# వావిలాల సోమయాజులు

## సాహిత్యం-1

### కవిత్వం

ఎమెస్కో

**Vavilala Somayajulu Saahityam- 1**
**KAVITVAM**
**వావిలాల సోమయాజులు సాహిత్యం - 1**
**కవిత్వం**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **మార్చి, 2018**

మూల్యం: రూ. **500/-**

ISBN: 978-93-86763-66-2

ముఖచిత్రం: **స్టార్ మీడియా సర్వీసెస్,** హైదరాబాద్

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

# ముందుమాట

శ్రీ వావిలాల సోమయాజులు (19.1.1918 – 9.1.1992) గుంటూరు జిల్లా విప్రులపల్లె అగ్రహారంలో జన్మించారు. తండ్రి సింగరావధానులుగారు, తల్లి మాణిక్యాంబ గారు. నరసరావుపేట, గుంటూరులో వారి విద్యాభ్యాసం జరిగింది. భార్య కైకమ్మగారు.

సోమయాజులుగారు 1940–46 మధ్య గుంటూరులోని శ్రీ శారదానికేతన ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆ తర్వాత 1976లో పదవీవిరమణ పొందేవరకు గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగా పనిచేశారు.

సోమయాజులుగారి జీవితం పూర్తిగా సాహిత్య రచనకు, సాహిత్య ప్రచారానికే అంకితమై పోయింది. తనకు ఇరవయ్యేళ్లు నిండీ నిండకముందే సాహిత్య సంస్థలలో సభ్యుడిగా సాహిత్య సేవ ప్రారంభించారు. 1939 నుండి సాహితీ సమితి సభ్యులు. ఈ సమితికి సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా వ్యవహరించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు సహాయ కార్యదర్శి. 'ప్రతిభ' పత్రికకు రచనలను ఎంపిక చేసే నిర్ణాయక సంఘంలో సభ్యుడు. 1963–73 మధ్య ఒక దశాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు.

సోమయాజులుగారు సంస్కృతాంధ్రాంగ్లాలలోను, హిందీలోను గొప్ప పండితులు. ఒక భాష నుండి మరొక భాషలోనికి అనువాదం చేయగలిగిన సమర్థత కలిగినవారు. వచనాన్నే కాదు పద్యాన్ని పద్యరూపంలోనే అనువదించడంలో సిద్ధహస్తులు. ఆయన సహజంగానే కవి కావడంవల్ల అనువాదంలోనూ మూలకావ్యం లోని కవిత్వాంశను సంపూర్ణంగా ప్రదర్శించగలిగిన కవితా హృదయాన్ని సొంతం చేసుకున్నారు.

సోమయాజులుగారి సాహిత్య సృజనా జీవితం బహువిపులమైంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రారంభమైన వారి సాహిత్య సేవ జీవితాంతం కొనసాగింది. ఇంత బహుళంగా రచనలు చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. అందులోనూ ఇన్ని ప్రక్రియలలో రచనలు చేసినవారు మరీ అరుదు. ఆయన కవిత్వం రాశారు. అందులో పద్యరచనలూ ఉన్నాయి, గేయ రచనలూ ఉన్నాయి. అతిసాధారణ వచనాన్ని కూడా అటు పద్యంలోనూ, ఇటు గేయంలోనూ ఇమిడ్చి మనోహరంగా రచింపగలిగిన శక్తి వారిది. నాటకాలు రాశారు, నాటికలు రాశారు. పద్య నాటికలు రాశారు, గేయనాటికలు రాశారు, సంగీత రూపకాలు రచించారు. శ్రవ్య నాటికలు రాశారు. నవలలు రాశారు. ఆంగ్లం నుండి నాటకాలూ, నవలలూ అనువదించారు. వీటిలో షేక్స్పియర్ నాటకానువాదాలు తెలుగులో వావిలాల వారివే బహుజనాదరణ పొందాయి. హిందీ నుండి మహాకవి జయశంకర ప్రసాద్ కావ్యాలు 'కామాయని', 'ఆంసూ' లను అతిమధురంగా పద్యకావ్య రూపంలో అనువదించారు.

ప్రౌఢ కవి అయిఉండీ పిల్లలకోసం సరళవచనంలో నవలలూ, దేశనాయకుల, దేశభక్తుల, చారిత్రక వ్యక్తుల, కవుల జీవిత గాథలూ రచించారు.

ఆయన పద్యరచన ఎంత విపులమో గద్యరచనకూడా అంతే విపులం. కథలు, జీవితగాథలు, నాటకాలు, నవలలను పక్కన బెడితే ఆయన సృష్టించిన వ్యాస సాహిత్యం అపారం. పరిశోధనాత్మక వ్యాసాలెన్నో రచించిన సోమయాజులుగారు సృజనాత్మక వ్యాసాలూ విస్తృతంగా రాశారు. ఆయన ఎంపిక చేసుకున్న విషయాలే మనల్ని విస్మయ పరుస్తాయి. డజనుకు పైగా వ్యాసాలు వివాహం పైనే అంటే ఆయనకు ప్రజల సాంఘిక జీవనం మీద, ఆచార వ్యవహారాల మీద ఉన్న పట్టును, అవగాహనను మనం అర్థం చేసుకోవచ్చు, మూడుపదుల వయస్సులో ఆయన వాత్స్యాయన కామసూత్రాలపై సాతవాహన సంచికలో రాసిన బృహద్వ్యాసం నేటికీ పరిశోధన వ్యాసానికి ఉదాహరణ ప్రాయంగా నిలుస్తుంది. ఆయన ఏమి రాసినా అది ప్రామాణికమే. తాను చెప్పే ప్రతి విషయానికీ ఆయన ఆధారం చూపుతారు.

సోమయాజులు గారి రచనలకు మరోపార్శ్వం కూడా ఉంది. ఆధ్యాత్మికంగా భారతీయ దార్శనికతా ప్రియుడైన ఆయన బహాయీ సాహిత్యాన్ని అనువదించారు. క్రైస్తవ రచనలను అనువదించారు.

సోమయాజులుగారు ఇంగ్లీషులో కూడా కొన్ని వ్యాసాలు రచించారు.

సాహిత్యాచార్య, సాహిత్యరత్న, సాహిత్య బంధు, మధురకవి, కవి భూషణ, కుమార ధూర్జటి, పద్యవిద్యాధర వంటి అనేక బిరుదాలతో ఆంధ్ర సాహిత్యలోకం వావిలాల సోమయాజులు గారిని సమ్మానించింది. ఈ బిరుదులు ఆయన రచయితగా ఒకవైపు, సాహిత్య సేవకుడుగా మరోవైపు చేసిన కృషికి అద్దం పడతాయి.

ఐదు దశాబ్దాలకు పైబడిన సాహిత్య జీవితంలో సోమయాజులుగారు చేసిన అసంఖ్యాక రచనల్లో ఎన్నో అలభ్యంగా ఉండిపోయాయి. కొన్ని అముద్రితాలుగా ఉండిపోయాయి. లభించిన రచనల్లో ముద్రితా ముద్రితాలన్నింటిని కలిపి ఇప్పుడు ఆయన లభ్యరచనల సమగ్ర సంపుటాలను ప్రచురించే ప్రయత్నం చేస్తున్నాం.

ఈ సంపుటులలో ఇది మొదటిది.

ఈ సంపుటంలోని **శివాలోకనము** 1990లో పింగళి కాటూరి సాహిత్య పీఠం వారి ప్రచురణ. ఇందులో 9 కవితా ఖండికలున్నాయి. ఖండకావ్యాలు కొన్ని వివిధ పత్రికల్లో ప్రచురితాలు, మరికొన్ని ఆకాశవాణి కేంద్రాల నుండి ప్రసారితాలు; కొన్ని అముద్రితాలు.

**'భరతరస ప్రకరణం'** శ్రీమాన్ నీడామంగలం తిరువేంకటాచార్యుల వారి రచనకు గేయానువాదం. 'మహాకవుల మతం' రవీంద్ర కవితకు అనువాదం. గేయకవితలలో కొన్ని సోమయాజులు గారి స్వీయరచనలు. వీటిలో కొన్ని ముద్రితాలు, కొన్ని అముద్రితాలు. కొన్ని అనువాదాలు. కొన్ని గేయాలు ఆకాశవాణిలో ప్రసారితాలు.

**'ఉపాయనలు'** హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసు గారి ప్రశస్తిని కీర్తించే గేయరచన. 1990లో ప్రచురణ.

నీలకంఠ దీక్షితుల 'కలివిడంబన' శతకానికి తెలుగు పద్యానువాదం 'కలివిడంబనము'. 'ఆంధ్రకామాయని', 'కన్నీరు' హిందీ మహాకవి జయశంకర ప్రసాద్ కృతులు 'కామాయని' 'ఆంసూ' లకు పద్యానువాదాలు.

సోమయాజులు గారి పద్య శైలి పూర్వ మహాకవుల ఒరవడిలో నడుస్తుంది. అదే సమయంలో సరళంగా పాఠక హృదయాలకు సుబోధంగా ఉంటుంది. మనం సాధారణంగా సంభాషణల్లో వాడే భాషకు దగ్గరగా ఉన్నట్లనిపిస్తుంది. అందుకే ధారాళంగా చదివిస్తుంది. సాధారణంగా పద్యరచయితలందరికీ గేయ రచనమీద పట్టు ఉండదు. కవికి కొంత సంగీతజ్ఞానం ఉంటే తప్ప గేయం రక్తికట్టదు. వావిలాల సోమయాజులుగారు పద్యగేయ రచనలు రెండింటిలో సవ్యసాచి అనదగినవారు.

ఐదు దశాబ్దాలకు పైగా వివిధ ప్రక్రియల్లో – పద్య కవిత, గేయ కవిత, నాటకం, నవల, కథ, గేయ నృత్యనాటికలు, విమర్శ, సృజనాత్మక వ్యాసం – అవిరామంగా కృషి చేసి వేల పుటల సాహిత్యాన్ని సృజించిన గొప్ప కవి, విమర్శకుడు, నాటకకర్త రచనలు పాఠకలోకానికి అందుబాటులో లేకపోవడం క్షంతవ్యం కాదు. వావిలాల సోమయాజులు గారి లభ్యరచనలన్నింటినీ సంపుటాలుగా తెచ్చే మా యీ ప్రయత్నంలో వారి కుమారుల తోడ్పాటు ఎనలేనిది. ఈ సందర్భంగా వారికి మా కృతజ్ఞతలు.

**డి. చంద్రశేఖర రెడ్డి**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శివాలోకనము | 9–72 |
| 2. | మధుప్రప | 73–288 |
| 3. | కలివిడంబన శతకము | 289–332 |
| 4. | భరతరస ప్రకరణము | 333–394 |
| 5. | మహాకవుల మతం | 395–424 |
| 6. | గేయ కవితలు | 425–456 |
| 7. | ఆంధ్ర కామాయని | 457–680 |
| 8. | కన్నీరు | 681–748 |
| 9. | ఉపాయనలు | 749–861 |

# శివాలోకనము

# శివాలోకనము

## అంకితము

ఈ "శివాలోకనము" ఖండకావ్య సంకలనం వావిలాల కైకమ్మ, సోమయాజులమైన మా ఉభయుల జ్యేష్ఠ పుత్రుడు కీర్తిశేషులు నా పెత్తల్లి సుబ్బాయమ్మ, పెత్తండ్రి రామచంద్రశాస్త్రిగార్ల దత్తపుత్రుడు

### స్వర్గీయ విశ్వనాథ ఛాయాపతి స్మృత్యర్థము

బిడ్డడవు నీవు పుట్టిన పెంచుకొనగ
కాకయున్న పుత్రునిగ ననె స్వీకరింప
తలపుగొనియున్న నాదు పెత్తండ్రి - హృదయ
కాంక్ష దీర్ప పుట్టితివి మా గర్భమందు.

ఆ సుజను పితృమేధార్థ మవతరించి
నట్టి కారణజన్ముండ వరయ నీవు
భీష్మ నేకాదశికి వేచి, వీడి పృథ్వి,
మాకు కల్గించినావు నమ్మకము తండ్రి!

'పెంపకము' వల్ల, నీ వ్యాధి పెరుగుచుంట
విద్య అక్రమవిధానమున ప్రాప్తించలేదు
'బహుముఖీనమ్ము'గా నబ్బె ప్రతిభ నీకు,
నృత్య చిత్రకళలు కొంత నేర్చినావు.

నాదు సాహిత్య జీవన నందనాన
విహరణము చేసి భావ వైవిధ్యగతుల
బహుముఖీనతాదృష్టి, దుర్వారరక్తి
పొంది సంతోషపరచి తో పుత్ర! నన్ను.

యౌవ నారంభమున నిను గన్నవారు
'తల్లి, కైకమ్మ – మహలక్ష్మి, తనయు డడుగొ,
అందగాడు, రతీభర్త' అంచు పలుక
వినగ నానందమును, శీలభీతి గలిగె.

ఎందరో పుణ్యజనుల దర్శించి నీవు
జ్ఞానివైనావు శుద్ధసంకల్పగరిమ,
బంధుమిత్రుల యనురాగ భద్రతలతొ
చేసితివి జనప్రీతికర జీవయాత్ర.

దీనజన రక్షణార్థమ్ము పూనుకొనెదు
దానధర్మాల యెడ బుద్ధి తరుగ దెపుడు
ఋణమొనర్చు చిచ్చెదవు సుశ్లోకులయిన
శాస్త్ర సాహిత్య విద్యా విశారదులకు

ఏమి బోధించినను పరు, లేమి విన్న
సోదరీసోదరుల ఎడ నీదు హృదిని
ఎట్టి వైషమ్యమును సోక దించుకైన,
చూచుకొంటివి గాఢవిస్ఫూర్తితోడ.

నీదు సోదర సోదరీ నిచయ గేహ
ములను బాల లతా వృక్షములు జనించె
అమరలోక నివాసీ వనవరతము
వచ్చి పోషించుకొనుము నీవాని, వాని.



'శివాలోకనము' ఆవిష్కరణ సభ

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట - డాక్టర్ కరుణశ్రీ | 15 |
| | అక్షరాంజలి - డా. నండూరి రామకృష్ణమాచార్య | 21 |
| | సమీక్షణం - ఆచార్య తిరుమల | 26 |
| | వావిలాల వారి సాహిత్య జీవనం - ఊట్ల కొండయ్య | 29 |
| | విజ్ఞాపనం -వావిలాల సోమయాజులు | 35 |
| 1. | వాత్సల్యప్రియ | 37 |
| 2. | ఉజ్జీవము | 40 |
| 3. | పరివర్తన | 44 |
| 4. | భ్రష్టయోగి | 50 |
| 5. | మాచలదేవి | 53 |
| 6. | ఆత్మార్పణము | 55 |
| 7. | విన్నపము | 61 |
| 8. | బృహన్నలాశ్వాసము | 65 |
| 9. | కర్తవ్యము | 71 |

# ముందుమాట

అభిజ్ఞ రసజ్ఞుల కరకమలాలను అలంకరించిన ఈ కావ్యం పేరు "శివాలోకనము". దీనిని రచించినవారు "కుమార ధూర్జటి" బిరుదాంకితులు శ్రీవావిలాల సోమయాజులు గారు.

ఉ. కలువలు పూచినట్లు, చిరుగాలులు చల్లగ వీచినట్లు, తీ
వలు తల బూచినట్లు, పసిపాపలు చేతులు చాచినట్లు, క్రొ
వ్వలపులు లేచినట్లు, చెలువల్ కడకన్నుల చూచినట్లు ఆ
త్మలు పెనవైచినట్లు కవితల్ రచియింతురహో మహాకవుల్!!

సుమారు నలభై సంవత్సరాలకు పూర్వం కవితాసరస్వతి స్వరూపాన్ని నిరూపించుతూ నేను వ్రాసిన పద్యమిది. ఇటువంటి కవివరేణ్యుల కోవకు చెందినవారు శ్రీవావిలాలవారు.

సహృదయ బంధువూ, సారస్వత సింధువూ, సౌజన్య నీరధీ, సౌహార్ద సారథీ అయిన శ్రీవావిలాలవారు తమ కవితా సంపుటికి "శివాలోకనం" అని పేరు పెట్టారు.

శివాలోకనం! ఎంత చక్కని పేరు? ఎంత చిక్కని పేరు? "శివ" శబ్దానికి ఈశ్వరుడు అనీ, శుభం అనీ అర్థం. "శివా" శబ్దానికి పరమేశ్వరి అని అర్థం. "శివాలోకనం" అని తన కావ్యానికి పేరు పెట్టటం వల్ల పైన చెప్పిన మూడింటి ఆలోకనం అనీ, కవి హృదయం అవగతమవుతున్నది.

ఈ కావ్యంలో మొత్తం ఎనిమిది కవితా ఖండికలు ఉన్నాయి. అవి, వాత్సల్యప్రియ, ఉజ్జీవము, పరివర్తన, భ్రష్టయోగి, మాచలదేవి, ఆత్మార్పణము, విన్నపము, బృహన్నలాశ్వాసము అనేవి. శివాలోకనంలోని ఈ అష్ట ఖండికలూ అష్టమూర్తి అయిన పరమశివుని స్వరూపాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ఇలా తన కావ్యం ద్వారా ఆ "ధూర్జటి"ని, ఈ "కుమార ధూర్జటి" మనకు ప్రత్యక్షం చేయించటంలో ఎంతో ఔచిత్యం ఉంది.

"వాత్సల్య ప్రియ"లో చిన్ని కృష్ణుని అల్లరి పనులు మానమని అనేక విధాలుగా బోధిస్తున్న మాతృమూర్తి యశోదాదేవి అంతరంగ తరంగాలు పొంగిపొరలాయి.

"ఉజ్జీవం"లో తానే దేవతలకు రక్షకుణ్ణి కాగలిగాననే దుర్గర్వంతో దూసుకువచ్చి శివ తపోభంగానికి తలపడిన మన్మథుని మనోమథనం మూర్తి గట్టింది.

"పరివర్తన"లో వల్లమాలిన అహంకారంతో తమ్మునితో తగాదాకు దిగి, రామబాణం తగిలి నేల కూలిన వానరరాజు వాలి వ్యాకుల హృదయం వ్యక్తమయింది.

"భ్రష్టయోగి"లో పరమతపోనిష్ఠకు ప్రయత్నించినప్పటికీ ప్రకృతిని జయించలేక పోయిన ఒక యోగివరుని తలపులు తేటతెల్లమైనాయి.

ఇక కాకతీయ చక్రవర్తి అయిన ప్రతాపరుద్రుని ఉపపత్నీ, సంగీత నాట్యకళా విశారదా అయిన మాచలదేవి ఔన్నత్యమూ, ప్రత్యేకతా "మాచల దేవి" అన్న కవితలో కళ్ళకు కట్టించబడినాయి.

"ఆత్మార్పణం" అన్న కవితలో కర్ణుని స్వామిభక్తీ, మైత్రీ మాధుర్యమూ, ధర్మాధర్మ విచికిత్సా, ఉచితజ్ఞతా, పరాక్రమ ప్రదర్శనాభిలాషా, కృష్ణభక్తీ, అచంచల స్వభావమూ. ఆత్మాభిమానమూ, సత్యసంధతా స్పష్టమైనాయి.

"స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో అతులిత మాధురీ మహిమ?" అని ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలచే ప్రశంసింపబడిన శివభక్త శిఖామణి ధూర్జటి మహాకవి హృదయఘోష, "విన్నపం" అన్న ఖండికలో నిండుగా నింపబడింది.

"బృహన్నలాశ్వాసం" అన్న చిట్టచివరి కవితాఖండికలో ఆడవారి యెదుట బీరాలు పలికి ఆడంబరంగా కౌరవులతో యుద్ధానికి సిద్ధమైన ఉత్తర కుమారుడు, సమయానికి వెన్ను చూపి రథం దిగి పారిపోతుంటే, బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడు అతనిని ఊరడించి ధైర్య స్థైర్యాలను నూరిపోయటం వెల్లడింపబడింది.

ఈ విధంగా విభిన్నవ్యక్తుల హృదయాలలోకి పరకాయ ప్రవేశం చేసి, వారి వారి చిత్తవృత్తులను వివిధ రీతులలో చిరస్మరణీయంగా చిత్రించారు శ్రీసోమయాజులు గారు తమ "శివాలోకనం"లో.

చిత్రం ఏమిటంటే "శివాలోకనం" అనే పేరుతో ప్రత్యేకమైన కవిత లేకపోయినప్పటికీ కవితాసంపుటి మొత్తానికి ఆ పేరు పెట్టి తమ నామౌచిత్య పాటవాన్ని ప్రకటించుకున్నారు వావిలాలవారు. అన్ని కవితలలోనూ అంతస్సూత్రం "శివాలోకనమే" అన్న రచయిత క్రాంతదర్శనానికి అది నిదర్శనం.

ఇక ఈ కావ్యంలోని సాహిత్య సౌందర్యాన్ని ఇంచుక పరిశీలిద్దాం. వీరి సుమసుకుమారమైన శయ్యాసౌభాగ్యాన్ని వెల్లడించడానికి ఈ క్రింది పద్యాలు చాలు.

"ఈ సెలయేటి కేమిటికొ యింతటి వేగము నీ వెరింగినా
వే సఖి! చేసెనే ప్రియుని యింటికి జేరగ ప్రొద్దు క్రుంకగా
బాసట అందుకౌ త్వర – త్రపారహితంబుగ నేగుచున్నదే
ఆ సెలయేటి మానసము నందలి కోర్కెల నూహ సేయుమా!"

"హాసౌజ్జ్వల్య రసోల్బణ ప్రథితమై ఆరగ్వధ ప్రక్రియన్
వాసించున్ సకలాశలందు ధరణీపాలావతంసోన్నత
ప్రాసాద ప్రమదావనాంతలతికా వాల్లభ్యపుష్పావళిలో
నీ సమ్మోహన ముగ్ధరూప సుమమో నీరేజపత్రేక్షణా!!"

వావిలాల వారి అలంకార సౌభాగ్యాన్ని ఔపమ్యరమ్యమైన ఈ క్రింది పద్యం వ్యక్తీకరిస్తుంది.

"కనకపు కంబ మొందు స్ఫటికంపు సురమ్య విశాలహర్మ్యమం
దున లగియించి నట్టులుగ తోచెడి శర్వుడు యోగశక్తిచే
ననుచగ నాత్మతేజము మహోన్నత దేహమునందు మున్ను నే
ననుకొన నీశు డర్యమ సహస్ర కళాకలితుం డటం చెదన్."

ఒయ్యారాన్ని ఒలకబోసే ఈ ఎత్తుగడలు చిత్తగించండి...

అ) ఎన్నడులేని యీ యెదుగు లెచ్చట నేర్చినదీ పికంబు?

ఆ) ఈడుకు తగ్గ చేష్ట లగునే వ్రజభామినులార!

ఇ) కాకులమూక లోకము ప్రకారము వింతయె

ఈ) కాళులు లేక చిక్కితిమె కాలవశంబున చిక్కినాము.

ఉ) అవును నిజమ్మె కుంతి కనెన్నది నమ్మితి.

ఊ) నేనొక తేపగాగ నవనీపతి దాటదలంచె.

**ఈ క్రింది పద్యాలలోని తెలుగు నుడికారాలు సుమనో మనోజ్ఞంగా ఉన్నవి.**

'ఏగతి వచ్చి చేరితివి యింటికి వాకిట నిల్చియుంటి కా
దా గజదొంగ! మూసితివి అమ్మకు కన్నుల దొడ్డిగుమ్మమున్

నే గడివేసి వచ్చితిని నీ కెటు వచ్చెనొ! ఇట్టులైన నే
లాగున నిల్వగాగలమురా నిను పెట్టుకు ఊరిలోపలన్!"

"అడుగుల కడ్డువచ్చి తడియారని కన్నులతో కపోలముల్
వెడవెడ వెల్లనై సొగసు వీడగ వీడుట కొప్పుకోని నీ
యెడదను దిద్ద ఉన్నయటులే చనుదెండు యుగమ్ము కాదె మీ
కడ నిలువంగలేని క్షణకాలము నా కని యార్తవైతివే!"

చిన్ని కన్నయ్య అల్లరి అనిర్వచనీయం. చెరువుకు గండి కొట్టాడని ఒకరూ, జింకల గుంపును పొలంలోకి తోలాడని మరొకరూ, అరకల కర్లు లాగాడని ఒకరూ, మంచెలు విరగగొట్టాడని ఇంకొకరూ, గడ్డ పలుగులను కనపడనీయక మట్టిలో కప్పెట్టాడని వేరొకరూ, చెట్టుమీద దాచుకున్న దుత్తలోని పెరుగన్నం ఖాళీ చేశాడని కొండొకరూ – ఇలా గోపగోపికలు బాలగోపాలుడి చిలిపి పనులను యశోదాదేవికి చెప్పుకున్న సందర్భం సహజసుందరం.

దండిగా కొండేలు చెప్పిన నందవ్రజం వారి పలుకులు. విని 'కృష్ణుణ్ణి పట్టుకుందామని పరుగెత్తిన యశోదకు కాళ్ళు "కండెలు కట్టాయి. 'ముత్తైదువ' లాగా ఏమీ ఎరగనట్లు నీతిగా కూర్చున్నాడు కృష్ణుడు. జన్మతోనే "నటకాగ్రగణ్యు"డైన ఆ పిల్లవాణ్ణి ఆమె ఏం చేయగలుగుతుంది? అవి "ఈడుకు తగ్గ చేష్టలగునే?" అని వాళ్ళను మందలిద్దామంటే, వెంటనే 'చిన్నబిడ్డ లీ యీడుకు కొండలెత్తుచు ఫణీశులతో చెరలాట మాడిరే!' అని, వాళ్లెక్కడ అంటారో అని మెదలకుండా ఊరుకుంది యశోద.

"తల్లికి నాకు తీరినది ధర్మము వీడుచు గంగ చేతిలో నుల్లము రాయి చేసుకొని యుంచిన యప్పుడె" అనీ, "స్వామికి ఉపాయనమై ఋణమెల్ల తీర్చెదన్" అనీ, "అతని సుఖమ్మె నా సుఖము అతని దుఃఖమె నాదు దుఃఖమై మతు లొకటై చరించితిమి మంచికి చెడ్డకు" అనీ, "ఇహపరా లేమైన నాకేమి నా ప్రాయం బిచ్చితి రాజరాజునకు నీ పాలోయి నా ఆత్మయే" అనీ కృష్ణుడితో కర్ణుడు పలికిన పలుకులలో అతని ఆత్మాభిమానమూ, ధర్మబుద్ధీ, స్నేహశీలతా, కృష్ణభక్తీ, ద్యోతకమైనాయి.

"జగము సమస్తమున్ నవరసాలము పోలిక సాంధ్యరాగపున్ జిగిని వెలుంగ"

"ఎద నదియై స్రవింప"

"ఏనాడైన భువిన్ అసూయ కలుషం బీర్ష్యావ్యథాశాంతియే
కానన్ రావు సమత్వ మభ్యుదయ మగ్రామ్యంబు సౌఖ్యంబు"

"శిరమున నున్న గంగ శశిశేఖర : నా రసనాంచలమ్ము నన్
దిరముగ నిల్పుమయ్య"

"నా కొక జన్మమున్న భువి నన్ జనియింపగనిమ్ము స్వామి : నీ
వాకిట బిల్వవృక్ష మటు వత్సలతన్"

"భోగము లారగించు తలపుల్ కొని చంచల చంచరీక హృ
ద్వేగ గతిన్ చరించి భ్రమ తీరగ జేరితి నిన్ శివా!"

మొదలైన పద్య పంక్తులలోని హృద్యానవద్యములైన భావాలు గమనింపదగినవి.

సందర్భ సముచిత సమాసవిన్యాసం వావిలాల వారికి వెన్నతో పెట్టిన విద్య. ఈ సురుచిర సమాససంఘటనం చూడండి –

ప్రౌఢానంత వాసంత లీలాలాలిత్యము, అనంత విలాస శకుంత సంతతులు, మహోన్నత భక్తి రసప్రపూత, చండీశోద్ధత కార్ముకోపమ మహాచాపమ్ము, త్వదీయ ధనురంచిత జంభర మంజు శింజినీ రసభర ఝాంకృతీ ధ్వని, ఐంద్రద్వీపోద్గళ ఘంటారవ పాటవోజ్జ్వల లసత్కావ్యంబు – మొదలైనవి అనాయాససమాస లాస్యవిలాసాన్ని వ్యక్తం చేస్తాయి.

కాటికి కాళ్లు చాచుకొను, గంపెడు కోర్కెలు, మిన్నుల తన్ని పోరగల మేటి బలాఢ్యుడు, ఉప్పెన నవ్వు, కదనదోహలి, దురుద్యోగి, కనుచూపు వెన్నెలల తీరము, తడబడు గుండె, గాలి బుడతలు, ఎడద ఉయ్యాల – వంటి జాతీయాలూ, శబ్దసంపుటులూ – వావిలాల వారి ప్రత్యేక ప్రతిబింబాలు.

ఈ విధంగా బహుముఖీన గుణగణమండితమైన "శివాలోకనం" సహృదయు లందరికీ సదా సదాలోకనమై, సాహిత్యజగత్తులో వ్యక్తిత్వం ముద్రాభద్రమైన స్థానాన్ని వావిలాల వారికి వాటిల్ల జేస్తుందని నా విశ్వాసం.

సోమయాజులు గారి వ్యాసాలు, కావ్యఖండికలు, నాటకాలు మొదలైన వెన్నో పుంఖానుపుంఖాలుగా సుప్రసిద్ధ సాహిత్య పత్రికలైన భారతి, ప్రతిభ, గృహలక్ష్మి, ఆనందవాణి మొదలైనవాటిలో ప్రచురితమై, పాఠకుల ప్రశంసల్ని అందుకున్నాయి. ఎన్నో గ్రంథాలు పాఠ్య గ్రంథాలుగా విశ్వవిద్యాలయాలలో కళాశాలలలో

నిర్దేశింపబడినాయి. సోమయాజులుగారి వివరణ, వ్యాఖ్యానం, తాత్పర్యంతో కూడిన 'నోట్సు' చదవని కళాశాల విద్యార్థి లేడంటే అతిశయోక్తి కాదు.

వావిలాల వారిది వెన్నలాంటి మనస్సు. వెన్నెల లాంటి చిరునవ్వు. వేణువు లాంటి గాత్రం. వేదం లాంటి విజ్ఞానం. వేలుపు లాంటి రూపం. జీవితంలోని అందాన్ని, ఆనందాన్ని పదిలంగా ఆస్వాదించి, తోటివారికి పంచిపెట్టగల చరితార్థుడు రసవేది, రసవాది వావిలాల.

సోమయాజులు గారి శేముషీవిశేషం అంతా ఏండ్ల తరబడి విద్యార్థులకు 'గైడ్లు' వెలయించటంతోనే చెల్లింపబడిందనీ, రావలసినన్ని కావ్యాలు వారి చేతి మీదుగా రాలేదనీ తపనపడేవారిలో నేను మొదటివాణ్ణి. ఇప్పుడు ఈ విధంగా వారి రచనలు వెలువడటం అస్మదాదులందరికీ అపరిమితానందాన్ని కలిగిస్తున్నది.

కవిత్వం, పాండిత్యం, పరిశోధనం, ఆచార్యత్వం, వక్తృత్వం, మిత్రత్వం ఏకీకృతమైన రూపం ఆయనది. ఇతోధికమైన గ్రంథాలు ఆయన నుండి వెంట వెంటనే వెలికి రావాలని కోరుతూ నా "ముందు మాట" ముగిస్తున్నాను.

**- డాక్టర్ కరుణశ్రీ**

# అక్షరాంజలి

ఈనాడు – స్ఫురద్రూపియైన వయోవృద్ధుడుగా సమకాలీనలోకానికి కన్పించే శ్రీవావిలాల సోమయాజులుగారు – నాకు సుమారు ఒక అర్ధశతాబ్దికి పూర్వం – జ్ఞానవృద్ధుడైన కవి కుమారుడుగా సుపరిచితులు. "శ్రీసోమయాజులుగారికి రావలసిన కీర్తి రాలేదు" అని అప్పుడప్పుడు నాలో నేను అనుకున్నాను గాని, అది సరియైన అభిప్రాయం కానే కాదు. అభిజ్ఞులు పలువురకు సాహితీతపస్వి శ్రీసోమయాజులు గారి రచనల విలువ తెలుసు. సమకాలీన విజ్ఞులు ఆయనను "కుమార ధూర్జటి" – "సాహిత్యాచార్య" – "సౌహార్ద సారథి" – "సాహిత్య బంధువు" – "సాంస్కృతిక సింధువు" ఇత్యాది బిరుదులు ఇచ్చి సత్కరించారు. "వెన్నవంటి చిరునవ్వు" – "వేణువు వంటి కంఠస్వరం" – "వేదం వంటి విజ్ఞానం" "వేలుపు వంటి రూపం" – పంచ వషట్కార సంస్కార సంపన్నుడు శ్రీవావిలాల సోమయాజులు అని సాహితీ సహవ్రతులు ప్రస్తుతించారు. నేడు ఈ కవితా ఖండికలు ప్రచురించటానికి నడుం కట్టుకొని ముందుకు వచ్చిన శ్రీఊట్ల కొండయ్యగారు విజ్ఞులలో విజ్ఞుడు.

శ్రీసోమయాజులుగారి కవితలకు పరిచయ వాక్యాలు వ్రాయగలిగిన ఏకైక వ్యక్తి సాహితీ సమితి సంస్థాపకుడు సభాపతి స్వర్గీయ తల్లావజ్ఝల శివశంకర శాస్త్రిగారు. నేడు వారు లేరు. ఇక సోమయాజులుగారితో కలిసిమెలిసి తిరిగినవారు పలువురు భూలోకంలో లేనే లేరు. నేటికీ సజీవుడై యున్న వయోవృద్ధుడను నేను గనుక ఈ "భారం" నా మీద పడింది. నిజానికి ఇది భారం కాదు, నా భాగ్యమే!

1942 సంవత్సరంలో శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రి గారు, శ్రీవావిలాల సోమయాజులుగారు, నేను తరచు శ్రీశివశంకర శాస్త్రిగారిని గుంటూరులో దివ్యజ్ఞాన సమాజం ఆవరణలో సాయంసంధ్యా కాలంలో కలుసుకుంటూ ఉండేవారం. శ్రీశివశంకరశాస్త్రిగారు సహజసాహితీ కవచకుండలాలతో అవతరించిన "సభాపతి". ఆయనకు ఆప్తమిత్రుడు నవ్య సాహిత్య పరిషత్తు కార్యదర్శి శ్రీతెలికిచెర్ల వేంకటరత్నంగారు అక్కడకు వచ్చేవారు.

గుణగ్రహణపారీణుడైన శ్రీవేంకటరత్నం గారికి, శ్రీవావిలాల సోమయాజులు గారిపై ప్రత్యేకమైన "మోజు" ఉండేది. నవ్య సాహిత్యపరిషత్తు ఆయన దత్తపుత్రిక. ఆయన అతిథి సేవాపరాయణత్వంలో అభినవ పెరియాళ్వారు. ఆయన ఇంటిలో శనివారము నందు మాత్రమే గాక, నిత్యం అతిథిపూజ అర్ధరాత్రి వరకూ జరిగేది. శ్రీఅడివి బాపిరాజు, శ్రీవేదుల సత్యనారాయణ శాస్త్రి, శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రి, ప్రభృతులు తమ నూతనకవితలు వినిపించేవారు. తెరమరుగున నిలిచి నవ్య సాహిత్యానికి చిరస్మరణీయమైన సేవ చేసినవారిలో ప్రాతఃస్మరణీయుడు శ్రీతెలికిచెర్ల వేంకటరత్నం గారు. ఆయన "ప్రతిభ" పత్రికకు సంపాదకుడు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఆంధ్రశాఖకు అధిపతి. ప్రతిభను గుర్తించటంలో ఆయన కన్నులు దృగ్బిణీ యంత్రాలు. ఆనాడు అనామకులుగా నిరుద్యోగులుగా అలమటించే యువ నవ కవులను చేరదీసి కేవలం పరోపకార పారీణతలో ఆంధ్ర క్రయిస్తవ కళాశాలలో ఉద్యోగాలు ఇచ్చి, ప్రతిభ పత్రికలో వారి రచనలు ప్రచురించి ఆదరించిన మహనీయుడు ఆయన. శ్రీపాపయ్యశాస్త్రికి, నాకు మొట్టమొదట ఉద్యోగాలు ఇచ్చింది ఆయనే. ఆ నాడు పలువురు యువకవుల నవనవోన్మేష ప్రజ్ఞకు ఆటపందిరి 'ప్రతిభ' పత్రిక.

"సభాపతి" శ్రీశివశంకర శాస్త్రిగారు ఆ నాడు 'నవీన బహుళాంధ్రోక్తిమయ ప్రపంచానికి' సాహిత్యాచార్యుడు. శిష్యవత్సలుడైన ఆయనకు – భారతంలో ద్రోణాచార్యులకు అర్జునునిపై ఉన్నట్లు – శ్రీసోమయాజులు గారిపై పక్షపాతప్రాయమైన ప్రత్యేకప్రేమ ఉండేది. నేను ఆ తల్లావజ్ఝల వారికి ఏకలవ్య శిష్యుడను. సుదూరంగా నిలిచి ఆయనను ఆరాధించేవాడిని. నవ్య సాహితీ మహోద్యానవనంలో విచ్చకముందే "మొగ్గల"లోని సౌందర్య సౌరభాలను రంగరించి ప్రపంచానికి ప్రసారం చేసిన సహృదయామోద గంధవహుడు ఆ మహానుభావుడు. శ్రీవావిలాల సోమయాజులుగారు శ్రీశివశంకర శాస్త్రిగారికి అభిమానపాత్రుడైన "గద్య పద్య కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి". గద్య రచయితలు పద్య రచయితలు కాకపోవచ్చు. అట్లే పద్య రచయితలు గద్య రచయితలు కాలేకపోవచ్చు. శ్రీసోమయాజులుగారి అసలు ప్రజ్ఞ పద్యరచన.

"ఏక శ్లోకః ప్రబంధ శతాయతే" అన్న ప్రశస్తి సంస్కృతంలో అమరుకునకు అన్వయిస్తారుగాని – వంద ప్రబంధాలతో సరితూగగల ఒక పద్యం వ్రాయగల నేర్పు తెలుగులో శ్రీవావిలాల సోమయాజులు గారిది. కవిత వాగర్థాల వర్ణనాతీత సమ్మేళనం. భాష భావాల కలయికలో పార్వతీ పరమేశ్వరుల పవిత్ర దాంపత్యం పరిఢవిల్లాలి!

ఆకాశనీలాల కవ్వలి సీమల మేరలకు ఎగురగలిగే ఎత్తయిన భావాలు – కడలి లోతులు తడివి చూడగల నుడికారపు కెరటాలపై తేలియాడే పలుకుబడులు కలిస్తేనే – అది ఆలోచనామృతం అనదగిన కవిత అవుతుంది. కవిత – ఆపాతమధురం కాదు. శ్రీసోమయాజులుగారి కవనాలు తొలకరి చిటపొటి చినుకులు కావు. అవి వేసవి వడగళ్ళ వానలు.

వీరు వ్రాసిన పద్యనాటికలు, ఏకాంకికలు రంగస్థలాన్ని, ఉరుములతో మెరుపులతో నింపేస్తాయి. వీరు వ్రాసిన గద్య పద్య నాటకం – "నాయకురాలు" ఆంధ్ర నాటక రంగస్థలంపై వడగళ్ళు – ఉరుములు మెరుపులు సృష్టించటమే గాక – పిడుగుల పిండు కురిపించింది.

శ్రీసోమయాజులుగారి గద్యరచనకు గీటురాయి "మణి ప్రవాళం" వ్యాసమంజరి. వ్యాసరచన తెలుగువారు అభ్యసించిన క్రొంగ్రొత్త విద్య. తెలుగు వారికి ఈ కళలో ఒరవడి దిద్దినవారు ఆంగ్లేయులు. ఆంగ్ల వ్యాసరచయితలలో తాడిని తన్నినవారు – భారతీయులు కొందరు ఉన్నారు. తాడి తన్నినవారి తల తన్నినవాడు ఆంధ్ర "మణిప్రవాళ" వ్యాసమంజరి రచయిత. వ్యావహారికమైన కర్మ జగత్తులలో బ్రతుకు పోరాటంలో విశ్రాంతి కోరేవారు అవశ్యం చదువదగినట్టిది "మణిప్రవాళ" వ్యాసమంజరి.

ప్రస్తుత గ్రంథంలో ఉన్న కావ్యఖండికలు – ఉజ్జీవము. పరివర్తన, మాచలదేవి, ఆత్మార్పణము, విన్నపం మున్నగునవి. ఇవి అన్నీ లోగడ ప్రతిభ మున్నగు పత్రికలలో పడినట్టివే. ఇందలి పరివర్తన రామ బాణోపహతుడైన వాలి స్వగతం. ఆత్మార్పణం కర్ణుడు శ్రీకృష్ణునితో జరపిన ఏకాంత సంభాషణ. ఈ రెండు ఖండికలు వింటే వాల్మీకి – వ్యాస మహర్షులు తలలూపక తప్పదు – అని నా అభిప్రాయం. మహాభారత రామాయణ కావ్యాలే కాక కాళిదాస ప్రభృత కవులు చేసిన ప్రౌఢప్రయోగాలు, శ్రీసోమయాజులుగారి తెలుగు కవితలలో ఎడనెడ సాక్షాత్కరిస్తాయి. మూడు వేల సంవత్సరాల సంస్కృత ప్రౌఢప్రయోగాలు, వేయి సంవత్సరాల గడుసరి తెలుగు నుడికారపు సొంపులు, వంపులు స్వాయత్తం చేసుకున్న సంస్కారి శ్రీసోమయాజులుగారు.

నేను అనంతపురంలో ఉన్నప్పుడు – శ్రీసోమయాజులుగారు పద్యాలలో ఒక "సుహృల్లేఖ" నాకు అందించారు. అది ఒక అపర మేఘసందేశకావ్యం. ఆయన దూతగా పంపిన మేఘుడు

"ఇంచు కాడంబరుడు గర్వి ఏమొ గాని
జలద యువకుడు వాడు ప్రశస్త గుణుడు
భావుకత వెఱ్ఱియై నింగి పర్వులెత్తు
మనవలెనె వాడు పాడక మనగలేడు."

నాకు పలువురు సహృదయులు విద్వత్ కవులు సన్మాన పత్రాలు ఎన్నెన్నో అందించారుగాని – అన్నిటిలో శ్రీసోమయాజులుగారి సుహృల్లేఖ – మకుటాయమాన మైన సన్మాన పత్రముగా భావించి నేను భద్రం చేసుకున్నాను.

సంస్కృత సాహిత్యాన్ని మాత్రమేగాక శ్రీసోమయాజులుగారు ఆంగ్లవాఙ్మయాన్ని గూడ ఆపోశనం పట్టారు. షేక్స్పియరు నాటకాలను వారు తెలుగులోకి అనువదించిన తీరు తీయాలు, తరతరాలవారికి ఒరవడులుగా నిలుస్తాయి.

ఆంధ్రుల సాహితీ సంప్రదాయంలో – భువన విజయం – అష్టదిగ్గజకవి వ్యవస్థ విశిష్ట స్థానాన్ని పుంజుకున్నాయి. ఆధునిక కాలంలో అష్ట దిగ్గజాలను ఎన్నుకోవలసి వస్తే – శ్రీసోమయాజులుగారికి ఏకగ్రీవంగా లభించేది "ధూర్జటి" పాత్ర. వీరు వ్రాసిన "విన్నపం" ఆధునికాంధ్ర వాఙ్మయంలో విశిష్టమైన రచన. అష్టదిగ్గజాలలో ధూర్జటి విశిష్ట వ్యక్తిత్వం గల మహాకవి. ఆంధ్ర వాఙ్మయములో మాత్రమే గాక, ధూర్జటి వ్రాసిన శ్రీకాళహస్తీశ్వర శతకం విశ్వసాహితీ రచనలోనే సాటిలేని ఉజ్జ్వల రచన. ఆంధ్ర సాహితీ పట్టభద్రుడు కాగోరేవారు ధూర్జటి వ్రాసిన ప్రతి పద్యం తప్పనిసరిగా చదవాలి. అథవా – శ్రీసోమయాజులుగారు వ్రాసిన "విన్నపం" పూర్తిగా కంఠస్థం చేయాలి – అని నా అభిప్రాయం. ఈ ఖండిక 1952 నవంబరు భారతిలో ప్రచురింపబడింది.

ఈ పద్యాలు శ్రీసోమయాజులుగారు తాడేపల్లిగూడెంలో కవి సమ్మేళనంలో చదివినపుడు నరసాపురం వాస్తవ్యులు డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం గారు ఆనందబాష్ప విలులిత నేత్రాలతో విని సద్యఃపరనిర్వృతిలో లీనమైపోయారు. తదుపరి శ్రీసోమయాజులుగారికి సత్కారం చేయటానికి నరసాపురంలో డాక్టరుగారి అధ్యక్షతన ఒక సన్మానసంఘం ఏర్పడింది. దానికి నన్ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అధ్యక్షుని అకాలమరణంతో ఆ సన్మానం జరుగలేదు. ఆ బాకీ తీర్చవలసిన బాధ్యత నాపై ఇంకా మిగిలి ఉంది. ఇంకా ఈ గ్రంథం ప్రచురణ – ఈ గ్రంథం ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొని, నా సౌహృదఋణం తీర్చుకోవాలని నా తహ తహ!

శ్రీవావిలాల సోమయాజులుగారి పద్యాలు గోరుముద్దలు కావు. గుజ్జనగూళ్ళు కావు. సెనగ గుగ్గిళ్ళు కావు. అవి సానబట్టిన వజ్ర వైడూర్య గోమేధిక పుష్యరాగ మణిమాణిక్య శకలాలు. పూత పసిడి తళతళలతో చెమికీ దారాలతో చీరెలు నేసేవారు – లంబాడీ లంగాలు కుట్టుకునేవారు వీటి జోలికి పోనక్కరలేదు. భావికాలంలో, సాహితీ ప్రతాపరుద్రులు కాగోరేవారు. కవితా కిరీటధారులు కాగోరేవారు, వీటిని కష్టపడి సేకరించి వినియోగించుకొని, తమ శిరస్సుల చుట్టు పరివేషప్రభలు తీర్చిదిద్దుకోవచ్చు.

**– ప్రగతి గీతాప్రవక్త**
**డా. నందూరి రామకృష్ణమాచార్య**

# సమీక్షణం

నేను మెడపైకెత్తి చూచేటంత ఎత్తైన వ్యక్తిత్వం గల మనీషి శ్రీవావిలాల సోమయాజులుగారు. ఆయన సుహృదయ స్పందన నుండి, ప్రౌఢధిషణ నుండి ఆవిర్భవించిన ఈ పద్యకావ్యానికి నేను నాలుగు మాటలు సమీక్షారూపంలో రాయటం కేవలం విద్యావయో వృద్ధులైన మా ఊట్ల కొండయ్యగారి మెత్తని ఆజ్ఞవల్లనే:

ఈ కావ్యాన్ని "శివాలోకనము" అనటంలోనే కావలసినంత కవిత్వం వుంది. కావ్య ప్రయోజనాన్ని వివరిస్తూ మమ్మటుడు

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహార విదే
శివేతరక్షతయే సద్యః పర నిర్వృతయే
కాంతా సమ్మిత తయోపదేశయుజే"

అని వక్కాణించాడు. ఈ నిర్వచనంలోని శివేతరక్షతే యీ కావ్యానికి శివాలోకన మయ్యింది. అంటే అమంగళ పరిహారార్థమన్న మహత్తర కావ్యప్రయోజనం కాస్తా "మంగళ ప్రదమైన చూపు" అయ్యింది.

ఈ రకమైన అంటే "విశ్వశ్రేయః కావ్యమ్" అనే లక్ష్యంతో కూడిన శివాలోకనం గల కవే జగత్కల్యాణాన్ని సాధించగలడు. అయితే అటువంటి 'చూపు' కలగాలంటే చిత్తసంస్కారం చాలా అవసరం. కవుల స్థానం ఈ చిత్తసంస్కారాన్ని కలిగించటంలోనే నిర్ణయించబడుతుందనే సత్యాన్ని Emerson అనే పండితుడు, ''Great Poets are judged by the frame of mind they induce in us'' అంటూ చెప్తాడు. ఈ కావ్యాన్ని చదివి ఆలోచనామృతాన్ని ఆస్వాదించిన తర్వాత, సోమయాజులు గారి మహాకవి అనని సాహిత్యాభిమానులుండరని నా విశ్వాసం.

మానవుని దుష్టప్రవృత్తిని క్షాళనం చేసి, ఉత్తమ సంస్కార బీజాల్ని అతని హృదయ క్షేత్రంలో నాటగల మహత్తర కావ్యాలు భారత, భాగవత రామాయణాలు. ఈ కావ్యంలోని "ఆత్మార్పణము", "బృహన్నలాశ్వాసము" అనే ఖండికలు భారతానికి, 'వాత్సల్యప్రియ" అనే ఖండిక భాగవతానికి, "పరివర్తన" అనే ఖండిక రామాయణానికి అనుబంధాలు

కాగా, "భ్రష్టయోగి" అనే కవిత కూడా మేనక అంటిన విశ్వామిత్రుణ్ణి గుర్తుకు తెస్తూ రామాయణ స్పర్శతోనే వున్నట్టుగా కనిపిస్తూ వుంది.

పౌరాణిక ఇతివృత్తమైన కుమార సంభవం ప్రతిధ్వనించే కవితాఖండిక "ఉజ్జీవనము". శివుని మీదికి దండెత్తి వెళ్లి, తన అశక్తతని అర్థం చేసుకొన్న మన్మథుని ఆంతర్యం ఉజ్జీవనంగా పొంగులెత్తింది. ఇలాగే, శివునికి ముడిపడ్డ మరో కవిత ధూర్జటి మహాకవి ఆంతర్యాన్ని నివేదించే "విన్నపము". ఈ "ఉజ్జీవనము" "విన్నపము" – అనే రెండు కవితలూ నిజంగా శివాలోకానికి సంబంధించి, కావ్యశీర్షికని సార్థకం చేస్తూ ఉన్నాయి.

ఇంక, ఈ కావ్యంలోని "మాచలదేవి", "కర్తవ్యము" – అనే రెండు కవితలు కాకతీయ చరిత్రకు సంబంధించినవి. ఈ రెండింటిలో శృంగార, వీరరసాలు తరంగితమవ్వడాన్ని సహృదయులు గమనించగలరు. అలాగే "వాత్సల్యప్రియ"లో వాత్సల్యరసం, "ఉజ్జీవనం", "పరివర్తన", "విన్నపము", కవితల్లో కరుణరసం. "భ్రష్టయోగి"లో శృంగారరసం, "ఆత్మార్పణం", "బృహన్నలాశ్వాసం"లో వీరరసం – మనకి కనిపిస్తాయి.

రసస్థాయినిబట్టి రచన చేయటం మహాకవి లక్షణం. శృంగారరస శృంగాన్ని అధిష్ఠించిన ఈ క్రింద పద్యాన్ని చూడండి : –

"హాసౌజ్జ్వల్య రసోల్బణ ప్రథితమై ఆరగ్వధ ప్రక్రియన్
వాసించున్ సకలాశలందు ధరణీ పాలావతం సోన్నత
ప్రాసాద ప్రమదా వనాంత లతికా వాల్లభ్య పుష్టాళిలో
నీ సమ్మోహన ముగ్ధరూప సుమ మో నీరేజపత్రేక్షణా!!"

ఇటువంటి పద్యాల్ని, కవుల ఔమ్ముల్ని కాల్చి విడిచిన ఏ శ్రీనాథుడో గానీ రాయలేదు. ఆ భావాలు, ఆ పద్యగమనాలూ అలాంటివి. భవభూతి తన ఉత్తర రామచరిత్రలో అంటాడు.

"లౌకికానాం హి సాధూనా మర్థం వాగనువర్తతే
ఋషిణాం పునరాద్యానాం వాచ మర్థోఽ నుధావతి"

ఋషుల మాట వెంట అర్థం వస్తుందట. అందుకే "నా నృషిః కురుతే కావ్యమ్" అన్నారు. ఋషిహృదయులకు తప్ప శివాలోకనం ఏర్పడదు. ఎందుకంటే, ఈ కావ్యఖండికలన్నిట మనస్తత్త్వశాస్త్రం నిండివుంది. ఆ మనస్సు కొొక రూపచిత్రణ

వుంది. ''The Poet's main glory is the power of Pictorial expression'' అని. ఈ మానసిక చిత్రణాభివ్యక్తి వల్లే కవికి సుస్థిరప్రతిష్ఠ కలిగేది.

ఎవరకే మాట కొసమెరుపో అచ్చమైన కవికి తప్ప తెలియదు. చూడండి – విల్లు పట్టుకోలేనివాడు యుద్ధమేం చేస్తాడు? ఉజ్జీవనంలో – "జారి పోయె నీ ననవిలు నిల్వనోపకను నా కరకంజము నుండి" అని అనుకుంటాడు మన్మథుడు. చేతికి చెమట పట్టిన మాట – 'కర కంజము' అనే శబ్దం చెబుతోంది. ఇది శబ్దశిల్పరహస్యం.

"భ్రష్టయోగి"లో "ఈ సకలము 'కాదు కా' దను వచస్సున లేదటె కాంక్ష గుప్తమై" అనే మాటవల్ల భ్రష్టత్వానికి పరాకాష్ఠని చూపించిన ఈ కవి, "ఆత్మార్పణం"లో – "నా ప్రాయం బిచ్చితి రాజరాజునకు నీ పాలోయి నా ఆత్మయే" అని, కర్ణుని మహాత్మని ఆవిష్కరించటంలోని ఔచిత్యాన్ని గమనించండి. ఇలా ఎన్నని ఎన్నిక చేసి చూపించేది? ఒక్కొక్క పద్యం ఒక్కొక్క రస గుళిక!

"కావ్య స్యాత్మా ధ్వనిః" అన్నాడు ఆనందవర్ధనుడు. కావ్యగత రసధ్వనిని ఆత్మతః వినగలగడమే రసజ్ఞత. భ్రష్టమైన సమాజంలో పరివర్తన చెంది, ఉజ్జీవనమై, కర్తవ్యాన్ని గ్రహించి, భావితరాల మీద వాత్సల్యంతో ఆత్మవిమర్శని విన్నవించుకుంటూ, మానవత కోసం లలిత జీవనం కోసం ఆత్మార్పణకైనా సిద్ధపడాలనే ధ్వని యీ శివాలోకనంలో ప్రవహిస్తోంది.

ఇంతటి ఉత్తమ కవితా సంపుటిని మా 'పింగళి–కాటూరి సాహిత్య పీఠం' అందించగలగటం ఒకానొక భాగ్యవిశేషం.

మహాకవులైన సోమయాజుల వారికి హృదయపూర్వక నమస్సులర్పిస్తున్నాను.

**– ఆచార్య తిరుమల**

# వావిలాల వారి సాహిత్య జీవనం

శ్రీవావిలాల సోమయాజులు గారి సాహిత్యచరిత్ర అంటే – అర్ధశతాబ్ది గుంటూరు సాహిత్యచరిత్ర అన్నమాట. యాభై యేండ్ల పాటు రేయింబవళ్లు, అధ్యయన, అధ్యాపన, రచనా, ఉపన్యాస వ్యాసంగాలతో గడచిందాయన జీవితం. సాహిత్యం వినా మరొకటి ఆయన పట్టించుకోలేదు. పోనీ, గృహస్థయి వుండి, ఇల్లూ వాకిలీ అయినా పట్టించుకొన్నారా అంటే అదీ లేదు. బలిష్ఠమూ, సుందరమూ అయిన తన శరీరారోగ్యాన్నీ లక్ష్యపెట్టలేదు. సాహిత్య మొక్కటే పని అదే లక్ష్యం, అదే జీవితమూ, జీవనమున్నూ.

గేయాలు వ్రాశారు, పద్యాలు వ్రాశారు, సాహిత్యవిమర్శలు వ్రాశారు. చరిత్ర పరిశోధనలు వ్రాశారు సభల్లో మహోపన్యాసాలు చేశారు. మృదుమధురంగా వ్రాసి, ఊరూర కమ్మగా పాడారు. సాహిత్య సమావేశాల్లో, రేడియో నాటికలూ, ప్రసంగాలూ వ్రాశారనేకం. సంగీత, నృత్య రూపక రచనకు ఒరవళ్ళు పెట్టారు. జయదేవుని 'పీయూష లహరి' అనే సంగీత నృత్య నాటికను తొలుదొల్త తెలుగువారికి పరిచయం చేసినవారు సోమయాజులుగారే. దాన్ని తెనుగు చేశారు కూడ, జయదేవుని ఇంపుసొంపులు తగ్గకుండా.

విశ్వనాథ తర్వాత అంత పెద్దయెత్తున వివిధ సాహిత్యరీతులలో రచనలు చేసినవాడూ, దేవులపల్లి తర్వాత, ఆంధ్ర దేశమంతటా సాహిత్యసభల్లో జనరంజకంగా ఉపన్యాసాలు చేసినవాడూ, వాసిలోనూ, రాశిలోనూ శ్రేష్ఠుడనిపించుకొన్నవాడూ శ్రీవావిలాల సోమయాజులుగారే. విద్వత్తుకు విద్వత్తూ, ప్రతిభకు ప్రతిభా, బహుముఖప్రజ్ఞా, అనంత సృజనాశక్తి కల వాడాయన. విశ్వనాథ, దేవులపల్లిలలో లేని సాహిత్యవిమర్శా, చరిత్ర పరిశోధనలనే విశేషకౌశలం వీరికి కైవసమైంది.

ఆంధ్రదేశంలోని సంగీత నాట్యరీతులపై వారి పరిశోధనవ్యాసం చాలామందే వ్రాసినా, 1948 సెప్టెంబరు భారతి సంచికలో వెలువరించారు. అలాగే వాత్స్యాయన కామసూత్రాలపై వ్యాఖ్యానవ్యాసం 1947లో అమరావతిలో జరిగిన ఆంధ్ర సామ్రాజ్య

మహోత్సవ సభల సందర్భంలో వెలువడినా, 1950లో ప్రకటింపబడిన సాతవాహన సంచికలో దర్శనమిచ్చింది. ఇవి ఆ నాటి పండిత పరిశోధకుల మన్ననలందుకొన్నవి.

1940 నుంచిన్నీ ఆయన ఎన్నెన్ని సాహిత్య సంఘాల వ్యవహారాలు నిర్వహించారో లెక్క లేదు. కార్యదర్శిగా సాహితీ సమితిలోనూ, 'ప్రతిభ'కు ఉపసంపాదకుడిగానూ, సహకార్యదర్శిగా నవ్య సాహిత్య పరిషత్తుతోనూ తనకున్న సాన్నిహిత్యం అలా వుండగా, హిందూ కాలేజీ నాటక సమాజానికి, "శారదాధ్వజ" సభకూ, "సుధర్మ" సభకూ కార్యదర్శిత్వమూ, నిర్వహణమూ ఆయనదే. పిల్లలమఱ్ఱి హనుమంతరావు గారధ్యక్షులుగ వున్న జ్యోత్స్నా సమితికి తొలుదొల్త తాను కార్యదర్శి, అనంతరం అధ్యక్షుడు. డాక్టర్ మారేమండ రామారావు గారధ్యక్షులుగా వున్న ఆంధ్రేతిహాస పరిశోధక మండలికి కార్యదర్శి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో 1963 నుంచీ 73 వరకూ 10 ఏండ్ల పాటు సభ్యుడు – ఇలా ఇంకా ఎన్నెన్నో!

దాదాపు 35 ఏండ్ల పర్యంతం ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలోనూ – కోస్తా, రాయలసీమ, తెలంగాణ – అన్ని జిల్లాల్లోనూ, ఇంచుమించు అన్ని కళాశాలల్లోనూ అన్ని హైస్కూళ్ళలోనూ సాహిత్యం పైననే గాక, ఇంకా అనేకానేక విషయాలపై సోమయాజులుగారి ఉపన్యాసాలు మారు మ్రోగేయి.

సోమయాజులుగారు ఉత్తమరచనల్ని చాలా అనువాదం చేశారు. మహాకవి జయశంకర్ ప్రసాద్ 'కామాయని'నీ, 'ఆంసూ'నూ హిందీనుండీ, షేక్స్పియర్ నాటకాలు – జూలియస్ సీజర్, మేక్బెత్, ఆంటోనీ క్లియోపాత్రాలను బహాఈ మతానికి చెందిన అనేక గ్రంథాలనూ, కేథలిక్ క్రయిస్తవుల మతసాహిత్యాన్ని ఇంగ్లీషు నుండీ మనోహరంగా తెలిగించారు. బాల సాహిత్యం కూడా చాలా రచించారు ప్రీ యూనివర్శిటీ, ఇంటర్, బి.ఏ., బి.ఎస్‌సీ, బి.కాం. తరగతులకు నోట్సు వ్రాశారు అసదృశంగా అనేక సంవత్సరాలు. భువనవిజయ ప్రక్రియ నారంభించడంలోనూ, దాన్ని రూపొందించడం లోనూ, దాని ప్రదర్శనలలో పాల్గొని విజయవంతం చేయడంలోనూ వావిలాలవారు అమోఘమైన పాత్ర నిర్వహించారు.

భువనవిజయం సభల్లో ప్రియదర్శనుడైన తాను ధూర్జటి పాత్రలను పోషిస్తూ వుంటే, నిజంగా ధూర్జటియేనేమో ఈయన అనిపించేవాడు. అంతగా ఆ పాత్రలో ఐక్యమైపోయేవారీ కుమార ధూర్జటి. ప్రకాశం జిల్లా మద్దిపాడులో జరిగిన భువన

విజయం సభలో, మహామంత్రి తిమ్మరుసు పాత్ర నిర్వహిస్తున్న జమ్మలమడక మాధవరామశర్మగారు –

“స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గె నీ
యతులిత మాధురీమహిమ…?”

అంటూ పృచ్ఛ చేస్తే – ధూర్జటి పాత్రనభినయిస్తున్న సోమయాజులు గారు వెంటనే అందుకొని,

“………..ఔ. తెలియందగు లోకమోహనో
ద్ధత సుమసాయక ప్రబలతాప మహోజ్జ్వల పూజ్యపార్వతీ
పతిపద మంజులాబ్జ మధుపాన మధువ్రతుడై చెలంగుటన్”

అంటూ ఆ పద్యం పూరించారు సభికుల కరతాళధ్వనుల నడుమ 1956 జులై 12 నాటి ఉదంతమిది.

…………….

స్వాతంత్ర్యోద్యమ దీక్షతో, జాతీయ విద్యాభిమానంతో, మహిళాభ్యుదయాభిలాష తో, ఉన్నవ వారి శారదానికేతనానికి ప్రిన్సిపాలై త్యాగబుద్ధితో పనిచేశారు. స్వాతంత్ర్యం మన ప్రాంగణం చేరేవరకు ఖద్దరు తప్ప కట్టలేదు. ‘మణిప్రవాళం’ (1952) వంటి ఉన్నత సాహిత్య ప్రమాణాలు గల అపురూప పాఠ్యగ్రంథాన్ని విద్యార్థుల కందించారు. ‘నాయకురాలు’ (1944) వంటి గొప్ప నాటకాన్ని సృష్టించారు. తన విద్వత్తుచేత ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి వంటి సాహిత్యమహోపాధ్యాయుని మెప్పు పొంది, కట్టమంచి రామలింగారెడ్డి గారివంటి మహనీయుని వలన, పండిత – లెక్చరర్ పదవీ నిర్వహణకై ఎగ్జెంప్షన్ పొందగలిగారు. గుంటూరు హిందూ కళాశాలలో 30 ఏండ్ల కాలం సాహిత్యాధ్యాపకులుగా వుండి, ఎందరెందరో విద్యార్థులు విద్వత్కవులుగా, సాహిత్యాచార్యులుగా రూపొందడానికి దోహదం చేసిన గురుదేవుడు సోమయాజులు గారు. చూచేవాళ్లకు కళ్లు చెదిరే రూపలావణ్యం కలిగిన్ని, ఎన్నడూ తన కన్ను చెదరనీయని శీలసంపద నిండుకొన్న నిష్ఠాగరిష్ఠుడాయన. ఆచార్యుడై, కవియై, ఋషియై మహామానవుడైనా డాయన.

ఇంతటి మహనీయ సాహిత్యమూర్తి కావడం చేతనే ఆంధ్రసాహిత్య లోకం ఆయన్ని మహదానందంతో అభిమానించి, ఆదరించి, ఎన్నెన్నో సన్మానాలు జరిపింది

సాహిత్యాచార్య, సాహిత్యరత్న, సాహిత్యబంధువు, మధురకవి, కవిభూషణ, కుమార ధూర్జటి - ఇత్యాదిగా ఎన్నో బిరుదులిచ్చి సత్కరించింది. అందుచేతనే సాహిత్య, నాటకరంగాలలో హేమాహేమీలందరూ ఆయన కాత్మీయులూ, సహవ్రతులూ ఐనారు. విస్సా అప్పారావు, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, కురుగంటి సీతారామ భట్టాచార్య, నోరి నరసింహశాస్త్రి, జమ్మలమడక మాధవరామశర్మ, మల్లంపల్లి సోమశేఖరశర్మ, తెలికిచెర్ల వేంకటరత్నం, వల్లభజోశ్యుల సుబ్బారావు వంటి పెద్దలాయనకు సాహిత్య సహవ్రతులైతే, డాక్టర్ మారేమండ రామారావు, ఓరుగంటి నీలకంఠశాస్త్రి, శ్రీసదన ప్రస్తుత పీఠాధిపతులు నృసింహభారతీస్వామి వారు (పూర్వాశ్రమంలో ఘట్టి నరసింహశాస్త్రి), టేకుమళ్ల అచ్యుతరావు, కామేశ్వరరావు వంటి వారు చారిత్రిక సహవ్రతులైనారు. స్థానం నరసింహారావు, బందా కనకలింగేశ్వరరావు, కూర్మా వేణుగోపాలస్వామి, మాధవపెద్ది వెంకట్రామయ్య, పులిపాటి వెంకటేశ్వర్లు ప్రభృతులు నాటకరంగంలో సహవ్రతులు కాగా, ఆయన వలన సాహిత్య భాసురులైన వారిలో కె.వి.యల్. నరసింహారావు, ఎక్కిరాల కృష్ణమాచార్య, జూలూరి హనుమంతరావు, బూదరాజు రాధాకృష్ణ, బండ్లమూడి సత్యనారాయణ, బొడ్డుపల్లి పురుషోత్తం, కేతవరపు రామకోటిశాస్త్రి, పేరాల భరతశర్మ, యామర్తి గోపాలరావు మొదలైన యశస్వులెందరో వున్నారు. ఇంతటి విస్తార - సాహిత్య నాటకరంగ బంధువర్గాన్ని బట్టే మనం ఊహించుకోవచ్చును సోమయాజులుగారి అర్ధశతాబ్ది సాహిత్య జీవితం ఎలాటి నిరంతరాయయోగ సమాధియై సిద్ధించిందో! ఈ యోగసిద్ధి వెనుక, అజ్ఞాతంగా, కృతజ్ఞత కూడా ఆశించని ఒక వ్యక్తి త్యాగ మహిమ అండదండలుగా వుంది ఆ వ్యక్తే ఆయన ప్రియధర్మపత్ని, నా చెల్లెలు - చిట్టెమ్మ. తొణుకు బెణుకు లేకుండా, సంసారాన్ని అహర్నిశలూ కంటికి రెప్పలాగా కాపాడగలిగిందామె పుణ్యమే. ఆయన ఇంతటి సాహిత్య పారిజాతమై వికసించడానికి గృహరంగంలో ఈమె సాహచర్యమూ, సాహిత్యరంగంలో శ్రీశివశంకరుల సాహచర్యమూ దోహదం చేశాయి.

ఎనిమిదేండ్ల మా చిట్టెమ్మను 14 ఏండ్ల సోమయాజులుగారు 13-5-1932న పెండ్లాడారు. చిట్టెమ్మ తండ్రి రాయప్రోలు రామశేషయ్య గారు గుంటూరు వాస్తవ్యులు, గుంటూరులోనే నివసిస్తున్న - సోమయాజులు గారి పెదతండ్రి - వావిలాల రామచంద్రశాస్త్రి గారి సంబంధం కుదిర్చి పెండ్లి చేశారు. సోమయాజులుగారి తండ్రి, సత్తెనపల్లి వాస్తవ్యులైన సింగరావధాని గారు తల్లి మాణిక్యాంబగారు. 18-1-1918

పింగళ నామ సంవత్సర పుష్యశుద్ధ సప్తమీ శనివారం నాడు సోమయాజులుగారు జన్మించారు. తాను పసిగుడ్డుగా వున్నప్పుడే తండ్రి స్వర్గస్థులు కావడంతో సోమయాజులుగారు నరసరావుపేట తాలూకాలోని విప్రులపల్లి అగ్రహారంలో మాతామహుల ఇంట పెరిగి, సత్తెనపల్లెలోని క్రైస్తవ ఎలిమెంటరీ స్కూలులోనూ, తరువాత నరసరావుపేట హై స్కూలులోనూ, పిమ్మట గుంటూరు ఎ.సి. కాలేజీలోనూ చదువుకొని, తెలుగు సాహిత్యం, దక్షిణ భారత చరిత్ర అభిమానవిషయాలుగా తీసికొని 1938లో పట్టభద్రులైనారు.

పట్టభద్రులైన తరువాత రెండేండ్ల కాలం గుంటూరులోని ట్యుటోరియల్ కాలేజీలలో అధ్యాపకులుగానూ, స్వాతంత్ర్య సమరయోధుడైన ఒక మిత్రునకు ప్రింటింగ్ ప్రెస్సు నిర్వహణలో సహాయకుడుగాను పనిచేశారు. 1940 నుండి 1947 వరకు శారదానికేతనం ప్రాచ్య విద్యా కళాశాలకు ప్రిన్సిపాలుగానూ, 1947 నుండి 1977 వరకు హిందూ కళాశాలలో ఆంధ్ర భాషాచార్యులుగాను పనిచేశారు. 1974, 1975, 1976 సంవత్సరాలలో – ఇంటర్, పి.యు.సి., బి.ఎ., బి.ఎస్‌సి., తరగతుల వారికి, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి కరెస్పాండెన్సు విద్యాలయంలో ఆంధ్రోపన్యాసకులుగా కూడా పని చేశారు.

శ్రీవావిలాల కవిశేఖరుల సంతానం – నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, పెద్ద వాడైన ఛాయాపతిని, తన పెద తండ్రి నిస్సంతు కావడం చేత, ఆయన దత్తత తీసుకొన్నాడు. ఆ పుత్రుడు వివాహానంతరం కొద్ది కాలానికే, అందరి కడుపుల్లో చిచ్చుపెట్టి వెళ్ళిపోయాడు. పెద్దమ్మాయి భర్త కూడా అదే పని చేశాడు, సంతానమైనా కలగకుండానే. తక్కిన ఈ ముగ్గురూ ఆ ముగ్గురూ ఉన్నతవిద్యావంతులై ఆర్జిస్తూ, సద్గృహస్థులై సంతానవంతులై, తండ్రి కీర్తి నినుమడింప జేస్తూ ఉన్నారు.

'పూర్ణపురుషుడు' అనే మాట ఒకటి ఉన్నది కదా? సర్వతోముఖ నిష్కళంకమూ సుందరమూ శుభప్రదమూ ఆనందదాయకమూ ఐన మానవజీవితాన్ని తెలియజెప్పడాని కీ మాట వర్తించేట్లయితే, తప్పక శ్రీవావిలాల సోమయాజులుగారికి కూడా వర్తిస్తుంది. అయితే సాహిత్యంతో ప్రత్యక్షసంబంధం లేని మహాపురుషులకే ఈ మాట వాడకంలో ఉండడం చేత, సాహిత్య విశేషార్థం వచ్చేట్లు ఈయన్ని 'సాహిత్య పూర్ణపురుషుడు' అందాము.

నా చెల్లెలు చిట్టెమ్మకు 'ఇంటాయన' కావడం చేత, ఈయన నాకు బావగారైనారు. 73వ ఏడులో నడుస్తున్న ఈ సాహిత్య పూర్ణపురుషుడు. మా బావ వావిలాల సోమయాజులుగారు, ఆంధ్ర సాహిత్యభాగ్యాన్ని ఇనుమడింపజేస్తూ, అందరినీ ఆశీర్వదిస్తూ నూరేండ్ల కాలాన్ని దాటి, హాయిగ సాహిత్య జీవయాత్ర కొనసాగించాలని త్రికరణ శుద్ధితో కోరుకొంటున్నాను.

పింగళి – కాటూరి సాహిత్యపీఠం, హైదరాబాదు

విధేయుడు
**ఊట్ల కొండయ్య**

# విజ్ఞాపనం

"శివాలోకనము" ను "కరుణశ్రీ" గారికి పీఠికకోసం పంపినప్పుడు, అది అష్టఖండికల సంపుటి మాత్రమే. తరువాత దానికి "కర్తవ్యము" అనే మరో ఖండిక చేర్చడంతో, అది నవఖండికల సంపుటి అయింది. 'కరుణశ్రీ' గారి 'ముందు మాట' నాకు అందేలోగా, 'కర్తవ్యము' ఖండికను వారికి పంపలేకపోయినందుకు చింతిస్తున్నాను.

అష్టఖండికల సంపుటిపై 'కరుణశ్రీ' గారు వెల్లడించిన ఆధ్యాత్మిక భావనను అనుగమిస్తూ భావుకుడైన ఒక మిత్రుడు. ఇప్పుడిది నవఖండికలు కలిగి వుండడాన్ని "నవరసనటనామూర్తిని స్ఫురింపజేస్తున్నది" అంటూ చమత్కరించాడు.

తొమ్మిదవది యైన "కర్తవ్యము"లో, శత్రుసైన్యాలతో, సాగిస్తున్న భీకరకదనంలో సర్వ సేనాధిపతి హఠాత్తుగా దివంగతుడుకాగా, అతని పరిరక్షణలో సర్వతోముఖ భద్రతలు అనుభవిస్తున్న చాళుక్య యువరాజు, ఆ భయంకర పరిస్థితికి తట్టుకోలేక, సంధి ప్రయత్నాలు సాగిస్తున్నప్పుడు, మరణించిన సర్వసేనాధిపతి ధర్మపత్ని చిరంటి వీరనారి "కామసాని" వీరవేషంతో వచ్చి, సర్వసేనాధిపత్యాన్ని తానే వహించి, సైనికదళాలను నడిపించి, విజయాన్ని చేకూరుస్తానని ప్రతిన చేస్తుంది. యుద్ధక్రీడకు యువరాజును ఘనంగా ప్రోత్సహిస్తుంది. ఈ కవితలో వీరనారి 'కామసాని'కి గల రాజవంశానురక్తి, రణతంత్రజ్ఞతా, శౌర్యమూ, త్యాగశీలమూ ఇత్యాది గుణవిశేషాలు నిస్తంద్రాలుగా నిరూపితాలయినవి.

నా గురువర్యులు శ్రీశివశంకరులు పీఠికాదులకు పరమేశ్వరుడని ప్రసిద్ధి గన్నవారు కదా? అయినా "నాయకురాలు" (1946), "మణిప్రవాళము" (1952) 'వసంతసేన' (1953) ఇత్యాది కృతులను ముద్రింపించి ప్రచురించినప్పుడు, నేను, వారిని గానీ, వారితో తుల్యులయిన ఆ నాటి సాహిత్యరంగంలోని పెద్దలను గానీ పీఠికాదుల కొరకు అర్థించవలసిన అగత్యం కలుగలేదు. ఇప్పుడు చాలాకాలం తరువాత ఈ ఖండకావ్య సంకలనం ప్రచురిస్తున్నందున వీని ఆవశ్యకతను కొందరు మిత్రులు సూచించి వున్నారు. ఫలితంగా మాన్యసాహిత్యమిత్రుల నుండి అవి లభ్యమయినాయి.

ఆదరంతో నాకు 'అభినందన' అందజేసిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీతయైన మహాకవి. తెలుగు విశ్వవిద్యాలయ – ఉపాధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారికి నా కృతజ్ఞతాభివందనములు.

తీరిక లేకున్నా అనురాగంతో "శివాలోకనము"నకు "ముందు మాట" పంపించిన నా ఆత్మీయులైన మాన్యమిత్రులు, కవీంద్రులు శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రి గారికి నా శ్రద్ధాపూర్వక ప్రణామములు. "కరుణశ్రీ" గారి వలెనే నాకు చిరకాల మాన్యమిత్రుడు, బహుముఖ సాహిత్య ప్రజ్ఞానిధులు, ఇష్టులు నైన సరస్వతీసమవాయ సహచరులు, "ప్రగతిగీతాప్రవక్త" శ్రీనండూరి రామకృష్ణమాచార్యులుగారు గౌరవానురాగాలతో అక్షరాంజలిని పంపించారు. వారికి నమఃపూర్వకాశీస్సులు. అంతర్జాతీయ కవి అవార్డు గ్రహీతలుగా ప్రఖ్యాతి నార్జించిన పింగళి – కాటూరి సాహిత్యపీఠం అధ్యక్షులు, యువవిద్వత్కవి చంద్రులు శ్రీఆచార్య తిరుమలగారు గౌరవానురాగాలతో "సమీక్షణం" పంపినందుకు వారికి నా నమఃపూర్వకాశీస్సులు. "శివాలోకనము"నకు సంపాదకత్వము వహించి, సమస్తాన్ని సక్రమంగా నడిపిన వారు, ఈ కావ్య సంచికలోనికి "సాహిత్యజీవనం"ను అందించిన వారు నా చిరకాల ఆప్తమిత్రులు, సత్కవులు, "పింగళి– కాటూరి సాహిత్యపీఠం సంస్థాపకులు. జనతా సంక్షేమ కాంక్షులు, గాంధేయానుయాయులు శ్రీఊట్ల కొండయ్య గారికి నా నమఃపూర్వకాశీస్సులు. ఈ నా ఖండకావ్య సంపుటిని అభిమానంతో ఆకర్షించి ప్రోత్సహించిన సాహిత్యమిత్రులు– సరసవిద్వత్కవులు, తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ విభాగాధికారులనగు డా. వి.వి.యల్. నరసింహారావుగారికి, ప్రసిద్ధ కవి జీవిత చరిత్రకారుడు, శ్రీత్రిపురనేని సుబ్బారావు గారికీ నా అభివాదనపూర్వ కాశీస్సులు.

'శివాలోకనము'ను వెలువరించే పనిలో మనఃపూర్వకంగా సహకారమందించిన నా ధర్మపత్ని చి.ల.సౌ. కైకమ్మ వురఫ్ చిట్టెమ్మకు, నా ప్రియ పుత్రీపుత్రులకు, వారి సహచరులకు, పౌత్రతుల్యుడైన – సమీపబంధువర్గంలోని – చిరంజీవి పైడిమఱ్ఱి శ్యాంప్రసాదుకు, నా అభినందనలూ, శుభాశీస్సులూ.

మేము అర్పించే పాదాభివందనాలను దశశతాలుగ స్వీకరించి, 'శివాలోకనము' నకు సాహిత్య లోకంలో విపుల ప్రచారాన్ని ప్రసాదింపుమని భక్తితో బ్రాహ్మీ పరమేశ్వరులను అర్థిస్తున్నాను.

తిరుమల అపార్ట్‌మెంట్స్, భవదీయుడు
హైదరాబాద్ **వావిలాల సోమయాజులు**
10–5–90

# వాత్సల్యప్రియ

లీలామానుషవిగ్రహుడగు గోపాలుని లీలలను మాయామోహితమైన జగమంతా ఒక ఎత్తుగా చెప్పుకుంటే, అదృష్టవంతురాలయిన శ్రీకృష్ణుని తల్లి యశోద ఆ మాటలనే మళ్ళీ చెపుతూ 'వాత్సల్యప్రియ'గా పరిపూర్ణత పొందింది. లీలల వర్ణనలో, పలుకుల పొందికలో, మాటల తీరులో అనేక అందాలు పోయింది ఆ అమ్మ హృదయం. ఈ కవితావాహినిలో పాలనురగలై ప్రవహించిపోయింది.

ఉ. గోపిక లొక్కటై పలుకు కొండెములన్ తలపట్టిపోయి నా
కోపము మిన్నుముట్టి, ఇక కొట్టక తిట్టక యున్న పట్టగా
నోప నటంచు నీ కయి గృహోపరిభాగ కవాట సీమలో
కాపల కాసి కాళులివె కండెలు కట్టెనురా కుమారకా!

మ. నిను దండింపగ వేచియుంటినని మున్దే చెప్పినా రెవ్వరో,
అనుమానించిరి, రాధ కాదు గద! ఏరా! అల్లరే మాని, నీ
తిని ముత్తైదటు కూరుచుంటి విటు లేదీ ఒక్కమారెత్తరా
కనుగొందు న్మొగ మెంత దొంగవుర సాక్షాన్మొని వైనావురా!

ఉ. ఏ గతి వచ్చి చేరితివి యింటికి, వాకిట నిల్చియుంటి కా
దా గజదొంగ, మూసితివి అమ్మకు కన్నుల దొడ్డిగుమ్మమున్
నే గడి వేసి వచ్చితిని, నీకెటు వచ్చెనొ ఇట్టులైన నే
లాగున నిల్వగాగలమురా నిను పెట్టుకు ఊరిలోపలన్?

ఉ. ఒక్కరు చెప్ప నమ్మకనె యుందును కావని గ్రామమధ్యమం
దక్కట మంచివాడ వని యాడరు ముద్దునకై నొక్క రే
దిక్కున నీవెయై ప్రజను త్రిప్పలు వెట్టుచు నుంటివంచు మా
మక్కువ యింత చేసెనని – మన్నన దక్కదటంచు పల్కెరా!

మ. పలుకన్ వారల కేమి చెప్పుటకు నే పాల్పోక నో తండ్రినా
తల యాడించితి సత్య మన్నటుల నిత్యం బిట్టు లెన్నాళ్లు లో

కుల తండంబుగ నింటిపై బరపి గగ్గో లాచరింపంగ నీ
తలపో – అర్థము కాదు మానసములో ధైర్యమ్ము శుష్కించెరా! 5

ఉ. ఊరికి ముందె నిద్దురకు నోర్వవు నీ కనులో మహాత్మ! వే
మారులు పిల్చినన్ పలుకు మాని, ప్రగాఢ సుషుప్తి చెంది న
ట్లో రమణీయ మోహన తనూ! నటియింతువు కాలరాత్రు లే
పారిన వల్లవీ దయిత మానవురా! యమునా విహారముల్.

మ. వరసా వాయలు లేక కన్నియల త్రోవల్ కాచి కవ్వించి నీ
పరిహాసమ్ములు మానరా' యనిన 'అబ్బా! ఎంత కోపమ్మో! – ఇ
ట్లరచాటై నటియింప సిగ్గుతెర నా కాహ్లాదమం చెంచితో
తెరవా! చాలని ముద్దు గొందువట ఈ తీరేమి మర్యాదరా?

ఉ. ప్రాయపు లేమ లొంటి మథురానగరమ్మున క్షీరమమ్ముకో
బోయెడు వేళ దారులను పొంచుక నీ వపు డడ్డుకొట్టి 'అ
మ్మా యితడెవ్వడో ఎరుగుదే, ఇక రాజగు ముందు ముందు నీ
తీయని గుమ్మపా లిటుల తె'మ్మని రొమ్ములు చూచినావురా!

ఉ. పండుగరోజు లంచు బ్రతిమాలిన అల్లుడుగారు వచ్చి రే
యెండకు మేడపై పడుక టింటను నిద్దురవోవు వేళ మా
దుండగి మెల్లగా నరిగి తొయ్యలి రుబ్బిన గోరటాకుతో
మెండుగ కాలు సేతులను మెత్తెనటంచొక తాడిపోసెరా!

ఉ. పాపము బ్రాహ్మణుం డెవరొ పంక్తికి భోజనవేళ వచ్చి సాం
దీపుల వారి యింట కొన తీర్థము లాడగ లోని కేగగా
నా పరదేశి మూలరుగుపై నిడి వెళ్ళిన దేవతార్చనన్
దోపిడి చేసినావట – బుధుం డత డేమి యొనర్చె పాపమున్?

మ. పగ సాధింపగ కోర్కె కలిగినను 'తప్పో ఒప్పొ' యం చించుకం
తగ నాలోచన చేయగా వలదె ఎంతైనాను, పై రేట కొ
ప్పుగ పండించిన చేలపై ఎనుము గుంపున్ త్రోలి త్రొక్కించ నీ
కగునా! వీటి విచిత్ర చేష్ట లివి సర్వానర్థ మూలమ్ములే. 11

చ. చెరువుకు గండి కొట్టె గుమి జింకల మా పొలమందు తోలె, మా
అరకల కర్లు లాగె పొలమందలి మంచెల పాడుచేసి కా
పరులను కొట్టి పంపె, గునపమ్ముల మట్టిలొ పూడ్చె చెట్టుపై
మరుగగు దుత్తలో చలిది మాయము చేసె నటంచు పల్కినన్.

ఉ. ఈడుకు తగ్గ చేష్టలగునే వ్రజభామినులార! యంచు నే
నాడగ నోడినాను శిశువా! ఎట వారలు 'చిన్న బిడ్డ లీ
యీడుకు కొండలెత్తుచు ఫణీశులతో చెరలాట మాడిరే
యేదవి మాట లమ్మ' యని యెచ్చట దెప్పెదరో యటం చెదన్.

చ. ఒక చిరునవ్వుతో నెడద నుయ్యెలలో నిదురింపచేతు వా
నిక పలువిప్పి మాటలను ని న్ననలేనుర! జన్మతోడ నీ
వొక నటకాగ్రగణ్యుడవు ఉన్నది కాదనుపించు శక్తి యే
తికమక పెట్టియో హృదయ తీవ్రత మాన్చెదురా వివేకివై. 14

***(ఆనందవాణి, 1946 దీపావళి సంచిక)***

# ఉజ్జీవము

(మహేంద్ర రాజ్యరక్షాగర్వి మదనుడు తపోభంగ కార్యార్థమై మహేశ్వరాశ్రమానికి విచ్చేసి తన అశక్తతను అవగతం చేసుకున్న తరువాత)

మ. అవిగో, శాత్రవ కాలమేఘములు, ప్రోవై క్రమ్మగా వచ్చె నీ
దివి నల్దిక్కుల, దిక్కు మాకిక భవద్దివ్యాస్త్ర జాలంబె నీ
పువువిల్ బూనుము, లెమ్ము, కావగదవే పుష్పాస్త్ర! శీతాద్రి సం
భవపై నీశు మనమ్ము నిల్పుము తపోభంగంబునన్ నెచ్చెలీ!

మ. అనుచున్ దేవసభాంతరాళమున నాకాధీశుడే బేలయై
నను ప్రార్థించిన పొంగి నాపొగరు మిన్నందెన్ భళీ! క్రొవ్వి ఆ
డిన మాటల్ తలకెత్తె నీ బరువు, పాటింపంగ లే రెవ్వ రే
మనినన్ నామొర నేడు, గర్వ మిటు మాయావాగురన్ చేర్చెనే?

చ. వలదని ఎంత చెప్పితివా రతి, నే విన నైతి సాధ్వి, నీ
తలపులె సత్యమయ్యె, జడదారులపై విజయంబు గొన్నటుల్
వలనగు నంచు వచ్చితిని భర్గు మహోగ్రతపంబు మాన్చ, నీ
పలుకెడ సేయ నింక కొనప్రాణముతోడ తిరోగమించినన్!

చ. అడుగుల కడ్డువచ్చి తడియారని కన్నులతో కపోలముల్
వెడవెడ వెల్లనై సొగసు వీడగ వీడుట కొప్పుకోని నీ
యెదదను దిద్ద, ఉన్నయటులే చనుదెండు యుగమ్ముకాదె మీ
కడ నిలువంగలేని క్షణకాలము నాకని యార్తవైతివే!

చ. ఎడ నెడ దుర్నిమిత్తముల నేడ్తెర కుంగి కృశించి ఓ చెలీ!
తడబడు గుండెతో నెదురు దారులు చూచుచు నిల్తు వీవు! నా
ఒడికముతప్పె – ఇంక తడవో కలకాలము – మానవే సఖీ!
ఎడదను నాపయిన్ మమత ఏగతి నున్నదొ ఈశ్వరేచ్ఛయున్?

శా. ఆలోచింపకమున్నె నల్దెసల ప్రౌఢానంత వాసంత లీ
లాలాలిత్యము క్రుమ్మరించితివి, ఉల్లాసంబుతో కాననం
బీలీలన్ భవదీయ దివ్యవిభవోద్వృత్తిన్ ప్రసాదించెనో
యీ! లోపమ్ము వసంత రాజ! కన లేనేలేదు పో నీయెడన్. 6

చ. నను గని నవ్వుచున్నది వనం బొక యుప్పెననవ్వు నేడు నా
మనమున ధైర్యమొక్క యణుమాత్రము నిల్వదు, జారిపోయె నీ
ననవిలు నిల్వ నోపకను నా కరకంజము నుండి, యెట్లుగా
ననితర సాధ్యు నీశు పరమాత్ముని తాపస వృత్తి మాన్పుదున్?

మ. సుమబాణావళితో జగత్రయము నే సుత్రాముకై గెల్చి అ
య్యమరేంద్రాసనరక్ష సేయుదు గదా, అస్మద్బల ప్రౌఢికిన్
సమ మే లోకములోన నున్నదని యిచ్చున్ గర్విnైపోదు – నా
ప్రమదం బీయెడ భగ్నమయ్యె, సురకార్యం బెట్టు లీడేరునో?

ఉ. జీవన పుష్ప సౌరభము చిత్రగతిన్ మటు మాయమయ్యె నే
మో? విధి యీ యెడన్ నను విమోహదరిద్రునిగా నొనర్చి బా
ధావిపినాంధకారమున దారులు మూసి, దవాగ్ని వెట్టె దే
వా! వగతీరి నాకు నిరుపాధి మరెన్నటికో మహేశ్వరా!

ఉ. "అచ్చరపిండు వెంటగొని, ఆమనియున్ మలయానిలుండు నీ
నచ్చిన నెచ్చెలుల్ ప్రియముమై సహవీరత వెంటరాగ, నా
పచ్చని చిల్కతేరు పరవళ్లను ద్రొక్కగ, పుష్పధన్విnై
మెచ్చ మదిన్ శచీప్రియుడు, మించుచు వచ్చితి భర్గుగెల్వగన్.

ఉ. ఓ మలయానిలా! సఖ!! మహోదయ!! నీదగు నృత్యకేళి నా
రామమునన్ తరుల్ సుమవిరాజిత ముగ్ధలతానుషంగముల్
కామకళారసజ్ఞతల గాఢవినిద్రిత చిత్తవృత్తులై
నామది కింపుగూర్చెడి యనంతవిలాస శకుంతసంతతుల్.

చ. ప్రసవశరాసనోజ్జ్వలవిలాసములన్ గనలేదు లోప మో
అసమశరా! త్వదీయధనురంచిత బంభరమంజు శింజినీ
రసభరఝాంకృతిధ్వనికి రా దిసుమంతయు భంగపాటు, నీ
పసతరుగంగ దీనతకు పాల్పడె దేటికి? ఉద్యమింపుమీ?" 12

చ. అని నను ప్రోత్సహించెడు నయాచిత శక్తి యొకండు ఎన్నడున్
గన నిటు దీనతాగుణము నాపయినన్ విజయమ్ముగొంట నే
ననుకొని తీర్పనట్టిది మహత్తరకృత్య మొకండు లేదు నా
మన మురియాడ నేల? ననుమానములన్ కలగుండు నొందుచున్.

ఉ. "తుంటరి వింటితో కదనదోహలియైన పినాకపాణి పై
కొంటిగ నేగుచుంటివి సముత్సుకతన్, గళమెత్తి నందినీ
బంటుదనమ్ము చూడ నొకపాటిగ రంకె యొనర్ప డిల్లవో
కుంట పొసంగునే? అళులనో మదనా! మది నమ్మ జెల్లునే?"

చ. అని మొరవెట్టి పల్కునెడ నో రతి! దీనత దుఃఖరేఖ నా
మనమున హత్తుకొంటివి – సమాయతవై పలుమారు తోచె దే
ననుకొన స్వప్నమందయిన నబ్బెడు నీ దురవస్థయంచు – ఓ
వనజముఖీ! త్వదీయముఖవారిజశోభ లెసంగుగావుతన్.

చ. పొలయలుకన్, నిరాదరణపూర్వక చేష్టల, మందహాసరే
ఖల నెటుగా ప్రయత్నవిముఖత్వము గూర్పగ పాటుబడ్డ నే
చలనము నొందకుంట, పటుసాహసవైఖరి నుత్సహించుటన్
కలగుచు నన్ను నంపునెడ గాఢభయాన్విత వైతి వో సతీ!

చ. కనకపుకంబ మొందు స్ఫటికంపు సురమ్యవిశాలహర్మ్యమం
దున లగియించి నట్టులుగ తోచెడి శర్వుడు యోగశక్తిచే
ననుచగ నాత్మతేజము మహోన్నతదేహమునందు మున్ను నే
ననుకొన నీశు డర్యమ సహస్ర కళాకలితుం డటం చెదన్.

ఉ. ఎంత మహోగ్ర మీ తపమ దెట్టి మహార్థము నొంద గోరియో!
అంత మదెన్నడో యెరుగ మాత్మభవా! శివ! అష్టసిద్ధు ల
త్యంతము నిన్నె చేరెను గదా? యిది ఏటికయా మహేశ! ర
వ్వంత విలాసమా, నిజనిరామయధారణకున్ పరీక్షయా? 18

ఉ. కమ్మని తావి గాలిబుడతల్ తలకెత్తుచు మోయలేని భా
రమ్మున మందమంద మధురమ్ముగ సాగుచు వచ్చి వచ్చి నీ
డమ్ముల నిద్రనోవ ప్రకటస్ఫుట పంచమగీతి సృష్టి మ
ర్మమ్ముల వ్యాఖ్యసేయ నమరన్ పిలచున్ పిక జంపతీతతిన్.

ఉ. ఏ యెడ నుండియో యివె నవేందుసుధామయరోచు లీవనిన్
ప్రాయపు వెన్నెలన్ గలయబ్రామెడు - ఎవ్వతె యీ మనోజ్ఞ? ఓ
హో! యిదె వచ్చుచున్నది మహోన్నత భక్తిరస ప్రపూత హ
ర్షాయత లోచనాంబురుహ, అద్రితనూజ మనోహరాకృతిన్.

ఉ. ఈ మహనీయ గాత్రి మధురేక్షణ పంక్తులలో, నటించు ది
వ్యామల పాదపద్మ మృదుచాలనలో, హసియించు చాలులో
కాముని ప్రాణముల్ దివిజకాంతలకోమలకుంతల ప్రభా
స్తోమము గూడు కట్టినవి - శుష్కజగంబిక పల్లవించెడిన్.

ఉ. మానితహస్తయుగ్మ మధుమాస మహోదయ పత్రపుష్ప మా
లానవ వాసనాలహరి లాస్యము చేయ మహేశు కంఠసీ
మానల మందు, భంగిమ నుమాసతి నిల్చి శుచిస్మితాంబుజ
శ్రీనవకమ్ములన్ గనగ జిత్తజ కేతన కాంతి గ్రాలదే? 22

***(ప్రతిభ 1945 అక్టోబరు)***

# పరివర్తన

(శ్రీరాముని బాణప్రయోగానంతరం వాలి మనోభావాలు)

శా. ఎన్నో మారు లెదిర్చి యోడి గిరులం దేమూలనో డాగి వా
డున్నా డన్నదె మాసి పోవ బ్రతు కెట్లో యీడ్చు సుగ్రీవు డు
ద్యన్నవ్యార్భటి బొబ్బవెట్టి నను నాహ్వానింప, నే మోసమో
యున్నట్లున్న దటంచు నెంచియును నే యుద్ధంబు నీ వచ్చితిన్.

మ. సరియే నాయనుజన్ము డెన్నడును భాస్వత్సత్త్వ సంపత్తి నా
కరయన్ వానిని కీటడంచు టొక యాటై యుండు నేవేళ సో
దర సౌహార్దముచే వధించుటకు జిత్తం బొప్పుకోకున్న నే
వరకున్ దేలని పోరు సల్పి తరుమన్ వా డిట్లు జీవించెడిన్.

మ. తరుమూలమ్మున డాగి చోరుని గతిన్ ద్రాఘిష్ఠ చాపాన భీ
కర నారాచము తొడ్గి నా విపుల వక్ష శ్శైలముం జీల్చుదా
కరయన్ నీ జతనమ్ము శాత్రవుడ వెట్లైనాడ వయ్యా! భవ
త్పరమ క్షాత్ర విచిత్ర రూపమును మున్ దర్శింప నే నెన్నడున్.

ఉ. కట్టిన వల్కలమ్ములకు గౌరవమున్ గలిగింపగోరి చే
పట్టితె వీర కార్ముకము వంచనమై పగవాడ గాని నన్
నెట్టన నిట్టు కూల్చి యవనిన్ మహనీయ పృషత్క విద్యకున్
పట్టము గట్టుకో దలచి భండన పండిత! యిట్లొనర్చితే?

ఉ. ఇట్టు లధర్మచేష్టను వధించి ననున్ చిరునవ్వు నవ్వుచున్
దిట్టతనాన మించి, గడి దేరిన వాడవువోలె నిల్చు, నీ
దెట్టి విశిష్ట సత్కులమొ, ఎయ్యది దేశమొ, ధర్మమేమొ? నీ
యట్టిడు లుబ్ధకుండొ, మహితాత్ముడొ కావలయున్ ప్రవీరుడా!

చ. ఎదురుగ నిల్చి గెల్చుటకు నెవ్వడు పూనిన వాని శక్తి సం
పద నొక యర్ధభాగ మెడబాసి ననున్ గని చేరు నెప్పు డి

య్యది యగు నాదు జీవిత రహస్యము – దీని నెరింగి యుంటచే
కదనము కోర కిట్లు నిజకార్ముక మంపి వధించి నాడవే? 6

మ. అవు నా జీవిత మర్మ మీ వెరుగుదయ్యా! కాక వంచింప నీ
కవునా? క్షాత్రమె మూర్తి దాల్చి నటులున్నా వీవు జ్యాఘోషమున్
వివిధాశాస్త్రవిభేదకస్వన మహావిస్ఫూర్తి విన్పించి నా
డవు నీ వెక్కటి శౌర్య సారుడవు గాఢ ప్రక్రియన్ నమ్మెదన్.

చ. తలపుకు వచ్చు చున్న యది దాసులు తొల్తగ విన్న వించి నా
రలు, రఘువంశజుం డొకడు రాజ్యరమన్ విడనాడి, తమ్ముడున్
చెలియును వెంటరా విపిన సీమలలో ముని వేషధారియై
మెలగెడి నంచు నా గతిని మించిన వాడవు నీవె యౌదువా?

ఉ. ఆవల వింటి నాత డగు నా రఘువంశజు డంచు రక్తి మై
యీవన భూమి పంచవటి నింతియు గూడి సుఖించు వేళ, నా
రావణు డేగుదెంచి, తన రాక్షస మాయను, జూపి ధీరుడై
ఆ వనితా మణిన్ గొని శతాంగముపై పయనించె నంచునున్.

ఉ. ఆతడ వీవె? యా దశరథావనినాథుని యాత్మజుండవా?
ఆతపనీయకీర్తి కగు నయ్య యనామయ మెన్న దేని న
త్యాతరభక్తి యున్నయది యీ యవనీపతి యన్న నాకు నీ
వాతని పుత్రకుండవ? మహత్తరమూర్తి, రఘూద్వహుండవా!

ఉ. కాదన నీవు, రాఘవునిగా గయికొందును నిన్ను! కాని మీ
రాదట ధర్మరక్షయె మహార్థముగా గయికొన్న దొడ్డ భూ
మీదయితుల్ కదా! యిలకు మేటివి, నీ విటు మాయచేత రా
జా! దయతప్పి నన్ను తెగటార్చుటలో గల సూక్ష్మ మెద్దియో?

చ. మధువన వీథులన్ ప్లవగ మానవతీ జనతా మనోజ దు
ర్వ్యథలను దీర్చుటల్! సుమసుధారస సేవన కేళిలోలతా
కథనములున్ మదీయ గుణ గౌరవ భంగము సేయ నీచపు
న్నిధనము నిచ్చినావె? యవినీతుడు వీడని నమ్మి నీయెదన్. 12

ఉ. ధర్మము నుద్ధరింప వసుధన్ రఘువంశము నందు కేశవుం
డర్మిలి పుట్టె నంచును మహాత్ములు మౌనులు చెప్ప వింటి మున్
నిర్మలచిత్త! యాతడవు నీ వగుదేమొ! వనేంద్ర నీతికిన్
ధర్మముగాని కార్యము లొనర్పను నే మదగర్వితుండనై.

మ. యమఘంటా నినదోపమంబయిన సింహధ్వానమ్ముం జేసి యా
హిమవంతుం గని న్యక్కృతించి కదనం బెవ్వాడు కాంక్షించె వా
డమితోత్సాహుడు యాతుధానుడును నే నా దుందుభిం జంపి దో
స్సమరంబందున కాలజిమ్మి యిట నాశ్వాసించితిన్ మేటినై.

మ. దెసలం గెల్చితి నన్న గర్వమున నంధీభూతుడై రావణుం
డసిసాహాయ్యమె మెచ్చి వచ్చి యొకనా డాయోధన క్రీడ నా
కొసగన్ శక్తుడవే యటన్న 'చెడె దోహో!' యంచు సూచించి వె
క్కసమౌ మల్ల విశేషబంధమున ధాకంగొట్టి నిర్జించితిన్.

శా. ఆవిర్భావము నొందినాడ దివి జాధ్యక్ష ప్రభన్ దీర్ఘ బా
హా విశ్రాంత బలాతిరేకమున సర్వారాతి దోర్గర్వమున్
త్రావన్ శాత్రవులైరి మిత్రులు - సదా రాజ్యప్రజాపాలనా
ప్రావీణ్యంబున కీర్తి కెక్కితిని, చంపన్ జెల్లునే నన్నిటుల్?

శా. ధర్మత్యాగ మొనర్ప నెన్నడును, సత్యప్రీతి పాలింతు, నే
కర్మిష్ఠుండను - సర్వసంధ్యలను శ్రీకంఠాంఘ్రి కంజాత స
న్మర్మాభిజ్ఞుడనై ద్విరేఫముగ నస్మత్ శీర్షము న్జేర్తు నో
ధర్మార్థ ప్రభవిష్ణు! విష్ణు! ఎటు లే దండ్యుండ నై నాడనో!

శా. ఆదిత్య ప్రభవమ్ము భవ్యమని నా కత్యంత తాత్పర్య మ
య్యా! దీవ్యద్భవదీయ వంశ మన సర్వానర్థముల్ దీర్పగా
నా దేవేంద్రుడు మిమ్ము గోరు కథలన్ జిన్నప్పుడే వింటి-ని
ర్వేదం బెన్నడు మీ కొనరుచు గతి వర్తింపన్ "దురుద్యోగినై". 18

ఉ. అంగదు వల్ల వింటిని బలాఢ్యుడు క్షత్రియ వీరమూర్తి స
ర్వాంగ మనోహరుం డొక డహస్కర పుత్రుని మైత్రిగోర ను
త్సంగము నందు వచ్చిగొని సంగడికిన్ శపథమ్మొనర్చి యు
త్తుంగ సుఖోపగూహనముతో జెలువొంది రటంచు మొన్ననే!

శా. ఆ మాయావిని రూపుమాపు తరి మాద్యద్దివ్య మాతంగ లీ
లామాత్సర్యము తోప నే కడగి ఘోర ప్రక్రియన్ పోరు వే
ళన్ మా సుగ్రీవుడె ద్రోహియై తనకునై రాజ్యంబు గైకొన్న వా
డా మాయావియె నీకు మైత్రి కయినాడా? సత్యధర్మప్రియా!

ఉ. అన్నయె చచ్చె నా దనుజు డాహవభూమిని గెల్చె, బాహుసం
పన్నత నన్న యీహ పొడమన్, కపిరాజ్యమునందు నంగదున్
మన్నన నిల్పి నా సచివ మండలికిన్ కడు పెద్దయౌచు, తా
నున్న మనోజ్ఞ కీర్తియును నూర్జిత ధర్మము నబ్బి యుండదే?

మ. అటు కిష్కింధకు నొక్కమారయిన రా! వాతిథ్య మిప్పించి యు
త్కట హర్షాంబుధి నోలలార్చి ప్రజ చేతం గాన్క వెట్టించి నీ
వటు విక్రాంతికి దగ్గ యర్హణము దేవా! ఏనె కావింపనే?
ఇటు లీ క్రూర నిశాంత సాయకముచే న న్నేల శిక్షించితో?

శా. కామాంధుం డయి పంక్తికంఠుడు నినున్ గైకోక మోసమ్మునన్
భామారత్నము బల్మి బట్టి కొనిపోవన్ వాని శిక్షింప నీ
వీ మార్గమ్ముల మెట్టు చుంట విని తండ్రీ! దర్శనం బిచ్చి నన్
ప్రేమం దీర్పగ కార్యము న్విలుతువం చెంతేని యూహించితిన్.

శా. నీకుం దృప్తిగ కింకరుండ నయి వానిం బట్టి తెప్పించి దే
వా! కంజాతమనోజ్ఞ తావక పదద్వంద్వంబు పట్టించి సీ
తాకాంతా మణి నిచ్చునట్లొనరుపన్ దైవార కాంక్షించు నా
కో కాకుత్థ్సమణీ! అనుగ్రహము కయ్యో! నిగ్రహం బబ్బెనే! 24

చ. అయినను నా పులస్త్యజ దురాసదవిక్రము నర్థి కొల్చు వా
రయి యనుజన్ములన్ సుతుడు వాహన దోహలులున్న వార లె
మ్మెయి గెలువంగ జాలునని మిత్రసుతుండు తదీయ మైత్రియున్
రయమున నిచ్చగింప తగునా యిది నీ సతి దెచ్చు మార్గమే?

చ. తగునె యుదగ్రవైర మిటు తమ్మునితో నని తార చెప్పినన్
మగటిమి నమ్మి యా పలుకు మన్నన సేయగ నైతి తత్ఫలం
బగు పడె నేటి కీగతిని, నయ్యును సంతస మౌను వంచనన్
పగతుడు గెల్చెగాని నిజబాహుబలంబున గెల్వ నేర్చునే?

చ. ఉరుతర సత్త్వసంపదను నూర్జిత మూర్తివె యయ్యు స్వామి? నీ
చిరవిరహంబు చే తనువు చిక్కెను - క్రూర వియోగ శక్తి ని
ట్లెరిగియు నేల తారకు విధించితి తీరని విప్రయోగమున్!
విరహి కిరాతు డేని కవవీడగ జేయడుగా మహాశయా!

చ. అనుపమ సాధ్వి, నా హృదయ హర్మ్యమహత్తరతార తార, స
ద్గుణఖని సుందరాంగి సుమకోమలచిత్త, గణించి నెమ్మదిన్
నను తన దేవదేవుగ ననారతము న్భజియించు నా మృతి
న్విని యది గుండియల్ ప్రిదిలి వ్రీలక యెట్లు భరింప నేర్చునో!

ఉ. ఎంతగ నింద చేసినను నేమియు నీ నగుమోము నందు నొ
క్కింతయు లేదు మ్లానత అహీనము శుద్ధము ధర్మసూక్ష్మ మ
త్యంతము నుండు నన్ను పరిమార్చిన లీల నటంచు తోచు, నీ
వింతగు మార్గమున్ గొనిన ప్రీతికి హేతువు తెల్పవే ప్రభూ!

ఉ. ఆతత విక్రమాన్వితుడ వయ్యును హీనత నీకు గూర్చి వి
ఖ్యాతిని నాకు గూర్చు తెరగారసి యిట్టు లపూర్వ లీల జీ
వాతువు నాహరించి ప్రభువా! నను ధన్యుని జేసినాడవే
ఓ తపనీయ ధామ! ఇది యుజ్జ్వలమైన యనుగ్రహమ్మెగా! 30

శా. వ్యగ్రంబైన మనంబుతో వదనమం దార్తిచ్ఛటల్ గ్రమ్మ నో
సుగ్రీవా! యిటు లుంటి వేమి? మదిలో సుంతైన జింతింప కే
నగ్రభ్రాతను జంపుకొంటి నని, నా కయ్యెన్ శుభం బిందుచే
నుగ్రారుల్ గలవాడ నెప్డొ యని నాకున్నట్టిదే మృత్యువున్.

ఉ. ఆదట బూర్వ పుణ్యమున నబ్బె రమావిభు మైత్రి నీకు - నిన్
కాదన గల్గువార లిల గల్గరు రక్తిని రామకార్య మ
ర్యాదను దీర్చి, నిల్పి కవిరాజ్య యశోలతికాంకురమ్ములన్
పాదుకొనంగ నల్దెసల, పాలన సేయగదయ్య సోదరా!

ఉ. అంగదు డన్న నీహృదయమందున హార్దత యున్న, దెన్నడున్
భంగము రాదు వాడు ననువర్తన నిన్ కొలువం గలడు, స
త్సంగము వాని కిచ్చి యనుతాపము తీర్పుము - తండ్రి నైన నా
కుంగల మైత్రిచే నిటుల కోరెద గాని ఎరుంగు దెల్లయున్.

మ. ఒక గర్భమ్మున పుట్టి ఋక్షవిరజుం డుద్గాఢ వాత్సల్యమున్
ప్రకటింపన్ తమి నొక్కచో బెరిగి సర్వం బొక్కచో నేర్చి పా
యక విశ్వాసముతో కవల్ వలెను నున్నామయ్యా, రాజ్యంబుకై
యకటా! వైరము వచ్చె, తీరినది ఆర్యా! కౌగిలింపంగదే!

ఉ. వందన మిద్ది గైకొని భవచ్ఛర కర్షణకైతవాన నా
నందము గూర్ప నొక్కపరి నా తనువున్ స్పృశియింపు మయ్య! నా
సందియ మెల్ల తీరినది సర్వమయుండవు నీవు రామ! ఆ
క్రందిత మీ కపి ప్రతతి, కానగ లే, నిక కన్ను మోడ్చెదన్. 35

***(ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక 1960)***

# భ్రష్టయోగి

ఉ. మానవలోక నైజమగు మానుషరూపము కాదు నీది ది
వ్యానన దీధితుల్ తెలుపు నచ్చర వీవని - కాని దేనికై
మానిని వచ్చినా విటకు, మాదు తపోవన పార్శ్వసీమలం
దే నవకమ్ములైన పువుటీరములో చెలి నిన్ను పిల్చెనే!

శా. ఓహో, ఎంతటి జాణవే సఖియ! న న్నూరించి కానంతలో
మోహావేశుని జేసి నాతపసు నున్మూలించె నీ రూప, మే
దేహ భ్రాంతియు లేని నా యెదద సందీప్తంబు గావించి నా
వాహో! లోతుల గ్రొచ్చి చల్లితివి రాగోద్రిక్త మోహోర్ములన్.

ఉ. నీ కనుచూపు వెన్నెలల నీరము త్రావుచు మోసులెత్తి, రా
కాకమనీయమైన ముఖకాంతుల తీవలువారి నా మదిన్
ప్రాకెను, చల్లనౌ వలపు పాటల నాటల పూచె నీ పయిన్
నా కనుచూపు గాటముగ నాటకమున్నె మహాద్భుతంబుగన్.

చ. శిలపయి నిల్చి నే తపసు చేయగపూనిన నాటినుండి యీ
చలువలయూట, - మానసము - చయ్యన నాగి జలంబులింకి ఆ
వల నొక సానువై ఉపలవైఖరి నొందెగదా! మధూల కో
త్పల భవదీయదృష్టి పరిపాకముసోక స్రవన్తి యయ్యెడిన్.

చ. ఎద నదియై స్రవింప కమలేక్షణ! నా కనుచూపు వింతగా
కదిసె జలాల! హల్లక నికాయము కాయము తాల్చె నోసి! నీ
మృదుతర మాధురీ నిబిడమేచక కుంతల పంక్తిలోన సం
పదలను క్రుమ్మరించి మధుపమ్ముల గుండెలు దోచ చూచెడిన్.

ఉ. ఎన్నడులేని యీ యొదుగు లెచ్చుటనేర్చిన దీ పికమ్ము నా
కెన్నడు విన్నయట్టు లొకయించుక యేనియు లేదు జ్ఞప్తి ఓ
అన్నులమిన్నరో! నెమిలి ఆటలలో సరిక్రొత్త పోకడల్
వన్నెలు తేరె - నీ విటకు వచ్చుటయేయగు నింతకున్ సఖీ! 6

చ. వన సుమ కన్యకావళి ప్రవాసి విభుం దరుదెంచె నంచు లో
మనమున పొంగె కాని పవమానున కైనను కౌగిలీయకే
మనకయి తాల్చి తావులను మంజుల ముగ్ధదరస్మితంబులన్
పనివడి వంపుచున్నయవి భాగ్యపురాసులు గాగ కానుకల్.

చ. జగము సమస్తమున్ నవరసాలము పోలిక సాంధ్యరాగపున్
జిగిని వెలుంగ కొమ్మలను చేరిన పక్షులు జంటకట్టి ఓ
మగువరొ! ప్రేమ గీతికల మాటికి మాటికి నాలపించి పా
డగ పులకల్ జనించిన కడాని వెలుంగుల బారు నింగిపై.

చ. తొలకరి వాన చిన్కులకు దోసిలి యొగ్గి నుతించు చాతకం
బుల కనినాడ మొన్న పెను పోటున నీగతి గట్లపై నదీ
జలములు పర్వులెత్తు ఘన చక్రమునన్ తటినీ లతాంగు లూ
ర్పులు చెలరేగగా గగురుపుల్ మొలకెత్తగ నాడ సాగెడిన్.

చ. ఉదయమె యీ నదిన్ మునిగి ఓ సుమ కోమలి! కర్మసాక్షికిన్
ఉదకము లర్ఘ్యమిచ్చి యెద యొల్లగ బూచితి నన్నిదిక్కు లే
మిది? యెటు తాల్చెనో ఋతువు లేమిటి మారినవా చెలీ! తరుల్
ముదిమిని మోయుచున్నవి సమూలముగా చివురించె నిత్తరిన్.

ఉ. ఈ సెలయేటి కేమిటికొ యింతటి వేగము నీ వెరింగినా
వే సఖి! చేసెనే ప్రియుని యింటికి జేరగ ప్రొద్దుక్రుంకగా
బాసట అందు కౌత్వర – త్రపారహితంబుగ నేగుచున్నదే
ఆ సెలయేటి మానసము నందలి కోర్కెల నూహసేయుమా!

చ. వడి వడి సాగి యేగ నలవాటుగ పోయెడి వంకదారి నీ
పొడవగు నీడలే అరుగు పోలిక నున్నవి, భానుడేగినన్
తడబడు గుండెతో నెదురు దారులు చూచుచు నిల్చువానికై
వడి నరుదెంచి కొంతదరి వాంఛితముల్ నడిపింప నెచ్చెలుల్. 12

చ. ప్రకృతికి నాకు దూరమని భ్రాంతి వహింపకు, మంతె చాలు నీ
కిక విపులంబుగా పలుక నేటికి? జాణవు? మౌని నైన నో
పికశుకవాణి! కోరికలు పెల్లుగ జీర్ణములై కలంచు – ఈ
సకలము 'కాదు కా'దను వచస్సున లేదటె కాంక్ష గుప్తమై!

ఉ. ఎంత విరక్తవై ఇటు నటింతువు నీవు – మనోజుడన్న కా
సంత ఎరుంగనట్టు లిదె సాగిలి మ్రొక్కి పదంబు లంటెదన్
పంతమదేలనే చెలియ! పాపము భ్రష్టుడె కాని యోగి అం
దంతటివాడు వేడుకొన నాగడ మేల యొనర్తువే సఖీ? 14

***(ప్రతిభ, ఏప్రిల్ 1945)***

# మాచలదేవి

(మాచలదేవి నాట్యకళాకోవిద, గణిక, కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రదేవుని ఉపపత్ని, విద్యాగోష్ఠీప్రవీణ)

చ. అరుణపటమ్ము గట్టె నుషయా యిది! రమ్య గృహాంగణమ్మునన్
తరుణవిలాసయై నిలిచె దర్పముతో మధులిట్ప్రభూత్తముం
డెరుగని పుష్పకోమలిగ – ఎవ్వతె? ఈ తొలిసంజ పార్థివుం
డరుగుచునుండె నా నెలవు, కాయమ యెంతటి పుణ్యమూర్తియో!

చ. కలగదు రాజరా జెదురుగా జనుదెంచిన, ముగ్ధహాసరే
ఖల నొలికించుగాని పదకంజము సుంత కదల్పబోదు, మం
జుల కరపల్లవంపు కొన జోకగ నూతనొసంగ పూనినా
డలసతతో మనోజ్ఞభవనాంతర భూమికి జేరు కోరికన్.

ఉ. ఇంతటి గారవమ్ము కలదే మును పెవ్వరికైన, రాజు ల
త్యంతదయార్ద్రచిత్తమున నాత్మ సఖీజన మెన్నడేని య
భ్యంతర హర్మ్యవీథి లఘుభావముతో గ్రహియించిరేని ని
శ్చింత క్షమింతు, రియ్యది విశిష్ట మపూర్వము పో మనోహరీ!

మ. అది యా మాచలగాక యెవ్వరగు సౌహార్ద్రప్రమోదాన నా
మదిరాక్షిన్ ప్రియశిష్యగా గొనియె నా మాన్యుందు రారాజు – నీ
పదకంజాతము లంటి నూత్నగతు లభ్యాసంబు సేయించు నే
యుదయంబందున, ధన్య వీవు, సరి లే రో నాకలోకాంగనా!

చ. అనయము స్వర్గసీమను బిడౌజుని గొల్చెడు దేవనర్తకీ
గణపరిసర్పవై యమర కల్పక మంజుమహీజ మైన సం
జనితముగాగ నీర్ష్య సురసారసలోచనలందు వచ్చి ఈ
వనుకొనెదన్, మహోజ్జ్వల మహత్తర కాంతులు కాక కల్గునే! 5

శా. హాసౌజ్జ్వల్య రసోల్బణ ప్రథితమై ఆరగ్వధ ప్రక్రియన్
వాసించున్ సకలాశలందు ధరణీపా లావతం సోన్నత
ప్రాసాద ప్రమదావనాంతలతికా వాల్లభ్యపుష్పాళిలో
నీ సమ్మోహన ముగ్ధరూప సుమ మో నీరేజపత్రేక్షణా!

మ. నిను సామాన్యగ జూచు నేత్రముల కున్మేషంబు రాబోదు తీ
రని కోర్కుల్ దయివారగా తెనుగునేలన్ నృత్యపాథోధి ఖే
లన సంజాత రసామృతమ్ము పొలుపారం బంచిపెట్టంగనై
జననం బందితి వంచు నెంచెద నినున్ సంధ్యారుణోద్యత్ప్రభా!

మ. అతిపుణ్యుండవు జాయపా! దొరికె నయ్యా నృత్యరత్నావళీ
కృతికిన్ ఈ అభినేత్రి మాచలయె, నీ కీర్తిధ్వజం బెత్తి భా
రతదేశాన త్రిలింగ నృత్యభరతా! లాస్య క్రియాజ్యోతి నా
తత దక్షత్వముతో రగిల్చి వెలుగొందన్ నిల్పు నశ్రాంతమున్.

శా. జాయా మధ్యగత ప్రభూత్తముని విస్ఫారాక్షియుగ్మమ్ముపై
నీ యాకేకర నేత్రకోణరుచి సందేహ ప్రమోదమ్ముతో
నాయత్తం బగువేళ బొల్చు స్మితమందాక్షమ్ము దేవేరులం
దా యర్ధాంగిను లే మెరుంగుదురు సఖ్యం బో రసానందినీ?

మ. శివ నీవై, ప్రభువే సదాశివుడుగా క్షేమంకరోద్య ల్లయో
త్సవవేళానటనం బొనర్చుతరి నే ధన్యుల్ మిమున్ జూచిరో,
యెవ రానందరసాబ్ధి మగ్నులయిరో ఎవ్వారు స్తంభించిరో
భవరాహిత్యము కల్గు వారి కని నే భావింతు నో నర్తకీ!

ఉ. నేనును నీవు నాంధ్రధరణీపతి కొల్వున సర్వశాస్త్రపా
రీణులమై విరోధి నవలీలగ గోష్ఠుల గెల్చినార మం
చే ననుకొందు - కాక కలదే మనకున్ మన ఓరుగంటికిన్
ఈ నయగారపుం బ్రణయ మేర్పడ కొండొక కారణం బిలన్? 11

*('సాహితీ సమితి' రజతోత్సవ సంచిక* ***1946*** *జులై)*

# ఆత్మార్పణము

చ. అవును : నిజమ్మె – కుంతి కనెనన్నది నమ్మితి, సూతపుత్రునిన్
చివరకు రాజ్యమిచ్చి యిటు జేసెను రాజుగ రాజరాజు, నే
నెవరికి బంధువైతి నపు డేడ్తెర చిత్తము కుందువేళ – నీ
పవరము వచ్చె స్వామికి ఉపాయనమై ఋణమెల్ల తీర్చెదన్.

ఉ. తల్లికి నాకు తీరినది ధర్మము వీడుచు గంగ చేతిలో
నుల్లము రాయిచేసుకొని యుంచిన యప్పుడె – నాటనుండి నా
తల్లియు తండ్రియున్ ప్రభువు దాతయు నాతడె యయ్యె గావునన్
ఎల్లిరణంబులో తనువు నిచ్చెద నాయది కాదు మాధవా!

ఉ. నే నొక తేపగాగ నవనీపతి దాట దలంచె శాత్రవాం
భోనిధి, నమ్మినాడు నను పొత్తులవానిగ, పార్థివుండు నా
పైనిఖిలమ్ము నిల్పి యొక పాడివహించెను – నీవె వచ్చి నన్
పూనుము వైరిగెల్చి భువి పొల్పుగ నేలుమటందు వీగతిన్ –

మ. నిజమే రాజ్యము నాది, తమ్ములును నన్నే రాజుగా చేసి నా
విజిగీషాప్తికి తోడునీడలుగ నుర్వీ రాజ్య మిప్పింపగా
ప్రజకెల్లన్ పితనౌట ధర్మమనె, దప్పార్థుండు బావా! చతు
ర్భుజ! మాకక్కిన కూటి కాసపడె కర్ణుం డన్న నే మయ్యెదన్?

ఉ. క్రోధము జీర్ణమై హృదయ గోళములం దొకమూల దాగి మ
మ్మోధరణీధరా! కదలి యూరక బాధలు వెట్టు నొక్క దు
ర్వ్యాధిక – నన్ను ఫల్గుణుని – వారణ చేయగ వెజ్జు లేడు, మా
ఆధియు వ్యాధియున్ తొలగు నాహవ మెవ్వరికైన కేశవా!

ఉ. పార్థున కీడు కర్ణుదని పార్థివు డున్నవాడు, నే
వ్యర్థము చేయ నా తలపు వంచన చేసి – మహోపకారి, రా
జ్యార్థము నేనె యిట్లయిన నాతని కెవ్వరు తోడునిల్తు, ర
న్యార్థము నీవె ఏల యిటు యాచన చేసెదవో జనార్దనా? 6

ఉ. కాలులు లేక చిక్కితిమె కాలవశంబున చిక్కినాము మే
మూలములోన చిత్రరథు, కర్ణుని డయ్యెడ వచ్చి గెల్చి మా
యేలికతోడ మమ్ముగొని యేగెను ధర్మజు నొద్ద కాత డిం
కేల వచింప మెత్తనివి ఎన్నియొ మాటల నాడె సూడగన్.

చ. తప మొనరించె ఫల్గుణుడు, దానము చేసెను పార్వతీప్రియుం
డపరిమితారాగమున నద్భుత దివ్య మహాస్త్ర మంచు మా
కృపుడును ద్రోణుడున్ బెదర క్రేపులు క్రీడికి చిక్కగాని వా
రపు డొక సుంత పూనుకొన నాతని కేగతి మూడి యుండునో?

ఉ. మిన్నుల తన్ని పోరగల మేటి బలాఢ్యుడ నన్న పొంగు భీ
మన్నకు మిన్న మమ్ము గని మల్లుల నెంతటి వారినైన నే
సున్నములోని కెమ్ము పొడసూపని యట్లుగ నుండ చేతునం
చెన్నియొ చెప్పె నిప్పు డవి యేటికి వ్యర్థము చేయ జూచెదో?

ఉ. నేనొక వేళ పాండవుల నీడకు చేరిన లోకనింద నా
పై నిక రాకమానదు, త్రపన్ త్యజియించెద నోర్చియైన, కా
నీ నను కన్నబిడ్డవలె నేగతి పెంచెను సూతు, డెంత లో
లోన తపించునో, ప్రభుని రూక్షణ వీక్షణ పర్విసంతటన్.

మ. అతడే మూలము దీని కంచు ప్రభు వత్యంతాగ్ర హోన్మత్తుడై
చితి కెక్కింపక మానునే యతని నా సీమంతినీ రత్నమున్?
వెత లన్నింటికి నాడు గంగకడ నన్వీక్షించు టౌగాదె, ఆ
తత ప్రేమార్ద్ర మనస్కులన్ చెరచి యీతం డొందునే స్వర్గమున్?

మ. నవమాసమ్ములు మోసి కన్నయటు నాన్నా చిట్టి నా తండ్రి, నీ
వవుదోయీ సకలార్థముల్ జనని కం చానంద సందోహ సం
భవరాగమ్మున చూచి దృష్టిభయ ముత్పాటిల్ల గొంతెత్తి కా
వవె నా బిడ్డను దేవదేవ యను బావా! తల్లి యీ నాటికిన్. 12

చ. ఎటు త్యజియింతు నాయమను? ఏగతి నిల్చును నాదు ప్రాణముల్
పటుతర లోభమోహముల బానిస నా యెద తల్లివంక నీ
వటువలె చేయనేర్చితని అచ్యుత! నే నెటు చేయనేర్తు? నీ
వెటు మది నిల్పినావొ పరమేశ! యశోదను వీడి యేగగన్?

ఉ.  సూతుల కంటిపాపనయి సూతకుమారిక నిచ్చిచేసి నన్
సూతులు కొల్వగా నిటుల సూతకులంబున నేను కర్తనై
సూతుడ కానటన్న యది చొప్పడునే పయిపెచ్చు సర్వమున్
కోతలె యౌటగాన నటు కుంతిచరిత్రకు మైల సోకదే?

మ.  నను ధర్మజ్ఞుడవోయి నీ వనెదు నే నామాట సత్యంబుగా
గను వర్తింపగ పోలదే, యిచట నాకై ప్రాణ మర్పించువా
రును మారాకుగ నెంచి ప్రాకి మది యూరు న్వేరు కాంక్షించువా
రును నున్నారెటు లింతలంతలన పోలున్ చేయ నన్యాయముల్?

ఉ.  కాటికి కాళ్లు చాచుకొని గంపెడు కోర్కెల చేతిమీదుగా
దాటగనున్న సూతుని విధం బెటు భగ్నముచేసి వత్తు? నా
మాటల కడ్డు చెప్పెనని మాత్రము లో ననుమాన మున్నచో
చోటు లభింప నీయకుము సూతకుమారుని నీ వెరుంగవే!

చ.  చెలి పొలయల్క తీర్చుతరి సేవకురా లరుదెంచి దేవ! మీ
చెలువుడు వచ్చె కర్ణుడని చెప్పినమాత్రనె లేచి వచ్చి నన్
పులకితగాత్రుడై ఎడద పొంగులు వారగ గ్రుచ్చి యెత్తు నే
కలగెద నయ్య మా ప్రభుని కాంతులు పారెడు చోట నిల్వగన్.

ఉ.  కాకులమూక లోకము ప్రకారము వింతయె అద్ది యర్థమౌ
నే కనినంతనే తొలుతనే కురురాజు పవిత్రమూర్తి – కృ
ష్ణా! కలుషాత్ము లెంద రెటు లాడిన నేమి హిమాద్రియాత, ద
స్తోక దయాపయోధి, రిపుతోయజమత్తగజంబు పోరులన్! 18

చ.  జనపతి చూచినట్లె అనుజన్ములు చూచెద రాత్మబంధువున్
కనుగొనినట్లు, నే మరువ గల్గుదునే పదిజన్మలెత్తి? ఆ
అనిమిషసౌహృదమ్ము హృదయమ్మున లేదిక తావు వేరె నా
అనుజులకైన కాన సదయా! దయవీడకు మిట్టి పల్కులన్.

మ.  ధృతరాష్ట్రుండును కర్ణు దన్న నమితోత్సాహంబు చూపించు నే
వితమైనన్ చెవి వేయ కా ప్రభువు కావింపండు, భీష్మాది బం
ధుతతిన్ విన్నటు కానవచ్చు వెలికిన్, దుర్యోధనాదిత్య సం
స్తుతి కెవ్వారలు పట్టుకొమ్మ లెరుగున్ స్వీయాంతరంగంబునన్.

మ. సుఖమో, దుఃఖమొ, స్వర్గమో, నరకమో సూత్రించె నీ కర్ణుడే
అఖిలం బాతని దంచు మాధవ! సహస్రాంశుండె రానీ యికన్
మఖవుండే యరుదెంచి నాక మిదె కొమ్మా! ధర్మరాజాగ్ర జా
సఖివై పాండవ బంధువై యనిన నే చాలింప నా యత్నమున్.

ఉ. ద్రోవదిలోన పాలని అదోవితమైన మొగమ్ము పెట్టి యీ
పావన మానసున్ కలగ బారగ చేసెదవేల? సూతుడే
పూవిలుకాని బారిపడి పోవగ కీచకుడా యితండు? బా
వా! వనజాక్ష! ఏటి కిటు లగ్నిపరీక్షకు పూనుకొంటివో!

చ. అతని సుఖమ్మె నా సుఖము అతని దుఃఖమె నాదు దుఃఖమై
మతు లొకటై చరించితిమి మంచికి చెడ్డకు నింతకాల మే
గతిచనెనో అదే గతిని కాలము వెళ్లెడుగాక కృష్ణ! ఆ
కతమున రౌరవాది నరకమ్ములు వచ్చిన సంతసంబగున్.

తే. నా పురాకృతమైన పుణ్యంబె యిట్లు
మూర్తి తాల్చిన దనదగు, పూత చరిత
సఖియ, అర్ధాంగి జీవితేశ్వరియునైన
సూతసుత మిన్న యొరులను చూడగలనె? 24

తే. నన్ను కనిపెట్టి నా యెదనున్న లతలు
చివురు లెత్తగ దోహద సేవసేయ
విసుగు చెందదు నడపు నెవ్వేళనైన
బ్రతుకు పడవను వినువాక బాటలందు.

చ. అలసత నేగు జహ్ను తనయా విరహోద్ధత మంద గీత లు
త్కలముగ వచ్చి మా మతులు త్రచ్చ ప్రియామృదు బాహువల్లరీ
లలిత దృఢాను బంధన విలాసముతోడ శరన్ని శీథినీ
విలసనలన్ హసింతు మతివేలముగా ప్రణయానుకూలతన్.

చ. అగునని సంధి వచ్చితివె? ఆ నెపమంతయ ధార్తరాష్ట్రు పై
దిగవిడిచేగ నిట్టు లరుదెంచి మమున్ కనుకట్టి గారడీ
తగ నొనరించి నావు ప్రభుధైర్యపుటాయువు పట్టుచిక్కె మా
పగతుర కెంత కొండ కనుపట్టిన దెంత యదృష్టమో కదా!

చ. మేమో ధర్మవిరుద్ధమౌ నటుల స్వామీ! నిన్ను బంధించినా
మేమో ప్రజ్ఞగనెంచి, భ్రాంతిపడి కానీ నీకె మేలయ్యె మా
వ్యామోహమ్ము భవత్ప్రదర్శనము దేవా! గుండెలో రాయియై
ఏమో చేయక యూరకుండు నటవే? యీడేరె నీ వ్యూహమున్.

ఉ. పాండవ పక్షపాతివి శుభప్రతిపాదన చేయుకోర్కెయే
మెండుగ నున్నరీతి కని మెచ్చగ లోకము రాయబారివై
దండిజయమ్ము పొందితివి, తథ్యము, ధర్మబలమ్ము చిక్కె నె
వ్వండు సమానమౌను నిలువన్ సరిపజ్జను నీతికోవిదా?

తే. ఆవులించిన ప్రేవుల నట్టె లెక్క
పెట్ట గలిగిన నీపయి పెట్టినారు
సకలమును దిద్ది సాగింప సమరమఖము
నాంది మొదలయ్యె నీ మహానాటకమున. 30

కం. కదలక మెదలక పోనీ
కదుపక నీవొక్కమారు కనుదామరలన్
కదిపితి వెల్లర గుండెల
పదపదమున కృష్ణ! నీదు ప్రాభవ మెసగన్.

తే. ఒకట నమరులు నమరారు లొకట నిలచి
సమబలంబుగ మథియింప జలధి గర్భ
మొదవ హర్షము కలిగె రసోదయంబు
అటులె యగు గాక నేటి మహాహవమున.

ఉ. కారణజన్మమెత్తి యల కచ్ఛపమైన పురాణపూరుషుం
డీరణ సాగరోన్మథన మేర్పడ భారము మ్రోయ పుట్టె పెం
పారగ నంచు ధర్మమధురామృతమున్ ఒకవేళ చక్రియై
పోరున తారుమారయిన పూనగవచ్చు నధర్మమార్గమున్.

తే. అతని కొరకు కేను నా కొరకు కతడు పుట్టె
విధి నియామక మిది గాగ విశదమగును
కర్త లేకున్న కర్ణుడు కాన బడునె
కర్ణుడే లేక లేదు పో కర్త బ్రతుకు.

చ. నొగపయి నిల్చి నీవొక వినోదముగా నడపంగ తేరు ఓ
యగధర! సవ్యసాచి పరమాద్భుతరీతి విరోధివర్గమున్
తెగ పరిమార్చువేళ రణధీరుడనై యెదురొడ్డి నిల్చి ఆ
సుగతతి బర్వి యిర్వురకు చూపెద నారణకౌశలద్యుతిన్.

శా. జ్యానాదారభటీ ప్రతిశ్రుతుల సద్యఃస్ఫూర్తి వర్తిల్లి మే
మూనానూన శరప్రహారముల కుద్యోగింప ధానుష్క సం
తానం బంతయు మూర్ఛవోవు నిక నాదైత్యారి వీరవ్రతుల్
ప్రాణాపాయ భయంబునన్ చెదరి శంపాకంపులై నిల్వరే? 36

శా. గాండీవమ్మును కాలపృష్ఠమును శ్రీకంఠోగ్ర కోదండముల్
నిండారన్ తెగలాగి వైచిన మహానిర్ఘాత పాతంబులై
కొండల్ కొండలె కూల్చినట్లుగను కాకోలార్చులన్ చిమ్ముచున్
చండాడన్ విశిఖౌఘమున్ బరువు ద్విట్సేనాసమూహాళిపై.

మ. సరియై క్ష్మాపతి వర్గముల్ బెదర నాశాదుర్గముల్ గిర్గిరన్
తిరుగన్ పార్థుడు నేను మొగ్గరములన్ తీండ్రించి భంజింప నో
హరి నీ కెంతయొ మోదమబ్బును గదయ్యా! నేడు నీ వేటి కా
తరుణంబున్ చెడగొట్ట చూచెదవు భక్తాయత్తచిత్తంబున్?

శా. ఈ రాధేయుడు కుంతిబిడ్డ డని నీ వేనాడు సూచింప కీ
పారావార పరీత భూవలయమున్ వర్ధించు ధర్మాత్మజుం
డా రాజన్యుడె భూమి నేలవలె చంద్రాలోకముల్ కాయగా
మా రాజేశ్వర రాజసోజ్వలుడు ధర్మం బీయగా నేర్చునే?

ఉ. మాధవ! నీకె సంగర రమా పరిరంభణ మబ్బు మాదు భూ
మీధవు కౌనటన్న మతిమీరిన ఊహల పోను కాని నే
నాధరణీపతిన్ ఏడువ నాత్మ కశాంతిని తెచ్చుకోను మా
యాధవ! యేల యిట్టి పరియాచకముల్ ననుబోటి వానితోన్?

శా. మాయావాదము లేలనయ్య ప్రభువా! 'మా కర్ణుడే' యన్నయా
యీ యాదృచ్ఛికమైన బుద్ధి కెదలో నిల్లిచ్చి కాపాడవో
యీ! యాచించెద దీనినే యిహపరాలేమైన నాకేమి? నా
ప్రాయం బిచ్చితి రాజరాజునకు నీ పాలోయి నా ఆత్మయే! 41

***(ప్రతిభ 1946)***

# విన్నపము

(లౌకిక విజయమర్యాదాదులను ఆశించి నానారాజసందర్శన చేయదలచిన ధూర్జటి కవీంద్రుని మనఃప్రవృత్తిని గుర్తించిన కాళహస్తీశ్వరుడు తొలుత వారించినాడు. పెడచెవిన పెట్టి వెళ్ళి ఆయా స్థితిగతులకు ఒదగలేక తిరిగి వచ్చి సర్వేశ్వర సన్నిధానంలో ఒకనాటి ఏకాంతమందు చేసుకొన్న విన్నపము)

కం. కన్నుల మూడిటి నార్పుచు
ఎన్నడు న న్నెఱుగ నట్టు లేల నటింపన్?
కన్నీరొలుకకు తండ్రీ!
కన్నప్పను గాను నేను కన్నుల నొసగన్.

చ. చనినాడన్ విజిగీషతోడ కవితా సామ్రాజ్యమున్ గోరి నా
ఘననిష్ఠా జపహోమ సత్క్రియలకున్ కల్పించితిన్ స్వస్తి, మా
యని కాలుష్యము, క్లేశమున్ మిగిలె రాజాస్థాన మర్యాద లీ
వని నట్లే జరిగెన్, సభన్ గలుగవయ్యా! అర్ఘ్య సత్కారముల్.

శా. ఏ నాడైన భువిన్ అసూయ, కలుషం బీర్ష్యా, వ్యథా, శాంతియే,
కానన్‌రావు సమత్వ, మభ్యుదయ, మగ్రామ్యంబు, సౌఖ్యంబు దే
వా! నాకేశగురూత్తముండు కవియై ఆస్థానముల్ చేరినన్
నే నమ్మన్ కనకాభిషేక మగునేనిన్, నా శిరం బిచ్చెదన్.

మ. 'పటు గంగా లహరీపరీత శమ శుంభత్ప్రౌఢతాంచత్కళా
ఘటనున్' న న్గని కృష్ణరాయ ధరణీకాంతుండు సామాన్య వా
క్పటిమన్ దర్పునిగా మదిన్ దలచి సంభావింపడున్, కావ్య ది
క్కటి గండస్థల గంధవాహమధు వాఘ్రాణింపగా నేర్వడున్.

ఉ. నాగరక ప్రపంచము ఘనమ్మని నెమ్మది నమ్మి స్వామి సం
ధ్యాగగనాంగనారుణ విధామథితాత్మ రజః ప్రవృత్తిమై
భోగము లారగించు తలపుల్‌గొని చంచల చంచరీక హృ
ద్వేగగతిన్ చరించి భ్రమతీరగ జేరితి నిన్ సదాశివా ! 5

ఉ. అలఘుప్రౌఢిని క్రీడమై బహు రణోద్యద్ధ్భాములన్ నిల్చు రా
ట్కుల గంధేభుడు కృష్ణరాయ వసుధా గోపాలు డైంద్రద్విపో
ద్గళ ఘంటారవ పాటవోజ్జ్వల లసత్కావ్యంబు కల్పించి నే
అలపెద్దన్నకు రాజుకున్ మధురసఖ్యం బన్న నిద్దాననే!

ఉ. అంకిలి లేక గైకొనిన ఆ శఠగోప యతీంద్రదత్త చ
క్రాంకిత సర్వ దేహమును కైటభవైరి పదాబ్జ సేవ ప్రే
మాంకిత నర్తకీగణ రహః ప్రణయార్ద్ర హృదంతరంబు లే
కంకురితమ్ము గాదు మనుజాధిప సత్కృప యెంతవానికిన్.

సీ. ఆళీక నేత్రాగ్ని హాసానంత రోచిస్సు
కనలేక శిఖిపింఛకాంతి వలచి,
హారవాతాశన మారుతౌద్ధత్యమ్ము
లడయింప కౌస్తుభహారు జేరి,
సందీప్త శితికంఠ సప్తార్చి వర్చస్సు
భయవెట్ట వైకుంఠు పజ్జ నిలిచి,
నందీశ హుంకార నాద జర్జరితోర్వి
మనలేక వాంశిక స్వనము గ్రోలి,

తే. పెద్దిరా జయ్యె నంతటి పెద్దవాడు,
ముక్కుతిమ్మన్న సంస్తుతి కెక్కినాడు,
అబ్బినది రామలింగన్న కంత చౌరవ
అయ్యె కవిపితామహుడు పెద్దన్న మొన్న!

ఉ. ఏ శివలెంక నీ భువిని ఎన్ని భవంబులు గల్గు నన్నిటన్
నే శివు కొల్వగా గలనె నీ మహనీయ భుజంగ దివ్య భూ
షాశితికంఠ సుందర హసన్న వరూపము దక్క నన్య, మీ
యాశయ మొక్కటే బ్రతుకు నార్ద్రము మంజులమున్ పొనర్చెడిన్. 10

మ. గణికాలోలు డటన్న యొక్క ప్రథ లోకంబెల్ల వ్యాపించె నిం
దణుమాత్రమ్మును లేదు సత్యమెట ఈశా! పెట్టినా డెవ్వడో
ప్రణయాందోళన నిత్యజీవన కథాలాపుండు – కల్పించె తీ
రని దుష్కీర్తిని – సంతసించెదను కల్గన్ భుక్తి అవ్వానికిన్.

శా. రాజద్వారము లందు దర్శన సముల్లాసంబునన్ నిల్చుటన్
నా జన్మం బిటు వ్యర్థమైన యది – విన్నాణంబు కోల్పోయి పం
కేజశ్రీపరిణద్ధ మత్కవిత విక్రీడింపగా మానె – నీ
రాజన్యత్వమె నమ్మి చేరితిని శర్వా! రాజరాజేశ్వరా!

ఉ. రాజత శైలరాజ! నగరాజ సుతాసురభూజ!! ఫాలవి
భ్రాజిత నేత్ర దగ్ధరతిరాజ!! సురాసుర నమ్రమౌళి సం
యోజిత నిత్య రమ్య కరయుగ్మ సరోజ!! శిరోజరాజ! ఈ
రాజులు నిన్ను పోలగలరా! సకలార్తిహరా! కృపాకరా!!

ఉ. ఉన్నది నా శరీర మట – ఉన్నది నా యెడ కాళహస్తి సం
పన్న మనోజ్ఞ తాపక శుభప్రతిపాద జలేజ షట్పదం
బన్నటు లెల్లవేళల, నహర్నిశలందును నీవె నాకు నే
నెన్నుట గాదు సర్వము మహేశ! ఎఱుంగుదు వీవె సాక్షిగన్.

శా. నా కీ స్వర్ణముఖీ జలౌఘములలోనన్ నాకకూలంకషా
రాకాచంద్ర విశుద్ధ మోహన సుధారంహమ్ములే తోచు నిం
దేకాలమ్మున దీర్ఘమాడుటలు స్వామీ! ఏ పురాజన్మలో
నో కావించిన పూజకాక యెటు లై యుండున్ మరొక్కందుగన్.

మ. జననం బన్నది దుఃఖహేతువని నే శర్వా! మహాదేవ!! ము
న్ననినాడన్ మది కెక్కెనా అది మహేశా!! జన్మమే లేని నీ
గణమం దొక్కనిగా నొనర్చు మిక కైలాసరాజ్య న్నట
ద్గణమం దొక్కడనై రచించెదను సంధ్యా నృత్యగీతమ్ములన్. 16

ఉ. నా కొక జన్మమున్న భువి నన్ జనియింపగ నిమ్ము స్వామి! నీ
వాకిట బిల్వవృక్షమటు వత్సలతన్ – దినమున్ దినమ్ము ప
త్రాకృతితో త్వదీయ ‘పదహల్లక’ వీథి నలంకరింతు, ఛా
యా కమనీయ దేహమున హ్లాదము గూర్చెద నేత్రపంక్తికిన్.

చ. శిరమున నున్న గంగ శశిశేఖర! నారసనాంచలమ్మునన్
దిరముగ నిల్పుమయ్య మధుదిగ్ధ సువర్ణ మహత్త్వవాణి నీ
కరుణకథానకమ్ములె యుగమ్ములు తెల్గుధరిత్రి పాడగా
చరణములాన చెప్పెద ప్రశస్తికి పాత్రునిగా నొనర్పవే!

శా. వాగర్థంబులు శ్రోతృవక్తలు జగద్వంద్యుండ వద్వైత వి
ద్యాగోష్ఠిన్ వివరింప నీవె కద చిత్తావాసముం జేరి మ
త్ప్రాగల్భ్యమ్ము సమస్తమున్ మెరయ శుంభ త్ప్రౌఢి పల్కింపవే
నీ గాథన్ గిరిశా! ప్రజాపతిపురంధ్రీ కంఠహారమ్ముగన్.

కం. తెలతెలవారెడి తూరుపు
తెలిగన్నుల విచ్చి దేవ! దీవన లిమ్మా!
తలపున నీ యెడ నాపై
వలపే జనియింప నిమ్ము వరద! దయాళూ!

కం. "శ్రీకంఠ! కంఠభూషిత
కాకోదరవర వరాకఖండ మతవ్యా
ఖ్యాకోలాహలదూర" చి
దాకృతి! జితకాల! కాలహస్తీశ! శివా!" 21

***(భారతి 1952 నవంబరు శాంతి 1961)***

# బృహన్నలాశ్వాసము

(ఉత్తర గోగ్రహణవేళ కౌరవసైన్యముల గెల్చి గోవులను మరలించుకొని వత్తునని వచ్చి శత్రువ్యూహముల తిలకించినంతనే భీతివడి పారిపోవుచున్న ఉత్తరునితో బృహన్నల)

చ. “కురుపతి సైన్యముల్ వెలుచ క్రొవ్వెనె! గోవులఁ బట్టి యేగెనే
యరమర లేక! వారు వివిధావదోహలు నైన నన్నునున్
బరిగణనంబు సేయరె! శుభస్థితి వారికి జెల్లె నింక స
త్వరముగఁ బూన్చుడీ రథము దారుణచాపశిలీముఖాదులన్.

చ. “అనిమిషకోటి నాజి విబుధాద్భుతవిక్రముడై జయించి య
త్యనుపమకీర్తియై వెలుగునట్టి పృథాసుతు కెందునైన నే
నెనయగువాఁడ – కౌరవుల కెల్లి రణాంగణమందుఁ జూపి నా
ఘనతర యుద్ధకౌశలము క్రమ్మర దెచ్చెద గోధనంబులన్.

శా. “కల్లోలంపడఁ గ్రీడి వచ్చె నని సంగ్రామక్రియాశ క్తి సం
పల్లాభుల్ కృప ద్రోణ భీష్ములె ఘనభ్రాంతిన్ ననుఁ జూడ వి
ద్యుల్లోకోజ్జ్వలకాంతుల న్మెరసి శత్రువ్రాతమున్ గెల్చి యో
చెల్లీ! తెచ్చెద బొమ్మ పొత్తికల నీ చిత్తంబు రంజిల్లగన్.

చ. “కొని యిదె వత్తు గోవుల నకుంఠితశక్తి” నటంచు నంగనల్
మనమున నుత్సహింప పలుమాటలు, మేటిగ బల్కి వచ్చి నీ
వనిమొనఁ జేరలేదు, రిపునైనను గన్గొనలేదు, వారు ని
న్గన రిసుమంత యైనఁ నిటుభీరుడవై పరువెత్త బాడియే?

మ. “అకృతాస్త్రుండను బాలుఁడన్ కదనవిద్యాప్రౌఢి పొల్పారు న
య్యకలంక ప్రతిభా సమగ్రు లగు భీష్మాచార్యద్రోణాధి నా
యక సంలక్షిత శత్రుసైన్యముల మార్రై నిల్చి పోరంగ నే
నకటా! చాల, బృహన్నలా! విడువు మం చర్థించుటల్ క్షాత్రమే!” 5

ఉ. శ్వాపదమేదుర మ్మయిన చండమహాటవి జొచ్చుతీరునన్
భూపకుమార! భీతివడిపోయెదు, మత్స్యకులోద్వహా! ఇటుల్
తాపముఁ జెంద నేమిటికి? తాల్మిమెయిన్ రణకాణయాచి యై
యీపృథివిన్ సుకీర్తి వెలయించిన వంశయశమ్ము నెంచుమా!

ఉ. ధూర్తులు ధార్తరాష్ట్రులిటు తోయధులై మనపైబడంగ స
త్కీర్తి గడించు కాల మరుదెంచిన తృప్తిని వీరపాణివై
వర్తనకేళి సల్పి, యట వచ్చి నిజప్రజ మెచ్చ – నిట్టుల
త్యార్తిని మున్నె వెన్దిరుగు టయ్యొయొ! యారయ నాత్మహత్య యౌ!

ఉ. ఉత్తర కేను లాస్యము, లయోచితరీతుల నేర్పువేళలన్
గ్రొత్తవి చెల్లి యేమి యనుగుంగతులం దగ నేర్చె వాని నీ
చిత్తము కెక్క ఁ జూచి పటుశేముషి నా కట వీరనర్తనో
ద్వృత్తగతుల్ నటించి మురిపించిన నెమ్మది నెంత మెచ్చితిన్!

ఉ. "కీచక కాలమేఘ మపకీర్తులపా లొనరింప క్రమ్మి య
త్యాచరణాళి రాజ్యమున కంతటికిన్ పెనుభీతి నిచ్చు, సం
కోచము మాని బంధు వని క్రుద్ధమహానిలలీల త్రోలి ధ
ర్మోచితరీతి దేశమున నొప్పుఁగ నిల్పెద నన్న పొంగితిన్.

చ. "కురుబల మెత్తి వచ్చి మనగోవులఁ బట్టిన దాని గెల్చి క్ర
మ్మరఁ గొనితేర శౌర్యమహిమంబున నెక్కటి వీరమూర్తినై
యరిగెడివేళ తేరికి బృహన్నల సారథియైన జూచువా
రరె! పురిలోన నింతకరవా రథచోదకు లంచు నవ్వరే!"

చ. అని మును మాలినీరమణి యయ్యెడ సారథిగాఁగ నన్ను గై
కొని యని కేఁగు మంచు తనకుం గల సూచనఁ జెప్పినం నీ
వనినటు వింటి – నందుకు నృపాత్మజ! నా యెద నవ్వుకొంటి – నై
నను నిటు భీరుతాగుణగణ ప్రబలార్తుడ వం చెరుంగబో! 11

ఉ. ఆహవ మన్న భీతిల జనాధిపనందన! నీ కి దేల? సో
త్సాహుఁడ వై వినీలజలదక్రియ నిల్చి రణానఁ గౌరవ
వ్యూహముల న్నిశాతవిశిఖోజ్జ్వలవృష్టిఁ దపింపఁజేయ స
మ్మోహనసాంపరాయచణభూరిరిరంస వహింపఁగాఁదగున్.

చ. అనయముఁ గోరి 'అల్లుడ నయో, యల పార్థున కే' నటంచు నీ
వనియెడు మాటలం దలఁచి, యంతిపురమ్మున క్షాత్రమూర్తివై
చనియెడు వేళఁ జూచి పదచాలనవైఖరి, మేనమామచా
లనుకొని యెంత సంతసము నందితి నుత్తర, నా మనమ్మునన్,

ఉ. "ఆటకొ, పాటకో కడఁగు మన్నఁ దగున్ రిపుఁ గెల్వఁగోరి యి
ప్పాటునఁ బోటుబంట వయి భండనభూమికి నేఁగువేళ వై
రాటి! రథంపు సారథిగ రమ్మని పిల్తువు, పేడి నైన నే
నేటికి నీకు సాటి యగు నెవ్వని నైనను బిల్వ యోగ్యమౌ"

చ. అని మును నేను పల్కినపు డద్భుతవీరరసాతిరేకతన్
గని జగదేకవీరుఁడవుగా నెది పల్కితొ దాని నెల్ల నీ
మనమున నెంచి, కాని యనుమానములన్ దిగబుచ్చి, లెమ్ము, నీ
కెనయగు వీరమాని జనియించునె కొన్ని యుగాల కేనియున్?

ఉ. గోధనమున్ గ్రహించి తమకుం జిరకీర్తిగ శాత్రవాళి ని
ర్బాధితులై చనంగ, సమరక్రియ కీవు జనించి, యస్త్రవి
ద్యాధనసంపదన్ గొని, మహత్తరవీర పరిశ్రముండ వై
యో ధరణీశనందన! మహోద్ధతిఁ జూపకయుంట పాడియే?

ఉ. ప్రాణము లింత తీపయినఁ బైకొను మృత్యు వనుక్షణమ్ము - ని
ద్రాణములై నశించు శుభదంబులు శక్తు లవెల్ల - యుద్ధపా
రీణుఁడ వోయి నీవు, నిటలేక్షణవీక్షణ నీకు నౌ తను
త్రాణము, భావిమత్త్యజనతాపతి నీవు విరాటనందనా! 17

ఉ. చచ్చిన వచ్చు స్వర్గ మిట సంగరభూమిని గెల్పుగొన్నచో
వచ్చు ననంతగౌరవము, బంధురకీర్తియుఁ - గాఁన, పూని వి
వ్వచ్చుఁడ వై, రిపువ్రజము పైఁ బడి, సింహకిశోరలీలల
న్మెచ్చఁగ శాత్రవేయు లనిమేషమహత్త్వముతోడఁ బోరుమా!

ఉ. ఏగతి బోధచేసినను నించుక యైన మరల్పవోయి నీ
భీగతచిత్తవృత్తి - నిఁకఁ బేడిని నాపయిఁ బడ్డ దెల్ల యు
ద్యోగము - పొంగి పొర్లి కడలొత్తెడు మామక శత్రుభంజనో
ద్వేగము నాపఁజాల, రిపువీరులపైఁ బడ నిశ్చయించితిన్.

ఉ. గోహరణమ్ము నొక్క యవకుంతనగా గొని ధార్తరాష్ట్రు లు
త్సాహము నొంది పాండవులు సల్పెడి, మీకడ గూఢవృత్తి క
త్యాహితముం బొనర్ప నిటు లర్థిని దిక్కుల రెంట నొక్క మా
రూహ యొనర్చి పట్టిరి రయోద్ధతి మీదగు నాలమందలన్.

చ. అమితవిచిత్రరీతిఁ గనులందునఁ బ్రశ్న మెలర్పఁ జూతు వో
యమలినచిత్త! మత్స్యమనుజాధిపు గొల్చుచు నొక్క యేడు గా
సముచితదాస్యవృత్తిఁ గెలసంబునఁ బాండవు లున్నవారు ఆ
సమయము దీరె భాస్కరుడు చయ్యనఁ జేరఁగ నింగి నచ్చటన్.

ఉ. కారణజన్మమై తనువికార మ దించుక గల్గినన్ మహా
వీరుఁడ నయ్య నేను పృథివీవరనందన నాదు కోర్కె మైఁ
తేరు చరించెనేని కురుధీరులె కాదు, సమస్తవీరులున్
స్థిరమతి నిల్చినన్ జయము దెత్తును – తథ్యము రాజనందనా!

చ. ఇదె, కనుమా, బృహన్నలనె? ఏగతిఁ బుంస్త్వము నన్నుఁ జేరి తా
నుదితమనోజ్ఞమోహనత నున్నదొ యీ తనువెల్ల నిండి – నా
యెదకడలిన్ సుడుళ్లుగొని యెల్లజగమ్ముల ముంచియెత్త నౌ
నదయత రేగు రౌద్రరసహారివిజృంభణ లేమి సెప్పుదున్? 23

చ. మతిపస, బాహుశక్తి, యతిమానుషవీరవిభూతి నొప్పి సం
తతఘనభైరవార్చనల దర్పితుఁడై వెలుగొందు నా జరా
సుతు, మురవైరి యీర్ష్యపడు శూరతమైఁ బ్రథనోర్వి సప్తవిం
శతిదినముల్ యెదిర్చి తుది జంపిన భీమున కేను తమ్ముడన్.

మ. అకలంకోజ్జ్వలబాహుదర్పమున నుద్యద్ధైర్య హేమాద్రి యై
బక కిమ్మీర జటాసుర ప్రతతికిన్ బ్రాణాంతకుం డై తిరం
బొక విఖ్యాతి గడించి మా కొసఁగె నే యోధానయోధుల నితం
డొకఁడే కీచకుఁ గాముకున్ చదిపి ప్రాణోత్సర్గఁ గల్పించెఁబో!

మ. నతనానావనినాథ దివ్యమకుటన్యస్త ప్రభారత్నదీ
ధితు లెవ్వాని పదాబ్జకాంతులు సముద్దీపించి త్రైలోక్యవి
ద్యుతులై వెల్గెనొ రాజసూయమఖసంస్తుత్యక్రియావేళ నా
యతిలోకుం డగు ధర్మజప్రభుని రాజ్యం బెల్ల నా గెల్పె యౌ.

ఉ. ఊర్జితశక్తియుక్తి మహితోదయ శౌర్యరసప్రభావ వి
స్ఫూర్జితధైర్యధుర్యుల, విశుద్ధయశస్కుల, గాఢసాధనో
పార్జితభీమభైరవరణాంచితులన్ రిపుల న్జయించు నా
'అర్జున' నామధేయుఁడను ఆ 'విజయుండ'ను నేనె ఉత్తరా!

చ. అదె యుపగూహనోజ్జ్వలత నా తపనీయజలేజకాంతి ను
న్నది పృథుసర్పదర్పమున గాండివ మా పెనుజమ్మిపైన – మ
త్కదనకఠోరబాహువులఁ దాండవమాడఁగ నద్ది, నిల్చి నే
నెదిరిన నింద్రసైన్యముల నైన జయింతును రాజనందనా!

చ. కొలువునఁ గంకుభ ట్టనఁగఁ గ్రుమ్మరు నట్టిఁడె ధర్మజుండు – మీ
వలలుఁడు భీమసేనుఁడు, అపాకృతపౌరుషశక్తియుక్తిమై
లలితకళాగురుండ నయి లాస్యము నేర్పితి ఫల్గుణుండ – ను
జ్జ్వలులు కవల్ త్వదీయహయశాసకగోగణదక్షశిక్షకుల్. 29

చ. కనుఁగొన నగ్నికీల యను గౌరవభావ మెలర్పఁజేసి 'మా
లిని' యను పేర మిమ్ము నలరించుచు, మీకడ గట్టువాలుగా
మని, తుదిఁ గీచకాధము నమాన్యవిచేష్టలఁ జిక్కి స్రుక్కి, వా
నిని మడియింపఁజేసిన యనిందితదివ్యచరిత్ర 'కృష్ణ' యౌ.

ఉ. మోహముదీర నింక రథముం గొని ర మ్మిట కేను వైరిసం
దోహము నొంప సింహగతులన్ జన సారథి వౌట కీవు వ్యా
మోహపడన్ దగున్ – అధిపుపుత్రుఁడ! అల్లుఁడ! ధన్యుఁజేతు నే
నాహవభార మందుకొని యంతయుఁ దీర్తును సవ్యసాచి నై.

ఉ. సంతస మయ్యెనా? సమరసంభృతి కేను గడంగ ధీర ధీ
మంతుఁడ వైతివే? ఇపుడు మా రథసారథి వైతి నీవు – ని
శ్చింత రథమ్ము నెక్కి ననుఁ జేర్పు శమీకుజభూమి – వైరిరా
డంతకమూర్తి నై మెరయ నయ్యెడఁ దాల్చెద వీరవేషమున్.

మ. అవనీచక్రము తల్లడిల్లఁ, త్రిదివం బాకంపమున్ బొంద, ది
గ్వివరమ్ముల్ చలియింప, నుద్ధురకులోర్వీధ్రమ్ము లల్లాడ న
ర్ణవముల్ పెల్లు కలంగి ఘోష లిడ రుద్రప్రౌఢహాసోద్భటా
రవశంఖం బగు దేవదత్తమును దర్పంబొప్ప పూరించెదన్.

శా. చండీశోద్ధతకార్ముకోపమమహాచాపమ్ము, సంబుద్ధమ
ద్గాండీవమ్ము ధరించి, వీరగతి విక్రాంతిన్ రథం బెక్కి, యే
చండాంశుంబలె వెల్గుచు న్గదలి యా శత్రుక్షమానాథుకుం
గుండెల్ దల్లడిలంగ విన్చెదను జ్యాఘోషం బపూర్వంబుగన్.

ఉ. అచ్చట శత్రుమారణనయాంచితకేళి కుపక్రమింప నే
వచ్చెద - నాహవావని నవారణఁ జొచ్చెద, నా గురుండు వి
వ్వచ్చుఁడు వచ్చినాఁ డని కృపామతి మెచ్చఁగఁ, తాతయుం గడు
న్నచ్చిక దీవనల్ గురియ నాటెద వందనమార్గణద్వయిన్. 35

***(అముద్రితం, 1965 జనవరి)***

# కర్తవ్యము

(మృత్యు దేవతాహ్వానాన్ని అంగీకరించేటప్పుడు కాకతి ప్రోలరాజు దుర్జయ ఎఱ్ఱసేనానిని కుమార బేతరాజుకు పాలకుణ్ణిగా నియమించారు. కొంతకాలం గడచిన తరువాత యుద్ధభూమిలో వృద్ధు ఎఱ్ఱసేనాని వీరస్వర్గాన్ని అలంకరించాడు. అదను దొరికిందని పల్లవరాయాది శత్రువర్గం యువ బేతరాజు మీదికి దండెత్తి ఓరుగల్లును ముట్టడించింది. సంధిప్రయత్నాల కోసం ఆహ్వానించిన రాజసభలో ఎఱ్ఱసేనాని భార్య కామసాని, ప్రభువుతో)

ఉ. క్రమ్మెను కారుమేఘముల కైవడి దిక్కుల శత్రుసేన, వీ
రమ్మగుసాధనమ్ము, పవరంబుల పోక లెరుంగక నట్లు నీ
నెమ్మది కింత భీతి తగునే? బలగంబులు చాలవే? ప్రభూ!
లెమ్ము, కరాంబుజంబున ధరింపుము కాకతి శాతఖడ్గమున్.

ఉ. నీవొక వీరమూర్తివయి నిస్తులధైర్య హిమాద్రి నాం
ధ్రావనికిన్ మహాయశ మనంతముగా గడియింతు వంచు, లో
కావన దక్షతన్ పృథివి కంతటి కేలిక వౌదు వంచు నే
మో వచియింపరాని తమి నువ్విళులూరెడి దేశమింతకున్.

మ. రిపు లేనాడును తేరిచూడగలవారే నిన్ను! నీ ప్రాభవం
బిపు డేపాటిదొ నీవెరుంగక ధరిత్రీశావళిన్ బేలవై
అపకీర్తిన్ ఘటియింప పూనెదవు రాజా! కాకతీయాన్వయ
ప్రప నీ మూలమునన్ విషాక్త జలపూర్ణం బౌటయోజింపుమా!

ఉ. ఆ కమలాప్తు డాదిగ మహాద్భుత విక్రము లెందరెందరో
మీకులమందు పుట్టి పుడమిన్ ప్రతులై వెలుగొంది నార, ల
వ్యాకుల చిత్తవృత్తి తలపన్ దగు నియ్యది కిల్బిషమ్ము తం
డ్రీ! కలకాలమున్ నిలచు నెన్నడు మాయదు మీ చరిత్రలో.

ఉ. అచ్చుత ప్రోసె పేరు భవదన్వయ, మెన్నటికైన నిత్యమీ
తుచ్ఛ శరీర నాశనము – దూషణ కీవొడి పట్ట బోకుమా –
స్వేచ్ఛ నశింపగా బ్రతుక చింత యొనర్చుట సిగ్గు సిగ్గు, ప్రా
ణేచ్ఛ త్యజింపుమా, ఇక వరింపుము స్వర్గమునో జయమ్మునో – 5

ఉ. సంధికి ప్రాకులాడు టొక సాహసమే, అది క్షాత్రధర్మమే,
బంధములన్ తెమల్చి పరపార్థివ మోహన రాజ్యలక్ష్మిసం
బంధముకోరి నిల్వదగు భండన భూమి – ఆరాతి శౌర్య గ
ర్వాంధత రూపు మాపి జనరంజక కీర్తి వహింపగాదగున్.

మ. ఇది నీ స్వేచ్ఛ క్రయం బొనర్చుకొనుటే – ఈ యావదాంధ్ర ప్రజా
హృదయా వాసములన్ దవాగ్ని నిడుటౌనే కాని – భీరుండవై
కదన క్షోణిని నిల్వలేని తరి యోగ్యంబౌ ప్రజారక్షకై
అద నేతెంచెను చాలవేని ప్రభు రాజ్యత్యాగమున్ చేయుమా!

ఉ. ఎగ్గు దలంచి వారలు జయింపగ నీపయి కత్తి గట్ట ని
మ్మగ్గలమైన సేనల మహాహవ భూమిని జైత్రయాత్రకై
మొగ్గరముల్ రచించి పురమున్ నలు దిక్కుల ముట్ట నిమ్ము, ఇ
ల్లిగుగ్గులు పెట్టగా గలరె లేశము –నే నొకదాన చాలనే.

చ. అబలయె కామసాని, వివిధాహవ కేళుల నందెవేసె నా
ప్రబల విరోధి సైన్యములు – బారల ప్రాభవముల్ హరించుటే
కబళముగాగ మింగెదరు గాదె బలమ్ము క్షణమ్ములోన నే
నబకను నమ్మి గంగ దిగినట్లగు నంచు తలంప బోకుమా!

శా. గర్జింపన్ ప్రళయాంబుదంబుగ రిపుక్ష్మానాథు లుద్విగ్నులై
వర్జింపన్ రణభూమి శౌర్యవిభవ వ్యావృత్తి శాసింప నే
తర్జన్యంగుళితో – సమస్త వసుధా ధాత్రీశ్వరత్వంబు నీ
కార్జింతున్ భయమేల యుద్ధమున కాహ్వానింపగా శాత్రవుల్.

శా. సేనా పట్టము గట్టి నన్నునుపు మాజిన్ కాళికా మూర్తినై
నానా భూత వితాన భీకర లసన్నవ్యోజ్వల క్రీడగా
నే నాట్యం బొనరించి తెత్తు జయ తన్వీ గాఢ సంశ్లేష భ
వ్యానందం బట రాజ్య మేలు కొనుమయ్యా, శ్రీశచీస్వామివై : 11

***'ఏకశిల' నుండి (1951)***

# మధుప్రప

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సమస్యాపూరణం | 75 |
| 2. | సత్యసత్కవీ! | 79 |
| 3. | సన్మాన పద్యాలు | 80 |
| 4. | సంతాపము | 82 |
| 5. | నర్తనశాల | 84 |
| 6. | శకుంతల | 93 |
| 7. | పూజారీ! | 98 |
| 8. | గురుదేవుడు | 102 |
| 9. | క్రొత్త చుక్కాని | 106 |
| 10. | ద్వాదశలింగ స్తోత్రము | 110 |
| 11. | విప్రయోగము | 112 |
| 12. | భావ కవిత | 114 |
| 13. | విన్నపాలు | 115 |
| 14. | కృష్ణరాయలు, తిమ్మరుసు | 117 |
| 15. | గాథలు | 119 |
| 16. | నాప నారసింగ | 126 |
| 17. | నేను కవిని | 128 |
| 18. | ప్రియోత్కంఠ | 131 |
| 19. | భారతా! | 133 |
| 20. | స్వామి | 135 |
| 21. | తెలుగు నాగు | 136 |
| 22. | కోకిలా! | 138 |
| 23. | జీవయాత్ర | 139 |
| 24. | పితామహుడు | 140 |
| 25. | తల్లి | 141 |
| 26. | ఉపాలంభము | 143 |
| 27. | నిరాశ | 144 |
| 28. | అవతరణ | 145 |
| 29. | ప్రేమ | 146 |
| 30. | అనామిక | 157 |
| 31. | గ్రీష్మము | 185 |
| 32. | రామాయణ పద్యాలు | 190 |
| 33. | వాల్మీకి రామాయణ నీతి శ్లోకానువాదములు | 227 |
| 34. | గీతాప్రవచనములు | 234 |
| 35. | పాంచరాత్ర రహస్యము | 238 |
| 36. | మహాజనసూక్తులు : అనువాదాలు | 242 |

# సమస్యాపూరణం

## దత్తపది

(రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న – అన్న రామాయణ పరాలైన పదాలను భారతార్థ భావాన్ని గ్రహించి పూరించమని అడిగితే, దుర్యోధనుఁడు భానుమతితో, పద్మవ్యూహ సమయంలో అభిమన్యుఁడు, తమ కుమారుఁడైన లక్ష్మణకుమారుఁడిని అస్తమింపజేయటమనే భావాన్ని గ్రహించి ఇలా పూరించటం జరిగింది.)

శా. "మిత్రవ్రాత మనోభిరాముఁడయి సామీచీన్యయోధారిరా
డ్గోత్రాభుగ్న మహోగ్రలక్ష్మణుడనై, క్రోధావతారంబుతో
పుత్రుండుద్ధతయుద్ధ తంత్ర భరత ప్రోద్ధూత సంరంభియై
శత్రుఘ్నుండయి చేరె లక్ష్మణుఁడు భాస్వత్స్వర్గమున్ తన్విరో!"

**గమనిక: రామః పశువిశేష (పెద్ద దుప్పి) జామదగ్న్యే హలాయుధే రాఘవే చ అసితశ్వేత మనోజ్ఞఘుత వాచ్యవత్ లక్షణం లాంఛనే నామ్ని రామభ్రాతః లక్ష్మణః అమరము భరత, శత్రుఘ్నపదాల ధాత్వర్థాలు గ్రహింపబడ్డాయి)**

**స. ధీరత్వంబున దోమ తుమ్మెఁగదరా దిగ్దంతు లల్లాడఁగన్.**

**పూ.శా.** "తోరంబౌ ద్రగడం బొనర్చియని కుద్యోపింప మేల్కొల్పినన్
ఘోరాకారుఁడు కుంభకర్ణుఁడు మహాక్రోధంబునన్ లేచి, పొ
ల్పారన్ మద్యము గ్రోలు వేళ్ళు ముకుఁ గ్రోళ్ళన్ జేరి నర్తింపగా
ధీరత్వంబున దోమ, తుమ్మెఁగదరా దిగ్దంతు లల్లాడఁగన్."

**స. అందరు నందరే మఱియునందరు నందరె యంద రందరే.**

**పూ. ఉ.** "అందరు సత్కళావిదుల నర్థివరించుట వ్యర్థ యత్నులై
నందిమిఁ జూచి, కాచి జననాయఁక త్వన్నగరీ విలాసినీ
మందిర వీథులందుఁ బలుమారుట పల్లవులాడ విందు" వీ
రందరు నంద, రే మరియు నందరు, నందరు, అందరందరే!"

**స.** **పగలే సూర్యుడు ఘూకమై యడఁగె విశ్వం బద్భుతం బందఁగన్**

**పూ.మ.** "పగయౌ మేరువుఁ గెల్వ వింధ్యనగ మప్పాటన్ విజృంభించి తా
ఖగతారా పదముల్ గమించి నిలువన్ కాలజ్ఞతా శూన్యమౌ
నిగణంబుల్ తను వేడ కుంభజుఁడు సందీపించి వాౖక్రుచ్చె
పగలే – సూర్యుఁడు ఘూకమై యడఁగె విశ్వం బద్భుతం బందఁగన్.

**స.** **ఒక రూపంబు ధరించి కొల్చు హరియా బాలేందు చూడామణిన్.**

**పూ.మ.** "సకలాదిత్యులు దేవతాన్నమును విశ్వాసంబునన్ ద్రావునం
తకు దైతేయుల మోహినీ నటన మధ్యాసించి నిల్పంగ వం
చకుఁడై లీలఁ జరించు వేళ సుతు నొందం జేరినన్ పంక జాం
బక రూపంబుధరించి కొల్చె హరియా బాలేందు చూడామణిన్.

**స.** **ఒక రూపంబు ధరించి కొల్చె హరియా బాలేందు చూడామణిన్.**

**పూ.మ.** ప్రకటక్రీడగ సూర్యచంద్రులను చక్రద్వంద్వముంజేసి, యు
త్సుకతన్ భూరథమెక్కి, యబ్జజుని నుద్యోగించి, సారథ్య పా
లకుగా, ఆ త్రిపురాసుర ప్రతతి గెల్వంబోవు నవ్వేళ నం
దొక రూపంబు ధరించి కొల్చె హరియా బాలేందు చూడామణిన్."

**స.** **పక్కున నవ్వె గౌరి తలఁబ్రాలను బోయుచు రాజమౌళిపై.**

**పూ.ఉ.** "ఎక్కితినే శిరమ్ము, నటియింపగ నేర్తు – తపించి యేటికే
చక్కని చుక్క వచ్చి" తని జాహ్నవి మేలఁపు జూపు జూడ "ఓ
అక్కరో! నాదె ఈశు – హృదయంబని యక్కున నిల్పి వీక్షలన్
పక్కున – నవ్వె గౌరి తలఁబ్రాలను బోయుచు రాజమౌళిపై.

**స.** **పక్కున నవ్వె గౌరి తలఁబ్రాలను బోయుచు రాజమౌళిపై.**

**పూ.ఉ.** మిక్కిలి మక్కువన్ పతిని మించి శిరమ్మున నుంచు కోర్కెమై
నిక్కుచు పెక్కుమారులుగ నేర్పునఁ బోసి యొకింత వెన్కకున్
జిక్కగణంబు లాయలపుఁ జేతల గేలిగ నాడి చూపు చో
పక్కున నవ్వె గౌరి తలంబ్రాలను బోయుచు రాజమౌళిపై.

**స.	కారాగారమునన్ ధ్వనించె నవురా! గంధర్వ సంగీతముల్.**

**పూ.శా.** "మీరేకప్పములీయఁ దెచ్చితిరి స్వామిన్ దైత్యరాజేంద్రునిన్
జేర న్వచ్చినవారు తెల్పుఁడన విస్తీర్ణమ్ముమై చూప వీ
ణారావమ్ముల వింత వింతలగు విన్నాణాలు దేవద్విష
త్కారాగారమునన్ ధ్వనించె, నవురా, గంధర్వ సంగీతముల్.

**స.	కారాగారమునన్ ధ్వనించె, నవురా! గంధర్వ సంగీతములై**

**పూ.శా.** హేరంబంబున బంక్తి కంధరుదు లోకేశా! నినున్ గెల్వగా
ప్రారంభించిన శక్తితర్పణకునై రాజర్షి శీర్షాళిపెం
పారన్ వ్రేల్చెదు వేళ పాడుఁడని యాజ్ఞాపింప పౌలస్త్యు హ్రీం
కారాగారమునన్ ధ్వనించె నవురా! గంధర్వ సంగీతముల్.

**స.	ఆజికి నిట్లనున్ పరుని యాలికి నిట్లను నర్థి కిట్లనున్.**

**పూ.ఉ.** ఈ జగమందు లేరు సరి యెవ్వరు భండన సవ్యసాచి, అం
భోజ విశాలలోచనల బుద్ధి కలంచు ననంగమూర్తి వి
భ్రాజిత దాన కల్పకము రాయనభాస్కర మంత్రి సత్తముం
డాజికి నిట్లనున్ పరునియాలికి నిట్లను నర్థికిట్లనున్.

**స.	రాతినిఁ గూడి పొందె నలరాయని ముద్దులపట్టి ప్రీతితోన్.**

**పూ.ఉ.** "ఆతతశక్తి యుక్తుఁడగు కీన[1]న్నతనున్ శిశుపాలు యఁగా
బ్రీతివహించుటల్ దెలిసి, పెండ్లికి రమ్మని వార్త రుక్మిణీ
కాతరనేత్ర పంప [2]యదుకాంతుఁడు వచ్చి వధించి దానవా[3]
రాతినిఁ గూడి పొందె వలరాయని[4] ముద్దులపట్టిఁ[5] ప్రీతితోన్.

---

1. అన్న: రుక్మి
2. యదుకాంతుడు: శ్రీకృష్ణుడు
3. దానవారాతి: రాక్షసరూప శత్రువైన రుక్మి
4. వలరాయని: మన్మథుని
5. ముద్దులపట్టి : ముద్దుబిడ్డ

**స.** **యమునఁ బురారిఁ గెల్వగ భయానకలీల నెదిర్చి పోరఁడే!**

**పూ.చ.** "[1]విమతులఁ గెల్వఁగా వలె [2]త్రివిష్టపరాజతనూజ! భక్తి న
య్యమరులఁ గొల్చి తెమ్ము దివిజాస్త్రము లంచన నన్నయాజ్ఞను
త్తమతపమాచరింపఁగ [3]పృథాసుత మధ్యము కైన నొంటిక
య్యమున [4]పురారిఁ గెల్వగ భయానక లీల నెదిర్చి పోరఁడే!

**స.** **భీష్మని పెండ్లి కేగిరట పిన్నలు, పెద్దలు నెల్లవారలున్.**

**పూ.ఉ.** [5]"ఇష్మశరానువిద్ధ మనుజేశునిఁ దేర్పఁగ బ్రహ్మ చర్యతై
క్ష్ణోష్మము, భీష్మమౌ ప్రతిన బూని యొనర్చుచునుండె దీనినీ
గ్రీష్మ వికర్తన ప్రకర ఖేలన శుష్కుఁడటంచు మెచ్చుచున్
భీష్మని – పెండ్లి కేగిరట పిన్నలు పెద్దలు నెల్లవారలున్.

**స.** **గజిబిజియయ్యె సంద్రము, ప్రకంపితమయ్యె హిమాచలేంద్రమున్.**

**పూ.చ.** "భుజబల సంపదన్ తరువ భూరి హలాహల ముద్భవింపన
[6]య్యజుడును, [7]నిర్జరుల్ [8]దనుజు లార్తిని వేడుకొనంగఁ, బూని నీ[9]
రజనయనుండు మ్రింగుమన రాజశిరోజుఁడు మ్రింగనంతపై
గజిబిజి యయ్యె సంద్రము, ప్రకంపితమయ్యె హిమాచలేంద్రమున్.

**స.** **జారులు పిల్తురమ్మ గిరిజాపతి వద్దనఁ దేగవే చెలీ!**

**పూ.ఉ.** "ఊరటలేని చిన్నదెడనున్నది స్వామికి నొంటిఁ దెల్పుకో
గోరుచు ముందు పంపెనని గొప్పగ నీ మరులెల్లఁ దెల్పితిన్
వారలనుగ్రహించిరి కృపాపరతన్ భయమందనేల? పూ
జారులు పిల్తురమ్మ! గిరిజా పతికాదనఁ దేగవే చెలీ!"

---

1. విమతులు: శత్రువులు
2. త్రివిష్టపరాజతనూజ: స్వర్గాధిపతి పుత్రుడు (అర్జునుడు)
3. పృథాసుత మధ్యముడు (అర్జునుడు)
4. పురారి: రుద్రుడు
5. ఇష్మ: కాముడు, వసంతుడు
6. అజుడు: బ్రహ్మ
7. నిర్జరులు: దేవతలు
8. దనుజులు: రాక్షసులు
9. నీరజనయనుండు: విష్ణువు

# సత్యసత్కవీ!

మ.　కలపుం స్కోకిలలై, మహారసఝరుల్ కల్పించి అందింప నీ
తెలుగుల్ హర్షమరాన్న భోక్తలయి రక్తిం గొల్వ నిత్యమ్ము ని
య్యిలనా యాసమయంబులన్ జననమై రేయే కవీశాను లు
జ్జ్వల మూర్తీ! కన వార లెల్లరును నీవై పుట్టి రీనాడోపన్.

ఉ.　ఆమెతవెట్ట తెల్గులకు నర్వత రమ్యరసాన్న రాజి సు
శ్రీమహితంబులైన రససింధువు లెల్లను దోచి తెచ్చి మా
నోములపంట! యిచ్చితివి యంచు కృపారతిఁ బ్రీతి – నీవె బ్రా
హ్మీమయమూర్తి! విశ్వకవి! యీ యుగకర్తవు తెల్గుకైతకున్.

చ.　వివిధ రహస్యవేదివయి వేయివిధంబుల వేదశాస్త్ర దీ
దివివని మెచ్చ లోకము సుధీ!! మహనీయ మనోహరమ్ములౌ
కవితలు జెప్పి వేయిపడగల్ గల శేషుని భంగి యిచ్చి తో
కవికవి! నీ ఋణమ్ము నెటుగా మారి, తీర్చె రసజ్ఞలోకముల్.

చ.　అతిశయ భక్తి రామకథ యందున సత్కవితా విశిష్టతల్
ధృతిమెయి నిల్పి, జెప్పి జగతిన్ మరు జన్మము లేనియట్టి స
త్కృతి యొనరించి, నిత్యఘనకీర్తి వహించిన 'విశ్వనాథ' ఓ
అతులిత పుణ్యమూర్తి హృదయాంజలి కాన్కగ నంజలించెదన్.

చ.　తెలుగు రసజ్ఞలోక మిలఁ దెల్విమెయిన్ చరియించు దాక, పూ
మొటకుల రేని పోడిమి సముజ్జ్వలమై యలరారు దాక, వె
న్నెల విభు జూచి యా కడలి నిద్దపు ప్రేముడి నాడుదాక, నీ
యిలపయి నీకృతుల్ నిలచు నియ్యది సత్యము సత్యసత్కవీ! 5

(Written to be read in శ్రీవిశ్వనాథ సత్యనారాయణ సప్తతి మహోత్సవము. held in Vijayawada)

# సన్మాన పద్యాలు

(సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర ఆంధ్ర నాయకులు శ్రీ గుళ్ళపల్లి పున్నయ్య శాస్త్రి మహాశయుల షష్ఠ్యబ్ది పూర్తి సన్మాన సభలో శ్రీవావిలాల పఠించినవి. శ్రీపున్నయ్య శాస్త్రి సన్మాన సంచికకు ఆయన సంపాదకుడు)

చ. అనయము ఆ స్వతంత్ర సమరాంగణ వీథుల వీరనాయకా
గ్రణివయి, శాస్త్రిజీ, జయరిరంస మహోజ్జ్వల శాంతిసేనలన్
ఘనగతి నిల్పిపోరి జయనాదములన్ విహరించుతొంటి నీ
యనుపమ శౌర్య సాహసము లాంధ్రుల నెయ్యెడ మేలుకొల్పవే!

చ. సమర ముఖ క్రియార్థము ప్రచారమొనర్పఁగ దక్షు, నిన్ను, ను
త్తమ నియతిన్ బ్రజా హృదయతంత్రుల మీటఁగనింప నేగినీ
వమలిన రక్తితో సలిపి యా కృషి రాయలసీమలోన ను
ద్యమమున మేటినాయకుఁడవైన చరిత్రను విస్మరింతుమే!

చ. కదన మొనర్చువారిలను కార్యసమర్థులు గారు కార్యముల్
పదిలముగా నొనర్పఁగలవారలు పోరొనరింపలేరు - నీ
కదియును నిద్ది విద్యలుగ వచ్చెను వెన్నలఁ బెట్టినట్లుగన్
కదనమునందు దక్షుఁడవు, కార్యసమర్థుఁడ వీవు శాస్త్రిజీ!

చ. అపుడు స్వతంత్రరాష్ట్ర సముపార్జనకై సభఁ జేతఁబట్టి దూ
రపు పొలిమేరలం దిరుగు రాష్ట్ర జనావళి నొక్కత్రాటిపై
నపరిమిత ప్రభావమున నచ్చెరునొందఁగ, నిల్పి, లేతయా
తపములు గాయఁ బల్కిన విధంబులు వక్తృత కొజ్జ బంతులౌ.

శా. ఏ రంగం బది యీ తెలుంగు భువిలో నీవిచ్చు చేఁదోడు లే
కారంభమ్మయి వృద్ధినొందినది - సత్యంబిద్ది - ఎందైన నీ
ధీరత్వంబును, త్యాగశీలమును, నేతృత్వమ్మొ కన్పట్టు, నీ
కీరాష్ట్రేందిరయెట్లు తీర్పఁగలదోయీ యీ ఋణం బంతయున్

చ. "ఎన్నో జన్మల నోమొనర్చి యిటు లే నీ నాఁట జన్మించి తం"
చన్నా! మున్నొకమారు వల్కితివి మాకాత్మన్ బ్రసాదింప సం
పన్నంబైన త్వదీయ వాగ్విలసన ప్రౌఢిన్ పిసాళించి – యీ
తెన్నుం గాంచని జీవయాత్ర కది పాథేయమ్ము పో సోదరా!

శా. విన్నాణమ్ములు చిందుగా హృదయమున్ వీక్షించి భాషింప నీ
యౌన్నత్యంబుల లోతులందెలిసి నీ యాప్త వ్రజంబందుఁదా
మెన్నం జేరిన పిన్న పెద్దలను లెక్కింపన్ మదిన్ తోచునో
యన్నా! పున్నయశాస్త్రి! నీయెడఁద యౌనంబోధియం చయ్యెడున్.

ఉ. ఎందఱకెన్నో సాయముల నీవొనరించితి, వట్టి వారలున్
వందలు వేలుఁగా గలరు – వారలయిండ్లఁ బసందుఁ జిందులే
యందఁపు చిన్ని పాపల సుహాసరుచుల్ వెలుగొందునంతకున్
జెందుచుఁ గీర్తి పుణ్యునిను నిత్యునిగా నొనరించు మిత్రమా!

చ. అరువది యేండ్లు వచ్చినను నప్పటి యౌవన మిప్పుడేనియున్
దరుగదు మానసాన – జనతాప్రియ గౌరవ మందుకొంచు నీ
విరువది యేండ్ల వాడవయి యెన్నియొ దేశహితాలఁ గూర్పఁగాఁ
గరమనురక్తి శంభుఁడు సుఖస్థితి నాయువు నీ కొసంగుతన్.

# సంతాపము

**(శ్రీవల్లభజోస్యుల సంతాప సభలో పఠించినవి)**

చ. గురుడవు, నాప్తమిత్రుడ వకుంఠిత కావ్యరసజ్ఞమూర్తిసుం
దరనిఖిల ప్రపంచ కవితా కమనీయ మహాధ్వ సీమలం
దిరిగి రసానుభావ భావ దివ్యసుఖమ్ముల పంచుకొన్న సో
దరులము – నీవు లేని జడతామయ జీవితమెట్లు సాగునో?

ఉ. మమ్మిట వీడి యేగితను మాట చెవింబడి నంతనే ననున్
క్రమ్ముచు వచ్చి క్రూర తిమిర మ్మెదొ మ్రింగిన యట్లు – ప్రార
బ్ధమ్మొక 'టెద్దియో పయిన పాంపతు లొల్కిన యట్లుపెన్పొగన్
ముమ్మరమై దవాగ్ని యెదొ ముట్టడి చేసిన యట్టు లైతిపో!

చ. ఎవని సుఖమ్ము చూచిన నెదో పొడకట్టెడి చింత – దేనికై
ఎవని గదల్చినన్ వినెద నియ్యది దారుణ దుఃఖవార్త – ఎం
దివె కన నీరు శోకరస దృశ్యములే – ఎటు సుబ్బరాయ నీ
వవుర! సమస్త బాంధవుడ వౌటకు నే మొనరించి నాడవో!

చ. అరువది యేండ్లు నిండినవి ఔనిక వచ్చును నేడొ రేపొ శం
కరమగు షష్టిపూర్తి, తగు కాన్క లొసంగి ఋణమ్ముఁ దీర్పం
దరు నభిలాష గొన్న విధి దారుణ కర్కశ చిత్తవృత్తి ని
న్నర శతవత్సరమ్ములకె వంచన నిట్లు సమాప్తి సేసెనే!

శా. నీ నిర్యాణము నూహసేయ మది కెన్నే తోచు బృందారకో
ద్యానంబందలి పారిజాతమవు, ఆర్యా! నీదు సౌరభ్యముల్
కాన న్రావిక యెన్ని జన్మలకు – సంస్కార క్రియా శూన్య
ధ్యానిష్కాసిత వాసనా తతుల మధ్యన్నిల్పి మమ్మేగితో?

శా. రాజుల్ పొందని గౌరవమ్ము లవి దుర్వారమ్ములై చెందె ని
న్నొకడన్ – రాజితమాన సాబ్జ మకరందోపాయనం బిచ్చి

రాజుం గొల్చెడి రీతి కొల్చిరి నినున్ – ప్రాభాతపూషోజ్జ్వల
ద్భ్రాజిష్ణుత్వము పంచి యెల్లరకు సుబ్బారాయ లాలింపవే! 6

శా. ఆ యౌదార్య మనూన మౌ కరుణ సంధ్యారాగ చిత్రోజ్జ్వల
ద్భూయస్త్వంబున నొప్పు స్నేహమును, సంపూర్ణ క్షమాదక్షశి
క్షాయత్తో చిత పాలనాచణత, రజ్యన్నిస్తులో పజ్ఞ
ధ్యాయాధ్యాపన శేముషీవిభ వమౌనీవౌ పరిష్కారముల్.

మ. ఎదు రెవ్వారలు నిల్చినన్ గెలుపు నీదే యెందు – భాషారుచి
న్బదులుం జెప్పఁగఁజాలు ప్రాజ్ఞమును సర్వజ్ఞత్వముం నీకునె
య్యది సత్యమ్ము, త్వదీయ మానసము దీవ్యద్భావ రత్నా కరం
బది గైకొన్న కొలది యీయఁగలరయ్యా నవ్యమాణిక్యముల్!

మ. మరియాదల్ విడనట్టి హాస్యరుచితో మాంజిష్ఠ రేఖావళీ
చిరసౌభాగ్యముతో, నుదాత్తగతులం జెన్నొందు కావ్యాల నీ
శ్వరి భాషాసతి కిచ్చి భూషలుగ శశ్వత్కీర్తి గైకొన్న ని
న్మరువ న్నేర్తు మె సుబ్బరాయ సుకవీ! మాధుర్యలీలా భువీ!

చ. కడుపున బాడబాగ్ను లధిక జ్వలనమ్ముల నాట్యమాడ నా
కడలి కలంగు నట్లుగను కష్ట పరంపర లెన్ని యడ్డినన్
తడబడ కీవు మేరునగధైర్యముతో ఘనకర్ణధారి వై
నడిపిన జీవిత క్రమ మనారతమున్ మరువంగ నేర్తునే?

మ. మును నేఁ జెప్పి 'వసంతసేన' కృతి సమ్మోహార్ద్ర శక్తి న్మనం
బెనయంగా కృతినిచ్చువేళ "సఖుడా"! ఏ మీయఁగా నేర్తునీ
కని బాష్పాంబుజ నేత్రకోణ రుచి నాహ్లాదంబు చిందింపనా నేర్తున
మన మానా డొక రాజ్యమిచ్చి నను సమ్మానించినట్లయ్యెన్.

ఉ. మానిత మోహనమ్మగుచు మంజులభాషణ భూష లొప్పు నీ
యానన సుందరాకృతినొ, ఆత్మకృతుల్ వినిపించు నుత్సుక
శ్రీనవతా మనోజ్ఞతల స్నిగ్ధతనో, కరుణార సామృతై
శానతనో పదింబదిగ స్వాప్నిక దర్శనమీయఁగోరెదన్. 12

(Published in the Hindu College Magazine)

# నర్తనశాల

ఉ. బుద్ధులు సెప్పమాని కృపఁబూనుము నాపయి నీవు, అక్క, నీ
శ్రద్ధ తొలంగెనా సుమశరాసన దారుణ తాపవహ్నిలో
బద్ధుఁడనై హరింపఁబడువాఁడను నా చెలిఁ జేర్చి, సౌఖ్య సం
సిద్ధి యొనర్చి సేవలను చిత్తము రంజిల స్వీకరింపుమా!

ఉ. మెచ్చితి, లెమ్ము, లెమ్ము, కనుమీ! కనువిప్పుము, భీమసేన, ఆ
చచ్చినవాఁడు కీచకుఁడు చావఁడు, చక్కని నిద్రవోవు – వి
వ్వచ్చుడు పేడియైన నటు, వచ్చెనె నీ కేదియైన – లేక మీ
యచ్చపు జోగి, అన్న, వలదన్నను నా పయి జాలి చచ్చెనే?

శా. ఇంతీ! ఏ నొకమాట చెప్పెదను నన్నీ సప్తపాథోధి ప
ర్యంతంబైన జగాన నెవ్వడును బాహాటోప దుర్దాంత వి
క్రాంతిన్ గెల్చుట కల్ల! దాని మగ లెల్లన్ ఒక్కటై నిల్చి యే
రంతుల్ సేసిన కీటడంతు మదలీలన్ కాలకాలుండ నై.

మ. అకలం కోజ్జ్వల బాహు దర్పమున నుద్యద్ధైర్యహేమాద్రి యై
బక కిమ్మీర జటాసుర ప్రతతికిన్ బ్రాణాంతకుండై తిరం
బొక విఖ్యాతి గడించి మా కొసఁగె – గర్వోజ్జృంభణల్ మాని, నే
డకటా! తేజము దాచి పెట్టుకొను నాయాసంబు నెట్లోర్చునో?

ఉ. ఏర్చెను ఖాండవమ్ము, దిగధీశులు చూడని యాశుఁ జూచెఁ తా
నోర్చి జయించె నుగ్రదనుజోజ్జ్వలులన్, సఖుడై సురాళి క
భ్యర్చన సేయనెక్కె నమరాధిపు గద్దియ – అట్టిక్రీడిఁ యె
ట్లోర్చుచు నొక్క యల్పుకడ నూడిగమున్ సలుపంగ నేర్చునో?

చ. ననుగని యింతి యెవ్వతయినన్ మదనార్తికి నిల్వజాలదు
చనియెడి మాట చెల్లదిక యా చెలి యించుక యైన నేడు తా
మనసిజ పుష్పచాప మధుమార్గణ భిన్న శరీరగాదు నా
మనసున నున్న గర్వము సమస్తము భుగ్నము, భగ్నమయ్యెఁబో! 6

సీ. దక్షిణాధిప మహా ధర్మోజ్జ్వలుండౌచు
తేజరిల్లెడు రాజరాజొకండు
శతనాగ బలఘన శక్తి సంపత్తిచే
పవను గెల్వఁగఁజాలు ప్రభువొకండు
శక్రచాప ప్రభాతముఖ విభవుడై
యఖిలాధికత నొప్ప నమరుఁ డొకఁడు
ఆశ్వినేయ మనోజ్ఞు లధిక దర్పాన్వితుల్
అరి నిషూదన చణులిరువురు, కడు

తే. నద్భుతాకృతులై మదీయానువర్తు
లగుచు గంధర్వపతు లేవు రగ్గి ప్రియను
నన్ను గాపాడుచుందురో యన్న! ఇట్టి
వలపు మాను మేల? బ్రతుకఁ దఁలచె దేని.

మ. తరుణీ! ఏలనె, మత్పతుల్ భయదగంధర్వుల్, మహావీరు, లు
ద్ధురతేజుల్ గలరంచు నాదు నెదకెంతో భీతిఁ గల్పింప నీ
వరలేకించుక పల్కె దోసి! ఘనబాహాటోపము న్జూప భీ
కర యుద్ధావని నేను నిల్చినను స్వర్గ స్వామియిన్ గెల్చునే?

చ. నను సభలోన కీచకుఁ డనాథనుగాఁ గని భంగపెట్టఁగాఁ
గని యవనీజమున్ బెరికిఁ గ్రక్కునఁ బైఁబడి చంపఁబోవఁ న
త్యనితరశాంత చిత్తుండు, మహాత్ముఁడు, ధర్మజుఁ డడ్డు వెట్టకుం
డిన మన గూఢవృత్తికి ఘటింపదె యాపద వాయునందనా?

నెమ్మది నిచ్చు కొన్నటుల నేడిటు లర్పణ జేసి తీవు నా
కమ్మవొ పారిజాత సుమహారము, నియ్యది క్రొత్త క్రొత్తయై
కమ్మని తావులన్, కడిది కాంతుల విందులు వెట్టుచున్న దీ
యిమ్మగు దానమున్ దమి రచించిన మాలిని వీవెయుత్తరా!

చ. కొలదుల కంకుభట్టనఁగఁ గ్రుమ్మరు నాతఁడె ధర్మజుండు, మీ
వలలుఁడు భీమసేనుఁడు, అపాకృత పౌరుషశక్తి యుక్తి నే
లలిత కళాగురుండనయి లాస్యము నేర్పితి ఫల్గుణుండ ను
జ్జ్వలులు కవల్ త్వదీయ హయశాసక గోగణ దక్ష శిక్షకుల్.

చ. "కురు బలమున్ జయించి మనగోవుల దెచ్చెద" నంచు నుత్తరుం
డరిగెను బాలుడతఁడు, మహాద్భుత విక్రములందు నున్నవా
రరయ – విచారనీల జలదావృతమై మది తల్లడిల్లు, మీ
రురుతర యోధముఖ్యుల రయోద్ధతి, దోడ్పడ నంపుడీ తగన్.

ఉ. ఆటకొ పాటకొ పిలుచుటన్న తగున్, రిపు గెల్వఁగోరి యి
ప్పాటున పోటుబంట వయి భండన భూమికి నేగువేళ వై
రాటి! రథంపు సారథిగ రమ్మని పిల్తువు! పేడినైన నే
నేటికి, నీకు సాటియగు నెవ్వని నైనను బల్వయోగ్యమౌ –

తే. రమణి! మద్భుజాబల పరిరక్షితంబు,
ఏనె నిజమైన ప్రభువు నీ యిలకు – నాదు
కన్నులించుక మందార కళికలైన
విరటుఁడు క్షణము గద్దెపైఁ ఒరఁగఁగలఁడె?

తే. నన్నుఁ జేకొన్న యన్నుల మిన్న సతులఁ
బిలిచి యపుడె నీ సేవ కర్పించుకొందు
ప్రీతివడ నిత్తు నీవు సేవించు సోద
రిని సుధేష్ణను సైరంధ్రిగను బ్రియాన.

తే. కనుమ, సోదర! ధర్మరక్షకుడ వైన
నీకు తగునె యిది? తగదు నిశ్చయమ్ము
చిత్త మొకట విచారమ్ము చెలఁగె నేని
తలఁచి యదుపునఁ బెట్టఁగాఁ దగును దాని. 16

తే. రమణి కాలి గోటికి సరిరారు నిఖిల
నాకలోక సురాంగనా నీక మక్క!
ఎపుడు సేవకు నీవు చిక్కించుకొంటి
వప్సరః కంఠ సుందరహార మణిని?

తే. అరయు చుంటి నాసతి, సవనాగ్ని కీల!
దివ్యగుణవల్లి! సకల సాధ్వీమ తల్లి!!
మోముఁ జూచినఁ బూజింప బుద్ధి పుట్ట
ఇట్టి నీచపుటూహ నీకెట్లు గలిగె?

చ. అదయిన జూపులు తోప కామశర సంహారమ్ములై మించి శా
రద శంపాలలితాకృతిన్ జనెదు – నీరంధ్రమ్ములై క్రమ్మి నీ
రద సమ్మోహ వినీల కేశరుచి జాలమ్ముల్ – తమః పుంజ సం
పద లెల్లన్ దమి క్రుమ్మరించి యెద సంతప్తమ్ము గావించెడిన్.

ఉ. ఆతడు కీచకాగ్రజుని నాతని తమ్ముల గీటడంచి పె
న్భీతికి హేతుభూతుఁడయి పెల్లుకలంచిన భీమసేనుఁ డ
త్యాతత బాహుదర్ప వివశాత్ము బకాసురుఁద్రుంచి లోకవి
ఖ్యాతి గడించుకొన్న పవనాత్మఁజుఁ డాతడు మత్స్య భూపతీ!

సీ. కలికి బేడిసమీ కనులఁ గన్గొన్నచో
            పడతి! యేను నలకూబరుఁడ నౌదు
కలకంఠరుతి దోషగాఁ బల్కు పల్కుచో
            యబలరో! నందనోద్యాన మగుదు
కెరలు తేనియవాక కెమ్మోవిఁ దనుపుచో
            చాన! యమృత కలశమ్ము నౌదు
నాగభోగిని వోలె నను కౌఁగిలించుచో
            తరుణి! యే నైరావతమ్ము నగుదు. 21

తే. స్వర్గమును వీడి వచ్చిన వనిత! నన్ను
నింత దయఁజూపి దాసుగా నేలుకొమ్ము
అన్య భువన సుదుర్లభంబైన యెల్ల
త్రిదశలోకసుఖాల నర్పింతు నిన్ను.

ఉ. కొఁవ్వి ప్రియుండు నిన్ను సుమ కోమలి! కౌఁగిట ద్రోసి పుచ్చ నీ
వివ్వసుధం చరించి సుఖియించుచు బుద్ధులు సెప్పఁగోరి ఓ
జవ్వని వచ్చితే – అమర శైవలినీ జలజాత మోహనా!
ఎవ్వని కీయ నెంచెదవో యీవు మనోజ మహీపతిత్వమున్?

చ. చతురుఁడె యైన నా ముసలి – స్రష్ట సృజించిన మూర్తి యౌనె యీ
యతివ? రతీద్వితీయుఁడు, ప్రియమ్మున దిద్దిన ముద్దుగుమ్మ, యీ
శత మఖు దేవియున్, రమయు, శైలసుతా వనితామ తల్లియున్
రతియును సాటి వచ్చెదరె లక్షయుగాలు తపమ్ము చేసినన్?

చ. బలయుతులైన సోదరుల ప్రాపు వహించితి, వీరపత్నినై
యలఘు పరాక్రమాన్వితుల నాత్మజులన్ గనుగొంటి కృష్ణ కే
చెలియల నైతి, పుణ్యతర సింధు జలమ్ముల స్నాత నైతి, ను
జ్జ్వల ఘన రాజసూయ మఖవైభవ వేళ మహత్త్వ పూర్ణనై.

ఉ. మత్తగజేంద్ర మొండు మద మత్సరతన్ వనభూమిలోన ను
ద్వృత్తి మెలంగి లీలలఁ నవీక్షితమై తుది భీమసింహ స
త్త్వోత్తమ చారుశాత నఖరోద్ఛ్రిత పాటనశక్తి నీల్గు న
ట్లిత్తరి రూపుమాసితివె యీవు సమస్తము కీచకాధమా!
(నేనెంత చెప్పినా కనవైతివి, వినవైతివి)

ఉ. ఉత్తర క్రొత్త క్రొత్తలుగ నూహల మేళన చేసి నేఁడు నా
చిత్తము కెక్క నేర్చిన విశేషములన్ నటియించు వేళలం
దత్తరలాక్షి, ఊర్వశి, సురాధిపు నర్తకి చూపి నట్టి యు
న్మత్త మనోజ్ఞ భంగిమలు మాటికి మాటికి రూపుగట్టెడిన్. 27

తే. అమరపతి కొల్వులోన రంభాదులైన
యచ్చరల నాట్యగరిమల నరసినాడ!
అందుఁ గనలేదు అమ్మరో! సుందరములు
లలిత భవదభినయ లసద్విలసనములు.
(తన ఏకవేణిని చేతఁ బెట్టుకుని)

చ. కురుకుల పాంసనుండొకఁడు క్రొవ్వి సభన్ నను పట్టి నన్ను నీ
యరుదగు దుఃఖ వహ్నులకు నాతఁడు దగ్ధముగాక మున్నె నిన్
విరటు మరంది వట్టి పెనువేనలికై ఈతని గృష్ణ సర్పవై
ఖరి విషపూత్కృతాగ్నులను గాల్పుము కౌరవ సూచకంబుగన్.

మ. ప్రబలాహంకృతి నుద్ధతుం డగుచు నీపై మోహమున్ నిల్పి బా
డబకీలానల హేతి నిన్గలఁచి మెండౌ గర్వముంగొన్న సిం
హబలున్, దుష్టు, నికృష్టు జంపు గతి నుద్యల్లీలలన్ జంపినా
నబలా! చూచితె, సంతసించితె మదీయా నూనతన్ మెచ్చితే? ఔద్ధత్యమున్.

తే. కలికి! కనులెన్ని నవకర్ణి కారములను
మించు సంధ్యారుణిమలఁ బూయించుకొనుచు

తోచునయ్యవి నాకు నుత్కృష్ట ముగ్ధ
మధుర మోహన నవ మంజుమల్లికలుగ.

తే. రమణిరో! ఘన జఘన భారచ్ఛలాన
నెంత వేగాన పయనింప నిచ్చగొనిన
నమృతమును గొన త్రావ నా యక్షి యుగళి
నలసతల నాపు నీ నడ కంజలింతు.

తే. పతుల కుయ్యిడి యిటు పిలువంగ నీవు
లేమ! వినెదను పిక కాకలీ స్వనమ్ము
భయమున వడుకు చిట నిలువంగ కలికి!
అలసి విద్యుల్లతా తన్వి నిలచినటుల నిన్ను. 33

తే. నన్ను చెఱవట్టి చెరపు వెన్నాడు చుండె
గంధ గజ మటుల నిడె మదాంధు డితఁడు,
వీరగంధర్వ హర్యక్ష విభవు లార!
ఈ మహాంభోధి నీదింప మీరు రారె!!

తే. ఒక్క యాడుకూయిని విని యోపలేక
ఊరకే యిటు తల్లడ మొందె దీవు?
కదన మన్న నన్నియు భయాక్రందనములె
ఎటుల నిలతు బృహన్నలా! ఇట్టులైన?

తే. ఊరకుండెదరేల నేఁ డుదిత బలులు
మీ రథః కృతారులు, దీన మిత్రులు గద
కాంత కివ్విధి నపకృతి కలుగు పిదప
కాల్పనా యోధు ఘనతలు? కడిగి రండు!

తే. నలువ రాణికి నెవరిపైఁ దలంపు లేదో
యామె వారిని మధుర నేత్రాంచలముల
నించుకేనియు వీక్షింప నిచ్చవడదు
ఆమె వలచినఁ దనుదానె యాశ్రయించు.

తే. నీదు శ్రద్ధకు, భావనా నిరతి కర్థి
సలిపెడి విముగ్ధ గురుపూజనల కలరి

బహుజనన సుకృతముల సత్ఫలమె యైన
అమృతమయ విద్య, తల్లి, నీ కబ్బె నిటుల.

ఉ. ఇంతి సుధేష్ణ ధర్మ మననెంతయుఁ గూర్మి వహించు నెమ్మదిన్
పంతముఁ దాల్చి రక్షయిడుఁ బాణము లర్పణ చేసియైన నం
చెంతయు నమ్మియుంటి ఇటు చేసెనె మోసపు జంత! ఇంక నే
నింతటి పాపురాలి మొగమేగతిఁ జూడఁగ నేర్తునో గదా? 39

(తప్పెడి దేమున్నది? సేవావృత్తి గైకొన్న చేడియలకు యజమానురాం డ్రెంతటి...
సుధేష్ణ ధర్మానికి తప్పింది, తమ్ముడిపై ప్రేమ ఆమెను తల్లడ పరచింది)

సీ. చౌర్యక్రియాధుర్య శౌండీర సమితికి
తనరు దొడిగిన తనుత్రాణమనగ,
అరిజన ప్రాణ సంహరణదీక్షా బుద్ధ
కుహన వీరామోఘ కులిశ మనగ,
పరసతీ సంయోగ ఫలకనత్కాంక్షలో
నరుగు జారులకు సిద్ధాంజనముగ,
స్వైరిణీతతి కభిసరణ సౌఖ్యం బీయ
తోడు నిల్చిన ప్రియదూతి యనఁగ,

తే. సకల నిరయన నిలయ ప్రశస్త శబల
బహుళ జీమూతకాంతి సంపదలఁ బొదలి
యొక్కటౌ నీలజలధిగా, నొక్కటైన
ప్రళయవేళా జగమ్ముగాఁబరగు నిద్ది.

మ. వలలా! నీ కనుచూపు పడ్డయది సర్వశ్లాఘ్య భూమీజ, మి
య్యల సుచ్ఛాయలొసంగి యాశ్రితుల కెంతో రక్ష గావించు, మం
జుల శాఖా పరిశోభితంబగుచు చక్షుః ప్రీతి గావించు ను
జ్జ్వల వృక్షం బిది వంట కట్టెలకుఁ గూల్పన్ జూచుటల్ చెల్లునే?

తే. భామ! గంధర్వకులజులు భర్త లంటి
వంధులేవారు? నీయార్తి నరసినారు
అతివ చేబట్టి నట్టి కామాంధునొంప
బాంధవుఁడు గాఁడె పావని, పతియొకండు.

చ. పడతులు పెద్దకాలము నృపాలుని కొల్వున నిల్వరాదు నీ
వడిఁగెడు ధర్మమెల్ల మనుజాధిపు బుద్ధికి నెక్కె దోషి కీ
యొడయడు యుక్త దండనము నోపి, యొసంగు సకాలమందు నీ
చిడిముడిపాటు మాని యిక చేరుము అంతిపురమ్ము మానినీ! 43

ఉ. ఈసున వెంట నంటి యిటు లించుక జంకును గొంకు లేక నా
యాసము వెట్టు దుష్టు కనులారఁగఁ జూచియు బొమ్మలైరె? సం
త్రాసిత శిష్ట రక్షణను దారుణ దుష్ట విశక్షణంబు నన్
ఈ సభ గొడ్డు వోయినది యిందరు భీమ బలాఢ్యులుండియున్.

## ద్రౌపది

తే. ఓ జయంత! జయోద్బలా!! ఓయి విజయ!!
ఓ జయత్సేన!! రండు, మీరున్న యటులె
సూతజుని చోద్యముగఁ జంపి మీసుదతిఁ బ్రోవ
నాజ్ఞ నీయఁగ లేదె మీకా జయుండు?

## కీచకుడు

తే. ఓ జలజమిత్ర! విడువఁగా నోప, కీవు
ప్రియల నడుగు సాగని నడన్వెడలె దీవు
విరులఁ బ్రియురాండ్రఁ గవయ తత్తరముఁ గొనెడి
ఎడద లెట్లుండునో యించు కెరుఁగవయ్య!

తే. ఏను వందన ఘనత నర్పించి నీకు
నెల్ల వనితలఁ బూజ్యు గావించును
అనుఁగు తమ్ముఁడ నైన నా మనసు దీర్ప
నొక్క సైరంధ్రి నీయఁగా నోపలేవె?

చ. వికృతపు - చావు చంపి రిటు వేల్పులు, క్షుద్రుని వీని నంచు ను
త్సుకతను జూడ మూగు మనుజుల్ కడు చెప్పుకొనంగ నెల్లి నే
నొక పెను పీన్గు ముద్దయటు లుండునటుల్ మడియించినా డ కీ
చకునిటు - కర్జ మిద్ది మన చక్కని గూఢనివాసవృత్తికిన్. 48

**నర్తనశాలకు**

ఉ. వచ్చు మదాతి రేకమున వాఁడొకఁడే, నినుఁ బొందు తత్తరన్
జొచ్చు కడంగి నిన్వెదకి, చూచిననున్ కడుపొంగి, సంగరం
బిచ్చు, మదీయ బంధుర భుజేరిత శక్తికి నిల్వ జాలకన్
జచ్చు – త్వదీయ రోషశిఖిశాంతి వహించెనె భామినీ మణీ!

(కీచకుడి చేత పాదాభివందనం చేయించుకున్న తరువాత, ద్రౌపది అతడితో)

నేరిమి, నోర్మి, నెగ్గితివి నీవు మదీయ పరీక్షలోనే – నే
తీరిచి నీ యెడందగల తీవ్ర మనోజ మహార్తి తాప వి
స్తారము, నీకు స్వర్గ ఘన సౌఖ్య మొసంగి తరింపఁ జేతునో
ధీరుఁడ! నాట్యశాల కరుదెంతును నే నభిసారికాకృతిన్.

(కానీ, ఒక్క హెచ్చరిక. ఏమని? మగనాలిని గదా! నీ వొంటిగ రావలె. సమయము సర్వజనులు నిద్రాశయ్య నలంకరించిన పిదప)

**కీచకుడు**

నీ పరిష్వంగ సౌఖ్యాన నిలచినపుడొ,
యున్నమదురోజముల నిద్ర నున్న యపుడొ
మృత్యుదేవత యేతెంచి, మె/నెలఁత! అడుగ
బ్రీతిఁ బాణాల నేనె యర్పించుకొందు. 51

సర్వ సర్వంసహాచక్ర సార్వభౌము
డౌ యుధిష్ఠిరు నర్ధాంగి యయ్యు నేఁడు
ఇలను మును జానకీదేవి వలె కనంగ
నెన్ని యిక్కట్లు పడుచున్న దీనెలంత! 52

# శకుంతల

తే. ఆశ్రమమ్మిది, శాంత విహార భూమి!
ఏల నాబాహు వదరెడి నిట్టు లిపుడు
ఫలము ముం దేమి కల్గునో – ద్వారచయము
తలఁప వివృత మయ్యెడు భవితవ్యములకు.

తే. అరయ శుద్ధాంత దుర్లభమైన యిట్టి
మేనఁ దాపసకన్యకల్ మించిరేని
గుణములను వన్యలతికలు కోటి కెక్క
తరుమవే దూరములకు నుద్యాన లతల.

తే. చెలువ కెమ్మోము తనరారు చివురు పగిది
ముగుద బాహులు విటపముల్ – మోహనంపు
యౌవనము లోభ నీయమై యుహకముల
మరులు గొల్పెడి పుల్లసుమమ్ము రీతి.

తే. సందియ మ్మేల – ఈ తన్వి క్షత్రియార్హ!
కాక యార్యము నామది నిలుచు నెటుల
నెలతపై – కల్గ వస్తు సందేహ, మెపుడు
నార్యులకుఁ బ్రమాణముగద యాత్మగతియె!

తే. ఎచటఁ బైకొనుఁ దుమ్మెద యచట బెదరి
కనుచుఁ ద్రిప్పుచుఁ గను బొమల్ గాఢ భీతి
కామ గురుదేవ శిక్షణ క్రమము లేక
నేర్చె నేత్రవిభ్రమము నీ నెలఁత మిన్న!

తే. నీతిరహితుల దండించి నేల నేలు
పౌరవుం డిట నుండఁగా భయము లేక
గర్వమున ముగ్ధతాపస కన్యకాళి
నేచఁగా వచ్చినాఁడ వీ వెవఁడ వోయి? 6

తే. ఇట్టి సుందరమూర్తితో నెసఁగు తన్వి
కలుగునే మర్త్య భామినీ గర్భమునను?
దివ్యసుషమానుషంగయై తేజరిల్లు
నొక తటిల్లత పుట్టునే యుర్వి యందు?

తే. తాపసస్త్రీల దివ్య సౌందర్య గరిమ
రాజకాంతల కెందు దుర్లభమె యగును
వజ్రపాత కఠోరమై వరలు నీదు
క్రూర నారాచ మదియేడ ధారుణీశ!
అమిత సుకుమారమును మనోహరమునైన
విమలచంచల హరిణ జీవితమదేడ॥

తే. వలదు వలదయ్య అలుగును వదల వలదు
చెలువముల రాసి చిన్నారి జింక మీఁద
అమితదారుణమై పొల్చు నగ్ని శిఖతో (ను)
కుసుమరాశిని దహియింపఁ గోరఁదగునె?

తే. జడిసి పరువెత్తు నా కృష్ణసార మరసి
యెక్కు వెట్టిన ధనువుతో నేను నిన్ను
గనిన రాజేంద్ర! కనులకుఁ గానుపించు
యజ్ఞ హరిణమ్ము వెన్నాడు నాపినాకి!

తే. తపసి కన్యక వెనువెంటఁ దవులఁ జూచు
వేళ నిల్పెన దడ్డి నా వినయగుణము
అయినఁ గదలక యుండుము/ను నతివ వెంట
నరిగి క్రమ్మర వచ్చిన విధము తోయ.

తే. హృదయమా! కోర్కె వీడకు మింక నీవు
సంశయము తీరె నాకు నీ సతిని గూర్చి
అగ్నియని మున్ను భ్రమపడి నట్టి దిప్పుడు
హస్తమునఁ జేర్పఁదగు మణియయ్యె నోసి!

తే. అధిప! లక్ష్యమ్ము తప్పుట యన్న దెఱుఁగ
ఆర్తజనరక్ష దీక్షగా నైన యలుగు

సాధువులపైఁ బ్రయోగింపఁ జనదు రాజ!
నిలుపుమా, దీని నీదు తూణీరముననె!

తే. విఘ్నరహితము లే వేళఁ బ్రీతిదములు
నగు తపోధన రమ్యమాగాళు లరసి
జ్యాకిణాంకము నసహాయ శక్తియుతము
నీ భుజమ్మెలు మేరల నెఱుఁగు మధిప!

తే. పుట్టి పురువంశమున కొక భూషణముగ
నుర్విఁ బాలించు నీకిది యొప్పు గుణము
పరమగుణయుతు నీవంటివానిఁ బుత్రు
సార్వభౌమునిఁ బడయుమా జనవరేణ్య!

తే. అతివ సహజ మనోహర మయిన మేను
నుగ్రతపముల కీ మౌని యొనరఁ గూర్చె!
మించి నీలోత్పల దళము నంచుతోడ (చేత)
నితఁడు కోయజాలఁడె సమిల్లతల నేని?

తే. సూరరీమణి తను శోభ చూపలేదు
చిఱుతముడి మూపుపైఁ జెలఁగి, కుచపు
పొంగులను మాటు వల్కల మూలముత్యను మూలములను
పాండు పత్రాళిఁ గప్పిన ప్రసవ మటుల.

చ. జలజము, కప్పెనేనియును శైవల, మెంతయు రమ్యమేయగు
మలిన కళంక పంకుఁడు హిమాంశుఁడు మంజులతన్ వహించెడున్
కలికి, సరోజ నేత్ర!! యిది కట్టియు వల్కల మింపు మీరెడిన్
ఇల మధురోజ్జ్వలాకృతుల కెయ్యది యైనను భూషణంబె.

చ. సడలుపఁ బగ్గముల్ సనెడి చాచిన మేనుల నశ్వరాజముల్
బెడఁగులఁ జెంగు చేగు మృగ వేగము సైపక పర్వు రీతిగా,
గడుపెలు పొందు చామర శిఖల్ వహియింపక నిశ్చలత్వ మిం
పడరగ నిక్కబెట్టి చెవు లందక రేపిన ధూళి కేనియున్.

చ. చెలువుగ వ్రాసి చిత్రమును జీవము వోసెనో యా విరించి
చెలువగ, రమ్య రూపములఁ జేర్చి మనమ్మునసే సృజించెనో?
మెలతుక, లేని రూపు పరమేష్ఠి కళాప్రతిభన్ దలంప యీ
నెలతుక నాకుఁ దోచు తరుణీమణియైన యపూర్వ సృష్టిన్.

ఉ. తే రిటు వెంటఁబడ్డ మెడ త్రిప్పి యపార విలోకనంబు పెం
పారఁగ నిల్పి, బాణభయభావము పైకొన మేను కుంచి, మో
మారిన నోరు విప్పి, కబళార్ధకుశంబులు మార్గసీమలన్
జారఁగ నింగిపై కెగయుఁ జయ్యనఁ జెంగుచు నేల నిల్వకన్.

ఉ. ఈ మహనీయమూర్తి హృదయేశున కీఁబడుదాక నియ్యెడం
గాముని శక్తిఁ గీడ్పరచు గాఢతపో వ్రతదీక్ష నుండునా
కోమలచారు నేత్రములకున్ సరివచ్చు మృగాంగనా సఖీ
ప్రేమలఁ జూరఁగ్రొంచు నటవిన్ కడుఁ బ్రీతి వసించు చుండునా?

చ. పలుకులఁ జేర్చి పల్కు నొక వాక్యము పల్కకయున్ననేమి?
బలికిన వీనులొగ్గి వినుఁ బాయక పొందుచు నాభిముఖ్యము
నెలఁతుక నాదు మోమునను నిల్పక యున్నను దృష్టి జాలమా
కలికి మిటారి చూపుగమి కాంచఁగ నేగదు నన్యమెద్దియున్
బలిసెను – మోము క్రొంజెమట వాడ్చెను గర్ణశిరీష పుష్పము
కలఁగిన – పెన్నిటిన్ ముడుచుఁ గ్రమముగా నొక గేల దిద్దుచున్.

ఉ. ఆనని తావ్వలం జెలఁగు నద్భుత పుష్పము, గోటి త్రుంచుటల్
లేని మనోజ్ఞ పల్లవము, లీలగఁ గ్రోలని పూవుదేనె, ము
ల్లానని నూత్న రత్నము, మహోఘన పుణ్యఫలమ్ము వేధ యీ
మానిని మంజురూప మహిమంబున కెవ్వని భోక్త సేసెనో?

తే. చిన్నదై మును పెయ్యెడ యున్న యదియొ
గొప్పదై మదియె యెదకుఁ గూర్పునింపు,
ఎడము గలుగుట విడివడి యేది తోఁచుఁ
గలసి యున్నట్లుగా నదె గాను పించు.

తే. వక్రమౌ నెది చూడఁగాఁ బ్రకృతి చేతఁ
నదియె సమరేఖయై తోఁచు నక్కజముగ

చేరువో కాక దూరమో తేరువడిని
నిమిషమాత్రానఁ దెలియదు నిర్ణయింప.

సీ. చిలుక తొఱ్ఱలనుండి యొలికిన నీవార
ధాన్యమ్ము లయ్యవే తరుల క్రింద,
స్నిగ్ధమ్ము లీశిలల్ చెప్పెడి నింగు దీ
ఫలముల వానిపై వ్రచ్చిరంచు,
విని మన శబ్దమ్ము విశ్వాసమున సైచి
చెంగక నిల్చె కురంగ చయము,
వల్కలాంచలముల వారి రేఖల చేత
నేటిదారులు తెల్ప కెంక పడెడి,
వాయు కలిత ఝరీవారిచేఁ దడిసిన
పాదులఁ బెంపొందు పాదపములు

తే. క్రమ్మి యలమున ఘృతధూమ కాంతివలనఁ
గిసల యావళి గోల్పోయెఁ గెంపు సొంపు
దర్భకోసిన తలముల తలఁగి భీతి
జల్లఁగా మేయు నవె హరిణ శాబకములు.

# పూజారీ!

క. వరములు దేవుం డొసంగినఁ
జెరచును బూజారి యనుచుఁ జెప్పెడి మాటల్
తిరములు సత్యము లౌ సుమి
పరికింపఁగ నీ వొనర్చు పాపపుఁ బనులన్.

మ. కలలో దర్శన మిచ్చి స్వామి యనురాగ స్నిగ్ధ నేత్రద్వయిన్
దిలకించె, న్నను, గొల్వ రమ్మనుచు నెంతే యాప్తతం
వలపుల్ మీరంగ వచ్చి నాఁడ నిటు, భాస్వద్భక్తి భావంబుతో
దొలి పూలన్ దమిఁ గోసి తెచ్చితిని, సంతోషింపకీ విట్టులన్.

చ. తెరచిన తల్పు మూసెదవు. తెచ్చిన పూలునుఁ బత్రి వాడు నీ
తరుణము తప్పిన న్ప్రభువు దాసుని న న్మరి రమ్మనందు, ని
ద్ధురతర నిష్ఠురత్వమున ద్రోసెద వేటికొ యడ్డు నిల్చి నీ
పరమ విమూఢ మానసవిపాకము దారుణమయ్య అర్చకా.

ఉ. పాపము పాప మిద్ది ప్రభుభక్తుల నేటికిఁ గష్ట పెట్ట నీ
యోపినఁ దోడుపా టొసగ నొప్పును – ఏల కృతాప రాధసం
తాపభారమ్ము నెత్తికొన, తథ్యము తీరదు జన్మజన్మలం
దాపకుమయ్యా! నేను కుసుమాస్త్ర విరోధికిఁ గూర్చు భక్తుడన్.

శా. "ఏదో యించుక లంచమిచ్చి మరి నీవీ శాఖను సేవింపఁ బో
రాదా? ఎందుల కింత" యంచనెదు, దౌర్భాగ్యుండ, న న్నమ్మగా
రాదయ్యా? యొక చిల్లి గవ్వయును, అన్నా! రిక్తుఁడన్, నేనయో
పేదన్యాదను జూడఁగా వలదె నీ పీనాసి సంపాదనన్.

శా. ఈ యుద్యోగము నా కొసంగినది సర్వేశుండు నేల యీ
న్యాయాన్యాయ విచక్షణన్ భయముఁ జెందన్, చండశీలుఁడనై
నాయాధిక్యము జూపి వెల్గెదను. పుణ్యంబౌనో, పాపంబౌనో
ప్రాయపుం జిగి దోప వెల్గుచును నే వర్తింతు నం చెంచినన్. 6

మ. ఎవరో పెద్దలు కట్టి రాలయము నిం దిన్నాళ్ళ పూజారులై
సువిచారుల్ మహనీయు లెందరో రహిన్ శోభించి భక్తాళికి,
భవబంధమ్ములు వాయు మార్గములు సూపన్ ఖ్యాతిఁ గొన్నారు నే
డవురా, ఎక్కితి వారి గద్దియు నపఖ్యాతిన్ సమార్జింపగన్.

ఉ. ఎన్నో జన్మల నోము పంట గద నీ వీరీతి సర్వేశు సం
పన్నంబౌ గృహ రక్షకుండగుట! సంప్రాప్తింప సద్వృత్తి ఓ యొందుగ
యన్నా! వెంగలివై యో యెందుల కిటు లత్యాసక్తి పీడింతు విం
కెన్నండున్ భవుఁ డర్థి నీకొసఁగఁ డోయీ! ఈ మహోద్యోగమున్.

ఉ. ఎవ్వఁడు పాత్రుఁడో శివుని దివ్య కృపామృత వృష్టి దృష్టికిన్
అవ్వల నెవ్వనిన్ నిజ గణాత్మ కొక్కటినిఁ జేయ నెంచునో
యవ్వర పూరుషున్ నిలుపు నర్చకుఁగా నిజమందిరాన్త, దౌ
దవ్వుల నిల్చి చేయ నతి దారుణముల్ సుపరీక్ష లెన్నియో!

మ. నటకుల్ లోకమునందు మెప్పుగనుట నైర్మల్యము న్వీడి లా
నటకు ల్గావలె పార్వతీధవునకున్ నానాగుణాన్వయులై
పటు విశ్వాసముతో భజించెడి, మహాభక్తుల్ పనేమంచుఁ బాల
కట విభ్రాంతి వహించి యజ్ఞతను దుష్కార్యంబులం జేతువే?

ఉ. చేసిన సొమ్ము చాలదె వసంచెడి నీ గృహ మెల్ల బంగరుం
బూసిన దౌను, రాజునవుఁ బ్రోవుల నిచ్చును క్షేత్రలక్ష్ములున్
వాసన లీను సర్వ సుమవర్గ కుజమ్ముల నీవనావళుల్
మానెడి, కీర్తి పుణ్యము అమంగళమౌ బ్రతు కేల కోరెదో?

సీ. అయ్యవారికిఁ గొను నంబరాదులతోడ
నమరు కూలాల నలరె దీవు,
అమ్మకుఁ జేయంచు సొమ్ముల నొక కొన్ని
నిండంగ మెడఁ గుల్కు నీ నెలంత
గణపయ్య పేరునఁ గైకొన్న ద్రవ్యాలఁ
గ్రొత్త నీటులు గుల్కుఁ గొడుకుఁ గుఱ్ఱ
పరిచారికాగణ బహుళ సంభారాల
సోకు మాయదు గద నీ కుమార్తె 12

తే. ఇంక నెన్నియో రీతుల నీశు ధనము
నన్న సత్రాల కల్యాణయాగశాల
లందుఁ గైంకర్య మొనరింతు వైన నేమి?
తరుగ దయ్యెనే నీధనదాహ గరిమ?

శా. ఏరమ్యాద్భుత దివ్యవర్ణనము నా కింపారఁ జూపించి ప్రే
మారన్ ధన్యునిగా నొనర్చుటకు "రమ్మా! పుత్ర!" యంచాడె.
యారజ్యద్రజతాచలేంద్రుఁ డిట నీ వత్యంత శత్రుండవై
ఘోరంబౌ యపకారము న్దలచి నాకుం గీడు కల్పించితే?

శా. ఆ కోలాహల మేమి? శంకరుని సంధ్యా తాండవాటోపమో?
శ్రీకల్యాణమనోజ్ఞమూర్తి యగు గౌరిన్ లాస్యమున్ జూపుమం
చాకాకోలగళుండె కోరి సభలో నాదేశముం జేసెనో
యేకాంతమ్మున వారిఁ జూచుట గాదె భాగ్యభాగ్యం బిలన్.

మ. పరిహాసోజ్జ్వల రమ్య కల్పనలచే భక్తులకు భృంగీశుడే
సరసోక్తుల్ పచరింప స్వామి సుఖియై స్వాంతంబునన్ మెచ్చునో
చిరకాలార్జిత సత్క విత్వ మధుర స్నిగ్ధాప గాంభస్సులన్
బరమేశున్ కనియిటు నంది నను కృపావృష్టి లాలించునో?

మ. సురలున్ శత్రులు మిత్రులై జలధి నస్తోక ప్రమోదమ్ముతో
దరువంగా నమృతార్థులై గరళ ముద్యత్ఫూత్కృతిన్ గ్రమ్మ వా
రరుదేరన్ శరణమ్ము వేడుచు ఘనా హ్లాదంబుతో వీరవై
ఖరి నద్దానిని బట్టి మ్రింగి నిలిపెన్ కంఠంబునన్ శంభుడున్!!

చ. తనసతిఁ గోలు పోయి హిమధాత్రి ధరమ్మున దీవ్రదీక్ష
కొని తపమాచరించు తరి కూర్చుటకై నగరాజు పుత్రి నా
మనసిజు పడ్డ యత్నము సమస్తము భగ్నమొనర్చి శర్వుడాఁ
వనిత తపమ్ము మెచ్చి నిజపత్నిగఁ జేకొనియెన్ స్వయమ్ముగన్. 18

శా. దుర్వారుల్ త్రిపురాసురుల్ ప్రబలులై దోస్సారమున్ నమ్మిదు
ర్గర్వాహంకృతి సర్వలోకములపైఁ గాల్ద్రవ్వ నింద్రాదులు
న్సర్వంబున్ గోలు పోయిన యెడ న్సంగ్రామ రంగ స్థలిన్
శర్వుం డెక్కటి వీరుడై గెలిచె నా శౌండీరులన్ ధీరులన్.

శా. ఈ రమ్యాద్భుత దివ్యదర్శనములం దెవ్వానిc జూపించు నో
కోరన్ భక్తులు నూత్న లీలలను రక్షోనాథ కైంకర్య వే
ళారాజత్కరుణాఢ్య కృత్యముల వాల్లభ్యంబులం జాటు నే
ధీరానంత మనోజ్ఞ దృశ్యముల తృప్తిం జాడc జూపించునో!

ఉ. ఆపకుమింక నన్ను క్షణమైనను, గాల విలంబనమ్ము నే
నోపcగ లేను దుఃఖ మేదియో ననుc బైకొనుచున్నది
న్నాపయి జాలినొంది, సుగుణమ్ముల పోక లెరింగి, చేర్పుమా
యాపరమేశు సత్సభకు, ద్వయి మోడ్చి వేడెదన్.

ఉ. ఎంతగ వేడుకొన్న (జలియింపవు రాల్గరగంగ బల్కినన్)
వింత ప్రవర్తనమ్ము విడనేరవు రాక్షసవృత్తి తోడ గా
వింతువు క్రూరచేష్ట లిటు పెద్దగుc గాలము సాగెనేని నీ
యంతము దేల్చుకొందు మరియాదలు చెల్లెనుబో ప్రవర్తనన్!

చ. ముును కడు శ్రద్ధతో పరముగ్ధ విమోహముతో సిరించితిన్
జనభయదాయకంబులగు సర్వరహస్య పిశాచ మంత్రముల్
నినుశపియించి యీ క్షణమె నిస్తులనాశ మొనర్ప నేర్తునై
నను గ్రహియింప నాక్రమ మనార్యము పాతకమై చెలగుటన్

ఉ. పున్నెము లెన్ని జన్మలకో పాత్రమగు నీయిల – పాప మన్ననో
యన్నరో! కొండ కొండలలో యద్భుతరూపముc దాల్చు లిప్త – ను
త్పన్నముగాగ సత్తపము సాధులు శత్రులనైన హింసచే
నెన్నడు గాసిcబెట్టరు, సహింతురు దారుణదుష్ట కృత్యముల్! 24

ఉ. రంతులు మాన కేని నిను రచ్చకు నీడ్చెద – పోరువాడ న
త్యంతము సర్వమొడ్డి, నిజమౌ, హఠ యోగము పూని వాకిటన్
పంతము నుంచి గట్టి నిల్పెదను ప్రాయము ప్రాణము, నిల్పుకొందు సీ
మాంతము దాటివచ్చు వర కాపరమేశుని వీరశైవతన్.

చ. మునుపెటుగా జరించిన విమూఢతమానము దుష్టచేష్టలిం
కను – హృదయమ్ము జ్ఞానివయి క్షాళనc జేయుము, పూతున్
దినము దినమ్ము రక్తి నిక దిద్దుము శర్వుని దివ్యధామమున్
మినుము పవిత్రవర్తన నుమాధవు సత్కృప యబ్బుc గావుతన్ 26

# గురుదేవుడు

మ. అది కృష్ణాష్టమి, పుణ్య వాసరము నిత్యానంద గోస్వామి వా
రుదయాదిన్ నిజ శిష్య వర్గములతో నుల్లాస మందాకినీ
మృదు వీచీ పరిరంభ డోలికల తృప్తిజెంది సంకీర్తనల్
పదమందొక్కొక్క నూత్న జలతతో భక్తిన్ ప్రసాదించుచున్.

తే. గడచి యొక కొన్ని వీథుల నడచి నడచి
రాజమార్గాని కరుదెంచి రమ్య మధుర
భావ బంధుర గీతాల పాడుకొనుచు
తొట్రు పడుచు లేచుచు తమ త్రోవజనుచు.

తే. తన్మయతలోన నొక మాటు తన్ను తానె
మరచి నిస్తబ్ధుడై కొంత, మరల తెప్ప
రిలుచు 'రారా! మనోహరా! పిలుపు వినియు
అటుల పరువెత్తె దేటికో? యనుచు పలుకు.

మ. పిలువన్ లేదొకరైన నాయెడ నవద్వీపమ్ము సర్వమ్ము ఏ
పిలుపో విన్నటు వచ్చి చేరినది – సంప్రీతిన్ రసోన్మత్తతన్
పులకల్ జెందని దౌను మాక్కటయున్ పోల్పగ లేదయ్యెపో
కలయేదో సత్యమన్న చిం త యట కల్గన్ తావు లేదయ్యెపో!

తే. స్వామి హిమధామ మధుర ప్రశంస చేయ
శీతకరుడయ్యె నొక మారు చిత్ర భాను
డమల వంశీరవామృత మభి నుతింప
పాదములెల్ల నవవేణువనము లయ్యె.

మ. తన సర్వస్వము కోలు పోయినటు చింతన్ మున్గి యున్నట్టి యా
ననమందించుక తెల్వితోప నయనానందంబుగా వెల్గుతూ
నను వర్తించుచు, స్వామి కన్నుగవలో నాషాఢ విద్యుద్యుతుల్
తొనకించెన్ మెరపించె, వేచనియె సంతుష్టిన్ దివాధ్వంబులన్. 6

తే. నిజ మనోహర గీతికా నిచయ మధుర
మంజులాశ్వనమున వచ్చి మరల వేని
జనునె గోస్వామి గోపికా సముదయముగ
నాడె నా రాసలీలా విహారి వోలె –

చ. వెడ వెడ మొల్క లౌనగవు విప్పరు కన్నులు ఖేదమోదముల్
తడబడు పాదపద్మములు ధైర్యము దైన్యము నిర్వికారముల్
పొడగన చూచువారి తలపోతల కగ్గలుడై నటించె నా
యెడ నిజ శిష్యవర్గమునకౌ పరమాద్భుతమ యెసంగగన్.

శా. లోలో సొమ్మసిలంగ రూపతతి గోలోకంబె ఏకాగ్రయై
ఆలోకించి వినంగ తామురళి రాగాలాప నాసక్తుడౌ
లీలా మోహన మూర్తి యాడెదినో యాలీలన్ మనోహారి రా
గాలాపం బొనరించి యొక్క పరి రాగాంభోధి కృతంబున్.

మ. "దళమై నాయెదలో ప్రరాగరుచి పంతాలాడుచు దివ్యమై
నిలచున్ రమ్మిక స్వామి! యెల్లపుడు నేనీ వచ్చితిన్ కాన్క పాం
శుల బిబ్బోక సితాంబు జంబుల మధు స్రోతస్వినిన్ నవ్వు ని
వలతో రమ్మిటు బేరమాడుటకు సవ్య ప్రేమ సాంయాత్రికా!

చ. ఒక పరితా రహః క్రియల నొందిన మోదము మాటిమాటికిన్
తికమక పెట్టిసల్పు కొనడేలనె బాళి వివర్ణ నౌచు నౌ
సకల కలాపనై మధుర సాధ్వసరేఖ విదల్చి రేలనీ
నికటము జేరనేర నవనీరద! ఆ యభిసారికాకృతిన్.

మ. ప్రభువా! ఏ పని చేయ మీ మనసు తృప్తింగాంచు ఏ పల్కు మీ
ప్రమితన్ తెల్వగ నోపునో యెరిగి నేర్పన్ శక్తి కాదయ్య! ఏ
అభిమానమ్మును గాదు, ముగ్ధ యిది న్యాయమ్మ సరోజాక్ష! ఇ
ట్లభి షంగం బచరింప భవ్య భవదాయా లింగనం బీయకన్". 12

తే. అనుచు గాద్గద్యమున గాత్ర మరిగిపోగ
గుండెలో పాట నీరయి కొలను కట్టె
తత్పరీవాహమొకటి నేత్రాంచలముల
బయటి కరుదెంచె నొక రెండు పాయలుగను.

సీ. స్స్మితమౌ యనువల్లి స్పృశియించి నది యేమొ
లలిత మోహన కాంతి లతిక యయ్యె
పొందామరల కనుల్ పోల్చుకొన్నది యేమొ
నవ్య శంపాలతల్ నాట్యమాడె,
శ్రుతి పుటమ్ముల లోన చొరబారినది యేమొ
అవతంసముకుళమ్ము లల్ల విరిసె
ఆత్మ కాయెడ నుండి ఆహ్వానమోయేమొ
అలిగి యెంతటికైన తిరిగి రాదు.

తే. స్వామి చైతన్య గురుదేవ చరణయుగళ
సరస సలితాన శీతలచ్ఛాయనిలచె,
వల్లవీపీన వక్షోజ వస్త్ర చయము
మృదు భుజాశ్లేషమున మేను మరచె.

తే. అనుచు వివరించి పలుకు జనాభి భాష
ణముల శ్రుతి కల్పు కోర్కె నానాడు మెరిసె
కేశవాలయ ప్రాంగణాకాశ దీప
ఘంటికాతతి మంజునిక్వాణములను–

తే. స్వామి చెవి సోకె మధుర నిస్వనము తెలిసి
తెలియని హృదయ విభ్రాంతి దేహలతిక
నటకు నడిపించె – చేరినాడాలయమును
ప్రజల మునుముందు గొల్ల కాపరిగ నిలచి – 17

తే. నవ్యసంకీర్తనము నర్తనమును మరల
నందుకొని చేయధ్రువగతి – నపుడుతాకె
బిట్టుగ – విధుర రయజాత విభ్రమ భ్ర
మణమున మధుపాత్ర ఉత్తమాంగమునకు–

తే. వికవికలగాన వెనువెంట విరసి పడియె
స్వామి శీర్షాన రక్తపు జాలు – జనస
మూహమున పెద్ద గగ్గోలు – "మూర్ఖు డెవడు?
త్రాగుబోతెక్క?" దను పెను రంకెలపుడు.

తే. అచటి వారల రక్తారుణాక్షి యుగము
లెల్ల మిరుమిట్లు గ్రక్కుచు నేగెనొక్క
దెసకు – నిలచె మాధవుడు తాదిక్కుతోచ
కచట ముఖమెల్ల వెల్లనై ఆత్మలోన.

తే. తప్పు గ్రహియించినట్లుగా – 'తన్నుడతని
చీల్చి చెండాడు' డను స్వామి శిష్యకోటి
మాటలకు స్మృతి వచ్చెను – మందలించి
పలికె నిట్లు నిత్యానంద భక్త మూర్తి.

తే. ఆగ్రహింపకు డిటు మనోహరున కితడె
పరిచయము చేసె నీ మధుపాత్ర కలన
ఇతడె నా ఆప్త బాంధవు డితడె సఖుడు
ఈ మహా జనమందునా కితడె ప్రియుడు. 22

# క్రొత్త చుక్కాని

మ. ఇదిగో తెచ్చితి నేఁటిభారతముఁ జూపింపంగఁ జుక్కాని క్రొ
త్తది ఇందు న్గల బొమ్మలెల్ల సరిక్రొత్తల్ – రండు. చూడంగ మీ
మదిలో నిల్చిన మాంద్యము ల్తొలఁగి సమ్యగ్దృష్టి చేకూరు క్రొ
త్తది. మీ మీ బ్రతుకుల్ సురాలయమహోద్యానంబు లై వెల్గెడిన్.

మ. పదమూఁ డేండ్లుగ నీ ప్రణాళికల సంభావించి యుత్పత్తి పెం
పొదపన్ జీవనసౌఖ్యముల్ ప్రజలకున్ బొందించి సంక్షేమ మె
య్యది యార్జించి నవవ్యవస్థ నెటు లయ్యా! మీ ప్రజానాయకుల్
యెద లుప్పొంగ ఘటించిరో కనఁగరండీ! మీరు మీ రెల్లరున్.

ఉ. రెండుగఁ జీలె రాజ్యము: దరిద్రత, దుర్భరవస్తులోపముల్
దాండవమాడుచుండెను స్వతంత్రము వచ్చిన క్రొత్తరోజుల
న్మెండుగ నెక్కి యాధరలు మిన్నులపైఁ గొరియారణోద్ధతిన్
గుండెలఁ జీల్ప ధైర్యమును గోల్పడసాగిరి పౌరసంతతుల్.

మ. అపు డేతెంచిన దీప్రణాళికలలో నాద్యమ్ము సామాజిక
వ్యపదిష్టార్తులఁ జక్కదిద్ది, నవరాజ్యస్వేచ్ఛఁ గాపాడి, స
ర్వపరాధీనతల న్దొలంగుటకు నారంభంబుఁ గావించి నే
రుపుతో నభ్యుదయమ్ము – గూర్చుటకునై రూపొందె స్ఫూర్తితో.

చ. ఇదియె ప్రణాళికా సమితి. ఇందలి వ్యక్తులు సర్వశాఖలం
గొదవతన మ్మెఱుంగని యకుంఠితవిజ్ఞులు. నంచితవ్రతుల్,
మదిఁ గని లక్ష్యముల్ కలుగు మార్గముల న్దిలకించి తొల్త రూ
పొదవిన యా ప్రణాళికల నొక్కొకటే మన కిత్తు రిట్లుగన్.

శా. ఆయారంగములందు సాగె కృషి యత్యంతమ్ము, పెంపొందె జా
తీయాదాయము. కాని, వింతయగు వృద్ధిం జెందలే దా ధరల్
పాయల్సాగెను సస్యలోపములు, నాపై విద్యుదుత్పత్తి హె
చ్చై యార్జించితిమయ్య యన్యమగు విస్తారంపు సంపత్తులన్. 6

చ. మొదటి ప్రణాళి కిచ్చినది ముఖ్యములైన వినిర్మితుల్ గనుం
డిది మన 'చిత్తరంజ' నిటనే మనవారలె ఇంజినుల్
ముదమున శాస్త్రపాండితి సముజ్జ్వలబుద్ధి సృజించుచున్నవా
రిదె కనుఁడయ్య రైళ్ళ కిట నింజిను లెల్లను బుట్టు నీగతిన్.

చ. ఎరువుల 'సింధ్రి' యిద్ది. ఇటనే ఘనశక్తి ననూన వైఖరి
స్ఫురువపు విజ్ఞు లేగతిగ బంగరుసస్యసమృద్ధికోసమై
యెరువు తయారొనర్చి మన కిత్తురు. చల్లిన వీనిఁ గొంతగా
గరవలఁ జౌటిమాగిలులుఁ గమ్మనిపంటలు ముమ్మరమ్మగున్.

శా. అస్త్రావిస్తము మాని చూడుఁడివి యయ్యా! మున్ను లేనివ్వి, 'హిం
దూస్తాన్కేబిలువర్క్సు' ఉన్నయది యా దుర్గాపురం బందు, వి
న్యస్తంబయె 'విశాఖ' నిద్ది కనుఁడీ నౌకాశ్రయంబున్, మది
న్పస్తాయించుచుబెంగులూరు టెలిఫోన్ఫాక్ట్రిన్ దీనిఁజూడందగున్.

చ. ఇది కలకత్త మైసురుల నేడ్తెఱఁ గట్టిన వీనిఁ జూడుఁడీ
సకలములైన శ్రామికుల సాధనల, న్ఘనవైద్యవృత్తికి
న్ప్రకటితశస్త్ర సంతతి. నివాసగృహంబలుకు న్మహో
పకరణముల్ సృజింపఁగ జవమ్మున సాగెడి యంత్రశాలలన్.

శా. ఈమై నార్థికవృద్ధికి న్సలుపఁగా నిచ్చం గృషి న్గొంత నా
నా మార్గంబులఁ దోఁచె నభ్యుదయ మన్నల్లార! ఈ భారత
శ్రీమంతస్థితి హెచ్చె. లోకమున నక్షీణ ప్రజాస్వామికం
బై మాన్యత్వము నొందు దేశ ధీమా కల్గెఁ జిత్తంబునన్. మున

చ. అదె కనుఁడయ్య 'లోకసభ', యందు మహాత్మున కంజలించి పె
పొదవెడు నామహోన్నతుని యుజ్జ్వలబోధలఁ దృష్టినిల్పి సం
పదలను వృద్ధిసేయ మనభారతరాజ్యము సోషలిస్టు రీ
తిది యగు స్వర్గమట్టులుగ దిద్దుదమం చిటు జిహ్వ లాడెడిన్. 12

ఉ. "ముప్పదినూర్ల కోట్లు ధనము న్దొలిసారి వ్యయించిన న్గనం
గొప్పగ మార్పు వచ్చుటకుఁ గొంచెపు దేశమె? సంఖ్యయన్న నో
యుప్పెనపొంగు లట్లుగను నూరక పొంగుచు నిల్వ – దల్పమే
యొప్పుగఁ గూడు గుడ్డ 'ప్రతియొక్కరికి' న్దగ విద్య నిచ్చుటల్.

శా. శ్రేయోరాజ్యముగా ఘటించితిమి, నిశ్రీకమ్ము దేశమ్ము, లే
దీ యధ్వశ్రమమందు శ్రాంతి మన కిం కేనాఁడు యుద్ధాతురో
పాయజ్ఞుల్ వలె నుండఁగా వలయు, నవ్యప్రక్రియ స్దీర్చి యే
నీయజ్ఞానపుసంఘముల్ మలతుఁ బొందింప స్జనక్షేమముల్".

మ. మన నిర్దేశకసూత్రపాళి నెద నమ్మానించుచున్ విస్తృతిం
గని యా రెండవదౌ ప్రణాళిక మహాగంభీర గయ్యాళితోఁ
జనుదెంచెన్ బెలుచై. పరిశ్రమలు రాజ్యద్రీతిఁ బెంపొందినం
తన నుద్యోగికళాతముల్ పెరిగె నుత్సాహమ్ము దీపింపఁగన్.

శా. ఆరోగ్యంబును, నన్నముల్ వలయు నిత్యార్థంబులం గూర్పఁగా
నా రూర్కేలను, రాంచి, ట్రాంబె జలహళ్ళందున్, భిలాయీలొ, కో
లారందున్, హతియాకడన్ మఱియు నా ప్రాంతాల నెన్నింటినో
భారీయెత్తున సృష్టియైన నవిగో, ప్రాజెక్టు వీక్షింపుడీ!

మ. అల సీమెంటుకు, బొగ్గకున్ జమురు కాయారీతి లోహాల క
వ్వల సైకిళ్ళకు, కుట్టుయంత్రములకున్, పంకాలకున్. డీడిటీ
జలయంత్రాలకు, కాగితాలకును నా సల్ఫాల కిత్యాదికిం
గల మాంద్యమ్ములు సన్నగిల్లి జనసౌఖ్యశ్రీరహించెన్ దగన్.

మ. నలుమూలల్ గన హెచ్చు నిట్టుల రవాణాతంతి సౌకర్యముల్
తొలఁగె న్లోపము కార్లకున్ బలిసె విద్యుచ్ఛక్తి. 'టెల్ఫోన్లకు
గలిగె న్పెంపిఁక రేడియో నిలిచిఁ గుగ్రామాలలో, నౌకలున్
వెలసెన్ 'సింధియ' కంపెనీకడను – వీనిం జూడుఁడీ వేడ్కమై. 18

మ. వ్యవసాయంబున గల్గినట్టి యరుదౌ వ్యాప్తిన్ గనన్వచ్చు మీ
రివి గన్గొన్న, జపానుసా గిదియె. ఇవ్వే క్రొత్తనాగళ్ళు, మీ
రవధానంబునఁ జూడఁగా దగును ఘోరారణ్య విచ్ఛేదనం,
బవల న్వచ్చెడు చిత్రముల్ దెలుపు నుద్యానాభివృద్ధిన్ దగన్.

మ. తమితోఁ జూడుఁడు కృష్ణ, కోసి ఇవి భద్రా, పెన్న, పాలారు లు
ద్యమవృత్తి న్దగపొంగి యిట్టి నరు లాయా ప్రాంతదేశమ్ములం
దమితార్తి న్గలిగించు. కట్టిరి గదయ్యా! భక్ర, నాంగల్, సిలే
రు, మలంపూజలనందు డాములను నేర్పులమీఱ నెన్నింటినో.

ఉ. శ్రామికరంగమందునఁ బ్రశంసల నందిన మార్పు వచ్చె నీ
భూమిని మున్ను లేని సుఖముల్ గలిగింపఁగ జీవితంపు బీ
మా, మరి వృత్తిచట్టములు, మంచిప్రసూతి గృహంబు, లుర్వి నిం
కేమి ప్రసిద్ధ దేశముల నేర్పడెనో యవియెల్లఁ జేకురెన్.

శా. సద్యోమోదము నిచ్చు బొమ్మ లివి, దేశంబందు సర్వత్ర పె
న్విద్యావ్యాప్తి ఘటిల్లె స్త్రీలు, పురుషుల్ విఖ్యాత సాంకేతిక
ప్రద్యుమ్నోజ్జ్వల విద్యలన్ బ్రబలభాస్వత్రైన్యవిజ్ఞాన, మ
వ్వైద్యామ్నాయము నెట్లు నేర్చెదరొ గర్వారూఢిఁ జూడందగున్.

ఉ. బానిస లైన యంత్రముల ప్రాపున పౌరులయాత్మశక్తియే
మౌ నని సందియంపడకుఁ డద్భుతదోహద మిచ్చి భావనా
నూనమనోజ్ఞనైపుణుల నొప్పుగ దిద్దుచు నీ ప్రభుత్వ మెం
తైన వివృద్ధి నేనెఁ గనుఁడయ్య కుటీర పరిశ్రమస్థితిన్.

శా. మళ్లా వచ్చెదఁ గ్రొత్తబొమ్మలతో, నీమైఁ దెత్తుఁ గ్రొంగొత్తలౌ
కళ్ళద్దాలనువాని పెట్టుకొని మీకన్నుల్ బలే క్రొత్త పో
కిళ్లన్ బోవునుపో, మరింక సెలఁవేగెన్ బ్రొద్దు, నన్నంపుఁడీ!
మేళ్లన్దెత్తు, నమస్తే మీకు మరి స్వామీ! మీకు మీ కియ్యదే. 24

***ఎ.ఐ.ఆర్. విజయవాడ***

# ద్వాదశలింగ స్తోత్రము

శా. సౌరాష్ట్రస్థిత సోమనాథు, విలసత్సౌదామనీ దివ్య శో
భారమ్యాలయు, లోకరక్షణ వ్యాపార శుభ లీలారతున్,
తారానాథ కళావతంస సుభగున్, తత్త్వార్థ భక్తి ప్రదున్
జేర న్నే శరణంబు గైకొనెద వాసింగన్న జ్యోతిర్మయున్.

మ. విబుధాసంగ తులాద్రి తూగ గృహ, మ్మర్వీధ్రమ్ము శ్రీశైలపు
బ్రబలోద్యత్ఘన శృంగకేళి భ్రమరాంబా ప్రీణ నాహ్లాదషా
డబ పీయూష రసార్ణవోజ్జ్వలుని, నొడ్డారంపు సంసార సే
తు బహూపజ్ఞుని మల్లికార్జునుని గొల్తున్ బ్రీతి కైమోడ్పుతో.

మ. ఘనమై యొప్పుచు నయ్యవంచిపురి ప్రాకామ్యత్వ వాల్లభ్యము
మొనపు న్సజ్జన కోటికిన్ పరమమౌ మోక్షంబున, రక్షించు తా
తన భక్తావళి, అకాల మృత్యుకృత సంత్రాసమ్ము పోద్రోలి
యని రక్తిన్ పరమేశు వేడెద భయాహర్తన్ మహాకాళునిన్.

శా. కావేరీ ఘననర్మదా ప్రణయ విఖ్యాతంపు కూటస్థలిన్
ప్రావీణ్యంబున నొంటియై మహిత మా మాంధాతృరాజత్ప
దేవాగారమునన్ వసించి సుజనోత్తీర్ణ క్రియా కీర్తియై
కైవారమ్ముల నొందు నీశ్వరుని – ఓంకారేశ్వరుం గొల్చెదన్.

మ. ఇలపై ప్రజ్వలికానిధానమున నయ్యాశాన్యదిగ్భాగ మం
జులసీమన్ గిరిజాసమేతుడయి – సంశోభిల్లు మృత్యుంజయున్
ఫలసంధాయకు వైద్యనాథ భవుదీవ్యద్దేవదైత్యార్చితో
జ్వలపాదాబ్జ, హృదబ్జ మిచ్చుకొని భాస్వద్భక్తి సేవించెదన్.

శా. అక్షయ్యంబగు భక్తి వచ్చి వడిపై నా శాకినీ ధాకినీ
రక్షో భూతపిశాచముల్ సుమ సమర్చల్ సేయ రాగిల్లి లో
దాక్షిణ్యంబునఁ బ్రోచు భక్తహితమందారున్ మహాదేవు, ఫా
లాక్షున్ వేడెద భీమ శంకరుని లీలాతాండవాటోపునిన్.

శా. పారావారసు తామ్ర పర్ణితటినీ భాస్వత్సు సంయోగ సు
శ్రీరమ్యస్థలి రామభూవిభుడు పత్రీ సేతువు న్నిల్పి యే
పేరుకున్న ప్రతిష్ఠ సేసి కొలిచెన్ విశ్వే శు నెవ్వాని నా
శ్రీరామేశ్వరు నీశ్వరేశ్వరుని సుశ్రీయుక్తు సేవించెదన్.

శా. సౌరాష్ట్రమ్మున యామ్య సీమ మహిత స్ఫాయత్ సదంగంబునన్
సారాలంకృత సర్వదేహుడు మహా శౌండీరు డౌ భోగి యై
ధీరప్రక్రియ భక్తి ముక్తు లిడుచున్ దీపించు నే శంభుడా
హేరాళోజ్జ్వల నాగనాథు శరణం బే నొందెదన్ రక్షకై.

శా. తానెవ్వేళ, ననాథ నాథుడయి, భక్త వ్రాత పాపఘ్నుఁడై,
యానందంబను కాననమ్మున మహాహ్లాదాను భోగంబుచే
నానందాద్భుత కందమై, పరగు నార్యానాథు, వారాణసీ
శ్రీనాథున్, ఘనవిశ్వనాథు, గొలుతున్ శ్రేయోర్థినై నిత్యమున్.

మ. ఘన గోదావరి మూలదేశమున, విఖ్యాతంపు సహ్యాద్రిపై,
తను, దర్శించినవారి పాతకములన్, తర్జించి, భర్జించి, పెం
పున, వేవేగ హరించి, బ్రోచు, ప్రభు, శంభున్, త్ర్యంబకేశ్వరుని
వినుతింతున్ పరమానురాగమున కావింపన్ శుభంబుల్ దమిన్.

శా. తాదాత్మ్యంబున, మౌని దేవ దనుజోధ్యక్ష నాళావళుల్
పాదాబ్జంబుల జేరి, కొల్తు రెవరిన్ భక్తిన్, భవుం, డెవ్వ డా
మోదంబొప్ప మహాద్రి పార్శ్వతటి సత్పుణ్య ప్రదేశంబునఁ
కేదారమ్మున, కొల్పు తీర్చె, నతనిం గీర్తింతు నత్యంతమున్.

గారామొప్పెగ, నత్యుదారగుణ విఖ్యాతిన్, జగద్వంద్యుడై
రారాజై, భువిలో నిలాపుర పవిత్రక్షేత్ర రమ్యస్థలిన్
ధీరత్వంబునఁ బ్రోచి భక్తతతి సందీపించు ఘుశ్మే శ్వరున్
నేరక్తిన్ శరణంబు నొందెద మహానిశ్శ్రేయస ప్రాప్తికై.

తిరమై పోల్చెడు ఈ స్తుతిన్ వలచి జ్యోతిర్మూర్తులౌ ద్వాదశి
స్థిర లింగంబుల గొల్చి శంకరుడు, తాఁజెవ్వెన్ మహాభక్తి
నరు డిద్దాని పఠించునో యాతడు కృణ్యంబైన సాలోక్య
స్ఫుర ఉద్దామ పదంబు తత్ఫలముగా శోభిల్లు నత్యంతము 13

*(ఈ పద్యాలను శ్రీరామ & కో ప్రొప్రయిటర్ ప్రత్యేక గ్రంథంగా ముద్రించినారు)*

# విప్రయోగము

ఉ. మిన్నుల డాగినన్ రిపునమేయ రణోజ్జ్వల విక్రమంబు సం
పన్నిజ బాహుదర్ప విభవంబున లోకము లెల్ల మెచ్చ న
భ్యున్నతి నాహరించి కదనోర్విని నుర్విజనొందుపూన్కి నే
మున్నొక విప్రయోగము నపూర్వముగా భరియించితిన్ గదా!
(.....)

చ. ప్రసవ శరాసనా! యిటుల భద్ర మెఱుంగక క్రుమ్మరింతొ నీ
యసమసుమాశుగ ప్రతతి నంతయు నాపయి నొక్క పెట్టు ము
న్నసువులు తీయలేక భవుఁడాకృతిఁ గైకొనె కాని నేను నీ
యసువుల నాహరించెద త్రియంబక చాప విభగ్న శౌర్యుఁడన్.

మ. ప్రకటారి ప్రభలాసు పాన విశిఖ ప్రఖ్యాతిఁ గైకొన్న నా
కొక బాణ మ్మొకమాట యంచు వినవే ఓ గంధవాహా భవ
ద్వికటారంభ విజృంభమాణ పటు విద్వేషమ్ము చాలింపుమా!
ఒక యాకారము నీకు కల్గమియు నాకో యడ్డుగా దెన్నఁడున్.

ఉ. ఉల్లము నాపయిన్ నిలుపు మోక్షితిపాల శిరోవతంస! ఆ
యల్లక శోకలగ్న వివశాత్ముఁడనై మునుపెన్నఁడైనను
త్ఫుల్ల శరత్శశాంక రుచితుందిల సుందరకీర్తివైన ని
న్నొల్లని పల్కుపల్కిన దయోదధి నీకిదె యంజలించెదన్.

ఉ. భువన జనప్రసిద్ధమయి పోల్చిన యిష్టికి సత్ఫలంబుగా
దివిజులు మెచ్చి యిచ్చిన త్వదీయ సుతుండను తండ్రి! నేనె నీ
నవజలదాభిరాముఁడను, నాక పతి ప్రియ నీలదేహుఁడన్
ప్రదిమల శీల సీత నెడబాసి ధరించితిఁ బాండురత్వమున్. 6

ఉ. ఈ పరమార్తి విహ్వలత యెంతటిదో, రమణీ వియోగ బా
ధాపరితప్త దేహుఁడవు తండ్రి! యెఱుంగుదు వీవు, కల్గదే
నాపయి నీయెడఁద నయినన్ దయ కోసల సార్వభౌమ! ఏ
నోపగఁజాల నింక విరహోజ్జ్విత తీవ్ర విదాహ వహ్నులన్.

శా. నీవాల్లభ్య మెఱింగియున్ వనులలోనే డించి రమ్మన్న వేఁ
'డీవే భర్తవు, విప్రయోగ మది లేనే లేదు నీకెన్నఁడో
దేవా!' యంచును జెప్పి పంపితివి ఇంతీ! నాకు నీ పల్కునా
లో వైక్లబ్యదవాగ్నులన్ నిలిపి కల్లోలమ్ములన్ రేపెడిన్.

చ. "అరిగెదనే తపోవనుల కచ్చట శాంతి లభించు నాకు నో
భరత! యొనర్తు నిన్ను జనపాలుని" యన్నను మ్రొక్కి "ఇద్ది నీ
తిరమగు నిశ్చయమ్మయిన దేవ! వినందగు, వీడికాన కీ
వరిగిన వేళ నా దశశతాంగున కైనది నాకు నౌ" ననన్.

చ. ఇదివిని తల్లడిల్లితిని – ఏ వెనుకాడితి పిల్వ లక్ష్మణున్
మది వికలమ్ముగాఁ గటుకు మాట మరేమనునో, భరింపలే
కెది యొనరించునో యను నహీన భయమ్మున నిట్టి తమ్ములన్
మదిఁగన నేరులైనయవి మామక దుఃఖ మునశ్రు సంహతుల్.

# భావ కవిత

సీ. పరుని నాయకుఁ జేసి పలుక నొల్లను గృతి
నా ప్రేమకథలె వర్ణనమొనర్తు
వనిత నా చూపులో వలపు వస్తువు గాదు
దర్శితప్రణయాధిదైవతమ్ము
రారాజు చరితలు రక్తినీయవు నాకు
సామాన్యజన విలాసములె వలతు
కథకు నేపథ్యమ్ముగాఁ జేయఁ బ్రకృతిని
దద్వర్తనకు భాష్యతతి నొనర్తు 11

తే. ప్రణయతత్త్వమ్ము మిన్నగా ప్రకృతి తత్త్వ
మెరిగి కైతలు పాడఁగా నెదరహింతు
ఎన్న సౌందర్య వేత్తను – ఏ నపూర్వ
భావకవిఁగాను ఏ స్వయంభావ కవిని. 12

# విన్నపాలు

శా. చిత్రమ్మో ప్రభు! నీదు జీవితము నీచే పుట్టు విశ్వమ్ము నీ
నేత్రాగ్ని చ్ఛటలన్ దహింపబడు – కానీ ఆది దేవుండ వే
మాత్ర మ్మేనియు లేదు లక్ష్మి – తిరిపెమ్మా పోషణార్థమ్ము? – నీ
మిత్రుల్ భూత పిశాచ ప్రేతములె స్వామీ! యేమి? మృత్యుంజయా!

మ. సురలున్ శత్రులు జేరి వారినిధి నస్తోక ప్రమోదమ్ముతో
తరువంగా నుదయించె వారువము, కాంతారత్నమున్ రత్నమున్
సరి – ఆ ఇంద్రుడు శౌరి పుచ్చుకొని రీశా! నిన్ను కాదంచు – నీ
కెరుకే లేనటు లెత్తి వచ్చె విషవహ్ని జ్వాల మృత్యుంజయా!

మ. మునులా ఊరను లేరు, స్త్రీ ప్రకృతి ఏమో మోసమౌనంచు నీ
వనుకొన్నావు పదే పదే – మరల మోహా విష్టలౌ వారె భా
మిను లామౌని పురంధ్రులం చరుగగా భిక్షాటనార్థమ్ము – నీ
కెన లేనట్టి ప్రమాదమయ్యె – విధి నిన్నే వేచె మృత్యుంజయా!

మ. అదయాలింగన పార్వతీ ఘన కుచార్ద్రా లిప్త పంకంబుతో
కదియన్ దేవ! త్వదీయ భూతియెడ వైక్లబ్యంబు నీకేల న
య్యది కల్పించెగదా! మనోహరికి దివ్యా నంద – మీశాన – నీ
కది యానందము గాదె, సత్రపణయ రూపౌజ్జ్వల్య! మృత్యుంజయా!

శా. ఈ స్వాతంత్ర్యము లేని జీవితములో నెన్నాళ్ళు ఖైదీనొ, నా
పై స్వేచ్ఛా పవమాన వీచికలు వీవన్ రావు కాబోలు నీ
భాస్వద్రూప విలాసహాస శుచి శోభల్ ద్రావి కైపెక్కి స్వా
మీ! స్వాధీనత తప్పనొక్క త్రుటి ఏమీ! లేదె మృత్యుంజయా!

శా. ఎన్నో జన్మలు వ్యర్థమైనవి గదోయీ స్వామి, నీ సేవకున్
తెన్నుంగానని యీ నికృష్టుడిక నింతే దుఃఖ వారాశిలో
మిన్నుల్ ద్రన్నెడి వీచి కావళుల కుంభీ భూతుడౌ – లేదు, సం
పన్నం బైన త్వదీయ పాద మధు వాస్వాదింప మృత్యుంజయా! 6

శా. నందీశత్వము కోర భృంగిరిటు నన్యాయంబు కావించి నా
కందిమ్మా ప్రమథాధిపత్యమని నిన్నర్థింప భూతేశ! ఆ
నందౌ ద్ధత్యముతో దినాంతనటనా నన్ మ్రోయు ఢక్కాగళం
బందే నొక్క గభీర నిక్వణముగా నాశింతు మృత్యుంజయా!

శా. ఎన్నో పుణ్యము లాచరించిననె – గా నీ రాదు ఈ జన్మ యో
అన్నా! పూర్వపు దుష్కృతమ్మునను నా కయ్యెన్‌గదా యిట్లుగా
పన్నన్ దుల్లె కిరాతజాలకములన్ పక్షంబులో స్వామి! నీ
విన్నాణంబులు చూడగా నెగుర నీవే నన్ను మృత్యుంజయా!

మ. తలలో కోతులు కొండముచ్చులకునై స్థానమ్ము కల్పించి యూ
హల నొక్కుమ్మడి పారద్రోలితిని మాయాదండమున్ బూని నీ
బలమున్ గ్రాదని నిల్వగా దగినదే ప్రాయమ్ము – దోషమ్ములే
పలికెన్ మామక వల్లకీ శ్రుతులు దేవా! నేడు మృత్యుంజయా!

మ. కవినో కానొ యెరుంగ పండిత కవుల్ కాదన్న జోహారు మా
కవిమిత్రుల్ కవివన్న నుబ్బి యట చీకా కేను కానయ్య నా
కవితల్ గావివి ఆర్ద్రముల్ హృదయరక్తాంభోజ సంవాసముల్
భవదీయాంఘ్రి సరోరుహ ద్వితయ సౌభాగ్యాలు మృత్యుంజయా!

మ. అరయన్ బ్రాహ్మణ వంశజాతుడను గాయత్రీ జపోక్త క్రియా
కరణం బందున బుద్ధి నిల్వదిక నే కైమోద్వ భక్తుండనై
ఎరుగన్ జ్ఞానపథంబు లాస లిడుదున్ హేమంత నీహార బం
ధురమౌ నీదు నివాస సంపదకు నెందున్ స్వామీ మృత్యుంజయా!

శా. ఈ సృష్టి స్థితి నాశనమ్ములకు నీవే మూల మెన్నాళ్లొ మే
మీ సర్వాగమ శాస్త్ర చర్చలను మా ఇచ్చాను సారంబుగా
నే సాగించిన తేలె నీ విషయమే – ఈశాన! అవ్వానిలో
నే సామీ నినుగొల్వ ముక్తి! గనలేమే! తండ్రి మృత్యుంజయా!

శా. అంతా వ్యర్థము కాదు కాదు పెను మాయావల్లియున్ గాదు – అ
త్యంతంబైన త్వదీయ దివ్య మహిమం బయ్యా మహాదేవ! ర
వ్వంతాలోచన చేసి చూడవలె సర్వం బీవె యౌదోయి! నీ
కెంతానందమొ యిట్టు లాడుకొన స్వామీ! తండ్రి మృత్యుంజయా! 13

**ఆశాజ్యోతి**

# కృష్ణరాయలు, తిమ్మరుసు

శా. "శ్రీరుద్రమ్మిది, లంకనుండియె యశశ్రీరాజ్యముం జేయు మ
న్నా రామా!" యనఁ దమ్ముఁ "డొల్లనిది స్వర్గం బైననొల్లన్, సురా
గారం బేన్ సరిరాదు జన్మభువికిన్ కన్నమ్మ కం"చాడు సీ
తారామాపతి కృష్ణరాయ నృపతిన్ ధర్మ ప్రభున్ బ్రోచుతన్.

ఉ. పాయని యుక్తి స్వః ప్రజల, భండన శక్తిని శాత్రవాళి, ని
శ్రేయస భక్తి దేవతల, చిత్తజరక్తి వధూగణమ్ము, రా
ధేయత యాచకావళి, విధేయత విజ్ఞులఁ దన్పి వెల్గు నీ
రాయలవంటి రాజు కనరాఁడు గదా యెట రాజమండలిన్.

చ. దయయని లేదు శాత్రవ విదారణ కేళుల కృష్ణరాయ! లో
భయపడెదీవు భామినుల ప్రౌఢ కటాక్షము తప్పెనేని, అ
వ్యయమగు నీ గుణ ద్వితయ మా నెఱజాణను, కీర్తికామినిన్
ప్రియ నొనరించి పంపె విహరింపగ త్వద్భుజ పంజరంబునన్.

శా. లేరెవ్వారలు ధైర్యధుర్యులగు నుర్వీనాయకుల్ ధర్మమం
దారవ్రాతము రక్షసేయుటకు నుద్యన్మేరువుల్, భూమి భూ
దారుల్ మీ ఘనవంశజన్ములె దయాధారుల్, విరూపాక్ష కే
దారాధీనులె నేఁడు దేశమున కాధారమ్ము చర్చింపఁగన్.

సీ. ఏ మంత్రిమణి నిజస్వామి కార్యక్రియా
తత్పర మానసోత్సాహశాలి,
ఏ మంత్రిమణి మిత్ర హితబాంధ వాశ్రిత
ప్రకర రక్షణ కళాప్రౌఢబుద్ధి,
ఏ మంత్రిమణి వచోహేలాతి నైర్మల్య
శీతలతాధూత శీతరోచి,
ఏ మంత్రిమణి సుధాధామ, శాంభవధామ
ధాళధళ్య సుతుల్య ధవళకీర్తి,

తే. అట్టి మంత్రికులోత్తంస మహిత నృపతి
పటల మకుటాగ్రఘటిత తత్పద్మయుగళ
సకల సామ్రాజ్యరక్షా విచక్షణుండు
దీన సురశాఖి సాళువ తిమ్మమంత్రి.

చ. "స్తుతమతియైన వాడు కవిధూర్జటి - నిండెను వాని వాక్కులం
దతులిత మాధురీ మహిమ?" యంచును లోకము మెచ్చె - నం చు నను
చితమును, ముగ్ధ మీ గుణ విశేషము కల్గెను నాకు పార్వతీ
పతిపద మంజులాబ్జ మధుపాన మధువ్రత మత్తతన్ రహిన్.

చ. "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలఁగల్గె నీ
యతులిత మాధురీ మహిమ?" హా, తెలిసెన్ భువనైక మోహనో
ద్ధత సుకుమార వారవనితా జనతాఘనతాప హారిసం
తత మధురాధరోదిత సుధారస ధారల గ్రోలుటన్ జుమీ!

చ. "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలఁగల్గె నీ
యతులిత మాధురీ మహిమ" ఔ తెలియందగు లోకమోహనో
ద్ధత సుమసాయక ప్రబలతాప హరోజ్జ్వల పూజ్యపార్వతీ
పతి పద మంజులాబ్జ మధుపాన మధువ్రతుఁడై చెలంగుటన్"

ఉ. నెయ్యముతోఁ ద్రిలోకజననీ జనకులే మది మెచ్చి యిచ్చుటన్
దియ్యని చూపు చూచి, సముదీర్ణ మహార్థములర్థినిచ్చి, సా
హాయ్య మొనర్చి, కీర్తిలతికావళి దిక్కులఁ దావి నింప బా
లయ్య మహోదయున్, గను, మహాశయు, దేశిక వర్యుఁ బ్రోచుతన్.

# గాథలు

తే. గాథలల్లోన గేయాల గతుల, వీణ
పలుకులందున ప్రోడలౌ పడతులందు
కలుగు నుత్తమ రసమును గానలేక
అవని బ్రతికెడి వారల కయ్యదియె శిక్ష.

తే. ఊది గాలిని నోటితో నోయి కృష్ణ
రాధ కన్నుల నలకల బాధ తీర్చి
గోపికల గౌరవమ్మును గూల్చినల్ల
దనము స్వచ్ఛత పోగొట్టదగునె నీవు?

తే. "ముద్దుబిడ్డఁ డిప్పుడును దామోదరుడు"
అనుచు ప్రీతితోడ యశోద అనినయపుడు
కృష్ణుని ముఖములోన వీక్షించి ఎల్ల
గోపికలు నవ్వుకున్నారు గూఢముగను.

తే. అచటి గోపికలందలి ఒక్క నిపుణ
ప్రక్క గోపిక కడజేరి ప్రౌఢముగను
రమ్యరీతి నాయమ కపోలమున తోచు
కృష్ణు ప్రతిబింబమూర్తి చుంబించి చనియె.

తే. కాననముల జనించు దావానలంపు
పొగను నల్లబడిన వింధ్య నగము శ్వేత
జలదముల క్షీర సాగర చారు మధుర
మహిత దుర్ధారుడౌ మధుమదను బోలె.

తే. అప్రియాధర మధుర సమాస్వతి రుచు?
భాగ్య మబ్బక పోవుట వలన నేమొ?
తెచ్చుకొన్నారు దేవతల్ తృప్తివడగ
రమ్య మమృతమ్ము రత్నాకరమ్ము నుండి. 6

తే. మచ్చలేనట్టి చంద్రబింబమ్ము సూర్య
బింబమును జేరి మిగుల శోభించునట్లు
వక్షమున నున్న ఘనకౌస్తుభమ్ము నందు
లచ్చి మోమున్న విష్ణుని మెచ్చి కొలుతు.

తే. అంటుకొన పిండి తెల్లగా నొంటినిండ
కర్షకుని పుత్రి పథికులు గాంచు చుండ్రి
క్షీరసంద్రమ్మునుండి పై జేరి లచ్చి
దేవతలు చూచునటుల సంతృప్తి తోడ.

తే. పరమ రతి గేహమున నున్న పంజరమ్ము
లోని శుకమును తొలగింప బూనవేల
అత్త, ఇంకొక చోటికి? అది రహస్య
వచనముల చాటుచుండె ప్రపంచమునకు.

తే. వర్ణములు లేక గీతలవలన చిత్రి
తమయి ఉన్న పటముననె తనదుప్రియను
ప్రియుడు క్షణకాల మేనియు విడువలేక
యున్నవాఁడెంత చిత్రమో యూహ చేయ.

తే. ఆమె ఆనవాలు మరచి, అచట పాతి
పెట్టి మరచిన వానిగా వెదుకుచున్న
దట్టి ఆ వెదురు పొదల యందు నిన్ను
అడుగడుగునను నదె మహార్తి తోడ.

తే. నీవు కనుపింతు వంచును నిర్దయుండ
ఆశతోడ నింటింట వాయనము లెల్ల
లెక్కపెట్టుచు నిచ్చు చాలేమ అదిగొ
తిరుగుచున్నది ఎంతయో తీరికగను. 12

తే. గంతులేయుచు పరుగెత్త గలుగు జనుల
యమిత కలకలనాదాన (నొప్పి) అధిక ఘోష
లొసగు తూర్యాలనొప్ప నీయుత్సవమ్ము
అతడు లేకుంట గ్రామ దాహమ్ము బోలె.

తే. ఆమె నుత్ఫుల్లిక క్రీడ నాడునట్లు
ఆడగా నిమ్ము జఘన భారాన్వితగుట
అంత సులభమ్ముగా లొంగనట్టిదగుట
కలుగదలచుట ఆమె కేకాలమందు.

తే. దేవలుడు నవలతికతో తెరవనప్పు
డెచ్చుటెచ్చుట తాకునో అచ్చుటచట
ఆమె దేహాన రోమాంచ మతిశయించి
కల్గుచున్నది – అద్దాని చూచినాను.

తే. అగ్నివర్ణుల మాహాత్మ్య మాచరింప
స్వర్ణమేఖల భవదీయ జఘన మెక్కు
టాదిగాగల సౌఖ్యాల ననుభవించె
అది ఇతరుడికి నెపుడు లభ్యమ్ము కాదు.

తే. ఫాల్గుణోత్సవ కాలాన పాపమడుల
తలపబడకుంట నిప్పు డో నెలంత బురద
నెవడొ నీపైన చల్లెను ఏల పరుగు
వారెదవు? మోమున, చనుల, కార చెమట.

తే. విప్పినాడు ప్రియుడు నీ కొప్పుముడిని
నోటను మధువు వాసనలూరుచుండె
సర్వమియ్యది మన్మథోత్సవమునందు
అగును నా బాస మిక్కిలి అధికముగను. 18

తే. ముష్టినిండుగ నొక రంగు ముగ్గు తీసి
ప్రియునిపై జల్లుదనుచు భావించె నెవతె
ఆమె ఆతనిఁ జూడఁగా నద్దియయ్యె
ముమ్మరమ్మగు గంధోదకమ్ము కరణి.

తే. వివసన గతిని గిరిజ గావింపబడగ
ఆమె సొగసుగ అక్షిద్వయమ్ము మూసి
కర కిసలయాల పరిచుంబ గ్రహణకేళి
మూయు – నళినాక్షి విజయమ్ము పొందుగాక!

తే. ప్రథమమున, మధు మదనుడు, వామరూప
ధారి జృంభించి బలిని బంధనమొనర్చి
నటుల ఈయమ స్తనయుగమ్మద్భుతముగ
ప్రౌఢముగ పొందె అవ్వలి బంధనమ్ము.

తే. కృష్ణ! సౌభాగ్య గర్వాన క్రీడ వోలె
గోకులమ్మెల్ల తిరిగెదు కోరి యెడద
స్త్రీల గుణదోషముల విచారించుటందు
తెలివి నేర్పున్న నట్టులె తిరుగుమయ్య!

తే. వయసు పెరుగగా నతని వివాహవేళ
దగ్గరకు జేరగా యశోదమ్మఁ జేరి
గోపికల్ ఆమెతో చెప్పుకొనుచు నుండ్రి
మధు మదనుతోడ వారి బాంధవములెల్ల.

తే. కలుష బుద్ధికి మరది వో కలువ కంటి!
ప్రతిదినమ్మును తమ గోడపైన చిత్రి
తమ్ము శ్రీరాము తమ్ముని ధర్మ చరిత
చెప్పుచున్నది యతని సచ్ఛీలుఁ జేయ. 24

తే. వెలసి యెది పానశాలను వెల్గు నగ్ని
అదియె వెలుగొందు పిమ్మట యజ్ఞశాల
అతివ స్థిత్యంతమును పొందినంతమాత్ర
పురుషులకు నిరాకృతి చేయబూనరాదు.

తే. వధువు కృత్రిమ సంతోషపటము నామె
చెలులు చూపింప జారుడు చిత్రగతుల
చిలిపి నవ్వులు నవ్వుచు వలపుటెరుక
చొచ్చుచుండగా మదిలోన జూచుచుండె.

తే. భర్త గావించు నను ధనుర్ధ్వనికి ఎదురు
చూచుచున్న ఓ బంధకి, సుదతి, ఇది అ
కాల మేఘ గర్జాధ్వని గాన వృథగ
పొందనేల రోమాంచమున్ పొలతి నీవు?

తే. మహిత వేదమగు చతుర్థి మంగళమ్ము
పిదప రాబోవు విరహ సంవేదనమ్ము
నూహగావించి కౌగిలి నొంద స్వేద
బిందువుల్ దంపతుల నేత్రబిందులయ్యె.

తే. "క్రొత్తగా వచ్చు పండ్లతో కొరికె కొడుకు
ఇదిగొ చూడుండనుచును ఇంతి పతికి
నవ్వుచును చూప తన బుగ్గ నాథుడధిక
రక్తియోజించి ముద్దిడె ప్రక్క బుగ్గ.

తే. లేడి ఒక్కటి కుడినుండి లీల వెడల
ఎడమవైపు ప్రయాణమ్మె ఎపుడొ ఆగు
అట్టి ఎడ మృగములు రెండు అరిగెనేని
ఆగకుండునే ఎట్టి ప్రయాణమైన? 30

తే. ఓసి వార్ధక్యమా! తుష్టినొందు మీవు
ఉత్సహించి నా తలక్రింద యువకులెల్ల
విఘ్ననాయకు దిండుగావించినారొ?
ఆ మహాత్మున కిప్పు డే అంజలింతు.

తే. చెలగి క్రీడగ తొండంపు చిగురుచేత
కడలి జలమెల్ల చేసి ఆకర్షణమ్ము
అంత జృంభించి బడబాగ్ని నాకసమ్ము
క్రమ్మ జేసిన గణపతి ఘనుని గొలుతు.

తే. కోపమున నెర్రవడుచు సంక్షోభపరచు
గౌరి ముఖ చంద్రబింబమ్ము ఘోరరక్త
వర్ణ జలజ విభ్రమ గొల్పు పరమశివు డొ
లికెడి మహనీయము జలాంజలికి నమస్సు

తే. కరము పైనున్న సర్ప కంకణము దూర
ముగ పతి, పశుపతియె నిల్ప ముద్దుచెల్లు
పార్వతిని గూర్చి సౌభాగ్యవతి యటంచు
పరిణయమ్మున చేసిరి భావనమ్ము.

తే. సంజవేళను నెత్తిన అంజలందు
కడగి ప్రతిబింబితమయిన గౌరి వదన
పద్మమును జూచి తా మంత్ర పఠన మరచి
పెదవులను త్రిప్పి హరుని సేవింతురీరు.

తే. పైకి లేచిన జ్వాల లపరిమితముగ
ప్రియుని మృతి దాక గాఢమాలింగనమ్ము
చేసుకొనుట జనించిన చెమటతోడ
పడతిచే నగ్ని అణపగా బడుచునుండె. 36

తే. మలయ పవనమ్ము తహ తహ చెలగు చుండె,
అత్త వెడలుట కొప్పుకో దవతలకిని
ఇంటిలో నున్న అంకోల వృక్ష మధుర
పరిమళము చంపుచున్న దపారముగను.

తే. జార ప్రియు చితాభస్మ సంస్పర్శవలన
అబ్బు సౌఖ్యమున శరీర మంత చెమట
పట్టుచుండుట నూత్న కాపాలికైన
ఆమె భస్మ లేపనము ముగియంగలేదు.

తే. బుద్ధ పదబంధనముజేయ బూనిక్రింద
ప్రేమ సాష్టాంగపడి యెదు భిక్షు సంఘ
మటుల శుకముఖములతో ఫలాశపుష్ప
చయముతో భూమి శోభా సుసమయమొందె.

తే. పొలము నెవ్వరితో నున్న భూమియందు
ఏలసఖి వంచి ముఖమిటు తేల్చెదీవు?
అదిగొ శనగచే నర్దళ మద్దబడిన
నర్తకీ ముఖమయ్యె నానంద మొసగ.

తే. ముఖమునను రంగు నేతిని పూసియుంట
ముక్కు నాల్క తగులనట్లు ముందుచాపు
నామె పెదవిని పెట్టిన యట్టి ముద్దు
మే మిపుడు స్మరియించు చున్నాము నేడు.

తే. స్నానవేళ రంధ్రాల కంకణములోని
చిల్లులందలి పసుపును చిత్రగతిని
వెదురు పుల్లతో, తమి, తీసివేయుచున్న
నాతి, ఎవని కృతార్థుని జేతు వీవు? 42

తే. తెరవ సుకుమారి అయ్యును తీక్ష్ణమైన
నేరెడి ఫల కషాయము చేరినట్టి
దుమ్ము ఈ అంగరాగ శేషమ్ముతోడ
వంటి నీరాడె గోదారి వద్దునందు.

తే. స్త్రీలు మంగళ గీతికల్ తృప్తి పాడి
వరుని వంశ ప్రశంసచే మరులు గొలుప
నవ వధువునకు వినుటతో వివశయగుట
మధుర మంజు మనోజ్ఞ రోమాంచమయ్యె.

తే. "నా వివాహ మంగళ గీతికా విశేష
నాదములు సమీపించు చున్నవి" యటంచు
యువకులతొ గూడియాడి ఆశించు చుండె
నదె వెదురుపొద ఎంతయో యనుచుతోచు. 45

# నాప నారసింగ

ఆ.వె. యుద్ధమన్న వీరుఁ డుత్సాహ వంతుఁడౌ
పిరికి వాని గుండె ప్రిదిలిపోవు
చా వొకండె రెండు చావులు గల్గినా
నమ్మవోయి చవట నారసింగ!

ఆ.వె. ఆలి విడిచి వేశ్య కర్పణంబైపోవు
నట్టివాఁడు రసికుఁ డౌనె తలఁప
అద్దె గుఱ్ఱ మెట్టు లగడితల్ దాటురా
నమ్మవోయి చవట నారసింగ!

ఆ.వె. కన్నులున్న తెరచి కనలేని దొరలకు
చెప్పుకొన్న వినఁగఁ జెవులు లేవు
కనులు చెవుల కుంటె కడుపుకుఁ జెప్పాలె
నమ్మవోయి నాప నారసింగ!

ఆ.వె. ఉన్న మంచివాని యుద్యోగమును దీసి
క్రొత్త 'మలప' కిచ్చు గుణము చూడ
కాకిఁ గొట్టి గ్రద్ద కర్పించినట్లౌను
నమ్మవోయి నాప, నారసింగ!

ఆ.వె. చందురుండు పొన్పు – పందిరి – యద్దంబు,
పద్మబాంధవుండు, పతక మణియె
యైన రావణుండు హతమారిపోలేదె!
నమ్ము మిద్ది నాప, నారసింగ!

ఆ.వె. ఆట వెలఁది మీద నభిమాన మేర్పడ్డ
నంటురోగములకు నడలరాదు
సంపెఁగ పొద – చుట్టు సర్పంబు లుండవా?
నమ్ము మోయి నాప నారసింగ! 6

ఆ.వె. తనదిగాని ధనము ధర్మమిచ్చుటలోన
బుద్ధి యెంతగానొ పుట్టు - నిదియె
యత్తగారి సొమ్ము నల్లుని దానము
నమ్ము మోయి నాప నారసింగ!

ఆ.వె. తెలివి నమ్మి, మరచి దేవుని సత్యాన్ని
మొరగి మెలఁగినంత జరిగి పోదు
అబ్బెగాదె హరికి నపుడు మేషాండంబు
నమ్ము దీని నాప, నారసింగ!

ఆ.వె. ఆలి సొమ్ము చేరి యబ్బగా భాగ్యమ్ము
భాగ్యమౌనె యద్ది భంగ పరచు,
గంగ నెత్తికెక్కి వంగఁజేసెను నీశు
నమ్ము మోరి చవట, నారసింగ!

ఆ.వె. చిత్తమంచుఁ జేరి జీవించువా రెల్ల
కడకు నిటుల మూషికాలు గారె!
పూని పౌరుషంబు పొగఁడగా నేర్తురు
నమ్ము మోరి చవట, నారసింగ!!

ఆ.వె. దైవనిందఁ జేయఁ దలపెట్టు 'త్వాష్ట్రుండు'
వేదనిందఁ జేయ వెఱచువాఁడె?
అమ్మ నెక్కువాని కత్తొక లెక్కయా?
నమ్ము మోరి నాప! నారసింగ!!

ఆ.వె. పెద్దలెవరు లేక పెండ్లి గాకుంటేను
షండుఁ డన్నపేరు సంక్రమించు
లంజె నొకతెఁ జేర్పరంకువాఁ డంటారు
నమ్ము దీని చవట! నారసింగ! 12

ఆ.వె. కుక్కతోక వంటి కొక్కెర బుద్ధికి
నక్క నడచు పుంత మక్కు వగును
సింహ మేగు త్రోవ చిత్తాని కెక్కునా?
నమ్ము మోయి చవట! నారసింగ! 13

# నేను కవిని

తే. నేను కవిని పూజారిని నేను నిరత
మమృత సౌందర్య దేవీ శుభాలయమున,
అమల కమనీయతా గీతు లాలపింతు,
అర్థి నెఱిగింతుఁ బ్రణయ రహస్యములను.

చ. ఎనసి వసంతు నేత్రముల నేడ్తెర నిండిన హర్షబాష్పముల్
కనుగొని ఆశయున్ వెలుగు క్రమ్మర న న్నడిపింపఁ జేతు జీ
వనమును – భావ వీథుల నవారణ విశ్వము సుట్టివత్తు నే
ననయము చంద్రుఁ డీ భువి నిరంతరము న్వలయించు కైవడిన్.

చ. కలికి గులాలు పూవుటెద కందు కనుంగొని విహ్వలించి య
వ్వల తపియింతు – నార్గిసు సువాసనలన్ హసియించె నేనికన్
నిలుపుకొనంగ జాల నెద నిండి తొణంకెడి సంతస మ్మెదో
కొలుతును "ప్రాత" – ప్రీతిమెయి క్రొత్తను సృష్టి యొనర్తు నేనికన్.

ఉ. ఎంచి వినూత్న పుష్పముల నెల్ల, మరందము బిచ్చమెత్తి ప్రే
మాంచిత మాధురీ మహితమై వెలుగొందెడి, గీతులల్లి కా
వించగ గాన్క తూర్పునను విశ్రుతమౌ నరుణాభ కైవు మై
నుంచితి పత్రమే ఎదుట – ఉజ్జ్వల లేఖిని గేలఁ దాల్చితిన్

ఉ. ఓజమెయిన్ వసంతఋతు వొప్ప వహించెడి నూత్నతల్ రస
భ్రాజిత నిర్ఝరీనిరత బంధురవేగము ఫుల్లదాడిమీ
బీజ మనోజ్ఞశబ్దములు, పేశలశౌక్తికమౌక్తిక ప్రభా
రాజిత మంజులార్థములు రంజిలు నా సుమముగ్ధ గీతులన్.

చ. పరగ రసజ్ఞుఁడై యుదయభాస్కరుఁ డయ్యపరంజికాంతుల
న్గిరిశిఖరాన నిల్పి తులకించెడి దృశ్యముఁ జూపనెంతు – భా
స్వర సుమసంతతిన్ మధువసంతుని, 'బుల్బులు' పాటగాని నా
సురుచిర కావ్యవీథుల శిశుప్రణయమ్మున నిల్పఁ బిల్చెదన్. 6

మ. పరిహాసోక్తుల, వ్యంగ్య భాషణములన్, భవ్యానురాగాల సుం
దరసల్లాపములన్ రచింతుఁ గవితల్ - తంత్రీరుచిన్ 'సాజ్ సం
తురులం' బాడెద గీతికల్ - తుడుచుచున్ ధూళిన్ గనుంగొందు దు
స్తరమోహమ్మున నాదుబింబమును నాశాదర్పణం బందునన్.

చ. నిలిపెద నెల్లదిక్కుల "సునిశ్చయదీపిక" - లెల్లవారలున్
వలచి వచింత్రుపో "ఇది దివాళి" యటంచు - మరేల నాకు నా
కులపడ నిట్లు? ఏరి రసికుల్ పలుసంఖ్యగ పాఠకోత్తముల్?
తలఁపఁ బరాయిభాష కవితన్ మును శ్రోతలకై వచింతునే?

మ. కవితల్ పాడెద నల్గడల్ ఉదయశంఖధ్వానముంబోలె న
య్యవి గేహమ్ముల మారుమ్రోయ నెటుగా నాలింప రవ్వాని వా
రెవరైనన్ రసికాళి యల్పమని నా కేలా విచారమ్ము - నా
కవితామంజుల వల్లకీమసృణ నిక్వాణమ్ము జృంభించుతన్.

శా. ఏవో యూహల నిట్లు మున్గతరి తా నేతెంచె నిల్లాలు : "మి
మ్మా విశ్వేశ్వరుఁ డోముగాత! ఎటుగా నాయవ్యయం బీ నెల
న్గావింపన్వలెఁ జూచి చెప్పుఁ - డొకచొక్కా మీకు కావాలి - పై
నా వీపంతయు జిన్గె - రూక లొక మూఁడైనన్ వలెన్ దానికిన్.

చ. కల మిదె చేత నున్న దదె కాగిత మం" చనె: అంత నేనునున్
దలఁచితి మాసపట్టిక కథ న్గన - చాలనిదుప్ప టయ్యె - నే
నిలువుగ నడ్డ మెంతో తెగ నీల్గుచు లాగితి - కాళ్లు కప్పినన్
దలపయిఁ జాలదయ్యెఁ దలఁదాల్చినఁ గాళ్లకు జాలదయ్యెడిన్.

ఉ. సుందర భావగీతికల శోభిలనున్న మదీయపత్రముల్
చిందరవందరై రణముచేసెను రాబడియున్ వ్యయమ్ము - ఆ
నందము డిల్లవోయెను - ఘనమ్ముగ దైన్యము గ్రమ్మసాగె - ఇం
కెందుకు బుద్ధికి న్నెదకు నెల్లెడ ఘర్షణ యున్నదే కదా! 12

తే. కలుగ బుద్ధికి నెదకు సంఘర్షణమ్ము
కవిని సౌందర్యపూజకాగ్రణిని - మధుర
కావ్యగీతుల వ్రాయఁగా నడఁగి యేను
"లోటు - బడ్జెటు" నొకటి నిర్మించినాఁడ! 13

(కాశ్మీరకవి త్రిలోకీనాథ కుందన్ రచనకు స్వేచ్ఛానువాదము. విజయవాడ ఆలిండియా రేడియోలో జాతీయకవితగా ప్రసారితము. "గులాలు", "నార్గిసు" కాశ్మీర దేశ కుసుమములు. "బుల్బుల్" రమ్యముగ పాడగల ఒక శకుంతము. "సాజ్", "సంతుర్యులు" ఆంధ్ర దేశమందలి "ఏకతార"ల వంటి కాశ్మీరమందలి వీణియలు)

***(A.I.R. 25-1-67న ప్రసారితం)***

# ప్రియోత్కంఠ

ఉ. ఆ కరణిన్ నిదాఘ దివసాంతము కల్గెడు దాత వేకర
త్నాకర సంగమంబు నెలతా, వసివాడి కృశించి నావు – కా
నీ కడచున్న యాదినము నేటికి జ్ఞప్తికి వచ్చు నీకు నే
డీ కరణిన్ ప్రియావిరహమెంత తపింపగ మిన్ను వ్రాలదే.

ఉ. క్రీడగ నిన్ను జూసి కనుగీటిన తోయద రాజుమింట నీ
"వ్రీడము తోడ బాహులుప గూహనకై పరువెత్తనేల? నీ
వేడ? క్షణప్రభాదయితుడేడ? మహోర్తి చరింపనేల? ని
న్నూదగ నెంచునే? వలపు కోర్కెల పాంశులవయ్యె దేటికే?

ఉ. నీవు కృశించి గ్రీష్మమున నీరవ శుష్క గళమ్ముతోడ నో
సీ! విలపించు వేళలను శీర్షముపై పదముంచి దాటి నా
నే – విధు శూన్యమైన రజనీఘన నీపతమిస్రలందు ప్రే
మావిలమూర్తి నా ప్రియు భుజాంతర పంజరకీర మౌటకున్.

శా. ఈనాడో భయమౌను నిర్ఝరణి నీహేలావిలాసంబుగ
ర్జా నిర్ఘోషము కన్నవిన్న – ఇటు గర్వస్ఫూర్తి యెన్నాళ్ళో దే
వానైదాఘ దినమ్ము లింక – అపుడేమై పోదునో. చూచుకో
నీ నీర ద్రవిణంబు శాశ్వతమటే నిర్ణీతివైవర్తిలన్.

ఉ. ఏమని ఏగుచుంటి సుదతీ! ఒడలెల్లను కాళ్ళుగాన, వీ
చే మృదులాంశుకమ్ము కటిసీమను నిల్వక జారిపోవ, నీ
వా మదనాభిరాముడగు నంబుధిరాజునకై మనోజ్ఞవై
నేమును నట్టివారమె సుమా! ఇది న్యాయమె సోదరీమణీ?

శా. ఈ నీ పొంగులె కాని ఆజలధి రాజేమో మహాహ్రాదినీ
లీనా లీన సమాగమంబునకు కేళీవృత్త చిత్తుండు ని
న్నేనాడైనను చేర్చె నీ యొడిని – ఏమే యెందుకో పొంగులో
సీ! నీ దాస్యమునైన నీకొరుగదే సిగ్గేల లేదే సఖీ? 6

ఉ. ఎంత అదృష్టవంతులు కదా యిటు పొంగెడు నిన్ తరిం
కాంతమునన్ త్రపన్ సఖుల కౌగిలిలో నిదురించు జాణలే
నంతకు నోచలేదు కఠి నాయుతమైన నితంబ వృద్ధి న
త్యంతము నాపయిన్ కరుణ నవ్వల జేర్పు తరంగ డోలలన్.

మ. చిరుప్రాయంబుననైన సెజ్జపయినే చేరన్ సఖీ! యొంటి సో
దరుడాతండు వియోగ వహ్నికృత బాధన్ తాళగా లేదు – ఈ
తరుణం బయ్యెడు దాక వేచిచను నాతండింక రానంచునీ
చిరదాంపత్యము కల్గునే జలధితో చెల్వున్ ననున్ జేర్చినన్.

మ. ఉరుముల్ పెల్లగు, ద్రోణ వృష్టి కురియన్ యుద్వేలమై వచ్చిన
కరిగాంభీర్య పయోనిధిన్ గనుము – నాగాత్రం బిదే యిందుది
తరువై ఈ చలిగాలిసోక, మీదనార్తన్ పాతకం బౌను స
త్కరుణామూర్తి వటంచు నేయేడ యశోగాథాళి కీర్తించెదన్.

శా. ఏదో ఓపగరాని వేదనను నిన్నే దూరితిన్ నీవు మ
ర్యాదన్ తప్పెడు దాచవే – జలధి సౌహార్దంబు నీ కబ్బవౌ
రాదివ్యాపన – మాకు దేవతవు నీవు కావే – నీ గాథలే
కాదా మారతివేళ కల్గెడు ప్రసంగంబుల్ సముద్రప్రియా! 10

***సాహితీ సమితి రజతోత్సవ సంచిక***

# భారతా!

మ. జననం బందిరి సర్వరంగములలో శౌండీరు లౌ పుత్రు లీ
జనయిత్రీ ఘన గర్భమందున – మహోత్సాహంబుతో వారి జీ
వన చాతుర్య కథల్ రచించి, నిజదర్పంబొప్ప లోకంబులం
దున నుప్పొంగుచు పాడుకొమ్మెపుడు నుద్యోగించి ఓ భారతా!

ఉ. తీర్చి భయం బహింసయను దివ్య మహాస్త్రము దాల్చి శక్తిమై
నోర్చి భయంకరారిగణ ముజ్జ్వల భాగ్యము స్వేచ్ఛ నిచ్చి, ని
త్యార్చిత మూర్తియై వెలుగు నా జననేతకు గాంధి దేవుకున్
గూర్చి త్వదీయ హృన్మధుర కుట్మల మీయెడ నంజలింపుమా

చ. భువి నిటువంటి నాయకుని పొందుట పుణ్యమటన్న కీర్తి తో
నవిరళ ధర్మ మూర్తి యయి అభ్యుదయమ్మును – శాంతి నిచ్చు వి
ప్లవకర రాజనీతిఁ బరిపాలన సేసిన రాజ్యశిల్పి – ఆ
జవహరునాత్మ నీకిల ప్రశస్త పథంబులఁ జూపు దివ్వెయై.

ఉ. ఈ కమనీయ దేశమున నెల్లర కెందును భేదభావముల్
లేక ప్రశాంతమై – బ్రతుకు రీతులతో గణతంత్ర రాజ్యమే
కైక మనోజ్ఞ వైఖరి ఘటించి జగమ్మున మిన్నఁ జేయఁగా
నీకిడినట్టి పూజ్య మహనీయుల నెల్లెడ సంస్మరింపుమా!

ఉ. ఖండన భూములం దెటుల ప్రౌఢులొ అట్టులె శాంతి వేళ ను
ద్దండులు భారతీయులని యీ జగమెల్ల నెరుంగ జూపె మా
ర్తాండు మహోజ్జ్వలుండయిన లాల్ బహదూర్ ప్రియనాయకుండు నా
తండు ప్రియంపడంగ వసుధన్ విరజిమ్మును శాంతి చంద్రికల్.

ఉ. 'శాంతి, ప్రపంచ శాంతి' యని చాటెడు దేశములందు నెన్నియో
సాంత్వన నిచ్చి శక్తిమెయి శాంతికి నై కృషి సల్పఁబోవు న
త్యంతము నీపయి బడియెనయ్య ఘటింపగ విశ్వశాంతి దు
ర్ధాంత తమః ప్రభాత్తరణ దారుణ మేఘములన్ జెదర్చుచున్. 6

శా. కాకల్ దీరిన కర్ణధారు లిదె చుక్కానిన్ కరంబందునన్
వీకం దాల్చిరి – రాజ్యనౌక సకలోర్వీ కీర్తికిం బాత్రపు
ఆకాంక్షా పరిపూర్తి నీ కొసంగ సర్వార్థంబునన్ సాగు నే
డే కల్లోలము లే మహా జలధులం దెన్నెన్ని జృంభించినన్.

ఉ. యుద్ధముపైన యుద్ధము, మహోన్నతమౌ సహజీవనమ్ములో
కోద్ధరణమ్ము కై అసువులొడ్డుట, శాంతి కలీన రీతికిన్
బద్ధమొనర్చి – జీవితము – పావన నీతిఁ జరింపు మయ్యనీ
విద్ధర లక్ష్య సిద్ధి గన నేగురి తప్పని రామబాణమై. 8

***(AIR 26.1.66)***

# స్వామి

తే. కోటికొండల బరువెత్తి కూలబడిన
ఇనుప పాదాల మర్దింతు వేలనోయి?
నీవు నీపూలవనిలోన నిలుపుకొనిన
మావిగున్నను పెకలింప మన సదేల?

తే. మంచు తెరలను నాదారి మరగుపరచి,
ముల్లు గర్రను చేపట్టి, ముక్కు త్రాళ్ల
చేత లాగుచు, నదలింప చేతనౌనె,
స్వామి, ఒక బెత్తె డేనియు సాగినడవ!

తే. అలసిపోయెను నాగుండె ఆటకట్టె
ఎత్తు వేయగ లేనింక ఏడిపింప
నేటి న్యాయమ్ము సఖులలో నెంచి చూచి
ఆట చాలింపు మదియె నాయభిమతమ్ము.

తే. తండ్రి, నా పేదయెద రహదారిమీద
ఎంతమందిని నడిపింతు విట్లు నీవు
ఎన్ని పుట్ల బరువుమోయ నిచ్చగింతు
వూసులాడుచు కుములు నీయోటిబండి!

తే. వెల్ల వేసిన పెండ్లిల్లు వీథిలోన
నాటకమ్మాడ కట్టిన తాటిపాక
పూటగంజికి లేనట్టి బాటసారి
బ్రతుకు నాయది వేధింప భావ్యమగునె?

తే. ఆశయ మ్మొక్కటే నన్ను పాశబద్ధు
చేసి నిలుపుచు నున్న దీచేతగాని
పడవవానిగ నా నావ పగులగొట్ట
తలప వలదయ్య యొక వసంతమ్ము వరకు. 6

***(భారతి, 1941–విక్రమ, ఫాల్గుణ)***

# తెలుగు నాగు

(ధరణికోట దిబ్బమీద పడివున్న నాగప్రతిమను చూచిన తర్వాత వ్రాసినవి)

తే. ఏ పురాతనశిల్పిలో యిచట మలచి
నగర సంరక్షణార్థమై నాగరాజ
విగ్రహంబును ప్రేముడి వేసి చనిరి
దివ్యలోకాల శిల్పమ్ము తీర్చిదిద్ద.

తే. ఆంధ్రరాజుల శౌర్యాగ్ను లణగిపోయి
స్వీయగాథల చెప్పుకో సిగ్గు వడెడు
ఆంధ్రజాతికి కర్తవ్య మతడు నేర్ప
నిలచియున్నాడు దిబ్బపై నేటివరకు.

తే. తెలుగు రేడులు రాజ్యమ్ము దివ్యదీప్తి
పాలనము చేయ స్వాతంత్ర్యపథమునందు
నవనవోన్మేష శక్తితో నర్తనంబు
ఒడలు పులకింప చేసిన ఒడయ డతడు.

తే. శత్రువీరుల పౌరుష సాహసమ్ము
సప్తజిహ్వాగ్రవిషముతో సమయజేసి
రక్తబంధూక నేత్రాంచలముల నగ్ని
కణము లొలుకగ పోద్రోలె కలుషరిపుల.

తే. ప్రతిదినంబును సంజలు పడెడు వేళ
సకల రాజన్యలోకాల చక్రవర్తి,
తెలుగు సమ్రాట్టు, దీపితదివ్యయశుని
అవనతనతుల నాత దందుకొనియె.

తే. చనుట అలవాటు నాగులచవితినాడు
రుచ్యమగు పదార్థాలతో రూపవతులు,
నిత్య సముపార్జ సౌందర్య నిలయ, లైన
ఆంధ్రరాజుల దేవేరు లతని కడకు. 6

తే. అతని ముందఱ నిడి గాని ఆరగింప
మనసు పోలేదు నాటి సామాన్యనకును
పుణ్యమూర్తి యని ప్రజాపూజ లంది
అన్య్ణ లెరుగని గౌరవం బనుభవించె.

తే. అన్యరాజన్య మస్తక హనన వేళ
సమర సేనలు తనముందు చనుట చూచి
తనదు పరిపూత మంగళ తనువు విప్పి
దీవనల నిచ్చి పంపించు దీక్షతోడ.

తే. అర్ణవత్రయమధ్యస్థితాంధ్రభూమి
తెలుగు రేడుల చేతిలో తిరము జెంది
నిత్యకల్యాణ మందగా నేత్రయుగళి
బాష్పపూరమ్ము లొలికించె పాపరేడు.

తే. అట్టి మహనీయమూర్తియో నతడు నేడు
కంటకాకీర్ణ సంకుల కాననమున
చూడవచ్చినవారలు శోషిలంగ
నిలచి విలపించుచున్నాడు కలతదృష్టి. 10

***(భారతి, 1940–నవంబర్)***

# కోకిలా!

ఉ. ఈసు వహింప నీప్రకృతియెల్ల రసాల మనోజ్ఞ శాఖికా
వాసము నుండి యిట్లు మధుభావ రసస్ఫుర ణైక గీతు లీ
వో సరసావతంస! రహి నుజ్జ్వల లీలగ నాలపింతు సు
శ్రీసముదీర్ణ గాత్ర పరిలీయసుధారవ మెట్టు లబ్బెనో!

ఉ. నీ సుకుమార మంజుల వినిస్వనముల్ హృదయాబ్జ భావ ని
శ్వాస పరీమళమ్ములు, వసంత మనోహర కీర్తి మల్లికా
న్యాస విలాస హాసములు, యౌవన చైత్రలసన్నవో దయ
శ్రీసముపేత దివ్య లవలీ నవలాస్యములో పికప్రభూ!

శా. తావుల్ జిమ్ముచు పంచమ శ్రుతిని వేదార్థంబులన్ బల్కు నీ
భావానంత సురమ్య కావ్య నిచయ ప్రౌఢ ప్రసూనావళుల్
కావా సంహిత కోశముల్ – మరల వ్యాఖ్యానింపగా ద్రష్టయౌ
నేవాల్మీకియొ పుట్టగా వలెను గాదే భూమి పుంస్కోకిలా!

ఉ. ఈ మధు మాసవేళను వనేందిర కొల్వున నీవు శబ్ద రే
ఖా మృదుచిత్ర రూపముల కల్పన సేసి యనంత భావ మా
లా మధురాళికై, మరల రాగల వత్సర లక్ష్మికై సఖా!
ఏ మహనీయ భూములకు నేగెదవోయి తపస్సమాధికై?

శా. స్వేచ్ఛాజీవన భావ గంధములు వాసించున్ భవత్కంఠ వీ
ణాచ్ఛస్వాధ్యయనమ్ము అందు కలదయ్యా శ్రీస్వరూపమ్ము, మా
తుచ్ఛాసక్తు లసత్పథానుగత వృత్తుల్ మాన్పి సద్బోధ్ధవై
స్వచ్ఛానంద సుధాప్రవాహలహరీ స్నానమ్ము లాడింపవే!

ఉ. రాగల జన్మలో విహగరాజ! భవత్ప్రియనై జనించి నీ
తో గళ మెత్తి కల్పి, మధుతుందిల మోహనరాగ కల్పనో
ద్వేగములోన మూగనయి దివ్య సుషుప్తి వహింప నెంతు నా
శాగతి యెట్టులున్నదొ ప్రసాదిత గాత్ర పవిత్ర! మిత్రమా!! 6

*(హిందూకళాశాల పత్రిక)*

# జీవయాత్ర

తే. ఎవరి కని చెప్పుకోను నే నీ నిశీథిఁ
బవలు మోసిన బరువులఁ బడిన బాధ
సకియ, సెలయేర్లు లే – వక సకల మటులె
చీకటిలొ మూగి గడుచునా జీవయాత్ర.

తే. ఎడఁద పరువెత్తు చెలియకై యేటి బాట
యిచట నను నిల్పి పిల్పుల కెంత గొంతు
జీరవోయిన వెనుకకుఁ జేరరాదు
చేరినదొ లేదొ నా కేక యారిపోక.

తే. ఎచటఁ గనుపించు నా యెద కెంత వెట్టి
ఇరుల పొలిమేర బాటల నెఱఁగి యెఱఁగి
యరిగినది గాని బేలయై యలసి సొలసి
తిరుగుఁ గనుచూపు మేరలలో దెల్సిన నరసి.

తే. మునుపు సెలయేటి పాటల మోసులెత్తు
నూతనాయత శాఖికా నోక హములె
నీడలే మేడలుగ మాకు నిండు రేలు
నీటి పాటలఁ గలలుగా నలిగిపోయె.

తే. ఆమె యాషాఢ జలధరాయతన సీమ
నొడలు పులకింప నటియించి యొరగి సోలి
మేల్కొను మెరపుటన్నుల మిన్న గాని
దీనుఁ డగు నన్ను మేల్కొల్పు తెరవ గాదు.

తే. స్వాగతోన్ముక్త గీతా స్రవంతి కలుగ
నపుడు ననుఁ బిల్చె నీ మది యలల గములు
ప్రణయరస మధువాహినీ బంధురములు
సైకతముల నేని కనఁగఁ జనఁగ నీవు. 6

***(భారతి, 1941)***

# పితామహుడు

ఉ. మూవురు తాతలున్ ముగురు మూర్తులు - దివ్యుడు దివ్యలో
భావితకీర్తి తేజులు. నివారితద్వంద్వులు - యజ్ఞవాటికా
పావన నిత్యనూతన సుపాతక కల్పిత కాలలీమూర్తు లి
మూవురలోన నెవ్వరయ ముచ్చట కల్గెడి కన్నుదోయికిన్.

చ. ములుకుల వోలె బాధ యొక మూలన నన్ను పరాభవించు నౌ
నిలచిన చోట నిల్వకను నీ పరిపూత లసత్శరీర సం
చలిత నవాంశు వాపిచనుటం జల్లగ తప్పుకొనంగ నేల? నే
పలుకున లేదు, కంటి పెను మంటలు దగ్ధము చేయ చూచెదన్.

మ. అనిమేష స్థితి నొందినందుల కహో! ఆరెప్పలల్లార్పకే
నను మీ వంశపు మొల్క నిట్లదయతోన్ నాశమ్ము గావింపరే
అనుమానమ్మును కాక పంపెదవుగా అగ్నిచ్ఛటల్ తండ్రి ఆ
నన తైక్ష్ణ్యమ్ము హరింపుమా దివిషదన్న ప్రాయమై పోవగా.

ఉ. మావలె యజ్ఞవేదికలు మేదుర దివ్య మహాగ్ని హోత్ర లీ
లావిభవంబునన్ మెరసి లక్ష్యము నాకముపైన నిల్పి రం
భా విపులావృత స్తనసభాంతర మంజుల నాట్యశాలపై
నీవు చరించి లాస్యమొనరింపవె కోరను బుద్ధి నెన్నడున్.

ఉ. దేశము పాప పంకిలము తిన్నని దోవలు మాసిపోయె నా
కోసము లోక మెల్లెడల కూర్చొని యున్నది కంటవత్తితో
పాశంబులన్ తెమల్చుకొని భారత యోధుడనై జనించి, స
న్యాసము నొంది నాస్తిక వినాశ మొనర్పవలెన్ పితామహా!

చ. పరమ వివేక సౌరభ ముపాయమనన్ నరజాతి కిచ్చినే
సురపురి కేగుదెంచి మిము చూచెద యజ్ఞము, కర్మకాండయున్
స్థిరముగ లోకలోకముల శిక్షణ నొంది యొనర్ప చూచినే
తరలెద లింగదేహమున తావకదివ్య పథమ్ము జేరగన్. 6

# తల్లి

తే. అందములు చిందు నీ మందిరాంతరాన
అమ్మ యీ బిడ్డ యెన్నఁడో యాడునపుడు
విసరి పెనుగాలి ప్రాభాతవేళ నెత్తి
దిగిచి చనినది యవ్యక్త దేశమందు.

తే. ప్రకృతి యంతయుఁ బరికించి, భ్రమల వీడి
చిఱుత నగవుల మునుముందుఁ జిలికె – అంత
నమృతమయ రూప! నీ వెద నవతరింప
నన్ని దిక్కుల వెదుకుచు నలసిపోయె.

తే. కనుఁగవ కొలంకు లుడుగని కడలు లనుచుఁ
గారు కన్నీటి సెలయేళ్లఁ గదనుఁ ద్రొక్క
బావు రని యేడ్వ నీ ముద్దుపట్టి తల్లి
బావురని యేడ్చెఁ దూరులో పర్వతములె.

తే. దినము లీరీతిఁ గడచెను – తేరు కొనిన
యంత నినుఁజేరు కోర్కెతో నిఖిల దిశల
మాయలోకానఁ బడతి నేమా యటంచు
వెదకి వేసారి వెఱ్ఱినై విసిగి పోయె.

తే. అనుదినమ్మును నెద నిన్నె యాలపించి
స్వప్న వీథుల నిను జూచి సంతసించి
తల్లి, దరిఁజేర్పుమని సదా ధ్యానముద్ర
ధారణము సేసి కొల్వగాఁ దలఁచినాఁడు.

తే. తల్లి, కేల్మోడ్చి నంతనే తావకీన
మూర్తి యెదలోన నేటికో మ్రోడువోలె
పుత్ర వాత్సల్యమును జూపు పోలుపు వీడి
కానుపించిన దేమౌను కారణమ్ము? 6

తే. స్వర్గసీమలఁ గుసుమ వాసనలతోడ
తేనె తెలికాంతి కళికలు దివ్యగతుల
విరియఁ బూచిన పున్నాగ కరణి నాకుఁ
గానుపించె పండువై, కన్నుఁగవకు. 7

# ఉపాలంభము

ఉ. ఎంతటి భక్తి ఆ స్మర మహీపతిపై మలయానిలుండు ని
శ్చింతగ తృప్తితో కొలువు చేయుచు - ఇచ్చునదేమొ కాని దు
ర్దాంత వియోగ బాధితుల తప్తుల జేయును శీతలాగ్నిచే
నింతటి బంటు కల్గెనటె ఎవ్వరి కేనియు నేయుగంబునన్?

ఉ. కోపముతోడ మాట ననగూడని మాటల నాడి పోసి ఆ
పాపపువాయు వీదెసకు పైకొని రానటు చేయవేని సం
తాప వియోగ వహ్ని నను దగ్ధము చేయగ భస్మరాశినౌ
నాపయి దుఃఖ వార్నిధుల నల్గడ వోసిన నిష్ఫలంబగున్.

మ. అది గాదే చెలినీవు కేరళ మహా హర్మ్యంబుపై నున్న యా
మదిరోన్మత్త పుళింద నాయకులతో మాటాడి చంపింపవే
కదనుల్ ద్రొక్కుచు వాని వాహనములై కాల్దవ్వ ఏ మ
న్మద సందోహము చూతమింక నెటు దుర్మార్గుండు రానేర్చునో?

మ. చెవి నీవేణి కఠోర చందన గిరిశ్రీగంధవాతమ్ము లౌ
బిలమందున్నమా చూచి సత్వరముగా పెంతురు నవ్వాని నా
అలుకన్ దీర్పగ నెంచి ఏ యెడను కారాగార మందుంచెఁగా
తలుపుల్ బట్టు బిగించి రమ్ము ప్రణయార్తల్ నిన్ను ప్రార్థింతురే!

ఉ. ఈయది వెర్రి ఊహలు కదే - అటులేల యొనర్తు రే సఖీ?
ప్రాయపు గబ్బి గుబ్బెతలపై బిగికౌగిలి కల్గు చిత్తడిన్
పాయగ చేయుచున్ శబర పల్లవులన్ స్మరకేళిఁ దేలఁగాఁ
జేయుచు మేలు జేయుచును చెల్వుడుగా మెలగుం గదా సఖీ! 5

# నిరాశ

ఉ. జీవితనావ భగ్నమయి చిందరవందర గాగ జేతు వీ
పావన మైన ఆశలకు పాదులు చేసి, జలమ్ము పోసి, ప్రే
మావనిలోన నాటుము భయాకులవృత్తిని మాను మింక సం
భావన చేయులే పెరిగి భర్తసుమ వ్రజపాలి నామనిన్.

శా. నాలో పెద్దతుపాను రేపి నగుచున్ గుర్తింతు వో తల్లి! నీ
లీలాలోలత పాడుగాను! తగ దీరీతిన్ విజృంభింపగా
జాలై పొంగెడు గాక నీ హృదయ సంసారమ్ము సంద్రమ్ముగా
కాలాహంకృతి పచ్చి నెత్తురులలో కర్మమ్మె జీవింపగా?

ఉ. గండశిలాతికర్కశము కాదు భవన్ముఖవీథి తల్లి. ఆ
గుండె కదెట్లు వచ్చినదొ కొండలు పిండిగ చేయునట్టి ఆ
ఖండలవజ్ర భీమ మగు కర్కశ సంపద? మారిపొమ్ము బ్ర
హ్మాండము నెల్ల ముంపగల మాపెదతల్లిగ కృష్ణవేణిగా!

ఉ. ఇమ్ముగ హాసచంద్రికల నెక్కడొ దాన సుధారసమ్ము లే
లెమ్మని నిద్ర లేపుము బలే! సొగసైన రసప్రవాహమై
కమ్మనివాసనల్ విరియగమ్ముచు లోకము నిత్యనూతన
త్వమ్మున వెల్గగా తలపు దాల్పుము నీవె రసాధిదేవివై! 4

***(ప్రతిభ, 1940)***

# అవతరణ

ఉ. ఏనొక కిన్నరీప్రియుడ! నేవసియించితి మున్ను నందనా
నూనరసాల శాఖిక శుభోజ్జ్వల గాయకమూర్తి నౌచుదే
వీ నయనారవింద రుచులే మహనీయ రసప్రపంచ యా
త్రానవమార్గ దర్పణములై కరదీపికలై చెలంగగన్.

ఉ. నా యెదలో జనించిన అనన్యానుభోగ్య మనోజ్ఞ భావపా
థేయముతో చరించితిని తృప్తి వహింపక - గీతికారవో
చ్ఛ్రాయము నా విపంచిక గళమ్మున జీర యొకింత రాదు ది
వ్యాయత మత్ప్రియా సురుచిరాక్షుల మ్లానత తోప దెన్నడున్.

ఉ. ఆ రమణీయ పుష్పవని కాటలనేర్పి సుభంగభంగ భా
గీరథికిన్ తరంగపటకీలనమున్ సవరింపనేర్పి - శం
పారమ కేను విష్ణుపదమందిరవీథి నటింప నొజ్జనై
ఈ రసయాత్రలో గడచె నెన్ని వసంతములో దినమ్ములై.

చ. ఎరుగరు మారహః ప్రణయమెవ్వరు మిత్రులు మద్విపంచియున్
కరమనురక్తి ప్రేమకథగా నయినన్ వచియింపలేదు కి
న్నరులకు నెంతనేస్తమయినన్ - సకలమ్మొకస్వప్నగాథగా
జరిగెను నా 'రసప్రియ'కు జల్పితమంజుల కావ్యవస్తు వై. 4

***(ఆశాజ్యోతి)***

# ప్రేమ

తే. బహుళ శోభా మనోజ్ఞమ్ము ప్రణయ మద్ది
దాని శక్తిని మర్త్యమౌ ప్రాణము పయి
పురుషమైన, స్త్రైణమునైన, పూర్వమట్లు
ప్రతియుగమ్మున, నెపుడొ అప్రతిహతముగ.

తే. ప్రేమయన వర్ణనము సేయ వీలుగాదు
చెలగి వర్ణింప నద్దాని చేరుకొనిన
మునుపునెన్నడు ననుభూతి గొనని యట్టి
అనుభవమ్మేదొ ఏతెంచి ఆవరించు.

తే. ఇది సహకరింపదు మనకు నెంతయైన
అందువలనను పరికింతు మాది దాని
పరము, మూలమ్ములైన ప్రవర్తనముల
గూర్చి యర్థమ్ము గావించు కొనుట కొరకు.

తే. తొలుత మరియొక ప్రాణితో కలిసియుండ
నాశపుట్టించి సంతోష మబ్బజేయు
పిదప వరియించు నిరువుర ప్రేమికులుగ
జేర్చి యొక చోట జీవింపజేయు ప్రేమ.

తే. ఎవరి ప్రేమింతురో వారి కిచ్చవడుచు
సేవఁజేయ నాతురతను జెందుచుంద్రు
ప్రేమ నశియింప జగతిలో వీక్షసేయ
లభ్యమవుదురె ప్రియగాని ప్రియుడు గాని?

తే. ప్రేమ వహియించుటయు లేక ద్వేషపడుట
మనదు శక్తిలో నేనాడు నొనరబోదు
జాతిమత ధనాదులను వీక్షణము సేయ
కుద్భవించెడు ప్రణయమే ఒప్పు సాక్షి. 6

తే. జాగరూకత రూపాల చాల విషమ
మైన యది ప్రణయార్థ మైనట్టి దద్ది
ప్రియయు ప్రియుడును వీక్షించి పిలుచు మొదలు
సర్వ సౌఖ్యాల నతిగ నాశన మొనర్చు.

తే. పోస్టులో నుంచి తనకయి పుట్టివచ్చు
నట్టి దానిని ప్రేమలేఖనుచు తలతు
రా టెలీఫోను మ్రోగిన యప్పుడెల్ల
అర్థి వినదలచెదరు ప్రియ స్వనమ్ము.

తే. వీక్షణము పొందకుండను పిల్వకుండ
వచ్చు ప్రణయ మొకానొక వ్యక్తి కడకు
అద్ది పరమమౌన నవకాశాది బాంధ
వముల చేకూర్చునెంతో అవ్యాహతముగ.

తే. ఆమె 'నెందుకు వృద్ధు పెండ్లాడి' తనగ
'తండ్రివలె నుండగా నేర్చి తనకు గల్గు
మానసోద్రేక విషయాల చర్చింప మనసునిచ్చు
గాన పెండ్లాడితని తెల్పు క్రమగాత్రి.

తే. అయిన నిక ప్రణయోద్రేక మతిశయించి
వారిలో గొన్న నయ్యది వారి మనసు
నుండి ఇతరమ్ము సర్వమ్ము నూడబెరుకు
ఇరువురొకరొకరిని తప్ప ఎరుగరెదియు.

తే. అతడి సహచర్యమ్ముతొ నుంట నామె పొందు
వారితో సౌఖ్యమెంతొ అపారముగను
అంత కొన్నాళ్ళలోననా యతివ కగును
వారిపై సర్వమునకు నాధారపడుట. 12

ఆహా ప్రియా, మనము ఒకరికొకరము సత్య
మొలికించు కొందము – మనమందు తోచేటి
ఈ జగము కనిపించు అంత భిన్నముగాను
అంతరమణీయముగ, అతినవ్య నవ్యముగ

స్వప్నలోకమ్ముగా సఖ్యమ్మునకు కనిన
సంతోషమా లేదు ప్రేమ యనునది లేదు
వెలుగెద్ది కనబడదు వేదనకు ద్రఢిమయును,
శాంతియు, సహాయమ్ము లేవులే వెట గనిన
కలహ విహరణ గంటికలల మార్జితమైన
తమోవృత క్షేత్రాన వసియించు రీతిగా
ఎట రాత్రి నజ్ఞాత సైన్యాలు భయదముగ
నెపుడు పోరాడునో అచట మన మున్నాము.

తే. నీ అసామాన్య గుణముల నిత్యములుగ
నాదు పద్యమ్ము గావించు నమ్ము మీవు
నిలుపు స్వర్గాన నది నీదు నిర్మలతను
మహిత విఖ్యాత మధుర నామమ్ము సఖియ!

తే. ఎపుడు మృత్యువు జగమావరించి ఎచట
లొంగదీయునొ అపుడట పొంగులెగసి
మనదు ప్రణయము జీవించు మహితముగను
భవ్యగతిగల్గు బ్రతుకులు నవ్యములుగ.

తే. ఏను యెదలోన ప్రేమించు నింతులందు
కానవచ్చెడి చాంచల్య గరిమ కాన
వచ్చు నన్నెద ప్రేమించు వనితలందు
అనుచు బెర్నార్డుషా విజ్ఞుడనగలేదె? 16

తే. కాదె సభ్యప్రశస్తి సంఘంబు ప్రేమ
ఇరువురీ సఖ్యులందులో నెవరి ప్రేమ
అల్పు తీక్ష్ణమొ వారు అధ్యక్షులవుదు
రందు నన్యోన్యముగ మెప్పులాడుకొంద్రు.

తే. అనుచు 'జోసెపు మే' ఇది హాస్యమాడె
మిఫ్వీను పలికె దిష్టమొ మీరు నిచ్చ
పడుదు దాని శూకరమైనను పడుడిచ్చ
నిట్టులేదైన ప్రేమింపు డనియె నతడు.

తే. కన స్వగడియారము లనేకకాల వృత్త
ములుగ నెవ్వరు చేయగా గలుగకుంట
ప్రేమకు గలుగు నున్మాద విషయమనుచు
రాయడే 'జాళి కూపరు' రసిక వర్య.

తే. అగును దైహిక వేద నవ్యక్త ప్రేమ
ఉండు తీక్ష్ణమ్ము గానిది యువకులందు
వెల్లడింప బడనిదైన ప్రేమకంటె
వర్జిత ప్రేమ ఘనతర వ్యథ యొనర్చు.

తే. అద్ది కేవల హింసయౌ, నంతకంటె
పూర్ణ రూపాన చెల్లింప బూను ప్రేమ
స్వచ్ఛమైన యతిశయమ్ము – సరసకవులు
వారి పాత్రల మూలాన పలికినారు.

తే. ప్రియతొ మరల సంగమమొంది ప్రేమవడగ
భూరి సంతోషముగ్ధ విస్ఫోటనమున
'డెస్డిమోనాను ఒథెలో' ఇష్టపడుచు
పిలుచు భాషకు ఎట సాటి వెదుకలేము. 22

"నా ఆత్మహర్షమా! ప్రతివాయు వర్షాన
శమములు జనింపగ, మృత్యువు మేల్కొల్ప
వాయువులు వీచవలె, సాగర నగాలపై
శ్రమియించు పోతము ఒలింపసు సమున్నతి
నదివసించెడు కాక అద్ది మరణించుటకు
స్వర్గమ్మునుండి నరకమ్మునకు గల దూర
మునకు దిగియెడు దాక భయపడుదు
నేననుచు అది ఉన్న దీయెడనె
అధిక సంతోషమున
నా ఆత్మ ఎంతొ పరిపూర్ణ వస్తువు తోడ
నిండి ఉన్నది ఇపుడు దీనిపోలిన సౌఖ్య
మవ్యక్త విధిలోన అనుసరింపదు ఎపుడు."

తే. ‘మాత్యు ఆర్నాల్డు’ రచయిత మధురముగను
ప్రీతితో వ్రాసె ‘డోవరు బీచి’ గాథ
అందు తుదినున్న కొన్ని వాక్యాలు కనగ
సర్వజనులకు నుపహాసాస్పదములు.

తే. దంపతుల మధ్య నుండు బాంధవ్యమెంత
కాలము సుగమ మంత్యము కాల మరయు
చుండు స్వర్గాన నీశ్వరు డుజ్జ్వలుడుగా
జగతి సర్వము సాగు ప్రశస్తముగను.

తే. కెరలు జలములపైని సంగీతమటుల
ప్రణయినీ ముగ్ధ నిస్వనము తోచు
ప్రియుడు ఆతడి గొంతున వెలువరించు
త్యాగ హృష్ట విరాగ విన్యాసములను.

తే. ఉచ్చ కంఠమ్ముతో ప్రియుడు ఉజ్జ్వలముగ
ప్రణయినీ నామ జపమున గుణగణనను
నర్ధరాత్రి వియోగ గీతాలు పాడు
తీవ్ర పవనాన నగము ప్రతిధ్వనింప. 27

తే. ఉంచతటి, ప్రియనామమే నొక్కనాడు
నరుగుదెంచి తుడిచిపెట్టె నలలు – మరల
ఏను రెండవ చేత లిఖించినాను
చేరి వేల నాశ్రమను భుజించి అనియె.

తే. “మర్త్యవస్తువు చేయు నమర్త్యమణిని
వ్యర్థమానవా, చేసితి వ్యర్థచర్య
ఇట్లు నశియింప జేయుట ఇష్ట మీవు
వ్రాసి నా పేరు చేయుము నాశనమ్ము.”

తే. అప్పుడేనంటి దానితో “అట్లు కాదు
ధూళిలో క్షుద్రవస్తువుల్ తూలవచ్చు
కాని నీవట్టి దానవు కావు, కావు
ఎపుడు విఖ్యాతితోడ జీవింతు వీవు.

తే. ఇట్టు లాధారపడుట రూపించు వెతకు
చుండు వారిని బానిసలుగను, ఇద్ది
లక్షణమ్మోను కనగ నే రాజ్యమందు
ఇది విశేషమ్ముగాను నయ్యింతిదయ్యె.

తే. ప్రణయ మొనరింతు ననెడి భావమ్ముకంటె
ప్రేమ గావింపబడు చుంటి ప్రీతి తోడ
ననెడి అనుభూతి సర్వశక్త్యాత్మ జగము
నధిగమించిన వానిగా నాచరించు.

తే. శక్తి దేహము అన్యోన్య చలనమొంద
మానసిక దైహికమగు సంగమము నొందు
టగునొ జగతి ప్రణయ చరమాశయమ్ము
సత్యమౌ 'ప్లెటానికు' ప్రేమ షండ ప్రేమ. 33

తే. ప్రణయ మింద్రియ కవితని పలికినాడు
కథకుడైన 'బాల్జాకు' ఆ కామమరయ
లైంగికమ్ము భావము పొందు సంగమము
రెంటికైక్యత లేక కాకుంట నిజము.

తే. "ప్రేమ అంధమ్ము" అని యొక ఫ్రెంచి ఉక్తి
అద్ది స్పర్శేంద్రియము చేత నాడసాగు
ఏకవేళ నింద్రియ శిరోహృదయములను
కలచు వాల్తేరు ప్రభల వికారమనియె.

తే. అల్పముగ ప్రేమ నొందెడి యట్టివారు
ప్రణయమొందెడి వారి వ్యాపారములను
సకల జోక్యమ్ము వహియించి సలుపవలయు
దాస్యమవసరమైనట్టి దానినెల్ల.

తే. ఇంతి యొకమారు నగ్నగా నెదుట నిల్చు
టెంతయో మేలు ఆత్మ నర్పించు కంటె
వలదటన్నను వెంటనే వచ్చు నింద
రమ్మనగ వలపు మెయి క్రూరాత్మయగును.

తే. వలచినను కీడె, కీ డగు వలువకున్న
ఎంతగనొ పెంచు నా భార్య ఈ సమస్య
శయ్య మరలి గుహ్యమును హస్తమున మూసి
బయట పెట్టు చిత్రాలలో పడతి పగిది.

తే. బాహ్య సంయోగ బంధమ్ము ప్రాప్తమగుట
నెరిగి భార్యయొ, భర్తయో ఏహ్యపడుచు
వారి పెండ్లిని విడనాడ ఒరగరాదు
మొదటి పొరబాటు కెంధైన చెదరరాదు. 39

తే. అతడిలో నేమి చూచె నా యౌవనాంగి
వృద్ధుడాతడు, భర్తయు వీరవరుడు
అనుచు నడిగిన చెప్పగా నగునె వీలు
ముసలి ప్రేమించి ఆమెయు మోసపోదు.

తే. చెలిరా! నీ చేతి, చేతిలో చేర్చుకున్న
పథము నందున్న దీపముల్ ప్రభల వెలిగె
వాయువుల్ మారె మృదు మంద పవనములుగ,
పడయుచుంటి నవధి సమీపమ్మునందు.

తే. ఏను కోరినది అనుగ్రహించినాడు
ఈశు దేగోర నిన్ను నాకిచ్చి నంత
ఎపుడు నాదు హస్తాలు ప్రార్థింపలేదు
ఇందుతో పూజ పూర్తిగావించినాను.

తే. నాదు ప్రియురాలు తాను గాంధర్వి ననిన
ప్రతిన చేయంగ వలెయన – ప్రబలరక్తి
పలుక నొక మాట – నమ్మెద వలపు జూచి
ఏ నబద్ధ మటంచు గ్రహించి యైన.

తే. పుట్టు పువ్వుల వెన్నియో గిట్టుచుండు
ముసుగులో నుండు నొకకొన్ని మొగ్గ లటుల
కొమ్మలందునె యుండును కొన్ని పూలు
అబ్బుజేయవు సౌఖ్యమ్ము నన్ని పూలు.

తే. చేర దెల్ల పూలకు వికసించు శక్తి
గాలి కొన్నిటి వికసింప గడగనీదు
కొన్ని పూలకు నిట్టె చేకూరునద్ది
అంతెకాదు సాధనసైత మవసరమ్ము. 45

తే. మనుజ హృదయమ్ము ఇట్టిదై మనును దాని
కర్హమగు సాధనెంతయో అవసరమ్ము
అన్ని కల్గియు వికసించు టతిశ్రమమ్ము
అన్యమును నట్లు గావించు టతిశయమ్ము.

తే. వివృత హృదయ కవాటమ్ము విసిగియైన
సంవృతత్వము నొందగా శక్తిహీన
వికసనముగొన్న ప్రసవమ్ము వేరె లేదు
వాడిపోవలె, ముకుళన వడయలేదు.

తే. కోరి హృదయమ్ము నర్పించుకొన్న వనిత
ఇడుమ లెన్నిటినైన సహింపగలదు
తనివితీరగ ప్రేమామృతమ్ము జుర్రి
విడిచిపెట్టిన దేహమ్ము విడిచిపుచ్చు.

తే. పంచజేరు ననాథుడౌ బాలు నొకని
ప్రేమతో జేరగా దీసి పెంచె వేశ్య
ఆర్జనతొ వానికిని చదువబ్బజేసె
ఆమె వేశ్యని గ్రహియించి అతడు విడిచె.

తే. ప్రక్క వైద్యుని ప్రాక్టీసు పాడొనర్ప
లేవగా దీసుకొనివచ్చి స్త్రీ నొకర్తె
నొప్పు జెప్పి భంగపరుప నువిద అయ్యొ
పాత్రురా లతడ తమికి, పరచి క్షమను.

తే. భర్త గతియింప పిల్లల బ్రతుకు కొరకు
ఏ యుపాయమ్ము నెరుగని ఇంతియొకతె
మానవతియయ్యు తప్పక మాన మమ్మి
జీవనము చేయ దోషమ్ము సేత కాదె. 51

తే. భర్త చావుకు హేతువౌ పడతి యొకతె
ప్రేమికుని ఎడ నెంతయో ప్రీతి నిలిపి
కడగి జీవిత శేషమ్ము గడుప దలప
అనతి కాలముననె యతడస్తమించె.

తే. ఇంతి నడయాడు త్రోవ ప్రార్థింతునెపుడు
క్రౌర్యమున నాదు ప్రేమను క్షయమొనర్ప
ఆమె పరిహాస మొనరించు హర్షమునకు
మృత్యు సన్నిధి చేరెద నిత్యమేను.

తే. చంచలములు స్త్రీ ప్రేమ సంచారచయము
నవ్యమై నిత్యముండు కాననములటుల
అన్ని వ్యవహారములలోన నతివ యుండు
ఇద్ది సత్య మటంచునునెరుగవలయు

తే. ప్రొద్దుననె స్నానమాడి సరోజ మొండు
సరసు నంతటి స్మృతులతో పరిమళింప
చేసె దానికి మూర్ఛిల్లి శీతకరుడు
కలతతో నందులోబడి కరిగిపోయె

తే. ముగ్ధ తారకాలి సరోజ ముకురములను
కలల సుందరముగ నలంకరణ గొన్న
దృష్టవలె నా సరస్సు ప్రత్యక్షమయ్యె
స్వప్నమది నాది పరిపూర్తి వడయలేదు
ఎంతగనొ భాస్కరుండుదయించు వేళ
రంగుల హిమబిందు లెటులొ రక్ష చేసె
నస్తమించెడి నాదు ప్రాణాల నపుడు. 56

తే. అగును దోషమ్ము జనుల రతాభిలాష
అందు మూలాన పుట్టిన యామిషమ్ము
పాపమాంసమ్ము అద్దానివలన వారు
మూల పాపమ్ము నిత్తురు బాలలకును.

తే. నారి! నీవు పిశాచికి ద్వార మెదురు
కొంటి వయ్యది భీతిని గొన్నవాని
దేవపుత్రుని జంపిన తెరవనీవు
దుఃఖదస్తుల చీరెలతోడఁ దిరుగు.

తే. ఇట్లు 'మారిసు వెస్టు' వచించినాడు
అతడు కారలు యాంగను నట్టి యతని
మానసిక శాస్త్ర విజ్ఞాని మహితయశుని
అట్టి ప్రణయము బాధించె ననుచు తెలిపి.

తే. తనదు నుద్యోగ సహచరి, తన్వి, ప్రేమ
తోడ శయ్యాతలాన సంతోషపరుప
'యూంగు' భార్యకు యువజన యూంగ్ల వలన
లీల నిప్పించె తమి మహాలింగనముల.

తే. పరిణయమునకు భిన్నమై పరుగు ప్రేమ
పెద్ద కాలము సాగిన వేరు పడదు
దినము వంటిదె, దోషమే తెలిపినారు
వెస్టు, 'యూంగులు' ఇర్వురు స్పష్టముగను.

తే. సత్యమౌ ప్రేమ పరిణయ నిత్యమైన
ప్రేమ విషయాన విధులు కల్పించె కొన్ని
షండభర్తల నజ్ఞాన సతుల భావ
బాధలను గూర్చి వేధింప పాడిగాదు. 62

తే. కలుగ సంప్రీతి నవకాశ కలహమపుడు
కంచుకమ్ముల మృదువసనాంచలముల
విప్పి పడవేయు వారికై వీరరసికు
లంపెదరు మక్షికాళి ప్రహర్షముననను.

తే. ఉభయపక్షాల నిట భేదముండ దెపుడు
మనుజ యందున నట్టులే మనుజునందు
వనిత తన యాత్మ ప్రియున కివ్వంగ మాను
నరుడు ఆత్మను ప్రియ కీయ మరచిపోవు.

తే. గేదె బుజమున వ్రేలుచు, మీద కొమ్ము
చేతఁ గొట్టఁబడుచు మ్రోగఁ జేయబడిన
వీణ కడనుండి యేతెంచు వెఱ్ఱిధ్వనిగ
సిమసిమల దోమలగుంపు చెలగు చుండె

తే. ఆతఁడుకులీఁను డది యొప్ప దంగమటుల
రెండు మోములు గలవాడు, నిండి మోము
నందు నుండ నన్నము పల్కియందముగను,
వీడ నీచ భాషణసేయు విరసముగను.

తే. పటహమును బూని వాయించి భర్త నీదు
దౌష్ట్యతను జాటుచుండగాఁ గష్టపడక
సిగ్గు పడకను నృత్యమ్ము సేయునటుల
వేయుచున్నావు గమకముల్ వెలఁది నీవు!

తే. అతఁడు నేఁడె స్థలాంతర మరిగినాఁడు
అందువలన నా వీథిలో నాదియందు
నున్న దేవాలయ ప్రాంగణోన్నతములు
మా మనస్సులు శూన్యమ్ము లేమి తెలుప. 68

తే. ఓయి, నే తెల్పునటుగాక ఊరకీవు
ఆడుచున్నావు గానగ నహరహమ్ము
బెల్లమునకై అరసికూడ బెల్లమైన
లేకరసము కాదనియఁగ లేదె నీవు.

తే. చక్కకా కాళ్లు పిసుగుట, చాలశక్తి
కలిగియున్నట్లు నా హస్తములకు నేమొ
చేర్చె లాక్షా మహారాగ చిత్రణమ్ము
ఆమె పాదాలు... ... 70

# అనామిక

తే. కూర్మి సంతోషపెట్టఁ బూన్కొనియొ యేమొ
యెవతె తన భర్త కూరిలో నితర వనిత
లెల్లరను బవిత్రలను గావింప లేదొ
యట్టి స్త్రీ చేయుఁబతిని నాహ్లాదరహితు.

తే. శుభ్ర 'శయ్య'ను విడని వస్తువులు కనఁగఁ
కొన్ని మాత్రమె యున్నవి ఎన్నొ లేవు
అందు స్త్రీత్వమ్ము విడువని యబల యొకతె,
ఆమె తన 'శయ్య'తో భర్త నాదరించు.

తే. భర్తయే దైవమని నమ్మి ప్రబలభక్తి
వర్తన మొనర్చు సతి – మానభంగమునకు
గురియగుట కనియును, నామెఁ గూర్చి 'దుష్ట'
పతిత యని పల్కుటది మహా పాపకర్మ!

తే. రమ్యతకుఁ బ్రతిక్రియ మనోలౌల్య మౌట
స్త్రీ పురుష శక్తు లుభయముల్ చేరుకొనిన
నందగత్తియ, సౌజన్యయైన పడతి
యీ జగమ్మున స్వాదు సమాజ మౌను.

తే. కామచారమ్ము స్త్రీ జనప్రేమ కాన
భవ్యవనమటు నిరతమ్ము నవ్యమగుచు (నవ్యుఁడగుచు)
నుండఁగా వలె, లేకున్న నుండఁగలఁడె
భర్త యెంతటి పాలనా ప్రౌఢుఁడయిన?

తే. వరల నెవ్వేళ శుద్ధాంత వైద్యవరుల
తో రహస్యాలు రాణులు కోరుకొంద్రు
వారి ప్రియులను జేర్తురు వారె వారి
భవనముల షండ వైద్య సేవకుల భంగి. (పగిది) 6

తే. సైనికోద్యోగి కన్యదేశముల యందుఁ
దరచు సక్రమ పత్నియై వరలు వేశ్య
అతడి పత్ని పతివ్రత యయ్యె నేని
విరహిణీ గోపిగా మారు విష్ణుభక్తి.

తే. రాజవైద్యుల జీవిత లక్షణముల
విశదముగఁ దెల్పుటన నవివేక మెపుడు
నమ్ము, తొలగించునవ్వారి నాలుకలను
ప్రభువు రాణుల బ్రతుకును గుప్తమొనర.

తే. దున్న దగినట్టి భూమియే దుహిత, నన్నుఁ
బిలిచితివి గాన నడుగఁగా వలచినాను
ఇచ్చితివొ నాకు మీ విద్య నచ్చ నేర్పి,
ధనికు నీ కల్లుఁ గావించి, తనియఁజేతు.

తే. నన్ను దోచిన ప్రియుఁడవై యున్న నేమి?
నాస్తికత గాఢముగ నెద నమ్మి నీవు
కలిసి తిరుగు నా చెల్లి యొక్కతెతోఁ దప్పు
నెవరితో నైన వాదించుటే నెఱుంగ.

తే. తరుణులకుఁ 'బ్రతిదాన' నర్థమ్ము గలదు
'ఏను చతురంగ కేళి నోడింతు నిన్ను'
అనియె యౌవని అర్థమ్ము నరసి మదిని
'అద్ది నాకు నదృష్ట' మం చనియె నతఁడు.

తే. అంతగా ననౌదార్యుండ వగుచు నన్ను
నీ వెదుర్కొందు వేని నే నిన్ను నిలిపి
యాపఁగా శక్తి గలదాన నౌట సున్న
అగుము పితవు, ప్రియుండ వియ్యాటయందు. 12

తే. "భర్త కడనుండి కొనిపోవఁ బాడియేమి
నీకుఁ గల"దని ధార్మికుల్ నిలిపి, యడుగ
"పడయు దనురాగమును నేనె పాడిగాదె,
విబుధవరులార! విడుఁడని విన్నవించు."

తే. “దుర్గమును నేను రాజన్య దుహిత నగుట
దండయాత్రల నెన్నియో తట్టుకొంటి
సత్యముగఁ బెండ్లి ప్రేమ శ్మశాన మరయ
కాన, వరుఁడ కొన్నాళు లాగంగవలయు.

తే. “నన్ను బసివిని గావించినాఁడు నాన్న
భక్తిఁ గొల్తుఁ జరల్లింగ బసవలింగ!!
ఇత్తు సంతృప్తి నను వస్త్రహీనఁ జేసి
కొమ్ము బహురూపములను భోగమ్ము, రమ్ము.”

తే. ఏడుగురు భర్తలను జంపె నెవతె, ఆమె
పాలనము సేయఁగల దేక పాలనముగ
క్రొత్త మిండఁడు గని కన్నుఁ గొట్టినంత
ప్రాత మిండనిఁ దొలఁగింప భయము వదునె.

తే. “ఓసి పుష్పమ్మ, నిన్ను నే నుత్సుకమున
నెదను జేర్చితి! మధుర మీ యుదయవేళ,
కంటకము సోకె సూర్యనిర్గమనమయ్యె
నీవు వాడితి వీరతి నిలిచె బాధ!”

తే. “ఆడవేషాల వేయు మర్యాదఁ జూపు
టందు ఘనమైన సంతోషమగును నాకు
ఒక మహారాజ్ఞి వేషమ్ము నొనరఁ దాల్చి
నపుడు చూచెడి రాజ్ఞు “లో అక్క” అనిరి (నన్ను)”. 18

తే. “ఆడువేషాల వలపించు నపుడ బావ
ముద్దులతొ, చూపులతొ నెంతో మురిసిపోయి
యన్నమును దిన మరచిన యంత రాత్రి
[1]యక్క తిట్లతో, కొట్లతో నలసినాము.”

తే. “ఉత్తమునిఁ బెండ్లియాడిన యువిదకంటె
నెవనిఁ బెండ్లాడి భార్యయౌ నతనిఁ నెఱిఁగి

1 తిట్లు భర్తవి, కొట్లు చెల్లెలివి

యుత్తమునిఁ జేయఁగల్గిన యువిద మంచి
యధిక సౌఖ్యమ్ము నొందెడి యతివ యౌను."

తే. నన్ను 'నీగ్రెస్వ', నిజమె! అన్నావు నీవు,
ఉండునట వారిలో నరణ్యోష్ణిషమ్ము
అగుము స్వేచ్ఛాప్రియుండ వీయవసరమున
కనఁగ నీగ్రెస్సు నౌదునో కానొ నేను"

ఆ.వె. "మేడిపండు వోలె మేలిమియైయున్న"
దన్నుఁగనఁగ వచ్చి "యర్థమయ్యె
రమ్ము తెలిసికొనఁగ, రాత్రికి రారమ్ము
పొట్ట విచ్చి చూచి పురుగుఁ గనవు."

తే. "నగ్న రూపను, ననుఁజూడ భగ్నమొంద
దెవని మానస మా తండ్రి యవును యోగి,
లైంగిక క్షుధలకుఁ జిక్కి లొంగిపోని
యతని దేఁగద నారాయణాలయమ్ము."

తే. [2]"ముదిత వౌట భోగము లేక ముదిరె దీవు
నాకు లాభమ్మొ, లాభమ్ము నీకొ కనుము
'అయ్య యొప్పెడు నందాక నాగు' మనిన
నుందుమాయూర నిరువుర ముత్పలాక్షి! 24

తే. [3]"ఆమె గంధర్వకాంతయే యౌను, లేక
యంత యౌజ్జ్వల్యరమ్యమ్ము లౌనె యామె
స్తన యుగమ్ము వానిఁగన నాసక్తిఁ గొందు
నెపుడు రవిచంద్రులటుల శోభించు నవ్వి.

తే. "మద్య మాంస ముద్రా మత్స్య మైథునమ్ము
లనెడి పంచమకారమ్ము లార్జనమున
శక్తిఁ బూజించు మహనీయ భక్తవరుల
సాధనములైన నాకు మోక్షమ్ము నిజము."

2 రతి లేక

3 Ref. Helan Diary 27 April 1979

తే. “భర్త దుఃఖింప దుఃఖము నృడయు నామె
సంతసించు నాయమ పతి సంతసింప
భర్త దేశాంతరమ్మేగఁ బడయుఁ బాళి
భర్త మరణింప మరణించుఁ బరమ భక్తి.”

తే. “గేయనర్తకి, స్వరమేళ–కీర్తన నటి
నాట్యమొనరించుగతి రాజ్ఞి నాట్యమాడ
దామె సాగరపుత్రిగా నడుగులేయు
స్వరము సారించు దేవతావనితవోలె.

తే. ఆమెతో నడిపిన కలహముల వలన
నీవు ఋతువుల వెంటనే నిలిపినావు
ప్రస్రవణ లాగిపోవుట వలన నామె
యయ్యొ మధు వీవు పొంది యాహ్లాద మొంద.

తే. “పతిత పాదాలపైఁ బడఁ బనికిరాని
భ్రష్టు నను వలచితివి–నా భార్యవైతి
“వప్పు చేయించి కారకు నంపినా” న
టంచు నణువైన శోకమ్ము నంద వలదు. 30

తే. అట్టి దోషినె యైన నే నప్పుడతని
భార్యకున్ భర్తృదుర్గుణ పథము దెల్పి
యొనరఁ జేయించి ప్రతిచర్య లుల్లసిలెడి
యామెచే మిత్రునకు శాస్తి నబ్బఁ జేతు.

తే. కామినీ కాయ గంభీర కాననమున
ఘనకుచద్వంద్వ మనెడి దుర్గమ్మునందు
నో మనఃపాంథ! సంచారమొనరజేయఁ
దలఁపకు మచట నుండును స్మరతస్కరుండు.

తే. “ముద్దు దొరుకని యప్పుడే యొద్దికలతొ (ను)
పాడఁ బూనవె పెదవులు గోడు వడుచు
ఎది అయోగ్యమొ తెలుపఁగా నదియె పాడఁ
బడు నటన్నది తెలియఁగా వలయు చెల్లి!

తే. “కశ్యపునకును సురసకుఁ గల్గినట్టి
అజముఖిదియె యౌను నదృష్ట మవని యందు
అందముగ నున్న పురుషుల నట్టె పట్టి
ఘోషిలంగ రమించి సంతోష పడియె.”

తే. “వనిత అజముఖి క్రుద్ధ దుర్వాసుఁ బట్టి
రతి యొనర్పఁగ నతఁడు గర్వమ్ము తోడ
నిచ్చె పుత్రుల వాతాపి, ఇల్వలులను
ఆమె పొగరెంతొ తరిగిన దందువలన.”

తే. “నెలఁత! నను గెల్వ నిర్మోక నృత్యభంగి
మలను ముకురాన, జూపి సల్లలితగతుల
నోడితివి, నగ్న శివనాట్య మొనరఁ జూపి
గెలువ నెందర నీయఁగా గలవు చెలుల! 36

తే. పూలతావిని గ్రహియించు పురుషు లిరుగొ
కూరుచున్నార లిచట నీ కుట్టిమమునఁ
బూల, విచ్చినవిగని విస్ఫుల్ల ములుగఁ
జేసితావి నొసఁగు వారె చేరువారు?

తే. “వెలితివడ నేల? స్వామి! సేవికను నేనె
ఉంటిఁగద, తెచ్చియిత్తు నీ యుదయమందు
మైలవడకుండు నిదె మీ కమండలమును”
అనుచు నగ్నయై తెచ్చె సన్యాసి కనగ.

తే. ప్రణయినీ దర్శనాసక్తిఁ బరుగువెట్టి
వచ్చితిని తల్లి, ఆరాజ్ఞి భవనమందెఁ
చేసి కొజ్జాను చెలియ నన్జేరు కొఱకు
పట్టుకొని రమ్ము, భగవతీ! బాహుచార!

తే. సత్యమో, పురాగ్రీసు దేశమ్ము నందు
నగరములలోని జనజీవన క్రమమ్ము
లెన్నొ ఆఫ్రడైట్ దేవి పూజించి సాగు
ననెడి విషయమ్ము శ్రద్ధతో నరయు దేని?

తే. నగర గణికల పరిశీలనమునఁ దెలిసె
"గణిక కే నరుపైఁ బ్రేమ కలుగ దెపుడు
వేశ్య యెందరఁ గల్గినఁ బ్రియజనాళి
స్త్రైణమవు ప్రేమ నర్థించుఁ బ్రాణగాగ.

తే. నగ్న భంగిమల మధుపానముల సేవ
గోష్ఠులందున జరిగెడి గొప్ప విందు
లందు నిలిపెదరు పురవృత్త్యంగనలను,
శోభలను, పెరీనలను నస్తోకముగను. 42

తే. మధుర మధురమ్ము భామినీ హృదయవీథి
అరయ నేకాంత దృష్టియం దద్దితోచు
నీలగగనమ్ము క్రింద నుద్వేలగతుల
వెలసి భాసిల్లు దేహళీ–విపణివోలె.

తే. [4]"ఇమ్ము పదివేల డ్రాక్మాల ఇచ్చి, నీవు
కలుసుకొన నన్ను కోరింతు కడకురమ్ము
పొమ్ము కాకున్న చౌకగా నమ్ము కొనను
ప్రౌఢ జీవన నౌ నేను బాధపడెద.

తే. [5]"మీరు క్రీడా విజేతలు మిత్రురాలి
తలఁపు నెఱిఁగి యే మొనర్తొ తెలియఁ గోరి
యే లియోన్టిస్టు నీతోడ ఏంటియారు
తోడ శయనించి తొకరాత్రి గాఢరతుల."

తే. "ఆమె స్వేచ్ఛకు అమెజాను" అనఁగ నద్ది (ఆమె)
స్తనము కోసి ధనుర్విద్య తాను నేర్చి
ప్రభువు రక్షణ కొఱకునై పార్శ్వచరిగ
నిలిచి, వర్తించు నాఫ్రికా నెలఁత వీర!"

---

4 లయన్ డెమస్తనీస్‌లో అన్న మాటలు
5 క్రీడావిజయం కోసం అన్యోన్యం ఈర్ష్య వహించేవారిలో ఒకడితో ఒకడు

తే. “తన్వి నా శరీరమ్మునఁదరిగె నగ్ని
ఎవఁడు నీ మాంద్యమింక తగ్గింపఁగలఁడు?
ఎదను బండింప మృదు మధు రేప్సితముల
నెవని నాఁగలి నీయెద నెఱిఁగి దున్ను.”

తే. “బావ! ప్రభవించె వింత స్వప్నమ్ము రాత్రి,
పొలము నైతిని నేను నీ తలఁపు నెఱిఁగి
నీదు నాఁగలి నను దున్ని నిలువ నెదియొ
యందు బిడ్డలవలెఁ బుట్టె నద్భుతముగ. 48

తే. “ఆట వెలఁదిని గానునే తేట గీతి
నెవరి హృదయమ్ము కడకైన నేగఁగలను
అదియె నా బ్రతుకునకు ననర్థమయ్యొ
పత్నిఁ గన్గొనఁ బూనఁగా భయము గొల్పు.

తే. “ఎట్టి యాచ్ఛాదనమ్మున్న పట్టుబడదుఁ
బూర్వజీవితమున” కని పొలఁతి, విధవ
‘హన్న’ పెట్టెలో నాఫీసు కరిగి యచట
[6]నాడె వెల్మొంటుతో వివాహమ్ము నటులె.”

తే. “మల్లయుద్ధమ్ములో గెల్చి వెల్లికిలగఁ
జేయఁగల మల్లవీరునిఁ జేసికొనగ
భర్త, నిదె వచ్చితిని, మహాబలుఁడ వీవు
తన్వినని పోరు మాను టధర్మమయ్య.”

తే. “పొందవలె ప్రజ దేవతాపూజనముగ
శ్రద్ధతో నుల్లసముతోడ రతినిఁ బ్రీతి”
యనుచు నాచార్య రజనీషుఁ డన్నమాట
యౌనె సత్యమ్మటంచును నరయవలయు.

---

6 ‘హన్న, వెల్మొంటు’ల వివాహం ఫ్రాన్సులో 22/2/1789న జరిగింది – ఆంధ్రజ్యోతి, వార్త

తే. “వృద్ధ నైతి నే ననుచు భీతిల్ల నేల?”
వైద్య శాస్త్రజ్ఞురాల, మీవాంఛఁ దీర్తు
వ్యాధులకు మీరు భయపడవలదననె
“ప్రౌఢ! ఇచ్చెద సంతోష బహుమతులను”

తే. “కరుణకున్నది మృదురమ్య కాయ, మరసి
నంత ‘అరుణ’ మహోదాత్తయగుచుఁ దోచు
చెలువ లిరువురి పాట నా చెవులఁ జేరి
యెదను రెండుగాఁగను విభజింప నేర్చె.” 54

తే. “మిమ్ము నిరువురఁ దమిని ప్రేమింతుఁగాన
నెవరిఁ బెండ్లాడుటో మీలో యెరుక పడదు”
“కోర మెవరము నిన్నుఁ బోఁగొట్టుకొనఁగ
పడయవలయును మిమ్మిర్వురఁ భార్యలుగను.”

తే. “అతి ఘనమ్ముగ నాట్యమ్ము నబ్బుఁ జేయ
నిత్తు దేహమ్ము, నాత్మ నే నెవని కైన
పత్నిపైఁ బ్రేమనన్యను బడయకున్న
ఆయనకు నేర్పెదను పరకీయకాంక్ష.”

తే. “ఆస్తి నిచ్చుట నన్యాయ మన్న చేసె”
ననుచుఁ పలుమార్లు మరఁదితో ననఁగ వదినె
ఆత “దేమొనర్చెద వీవు” అనఁగ, నామె
“ఇత్తునామది నీవు సుఖింపు మనియె.”

తే. “ఉన్నయది నీ నిచోళ మదో ఉషస్తి,
నిలువు, వెడలుపు మార కెన్నేళులయ్యె
గలసి గుడివీథి యక్కలఁ గాల్వకేగు
మట పురుషవాసనలు సోకు అంతమారు.”

తే. “అవల దూరాన శృంగార హావభావ
కేళులను జూచి పొంగెడి క్రింది మంచె
పైన సన్యస్త మానినీ భక్తి కక్ష్య
రెంటిలోఁ గాపురము సేయుచుంటి నేను.”

తే. “ఆమె యొక నైజమణి, కాన నవసరమ్ము
సర్వసౌందర్యయుత పరిష్కార గరిమ
అగుట నాయమ యాద్రాక్ష, తగదు కోయఁ
గాపు గానట్టి సమయ మీ కాలమందు. 60

తే. “నీకు నొక భాష నిత్తుము, మాకు, ప్రియుఁడ!
ఇమ్ము మరియొక భాష మాంద్యమ్ము వీడి”
అనుచుఁ బిల్తురట విటాళి నద్భుతముగ
ముద్దునకు ముద్దు లొసగెడి ముగ్ధ లెల్ల.

తే. “చూచిఫల మేమి? వలయును తూచుకొనగ”
అనిన సుందరి చెల్లెలి నడిగినపుడు
“చూచిననె చాలున” న్నని చూపినదట
అర్ధవస్త్రమ్ము తొలఁగించి యందమెల్ల.

తే. వేరు గ్రామమ్మునకు నేను వెడలునపుడు
పుత్ర! మిండడౌ మగనికి బుట్టి నట్టి
యతని, నినుఁబుత్రుఁగా జెప్ప నాత్మనిచ్చ
వడను తమ్మునిఁగావించి నడచుచుందు.

తే. ఇత్తు నాకున్నవని చెప్పి, యిచ్చువడుచు
నిచ్చె, దనకున్న వ్యాధుల నెల్ల నతివ!
లేదు దోష మాయమ కడ లేశమైన –
కడఁగ నైతిని జాగ్రత్త వడగ నేను.

తే. “నన్ను, యౌవనవతి! నిండు నాల్గు వత్స
రమ్ము లొంటిగ నిద్రించు నమలచరిత!
అనుచు నా పతి రణభూమి నాత్మ నీర్ష్య
నొందు” ననియు నొంటిగఁ బ్రియునొందునొకతె.

తే. స్త్రీలఁ గొందఱ ధర్షణ సేయకున్న
కా దభివ్యక్తి మే జేతృ ఘన జయమ్ము
అట్లు గెల్వంగ బడసిన య య్యంగనలకు
నా విజేతలకడ రహస్యములు లేవు. 66

తే. ఈ యుషస్సున నాకడ నీవు బ్రీతి
భావభవకేళి సౌఖ్యమ్ము వడసి తనుచు
వినఁడు నా పతి యని నేను విశ్వసింతు
మనసు పడుఁగానఁ గోల్పోవ వినడతండు.

తే. నీ వొసంగిన బహుమాన నిధిని దెల్పు
మనుచు నవ్వుచు నడుగ నా ఘనున కెరుగ
తెలిపి, యా వ్యాధి తీర్పింపఁ దిరిగిరాక
యతఁ డవజ్ఞ నొనర్చె నన్యాయముగను.

తే. "క్షణము, క్షణ మొంది శృంగార గరిమ నీవు
నాదు వలపును బెంచు నో నాతి! అయితి
'వబల' వన అనె 'నిద్ది సత్యమ్ము నాకు
శాసనమ్ములు నీదు నాసక్తు లెల్ల."

తే. "నగ్న సంపర్క దానయౌ నాతి' యనుచు
ధరణిఁ బేర్గన్న వ్యభిచారదర్పనైన
నేనె లేకున్న నానాఁడు మాన, పుణ్య
పరమరమణీయ, ఆ రాజ్ఞి బ్రతుకఁ గలదె?

తే. "లీల, భారమ్ము నిలిపి యాలింగనముల
బ్రణయ చుంబన, మధురానురాగములను
భారయుతఁ జేసినారలవ్వారు నన్ను –
కడఁగినారె నా ప్రేమ సాక్ష్యమ్ముఁ గనఁగ.

తే. నాదు మృతి వెన్కనే పొందు నాదు పత్ని
సౌఖ్యసంపత్తి, ప్రేమ విస్తారముగను
ఎవఁడు నావెన్క పెండ్లాడు నిచ్చ నామె
నతఁడు కను నామె గన్నెగా అనుభవించు. 72

తే. "ఎంతొ కాలమ్ము పైనను నెంతొ కాల
మటులె క్రింద నుండఁగ లేను – అట్టు లుండు
టగునె ధర్మమ్ము – అట్టుల యైన నాకు
నిచ్చినట్టులె యవమాన" మనియె నామె.

తే. “అయిన ముద్దిడ నిండు మీ హస్త” మనిన
“హస్తమా? ఏల నీ కిత్తు నద్ది? ఇవిగొ,
వీని ముద్దిడు” డనుచు న వ్వీరవనిత
ఇచ్చె మోమును, పెదవిని మెచ్చె ప్రియుఁడు.

తే. ‘సకియ కావించు దోష ప్రచార వర్త
నముల పద్ధతుల కడు మనసున నెఱింగి,
పరమ శృంగార వీర కల్పన మొనర్చి
తనకు విఖ్యాతి నొసఁగ నాదాసి మెచ్చె.”

తే. వస్త్రరాహిత్య మోహన వర్తనమ్ము
కన్యకాత్వమ్ము నొందఁగా గలుగు నేర్పు
వడసి విలసిల్లు భోగినీ వనిత లెపుడు
నతని కేలోపమీయలే రచట, సకియ!

తే. మగల సంతోషపెట్టఁగా మనసు వడుటె
ముదితల యలంకరణలకు మొదటి యవధి
ఎరిగి యిద్దాని పురుషులు పరమరక్తి
వనితలను గూర్చి మెలఁగఁగా వలయుఁ గాదె!

తే. కామ లౌల్యమ్ము వ్యథ వెట్టు కాంత, విధవ
నామె పితరుఁడు చేసె సన్యాసినిగను
ఆమె మది కోర్కెఁ దీర్చుకో నయ్యవారిఁ
జేసి వైచెను గామినీ చిత్తజునిగ. 78

తే. ఆమె పొక్కిలి దిగివేగ నడచు నాదు
నేత్రదృష్టిని గనియామె “నేను తొలఁగ
ద్రోసి మొలనూలు విజయ” నౌదు నని నవ్వ
మాని పదకూల భద్రత నూన సాగె.

తే. “ఆమె దేహంపు టందంబు నరసి నావె
యనుచుఁ బినతల్లి యడిగిన నామె మెచ్చ
“ఆమె భర్తను గాకుంట నామెనాకు
నరయఁగా వీటు నీయలే” దంటి నేను.

తే. పక్క సవరించి తన పతి వచ్చు వీథి
చూచు సతి నొక యువకుండు తోచి, తరిమి
యింటిలోనికి రతిచర్య నలయఁజేసె
అతనికై చూచుచుండు నిత్యమ్ము నామె.

తే. ఒక్కతన్వి 'నా బ్రతు కెట్టులుండు' ననిన
"మచ్చ చూడక చెప్పగా మార్గమౌనె"
అనిన నద్దాని గనుమని యడుగ నంటి
"అద్ది యున్నది రమ్య రత్నాలయమున.

తే. "ప్రియుని రీతిగ నేను నే ప్రియను బోలి
యుంద మీనాఁడు నిరువుర ముత్సుకమున
సోదరుని పోల్కి నీవు నే సోదరినిగ
నుండ వలెగద రేపటి నుండి మనము."

తే. "తొందరగ నత్త! పూని కుదుర్చు వాఁడ
నీ కుమార్తెకు ధనికుతో నేను పొత్తు
అందులకు నన్ను నాల్నాళు లనుభవింప
నిత్తుఁ గూతునని ప్రమాణ మీయవలయు." 84

తే. "శుద్ధయా, ఆమె! ఆయమ వృద్ధవేశ్య"
అనిన విని యనె "పరిశుద్ధ నమ్మ నేను
పలువురకుఁ బత్ని నౌటచేఁ బడయ దోష
మొకడి పెండ్లాము నైయున్న యువిదఁ గాను.

తే. ఏను దుఃఖింపఁ బరికించు మానవుఁడవు
ఈవు ప్రేమించితివె? ఈయ నేల డబ్బు?
పాశవ ప్రియు వలెఁ గాక పైకి వచ్చి
యింగితమ్మిమ్ము ఇత్తు జయించుకొమ్ము.

తే. వలదు ప్రేమ నాకెయ్యది వ్యవధి లేదు
[7]ఔదు నే పురుషుడ, గోరుదాడు దాని

---

7. శిల్పి గాగిన్ జీవితం మీద ఆధారం చేసి సోమర్‌సెట్ మాహమ్ చేత లిఖింప ఛార్లెస్ స్ట్రిక్స్ లాండ్ అన్నమాటలు

నప్పుడప్పుడు – నా కామ మంతవఱకె
ఇతర విషయాల మమత సేవించుచుండ.

తే. ఏను నీదు రూపమును దర్శింతుఁ బ్రియుఁడ
విందు నీ వాక్యముల స్వప్నవేళలందు
నీప్రసన్నతనొందెద, నేను నిన్నె
భావనము సేతు మోహసంప్రాప్తి యొదవె.

తే. "అట్టి వయసున జరిగింప నగునె! – ఆమె
యింటిలో డబ్బు మిండని కిచ్చు కొఱకుఁ
దానె కాజేసి చెప్పె సంస్థానమునకు
ఆమె బహురణ కోవిదయైన నారి!"

తే. "చెలఁగు నామె భోగనిరత చిత్రమటుల
వెఱ్ఱి వడి చూచు భర్త, వివిక్త, నామె
రక్తి నొనరించు రతి సాంపరాయములను
వెఱ్ఱి వడిచూచు భర్త, వివిక్త నామె." 90

తే. "ఉండగారాదు చేరియే యున్న యప్పు
డొంటిగను మన మిర్వుర ముజ్జ్వలాంగి
అటులఁ గావింపఁ గల్గు నా కపజయమ్ము
ఆది నను హర్షరహితుగా నపహసించు.

తే. "నా యెదుట నిల్చి నీవు నగ్నముగ నుండ
సఖియ! ఇంక నెంతగను నసహ్య పడెదు?
అనెడి యా రాత్రి దౌసౌఖ్య – మౌనె స్వప్న
మనుచుఁ జాగృతి నొంది భావన యొనర్తు."

తే. "అతఁడి కడ రాత్రి నగ్నగా జతురిమముల
గడుపి యలసట నొందెద గాఢనిద్ర
లేచి, అతఁడు వెనుదిరిగి వేచి యుండ
వస్త్రములఁ దాల్చి నే సుప్రభాతమనెద."

తే. "తెలుపఁగావలె నా ప్రేమ, ధీరుఁ డతఁడు
లేఖ వ్రాయఁగ గ్రహియించు, లేక మాను"

నసంగ చెల్లెలు విని యనె నక్క 'అమ్మో!'
వట్టి పత్రమ్ము పడవేయ వలయు ముందు.

తే. పడతి పుష్పాసవ ప్రభావమునం బడచు
వేసి కొజ్జాసువేషముల్ వెడలి యన్య
పురుషు కడ కట మధుర సంభోగములను
బొంది పరితృప్తి విజయమ్ము నొందె సతిగ.

తే. యుద్ధభూమిని విడిచిన యోధుం డతండు
పలువు రువిదల ప్రణయమ్ము వడసి తుదకు
నొక్క ప్రభుపుత్రి భర్తయై యోర్మి, బ్రతికి
యయ్యె యజమాని యాయమ – యాస్తి కెల్ల. 96

తే. అందు కాసించెదవొ మగనాంధ్ర వలచి
పొంది పైంబడి తెలియ దూరొంద వలయు
నూర నున్నార లందాల యువిద లందు
నింపయిన కన్నెం దెచ్చి చేయింతుం బెండ్లి

తే. నాతి, చేసుకొన్నట్టిది నచ్చ దేని
విడిచి పెట్టంగవచ్చు నెవ్వేళ నయిన –
తల్లి, సోదరి తోడ సైత మ్మొకళ్లు
కామసంబంధ మైత్రిని గల్గియుంద్రు.

తే. ఒక్క పురుషున కొక పత్ని యుండుటరయ
నియమ మైయుంట సామాన్య నిశ్చయమ్ము
ఆటవికు లిచ్చు చుంద్రు నాయకున కెపుడు
నెందరో స్త్రీల నిచ్చమై యెఱింగి, యెఱింగి.

తే. ఎన్ని నాళ్లకు భర్త రాకున్న దేవ
దర్శనము చేసి మఱదితో తరలి వచ్చు
పడవగదిలోన వెన్నెల భ్రమయంజేయ
వదిన భోగించె మఱదిని భర్త పేర.

తే. ఉందు మీయింట దాసినై యొక్క నాఁడు
ఆర్ద్రతను జూపి పోషింపు దయ్యు నన్ను
పరిణయము నాడి వేశ్యగా బ్రతుకఁ జేయ
నున్న యువకుని వలలోన నున్నదాన.

తే. తండ్రి ముదివేశ్య కమ్మగాఁ దలఁచి తానె
కామసౌఖ్యాలు గొననైతి గర్భవతిని
వైద్యురాల నను బయటఁ బడగఁ జేయు
మీవు చూపిన యతని కయ్యేదను సతిని. 102

తే. "పేదలముగాన నీ తోడఁ బెండ్లి మానె
మామ మాటను నీ తోడి మనసు వీడ
జాలకను వచ్చుచుండు నా జాణ విడిచి
అతడి వలపు నీకెంతయో యవసరమ్ము."

తే. "భర్త మృతి నొంది కాలేదు - పడతి! ఒక్క
మాసమైనను, సేవించి మంచి వారి
పొంది గుప్తమ్ముగా గర్భమొంద సుతుని
[8]నర్ధ భాగమ్ము లభ్యమౌనాస్తి యతివ!

తే. "చెల్లెలి - కుమార్తె పెండ్లిని జేసుకున్న
అల్లుఁడా! నీకు నాకలి యైన చెపుము
ఎప్పుడెచ్చట నైననే నెఱిఁగి తీర్తు
అవసరమ్మైన కూతుండ్ర నంపి తీర్తు."

తే. "జబ్బుతోఁ గూతు రెక్కి మంచమును నల్లు
కామభోగ దరిద్రునిగా నొనర్ప
నతఁడు పరకాంతలకు సఖుఁడైన చెడున
టంచు రతిసుప్తు లిచ్చి రక్షించె నత్త.

తే. "అన్న పరదేశమున కేగి యధిక కాల
మైన రాకుంట కడు వియోగార్తి వడయు

8. అర్థ భాగమ్ము ధర్మ కార్యము కబ్బు

వదిన నర్మచేష్టలను భావముల నెఱిఁగి
యిచ్చి సంగమసుఖము సేవించె మఱది.

తే. “మనకు నేతేర నెట్టి సమస్య యైన
నొక్కరితొ సఖ్య మొక్కరి కుండ వలయు
ననుచుఁ బ్రియురాలు, చెలిభర్త కవసరముల
గుప్తముగ నిండ్లు రక్షించుకొనఁగ వలయు.” 108

తే. పరమగణికాంగనాకళాప్రౌఢ రతుల
ననుభవించెడి యవకాశ మమరఁ జేయు
పత్నియొక్కనాఁ డొక్కమారు వడసి పరుని
పొంద సౌఖ్యమ్ము క్రోధమ్ము నొందఁ దగునె?”

తే. “పురుష వాసన నెఱుఁగని పుణ్య సతిని
కోడలిని అత్త తనకుఁగాఁ గొంత మార్ప
నైనయది యామె కనినట్టి యతని నెల్ల
జారునిగఁ జేయగల మహాజారిణిగను.”

తే. “జారిణీ భోగముల నొందు చతురయైన
గృహిణి కిని సహాయ పడెడి శిక్షితుఁడు దాసు
డాయె వలన గుప్తమ్ముగా నప్పుడపుడు
నధిక తృప్తి సంయోగ సౌఖ్యమ్ము నొందు.”

తే. కూతురికి లేదు బిడ్డఁడు – కొడుకుఁ గనక
యున్న నల్లుఁడేడాది కింకొక్క దాని
చేర్చి పెండ్లాడెదంచును జెప్పినాఁడు
కనుక ముసలిది పరులతోఁ గలుపుచుండు.”

తే. “ఊరి పడతులు కొందఱు కోరినటుల
ఊరి సోగ్గాని నీ పతి నుండ నిమ్ము
అడ్డు పడఁ జూడఁ గలదాని ననుచు నీవు
కష్ట పడెదవు వారల కపటములకు.”

తే. “లైంగిక స్వేచ్ఛ పెద్ద లొసంగుచున్న
నష్టవర్షాల కన్నియ లయిన గర్భ
ధారణను బొందఁ గల్గు యాథార్థ్యమునకు
సాక్ష్యమిచ్చిరి వైద్యశాస్త్రజ్ఞు లిపుడు.” 114

తే. “తాతకాయమ నాల్గవ నాతి, యువతి
కాన దయతోడ వర్తించుఁ గామము నెడ
తానె రప్పించి యువకులఁ దనియఁ జేయు
నింతివారిచే, కనుచు హర్షించు నతఁడె.”

తే. “దూతిగాఁ బంపె నాతన్వి ప్రీతి నిన్ను
పరమచాతుర్య కామసంపన్న వీవు!
నన్ను వలలోన వేసుకొన్నావు తిరిగి
యరిగినపుడు తిట్టింపకు మలసటలను.”

తే. “ఎప్పుడాయన వచ్చునో యెఱుఁగు కొఱకు
నింటి పరిచారి కను బంపి యెంతొ సేపు
దాటినది అద్ది మొనగత్తె, ఏటికడను
నే మొనర్చుచు నున్నారో యేమొ వారు.”

తే. “కామశాస్త్రమ్ము నందు విజ్ఞాని యగుట
చేసి స్నేహము నతనితో శిష్య నగుచుఁ
ఒడసి నేర్పునఁ జౌష్షి బంధనములఁ
బేరుఁగొనియెద స్మరకళాభిజ్ఞనగుచు.”

తే. “ఏను శివరాత్రియని వచ్చి నాను నిన్ను
గలియలింగోద్భవమ్మగు కాలముననుు
పొడమ నసురక్తి నాపయి కొడుకు నొసఁగఁ
గడఁగుమా నీవు బావ, శంకరుఁడ వయ్య.”

తే. “వెన్నెలకు విచ్చు నా పూవు, వెట్టి వడుచు
నేను చూపింతుఁ దోటకు నిపుడెవచ్చి
బావ కదియిష్ట మైనచో వలపు మీర
నలిపి వేయంగ వచ్చు నా తలఁపు లెఱిఁగి.” 120

తే. “చేతనున్నది వడిసెల, చెడిపెవాఁడ
కంకులను గోయ వస్తివా? వాడి వెంట,
మంచె క్రిందికి రమ్ము నా మంచి పండ్ల
పూల, నీకిత్తు నాకిమ్ము భూరి సుఖము.”

తే. “చిలిపి పూవులఁ గోర నే చెరచినాఁడ
నెన్నిటినొ తృప్తిపడి సంతసింప నవ్వి
అత్త! ఈ పూవుకోరెడి యర్థమేమి?”
అనిన “చెరచుట కాకెద్ది?” యనియె నత్త.

తే. నలిపివేయ మటంచును నన్నుఁ గోరఁ
జిలిపి పూవుల నెన్నిటో చేసితటుల
లేతపూలివి నీయవి ప్రీతి యేమి?
అనిన “అన్యమే ముందు నం చనియె”

తే. “అడుగొ, కామమ్మ మగడని యంద రనఁగ
బిచ్చ మెత్తెడు నతని నిర్భీతిఁ బిలిచి
కాపురము సేసి కొడుకును గన్న పిదప
శంక జనియింపసాగె నా స్వాంతమందు”

తే. “ఏను రతిఁగూడి నిన్ను శిల్పింతు నిచట
మదన విగ్రహమని నాకు మాట నిచ్చి
నట్టి ఓ శిల్పి! కోర దేహమ్ము నిచ్చి
యెదుట నుండెద నయిన రాజేంద్రు సతిని.”

తే. “అమ్మ పుట్టింటి కేగఁగా నయ్యవారు
లొంటిగా నుంట నెఱిగిన యువిద లెవియొ
పనులు పడ్డట్లు విచ్చేసి పలుకరించి
ప్రణయవశుఁ జేయ సాగి రభ్యర్థనముల.” 126

తే. “నగ్న రూపాన శోభించు నాతిఁ గనియు
నెవని చిత్తమ్ము చలియింప దించుకైన
నాతఁ డింద్రియములఁ గెల్చి నట్టి యోగి
యని వచించుట యెంతయో యర్థయుతము.

తే. “అన్ని పాలిచ్చి మేల్జేయు నాల మంద
కుండి యుండెడి ఆ కోడె లొకటొ రెండొ
ఎందుకిటు పుట్ట మగవార లింతమంది
ఆడ పుట్టువులకు నింద లవసరమ్మె?”

తే. నమ్మితే నమ్ము లేకున్న నమ్మఁబోకు
అమ్మ వ్యభిచారముల నెద నాపుకొనఁగ
లేక యయ్యకు స్పష్టీకరించి చెప్పు
చుంటి – ప్రాణభయము మనకున్న దింక!

తే. పరసరోరుహ నేత్రల వలపు తగుల
భార్య పట్టించుకొన నట్టి బావగారి
నామె కిప్పింప నొప్పించి యందగత్తె
మరదలు జయించె నర్చించి మదనకేళి.

తే. రండు, సుఖియింప నొకపరి రాత్రి వడిన
నింటి కేగుట కష్టమ్ము ఈయ నేల
ధనము, అమ్మశరీరమ్ము ఘనులు మీర
లొంటి వ్యథనున్న నే ప్రీతి నొప్పుకొంటి.

తే. ఆడువారిని జెరచుట కాడువారె
తోడ్పడుచునుందు రెందరో దూతి కలుగ
యోగినీ వేషములను మేలొనరఁ జేయు
ధర్మసతులట్లు మాతృవృద్ధాంగనలుగ. 132

తే. భర్తలను జంపి తెచ్చిన ప్రౌఢ సతుల
కామ యుద్ధాల గెలువక కన్న కీర్తి
వ్యాప్తి నొందదు జయవీరవరుల కిలను
రంజనుల్, భోగినుల్ చేరరారు ప్రభుల.

తే. సఖియ షాపునకు ప్రచార సాధనముగ
నగ్నరూపానఁ గూర్చుండ నన్నుఁన నిలిపి
ఎంత కోరిన నిప్పించి యంత డబ్బు
క్రమముగాఁ భోగి నిని జేసెఁ గడకు నన్ను.

తే. రెండు శాఖలు కలియుచునుండు చోట
నల్పతరుశాఖ పురుషావయవ మొనర్చి
దానిపై నగ్నునైయెక్కి యే నొనర్తు
రమ్య పురుషాయితమ్ము హర్షమ్మె సంగ.

తే. అద్ది శివరాత్రి కొలనుల నాటవిడుపు
స్త్రీలు, పురుషులు స్నానముల్ చేయుచుంద్రు
అల్పవస్త్ర వివస్త్రులై యటులె కలసి
ప్రకృతి జ్ఞానమ్ముతో చూచుచొకరి నొకరు.

తే. “నన్ను నగ్నగ పదుగు రానాఁడు పట్టి
వరుస రభసగ భోగించి చెరిచిరి గద!
అటులె యా యందగానిని నెటులొ పట్టి
వరుస నలయించి రతులతోఁ జెరుపవలదె!”

తే. “ఏల హస్త ప్రయోగాన నిట్లు నీదు
వీర్యమును స్ఖలనము సేతు భార్య దొరుకు
వరకు నిత్తు నా వృద్ధ పుష్పమ్ము నీకు
నవ్వ నద్దానితో నిత్యమాడుకొనుము.” 138

తే. “సత్య ధర్మాను గుణముగా జనులు పొందు
నర్థ సంపద, కామ సౌఖ్యమ్ము మేలు
కలుగఁజేయు ముప్పు నెపుడు కలుగఁజేయ
వనఁడె తలఁప మహర్షి వాత్స్యాయనుండు.”

తే. “ధనికుఁడవు జ్ఞప్తి వచ్చె నత్తయ్య యిపుడు
వచ్చితిని నేటికైనను బలుకరింప
నన్నొ నేఁగన్న కూతుఁ జిన్నమ్మ నోను
నిన్ను సుఖపెట్టెదము తోట నున్న దామె.”

తే. “ఎరుగుదువు నన్ను ప్రియసఖీ! యీ పరీక్ష!
నేను నదిలోన కడుదూర మీద వలయు
సరస నపుడపు డీదు ముత్సాహ పరుప”
నన “వివస్త్ర నైముందిడు దనియెనామె.”

తే. “మాతొ సుఖియింప నిచ్చిన మమ్ముఁ జేర్తు
రింద్ల కను నూహ నంగీకరించి నాము
తెలుపుఁ డద్దాని మీరు ప్రతిజ్ఞఁ జేసి
పలుక విని యందరము స్థిర పడఁగ వలయు.”

తే. “ఇంతగా నందమును బెంచి యెవరి కిత్తు
నన్న పతియౌట కొక్కఁడే నాశపడఁడు
కష్టకాలమ్ము, దీనిని గడుపు కొఱకు
నమ్ముకొన శరీరమిపు డత్యవసరమ్ము.

తే. ఒకనితో మున్ను రతిఁగొన్న యువిదవైన
నేను భోగింప ననదవీ వైన వినుము!
ఏ పవిత్రను, మున్నెన్న డెవని నెఱుఁగ
కాన నేఁ గలియను పరకాంతుఁడైన. 144

తే. “ఆడు దొంగలు శిక్షల ననుభవింప
కెటులొ తప్పించుకొనుట నెఱింగి యాక్ష
సేయు చధికారిణి కడు శిక్షింపఁ జేసె
ప్రతి యొకతె నొకపరి దశ భటుల రతిని.”

తే. “పేదగావునఁ గాకున్న పెండ్లి, యొకతె
నన్నుఁ గొనిపోయి యింటికి నిన్న, నాథు
సరణిబూజించి సంగమ సౌఖ్యమనుభ
వించినది శరీరము సమర్పించి నాకు.

తే. “పణ్యగా నేఁడు గావింపఁబడుట వలన
నెఱిఁగి వచ్చి నా శయ్య నిద్రించి నీవు
నన్ను భోగింపకే యిచ్చుచున్న ముదుపు
నే నధర్మమ్ముగా గ్రహియింప జాల!”

తే. “ఎవడు తొలిసారి తీయునో యిచ్చు నతఁడి
కెపుడు కల్లును చెట్టు నే నెపుడు నట్లె
దానివలెనే కలిగి యున్న దాని నిత్తు
నిచ్చువడి పతి పంపిన యెవని కయిన.

తే. “ఎంతొ యాడింతు రని జీలు గింత త్రాగి
వస్త్రరహితలమై యున్న వార మొక్క
గిరిజనుఁడు రాఁడు మత్తెక్కి కేకపెడుదు
మితరులను వచ్చి మాతోఁ గ్రీడింపుఁడనుచు.

తే. “వర్షమేను మరొక మడిబట్ట లేదు
మైల పడ నేను నే తెల్వి కోలుపోను
రమ్ము, పోబోకు” మని వివస్త్రయయి, చేర్చి
ప్రియుని సెయ్య, నడిపెఁ గమ్మవిల్తు కేళి.”

తే. “ఉత్తమ కులాన బుట్టెనా? ఊరికుక్క
వెంటఁజేరిన దాశుని విడిచి రాదు
చిత్తకార్తె గదా, ఇది చెప్పు డిద్ది
అమ్మగారికి నో భటులార! ఇద్ది.”

తే. “ఆ ప్రపాగేహ పాలిక యంద కత్తె
బాటసారుల కదియేమి బాంధవమ్మొ
ఎంత త్రాగిన దాహమ్ము సుంతతరుగ
దధిక దూరమ్ము తరిగిన యటులఁ దోచు.”

తే. “నవ్య దంపతుల్ కనబడ నాల్గు నాళ్ళ
కడిగె పరిచార కెద్ది యాహారమనఁగ
తేనె గావలె నాకని స్త్రీ యనంగ
నన్న మెపుడైన తినవలె ననియె దాసి.”

తే. “నేను లిఖియించు చున్నాను గానఁ గథను
నందముగ నంత మొందించుటవసరమ్ము
మలుపుఁ దెలుపు మనంగ మా మరదలనియె
భర్తఁ జంపింపు మో బావ, భార్య చేత.

తే. “కడకు నన్ను జనుల్ పురోగమన యనుచు,
భావనోద్ధతననియును బలుకుచుంద్రు”
అనఁగ నా తొడ దిగవమ్మ వ్యాధి తెలిసె,
వలయు మందిత్తు నని పల్కె వైద్య వరుఁడు.

తే. “ప్రౌఢ పరిపాలనా ప్రచారమ్ము కొరకు
నగ్నముగ మౌనముగ మహానగర వీథు
లందు మొగవార లొకపంక్తి, యాడువాడు
ప్రక్కనొకపంక్తి పయనింప వలసి వచ్చె.” 156

తే. “అక్క నీకిచ్చె నీ కోక, అద్ది నీవు
కట్టుకొనుటను దిలకించి యెట్టులుండి,
యెటుల సంతోషపెట్టునో యెఱిఁగి దాని
ననుభవించి రమ్మని ప్రేమ నంపె నన్ను.

తే. “వీడు భర్తని యిత్తురు పిన్ననాఁడె
పిల్ల మనసును జూడరు పెద్దవారు
ఎవని చూచి పతియని భావించు నద్ది
అతి పతివ్రత, పరమధర్మాన్వితయును.

తే. ఆమె వెనుకాడు టెఱిఁగిన యతివ కాదు
ఇష్ట పడునట్లు నటియించునింతి – నీవు
నగ్నయగు నిశిఁబ పద్మినీనాథు పగిది
చిత్తొనర్పుము, మది సంతసించునామె.

తే. భర్తఁ గోల్పోవుటను గడుబాల్యమందె
కులటగానున్న కోడలి తలఁపు లెఱిఁగి
యబ్బఁగా నున్న యపకీర్తి నాప మామ
తానె రతి సౌఖ్యమొసఁగుట తగదె తలఁప.

తే. “ఆమె భర్తను చెలికత్తె యడిగె నేని
యామె సమకూర్చు నాతని హర్షమునను
కాయ విషయాల మగలకుఁ గలుగు నీర్ష్య
జాలి వడెదరు స్త్రీలు దుర్జనుని యెడను.”

తే. “వాంఛతో వచ్చె నడిరేయి బావగారు,
పాప మక్కయ్య ఇప్పుడే బయటఁ జేరె
వద్దనన్నాడు అన్నమ్ము – ప్రక్కవేసి
అక్కవలెఁ జేరి ప్రక్కనఁ జొక్కఁజేతు.” 162

తే. "సిగ్గువడ మీరు నగ్నను జేసి చూడ
అచటి కురుపుఁ బూర్తిగను నయమ్మొనర్చి
నన్ను సుఖపెట్టఁ గలిగిన, మున్ను మీకు
నిచ్చుకొందును నన్ను భోగింప నిచ్చ."

తే. "ప్రణయ విక్రీడ మధురమై పరగె మనకు
ఒకరి యెద పూర్తి యెరిగితి మొకర మొహోహా!
ఎట్టి కోమల హస్తాల నిటు లిఖింతు
వంగి పారాణి వినతి నా పాద యుగళి."

తే. "ఉద్యమములకు పరమ ప్రయోజనముల
గూర్పనవసర వేళలఁ గొంతమంది
దేశ సేవికల్ పొంది యుద్దీప్తి ధర్మ
వర్తనమ్మని ప్రౌఢలై వ్యభిచరింత్రు."

తే. ఉద్యమములకుఁ పరమప్రయోజనములఁ
గూర్పనవసర వేళల గొంతమంది
వ్యభిచరింతురు ధర్మకార్యముల పగిది
దేశ సేవిక లవికావె దివ్య కృషులు.

తే. కన్నెలం దెంతొ వైచిత్రి కలదు – వారు
చిన్న యెలుకకు భయమంది బెదరిపోయి
పిదప సాహసశీలులై ప్రీతిఁదూకి
చిక్కు వడెదరు తోడేంద్ర చేతులందు.

తే. వనిత, బిడ్డలు గల తల్లి, భగము నద్దె
కిచ్చి కనియె పిల్లను బ్రజ కెరుక పరిచి
ఇందులకు వ్యతిరేకులై యెవరొ యడ్డ
న్యాయ నిర్ణేత పిల్ల కన్నతని కిచ్చె. 168

తే. "వృత్తి, యుద్యోగ మెదియైన నింతులదియె
యైన నార్థిక సాంఘిక యైన యట్టి
దాని దగు స్థితి మిక్కిలి తరగిపోవు
నని జగత్కార్మిక సమాజ మనగలేదె."

తే. “నగ్న నౌ నన్నుఁ జూచుకో నాకు వలపు
కలిగె ముకురమ్ము కొన్నాను తలఁచి నటుల
చూచుకొనఁ గొంత కాలమ్ము తోచె నాకుఁ
బ్రీతిపరుల కారూపుఁ జూపించుకొనఁగ.”

తే. “స్థలన మాపెడి సంభోగ కర్మఁ గనఁగ
నెవ్వ రెవరెస్టు శిఖరమ్ము నెక్కుటకుగ
యత్నమొనరించుటను మాని యంతలోనె
తిరిగి వచ్చుట వంటిది – తెలియవలయు.

తే. “చలికిఁ దాళఁగ జాలని ముసలి వోలె
వణుకుచున్నది పెల్లుగ వనిత, రాత్రి
అదుగొ, నిశ్శబ్ద మయ్యదే, యొదిగి భర్త
కౌఁగిలిని నూత్న వధువుగా గదికి జేరె.”

తే. “బంతి నాడిన నేను నా ‘బాసు’ తోడ
నందముగ సాగు జీవితమ్మనియె నతడు
కానక్రికెట్టు సామగ్రి నేను కొంటి
అంతె అని పల్కె ఉద్యోగ, అందగత్తె.”

తే. “కార్యదర్శిని వచ్చుట గడచుచున్న
కోటు, హస్తచ్ఛదమ్ము, జాకెట్టు విడిచె
నొక్కొ కంతస్తుఁ జేరుచు నుజ్జ్వలాంగి
నాల్గొయంతస్తు ననుపనియైన నెటులొ.” 174

తే. “ఆ ఎథీనియన్ స్వర్ణకల్యాణ వేళ
నింటి జంతువులను మించి యించుకైన
భార్యల భజింప రెప్పు డవ్వారు తృప్తి
పురుష లైంగిక ప్రియులయి పొల్చు చంద్రు.

తే. “మేరీ రీడ్, ఆని బోనీలు కోరి పురుష
వేషమున నౌకల హరించి రాకుహోము
భర్తగాఁ బట్టుబడి ప్రాణ భంగశిక్ష
పొందకుండఁగ గర్భముల్ పొందలేదె?

తే. బ్రెజిలు – వెనిజులా వర్షాటవీస్థలాన
యన యమో జాతి వనితలు తనయుఁగనిన
యంత వఱకును దనయల, అంత వెనుక
నిష్టమేతెంచి నటు సంహరించు చుంద్రు.

తే. ఇంటికేతెంచి యే వస్త్ర హీన నయిన
నగ్న సౌందర్య మద్దాన నన్ను దాని
నెపుడు మున్ను చూడనటు వర్తింపఁజేసె
దాని రూపమ్ము మలిపింపఁ దలఁచి నాను.

తే. పెండ్లి కాకున్న నందుకు వీలులేదు
కెరలు నాయంద మెట సన్నగిలఁగ రాదు
భర్త మనసున నా శిలాప్రతిమ యన్న
నుత్సుకతయును, బ్రీతియు నుండవలయు.

తే. ముకురమునఁ జూచుచును నేను ముందు నిలచి
నపు డొనర్చెద సటతోడి నాహవమ్ము
రమ్యగతులను నాలవిత్రమ్ము నుండి
జ్వాల లుద్భవమొందు సత్స్వర్ణ కిరణ
రమ్యత వెలుఁగ నా శిరస్సూర్య మణియె. 180

తే. శ్రోత్రియుని భార్య, నృపసతి, మిత్రుపత్ని
మామ పెండ్లాము, ఆచార్యు మహిళ, గురుని
వనిత – ఈ యపాత్రముల నెవ్వతెను గాను
నను నిషేధించు టిది యేమి న్యాయమయ్య?

తే. పది దినాలకె పెండ్లాము పతిని విడువ
లభ్యమైనంత మంది పెండ్లాడు దనుచు
నంత ప్రతిన గావించి పెండ్లాడి నాడు
అరువదైదు మందిని స్త్రీల నాస్తిపరుఁడు.

తే. ఒప్పిదమ్ముగ దినమున కొక్కమారు
నగ్నరూపాన గనుపింప నాకు నీవు
చూచి హర్షమ్ముతో లేచి, చూచువాఁడ
నేను జరుగవలసిన నీ యింటి పనులు.

తే. పిల్లలకు కామ సంయోగ విమల విద్య
తల్లుల వలన నేర్పింపఁ దలతు మేని
యమము నుత్తిష్ఠ పురుషావయవము గలిగి
యొప్పు పరదేశ దేవత యుండవలయు.

తే. "సిగ్గుపడె దేల నిట్టులో చెల్లి?" యనుచు
పడక గదిఁ జేరి మరదిని పట్టి తాను
పొందుచును జూపె భోగంపు పొలుపు
తలఁచ నీ యక్క కృత్యమ్ము ధర్మబోధ.

తే. తగ్గవలె లోకసంక్షేమ తత్పరతకు
యువతులకు, యువకులకు నన్యోన్య మోహ
మనుచు నగ్న రూపాలతో నాట్యమాడఁ
జేయఁడే ధుసిడైడిసు చేర్చి వారి. 186

# గ్రీష్మము

ఋతురాజ్యంలో వసంత మహారాజు పాలన కొంతకాలం సాగిన తరువాత, గ్రీష్ముడు సర్వసన్నాహాలు చేసుకొని దండెత్తి వచ్చాడు. ఆ విషయాన్ని గురించి కవి అంటున్నాడు.

సీ. వన్నె చిన్నెలు గుల్కు వనలక్ష్మి హొయలల
కనుల జూడక మున్నె గడలు కొల్పి,
వాసంత సంసృష్టివరమహత్త్వము నెల్ల
పదము వెట్టితొ లేదొ చద నొనర్చి
ఒక్క యుచ్ఛ్వాసాన యుబ్బుగంధానిలు
తావి కల్ముల నెల్ల ద్రావివైచి,
కఱకు చూపులతోనె చెఱుకు విల్ గలవాని
సీమాంతముల దాక చెలగి తరిమి

తే. విజయ గర్వాన లోకాల విరుచుకపడి
ఋతుమహావీరుడను పేర నుతికి నెక్క
విఱ్ఱవీగుచు తాపమ్ము వెంట నడువ
తరలి వచ్చితె గ్రీష్మప్రతాపమూర్తి.

సీ. దావాగ్ని మిత్రుడై తమిని నీకిచ్చెనా
జీవాళి తపియింపజేయు తీండ్ర?
సాగరేశ్వరు గెల్చి సంపాదనము చేసి,
నాడవే బాడబ నాశరక్తి?
అగ్నిహోత్రుని గొల్చి యడిగితే వరముగా
దహియింప లోకాలదాహశక్తి?
త్రిపురారి సేవించి ప్రీతిగైకొంటి వే,
అసిత నేత్రానంద హాస రోచి?

తే. లేక లోకాల కేల యీ కాక భయము?
తాళ జాలక భవదీయ దారుణోష్ణ
తాప సంతాపమున నిట్లు తారుమారు
పడునె యో గ్రీష్మ, యుర్వినీ ప్రాణికోటి?

మ. అవదాతాంబుజ బంధువై జగతి కత్యం తాప్త మిత్రుండు నై
భువి వెల్గొందు ప్రభాకరుండెపుడు, ఔ పుణ్యాత్ము డాతండు ఈ
పవి కాఠిన్యము దాల్చి వెల్గునె? కృపాంభోరాశి కాడా యతం
డవు నీ శాసనమేను కారణము తీవ్రార్చి ష్మతుండై యుంటకున్...

సీ. ఉదయాద్రిపై భాను డుదయించెనో లేదొ
చిత చిత పుట్టించి చెఱుచు పనులు,
నడిమింటి కెక్కెనా సుడివడు కొలిమియై
నారకాగ్నుల నింపు నాల్గు దెసల,
అస్తమించిన చూపు నద్భుత ప్రతిభ తా
పడగ వాయు విలాస వర్తనముల
తానె రేయెండయై తప్పులై విరుగుచు
యొదలి తైలము లెల్ల నొడుచుకొనును,

తే. నీదు తీవ్రాతప మెచట నేర్చె గ్రీష్మ
దాహకోజ్జ్వల గుప్త విద్యారహస్య
సముదయమ్ములనే గురు సవిధమందు
చిత్ర చిత్రమ్ములగు దాని చేష్ట లరయ

గ్రీష్ముని పాలనలో భూదేవి పడరాని పరాభవాన్ని పొందింది. త్రిలోకాధిపతి యింద్రునితో మొర పెట్టుకుంటూ ఆమె పంపుతున్న జంగమ లేఖల్లా కనిపిస్తున్న వీ సుడిగాలు లంటున్నాడు కవి.

సీ. గాఢరాగము కన్న గనులు గుట్టెడి రీతి
కొమరు మీరవుపో శకుంత తతులు,
ఉప్పొంగి నింగిదా కొయ్యారములు సూపి
కడలిజేరదు నదీ కాంత ప్రీతి

నూత్న దంపతులేని నోరార ప్రణయంపు
పలుకు లాడెడి చిన్నె వరలబోదు
భూదేవి దివముతో పొందు తప్పినయట్లు
విరహయై నిలువెల్ల విహ్వలించు

తే. జగతి కాధారమైన యీసకల రమ్య
రాగ రస మన్న నీకు పరాకదేమొ
నైష్ఠిక బ్రహ్మచారివా? శిష్టులకును
లేదె శృంగార జీవిత లీల గ్రీష్మ.

సీ. భూరి నదీ మధ్య పులిన సీమలతోడ
బలిసె మార్గాంతర ప్రపల సమితి,
పాంథావళీ కొంథభార భాగాళితో
నెండిపోయెను బావు లిండ్ల యందు,
ఘటజల రజ్జు సంఘాతమ్ములకు తోడు
దీర్ఘత నొందెను దినము దినము,
చటుల దావానలచ్ఛటలు తోడులు గాగ
గృహదాహములు హెచ్చి కెరలె నీరు,

తే. ధనికు నిల్లాలి బుజముపై దర్ప మొదవ
తివిరి రోజెల్ల బిందియ తిష్ఠ వేసె.
పొలము పండించి పెట్టిన భుక్తి యన్న
యెడ్ల గర్వమ్ము దిగద్రావె నింటి నీరు.

సీ. మధురాయువుల నిచ్చి మనసార గ్రోలించు
కీర్తికాంక్షను నారికేళమూర్తి,
ఫలదాతయై మైత్రి పాటించి రుచి చూపు
సన్మిత్రు రీతి రసాల రాజు,
వాసనల్ విరజిమ్మి వరరసానందమ్ము
తమిని నిల్పెడిని కుంద ప్రసూన
నిలువెల్ల తావులై నిండి వాసించెడి
బంగారు బొమ్మ సంపంగి కొమ్మ

తే. నీరు నీరాజ్య మందున లేకయున్న
ఘోర బాధల సహియించి కోరి బ్రతుక
తలచునే ప్రాణిలోకాలు ధర్మ లుప్త
బహుళ బాధాభియుక్త దుర్వార రాజ్య.

కవి ప్రసంగాన్నంతటినీ గ్రీష్ముడు విని అర్థయుక్తంగా మోము మీద ఓ చిరునవ్వు చిలకరించాడు. సామాన్యదృష్టితో చూచి నేను కూడా దొడ్డవాణ్ణి నిందిస్తున్నాను గామాలు నన్న భావం కవికి కలిగింది. పునరాలోచన చేసి గ్రీష్ముని తాపం లోకాని కవసర మంటున్నాడు.

ఉ. పాపము లెన్నొ చేసి యెడబాపు కొనన్ తమి సూక్ష్మ మార్గమౌ
కూప తటాక నిర్మితిని కొంత యొనర్చి వనాళి బెంచి సం
ప్రాపిత తృప్తితో మెలగు పాపులకీ యిల దారి యెద్ది నీ
తాపమె లేకయున్న అనుతాపము తీరునె గ్రీష్మ వారికిన్...

ఇంతలో మల్లె వాసనలు ముంచుకొచ్చి అతణ్ణి ముట్టడించాయి. ఆనందంతో అభినందిస్తున్నాడు గ్రీష్మణ్ణీ, మల్లెలనూ...

ఉ. పూవులు తావులన్నిటిని పొల్పుగ మల్లెల కిచ్చి మెచ్చి నీ
దీవన లిచ్చి నిల్పితివి దివ్య మనోహర పుష్పరాజ్య స
ర్వావని నేలుడంచు సిగలన్, మెడలందున శయ్యలందు స
ర్వావయపాళి యయ్యెవియె అద్భుతముల్ గదవాని చేష్టలున్.

ప్రణయ విరోధివని నిందించినందుకు ప్రతిగా కవి గ్రీష్మణ్ణి నీవు మన్మథ మూర్త్యంతరానివని ప్రశంసిస్తున్నాడు.

సీ. గుహలోన నిజసింహ కుమిలిపోవగనూచు
కేసరచ్ఛటల మృగేంద్రరాజు
పరితాపమును జూచి బాధ కరేణువు
పడియెలో బురదనె పైనజిమ్ము.
పగటి యెండకు బొరియకులాగు జెట్టిపోతు
వృంతంబు చేబూని విసరుచు సేవించు
తమి భర్త నేవేళ ధర్మపత్ని..........
.....................................

తే. క్రొత్తక్రొత్తల చేష్టల గుస్తరించు
ప్రాణికోటుల యనురాగ పథములందు
వింత వెల్గుల జూపించి వెలయు నీవు
కేవలము రతి రాజువే గ్రీష్మ రాజ!

నిన్ను లోకం నిందిస్తున్నదే గాని అందరి పనులూ సాగిపోతూనే ఉన్నవి. గృహస్థులు సుఖసౌఖ్యాలను అనుభవిస్తూనే ఉన్నారు. నిన్ను నిందిస్తున్నందుకు వారిని క్షమించవలసిందని కవి గ్రీష్మణ్ణి వేడుకొంటున్నాడు.

సీ. ఉక్కయంచును నిన్ను ఒక్క పెట్టుగ తిట్టి
ఆవకాయల మునుగు నత్తగారు.
చెమట చీకాకుతో చెడెపని యనుకొంచు
క్రొత్తరసములు గ్రోలు కొడుకుగారు.
విసుగుచు నెండంచు వేపగంధము తీయు
నాటలో మున్గె నబ్బాయిగారు,
వడదాకు నని ముందు గడపదాటక తానె
కోయుకుందమ్ముల కోడలమ్మ.

తే. ఎవరి పని చెడిపోయెనో ఎరుకపడదు
యిన్ని సుఖముల మరుగుచు నిన్ను తిట్టు
వీరి కిచ్చుచు సౌఖ్యాల కోరి నన్ని
కీర్తి వెల్గొంద జేయవే గ్రీష్మరాజ!

**ఆకాశవాణి ప్రసారిక**

# రామాయణ పద్యాలు

**బాలకాండము**

తే. బ్రహ్మ రాక్షస పండితుల్ ప్రబలు లగుచు
యజ్ఞ కర్మాప రాధమ్ములరయుచుండ్రు
శాస్త్రలోపాన యజ్ఞమ్ము సలుపఁ బడిన
నమితవేగాన నశియించు యజ్ఞకర్త. 1

తే. యజ్ఞ సాహాయ్య మొనరింతు ననుచుఁ బలికి
యడుగు వెనుకాడుచుంటివి అట్లొనర్ప
భంగమౌను ఇష్టాపూర్తఫలము లెల్ల
కనుక రాముని విడువఁగాఁ గడగు మీవు. 2

తే. స్త్రీని హింసింపవలసిన స్థితి జనించె
నని ఘృణవహించుటెంతొ యన్యాయమయ్య
ఇద్ది యగుట చాతుర్వర్ణ్య హితము నిష్ఠఁ
గడఁగి చేయుము కర్తవ్య కార్యమీవు. 3

తే. రక్షకుని విధియౌ ప్రజారక్షణమ్ము
అందుకై పాపకృత్యాల నాచరింప
వలసివచ్చినఁ గావింప వచ్చు వాని
రాజ్యభారుల కిద్ది ధర్మమ్ము సతము. 4

తే. శోభ నిడు నోర్మి స్త్రీ పురుషులకు,
కష్ట సాధ్యమ్ము ఓర్మిని గలిగియుంట
దేవతలయందు నెంతయో తీవ్రతరము
ఓర్మి నొందుట కష్టమ్ము నొందియుంట. 5

తే. గుణముల నెల్ల నోరిమి గొప్ప గుణము
ఓర్మిదానమ్ము వలె నెంతొ యుత్తమమ్ము
సత్య సంభాషణమ్మును, సర్వయజ్ఞ
కరణ పుణ్యమ్ము, ప్రఖ్యాతి కరము, ఘనము. 6

తే. అన్నిటికి దైవ ముత్కృష్టమైన యట్టి
దైనను పురుష కారమ్ము వ్యర్థమౌను
పృథ్వి నెల్ల దైవమె యాక్రమించెగాన
దైవ మౌగతి సర్వభూతములకిలను. 7

తే. ఓ నరశ్రేష్ఠ! ప్రాయాన నుర్వియందుఁ
దండ్రులకు ప్రీతి జ్యేష్ఠ సంతానమన్న
చిన్న పిల్లల పైనను "చెడ్డ ప్రేమ"
తల్లులకుఁగాన రక్షించెదను నరేంద్ర! 7

తే. దానముగ స్వీకరింపదగిన యట్టి
దైన కన్యాగవాదులౌ నర్థచయము
దాత వశమౌట నిచ్చెదు తరుణములను
నీవు వచియించు పగిది గ్రహింతుమయ్య. 6

## అయోధ్యాకాండము

తే. రాజ్యము సగము సగమౌట రామభరతు
లది భరతుభయ మొందును రాముడిపుడు
కాన యో చనెద భీతి కలుగు నాకు –
భయము పడువాని వలననే భయము కలుగు. 9

తే. రాజ్యపాలన మొనరింప రాజపుత్రు
లెల్లవారు నియుక్తులై యెపుడు నుండ
ఎల్లవారు నియుక్తులై యెప్పుడుండ
నప్పు డది నీతి బాహ్యమైనట్టి కర్మ. 10

తే. చిన్నతన మందె భరతునిఁ జేర్చి మేన
మామ కడ నుంచితివి యుండె రాముఁ డిచటఁ
దండ్రికడ, ప్రేమ పెరుగును స్థావరమ్ము
లందు రీతి సామీప్యమ్ము పొందినపుడె. 11

తే. జలము స్రవియించి గడచిన సమయమందు
నడ్డుకట్టలు గట్టుట యర్థమగునె
కనుక సమయమ్ము మించక మునుపె నీకు
శుభము నొసఁగెడు పనిఁ జేయఁ జూడు మయ్య. 12

తే. వాస్తవమునకు బద్ధుండు వార్ధి అందు
వలన సత్యము దాటెడి భయము వలన
వృద్ధి నొందంగ వలసిన వేళయయ్యుఁ
దనదు పరిమిత తీరమున్ దాటమాను. 13

తే. సత్యమేకాక్షరమ్ము – 'ఓమ్', సత్యమందె
యుండు ధర్మస్వరూపమ్ము ఉండు వేద
మూర్తిగను సత్యమున్నట్టి ముఖ్యమైన
వన్నియును సత్యమూలాన నందవలయు. 14

తే. పాలకుఁడు లేని పశువుల పగిది సేన
నాయకుఁడు లేక పొందు వినాశనమ్ము!
చంద్రరహిత రాత్రియు, వృషభేంద్ర రహిత
గోవులును నవు రాజు లేకున్న భూమి. 15

తే. భరతు పక్షమ్మువారిని, భరతు హితముఁ
గోరువారిని నందఱఁ గూల్చివైతు
ఏలయన మృదుశీలు నిన్నెల్లవారుఁ
జేతు రవమాన మొక్కింత నీతిలేక. 16

తే. ధర్మమతి ముఖ్యము పురుషార్థములలోన
ధర్మముల లే దధికము సత్యమ్ము కంటె,
తండ్రిగారి వచనము లుత్తమము, లాశ్ర
యించినవి ధర్మచయము నహీన ఫణితి. 17

తే. వశయుఁ బుత్రద యైనట్టి భార్యవలన
కామధర్మార్థములు మూఁడు కలిగినటుల,
ధర్మ మొనరింపఁగను ఫలితమ్మువలనఁ
గల్గుఁ బైమూఁడు – ధర్మమ్ము ఘనతమమ్ము. 18

తే. ధర్మకార్యమ్ము గావింపఁ దగిన యద్ది
ఇతర పురుషార్థములను గావింప రాదు
ఎవ్వఁ డర్థ ప్రధానుఁడో, ఎవఁడు కామ
ప్రియుఁడొ వారు జగతి గౌరవింపఁబడరు. 19

తే. ఎవ్వరసమర్థులో, భీరులెవరో, వార
లనుసరింతురు దైవమ్ము నవరతము
ఎవరు సంభావితాత్ములో, ఎవరు వీర
ధనులొ, వారు దేవు పయి నాధార పడరు. 20

తే. ఎవ్వఁడు పురుషకారాన నీశుఁ గెల్చు
నతఁడు తన కార్యములఁ బరమాత్మ కార
ణముగ హానిని బొంది యేనాఁడు దుఃఖి
తుండు కాఁడిది సత్యమైయుండు నెపుడు. 21

తే. ఉత్తమ శ్రేణికి జ్జెందు యువిద యయ్యు
వ్రతము, లుపవాసములు సేయు, వనిత యయ్యు
ఉత్తమ క్షేమముల భర్త కొసఁగు నట్టి
పనులఁ గావింపకున్నచో పాపమొందు. 22

తే. భర్తృ శుశ్రూష యొనరింప స్వర్గమందు
దైవపూజ యొనర్పక దైవవంద
నమ్మొనర్పక యుండెడి నాతియైన
నిజము ఇయ్యది ఇయ్యది నిజము నిజము! 23

తే. ఎల్లవేళల భర్తకు హితము, ప్రియము
నాచరించెడు నాసక్తి యతివ సేవ
చేయుచుండఁగ వలయును, స్నిగ్ధమిద్ది
వేద సమ్మతమ్ము, స్మృతి విదితమయ్యె. 24

తే. ఎవ్వరైశ్వర్య యుతులొ వారితర జనుల
స్తవమొనర్చుట సహియింపఁజాల రీవు
భరతు నెదుటను నెన్నఁడు వర్ణనమ్ము
సేయఁబోకుము నా గుణ శీలములను. 25

తే. మంచి నడవడి నొప్పి సేవించిరేని
మంచి యత్నము తోడఁ బూజించిరేని
అట్టి వారిని రాజన్యు లాదరింత్రు
భిన్నముగఁ బ్రవర్తింపఁ గోపింత్రు వారు. 26

తే. తమకు హితమొనర్పనియట్టి దాని నాచ
రించు నట్టి పుత్రులనె బహిష్కరింత్రు
రాజులు సమర్థులైనవారలను దమకుఁ
జెందనట్టి వారైనను స్వీకరింత్రు. 27

తే. తల్లియును, తండ్రియు మరి సోదరుఁడు, కొడుకు,
కోడలును వీరలందరు కోరి అనుభ
వింత్రు స్వఫలభోగ మనుభవింపఁగలదు
భార్య యొక్కతె భర్తదౌభాగ్యచయము. 28

తే. సత్యధర్మ సుమార్గానుసారియైన
యట్టివా డౌను నా తండ్రి అందువలన
ననుసరింతును – నా తండ్రి యాజ్ఞలెల్ల
ఇది సనాతనధర్మమ్ము ఏనొనర్తు. 29

తే. తండ్రిగాని, సుతుఁడు గాని, తాను గాని
తల్లిగాని సఖీజనతతులు గాని
స్త్రీకి ముఖ్యులు గారు ఏలీలఁ బతి యొ
కండె ఫలదాత యుభయలోకములలోన. 30

తే. పురుష రూపాన స్త్రీయయి పోలియునట్టి
నిన్ను నల్లుని గాగ, నన్నిచ్చి, పొందిఁ
నపుడు మిథిలాధి పతియైన యట్టి నాన్న
యేమి నిన్ను గురించి భావించినాడొ? 31

తే. తల్లిదంఁడ్రుల యాజ్ఞను దాటకుంట
ఓసి సుశ్రోణి, ధర్మమ్ము, ఉత్తమమ్ము,
అందువలనను నేవారి యాజ్ఞదాట
నెపుడు సంసిద్ధుఁడను గాను - ఇచ్చగింప. 32

తే. తృప్తిగా వీక్షసేయ స్వాధీనులైన
తల్లి, తండ్రి, గురువులఁ బ్రత్యక్ష దైవ
తముల నిర్లక్ష్య మొనరింప, దర్శనమ్ము
కష్టమౌ, దేవుఁ బూజింపఁ గలుగు టెట్లు? 33

తే. ముపురు తల్లి, తండ్రి, గురువు మూఁడు లోక
ములు కలుఁగ వీరు, ఈ లోకమునను గాని
వేరు లోకములను గాని కోరఁదగిన
వెవ్వియును లేవు సాటిరా వెవియుఁ గాన. 34

తే. దాన గుణమును, సత్యమ్ము, మాన యజన
ములును, పరలోక శుభప్రదములను జేయు
కాన నిహమున బలమును గలుగఁజేయు
అయ్యఁ దల్లిదండ్రుల సేవ యధికతరము. 35

తే. పెద్దవారల భావముల్ ప్రీతి నెఱిఁగి
నడువ ననుకూలముగను ధనమ్ము, ధాన్య
మును, సుఖమ్ముల, విద్యను, పుత్రతతిని
తప్ప కెయ్యది యైనఁ బొందంగ వచ్చు. 36

తే. అరయఁ దల్లిదండ్రుల సేవయందు నెవర
పేక్ష వహియించెదరొ వారు ప్రీతితోడఁ
జేసి యాసేవ గంధర్వ సీమ గోజ
గమ్ము, నన్యముల్ వడయంగఁ గలరు, నిజము. 37

తే. సత్యధర్మ పథమ్ముల సాగు తండ్రి,
అట్టి నా తండ్రి - యానతి ననుసరింప
నేను సంసిద్ధుఁడ నదియె నిర్మలము
అదె సనాతన ధర్మమ్ము, (అధిక శుభము). 38

తే. అన్ని సమకూర్చి నీదు బాధ్యతల నొందు
వాడు పతి పతి నవమాన పరచఁబోకు
మెట్టి సమయాన పతి–కోర్కె నెఱిఁగి చేయు
టతివకు శుభము శతసుతతతుల కంటె. 39

తే. నీదు భారమ్ము గ్రహియించి నీకు వరము
లిచ్చు భర్తను నిందింపనేల? తగదు
భర్త్రురిచ్ఛాను వర్తన బహుకుమార
వరుల బొందుట కంటెను పరమశుభము. 40

తే. మధుర ఫలముల నిచ్చు నామ్రమును నరికి
వేపచెట్టును బెంచడు వెఱ్ఱియైన,
పాలతో వేపఁ బెంచినవాని కైన
నీయ దది మధు ఫలముల నెన్నఁడైన. 41

తే. అమ్మదెట్టిదో యభిజాత్య మట్టిదె యగు
వేపతరువున తేనె స్రవింప దెప్పు
డన్నయది గదా, లోకోక్తి అట్టి తల్లి
గర్భమున నిను వంటిదె కలుగును గద! 42

తే. “పురుషుఁ డెవ్వేళఁ దండ్రినిఁ బోలి పుట్టు
స్త్రీ నిరతమును దల్లివలెను జనించు”
అన్న లోకోక్తి సత్యమటంచు నాకు
నిప్పు డెదలోనఁ గడియ జనించుచుండె. 43

తే. ఘనగజము పయి నభిమాన గుణము వీడి
యెవఁడు తృప్తిని నితురల కీయఁగలఁడొ
యతని కీయ రజ్జువును న దగునె ఘనము?
రజ్జు వందున నుండునే రతి? అదేల? 44

తే. ఎవ్వరు గృహస్థులో వారి కెపుడు భార్య
యగు ప్రధాన భూతమ్ము ఆ ఆత్మ సీత
యగుట చేతను రామరాజ్యమ్ము, గృహము
పాలన మొనర్పఁగాఁగల దా లతాంగి. 45

తే. అఖిలలోకాన దుష్టలైనట్టి స్త్రీలు
సతతమును ప్రియులైన తమ పతుల చేతఁ
జూడఁబడినవారైనను చౌరగ కష్ట
ములు పతుల లెక్క సేయరు చులకనగను. 46

తే. బహు సుఖమ్ముల నొందియు భర్తవలన
నతఁడు రోగి దరిద్రుఁడు నైన యపుడు
అతని దూషింత్రు, విడుతురు – ఔను ఇద్ది
స్త్రీల నైజమ్ము సర్వ ధాత్రీతలాన. 47

తే. వర్తనమ్మున సత్య సంభాషణమున
గురుజనోపదేశమ్మున పరమశాంత
లక్షణమ్మున నున్న సులక్షణలకు
పరమ ముఖ్యుడు లోకాన భర్తయగును. 48

తే. తీగలేనట్టి వీణ ధ్వనింపనటుల,
చక్రరహితమ్ము, రథము తా సాగనటుల
ఆత్మజుల నూరుగురిఁ గల్గి నట్టి దైన
భర్త లేని నెలత వృద్ధి వడయ దెపుడు. 49

తే. ఇహ సుఖమ్ములఁ గొంతగా నింతి కిచ్చు
వారు తండ్రి, అన్న, సుతుఁడు, భర్త అటుల
కాక నిహపరాలైన సుఖమ్ము లపరిమి
తముగ నిచ్చు భర్త సతి ప్రార్థన మొనర్చు. 50

తే. రాము దశరథు నట్టు లారమణి సీత
నన్నుగ గ్రహియింపుము మీర లుండు నటవి
యౌనయోధ్య తండ్రి సుఖాన నరుగు మయ్య
అన్నతోఁగూడి వసియింప నడవియందు. 51

తే. ఎవడనుగ్రహమును జూపు నిచ్చ గలుగు
నట్టి ధీయుత భర్తయో అతని చేత
ప్రార్థనము నొంది యద్దానిఁ బడయనిచ్చు
పడతి యిహపర సుఖములఁ బడయదెపుడు. 52

తే. అద్ది దైత్యమునకు లోప మాచరించు,
అద్ది విద్యకు నాశన మాచరించు,
సర్వమునకాచరించు నాశమ్ము నిద్ది,
దుఃఖమును బోలు శత్రువు తోఁచదెపుడు. 53

తే. వైరి వలనను బొందిన ప్రబల ఘాత
యోర్చుకొన శక్యమైనదై యుండుఁ కాని
పైనఁ బడినట్టి శోకమ్ముఁ బాపుకొనఁగఁ
గాదు శక్యమ్ము కనఁగ నే కాలమందు. 54

తే. ఆమ్ర వని ఛేదన మొనర్చి యట పలాశ
వనముపెంచి కనుచుసుమ వర్ణములను
నెవ్వఁడు దురాశ పండ్ల నాశించు నట్టి
యతఁడు ఆశ కోల్పోవు నిత్యమ్ము, నిజము. 55

తే. కర్మలారంభ మొనరించు కాలమందు
నెవ్వ డవ్వాని కఠినతా హీనతలను,
వాని ఫలితాల, శుభముల, నశుభములను
నెఱుఁగడో వాఁడు బాలుఁ డం చెఱుఁగఁబడును. 56

తే. ఎట్టి ఫలితమ్ము కలుగునో యేమొ యనుచు
విషయ మెఱుఁగక పని మొదల్పెట్టు వాఁడు
ఫలము నొందెడు సమయాన బాధపడును
కింశుక సేచకుని పగిది. 57

తే. గడ్డి బాగుగ మొలవని కాననమ్ము
జలము ప్రవహింపనట్టి శుష్క స్రవంతి
గోప జనములు లేనట్టి గోచయమ్ము
అవును రాజు లేనట్టి రాజ్యమ్ము నిజము! 58

తే. రాజు సత్య స్వరూపుండు, రమ్యధర్మ
మూర్తి, యుత్తమ కులజుల ముఖ్యు డతఁడె
తల్లియును దండ్రి, ప్రజలకు, నెల్లజనుల
పరమ సంక్షేమమును జూచువాఁడు రాజు. 59

తే. మంచి చెడులను విభజించి, మంచి నెపుడు
ప్రోత్సహించుచు, చెడులను రూపుమాపి
రాజ్యపాలన మొనరించు రాజు లేక
యఖిల మొకటియె యౌచు నాంధ్యమ్ముగ్రమ్ము. 60

తే. తమదు పరివారడంబరత్వముల నుండి
రాజులును, రాజపుత్రులు రాజ్యమందుఁ
గల తపోధనుల కెపుడుఁ గార్యభంగ
మొనరకుండఁగ దూరాన నుంచవలయు. 61

తే. బంధు మిత్రులు నాశమ్ము బడయ సంక్ర
మించు ధనమును నే స్వీకరించనెపుడు
నాధన మ్మది విషకృతమైన భోజ
నంపు వస్తువులను బోలు సొంపు తరిగి. 62

తే. కష్టపడి కూడఁబెట్టిన కనకరాశు
లవును తుదినాశనమ్ము సురాధిపత్య
మైననట్లె భార్యా కుమారాదులట్లె
అట్లె జీవితము మృతిని అంతమందు. 63

తే. పండిన ఫలములనుకును దప్పకయె క్రింద
పడు ప్రమాదమ్ము కల్గు నే ప్రాంతమైన
అటులె యావిధిఁబుట్టిన యట్టి మాన
వాళి కగుఁగీడు గిట్టుట యఖిల దిశల. 64

తే. గాఢ శిలలతో గట్టిగాఁ గట్టఁ బడియుఁ
గాలగమనాన శిథిలమౌ కట్టడమ్ము
అటులనె జరామరణ వశులై జనాళి
యెట్టి పోషణఁ గొన్న నశింత్రు నిజము. 65

తే. సూర్యు నుదయాస్త మయములఁ జూసి జనులు
ఎల్ల దినములఁ గడు సంతసించుచుంద్రు
ఎరుఁగ రీకార్య పద్ధతి క్షయము నొందు
చున్నయది జీవితమ్మను చొప్పువారు. 66

తే. కట్టె యొక్కటి మఱియొక కట్టెతోడఁ
గడలి యాదృచ్ఛికమ్ముగాఁ గలిసి కొంత
కాలమునకు విడివడును – కాంత, సుతుఁడు
బంధువుల్, సంపదల్ కూడి పాయు నిట్లె. 67

తే. పుత్రి, యుక్తవయస్కను బొందియుంట
తండ్రి కెంతయొ యౌను బాధాకరమ్ము
ఇంద్రునంతటి వాఁడైన నెదియొ పల్కి
నిందఁ గావింత్రుఁ పిన్నలు న్పెద్దవారు. 68

## అరణ్య కాండము

తే. ధర్మపాలుఁడు, కాననస్థానమందు
బ్రతుకు నీతపోమహనీయ రక్షకుండు,
ఖ్యాతి యుతుఁడు పూజార్హత గల్గువాఁడు
దండిరాజు, అత్యధికుఁ డందఱిని మించి. 69

తే. ఇంద్రు నంశతోడ నవతరించి నట్టి
వాఁడు ప్రజల రక్షించెడివాఁడు, రాజు
అందుచే నతఁడు జగము నంతలోని
యఖిల భోగమ్ము, లందమ్ము ననుభవించు. 70

తే. ప్రజల యాదాయమున నారవదగు నట్టి
భాగమును పన్నుగాఁ గొని, ప్రజలఁ బిల్ల
లవలెఁ బాలింప నట్టి ప్రభువుకుఁ గల్గు
దొడ్డ దాన ధర్మము నిస్తులము నిజము. 71

తే. కందమూల ఫలాల భక్షణముతోడ
మునులొనర్చు ధార్మిక కృత్యములను నాల్గ
వది యయిన వంతు చెందును బ్రజల ధార్మి
కముగ రక్షించు రాజు నక్షయముగాను. 72

తే. సకల పురుషార్థములలోన నొకటియైన
కామమున దుర్గుణమ్ములు గలుగు మూఁడు
అందసత్యమాడుట తొలిదౌ నితరము
లన్యసతిని బొందుటయు, హింసాచరణము. 73

తే. అగ్నిసామీప్యమున మండు నట్టి వస్తు
చయమె యున్న నద్దానిదౌ శక్తి కాంతి
పెరుగు, నట్లు క్షత్రియు కడ వెలయు ధనువు
ఎంతగానొ యతని బలమినుమడించు. 74

తే. అడవులలో బాధలందుచు నచలతపము
లొనరఁగావించువారి మహోన్నతముగ
రక్ష సేయుటే క్షత్రధర్మమ్ముగాన
వారి ధనువుల కయ్యది ప్రథమ కర్మ. 75

తే. ధర్మము వలన సర్వమర్థము లభించుఁ
గల్గు నద్దాని వలన సుఖమ్ము కాన
ధర్మమౌ నందటికినిఁ బ్రధానమైన
యట్టి దీలోకమందున నార్యవర్య! 76

తే. భర్త సుస్థితి ననురాగ భావమునను,
కష్టమున నున్న వేళను దుష్టముగను
నెప్పుడును జూచుచుందురు, ఇద్ది స్త్రీల
ప్రకృతి సృష్టి మొదలుగ నో రామచంద్ర! 77

తే. స్త్రీలు విద్యుత్తు వలెను నస్థిరలు, శస్త్ర
ముల వలెను వాడి లక్షణమ్మును వహించి
ఛేదన మొనర్తు వ్యవహరించెదరు ఎట్టి
దైన ఊహ లేకా గరుడా నిలముగ. 78

తే. ఎపుడు నీచభోగాలపై నిచ్చగలిగి
స్వార్థపరుఁడయి యుండ రాజన్యు ప్రజలు
అశ్మ శానమ్ము నందలి యగ్ని నెటులో
యటులఁ బూజింతు రెంతయు నర్వుఁడగుట. 79

తే. సత్క్రమమ్మైన సమయాన సలుపవలయు
పనులఁ గావింపనట్లు భూపాలకుండు
తనదు రాజ్యకార్యాలను దానె నష్ట
పడఁగ నొనరించు కొనును తప్పదు ఇదెల్ల. 80

తే. ఎవఁ డయుక్తమ్ముగాఁ బ్రవర్తించు నెవఁడు
ప్రజల కొసఁగఁడు సమయదర్శనము నెవఁడు
నిగ్రహ రహితుఁ డట్టి రాజేంద్రు ప్రజలు
విడుతురు గజాలు పంకము న్విడుచునట్లు. 81

తే. తన యధీనమ్ము తప్పిన ధరణి రక్ష
ణమ్ము చేసికోలేని జనపతి ఎంత
యున్నతమ్మైన స్థితినున్న మిన్న గాడు
వనధి మున్గిన యట్టి పర్వతములట్లు. 82

తే. దేశమందలి చారుల, కోశ, నీతు
లను నధీనమునం దుంచుకొనఁగ లేని
రాజు లౌదురు సామాన్య ప్రజలసములు
వారెపుడు జనపతులగువారు కారు. 83

తే. దూర దూరాల విషయాలు వారు వారి
చార సంచారముల వల్ల సర్వమెఱిఁగి
కొంద్రు గావున రాజుల కోర్కె తోడ
"దీర్ఘ చక్షువు" లని జనుల్ తెలుపుకొంద్రు. 84

తే. క్రోధియై పరజనుల కెక్కుడుగ సాయ
మెపుడు సేయక గర్వియై యితరులకును
హాని తలపెట్టు రాజు కత్యంత కష్ట
సమయ మందైన నెవ్వరు సాయపడరు. 85

తే. ఎవని - సుజనులు గర్వియం చిచ్చపడరొ,
ఎవఁడు తన గొప్పదనమున కీర్ష్య వడునొ
యట్టి రాజును అరులెకా కాప్తజనులు
సైతముకడు బాధింత్రు దుస్సమయములను. 86

తే. క్రమముగా నిర్వహింపక కార్యములను
జయము కల్గిన సమయాన భయము వడక
రాజ్యమును గొలుపోయిన రాజు తృణస
మాను వలె గణింపబడు నమాంతముగను. 87

తే. శుష్క కాష్ఠమ్ముతోడ, పాంశువులతోడ
మట్టిపెడ్డల గుమితోడ నెట్టి దయిన
పని జరుగ వచ్చు - రాజులు పదవి నుండి
భ్రష్టులైన నెద్దానికిఁ బనికి రారు. 88

తే. ఒక్క పరి నుపయోగమ్ము నొంద మఱల
వస్త్రమును, పుష్పమాలయు న్పనికి రావు
అట్టి స్థానమ్ము కోల్పోయి యధిపుడయిన
వ్యర్థుఁడగు రాజు సర్వసమర్థుఁ డయ్యు. 89

తే. రాజ్య విషయాల శ్రద్ధ సర్వమ్ము నెఱిఁగి
యింద్రియజయుఁడై మరువక నెపుడు మేలు,
ధర్మ గుణుఁడయి కడు జాగ్రతను వహించి
ప్రభువు చిరకాలమును రాజ్యపదవి నుండు. 90

తే. నిద్ర చేతన భౌతిక నేత్రయుగము
మూయఁబడిన సర్వ విషయముల నెఱిఁగి
శాస్త్రదృష్టి, కోపము ప్రేమ సముచితముగఁ
గలిగి వర్తించు రాజు సత్కారమందు. 91

తే. పరుల నవమాన పరచెడి వాడు, తుచ్ఛ
విషయముల యందు లోలుఁడు ప్రీతి నెచట
నెటుల వర్తింపవలయునో యెరుఁగ నట్టి
వాఁడు మంచి చెడుగుల వివరణ వేళ
బుద్ధి నుపయోగపరుపని పురుషుఁడయిన
రాజు స్వల్పకాలమునను రాజ్యమును న
శింపఁజేసి వేగముగ నశించు తాను. 92

తే. పాపముల నాచరింపని పరమ శుద్ధు
లయినఁ బాపుల సహవాసులయిన యెడల
పాప జనదుష్ట పాపాల ఫలము వలన
నాశమును బొందెదరు మహానాగ సరసు
లందున వశింప మత్స్యమ్ములటుల నిజము. 93

తే. ఎందఱో సాధుశీలు రనేక పుణ్య
పురుషు లీ జగాన స్వదోషములను బొంద
కితర జనదోష సంతతి హేతువుగను
నష్ట కష్టాలఁ బ్రజలతో నష్ట పడిరి. 94

తే. రాజసేవ నెఱిఁగిన మంత్రాంగ విదుఁడు
ఎద్ది యైనను రాజు ప్రశ్నింపఁ దన్నుఁ
దనదు క్షేమమ్ముఁ గోరుకోఁ దలఁచె నేని
యీయవలె సమాధాన మర్పించి నతిని. 95

తే. సర్వ విధముల శ్రేయమ్ము సలుపు శుభక
రమ్మగు వచన మతనికి ప్రతిగ నుండ
నట్టి రీతిగ నుపచార మాచరించు
తీరునను మహారాజుకుఁ దెలుపవలయు. 96

తే. హితము గావించు నదియైన నెంతొ నమ్ర
తను వచింపక రాజన్యుఁడనవరతము
గౌరవింపబడు టెపుడొ కాంక్ష సేయు
వాఁడు మెచ్చుడు ప్రీతి నా వాక్య మెపుడు. 97

తే. అధికశక్తి యుతులగు రాజ్యాధిపతులు
చంద్రయమ వరుణాగ్ని మహేంద్ర దైవ
తముల రూపమ్ములను దాల్చి తత్పరతను
పాలనము సేయుచుందు రపారముగను. 98

తే. ధరణి పాలకు లింద్రాది దైవతముల
రూపములు దాల్చియుండుట నోపగలిగి
యుందు రగ్నిని హారమ్ము, నుత్సుకమ్ము
దండముననుగ్రహమును యథాక్రమముగ. 99

తే. కెరలి యముఁ డేలునట్టి దక్షిణపు దిక్కు
నిదిగొ, సేవించుచుండె దినేశ్వరుండు
తిలకమును ధరింపని యట్టి స్త్రీ విధాన
నుత్తర దిశా సతి విశోభ నున్న దదియె. 100

తే. రవికిఁ గల సుసౌభాగ్యమ్ము లభ్యమైనఁ
దిమిరమునఁ గప్పఁబడి యెట్లు తేలు బింబ
మును గలిగి శశి నిశ్వాసమునను గప్పఁ
బడిన యద్దము వలెఁ గాంతిఁ బడయ దిపుడు. 101

తే. రాముఁడన మూర్తిఁగొన్న ధర్మమ్ము, సాధు
లక్షణుడు, దివ్య సత్య పరాక్రముండు
ఇంద్రుఁ డేరీతి దివిజుల నేలువాఁడొ
యట్టివాఁడు రాముఁడు సకలావనికిని. 102

తే. కామవృత్తిని దుర్మార్గగామి యగుచు
నున్న రాజన్యు మంత్రులే యుత్తమునిగఁ
ద్రిప్పవలె, సీత దుర్బుద్ధి, దెచ్చునపుడు
నిగ్రహింపరె నిన్ను మంత్రీంద్రు లధిప? 103

తే. రాజు సన్మార్గగామియై రాజ్యమేలు
నపుడె మంత్రివర్యులు పురుషార్థములను
బొందఁగలరు, వారలు వానిఁ బొందలేరు
రాజు దుర్మార్గగామియై రాజ్యమేల. 104

తే. రాజె యనుసరింపఁగ దుర్మార్గములను
రాజ్యమున నున్న దైనసర్వము నశించు
ప్రజలు బహువిధ కష్టాలు బడయు చంద్రు
ప్రభునిఁ గావింపవలయు సద్వర్తనునిగ. 105

తే. ధర్మమును, కీర్తి రెండు నాధారపడును
రాజుపై, నో విజేత ధరణిని కాన
నిట్టి కారణమున ధరణీశు లెల్ల
నిందుగా నెప్పుడును రక్షణీయులయ్య! 106

తే. ఎంతో క్రూరుఁడై ప్రజను శిక్షించువాఁడు,
నఖిల జనులకు వ్యతిరేకి యైనవాఁడు,
వాని కింద్రియ దార్ఢ్యము లేనివాఁడు
రాజ్యమున కీయఁగా లేఁడు రక్షణమ్ము. 107

తే. ఆయశక్తుడౌ సారథి దైనరథ్రము
భగ్నమై నెట్టులుగ నెత్తు పల్లములను
రాజులసమర్థులైన మంత్రాంగ జనులు
కష్టములు పొందెద రిల ప్రగాఢముగను. 108

తే. క్రోధపూరితుఁడును ప్రతికూలుఁ డయిన
ప్రభువుచే రక్షణను బొందు ప్రజలు నక్క
పాలనం దున్న మేఁకల పగిది నెపుడు
వృద్ధి నొందరు, నిజము, నశింత్రు, నిజము! 109

తే. గింజ చల్లిన వెంటనే కెరలి పెరిగి
పంట యిచ్చుట జరుగని పనియెయౌను,
కాలమవసర మట్లె దుష్కర్మఁ జేసి
నతని కీయదు ఫలితమ్మతిత్వరాన. 110

తే. జనుల నైజములను మార్ప సాధ్యపడదు
దుష్టులెదౌ కారణమ్మునఁ దోచి మంచి
స్వీకరించిన నది కడుసేపు నిలువ
దన్న యంశ మెంతయొ నిశ్చయమ్ము సుమ్ము. 111

తే. పూనుకొని యొక పని పరిపూర్తి చేయ
ధర్మమును, కీర్తి యెదియును దక్కనట్టి
శ్రమను గల్పించు కార్యమ్ము సలుప నెవఁడు
చేయ యత్నించు నుత్సాహ శీలమునను. 112

తే. చావు దరిఁజేరు చున్నట్టి సమయమందు
హాని నెంతయుఁ గల్గించువానిఁ గోరు
నట్లు నీవు మేలు నొసఁగ నట్టి వాని
స్వీకరింపంగ యత్నమ్ము సేతువేల? 113

తే. ప్రేరితము, వినాశము సమీపించినపుడు
ఈశ్వరేచ్ఛకు లోఁబడి యెంత వారు
తా మొనర్చెడి పనులందుఁ దప్పిదముల
నాచరించుచు నుందు రత్యధిక ముగను. 114

తే. లక్ష్మణా! పశు పక్షుల లక్షణమున
నైన సాధు స్వభావమ్ము నధికధర్మ
కార్యకరణ వీరములు రక్షణమ్ము
లున్నయట్టులఁ గన్పించుచున్నవోయి. 115

**కిష్కింధా కాండము**

తే. ఎట్టి జాతికి జెందిన యట్టి జీవి
అట్టి జాతిని వెదకిన నందు దొరకు
ఇతర జాతుల దొరుకదు అతివ అతివ
లందు దొరకును మృగములయందు కాదు. 116

తే. సర్వ మీయ పెంపునకు నుత్సాహముగను
మూలమైనది కాన నే మున్ను సీత
వెదకు తావుల నెట శ్రద్ధ వీక్షణమ్ము
చేయగా లేదో, శ్రద్ధతో చేయువాడ. 117

తే. ఎవ డనిర్వేదు డోయత డెల్ల వేళ
లందు కర్మల ప్రారంభ మాచరించు
ఇట్టి ఉత్సాహ మే జీవి యెట్టి కర్మ
చేయు దానిని సఫలమ్ము జేయునెపుడు. 118

తే. ఆత్మ నాశనమున గల్గు నట్టి దోష
చయ మనంతము, జీవన సలుపువాడు
పడయు శుభముల కావున ప్రాణములను
నిల్పుకొని పొందు ధ్రువముగా నిఖిల శుభము. 119

తే. నవ్య శోభ నొసగు భూషణమ్ము కంటె
కోమలికి కాంతి నెంతయో కూర్చు భర్త

అతడు లేకుంట నియ్యెడ నతివ, యీమె
కాంతి గోల్పోయి దీనయై కానబడును. 120

తే. ధర్మ! ఇతరుల భార్యల దరికి జేరి
బలముతో వారి హరియింప బాలుపడుట
భీరు? ధర్మమ్ము రాక్షస ప్రియ మదెపు
డిందు సందేహ మేమాత్రమేని లేదు. 121

తే. అందముగ వృద్ధి నొందె నీ యౌవనమ్ము
అనుభవము లేక వ్యర్థమై యరుగుచుండె
అరిగినది యెద్దియును మరి తిరిగిరాదు
అరిగినట్టి నదీ ప్రవాహమ్ము వోలె. 122

తే. సాధుపురుషుల ధర్మమ్ము సక్రమముగ
నెరిగి దాని నట్టుల నొనరింపవయ్య,
ఈవు నీ భార్య నెటుల రక్షించుకొందు
వటులె పరసతుల్ రక్షణ నందవలయు. 123

తే. నిన్నె ఉపమానముగ గొని నీదు భార్య
లందున రమింపుము, స్వసతులందు తృప్తి
నొందని చపలశీలుని నిందసేతు
రమితమౌయవహేళన అన్యసతులు. 124

తే. దృఢ మనస్కుడు కాక సత్కీర్తి లేక
మరిగియున్నట్టి యన్యాయ మార్గములను
పాపకృత్యాల గావించు ప్రభువు రాజ్య
మెంత సంపన్నమైన నశించు నిజము! 125

తే. కామ మే మానవులపైన గలుగు వారు
శిక్షయొనరింప దగినట్టి శీలు రయ్యు
వారిపై, దయ, స్నేహమ్ము పరగుచుంట
నగును కామము ప్రతికూల మరయ ప్రజకు. 126

తే. ఎదను కామము లేనట్టి యింతి నెవ్వ
డిచ్ఛయించు నాతండు తపించు మిగుల

కోర్కె గలిగిన కాంతను కోరువాని
కబ్బు శుభకరసంప్రీతి యధికముగను. 127

తే. కనుల కగుపడు వారిపై గలుగు ప్రీతి
అటుల కనబడకున్న స్నేహమ్ము నాస్తి (లేదు)
ఆ కృతఘ్నాళి ప్రేమను నాపు చంద్రు
రాముడు నశింప జేయండ ప్రణయరక్తి. 128

తే. అబ్బ దెన్నడు ప్రియ విషయమ్ము వలన
శోక, మప్రియమ్మున కల్గు శుద్ధ దుఃఖ
మిట్టి భావద్వయమ్మున కెవరు దూరు
లా జితేంద్రియుల మృతులు – అంజలింతు. 129

తే. యుద్ధ ఫలితాల సత్యాల నొప్పవలయు –
ఇట్టి సంశయ విషయాల కిష్టపడను
విజ్ఞుఁడెవ్వఁడు సాధింప వీలొసంగు
పనులఁగావింపఁ డనుమానఫలములుగను. 130

తే. అమిత కష్టమ్ములకును లోనగుచునున్న
ప్రాణములు గల్గి బ్రతికెడు మానవుండు
నూరువత్సరములకైనఁ దీరి యవ్వి
సౌఖ్యమొందు నన్నది నాకు సత్యమయ్యె. 131

తే. తగదు సామము రాక్షసతతుల తోడ (యెడను)
దాన మప్రయోజనకరము ధనికుల యెడ
భేదమున నసాధ్యులు బలప్రియులు – ప్రీతి
రావణుని తోడ నాకు పరాక్రమమ్మె. 132

## సుందర కాండము

తే. అరయుమా చేయవలయు సాయమ్ము మాకు
దాని గావింపు తరుణమ్ము తప్పకుండ
చేయ దగినది యయ్యును చేయబడని
దెద్ది యది మహాజన కోపహేతు వగును. 133

తే. రామ సంక్షేమ కరణ నిర్ణయమునందు
నున్న నిను పూజగావించు చున్నవాడు
జలనిధి తిరిగి తోడ్పాటు సలుపవలయు
తప్ప దెప్పుడీ సనాతన ధర్మకర్మ. 134

తే. ధర్మము నెరింగి సువివేక తత్పరతను
పుణ్య జీవన మొనరించు పురుష వరుడు
అతిథి సాధారణుండైన నతని గౌర
వించ వలయును తెలుపగా నేమి గలదు. 135

తే. క్రమమునను సిద్ధి నొందెడి కార్యములును
కార్యకర్తయె అవిమృత్యకారియైన
దేశకాల పరిస్థితుల్ తిరిగిపోయి
నాశమౌ భానురాక నంధస్సు వోలె. 136

తే. మంచివైనను చెడువైన మనదు స్థితుల
నింద్రియమ్ముల కంపించు నెపుడు మనసె
అరసియుంటి స్వేచ్ఛాసుప్తలైన స్త్రీల
నయినను వికారమును నొందదయ్యె మనసు. 137

తే. స్త్రీలు లేని ప్రదేశాన సీత వెదుక
లభ్యయయ్యెడి విషయమే? లభ్య కాదు
స్త్రీల మధ్యనే యెన్నండు స్త్రీల వెదుక
వలయునన్నది శుభ్రభావమ్ముగాదె. 138

తే. సీత! నీవు నీ భర్తపై చెలిమి యెంత
చూపితివో యది చాలును, ఎందువలన
ననిన నెదియైన నెక్కువ యాచరింప
నద్ది ఘనశోక కారణమౌట నిజము. 139

**యుద్ధకాండ**

తే. ప్రభువు తనపైన పెట్టిన భావ చరిత
కార్య మెవ్వండు తీర్పగా గలుగు ప్రీతి
నట్టి సేవకు నెల్లరు నభిలషించి
యొప్పుకొందు రెపుడు పురుషోత్తమునిగ. 140

తే. ప్రభువునకు నిష్టమైన కార్యమ్ము నందు
నను నియోగింపబడిన ప్రజ్ఞనొనరించి
మిగుల ఆ పని సామాన్యముగ నొనర్చు
భృత్యుడిల మధ్యముడుగ గణింపబడును. 141

తే. ప్రభువువరునిచే నియోగింపబడిన శక్తు
డతిసమాహిత చిత్తుడై అధిక తృప్తి
పని యొనర్పగడగని సేవకుడు కనగ
అధముడనుచును బల్కెద రార్యవరులు. 142

తే. శోకమును వీడు, క్రోధమ్ము నేకధాటి
స్వీకరింపుము, యత్నమ్ము విడుచు వారు
మందభాగ్యులు, కోపమ్ము నొందువారి
నందరును జూచి యెద భయమొందు చంద్రు. 143

తే. మంత్రమును జేయుటకును సమర్థులైన
హితుల, మంత్రుల, బంధుల నేర్చికూర్చి
వారితో గూడ యోజన వరపి దైవ
మొనర సల్పునతడు పురుషోత్తముండు 144

తే. ఎవరితో సంప్రదింపక ఎవడు తానె
విషయముల నిర్ణయించునో, ప్రీతి నిర్ణ
యమ్ము గావించునో ధర్మమఖిల కార్య
ములను నాత డగును మధ్యముండనంగ. 145

తే. మంచి చెడుగుల యోజింప మనసు పడక
దేవు తోడ్పాటు కోసమై దీక్షలేక
చేసెదను, చేసెదను అని చెప్పుకొనుచు
అసలు పని మానువాడు నరాధముండు. 146

తే. భిన్న భావాలు మంత్రులు వెల్వరించి
తొలుత, తుదకొక్క భావమే తెలిపి యపుడు
విషయ నిర్ణయమొనరింప భేదబుద్ధి
విడిచి, 'మధ్యమ మంత్రమ్ము' పేర బరగు. 147

తే. అభ్యసించిన శాస్త్రమ్ము ననుసరించి
చేసి యోజన మంత్రులు చెప్పినంత
వారి మంత్రమ్ము అది అధిపతులు స్వీక
రింత్రు ఉత్తమ మనుచు భావించి యెడద. 148

తే. సామదాన భేదము లర్థ సాధనమ్ము
లెటుల నిష్ఫలమ్ములౌ దాని కెటుల వీర
రసముఁ జూపించి, సాధింప లక్షణమ్ము
పండితులు దెల్పుచుందు రపారముగను. 149

తే. ఉన్నచో నజాగ్రత్తగా నున్నవారి
యందు, శత్రుభయమున నున్నయట్టివారి
యందు దైవము వ్యతిరేక మైన వారి
యందు శాస్త్రోక్త వీరమర్యాద చెల్లు. 150

తే. ఖరుఁడు దుష్ట స్వభావుఁడా కారణమునఁ
జంపఁగా బూనె నతఁడు, రాక్షసుఁడు రాము
ప్రాణ రక్షార్థమై చంపె రాముఁడతని
ప్రాణులిల శక్తి రక్షింపవలయుఁ దమ్ము. 151

తే. నీతిశాస్త్రానుసారుఁడై నిరతి యోజ
చేసి యెవ్వఁడు కార్యముల్ సేయుచుండు
నా ప్రభుడు దృఢ సంకల్పు డై వెలయును
వ్యథనొంద డెయ్యెడను కార్యమ్ములందు. 152

తే. సవ్యమౌ నుపాయము లేక జరుపవలయు
దాని కంటెను వేరుగాఁ బూని జరుపఁ
బడిన కార్యమ్ము లర్హతఁ బడయునట్టి
వారి కిడినదగు హవిస్సు వంటి దగును. 153

తే. ప్రథమముగఁ జేయవలసిన పనిని ముందు,
వెనుక చేయఁగ వలసిన పనిని ముందు
కొంద రొనరించుచుందు రా కొంతమంది
యెరుగరెది నీతియో యేది నీతి కాదొ! 154

తే. పరులకును, దమకును గల భావములను
బుద్ధిలోఁ బరిశీలనఁ బొసఁగఁ జేసి
ప్రభువునకుఁ దెల్పఁగా దగు పరమహితము
తెల్పునాతండె యౌను మంత్రీశ్వరుండు. 155

తే. వైరితో, మహాకోప సర్పమ్ముతోడఁ
గలసి నివసింపఁగా వచ్చుఁగాని మిత్రుఁ
బోలి కన్పించుచును శాత్రవాళిఁ బ్రీతిఁ
గొల్చువానితో వసియింపఁ గోరరాదు. 156

తే. ఓయి, రాక్షస జగతిలో నున్నవారి
లక్షణమ్ముల నెఱుగుదు రమ్యముగను,
జ్ఞాతులకు గష్టములు కడు కల్గినపుడు
భూరిసంతోషమును వారు పొందుచుండ్రు. 157

తే. జ్ఞాతి ముఖ్యుని, శూరుని, సర్వకార్య
కరణు, పండితు, ధర్మరక్షా ప్రవీణు
జ్ఞాతు లల్పునిగా భావన మ్మొనర్చి
వారి నిరతము నవమాన పరచుచుండ్రు. 158

తే. కష్టవేళ నొకరి నింకొకరు గనుచును
హర్ష మొనరించు వారు నన్యాయ కార్య
కరణులును, గూఢులును, ఘోర కార్యపరులు
నైన జ్ఞాతులు భయకారు లయినవారు 159

తే. అగ్నిగాని, యితరమైన యాయుధములు
గాని భయము గొల్పెడునవి గావు స్వార్థ
ఫలము నాశించి ఘోరమౌ పనులొనర్చు
వారు జ్ఞాతులు, కడుభయావహులు – నిజము! 160

తే. మనను బంధించు కొరకుఁగా మార్గములను
జ్ఞాతులే తెల్పు చుందురు శత్రువులకు
ఇట్టి హేతువు వలననే యెల్లవేళ
మనకు జ్ఞాతుల వలనఁ బ్రమాదమగును. 161

తే. గోవులందున సంపద, క్రుద్ధులయిన
జ్ఞానుల వలన భీతియు, కాంతలందు
చపలతయు బ్రాహ్మణులలోన చతురతపము
భావ్యములు నమ్ము మిద్దాని పరమసూక్తి. 162

తే. జలజ పత్రాలపైఁ బడ్డ జలపు బిందు
వులు కలియనటులాకుతో, గలిసియుండ
వెపుడనార్యమనస్సులు ఇచ్చతోడ
గాఢసాంగత్యములతోఁ బ్రగాఢముగను 163

తే. ఆ శరత్కాల మేఘంబు లధికగర్జ
లొనరఁ గావించుచును వర్ష మొనరఁ గురిసి
నఁ దడియదు నేల? ఆ విధాన చెడువారి
యందు సాంగత్య మెపుడుఁ బ్రత్యక్షమగును. 164

తే. మధుకరము దప్పిఁగొన్నదై మధువుఁ ద్రాగు
కాని యెన్నఁడు పూవుపైఁ గడగి నిలదు
సజ్జనులు గాని దుష్టుల సౌహృదమ్ము
ప్రీతి యుండదు పూవుపై వెలయు నిటులె. 165

తే. స్నాన మొనరించు తొలుత ప్రశాంతి గజము
చిమ్ముకొను తుండమున ధూళి మ్ముమ్మరముగ
పైకి పిదప – శరీరము పరచు మైల
మనకనార్య స్నేహ మీ మాడ్కిఁదోచు. 166

తే. దుష్టకాలమ్మునకు లొంగి దోషబుద్ధి
వర్తన మొనర్చు దుష్టులు వారి హితము
కోరి యోజించి చెప్పిన వారి వాక్య
ములను గ్రహియింప రణు మాత్రమును హితమ్ము. 167

తే. ఏ పరిస్థితి యందైన నెవియొ యిష్ట
మయిన మాటలు చెప్పెడునట్టి వారు
సుగములు జగాన అప్రియము శుభ్ర మొక్క
టయిన మాటను బల్కువా రసలె లేరు. 168

తే. వీరులును బలిష్ఠులు నైనవారు, నస్త్ర
పండితులును దుష్కాలమ్ము ప్రాప్తమైన
వాలుకాసేతువుల వలె వారు యుద్ధ
మందు నశియించి పోదు రో యసుర వర్య! 169

తే. ఆపదెదియైన వచ్చిన నాప్తులైన
స్నేహితులకు వారికిఁ జెప్పవలయు
బుద్ధిమంతుఁడు శాశ్వత పుణ్యయుతము
నైన హితమును వారి శుభార్థమునకు. 170

తే. కుటిల లక్షణు లెదలోనఁ గూడియున్న
భావములు వెలిబుచ్చక వ్యవహరింత్రు
ఏమరిన వేళ వారు గావింత్రు ద్రోహ
మది పరమమౌ ప్రమాదము నాచరింత్రు. 171

తే. ఎట్టి కార్యమేనియును యోజించి మంచి
చెడుల నాచరింపఁగవలె 'చెడుది' అనుచుఁ
దోచినను దానిఁ గావింపఁ దోడు పడక
చిత్తమిడక దానిని విసర్జింపవలయు. 172

తే. ఏదో యొక కార్యమందు వర్తింపఁజేయు
వరకు నెవ్వని శక్తియవ్యక్తపడదు
కాని వేగిరపడుచు నేకార్యమందు
వ్యక్తి నెఱుఁగక యోగించు టనుచితమ్ము. 173

తే. "ఇద్ది సరియైన కాలమా? ఇద్ది అట్టి
దేశమా? కాదు" అన్నట్టి తీవ్ర నిర్ణ
యమ్ము మనుజుని కడ నిల్చు ననవరతము
మంచి చెడులిట్టులే నిల్చు మనుజుని కడ. 174

తే. కష్టపడకయె పొందిన గాఢమిత్రు
మనము సందేహపడిన నా మాన్యమిత్రుఁ
డరుగుఁ! దొలఁగి – అర్థరహితమైన ప్రశ్న
అట్లు పోఁగొట్టు మంచి స్నేహితుని – నిజము! 175

తే. వచ్చినతని సందేహించి ప్రశ్న సేయ
నతఁడు కనిపెట్టి తెలియనీఁ డతని కథను
అనిన ప్రశ్నల మూలాన నవతలతని
భావ మెఱుఁగుట యౌ నసంభవము, నిజము. 176

తే. దాచుటకు నెంత యత్నింప దాచలేము
మానవుల మనోభావాళి, మానవాళి
యెదద నున్నట్టి భావమ్ము లెటులొ ముఖవి
కారముల మూలమున నెట్లొ కానఁబడును. 177

తే. స్వకులజులు, నిరుగు పొరుగు పాలకులును
దుష్టవేళలఁ గష్టాలఁ దోపఁ జేయు
వారనెడివారు అందుచే వచ్చె నీతఁ
డిచ్చుటకు మనోవర్తన మ్మేర్చి పంప. 178

తే. దోసిలిని బట్టి, దీనుఁడై తుష్టి యాచ
నమ్మె నర్చుచు శరణుకు నమ్రుఁడయ్యె
శత్రువైనను నాతనిఁ జంపరాదు
అట్లొనర్చిన ఘాతుకులండ్రు మనను. 179

తే. ఆర్తుఁడైన శత్రువు దృప్తుఁడగుచు శరణు
వేడినట్లైన, ప్రాణాల విడుచు కొన్న
దృఢుఁడు, ధీరస్వభావుండు తృప్తి నాత్మ
ప్రాణముల నివ్వవలయును రక్షసేయ. 180

తే. శరణుఁ గొని రక్షణము నొంద సాధ్యపడక
శక్తిగల యాతఁడే చూచు సమయమందు
నెవ్వఁడు నశించునో యతఁడేగు పుణ్యలోక
మునకు రక్ష నీయని వాని పుణ్యమునను. 181

తే. శరణు, రక్షణ కోరిన సలుపకుంట
దోషము ఫలముగా, దివి తొలఁగు, నంతఁ
గల్గు నపకీర్తి ఆతని గాథ బలము
వీర్యమును నితరమ్మును వీడిపోవు. 182

తే. ఒకపరి మాత్రమే శరణొంది యంత
"నేను నీ వాడనే" యని నిలిచి రక్ష
యాచనము సేయ నిత్తు రయ్యభయ మిద్ది
నా వ్రతము, దీనిఁ గావింతు న్యాయమగును. 183

తే. ప్రభువు వైనట్టివగు నభిప్రాయములను
విడిచి తన యభిప్రాయాల వెల్లడించు
చుచు ప్రభుని కార్యములు చేయ చొప్పడెవఁ
డట్టి దూత సత్యమ్ము, వధార్హుఁడగును. 184

తే. కోపరాహిత్యమును, క్షమ కుటిల మార్గ
మనుసరింపక యుంటయు నాపదలను
గలుగ నీయని భాషణ, గాఢ దుష్ట
లకడ నసమర్థమైన కర్మములు దెలుపు. 185

తే. వంచకుఁడు పొగడు కొనెడివాఁడు నిర్ద
యత వ్యవహరించు వాఁడును నందరినిని
దండనము చేసి, వర్తించుచుండు వారు
సత్కరింపంగ బడెదరు జగము నందు.
(మంచివారికి రోజులు కావని అర్థము) 186

తే. లక్ష్మణా! సామమార్గాన రమ్యకీర్తి
యును, బ్రతిష్ఠయుగాని, యా యుద్ధజయము
గాని పొందుట సాధ్యమ్ము గాదు వినుము,
సర్వకాలమ్ము లందున సత్యమిద్ది. 187

తే. ఓర్మి వహియించి యిట్లు నే నున్న నన్ను
శక్తి రహితునిగాఁ జూచు సాగరుండు
వ్యర్థ మిటువంటి వారిపై నరయ నోర్మి
సర్వ సమయాల నియ్యది సత్యము కద! 188

తే. పురుష దుపయోగపరుపఁగా బూనఁదగిన
ప్రముఖ వస్తువు దండంబు ప్రబలలోక
మునను ఆ కృతఘ్నులతోడ మునిఁగి వ్యవహ
రింప స్వాస్థ్యదాన క్షమల్ రిక్తములగు. 189

తే. నిగ్రహానుగ్రహమ్ముల నిల్పి చూపఁ
బ్రాజ్ఞుఁడును కీర్తిపరుఁడును రాజు - కాన
అతఁడె యాధారమగుటను బ్రతుకు మంత్రు
లతని కెపుడప్రియముల మాటాడరాదు. 190

తే. చారుని సహాయ పటిమ నా శత్రువర వి
శేషముల నన్నిటిని తెలిసికొనినట్టి
పండితుండైన రాజు అల్పమగుయత్న
మునవె శత్రువు నోటముఁ గొనగలండు. 191

తే. శాస్త్ర తత్త్వజ్ఞుఁడును సుప్రసన్న పండి
తుఁడును నైనవాఁ డెవ్వఁడు నుండక శత్రు
ప్రేరణ మ్మున్నతోద్యోగ వృత్తి నున్న
ప్రౌఢుతోఁబల్కఁ డెపుడును పరుషముగను. 192

తే. విరిగి రెండుగ ముక్కలై ప్రిదులువాఁడ
నెవ్వనికి లొంగ వినతి నర్పించుకొరకు
స్వామి! ఇద్ది నా నైజదోషమ్ము సుమ్ము
కనుక ప్రకృతిని దాట శక్యమ్ము కాదు. 193

తే. ఒకడు కావించు దుష్కార్య మొక్క కాల
పాశవశుఁడగు నాతని పాపకృత్య
ఫలితముగను నవ్వానిదౌ కులమదంత
యును నశించును సత్య మీ ఉక్తి స్వామి! 194

తే. త్రివిధ కార్యమ్ములను పంచరీతిగతుల
నుచితముగ సమన్వయమును నొనరఁజేసి,
మంత్రులతో నిర్ణయము చేసి మలఁగు రాజు
మంచి మార్గమునందు వర్తించువాఁడు. 195

తే. ధర్మ, మర్థమ్ము, కామమ్ము, కూర్మినొక్క
టొక్కటిగ మూటిమూటను నొక్క రెంటి
రెంట కడు పురుషుఁడు స్వీకరించి చేయ
మూఁటిలో నెప్పుడును రెంటి పాటి చేసి

వలయుకాలాన చేయఁగా వలయువీని
కాక నెపుడును కామమ్ము కడగి కొనఁగ
రాజు నశియించుఁబరమ నిర్వ్యాజముగను. 196

తే. పురుష రూపులు, కడు పశుబుద్ధులైన
వారు కొందఱు శాస్త్రాలు వారు చదువ
రయిన మంత్రి పదవులను నాక్రమించి
పలుకుచుంద్రు ప్రగల్భముల్ ప్రబలముగను. 197

తే. హితము కానట్టి దానిని హితము కాగఁ
జూపఁజూతురు గొప్పలఁ జూపు కొనుచు
అట్టి కార్యదూషకుల మహార్థ చింత
నల సమయముల దరిఁజేర్పఁదలఁచరాదు. 198

తే. తెలివిగల శత్రువులతోడఁ గలసి సచివు
లయిన కొందఱు వైరివరాశలకు
లొంగి ప్రభుని నాశన మొనర్పంగ దారి
తీయు పనులఁ జేయింతు రతీతముగను. 199

తే. ఎవడు వైరినిఁ దనకంటె హీనునిగను
భావనయొనర్చి, యవసరపడదగిన
రక్షణను పొందఁడో యాధరాధినాథుఁ
డొందు కష్టాలు, స్థానమ్ము నురలిపోవు. 200

తే. వర్తమానమ్ము ముఖ్యము, ప్రబలమగుట
చేయవలసిన దాని యోజింపవలయు
గతము గూర్చి యోజింపఁగాఁ గడఁగ రాదు
అవసరము లేదు గతమగు గతము - కాదె. 201

తే. జీవమనుమాన నిలయమై చెలఁగు నపుడు
ఎట్టి బలహీనుడును వైరి నెదియొ సహజ
మానవునిగ భావన చేసి వాని వశము
చేసికొనుటకు యత్నమ్ము చేయరాదు. 202

తే. వీరు లేనాఁడు జలశూన్య నీరదముల
వలె నధికము గర్జింపరు వ్యర్థముగను
కలహమున శత్రు నోటమి ఫలితముగను
నిచ్చు నా గర్జనమును వీక్షింపుమయ్య! 203

తే. ఓ మహావీరులార! ఆయుధముల విడి
జీవితమునకు రక్షణఁ జేసికొనఁగ
మీరు పరువెత్తుచున్నారు మీదు సతులు
పరిహసింత్రుథె పెద్దలు వడయ నవ్వ. 204

తే. వైరులకు నోడి, జగతి జీవించు వాని
నందరును భీరు వనుచు హాస్యమ్మొనర్తు
వీడి భయము సజ్జన మార్గ వివృతి ననుస
రింపఁగా వలె నాతఁడు పెంపు నొంద. 205

తే. సృష్టి ధర్మప్రకారమ్ము చిన్ని ప్రాణ
ములము – యుద్ధ మందున ప్రాణములను వీడి
స్వల్పయోధులకెపుడు లభ్యమ్ము గాని
బ్రహ్మలోకమ్మునకు నేగవలయు మనము. 206

తే. ఓయి వానరులార! ఈ యుద్ధమందు
వైరి నోడించి కీర్తినిఁ బడయవలయు
వీరరణమున మృతి నొంది, వీరలోక
సంపదను బొంది యనుభూతి సలుపవలయు. 207

తే. తండ్రి మాటను నడిచితి ధర్మమార్గ
మందున – జితేంద్రియుండ వీ వరయధర్మ
మగును వ్యర్థము – పూజ్యుఁడా! అఖిల కష్ట
ములకు నిను దూరుఁ గావింపఁగలుగ కున్న. 208

తే. జగము నందలి స్థావర జంగమమ్ము
లయ్యు భూతముల్ కన్పించు నన్ని కాని
ధర్మము కనఁబడని దౌట ధర్మమెటను
లేదనునది నా భావ మీ రీతి నిజము. 209

తే. ఉన్న మన ధర్మ మన్నది యుండవలయు
రావణుఁడు నరకాన ధర్మపురుషుఁడవు
నీవు దుఃఖమ్ము రామ! పొందెదవె, ఇట్టి
వైన వ్యతిరేక ఫలముల్ నిరర్థకములు. 210

తే. ధర్మ పరుఁడైన వానికి ధర్మఫలిత
మైన సఖ్య మధర్మున కాఫలితము
నైన దుఃఖము చెందును అట్టి సమయ
మందు మానవుల్ ధర్మమార్గాళి విడరు. 211

తే. వారికి నధర్మమును జేయవలయు ననెడి
కోర్కె కల్గదు ధర్మానుకూలరుచియె
కల్గి ధర్మమొనర్తురు గాఢధర్మ
ఫలము సౌఖ్యమ్మె వారికి ప్రాప్తమగును. 212

తే. చెడుగు గావించువార లక్షిణ ధనులు
మంచి చేసెడివారు సుఖించలేని
వారగుట జర్గుచున్నది వారి గనిన
ధర్మము, నధర్మమును నవాస్తవము లౌను. 213

తే. దాని ఫలితమ్ము తోచక దాని రూపు
కనుల కగుపించకను నసద్గాథ భూత
మైన ధర్మమ్ముతో సుఖాలందుకొనుట
యెట్లొ మీరలు కడుగమనింపవలయు. 214

తే. అర్థముఖ్యమ్ముగా వ్యవహరణ జేసి
యర్థ మభివృద్ధిఁ జేసెడి యట్టి పర్వ
తముల నదులయటులఁ గార్యతతి సమస్త
మందు నుండియె ప్రారంభమగును నిజము. 215

తే. పురుషుఁ డెవ్వండు దూరుఁడై పొల్చు నర్థ
మునకు నాతని కార్యముల్ ముఖ్యముగను
నన్నియును గ్రీష్మ ఋతువటు, చిన్ని నదుల
పోలి నశియించు సత్యమై పొలుచునిద్ది. 216

తే. ఉందు రీలోకమున ధనమున్నవారొ
కరికి బంధువుల్, స్నేహితగణము అటె
యతఁడు ప్రాజ్ఞుఁడు, పండితుఁడైన పురుషుఁ
డిగ సమాజము భావించు నతని నెపుడు. 217

తే. అర్థ మెవ్వని కుండునో యతఁడె బుద్ధి
యుతుఁడు, పుణ్యుఁడు, సద్గుణ యుతుఁడు, జ్ఞాని
గాగ భావింపఁబడును జగాన సకల
జనగణంబుల చేత నౌ సత్య మిద్ది! 218

తే. అర్థమున్నవానికిని ధర్మార్థకామ
ములు లభించు వానికి సర్వమనుకూల
ముగను నుండును ధనమును పొందనట్టి
వాఁడు కోరెడు నభివృద్ధిఁ బడయలేఁడు. 219

తే. రాజ! అర్థమ్ము నుండి హర్షమ్ము, ధర్మ,
దర్ప, క్రోధములు, శాంతి, దమము - ఇట్టి
వన్నియు జనన మొందు నత్యధికముగను -
ఇద్ది సత్యమై యిలను వర్తించు చుండు. 220

తే. స్వజనులను గూడి యుండుట, శాత్రవులను
నాశ్రయించుట యనియెడు నల్పక్రియకు
మధ్యనున్నది తారతమ్యమ్ము మివుల -
తుచ్ఛబుద్ధికి నియ్యది తోచదెపుడు. 221

తే. నీకుఁ జెందిన యాతండు నిర్గుణుండు
శాత్రవులవాఁడు సుగుణ విశ్రాంతియుతుఁడు
నగుచు నుండఁగ వచ్చును - అయిన పరుఁడు
ఎన్నటికి నైన పరుఁడు గానే రహించు. 222

తే. వీడి తన పక్షము, పరులఁగూడియుండి
ఆత్మపక్షమ్ము నాశన మందు వెనుక
శత్రువుల చేత కొద్దిలో సంహరింప
బడు నతండియ్యది యౌను పరమరూఢి. 223

తే.	ఆచరింపగఁ గడు దూరమందు ధర్మ
ముస్న వాఁడు కరమ్మున నున్న సర్ప
మును విడిచి నట్టి యాతనిఁబోలి సర్వ
సౌఖ్యముల నొందుచుండు ప్రశస్త ముగను. 224

తే.	ఇతర ధనములఁ గాఁ జేయు నిచ్ఛయందు
బరవనితలను నవమానపరచుటందు
గోర్కెగలవారె విడువఁగా గోరవలయు!
అనుచు వచియించువారు సర్వజ్ఞులెపుడు. 225

తే.	ఇతరుల ధనము లపహరించుటయును,
పరనళినులను నవమాన పరచుటయును,
హితుల నూహించుచు నవమానించుటయును,
మూఁడు దోషాలు నాశనమూలకములు. 226

తే.	కార్యమును నిర్వహింపఁగాఁ గడగి ప్రాణ
ములను నర్పించు ప్రభువొందు స్వర్గసీమ –
కనుక నిది యొక విషయమ్ము కాదు దేవ
జనుల విషయమ్ము నైయుండు – సత్య మిద్ది. 227

తే.	సర్వదేశమ్ము లందున సతులు గలరు
అఖిల దేశాల బాంధవులర్థిఁగలరు
సుగుణ భూషణుఁడైన యా సోదరుండు
లభ్య మౌ దేశ మెట కనరాదు కనఁగ. 228

తే.	గగన మున్నది గగనమ్ము గాగ నదియె
సాగరముఁ బోలి యున్నది సాగరమ్ము
రామరావణ మధ్యయో రణము కనఁగ
నున్నయది రామరావణ యుద్ధమటుల. 229

తే.	పెద్దలెల్ల తెల్పినది యామోద ముద్ర
మహితు లాయోధు లిచ్చిన మార్గమద్ది
యుద్ధ మరణమ్ము నొందిన యోధుఁగూర్చి
దుఃఖమొందంగ రాదని తోచు క్రమము. 230

తే. శుభములొనరించు నాతండు సుఖములొందు
పాపములు చేయువాండొందు పాపచయము
పేరి సౌఖ్యాల నొందు విభీషణుండు
రాక్షసుండు రావణునకు మరణము ఫలము. 231

తే. వ్యసనములను, కృచ్ఛ్రముల, యుద్ధాదులందు,
యజ్ఞముల, స్వయంవరముల నంత పాణి
గ్రహణ విరహాల పరులకు గ్రందుంబడుట
కాంతలకు దోషమెన్నండు కాదు, కాదు. 232

తే. చరిత సందేహమును గొన్న చానవైన
నీవు ప్రత్యక్షమున నిప్డు నిలిచినావు
నేత్రరోగి నిర్మలిన సందీపకాంతి
నెట్లొ యటులనే నిన్ను సహింపంజాల! 233

తే. చేయవలసిన పని పూర్తి చేసి పిదప
నడ్డు కలుగకయుంటకై యందు కొఱకు
నన్యకార్యమ్ము లెవండు తానాచరించు
నతండె యర్హుండు సకల కార్యము లొనర్ప. 234

తే. అఖిల లోకాన పని యల్పమైనదైన
నొక్క మార్గాన సాధింపనోప లేము
కార్యసాధన కెవ్వాండు కనుంగొనంగం
జాలు సాధనల నతండు సాధకుండు. 235

## ఉత్తర కాండ

తే. కన్నెలకుం బితృత్వము దుఃఖ కారణమ్మొ
అంద రభిమానవంతుల కగును గాదె
ఎవండు వరియించునో యన్న దెఱుక పడక,
నోర్చుకొనలేక తా వ్యథ నొందు చుండ. 236

తే. తల్లి పుట్టిన కులమును, తండ్రి కులము,
నామె యీయంగం బడియెడి యట్టివాని

కులము మూడు కులమ్ముల నిలుపు కన్య
సర్వ విషయాల సంశయ స్థానమందు. 237

తే. రాక్షసాధిప! నేను నిరాకరింప
బడితి నెపుడును నీచేత – పరమదోషి
యయ్యు బాలుఁ డెవ్వేళను నగును గాదె
బంధువులకు రక్షింపఁగా వలయు వాఁడు. 238

తే. ఇలను నేజీవి యపకీర్తి యెంతవరకుఁ
జర్చనీయాంశ మైయుండి సాగుచుండు
నట్లు చర్చసాగెడు సమయమ్ము వఱకు
నధమలోకమ్ము నందు నాతఁడుండు. 239

తే. తృప్తి గలిగింప దపకీర్తి దేవతలకు
మెచ్చెదరు కీర్తి లోకాల మెలగువారు
రక్తిని మహాత్ములెవో కార్యములను
గెరలి మొదలు పెట్టుటయును గీర్తి కొఱకె. 240

తే. భర్త దేవత, భర్తయౌ బాంధవుండు,
భర్త గురుఁడు అందువలనఁ బ్రాణములను
నర్పణము చేసి యైనను నతని కిష్ట
మైన కార్యమ్ము గావించు టవసరమ్ము. 241

తే. ఎవడు విధిక్రమమ్మునను పాలింపఁ డట్టి
రాజొనర్చెడి దోషాల ప్రజలు నాశ
నమ్ము గొనెదరు – రాజు దుర్నయత నేల
జనులు మరణింత్రు వార్ధక్యమునకు మున్నె. 242

తే. పురములందున గ్రామాలఁ బొలుచు ప్రజలు
చేయఁగా రాని పనులను జేయుచుండ
రాజరక్షణ లేనట్టి రాజ్యమందుఁ
గలుగు మరణ భయమ్ము దుష్కాలమునను. 243

తే. ప్రభువు దోషుల శిక్షింపవలయు – అటుల
శిక్షణను నిచ్చుటెంతయు క్షేమకరము
నుత్తమ మ్మగు కార్యమైయుంటవలన
జనపతి తప్పక వెడలును స్వర్గమునకు. 244

తే. చెప్పినది పిన్నలైనను క్షేమమొసగు
నట్టి వాక్యమ్ముగ్రహియింపనగును – కాన
సర్వమయినది యుక్తమ్మునయిన నీదు
నుచిత వాక్యము వినుచుంటి నోయి భరత! 245

# వాల్మీకి రామాయణ నీతి శ్లోకానువాదములు

తే. అర్థి నుపకార మొనరించి నట్టి మిత్ర
తతి కసత్యప్రతిజ్ఞులఁ దానె పూని
యెవఁ డధర్మము గావించు నిచ్చ మెయిని
నతని మించెడి ఘన నీచుడరయ లేడు.

తే. ఆ నిరుత్సాహవంతుఁడే యన్ని పనులఁ
గడగి యారంభమొనరింపఁ గలఁడు, జీవి
జగతిఁ గావించు నట్టిదౌ సకల కృషిని,
సఫల మొనరించు సత్య, ముత్సాహమెపుడు.

తే. పూర్వజనపాలనమ్ము సంపూర్ణ సత్య
కరుణల పయిన నిలచియె గడచుచుండె
అఖిల లోకమ్ము నిలచి సత్యమ్ము పైన
నుంట సత్యమ్ముపై నిల్చియుండు ప్రభుత!

తే. ఇలను పాపిష్ఠి పనులు గావించువాఁడు
ఎట్టి మర్యాదయైన లేనట్టివాఁడు
చెప్పునది చేయకుండువాఁ డెప్పుడయిన
గైకొనగ లేఁడు సజ్జన గౌరవుఁడుగ.

తే. ఎపుడు వచ్చును నీతోడ మృతి విడువక
నీ సమక్షాన కూర్చుండు నిశలు పవలు
ఎంత నడువ తా వెంటనె యంతయుండు
తిరిగి వచ్చెడి యానానఁ దిరిగి వచ్చు.

తే. మిద్దెలైనను వసియించు మేడలయిన
నందముల నొప్పు చీని చీనాంబరములు
రాజసత్కార, ప్రాకార లక్షణములు
తరుణులకు నౌనె గౌరవావరణ చయము?
చాన సౌశీల్యమౌ మహాచ్ఛాదనమ్ము. 6

తే. ఎటులఁ దలపోయు చుందుమో యటు లొనర్ప
నెంత మాత్రము మనచేత నేమియుండ
దాయదృష్టము త్రిప్పుచు నటుల నిటుల
జరుగవలసిన దానిని జరుపుచుండు.

తే. ఎప్పటికి నట్టె భృత్యుల కీయవలయు
జీత, మాహారధాన్యాలు చెప్పినటుల
అయిన నాలస్య మా ప్రభునైన నాగ్ర
హించి దూషింత్రు వారది యెంతొ ముప్పు.

తే. ఈ జగమ్మును మరి జనియించె నట్టి
సకల జనులందుఁ బ్రతివారి కొకటి తల్లి
తండ్రియును నుపాధ్యాయుండు తప్ప కెపుడు
ముప్వురు గురువు లవుచును బూజఁగొంద్రు.

తే. కన నిరుత్సాహవంతుండు గానివాఁడె
యరసి ప్రారంభమొనరించు నన్నిపనులు
చెలగి యుత్సాహమే యిల జీవిసేయు
సర్వకృత్యాల నొనరించు సఫలములుగ.

తే. కోపమును గొన్న మనుజుండు పాపకృత్య
మొనరఁ గావింపకుండునే – ఒడిసి చంపు
గురువులను, సాధుజనులను పరుష వాక్య
ములను నెదురించుటయుఁ జేయు మూర్ఖుఁడగుచు.

తే. అగు స్వభావమ్ము మార్చుటత్యంత మౌన
సాధ్య కృత్యమ్ము మంచి నే సమయమందు
నెట్టి హేతువున గ్రహించి రేని దుష్టుఁ
డద్ది బహుకాల ముండఁబో దచట నిలచి. 12

తే. గర్వమను నంధకారానఁ గడఁగి తెలుసు
కొనగ మంచి చెడ్డలు క్రూరు లెంత
దొడ్డవారైన సరియైన త్రోవఁ జేరుఁ
డనుచు శాసించుటగును న్యాయమ్ము, నిజము!

తే. అధికతర తపస్సంపన్నులైన ఋషులు
సైతము విధి వక్రించిన సమయమునను
నియమ నిష్ఠలఁ గోల్పోయి నిశ్చయముగ
కామక్రోధాదులకు లొంగి కడగఁగలరు.

తే. ధనము, ధాన్యాలు సమకూరు ధర్మమునను
లభ్యములగు సౌఖ్యములు ధర్మమ్ము వలన
ధర్మ మొనరింప ధరను పొందనిది లేదు
పొడము ధర్మమొక్కటి సారభూతమగుచు.

తే. పెద్దల యభిప్రాయమును సంప్రీతి గౌర
వించి, నిరతమును ననుసరింతు మేని
స్వర్గమును, సర్వధనమును, సకల ధాన్య
ములను, పుత్రుల, సుఖముల పొందవచ్చు.

తే. కానబడడు లోకమున దుఃఖమ్ముతోడ
సాయమును బొందియున్న శత్రువు కనఁగ
నాశమొనరించు నద్ది జ్ఞానమ్ము, ధైర్య
పరమ బలము నితర సర్వవస్తు చయము.

తే. బంధితుల సేయ మనల నుపాయములను
జ్ఞాతులే తెల్పుచుందురు కాన మనము
యెరిగి దీనిని జ్ఞాతులె యెంతవరకు
నాప దలగుదురో తెలియంగఁ దగును. 18

తే. గడచిపోయిన యుద్ధానిఁ దడవి, దాని
గూర్చి యోజించు టెంతయుఁ గూడని పని
గత మదెదియైన నెవ్వేళ గతము కానఁ
జేయవలసిన దెదియొ యోజింపవలయు.

తే. గడుపుకొనఁదయ పని నిచ్చకములఁ బలుకు
వార లెవ్వేళ నెందరో చేరుచుంద్రు
హితవు కోరి చెప్పెడువార లెంద్రులేరు
వారు దొరికిన వినియెడువారు లేరు.

తే. తప్పు చేసినవానికి దాని ఫల మ
దెట్లు కనుపించు వెంటనే? ఏల ననిన -
పైరు నాటిన నయ్యది పండు కొరకు
కాల మొక కొంత తప్పక గడవవలదె?

తే. జలము ప్రవహించి వెడలిన సమయమందు
సేతువును వేయు టెంతయు చిలిపితనము
కనుక - కాల మే మాత్రమ్ము గడువకుండ
శుభము చేకూర్చు క్రియసేయ శోభలబ్బు.

తే. తానొనర్చుపనికి ప్రమాదమ్ము దలఁచి
దీనుఁడగువానిఁ జేరునుద్దీప్తి సఖుఁడు
ఒకని మార్గమ్ము చెడిపోవ నోపి, సాయ
పడగ నేగెడు నాతఁడు బంధువుండు.

తే. లభ్యమౌను ధర్మమున నర్థమ్ము మనకు
కలుగు నద్దాని వలన సౌఖ్యమ్ము లెల్ల
అగుట లోక ప్రధానమైనట్టి దెప్పు
డగును ధర్మమ్మెయని తెలియంగ వలయు. 23

తే. ప్రజల రక్షింపవలె ప్రజారక్షకుండు
చేయవలసె నేని యతఁడు చేయవచ్చు
పరమ పాపమ్ములను రాజ్యభార మహిత
బాధ్యుల కిది ధర్మమ్ము, శాశ్వతము, ఘనము.

తే. స్నిగ్ధవర్తన గల్గి పూజింతు రేని
విమల యత్నమ్ముతోడ సేవింతు రేని
యబ్బుఁదగినట్టులుగ రాజుననుగ్రహమ్ము
భిన్న వర్తనులైన కోపించు ప్రభువు .

తే. నీళ్ళతో నార్పినట్టుల నిప్పుఁ బెచ్చు
పెరిగిపోవు కోపమును, వివేకమునను
నడ్డఁ గల్గెడి యట్టి మహాత్ములు పురు
షోత్తములును, ధన్యాతి ధన్యులు గదయ్య!

తే. చెడ్డవౌ కారణమ్ముల చేత నొకఁడు
మంచి పాపకృత్యములు గావించినాఁడు
అతడి దుష్కార్యఫలముగా నతని సకల
కులము నాశనమొందె సంక్షోభమొదవ.

తే. సత్య 'మోమ్', బ్రహ్మ – తిలకింపు సత్యమందె
వరలుచుండు ధర్మ స్వరూపమ్ము సత్య
మౌను వేదస్వరూపమ్ము – అఖిలముఖ్య
ములను సత్యమూలముననె పొందవచ్చు.

తే. కట్టుబడె సత్యమునకు సాగరుఁడు – కాన
దాని తప్పెదననెడి సంత్రాసమునను
వృద్ధి పొందంగ వలసిన వేళయైన
తనదు పరిమిత తీరమ్ము దాట డతడు. 30

తే. కర్మలారంభమొనరించు కాలమందు
వానిలో గొప్పలోపముల్, వాని వలన
నబ్బు మేళ్ళను, కీడుల నవగతమ్ము
చేసుకొననట్టి వారెంతొ చిన్నవారు.

తే. ఎవఁడు ధైర్యమ్ము కోల్పోవు నెపుడు మూర్ఖు
డతఁడు బరువుతోఁ గూడియున్నట్టి నౌక
నీట మునిగెడి రీతిగాఁ జేటు వడును
మునుఁగ చేయఁడు తా కష్టములను నెపుడు.

తే. స్వయముగాఁ జేయకున్నను పాపములను
పాపులతొఁ గూడుటను మంచివారు వారి
పాపములఁ జిక్కి "యహి సరోవరము" లందుఁ
బడిన మత్స్యమ్ములటు భంగపడుదు రయ్య.

తే. అగ్ని గాని, శస్త్రమ్ములన్నములు గాని
భయము గొల్పెడునవి గావు స్వార్థ పరత
నాత్మ కృత్యమ్ము లొనరించు న,ట్టి జ్ఞాతు
లగుదురు భయావహు లదియ ఔను, నిజము!

తే. మనసు నేకాలమున దుఃఖమునను నిలుప
రాదు కీడొనర్చునది సర్వమ్ము మించి
క్రీడ క్రుద్ధాహి, యెల్ల హరించునట్టు
లా విషాదము మూడు సంహరణ సేయు.

తే. శత్రుతోడను, కోపించు సర్పము కడ
వాస మొనరింపఁ గోరఁగా వచ్చుగాని
మిత్రువలెఁ గాను పించుచు శత్రుసేవఁ
జేయువానినిఁ గలిసి వసింపరాదు. 36

తే. ఇతర జన సంపదలను హరించుటయును,
పరుల భార్యల నవమాన పరచుటయును,
స్నేహితుల నెదను ననుమానించుటయును
సర్వనాశన మొసఁగు దోషములు మూఁడు.

తే. మంచిలోఁ జెడుఁగును బ్రవర్తించుటకును
నింద్రియములు కారణమౌను – ఎంతొ ద్రఢిమ
నీవు నీదగు మనసును నిగ్రహించి
పెద్దగను నీయధీనాన బెట్టవలయు.

తే. హితులను సమర్థులునునైన యెల్ల మంత్రు
లతొ, సచివులతో, బంధువులతొ సలుపుచు
చర్చలను, మంచి నిర్ణయచయ మొనర్చి
దేవు ననుకూలుగా నొందు దివ్యజనుఁడు.

తే. జావలగ లేచు నగ్నిని జలముతోడ
నాపు పగిది పయికి రేగు కోప మాత్మ
బుద్ధి సాహాయ్య శక్తితో నిల్పఁబోలు
నమ్మహాత్ములు, ధన్యు, లత్యధికబుధులు.

తే. నిత్యమును కలహించు దుర్నీతి పరులు,
నేటి సోదరులకు భ్రాతృనీతిఁ దెలుపు
ధన్యమో దాంపత్యమును, మాతాపితృ
మహితభక్తిని దెలుపు రామాయణమ్ము.

తే. పుడమి యీ పర్వతమ్ముల బడయు వరకు,
మానసీయమ్ము లగుచు నదీనదమ్ము
లుజ్జ్వలానంత గతులతో నుండు వరకు
మనును లోకమ్మునందు రామాయణమ్ము. 42

తే. వానరశ్రేష్ఠ హనుమంతు స్వామి భక్తి
సేవయొనరించు నిరతికి చిహ్నమౌను!
స్నేహమున కెద్దియని పరీక్షించి నపుడు
రామసుగ్రీవమైత్రియే రమ్యమౌను.

తే. శబరి రుచి చూచి తినిపింప స్వాదుఫలము
లధిక సంప్రీతి శ్రీరాముఁ డారగించె
కులమునకుఁ గాక వ్యక్తికే గొప్పఁదనము
నాయ నవ్వేళ నొసఁగిన యటులఁ దోచు.

తే. తిరముగా రాము నేకపత్నీ వ్రతమ్ము
నిప్పుడీ నాటి పురుషుల కెంతగానొ
నేర్పి గుణపాఠములను సునిశ్చితముగ
నార్జనమ్మొనర్చినను ప్రఖ్యాతి నొసఁగు.

తే. ఎవని మృత్యువు కడు సమీపించు నతడు
కీడు కలిగించువాని కాంక్షించుచుండు
ఎవని మృత్యువు కడు సమీపించు వాడు
ఏది మంచిదో దానికి నిష్టపడడు.

తే. పెద్దవారి భావాలపై ప్రీతి నిల్పి
వాని పాటింప పొందగా వచ్చు విద్య
ధనము, ధాన్యము, స్వర్గమ్ము తనయ తతిని
సకలమును నిచ్చు నీరీతి సౌఖ్యములను.

తే. కోర్కెలవి గొప్పవైనను కొద్దినైన
చెడు నిరాశల మాత్రమే స్థిరమొనర్చు
ప్రౌఢి మనసును సంతృప్తి పరచునట్టి
ఎట్టిదో అదృష్టము ప్రసాదింపనది. 48

# గీతాప్రవచనములు

తే. తన్నుఁదాఁ బొగడుకొనుట, తాను పల్కు
పల్కులను జేయు చేతలఁ బరుల నెపుడు
బాధ వెట్టుట, నిలుకడ బడయకుంట
యగును నజ్ఞాన గుణము లీయవనిఁ గనఁగ.

తే. కలుగ వలయు విచక్షణా జ్ఞాన – మంత
వినయమును, విధేయతయును బెరుగవలయు
వ్యర్థము, ననర్థమౌ విద్య యబ్బకుండ
దేని నెపుడెట్లు చేయుటో తెలియవలయు.

తే. ధైర్య రాహిత్య, మతి నిరుత్సాహ, మెల్ల
పిరికితనము పూని విడిచి పెట్టవలయు
తానె యెఱుగంగవలయు కర్తవ్యమేమొ
తెలిసినంత నద్దాని సాధింపవలయు.

తే. బాలలకును గర్తవ్యమ్ము ప్రౌఢగతుల
విద్యయార్జించు టద్ది ప్రాపించు కొఱకుఁ
బట్టుదల, శ్రద్ధ, ఓపిక – పైన గురువు
లందు నసమాన భక్తియు నబ్బవలయు.

తే. ఉండవలె నెంత నేర్చిన నిండుకుండ
వలెను దొఱకక, యెడిసెడు వాఁడు మూర్ఖుఁ
డెపుడు పెరుగంగ వలయు జ్ఞానేచ్ఛ ప్రజకు
జ్ఞానవార్నిధి కంతమ్ము గానఁబడదు.

తే. తనదు కోపమ్ము శత్రువు తనకు కోప
మునను బ్రాపించు మోహము – మోహమునను
భ్రమ, దాన నాశనము సర్వమ్ము కలుగు
కోప మెల్ల దుష్టులపయిఁ జూపవచ్చు. 6

తే. పిల్లలకె కాదు గమనింపఁ బెద్దలకును
మాంద్య నిర్లక్ష్య గర్వముల్, మహిత దురభి
మానమును గీడొనర్చు, ననూన వైరు
లగుట దీని దూరాననుంచంగ వలయు.

తే. భయమునొందుట, యనుమాన పడుట యెపుడు
మంచి చేష్టలు కావు భావించి చూడ
"లక్ష్మి సాహసధైర్యాల లభ్యయౌను" –
అనుట మీర లెఱిఁగి నట్టి యర్థముగద!

తే. అవును – తల్లిదండ్రుల తెన్క నంత దొడ్డ
స్థానమది జ్ఞాన నిచయమొసఁగెడు నట్టి
గురునిదేయగు – కడుమంచి గురువు దొరుకు
టెంతయును నదృష్టమని వచింపవలయు.

తే. ఈవు దేని కొఱకయి దుఃఖింపవలెనో
దాని కొఱకు దుఃఖింపుము – కాని నాశ
మైన వానిని, జరిగిన యట్టి వాని
గూర్చి వ్యథనొందు టొక వ్యర్థగుణము .

తే. కల్గుచుండును సుఖము, దుఃఖము నెల్ల
రికిని – అందు దుఃఖము వర్తింపదెల్ల
వేళ – మరియు రాదు సుఖము వీక్షఁ జేసి –
శుభ్రగతి రెంటి సమముగాఁ జూడ వలయు.

తే. మోక్షమున జన్మమిఁక 'లేకపోవుట యగు
అద్ది లభియించు నెడ నుండ దవసరమ్ము
తిరిగి విచ్చేయ జగతికి – తెలియ నట్టె
దాని నార్జింప కులము, మతమ్ము జాతి. 12

తే. ఏది బాధించు మన నదే యితర జనుల
నైన బాధించు – వారిలో నైననున్న
వాఁడు దేవుఁడటంచు భావన యొనర్తు
మేని మన మితరుల బాధింపమెపుడు.

తే. తప్పకను ప్రతి వ్యక్తియు దనదుపనులఁ
జేయవలయు నుత్సాహానఁ జివరవఱకు
మంచి పలితమ్ము లొసఁగును మంచి పనులు
చెడు ఫలమ్ములు చేకూర్చు చెడ్డపనులు.

తే. ఆశలకు నుండునే యెంత యైన నంతు
కోర్కెల నదుపులో నుంచుకొనఁగ వలయు
పట్టుదలతోడు నేర్వంగ వలయుఁ దృప్తి
తృప్తిగలవాఁడు నిండు సుఖింపఁగలఁడు.

తే. అవును స్వార్థము మూల మనర్థములకు
స్వార్థ పరుఁడ తెగించును సర్వమునకు
చేయఁ దనవారికే కీడు సిద్ధపడును -
మనుజులగుటకు స్వార్థమ్ము మానవలయు.

తే. చేయఁ దప మరణ్యమునకుఁ జేరవలెనె
ఉండియే యింట, సర్వమ్ము నుంచుకొనియె,
లోకబాంధవ్యమునను జీకాకు పడక
పద్మ జలబిందు వట్టుల వరల వలయు.

తే. ధ్యాన మొనరింపవలెఁ బరమాత్మ సకల
వయసులందు వృద్ధులదియె భక్తియనుట
యెంతో తప్పు ప్రహ్లాదుండు ధ్రువుఁడు బాల్య
మందె ఘనభక్తితో ధన్యులైరి గాదె! 18

తే. త్యాగబుద్ధి, సేవాసక్తి, యవసరమ్ము
ప్రతి మనుష్యునకు - ఏ ప్రాణినయిన
హింస గావింపఁ జెల్లదు ఎన్నఁడయిన
పరమ ధర్మమహింస యెవ్వరికి నైన.

తే. ప్రీతి నున్న దొక్కరికిని బెట్టుటందు
నున్న యానంద మెందును నుండఁబోదు
మంచి నెవరు చెప్పినను గ్రహించవలయు
నెక్కడున్నఁ బొందవలె సహృదయ నిరతి.

తే. అగు నసూయ మహోఘనవ్యాధి నాంది
యదియ భారత ఘన మహాహవమునకును
చావునకు భయపడరాదు సహజమైన
యట్టి పరివర్తనము దీర్ఘమయిన నిద్ర.

తే. అందఱును బిడ్డ లా పరమాత్మ వరున
కింద నే యొక్కరిపయి ప్రత్యేకమైన
ప్రేమ, ద్వేషము కల్గి వర్తింప డెపుడు
వారి నడపును గర్మానుసారముగను.

తే. తప్పొనర్చుట నైజమ్ము, దాని నెఱింగి
పరమనిరతి పశ్చాత్తాప పడి యశేష
శ్రద్ధ తిరిగి చేయకయుంట సత్యమైన
మనుజునకు లక్షణ మది సన్మార్గ మౌను.

తే. సాత్త్వికాహార మది పెంచు సత్త్వగుణము
జ్ఞాని కందఱు మిత్రు లాజ్ఞానులందు
నుండు సమభావ మెంతొ సముజ్జ్వలముగ
వశపడు మనసు చేయు నభ్యాసమునను. 24

# పాంచరాత్ర రహస్యము

తే. మోక్ష విషయికమగు సత్యములను గూర్చి
మన మహర్షులు దర్శించి, మనకు దెల్పి
నట్టి సిద్ధాంతములె దర్శనములు - అవ్వి
అస్తికమ్ములు, మరియును నాస్తికములు.

తే. 'చూపునట్టిది', మరియును 'చూచునట్టి'
దనుచు 'దర్శన' పదము రెండర్థములను*
కలిగియుండు - దేని ననెడి కాంక్ష యొడమ
'జ్ఞాన' మను సత్యమౌ సమాధాన మొదవు.

తే. బౌద్ధ జైనార్హతములు, చార్వాకమతము,
నా దిగంబరములును నాస్తికములు
వేదములు ప్రమాణమ్ములు వేని కగునొ
యట్టి దర్శనగణమాస్తికాళియగును.

తే. అందు ఔలూక్య పాశుపతాక్ష పాద
జైమినీ ప్రత్యభిజ్ఞలు, సాంఖ్యశైవ
శాంకర నకులీ రామానుజములు, పాణి
నీ రసేశ్వర మాధ్వముల్ నెగడు తొలుత.

తే. అరయు దర్శనమ్ములను రామానుజమ్ము
వైష్ణవము విష్ణుపారమ్య భావ బోధ
ఈ మహాదర్శనమ్ముద్భవింపబోవు
పూర్వమున జైన బౌద్ధముల్ పొలిసియుండె.

---

* 'దృశిర్' ప్రేక్షణే - దృశ్యతే ఇతి - దృశ్యతే -అనే నీతి భావకర్మార్థములు రెండు.

తే. అందు జైనుల స్వాద్వాద మతిశయించి
యప్రదృష్యమ్ముగా నొప్పెనఖిల దిశల
అద్ది సత్ - అసత్ సదసత్‌ల అఖిలవాద
ములను నిర్జించుచుండె సంపూర్ణముగను. 6

తే. అప్డు వైష్ణవాచార్యులా యతి విచిత్ర
వాదమును ఖండనము చేసి వైష్ణవమ్ము
నిల్పి, రద్దానఁ బరమాత్మ నిత్యశుద్ధ
బుద్ధ ముక్తస్వరూపుడై పొలుచు బ్రహ్మ.

తే. అదియె పరమాత్మ రూపమ్ము అదియె చేరి
జీవములను గారణముగఁ జెలఁగుచుండు
దాని వలననే 'తత్', 'త్వం' పదార్థములకుఁ
గలుగుఁ గనఁగ సమానాధికరణ గుణము.

తే. అరయ జీవాత్మ యేని బ్రహ్మాత్మరూపుఁ
డగు శరీరత్వ పద్ధతి ననుసరించి
సర్వ శబ్దాలు పరమాత్మవాచకమ్ము
లనెడి వచన ముత్పన్నమై చెలంగు.

తే. "అగును జీవాత్మ లా పరమాత్మ కంటె
భిన్నము" లని రామానుజు విన్నపమ్ము
"ద్వాసుపర్ణా" దియౌ శ్రుతివాక్య మిందు
కై ప్రమాణముగను జూపఁ గడఁగి నారు.

తే. ఆ అచిచ్ఛబ్ద వాచ్య దృశ్యమ్ము కనఁగ
భోగకరణ భోగాయుత భోగ్యములను
మూఁడు భేదాల వింగడి బొందియుండు
నిదియె కన్పట్టు నీ జగమెల్ల నగుచు.

తే. ఈశ్వర పదార్థ వాచ్యుండు - ఈ సమస్త
జగదుపాదాన కారణుఁడగు నటంచు
నా పురుషోత్తముండైన యట్టి వాసు
దేవుఁడా జీవభిన్నుఁడు తెలుపఁబడియె. 12

తే. వాసు దేవుఁడు, కల్యాణ వైభవుండు,
నఖిల లోకాల జీవనియామకుండు
భక్తవత్సలుఁడనుగ్రహ పాత్ర జీవు
డంది సాన్నిధ్యమును విశిష్టాత్ముఁడగును.

తే. అతఁడు, కనఁగ, నద్వైత బ్రహ్మమ్ము పగిది
కాఁడు నిర్గుణుఁడును నిరాకారుఁ డెపుడు
పరగుఁ గల్యాణ విభవసంపదల నెపుడు
భక్తులకు నర్హతలఁ బట్టి ఫలము లొసఁగు.

తే. అట్టి యాయాప్రదానాల నర్హతలను
ననుసరించి యొసఁగఁగా నర్చయును వి
భవము వ్యూహ మంతర్యామి సూక్ష్మములను
పంచవిధములఁ దనలీలఁ బరగు నతఁడు.

తే. అర్చకు న్జెందినవి ప్రతిమాదులు అవ
తారములు విభవస్వరూపమ్ము అట్లు
వాసుదే, వానిరుద్ధ, ప్రద్యుమ్న, సంక
ర్షణులను నాల్గు సంజ్ఞల వ్యూహ మొప్పు.

తే. షడ్గుణైశ్వర్యయుతుఁడైన వాసుదేవ
మూర్తియే కనుఁగొన సూక్ష్మరూపుఁడగును
అట్టి సూక్ష్మరూపుఁడు వాసుదేవుఁ డరసి
కనఁగఁ దోచు నంతర్యామిగాఁ బరంగి.

తే. పూర్వ పూర్వోక్త మూర్త్యు పాసనల ఫలము
వలన జ్ఞానమ్ము ప్రాప్తమై క్రమక్రమముగ
నుత్త రోత్తర మూర్త్యుపాస్తి పయిన నధి
కార మద్ది మేలొసంగ సంప్రాప్తమౌను. 18

తే. అంతయును నిద్ది వాసుదేవానుగ్రహము
వలనఁ గల్గు నటంచుఁ జెప్పంగఁ బడియె
'పంచరాత్రమ్ము' తెలిపెను పంచగతుల
వాసుదేవు నుపాసించు పద్ధతులను.

తే. అభిగమన ఉపాదాన, స్వాధ్యాయ, యోగ,
ఇజ్య – లీ పంచపద్ధతు లిందు అభిగ
మనము దేవతా స్థాన మార్గాదులైన
వాని తుడిచి, అలికి, శుభ్రపరచుటగును.

తే. గంధపుష్పాది పూజన కరణ సాధ
నములు చేర్చుటు పాదాన నయము ఇజ్య
దేవతా పూజనమ్మగును దెలియు దేవ
తాను సంధానమే యోగమౌఁ గనంగ.

తే. పొలుచు నర్థాను సంధాన పూర్వకముగ
మంత్రజపములును, స్తోత్రపఠనములును
నామ సంకీర్తనలును నానా విధాల
తత్త్వ శాస్త్ర పఠనము స్వాధ్యాయ మౌను.

తే. పై విధమ్మునఁ గన్పట్టు నట్టి ఉపాయనమున
సముచితమ్మైన విజ్ఞాన సముదయమున
వ్యక్తుండై వాసుదేవుండు భక్తు కిచ్చు
తనదు సాన్నిధ్యమును మహాప్రదానముగను.

తే. పురుషు సాంసారికమ్ములై పొలుచు గుణము
లెప్పుడగు తిరోహితములు అప్పుడతని
దగు నవిద్య నశించును – అద్ది కనఁగ
సకలమును వాసుదేవు ప్రసాదమగును. 24

తే. జీవుఁడు అవిద్య లోపింపఁ జెలఁగి ముక్తు
డైనఁ బరమాత్మ తుల్యుఁడై యందు నతని
సర్వగుణ వైభవమ్మని చాటి చెప్పె
పాంచరాత్ర రహస్యమ్ము ప్రౌఢముగను. 25

# మహాజనసూక్తులు : అనువాదాలు

తే. వర్తమానమ్ము భరియింప వలను పడక
దుర్భరమ్మయి వ్యక్తికిఁ దోచువేళ
గతమునందలి సౌఖ్యాల జ్ఞాపకమ్ము
కంటె బాధాకరము వేరు కానఁబడదు. – దాంతే

తే. గాఢమగు నిద్రనుండి మేల్కాంచినట్టి
దౌను మరణము అట్టిదే యౌను యోజ
సేయ మృత్యువు ప్రాణుల జీవితమున
కలుగు చుండ నొకానొక గాఢనిద్ర. – స్వామి శివానంద

తే. ఎట్టి పరిమితి నైనను నెఱుఁగ నట్టి
ప్రణయ మట్టుల నెట్టి లోపమ్ము నెఱుఁగ
నట్టి మైత్రియుఁ గల్గిన యట్టి పత్ని,
సర్వసహకారగుణ! నమస్కార శతము.

తే. ఎద్ది పుట్టునొ యయ్యది గిట్టుచుండు
గిట్టునెయ్యది యయ్యది పుట్టుచుండు
ప్రాణిలోకమ్ము పొందెడు ఫణితి యిద్ది
శాశ్వతాత్మకు మృత్యువు, జన్మ లేవు.

తే. ఓర్పెదానమ్ము, అగుయజ్ఞ మోర్పె ఔను
ఓర్పె సత్యమ్ము ధర్మమ్ము నోర్పెయగును
నిండుగా నోర్పుతో నెంతొ నిండియుండె
జగము సర్వము ఎరుగు మీ సత్య మీవు.

తే. ఎవరు నిర్మల మౌ భక్తి నెదవహించి
ధర్మచింతన జీవించు ధర్మపరులొ
వారు సంపూర్ణ దైవసంపదకు నర్హు
లైన యధికారులగుట సత్యమ్ము, సుమ్ము. – సద్గురు మలయాళ స్వామి

తే. ఉన్న చట్ట మదేనాఁడు నుండవలయు
పేదవారల పాలిటి పెన్నిధి గను
ఉండcగా రాదు ఎన్నడు నున్నవారి
సంతసమ్ముల దీర్చెడి సాధనముగ. – డా. అంబేద్కర్

తే. ఒక గెజోరా జెమోజాను యుద్ధసేన
నొనరcగావించి నట్టి స్త్రీ జనముతోడ
వారు ధానుష్కలే కాదు పరమ భయద
ఖడ్గ విద్యావిశారదల్, కదన రతుల.

ఎమోజాన్ సైన్యం 2,500 పశ్చిమ ఆఫ్రికా దహోమీ రాజన్యుడి అగన్జారు, ఈ సైన్య ప్రారంభం గావించినాడు. 1892లో ఫ్రెంచివారి చేత దహింపజేయబడ్డది.

తే. బయటి లోకమ్ము మనలను భారతీయు
లనుచు గుర్తించుచున్నది ఆంధ్రులనుచు
తమిళు లనుచును ఘూర్జరులు మలయాళు
లనుచు కన్నడుల్ వంగవారనుచు ననరు. – మహాత్మా గాంధీ

తే. నేర్వవలె గుర్వుకడ విద్య నిలుకడగను
అతcడు లేకయె సాధింపనయ్యెనేని
యాతc డెంతటి సజ్జనుcడైన నేమి?
గర్వమొంది కావింప కువ్యాఖ్యానములను. – భారతము

తే. వరలవలె మనయాత్మ విశ్వాసమునకు
ధర్మభూమియై మరియును కర్మభూమి
అయిన నీ మాతృభూమి కర్మానురక్తి
కెపుడు కావలె నాధారమెవరికైన. – గురూజీ

తే. ధైర్యవంతుడవై లెమ్ము తగిన రీతి
బలము చేకూర్చుకొని యంత నిలుము నీవు
ప్రీతి బాధ్యత నీపయి పెట్టుకొనుము,
ఈవె నీ భవిష్యమును నిర్మించుకొనుము. – స్వామి వివేకానంద

తే. శ్రేష్టమనుజుఁడు బ్రతుకు నేరీతి దాని
నవుకరించుచు బ్రతికెద రన్యజనులు
ఎది ప్రమాణమొ యతనికి నదియె యగును
లోకమునకును నిద్దియే లోకరీతి. – స్వామి వివేకానంద

తే. ఉదయమొందినా డాదిత్యుఁడస్తమించె
నంచు మానవులానంద మందు చంద్రు
వారి రాత్రులను బవళ్ల బాగుగనప
హరణ సేయునం చెరుగ రభ్యాగ తాళి.

తే. పడవ నీరమ్ములో నుండఁ బ్రతుకు వార
లందులోనికి నీరురా నడ్డుకొంద్రు
అంటె సంసారమొనరించు నట్టివారు
దాని మునుకలేనటు చూడఁదగు నెవేళ. –రామకృష్ణ పరమహంస

తే. కాల్వగా పారు నీటిపై కాష్ఠఖండ
మెట్టులో పైకొ, క్రిందుకో యేగుచుండు
గడచుక్రియల కాధారమ్ము గతక్రియలది
యయిన ఫలితమటంచు తెల్పంగ వలయు. – వివేక చూడామణి

తే. ప్రీతి నెవ్వఁడు గంజాయి పీల్చు వాని
కోపపరిణామముల మాప కుడితి యవస
రమ్మయినటుల సంస్కారలగ్నజీవి
కవసరము 'సాధుసేవ', 'మహాత్మమైత్రి'. – రామకృష్ణ పరమహంస

తే. ఎపుడు తోచు భావమ్ము బహిర్గతమ్ము
చేయఁగా లేమొ మన మట్టి స్థితి వహించి
నపుడు మౌనముతోడ మాట్లాడకుండ
నుండఁగలుగుట యెంతయో యుత్తమమ్ము. – కందుకూరి వీరేశలింగం

తే. అక్షరాలు మృతికి రెండు అవ్వి మూఁడు
అగును బ్రహ్మత్వమునకు నత్యంతముగను
దారిచూపు "మమ, నమమ" దారితీయు
మరణమునకును, నిత్య బ్రహ్మత్వమునకు. – స్వామి శివానంద

తే. ఇతరులెపుడైన నెటనైన నే మొనర్ప
గలుగగా వ్యథ తనమది కష్టపడునొ
దాని నితరుల కొనరింపఁ దలఁపకుంట
ధర్మములలోన నుత్తమ ధర్మమరయ. – వ్యాసభారతము

తే. గ్రీసుదేశమ్ము నేలు నగ్రేసరుండు
మణులఁ జూపింపుఁ డనుచు రమణులఁ బిల్వ
తల్లి కోర్నలియా చూపి పిల్లవాండ్రు
"ఇవియె నా మణు"లని వచియించెఁ బ్రీతి.

తే. శ్రోత్రియుని భార్య, నృపసతి, మిత్రు పత్ని,
మామ పెండ్లాము, ఆచార్య మహిళ, గురుని
వనిత ఈ అపాత్రముల నెవ్వతను గాను
నను నిషేధించు టిది యేమి న్యాయ మయ్య?

తే. ఒకరు సంపదలను గల్గియున్న యపుడు
వారిఁ జేరి సహకరించువారి కంటె
నాపదలు కల్గు సమయాల నాదుకొనెడి
వారె నిజమైన స్నేహితుల్ వాస్తవముగ. – పంచతంత్రము

తే. కర్మ ఫలితాల యనుభవగమనమునకు
లేదు తప్పించుకొను మార్గమేది యైనఁ
గాన జీవులెల్లరును సత్కర్మచయమె
చేయవలెనని బుద్ధుండు చెప్పలేదె?

తే. యజ్ఞమందలి కర్మగా కన్యయైన
కర్మయంతయు బంధన కారణమ్ము
స్వార్థరహితమ్ముగాఁ జేయు సర్వకర్మ!
భగవదర్పితమై మోక్షపథ మొసంగు.

తే. మానవుఁడు తనకున్న సంపదను దనదు
'స్వంత' మైనట్లుగాఁ గాక సర్వజనుల
దైనయట్లుగ భావించి యవసరమ్ము
నొందు వారి కుంచఁవలెం బొందునట్లు. – థామస్ ఎక్కినస్

తే. భిన్నతను సమాజము పొందుచున్న కొలఁది
నెక్కువ నియమ పాలన హీనగతిని
గాఢముగ నిష్ఠతోడ సాగంగవలయు –
మానఁగా ముప్పగును దాని మనుగడకును. – జటావల్లభుల

తే. శ్వేతపత్రమ్ము వంటిదై చెలఁగు మనసు
దానిపైఁ బడు ముద్రలే తరుచు నిలుచు
అయిన నీరీతి ముద్రలయ్యా, యివేళ
నీలముద్రలె యైయుండు నిశ్చయముగ. – ఏ.సి.హారే

తే. ఎంతయో యున్నయది మన మెఱుఁగఁ దగిన
యట్టి పాశ్చాత్య విజ్ఞాన మతిశయముగ
ఒప్పుకొందు నే నద్దాని ఒక్క ఖండ
మున్ను, జాతికా దక్కరి మూల్య మెపుడు. – మహాత్మా గాంధీ

తే. అదె యనంత భవిష్యమ్ము పదిలముగను
భూరి వివృతమ్ము గావించు ద్వారములను
గతము సంపూర్ణముగ మృతగతిని బొంది
శిథిల రూపమ్ము నొందినఁ జెరుపు లేదు. – వివేకానంద

తే. ఎవరు సంపద చేరఁగా నెంతొ మురిసి
యుబ్బి తబ్బిబ్బులవుచునుండి యుంద్రొ
యట్టివారికి దారిద్ర్య మబ్బినపుడు
గాలి తరిగిన బుడగలై కానుపింత్రు. – కోట్రన్

తే. మిట్ట మధ్యాహ్న వేళల మెరయు ఛాయ
గతిని నుజ్జ్వల పాపముల్ గానఁబడవు
అనుభవించెడి సమయాన నవ్విఁతోచు
నెగుడ సాయంతనపు నీడ పగిది మనకు.

తే. వేదములె గొప్ప వనుచు భావింపలేను
బైబిలు ఖొరాను మరియు నెవెస్త నేను
వేదముల వలెనె మహా పవిత్రములుగ
భావనము సేయుచుందు నవ్యాజరక్తి. – మహాత్మ గాంధి

తే. పెరుగు లోపల దాగుండు వెన్నవోలె,
గింజలో నుండు నూనెలా, కెరలు కాష్ఠ
మందు గుప్తమ్ముగా నుండు నగ్నివోలె
పరమ గూఢమ్ముగా భగవంతుఁడుండు. – స్వామి శివానంద

తే. జీవులకు మృత్యు వెన్నండు చేరియుండు
చెప్పలేము నిశ్చయమని జీవితాన
మరుసటిదగు క్షణమ్మును – అరయజీవి
తమ్ము స్థిరమని తలఁచుట తప్పు – నిజము! – మహాభారతము

తే. మధ్య తరగతి జనులను మరచి పోవఁ
జేయ సంపన్నజనవరుల్ చెలిమి మెచ్చి
యిచ్చు బిరుదమ్ము కాక మరెద్ది యగును?
'పెద్ద మనిషి' యంచును తోచు బిరుదు కనఁగ. – రస్సెల్

తే. తనను మించినవారు లేరనటు యర్థ
రహితమో జ్ఞాన మన్యుల మహము, మేధ
నెఱిఁగి ప్రజ్ఞతో నెదను భావించు టెరుఁగ
రమ్య ప్రతిభాన్వితులదైన లక్షణమ్ము. – సర్ ఆర్థర్ కాన్టెల్

తే. హృదయ పరిశుద్ధి లేకయే యెల్లవేళ
నిటు 'శివోహం, శివోహం' వచించు వారి
కంటె శ్రేష్ఠులు, వెదశుద్ధి కలిగి తృప్తి
నెపుడు దాసోహమంచు వచించువారు. – మహర్షి మలయాళ స్వామి

తే. రకరకాల దేహమ్ము నలంకరించు
కొనెడి వారి కాదరణ చేకూరుచున్న
దా నిరాడంబరుండిపు డర్థరహితుఁ
డయి యనాగర కుండయ్యె నందరకును.

తే. అక్షరపు ముక్క లభియించ నట్టివాఁడు
వదలి యలవాటు పడ్డట్టి పంచకట్టు
ఉజ్జ్వలమ్ముగ విహరించుచున్నవాఁడు
'ప్యాంటు' ధరియించి విజ్ఞాన వంతుఁడగును.

తే. ప్రజల జీవితములఁ బోలు రాజ్యజీవి
తములు ఆత్మరక్షణకు నితరుల జంపు
హక్కు జనులకు నుండ రాజ్యములు సేయు
రణము పరులతొ నాత్మ సంరక్ష కొఱకు.

తే. "అగును నవకాశవాద మీ యఖిల సృష్టి
స్వయముగనె పుట్టి యీ రీతి సాగుననుట
దైవదూషణ చేసి సంతసము గొనుట
ఆత్మవంచన యౌను – అన్యమ్ము కాదు."

తే. చేయు జ్ఞప్తిని సజ్జన జీవితములు
'బ్రతుకు దాత్తగతి నడుపవచ్చు' ననుచు,
వెడలిపోవుచు నిలువుగాఁ గడఁగఁ గలము
లీలఁ బదముద్రికల మనకా లసికత.

తే. మన శరీర దోషములతొ, మన మనోవి
వేక హైన్యతలతొ, దేహ వికృతి గణము
తోడ, నగరదోష కుటుంబ దోషములతొ–
అరసి అయిదింటితొ కదన మాడవలయు.

తే. "నీవు గావింపఁగల పని నీవె చేయు
మంచు" వినెడు నుక్తిని విసర్జించి, యింక
నెద్ది యొనరింపగా లేరొ యితరులద్ది
నీవు గావింపఁగాఁ బ్రయత్నించు మయ్య."

తే. నేలపై నిల్చు పాదాలు నీచములని
పైన నుండుట శీర్షమింపైనదనియు
గొప్పదని మదిఁ దలఁపరా దెప్పుడయిన –
ఇటులె ప్రముఖులు ప్రజలలో నెల్లవారు.

తే. తార్కికంబైన దృష్టితోఁ దలఁతుమేని
నిశితముగ నెన్నొ యంశాలు నిలువఁగలవె?
సూర్యుఁడుదయింపఁ జీఁకట్లు సురుగునట్లు
నష్టమైపోవు మనగ్రుడ్డి నమ్మకములు.

తే. కలగి యందు వచ్చు సుర వృక్షమ్ము నుండి,
సీధువు మధు ప్రసవ తతిఁ జేరి కలుగు
కోసి పండ్లు తీయఁబడు ఫలాసవమ్ము
వీని భేదమ్ము నెఱిఁగి సేవింపవలయు.

తే. కఱ్ఱతోఁ గొట్టి చంపంగఁ గష్టపడుట
త్రోవఁబోవు మౌనియెకని తొలఁగి పలికె
"పాపమౌఁ జెప్ప తిరగేసి పయినఁబోయు
వేడినీళ్ళకు తాఁబేలు విడుచు బ్రతుకు."

తే. మున్ను జీవకుఁడనెడి విద్వన్నుతుండు
తక్షశిల నేర్చినట్టి వైద్యాంతమందు
"కన ననౌషధమెద్దియుఁ గానఁ బడదు"
అనడె తెమ్మని గురుఁడంప నరిగి వచ్చి.

తే. సలుప 'ఆదాము' కొనె బహిష్కరణ హవ్వ
అపుడె సైతాను గావించెనట్టి పనిని
దాని దేవుని వలన నాదాము కొనియె
కాని యవమానపడె జ్ఞాన కారణమున.

తే. మనకు దూరాన నున్న యామాన్యలోక
మరయ సన్యాసి చూచు గవాక్షమరయ
ఆగవాక్షము నను జూచు నఖిల దర్శ
నమ్ము జనియించు నతని మనస్సు నందు.

తే. ఎవఁడు దాసుండు ధనమున కెపుడు గాడొ
ధనము గావించు నెవనికి దాస్య మెపుడు
అతఁడు నిజమైన మానవుఁ డనుచుఁ దెలియఁ
బలుకఁగా లేదె మనకు నా పరమహంస.

తే. బ్రతుకు నొకయొడ్డు పట్టించు ప్రౌఢిమమ్ము
నార్జనము చేయు బ్రహ్మ చర్యమున నెవఁడు
అతఁడి భావి జీవితము భయరహితమ్ము
సర్వశుభపూరితమ్మయి సాగుచుండు.

తే. ఎట్టిదైనను విషమాత్ర యేకకాల
మందుఁ బని చేయఁగల నేర్పునొందియుండు
దుష్టగ్రంథమ్ము తనలోని దోషవిషము
నెంతకాలమ్మునైన నెక్కింప గలదు.

తే. మతము లేనట్టి నరుఁడు దుర్మార్గుడగునె?
కాఁడు, కనికరింపఁదగినవాఁ డతండు
దేవు నెఱుఁగని నారి సందేహశీల
భయము కల్గించు నాయమ ప్రణయమైన.

తే. తప్పుఁ గావించినానని యొప్పుకొనుట,
తప్పుఁ గావించుచుంటినం చొప్పుకొనుట
మెప్పిదము నిచ్చి పోషించు గొప్పదనము
లేల, యవమానపడగ, చింతింపనేల?

తే. పోలు నిద్ర మృత్యువును సంపూర్ణముగను,
ప్రార్థనము లేక విశ్వసింపంగ రాదు
ఇవి శరీరము నెపుడాక్రమించు నప్పు
డాత్మ నెంతయు స్వేచ్ఛగా నమరఁజేయు.

తే. అగు మహాశక్తియే ప్రేమ – అద్ది పురుష
స్వార్థసేవ నాచరణలో వర్ధిలంగఁ
జేయఁగలుగు సామర్థ్యమ్ముచేఁ జరించు
చు భగవంతునిఁ గావించుచుండు నతని. – మెహర్ బాబా

తే. నేనొసంగవలసిన సందేశ మొకటె
యొకటి, యుగయుగాలను దాని నోపి చెప్పు
చున్నవాఁడను – స్రష్ట, నత్యున్నతుఁడిని,
ప్రభుని, భగవంతుఁ బ్రేమింప వలయు ననుచు. – మెహర్ బాబా

తే. కులమునకు నొకనిని వీడఁగోరు మీవు
గ్రామమునకునై కులమీయ క్షేమమగును
గ్రామమును నిమ్ము జనపద గరిమఁ గోరి
పృథ్వి సర్వ మిమ్మాత్మ సంప్రీతి కొఱకు.

తే. అతని జీవులు నిర్జీవులగు దినాన
సహచరుల దొడ్డ శ్రమపైన సాగుననుచు
నాంతరిక బాహ్య జీవితమధికముగను
దినమునకు నెన్ని మార్లొ గుర్తింతు నేను.

తే. అమల విజ్ఞానఘన నిష్ఠుఁడైన యోగి
యఖిల విశ్వాసమును దన యాత్మ తోడ
దర్శనము చేయు, సర్వ మాత్మయగు, నన్న
మెద్దియును లేదటంచు గ్రహించుచుండు.

తే. "ఔను, రామావతారమే ఔను, నటన
అట్టి మాయాభినయమున నేను రాము
డొక్క మాయానరుఁడు, సీతయును నటులనె
మాయవిగ్రహ, ఇది క్రీడ – మరువ రాదు.

తే. పిల్లలకు కామసంయోగ విమల విద్య
తల్లుల వలనే నేర్పింపఁ దలఁపఁ దాను
యమము, నుత్తిష్ఠ పురుషావయవము గల్గి
యొప్పుపరదైవతము మనకుండవలయు.

తే. వలచి, నా జీవితమునందు స్వయముగాను
నాచరింపని యద్దాని నాచరింప
వల దటంచును నెవ్వేళ ప్రజల నేను
కోరుటయె నాదు వ్యక్తిత్వగుణము సుమ్ము. – మహాత్మా గాంధీ

తే. లీలద్రవ్యోల్బణము నెదిరించు కొఱకు
నున్న యుత్పత్తి పెంచుట యన్ని మించు
మార్గమగు – పన్నుల బరువు మరల వృద్ధి
వడయనీయదు దొడ్డగా పరిశ్రమలను.

తే. భిన్నభావాలఁ బ్రతుకనీ కున్న పక్ష
మన్య పక్షమ్ము బ్రతుక నీ నట్టి పక్ష –
అద్ది ప్రజలెన్నుకొన్నదే యైన నేమి?
అది ప్రజాస్వామ్య పాలన యనఁగఁ దగదు.

తే. పరగి గాంధేయ వాదిగా బ్రతుకఁ గల్గు
టన్న సామాన్య విషయమా? అరయ గాంధి
లౌక్యముల కెప్డు లొంగని రాజకీయ
వేత్త, జను లపార్థమ్ము గావించుకొనిరి.

తే. ధర్మమును, నీతిఁ దెలుపు గ్రంథమ్ముగాన
మనము పఠియింపవలయు రామాయణంబు
మోక్షమార్గమ్ము జూపఁ బ్రత్యక్షముగను
రాముడై యేగు దెంచె నారాయణుండు.

తే. చెలఁగు భారతదేశంపు జీవగట్టు
సకలసంపత్తి నొప్పు నా స్వర్గభూమి
అగును భారతదేశ శ్రేయస్సు నాదు
శ్రేయ మీ దృష్టి కల్గి వర్తింతు నేను. – వివేకానంద

తే. కడఁగు నొకఁడు పాపిని జంపు కార్యమునకు
పాపి నుత్తము గావింపవలచు బుధుఁడు,
దుష్టు సజ్జనుగావింప నిష్టపడుచుఁ
జేసి కృషి క్రీస్తు విజయమ్ము జెందలేదె?

తే. నృత్యమొనరించుటను నీవు నేర్వవలయు –
నృత్యమొనరించుటకుఁ గాదు నిన్ను నీవు
గొప్పగా నింట వెలిబుచ్చుకొనుట కొఱకె
ఉత్తమ స్త్రీలు నీచత నొప్పుకొనరు.

తే. ఒక్క పనిఁజేయు నుద్దేశ మొదవఁ బిదప
దాని నారంభ మొనరించి తనరు వరకు
నిద్ర పోఁగూడ దెవరైన – నేఁడు వ్యర్థ
మైన కాలము రేపురా దరయ నెపుడు. – వీరేశలింగము

తే. ఎద్ది మాయయుఁగాక యే యెల్ల వేళ
లందు శాశ్వతముగ వెల్గునట్టి సత్తు
నరసి దాని శాస్త్రవిదులు అనుచునున్న
వారు లోక మెఱుఁగ సత్యవస్తువనుచు.

తే. ఎవరి మనసు – నధీనాన నింద్రియములు,
మనసు బుద్ధి యధీనాన మసలుచుండు
వారిదౌ ప్రజ్ఞ చక్కగా వరలుచుండు
నతిశయముగఁ బ్రతిష్ఠితమ్మగుచు నొప్పి. – గీత

తే. సంపదలు గల్గు వారలా సంపదలను,
అందుచేఁ గల్గెడి యధికారాళి విడిచి
వానిని సమాజ సంక్షేమ పద్ధతులకు
వాడకున్న విప్లవ రక్తపాతమగును. – మహాత్మా గాంధీ

తే. మనము పరమాత్మ కనుకూల మార్గమందు
పయన మొనరఁజేయ నమృత ప్రాయ మౌను
ఎపుడు మన జీవితము, దాని నెట్టి శక్తి
యడ్డగింపలే దెపుడును నాక్రమించి. – పరమహంస యోగానంద

తే. దేవు సౌందర్య భావముల్ తృప్తి నొసఁగి
మనుజ దృష్టికి సంతోష మొనరఁ జేయ
ప్రసవ మోహన రూపసంప్రాప్తి నొందు –
పూలఁ దిలకించి జ్ఞానమ్ము పొందదగును.

తే. మేటిగా నొప్పు నిచ్చెన మెట్ల పగిది
ఊర్ధ్వగమనమ్ము లొకకొన్ని ఉన్నయట్లు
పతనములు కొన్ని తోద్పడు పైకిఁ జేర్ప
అవ్వలికి జేర్చు క్షణములో వ్యక్తి యునికి.

తే. ద్వేషమున గాక వైరుల ప్రేమతోడ
గెల్వఁగా వలె హింసకుఁ గెరలు వేరు
రూప మాద్వేష మయ్యది యొపుఁజేయ
హాని ఎయ్యెడ ద్వేషించువానికేను. – మహాత్మా గాంధీ

తే. వారి శారీర వర్ణమ్ము వలనఁ గాక
నాదు పిల్లలు నల్వురు నడవడికిని
గౌరవమునొందు దేశానఁ గడగి బ్రతుక
వలయు నన్నది నాకు స్వప్నమ్ము, ప్రియము. – మార్టిన్ లూథర్ కింగ్

తే. బుద్ధి యెవ్వరి కుండు విశుద్ధముగను
వారి కొక్కరికే బుద్ధి పరము, ఘనము
నైన దా బ్రహ్మ భావమ్ము నందు నిత్య
మయిన నిలకడ కలుగు సత్యమ్ము, కనగ. – వావిలాల సోమయాజులు

తే. సాటి మనుజులదైన కష్టమ్ము నెఱింగి
యెంత మేరకు నది తొలగింపగలుగు
నంతమేరకు సాధించి నట్ల యతఁడు
ఘనతరమ్మైన విజయమ్ము ఘనముగాను. – మహాత్మా గాంధీ

తే. ప్రళయ సమయమ్ము నందైన బరిని దాట
కుండ నియమవంతు లెచట నుండుటరుదు
చలనమొంద రెపుడును నచలముల గతి
వారు కళవళ పడరు పర్వతములటుల. – మహర్షి మలయాళస్వామి

తే. ధనము లేకుంటనైన నిర్ధనుడు, దైవ
ధనుఁడయిన యెడ నిజమైన ధనుఁడతండె
ధనము కలిగి యైనను మహాధనుడు దైవ
ధనము లేకున్న నగును నిర్ధనుఁడతండె. – మహర్షి మలయాళస్వామి

తే. ఉన్న సంసారమున గల్గియున్న నెవ్వ
డాత్మ సన్యాస మతఁడె సన్యాసి యగును
అయ్యు సన్యాసి ఆత్మ సన్యాస మెఱుఁగ
నతఁ డగును మహాసంసారి యరసి నంత. – మహర్షి మలయాళస్వామి

తే. మంచివాఁడుగ నుండెడి మానవుండు,
మంచిగావింపఁదలంచెడి మానవుండు,
వీరలిరువురు నిల నెల్లవేళలందు
గడఁగి యుండఁగ రాదధికార మందు. – మహాత్మా గాంధీ

తే. "అల్పసంఖ్యాక వర్గాల నాదరించు
క్రమము జనతతి నాగరికతను దెలుపు" – మహాత్మా గాంధీ

తే. పరమ భూరేణువులఁ గల్గెఁ బర్వతమ్ము
దొడ్డ దౌ నబ్ధి నీరబిందువులఁ గలిగె
అటులె యున్నది జీవిత మధిక సంఖ్య
చేష్టలను, నిత్యవచనాల, చింత నలను. – స్వామి శివానంద

తే. ఎల్లవారి క్షేమమ్ము కాంక్షింపు మీవు
అందువలనను పెరుగు నీ ఆయు వెంతొ
పెద్ద శాంతి సౌఖ్యమ్ము లభించు నీకు
తలఁచు మిద్దాని నెంతొ సత్యమ్ము గాన. – స్వామి శివానంద

తే. పాప కృత్యాల మనము గుప్తముగఁ జేతు
మయిన మన చేతలనె గాక నఖిలమైన
యట్టి మన యూహలను గనునా మహేశుఁ
డట్లు గ్రహియించు వేళను నబ్బు ముక్తి. – మహాత్మా గాంధీ

తే. కడఁగి డ్రింకెట్టు జాతినాగమ్ము కష్ట
పడి మహారాష్ట్ర కచనూరు కడకుఁ జేరి
యొక దుకాణమ్ము గైకొని యొప్పునట్టి
యాశ్రయమ్మున బిడ్డకు నమ్మ యయ్యె. వార్త

తే. ఎవ్వఁ డీయిల సర్వమ్ము నెరుఁగు వాని
వలన నెయ్యదియును పోదు వాఁడు నన్ను
నేదిగా భావనము జేయు నేను నటులె
వానికిని, ప్రతివానికిని గానఁబడుదు. – మెహర్ బాబా

తే. పరగ నెవడాత్మ హృదయదేవాలయముల
లోఁ బ్రవేశించి యంత మహాప్రభావుఁ
డయిన భగవంతుఁ జూడని యట్టి వారె
నిజముగ నదృశ్యు లియ్యిల నిజము, నిజము! – మెహర్ బాబా

తే. నామమును, కీర్తి, సంపద నాశమైన
దైవమార్గమ్ము విడవఁగాఁ దలఁపరాదు
చెదరకను మీరు గమ్యము చేరువరకు
ననుసరింపుఁడు దాని నత్యంత దీక్ష. – స్వామి వివేకానంద

తే. సౌఖ్యమును, శాంతి, బలమును, జయము మీకు
కలిగి మీదు వ్యక్తిత్వమ్ము ఘనతరముగ
నధికమొందును గావున ధ్యాన మెపుడుఁ
గ్రమముఁ దప్పకఁ గావింపఁ గడగవలయు. – స్వామి వివేకానంద

తే. పర్వత సమాన విఘ్నాలు పడిన నడ్డు
కడఁగి దాట వాని దృఢ సంకల్పులగుఁడు
ఎల్ల జగము మిము ప్రతిఘటించె నేని
సత్యపథమున వర్తన సలుప వలయు. – స్వామి వివేకానంద

తే. బాహ్య సౌఖ్యమ్ములమృతమ్ము పగిదిఁదోచు
నాది నయినఁ దుది కదియె యౌ విషమ్ము. – స్వామి శివానంద

తే. స్నిగ్ధమైన యాధ్యాత్మిక జీవితమున
కగును నిర్భయత్వమ్ము ముఖ్యమ్ము నిజము,
పిరికివారలు నీతివౌ విలువలెల్ల
నెపుడు పాటింపలేరు ఈ యిల కనంగ. – మహాత్మా గాంధీ

తే. ఎవఁడు ధారాళముగను భాషింప నేర్చి
నట్టి వాఁడయ్యు నతఁడొక్కటయిన పొల్లు
మాట మాటాడడో యట్టి మానవుండు
నమ్ముఁడు, నిజము, నిజము మౌనవ్రతుండు. – మహాత్మా గాంధీ

తే. ఆత్మయన్నది తిరుగులేనట్టి నిజము
ఆత్మ యియ్యెడ నొక్క దేహాని దయిన
నట్టులే ముందునైనను నద్దియుండు
ననుచుఁ దెలియంగ వలయు సత్యమ్ముగాన. – ప్లోటినస్

తే. ఎవఁడు ఈ జీవజగతి జీవింపఁ డెపుడు
స్వార్థ లాభమ్ము కోసమై అయిన నెవ్వఁ
డిల పరోపకారార్థమై చెలఁగి బ్రతుకు
నతఁడె నిజముగా నిలను మహాత్ముఁడరయ.

తే. ద్వేషము నశింప దెన్నండు ద్వేషముననను,
ద్వేష మెప్పుడు శమియించు ప్రేమ వలన
ఇది సనాతన ధర్మమం చెరుగఁ దగును
ధర్మమిద్దానిఁ దెలిపెను ధర్మపథము.

తే. అరయు మస్పృశ్య నిర్మూల మనఁగ – కనుము
అంటరానివారిని ముట్టుకొంట కాదు
మనసులో నుండి అస్పృశ్యతను నభావ
ముగ విసర్జింపవలయు సమూలముగను. – మహాత్మా గాంధీ

తే. చిత్ర చిత్ర పదాల భాషించుటలును,
వేదమును ముఖస్థమ్ము గావించుటయును,
ముక్తి కయ్యవి తోడ్పడఁ బోవుగానఁ
బండితుం డిట్టి వానితోఁ బడడు తృప్తి. – వివేక చూడామణి

తే. ధ్యానమును నీవెపుడును నభ్యాస మొనరఁ
జేయుచుఁ దిమిని నిస్వార్థ సేవలోనఁ
దివిరి లగ్నమయిన రాగద్వేషముల క
తీతుఁడవయి పోఁగలవు సందేహపడకు. – స్వామి శివానంద

తే. శివుని పేరాత్మ జ్ఞానమ్ముఁ జెందఁజేయు
దానిసేవింపనా మోక్షధనము లేదు
పుణ్యపాపమ్ము లెటుఁ దప్పిపోవు – అయిన
శివజపమ్మొనరింపఁగాఁజెందు ముక్తి. – శంకర భగవత్పాదులు

తే. సత్యమును సుందరమ్ము సమ్మిళితము
నొంద వాస్తవికమ్మయి యొప్పరూప
మద్ది పొంది సమ్యక్ దృష్టి నధికవృద్ధి
జేసికొనుట కనంగ సంస్కృతికి హద్దు. – జె.సి.పాలిస్

తే. దివ్యశక్తులు గలదాన తిరిగి బ్రతుకఁ
జేసితిని నేను మృతిఁ గొన్న జీవరాశి
కాని వైద్యులింజెక్షన్లు, గట్టి మాత్ర
లిచ్చి దివ్యశక్తులను హరించినారు. – ఆంధ్రప్రభ 5 ఆగస్టు 85

తే. భారతీయ భాషల మాతృభాష సంస్కృ
తమ్ము శ్రద్ధతో నేర్వఁగాఁ దాని దేశ
భద్రతయు, నైకమత్యమ్ము, పరమసుసమ
గ్రతయును పటిష్ఠములగును – కనుడు – దీని.

తే. గెలుపు, ఓటమి మన హస్తములను లేవు!
చేయవలసినదేదైన చేయఁజాలు!
ఔను మన పని చేత ముఖ్యమ్ము మనకు
కలుగు ఫలితము సర్వేశుకాంక్ష కరణి. – మహాత్మా గాంధీ

తే. అర్థమే ముఖ్యముగ సాగినట్టి కైతఁ
గనులతోఁ జూచి తెలియఁగాఁ గడఁగ వచ్చు
కైత శబ్దార్థ సంయోగ ఘటనఁ గలిగి
యున్న గొంతెత్తి చదువుట యుత్తమంబు.

తే. అధికవీరులు "తార్తారు" లట్టి మాట
కరయ "యమ కింకరావళి" యుద్ధ మట్టి
దాని నేల నా చింఘీసుఖాను తనదు
ననుచరుల పేరుగాఁ బెట్టననుమతించె?

తే. క్రొత్త వృత్తుల తోచ గైకొనఁగ వాని
నవసరమ్మగు నెన్నియో యన్యగతులు
వానిగైకొన తప్పదు గాన మనము
త్రోసి వేయంగవలెఁ గొన్ని తొంటి వాని.

తే. నాదుపేరు స్మరింపుము, నన్నె శరణు
పొందు – మయిన నే నెవరనో పోల్చుకొనఁగ
శ్రవణ, మననములొందుము – రహితరూపు
డను, సకలమున నుండువాఁడను గ్రహించు. – షిర్డీ సాయిబాబా

తే. ధ్యాన, మారాధ్యము, – పెట్టెయందుఁ బెట్టి
తాళమును వేయుకొఱకు నెంతయును స్వర్ణ
హారముల వంటి నగలుకావవ్వి, మనము
చేయు ప్రతికృత్యమందు విచ్చేయ వలయు. – మహాత్మా గాంధీ

తే. ఎవరి యారాటమును, నిష్ఠ యెంతయధిక
నిశితములుగ నుండునొ వారు నిశ్చయముగ
దర్శనమొనర్చెదరు జగత్పతిని హరిని
ఇద్ది తథ్యము తథ్యమ్ము ఇద్ది, వినుఁడు. – రామకృష్ణ పరమహంస

తే. వ్యష్టిగతలాభములకు, సమష్టులయిన
లాభములకు సంఘర్షణ రానియట్టు
లరసి కాపాడు లక్షణ యౌనెవేళ
సంస్కృతికి నొక ప్రత్యేక సంపదాళి. – స్వామి వివేకానంద

తే. వాక్కు నదుపున నిలుపుట, బహుమతులఁగ్ర
హింపకుండుట, కర్మల నెంతొ పరిమి
తములు గావించు టేకాంత ధరణివాస
మౌను యోగసాధనకు నాయాద్య క్రియలు. – వివేక చూడామణి

తే. పాల పాలు, నూనెనె నూనె పరఁగఁగ జల
మునను జలము పోయఁగ నేకము లయినటుల
నరసి యాత్మను గ్రహియించి నట్టివారు
ఆత్మతోఁ దుదిని విలీనులగుట నిజము. – వివేక చూడామణి

తే. సాధు పురుషుల సంగతి సజ్జనులకు
లభ్యమవనట్టి వేళ దుర్జనుల యొద్ద
క్షణము నిల్వరు – దుష్ట సాంగత్యమెపుడు
మంచివారి కాధ్యాత్మిక మరణమగుట. – స్వామి శివానంద

తే. నీవు ప్రేమించుటను ప్రీతి నేర్చుకొమ్ము
నేర్చితివొ ముందు దేవుపై నిలుపు మనసు
భక్తియందునఁ గాఁబోకు పరవశుఁడవు,
సాటివారినిఁ బ్రేమింపఁ బోటిపడుము.

తే. తూచ పురుషుల యన్ని యాలోచనలును
స్త్రీలదౌ నేక భావము న్పోల వెపుడు
బాహ్యదృష్టియె పురుషుల వశమునందు
జెలఁగు కనెడి యంతర్దృష్టి స్త్రీలకుండు.

తే. పెంచుకొనవలె నిహమున మంచి మనము
పరము కొఱ, కందె పుణ్యమ్ము మరణమొందు
వరకు ప్రౌఢిమై నార్జింపవలయుదాన
ధర్మములను పూజాదిక కర్మములను.

తే. క్రొత్తగా నేర్చుకొన్నది కొంచెమైన
లేదు పూర్వులే సర్వమ్ము లిప్సలోన
తెలుసుకొనురీతుల మనకుఁ దెలిపినారు
దాని గ్రహియించి, వర్తింపఁ దగును మనము.

తే. కొండపైనను, స్వామి, నిల్చుండ నేల?
గుండెలోఁ బ్రేమతోడఁ గూర్చుండిరమ్ము
కడలి కన్నీట నీ పాదకంజములను
రక్తిఁ గావించెదను మహాప్రార్థనమ్ము.

తే. ప్రకృతిలోన నున్న జడప్రేరణము వలన
కాంక్ష లుత్పన్న మౌటను గని, వరించి
దుష్టతను రావణుఁడు ఘనదోషమునకు
లొంగి, దుర్నీతి పాలయి, భంగమొందె.

తే. ఎవఁడు మృతివేళ మనసులో నెట్టి భావ
మిడి కళేబరమును దృజియించు నతఁడి
కా పునాదిఁ బునర్జన్మ యరుగుఁదెంచు
ననుచుఁ దెల్పఁడె శ్రీకృష్ణుఁ డర్జునునకు?

తే. "ఎల్లలోకాల, తండ్రి, జయించినావు
ఇంద్రియాళి జయింపఁగా నెఱుఁగ వైతి"
వనియెఁ బ్రహ్లాదుఁ డీ మాటలనఁగ వచ్చు
మనము – పాశ్చాత్యు లివి విని మనసు వడఁగ.

తే. "అగుదువె యశోద బిడ్డఁడ వబ్జనేత్ర!
యఖిల జంతుచేతో హృదయాత్మ వీవు"
అనుచుఁ బాడఁగ గోపిక లతఁడు వారి
పాదరేణులఁ దల దాల్చి పరవశుఁడగు.

తే. జనుల కెల్ల చక్ర పరివర్తనము జరుగ
వరుసగను మోద ఖేదముల్ పరగుచుండు
ఆత్మ విజ్ఞానమున వాని ననుభవించు
బుధులు సంతోష దుఃఖముల్ పొందరెందు.

తే. "ఏను అవ్యక్త రూపినై యీజగాన
నంతటను వ్యాప్తి నొందియున్నాఁడ" అనుచు
జ్ఞాన, కర్మ, భక్తి యను త్రికోణ మధ్య
మందు నిలిచి హృషీకేశుఁ డనుచునుండు.

తే. చేయు దోషమ్ములను నవిచ్ఛిన్నముగ నొ
కండు ఛిన్ననాసునిఁ జేయు, కొండనెక్కి
యొక్క యోగియై, తనుఁ జేరి మ్రొక్క జేసి
ఛిన్ననాసుల మతములో జేర్చినాఁడు.

(ఈ విషయం పహ్వరిబాబా వివేకానంద స్వామికి తెలిపినట్లు వినికిడి.)

తే. అయ్యొ, మనస! ప్రపంచ మోహమును విడుము!
ఎప్పుడో దాని మూలమ్ము ఖండింతు వీవు
కనుము, దాని నసహ్యించుకొనుట యెటులొ
పరగఁగ వివేక మద్ది, కేవలము విషము!

తే. వ్యసన దోషాల ప్రాకారమై మెలంగి
పురుషబలమును, స్త్రీ రక్ష, పూర్ణ రూప
రచన సేయు యంత్రము, అనురాగ కేంద్ర
మై వివాహము సంస్కార మర్థినొసఁగు.

తే. దీపమున వెల్గి జ్వలియించు దీపమటుల
నుండె నీ పుత్రుఁడీతఁ డో యుత్పలాక్షి!
ఉన్నవాఁడును ఘన వదానోత్సుకతల,
ధర్మవీరమున నతని తండ్రి వోలె.

తే. రమ్యముగఁ బ్రజాపీడకరక్తనీర
ములను బోయుచుఁ బెంచుట మూలముననె

పెరుగు నెవ్వేళ స్వాతంత్ర తరువు - అద్ది
యపుడె సుమగుచ్ఛ ఫలముల నతిశయిల్లు.

తే. కనగ భద్రతయె ప్రమాదమునకు, నమ్ము,
నాశమున కౌను అమ్మమ్మ! - ఆశపడక
భద్రతను బొందు సమయాన భద్ర పడగ
వలయు నద్దానిఁ గైకొను పద్ధతులను.

తే. బ్రహ్మ తపమునఁ జేరిన బాలవిధవ
యౌ ఋచీక తిలోత్తమ యనఁగఁ జేసి
యనుపసుందోపసుంద సంహారమునకుఁ
దీర్చి ఆయమ రవి రథ స్థితినిఁ బొందె.

తే. వయసు నను బెద్దనని గర్వపడఁగ బ్రహ్మ
"అటులనా" అని పల్కి తానతనిఁ బిల్చి
రోమశునిని, అష్టావక్రు, బ్రేమఁ జూపి
పలికె నారాయణుడు వారి వయసుఁ దెలుప.

తే. మద్య, మాంస, ముద్రా, మత్స్య, మైథునమ్ము
లనెడి పంచమకారమ్ము లార్తిఁగొనుచు
శక్తిఁ బూజించు మహనీయ భక్తవరుల
సాధనము నౌదు నేను మోక్షమ్ము వడయ.

తే. ఏ ప్రయోగమునైన దర్శింపవలయు,
చూచి, స్పృశియింప వలయును స్థూలముగను
సాధనము సోక వస్తువు సవ్యమైన
దౌనొ, లేదో, యెఱింగెద నబల దాని.

తే. భక్తితోఁ బ్రేమ యర్పింపఁ బడిన కొంచె
మైనఁ దప్పక నద్ది కొండంతయగును
ఈయఁ గొండంత భక్తి విహీన ముగను
లేదు సంతుష్టి కల్గింప లేదు నాకు.

తే. ఎప్పు, డేమిటి, ఎక్కడ, నెందు, కెవ్వ,
రెట్లు – ఆర్యులు సేవకు లెంతొ నేర్పి
నారు నమ్మకస్థులు కడు నాకుఁ దెలిసి
నట్టి దంత వారలు నేర్పినట్టి దౌను. – రుద్యర్డు కిప్లింగ్

తే. భర్తృవీర్యమ్ముతోడ గర్భమ్ము దాల్చి
శిశువు నొందిన నది తను జేరితీరు,
భర్తృమరణమ్ము దాటని వత్సరమును
అట్లు చెందని సంతాన మక్రమమ్ము.

తే. ఎవ్వఁ డింద్రియసీమ జీవించు నతఁడు
దుఃఖ రాజ్యమ్ము నందు మృత్యువును బొందు
అరయ నింద్రియ సౌఖ్యమ్ము పరమమైన
పితృలవన మాత్మకిందుకు వేరు లేదు.

తే. ఐంద్రియమ్మైన తృప్తియే యరయ సౌఖ్య
మైన జంతుకోటియె మించు మానవులను
ప్రజల సుఖ ముండు నాత్మలో నిజము అద్ది
అద్ది యుండదు గమనింప నింద్రియముల.

తే. నేను నీదు సంయోగ వనీ కపోత
మధుర కంఠస్వనమ్ముల మనసు వడచు
కెరలి వినఁగోర, దేవ, అంగీకరించు
ఏను విని, నిన్ను చేరఁగా, కృషి యొనర్తు.

తే. కూర్చుటారోగ్య మొప్పెడు గొప్ప కరుణ,
అట్టి దియెయౌను నిడు కృషి యందుఁ బ్రజ్ఞ
ఆప్తవర్గమ్ము నిచ్చిన న్యాయపరులు
పరమవిశ్వాస్యులగుట సత్కరణ యౌను.

తే. వీరు, నుత్తము బ్రతు కంధకారశోక
గర్జితమ్మని తలపోయఁగా దతండు
అంతకంటె ఘనమ్మగునట్టివాని
ననుభవింపఁగఁ గొన్ని సౌఖ్యాల విడుచు.

తే. ప్రజలవృద్ధికి, ప్రజ్ఞకు వలయు నెంతొ
గొప్ప గుంపులుగా జనుల్ గూడియుంట
అచటనున్న సంస్కారాగ్నియందు నుండి
వెలుగు వేడిమి యంతకు వెడలు చుండు.

తే. పుణ్యకర్మలొనర్చిన పుణ్యకీర్తి
ప్రాకుజాటు కొనకె సర్వప్రాంతములను
పూలవృక్షమ్ము పుష్పింప గాలి వలన
శుభ్రవాసనల్ జనులకు సోకు నటుల.

తే. ఎద్దియైనను సాధింప నెంతువేని
ధ్యానమైనను, పూజైన, అదియెకాదు
మరి యనుష్ఠానమైనను మరువఁబోకు
మిదియె తగిన సమయము సాధింపుమిపుడె. – మాతృశ్రీశారదాదేవి

తే. పరగనీ రాదు పరసతి పైకి బుద్ధి
వస్త్రరహిత కన్యను జూడ వలవదగదు.
ముట్టునం దున్న పడతిని ముట్టరాదు
ఆమెతో మాటలాడుట నాపవలయు.

తే. గుడ్డలను విప్పి శయనింపఁ గోరరాదు
అటుల నెన్నడు స్నానమాడంగరాదు
ఇల్లు లేని బయళ్ళలో, నీరములను
సంగమించుట విడిచిపెట్టంగ వలయు.

తే. సాంధ్యవేళలందున, దివస్సమయములను
బయటఁజేరిన యాత్మీయ పత్నితోడ,
పర వనితలతో సంభోగ పరవశత్వ
మొందఁ దలపోయగా రాదు ఉత్తముండు.

తే. ఆ సదాచార మొక వృక్ష, మరయదాని
స్కంధమగు ధర్మము ధనము, శాఖయగును
పుష్టమౌ కామము, ఫలము మోక్ష మట్టి
దాని సేవించి కొనుము పుణ్యానుభవము.

తే. మామ మరణింప నల్లుఁడు మామసతిని –
అత్తను గ్రహింపవలెఁ బెండ్లాడి సతిగ
అందు కంగీకరింపక నల్లుడున్న
పంపఁబడును 'గారో మాతృస్వామి కమున'

(Customanny law and justice in the tribal of Meghalaya - published by N.M. Tripathi (p) ltd Bombay)

తే. సరగున పొగడ పన్నీరు వంటి దగుచు,
వాసనను జూచి విడువఁగా వలయు దాని
నిరతమద్దాని సేవలో నిలువరాదు
కాని, నిల్చిన నాపద కలిగి తీరు – జాన్ బిల్డింగ్స్

తే. పెద్ద గుంపులుగా సమావిష్టు లౌటఁ
బ్రజలు ప్రజ్ఞలఁ బెంచుకోవచ్చు – కాని
సద్గుణమ్ములు కొన్ని నష్టమ్ము నొందు
మతులు బలమొందు, నీతుల గతులు మారు.

తే. పక్షులకుఁ బంజరములయి శిక్షవేయ
జంతువుల నుంచు నట్టి కొష్టముల పగిది
నతుల విఖ్యాతులగువారి యాత్మలకును
కడు మహానగరమ్ములు కారలగును.

తే. నాదు చిననాఁటి మిత్రుండు నన్నుఁ బిలువ
నతఁడు వసియించు నగరాని కరిగి నేను
"అంత ధనమెట్లు గడియించి" తనుచు నడగ
"ఆదరమ్మున" నంచునా కతఁడు తెలిపె.

తే. దేవుఁడొనరించె మానవదేహ రూప
మద్భుతగతి, నత్యున్నతమైన రీతి
జీవితమ్మెల్లఁ దెలియఁగఁ జెల్లు సృష్టి
యద్ది తెలియఁగా సంక్షేమ మఖిలమబ్బు.

తే. అతఁడు కీడుకుఁ దగినవాఁడనుచు నమ్మి
కోరి యతనిని వారు పల్కుదురు గాన

ప్రజల కొందఱి కుపకారపడుటకంటె
కేరుచును నెదుర్కొనుటయే క్షేమకరము. – సెనికా

తే. అఖిల లోకమ్ము ననుఁగూర్చి యతని తోడ
బహువిధమ్ములఁ గీడుగాఁ బల్కుకంటె
నతఁడు ననుఁ గూర్చి లోకాని కంతటికిని
జెడుగఁబల్కుట యెంతయో శ్రేయమొసఁగు. – టిస్సో

తే. ప్రేమ మరి టెలిస్కోపుతో వీక్షసేయు
తోచఁగనును మైక్రోస్కోపుతోడ నీర్ష్య
నవ్వు మోములతోఁ గూడ నవ్వు నెన్నో
గడఁగి శోకించు, రోదించుఁ గలసి వాని. – హెన్రీబీలర్‌షా, హోరేస్

తే. అతిశయించుట కాశించు నట్టివాఁడు
అట్టి కృషినిఁ గావింపఁ బ్రయత్న మొనరఁ
జేయవలయు నే వస్తు విశేష చయము
స్వయ మతిశయత నొందునో వానియందె. – ఎపిక్టిటస్

తే. అగు నసత్యమ్ము నాడెడి యతని కాంక్ష
మోహనతఁ గూర్చుట యను ప్రమోదమిడుట
సౌఖ్యమొసఁగుట ఆరయ సంస్కార సంఘ
మునకు నాతఁడు కేవల మూలమగును. – ఆస్కార్ వైల్డు

తే. బ్రతికి యున్నంత కాలమ్ము నతఁడు బిచ్చ
మెత్తి, తిండి అద్దాన జీవించెఁ గాన
ఆ మహాకవి హోమరు అస్తమింప
సప్త సంపన్ననగరాలు సంతసించె.

తే. పేర్లు కడుశ్రద్ధ వహియించి పెట్టుకొనుట
యవసరమ్మని యెంతయు నర్థమగున
ఎంతొ వాఁడు చింతామణి యెన్ని కలను
నప్పు డోడింపఁబడడె వేశ్యయను భ్రాంతి. – ఫెథర్స్ & స్టోన్స్

తే. మంచి పలుకుట కడు నుత్తమ ప్రియమ్ము
దోష శూన్యమ్ముగా, బల్కఁదోచెనేని
యందు కెంతో మన ప్రశాంతి యవసరమ్ము
కాని, దాని కేమూల్యమ్ముఁ గానఁబడదు. – టిల్లోట్సన్

తే. నూర్గు రగు భర్తలున్నట్లు నోటఁ బడెడు
పొలఁతి కొకఁడైన నుండక పోవవచ్చు
ఒక్క చింపాజిఁ బోలిన యువిద చరిత
గనిన మిండంద్రు పదివేలు గలుఁగవచ్చు. – బెర్నార్డుషా

తే. జనులు ఎద్దాని ననెదరో శౌర్యమనుచు
దేని వ్యభిచార మందురో దేవజాతి
అద్ది యధిక సామాన్యమౌ నచట నెచట
ప్రకృతి వర్తించు పెల్లుగా ప్రఖరమగుచు. – బైరన్

తే. పాలనము సేయఁగా సర్వపార్థివులకు
బరఁగు గండూతి ఆ ప్రభుత్వమ్ము లెల్ల
ఎక్కువగఁ గొన్ని మరికొన్ని తక్కువగను
పూనుకొనుచును బ్రజలను మోసగించు. – ఎర్నస్టుట్రాలర్

తే. వర్తమాన మున్నపుడు దుర్భరముగాగ
గతమును తదనుభూతిని గన్నసౌఖ్య
గరిమ జ్ఞప్తి చేసికొనుట కంటె వేరు
తోచ దింకొక విషయమ్ము దుఃఖకరము. – డాంటే

తే. దోషయుతమైన భావన దుష్టవర్త
నమ్ము నుత్పన్నమొనరించు నయము కంటె
దుష్టవర్తన కల్పింప దోషయుతము
నైన భావన కలది శక్త్యతిశయతను. – జె.యస్.కెయ్‌ఫర్

తే. పడినయపు డెల్ల నున్నతిఁ బడయుటందె
కానఁబడుఁగాని ఘనకీర్తి, కానఁబడదు
ఎన్నఁడును బడకుంటలో నన్నమాట
నెంతొ వచియింత్రు చైనీయు లెల్లవేళ. – బొవీ

తే. తప్పిదము కొన్ని తరుల సత్యమ్ముతోడ
గలసి యస్పష్టముగ నుండు గాఢముగను
పెనచుకొని ఇంద్రధనువును వర్ణములను
బోలి యొకదాని నొక్కటి పోలియుచుండు. – క్లూల్

తే. చంపఁ దము వైరి బలసాహసములు చేరు
ననుచు సాండ్విచి ద్వీపజు లనెడు గతిగ
మనములొంగని దోషమ్ము మనకుఁ బ్రతిది
క్షేమకారిణి ఎదిరింపు చేర్చు బలము. – ఎమర్సన్

తే. ఏ వివేకి బండగను గణింపఁబోడు
దోషముల కొన్ని కనఁబడఁ దోచవీలు
క్షితిజరేఖకు నెంతయో క్రింద గాఢ
సత్య వక్రీకరణము విస్పష్టముగను. – కోల్రిడ్జి

తే. మన యవగతములందు సామాన్యముగను
తప్పిదము లుంట కెంతయు దావు గలదు
ప్రకృతి నిశ్చలతలు లభ్యపడుట ఘనము
మరి యభ్రాంతి వ్యాజ వృథాభి మాన యుగము. – మార్కస్ ఆంటొనీ ఎస్

తే. తృణము పెరుగని భూమి దర్శింతువేని
దోషశూన్యమ్ము హృదయమ్ము తోచు నీకు
సల్పెదరు తప్పు మగవారు స్వార్థపరత
ఇంతు లొనరింతు రది బలహీనులగుట. – నౌల్స్, మాడ్ డిస్టయిల్

తే. నీవు మాటాడవలసిన నిముషమందు
సత్యమును పల్కుటకె సునిశ్చయము సేయు
మరయ సందిగ్ధవచనమౌ నర్థదూర
మా యసత్యాని కది నరకాధ్వమగును. – పెన్స్

తే. క్షుద్ర ప్రకట 'నిటాలియన్ ఛురిక' వోలె
హంతకుని ఘనఘోర క్రూరాయుధమ్ము
వక్తలెప్డు మానుదురు దుర్భాషణమ్ము
కర్ణనులు విన మానరష్కర్ణనమును. –మాథ్ డియెన్టి నాన్

తే. శత్రువులు కావలెనని ఆశపడెదేని
ఇతరులను మిక్కిలి యతిశయింపఁదగును
మిత్రులను గోరెదేని ప్రేమించి వారి
నతిశయింపఁగ నిమ్ము నీ వన్యజనుల. – కోల్టన్

తే. స్వేచ్ఛ, సామ్యత అనునవి తుచ్ఛగుణము
అరయ న్యాయము మనుజ సత్యనియమమ్ము
రక్షణమ్మును, కారుణ్య రమ్య జీవ
నమ్ము బలహీన జనులకు న్యాయమౌను. – ఆమియల్

తే. ఈర్ష్య వహియించు వారలు ఎవరి వారు,
మించుచుందురొ వారిని మెచ్చుచుంద్రు
ఎవ్వరవ్వారిని నతిశయింత్రొ వారి
వారు వెనుకాడకను నింద వలుకుచుంద్రు. – కోల్టన్

తే. సద్గుణమ్మునకు దూరమ్ము సలుపు నీర్ష్య
గోచరింపదు వేరొక్క గుణము ఈర్ష్య
పిరికితన మవమానమ్ము పిండిగొన్న
వృత్తి విశ్వసింపరు గ్రహియింపనెవరు, – అవీ, రోషిష్టర్

తే. తప్పు దిద్దుట ఎంతయో ఒప్పుఁ జేయు
అయినఁ బ్రోత్సాహ మొసఁగును నంతకంటె
ప్రోత్సహించుట యాక్షేపమునకుఁ బిదప
వర్షధార వెన్కను రవి వంటి దగును. – గెథీ

తే. నేర్పునను మన శక్తితోఁ దీర్పలేని
యాశలను బెంచుటన్నది యనుచితమ్ము
నెగడు జ్వాల ధూమమయి క్షీణించుకంటె
తిమిర మెంతయొ జ్వాలౌట తృప్తికరము. – జాన్సన్

తే. సత్యమౌ వివేకము, ప్రజ్ఞ, సర్వవేళ
లందసహ్యించు నట్టి యా యధమవైరు
లీర్ష్యతోడ విఖ్యాతి నార్జింపఁగోరి
నిల్తురున్నతి యన్యుల నిల్పిక్రింద. – డ్రైడన్

తే. దేని నెఱుగరొ యద్దానిc దెలియపరచు
టెప్పుడును గాదు విద్యన - ఎటుల వారు
వర్తన మొనర్పరో యట్లు వర్తనమ్ము
నొనరc గావింప నేర్పుట - ఒప్పవలయు. - టి.డి. ఉల్ఫ్

తే. ఏను నీ సెజ్జ తెరలc గల్పింప, జేతు
"నీవు మేల్కొన కున్నచో నిత్యముదయ
వేళ పెందలకడను నే విషయమందుc
బ్రగతి నొందవటం చనురాగమునను."

తే. కాదు లోకమ్ము నడిపింపcగలది డబ్బు,
కాదు కేవల మేదస్సు, కనcగ, గానc
బడును సచ్ఛీలమును, మేధ కడcగి కలిసి
నడుపు చున్నట్టులుగ ప్రపంచమ్మునెల్ల. - వివేకానంద

తే. "నీవు వర్తింపగా వలె నీతితోడ,
ధైర్యయుతముగ మనదు సిద్ధాంతములకు
మతిని జెడcగొట్టు కొనకుము - మంచి పాపి
యౌను పిఱికియె - ప్రేమింపు మఖిల జనుల.

తే. మెలతలకుc గీడు కంటెను మేలొనర్చు
మందు వస్త్రధారణ అది మఱియు కాదు
వస్త్రములయిన నవ్యముల్ స్వచ్ఛములును
అవ్వి వారికిc గలిగించు యౌవనమును.

తే. అధిక మైనట్టి యశ్రద్ధ, అట్టి బాహ్య
శోభగల వస్త్రధారణ చూపుc గనుక
వార్ధకపు జన్మరేఖల వార్ధకంపు
గాఢపతనమ్ము నయ్యది కానc బరచు. - రిచ్‌టిడ్ జౌబర్ట్

తే. ధరణి ప్రకృతికి మాత - అద్దాని కగు స
మాధి విఖ్యాత భవనాల మంచి ముంచు
వాకిలి జనసమూహ మపారముగను
నమితమౌ ప్రీతి గల్గించు నట్టిదౌను. - షేక్స్‌పియర్

తే. అంది యీ జగమన నసహ్యమ్ము - అంత
ఇంత రెండవదానిఁ బట్టించుకొనక
హింసను తమకు దామె చేయించుకొంద్రు
బద్ధకస్థు లిచ్చెద రసంభ్రమకుఁ గీర్తి. - కోల్టన్

తే. మనుజ జీవితమును గూర్చి మహితయైన
కాంక్షకును లేదు ఆబద్ధకమున కున్న
శ్రద్ధ లేకుంట కాంక్షకుఁ గరుణ గలదు
బద్ధకమ్మున కభిరుచి పాశవికము. - బ్రౌన్ కాఫ్ట్

తే. ఈ ప్రపంచాన నెదియొ గావింపఁదగిన
దాని గావింప నిల్చిపోఁ దగదు సంచ
రించుచును శీతలత్వము, క్లేశము, మది
దలఁచుచు, దుమికి శక్తి నీదంగవలయు. - సిడ్నీ స్మిత్

తే. సత్యమైన వాగ్వైచిత్రి సముచితమ్ము
సర్వమును జెప్పుటైయుండు - చాలు నద్ది
సంగ్రహిత యిచ్చు రమ్యత - సభను వక్త
యధిక సంభాషియనిపించు టల్పశక్తి. - సర్ జాషువా రైనార్డ్స్

తే. శక్తి జగమున గావింపఁ జాలినట్టి
సర్వమును జేయు ప్రజ్ఞలు, సమయములును,
అవసరమ్ములు లేకుండ అద్ది చేయ
బూనునె ద్విపాదపశువును మానవునిగ. - గెథీ

తే. పరమ మాధుర్య మట్టులఁ బరిధ విల్లు
మిత్రులకు నిచ్చుకంటెను శత్రువులను
నుగ్రులకుఁ జేతు రుపకృతి నుల్లసమున -
వారు సత్యమ్ము, జెప్పుట కారణమ్ము. - కేటో

తే. దారుణుండైన వైరి కాదగిన ప్రజ్ఞ
యెవని కుండునో యాతండు ఎన్నఁడేని
కలిగి యుండడు సన్మైత్రి కలుగువాని
కవసరమ్మైన సద్గుణ హోరిచయము. - ఫిట్జ్‌రోస్ బోర్న్

తే. బద్ధకస్థులు స్థూలానుభవములెల్ల
పెల్లుగా నొనరించి స్తంభింపఁజేతు
రుత్తమమ్ములను నిరుపయోగమునను
శక్తి హీనత నొనరింత్రు జడములు గను. – కోల్టన్

తే. మనసు చారుత్వ భావనా ఘనత కోలు
పోయినపుడు దోషమ్మును, భూరి తుచ్ఛ
గుణము పెంచును, వెదకును గుంపులోన
నింటఁ గన్పడవలసిన యెల్లవాని. – లాన్‌డోర్

తే. శత్రువులఁ జేసికొనకుము – సలుపక్లేశ
మతఁ డశక్తుఁడైన యెడ నిరర్థకుండు
అర్ధశత మిత్రులున్నారె? – అయిన చాల
రొక్క శత్రువుఁడున్నాఁడె? ఉంట గొప్ప. (ఇటలీలోని కోల్బన్‌లోని సామెత)

తే. శాత్రవుని గెల్చుకంటెను సంధి మేలు
పరమభద్రత గల్గింపవచ్చు నద్ది
గెలుచుటతని విషము తొలగింప వచ్చు –
అయిన సంధి లుప్తముఁ జేయు నతని యిచ్చ. – ఫెల్థామ్

తే. ధనము, అధికారమెంతగాఁ దనది యైన
వ్యక్తిగత వైరులను పొందపాడిగాదు
రక్షణము లేని ఒక్క కాలమ్ము అతని
విపుల పీడన వశముగా వింపవచ్చు. – లైట్టిల్ టన్

తే. ఆశ కలిగిన భోజన మందు నీకుఁ
బెంపుగా దాని కొఱకు శ్రమింపు మీవు
ప్రీతి కలుగ దుస్తుపయి చెల్లింపు విలువ
నిద్ర పోఁగోరఁ జేర్పుము నిర్మలాత్మ, – ఫ్రాంక్లిన్

తే. నీవు నినుఁగూర్చి పలికెద వేని యతిగ
బహునసత్యాలఁ బ్రీతితోఁ బలికె దీవు
ఎవఁడు తను గూర్చి కడు విస్తరించి పలుకు
నాతఁడణు మాత్రమైనను నన్ను వినఁడు. – ఝిమ్మర్ మన్

తే. ఎవcడు తనుcగూర్చి మాటాడు నెంతగానొ,
ఎవcడు నన్ను గురించి భాషించుకొనcగ
నించుకైనను కాలమ్ము నీయ బోడొ
వాcడు తెలియంగ నెంతయు స్వార్థపరుcడు. – హెచ్.యల్.లైలాండ్

తే. ఎపుడు మనగూర్చి మనము భాషింతు మపుడు,
ఎంతొ మోసగాంద్రవలెc గాన్పింతుమోయి!
మనదు నెదలెంతగానొ గర్వించునపుడు
పోలుచు వినయాన మన శబ్దములు ధ్వనించు. – హతె

తే. ఎందువలనన – మానవ హృదయమందు
సత్యమునకు, నందమునకు స్వాదు ప్రేమ
మునకు పరివర్తనమ్మును బొందనట్టి
వర్తన మ్మనూహ్యమ్మునై వరలు గాన. – హెచ్.ఎల్. లాక్ ఎల్లిస్

తే. బాగుగా నెద్ది నేర్పంగ, బడుచునున్న
నేను విషయ మే దంచు పట్టించుకొనను
ఆధునిక విద్య వ్రేళ్లకు నంగుళీయ
కముల నిల్పును పిడికిలి కడను కోయు. – థామస్ హెచ్. హక్స్లీ

తే. ద్వివిధమ్ము విద్యారీతి – తెలియుట తొలి,
అవల నుచ్చరించుటయును, అంతెకాదు
ఆంతరిక జీవి యోజించు నధికముగను
దాత్తముగను, మాటాడడు తరుచుగాను. – ఆర్.ఎల్. స్టీవెన్ సన్

తే. అధికముగ నేcడు వివిధ విద్యాలయములు
ప్రజకు విద్యను నేర్పcగా, బాటుపడుట,
ప్రీతి శాస్త్రీయ యోజనా పీఠములుగ
నుంట తప్పు నందునను కొన్నింట తప్పు. – వాల్టర్ జె. పిట్కిన్

తే. హృదయ గాఢ రహస్యాల నెఱిcగి నట్టి
సదధికారమ్ము నొందిన స్థాయిలోన
నే నసాధారణత యన్న హీనగుప్త
క్రిమి నటించు పాత్ర తమి నెఱింగినాcడ.

తే. స్త్రీలు, పురుషులు వారల జీవితముల
పాత్ర వహియించు (నీక్రిమి) నిద్దాని వారి తోట
లందుఁ బెరిగెడి తృణముల యటుల స్తంభ
నమ్ముఁగావించి సంపీడనము నొనర్తు.

తే. బహుళ కష్టమ్ములతొ గూడి ప్రబలుచుండు
నాపదలతోడ నెంతయు నతిశయించు
నింతకంటెను మఱియొక టెంతో యుత్త
మమ్ము మార్గమ్ము కలదు అమ్లాన మగుచు.

తే. ఎన్నడును మృతినొందని తృణచయమ్ము
పీడనము సేయ యత్నించి వెట్టి కంటె
వాని నుపయోగపడియెడు ప్రసవములుగ
విమల రమ్య సుమముల గావింపవచ్చు. – హేవ్‌లాక్ ఎల్లిస్

తే. గృహము రమణీయ విద్యానికేతనమ్ము
శిక్షణకు – అగును కుటుంబ జీవితమ్ము
బాలలకు నేర్పు దేవుని ప్రౌఢ శయ్య –
లతివ లొనరించి నంతటి వౌ గృహాలు. – ఎస్. స్మైత్స్

తే. నారి యేయే కుటుంబమ్ము నడపుటందు
నోడు నాయమ చదివిన యువిద గాదు
మంచి విద్యను నేర్పని మానవుండు
మానవుఁడు కాడటందురు మాన్యజనులు. – హెచ్. హోన్స్

తే. అవసరమ్మైన దానిని నాదియందు,
యోగ్యమైనది పిదపను, ఆభరణము
నెన్నదాని నేర్పగవెల – అద్ది కాదొ
కట్టె టౌను సౌధోర్ధ్వ భాగమును ముందు. – మిసెస్. సి. జావ్.నే

తే. జాతులకు విద్య పరికింప చాల చులక
నైన రక్షణ ఇతరుల నధిగమించి
బండపిల్లలు కష్టాల మెండు వాంఛ
చేతు రవి యిచ్చుచుంటను చేతి పనుల.

తే. స్త్రైణ దారిద్ర్యమును జూపు సమయమందు
కపట వేశన కెపుడవ కాశముండ
దెచట కామచారమున నే తెరవయైనఁ
దక్కువగఁ బొందునా వస్త్ర ధారణమ్ము? – ఛార్లెస్ లాంబ్

తే. వస్త్రధారణ మనుజ ప్రవర్తనమునఁ
గల్గియున్నది యొక నైతిక ప్రభావ
మద్ది తగుగతి లేకున్న నబ్బి తీరు
సభల గౌరవలోప విసర్జనములు.

తే. గాఢముగ బాహ్యలక్షణాల్, గౌరవమును
గలుగఁ జేయు నాగరక సంఘమ్మునందు
వీపునను మంచి కోటున్న బిలుచుచుంద్రు
తెల్వి తేటల నేమియుఁ దెలిసికొనరు.

తే. దుస్తులను నెన్ను కొనియెడు త్రోవలందు
వర్ణముల యందమునకు లోఁబడుట చేత
నట్టి వానిని గ్రహియింతు రరయఁ బోరు
జనులు తమకంద మిచ్చు వస్త్రములఁ దరుచు. – షన్ స్టోన్

తే. దివ్యమోహన రమణీయ దీపకాంతి
లభ్యమౌనటు లంధకారమ్ము నుండి,
భయదగాఢ విసంవాద చయము నుండి,
యొదవు గంభీర విశ్వాస ముజ్జ్వలించి. – ఆర్.టరన్ బుల్

తే. నమ్మి, సత్యమ్ము నన్వేషణ మ్మొనర్ప
నొలయు ననుమాన మెవ్వేళ నుత్సుకముగ
సలుప నమ్మహా శాంతవి చార ణమ్ము
కడగి యయ్యది సత్యమార్గమున నడుపు.

తే. ఒడుపులో మ్రోయు నీలోక యుగ్మభారు
లైన విశ్వాస జనవృత్తి నధిగమించి
సత్యసంధుని యనుమాన చయము తెలుపు
నధిక నైతిక సత్యాల నముతమిగను.

తే. స్వప్నకరణమ్ము కేవల భావనమ్ము
ఇద్ది రూపించు నెల్లర సృజనలీల
మేలుకొనియున్న వేళ నీ లీలయున్న
యెడల వాల్మీకు లయ్యెద రెల్లవారు.

తే. బ్రతుకు నార్జించు కొనువేళఁ బడసినట్టి
దరయ లోకాన నుత్తమమైన విద్య
ఆత్మత్యాగమ్ము నేర్పెడి దధమ విద్య -
ఇతరమును నేర్పు విద్యకు నెంతొ ఘనము. - వెండాల్ ఫిలిప్స్

తే. ఈవు విశ్వ సమ్మతిని నర్థింతు - దాని
కేను విశ్వవిద్యయును వాంఛింతుఁ దోడు
శుభ్రగతిని మనుజ మనసునకు విద్య
యగును ప్రారంభమెపుడు నుయ్యాలయందె. - ఫారెస్టర్

తే. మనసు విద్య నెఱుఁగ వర్తమాన జనులు
భావితరముల వారికిఁ బడిన యప్పు
అతి వివేకియు విద్య నిరంతరమ్ము
దీన కర్షకు కడ కొంత తెలియవచ్చు. - జార్జి పియబడ్

తే. విద్య లక్ష్యమ్ము మనసును విమల జీవ
నోల్బణమ్ము గావించుటే ఉత్తవాపి
నొనరఁ జేయుటగాదు మహోన్నతముగ
నింపుకొని నిండ బయటకు బంపుకొరకు. - జాన్ ఎమ్. మాసన్

తే. ఓడుటా? విద్య యద్ది మరొక్కటగునె!
ఘనత నొందఁగ నది తొలి ఘట్ట మరయ
అద్దియొ నొక్క మాన్య విద్యాలయమ్ము
అందు సత్యమ్ము పొందెడు నధిక బలము.

తే. ఒక అసంతృప్తి విడువక నుత్కటముగ
పట్టి సాధించుచున్నట్లు గట్టివడిన
నమ్మకము చేతఁగాక నన్యమ్ము వలన
నోటమినిఁ బొందు చుండునే యొక్క నరుఁడు?

తే.	అరయ వైరూప్యమౌను సాహసయుతమ్ము
దాని సారమౌ హృదయాత్మల హరించి
లోఁ బరచుకొని మానవలోకమెల్ల
నొలసి తనుఁ జేకొనుట నిఖిలోత్తమముగ.

తే.	సర్వతంత్ర స్వతంత్రులు, గర్వరహితు
లెల్లవేళలఁ గావలె నెంత గానొ!
దళిత బలహీన కష్ట సంతప్త జనులు
నఖిలమౌ జీవిత వ్యవహారములను.

తే.	సిద్ధపడినట్టి వానికి నెల్ల దెపుడు
వలచ నాలస్య మద్ది యాపత్కరమ్ము
దీపముల వ్యర్థమొనరించు తెరవు అద్ది
దేవసేవ యందైన వర్తింపరాదు.

తే.	దారుణాసక్తి తుదటను క్రూరములగు
తానె యాలింగనము సేయుతరుణమందె
తరిగిపోవు శక్త్యగ్నిగాఁ దలఁపనద్ది
మహితజయ సమయాననే మరణమొందు.

తే.	లొంగి నట్టులె విధికిఁ దా లొంగు మనుజుఁ
డిలను నాచారఫణితికి వలచి, వలచి
మనసు నడకల, శారీంమార్గములను
ఆస్తి పాస్తుల పాలనార్థతలలోన.

తే.	కలిగియుంట బాలలయెడఁ గౌతుకమ్ము
అరయ జ్ఞానేచ్ఛ యందు ఘనాభిలాష
తమకుతూహల మెవ్వరుఁ దలపకుంట
చెలఁగి బాలలు తమ్ము త్యజించు కొంద్రు.	– లోకే

తే.	కష్టపెట్టెడి స్వప్నదుర్గాథనుండి
జాగృతినిఁ బొంద సుఖియించు సరణితోచు
మరణమొందిన సమయాన మనసునందు
నటులె కన్పట్టు స్వర్గ సౌఖ్యమ్మె వచ్చి.

తే. ఇల నహంకార పాపాల వలచు నటులఁ
జేయు మోపకల నిర్జింపఁ జేయు కొఱకు
నప్పులను దీర్చుటగును దైవానుగ్రహము
పిదప నుత్తమ సాధన – ఇది నిజమ్ము.

తే. అన్యమతముల దౌర్జన్య మణపవలయుఁ
గాని యవ్వాని భంజింపఁ గడఁగ రాదు
అన్ని మతముల నుత్తములున్నవారు,
నాస్తికులు కారకులు సర్వనష్టములకు.

తే. 'అప్పులేనివానికి లేదు ఆపదయును'
వినుము ఇయ్యది ఎంతో వివేకయుతము
అద్దియున్న దుష్టత్వదైన్యమ్ము లబ్బు
హృదయమున, నాకు విశ్రాంతి ఎరుక పడదు.

తే. ఎట్టిదో పాము పక్షికి నటులె ఋణము
మానవుల కగు – నేత్రమ్ము మభ్యపెట్టు,
ఊర్పు గరళమ్ము వోయును, ఒడిసి చుట్టు
కొనియు స్నాయువుశల్యాల మట్టు మణచు.

తే. మోసకారులు సంఘాన ముఖ్యులౌ ప్ర
మాదకరులౌదురనురాగ మహితగతుల
పైనఁ బరిహాస మొనరింత్రు వారు సర్వ
రమ్య సౌజన్యములను దిరస్కరింత్రు.

తే. గాఢ సద్భక్తిఁ బోలి భూగర్భమందు
ప్రసరణము సేయు నిమ్నగన్ భద్రగతుల
లోకనేత్రాల మూయుఁ బ్రత్యేకముగను
త్రిప్పుటకుఁ దను జూడఁగా దేవుకనులు.

తే. ప్రార్థనము కాక పోయిన స్వర్గమునకు
ద్వారమగు కుంచిక చన యత్నమ్మొనర్చి
దొరుక కున్నను స్థానమ్ము తొలుత, పిదప
తలప సర్వమ్ము ప్రార్థనా స్థానమగును.

తే. బాగు గావించుకొనఁ జేయు పనుల నీవు
శత్రువులఁ బిల్చి చూపుట చాలు మిత్రు
లరుగుదెంచియు, దోషాల నరయలేరు
– మెచ్చుకొనెదరు ప్రేమ సమీకరించి.

తే. కావ్యకర్తకు శత్రువే గాక, పూని
నతఁడు వ్యతిరేకియును గాని యాతఁడెంతొ
కర్తృ దృష్టినిఁ బరికింపఁ గడఁగుఁ గాన
అతని దొగద ఉత్తమమౌ విమర్శ!

తే. మనసు గొనుట విమర్శపై మనకు రమ్య
వస్తుదర్శన తొలగింప వచ్చు కాన
నెట్టి యాసక్తి లోనైన నిరుకు పడక
కావ్యరమ్యత దర్శింపఁ గడఁగు తొలుత.

తే. సత్యవిశ్వాసముల మధ్య సాగు నొక్క
పూజ్య సంబంధ మదెపుడు పొలయు చుండు,
సత్య మా భౌతికముల విశ్వాసమగుచు,
అగును సత్య విశ్వాసము లమరములను.

తే. మానవుల లోపములలోన మలుచుచున్న
యద్ది యాచారమౌను రాజాధిరాజు
చట్టములు చేయుటేగాని సాగవవ్వి
సర్వభూమి నాచారముల్ సాగుచుండు.

తే. మోస మీయదు సద్గుణమ్మునకు విలువ
అది వివేకమ్మునకు నల్పమౌ ననుకృతి
పూని మోసకారి సగము వానినైన
మీరఁగల్గుట నిశ్చయమే కనంగ.

తే. చాల మోసమ్ము లనుచును జగము తలఁచు
కాని విశ్వాస కోశానఁ గానఁ బడదు
మోసమను శబ్ద మితరుల మోసమెపుడు
తోచు విశ్వాసులకు దేవసూచనముగ. – జాన్ న్యూటన్

తే. గాఢ క్రమశిక్షణము కొంత కఠినగతిని
సకల ప్రకృతియందుండును శాశ్వతముగ
అట్టులుంట పరమకారుణ్యమున నుంట
కని యెఱుంగరు పలువు రజ్ఞానవశత.

తే. పోల్ప శుభమిదు సామాన్య భోజనంబె
పెక్కు వంటలు అందులోఁ బిండి వంట
లమిత జాడ్యాల నొసఁగును అందు సింహ
మునకు సాటియయ్యెడిఁ బ్రతిదినము నొకటి.

తే. కష్టమెయ్యది యని చూడఁగడఁగ, దెలియు
బరమరక్షకు డిడినయో పాఠకుఁడుగ
మహిని మనకంటె ఘనముగా మనలఁ గూర్చి
సర్వమెఱిఁగిన శాసన సుఖుఁడతండు.

తే. ఎంత శ్రమపెట్టు నంత ప్రేమించు మనల
మనతొ పోరాడు వారిచే మన నరాల
బలము పెంచును ప్రావీణ్య ఫణితి మించఁ
జేయు కష్టమ్ము లోటు నశింపఁ జేయు. – బర్క్

తే. పురుష గుణములు, స్త్రీ గుణాల్ భూరి గతులఁ
బెరుగఁ గష్టమ్ము సముచిత పృథ్వియగును
రంగ మెదియైన సత్క్రమ శ్రామికాళి
కష్టములతోడను ప్రతిపక్షము వహింత్రు.

తే. వైద్యమా? పథ్య పద్ధతి వడయ మేలు
నేర్చి వైద్యుడు కావలె నీకు నీవె
పొందు మెప్పు డెయ్యెడ మిత భోజనమ్ము
యోగ్యమౌనది నీకు నా రోగ్యమునకు.

తే. ఎంత దారుణశక్తి వహించి యున్న
భాస్కరుని ముందు తిమిరమ్ము బ్రతుకనట్లు
పత్రికల తేజ మున్నంత వఱకు బ్రతుక
జాలదు నిరంకుశత్వమ్ము సత్యమిద్ది.

తే. కలిగి యుండు సముచితాత్మ గౌరవమ్ము
ఎద్ది నినుఁ గూర్చి భావింత్రు ఇతరులద్ది
పెక్కు పట్టించికొనకుము – వీని వలన
నమ్మకముగ గెల్చెద నప నమ్మకమును.

తే. గౌరవము, ప్రేమ రెండును గలసి యుండ
జాల, వనియె కాక కలసి సాగవెపుడు,
గౌరవమ్ములఁ బొందుటకంటె వాని
కర్హులము మేమనెడి భావమబ్బవలయు.

తే. మన పరిస్థితి యెన్నండు మనల దృష్టి
పరచ దందుకు హేతువైపరఁగు నట్టి
దౌ నసంతృప్తి ఇవి మనసైన మనము
నిలువఁగా లేకపోవుట న్నిలచియుండు.

తే. ఆ యసంతృప్తి మనసుపై నట్టి నిలుపు
నొక్క మేఘమ్ము – తొలగింప నొక్క సాధ
నమ్ము కన్గొనెడి కృషి నొనర్చుకంటె
దాని దుష్టత్వమును గూర్చి తలఁప నేర్పు.

తే. ఉత్తముండు, వివేకి, మహోన్నతముగఁ
గొన్ని పర్యాయముల్ మహాక్రోధపడును
చింతనొందు కర్తవ్యమున్ జేయువాఁడు
పడ డసంతృప్తి యెపుడు ప్రపంచమునెడ. – సఢీ

తే. తెలియ జీవితమున నసంతృప్తులుండఁ
గొన్ని వేళల మేళ్ళను గూర్చునదిగ
కోరుదును సంతోషమును, తృప్తికొరకు నేను
పడసెదను అసంతృప్తి లాభమ్ము కొరకు. – ఫెల్థామ్

తే. విందునందు భోజనవేళ జరుగు నపుడు
మంచి సంభాషణ మనసు మార్చి – అద్ది
యరుగుదల యంత్ర చలనమ్ము నందుఁ దిరుగు
టాపి జీర్ణమ్ముగావించు నద్భుతముగ! – జెరడాన్

తే. "పెద్దగాఁ దినఁగల వేళ పేదవాఁడ,
ఉన్నఁ దినలేని ముసలినై యున్నవాడ
పొందితిని మోసమును రెంటి పుష్కలముగ"
ననుచుఁ బలికి నాఁడొక వృద్ధుఁ డంత్యదశను.

తే. కలిగియుందు రెందరొ ఖ్యాతికై యపేక్ష!
కోర్కెతో ఘనకీర్తికై కొద్దిమంది
లీలగా ప్రాణచయముఁ బరిత్యజింత్రు
తెల్వి నెవ్వరు దోషాలఁ దెల్పుకొనరు. – సింక్లయిర్

తే. చెలఁగు ప్రావీణ్యమూల్యముల్ స్నిగ్ధగుణము
లగుచు వైశిష్ట్యమునకు, సర్వాత్మ చేర్చె
నా గుణాల కుదాత్తతానంత చిహ్న
మివియె నిత్యులను వినిర్ణయించుచుండు. – మిస్. సెడ్జివిల్

తే. విప్పు మోమును ధనకోశమొప్ప శ్రద్ధ
నీదు సంపత్తియును కీర్తి నిలచి యుండు
ఖ్యాతి లోనైన ఘనముగాఁ గాకయున్న
వ్యర్థమౌటయు, నపకీర్తి యబ్బితీరు. – జిమ్మర్మన్

తే. మనసు చెరుపనిదగు మృదుమధురభాషఁ
జర్చతో గాఢ వాదముల్ సాగవలయు
సముచితము, స్వతంత్రము నైన సరణి సాగు
చర్చలో, దోచు సుఖుడు సుసత్యమునకు. – జి. కాంప్‌బెల్

తే. నిన్నుఁ బ్రేమించుకొనవలె నీవు తుదకు,
మున్ను ద్వేషించువారిని మిన్నగాగ
నెన్ని పోషింపదగును సత్యేచ్ఛ – ఆశ
యములు నెలకొల్పు దేశదేవార్థములుగ.

తే. ఎచట నధికారముండునో యచట నుండు
శాసనమ్ముల భంజన సహజముగను
సాగు నణకువ ప్రేమతో శ్రద్ధభంజ
నమ్ముసాగు శత్రుత్వ విన్యాసములను.

తే. పరగ కృషి దేహమున్ బలపరచునటులఁ
గష్టములు మానసమ్మును గట్టిపరచు
వానితోఁ బోరమనలను బంపునపుడు
కష్టములు దేవసందేశ కాంతులౌను. – సెనెకా

తే. ఎవ్వడెవ్వేళ నాశించు నెక్కువగను
నతడు తరచుగ మోసమ్ము నందుచుండు
కాని మోసమ్ము పొందుట కడకు నతని
యాశలను దీర్చు, శుభముల నబ్బఁజేయు. – జాన్సన్

తే. ఇచ్చమై నొక దేశాని కేగునపుడు
దారి రమణీయ మని మది దలఁప రాదు
అట్టె సిద్ధాంతమును సత్యమైనఁ జాలు
దానియందమ్ము భావింపరాని కాంక్ష. – హరే

తే. "పత్ని ధరియించె నితరుల భార్యలట్లు"
అనుచు భర్తయు "భార్యయు నటులె" వస్త్ర
ధారణము చేసినా"దని తలుప వలయు –
వ్యయమొనర్చుట యిందుకుఁ బరమ శుభము.

తే. పొలుచు దూరపు మెఱుగుడు పురుగులట్లు
కీర్తులును దూరమందు విస్ఫూర్తి వెలుగు
దగ్గరగఁ జూడఁ దోపవు దారుణోష్ణి
మమ్ము, కాంతియునున్నట్లు ముమ్మరముగ.

తే. దైవఘటనలు మనదు పృథగ్విధాలు –
లోపశూన్య సౌందర్య వైరూప్య గుణము
లవ్వివ్యక్తిగతమ్ములు – అయిన నేమి,
తలపఁగీర్తింప, గర్హింపఁ దగవు అవ్వి. – జిమ్మర్మన్

తే. సంభవించెడు నపజయ చయము కెల్లఁ
గలుగు నాత్మానుమానమే కారణమ్ము
ఎంత బలమున్నఁ దము విశ్వసింపరేని
వారు బలహీనులౌట తప్పదు నిజమ్ము! – బొలీ

తే. అవును కర్తవ్యమునకు సిద్ధాంత మెంతొ
యవసరమ్మైన మూలమ్ము - అద్ది దోష
యుతమయిన యెడ లోపభూయుతమె యౌను
శ్రద్ధతోఁ జేయునట్టి యాచారమైన.

తే. ఉత్తమ ప్రకృతి విలువతో నొప్పు నెపుడు
స్వర్గమును మించి, కనకమ్ము వాస్తవముగ
సంపద యొసంగు బహుమతి, సర్వవేళ
లందు ప్రకృతి స్వభావ శుల్కమ్మెయగుట. - ఎడిసన్

తే. కొన్నివేళల దూరమ్ము, గోలుపుచ్చి
దోషముల మైత్రిఁ బ్రేమగాఁ దోపఁజేయు
మిత్రుఁడే కూడియున్న సమేళనమున
మైత్రియొనరింపఁగాఁబడు మధురతమము.

తే. దేవు నెదుటను, భావన న్దేవుకొరకు
నృత్య మాడుట పూర్వమ్ము నీతియయ్యె
నేఁడు నయ్యది, తరచుగ పాడుచుంట
నయ్యెదయ్య మొదటను, దయ్యమ్ము కొఱకు.

తే. దాంభికుఁడు ఘనతర వస్త్రధారి, అతఁడి
వైన వ్యాపార కార్యాలయములు, ఉనికి
దుస్తులను ధరియించుటతో నెసంగు -
బ్రతుకు నాతఁడు వస్త్ర ధారణము కొఱకు.

తే. ఉండఁ దుది వ్యాధి నుత్తము నొకని నడుగ
"ఆర్య! మరణించుచున్నావె" యని యతఁడనె
"నేను మరణింప దేవుని తోడనుందు
బ్రతుక దేవుఁడు నాతోడఁ బరగుచుండు." - ప్లూటార్క్

తే. మృత్యువును మిత్రుపోల్కి భావించి మదిని
తెలుసుకొని యెట్లొ యతని కాతిథ్య మిడుట!
శత్రువై రాగననుకొన్న సమర మిమ్ము!
వింతగా వచ్చినప్పుడే వెట్టిపరచు.

తే. కనఁగ మృత్యువు కీర్తిమార్గమ్ముఁ దెరచు,
మూయు నయ్యసూయాద్వారమును తదుపరి
నధిక విఖ్యాతి నొసఁగు బాల్యమ్మునుండి
బంధితుండైన కింకరుఁ బరునిఁ జేర్చు.

తే. మరణమును బొందునపుడొక మాన్యుఁడనియె
"మృత్యువా? పూర్వమొక మహాహీననదిగ
తోచె నేఁడది యొక కుల్య తోచి కాన
బడియె సౌఖ్యాలు దీర్ఘ స్రవంతి పగిది." – మినాండరు

తే. ఆగుట మృత్యువు సురభవ నాంకుటమ్ము
ఎవ్వరుత్తముల్ వార్మరణింత్రు తొలుత
ఎవరి హృదయాలు వేసఁగి యిసుక లౌనొ
వారు కాలుచుందురు తుదిపాత్ర వరకు. – వర్డ్స్ వర్తు (కొంత)

తే. దేశములు లోహముల వోలె తీక్ష్ణమైన
పూతలతో నొప్పుచుండ నపూర్వముగను
ఉత్తమ స్త్రీ ప్రభావమే యుచితసత్య
మగు విధానమ్ము సంస్కృతి నరసి చూడ.

తే. అగును సంస్కార మది మానవాళి ఊర్ధ్వ
గతిని జేరంగ నొనరించు కలహ మందు
లక్షల జనుల్ మృతికిఁ బదా క్రాంతులైన
వారి దేహాలపై వేలు పర్యటింత్రు.

తే. అమలినత కాదు దోషమ్ము – అగును విధియె
అరయ జనశరీరమ్ము దేవాలయమని
దేవతాశ్రద్ధ పిమ్మట దెలిసికొనుట
దాని స్వచ్ఛతఁ గాపాడఁ దలఁచినారు.

తే. "పోవుచున్నవి యవియె నీ పూజ్య మేఘ
రథము లందు గూర్చుండి క్షేత్రాల, ఉపవ
నాల, నుద్యానవనముల, దేవగోప్ర
చారములఁ జూచుకొనెదవే స్వామి! నీవు.

తే. ఎప్పుడును కృషి గావించు చెంత గానొ
పతితుఁ గావించి యొకని లోఁబరచుకొనఁగ
నుత్సహించుచు నితరుల నొక విలాస
కానఁబడును నియోగాధికారివోలె.

తే. "అరయ సంస్థాన సభ్యత్వ మతివ యగును,
అందుచే దాని ప్రణయమ్ము పొందఁ దగును
నీవు నీపయి ప్రేమ నానీల వేణిఁ
బొందవో గౌరవమ్మిచ్చి పొందవలయు.

తే. త్రాసువంటిది తీర్పు ఆధార సాక్ష్య
ము లుభయములు తక్కడ బర్వులు – ఉరలనటు
త్రాసుపట్టెడి హస్తమ్ము ధర్మకాంక్ష
అద్ది కదలినఁ దక్కెడ కగును బరువు. – ప్లేటో

తే. ఎది అసత్యమొ, సత్యమ్ము ఎదొ విచక్ష
ణమ్ము గావించుట అవసరమ్ము శాశ్వ
తమ్ము, సత్యమ్ము, పరమాత్మ తప్పలేఁడు
మనసున నశాశ్వతమ్మును మరువవలయు. – రామకృష్ణ పరమహంస

తే. పడయ విజయ మొక్కడు వ్యాపారమందు
కష్టపడి కృషి సేయఁగా, గలుగ వలయు
అయిన నొకదాని యెడ శ్రద్ధయవసరమ్ము
తీసుకొనరాదు దేనిని తీక్ష్ణముగను.

తే. యుద్ధమున కేగు వీరునందుండునంత
ధైర్యముండంగవలయు నుత్తమము గాగ
నడిపి వ్యాపారము మహోఘనవిజయమ్ము
నొంద నన్న దగును నెంతయో నిజమ్ము.

తే. పగలు ఎట్టిదొ చూపు ప్రభాత మటుల
వ్యక్తి యెట్టిఁదొ చూపు బాల్యమ్ము బాల్య
మునకు నున్నట్టి కాంక్షలు ముందుఁ జూపు
ఇందు లోపమ్ము అణుమాత్రమేని లేదు.

తే. బాలలు మధురముగ నడుపంగఁగలరు
తల్లిదండ్రుల కష్టాల కొల్లకొల్ల
గ దురదృష్టములఁ గటువుగా నొనర్త్రు –
భద్రతల బెంచినను మృత్యు భయము మాన్త్రు. – కార్లయిలు

తే. "ఎద్ది పిల్లలఁ బెంచ నేకైక గుణము?"
అనుచుఁ బ్రశ్నింప దెలిపెద "నది ప్రశాంతి"
అనుచు వారి స్వభావాన, అర్థగ్రహణ
మందు ప్రగతి, ప్రశాంతి యే యవసరమ్ము.

తే. పిల్లలను నిచ్చు దేవుండు పెంచు నెదను
స్వార్థరహితుల గావింప, సకల కరుణ
ములను ననురాగముల నొనరంగఁ జేయఁ
దెలిపి యొసఁగ నాత్మకు సదుద్దేశములను.

తే. నాగరికతకు నగు లక్షణమ్ము ప్రజల
సంఖ్య, పట్టణ విస్తీర్ణసరణి, కృషి ఫ
లాదులను నెద్దియైనను గాదు – దేశ
మొనరఁబుట్టించు నట్టి మహోదయుండు.

తే. అధిక నాగరకమ్మును నాటవికము
నైన జాతులొకటి కొకటంత దూర
మునను నుండు నయోమలమును పరిష్కృ
తమ్ములైన లోహము రెండు తరుగనటుల. – రైవల్

తే. సేవ గురువుకు దొడ్డగా జేయవలయు
శ్రమ యొనర్పగ వలయును – చక్కనైన
అట్టి విద్యలు ఫలియించు – అబ్బ గురువు
లేక విద్యలు అవ్వి ఫలింప వెపుడు. – భారతం

మహాకవి శ్రీ నీలకంఠ దీక్షిత ప్రణీతమైన

# "కలివిడంబన" శతకము

తెలుగు స్వేచ్ఛానువాదం

# అంకితము

స్వర్గీయులు, పరమప్రాచార్యులు

## శ్రీ మారేమండ రామారాయ మహాశయులకు

ఉ. ఇచ్చితి దీనిఁగైకొనఁగదే మన సౌహృదభావ బంధన
మ్మచ్చుపడన్ కవిత్వ సుమహారము - ఈ కలికాలరీతుల
న్మెచ్చగ నెల్ల లోకము మనీషము వ్యంగ్యము నైక్యమంద నం
దిచ్చెను నీలకంఠ కవిధీరుఁడు దీని జగద్ధితార్థియై

శా. విన్నాణంబుల నా బృహస్పతివలెన్ విఖ్యాతిఁ గన్నట్టి నీ
వెన్నో రీతుల స్థైర్యమిచ్చితివి; నిన్నే నమ్మియున్నట్టి యీ
నన్నున్ నీ ప్రియ సోదరుం బలెను గన్నా వెల్ల కాలమ్ము నో
యన్నా! నీ ఋణ మీఁగఁగల్గుదునె ఈ యల్పప్రదానమ్ము తోన్.

శా. నీ కారుణ్య సుధీ సుశిక్షిత మహాంతేవాసినౌ నన్ను నీ
వాకాంక్షన్ సభ వాగ్వివాదములు సేయన్ బంప, ద్విట్సేనలన్
ధీకౌశల్యముతోఁ బ్రవీరగుణముల్ దీపింప భంజింపుచున్
నీ కీర్తి ధ్వజమున్ వెలార్చనొకొ తండ్రీ! రామరాయాగ్రణీ!!

మ. రసికశ్రేష్ఠుల, సత్కళా విభవ సౌరభ్యార్ద్ర సద్బుద్ధులన్,
అసమానోజ్వల భావనాచణుల, స్వేచ్ఛానంద సంసేవ్యులన్
ప్రసరోదగ్ర సుశాస్త్రవేత్తలను నే రక్తిన్ బరీక్షించితిన్
వసివా ళ్వాడని నీదు స్నేహసుమ మవ్వారిన్ గనన్ రాదుపో!

మ. పటు గంభీర పయోధిరాజ నటనా ప్రావీణ్య మెన్నాళ్లో - ఆ
నటరాజేశ్వర పాదనూపుర రణన్యాసంబు లెన్నాళ్లో ప్రా
కటమై యీ కృతి యన్ని నాళ్లు విలసత్కల్యాణ సౌరభ్యసం
పుటముల్ వీచగ నీదు సంస్మృతికి విస్ఫూర్తిన్ ప్రసాదించుతన్.

# కృతి భర్త - నేను

మిత్రులారా!

స్వర్గీయులు డాక్టరు మారేమండ రామారావు, ఎం.ఏ., పిహెచ్.డి, గారు క్రీ.శ 1934 మొదలు 1974 వరకు ఆంధ్ర, ఉస్మానియా, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలల్లో చరిత్రాధ్యాపకులుగాను, ఆచార్య, ప్రాచార్యులుగాను ఉద్యోగించిన మాననీయ మహావ్యక్తులు. వీరు ఆంధ్ర దేశచరిత్ర పరిశోధన విషయంలో ప్రముఖ పాత్ర వహించి మహోన్నత కృషి గావించి ఆంధ్ర పాఠకలోకానికి 'కాకతీయ సంచిక'ను (1934) 'సాతవాహన సంచిక'ను (1950) 'ఆంధ్ర శాసనసర్వస్వ సంగ్రహా'న్ని (1954) సంపాదకత్వం వహించి, సంపాదించి ప్రసాదించిన పూజనీయులు. వీరు నాకు కొంతకాలం దక్షిణ భారత, ఆంధ్ర చరిత్రలకు గురువులుగా వ్యవహరించి, తరువాత పరిశోధనలో ప్రవేశపెట్టి, అనేక చారిత్రక ప్రదేశాలను దర్శింపజేసి చారిత్రక మూల విజ్ఞానాన్ని చేకూర్చారు. ఆప్త మిత్రులుగా, సోదరులుగా పరిణమించి వారి ఐతిహాసిక మండలికి సహకార్యదర్శిని గావించారు. నాచేత చరిత్రాత్మక నాటికలను రచింప జేశారు. తత్కాలీన నాటకీయాలల్లో (హిస్ట్రియానిక్స్‌లో) ప్రవీణుడిని గావించారు. వీరి ఆదేశం తోనే 1947 ఏప్రియల్‌లో వీరు కార్యదర్శి అయిన ఆంధ్రేతిహాస మండలి గుంటూరు వారు ఆంధ్రుల ప్రథమ ముఖ్యనగరమైన "ధనకటకం" (అమరావతి)లో జరుపనున్న "ఆంధ్ర సామ్రాజ్య మహోత్సవ" సభలో ఉపన్యసించటానికి "వాత్స్యాయన కామసూత్రాల" మీద బృహద్వ్యాసాన్ని లిఖించి నేను ఆ కార్యాన్ని నిర్వహించాను. ఈ వ్యాసం శ్రీ "మారేమండ" వారి "సాతవాహన సంచిక" (1950)లో ముద్రితమై చారిత్రక సంచికకు ప్రతిగా వచ్చిన "కలింగ" హిస్టారికల్ రిసర్చి సొసైటీ వారి జర్నల్‌లో (మార్చి 1947 – సంపుటం 1 సంచిక 4) ప్రచురితమైన శ్రీ జయదేవ మహాకవి "పీయూష లహరి" నామ గోష్ఠిరూపకమైన అపురూప సంస్కృత కావ్యాన్ని వీరు నాకు చూపించి, ఆపేక్షించి నా చేత దానిని ఆంధ్ర గేయరూపకం జేయించి, "జయదేవుడు – పీయూషలహరి" అన్న వ్యాసం వ్రాయించారు. వ్యాసం భారతిలో (వికృతి –

మాఖం) 1951 మార్చిలో ప్రచురితమైంది. తెలుగు విశ్వవిద్యాలయం వారు నా 'పీయూష లహరి'ని 1990 మార్చిలో ముద్రించారు; జయదేవ కవీంద్రుని సంస్కృతమూలాన్ని నాగరీలిపిలో ఆంగ్ల పీఠికా వివరణలతో వేరే ముద్రింపనున్నారు.

పైన వెల్లడించిన కార్యాలన్నింటికీ కారణభూతులైన మహాపురుషులు, స్వర్గీయులు అయిన శ్రీ "మారేమండ" మహనీయులను శ్రద్ధతో సంస్మరిస్తూ, కలి విడంబన కావ్యాన్ని వారికి అంకిత మివ్వటాన్ని సాహిత్యలోకం అభిమానించి హర్షిస్తుందని విశ్వసిస్తూ ఇంతటితో నేను విరమిస్తున్నాను.

509 తిరుమల అపార్ట్‌మెంట్స్ — భవదీయుడు
హిమాయత్ నగర్, హైదరాబాద్ 29 — **వావిలాల సోమయాజులు**

# కావ్య ప్రశంస
# డాక్టరు వి.వి.యల్. నరసింహారావు

ఇది 'కలివిడంబన' కావ్యం. సంస్కృత మూలాని కనువాదం. మూలకర్త నీలకంఠ దీక్షితుడు. అనువక్త శ్రీ వావిలాల సోమయాజులుగారు. దీక్షితుల వారి మూలానికి సోమయాజుల వారి అనువాదం వ్యాఖ్యాప్రాయమైన స్వేచ్ఛానుసరణ కావటం దీనిలోని ప్రత్యేకత. వ్యాఖ్యానిరపేక్షంగా తెలుగువారు మూలాన్ని అవగతం చేసుకోవటానికి ఈ అనువాదం అత్యంతోపయుక్తంగా ఉంది.

కావ్యనామం 'కలివిడంబనం'. 'కలి' మనకు క్రొత్తగాదు. మన మున్నది కలియుగం. కలి కాలమహిమ మనకు తెలుసు; కలిపురుష లక్షణమూ కొంత తెలుసు. 'విడంబన' శబ్దం కొంచెం విలక్షణమైంది. దీనికి 'అనుకరణ', 'వంచన' అనే అర్థాలున్నాయి. కలి ననుకరిస్తూ కలికాలం చేసే మోసాలు గడుసుగా చెప్పటం కావ్య వస్తువు.

పరిమాణాన్ని బట్టి కావ్యం చిన్నది. మకుటం లేని శతకం లాంటిది. నిండా నూరు పద్యాలు – ఒకటి రెండు అటూ ఇటూగా. పరిమాణంలో చిన్నదైనా పరమార్థాన్ని బట్టి ఇది పరమప్రౌఢకృతి. ఈ కారణం వల్లనే సోమయాజుల వారు దీక్షితుల పట్ల ఆకర్షితులై యుంటారు.

దీక్షితులవారు మానవ ప్రకృతిని కాచి వడపోశారు. సన్నిహితమైన దోషాలను తూర్పారబట్టారు; అదీ గడుసుగా, సుకుమారంగా, వ్యంగ్యచమత్కార సుందరంగా. 'కలి విడంబనాన్ని' ఆంగ్ల పరిభాషలో చెబితే Satirical Poems అనవచ్చు.

మూల కావ్యకర్త నీలకంఠ దీక్షితులు అప్పయదీక్షితుని సహోదర పౌత్రుడు. అప్పయ దీక్షితుని సహోదరుడు అక్కాదీక్షితుడు. అక్కాదీక్షితుని పుత్రుడు నారాయణుడు. నారాయణుని భార్య భూమిదేవి. ఈ దంపతుల పుత్రుడే నీలకంఠుడు. ఈయన మధుర తిరుమలనాయకుని ప్రధానమంత్రి. 17వ శతాబ్ది పూర్వార్ధంలో ఉన్నాడు. అంటే లోకజ్ఞుడైన మంత్రిసత్తముని సత్కవిత ఈ కావ్యం.

16వ శతాబ్దిలో మరొక నీలకంఠుడున్నాడు. మహాభారతానికి వ్యాఖ్యానం వ్రాసిన ఆ నీలకంఠుడు మహారాష్ట్ర దేశీయుడు.

'కలి విడంబన' కర్త అయిన నీలకంఠదీక్షితుడు శివలీలార్ణవం, సభారంజన శతకం, అన్యోపదేశ శతకం, వైరాగ్యశతకం, శాంతివిలాసం, ఆనందసాగరస్తవం మొదలైన అనేక రచనలు చేశాడు. ఇవే కాక గంగావతరణం, నలచరిత్రనాటకం, కైయట వ్యాఖ్యానం, శివతత్త్వ రహస్యం, నీలకంఠచంపువు మున్నగు రచనలు దీక్షితుల కీర్తికేతనాన్ని దివికెత్తి పట్టిన దివ్యరచనలు. తాతగారైన అప్పయ దీక్షితుల వృత్తివార్తికం, కువలయానందం, చిత్రమీమాంసాది రచనలను సంస్కృత రసజ్ఞ పండితులు మర్చిపోగలరా? ధ్వని – గుణీభూత వ్యంగ్యాదుల్ని తాతగారైన అప్పయ దీక్షితులవారు ఏ మార్గంలో వివరించారో ఆ మార్గంలోనే నీలకంఠు డవగతం చేసుకుని 'కలి విడంబన' కావ్యాన్ని ధ్వనిమయ కావ్యంగా, వ్యంగ్య వైభవోపేతంగా వెలయించా డనిపిస్తుంది.

డొక్కశుద్ధి లేని పండితులు, ఆత్మశుద్ధి లేని మాంత్రికులు, శాస్త్ర బుద్ధిలేని జ్యౌతిషికులు, ఆయుర్విదులు గాని వైద్యులు, శబ్దార్థ శక్తి లేని కవులు – నీలకంఠదీక్షితుని కంటబడి, గంటాని కెక్కకుండా పోయింది లేదు. అల్లుని మంచితనం, ఋణదాతల సౌజన్యం, దరిద్రుల తాల్మి, లక్ష్మీపతుల లోభం, దాంభికుల దౌర్జన్యం – సున్నితంగా, సుతిమెత్తగా మెత్తని చెప్పుతో మొత్తినట్లు మందలించటం, మూదలించటం నీలకంఠునికి అలవోకగా అలవడిన కవితా విలాస మనిపిస్తుంది.

పండిత సభలలో జయం పొందాలంటే చిట్కాలైదున్నాయట; ఒకటి నిర్భయత్వం, రెండు సిగ్గు విడిచిపెట్టటం, మూడు ప్రతివాది ఎంత గొప్పవాడైనా వాణ్ణి అవమానించడం, నాలుగు పరిహాసవాక్యాలకు దిగటం, అయిదు సింహాసనస్థుడైన ప్రభువును ప్రస్తుతించడం – జయార్థ హేతువు లివి యట!

'అసంభ్రమో, విలజ్జత్వ, మవజ్ఞా, ప్రతివాదిని
హాసో, రాజ్ఞః స్తవ శ్చేతి పంచైతే జయహేతవః (2)

దీనికి సోమయాజులవారి స్వేచ్ఛా సుందర భాష్య ప్రాయానుకృతి చిత్తగించండి.

చ. భయము మనమ్మునుండి యెడబాపుము; లజ్జను వీటిబుచ్చు; మ
వ్యయగతి నెంతవాని – ప్రతివాది – నవజ్ఞ యొనర్చు; మంతటన్
'పయర' గ హాస్యమాడుము; స్తవ మ్మొనరింపుము రాజమౌళి; నీ
యయిదు జయార్థహేతువు లటంచు వచింపరె ప్రాజ్ఞులౌ బుధుల్?

మూలంలో 'హాస' అని రెండక్షరాల్లో చెప్పిన భావాన్ని "పయరగ హాస్య మాడుము" అని నవాక్షరగుంభితంగా, నవార్థ బంధురంగా చెప్పటం విశేషం. 'పయర' శబ్దానికి దక్షిణపు గాలి అనే అర్థం ఉంది. మలయమారుతం వీచినట్లు మంచిహాసోక్తులు పలికితే ప్రతివాదితో పాటు ప్రభువుకూడా ముగ్ధుడు కాక తప్పదు. మూలానికి మెరుగులు దిద్దిన అనువాదం వావిలాల వారిది.

మూలం అనుష్టుప్పులో, ప్రతిపాదం అష్టాక్షరిగా నడుస్తుంది. అనువాదం చంపకోత్పల శార్దూల మత్తేభాలుగా ఏకోత్తర – ఏకోన వింశతి – అక్షర బద్ధ పాదాలుగా ప్రసరిస్తూ, పరిమళ లహరులు కుమ్మరిస్తూ, ఉదాత్తగమన సౌందర్యాన్ని ప్రత్యక్షం చేస్తాయి.

దాంభికులైన మాంత్రికులకు ప్రౌఢ గంభీర మౌనమే మహామంత్రమట! (13) జ్యౌతిషికుడు "పుట్టబోయే బిడ్డ – ఆడా? మగా?" అనే విషయంలో తండ్రికి కొడుకనీ, తల్లికి కూతురనీ చెపుతాడట! ఆడ పుట్టినా మగపుట్టినా పురస్కారం పుచ్చుకోవటానికి అప్పు డిబ్బంది ఉండదట. కలి కాలపు జ్యౌతిషికుల కెంత తెలివి?

ఇంటి ప్రక్కన దుష్టుడు తారసిల్లితే ఆ యింట్లో కాపురం ఎంత కష్టమో నీలకంఠుడు పరిమిత పదాల్లో రూపక మర్యాదలో ప్రవచించాడు.

"కాలాంతరే హ్యనర్థాయ గృధ్రో గేహోపరిస్థితః
ఖలో గృహసమీపస్థః సద్యోఽనర్థాయ కేవలమ్ ". (74)

సోమయాజులవారు ఆ చాలునకు రెక్కలు విప్పి – లీలగా ఆడించిన తీరు తిలకించండి.

ఉ. "రెక్కలు విప్పి యాగుచును, లీలగ నార్చుకు వ్రాలి కొప్పుపై
కెక్కిన గృధ్రమౌ నెపుడొ యేదొ యనర్థ నిమిత్త ఽ మింటికిన్
ప్రక్కగ నున్న దుష్టుఁడు కృపారహితాత్ముఁ డనర్థహేతువౌ
ఇ క్కలికాల మందు కన నెప్పటి కప్పుడె క్రూరకృత్యుడై" ( 74)

శబ్దార్థ శక్తి గల సత్కవికి అసాధ్యమనేది లేదు. మంచి మాటతో జనవశీకరణం హాయిగా చెయ్యగలడు. 'ఏకాక్షి' ని శతపత్రేక్షణుని చెయ్యగలడు 'లోభిని కల్పవృక్షంగా' మార్చగలడు. 'పిరికి వాణ్ణి వీరవరేణ్యుని'గా వర్ణించగలడు. సరస్వతీశ్వరు డైతేచాలు; వానికి చేతకాని దేముంటుంది? ధ్వనిచే వ్యంగ్య వైభవాదులు వాని కవితలో

చర్వణసహేలు. అటు నీలకంఠదీక్షితులు, ఇటు సోమయాజులవారూ సమస్కంధులు. ఆ మాటకు వస్తే సోమయాజులవారే ఓ ఆకు ఎక్కువ చదివారేమో ననిపిస్తుంది.

పద్యం, గద్యం, వ్యాసం, నాటకం, ప్రసంగం, ఉపన్యాసం, అనువాదం, పరిశోధన ఒకటేమిటి? తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషల్ని ఆత్మగతం చేసుకున్న సాహిత్యాచార్యులు వావిలాల సోమయాజులుగారు.

నిరంతర జప తపో నిష్ఠాగరిష్ఠులైన యజ్ఞకర్తలకు నెలవైన విప్రులపల్లె అగ్రహారం (గుంటూరు జిల్లా) లో మాణిక్యాంబా సింగరాయావధానులకు ది. 19-1-1918లో జన్మించిన సోమయాజులుగారు, భూమిదేవినారాయణుల గర్భవాసాన జన్మించిన నీలకంఠదీక్షితులను తలపింప జెయ్యటంలో ఆశ్చర్య మేమీ లేదు. దీక్షితులు తిరుమల నాయకుని ప్రధానియై భోగా లనుభవించినా, శీలసంపత్తిలో, కవితలో సోమయాజులవారికి పరమానుకార్యుడే.

కనుకనే "కలి విడంబన" కావ్యం సోమయాజులుగారి దృష్టి నాకర్షించింది.

కలికాలంలో కవులు డబ్బుకు అమ్ముడుపోయే దుస్థితిని దీక్షితులు గర్హించారు. శబ్ద బ్రహ్మం వ్యాపారదృష్టికి అతీతంగా ఉండాలని ఆయన ఆశయం. పోతన్న గారి లాగే దీక్షితులవారున్నూ.

"శబ్దాఖ్యా మపరం బ్రహ్మ సందర్భేణ పరిష్కృతమ్
క్రీయతే కతిపయైః వృథాన్యైః వినియుజ్యతే" (37)

ఉ. "పాయక శబ్ద రూప మగు బ్రహ్మమునున్ కయిసేసి కొంద రా
ప్యాయత తోడ చేయుదురు వర్తకమున్, మరియున్ నిరర్థక
ప్రాయము గాగ కొందరు ప్రవర్తిలుచుందు; రెరింగి బ్రహ్మమే
ధ్యేయముగా చరించు గుణధీరులు లే రిల నెందు చూచినన్" (37)

సోమయాజులుగారు దీక్షితుల వారి త్రోవలో ప్రకృతం బ్రహ్మమే ధ్యేయముగా చరిస్తున్న గుణధీరులు, కలి విడంబనానువాదానికి సర్వాధికారులు. వీరి ధీరగుణాన్ని బహుధా ప్రశంసిస్తూ, నా కీ ఉపక్రమ వాక్యాలు వ్రాసే అవకాశా న్నిచ్చిన సోమయాజులవారికీ, కవిముద్రాపకులు ఊట్ల కొండయార్య గుణ గ్రామణులకూ నమస్సు లర్పిస్తున్నాను.

హైదరాబాద్ - 35 **వి.వి.యల్ నరసింహారావు**
ది. 14.7.1990

# కలి విడంబన సవ్యాఖ్యానుసరణం

## సత్కవి శ్రీ ఊట్ల కొండయ్య

విద్వత్కవులైన శ్రీ వావిలాల సోమయాజులుగారు, 60 ఏండ్లుగా చేస్తున్న పని – అధ్యయనమూ, అధ్యాపనమూ, రచనమున్నూ. అధ్యాపన కార్యక్రమం మాత్రం రిటైర్మెంటుతో ఆగిపోయినా, మిగిలిన రెండు కార్యక్రమాలున్నూ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే వున్నాయి నేటి వరకు. యాభై రెండేండ్లుగా నే నెరుగుదును వీరు నిరంతరాయంగా రచనలు చేస్తూవుండడం. కవిత్వమూ, చరిత్ర – సాహిత్య పరిశోధన వ్యాసాల రచనంతోపాటు విద్యార్థులను విద్యాధికుల్ని చేసే అనేక గ్రంథాలు నిర్మించడమే గాక, మరొక గొప్ప పని కూడా చేశారు సోమయాజులుగారు.

విద్యార్థుల కోసం అనేక విధాలుగా గ్రంథరచనం చేశారు చాలా మంది పండితులు అలాగే చరిత్ర – సాహిత్య పరిశోధన రచనలున్నూ అలాగే ఎవరికి వారు కవిత్వమూ వ్రాస్తున్నా రనేకులు. అయితే, ఈ అన్నిరకాల రచనలూ కలుపుకొని చేసినవారు తక్కువ. వీటితో పాటు అనువాదాల్ని కూడా తమ రచనా కార్యక్రమంలో ఇముడ్చుకొన్నవారు చాలా తక్కువ. అల్ప సంఖ్యాకులుగా వున్న వీళ్లల్లో అందరూ, అందరికీ తెలిసి బాగా ప్రచారంలో వున్న గ్రంథాలనే అనువదిస్తూవుండడం పరిపాటిగా వుంది. వీళ్లలాగే వావిలాలవారున్నూ అనువాదాలు చేశారు, విద్యార్థుల కోసమని, ఇంగ్లీషు నుండి షేక్స్పియరు నాటకాల్ని కొన్ని ఇంగ్లీషు – లెక్చెరర్లు కొందరు వీరి అనువాదాలు చదువుకొని, షేక్స్పియర్ ఆంగ్లనాటకాల పాఠాలు చెప్పేవారంటే, ఆ అనువాదాల ప్రాశస్త్య మెలాంటిదో మనం ఊహించుకోవచ్చు. విద్యార్థుల కోసం చేపట్టిన అనువాదాల సంగతి మాత్రమే ఇది. వావిలాల వారి అనువాద కార్యక్రమంలోని ప్రధాన సూత్రం మరొకటి.

సాహిత్యలోకంలో అట్టే ప్రచారంలోకి రాకుండా మరుగునపడి వున్న అన్యభాషా గ్రంథాలను – మహోన్నతమైన వాటిని – మన పాఠకులకు పరిచయంచేయడం, మన కవులకూ పండితులకూ రచయితలకూ, జ్ఞాపకం చేసి, చూపించడమూ శ్రీ వావిలాల వారి ప్రధానోద్దేశ్యమని, సంస్కృతం నుండి జయదేవుని 'పీయూషలహరి' అనువాదమూ, దానిపై వారి పరిశోధన వ్యాసమూ ఆంగ్లం నుండి క్రైస్తవ, మొహ్మదీయ

మతశాఖలవారి ప్రముఖ గ్రంథానువాదాలూ, జగద్విఖ్యాతమైన – జయశంకర ప్రసాద్ కృతహిందీ కావ్యం – 'కామాయని' అనువాదమూ ఇప్పుడీ 'కలి విడంబన' అనువాదమూ మనకు ప్రస్ఫుటం చేస్తున్నాయి. సాహిత్య పరిశోధకుడైన విద్వత్కవికి విద్యా వితరణ గుణం వున్నప్పుడు, ఇలాంటి ఔదార్యం సహజం. శ్రీ వావిలాల సోమయాజులుగారు, స్వీయరచనలతోపాటు, ప్రాచీనులైన మహాకవి పండితుల రచనలున్నూ మన కందించి, ఆంధ్ర సాహిత్య భాగ్యాన్ని పెంపొందించడానికి పూనుకున్నారు. ఈ వైపున వున్న వారి నిర్మాణ కుశలతలోని అంతర్భాగమే ఈ 'కలి విడంబన' అనువాదమున్నూ.

శ్రీ వావిలాల సోమయాజులు గారు పెద్దవారైన మాట నిజం. వృద్ధాప్యం ఆయన శరీరంలో ప్రవేశించిందే గాని మనస్సులో ప్రవేశించలేకపోయింది. ఇంకా ఆయన మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేస్తూనే వుంది సాహిత్య సృష్టిలో. మనస్సు కనపడదు, శరీరం కనిపిస్తుంది. మనస్సును చూడగల చూపు అందరికీ వుండదు. కేవల బాహ్యస్వరూపాలనే చూడగలవారికి వావిలాల వారి వృద్ధాప్యమూ, అశక్తతా మాత్రం గోచరిస్తాయి. ఆయన మనస్సులో నిత్యనూతనంగా జరుగుతూ వున్న కవితా సృష్టి కనిపించదు వారికి. మహా వేగంతో తిరుగుతూవున్న బొంగరం అచంచలంగా స్థాణువువలె కన్పిస్తూ వుంటుందనీ, తక్కువ వేగంతో తిరుగుతున్నప్పుడు మాత్రమే దాని వేగం గమనింపగలుగుతామనీ, 'అచల రూపుడైన' పరమేశ్వరుని చైతన్యస్థితికి ఉదాహరణగా మహాతత్త్వవేత్త ముట్నూరి కృష్ణరావు పంతులుగారు చెబుతూ వుండేవారు. ఆమాటే శ్రీ వావిలాల వారి 'అశక్తత' కున్నూ వర్తిస్తుందను కొంటాను వినయంతో.

ఇప్పుడీ "కలి విడంబనం" అనువాదాన్ని విడమర్చి చూస్తే సంగతి సమగ్ర స్వరూపంతో ప్రత్యక్ష మవుతుంది మన యెదుట :–

"కలి విడంబనం" అనుష్టుప్‌శ్లోకాల్లో వుంది. మహాఅయితే, ఒక శ్లోకం, మన ఆట వెలదిలోనో, తేటగీతిలోనో – తెలుగు మూసలో – కరిగిపోయవచ్చు, ఆ స్థలం చాలు దాని విస్తృతికీ, దాని యథాతథానువాదానికీ బాగా కాళ్లూ చేతులూ చాపుకొని పడుకొనేటంత వీలుంది ఆ శ్లోక భావస్వరూపానికి ఈ ఛందశ్శయ్యమీద అయితే, అలా వున్నది వున్నట్లు చెప్పడం, యథాతథంగా దించడం సోమయాజులుగారి అభిమతంకాదు. అలా చేస్తే సోమయాజులుగారి ప్రత్యేకత ఏముంటుంది? అనువాదంలో ఆయన వ్యక్తిత్వమే మున్నట్లు? కొన్ని మూలశ్లోకాలు చాలా క్లుప్తంగానూ మహా ఇరకాటంగానూ వున్న విషయం ఆయన గమనించారు. అనువాదం అంటే – "చూస్కో నే నెంత గొప్ప గ్రంథం అనువాదం చేశానో!" అని చెప్పుకొని, ఆత్మానందం పొందుతూ, చదివేవాళ్లకు అర్థంకాకున్నా, వాళ్లు తన ఘనతను శ్లాఘిస్తే చాలు ననుకొనే తత్త్వం కాదు సోమయాజులుగారిది. బహుకాలం విద్యార్థులకు సాహిత్యాధ్యాపనం

చేసిన వారు కనుక, వ్యాఖ్యానసమేతంగా విడమర్చి చెప్పడం, చెప్పింది అందరికీ అర్థమయ్యేట్లు స్పష్టంగా చెప్పడం, ఆయనకు బాగా అలవాటై సహజరీతిగా రూపొందింది. ఆ మార్గాన్ని ఆయన వదలలేదు. అన్ని శ్లోకాలూ ముందు కూలంకషంగా చదివి అవగాహన చేసికొన్న తరువాతనే అనువాద ప్రణాళిక నిర్ణయించుకొన్నట్లు తోస్తుంది.

ముందుగా, ఆయన ఎన్నుకొన్న ఛందస్సును చూస్తే రహస్యం బైటపడుతుంది. వృత్తాలెన్ను కొన్నారాయన, నిజానికి మూలశ్లోకం, మాటకు మాట అనువదిస్తే రెండు చరణాలచోటే సరిపోవాలి, కాని, సోమయాజులుగారు కాస్త పెద్ద ఛందస్సు – పాత్రను ఎందు కెన్నుకొన్నారంటే – ప్రతిశ్లోకాన్ని ముందు విరిచి, పొడిచేసి, అందులో తన వ్యాఖ్యానక్షీరం, భావనా మాధుర్యం కలిపి పాకంచేసి, వృత్తమూసల్లో పోయడానికే.

సోమయాజులుగారి అనువాదం చదువుతూ వుంటే – కథని అనుసరిస్తూ మూలంలోని కవిత్వాన్నీ – భావ, శబ్ద సౌందర్యాన్ని ఏ మాత్రం జారవిడవకుండా, సాధ్యమైన చోట్ల నాటకీయతనూ, కావ్యవైభవాన్ని పెంపొందించడానికి ప్రయత్నించి సఫలీకృతులైన ఆంధ్రభారత కవిత్రయం జ్ఞాపకం వస్తుంది. పలుతావులలో ఏనుగు లక్ష్మణకవి జ్ఞాపకం వస్తాడు కూడ. భర్తృహరికి ప్రాచీనానువాదాలు మూడున్నా లక్ష్మణకవినే సాహిత్యలోకం ఎందుకు అభిమానించిందో తెలిసికోవడం అంత కష్టమేమీ కాదు. అతని – అనువాదంలోని స్పష్టత ఒక గుణం రెండవది – మూలంలోని ఏ చిన్న భావాన్నీ పిసరంతైనా వదలివేయకపోవడం, మూలంలోని మధుర సుందర పదగుంఫనాన్ని వీలైనంతమట్టుకు తెలుగులోకి తీసుకురావడం, మూడవది అన్నిటికంటె మిన్నయైన ధారాశుద్ధి, శబ్దమాధుర్యం, మనల్ని ఆకట్టుకొన్నాయి. ఈ సల్లక్షణాలన్నీ పుణికి పుచ్చుకొన్నారు తమ అనువాదంలో శ్రీ సోమయాజులుగారు. అనువాద విషయంలో నేటి ఏనుగు లక్ష్మణకవే ఈయన అంటే తప్పులేదు. నిజానికి సజావుగా అనువాద భారం లాగాలంటే ఏనుగువంటి కవిఐతే గాని పని నడవదు. అంత సాహిత్య, భావనా బలంతో పాటు, అంతటి ఛందోబలమూ కావాలి. మూలాన్ని చూడగానే, అనువాద రూపాన్ని అద్దంలో ప్రతిబింబాన్ని చూచినంత ఝటితిస్ఫూర్తితో, సందర్శించగలిగిన దక్షత వుండాలి.

ఇప్పుడు చూడండి ఈ 4వ శ్లోకం, – అనువాదానికి లొంగని దుష్కరకాఠిన్యాన్ని ఎలా రూపొందించుకొన్నదో అది!

"లోభో హేతు ర్ధనం సాక్ష్యం దృష్టాన్తస్తు పురోహితః
ఆత్మోత్కర్షో నిగమన మనుమానే ష్వయం విధిః"

ఈ శ్లోకం ఉక్కు పిండం ఏ వృత్తంలో కరిగి పోదామన్నా కరిగేట్లు లేదు. దొమ్మల గుండ అనే ఒక మృగం తిరుగుతూ వుంటుందట శ్రీ కాకుళం జిల్లా ప్రాంతాలలో అది ఎముకల్ని వాసన చూస్తే అవి మెత్తబడతాయంటారు నిజమో అబద్ధమో! అయితే, ఆ జంతువు తాలూకు ఎముక బిళ్లతో వుంగరం తొలిపించి, దాన్ని ఎడమచేతి మధ్య వ్రేలుకు పెట్టుకుంటారు, అరిసెమొలల వ్యాధి వున్నవారు చాలా మంది ఆ ప్రాంతాలలో. మన సోమయాజులు గారి అనువాద శక్తిన్నీ అలాటిదే ఐవుండాలి లేకుంటే ఆయన ఒకసారి చూడగానే, ఈ శ్లోకాలు ఎందుకు అలా అమాంతం కరగి, వృత్తాల మూసల్లో ఒదుగుతాయి!

ఈ శ్లోకానువాదం మత్తేభరూపం చేకొని ఏనుగ నడిచినట్లే నడిచింది. చూడండి:-

"అనుమానాఖ్యము నౌ ప్రమాణ మది నాల్గంగంబులై యుండు" నంటూ ఎత్తుకొన్నారు. అనుమానేషు అయం విధిః అన్నమాటను విప్పిచెప్పారు. అనుమానమనే ప్రమాణంవున్నది కదా? అది నాలుగు తీరులుగా వున్నదండీ! అని తేల్చి చెప్పారు. లోభ, హేతు, ధన, సాధ్యములకు క్రమాలంకారపరంగా దృష్టాంత, పురోహిత, ఆత్మోత్కర్ష, నిగమనాలు ఫలాలుగా చెప్పబడ్డాయి, మూలంలో వావిలాలవారు తెలుగులో దేనిఫలం దానికి జోడించేశారు - దృష్టాంతమగున్ పురోహితుడు, పొందున్ హేతు వాశన్, ధన మ్మది సాధ్యమ్మున సాధ్యమౌ నిగమనమ్మున్ స్వప్రశంస మ్మగున్. ఇక్కడికి ఐపోయింది మూల భావసర్వస్వం. సోమయాజులు గారు ఊరుకోలేదు. అసలు సంగతి బైట పెట్టారు, నీలకంఠ దీక్షితులవారు తన శ్లోకంలో చోటుచాలక, ధ్వనిపూర్వకంగా వదలివేసిన భావాన్ని - ముక్తాయింపుని అనుమానాస్పదులౌ జనావాళికి, సాధ్యంబేకదా సర్వమున్? అంటూ పద్యాన్ని నాటకీయంగా ముగిస్తూను.

పదహారో పద్యం చూడండి. కదను త్రొక్కుతూ ఎలా నడిచిందో, నీలకంఠ దీక్షితులవారి శ్లోకాన్ని అరటిపం డొలిచినట్లు ఒలిచి చేతికందిస్తున్నట్లుగా-

"ఆయుః ప్రశ్నేదీర్ఘ మాయుర్వాచ్యం మౌహూర్తికై స్సదా
జీవన్తో మహు మన్యన్తే మృతాః ప్రక్ష్యంతి కం పునః"

ఇది మూల శ్లోకం. దీనికి సోమయాజులుగారి అనువాదం ఇది :-

మ. "ఇలపై నా బ్రతు కెంత కాల మని ప్రశ్నింపంగ, దైవజ్ఞుఁడు
జ్వల వాక్యముల "దీర్ఘమాయు" వని తెల్పంజెల్లు - జీవించెనా
కలుగున్ గౌరవ మద్భుతంబుగను, కాకన్ కాలగర్భమ్మునం
గలియన్, రాడుగదా 'ఇదేమి' యని ధిక్కారించి ప్రశ్నింపగన్ "

ఎంత మనోహరంగా మన ఎదుట నిలిచి మనతో మాట్లాడుతున్న మనిషివలె కనిపిస్తున్నదో ఈ పద్యం చూడండి! నీలకంఠ దీక్షితులవా రన్న దేమంటే – ఆయువును గూర్చి ప్రశ్నిస్తే "దీర్ఘ మాయు" వని జ్యోతిష్కుడు చెప్పాలి. ఆ అడిగిన వాళ్లు బ్రతికి వుంటే, సన్మానం చేస్తారు పోయారే అనుకో మరి ఎవరి నడుగుతారు? అని మాత్రమే దీనికి 'ఉజ్వల వాక్యముల' అనే మాటనూ, 'కలుగున్ గౌరవం' అనేమాటతో 'అద్భుతంబుగను' అనేమాటనూ, మృతాః అన్న మాటకు 'కాలగర్భమ్మునం గలియన్ అనే మాటనూ, 'ధిక్కారించి' అనే మాటనూ చేర్చి, ఎలా ప్రాణం పోశారో చూడండి ఈ పద్యానికి !

ఇలా ప్రతి శ్లోకమూ దాని అనువాదమూ చెప్పుకొంటూ పోతే, మనం వేరొక గ్రంథమే వ్రాసుకోవలసి వుంటుంది. ఈమాట చెప్పినా, వదల బుద్ధి పుట్టడం లేదు 36వ పద్యం చూడండి. దీన్ని అనువాద మని ఎలా అంటాం? సోమయాజులుగారు స్వయంగా వ్రాసినంత బాగా వుంది ఎలా పరుగిడుతున్నదో 25వ పద్యం ఎలా సెలయేరులా గలగలలాడుతూ ఊరిస్తోందో చూడండి. అలాగే 37వ పద్యమూ, 66వ పద్యమూ, అనుబంధంలోని 3,5 పద్యాలూ, చూడండి, ఎక్కడా అనువాద వాసన కూడా లేదే! సోమయాజులుగారు పద్యనిర్మాణవేత్త కావడంచేతనే 'పద్య విద్యాధరుడు' అనే బిరుదంతో ఆయన్ని సాహిత్యలోకం గౌరవించింది. స్వీయరచనల్లో ఎలాటి గొప్పదనం వుందో అనువాదంలో అంతకంటే గొప్పదనం చూపగలగడం ఆశ్చర్యమనిపిస్తుంది. మూలకర్త శబ్దాల ద్వారా, భావాల ద్వారా అతని ఊహాలోకంలోకి ప్రవేశించగల, పరకాయ ప్రవేశ మహిమ యేదో సోమయాజులుగారికి లేకపోతే ఇంత గొప్పగా అనువాదాలు చెయ్యలే రనిపిస్తుంది. వారి మరి ఇతర అనువాద మహారచనలకోసం, ప్రత్యేకించి మహాకవి జయశంకర్ ప్రసాద్ హిందీ "కామాయని" అనువాదం కోసం ఆంధ్రలోకం ఎదురుచూస్తూ వుంటుంది.

శ్రీ సోమమయాజులుగారి ఈ సాహిత్య తపస్సు నిరంతరాయంగా, నిరంతరం కొనసాగడానికి, అన్ని విధాలా తోడ్పడుతూ వున్న వారి ధర్మపత్ని యైన మా చెల్లెలు 'చిట్టెమ్మా', ఆమె ముగ్గురు కొమారులూ, ముగ్గురు కుమార్తెలూ అభినందనీయులని చెప్పక తప్పదు.

'పింగళి–కాటూరి' **ఊట్ల కొండయ్య**

సాహిత్య పీఠం

# విజ్ఞాపనం

నేను మొదట, విద్యార్థులకు పాఠం చెప్పేటప్పుడు, మిత్రులతో సంభాషించేటప్పుడు, సభల్లో ఉపన్యసించేటప్పుడు శ్రోతలను ఉల్లాసపరచటం కోసం మధ్య మధ్య మహాకవి నీలకంఠ దీక్షితులవారి 'కలి విడంబన' శతకంలోని వ్యంగ్యగర్భితాలైన మనోహర శ్లోకాలను ఉపయోగించటానికి అలవాటుపడ్డాను.

'కలి', 'విడంబన' శబ్దార్థాలను పౌరాణిక విజ్ఞానం వల్ల అవగతాలైన చతుర్యుగాలలో తుదిదైన కలియుగ లక్షణాలను, కలిపురుషుని దౌష్ట్య ధిషణా నైశిత్య లక్షణాలను అనుసరించి ఈ శ్లోకాలను అన్వయించి వివరించటం నాకు గుణమై పోయింది.

ప్రజ్ఞాన్వితులైన నా శిష్యులు కొందరు, నా సాహిత్య సహవ్రతులు, సహోద్యోగులు, విద్వాంసులు కొందరు నా వివరణను అభిమానించి 'కలి విడంబనాన్ని' ఛందోబద్ధంగా ఆంధ్రీకరించ మని కోరుతూ వచ్చారు. ఇలా 1939 మార్చి నుంచి, 1947 మార్చి చివర వరకు గడిచింది. ఈ కాలంలో ఒకసందర్భాన మహాత్మాగాంధీజీ "సత్యం స్వాతంత్ర్య యుద్ధానికి తొలిబలి" అన్నారు. ఈ ప్రవచనం నన్ను పలుమారు స్పందింపజేసి బుద్ధిని 'కలి విడంబనం' మీద లగ్నం చేయటం మొదలు పెట్టింది.

భారతదేశ స్వాతంత్ర్యం రానున్న కొద్ది దినాలకు ముందు నేను ఒక సాయం సంభాషణలో ఈ విషయాన్ని ఆనుషంగికంగా నా పూజ్య మిత్రులు పుణ్య పురుషులు శ్రీ ఓరుగంటి నీలకంఠ శాస్త్రి మహోదయులకు చెప్పుకున్నాను. వారు "ఉచిత సమయం. వెంటనే ఆంధ్రీకరించి ప్రచారంలోనికి తీసుకొనిరం" దని సమంత్రకంగా ఆశీర్వదించారు ఆ, 1947 ఏప్రియల్ చివరలోని ఒక దినాననే. నేను కృషిచేసి 'మే' మాసాంతానికి అనువాదాన్ని ముగించి వినిపించి అనేకులను సంతోషపెట్టగలిగాను.

అయితే ఇంతకాలం వరకు బహు పర్యాయాలుగా శ్రోతల శ్రవణాలకు వినబడగలిగిన భాగ్యాన్ని పొందినప్పటికీ ఈ కృతి సాహిత్య లోక ముఖావలోకనం చేయగలిగే అదృష్టాన్ని పొందలేకపోయింది  ఇందుకు హేతువు లనేకం.

ప్రస్తుతం నా పురా మిత్రులు 'సత్కవులు' 'కవిధీరులు', బహుకావ్యకథాగ్రంథ కర్తలు పింగళి – కాటూరి సాహిత్యపీఠ ప్రచాలకులు శ్రీ ఊట్ల కొండయ్యగారు నా ఈ 'కలివిడంబన' ప్రచురణకు సంపాదకత్వం వహించి దానిని వారి పింగళి కాటూరి సాహిత్య పీఠం ద్వారా సాహిత్యలోకానికి సమర్పిస్తున్నారు. సంపాదకత్వం వహించినందుకూ, ప్రచురణ విషయాన్ని సమగ్రదృష్టితో పరిశీలించి ఆముఖభాగంలో ఉంచటానికి అత్యవసరమని భావించి "కలి విడంబన సవ్యాఖ్యానుసరణం" అన్న వ్యాసాన్ని లిఖించి ముద్రణకు ప్రసాదించి, గ్రంథానికి ప్రత్యేకతను ఆర్జించి ఇచ్చినందుకు శ్రీ కొండయ్య బావగారికి నా నమఃపూర్వ కాశీస్సులు.

నా "కలివిడంబన' స్వేచ్ఛానువాదానికి పీఠికారూపంగా ఉండదగ్గ రచన కావాలని మేము ఆపేక్షించినదే అని అనిపించుకో దగ్గ "కావ్య ప్రశంస" అన్న రమణీయరచనను నా పూర్వ మిత్రులు, "ఉభయకవి మిత్ర" బిరుదాంకితులు ఆంధ్ర ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయ డైరెక్టరు గాను, తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథప్రచురణ విభాగాధిపతులుగాను ఉద్యోగించి విరమించిన విద్వద్వరేణ్యులు, కవిశ్రేష్ఠులు డాక్టర్ వి.వి.యల్. నరసింహారావు గారు నా ఎడ గౌరవానురాగాలతో బహూకరించి నన్ను సంతోషపెట్టారు. ఇందుకు ఆ మాననీయ మిత్రులకు నా అభినందనలు.

ఈ కృతిని వెలువరించే కృషిలో మనఃపూర్వకంగా సహకరించిన నా పౌత్రతుల్యుడు సమీప బంధువు చిరంజీవి పైడిమర్రి శ్యాంప్రసాద్‌కు కళ్యాణాకాంక్షలు, శుభాశీస్సులు.

ఈ కృతిని అనతికాలంలోనే ఆనందప్రదంగా ముద్రించి యిచ్చిన "లాసర్ గ్రాఫిక్స్" (జి. 15 అరుణ్ అపార్ట్‌మెంట్సు, రెడ్ హిల్స్, లక్డికాపూల్, హైదరాబాద్) ముద్రణాలయాధికారులకు మా శుభాకాంక్షలు.

వినమ్రులమై మేము సమర్పించే దశశతాధిక పాదాభివందనాలను వాత్సల్యంతో స్వీకరించి నా 'కలి విడంబన' శతక స్వేచ్ఛానువాదానికి సాహిత్య లోకంలో విపుల ప్రచారాన్ని ప్రసాదించమని మా కుటుంబ సభ్యుల మందరమూ బ్రాహ్మీ పరమేశ్వరులను అభ్యర్థిస్తున్నాము.

509, తిరుమల అపార్ట్‌మెంట్స్.<br>హిమాయత్ నగర్, హైదరాబాద్–29

భవదీయుడు<br>**వావిలాల సోమయాజులు**

# కలి విడంబనము

## = పండితులు =

చ. సభల జయమ్ము గోరునెడ జంకకు, నీ ప్రతివాది యెట్టి వా
గ్విభవుఁడె యైన వాని యునికిన్ గురుతింపకు, వాని వాద మ
భ్యభిహిత మైన దైన సభయందు చెవిం జొరనట్లు శీఘ్రమే
రభసగ వాక్ప్రవాహముల రమ్యముగాఁ బ్రవహింపఁ జేయుమీ. 1

చ. భయము మనమ్మునుండి యెడఁబాపుము, లజ్జను వీటి బుచ్చు, మ
వ్యయగతి నెంతవానిఁ, బ్రతివాది, నవజ్ఞ యొనర్పు మంతటన్
'పయర' గ హాస్యమాడుము, స్తవమ్మొనరింపుము రాజమౌళి నీ
యయిదు జయార్థహేతువు లటంచు వచింపరె ప్రాజ్ఞులౌ బుధుల్. 2

మ. తను వాదించు సభన్ గ్రహించునెడ మాధ్యస్థం బవిద్వాంసుఁ డు
ద్ఘనకంఠంబున బొబ్బవెట్టఁ దగు, నక్కార్యంబు పాండిత్యపుం
గని గైకొన్నను పక్షపాతి యనుచున్ గావించి యారోపణం
బును పొందన్వలయున్ జయంబు సభలన్ బొల్పార దృష్టాత్ముఁడై. 3

మ. అనుమానాఖ్యము నౌ ప్రమాణ మంది నాల్గంగంబులై యుండు, నం
దున దృష్టాంత మగున్ పురోహితుఁడు, పొందున్ హేతు వాశన్, ధన
మ్మును సాధ్యమ్మన సాధ్యమౌ, నిగమనమ్మున్ స్వఃప్రశంస మ్మగున్
అనుమానాస్పదు లౌ జనావళికి సాధ్యంబే కదా సర్వమున్. 4

చ. పరుకడ విద్య నేర్చి ఘన పాండితిఁగైకొన బుద్ధి కల్గియున్
బరగిన లజ్జచే విడిచి, పండితవర్యులఁ గెల్చు కొర్కె ము
మ్మర మగు నేని సిగ్గువడ మాని సభన్ రగడన్ బొనర్చుటే
యరయఁగ నున్న కార్యము గదా యిలలో నటువంటి వ్యక్తికిన్! 5

చ. చదివిన దల్ప మైనను ప్రచారము గట్టిగఁ జేయు శిష్యులన్
పదుగురఁ జేర్చి, యే కృతుల పాదములో తలక్రిందుచేసి, రూ

పొదవగఁ జెప్పి యల్పగురుఁ డొందును బండితుఁడన్న ఖ్యాతి, క
ల్గదుగద యట్టివానికిఁ బ్రగాఢ సుపాండితి జీవితంబునన్ 6

చ. జగతినిఁ దన్నుఁ దానె సుత్తి సల్పుకొన న్వలె, లేక మూర్ఖునిన్
బొగడెడువార లుందురె? అపూర్వసుఖం బెటు లబ్బు - అందుచేఁ
బొగడుకొనం దగున్ మధుర భూరి వచోవినిగుంఫన క్రియల్
నెగడగ నెల్లవేళల వినిశ్చయుఁడై కన కెట్టి తృప్తియున్ 7

చ. "చదువుము ప్రశ్నవేళ కడు చన్నది యెన్నడొ-ముందు ముందు నీ
కిది విశదంబుగాఁ దెలియు"- ఈ గతి ఛాత్రుల దాటవేసి, నె
మ్మది కొక ధైర్య మిచ్చి, అనుమానములన్ దిగఁబుచ్చి గ్రంథముల్
జదువగఁ జేయు వాని కిల సాధ్యము గాని గురుత్వ మున్నదే! 8

ఉ. చెప్పెడువాడు వేరొకఁడు చేకురకుండుట, మించు శ్రద్ధ, వా
డెప్పుడుఁ జెప్పినట్టిదె పఠించుటలోఁ గల తృప్తి - యన్న పెం
పొప్పెడు మూఁడు శిష్యగుణముల్ భువిలోనఁ దలంచి చూడఁగా
జొప్పడుఁ గాదె మూర్ఖగురు శోభన మైన యదృష్టరేఖచేన్ 9

ఉ. ఎంతగ మేము విద్యల శ్రమించిన మా దగు బుద్ధి కొక్కర
వ్వంతయు నబ్బదేని భయ, మందము, మాంత్రికవిద్య యందు ధీ
మంతులమో, యతీశులమొ, మౌనము దాల్చెడి యోగిపుంగవా
త్యంత మహత్వమూర్తులమొ యై గడు మాన్యత నొందకుందుమే! 10

## మాంత్రికులు

చ. కలిగినఁ గార్యసిద్ధి తరి కాలవిలంబన లేక మాంత్రికుం
డిల మహిమాన్వితుం డని వహించు సుకీర్తిని - కార్యసిద్ధికిన్
గలిగినచో విలంబనము "కావలె, తం తిది చాల, దెంతయో
గల" దని చెప్పి పుచ్చు కొనఁగాఁ దగు ద్రవ్య మనూన వైఖరిన్. 11

చ. జగతి సుఖించు వారు కడు సౌఖ్యము లొందుట, జీవితంబునం
దగణిత దుఃఖయాతనల నందెడు వారు వివేకవంతులై
వగలఁ దొరంగి జీవన మవారణ సల్పుట మా యనుగ్రహం
బగు నని పల్కు మాంత్రికు లయారె! కనం గడు ధన్యు లిద్ధరన్ 12

ఉ. ఆరయ జ్ఞాన మొక్క లవ మైన లభింపక యున్న ప్రౌఢగం
భీరత మౌనమున్ గొనుట, విజ్ఞు లెఱుంగని యే విలక్షణా
చారమునో వరించుట యజస్ర మహత్వము లై చెలంగు నీ
ధారుణి మంత్రవేత్తల కుదాత్త యశః పరివాహకమ్ము లై. 13

## జ్యోతిష్కులు

చ. ఫలములఁ జెప్పు వేళల నవశ్యముగా గ్రహచార వేత్తయై
పలుకుట లెస్స యౌట జనపాలురకున్ ఫలముల్ వచించుచో
ఛలము వహించి చారులతొ సల్పి విచారణ, చెప్ప నొప్పు ని
య్యల పయి జ్యోతిషుండు వినుతింపగ లోకము శాస్త్రపాండితిన్. 14

మ. కలుగంబోయెడు బిడ్డ యెవ్వ రనుచున్ గావింపఁగాఁ బ్రశ్న "పో,
కలుగున్ పుత్రుడు నీ" కటంచు పితకున్, "కల్గున్ బలే పుత్రి ఉ
జ్వలనేత్రీ!" యని తల్లికిన్ దెలుపు దైవజ్ఞుండు ధీధుర్యతా
కలితుండై విజయమ్ము సేకొను పురస్కారాళితో నిచ్చలున్ 15

మ. "ఇలపై నా బ్రతు కెంతకాల" మని ప్రశ్నింపంగ దైవజ్ఞుఁడు
జ్వల వాక్యముల "దీర్ఘమాయు" వని తెల్పం జెల్లు–జీవించెనా
కలుగున్ గౌరవ మద్భుతంబుగను కాకన్ కాలగర్భంబునం
గలియన్ రాఁడుగదా, 'ఇదేమి' యని ధిక్కారించి ప్రశ్నింపగన్? 16

మ. గురుఁ డేకాదశ మందు నుచ్ఛగతుఁడై కూర్చుంటఁ గార్యంబు సే
కురు, కానీ – శని యష్టమం బగుటఁ గల్గున్ గొంత సందేహ – మీ
మరు మాసంబునఁ గాక యున్న జరుగున్ మాసద్వయానంతరం
బరలే దంచును జోస్యుఁడాడఁదగు మిశ్రార్థంబులన్ మేటియై. 17

మ. నిరుపేదల్ దమ భాగ్యముం గురిచి ప్రశ్నింపంగ నైశ్వర్య సు
స్థిరులై మింతురటంచు, పృచ్ఛకయి లక్ష్మీపుత్రు లేతేర మీ
కరుదౌ సంపద లబ్బ నున్నవని జోస్యంబాడు దైవజ్ఞుఁడు
ర్వరపై నెల్లర యాదరంబును సమర్చల్ గొంట యాశ్చర్యమే. 18

మ. పరగన్ నూర్ల కొలంది లాభములు దైవజ్ఞుండు తాఁ బొందు ను
ర్వరఁ దాంబూల మొకండు, వేలుగను లాభంబుల్ లభింపంగ నా

దర మేపారెడి భోజనమ్ము వడయున్ – తథ్యం బిదెట్లన్నఁ జే
కురకన్ దప్పి జోస్య మాతనికిఁ గల్గన్ గాదె తిట్లెయ్యేడన్ 19

మ. స్థిర విశ్వాసము గల్గఁ బ్రాశ్నికుల నెంతే శ్రద్ధ వీక్షించి యా
దర మేపారగ జోస్యముల్ పలుకు నా దైవజ్ఞవిజ్ఞుల్ నిరం
తరమున్ వర్ధిల నట్టి తావు మదిలోఁ దర్కింపఁ బెత్తెండు సా
గర పర్యంత మహా మహీతలము పైఁగన్పట్టెనే యెన్నఁడున్. 20

ఉ. ఎన్నఁగ వారనామముల నేఁడును నేర్పిన వారు కొంద, రు
త్పన్నమతిన్ గ్రహక్రమ విధమ్ము నెఱింగినవారు కొంద, ర
భ్యున్నతిఁ దారకా నివహమున్ గణియింపఁ గలారు కొంద, రీ
యన్నియు నేర్చువారు భువి నౌదురు దేవగురుల్ స్వయమ్ముగన్. 21

మ. శకునఫలంబులో మహితశక్తి నెఱుంగఁగఁ జాలువారు, పొం
దికమెయి స్వప్నదృశ్యముల తీరులు తెల్పఁగ నేర్చువారు, పా
యక సురపూజనాపరత నర్థి నుపాసకులైనవారు, జా
తకములు చెప్పువారి కిల దారుణశాత్రవులై మెలంగరే 22

## = వైద్యులు =

ఉ. రోగము లేనివానికడ రూకలు రాల, వసాధ్యరోగితో
సాగదు వైద్య, మిద్దియును సంపద నీయదు, రోగభీతి పె
ల్లూగెడివాఁడు, దీర్ఘరుజ నుత్తలమందెడి వాఁడు సర్వదా
సాగి ధనమ్ములన్ గురువజాలు కుబేరుఁడు గాడె వెజ్జుకున్. 23

మ. అతిధైర్యం బిడరాదు వెజ్జు, మదిలో నత్యంత నిశ్చింత నం
చితరీతిన్ దగు "వైద్య కట్నమును" దాఁజెల్లింపఁ డేరోగి, ఆ
యతభీతిన్ గలిగింప నొందు గద నైరాశ్యమ్ము – భైషజ్యు కి
క్కతనన్ గల్గదు గా ధనమ్ము నిజకాంక్షాపూర్తి యేపారఁగన్. 24

ఉ. ఈయఁగ వచ్చు మం దెదియొ యిష్టము వచ్చిన రీతి వెజ్జు, తాఁ
బాయక చెప్పఁగా వలయు పథ్యము గట్టిది – వ్యాధి తగ్గెనా
మా యభిజాత వైద్యమహిమం బని యాడగవచ్చు, లేనిచో
నీ యఖిల మ్మపథ్యఫలమే యని పల్కఁదగున్ క్రుథోక్తులన్. 25

ఉ. రోగ నిదానమున్ దెలిపి, రోగపుఁ బేరులఁ జెప్పి, యాపయిన్
రోగిహితాహితమ్ముల ప్రరూఢగతి న్వివరించి వెజ్జుకున్
రోగి గ్రహించినట్టి యపురూప చికిత్సల నెల్లఁజూపి తా
మాగక బోధ సేసెదరు వ్యాధితు నింటఁ గలట్టి యంగనల్. 26

ఉ. పెంపు వహించి జాడ్యములు పెక్కు విజృంభణ సేయుచుండ ను
త్కంపితదేహులై, మరణదారుణవర్తన జంతుసంతతుల్
తంపరగా నశింప, వసుధన్ మెల మెల్లగ రోగతత్త్వస
త్వంపు వివేకము న్వడసి వర్ధిలు వారు గదా చికిత్సకుల్. 27

శా. రాకల్ పోకలు సేయఁగా ననుచు నారంభంబునన్ గొంత, "నే
మీకై యౌషధ మొందు సేసితిని తెమ్మీ" యంచు నర్థంబులో
నో కొంతన్, బహుమానమంచుఁదుదియం దొప్పించుచుం గొంతగాఁ
దాకాఁజేయుట యొప్పు వైద్యులు చికిత్సార్థుల్ శ్రమన్ వీడగన్. 28

ఉ. ఈ తపనీయభూమిపయి నే చిరకాలమొ యాశ్రయించి వి
ఖ్యాతము గాగ రోగుల ధనాళి గ్రహింప మదిన్ దలంపఁగా
నా తరి పుట్టి వచ్చిరి మహాద్భుతరీతి చికిత్సకాళికిన్
జ్ఞాతుల రీతి నిల్చి మనఁగా ఁదగ జ్యోతిష మాంత్రిక ప్రభుల్. 29

ఉ. పొడమినవేళ జాడ్య మెద పొంగులతో బతిమాలు వెర్రియై
నడుమ నొకింత యిచ్చును ధనమ్ము, భిషగ్వరు లక్ష్యపెట్టఁ డా
పొడమిన వ్యాధి పెల్లడఁగి పోయిన, స్నానమొనర్చి నంతటన్
కడ కొకమారు వానిఁ గనఁగా దలపోయఁడు పో నరుం డిలన్. 30

శా. దైవజ్ఞత్వము, మాంత్రికత్వమును, వైద్యంబున్, జమత్కార వా
క్ప్రావీణ్యంబును, నొక్క టొక్కటగు ద్రవ్యం బీయ శక్తంబు – కా
నీ విభ్రాజిత విద్యలై పరగ నిం దే రొండొ మూఁడో – తమిన్
వ్యావర్తంబును జెంది యుండుటగు గాదా దుర్లభం బిద్ధరన్. 31

చ. కడఁగి యసత్యము న్బలుకఁగల్గుట, చాతురి యేర్పడ న్సదా
యడలక ముచ్చటించుటయు నౌ నిలలో ధనయోగ మాత్మలో
సడలక యెట్టి యాపదకు సత్యము పల్కుట నిండు పాండితిన్
వడయుట యీ జగాన పరువంబగు నిర్ధనయోగ మెన్నగన్. 32

## = కవులు =

ఉ. పట్టెడు కూర కాశపడి ప్రౌఢతఁ గోల్పడి దాస్యవృత్తి చే
పట్టిన యట్టి యీ కవులు బంధురభీరుత, దుర్వినీతి, నె
ప్పట్టునఁదోచు లోభగుణవర్తన మ య్యవివేకశీలమున్
బిట్టు చలింపకే తుడిచి పెట్టుచు నుందురు నిర్మలమ్ముగన్. 33

చ. పొగడుట కుద్యమించిన కవుల్ కన ఁగోరెదరే ధరిత్రిలోఁ
దగిన నిమిత్త మెద్దియు, సతంబును వారలు దేని నేనియున్
పొగడకయున్నచోఁ దొలుచు బుద్ధి, చలించును జిహ్వ యెంతయో
యగడువడున్ నిరంతర మహత్తర ఘర్ఘురతా విజృంభణన్. 34

ఉ. ఇంకొక రెవ్వరో కడు నుతించి రటంచు స్తుతింత్రు గాని వ
స్త్వంకిత మౌ గుణమ్ము గని సన్నుతిఁ జేసెడు వారలే కవుల్
కొంకక పెద్దసేయుదు రొకో-యిది సత్యమె-కాకయున్నచో
నంకిలిలేని యొక్క పురుగైన యళిన్ ఘనవర్ణనారతిన్. 35

ఉ. ఒప్పిదమైన యా కవిత యొక్కటి యే యొక గ్రామ మిచ్చు, పెం
పొప్పెడు నశ్వ మిచ్చు, నొక యున్నత మౌ గజ మిచ్చు, కానిచో
తప్పక యన్న మిచ్చు, సుఖదంబగు వస్త్రము నిచ్చు, తమ్ములం
బొప్పరికింప కిచ్చు సకలోచిత సాధకమై చెలంగుచున్. 36

ఉ. పాయక శబ్దరూప మగు బ్రహ్మమునుం గయిసేసి కొంద రా
ప్యాయతతోడఁ జేయుదురు వర్తకమున్, మరియున్ నిరర్థక
ప్రాయము గాగఁగొందరు ప్రవర్తిలుచుందు, రెరింగి బ్రహ్మమే
ధ్యేయముగాఁ జరించు గుణధీరులు లే రిల నెందుఁ జూచినన్ 37

మ. రసవంతం బగు కైత లబ్బు తరి శర్వాణీపతిం గొల్వ కు
ల్లసిత ప్రక్రియ నే నరాధములనో లక్షించి వర్ణింపఁ బె
ల్లొసగం జాలిన కామధేనువును మిథ్యోద్యోగులై నాగటన్
పొసగన్ గట్టిన మందభాగ్యులఁతొఁ దామున్ సామ్యముం బొందరే ! 38

చ. అతిశయకౌశలమ్ము మెరయన్ మనుజాధములన్ నుతించుచున్
రతిపతి రాజ్య వైభవ విలాసములే పరమంబు లంచు సం

తత మదమత్తు లై ప్రలపనమ్ము లొనర్చు కవుల్ మహావ్యథా
శ్రితతతి భీమ మైన భవసింధువు నెట్లు తరింప నేర్తురో ! 39

చ. ఒడుపుగ శబ్ద గుంఫనల నూహ యొనర్చుటలో, నలంకృతుల్
చిడిముడి లేక కూర్చుటను, చెల్వగు వ్యంగ్యము సంతరించుటన్
తడఁబడ నట్టి చిత్త నిభృతత్వమునన్ స్మరవైరివర్ణనల్
కడిమి నొనర్చు కైత కనఁగా ఘనమౌను సమాధి నిష్ఠకున్ 40

## = గృహస్థులు =

చ. అమిత మనోజ్ఞ శిల్పమున నాతని భార్యను, ఆమె చెల్లెలిన్
ప్రముదిత భావనన్, శ్వశురులన్ మరి శ్యాలకు చిత్ర కల్పనో
ద్యమమున సృష్టిచేసి కలి తానె గృహస్థున కిచ్చె నైదు ప్రా
ణములుగ తచ్ఛరీరభరణం బను కొండొక కర్మ దీర్పఁగన్. 41

మ. అల యల్లుండ్రును, భాగినేయులును, భార్యాబంధువుల్, మేనమా
మలు పెన్నుద్దులు వైచికొంచుఁ గడు నీమం బొప్పఁగా నింటిలో
నెలుకల్ సేరిన యట్లు చేరి ఘనులై యేమేమి భక్షింతురో
తెలియంగాఁ బనియేమి గేస్తునకు ధాత్రిం గాల మెంతైననున్. 42

మ. బలమౌ తల్లియె మేనమామకు గృహప్రాథమ్యముం గూర్ప, నౌ
బల మా యల్లునకున్ గుమార్తె సకల ప్రాముఖ్యముం గూర్ప, న
వ్వల భార్యాపితకున్ సతీమణి బలం బౌ నగ్రిమం బీయఁ, దా
బలమౌ గేస్తె స్వయమ్ముగా నతిథికిన్ ప్రాజ్యమ్ము చేకూర్చఁగన్. 43

## = అల్లుడు =

చ. పరఁగుచు నెంత కాల మిల బావమఱందికి బాల్య ముండునో
యరయఁగ నంతకాలమును నల్లుని వక్రత సాగు–వానికిన్
దొరకొనఁ గొంతగాఁ దెలివి తోఁచును సౌమ్యత జ్ఞానవంతుఁడౌ
టరసిన యా క్షణంబె యత డర్థి పలాయనమున్ పఠించెడిన్. 44

చ. తన సతి జ్యేష్ఠయై గృహవిధాన మటంచును బేరుగొంట, క్రొ
న్నన యయి శ్యాలకుండు సదనమ్మున శైశవవృత్తి నుంట, పె

త్తన మది యత్త దౌట కడు దవ్వున మామ ప్రవాసి యౌట – ఈ
యనువులు గల్గినన్ జగతి నల్లుని భాగ్యము కోటి కెక్కదే ! 45

ఉ. పుట్టిన యింటి కొక్కపరి పుత్రిక చూడఁగ వచ్చి కొంతకున్
మెట్టిన యింటి కేగు తరి మిన్నగ నూడ్చు గృహమ్ము – పెట్టుకో
గట్టివి సొమ్ములన్, వలచి కట్టెడు పుట్టములన్, సుపాత్రలన్,
పట్టికి నాడుకోఁ గనులపండువు లౌ నుపలాలనమ్ములన్ 46

ఉ. వచ్చిన నింటికిన్ స్వజనవర్గమువారు పదేపదిన్ మదిన్
మెచ్చక "శుష్కభోజనులు, మించి మితాశను" లంచు, నెన్నడో
వచ్చిన భర్త బంధువులు పాల్పరమాన్నము తెచ్చి పెట్టినన్
మెచ్చక "దొంగ తిండి తెగ మెక్కెద" రంచును భార్య తెల్పెడిన్. 47

చ. కొడుకుల గన్న యట్టి బహుకోపన లౌ సతు లిద్ద రుండి, తా
చెడి తల చిన్ననాడె యిలు చేరిన చెల్లె లొకర్తు తల్లికిన్
గడు ప్రియపుత్రియై సకల కైతవశాలినియై చెలంగెనేన్
ఉడుగని యట్టి దౌ కలహయోగము పో గృహిజాతకమ్ముకున్. 48

చ. ఇరువురు పత్ను లుండుటయు నెందరొ పుత్రులు పుట్టియుంటయున్,
తరుగని లేమియున్, గడు ఘనంబగు జాడ్యము చేరియుంట, దె
ప్పర మగు వార్ధకంబు తమ పైఁబడి యా తలిదండ్రు లుంటయున్
మరణము కంటె నత్యధికమై యొక టొక్కటె దారుణం బగున్. 49

## = ఋణదాత =

ఉ. అప్పిడినట్టివాని మన మందు దలంచిన నంగకమ్ములుం
గుప్పుగఁ గూలు, వాని గనుఁగొన్నయెడన్ స్పృహ దప్పు నెప్పుడున్
తప్పక వాడు భూత మయి దర్శనమిచ్చును నెల్ల వేళలం
దప్పునుఁ గొన్నవాని కిది యచ్చెరు వౌను దలంచిచూడఁగన్. 50

మ. అసువుల్ గైకొన నంతకుం డయిన నత్యంత క్షమాదక్షుఁడై
నొసటన్ వ్రాసిన వ్రాత చెల్లుటకుఁ దానున్ నిల్చి వీక్షించు పె
న్ముసురై క్రమ్ముటఁ దెల్పు కాలనియమంబున్ దా ఋణగ్రాహికిన్
కొసకుం జెప్పఁడె యుత్తమర్ణుఁ డిల నక్రూరత్వతా దీనతల్. 51

చ. కనఁబడ వుత్తమర్ణుని ముఖంబున దారుణ దంష్ట్ర లెవ్వి గై
కొనఁడు కరమ్మునం దెదియు ఘోరతరం బగు నాగపాశ, మై
నను, గనినంతనే మనమునన్ జనియించును భీతి జల్లియై
తనువు చలించు, కంఠమును దాల్చును గద్గదికావిరావమున్. 52

## = దారిద్ర్యము =

ఉ. అంజిలి శాత్రవుండు బలుఁడైన, ప్రతిక్రియ సాంత్వనమ్ము – పె
న్మంజుల మౌ ప్రతిక్రియ సమస్త రుజాతతి కౌషధమ్ము – మృ
త్యుంజయ చింతనమ్ము మృతి కొప్పు ప్రతిక్రియ – ఎన్నడేన్ ప్రభా
వ్యంజిత మౌ ప్రతిక్రియ యెదైన నభాగ్యత కున్నదే ధరన్. 53

శా. సంచారం, బొనరింప సర్వ దిశలన్ సామర్థ్యముం గూర్చుచున్
సంచారించి సహింప నేర్చుచును తీవ్రమ్మైన శీతోష్ణముల్
అంచద్వైఖరి జాఠరాగ్ని కుదరంబం దుచ్ఛ్రితిం జెందుచున్
మించున్ ధాత్రి దరిద్రతాగుణము సామీచీన్య భైషజ్య మై. 54

చ. భయమున మాట తొట్రుపడువానిగ, మూసుకు పోవు కన్నులన్
సయిరణ నిల్పువానిగను, చయ్యనఁ గాళ్లు వడంకువానిఁగా
నయమునఁ దీర్చి దిద్ది ప్రభునానతి వోలె దరిద్రతాగుణం
బయమగు వేడికోలునకు నర్థి నొసంగరె యుత్సుకత్వమున్ 55

మ. తలపోయం గడు జీర్ణమై తగు దురంతంబుల్ ప్రభుద్రోహముల్
లలి నెన్నో యవిధేయకృత్యములు సర్వం బిట్టె జీర్ణంబు లౌ
అలుపాలై చను, జీర్ణమై యొలసి యత్యంతమ్ము గండాశ్మముల్
ఇల దారిద్ర్యబలాఢ్యతన్ వెలయువారే యైన లోకమ్మునన్ 56

శా. లోకంబందున నా దరిద్రులకు చోరుల్ లేరు, చూపోపమిన్
ప్రాకాశ్యంబు వహించు వారలును కానన్‌రారు, దాయాదులు
స్వీకస్వైరముఁ దాల్పఁబోరు, కన పృథ్వీవల్లభుల్ లేరు, పె
న్జోకై రాజ్య మభాగ్యతాగుణముతో శోభిల్లగాఁ జాలునే ! 57

## = లక్ష్మి =

మ. సిరి యొక్కించుక చేరెనేని బహుళోత్సేకమ్ముతో నింటిలో
తిరమై నిల్వ నహంకృతిం బెనిచి యుద్దీపింపఁగాఁ జేయుఁ ద
స్కరులన్ రండని పిల్చుఁ దా నిరతమున్, దాయాదులం జేరి దు
స్తర కార్పణ్యము బుద్ధి కెక్కునటు ప్రోత్సహించుచున్ వర్తిలున్. 58

మ. ధన సంపత్తిఁ గలట్టి వారిఁ గని నిత్యం బే విమూఢాత్మదు
ర్జను లోజన్ హసియింత్రొ, వారలె కనన్ లక్ష్మీ కృపాపాంగ వీ
క్షణ మొక్కించుక చేరినంతటనె లోకంబందు హాస్యాస్పదో
ల్బణ కిమ్మీరిత కింవదంతులకుఁ బాలై పోవుటల్ గ్రొత్తలే. 59

చ. ఇతరుల సేయు స్తోత్రము లహీన సుసత్యము లంచు నెంచుటల్
మతి నిజ నిర్జరత్వ మనుమానము లేక గ్రహించి నిత్య మం
చిత గతి మానవాళి యెడ నిందిత కీటక బుద్ధి పెంచి స
మ్మతి గొనుటల్ కనంగ నడమంతరపున్ సిరికి న్ఫలంబు లౌ 60

మ. ధనవంతుల్ మును విన్న దానినె సదా తా మిద్ది యే మంచు క్రొం
దనముం జూపి వినంగఁ గోరెదరు, చిత్త ప్రీతిమై మెండుగాఁ
గనియున్ సర్వము నిండు కన్నులను వీక్షంజేయఁగా జాల, రొ
య్యన భావింతురు కీర్తనమ్ముగ మహోహోసాత్త భాషారతిన్. 61

చ. ధనమద మావరించి కనుదమ్ములఁ గప్పినఁ జూడలేనివా
రిని గని, పార్శ్వ మందునఁ జరించెడివారు పరస్పరమ్ముఁ దాఁ
బనివడఁ గంటి సైగలతొ, బాలుర, నున్మదులన్, పిశాచి పం
పున మనువారిఁ జూచి నగు పోలిక నవ్వుచునుందు రియ్యిలన్. 62

మ. తన స్తోత్రంబుల నందుకోఁదగిన పెద్దల్ సంస్తుతుల్ సేయ నె
మ్మనమం దించుక యైన భీతిఁగొనఁ డే మాడ్కిన్, గురుత్వంబుచేఁ
దన సేవల్ గొనఁ దగ్గ యోగ్యులటఁ బ్రత్యక్షంబుగా సేవ చే
సిన లజ్జన్ వహియింపఁబోడు ఘనుఁ డాశ్రీమంతు డీయుర్విపై. 63

మ. క్షణమాత్రమ్ముగ నిల్చి తాఁ దొలఁగు లోకానన్ గ్రహావేశ – ముం
దును హాలా మద మొక్క యామముగ – మూఢుం జేరి సంపత్తి పెం

పున నెక్కించిన యుజ్వలన్మదము పొల్పొందున్ ఘనోదర్చియై
యనువర్తించును నిత్యదోహదముమై నా దేహ మవ్వానితోన్. 64

మ. ఇలలో నా సిరి యింట నొక్కనెలయో యం దర్ధమో నిల్చి అ
వ్వల మోమాటముమాని చెప్పకయె యావాసంబుఁ దా వీడు – ఆ
కలిమిన్ గల్గిన పెన్వికార మది యాగారాంతరం బందు కొ
దులమందన్ దిర మై రహిన్ లశునగంధం బట్లుగా నిల్చెడిన్. 65

ఉ. ఆరికయన్న మిచ్చుమద మంతయు కంఠము నందె నిల్చు, నొ
ప్పారెడి తమ్ములంపు మద మా హృదయమ్మున నిల్చు – కాని ల
క్ష్మీరమణీలసన్మదము చేరును పో నిఖిలాంగకమ్ములన్
చేరును వాని పత్నిని, వసించును జేరి సుతాదులందునన్. 66

ఉ. ఏ కులమందుఁదా సిరి వసించుచు నున్నదొ చిత్రవిభ్రమం
బా కులమందు నర్తనల నత్తరి నిల్చిన నిల్చుగాక, ము
న్నే కులమందు నామె చరియించి త్యజించునొ యందుఁగుష్ఠయ
ట్లాకులపెట్టు సొమ్మవలె నయ్యది వర్తిల నేమి హేతువో! 67

మ. ఇలఁ దా మింపుగఁ జేరి హస్తమున నాడింపంగ నైదారు గ
వ్యవలు శాస్త్రార్థము లొక్కమారె చదివింపంజేయు, విద్వాంసుల
న్పలు మార్గాలఁ దృణీకరించుటకునై నైశ్చల్యముం గూర్చు, వ
ర్తిలఁజేయున్ నిజ జాతివిస్మృతిని బ్రీతిం బెంచి చిత్తంబునన్. 68

మ. ధనవంతుం డెపు డాత్మ సేవకుల వాత్సల్యాన పోషించుఁగా
కనయంబున్ దనుఁజేరు యాచకుల కీయన్వచ్చుఁగా, కేమియై
నను, సామర్థ్య మెటింగి యర్థులకు నెన్నన్ దానముల్ సేయుచో
గనఁ దా నోర్చునె వాని లోభగుణ మెక్కాలంబునన్ బెంపునన్. 69

చ. ఇల పయి నోర్వలేని జనులే యతి కష్టము తోడ నెట్టులో
కులధనభార మెల్ల తమ గొప్పగు మూపుల మోయు రీతి ను
జ్వలగతిఁదోఁచు – అయ్యదియె సత్యము కాక మరెద్ది యైన వా
రలు లఘువు న్బొనర్పఁగ నిరంతర మేల శ్రమింతు రిద్ధరన్. 70

ఉ. ఓపికతోఁ గనుంగొనఁగ నుర్విపతుల్ శ్రమ యెంతొ చూచి చూ
పోపమిఁ గొండెముల్ వలుకు పుణ్యజనాళిని గౌరవింపఁగా
నోపిరె? నేర్పుమై నెఱిఁగి యోగ్యత లెల్లఁ గృతాంతుఁ డొక్కఁడే
యీ పనిఁ దీర్చు చుండు గద, నిబ్బడి ముబ్బడిగాఁ గృతజ్ఞుఁడై. 71

శా. గోకర్ణంబున భద్రకర్ణమున, సంకోచంబుల న్మాని పె
న్వీకం జేయు జపంబు లెల్ల నెపుడో వీక్షించి దుష్కర్మలన్
బోకార్చున్ ఉ మరి రాజకర్ణజప మున్మూలించుఁ బెంపొంది పె
ల్లాకన్ సర్వము లైన కర్మముల సద్యఃకాలమం దొయ్యనన్. 72

మ. ఇలపై దుష్టజనుల్ మహాపురుషు లెంతేఁ దుల్యులై స్వార్థముం
గలలో నైనఁ దలంప కొక్కరునిచేఁ గార్యార్థ మెవ్వేళ నే
పలు కొక్కించుక యైనఁ గోరకయె తా వర్తింతు రీ యుర్వి ని
శ్చల చిత్తమ్మున నన్యకార్య రచనోత్సాహంబునన్ ధీరులై. 73

ఉ. రెక్కలు విప్పి యాడుచును, లీలగ నార్చుచు నింటి కొప్పుపై
కెక్కిన గృధ్ర మౌ నెపుడొ యేదొ యనర్థ నిమిత్త ఉ మింటికిన్
బ్రక్కగ నున్న దుష్టుఁడు కృపారహితాత్ముఁ డనర్థ హేతు వౌ
నిక్కలికాలమందుఁ గన నెప్పటి కప్పుడె క్రూర కృత్యుఁడై. 74

**= లోభి =**

మ. సొరిదిన్ ధాత్రి సమస్త ధర్మములలో శుష్కోపవాసంబు మే
ల్తర మై, లంఖనమే చికిత్సలను సర్వశ్రేష్ఠమై దొడ్డగా
వర యజ్ఞప్రజ మందు మేటి జపయజ్ఞం, బర్థి నా లోభికిన్
బర మామోదములై రుచించుఁగద సంభావింపఁగా నిచ్చలున్. 75

ఉ. ఏమని పల్కునో ధనము నిమ్మని తా నడుగన్ ధనాఢ్యు డం
చీ మహి నిర్ధనుం డెటు లహీనగతిన్ భయము న్వహించు – న
ట్లేమి యతండు కోరి మది నిమ్మని నన్నడుగంగ వచ్చెనో
ఏమి యొసంగఁగా వలెనొ యే నని లోభియు భీతి నొందెడున్. 76

చ. అతిథికిఁ బెట్టి నట్టి కబళాన్న మొకొక్కటె మేరుతుల్య మం
చతిశయ మిచ్చి శాస్త్రముల యందున పెద్దలు బోధచేయ సంత

తమును లుబ్ధ మానవులు దాని మహార్ఘ మెఱింగి కంటి ముం
దతులిత మేరురూపముల నా కబళాన్నము లీక్ష సేయరే. 77

మ. ఛల మొప్పన్ ధనరక్ష సేసెడి పిశాచం బా ధనస్వామి కా
వలె నంచున్ దనుఁ గోరినంతటనె సర్పం బిచ్చు నాటంకముల్
గలిగింప న్దలపెట్ట దెవ్వనికి నైనన్ దా ధనం బీయఁగా
నిల నా లోభిపిశాచి యొప్పుకొనునే యెవ్వేళ నిచ్ఛాగతిన్! 78

శా. యాచింపన్ జనుచుందు రర్థు లిలలో నా దాతృగేహాళికిన్,
యాచింపంగను దాతలున్ మరి విపర్యంబైన కాలాన సం
కోచం బందక నర్థిఁ జేరెదరు – కల్గుంగాదె నిమ్నోన్నతుల్,
ఆ చాంచల్యపు కర్తృకర్మ గత సంయాత వ్యతీహారతన్. 79

చ. ధనమున కెన్నఁగా దగిన త్రాత మరొక్కడు లేఁడు నేఁడు నే
తనువు ధరింపకున్న వసుధాతల మం దని లోభి యెంతయు
న్మనమున నిశ్చయించి పెరమార్గ మగోచర మౌట నెట్టులో
దినుఁగద యించు కించుకయె తిండి మనోవ్యథ దందడింపఁగన్. 80

చ. ఒకరి గృహమ్మునం దతిథి యుండఁగఁ గోరినఁ దిష్ఠ వెట్టి పా
యక దినమున్ బ్రయాణముల నర్థి నొనర్చుచుఁ జిత్ర చిత్రదు
శ్శకునము లూహసేసి, మనసా చలియింపక వాని మెల్లఁగా
నొక టొకటే వచించు టిల నొప్పగు మార్గముగాదె చూడఁగన్. 81

## = అతిథి, దాంభికులు =

మ. ధన మార్జింపఁ దలంచువారు ఘటకున్ దాత్పర్యమున్ జూపి, సే
వనఁ గావించి, నిజేచ్ఛఁదెల్పి, తమ సద్వృత్తంబుఁ జెప్పించి యా
ధనికుం డాత్మను నమ్మునట్లుగ నిజార్థంబుల్ ఫలాంతంబులై
చనుదాకన్ దమ దుర్గుణంబులకు రక్షల్ సేయఁగాఁ జెల్లెడిన్. 82

చ. "అవని సమస్త శాస్త్రనిచయం బొక యెత్తు, మరొక్క యెత్తగున్
భువన మనోజ్ఞ మౌ తులసిపూస య దొక్కటి, ఇంచు కంత మే
మవగతి సేసినాము, నిజ మా తులసీ గుళి కొక్కటే ఘనో
ద్భవము మహత్వపూర్ణ" మని పల్కఁగఁ జెల్లును దాంభికాళికిన్. 83

మ. అల యెన్నింటినొ జెప్పి బాహటుఁడు దీవ్యద్వైద్య శాస్త్రంబులో
దులసీకాష్ఠము కున్న యా గుణములందున్ విశ్వమం దర్థి ని
స్తుల సమ్మోహిని, విత్తదాయిని యటంచున్ తద్గుణ ద్వంద్వమున్
బలుకంగా మరచె న్గదా, ఇవియె సర్వశ్రేష్ఠముల్ గావొకో! 84

ఉ. ఈ యిలఁ బండితుం డయిన నిత్తురు రూప్య మొకండు, కావ్యసం
ధాయకు కిత్తు రొక్క పది, నర్తకు కిత్తురు నూరు, దాంభికుం
డాయతవిప్రకారమున నర్థిగఁ దాఁ జనుదేర నిత్తురో
వేయి, తలంచి యించుకయు వేదవిదుం గని యీయ నేర్తురే! 85

ఉ. ఈ వసుధన్ గనుంగొనఁగ నిం తది గోచియు, భస్మధారణం
బా వరదర్భ ఖండము, లయంబగు రుద్రజపాక్షమాల, తా
రావళి నొప్పు ఖడ్గిక, నిరంతర మౌనము – నవ్వి మూర్ఖసం
జీవన షట్క సాధనలు, చెల్లును బూజన మబ్బఁజేయుచున్. 86

శా. మా యావాసము పుణ్యతీర్థములు, సన్మాన్యుండు, విఖ్యాతుఁ, డా
మ్నాయార్థాంబుజ సంభవుండు, సమరానందుండె యాచార్యుఁ డ
ధ్యాయాధ్యాపన గోష్ఠి శిష్యులకు విద్యల్ సెప్పుటే వృత్తి యం
చా యా దాతల కెక్కఁ జెప్పు కొనఁగా నర్థార్థు లుంద్రీ ధరన్. 87

మ. ధన మార్జించెడి యన్య దేశముల మంత్రభ్రంశముల్ గల్గుచోఁ
గన మా కయ్యది సంప్రదాయ మనుచున్, కల్గన్ కుసంస్కార మొ
య్యన నేఁ గైకొనుచుంటి నూత్నమగు ప్రాయశ్చిత్త మంచున్ చెలం
గ ననాచారము దేశధర్మ మనుచున్ దా పృచ్ఛకుం గెల్వ నౌ! 88

చ. పలువు రెరుంగనట్లు తమపై నభిమానము గల్గి దాతకుం
దెలిపెడియట్లు స్నాన జప నిర్మల యజ్ఞము లాదిగాగ పెం
పొలసెడి సర్వ ధర్మముల యుక్తిమెయిన్ సలుపన్ ఫలించు – ని
య్యిల వృథగా నొకించుకయు నేల యొనర్పఁగ దాంభికాళికిన్. 89

మ. జపవస్త్రంబు నిరంతరంబు నిజవస్త్రం బందునం దాల్చుటల్
యుపశోభింపఁగ మధ్యమధ్య నిజనేత్రోన్మీలనల్ సేయుటల్
కృపతో సర్వము బ్రహ్మమం చనుట లెందేనిన్ మహాత్ముం డటం
చపుడే నమ్మకమున్ కుదుర్చుటకుఁగా నౌఁబో నిమిత్తంబులున్. 90

శా. ఆ మధ్యాహ్నము వాహినీతటిని సంధ్యాకృత్యముల్ దీర్చుటల్
నీమం బొప్పఁగ దేవతార్చన జనానీకంబు దర్శింపఁగాఁ
బ్రేమ న్దీర్చుటలున్ నిరంతర శుచిర్వేషంబుతో నుండుటల్
ఏమీ యీ యిల దాంభికాగ్రణికిఁ గాదే జీవితం బెయ్యేడన్. 91

ఉ. చూచెడువార లెందనుక చొప్పడుచుందురొ యంతదాకయు
న్వేచి సుదీర్ఘకాలము, సువిస్తర వృత్తిని, నిత్యకర్మలన్
జూచి యొనర్చు టాపగిదిఁ జూచెడు వారలు గల్గకున్న సం
కోచము మాని దాంభికులు క్లుప్తమొనర్చుట క్రొత్త వింతలే. 92

చ. తలచిన యంతనే నయన తామరసమ్ముల హర్షబాష్పముల్
కలుగుట, దేహమందు పులకల్ జనియించుట నేర్చెనేని యు
జ్వలుఁడగు వాని కింకఁ బెరసాధనలన్ బనియేమి యున్న ది
య్యిలఁగల రాజలోకముల నేలికొనన్ దన సేవకాళిగన్. 93

## = దుర్జనులు =

చ. కడఁగుచు శిక్షసెప్పక వికారము కల్గగఁ జేతు రర్థిమై
నెడదకు – లాలనల్ సలుప నేద్దెర మించు మనో వికారముల్
వడయఁగఁ జేయఁజాలెదరు – ప్రౌఢత దుష్టుల దూరమందున
న్విడచుట న్యాయమున్ గడు వివేకము గాదె తలంచి చూడఁగన్. 94

ఉ. ఈయఁగ నున్నఁ గొంచెముగ నిచ్చిన వచ్చును సుంత కోప, మెం
దీయిల వారు దృప్తిగను టెంతగ నిచ్చిన లేదు గాన పె
ల్లీయుట సజ్జనావళి వహించెడి నైజగుణమ్ము, మధ్యలో
నీయక మానినన్ కలహహేతువుగాఁ బరిణామ మొందెడిన్. 95

చ. అరయఁగఁ గల్గ కుండుటయె యౌశుభ మీ భువి, దుర్జనాళితో
బరిచయమున్నచో నది కృపారహితేర్ష్యకు హేతు వౌ – తగం
దొరకాని తుచ్ఛమానవులతోఁ దగ వియ్యము నందుకొంట యెం
దరిమురి సర్వనాశనము నబ్బగఁజేసిడి మూలకంద మౌ. 96

శా. చేతః పద్మ మనోహరత్వమును విచ్ఛేదంబు గావించు వి
ఖ్యాతమ్మైన దరిద్రతాగుణము, నా జ్ఞాతిత్వమున్, జ్ఞానశూ

న్యోత ప్రోతము, పైశునంబు లను నా ల్గొప్పార నే దిక్కునం
బ్రీతి న్నిల్చునొ దాని కీయఁదగు సంప్రీతి న్నమోవాకముల్. 97

మ. చెలఁగన్ దుష్టుల చిత్త మెన్నఁడు పరచ్ఛిద్రంబులన్, వారి శ్రు
త్యల ఘూర్జద్ఘన రంధ్రముల్ పరుల వార్తా సంతతిన్, వాక్కు ని
శ్చల వృత్తిన్ బరమర్మకర్మముల నిచ్చన్నిల్చి రాణింపఁగా
నల పద్మోద్భవ శిల్పి నైపుణిని నత్యాసక్తి సృష్టించెఁబో ! 98

ఉ. ఏగతి జీవకోటులకు వృశ్చిక మిద్ధర పుచ్ఛకోణది
గ్భాగమునందు నుండు విషబంధురతన్ గడు భీతిఁ గూర్చునో
యా గతి నిల్చి నంత దశమాంశము నందున సర్వ కాలమున్
దాఁ గలి భీప్రదంబుగ నొనర్చి కలంచుట, సత్యమౌ గదా ! 99

శా. ఏ కాలమ్మున భార్యవాక్యములె తా మింపౌ శ్రుతుల్, సాధనం
బే కాలంబున ధర్మనిర్వహణ మార్జింపంగ స్వః ప్రజ్ఞయౌ
నే కాలంబున నౌఁ బ్రమాణ మిల నర్పింతున్ నతుల్ శ్రీ యుతుం
డా కాలాత్మున కా కలిప్రభున కూహాతీత తేజస్వికిన్. 100

శా. ఆయత్తస్థితిఁ గొన్న యి జ్జగము కాలాధీనమై యుండుఁగా
నీ యీ కాలము కాలకాలుఁడగు సర్వేశుండు చిత్తంబునం
దే యే రీతులఁ ద్రిప్పఁగా దలఁచు నట్లే సాగు – మ మ్మేమియున్
జేయంజాలదు కాల మీశు పదరాజీవంబులం జేరుటన్. 101

శా. భ్రాంతాత్ముల్ కలికాల లక్షణ విపర్యస్తంబులన్ నేర్వఁగా
సంతోషింపఁగఁ బండిత వ్రజము, రాజాస్థాన సభ్యుల్ నిజ
స్వాంతంబం దనుమోదనమ్ము వడయన్, సర్వజ్ఞుఁడై తొల్లి య
త్యంత ప్రీతిని నీలకంఠ కవి సంధానించె నీ కావ్యమున్. 102

## మహాకవి నీలకంఠ దీక్షిత ప్రణీత
## "కలి విడంబనము" లోని 'కవులు' కు చెందిన
## అనుబంధ శ్లోకాలకు అనువాదాలు

మ. ఘనమై తోచెడు విశ్వ మియ్యది కనంగా నామరూపాత్మకం
బని తా నొప్పును రెండు రీతులుగ ఇం దా నామ విశ్వమ్ము కెం
దెన లేనట్టి కవీశ్వరుం డగును తానే స్రష్ట – రూపాత్మకం
బను విశ్వమ్మున కా చతుర్ముఖుఁడు కర్తైయొప్పెడున్ జూడగన్. 1

మ. అల సామాన్యపదంబె యయ్యు నది యా యా విద్యలం దెల్ప నీ
యిల సారస్వత మన్న నామ మొగి తానెందున్ ధ్రువమ్మై మహో
జ్వల లీలన్ బెలు పొందునో కవికి నా సారస్వతం బొప్పు ను
జ్వల పాత్యంబయి  మించు నన్య పఠనౌత్సుక్యం బనర్హం బగున్. 2

ఉ. వేలకొలంది యశ్వములు వేలకొలంది మదద్విపంబులున్
వేలకొలంది యోధులును వేయివిధంబుల నున్న నేమి? భూ
పాలుని సత్సభన్ పరమభవ్య రసామృత కావ్య కల్పనా
లీల నెఱుంగు నొక్క కవి లేకయె కల్గునె కీర్తిచంద్రికల్? 3

మ. శతపత్రేక్షణుఁ డంచుఁ బొందును బ్రశస్తఖ్యాతి యేకాక్షి, ఆ
య్యతిలోభుం డగు దేవతా భువన భాస్వత్కల్ప వృక్షంబు – వి
శ్రుత సంగ్రామ పరంతపుం డగుచుఁ బొల్చు న్భీరు వీ భూమి – భా
రతి కీశుండగు సత్కవీశుని కృపార్ద్రంబైన చూ పబ్బినన్. 4

మ. పరదేశంబుల వాసముల్, పరునికిం బాపిష్ఠి దాస్యంబు, లే
వురునే కాక్షి నొకర్తు పత్నిగను దా భోగించుటల్ గల్గియుం
దిరమౌ కీర్తిని బాండవుల్ వడసి రెంతే వ్యాసభట్టారక
స్థిరవాణీ కరుణా కటాక్ష మనురక్తిం బ్రోచి వీక్షించుటన్. 5

చ. ఎరుఁగరొ దేని నా శశిదినేశులు లోకపుఁ గన్నుదోయి యై
యెరుఁగరొ దేని యోగివరు లిద్ధ సమాధి నివిష్ట చిత్తులై
పరఁగియు, సర్వమున్ దెలియు భర్గుఁడు దేని నెఱుఁగ లేఁడొ ఆ
పరమ రహస్య మెల్లఁ గవివర్యుఁ డెరుంగును ధీవిశేషతన్ 6

## "కలి విడంబనము" లోని మరొక అనుబంధమైన 'జగద్వశీకరణ' ను గూర్చిన శ్లోకానికి అనువాదము

చ. అరయగ నిచ్చు టొక్కరికి నక్కర లేదు, గ్రహింపఁ గోరినన్
బరుడిడు వస్తు వెద్దియును బట్టఁగ నక్కరలేదు, శక్తిమైఁ
గరము శ్రమించి చేయఁదగు కార్యము నక్కరలేదు మంచి మా
టరసి వచింప నెల్లరకు నౌను వశంబు జనమ్ము సర్వమున్. 7

శ్రీ

**శివాభ్యాం నమః**

**మహాకవి "నీలకంఠ దీక్షిత" ప్రణీత**

# కలి విడంబనము

## పండితులు

మూ॥ నభేతవ్యం నబోద్ధవ్యం నశ్రావ్యం వాదినో వచః ।
ఝుడితి ప్రతివక్తవ్యం సభాసు విజిగీషుభిః ॥ 1

మూ॥ అసంభ్రమో విలజ్జత్వ మవజ్ఞా ప్రతివాదిని ।
హాసో రాజ్ఞస్తవశ్చేతి పంచైతే జయహేతవః ॥ 2

మూ॥ ఉచ్చై రుద్ఘుష్యజేతవ్యం మధ్యస్థశ్చే దపండితః ।
పండితో యది తత్రైవ పక్షపాతో ధిరోప్యతాం ॥ 3

మూ॥ లోభోహేతు ర్ధనం సాధ్యం, దృష్టాంతస్తు పురోహితః।
ఆత్మోత్కర్షో నిగమన, మనుమానే ష్వయం విధిః ॥ 4

మూ॥ అభ్యస్య లజ్జమానేన తత్త్వం జిజ్ఞాసునాచిరం।
జిగీషుణా హ్రియంత్యక్త్వా కార్యః కోలాహలోమహాన్ ॥ 5

మూ॥ పాఠనైర్గ్రంధనిర్మాణైః ప్రతిష్ఠాతావ దాప్యతే ।
ఏవం సతస్తు వ్యుత్పత్తి రాయుషోంతే భవేన్నవా ॥ 6

మూ॥ స్తోతారః కేభవిష్యంతి మూర్ఖస్యజగతీతలే ।
నస్తౌతిచేత్ స్వయంచ స్వం కదా తస్యాస్తు నిర్వృతి ః ॥ 7

మూ॥ వాచ్యతాం సమయోఽ తీతః స్పష్ట మగ్రే భవిష్యతి
ఇతి పాఠయతాం పుంసాంకాఠిన్యం కుత్ర వర్తతే ॥ 8

మూ॥ అగతిత్వ మతిశ్రద్ధా జ్ఞానాభ్యాసేన తృప్తతా।
త్రయశ్శిష్యగుణాహ్యేతే మూర్ఖాచార్య కభాగ్యజాః ॥ 9

మూ॥ యదిన క్వాపి విద్యాయాం సర్వధాక్రమతే మతిః
మాన్త్రికాస్తు భవిష్యామోయతయో యోగినోపివా । 10

## మాన్త్రికులు

మూ॥ అవిళంబేన సంసిద్ధౌ మాన్త్రికై రాప్యతేయశః ।
విలంబే కర్మ బాహుళ్యం విఖ్యాప్యావాప్యతే ధనం ॥ 11

మూ॥ సుఖంసుఖషు దుఃఖీపి జీవనం బుద్ధిశాలిషు ।
అనుగ్రహాయ తేయేషాం తేధన్యాః ఖలుమాన్త్రికా ః ॥ 12

మూ॥ యావ దజ్ఞానతోమౌన మాచారోవా విలక్షణః
తావ న్మాహాత్మ్యరూపేణ పర్యవస్యతి మాన్త్రికే ॥ 13

## జ్యౌతిషికులు

మూ॥ చారాన్విచార్య దైవ జ్ఞైః వక్తుం భూభృతాంఫలం ।
గ్రహచారపరిజ్ఞానం తేషామావశ్యకం యతః ॥ 14

మూ॥ పుత్ర ఇత్యే పితరి కన్యకేత్యేవ మాతరి ।
గర్భ ప్రశ్నేషు కథయ దైవజ్ఞో విజయీభవేత్ ॥ 15

మూ॥ ఆయుఃప్రశ్నే దీర్ఘమాయుర్వాచ్యం మౌహోర్తికై స్సదా ।
జీవన్తో మహుమన్యన్తే మృతాః ప్రక్ష్యంతి కంపునః ॥ 16

మూ॥ సర్వం కోటిద్వ యోపేతం సర్వం కాలద్వయావధి ।
సర్వంవ్యామిశ్రమివచ వక్తవ్యం దైవచింతకైః ॥ 17

మూ॥ నిర్ధనానాం ధనావాప్తిం ధనినా మధికం ధనం ।
బ్రువాణా స్సర్వదా గ్రాహ్యాలోకే జ్యౌతిషికాజనాః ॥ 18

మూ॥ శతస్య లాభే తాంబూలం సహ్సస్యతుభోజనం ।
దైవజ్ఞానా ముపాలంభో నిత్యఃకార్యవిపర్యయే ॥ 19

మూ॥ అపిసాగరపర్యన్తా విచేతవ్యా వసుంధరా ।
దేశోహ్యరత్ని మాత్రోపి నాస్తి దైవజ్ఞవర్జితః ॥ 20

మూ॥ వారాన్‌కేచి ద్గ్రహాన్ కేచి త్కేచిదృక్షాణిజానతే ।
త్రితయం యేనిజానంతితే వాచస్పతయస్స్వయం ॥ 21

మూ॥ నైమిత్తికాః స్వప్నదృశో దేవతోపాసకా ఇతి ।
విసర్గశత్రవః సృష్టాః దైవజ్ఞానా మమీత్రయః ॥ 22

## వైద్యులు

మూ॥ స్వస్థై రసాధ్యరోగైశ్చ జన్తుభిర్నాస్తి కించన ।
కాతరాదీర్ఘరోగాశ్చ భిషజాం భాగ్యహేతవః ॥ 23

మూ॥ నాఽ తిధైర్యం ప్రదాతవం నాఽ తిభీతిశ్చ రోగిణి ।
నైశ్చింత్యా దాదిమేదానం నై రాశ్యాదేవ నాస్తిమే ॥ 24

మూ॥ భైషజ్యంతు యథాకామం పథ్యంతు కఠినం వదేత్ ।
ఆరోగ్యం వైద్యమాహాత్మ్యా దన్యథాత్వమపథ్యతః ॥ 25

మూ॥ నిదానం రోగనామాని సాత్మ్యాసాత్మ్యచికిత్సతం ।
సర్వమప్యు పదేక్ష్యంతి రోగిణస్సదనే ఽ స్త్రియః ॥ 26

మూ॥ జృంభమాణేషు రోగేషు మ్రియమాణేషు జన్తుషు ।
రోగతత్త్వేషు శనకైః వ్యుత్పాద్యంతే చికిత్సకాః ॥ 27

మూ॥ ప్రవర్తనార్థ మారంభే మధ్యేత్వౌషధహేతవే ।
బహుమానార్థమస్తేచ జిహీర్షంతే చికిత్సకాః ॥ 28

మూ॥ లిప్సమానేషు వైద్యేషు చిరాదాసాధ్యరోగిణః ।
దాయాదా స్సంప్రరోహన్తి దైవజ్ఞా మాన్త్రికా అపి ॥ 29

మూ॥ రోగస్యోపక్రమే సాంత్వం మధ్యేకించి ద్ధనవ్యయః ।
శైనెరనాదర శ్శాన్తౌ స్నాతో వైద్యం నపశ్యతి ॥ 30

మూ॥ దైవజ్ఞత్వం మాన్త్రికతా భైషజ్యం చాటుకౌశలం ।
ఏకైక మర్థలాభాయ ద్విత్రియోగస్తు దుర్లభః ॥ 31

మూ॥ అనృతం చాటువాదశ్చ ధనయోగో మహానయం ।
సత్యం వైదుష్య మిత్యేష యోగో దారిద్ర్య కారకః ॥ 32

## కవులు

మూ॥ కాతర్యం దుర్వినీతత్వం కార్పణ్య మవివేకితాం ।
సర్వం మార్జంతి కనయ శ్శాకినీముష్టికింకరాః ॥ 33

మూ॥ నకారణ మపేక్షంతే కవయః స్తోతు ముద్యతాః ।
కించి దస్తువతాం తేషాం జిహ్వా ఘురఘురాయతే ॥ 34

మూ॥ స్తుతం స్తువంతి కవయో నస్వతో గుణదర్శినః ।
కీటః కశ్చిదళిర్నామ కియతీ తత్రవర్ణనా ॥ 35

మూ॥ ఏకైక కవితా పుంసాం గ్రామా యాஉశ్వాయ హస్తినే ।
అస్తతోஉ న్నాయ వస్త్రాయ తాంబూలాయచ కల్పతే ॥ 36

మూ॥ శబ్దాఖ్య మరపరంబ్రహ్మ సన్దర్భేణ పరిష్కృతం ।
విక్రీయతే కతిపయై ర్వృథాஉ న్యై ర్వినియుజ్యతే ॥ 37

మూ॥ వర్ణయన్తినరాభాసం వాణీంలబ్ధ్వాపి యేజనాః ।
ప్రాప్యాపి కామధేనున్తే లాఙ్గలే వినియుఞ్జతే ॥ 38

మూ॥ ప్రశంసంతి నరాభాసాన్ ప్రలపంతోஉ న్యథా తథా ।
కథంతరస్తు కవయః కామపారమ్యవాదినః ॥ 39

మూ॥ యత్సన్దర్భే యదుల్లేఖే యద్వ్యంగ్యే నిభృతంమనః ।
సమాధేరపి తజ్జ్ఞాయ శ్శంకరోయది వర్ణ్యతే ॥ 40

## గృహస్థులు

మూ॥ గృహిణీ భగినీ తస్యాః శ్వశురౌ స్యాల ఇత్యపి।
ప్రాణినాం కలినా సృష్టాః పఞ్చ ప్రాణా ఇమేஉపరే ॥ 41

మూ॥ జామాతరో భాగినేయా మాతులాదారబంధవః ।
అజ్ఞాతాఏవ గృహిణాం భంక్షయాన్త్యాఖువద్గృహే ॥ 42

మూ॥ మాతులస్య బలం మాతా జామాతు ర్దుహితా బలం
శ్వశురస్యబలం భార్యా స్వయమేవాஉ తిథే ర్బలం ॥ 43

## అల్లుఁడు

మూ॥ జామాతు ర్వక్రతాతావ ద్యావ త్స్యాలస్య బాలతా ।
ప్రబుధ్యమానే సారళ్యం ప్రబుద్ధేఽస్మి పలాయనం ॥ 44

మూ॥ భార్యాజ్యేష్ఠా శిశు స్స్యాలః శ్వ శ్రూస్వాతంత్ర్య శాలినీ ।
శ్వశురస్తు ప్రవాసీతి జామాతు ర్భాగ్యధోరణీ ॥ 45

మూ॥ భూషణై ర్వసనైక పాత్రై పుత్రాణా ముపలాలనైః ।
సకృదాగత్య గచ్ఛంతీ కన్యా నిర్మార్ష్టి మందిరం ॥ 46

మూ॥ గృహిణీ స్వజనంవక్తి శుష్కాహారం మితాశనం ।
పతిపక్షాంస్తు బహ్వాశాన్ క్షీరాపాన్ తస్కరానపి ॥ 47

మూ॥ భార్ద్వే పుత్రశాలిన్యౌ భగిన్యః పతివర్జితాః ।
అశ్రాస్తకలహానామ యోగోఽయం గృహమేధినాం ॥ 48

మూ॥ ద్వేభార్యే బహవః పుత్రాః దారిద్ర్యం రోగసంభవః ।
జీర్ణాచ మాతాపితరా వేకైకం మరణాధికం ॥ 49

## ఋణదాత

మూ॥ స్మృతే సీదన్తి గాత్రాణి దృష్టే ప్రజ్ఞాపి నశ్యతి ।
అహో మహదిదం భూత ముత్తమర్ణాభి శబ్దితమ్ ॥ 50

మూ॥ అస్తకోఽపిహి జస్తూనా మస్తకాల మపేక్షతే ।
నకాలనియమః కశ్చిదుత్తమర్ణస్య విద్యతే ॥ 51

మూ॥ నపశ్యామో ముఖే దంష్ట్రాం నపాశంవా కరాఙ్చలే ।
ఉత్తమర్ణ మవేక్ష్యైవా తథాప్యుద్విజతే మనః ॥ 52

## దారిద్ర్యము

మూ॥ శత్రౌసాస్త్వం ప్రతీకారః సర్వరోగేషు భేషజం ।
మృత్యౌ మృత్యుంజయధ్యానం దారిద్యే నతుకించన ॥ 53

మూ॥ శక్తిం కరోతి సంచారే శీతోష్ణే మర్షయత్యపి ।
దీపయాత్యుదరే వహ్నిం దారిద్ర్యం పరమౌషధం ॥ 54

మూ॥ గిరం స్థలంతీం మీలన్త్యౌదృశౌ పాదౌ విసంస్థులౌ ।
ప్రోత్సాహయతి యాచ్నాయాం రాజాజ్ఞేవ దరిద్రతా ॥ 55

మూ॥ జీర్యన్తి రాజ విద్వేషాః జీర్య స్త్యవిహితాన్యపి ।
ఆకించన్యబలాఢ్యానా మన్తతోఽ శ్మాఽపి జీర్యతి ॥ 56

మూ॥ నాఽస్య చోరా నపిశునా నదాయాదా నపార్థివాః
దైన్యం రాజ్యాదపిజ్యాయోయదితత్త్వం విబుధ్యతే ॥ 57

## లక్ష్మీ

మూ॥ ప్రకాశ యత్యహంకారం ప్రవర్తయతి తస్కరాన్ ।
ప్రోత్సాహయతి దాయాదాన్ లక్ష్మీః కించి దుపస్థితా ॥ 58

మూ॥ విడంబయంతి యే నిత్యం విముగ్ధా ధనినోజనాన్ ।
తఏవతు విడంబ్యంతే శ్రియా కించి దుపేక్షితాః ॥ 59

మూ॥ ప్రమాణ్యబుద్ధిః స్తోత్రేషు దేవతాబుద్ధిరాత్మని ।
కీటబుద్ధిర్మనుష్యేషు నూతనాయాః శ్రియః ఫలం ॥ 60

మూ॥ శృణ్వన్త ఏవ పృచ్ఛంతి పశ్యన్తోఽపి నజానతే ।
విడంబనాని ధనికాః స్తోత్రాణీత్యేవ మన్వతే ॥ 61

మూ॥ ఆవృత్య శ్రీమదేనాఽ న్ధా నన్యోన్యకృత సంవిదః ।
స్వైరం హసంతి పార్శ్వ స్థా బాలోన్మత్త పిశాచవత్ ॥ 62

మూ॥ స్తోతవ్యైః స్తూయతే నిత్యం సేవనీయైశ్చ సేవ్యతే ।
నబిభేతి నజిహ్రేతి తథాపి ధనికో జనః ॥ 63

మూ॥ క్షణమాత్రం గ్రహావేశో యామమాత్రం సురామదః ।
లక్ష్మీమదస్తు మూర్ఖాణా మాదేహ మనువర్తతే ॥ 64

మూ॥ శ్రీర్మాస మర్ధమాసంవా చేష్టిత్వా వినివర్తతే ।
వికారస్తు తదారబ్ధో నిత్యో లశునగంధవత్ ॥ 65

మూ॥ కంఠోమదః కోద్రవజః హృదితామ్బూలజో మదః ।
లక్ష్మీమదస్తు సర్వాంగే పుత్రదారముఖేష్వపి ॥ 66

మూ॥ యత్రాసీ దస్తివా లక్ష్మీ స్తత్రోన్మాదః ప్రవర్తతాం ।
కులే త్వవతర త్యేషా కుష్ఠాపస్మారవత్కథమ్ ॥ 67

మూ॥ అధ్యాపయన్తి శాస్త్రాణి తృణీకుర్వన్తి పండితాన్ ।
విస్మారయన్తి జాతింస్వాం వరాటాః పఞ్చషాః కరే ॥ 68

మూ॥ భిభర్తు భృత్యం ధనికో దత్తాంవా దేయ మర్థిషు ।
యావ ద్యాచకసామర్థ్యం తావ ల్లోభో నమృష్యతి ॥ 69

మూ॥ ధనభారోహి లోకస్య పిశునైరివ ధార్యతే ।
కథంతే తంలఘూకర్తుం యతన్తే పరథాస్వతః ॥ 70

మూ॥ శ్రమానురూపం పిశునః కిము ప్రక్రియతే నృపైః ।
ద్విగుణం త్రిగుణంవాపి కృతాన్తో లాలయిష్యతి ॥ 71

మూ॥ గోకర్ణే భద్రకర్ణేచ జపో దుష్కర్మనాశనః ।
రాజకర్ణే జపస్సద్య సర్వకర్మవినాశనః ॥ 72

మూ॥ నస్వార్థం కించి దిచ్ఛంతి నప్రేర్యన్తేచ కేనచిత్ ।
పరార్థేషు ప్రవర్తన్తే ఖలాస్సన్తశ్చ తుల్యవత్ ॥ 73

మూ॥ కాలాన్తరే హ్యనర్థాయ గృధ్రోగేహో పరిస్థితః ।
ఖలో గృహసమీపస్థ స్సద్యోనర్థాయ కేవలమ్ ॥ 74

## లోభి

మూ॥ శుష్కోపవాసో ధర్మేషు భైషజ్యేషుచ లంఘనం ।
జపయజ్ఞశ్చ యజ్ఞేషు రోచతే లోభశాలినామ్ ॥ 75

మూ॥ కిం వక్ష్యతీతి ధనికా ద్యావ దుద్విజతే ధనః ।
కిం ప్రక్ష్యతీతి లుబ్ధోపి తావదుద్విజతే తతః ॥ 76

మూ॥ సర్వ మాతిథ్యశాస్త్రార్థం సాక్షాత్కుర్వంతి లోభినః ।
భిక్షాకబళ మేకైకం యేహి పశ్యన్తి మేరువత్ ॥ 77

మూ॥ ధనపాలః పిశాచోహి దత్తేస్వామి న్యుపాగతే ।
ధరలుబ్ధః పిశాచస్తు నకస్మైచన దిత్సతి ॥ 78

మూ॥ దాతారోఽ ర్థిభి రర్థ్యంతే దాతృభిః పునరర్థినః ।
కర్తృకర్మవ్యతీహారా దహోనిమ్నోన్నతం కియత్ ॥ 79

మూ॥ స్వస్మిన్నసతి నార్థస్య రక్షక స్సంభవే దితి ।
నిశ్చిత్యైవం స్వయమపి భుక్తే లుబ్ధః కథంచన ॥ 80

## అతిథి

మూ॥ ప్రస్థాప్యమానః ప్రవిశేత్ ప్రతిష్ఠేత దినే దినే ।
విచిత్రానుల్లిఖే ద్విఘ్నాన్తిష్ఠాను రతిథిశ్చిరం ॥ 81

## డాంభికులు

మూ॥ ఘటకం సమ్యగారాధ్య వైరాగ్యం యావ దాహరేత్ ।
తావదరాః ప్రసిధ్యన్తి యావచ్ఛాపల మావృతం ॥ 82

మూ॥ ఏకత స్సర్వశాస్త్రాణి తులసీకాష్ట మేకతః ।
వక్తవ్యం కించిదిత్యుక్తం వస్తు స్తులసీ వరా॥ 83

మూ॥ విస్మృతం బాహటేనేదం తులస్యాః పరతాగుణాన్ ।
విశ్వసమ్మోహినీ విత్తదాయి నీతి గుణద్వయమ్ ॥ 84

మూ॥ ప్రదీయతే విద్యుష్యేకం కవౌ దశ నటే శతం ।
సహస్రం డాంభికే లోకే శ్రోత్రియే నతు కించన ॥ 85

మూ॥ కౌపీనం భసితాలేపో దర్భా రుద్రాక్షమాలికా ।
మౌన మేకాసికా చేతి మూర్ఖసంజీవనాని షట్ ॥ 86

మూ॥ వాసః పుణ్యేషు తీర్థేషు ప్రసిద్ధశ్చమృతోగురుః ।
అధ్యాపనా వృత్తయశ్చ కీర్తనీయా ధనార్థిభిః ॥ 87

మూ॥ మన్త్రభ్రంశే సంప్రదాయః ప్రాయశ్చిత్త మసంస్కృ తౌ।
దేశధర్మస్త్వనాచారే పృచ్ఛతాం సిద్ధ ముత్తరమ్ ॥ 88

మూ॥ యథాజానన్తి బహవో యథావక్ష్యన్తి దాతరి ।
తథాధర్మంచరేత్సర్వం నవృథాకించి దాచరేత్ ॥ 89

యూ॥ సదాజపపటోహస్తే మధ్యేమధ్యేఽ క్షిమీలనం ।
సర్వం బ్రహ్మేతివాదశ్చ సద్యః ప్రత్యయహేతవః ॥ 90

మూ॥ ఆమధ్యాహ్నం నదీవాసో సమాజే దేవతార్చనం ।
సతతం శుచివేషశ్చేత్యేత డ్డంభస్య జీవితమ్ ॥ 91

మూ॥ తావదీర్ఘం నిత్యకర్మ యావత్స్యాద్ద్రష్టమేళనం ।
తావత్సంక్షిప్యతే సర్వం యావద్ద్రష్టా నవిద్యతే । 92

మూ॥ ఆనన్దబాష్ప రోమాన్చౌ యస్య స్వేచ్ఛావశంపదౌ ।
కింతస్య సాధనై రన్యైః కింకరాస్సర్వ పార్థివాః ॥ 93

## దుర్జనులు

మూ॥ వికుర్వన్తే దండ్యమానా లాల్యమానా స్తత స్తరామ్ ।
దుర్జనానామతో న్యాయం దూరాదేవ విసర్జనమ్ ॥ 94

మూ॥ ఆదాన మీషద్దానంచ కించిత్కోపాయ దుర్ధియాం ।
సంపూర్ణదానం ప్రకృతి ర్విరామో వైరకారణమ్ ॥ 95

మూ॥ జ్యాయా నసంస్తవో దుష్టై దీర్ష్యాయై సంస్తవః పునః ।
ఆపత్యసంబంధ విధః స్వానర్థాయైవ కేవలమ్ ॥ 96

మూ॥ జ్ఞాతేయం జ్ఞానహీనత్వం పిశునత్వం దరిద్రతా ।
మిళంతియది చత్వారి తద్ది శేపి నమోనమః ॥ 97

మూ॥ పరచ్ఛి ద్రేషు హృదయం పరవార్తానుచ శ్రవః ।
పరమర్మనువాచంచ ఖలానా మసృజ ద్విధిః ॥ 98

మూ॥ విషేణ పుచ్ఛలగ్నేన వృశ్చికః ప్రాణినామివ ।
కలినాదశమాంశేన కాలస్సర్పోఽ పిదారుణః ॥ 99

మూ॥ యత్రభార్యాగిరోవేదాః యత్రధర్మోఽ ర్థసాధనం ।
యత్ర స్వప్రతిభా మానం తస్మై శ్రీకలయే నమః ॥ 100

మూ॥ కామ మస్తు జగత్సర్వం కాలస్యాస్యవశం పదం ।
కాలకాలం ప్రపన్నానాం కాలః కింసు కరిష్యతి ॥ 101

మూ॥ కవినా నీలకంఠేన కలేరేత ద్విడంబనం ।
రచితం విదుషాం ప్రీత్యై రాజాస్థానానుమోదనం ॥ 102

కలి విడంబనము

సంపూర్ణము

# భరతరస ప్రకరణము

# భరతరస ప్రకరణము

(శృంగార రస ప్రధానము)

## ఆంధ్ర ఛందోనువాదము

### ప్రార్థన

శృంగార వ్యవహారా
లకు కూటమి, స్వాశ్రితజన
వర్గమ్ముల కాంక్షల నీ
డేర్చు కల్పవృక్షమ్మును,
సంసారాదులను ఆశ్ర
యించు వారికిని శాశ్వత
మౌ బ్రహ్మానంద మొసఁగు
శ్రీనాథుని నాదు మనో-
రథసిద్ధికి ఆశ్రయింతు (1)

### మహిళానృత్యం

నటన మ్మొనరించు వనిత
తొలుతగ గీతమ్ము పాడి,
అటు పిమ్మట గీతార్థము
హస్తాభినయమ్ములచే
తెలుపంగా వలసియుండు,
నేత్రాలచె భావాలను
తెలుపవలెను పాదాలచె
తాళమ్మును ఆచరింప
గావలయును (2)

### అభినయం - రసోత్పన్నత

రసోత్పన్నత హస్త మెచట
చూపించునొ అచట దృష్టి
నుంచవలెను, దృష్టి నుంచు-
చోట మనసు నుంచవలెను
మనసు నుంచుచోట భావ-
ముంచవలయు ఎచట భావ-
ముంటుందో అచట రసము
సంభవించు (3)

### భరతసూక్తి

విభావమ్మును
భావము, వ్యభిచారము అను
భావమ్ముల సంయోగము
చేత రసము నిష్పన్నం
ఔతుందని భరతసూక్తి 4-అ

### విభావము

రతి మొదలౌ స్థాయి భావ-
ములు దేనిచె మిక్కిలిగా
భావింపగబడుతున్నవొ

భావజ్ఞులు దాని “విభా-
వ”మ్మనుచును తెలుపంగా
కళయందున ఉంటున్నది. 4 ఆ

**అనుభావము**

రతి మొదలౌ స్థాయి భావ
ములను, చింత మొదలు అయిన
వ్యభిచారీభావాలను
ఏది స్మరణకును తెచ్చునొ
అది “అనుభావ”మ్మనుచును
చెప్పంగా బడుతున్నది 5

**‘వ్యభిచారి’భావము**

ఏ భావము రత్యాది
స్థాయి భావముల కెదురుగ
సంచరిస్తు ఉంటుందో
అది “వ్యభిచారీభావ”
మ్మని భావార్థజ్ఞులచే
తెలియంగాఁ దగినట్టిది 6

**స్థాయి విభావాది భావముల సంబంధము**

స్థాయి అయిన అద్ది విభా
వముల చేత పుట్టింపం
బడునది గావునను స్థాయి
విభావముల కొకటొకటికి,
కార్య కారణపు భావము
సంబంధమ్మని చెప్పగ
బడుతున్నది 7అ.

స్థాయ్యనుభా
వముల చేత జ్ఞాపింపగ
బడుట చేత స్థాయికి అను
భావములకు జ్ఞాప్య – జ్ఞాప
కపు భావము సంబంధం
బని చెప్పగబడుతున్నది. 7 ఆ

**సంయోగము**

స్థాయీభావములు వ్యభిచా
చార భావమ్ముల చేత
పోషింపగ బడుతున్నవి.
కనుకను స్థాయీ – వ్యభిచా
రీభావములకును పోష్య
పోషక భావము సంబం
ధమ్మనబడుతూ ఉన్నది. 8 అ

ముందు చెప్పినట్టి తెఱగు
భేదమ్ములు సూత్రములో
నుండెడు ‘సంయోగ’పు శ
బ్దార్థము లని చెప్పబడును. 8ఆ

**రసము**

స్థాయి విభావాను భావ
వ్యభిచారీ భావాలచె
మనోజ్ఞత్వమును పొందిం
పంగా బడి రస మౌను 9.

**నిష్పత్తి**

విభావాని కొరక కార్యము
కలిగించుట, అనుభావము
నకు కార్యము జ్ఞాపించుట,
వ్యభిచారీ భావానికి
కార్యమ్మును పోషించుట
'నిష్పత్తికి' శబ్దార్థము 10,11 అ

**'విభావ' నిరూపణ**

విభావమ్ము ఆలంబన
విభావమ్ము 'ఉద్దీపన
విభావమ్ము' అని ఇరు తెఱఁ
గుల నున్నది. 11 ఆ

**ఆలంబన విభావము**

రతి మొదలౌ
స్థాయీ భావములు రసా
లే వస్తువులను నాశ్రయ
మొంది కల్గుచున్నాయో
నాయిక మొదలౌ నా వ
స్తువు లాలంబన భావము.
లంటు భావశాస్త్రజ్ఞులు
తెలుపుతారు 12

**నాయిక – భేదములు**

ఏ నాయిక
రసమున కాధారంగా
చెప్పబడుతు ఉందొ ఆమె
'స్వీయము', 'పరకీయ', మరియు
'సామాన్య'ని ముత్తెఱఁగులు
గా నున్నది 13

**'స్వీయా' లక్షణం**

సంపత్కా
లమున విపత్కాలమ్మున
శీలమ్మును, నార్జవమ్ము
మొదలౌ సద్గుణములతో
ఎన్నడు నాయకుని విడువ-
కుండునట్టి వనిత స్వీయ. 14

ఆమె ముగ్ధ, మధ్య, ప్రగ
ల్భ లనెడు మూడు రీతులలో
గోచరించు 15 అ

**'ముగ్ధ' లక్షణం**

మదన విహా
రమ్మునందు నవవనితగ,
మదనక్రీడల నస్వా
ధీన పోల్కి, గాఢమైన
లజ్జాన్విత యట్టులుగా,
కోపవేళ సుస్తిమితగ,
నాయకుడపరాధి అయిన
రోదన గావిస్తు, చూస్తు
ఉండునదియు, రతి వ్యాపా
రము యత్నమ్మును చేస్తూ

హితముల – నహితముల తెలియ
జెప్పక వర్తించు వనిత
యై ఎవ్వతె ఉంటుందో
ఆమె 'ముగ్ధ' నాయిక యౌ
15ఆ–17అ

**మధ్యలక్షణం**

లజ్జా కామములు సమా
నముగ గల్గినట్టిదియును
వృద్ధి నొందుచున్న యౌవ
నమ్ము గలది, మోహవ్యా
పార మధ్య మందు సురత
యోగ్యత గలిగిన యట్టిది
తన నాయకు మోహించే
గుణము గల్గినట్టిదియును
'మధ్య' అనే నాయిక యౌ. 17ఆ

మాన మనే కోప వ్యా
పారము చే 'ధీర', 'అధీ
ర'యు, 'ధీరా ధీర' అంటు
మధ్య అన్న ఈ నాయిక
ముత్తెరగుల భేదాలతో
వర్తిస్తూ కనుపించును 18

**మానలక్షణం**

నాయకాపరాధము తెలి
సిన పిమ్మట కలుగు మనో
వ్యాపార విశేషమ్మే
'మాన' మంటు పేరుపొందె 19అ

ఆ మానము, 'లఘు మానము'
'మధ్య మానమును 'గురు మా
నమ్ము' అనే మూడు విభే
దాల నొందె 19ఆ

**లఘుమాన లక్షణం**

అన్యస్త్రీ
దర్శనమ్ము ఇత్యాదుల
వల్ల కలుగు కోపము 'లఘు
మాన'మ్మని పేరు నొందె
మంచిమాట లిత్యాదుల
వలన నిట్టి మానమ్మును
తొలగింపంగా వచ్చును. 20

**మధ్యమాన లక్షణం**

నాయకుతో సరసపు స
ల్లాపమ్మును జరుపుచుండు
సమయంలో అన్య స్త్రీ
నామము చెప్పుటచే
కలుగు మనో వ్యాపారము
'మధ్యమాన' మనబడును.
ఈ మానం ప్రమాణాన్ని
గావించుట ఇత్యాదుల
అనుసరించటమ్ము చేత
తొలగింపంగా వచ్చును. 21

**'గురుమాన' లక్షణం**

నాయకు కడ అన్యస్త్రీ
సంభోగపు గుర్తులు మొద
లైన వాటివల్ల కల్గు
చిత్తా వేగము 'గురు మా
న'మ్మని పిలువంగా బడు
ఈ మానం నమస్కార
మొనరించుట, అనునయించు
టిత్యాదుల మూలంగా
తొలగింపగ సాధ్యమౌను 22

**'ధీర మధ్యా అధీర 'మధ్యా' లక్షణం**

అపరాధై ఉన్న నాయ
కుని చూస్తూ సాభిప్రా
యముగా వంకర మాటలు
పలుకునట్టి సీమంతిని
'మధ్యాధీర' యను నాయిక. 23అ

అపరాధై ఉన్న నాయ
కుని క్రూరములైన పల్కు
లాడి భేద పరచు వనిత
'మధ్యాధీర'యను నాయిక 23 ఆ

**'మధ్యాధీరాధీర' లక్షణం**

కన్నీ రొలికే రీతిగ
నాయకు కడు క్రూరపు పలు
కులు పలికే నాయిక 'మ
ధ్యాధీరాధీర' అనే
నాయిక అనిపించుకొనును 24 అ

**'ప్రగల్భా' లక్షణం**

నిండు యౌవనముచే మది
యించి నట్టిదిగను మదన
వ్యాపారము లందును పా
రంగతు రాలుగ నుండెడి
అంగన 'ప్రగల్భ' అను నాయిక
24 ఆ

రతి లీలను నాయకాంగ
లీన వోలె యత్నపడును
క్రీడారంభములోనే
సౌఖ్యమూర్ఛ పొందుతుంది. 25

ఆ ప్రగల్భనాయిక మా
నవ్యాపారమ్ము చేత
ధీరాది విభేదమ్ముల
మూడింటిని పొందుతుంది 26 అ

**'ప్రగల్భాధీరా'**

కపట మానసము గలదీ,
అపరాధిగ నున్న నాయ
కుని యందున ప్రేమతోటి
రతి విషయములం దుపేక్ష
చేసేదీ అయిన పడతి
'ప్రగల్భాధీర' యనబడును 26 ఆ

**'ప్రగల్భాఅధీరా'**

అపరాధిగ నున్న నాయ-
కుని మిక్కిలి బెదరిస్తూ
కొట్టునది 'ప్రగల్భ-అధీర'
యను నాయిక ఔతుంది. 27అ

**'ప్రగల్భాధీరాధీరా'**

అపరాధిగ నున్న నాయ-
కుని యందు రతి వ్యాపా-
రాన ఉపేక్షను వహించు
నదియును, బెదరింపు, తిట్లు,
కొట్టటమ్ము కలిగినదియు
నైన వారి 'ప్రగల్భా-
ధీరాధీరా' నాయిక
అని చెప్పగ బడుతున్నది. 27 ఆ

ముందు చెప్పినట్టు 'మధ్య'
'ప్రగల్భ'లందు జ్యేష్ఠ - కని-
ష్ఠలు అని చెప్పంగ బడెడు
రెండు భేదములు ఉన్నవి. 28 అ

**'జ్యేష్ఠాకనిష్ఠా' లక్షణం**

నాయకునకు ఎవతె యందు
ప్రేమ అధికముగ ఉండునో
ఆమె 'జ్యేష్ఠ' అనబడును. 28 ఆ

ప్రేమ ఎవతె యందల్పమొ
ఆయమను 'కనిష్ఠ'ందురు.
మధ్యాప్రగల్భ నాయి
కలు కన పండ్రెండు విధము
లంటూ, 'ముగ్ధ' ఏకమైన
విధము కల్గినదె అంటూ
చెప్పబడియె. 29

ఈ చెప్పిన రీతి ప్రకారమ్ము మొదట
తెలుపబడిన 'స్వీయ' అనే
నాయిక పదమూడు విధము
లవుతున్నది. 30 అ

**'పరకీయా' లక్షణం**

పరపురుషుల-
యందు కలుగు ఇచ్ఛా వ్యా-
పారమ్ముల మఱుగు పరచు-
టందు దత్త చిత్త అయిన
నాయి కౌను 'పరకీయ'. 30 ఆ

అంటూ భరతాగమవే
త్తలు తెలిపిరి. 'కన్య' 'పరోఢ'
యనెడి రెండు భేదాలతో
వర్తిస్తుందీ 'పరోఢ' 31

**'పరకీయాకన్యా' లక్షణం**

చతురగాదు
యౌవన మధ్యస్థ యౌను
లజ్జావతి, మాతాపిత-
రులచేతను, పోషింపం-

గా బడునది, చెలుల తోటి
విహరించే వేళలందు
ప్రియురాలుగ, ప్రియునియందు
'ముగ్ధ' గుణము గలిగినట్టి
దానివోలె వర్తిలు పర
కీయా కన్యకా నాయిక 32

## పరకీయా పరోఢా లక్షణం

ప్రియుని చేత పెండ్లాడగ
బడినదనియును పెనిమిటి మది
కిని సరియౌ నడత గల్గి
నదియును గృహకృత్యాల
ల్లో సమర్థురాలివలె
ఉన్నను పరపురుష సంగ
మమ్ము నందు నాసక్తిగ
లది పరకీయా పరోఢ 33

## 'సామాన్యా నాయికా' లక్షణం

సంగీతము, అభినయమ్ము
మొదలౌ పలు విద్యలలో
ప్రాగల్భ్యము, ధైర్యమ్మును
గలదిగాను, అర్థాశచె
జనులయందు అనురాగము
గలదిగాను ఉండునట్టి
నాయిక 'సామాన్య' ఔను 34
ఇదే 'గణిక' నాయకుండు
గుణవంతుడు అయ్యు ధనా
గమనము లేనట్టివాని
పైన ప్రేమ 'సామాన్య'కు
కలుగ దెపుడు. ధనాగమన-
మున్నవారు భగ్న కాము
లైన బాలురయినను, పా-
షండులైన, షండులయిన
వారిపైన ప్రేమ ఉన్న
దాని వలెనె ప్రవర్తించి
వారిని సంతోషపరచు 35
చెప్పబడినవారు కపట
మెఱుగనట్టి వారు గాను
ఉండవలెను. ధనరహితుల
తరిమికొట్టగలదు 'గణిక'.
ఈమెకు దౌత్యాదులైన
గుణములు ఉపయోగిస్తవి. 36

## 'శృంగారవస్థా' భేదములు

పదునారుగు రౌ నీనా
యికలకు శృంగారావ
స్థా భేదమ్ముల చేతను,
ఒక్కొకతెకు ఎనిమిది విధ
ముల భేదమ్ములు చెప్పం
గాబడినవి 37

## అష్టవిధనాయికా నిరూపణ

'స్వాధీన పతిక'
'వాసక సజ్జిక', 'విర

హోత్కంఠిత', 'విప్రలబ్ధ'
'ఖండిత', 'కలహాంతరితా' 38
'ప్రోషిత భర్తృక', 'అభిసా
రిక' అని పూర్వమ్ము చెప్ప
బడిన నాయికలలో ప్రతి
ఒక్కతెయును దశావిభే
దముగ నొక్క ఎనిమిది విధ-
ములుగ చెప్పబడు చుంద్రు. 39

**'స్వాధీనపతికా' నాయికా లక్షణం**

నాయకుచే ఎల్లప్పుడు
సంతోషము పొందునట్లు
గావింపగబడునది 'స్వా-
ధీన పతిక' ఈమె వ్యా-
పారము మన్మథ పూజా-
మహోత్సవ మిత్యాదులు,
వన విహార జలనృత్య
క్రీడలు, పుష్పాపచయము
మొదలైనవి. 40, 41 అ

**'వాసకసజ్జికా నాయికా' లక్షణ**

ప్రియుడు వచ్చు
సమయానికి అలంకరణ
చేసుకొని కేళీగృహ
మును అందముగా నొనర్చి
సిద్ధముగా నుండునట్టి
నాయిక 'వాసక సజ్జిక'

ఈమెకు వ్యాపారమ్ములు
నాయక సంసర్గ మనో
భీష్టమ్మును యోజించుట,
సకియలతో వినోదాలు
సలుపటమ్ము, దూతిక నడు
గడుగునందు సాభిప్రా
యమ్ముగాను తిలకించుట
నాయకు డేతెంచు మార్గ
మును జూచుట మొదలైనవి.
41 ఆ, 42,43

**'విరహోత్కంఠితా' నాయికా లక్షణం**

నిరపరాధి యౌ ప్రియుండు
వచ్చుటలో జాగుచేయ
కాలవిలంబనము నోర్వ
గాజాలక యెదురు చూచు
నాయిక 'విరహోత్కంఠిత' 44
ఈయమ వ్యాపారమ్ములు
సంతాపము, దేహము కం
పము నొందుట, అల్పత్వం
వహియించుట వ్యాపారాం
తరములపై ప్రీతి లేక
వర్తించుట, కన్నీరును
విడుచుచుంట, తన యవస్థ
సఖులకు తెల్పుట మొదలై
నవి ఎన్నో ఉన్నాయి 45

**'విప్రలబ్ధా' నాయికా లక్షణం**

ఒక చోటును సంకేత
స్థానముగా జెప్పి అచట
ఆమె నాయకుని చేతను
వంచితయై మన్మథపీ
డితురాలుగ నున్న వనిత
'విప్రలబ్ధ' 46

ఈమె వ్యాపారమ్ములు నిర్వేదము,
చింత, ఖేదమును, దీనత,
కన్నీరును, నిట్టూర్పులు
విడుచుటయును, మూర్ఛనొందు
చుంట అనే కృత్యమ్ములు
మొదలైనవి 47

**'ఖండితా' నాయికా లక్షణం**

సంకేతిం-
చిన సమయం దాటవేసి
పరనార్యుపభోగ చిహ్నా
ములతో ప్రాతర్వేళను
వచ్చునట్టి నాయకు గల
నాయిక ఖండిత యనబడు
నిట్టూర్పులు విడుచుటయును
పలుకకుంట, కన్నీరును
కార్చుటయును, ఖేదపడుట
భ్రమియించుట, మూల్గుట మొద
లైనట్టివి ఖండిత వ్యా-
పారమ్ములు 49

**'కలహాంతరితా' లక్షణం**

సఖుల యెదుట
పదపతితుండయిన నాయ
కుని నిరాకరించి పిదప నెంతో
పరితాపము నొందునట్టి
నాయిక కలహాంతరిత 50

ఆమెవి వ్యాపారమ్ములు
నిట్టూర్పులు, విడుచుటయును,
భ్రమియించుట మనస్తాప
మును పొందుట, స్తంభము మొద
లౌ సాధ్వస భావమ్ములు
కలుగుటయును మాటిమాటి
కిని పంపించుట మొదలై
నట్టివియును నై యున్నవి 51

**'ప్రోషితభర్తృకా' లక్షణం**

నాయకుండు దేశాంతర-
మున జేరిన కాలమ్మున
ఖేదమునొందెడు స్త్రీ ప్రో-
షిత భర్తృక. ఈయమ వ్యా-
పారమ్ములు నిద్రారా-
హిత్యమ్మును, కృశియించుట,
ప్రియుడెన్నాళ్ళకు వస్తా-
డని శకునాలను చూచుట 52

మలినురాలుగా నుండుట
ఎచట నిల్చునో అచ్చట
నిల్వకుంట, నిరతమ్మును
శయ్యపైన వసియించుట,
ఏమియు తోచని రీతిగ
వర్తించుట, చింత వడుట
అని పెద్దలు చెప్పుచుంద్రు. 53

**'అభిసారికా నాయికా' లక్షణం**

మదనానల సంతప్తయి
ఎవ్వతె తన స్థానానికి
నాయకు డేతెంచునట్లు
చేస్తుందో, లేక తానే
తన నాయకుడుండు చోటు
కేగు తుందో ఆవనితయె
'అభిసారిక'. సంతాపము
నొందుచుంట, చింతించుట,
మొదలైనవి ఈయమ సమ
యోచితమ్ములయినవి వ్యా
పారమ్ములు. 54

ముందు చెప్పి
నట్టి నూట యిరువదియె
న్మిది భేదములున్నయట్టి
నాయిక లుత్తమ మధ్యా
ధమ భేదములను మూటిని
కలిగి యుండు 55

**'ఉత్తమా' నాయికా లక్షణం**

నాయకు డహి
తమ్ము చేస్తు ఉండంగా
ఏ నాయిక అతనికి ప్రియ
ముగ వర్తిస్తుంటుందో,
ఏ నాయిక అపరాధము
గావించిన యట్టి వల్ల
భుని వీక్షణ చేసి ఊర
కుంటుందో ఆయమ ఉ
త్తమలక్షణ యౌ నాయిక. 56

**'మధ్యమ'నాయికా లక్షణం**

నాయకు డిచ్ఛించిన తా
నిచ్ఛించుట, ఆతడు కో
పించ తాను కోపించుట,
అతడు, సత్యమును పలికిన
తాను సత్యమును పలుకుట,
ఆతడు అపరాధమ్మును
చేసినచో తా నపరా
ధము చేయుట, ఆతడు స్నే
హించెనేని తానును స్నే
హము చేయుట ఇట్లా గుణము
లెవతె కలిగి ఉంటుందో
ఆయమ 'మధ్యమ' నాయిక
57, 58

## ‘అధమా నాయికా’ లక్షణం

ఏ నాయిక కారణ రహి-
తమ్ముగాను కోపించునొ
ఏ నాయిక ప్రార్థన చే-
సినను కోపమును విడువదొ
చక్కని వాడయిన రూప-
రహితు డయిన, గుణవంతు
డైన అగుణుడైన వృద్ధు
డయిన తరుణుడయిన నెట్టి
వానినైన ఎవ్వతె ఇ-
చ్ఛిస్తుందో నాయకుగా,
ఈర్ష్యాక్రోధాల, వ్యసన
ముల నెవ్వతె కలిగియుండు,
ఆమె ‘అధమ’ నాయిక అని
పేరొందెను. 59, 60

## నాయికా సంఖ్యా ప్రకరణం

పదమూడు విధాలు గలది
‘స్వీయ’ రెండు విధాలు పర
కీయ’వి – ‘సామాన్య’ దొక్క
విధమె – ఈ పదారునాయి
కల కెనిమిది ప్రత్యేకా
వస్థలు కలుగుట చేతను
నూరుపైన నిర్వది ఎ
న్మిది భేదమ్ములు గలవా
రై ఉత్తమమును మొదలొ
భేదాలను మూడునూర్ల
ఎనుబది నాలుగు భేదము
లను గల్గిన వారౌదురు. 61, 62

## ‘దూత్యాదుల’ నిరూపణ

దూతి, దాసి, సఖియ, చేటి
ధాత్రేయియు, ప్రాతివేశి
నియు, లింగిని, శిల్పిని మొద
లయినవారు నాయికలకు
సహకరించునట్టి వారు 63

## ‘శృంగార నాయికా’ నిరూపణ

పతి, ఉపపతి, వైశికుండు
అను ముప్వురు స్వీయయు, పర
కీయయు, ‘సామాన్య’ అన్న
ముప్వురు నాయికలకు నా
యకు లౌదురు. 64

## పతి లక్షణం

ఏ పురుషుడు వేదశాస్త్ర-
ములు ఆదేశించినట్టి
పద్ధతిలో ఒక తన్విని
పాణిగ్రహణ మ్మొనర్చు
కుంటాడో ఆ వనితకు
అతడే పతి అని ‘విద్వాం
సులు శాస్త్రాలలో ఉన్నట్లు
తెలిపినారు 65

**'ఉపపతి' లక్షణం**

అన్య వనిత
నెన్నో ఉపాయాల నాస
పెట్టి ఎవ్వ డనుభవించు
ఆతండుపపతి ఆమెకు 66

**'వైశిక' లక్షణం**

బహువేశ్యల ఉపభోగిం
చుట చేతను గౌరవమ్ము
నార్జించిన యట్టివాడు,
అర్థవ్యయ మొనరించెడు
నట్టివాడు విలాసమ్ము
గల్గువాడు ఎక్కడ ఉం-
టాడో అతడు వైశికుండు. 67

**చతుర్విధ, శృంగార నాయకులు**

అనుకూలుడు, దక్షిణుండు
'ధృష్టుడు', 'శఠు' డౌ విడివిడి
నలురీతులు శృంగార ర
సాన్వితులౌ నాయకాళి 68

**అనుకూల నాయక లక్షణం**

ఇతర స్త్రీలను జూచుట
మొదలౌ వ్యాపారమ్ములు
లేనివాడు స్వస్త్రీపై
ప్రేమగల్గి ఉండువాడు
అయి ఉండేవాడెవడో
అతని 'అనుకూలు'డంటు
తెలుపుతారు 69

**'దక్షిణ నాయక' లక్షణం**

తనను ఆశ్ర
యించినట్టి పలు స్త్రీలను
తుల్యముగా ప్రేమిస్తూ
నిరతమ్మును గౌరవమ్ము
నొందుచుండు నట్టివాని
'దక్షిణ' నాయకు డందురు 70

**'ధృష్ట' నాయక లక్షణం**

ఎవ్వడు తన అపరాధము
నాయికచే ఎరుగబడిన
భయరహితుడుగా ఉండునొ,
తొలగించిన ఎవ్వడు తొల
గండొ, ఎవ్వ డా నాయిక
నే వేగంగా నమస్సు
లర్పణగా వించుటయును
అన్యోపాయాల చేత
అనుసరించు నాతడు
'ధృష్టుండ'నబడు 71

**'శఠనాయక' లక్షణం**

తనపై అను
రాగము గల ప్రియురాలికి
గూఢముగా ఎవడహితం
చేస్తాడో అతడు శఠుడు 72

**‘చతుర్విధ సహాయకులు’**

తొల్లి తెలియజేసిన శృం-
గార నాయకులకు సహా
యకులు వీరు - పీటమర్దు-
డును, విటుండు, చేటుడును, వి
దూషకుండు అనునల్వురు 73

**‘పీఠమర్దాది’ లక్షణం**

నాయకునకు కొంత క్రింద-
ఉండువాడు ‘పీఠమర్ద -
నుండు’, ‘విటుడు’ కామశాస్త్ర-
మందెంతో ప్రవీణుండు.
నాయికకును - నాయకునుకు
సంధి జేయునట్టివాడు
‘చేటుడు’ ఆ ‘విదూషకుండు’
హాస్యమ్మున కడు ముఖ్యుడు. 74

**‘ఉద్దీపన విభావ’ నిరూపణ**

ఆలంబన విభావాన్ని
ఆశ్రయమొందిన గుణాలు
చేష్ట, అలంకృతులు మూడు
తటస్థాలు కూడగ ఉ
ద్దీపన విభావము నలు-
తెఱగులుగా బరగుచుండు. 75

**‘ఆలంబన’ గుణాలు**

యౌవనమ్ము, రూపము, లా
వణ్యము, సౌందర్యము, అభి
రూపత్వము, సౌకుమార్య
మివి ఆలంబన గుణములు 76

**‘యౌవన’ నిరూపణ**

స్త్రీ లందరికిని యౌవన
మొక్క మూడు తెరగు లౌను
ఆ ఆ యౌవన చేష్టలు
వేరు వేరుగా ఉంటవి

**ప్రథమ యౌవన లక్షణం**

కించి చ్చపలమ్ములైన
కడగండ్లను గలదిగాను
మదనునిచే వికాసమ్ము
నొందిన ముఖ పంకజమ్ము
గలదిగాను, గర్వముచే
గలిగినట్టి రజోగంధ
యుత వోలెను, పూర్తి అయిన
ఎఱుపు లేని పెదవులు గలి
గినది గాను, 78

**లావణ్య ప్రకాశనము**

మనోహరము అయిన
శరీరమ్ము గలది
గాను, భావసౌరభమ్ము
గలదిగాను, వృద్ధి నొందు
మొలకు చనులు గలదిగాను
చక్కగ నేర్పడని యట్టి

అంగమ్ముల సంధులు గల
యట్టిదిగను, ఎది ఉండునొ 79

అది తొలి యౌవన మనబడును
తొలి యౌవన లక్షణమ్ము
గల నాయిక మృదు స్పర్శ
నపేక్షించు ఉచ్చ రతి
సహింపలేదు 80

**సఖులతోడ ఆడుకొంట మహాప్రీతి**

తన్ను తా నలంకరించు
కొనుట యన్న నెంతో ప్రియము,
సవతిని చూచుట మొదలౌ
కృత్యము లన కోప హర్ష
ములు లేనిదిగా నుండుట 81

ప్రియుని యందు అధిక లజ్జ
లేకుండుట, రతి యందున
భయము నొందుచుంట అనెడి
ఈ గుణాలు కలిగి ఉండు. 82

**'ద్వితీయ యౌవన' లక్షణం**

పెద్ద చనులు, సన్ననైన
యట్టి నడుము, రక్తవర్ణ
పాదమ్ములు, హస్తమ్ములు 82 ఆ

ఏనుగు - తొండమ్ము వంటి
తొడలు, ఎంతో ఎఱుక పడే
అంగసంధి గల దేహము
విపుల నితంబమ్ము, గభీ
రంపు నాభి, ఘనమౌ జఘ
నప్రదేశమును, ప్రకాశ
శోభితమౌ రోమరాజి,
అంగ ప్రత్యంగమ్ముల
చక్కదనమున గలిగినదై
ఉంటుం దా ద్వితీయ మౌ
యౌవన మని తెలుసుకొనుడు.
ఈ యౌవనమును పొందిన
నాయిక తన మనోభావ
ములు తెలిసిన సఖులయందు
తఱుచ ప్రీతి గలదిగాను,
సమాధాన వచనాలకు
తృప్తిపడని దానిగాను
సవతులం దసూయ గలది
గాను తప్పిదాల నోర్వ
నట్టిదిగాను, ప్రణయ కలహ
మందు ఈర్ష్య కలదిగాను
రతికేళుల లోన స్థిమిత-
గా నుండక ఏకాంతము-
నంద మహాగర్వముతో
వ్యవహరించునదిగ ఉండు
83-86

**'తృతీయ యౌవన' లక్షణం**

కన్నులలో తేట మారి
నట్టిదియును, చెక్కిళ్ళలో

వాడినదియు, దేహకాంతి
తప్పినదియు, కఠినమైన
స్పర్శగలదిగాను, దేహ-
పటుత్వమ్ము కొంత తప్పి-
పోయినట్టి దానిగాను
అధరరక్త వర్ణ మధిక-
మైనదిగను ఏది ఉండు-
నో అది మూడో యౌవన-
మై ఉన్నది. ఈ యౌవన
మును కలిగిన దౌ నాయిక
వ్యాపారా లిట్లుంటవి.
రతితంత్రము లందు విశే
షములౌ చాతుర్యమ్ములు,
నాయకు విడువక యుండుట
నాయకు స్వాధీను చేసు
కొనుట యందు పాండిత్యము
నాయకాపరాధమ్ముల
యం దసూయ లేకుండుట,
సవతులందు మాత్సర్యము
లేకయుంట మొదలైనవి. 87-89

## యౌవనములు - శృంగారయోగ్యత

త్రివిధము లౌ యౌవనముల
యందు మొదటి రెండు యౌవ
నములకె రసముల చే సం
తోషపరచు హేతువైన
శృంగారపు యోగ్యతుంది
ఈ యోగ్యత మూడవ దౌ
దానికేమి కనుపట్టదు 90

## 'రూపలక్షణం'

అంగమ్ములు తగిన భూష-
ణాలచే నలంకరింప
బడకుండానే అలంక-
రింప బడిన రీతి దేని
వల్ల ప్రకాశిస్తాయో
అద్ది రూపమనబడును. 91

## లావణ్య లక్షణం

ముక్తాఫలముల లోపలి
తారళ్యం వలె అవయవ
ములయందే కాంతి ప్రకా
శించునో అది లావణ్యం 92

## 'సౌందర్య లక్షణం'

అంగ ప్రత్యంగమ్ముల
అందమైన సంధిబంధ-
మును గల్గిన యట్టి యథో-
చితమౌ, సన్నివేశమ్ము
'సౌందర్యం' అని అనబడు 93

## ఆభిరూప్య లక్షణం

ఆత్మీయ గుణాధిక్యత
వలన తన సమీపంలో

ఉండునట్టి వస్తువునకు
తన సారూప్యమును గలుగ
జేసెడు నది 'ఆభిరూప్య'-
మనబడును 94

**మార్దవ లక్షణం**

దేహము అం-
టం బడియును అంటంబడ-
నట్టి దానివలె నుండెడు-
నట్టి దౌను మార్దవమ్ము 95 అ

**సౌకుమార్య లక్షణం**

అంగమ్ములయందు కోమ
లము లౌ వస్తువుల స్పర్శ
నోర్వజాల కుండట సౌ
కుమార్యము 95 అ

ఇది 'ఉత్తమ'
'మధ్య' 'మాధ్యము' లని ము
త్తెఱగు లౌను 96 అ

**ఉత్తమ సౌకుమార్యాలు**

ఏ గుణమ్ము-
చే అంగము పుష్పాదులు
అయినవాని స్పర్శ సైత-
మును సహింప లేదో అది
'ఉత్తమ సౌకుమార్యమ్ము' 96 ఆ

ఏ గుణము చే అంగము
కర స్పర్శ సహియింపగ
లేదో అది మధ్యమ మౌ
సౌకుమార్య మై ఉన్నది. 97 అ

ఏ గుణముచె దేహమెడ
మొదలౌ వానిని సహింప
శక్తిలేని దౌతుందో
అద్ది అధమ 'సౌకుమార్య'
మౌతుందని తెలుసుకొమ్ము 97ఆ

**చేష్టలు**

యౌవనమ్ము వ్యాప్తి నొంద
కలిగెడు కడగంటి చూపు
లిత్యాదులు చేష్టలంటు
చెప్పబడును. 98 అ

**చతురలంకృత్యాదులు**

వస్త్రమ్ములు
భూషణాలు, పుష్పమ్ములు
మైపూత, లలంకారము
లును నాలుగు విధము లౌను
98 ఆ

**తటస్థో ద్దీపనాలు**

చంద్రిక కాధారాలౌ
గృహములు చంద్రోదయమ్ము
మొదలయినవి, కోయిలలతో

నిండినవి రసాల తరులు,
మందమారుతమ్ము తిరుగు
భ్రమరమ్ములు, లతా మంట-
పములను, భూ గేహము, దీ-
ర్ఘికలు, మేఘనాదము, ప్రా-
సాదమధ్యమము, సంగీ-
తము, క్రీడాదులు, సెలయే-
ఱులు, ఇత్యాదులు ఉపభో-
గోపయోగ వస్తువులు, త-
టస్థోద్దీపనములు ఇవి
కాలో చితముగ నూహిం-
చుకొనంగా వలసినయవి
99-101 అ

**అనుభావ లక్షణం**

స్వహేతువులయిన మనో
ద్దేశమ్ములు ప్రత్యక్షము
వోలె నెవ్వి బయలు పఱచు
అవి అనుభావములనబడు
101 ఆ

ఇవి చిత్తజానుభావ-
ములును, గాత్ర జానుభావ
ములు వాక్ప్రారంభపు అను
భావమ్ములు, బుధ్యారం-
భాను భావములు అని నలు
విధము లౌను. 102

**చిత్రజానుభావాలు**

ఆ నలువిధ
ముల అనుభావాల యందు
భావము, హావమ్ము, హేల,
శోభ, కాంతి, దీప్తి పిదప -
ప్రాగల్భ్యము మాధుర్యము,
ధైర్యము, నౌదార్యములను
వాని చిత్తజానుభావ-
ములు' అని అనెదరు పెద్దలు. 103

**'భావలక్షణం'**

వికారమ్ము లేని మాన-
సిక విక్రియ 'భావ'మ్మని
అనబడును. అది గ్రీవా-
రేచక సంయుక్తమ్మై
భ్రూనేత్రాదుల యందు వి
కాసమ్మును కలుగుజేయు. 104

**'హావ, హేలా' లక్షణాలు**

ఆ భావము నేత్రాదుల
వలన కొంత ప్రకాశించు
నేని అద్ది హావమ్మని
చెప్పబడును 105 అ
లలితమ్ముగు
అభినయ రూపమును పొంది
ఆ భావమె 'హేల' అనం
గా బడును 105 ఆ

**శోభాకాంతి లక్షణాలు**

రూపముచే
భూషాదుల దేహమ్ము న
లంకరించుకొనుట 'శోభ'
అనబడును. 106 ఆ

శోభయె మన్మథ విషయ తృప్తిని
కలిగించుట యందు ప్రకా
శించెనేని అద్ది 'కాంతి'
అనబడును. 106 ఆ

**దీప్తి లక్షణం**

అట్టి కాంతె
వయో భోగ దేశ కాల
గుణములు మొదలైనవాని
చేత నెంతో అధికమైన
దయిన 'దీప్తి' అనబడును 107

**ప్రాగల్భ్య, మాధుర్య, ధైర్య, ఔదార్యాల లక్షణం**

ప్రయోగాల యందుని-
శ్శంకవృత్తి 'ప్రాగల్భ్యము' 108 అ
సర్వావస్థలకు జెందు
మృదుత్వమ్ము 'మాధుర్యము'
అని అనబడు 108 ఆ

దృఢము అయిన
చిత్తవృత్తి 'ధైర్య'మ్మని
అనబడును 109 ఆ

సర్వావస్థలను అనుసరించు
వినయ
'మౌదార్య'మ్మని అనబడు 109 ఆ

**స్త్రీల గాత్రజానుభావాలు**

లీల, విలాసము, విచ్ఛి
త్తియు, విభ్రమమును, కిలికిం
చితమును, మోట్టాయితమ్ము,
కుట్టమితము, బిబ్బోకము
లలితము, విహృతమను పది
స్త్రీల గాత్ర జానుభావ
ములు అనబడు 110, 111 అ

**'లీలా'లక్షణం**

మధురాలా-
పము మొదలౌ చేష్టలచే
తన నాయకు ననుసరించు 111ఆ
టనియెడు పని 'లీ' లనబడు
112అ

**విలాస లక్షణం**

నాయకు డేతెంచెడు సమ-
యమ్ము నందు కనుబొమ్మలు
కనులు, ముఖము, వీనిచేత
అప్పుడు కలిగే విశేష-
మేదో అది 'విలాసమ్ము'.
112 ఆ 113 అ

**'విచ్ఛిత్తి' లక్షణం**

అలంకార విన్యాసా-
నికి సమమై మెరయుచుండ
నది 'విచ్ఛిత్తి' అనగా బడు.
113 ఆ

**విభ్రమ లక్షణం**

ప్రియుడు వచ్చు సమయానికి
మన్మథు నావేశ సంభ్ర-
మము చేతను గంధము, హా-
రము మొదలౌ భూషా స్థా-
నపు విపర్యయము 'విభ్రమ'
మని అనబడు. 114

**కిలికించిత లక్షణం**

శోకము, కో
పము, కన్నీరును సంతస
ముల కూడిక 'కిలికించిత'
మని అనబడు, 115 అ

**మొట్టాయిత లక్షణం**

తన అపేక్ష
తెలుపుట 'మొట్టాయిత' మని
అనబడును. 115 ఆ

**'కుట్టమిత' లక్షణం**

రతికాలము-
నందు ఉవిద - కొప్పును, అధ
రము మొదలౌ వానికి చెం
దిన గ్రహణమునను మదిలో
సంతోషము గలదైనా
బయటికి దుఃఖిత పోలిక
కనుపించుట 'కుట్టమితము'. 116

**'బిబ్బోక' లక్షణం**

గర్వమునను ప్రియవస్తువు
మీద కొంత అనాదరణ
వహియించుట 'బిబ్బోకము'.
117 అ

**'లలిత' లక్షణం**

అంగమ్ముల విన్యాసపు
భంగిమ లందలి వైచి-
త్ర్యములు, మనోహరము లైన
భ్రూవిలాసములు సుకుమా
రమ్ము లౌటయే' లలితము.
117ఆ 118 అ

**'విహృత' లక్షణం**

ఈర్ష్య చేత గాని లేక
క్రోధముచే గాని సిగ్గు
చేతగాని తగినపాటి
ఉత్తరమీయకను క్రియల
మూలంగా వెల్లడింప
అది 'విహృత' మనబడును.
118ఆ 119అ

**'వాగారంభానువాదాల' నిరూపణ**

ఆలాపము, విలాపమ్ము,
సల్లాసము, ప్రలాపమ్ము,
అనులాపము అపలాపము
సందేశము, అతిదేశక
మును, నిర్దేశము అపదే
శము, వ్యపదేశము, ఉపదే
శమ్మను నీ పన్నెండును
వాగారంభానుభావ
ములు అనబడు.

119 ఆ, 120, 121 అ

**'ఆలాప-విలాప' లక్షణం**

వీటిలోన
సంతోషపు మాట ఔను
'ఆలాపము' దుఃఖముచే
కలుగు పలుకు 'విలాపమ్ము'.

21 ఆ

**'సల్లాప ప్రలాప అనులాప' లక్షణం**

ఉక్తి ప్రత్యుక్తు లున్న
యట్టి మాట 'సల్లాపము' 122 అ
ఉపయోగము లేని మాట
'ప్రలాపమ్ము' చెప్పిన మా-
టను చెప్పుట 'అనులాపము'

122 ఆ

**'అపలాప, సందేశ, అతిదేశ' లక్షణం**

తొలుత చెప్పినట్టి మాట
మఱియొక విధముగ త్రిప్పుట
'అపలాపము' 123 అ.

ఊరికి పోయిన నాయకునకు
తన సం-
గతుల సఖులచే తెలుపుట
'సందేశము'. 123 ఆ

నేను చెప్పినవె ఆతడు చెప్పినట్టి
మాటలనుట 'అతిదేశము' 124 అ

వాడు, వీడు, వీడు, నేను
మొదలౌ పలుకులు 'నిర్దే
శము'లని అనబడుతుండును.

124ఆ

**'అపదేశ ఉపదేశ' లక్షణం**

అర్థాంతరముతో తెలియగ
జేయు 'పలుకు' 'అపదేశము'

125 అ

శిష్యులకోసము ఆచా
ర్యుల చేతను చెప్పబడే
పలు 'కుపదేశ' మ్మనబడు 125 ఆ

**'వ్యపదేశ' లక్షణం**

ఇతర వ్యాజము ద్వారా
తన కోర్కెను తెలుపుట 'వ్యప
దేశ' మ్మని అనబడును. 126 అ

**'బుధ్యారంభానుభావ', నిరూపణ**

ఈ బుద్ధ్యారంభపు అను
భావమ్ములు రీతి, వృత్తి
మరి ప్రవృత్తి అనెడి మూడు
తెఱగు లౌను (126ఆ)
ఇవి ప్రబంధములు మొదలౌ
వానియందు
భావశాస్త్ర విజ్ఞులచే
నెఱుగంగా దగినట్టివి 127 అ

**'సాత్విక భావముల' నిరూపణ**

ఇతరుల సుఖదుఃఖమ్ములు
మొదలౌ భావమ్ములందు
ఆనుకూల్యతతో కృతభా
వనమై ఏ మనసు ప్రవ-
ర్తిస్తున్నదో అది సత్వ మనం
బడుతున్నది. అందునుండి
పుట్టెడు భావములు 'సాత్వి-
కమ్ము' లౌను. అవి 'స్తంబ'
మ్మని 'స్వేద'మ్మని 'రోమాం
చ'మ్మని 'స్వర భేద'మ్మని
'వేపథు'వని 'వైవర్ణ్యం'
అనియు 'అశ్రు' వనియును ప్రళ-
127ఆ
యమ్మనియును నొక ఎన్మిది
128,129

అని పెద్దలు చెప్పుచుండ్రు-
130 ఆ

**'స్తంభ' లక్షణం**

స్తంభంబను సాత్విక భా-
వము, సంతోషము, భయమ్ము
కోపమ్ము, విషాదమ్మును,
అద్భుతమ్ము అనువానిచే
కలుగు నిష్క్రియాంగత్వము
130 ఆ 131 అ

**'స్వేద'లక్షణం**

ఉష్ణిమ, సంతోషము, వ్యా-
యామము, శ్రమ,
క్రోధము, భయ-
మిత్యాదులు చేతను స్వే-
దము కలుగును. అపుడు దాని
తుడుచుకొనుట, గాలినికో-
రుటయు, వ్యజనగ్రహణము మొద
లైనయట్టి అనుభావ
మ్ములు కలుగును 131 ఆ, 132

**రోమాంచ లక్షణం**

ఆశ్చర్యము,
ఉత్సాహము, సంతోషము,
ఇత్యాదుల చేతను 'రో-
మాంచము' సంప్రాప్తమౌను

అందు గగుర్పొడుచుట మొద-
లౌ వికారములు గలుగును. 133

**స్వరభేద లక్షణం**

సౌఖ్యము ఇత్యాదులచే
స్వరభేదము కలుగుతుంది.
డగ్గుత్తిక మొదలైనవి
ఇందు కలుగుతుంటాయి. 134 అ

**'వేపథువు' లక్షణం**

సంతోషము, బెదరించుట,
జ్వరము, క్రోధమును మొదలౌ-
వాని చేత జనిస్తుంది.
'వేపథువు' స్మరియించుట
దేహము కంపించుట మొద
లైన విందు కలుగుచుండు
134 ఆ 135 అ

**'వైవర్ణ్య' లక్షణం**

విషాదమ్ము ఇతరులందు
గల రోషము ఇత్యాదుల-
చే 'వైవర్ణ్యమ్ము' కలుగు,
ముఖతేజము మారుటయును
చిక్కటమ్ము మొదలైనవి, 135 ఆ
ఎన్నొ కొన్ని కలుగుతాయి
136 అ

**'అశ్రు'లక్షణం**

వ్యసనము, కోపము, సంతో
షము, ధూమము ఇత్యాదుల
చే 'నశ్రువు' ప్రాప్తించును
నేత్రజలము విదలించుట
నేత్రమ్ములు తుడుచుకొనుట
మొదలైనవి కలుగుతాయి.
136 ఆ 137 అ

**'ప్రళయ' లక్షణం**

'ప్రళయమ్మున సుఖ దుఃఖా
దుల చేతను కలిగెడు ప్ర
జ్ఞాభంగము, 137 ఆ

**'అనుభావ' సమాప్తి**

సత్వమూల-
ములు గనుకను వీనికి సా-
త్విక భావములని నామము,
భావానికి సత్సూచన
లిత్యాదులు 'అనుభావము'
లనబడును 137 ఆ
ఈ రీతిగ ద్వివిధమ్ములు
138, 139 అ

విభావమ్ము లనుభావము
లొకటి కొకటి కార్యకార-
ణపు భావములుగ భావ-

జ్ఞుల చేతను తెలియవలయు.

139 ఆ 140 అ

**'వ్యభిచారి' భావ నిరూపణ**

వాక్కు, దేహమును, సత్వము
వీటి తోటి గూడినవై
స్థాయికిని విశేషాభిము-
ఖాలుగ తిరిగే భావ
మ్ములు వ్యభిచారీ భావము-
లని యెరుంగగా వలయును.

140 ఆ, 141

**'సంచారీ' భావములు**

స్థాయిలుగా అవి బాగా
చరింపజేయుచున్నవిగా-
వున సంచారులు అనియును
చెప్పబడుతు ఉన్నాయి 142 అ
ఎట్టి భావములు స్థాయిలో
సముద్రాన అలలవోలె
దానిని పెంపొందజేసి
తద్రూపత పొందుచున్న-
వో అయ్యవి 'వ్యభిచారీ
భావమ్ములు' 142 ఆ, 143

**నిర్వేదాదులు**

నిర్వేదము,
గ్లాని, శంక, అసూయయు, మ-
దమ్ము, శ్రమయు, ఆలస్యము,
దైన్యమ్మును, చింత, మోహ
మును, ధృతియును, స్మృతియు
చపలత, హర్షము, ఆవే
శమ్ము, జడత, గర్వమ్ము, వి
షాదము, ఔత్సుక్యమ్మును,
నిద్ర, అపస్మారమ్మును
సుప్తి, విభోదమ్ము, అమ
ర్షము అవహిత్థము, ఉగ్రత,
మతియు, వ్యాధి, ఉన్మాదము
మరణము, త్రాసము, వితర్క
మును ముప్పది మూడును 'వ్యభి
చారీ' భావము లని చె-
ప్పంగ బడును

145 ఆ 146, 147ఆ

**నిర్వేద లక్షణం**

తత్వజ్ఞా
నము పేదఱికము, సంకట
మును, వియోగమును, దుఃఖము
ఇత్యాదుల వలన గలుగు
ఫలాభావమతి నిర్వే
దమ్మనబడు 147 ఆ, 148 అ

**గ్లాని లక్షణం**

మనోవ్యాధి,
శారీరకమౌ రోగము,

ముసలితనము, దప్పిక, వ్యా-
యామము, సురతము మొదలౌ
వానివల్ల గలుగునట్టి
దౌర్బల్యము 'గ్లాని' యంద్రు.
దేహము చిక్కుట, సన్నని
వచనమ్ములు, కళావిషయ
ములయందున నుత్సాహము
లేకయుంట, శారీరక
వైవర్ణ్యము, నయన భ్రమ-
ణమ్మును నిత్యాదులిందు
కలుగునట్టి వికారాలు

148 ఆ, 149

**'శంకా' లక్షణం**

చౌర్యా దపరాధమ్ముల-
చేతను, తన కహితమ్మును
ఉత్ప్రేక్షించుటయె శంక
వ్రీడ, ఇందు మాటిమాటికి పా-
ర్శ్వాలను వీక్షించుటయును,
ముఖశోషణ, అవకుంఠన,
వైవర్ణ్యము, కంఠానికి
గాద్గద్యము మొదలౌ చే
ష్టలు ఉన్నవి. 150, 151 అ

**'శంకా' భేదములు**

'స్వోత్థ శంక'-
యును 'పరోత్థ శంక' అంటు
శంక రెండు విధములుండు,
స్వకార్యమ్ము వలన సంభ-
వించెడునది స్వోత్థశంక
ఇందు ఉన్న ఇంగితాలు
కనురెప్పలు, కనుబొమ్మలు
నల్లగ్రుడ్డు, చూపు వీని
అందున గల వికారాలు
ఇతరుల ఆకారముచే
కలుగు స్వేదమో పరోత్థ-
శంక వరుసగ నాకృతియు
చేష్ట ఆదులచే నీద్వి
విధములైన శంకను ఊ
హింపవచ్చు. ఆకారము
సాత్వికమ్ము, చేష్టలు అం
గ ప్రత్యంగముల యందు
కలుగు క్రియా భేదమ్ములు

151 ఆ - 154 అ

**'అసూయా'లక్షణం**

ఇతరుల సౌభాగ్యము, సం
పత్తి, విద్య, శౌర్యము మొద
లౌ హేతువులతో, గుణముల-
యందు గూడ దోషమ్ముల
ఆరోపణ గావించుట-
సూయనంగా బడును.
ఇందు మోము త్రిప్పుటయును
నిందించుట, భ్రూ భేద

మ్ము నుపేక్ష ఈ మొదలౌ
క్రియలున్నవి.      154 ఆ 155

**మదలక్షణము – భేదములు**

మద్యము మొద–
లైనవాని చేత కలుగు
ఆనంద సుసమ్మోహన
లక్షణము మదమౌను.
ఆ మదమ్ము 'తరుణ మదము',
'మధ్య మదము' అపకృష్ట–
మ్మను మదమ్ము' అంటు మూడు
విధములుగా కానుపించు 156

**తరుణ మదము**

తరుణ మదానికి గర్వపు
వీక్షణాలు, మోమునందు
అరుణిమమ్ము, చిరునవ్వులు
సంభ్రమమ్ము గల వాక్కులు,
ఒయ్యారపు నడక ఇట్టి
చేష్టలుండు      157

**మధ్య మదము**

'మధ్య మదము'
నకు వాక్కున తడబడుటయు
దృక్కులలో ఘూర్ణనమ్ము
గమనము నందున వక్రత,
చేతుల నాడించుటయును
వాని వ్రేల వేయుటయును
ఇట్టి చేష్టలుంటాయి.      158

**'అపకృష్ణ' మదము**

'అపకృష్ణ మదమ్ము'నందు
గతి భంగము, మూర్ఛిల్లుట
తెలివి తప్పి వర్తించుట,
ఉమియుట, వెక్కిళ్ళు, వాంతి
అన్నవి చేష్టగ నుండును.   159

**'మదయుతుల' లక్షణం**

ఉత్తమమద మున్నవాడు
పండుకొనియె ఉండు. మధ్య
మద ముండు వాడు నవ్వ–
చెవో బాగ పాడుచుండు
అధమ మదము గల్గువాడు
మాటాడుతు, దుఃఖించును. 160

**శ్రమ లక్షణం**

త్రోవన పయనించుటయును,
నృత్య మొనర్చుచు నుండుట,
క్రీడనమ్ము మొదలౌ వ్యా–
పారాలచే కల్గు మనః–
ఖేదనమ్ము శ్రమ అనబడు
ఇందు అంగ మర్దనమ్ము
నిట్టూరుపు, కాళ్లు పీకు
చుంట, ఆవలింత, మంద
మందముగా పయనించుట

ముఖము నే(త్రాల వికూ
ణనమును గావించుట,
సత్కారమ్మొనరించుట
ఈ అనుభావాలు గలుగు
161, 162

**'ఆలస్య' లక్షణం**

స్వభావమ్ము, భయమ్ము, తృప్తి
గర్వమ్మును, భీతి లేక
ఉండుట మొదలైన వాని
చేత కష్టముతో పనులు
చేయటానికి యత్నించుట
'ఆలస్యం' అనబడును.
ఇందు అంగ భంగమ్మును
క్రియపై ద్వేషమ్ము ఆవ
లింత, నే(త్రములను, నలుపు
కొంట, శయ్యపైన పండు
కొనుట, అందు కూర్చుండుట
అందు ప్రధానముగ ప్రీతి
వహియించుట, కనులు మూత
వడుట, నిదుర మొదలౌ కా
ర్యాలు కలుగుతుంటాయి.
163, 164

**'దైన్య' లక్షణం**

మనస్తాపమును, దారి-
ద్ర్యము ఇత్యాదుల వల్లను
కలుగునట్టి అణుకువ
దైన్యమ్మని అనబడుతున్నది.
ఇందుకు మాలిన్యమును,
గాత్రస్తంభన ఇత్యా
ద్యనుభావమ్ములు కలుగును. 165

**'చింతా' లక్షణం**

ప్రియమగు వస్తువులు లభిం
చకపోవుటచే నైశ్వ
ర్యభంశన ఇత్యాదుల
చేత కలుగు నట్టి ధ్యాన-
మును 'చింత'ని అనుచుందురు
ఇందు మేను చిక్కుటయును,
తలవంచుట, సంతాపము,
నిట్టూరుపు మొదలైనవి
కలుగుతాయి. 166, 167 అ

**మోహలక్షణం**

ఆపత్తు, భ
యమ్ము, వియోగము మొదలౌ
వానిచేత మనసున కే
మియు తెలియకపోవుట 'మో
హము', అని అనగాబడు.
ఇందు ఇంద్రియాలు శూన్య
ముగనుండుట, చేష్టలు లే
కుండుటయును, శరీరమ్ము
తిరుగుచుంట, కనుగ్రుడ్డులు

గిరగిరలాడుట మొదలౌ
క్రియలు కల్గుతుంటాయి

167 ఆ 168అ

**'ధృతి' లక్షణం**

మోక్ష విషయక జ్ఞానము
శాస్త్రజ్ఞానమ్మును, గురు-
భక్తియు, నానా విషయ
మ్ములను సిద్ధి, లజ్జయు మొద
లైనవాని చేత మనసు-
కే ఇచ్ఛయు లేకుండుట
'ధృతి' అని పిల్వగబడును.
ఇందు లభించిన దానిని
అనుభవించుటయు పొందగ-
బడని యట్టి విషయమ్ములు
కడచిన విషయములు, నష్ట
విషయమ్ములు - వీనికి గా
మనసు నందు నెట్టి చింత-
లేకుండుట మొదలైనవి
కలుగుతాయి.

168 ఆ - 170 అ

**'స్మృతి' లక్షణం**

మనోభ్యాస
బలము చేత తన అంతట
సమములైన వస్తువులను
వీక్షించుట ఇత్యాదుల చేతగలుగు
పురానుభూతార్థ జ్ఞానము 'స్మృతి'
అని అనబడును. ఇందు శిరము
నాడించుట, ఊచుట, కను
బొమలను విక్షేపించుట
మొదలైనవి కలుగుతాయి.

170 ఆ, 171

**'వ్రీడా' లక్షణం**

అకార్యమ్ము చేయుటయును
అవమానమ్మును, స్తోత్రము,
నవ్యసంగమమ్ము ప్రతీ
కార్యక్రియ ఇత్యాదుల
చేతను అతిధార్ష్ట్యము లే
కుంట 'వ్రీడ' అని అందురు.
మఱుగుగ మాటాడుటయును,
తలవంచుట, యోచించుట
బయటకు రాకుండుట, దూర-
ముగనె ముసుగు నిడుట, గోళ్లు
గిల్లుట, నేలను గీరుట
మొదలైనవి ఇందు కలుగు.

172-174అ

**'చపలతా' లక్షణం**

ఆశ, ద్వేషమును మొదలౌ
వానిచేత మనసులోన
కలుగునట్టి లాఘవమ్ము
చాపలమగు. యోచింపక

కౌగలించుకొంటయు, వీ-
క్షించుటయును, వెళ్ళుమనుట,
కఠినపు మాటలు పలుకుట,
తాడనమ్ము, ఆజ్ఞాపన
నొనరించుట, మొదలగు చే
ష్టలు ఇందున కలుగుతాయి.
174ఆ 175

**హర్ష లక్షణం**

మనోరథము - సిద్ధి , యోగ్య
మైన వస్తు సంప్రాప్తిని
మిత్రుల సంగమము చేత,
దేవతాదులిచ్చు ప్రసా
దమ్ము చేత కలిగింపం
గబడెడు మనఃప్రసాదమ్ము
'హర్షమ్మని' అనబడును
ఇందు ముఖము, నేత్రమ్ములు
వికసించుట, ప్రియభాషణ
ఆశ్లేషణ, పులకరింత,
స్వేదోదమనమ్ము, హస్త
ములను తట్టుటయు మొదలౌ
చేష్టలు సంప్రాప్తించును.
176-178 అ

**'ఆవేగ' లక్షణం**

మనసు పొందు తడబాటగు
'ఆవేగము' ఆ ఆవే
గము ఉత్పాతావేగము
అని, వాతావేగమ్మని,
వర్షావేగమ్మని, అ
గ్న్యావేగమ్మనియు, మత్త
కుంజరదర్శన - అవే
గ మ్మని ప్రియశ్రవణా వే
గమ్మని, అప్రియశ్రవణా
వేగమ్మని శాత్రవవ్యస్త
నా వేగమ్మనియు కార
ణాను సారముగ నెనిమిది
తెఱుగు లౌచు గోచరించు.
178 ఆ, 179

**ఉత్పాతా వేగము - క్రియలు**

వీనిలోన పర్వత మి-
త్యాదులు కదలాడుచుంట,
తోకచుక్క జనియించుట,
మొదలయినవి ఆ ఉత్పా-
తమ్ము లవును. దీనివల్ల
గలిగిన సర్వాంగపు వి
స్రంసనమ్ము, వైమనస్య-
ము సంస్మరణ, ఉత్పాతా
వేగమనంగా బడును. 180

**వాతావేగము - క్రియలు**

వేగమ్మగు గమనమ్మును,
వస్త్రాలను గ్రహియించుట

అవకుంఠన, నేత్రాలను
తుడుచుకొనుట మొదలైనవి
'వాతావేగపు చేష్టలు'. 181

**వర్షావేగము - క్రియలు**

ఛత్రమ్మును గ్రహియించుట,
దేహము సంకోచించుట,
హస్తములను, భుజమూలము
లను చేర్చుట, దావనమ్ము
ఛన్నాశ్రయణము చేరుట,
మొదలయినవి 'వర్షావే
గము' చేతను గల్గు క్రియలు 182

**'అగ్న్యావేగము - క్రియలు'**

అగ్న్యావేగమ్ము నందు
కల్గు క్రియలు వీజనమ్ము,
అంగధూన నమ్మును వ్య
త్యాసముగా పదముల వి
క్షేపించుట, నేత్రమ్ములు
సంకోచము నొందుటయును
మొదలైనవి. 183

**మత్తకుంజరదర్శనావేగము - క్రియలు**

కుంజరమ్ము-
చే కలిగే ఆవేగము
నందు వేగముగ ధావన
మొనరించుట, మాటిమాటి
కిని ప్రక్కకు తిరిగి తిరిగి
వీక్షించుట, భయము, వణకు
మొదలైనవి కలుగుతాయి 184

**ప్రియ శ్రవణా వేగము - క్రియలు**

ప్రియశ్రవణ జావేగ
మ్మందున నభ్యుత్థానము
ఆలింగన స్వీకారము,
ప్రీతి పురస్సరముగ వ
స్త్రా భరణాదుల నిచ్చుట,
ప్రియ వాక్యములను పలుకుట
రోమాంచము మొదలైనవి
కలుగుతాయి. 185

**అప్రియశ్రవణావేగము - క్రియలు**

అప్రియ శ్రవ
ణావేగమునం దేడుపు
పరిలుంఠన, మొరవెట్టుట
క్రిందబడుట, పరిభ్రమణ
మొనరించుట మొదలైనవి
కలుగుతాయి. 186

**శాత్రవవ్యసనావేగము - క్రియలు**

శాత్రవవ్యస-
నావేగమునందు కవచ
మును, నాయుధమును మొదలౌ
వస్తువులను ధరియించుట,

గజమును, అశ్వమును, రథము
ఆరోహణ గావించుట,
వేగముగా విక్రమించు
టయు మొదలౌనవి కలుగును
ఇవ్వి ఉత్తమాదులకు య
థోచితముగ కలుగుతాయి
187, 188 అ

**'జడతా' లక్షణం**

ఇష్టార్థ మనిష్టార్థ
ములను వినుట వలన గాని,
వర్షము వలనను గాని,
విరహము మొదలయిన వాని
వలన గాని కలుగునట్టి
అజ్ఞానము జడతయౌను
ఇందు రెప్పపాటు లేక
యుంట, చెవులు వినకుండుట,
పారవశ్యమును తూష్ణీం
భావమ్మును పొందుట మొద
లైన యట్టి క్రియలు కలుగు.
188 ఆ 189

**'గర్వ' లక్షణం**

ఐశ్వర్యము, రూపము, యౌ-
వనము, కులము, విద్య, బలము,
ఇష్టలాభములు మొదలౌ
వానిచేత నితరుల నవ
మానించుట 'గర్వ'మ్మగు
ఇందు అహంభావము, ఆ
జ్ఞోల్లంఘనము అనుగ్రహ
ప్రదానమును, మోము త్రిప్పు
కొనుట, మాటలాడకుంట
మొదలైనవి, పరుషముగా
మాటాడుట, చూడకుంట,
తన అవయవములను చూచు
కొనుట, ఒడలు విరుచుకొనుట
మొదలౌ అనుభావమ్ములు
కలుగుతాయి. 190–192

**'విషాద' లక్షణం**

తా నారం-
భించిన పని సాగకుంట
ఇష్టవస్తువులు లభ్యము-
కాకుండుట, ఆపదయును
అపరాధ పరిజ్ఞానము
వీటి వల్ల కలుగునట్టి-
దౌ అనుతాపము. 'విషాద'
మనబడును. జ్యేష్ఠ, మధ్య
మాధమములని విషాదమ్ము
మూడు తెఱంగులై ఉండును.
జ్యేష్ఠ విషాద వ్యాపారాలు
జ్యేష్ఠ విషాదమ్మునందు
సహాయాన్ని అన్వేషణ

చేయుటయు, ఉపాయచింత
మొదలౌ వ్యాపారమ్ములు
కలుగుతాయి. 193, 194

**'మధ్యమ విషాద' చర్యలు**

మధ్యమపు వి-
షాదమందు ఉత్సాహము
లేకయుంట, మిక్కిలిగా
చింతించుట, కార్యాకా-
ర్యములు తెలుసుకొనకుండుట,
ఎవరిని తలయెత్తి చూడ
కుంటయు, భ్రమనొందుట మొద
లైన క్రియలు కలుగుతాయి. 195

**'అధమ విషాద' చర్యలు**

అధమ విషాదమ్మునందు
రోదనమ్ము నిట్టూరుపు
ధ్యానము, ముఖవక్రతయును
మొదలయినవి కలుగుతాయి
196

**'ఔత్సుక్య' లక్షణము**

ఆస, దాన్ని పోలినట్టి
వానిచేత కలుగు జాగు
ఓర్వ జాలకుండుట 'ఔ
త్సుక్య'మ్మని అనగాబడు
ఇందు వేగముగ నడచుట,
శయ్యనుండి ఉత్థానము,
చింతించుట, దేహము బరు
వెక్కుటయును మొదలైనవి
కలుగుతాయి. 197, 198 అ

**'నిద్రా'లక్షణం**

మందమైన
స్వభావమ్ము, వ్యాయామము
నిశ్చింతతయును, సమాధి
వీని చేత గలుగు మనో-
నిమీలనము 'నిద్ర' యౌను
ఇందానన గౌరవమ్ము
నేత్ర నిమీలనము, అంగ-
ముల పరివర్తన, నిశ్వా-
సము - ఉచ్ఛ్వాసము, దేహ-
మ్మందున సంకోచము, జా-
డ్యాదులు ఇందున కలుగును
198 అ 200

**'అపస్మార' లక్షణం**

వాత, పిత్త, శ్లేష్మ, ధాతు-
వులకు చెందు హెచ్చుతక్కు
వలు, దోషము, దయ్యము సో-
కుట మొదలౌ వానిచేత
చేయబడిన మనక్షోభ
'అపస్మార' మనబడును.
ఇందు కంపనమ్ము, ధావ

నము, పతనము, స్తంభనము
భ్రమణము, నేత్రమ్ముల వి-
క్రియయు, దంశ భేదనమ్ము,
భుజ క్షేపమును లాలా
జలమును కార్చుట, ఫేనము
కట్టుట మొదలైన విందు
కలుగుతాయి. 201, 202

## 'సుప్తి' లక్షణం

నిద్రాధి క్య-
తయె'సుప్తి' అనబడును
ఇంద్రియాలు ఉపరతి వహి
యించి యుంట
కనులు మూసి
కొని యుండుట, గాత్రము స్ర-
స్తముగనుంట, స్వప్నము వహి
యించి యుంట, అతి దీర్ఘ
మ్మగుకాలము సంచలనము
లేకయుంట, ఉచ్ఛ్వాసము
నిశ్వాసము మొదలయినవి
ఇందులోన కలుగుతాయి.
203, 204 అ

## 'విబోధ' లక్షణం

నిద్దుర మేల్కొనుట విబో-
ధమ్మని అనబడుతున్నది.
ఇందు అక్షి మర్దనమ్ము,
శయ్యా మోక్షణము, బాహు
విక్షేపము, అంగుళాల
మోటనమ్ము, శిరము గోకు
కొంట, దేహమును త్రిప్పుట
మొదలైనవి కలుగుతాయి
204ఆ, 205

## 'అమర్ష' లక్షణం

అధిక్షేప మొనరించుట
అవమానము గావించుట
మొదలయ్యేడు వాని చేత
కలిగెడు క్రోధము 'అమర్ష'
అనబడును. స్వేదమ్ము శి-
రః కంపన, తలను వంచు-
కొనుటయు, చింతించుటయు, ఉ-
పాయనముల అన్వేషిం
చుట, ఉత్సాహము, వ్యవసా
యము మొదలౌనవి కలుగును,
206, 207 అ

## 'అవహిత్థా'లక్షణం

ధైర్యము, ప్రాభవము, నీతి,
సిగ్గు, సాధ్వసము, దాక్షి
ణ్యము, ప్రాగల్భ్యము, అపజయ-
మును మొదలౌ వానిచేత
కలిగెడు ఆకారగుప్తి
'అవహి' త్థగుప్తి ఇందు అన్య

ధాపాదన, మిధ్యా ధై
ర్యము, మతియొక పక్షమ్మును
తిలకించుట, కథా భంగ
మును నితరము లిందు పొంద
బడతాయి. 207 ఆ - 209అ

## 'ఉగ్రతా' లక్షణం

అపరాధము
అవమానము, అపహరణము
నిగ్రహము, అసత్ప్రలాప
మును మొదలౌ వాని చేత
చేయబడిన త్వర 'ఉగ్రత'
అనబడును. ఇందు కనులు,
మోము ఎఱ్ఱవడుటయు బం-
ధించుటయును, తాడనమ్ము,
తలయాడించుటయును, స్వే-
దము కలుగుట, బెదరించుట,
వర్ధనమ్ము, పతితత్వమ్ము
మొదలయినవి, కలుగుతాయి.
209 ఆ-211అ

## 'మతి' లక్షణాలు

నానా శాస్త్రార్థాలను
చెప్పుటచే కలుగు అర్థ
నిర్ణయమ్ము 'మతి' అనుబడు
ఇందు యుక్తమౌ క్రియలను
గావించుట, సంశయాన్ని

పోగొట్టుట, శిష్యులకుప
దేశించుట, కనుబొమ్మల
నాడించుట, ఊహాపో
హమ్ములు మొదలైనట్టివి
కలుగుతాయి. 211 ఆ 212

## 'వ్యాధి' లక్షణం

దోషోద్రే
కమ్ముచే, వియోగాదుల-
చే గలుగు జ్వరమ్ము 'వ్యాధి'
అనబడును. ఇందు శరీ
రము స్తంభించుట, అంగపు
బిగి తగ్గుట, కూజితమ్ము,
ముఖ కూణన, వ్యర్థ - అంగ
విక్షేపము, నిట్టూరుపు
మొదలయినవి కలుగుతాయి.
ఆ జ్వరమ్ము శీత జ్వర-
మనియును, దాహ జ్వరమ్ము
అనియును, నిరు తెఱగులుగా
వ్యవహరించు. 213, 214

## శీతజ్వర వ్యాధి చేష్టలు

శీతజ్వర
మందున తాపమ్ము శరీ-
రము చిక్కుట చెక్కిళ్ళు చ-
లించటమ్ము కన్నీరును,
సర్వాంగమ్మును వణకుట

కూజనమ్ము జానుకంప-
నమ్ము పులకరింపు, మోము-
శోషణమ్ము మొదలయినవి
కలుగుతాయి.      215 216 అ

**దాహజ్వర వ్యాధి చేష్టలు**

దాహజ్వరమందు
శీత పుష్పమాల
మొదలగు వానిని దాల్చుట,
హస్తమ్ముల, పాదమ్ముల
ఎత్తి ఎత్తి వేయుటమ్ము
ముఖ శోషణ, మొదలౌనవి
కలుగుతాయి      216 217 అ

**ఉన్మాద లక్షణం**

వియోగమ్ము
ఇష్టనాశనమ్ము వీని-
వలన గలుగు చిత్ర విభ్ర-
మము 'ఉన్మాద'మ్మని అన-
గాబడును.      217 ఆ

**వియోగజోన్మాద చేష్టలు**

వియోగజో
న్మాదమందు ధావనమ్ము-
పరివేదన, సంబంధము
లేనియట్టి పలుమాటలు
పల్కుచుంట శయనించుట
వేగంగా లేచుండుట
ప్రాణము లేనట్టివాని-
తో భాషణ యొనరించుట
కారణమ్ము లేకుండా
నవ్వుచుంట మొదలయ్యివి
కల్గుతాయి      218, 219 అ

**ఇష్టనాశోన్మాద చేష్టలు**

ఇష్టనాశ-
నోన్మాదమునందు భస్మ-
మిత్యాదులు అయినవాని
పరిలేపన మొనరించుట,
నృత్యమ్మును గావించుట,
గీతాదులు పాడుచుంట,
తృణములు మొదలైనవాని-
తో గూర్చిన మూల్యమ్ములు
ధరియించుట ఇవి క్రియలు
ఇవియు వియోగజోన్మాద
మందలివైనట్టి క్రియలు
కలుగుచుండు      219 ఆ 220

**మరణము - భేదములు**

సర్వాంగ-
వ్యాపిగాను ఉండు ధనం-
జయ వాయువు నిర్గమించు
టగు 'మరణము' ఈ మరణము
'వ్యాధిజమ్ము' 'అభిఘాత'
మ్మని ద్వివిధము  221, 222 అ

**వ్యాధిజ మరణ చర్యలు**

అసాధ్యమైన-
దౌ హృద్రోగము, విషూచి
మొదలయ్యెడు వానిచేత
సంభవించునది "వ్యాధిజ
మరణమ్ము" కొతుకుచు మా
టలు పలుకుట, దేహకాంతి
మారుటయును, మెల్లగ శ్వా-
సను విడుచుట, మాట నిలిచి-
పోవటమ్ము, నేత్రమ్ముల
మీలనమ్ము , హిక్కపరిజ
నముల నపేక్షించుటయును,
ఇంద్రియ చేష్టలు అణగుట
మొదలైనవి ఇందులోన
కలుగుతాయి

222 ఆ - 224 అ

**అభిఘాత మరణ చర్యలు**

ఘాతము, పతనమ్ము, దేహ
బంధనమ్ము, విషము దీని
చేత కల్గునది అభిఙా
తజ మరణము ఘాతజమున
నేలబడుట దుఃఖించుట
మొదలయినవి ఇందు కలుగు
వసనాభియు మొదలయినవి
విషము పతన మాదియైన
అభిఘాతము వలన కలుగు
క్రియలు చిక్కిపోవటమ్ము
వణకుట తాపమ్ము, హిక్క
ఫేనము, కంధర భంగము,
జడతయు, మృతి ఇత్యాదులు,

224 ఆ 226

**త్రాస లక్షణం**

మెఱపు, రాక్షసాళి, ఉఱుము
పిశాచమ్ము, నాగుబాము
ఇత్యాదుల వలన గలుగు
మానస చాంచల్యము 'త్రా
స'మ్మని అనగా బడును
ఉత్కంపము, దేహపు సం-
కోచము, రోమాంచము సుం-
స్తంభము, గాద్గమ్యమ్మును
అడుగడుగుకు తెప్పపాట్లు,
భ్రమ, ప్రక్కనున్న వారి
పట్టుకొనుట మొదలైనవి
ఇందు కలుగు. 227, 228

**వితర్క లక్షణం**

సందేహము,
నిశ్చయమ్ము మొదలయ్యెడు
వాని చేత గలుగునట్టి
ఊహాత్మకమును, సత్యా-

సత్య నిర్ణయము 'వితర్క'
మనబడును. దీనియందు
కనుబొమ లెగురగ వేయుట
తలయాడించుట మొదలౌ
అనుభావమ్ములు కలుగును
229, 231 అ

**స్వభావము - భావము**

ఉత్త మధము మధ్యమ స్వ-
భావమ్ములు కలుగువారి
విభావానుభావ సాత్వి-
కభావ వ్యభిచారీ భా
వములు యథోచితముగ
వర్ణింపగా దగినట్టివి.
230 ఆ, 231 అ

**స్వాతంత్ర్య పారతంత్ర్య వ్యభిచారీ భావములు**

వ్యభిచారీ భావమ్ములు
స్వాతంత్ర్యము, పారతంత్ర్య
ముల వలనను ఇరురీతుల
వౌతున్నవి. ఇవి ఇతరుల
పోషణాన్ని పొందినపుడు
పరతంత్రము లనియు, అట్లు
కానప్పుడు స్వతంత్రములని
చెప్పబడును. 231 ఆ 232

**వ్యభిచారీ భావ చతురవస్థలు**

ఉత్పత్తియు,
సంధియు, శాబళ్యమ్మును
శాంతి, అంటు వ్యభిచారీ
భావములకు నాలుగవ-
స్థలు ఉన్నవి. ఇందున ఉ-
త్పత్తి' అన్నయది భావము
కలుగుటయౌ సరూపమ్ము
లయినను, అసమానరూప
ములు అయినను భిన్న కార-
ణాల చేత కల్పితమ్ము
లయిన రెండు భావమ్ములు
చేరిన చో సంధి యౌను
భావమ్ములు ఒక్కదాని
నొక్కటి ఒరయుట 'శబళ
త్వ' మ్మని అనగాబడును
అత్యారూఢమ్ము అయిన
భావలయము 'శాంతి' అనం-
గా బడును. 233-235

**ఆభాసత - భేదములు**

ఈ భావము-
లకును అనౌచిత్య ప్రవ-
ర్తనము 'ఆభాసత' అనబడు
అనౌచిత్యమసత్యా
నౌచిత్యమ్మనియు, అ-

యోగ్యా నౌచిత్య మనియు
ద్వివిధాలుగ వర్తిల్లును. 236

అనౌచిత్యద్వయ లక్షణం
ఏది అచేతనగతమౌనో
అద్ది 'అసత్యమ్ము' చేత
నిర్మింపంబడిన దౌను
నీచమైన తిర్యగ్జడ-
ముల కాశ్రయ మైనయట్టి
'దయోగ్యత్వకృత'మని చె-
ప్పంగ బడును 237

## స్థాయీ భావ నిరూపణ

సజాతీయ
విజాతీయ భావముల అ-
తిరస్కృతమ్ము లౌచు క్షీర
జలధి వోలె నితర భావ-
ముల స్వాత్మత్వము నెవ్వి
పొందింపగ
చేసుకొనునో
అవి స్థాయీ భావమ్ములు.
స్థాయీ భావము లెనిమిది
విధములంచు ఋషివర్యులు
ఒప్పుకొనిరి వాని పేర్లు
రతి, ఉత్సాహము, శోకము,
విస్మయమ్ము, హాసము, భయ
మును, జుగుప్స, క్రోధము - ఇవి
నాట్యమందు చెప్పబడియె.
238- 240 అ

## 'రతిస్థాయి' లక్షణము

స్వభావమ్ము సహవాసము
సంబంధము, అభిమానము
ఆత్మోపమాది విషయ
మ్ములు, దీనివల్ల నాయి
కానాయక మనములందు
కలిగెడు నన్యోన్య విషయ-
మౌ నిచ్ఛా విశేషమ్ము
'రతిస్థాయి' అందున కడ-
గంటి చూపు, కనుబొమ్మల
ఎగురవేత, ప్రియవాక్యము
మొదలైనవి కలుగుతాయి.
240 ఆ -242 అ

వరుసగ మొలకయు, చిగురును
పూవు, ఫలము నగు రతిస్థా
యీ భావము. 'ప్రేమ' అనీ
'మాన'మనీ 'ప్రణయ'మనీ
'స్నేహ'మనీ 'రాగ'మనీ
'అనురాగ'మ్మని యను నా-
మాలను వహియిస్తున్నది.
242 ఆ 243 అ

**ప్రేమ లక్షణం**

నాయిక–నాయకుల ప్రీతి
సహితమైన మనసుల కల
యిక ప్రేమని అనబడును.

243 ఆ

**మాన లక్షణం**

నాయిక నాయకుల ప్రేమ
బంధముచే స్వాతంత్ర్యము
వలన కలుగునట్టి భావ
కౌటిల్యము 'మాన' మనం–
గా బడును.

**ప్రణయ లక్షణం**

నాయిక నా
యకులకు చెందినదౌ మా
నోప కల్పితమ్ములైన
బాహ్య – అంతర – ఉపచార
మ్ములచే భావపు విస్రం
భాన్ని కలుగుజేయు ప్రేమ
'ప్రణయ'మ్మని అనబడును. 245

**స్నేహలక్షణం**

నాయిక నాయకులది యౌ
విస్రంభము, దర్శనమ్ము
ఇత్యాదుల చేత పూర్ణ–
తను పొందగ ఏ దశలో
మనసు కుఱుగుతూ ఉందో
అది 'స్నేహము' అనబడును.
ఆ స్నేహము ప్రౌఢ స్నే
హమ్మనియును, మంద స్నే
హమ్మనియును, మధ్య స్నే–
హమ్మనియును, ముత్తెఱగులు

246, 247 అ

**ప్రౌఢ స్నేహ లక్షణం**

తోచుట మొదలైనవాని
చేత నెఱుగబడని యట్టి
చిత్త వృత్తిగల నాయకు
నందు నితర క్లేశ కారి–
ణయిన యట్టి స్నేహము 'ప్రౌ–
ఢస్నేహము' అని అనబడును.

247 ఆ, 248అ

**మందస్నేహ లక్షణం**

నాయిక–నాయకుల యందు
ఒకరికి కోపము మొదలౌ–
నట్టివి పొందున్నప్పుడు
రెండవ వారికి ఉపేక్ష
యును అపేక్షయును చేయక
ఉండెడునది 'మంద స్నే
హ'మ్మనబడు 248 ఆ, 249 అ

**మధ్య స్నేహ లక్షణం**

ఇతరాను భ
వాపేక్షను ఎదురు చూచు
చున్నట్టిది 'మధ్యమ స్నే
హ' మ్మనబడు 249ఆ

**రాగలక్షణం**

ఏ స్నేహపు
అతిశయమ్ము వలన మనసు
నందున దుఃఖమ్ము సుఖము
వోలె తోచుచున్నదొ అది
'రాగ' మనంగా బడును.
అది 'కుసుంభరాగ' మనియు
'నీలరాగ' మనియును 'మాం
జిష్టరాగ' మనియు మూడు
తెఱుగులుగా కనుపించును.
250, 251

**కుసుంభ రాగ లక్షణం**

ఏ రాగము
మనసున క్షణకాలమందె
పుట్టునదియు, అధికంగా
ప్రకాశించుచున్నదైన
తక్షణమే మారునదియు–
నైయుండునో అది 'కుసుంభ
రాగ'మనంగా బడును.
251 ఆ, 252 అ

**నీలరాగ లక్షణం**

ఏది మదిని సక్తమ్మై
మాఱకుండ, ప్రకాశింప
కుండ ఉండునో అయ్యది
'నీలరాగ' మనబడును. 252 ఆ

**మాంజిష్ట రాగము**

ఏది చిత్తమందు త్వరగ
సంసక్తమ్మై ఎన్నటి
కిని మాఱక ప్రకాశించు
నో అది 'మాంజిష్ట రాగ'
మనబడును. 253

**అనురాగ లక్షణం**

ముందు చెప్పి
నట్టి రాగమే తన సం
వేద్యదశను పొందుట చే
ప్రకాశితము అయి ఆశ్రయ
ముండు వఱకు ఉండెనేని
అది "అనురాగ"మ్మని అన
గా బడును. కొందఱు ప్రీ
తిని రతిభేద మ్మందురు. 254

**ఉత్సాహ స్థాయి లక్షణం**

శీల శ్లాఘ్యమ్ములైన
కార్యమ్ముల యందు శక్తి,
ధైర్యమ్ము, సహాయము, మొద
లైన వానిచే త్వరగా

ప్రవర్తించు మానస వ్యా
పారము 'ఉత్సాహస్థా'
యని అనబడు. అందు సమయ
మును జూచుట ధైర్యము, త్యా
గము, ఆరంభము మొదలౌ
నవి' కలుగును. ఇది 'సహజో
త్సాహస్థా'యనియును, 'ఆ
హార్యోత్సాహస్థా'యని
రెండు తెఱగులైయున్నది
255, 256, 257 అ

### శోకస్థాయి లక్షణం

బంధు విషయమౌ విపత్తు
దుర్గతి, ధన నాశము మొద
లయిన వాని వలన బుట్టు
చిత్తక్లేశాన్ని సృష్టి
చేయు వృత్తిని 'శోకస్థా'
యని అందురు అందు దేహ
కాంతి మార్పు దొందుటయును
బాష్పోద్గమమును ముఖమ్ము
వాడుటయును స్తంభము ని
ట్టూర్పు ఇతరములు కల్గును.
257 ఆ 258

### విస్మయ స్థాయి లక్షణం

లోకోత్తరమైన పదా
ర్థాల నపూర్వము వీక్ష
గావించుట వీని చేత
గలుగు మనో విస్తారత
అనునది 'విస్మయ' స్థాయి
ఇందు నైత్ర వైశాల్యము
శ్లాఘించుట, పులకరింపు
మొదలయినవి చేష్టలగును
259, 260 అ

### హాస స్థాయి లక్షణం

పలుకులు, ఆకారము, వే
షమ్ము పనియు, వీని వికా
రము చేతను, ఇవ్వి పర
స్థలవాసుల వైన యెడల
సహజముగా నున్న వెక్కి
రించుట చేతను గల్గు మ
నోవికారమే 'హాస
స్థాయి' అనంగాబడును
ఇందు వికారంపు చూపు,
ముక్కు, పెదవి, చెక్కిళ్ళును
వానియందు సంచలనము
మొదలయినవి కలుగుతాయి
260 ఆ

### భయస్థాయి లక్షణం

ఆకస్మికముగను భయం
కరవస్తువులను చూచుట
వాని వినుట మొదలయ్యేడు

వానిచేత, తప్పిదమ్ము
చేత నెంతో పుట్టు చిత్త
చాంచల్యము 'భయ' స్థాయి
ఇది ఉత్తమ, మధ్యమ, నీ
చాశ్రయమై మూడు విధము
లుగ నుండును కంపమ్మును
ము శోషణ మొదలయ్యేడు
వానివల్ల దీని నెరుగ
గావచ్చును.

262 ఆ 263, 264 ఆ

### జుగుప్సాస్థాయి లక్షణం

యోగ్యము కా
నట్టి వస్తువుల చూచుట
వినుట అనే వాని వల్ల
కల్గు మనస్సంకోచము
'జుగుప్స' అను స్థాయీ భా
వమ్మన బడు ముక్కు మూసు
కొనుట, వేగముగ బోవుట
మోము వికూణనము చేసు
కొనుటయు, సర్వాంగ ధూన
న, మ్మసహ్యపడుట, మాటి
మాటికిని నిష్ఠీవనమ్ము
నొనరించుట మొదలైనవి
దీనియందు కలుగుతాయి.

264 ఆ 265 266అ

### క్రోధస్థాయి లక్షణం

పురాక్షేపమును మొదలౌ
వానిచేత గలుగునట్టి
మనః ప్రజ్వలనము క్రోధ
స్థాయి అంటు తెలుపుతారు.
ఇద్ది ఫుల్ల నాసాపుట
మును, గిరగిర తిరిగెడు కను
తారకలును, ఇత్యా ద్యను
భావమ్ముల కలిగినదై
ఉంటుంది. దీనికి శ
త్రువులు, భృత్యులును, మిత్రులు
పూజ్యులు ఈ నల్వురు విష
యులు అని అనబడుదురు.

266 ఆ. 267

### శత్రు విషక్రోధ సంభవాలు

శత్రువిషయ క్రోధ మందు
అడుగడుగున ఓష్ఠమ్ముల
కొఱకు కొనుట, కనుబొమ్మలు
వంకరగుట, దంతఘట్ట
నము, చేతుల పిసుగుకొనుట
శరీరమ్ము వణుకుటయును
అస్త్రమ్ముల వీక్షించుట
తన బుజముల చూచుకొనుట
గర్జించుట, మొదలైనవి
కల్గుతాయి. 268, 269 ఆ

### భృత్య విషయ క్రోధ సంభవాలు

భృత్య విషయ
క్రోధ మందు కన్నీరును
కార్చుటయును, ఊరక
ధ్యానించుట యును చలన
రహిత
ముగ నుండుట, అడుగడుగున
నిట్టూర్పులు విడచుటయును
మాటాడక యుండుటవై,
నమ్రత వహియించుటయును
భుగ్నదృష్టి మొదలైనవి
కల్గుతాయి. 269 ఆ, 270

### మిత్ర క్రోధ సంభవాలు

మిత్ర క్రో
ధమ్ము నందు భావగర్భ
ముగ భూషించుట, భ్రూ భే
దనము వహించుటయు, నొసట
చెమట పట్టుటయును నేత్ర
ములు ఎఱ్ఱందన మొందుట
జరుగుతాయి. 271

### పూజ్యక్రోధ సంభవాలు

పూజ్యక్రో
ధమ్ము నందు తన్ను తాను
తిట్టుకొనుట, మోము వంచ
టమ్మును ప్రత్యుత్తరమ్ము
చెప్పకుంట శరీరాన
స్వేదమ్మును కంఠమందు
గాద్గద్యము మొదలైనవి
ఎన్నెన్నో కలుగుతాయి. 272

### క్రోధ విషయ విశేషాలు

భృత్యాది క్రోధత్రయ
మందు దాని దాని కెవ్వి
చెప్పంగా బడినవొ ఆ
క్రియలు దాని దాని కుద్భ
వించు చుండు మిత్ర క్రో
ధాంతర్గతు లయినయట్టి
స్త్రీ పురుషుల కోపాలను
వనితమీద పురుషుని కో
పమ్ము ప్రత్యయమ్ము కలుగు
నంత వఱకు ఉంటుంది.
ఇందు వక్రవీక్షణమ్ము,
అధరము నందున స్ఫురణము
కడకన్నులు ఎఱ్ఱవడుట
ఇత్యాదులు కలుగుతాయి.
273, 274

### పురుషవిషయ మైనయట్టి

స్త్రీ క్రోధము ఆ సపత్ని
హేతుక మని, అన్య హేతు
కమ్మని యను ఇరు తెఱగుల
వర్ధిల్లును ఆ సపత్ని

హేతుకమ్ము అగు రోషము
విప్రలంభ మందు చెప్ప
గా బడినది. అన్యహేతు
కృతరోషము నందు పురుష
రోషమందు ఉన్న క్రియలె
కలుగుతాయి. 275, 276

## స్థాయిభావములు – రసరూపము

విభావ వ్యభిచారిభావ
సాత్వికానుభావవ్యా
పారరూప – అనుభావము
లచె సాక్షాత్కారమ్మును
పొందింపం బడినయట్లు
అభినయ గోచరత నొంది
స్థాయీ భావములు స్వాదు
రూపత పొందింపబడి
సామాజిక మానసాన
రసమౌటను పొందుతాయి
యథాయోగ్యముగ గూడిన
దధి మొదలౌ వ్యంజనాల
చేత చింతపండును, మి
ర్యాల వంటి ఔషధాల
చేత, గుడము మొదలైనవి
అయిన మధుర పదార్థాల
చేత, పాకభేదమ్ముల
చేత అన్నమునకు రసము
ఎటుల కలుగుతూ ఉన్నదో
అట్లు విభావాది భావ
ముల చేత, ప్రయోగాల
చేత రసము నిష్పన్నము
అవుతున్నది రస మన్నది
మనసు చేత ఎఱుగ దగిన
యట్టి సుఖ విశేషమ్ము
అది భావజ్ఞుల చేతను
ఆస్వాదింపగబడును.
277–281 అ

## రస భేదములు

శృంగారము, వీరము, కరు
ణాద్భుత, హాస్యములు, భయా
నకమును, బీభత్సము, రౌ
ద్రమ్ము అంటు నాట్యమందు
రసము లెన్మిదని చెప్పం
గా బడినవి 281 ఆ 282 అ

## శృంగార రసలక్షణం

ఈ ఎన్మిది
రసములలో శృంగారము
మొదటిదిగా చెప్పబడియె
విభా వానుభావ వ్యభి
చారి సాత్వికములను భా
వములచే సదస్య స్వా
ద్యత్వము పొందిన స్థాయీ

భావము శృంగారమ్ము
అట్టి రసస్థాయి నాయి
కానాయకులను ఆలం
బనముగాను పొందినది
రూపము, యౌవనమును లా
వణ్యమ్మును కులము, శీల
మును మొదలౌ నాయికనా
యకుల గుణమ్ముల చేతను
మధురములౌ పలుకులచే
తన సంగీతంపు విద్యా
ఇత్యాదులచే, భుజవి
న్యాసమ్ము, కటాక్షము హా
సము మొదలౌ వాని చేత,
చేష్టలచే, పూలు, గంధ
మును, వస్త్రము హస్తాభర
ణములనెడి అలంకార
మ్ముల చేతను చంద్ర దీప
ములు అనెడి తటస్థ భావ
ముల చేతను, మళ్ళీ ఉ
ద్దీపితమై రమ్య దృష్టి
యును, ముఖరాగము మొదలౌ
ఆంగికాలచే, మధురా
లాపము, గుణకీర్తనమ్ము
మొదలౌ వాచికములచే
స్తంభము, కంపము, మొదలౌ
సాత్వికానుభావము లచె
ప్రకాశితమ్మై ఔత్సు
క్యమ్ము చింత, హర్షము, మొద
లౌ సహకారుల చేతను
పోషింపంబడిన యట్టి
ఆ రతియే, భావములచె
రంజితమై రసికులచే
ఆస్వాదింపగ బడుతూ
శృంగారరసమ్మౌటను
పొందుతుంది. 282 ఆ–289

## శృంగార విభజన, విప్రలంభ శృంగారం

శృంగార ర
సమ్ము విప్రలంభ యనెడి
శృంగారము, సంభోగ శృం
గారమ్మని ద్వివిధమ్ము
అత్యంతమ్మగు నాస
క్తిని గల్గిన నాయిక నా
యకు లిరువుర కన్యోన్యము
చేరిక లేకుంట 'విప్ర
లంభ' మంచు తెలిపెదరు.
ఇందు విరహ పాండిమమ్ము
సోలిపోవునట్టి చూపు
మొదలయినవి కలుగుతాయి
హర్షము, గర్వము, జుగుప్స,
ఉగ్రభావమును, మదమ్ము,
హాసమ్ము , శమమ్ము, ఇవ్వి

వినా మిగిలిన సంచారీ
భావమ్ములు సర్వమ్మును
ప్రకృతి కనుగుణముగాను
కలుగుతాయి. 290 ఆ – 292 అ

**విప్రలంభ హేతువులు**

విప్రలంభ
మునకు 'అయోగము, విరహము,
మానమ్ము, ప్రవాసము, శా
పమ్ము' అనెడి అయిదు హేతు
వులు ఉన్నవి 292 ఆ, 293 అ

**అయోగ విప్రలంభ శృంగార లక్షణం**

ప్రేమ అతిగ
గల్గిన నాయిక, నాయకు
లకు తొలుతటిదౌ సమాగ
మునకు మునుపు గల్గు విప్ర
లంభమునుం 'అయోగ విప్ర
లంభమ్మ'ని అనియెదరు.
ఇందు 'నాయకుని వీక్షణ
చేసి యింటిలోనికి పో
వుటయు, బయటికిని వచ్చుట,
ఊరకతని చూపునకును
కనుపించుట తన ఆశను
వెల్లడించు చేష్టలు తన
శరీరాన్ని కాంతివంత
మొనరించుట, వ్యాజోక్తులు,
విజనస్థలమందుండుట'
మొదలైనవి ఇందుండును.
అసూయయును, భ్రమ, భయమ్ము
నిర్వేదము, ఔత్సుక్యము
దైన్యమ్మును, చింత, నిద్ర
ప్రబోధమ్ము , విషాదమ్ము
జాడ్యమ్మును, ఉన్మాదము,
మోహము, మరణమ్ము అనే
ఈ వ్యభిచారీ భావ
ములకు యథోచితముగ ప్రవే
శమ్మున్నది, ఈ 'అయోగ
విప్రలంభము'నకు దశా
వస్థలున్న వని ప్రాచీ
నుల మతమ్ము దీని ననుస
రించి భరతుడిట్లు చెప్పె.

294 ఆ 298

**అయోగ విప్రలంభ దశావస్థలు**

'చక్షుః ప్రియమ్ము, చింతయు
సంకల్పము, గుణనుతియు క్రి
యాద్వేషము, తాపము, ల
జ్జాత్యాగము, ఉన్మాదము,
మూర్ఛ మరణ' మనునవి ఈ
'దశావస్థ' లై యున్నవి 299

**చక్షుఃప్రీతి లక్షణం**

రమ్యమైన ఆలంబన
వినబడినది గాని లేక
కనబడినది గాని కాగ
దాని యందు కలుగు ఇచ్ఛ
'చక్షుః ప్రీతి'. ఇది 'సంతో
షము, స్వేదము, పులకరింపు,
హర్షము, ఆశ్చర్యము సా
ధ్వసము, చాపలము, స్తంభము,
సిగ్గు'ను మొదలైనవాని
చేతను భావింపదగును.

300, 301 అ

**'చింతా'లక్షణం**

"ఏ ఉపాయమునను ఇచ్ఛ
ఈడేరును? అతడితో
ఎప్పుడు కూడుట కలుగును?
చెలులతోటి, ఏమి చెప్పి
పంపవచ్చు?" అని ఊహిం
చుట 'చింత' అనంగాబడు
'నిట్టూరుపు, ధ్యానము, దే
హము సోలుట, హస్తాభర
ణాల చేతితో తడవుట,
స్వేదమ్మును, పులకరింపు,
శయ్య, ఆసనాదులందు
విద్వేషము, నిర్లక్ష్యపు
వీక్షణమ్ము' మొదలగునవి
ఇందు సంభవిస్తాయి.

301 ఆ - 304ఆ

**'సంకల్పావస్థా' లక్షణం**

నాయకుని సమాగమమ్ము
వలన గోచరించి నట్టి
మనోరథము 'సంకల్పము'
అనబడును. ఈ అవస్థ
యందున 'నౌత్సుక్యమ్మును,
స్వేదము, రోమాంచము, స్మర
ణము, శ్వాసము, నేత్రాలను
మూసుకొనుట, బాహ్య వ్యా
పారమ్ములు తెలియకుంట'
మొదలైని కలుగుతాయి.

304 అ 305

**'గుణనుతి' లక్షణం**

నాయకురూపము మొదలౌ
గుణముల పరికీర్తనమ్ము
గావించుట 'గుణనుతి' అని
అనబడును, ఇందున 'రో
మాంచితమ్ము, దగ్గుత్తిక
తో గూడిన వచనమ్ములు
సాభిప్రాయమ్ము తోడ
వీక్షించుట, చెలికత్తెల
తో నాతని సంగమమ్ము

గూర్చి యోచనను జేయుట,
కపోలాలయందు చెమట,
ఉత్సాహము, హర్షమ్ము, స్మరి
యించుటయును మొదలయినవి
ఇందు సంభవిస్తాయి,
306 ఆ 308 అ

**క్రియాద్వేష లక్షణం**

నాయకునందునను తప్ప
ఇతర భోగ్య వస్తువులన
కలిగెడు ద్వేషమ్ము 'క్రియా
ద్వేషమ్మ'ని అనబడును
ఇందు 'చింత, నిశ్వాసము,
దైన్యము, కన్నీరు విడుచు
చుంట, నిదుర లేకయుంట,
పాండిత్యము, విషాదమ్ము,
సోలుట' మొదలయినట్టివి
కలుగుతాయి. 308 ఆ 309

**తాపలక్షణం**

ప్రియుని రాక
లో విలంబనము కల్గు
కామజ్వరమును 'తాప'
మ్మని అనెదరు. ఇందున వై
వర్ణ్యమ్మును, నేత్రజలము,
స్వరభంగము, పడకమీద
పొరలాడుట, నిట్టూర్చుట,
ముఖశోషణ మొదలైనవి
కలుగుతాయి. 310, 311 అ

**లజ్జా త్యాగలక్షణం**

ఔత్సుక్యము
ఇత్యాదుల చేత సిగ్గు
విడిచి పెట్టుటగు అజ్ఞా
త్యాగమ్ము. ఇందున ఆ
జ్ఞను మీరుట, గౌరవమును
తలపకుంట, విషాదమ్ము
వ్యగ్రత, దైన్యము మొదలై
నవి కల్గును. 311 ఆ 312

**ఉన్మాద లక్షణం**

సర్వావ
స్థలయందును ఎల్లవేళ
నాయకునెడ దత్త చిత్తు
రాలై యుండుటచే మది
కొక వస్తువు మరియొక వ
స్తువుగా తోచుట విరహము
వలనగల్గు ఉన్మాదము
అని అనబడు ఇందు తనకు
'ఇష్టమయిన వస్తువు నం
దును సైతము ద్వేషము, ని
ట్టూర్పు, ఱెప్పపాటు లేమి,
హేతురహితముగ నవ్వుట,
ధ్యానించుట, గానము, మూ

ర్ఛను పొందుట, హేతుకమ్ము
గా గమనము, ఉత్థానము,
శంక' మొదలైనవి విషా
దమ్ము, రోషమును ఈ అను
భావమ్ములు కలుగుతాయి.
313–316 అ

## మూర్ఛా లక్షణం

నాయకుండు రానందున
అధిక తాపమగుట వలన
జ్ఞానము సంక్షీణించుట
'మూర్ఛన' అని అనబడును.
'ఇష్టమును అనిష్టమ్మును
తెలియకుంట, పిలిచిన పలు
కకయుండుట, వీక్షణమ్ము
లేకుండుట, శ్రోత్రమ్ములు
వినకుండుట, క్రమముగ ను
చ్ఛ్వాసము నిశ్వాసమ్మును
మంద మౌట, చేష్టలు న
ష్టమ్ము నొందుట, స్పర్శ తెలియ
బడకుండుట, ఇవి మొదలౌ
అనుభావమ్ములు కలుగును.
316 ఆ318

## మృతి లక్షణం

మన్మథ వ్యా
పారముచే కలిగెడు మర
ణేచ్ఛయై 'మృతి' అనగా బడు
ఇందు 'విలాసపు శుకముతో
క్రీడ, ఇతరములౌ వానిని
చెలికత్తెల కొప్పగింత,
కలకంఠ కలాలాసము,
వినుట, మందమారుతమ్ము
ఆశ్రయించుటయు, వెన్నెల
లో ప్రవేశమొనరించుచుట,
మాకంద పుగుచ్ఛమ్ముల
వీక్షించుట, ఉరి మొదలౌ
వానిని, సన్నాహాలై
నట్టి వాని సిద్ధముగా
వించుకొనుట, నేత్రజలం
తోటి దృష్టి' ఇత్యాదులు
కలుగుతాయి. 318 అ 321 అ

## విరహ విప్రలంభ లక్షణం

ఒకే ఊరిలో ఉండే
ఒక నాయిక – నాయకులకు
ప్రీతి సిద్ధముగ నుండగ
కార్యవశమునను గానీ
పరాధీనతా, హేతువు
వల్ల గాని కలిసికొనగ
కాలహరణ మయ్యె నేని
అద్ది 'విరహ విప్రలంభ
శృంగారము' అనబడును

ఇందు త్సాహమ్ము , చింత,
నిట్టూరుపు, వితర్కమ్ము
మొదలయినవి కల్గుతాయి.
321 ఆ 322

### మాన విప్రలంభ లక్షణం

వీక్షణ, ఆలింగనమ్ము
మొదలౌ వ్యాపారమ్ముల
నిరోధించి యుంట 'మాన
విప్రలంభ'మని అనబడు
ఆమాన్యము 'ప్రణయ మాన'
మని, 'ఈర్ష్యా మాన'మనియు
ఇరుతెఱుగులు. 323

### ప్రణయ మాన లక్షణం

వానిలోన
నాయిక–నాయికలకును ప
రస్పరమ్ము ఆజ్ఞాలం
ఘనము చే కలిగెడు నట్టి
'ప్రణయ మాన' మౌతుంది
అందు మాటలాడకుంట,
మోము త్రిప్పుకొని ఉండుట
మొదలైనవి కలుగుతాయి. 324

### ఈర్ష్యా మాన లక్షణం

అన్యస్త్రీ సంభోగము
నెఱుఁగుటచే ప్రియుని యందు
కల్గు కోప 'మీర్ష్యా మా
నము' అని అనగా బడును
ఇది అభాషణమ్ము, ఉపా
లంభనమును, తాడనమును
వైముఖ్యము, నేత్రజలము
ఇత్యాదులచే ఎఱుంగ
గా దగినది. దేని నెఱుం
గుట, శ్రవణము, దృష్టియు అను
మానమ్మను మూటిలోన
దేని వలన నైన కలుగు. 327

### శ్రవణాది నిరూపణ

శ్రవణమ్మను నది దూతిక
ఇత్యాదుల వలన వినుట
'దృష్టి' ఎదుఱుగా జూచుట,
అనుమానమ్మను నది స్వ
ప్నమ్మున గోత్రస్థలనాదుల
వలనను కలుగుతాయి.
అని చెప్పంగా బడినవి. 327

### ప్రవాస విప్రలంభలక్షణం

నాయిక నాయకులు వేఱు
దేశమ్ముల వసించుట, 'ప్ర
వాస విప్రలంభ'మ్మని
చెప్పంబడు. ఇందు 'కృశిం
చుటయు, బాగ తెల్లవడుట,
నిట్టూరుపు, చింతయు, దీ

నత్వమ్మును, నేత్రజలము,
లంబాలకతయు' మొదలౌ
అనుభావమ్ములు కలుగును.
328- 329 అ

## శాప విప్రలంభ లక్షణం

దూరములో ఉన్న లేక
సమీపమ్ములో ఉన్న
జాడ్యముచే నోకోపము
'శాప విప్రలంభ'మ్మని
అనబడును. ఇందు 'చింత,
సంతాపము, నిశ్వాసము
'పాండిమమ్ము' మొదలౌ అను
భావములు కలుగుతవి. 'అ
యోగవిప్రలంభ'మందు
చెప్పబడిన దశావస్థ
లితర విప్రలంభమ్ముల
అందు యథోచితముగ గలు
గును అని చెప్పంగ బడెను.
329అ - 331

## సంభోగ శృంగార లక్షణం

'పరస్పరానుకూల్య విలా
సములు గలిగి దర్శనాన్ని
స్పర్శనాన్ని ఇతరాలను
ఎందు పొందుతారో' అది
'సంభోగ శృంగారము'
అనబడును అందున విక
సించిన కనుబొమల చేత
ఎంతో అందమయిన చూపు,
లలితము, మధురమ్ము అయిన
పలుక స్తంభమును మొదలౌ
సాత్విక భావము లన్నియు
లీలలు, మొదలౌ చేష్టలు
ప్రసన్నమైన ముఖ కాంతియు
మొదలైనది దీనికి అను
భావమ్ములు, జుగుప్స, శ్రమము
నిర్వేదము, వ్యాధియు ఉ
న్మాదమ్మును, మదము, మృతి వి
షాదమ్ము, అమర్షము, ఆ
లస్య మపస్మారము, వీ
ని వర్జన చేసి ఇతర
రములౌ సంచారీ భా
వాలు కలుగుతుంటాయి.
ఈ సంభోగ శృంగా
రము 'సంక్షిప్త' మ్మని యును,
'సంపన్న'మ్మనియు రెండు
తెఱగు లౌను. యౌవను లౌ
స్త్రీ పురుషులు సాత్వికో ద
యమ్ము, సిగ్గు యిత్యాదులు
చే సంక్షిప్తమ్ము లైన
ఉపచారములను పొందిన
'శృంగారము' సంక్షిప్త

మ్మౌతుంది వియోగమ్ము
నొంది కూడినట్టి వారి
సంభోగము 'సంపన్న'
మ్మన బడును. 331 ఆ - 336

### వీరరస లక్షణం

విభావాను
భావ సాత్విక వ్యభి చా
రీ భావమ్ముల చేత స
దస్య రస్యతను పొందిం
పగబడినది అయి ఆలం
బన గుణదానాదులచే
ఉద్దీపిత మగునుత్సా
హమ్మే 'వీరరస' మౌను
అది ప్రసన్న మౌ ముఖ కాం
తి త్యాదుల వలనను భా
వింపదగును. ఔత్సుక్యమ్ము
చింత, హర్ష మిత్యాదుల
చేత నద్ది పోషింపం
గాబడును. ఆ వీరర
సమ్ము యుద్ధవీర, దయా
వీర, దాన వీర రసము
లంటు ముత్తెఱంగు, 337-339

### యుద్ధ వీర రస లక్షణం

యుద్ధవీర రసమునందు
యుద్ధానికి సాహాయ్య
మ్మును వెదకుట, యుద్ధానికి
ఉచితమైన పటుత్వమ్ము,
'భయమొందినవారి కభయ
దానమ్ము'ను ఇత్యాదులు
అనుభావములును, హర్షము
గర్వమ్ము, నహర్షణమ్ము
మొదలౌ వ్యభిచారీభా
వాలు గలవు 340, 341 అ

### దయా వీరరస లక్షణం

దయావీర
రసము నందు తన అర్థము
ప్రాణము పోగొట్టుకొనే
వాడు అయిన తన్ను శరణ
జొచ్చువారి రక్ష చేయుటమ్ము
ఆశ్వాసన చేయు, వచ సు
స్థిరత్వమ్ము, ఇది మొదలౌ
అనుభావములును మతి, ధృతి
మొదలౌ వ్యభిచారీ భా
వాలు గలవు. 341 ఆ, 342

### దానవీర రస లక్షణం

దానవీర
రసమునందు మందస్మిత
పూర్వకయౌ పలుకులనను
మోదించుట, గుణదోష వి
చారణమ్ము మొదలౌ అను

భావములను, ధృతి, హర్షము
ఇవి మొదలౌ వ్యభిచారీ
భావమ్ములు ఉన్నాయి. 343, 344

**కరుణ రస లక్షణం**

విభావాను భావసాత్వి
కవ్యభిచారీ భావా
లచే సదస్యులకును అనుభ
వార్హత్వము పొందింప
బడిన శోకస్థాయి 'కరుణ
రస' మనబడు. ఇందు ధర్మ
నాశనమ్ము, అర్థనాశ
నమ్ము, ఇష్టజనబాంధవ
ఘననాశము, ఉరిదీయుట,
దారిద్ర్యము, పదభ్రంశ
మ్మవ మానము, దైవ - ఉపహ
తియు, ధిక్కారము, వ్యాధియు,
శాపము' చెప్పుటయును ఇవి
మొదలైనవి చూడబడిన,
అనుభవింపబడినను, విన
గా బడినను అవి ఆలం
బన విభావములు ఔను.
ఉద్దీపన విభావాలు
సైతము వానిని ఆశ్రయ
ముగ గ్రహించి ఉంటాయి.
కేశమ్ములు, వసనము, దే
హమ్ము , ఇవ్వి వికారాన్ని
పొందుటయును, శరీరమ్ము
సోలియుంట, ఎట్టిని ముఖ
కాంతి, నేత్ర, నేత్ర జలము
గల్గు చూపు ఈ ఉద్దీ
పనములు, భూపతనమ్మును
ముఖ వైవర్ణ్యమ్ము, హస్త
ముల వ్రేలాడగ వేయుట,
అవికత్థనమును, చేతుల
శిరముపైన పెట్టుకొనుట,
నిట్టూర్పులు విడుచుటయును
వక్షము, తల, శిరము, ముఖము
వీని కొట్టుకొనుట, నేల
పైనను పొరలాడుటయును,
హాహాకారమ్ము, రోద
నమ్ము, విలాపనములను, పరి
దేవనమ్ము ఈ అనుభా
వములు, స్తంభ ప్రణయాది
సాత్విక భావములును, ని
ర్వేదము, దైన్యము, ఆల
స్యము ఉన్మాదమ్ము, వ్యాధి,
సుప్తి, నిద్ర, మోహమును, శ్ర
మమ్ము గాని చింత, స్మృతి
యు, అపస్మారము విషాద
మును, జాడ్యము, ఔత్సుక్యము
శంక, మరణ మీ వ్యభిచా

రీభావము లున్నాయి.
ఈ భావము లుత్తమములు,
మధ్యమాలు, అధమములను
విషయమ్ము యథోచితము
గాను కలుగుతుంటాయి.

345-354 అ

## అద్భుత రసలక్షణం

'విభా వానుభావ సాత్వి
క భావ వ్యభిచారి భా
వముల చేత సభ వారికి
ఆస్వాద్యత్వమును బొంది
ఉండు విస్మయ స్థాయి'యె
అద్భుతరస మౌతుంది
ఈ అద్భుతరసమున కా
దుష్ప్రాప్యమ్మైన వస్తు
వుల లభ్యత, మానవులకు
'శక్యము కానట్టి క్రియల
గావించుట, కాంతిచేత
నిర్ణయింప దగినయట్టి
గంధర్వుల నగరాదుల
వీక్షించుట, మాయ, ఇంద్ర
జాల విద్య, నాట్యమ్మును
మొదలయినవి ఆలంబన
ములు. అందు ప్రసన్నమైన
ముఖరాగము, నేత్రమ్ముల
విస్తృతియును, ఱెప్పపాటు
లేకయుంట, శిరము, కపా
లప్రదేశమును కదలిం
చుట ఈ అనుభావములును
స్తంభము మొదలైన సాత్వి
కాను భావములును, విత
ర్క చాపలము, ఆవేగము,
హర్షము', మొదలైన యట్టి
వ్యభిచారీ భావములును
ఉన్నాయి. 354 ఆ - 358 అ

## హాస్యరస లక్షణం

విభావాను
భావ వ్యభిచారీ భా
వముల చేత సభవారికి
ఆస్వాద్యత్వము పొందిం
పంగబడిన 'హాస్యస్థాయి'
'హాస్య రసము' అనబడును.
'వికట కవులు, ఉన్మత్తులు,
మదము నొందినట్టివారు'
ఇత్యాదులు ఈ రసమ్ము
నాశ్రయించి 'మల్లయుద్ధ
మొనరించుట, ఆకూతము
గావించుట, సిగ్గుమాను
టయు మొదలౌ గుణములచే
మృగముల, పక్షుల, మనుజుల
స్వరముల అనుకరణాలచే

వేద శాస్త్ర కళలు విద్య
దేశభాష లను మొదలౌ
వాని ననుకరించుట’చే
సందర్భము లేని యట్టి
మాటలచే సత్రప్రలాప
ముల చేతను దూషణల చే
పరక్రియల అనుకరించి
పలుకుటచే, చేష్టలచే
దాని ననుసరించు తట
స్థోద్దీపనముల చేతను
బాగుగ నుద్దీపితమై
ఇష్టమ్ములు, నాసికయు, క
పోలమ్ములు, మోము వీని
కదలించుట చేత దంత
ముల వెలిబుచ్చుట చేతను
సంతోషము చేగలిగిన
లెస్స లెస్స అను వచన
మ్ముల చేతను, స్తంభ ప్రళ
యముల విసర్జనము చేసి
రోమాంచము మొదలు అయిన
సాత్వికాది భావాలచె
భావింపంగా బడినది
అయి ఔత్సుకమ్ము,
చాపలమ్ము, వ్రీడ,
హర్షము, స్మృతి, మదము,
శ్రమయు
మతి, గర్వము, అవబోధము,
విస్మయమ్ము, వీని చేత
పోషింపగబడినదియై
ఆ హాస్యము, స్మితము మొదలౌ
ఆఱు భేదములను కలిగి
ఉన్న వంటు చెప్పంగా
బడి ఉన్నవి. 358 ఆ - 365

## స్మితాది నిరూపణము

స్మితము, హసిత
ము, విహసితము, ఉపహసితము
అపహసితము, అతిహసితము
ఈ ఆఱును, ఉత్తమ,
మధ్యమ, అధమ ప్రకృతులయందు
ఒక్కొకనికి రెండు రెండు
కలుగుతాయి 366

## స్మిత లక్షణం

కడ కన్నుల
చూపులచే వ్యక్తమైన
నవ్వులతో కొంచెమ్ము వి
కాసమ్మును పొందినట్టి
చెక్కిళ్ళతో గూడి తెలియ
బడని దంతములు గలదిగ
నుండు నవ్వు ఉత్తములకు
కలుగుతుంది. దీనిని ‘స్మిత’
మంటారు. 367

**హసిత లక్షణం**

వికసితమై
నట్టి గండ దేశాలతో
గూడ వికాసాన్ని పొంది
నట్టి మోము నేత్రమ్ములు
గలదిగాను ఉన్నదో అది
'హసితమ్మ'. 368

**విహసిత లక్షణం**

వంచబడిన
వీక్షను చెక్కిళ్ల యందు
గలదిగాను ఆ సమయము
నందు వచ్చి నదియు ముఖవి
లాసముతో గూడినదిగ
నుండు నవ్వు 'విహసిత' మని
పించుకొనును. 319

**ఉపహసిత లక్షణం**

వికసించిన
నాసిక గల్గినదై నా
లుకయందున కంటిచూపు
కలిగినదై వంచబడిన
బుజము, శిరసు గలదిగాను
కన్న 'నవ్వు' 'ఉపహసిత'
మ్మని అనబడు. 370

**'అపహసిత' లక్షణం**

ధ్వనిని గల్గి
కనుల జలముతోడ గూడి
కంపింపని భుజము, శిరసు
గల్గి చేయునట్టి నవ్వు
'అపహసిత' మ్మనబడును. 371

**అతిహసిత లక్షణం**

స్వరముతోడ గూడినదిగ
కన్నీరును కార్చునదిగ
అధిక ధ్వని పొందినదిగ
గొప్పదిగా పార్శ్వమ్ముల
పిసిగి కొనెడి యట్టిది గను
ఉండు నవ్వు 'అతి హసిత'
మ్మనబడును. 373

**భయానక రస లక్షణం**

విభావాను
భావ వ్యభిచారి సాత్వి
క భావాల సభ్యుల
రస్యత్వం పొందింప
బడినది అయి ఉండు భయ
స్థాయి భయానకరస మౌ
నని తెలియుడు. ఈ రసాన్కి
రాక్షసుండు, దయ్యము, భ
ల్లూకము, వ్యాఘ్రము నాగు

మొదలౌ వానిని జూచుట
మాన్యమైన కాననమ్ము
గృహము, తోట, శ్మశానమ్ము,
మొదలగు వానిలో ప్రవేశ
మొనరించుట, కలహము,
చౌర్యమ్ము, రాజవిద్రోహము,
వికారంగ ఉగ్రంగా
ఉండు స్వరము మొదలయినవి
ఆలంబన భావమ్ములు.
'స్వేదము, ఉద్దీపనమ్ము
ముఖము కపోలమ్ము వీని
కంపమ్మును, ముఖ శోషణ
పార్శ్వము నవలోకించుట
దుఃఖరాగము శ్యామ మౌట
కనుతారలు వలనముగా
వించుటయును, ఒక ప్రక్కకు
పోవుచుంట, ప్రణయమ్మును
నొనరించుట, కాందిశీక
తను గావించుట, అంగుళి
త్రాణమ్మును కఱచుకొనుట
ఆంగికముల వాచికముల
సహాయాన్ని వెదకి కొనుట
నేను నీకు దాసుడను
నిన్ను శరణు పొందినాను
కాపాడుము నన్ను నీవు
అని అనుటయు నివి మొదలౌ'
అనుభావమ్ములును అన్ని
సాత్విక భావములును త్రా
సము, ఆవేగమ్ము, మృతి, వి
షాదము, చాపలము, మోహ
మును, చింతయు, జాడ్య మప
స్మారము, ఈ సంచారీ
భావమ్ములు ఉన్నాయి. 374, 378

### 'బీభత్స' రస లక్షణం

విభావమ్ము మొదలగు భా
వాలచేత సభవారికి
ఆస్వాద్యత్వము పొందిం
పగ బడినదియు జుగుప్సా
స్థాయియు నైనదియును 'బీ
భత్స'రసం అనబడును.
ఈ బీభత్సపు రసమ్ము
రక్తము, మాంసము, పులిభీ
రును, ఎముకలు, మొదలగునవి,
వాంతి, జొల్లు మొదలగునవి
ఆశ్రయమ్ముగా గలదియు
వెనుకకు తిరుగుటయు, మోము
దృష్టి వంకరగబోవుట
మొదలైనవి. శ్యామమ్మౌ
ముఖరాగము ఈ అనుభా
వములతోను, పులకలు మొదల
లైన సాత్వికానుభావ

ముల తోను, నిర్వేదము,
శంక, అపస్మారమ్ము, వి
షాదము, జాడ్యము, దైన్యము
మోహము, శోకము, మొదలౌ
వ్యభిచారీ భావాలతో
గూడియుండు ఇద్ది క్షోభ,
బీభత్సము అంటు రెండు
తెరగులుగా కనుపించును
వానిచేత కల్గునదే
"క్షోభయు, బీభత్సమ్మును,
రక్తము మాంసము మొదలౌ
ఛర్దిలాల ఇత్యాదుల
వలన పుట్టు నట్టిది, 'ఉ
ద్వేగీ బీభత్స' మ్మని
అనబడుతూ ఉంటాయి. 384

**'రౌద్ర' రస లక్షణం**

విభా వాను భావ సాత్వి
క వ్యభిచారీ భావ
మ్ముల చేతను సభ్యుల ఆ
స్వాద్యత్వము పొందింపం
బడిన క్రోధ స్థాయి 'రౌద్ర'
రసమని చెప్పంగబడును.
ఆకతాయి, కొండెమ్ముల
చెప్పువాడు, పాపము మొద
లైన వాని చేయమంటు
చెప్పువాడు, క్షేపము, అవ
మానమున మొదలైన యట్టి
ఆక్రోశమును బంధనమ్ము
వధ, మొదలౌ హింసను గా
వించువాడు, ద్రోహము చే
సేవాడును దీనికి 'ఆ
లంబనములు. దౌర్జన్యమ్మును
భయరహితత గర్వము ఔ
ద్ధత్యమ్మును మొదలౌ గుణ
ములను "ఎవడురా నీవు
ఏమి చేయుచున్నావురా"
అనునవి మొదలైన క్రూర
వాక్యములును, విరోధపు
వచనమ్ములు శిరఃకంప
నము హాసము, వక్రీక్షణ
మొదలైనవి దష్టోష్ఠత
కనుబొమ్మల ముడివేయుట
గ్రుడ్డు ఎఱ్ఱనై గిరగిర
తిరుగు చుంట, నలగొట్టక
భుజాస్ఫాలనము చేయుట
చపేటమ్ము ముష్టితాడ
నమ్ము, కపోల స్ఫురణము,
ఎఱ్ఱనయిన ముఖరాగము,
వధియింపగ నుద్యమమ్ము
భేదించుట, ఆకర్షణ
గావించుట ఆఘాతము

నొనరించుట, ఛేదనమ్ము
వస్త్రమును విదిలించుట,
భాషణమ్ము,
దండము శస్త్రాస్త్రమ్ముల
గ్రహియించుట
అభిధావన, మారణమ్ము
అశ్రువులను కల్గించుట
రక్తపాన మొనరించుట
మిక్కిలిగా తరుముటయును
"ఓరి పాపి" మనుజ పశువ
ద్రోహి నిలువు. ఎచట కేగె
దోయి నీవు, మూర్ధమ్మును
ఉత్పాటన గావిస్తా
వక్షమ్మును చీలుస్తా
దంతమ్ములు రాలుస్తా
గాత్రమ్మును సంచూర్ణం
గావిస్తా' ఇవి మొదలౌ
వచనాలు భయం లేక
వర్ణించుట, సాత్వికమ్ము
లేక యుండు. అనుభావము
లై ఉంటవి. అమర్షమ్ము
మదము స్మృతియు ఔత్సు
క్యావేగమ్ములు మోహము, గ
ర్వమ్ము, ఈర్ష్య, చాపలమ్ము
ఉగ్రత, ఈ సంచారీ
భావమ్ములు దీన్కి గలవు     394

**రసాద్ర సోత్పత్తి**

'శృంగార రసము' వలన
'హాస్య రసము' ఉద్భవించు,
'రౌద్ర రసము' వలన 'కరుణ
రసము' కలుగు, 'వీర రసము'
చే 'నద్భుత రసము' గలుగు
'బీభత్స రసమ్ము' వలన
భయానక రసమ్ము కలుగు

**రసములు - వైరుధ్యము**

'శృంగారము, బీభత్సము
రెండు పరస్పర శత్రువు
లౌ రసాలు.
వీరభయా
నక రసముల రెండింటికి
వైరుధ్యం చేరి ఉంది.
రౌద్ర రసము అద్భుతమ్ము
వైర రసాలై యున్న
హాస్యరసము, కరుణ రసము
వైరుధ్యము గల రసములు
రసము లన్ని కార్య వశ
మ్మును చేరుతు ఉన్నవేళ
వానిలోన ఏ రసమ్ము
మొదట చెప్పబడుతుందో
అది ప్రధాన రసమౌను..

రసములలో ముఖ్యమైన
రస మందున తదితరములౌ
రసములు ఒకానొక్క
సమయంలో అంగత్వము
నొందుతాయి. 398

## రసములకు వ్యభిచారి భావములకు ఆనుకూల్యత

ఎన్మిది రస
ములకును, ముప్పదియు మూడు
వ్యభిచారీ భావాలకు
అన్యోన్యం ఆనుకూల్యం
చెప్పంగా బడుతున్నవి. 399

## శృంగారానికి 33 వ్యభిచార భావాలకు ఆనుకూల్యత

శృంగార రసమ్ము నందు
ముప్పది మూడగు వ్యభిచా
రీభావాలను ప్రయోగ
మొనరింపగావచ్చును. 400 అ

## వీర రసానికి ఆనుకూల్యత గల వ్యభిచారీ భావాలు

వీర రసము
నందున ఆమర్షమ్ము వి
బోధమ్ము, వితర్కము, మతి
ధృతి, క్రోధము, అసూయయును
సంమోహము, ఆవేగము
హర్షము, గర్వమ్ము, మదము
ఇవి కలుగును. 400 ఆ

## కరుణరసానుకూల వ్యభిచారీ భావాలు

కరుణ రసము
నను 'దైన్యము, చింత, గ్లాని
నిర్వేదము, జాడ్యము, స్మృతి
వ్యాధి' అనే ఈ వ్యభిచా
రీ భావమ్ములు కలుగును. 401

## అద్భుత రసానుకూల వ్యభిచారి భావాలు

'ఆవేగము జాడ్యము మో
హము, హర్షము, విస్మయమ్ము
స్మృతి', ఈ వ్యభిచారీ భా
వము లద్భుత రసము నందు
కలుగుతాయి. 402

## హాస్య రసానుకూల వ్యభిచారి భావాలు

'శ్రమము చాప
లమ్ము, నిద్ర, స్వప్నమ్మును
గ్లాని, శంక, ఈర్ష్యము, అవహిత'
అనే వ్యభిచారీ
భావమ్ములు హాస్య రసము
లోన కలుగు 403

**భయానక రసానుకూల వ్యభిచారి భావాలు**

సంత్రాసము
మృతి, దైన్యము గ్లాని ఇవి భ
యానకము నందున గలిగెడు
వ్యభిచారీ భావమ్ములు 404

**బీభత్స రసానుకూల వ్యభిచారీ భావాలు**

అపస్మారమును, విషాద
మును, భయమ్ము, రోగము, మృతి
మదమును ఉత్సాహము ఈ
వ్యభిచారీ భావమ్ములు
బీభత్స రసమ్ము నందు
కలుగుతాయి. 405

**రౌద్రరసానుకూల్య వ్యభిచారి భావాలు**

హర్షమసూ
యయు, గర్వము, ఉత్సాహము
చాపల్యము, ఉగ్రత ఇవి
రౌద్ర రసము నందు గల్గు
వ్యభిచారీ భావములని
ప్రశంసింప బడుతున్నవి 406

**భరతరస ప్రకరణ సంపూర్తి**

ఆలంబన భూతనాయి
కానాయక మానసముల
కారణమ్ముచే గలిగిన
దై కార్యము లయిన యట్టి
అనుభావమ్ముల చేతను
జ్ఞాన విషయమును వహించి
సహకారుల వ్యభిచారీ
భావముచే పోషణమ్ము
పొంది సాక్షి అయి సంభో
గ శృంగారమ్ము నొందు
సౌఖ్యమ్మును
'విప్రలంభ
శృంగారము'నను శోకము
కలుగజేసి భావమ్ముల
అనువర్ణన నామకరణ
ముల చేతను కావ్యమందు
నాట్యమందు వ్యక్తమ్మై
నిరాశ్రయమ్ము అయి సుఖకర
మైన రసము రసికులచే
ఆస్వాదింపంగబడుతు
కనుపించును.

---

శ్రీమాన్ నీడా మంగలం
తిరు వేంకటాచార్యుల
భరతరస ప్రకరణ అనువాదం
సంపూర్ణము

***23-1-91***

# మహాకవుల మతం

# మహాకవుల మతం

**1**

సభ్యతన్న 'ప్రవర్తనా
సౌందర్యం' రమ్యమైన
వర్తనమ్ము పరిపూర్ణత
నొందటాన్కి సహనమ్మును,
ఆత్మనిగ్రహము, విశ్రాం
తిని నొసగే పరిసరాలు
వాతావరణమ్ము ఎంతో
అవసరమ్ము, సత్యమైన
మర్యాదయు, సంగీతము
చిత్రకళా ఖండమ్ముల
బోలు సృష్టి, కంఠస్వర
మందును, చలనములలోన
సంభాషణ పద్ధతిలో
చేష్టలు మొదలైన యట్టి
విషయమ్ముల సామరస్య
మందున నా ఔదార్యము
ప్రస్ఫుటమ్ము చేయబడుటె
మర్యాదనిపించుకొనును.
దానికి మనుజుని తత్త్వం
ఉన్మీలన గావించుట
గాని అన్యయౌ ప్రయోజ
నమ్మింకొక టెదీ లేదు
మనకీ భౌతికములైనవౌ
అవసరాలు మనలనెపుడు
త్వరపెడుతూ ఉంటాయి.
అవి ఎంతో పరుషాలై
ఎట్టి ప్రమాణాలను పా
టించకుండ పరస్పరమ్ము
త్రోసుకొంటు పరుగిడుతూ
ఉంటాయి. వాటికెట్టి
తీరుబాటుగాని, లక్ష్య
సాధనమ్ము వినా అన్య
విషయాలల్లో సహనం
గాని లేవు. మన దేశం
లోన నీరు తెచ్చుకోను
ఆ ఖాళీ కిరసినుడ
బ్బాలు మొరటు మొరటుగాను
కోయంబడి, కర్రలచే
అడ్డంగా బిగింపంబడి
కేవలమ్ము నీటితోటి
నింపబడుట అను ప్రయోజ
నమ్ముగాక అవ్వి అన్య
మైన యెట్టి ప్రయోజనము

ఆశింపవు. వాటి మొరటు
తనము కవ్వి సిగ్గుపడవు
మనవౌ ఆవశ్యకతల
మూలమైన కారణాలు
ఆహారము, వస్త్రమ్ములు
నీడ ఇతరమౌ సుఖసౌ
ఖ్యములన్నీ కావలెనని
నిత్యము నిర్బంధించును
అయితే మానవులు తాము
కేవల మీ నిత్యావస
రముల పట్టికలను త్రోసి
పుచ్చి వారియందున నొక
పరిపూర్ణమ్మయిన యొక్క
ఆదర్శం కలదనియును,
తమ వివిధాంశముల మధ్య
పరిసరములతో తమకొక
సామరస్య మున్నదనియు
ప్రకటించుటకును తమదౌ
కాలములో బహుభాగము
వ్యయమొనరిస్తున్నారు.
అనంతత్వలక్షణమ్ము
అంతులేని విస్తరణలో
లేదు. అట్టి అద్వైతమ్మని
చెప్పబడే ఏకత్వపు
రహస్యమ్ము నందున్నది.
సృజనీకృతమైన విషయ
సందోహము అంతులేని
ప్రాంతమ్మును, కాలమ్మును
ఆక్రమించు.
అయితే ఈ
విషయపు సందోహాన్నం
తటిలోన నిముడ్చుకొన్న
సత్యానికి మాత్రమెప్పు
డెట్టి పరిమితియును లేదు.
అద్ది ఏకైకమ్ము, అద్వి
తీయము మరి ఏదైనా
స్వల్ప విషయమ్మునగానీ,
ఘనవిషయమ్మున గానీ
ఈ అద్వైతంపు స్పర్శ
మనకు సోకినప్పుడనం
తత్వ స్పర్శ గుర్తింపగ
బడుతున్నది.
ఒక్కమారు
ఒక్కరితో మన వ్యక్తి
త్వమ్మువలన లభియించే
ఆనందము గూర్చి నేను
ప్రస్తావన చేసినాను.
మనలో నేకత్వ భావ
మొక్కటి నిక్షిప్తమ్మై
ఉంటవలననే మనమీ
ఆనందము అనుభవింప
గా గలుగుతు ఉన్నామని
అన్నాను.
అతడు తనకు

"అట్టిదయిన ఆనందపు
టనుభవమ్ము ఎన్నండును
కలుగలేదు" అన్నాడు.
"కాని అద్ది అతిశయోక్తి
అనియే నా అభిప్రాయము.
తనలోపలి ఏకత్వపు
భావనకును, పరిసరాల
కును పొంతన భగ్నమౌట
వల్ల కలిగినట్టి బాధ
చేత అలా ఆతడు ఊ
హించి ఉండగా వచ్చును.
కానీ ఈ విషయమ్మే
ఆయేకత్వపు నస్తి
త్వాన్ని ఎంతొ అధికంగా
చాటుతోంది. శరీరమ్ము
వ్యాధిగ్రస్తమ్మయినపు
డే ఆరోగ్యపుటర్థము
మానసాన్ని కడు బలముగ
హత్తుకొనును.
దేహంలో కడు ముఖ్య
మ్మయిన విధుల సామరస్య
మే ఆరోగ్యమ్ము గనుక
ఆనందము నిస్తోంది.
జీవన మందలి విషాద
సంఘటనలు జీవిత సం
తోషమ్మును తాత్కాలిక
ముగను భగ్న మొనరజేసి
శాశ్వతమౌ ఆనందపు
సూత్రాస్తిత్వాన్ని నిరూ
పించుటకే గాని వాని
అస్తిత్వము ప్రకటనగా
వించుకొనుట కేర్పడినవి
కానెకావు. మనయందలి
ఏకత్వపు పరమావధి
తోటి జీవులందరి పరి
పూర్ణ ప్రేమమూలంగా
తనదు అనంతత్వమ్మును
తెలుసుకొనుటె ఈ ఏక
త్వాన్కి గల్గు సర్వవిధూ
తాలు దైన్యమును కల్గిం
చుచు నీచప్రవృత్తులవి
జృంభణాన్కి దారితీయు
ఈ నీచప్రవృత్తులు బహు
విభిన్నతా దృక్పథమ్ము
వలన జనించిన మాయా
రూపమ్ములు. మనయందలి
ఏకత్వము వల్ల పుట్టు
ఆనందము తన్ను తాను
వెల్లడిగావించుకొనే
యత్నంలో సృజనశీల
మౌతున్నది. అయితే మన
అవసరాల తీర్చుకొనను
మన అందున పుట్టెడు కో
రిక మాత్రం నిర్మాణా

నికి కారణమౌతున్నది
జలకుంభం ఒకదానిని
పాత్రదృష్టితో మాత్రమే
దర్శించిన దాని ఉనికి
కర్థమేమి? అన్న ప్రశ్న
ఉదయించు ప్రయోజనాత్మ
కమ్ము అయిన తన రూపమె
తన అస్తిత్వానికి కా
రణమని అది అనవచ్చును.
కాని అదే ఒక సుందర
రూపమ్మును పొంది ఉన్న
యప్పుడు అది తన ఉనికికి
ప్రత్యేకంగా అర్థము
చెప్పుకొనగ అవసరమ్ము
ఏముండదు! దాని ఉనికి
మాత్రమ్మే దాని పరమ
ప్రయోజనమ్ము. ఈ సుందర
జలకుంభము లైనట్టివి,
తనలో నందర్భాగము,
బాహ్యదృష్టికిని అనేక
ములుగ తోచుచున్నట్టివి
అయిన వస్తుసముదాయము
అంతటిదౌ సమన్వయము
చేత విచిత్రముగా మన
యందలి ఏకత్వ భావ
నా సంగీతమునకు సమ
శ్రుతిలో స్పందించెడు నొక
ఏకత్వము తన రూపము
అని వ్యక్తము గావించును.
ఈ ప్రపంచ మందలి స
త్య మెట్టిది? అద్ది ఈ ప్ర
పంచమందు ఉన్న పదా
ర్థాలదైన పరిమాణపు
ఘనతయందుగాని వేద
సంఖ్యలదౌ విశేషాన
గాని లేదు. అద్ది ఆ ప
దార్థమ్ముల అన్యోన్యపు
సంబంధంలో ఉన్నది
ఈ సంబంధమ్ము ఒక్క
లెక్కకయిన, కొలతకైన
అందనట్టిదై ఉన్నది.
అద్ది వ్యక్తమైన పదా
ర్థాలదైన వైవిధ్యం
లోనగాక ఒక్కటియే
అయిన యట్టి వ్యక్తిత్వం
లోఉన్నది. మనకు ఉన్న
విషయ పరిజ్ఞానమెల్ల
ఆ విషయాలకు విశ్వం
తో గల సంబంధమ్మును
గ్రహియించుటలోనే ఉంది.
ఈ సంబంధమ్మే జగ
త్సత్యమ్ము.
జలబిందువు ఒకటి కేవ
లమ్ము దానిలోని వివిధ

మూల పదార్థాల సముదా
యమ్ము కాదు. అది అచ్చెరు
వయ్యెడు నా మూలపదా
ర్థాలదైన అన్యోన్యపు
సమ్మేళనయునను ప్రకట
మౌనేకత్వంపు బాహ్యా
రూపమ్ము. ఈ ఏక
త్వపు రహస్యమును తెలుపుట
కై ప్రతి విషయమ్మును విడ
దీసి చూచు విశ్లేషణ
దృక్పథాన్కి శక్తిలేదు.
పదార్థాల తత్వమెంతొ
అగోచరమ్ము ఎందువల్ల
నంటే మనదౌ వాస్తవి
క ప్రపంచ మీ పదార్థ
తత్వరూపమును గ్రహించ
టాన్కి నిరాకరణ వహి
స్తోంది గనుక ప్రాపంచిక
మహాశక్తులైన కేంద్ర
శక్తియు, నభిముఖశక్తియు,
నా పరాఙ్ముఖపు శక్తియు
మనదుగ్రహణ శక్తికి గల
పరిధికెంతో ఆవలనే
ఉన్నాయి. ఈ శక్తులు
సృష్టికర్త దర్బారులో
ప్రవేశింపనర్హతలే
నట్టి రోజు కూలీలు

కాని కాంతి, శబ్దమ్ములు
వివిధ రమ్య వేషాలను
స్వీకరించి, ఇంద్రియాల
సమక్షాన నృత్యమ్మొన
రిస్తున్నవి. సదా మనకు
ఈ ప్రపంచక దృశ్యము
సిద్ధమైనవిందుగాని
ఆ విందును సిద్ధపరచు
నెట్టి పాకశాలి కాదు.
ప్రాపంచిక బాహ్యరూప
మేగానీ దాని ఆంత
రంగిక తత్వమ్ము కాదు.
ఋతువులదే నాట్యచంక్ర
మణము, పట్టుచిక్కనిదౌ
కాంతిచ్ఛాయా విచిత్ర
లీల, పంచభూతమ్ముల
వివిధ శక్తి ప్రదర్శనము
చిత్రవర్ణ విలసితమౌ
పక్షాలతొ జీవవిహం
గాల జనన మరణమ్ముల
మధ్య సలుపు విహారాలు
ఇవియే మన కంటికి కను
పించునట్టి దృశ్యమ్ములు.
వీనికి గల ప్రాముఖ్యం
దేశకాల బద్ధమైన
వానిదియగు అస్తిత్వం
లోనగాక, వానివైన

సామరస్య పరిభాషలో
మన ఆత్మకు మాతృభాష
సామరస్య పరిభాషతో
వంటిదైన పై జెప్పిన
అవ్వి మనకు తెలియబడుట
లో ఉన్నది.
ప్రాపంచిక
ప్రాభవమ్ము కొరకు ప్రాకు
లాడుటచే నాధ్యాత్మిక
తయే లోపించిన యప్పుడు
మనము ఈ మహాసత్యపు
స్పర్శకు దూరులమౌటను
దాని వైన ఆహ్వానము,
ఆతిథ్యములను నిరాద
రిస్తాము!
"రాత్రింబవ
ళులు మనలను విడువకుండ
నీ ప్రపంచ మతి సన్నిహి
తమ్ముగ మనతోనున్నది.
అర్చనలో, భోగాలలో
మగ్నులమై మనము మనదు
శక్తులెల్ల వ్యర్థంగా
వించుకుంటు ప్రకృతిలో
ఉన్నయట్టి మనదౌ దా
నిని కొంచెము కూడ తెలుసు
కొనుట లేదు" అంటు వర్డ్సు
వర్తుకవీశుండు పద్ద
వేదనలో ఈ సత్య
మ్మే వ్యక్తమ్మౌతున్నది.
కానీ ఈ దౌర్భాగ్యం
మనకు ఈ ప్రపంచ మ్మతి
సన్నిహితమ్మగుట చేత
సంప్రాప్తించేది కాదు.
ప్రకృతిలోని భిన్నత్వా
న్నన్వేషణ గావిస్తూ
పరుగులాడటములోన
దానిలోని ఏకత్వపు
రూపమ్మును దర్శింపగ
లేకపోవటమ్ము వల్ల
కలిగింది.
భౌతిక విష
యాలు భౌతికపు విషయా
లుగ గ్రహింపబడినప్పుడు
అవసరాలు వానికెట్టి
పొత్తులేదు. ఎల్లప్పుడు
అన్యోన్యం హింస చేసు
కొనటానికి అతిసిద్ధము
గా ఉంటవి. మనుజులలో
వ్యక్తిగతమ్ము ఉద్రే
కాలవోలె అవి నిరవధి
కమ్ము అయిన స్వేచ్ఛాప్ర
వృత్తి కోరుతుంటాయి.
స్వభావమ్ము చేతను అవి
నశ్వరాలు అయితే, ఒక

మారీ విషయమ్ములొక్క
ఏకత్వాదర్శనాన్కి
లోబడితే వాని విప్ల
వాత్మకాలు అయిన శక్తు
లెల్ల నిగ్రహింపగబడి
వానిలోని సృజన బహి
ర్గతమౌను. శాంతి స్వరూ
పమ్ములోను, దోషరహిత
మైన పరస్పర సంబం
ధాలలోను అంతర్నిహి
తమ్ము అయిన ఐక్యతయే
ఈ సృష్టి భోజనమ్ము
నందు నధికమౌ కోరిక
స్వాభావికముగను జుగు
ప్సాకరమ్ము స్వార్థమయము
దాన్కి 'సభా మర్యాద'ను
పాటించే గుణము లేదు.
అయితే, సామాజిక సౌ
భ్రాత్రపుటా దర్శానికి
లోబడినప్పుడు అది ఒక
విధానాన్ని సంతరించు
కోని ఒక్క అలంకార
ముగను పరిణమిస్తుంది.
మనుజ స్వభావాన కామ
ముధృతమ్ము, వ్యక్తిగతము,
నాశకరము నైనట్టిది.

కాని అమలమైన ప్రేమ
అను ఆదర్శప్రభా
వమ్ము వలన అద్ది విశ్వ
ప్రేమ అనే పరమ సత్య
మునకు ప్రతీకమ్ము వోలె
సంపూర్ణపు సౌందర్యం
తో వికసిస్తూ ఉన్నది.
ఈ విధంగ ఏకత్వం
సృజియింపగ బూనుకోని
అనేకత్వముగను వ్యక్త
మౌట అనేకత్వము వివి
ధత్వమ్మును విడిచిపెట్టి
ఏకత్వముగా పర్యవ
సించటమ్ము కానుపించు

**2**

మా ఉపవనమున బారులు
తీర్చి నిల్చె శాఖా హ
స్తాలతోటి ఉదయభాను
నాహ్వానం చేస్తు ఉన్న
నారికేళ వృక్షమ్ములు
నా బాల్యమునందు నాకు
తమసజీవ సాహచర్య
మును అందిస్తుండేవి.
నా ఊహాశక్తే నా
బాహ్యాజగత్తునునా ఊ
హాజగమ్ముగా పరివ

ర్తన చేసేనంచు నేను
ఎరుగుదును. ఏకత్వా
న్నన్వేషణ గావిస్తూ
బాహ్యాజగముతో వ్యవహా
రము చేసేదైనను ఊ
హాశక్తే. పరిసరమో
ప్రకృతి యిచ్చునట్టిది ఈ
సాహచర్యమును వాస్తవ
మైనదేను అని భావిం
పగవలయును. నా ఊహా
జగమునకతి సన్నిహిత
మ్మైన అంశ ఒక్కటి ఈ
ప్రపంచాన ఉన్నది మరి,
లేత మనసులందునుండు
సృష్టికర్త కున్న శక్తి
కీయంశమె తట్టి మేలు
కొలుపుతుంది. పలురంగుల
దారాలతొ తనకు నచ్చి
నట్టి రీతిలో ఎన్నో
రూపాలను (సృజన అనే
చిత్రమైన వస్త్రంలో)
కువిందమ్ము చేయుచున్న
సృష్టికర్త కానందం
ఈ సత్యం మనకు చాల
సన్నిహితం ఐంది గనుక
అది మన ఊహాశక్తితో
అనుగుణ స్పందనము కల్గి
ఉంది. కొన్ని తంత్రులు మరి
కొన్ని తంత్రులతో సమశ్రు
తిలోనున్నచో నీ సమ
శ్రుతి ఒక శాశ్వత సత్యము
ప్రకటన చేస్తూ ఉందని
మనకు తెలుసు. ఈ జగత్తు
నుంచే మన కాల్పనిక
మ్మోజగతికి ప్రేరణ లభి
యిస్తున్నది. అను అంశము
వలనను ఈ సృజనాత్మక
కల్పన ప్రకృతికి మనకు
సామాన్యం అంటు తెలు
స్తూ ఉన్నది.
"ఏది ప్రాతదౌ మతమో
దానిలోనె పాతుకోపో
యిన ప్రాణిగ ఉండటమ్మొ
తలచిచూడ నెంతో మేలు.
ఏకాంతపు బాధతీర
ఎన్నెన్నో ఏవేవో
స్వప్నాలు వహిస్తు నేను
నా ఈ ఉపవనము నందు
నిలచి అచట కడలి నుండి
వెడలివచ్చు. 'ప్రోటియనునో',
'కొమ్ము నూదు ట్రైటానునొ'
మనోనేత్రమార్గంలో
కనియెద నా కరువు దీర"
అన్న సుకవి వర్డ్సు వర్తు

భావనలో కల్పనాజ
గమ్ము ఇచ్చు సహాయాన
మన మేకాంతమును పార
ద్రోలగలము అను నాశా
భావము దృఢముగ నున్నది.
దాని సాహచర్యమ్మును
ఇవ్వగలుగు అతిసన్నిహి
తపు సత్యము నీ దృశ్య ప్ర
పంచపు మాటున నుండే
బయలు పరచగలుగు శక్తి
కున్నట్లయితే మాత్రమే
ఈ ఏకత పారద్రోలు
టనునట్టిది సాధ్యపడును.
మనము కొన్ని రూపాలను
కల్పింపగ నెంతో శక్తి
చేయుచునున్నాము వ్యయము.
కల్పనలకు ఉపయుక్తము
హేతుబద్ధమయిన యట్టి
విషయమేదీ నిర్ణయింప
బడుటలేదు. కేవలమీ
సత్యపు వివిధ స్పర్శల
కును వివిధములౌ స్పందన
లను పొందగ గల్గుట మా
త్రమ్మే జరుగుతున్నది.
ఇట్టి రూపకల్పన అను
శక్తిలోనె పసిబాలుడు
తనకు గోచరించుచున్న
లోకానికి ప్రతిగా ఊ
హాలోకము నొక్కదాన్ని
తనకోసం నిర్మిస్తూ
ఉన్నాడు.
-మనలో గల
పసితనమ్ము కనుపించే
ఈ జగత్తు తెరవెనుకను
ఉన్న తనదు శాశ్వత సుఖ
జలధినుంచి వెలికి వచ్చు
'ప్రోటియస్లుగానొ', పుష్ప
ములతోటి అలంకృతమ్ము
అయిన'కొమ్ము నూదుచున్న
ట్రైటాన్ గను' ఒకటే ఒక
క్షణకాలం దర్శింపం
గా గులుగుతు ఉంటుంది.
జ్ఞానమ్మును గాని సహా
యాన్నిగాని ఇవ్వనట్టి
దియును, కేవలమ్ము వ్యక్తీ
కరణము మాత్రము చేయున
దియును క్రియాజాలములో
పసివాడికి ఆనందం
ఇవ్వగలుగుతున్నట్టిది
అయినట్టిది "సఖుడు"
అనే పరమైన సత్యమ్మే
సృష్టి చేయుటమ్ములోన
ఉన్నయట్టి ఆనందమె
కల్పనలో మనకు ఉన్న

ఆనందానికి ప్రేరణ.
ఒక్క కవి తన నుదుటి వ్రాత
అయిన కలలు కనటమనే
తత్వాన్నీ, ఆ స్వప్నపు
వ్యర్థతనూ, వ్యర్థమైన
వైనవాని కున్న శాశ్వ
తత్వమ్మును గూర్చి ఇలా
చెప్పినాడు.
“లౌకికమో జగము నెదుట
నిర్లక్ష్యపు నాశిరాన్ని
ప్రతిదినము వంచి నిలుతు
భావలోకమందున విహ
రించునట్టి వాడొకండు
బహుఫల ప్రదాత ఒకడు :
ఈశ్వరుడే ఒక్కనాడు
ఇద్దరి హరియిస్తాడు.
కానీ ఈ లోకపు క్షే
త్రమ్మునందు పంటకోయ
బడ్డ వెనుక ప్రతిఫలమ్ము
కొంత మిగిలితేను అవ్వి
నేల కొరుగుముందు నేను
నేలను రాల్చిన గింజలె”
మరల మరల ఆ స్వప్నం
తలయెత్తుతునే ఉన్నది
సారమ్ము ప్రయోజనముగ
గల ఆహారమ్ము కంటె
యిది ఎంతో వాస్తవమ్ము
అయినట్టిది.
చిత్రకార చిత్రానికి
ఆధారమ్మౌ పటాన్కి
మన్నిక, సారమ్ము రెండు
నున్నాయి
దానిని ఉత్పన్నముగా
వించటాన్కి, విపణివీధి
చేర్చటాన్కి ఎన్నెన్నో
యంత్రమ్ములు, కర్మాగా
రమ్ములెంతో అవసరమ్ము
అయితే ఏ కర్మాగా
రమ్ములోన ఉత్పన్నం
చేయంగా వీలుగాని
చిత్రకారు చిత్రమ్మొక
స్వప్నమ్మును, ఒక్క మాయ.
కాని పరమ సత్యమ్మును
ఆవిష్కరణమ్ము చేయు
నట్టిది ఆ స్వప్నమ్మే!
పరముకాదు. కవి ఒక్కడు
శిశిరమ్మును గూర్చి యిలా
పలికినాడు.
“వృద్ధురాలు శిశిర ఋతువు
మూగవోయి నిలిచి ఉంట
ఒక ఉదయం చుట్టూ ఒక
మంచు మధ్య చూచినాను.
నిశ్శబ్దం వింటు అది
నీరసముగ నున్నదేమొ!

పాడువడ్డ వనమునుండి
వినబూనిని వీనుల కట
వినబడదే పికము పాట!"
ఇంకొక కవి మధుమాసం
గూర్చి యిలా అన్నాడు :
"ఓ మధుమాసమ్మా! హృద
యోల్లాసమ!! కమనీయ
మ్మైన నీదుకన్యాదర
హాసమ్మును వెలుగునిమ్ము!
ఒక్కమారు వెంటనే నీ
నయన కజ్జలంపు బాష్ప
నవ్యవారి జారనిమ్ము!"
చంద్ర మండలాన ఉండు
వాడొక్కడే భూమికి దిగి
వచ్చి ఒక్క గ్రామఫోను
సంగీతం వింటున్నా
డనుకొందం. దానివల్ల
తన హృదయంలోనను ఉ
త్పన్న మొందు ఆనందానికి
మూలాన్నన్వేషణ
చేయుబూను కొన్నాడని
అనుకొందాం. అతడి యెదుట
ఉన్నవి ఒక చెక్కపెట్టె,
దాని పైన గుండ్రంగా
తిరుగతు శబ్దాన్ని పుట్ట
జేయునట్టి ఒక పళ్లెం
అయితే కంటికి కన్పిం
చనిదియు వివరించరాని
యట్టిదైన సంగీతమ
నే సత్యము తనకు లభిం
పగ జేసేవ్యక్తిదైన
సందేశం అతని వ్య
క్తిత్వము అంగీకరింప
వలసి ఉంది. ఈ సందే
శము ఆ పరికరములందు
గాని, వానినుండి పుట్టు
శబ్దజాలమందు గాని
లేనె లేదు. హేతుబద్ధ
ముగ నూహించినచో ఆ
చంద్రమండలాన వసిం
చేటి వాడు ఒక కవియే
కావచ్చును. అట్టులయిన
దారుపేటికందున, దే
వత బంధింపబడినది
ఒక నిర్జన దేవలోక
మున ప్రమాద భరితమైన
సాగరమందలి ఫేనము
పైకి తెరచుకొనెడి ఒక్క
దూరదూర మందలిదౌ
మంత్రగవాక్షాన్ని తెరచు
కొనుట కొరకు వేదనపడు
చా దేవత గీతమాలి
కలనల్లుతు ఉన్న దంచు
కవిత చెప్పగావచ్చును.

ఇది ప్రత్యక్షమ్మో సత్యము
కాదుగాని దాని సార
మదియేను. గ్రామఫోను
మనకు శబ్ద ముత్పన్నం
ఔ సూత్రాలను తెలుపదు.
కాని దాని సంగీతం
వ్యక్తిగతమ్మయిన సాహ
చర్యమ్మును మనకిచ్చును.
వసంతంపు బాహ్యలక్ష
ణాలు ఎండ, వానజల్లు
ఒకటి వెనుక యింకొక్కటి
రావటమ్ము గాని, వసం
తపు ప్రభాస సుచ్ఛాయలు
సున్నితమౌ మేళవింపు,
మృదువు అయిన శబ్దమ్ములు,
సన్నని సంచలనమ్ములు,
ఇంద్రియమ్ములకు స్పర్శా
ఘాతమ్మల గలిగించుట
మాత్రమ్మే చేయలేదు.
సంగీతం వలెనే అవి
సైతం 'ఆనందపు అను
భూతి' అనే యోగమ్మును
మనకు ప్రసాదిస్తున్నవి.
అందువల్ల కవి ఒక్కడు
వాసంతీ రమణి గూర్చి
ఊహాచిత్రణ చేసిన
ఎంతటి భౌతిక వాదియు

అతనితో సహానుభూతి
నొందకుండ మానలేడు
కాని గణిత సూత్రమొకటి
గాని, జీవశాస్త్రపు సి
ద్ధాంత మొకటిగాని, ఒక్క
పూవు వలెనో, కన్నె వలెనో,
లేక ఒక్క జంతువుగా
వర్ణన గావిస్తే ఆ
భౌతికవాదే ఆగ్రహ –
ఆవిష్టుడు ఔట నిజము.
ఎందువల్ల నంటారా?
ఈ మేధా విషయక సి
ద్ధాంతాలకు మనదు మనో
వీణను స్పృశియించునట్టి
ఇంద్రజాల మనెడు విద్య
చేతగాదు. పక్షిజాతి
సంగీతపు మాధుర్యం,
సూర్యకాంతిలో మిలమిల
మెరయు నార్ద్ర పల్లవాళి
గగన వీధిలోన తేలి
ఆడునట్టి తెలిమబ్బుల
వలె ఆ సిద్ధాంతములు
కలలుగావు
మనము కేవ
లము భౌతిక, గణితశాస్త్ర
విజ్ఞులమే మాత్రమ్మును
కాదనటం మన వ్యక్తి

త్వమ్ముద్దైన సత్య మ్మిది
నిజము, నిజము గాథ నిజము.
"మనసు స్వప్నలోకంలో
విహరించే ఊహాజీ
వులము. మనము సంగీతం
సృజియించే స్రష్టలము.
భావుకత్వమును సంగీ
తపు సృష్టియు కేవలమ్ము
మందబుద్ధుల కృషిగాదు
పదములతో, మనుజులలో
శిలలతోటి, లోహాలతో,
రంగులతో రేఖలతో,
రాగంతో, గీతంతో,
సంగీతం సృజన చేయ
గలుగునట్టి సృష్ట్యాత్మక
ప్రేరణమ్ము"
"అమరమైన గీతాలతో
అద్భుతమౌ గాథలతో
పెద్ద నగరము నిర్మితి,
సామ్రాజ్యపు వైభవమ్ము
మానవలోకములోనే
సృజియింపగా బడును.
ఎల్లప్పుడు తర్కించుట
కెంతో అలవాటు పడిన
ఒక్క పండితుండీ "అల
వాటు వల్ల నైజలక్ష
ణమ్ము అయిన విశ్వాసము
కోలుపోయినాను నేను"
అని నాతో చెప్పినాడు
ఇందుకు కారణము తాను
దర్శించే రూపకమ్ము
నందలి అంతర్గతయో
గాన్ని గ్రహించటము ద్వార
రూపకార్థమును గ్రహించు
ప్రేక్షకుండు మనలోపలి
విశ్వాసమె అయి యుండుట.
కానీ తర్కమ్ము మనల
రూపక మేదీ ప్రదర్శ
నము పొందని నేపథ్య గృ
హానికి కొనిపోతున్నది.
అచటి దృశ్యమును వీక్షణ
చేసి తర్కమలసటతో
తలనూపుతు తనది అయిన
భ్రమ తొలంగిపోయెనంటు
ప్రలాపించు కాని ఎంతో
వైవిధ్యము ఉన్న వస్తు
సంతతితో వ్యవహరించు
వేషధారణ ప్రదేశ
మును ప్రశ్నించితిమో అది
తెల్విమాలి నట్టిదిగా
కనిపించుట, కాకపోతె
సైతానటు అపహాస్యము
గావించుట ఆచరించు.
ఎందువల్ల నంటారా?

రూపకయోగమ్ములోని
రహస్యమ్ము దానియందు
లేదు గనుక. అద్ది మరో
స్థానంలో ఉంటుంది.
ఆ సమయానను విశ్వా
సమ్మె అద్వితీయుడైన
పరమేశ్వరు వద్దనుండి
యే యీ యోగమ్ము మనకు
సంక్రమించె. మన హృదయము
లోననున్న ఆ పరమే
శ్వరుడు కవాటాన్ని తెరచి
ఆనందంతో యోగము
నాహ్వానిస్తున్నాడు
అంటు సమాధానమ్మును
చెప్పవలెను. వేషధార
ణపు సామగ్రియు, రంగ
స్థల పరికరములను నాట
కపు కళలో సంయోజన
చేయగబడి రూపకరూ
పకమున ప్రదర్శింపబడుటె
సత్యమనీ, నేపథ్య
మ్మున కనిపించేది మహా
భ్రాంతి అనీ తెలుపుటయే
కళలదైన కర్తవ్యం
కావ్య కరణ కర్తవ్యం
రూపకసామగ్రి అంత
నశిస్తుంది. రంగమ్ములు
మార్చబడును. అయిన నిత్య
భావుకుండు పరమేశుడు
శాశ్వతుండు అవినాశియు
అందుచేత నీ రూపక
ముసు స్వప్నము. నిత్య సత్య
మౌచు నిలచి యుండిపోవు.

**3**

కవుల కవిత్వమ్ము, కళలు
ఈ విశ్వములో మనుజుని
కున్నయట్టి ఏకత్వపు
గుణము గూర్చి, అట్టిదైన
విశ్వాసము అతని యందు
పెంచి, పోషణమ్ము చేస్తు
ఉన్నాయి. ఇట్టి ఏక
తత్వ మహాసత్యము మా
నవునిదైన వ్యక్తిత్వమె
ఈ సత్యం ప్రత్యక్షం
గాను తెలుసుకొనదగిన
ఒక్క మతము. అంతెగాని
తర్కము విశ్లేషణమ్ము
చేసి తెలుసుకొనంగాను
తగిన తత్వ సిద్ధాంతము
కానెకాదు. మన వ్యక్తిగ
తానుభూతి వల్ల మనము
సృష్టిచేసి నట్టివాని
దౌ నర్థము మనకు తెలియు

గనుకనే మన చుట్టు నున్న
ఈ సృష్టికి అర్థమ్మును
గూడ మనం తెలుసుకొనం
గా గలుగుతునున్నాము.
కీట్సు మహాకవివర్యుడు
గ్రీకు పాత్రపైన ఒక్క
గీతంలో "ఓసి మూక
రూపమ్మా! అంతరహిత
మైన కాలమటుల నీవు
గూడ మమ్ము భావనా
జగమ్ము నుండి వెలికి లాగు
తున్నావే" అని గానం
చేయటంలో కోపము లే
నట్టి రూపములు అన్నిం
ట్లోని ఉన్న, నిర్వచింప
రాని యట్టి ఏకత్వ ర
హస్యాన్నే అనుభవమ్ము
నొందినాడు. ఈ రహస్య
మే మనలను భావాతీ
తమ్ములైన లోకాలకు
తీసుకెళ్ళి అనంతత్వ
ముతో మనకు ప్రత్యక్ష
స్పర్శను కలిగిస్తున్నది
ఇదియే కవి తాను చూచి
లోకానికి ఆవిష్కర
ణమ్ము చేయవలసినదే
సత్యము. ఇదియేను కీట్సు
కవితలోని వేదనా ని
రాశలకును మధ్యనుండి
అతికష్టంతో వెలువడు
కాంతి రేఖలుగ దర్శన
మిస్తున్నది.
"మానవతా
దారిద్ర్యము – మాసిపోని
దారిద్ర్యము, బరువు బ్రతుకు
దినాలున్ను, ఇరుకు దారి
నడకలున్ను, మనకు నుదుటి
వ్రాతలేను. అయిన నొకటి
నిజము, నిజము.
తమోరాశి త్రోసిపుచ్చు
సమ్మోహన రూపమొకటి
సౌందర్యము నింపుకొంటు
విందొనర్చు నందఱకును,
సత్యమిందు సౌందర్యపు
రూపంతో వ్యక్తమౌతు
ఉంటుందను సూచనిందు
లో ఉన్నది.
విశ్వసృష్టి అనెడి శాశ్వ
తలపు చిత్ర వస్త్రంలో
సౌందర్యం అన్నది ఒక
హఠాత్సంఘటన మాత్ర
మే అయితే అది బాధా
కరమై వాస్తవ విషయా
లతో తనకు ఉన్న యట్టి

వైరుధ్యం వలనను ఓ
టమి పొందును.
సౌందర్యం
కేవలమొక ఊహాచి
త్రమ్ము కాదు. దానికి స
త్యంపు శాశ్వతమ్ము అయిన
అర్థమొకటి ఉంటుంది.
నిర్వేద విషాదాలను
సృజియించే విషయమ్ములు
కేవలమ్ము మంచుతెరల
బోలినవి, వాని మధ్య
భాగమందునుంచి గొప్ప
సౌందర్యం క్షణకాంతితో
సాక్షాత్కారమునొందిన
ప్రేమ పరమ సత్యమ్మని
ద్వేషమసత్యమ్ము అనియు,
సత్యము ఏ కమ్మని యును
అది పరస్పరపు సంబం
ధమ్ము లేనివౌ విభిన్న
విషయమ్ముల సందోహం
కాదని మన కర్థమౌను.
ఒక విస్పష్టమ్ము అయిన
ఆదర్శానికి దాని
భౌతిక ప్రతిబంధనమ్ము
లకును మధ్య స్పష్టమైన
వైరుధ్యం ఏమీ లే
నంతవరకు కష్టనష్ట
ములకు మనము బెదరనవస
రము లేదనే కవి మతమ్ము.
సాంప్రదాయకాలు అయిన
మతముల వౌ నుక్కు వైన
చట్రాలకు అలవాటయి
నట్టివారికీ కవి మత
మొక నిశ్చిత రూపములే
నిదిగాను, అనంతమైన
మార్పుల కవకాశమున్న
యట్టిదిగా కనుపించును.
అద్ది వాస్తవమ్ము – కాని
కవి మతాన్కి లక్ష్య మనం
తత్వమ్మును బంధనమ్ము
చేసి భౌతిక ప్రయోజ
నాలకు అనుకూలంగా
మలచటమ్ము కాక, మనుజు
చేత నత్వమును భౌతిక
శృంఖలాల నుంచి వియో
చన చేయుట గనుక, దాని
కొక్క నిశ్చితపు రూపం
ఏదీ లేదు. అది ప్రాతః
కాలమువలె ఎంత అయిన
చేతనమ్ము కాని కాల
పరిధి గలది ఓః అంతటి
కాంతివంతమైనట్టిది
అది మన ఆలోచనలకు,
అనుభవాలకును, వానిని తే

జోవంతము చేస్తుంది.
కవిమతాన్కి నిశ్చితమ్ము
లౌ విధులును, సిద్ధాంతము
లేమిలేవు. ఈ అనంత
సృష్టిరూపమున సర్వద
ప్రకటమ్మగుచుండ మహో
సత్యమునెడ మనకు ఉన్న
దృక్పథమ్ము మాత్రమ్మే,
దానియందు కనబడును.
అభేద్యసూత్రబద్ధమైన
మతమునందు అన్ని ప్రశ్న
లకును నిశ్చితమ్ములయిన
సమాధానములు ఉన్నను
సంశయాలు అన్ని పాతి
బెట్టబడుతు ఉంటాయి.
కాని, వెలుగు నీడలు దో
బూచులాడు నట్టిదియును
ఆలమందలలో మధ్యన
వేణువూదు పసుల కాప
రిని బోలుచు, మేఘ సమూ
హాలమధ్య వేణుగాన
మొనరించే వాయుసహిత
మైనదియును నైనభూమి
చుట్టును గల వాతావర
ణమ్ము రీతి కవిమతమ్ము
ఒక అనిశ్చితపురూపం
పొందినది. అది ఎవరిని

నిశ్చితమ్ము లయిన యట్టి
నిర్ణయాల వైపునకై
నడిపించుట కెన్నండును
పూనుకోదు. దానికి తన
చుట్టు అవధులెవ్వి లేవు
కాన అది అనంతకాల
ముసు లోకములను ఆవి
ష్కరణ చేయగా జాలును.
అది దౌష్ట్యపు నస్తిత్వము
నంగీకారమ్మొనర్చు.
మనుజులొకరి వేదన నిం
కొకరు నిరంతరము వింటు
కూర్చుండే ఈ లోకపు
అలపు, విరామము నెఱుగని
వేగమ్మును, విసుగుదలలు
ఉండుటలను కాదనదు.
కాని యీ ప్రపంచమందు
కోయిల కూతల ఆకస
మున చంద్రుడు చల్లంగా
రాజ్యమేలుచుండుటమ్ము
అనునవియును గలవని అది
జ్ఞప్తిచేయు.
"తెల్లనివౌ
పద్మమ్ములు బాహ్యాహరిత
తృణభూములు, ఆకులమ
ధ్యన దాగిన కృష్ణాంబర
ములు మకరంతమ్ము తోటి

నిండినట్టి మధ్యాహ్నపు
తొలిశిశువు, మంకెన పూ
దేనె ద్రావ మరల మూగు
తేటిగములు."
కాని యిందు
ఏ ప్రక్కన, ఏ వేళలను
ఒక్క సమాధానానికి
అవసరమ్ము అయిన యట్టి
నిర్దిష్టత కనుపింపదు
అయితే అది ఎద అంతా
నింపి భావనాప్రపంచ
పరిధుల దాటించు నొక్క
సంగీతమ్మును మాత్రం
కలిగి ఉంది.
ఈ సంగతి
తెలియపరచు ఒక బెంగా
లీ కవి మధుగీతమ్మును
వినుడు మీరు :
"ఉదయాన నీ నౌక
తెరచాప రెపరెపలు
హృదయాన్ని కదలించె
మేలుకొంటిని దేవి!
"అలలునను పిలిచినవి
తీరమును వీడితిని
నా జీవయాత్రాధి
దేవతా! ఓ వనిత!!"
"ఈ జీవ జలధికా
వల వెలయుదానిలో
మా జీవనస్వప్న
సుమతతులు విరియునా?"
"ప్రశ్నించు నా హృదయ
జలనిధి తరంగాలు
ప్రాభాకరప్రభల
నీరవత బోలు నీ
మందహాసప్రభా
మహిత నిశ్శబ్దమ్ము
సుందరంగా నాట్య
భంగిమల జూపినది
శాంత్య శాంతులమధ్య
సాగినది దివసమ్ము
పర్వినవి దశదిశల
ప్రౌఢతర పవనాలు"
"సంద్రమ్ము మధ్య వడి
వ్యధితమైపోయినది
మరల నా హృదయమ్ము
ప్రశ్నింప సాగినది"
"ఎక్కడుంది నీ శయనపు
మందిరమ్ము ఓ లలనా!
పగటి వెల్గులున్న చితికి
బహుదూరంలో ఉందా?
ప్రత్యుత్తర మేమిలేని
ప్రశ్న అయ్యె నాదు ప్రశ్న"
"సంధ్యాభ్ర నీరదాం
చలకాంతి రేఖవలె

సరళముగ ఒక నవ్వు
వెలిగె నీ కనులలో"
"రేయి అరుదెంచినది
తిమిరావృతం బౌట
తెలియగా బడదయ్యె
రమ్యమౌ నీ రూపు"
"గాలి హేలగ వీచె
కదలి నీ ముంగురులు
లలిత లాస్యము చేసి
నాదు చెక్కిలిపైన
రమణీయ రతిలో
హృదయ సంభారమును
కమనీయ వాసనల
కదలించి వేసినది"
"హస్తాల సారించి
చీకటిలో నీ దివ్య
చేలాంచలము నందు
కొన వెదుక సాగితిని"
"తిరిగి నా మనసు నిను
ప్రశ్నింప మొదలిడెను
ఈ రేయి వెలిగేటి
రిక్కగమి కావలను
వరలు నీ నిశ్శబ్ద
గీతాలు గసుమములై
విరియ నీ నిలయోప
వనసీమ నున్నవో?
నడిరేయి వెలిగేటి
నక్షత్ర రుచి వోలె
నేత్ర పర్వముగూర్చు
నీ దివ్య హసనమ్ము
నిశ్శబ్ద మధ్యాన
నిర్మలముగా వెలిగె."

**4**

**షెల్లీ కవిత :**

షెల్లీ కవితల్లో అ
స్పష్టతయును, సంశయము
లేదన అన్వేషకులకు
మధ్యనుండి ఈ మతమ్ము
క్రమప్రవృద్ధి నొందటమ్ము
మనకు బాగ స్పష్టమౌను.
అతడు లేత వయసునందె
మృతుడైనా, తుదకైనా
తన విశ్వాసాన్ని ఎంతో
సుస్పష్టము చేయగలిగె.
ఈ విశ్వాసపు అంతిమ
పరిపూర్ణత "మేధాసౌం
దర్యమ్మును గూర్చిన గీ
తమ్ము" అనే గీతికలో
మనకు స్పష్టముగ గన్పడు
వీని శీర్షికామూలము
లో సౌందర్యమ్మునునది
ప్రత్యేకపు విషయాలతో
కనుపించే ఒక్క జడగు

ణము కాదని జడజీవన
యందలి మిథ్యా వైరు
ధ్యపురూపముగా ప్రకటిత
మయ్యే ఒక శక్తి అనియు
షెల్లీకవి భావముగా
మనకు అర్థమౌతున్నది.
షెల్లి జీవయాత్రకు చెం
దిన అవసానపు దశలో
అప్పుడపుడు దిఙ్మాత్రము
గా దర్శన మిస్తు నెడద
శాంతి రహితతతొ నింపు
దివ్యతత్వముతో అతండు
ముఖాముఖిగ దర్శనమ్ము
చేసిన సమయమ్మునందు
ఆతని హృదయాంతరాళ
మందు గీతి వెలివడినది
ఆతని సౌందర్యపు టను
భూతులు సర్వము నాతని
సత్యపురూపేమి అన్న
ప్రశ్నతోటి బోధించెను,
ఒక్కచోట అతడు వివిధ
పుష్పాలతో కూర్చినట్టి
గుచ్ఛమ్ముల లోననున్న
అల్లరి రీతిగ నానం
దమ్ముగాను, తనదు దివ్య
మైన యట్టి కన్నీటితో
తల్లి మోము తడుపుతున్న

దీర్ఘమయిన ఒక పూవును
గూర్చిగాన మొనరించెను.
"తదుపరి సంతోషముతో,
గర్వముతో నేను బయలు
దేరిన ప్రాంతమ్ము చేరి
అచట దాని నర్పణగా
వించగవలె ననుకొంటిని
అయ్యో! దాని నెవరి కిత్తు"
అనుటతోటి ఆ గీతము
పూర్తిచేసె. ఈ ప్రశ్నకు
సమాధానమేదీ లేక
పోయినాను ఒక ప్రత్యే
కార్థముంది. ఒక సౌంద
ర్యంపు సృష్టి ప్రేమకు చెం
దిన సాఫల్యమ్మనియెడు
నొక ఆశయ పరిపూర్తిని
సూచించును. ఈ సౌంద
ర్యంపు సృజనను నిరాశా
నిస్పృహలతో నిండిన కొం
దరు కవీశ్వరులు నిరసి
స్తుంటారు. కానీ అది
వ్యాధిగ్రస్తుండు అయిన
బాలకుండు తన తల్లినె
దండించెడు పని వంటిది
విశ్వాసానికి పట్టిన
ఈ రోగము సత్యమ్మును
బాధించును. కానీ అది

తన కోపం బాధలవౌ
ఉనికితోడ ఆ సత్యము
నే నిర్ధారిస్తున్నవి.
అద్వితీయు డౌపరమే
శ్వరుడు తనకు తానె చేయు
ఆత్మార్పణయే సౌంద
ర్యమ్ము అనునదే ఈ వి
శ్వాసమ్ము.
మేధాసౌం
దర్యమ్మును గూర్చిన గీ
తమ్ములోన ప్రథమ భాగ
మున షెల్లీ సౌందర్య
ప్రకటనంపు చంచలత్వ
మును, ననిత్యతను గూర్చి
ఆ ప్రకటన ఈ సౌంద
ర్యాన్ని సత్యదూరంగా,
ఎంతో బలహీనముగను
కానుపింపజేయటాన్ని
గూర్చియె ఇటు వాపోవును
"సాయంసంధ్యల వెలసిన
రాగంలో, గానంలో
శార్వరి తారాకాంతుల
తేలియాడు మబ్బులలో
సంగీతము వీడినట్టి
స్మృతిపథాల బరువులతో
ఉన్న అనిత్యత్వ చంచ
లత్వమ్ములు మన యందున"

"ఎందులకో, ఎందులకో
వికసించిన విజ్ఞానం
వెలుగు మాసిపోవటాలు,
జీవన మరణ వలయమ్ములు,
మన జీవన స్వప్నమ్ములు
మనికిలోని భయభీతులు
మానవలోకపు వెలుగును
మలపివేయు టెందులకో,
మానవాత్మ పడువేదన
మన ప్రేమయు మన ద్వేషం,
మన ఆశల కవకాశం
ఎందులకో, ఎందులకో,"
అను ప్రశ్నల నుదయింపం
గా జేయును
ఇందుకు కవి
చెప్పు సమాధానమ్ము
"ఒహోహో, సౌందర్యమ।
అజ్ఞాతము, అద్భుతమ్ము॥
అయిన నేమి నీ రూపము
మానవుడే అమరుడైతె,
మహితశక్తి మంతుడైతె
పాదమతని గుండెలోన
పదిలంగా ఉంతువేమొ॥
సౌందర్యపు పట్టు చిక్క
నట్టిదైన తత్వమ్మే
అమరత్వపు, సర్వశక్తి
మత్వమ్ముల అస్తిత్వము

సూచిస్తూ, ఒక్క శాశ్వ
తత్వానికి రూపమీయ
టమ్ములోన వానిని ద
ర్శింప యత్నమును చేయుము
అని మనలను ప్రోత్సహించు
పరమ సత్యమత్యంత
శ్రమతో సాధింపవలసి
నట్టిదైన ఘన విషయం
సత్యలాభమే పరిశ్ర
మాంతమ్మున దొరుకునట్టి
ఫలముకాదు.
అది సాధింపంగబడిన
సర్వవిషయములను దర్శ
నమ్మొసగును. మహాజ్ఞాన
యాత్రయందు మనకు దారి
చూపగలది యేది?
దీనికై మానవజాతి సదా
మార్గాన్వేషణ చేస్తూ
ఉన్నారు.
"రాక్షసులు, దేవతలు,
రాత్రించర భూతాలు
క్షణకాలం జీవించే
అక్షరాల మాలికలే
ఫలియించని సాధనలకు
ప్రతిరూపాలౌట నిజము.
అవి చూపే మంత్రతంత్ర
మహిమలకే జగములోని
అనుమానపు భూతాలు,
అదృష్టపు లాభాలు,
అంతులేని మార్పులునూ
అట్టె మాయమైపోవును
లోకంలో అమలులోన
ఉన్నయట్టి మతవిషయక
సంప్రదాయములును నిత్య
విధులు తలపగ కని
కట్టువంటివని షెల్లీ
భావమ్ము. అవి మానవు
తీవ్రములౌ ప్రయత్నాలె
గాని సాధానా ఫలాలు
కావు. మనము అన్వేషణ
గావించే పరమావధి
మనల సూటిగానె పిలు
స్తున్న దనియు, అద్ది మనకు
స్వీయకాంతితోనె దారి
చూపుతున్న దనియు నాత
నికి తెలియును. సౌందర్యపు
పిలుపే సత్యంపు పిలుపు
సహితమ్మును అయి ఉన్నది.
"పర్వతాలపైన కదలు
మంచు మబ్బు తెరలవోలె
మూగదైన వీణపైన
రేయిగాలి పలికించె
నవరసభర గీతివోలె
నడిమిరేయి నీటిపైన

నాట్యమాడు వెన్నెలవలె
జీవిత దుస్స్వప్నానికి
నీ కటాక్ష కాంతి సత్య
సౌందర్య స్ఫూర్తి నొసగు
సర్వగతము అయిన మనల
పిలిచెడు ఈ సత్యదర్శ
నాన్ని గూర్చి ఒక్క వంగ
దేశ గ్రామ గాయకుండు
ఇలా పాడుతుంటాడు :
“స్వామి వేణుగాన రవము
సకల జగతి ధ్వనియిస్తూ
విశ్వవీధి విహరింపగ
వీడు వెడల పిలచుచుండె
వీనులకది వినబడనే
వేయుచున్న అడుగులెల్ల
వేణుగానలోలు శుభా
వాసమందె అని ఎరిగితి
అతడే గద వాహినులు
అతడే గద జలనిధియు
అంబునిధికి రేవు కూడ
అతడే గద! అతడే గద!!
షెల్లీ మత మతని జీవి
తముతో బాటుగ నెదిగెను.
షెల్లీ కా సిద్ధాంతీ
కరణము గావింపగబడి
ఇవ్వబడ్డ స్థిరమౌ విష
యమ్ము కాదు
సృష్టియత్నమున లభించు
ఆనందముతో మాత్రమె
సత్యమ్మును దర్శింపగల
సృజనశీలమైన మనసు
షెల్లీది. సత్యమ్మును
ఎవ్వరికీ వారి విశి
ష్టపు ప్రతీకలోని
కనువదించు కొనుటవల్ల
సత్యదర్శనమ్ము చేయ
గల్గుటయే నిజము అయిన
సృష్టికళ.

**5**

అట్టి సత్య దర్శనాన్కి
మానవసాంగత్యమ్మే
మానవుడికి ఉత్తమావ
కాశమిచ్చు సామాజిక
మాతని సామూహిక సృష్టిని
దాని ద్వార ఆతని సా
మాజిక వ్యక్తిత్వము తన
సత్యపు సౌందర్యమ్ముల,
తన ప్రయోజకతను మాత్ర
మే ప్రకటించిన యట్లై
తేను ఆ సమాజమొక్క
కానబడని తారవోలె
మూగగుండు కానీ శిథి
లావస్థనె గాని సమా

జమ్ము అట్టులుండిపోవ
టమ్ము జరుగ దెప్పుడయిన
సామాజిక మానవాళి
చేయు సమష్టి క్రియాక
లాపము మూలాన సమా
జమ్ము తనకు వ్యక్తిత్వము,
చైతన్యము – రెండు నిండు
గాను ఉన్న ఆత్మ ఒకటి
ఉన్నదంటూ ఎల్లవేళ
సూచిస్తూనే ఉన్నది.
కడు విశాలమౌ సామా
జిక వ్యవహారపు జీవిత
మందు గూడ మనుజ జాతి
తమ అఖండతను రహస్య
స్పర్శననుభవించుచునే
ఉన్నారు. ఈ ఏకా
త్మకతా జ్ఞానము నుంచే
మనుజజాతి అంతమునకు
భగవద్భావమును జేరు
కో గల్గిరి. అందువల్ల
ప్రతి మతమును ఆ ఆ జా
తుల విశిష్ట భగవద్రూ
పములనుండియే జనించి
నది అని చెప్పంగవచ్చు.
మన నాగరకతలన్నీ
మొట్టమొదట సమాధాన
మును చెప్పం గావలసిన
ప్రశ్న తమకు ఏ ఏ సం
పదలు ఎంత ప్రమాణంలో
ఉన్నవనుట కాదు, కాదు
తాము చెప్పదలచినదేదో,
దానినెట్లు చెప్పదలచు
చున్నారో అనునట్టిది
ఒక్క సమాజమ్ములోని
ప్రజలు తమ్ము నియమముగా
వించుకోని, తమకు నొక్క
టైన సమగ్రతను ఇవ్వ
గా గలిగిన ఆధ్యాత్మిక
జీవన సరళిని నిర్ల
క్ష్యము చేసిన, సరుకుల ఉ
త్పత్తి వ్యాప్తులు, ఆదా
య వ్యయాలు ఒక్క సరళ
రేఖ ననంతమ్ముగాను,
పొడిగించినయట్లు గాను
నిరంతరము సాగుచునే
ఉండవచ్చు”
ఒక్క అసంపూర్ణత పరి
ధుల ననంతముగ పెంచుట
యే వృద్ధికి కాదర్థము
సమగ్ర తొకటి తనకంటే
గొప్పదైన మరియొక సమ
గ్రతవైపునకున్ముఖమై
ప్రవహించుటె పెరుగుదలకు
అర్థమ్ము. జీవజాల

మంతయు తమ జీవితాల
ఇట్టి సమగ్రతలతోనె
ప్రారంభమగావించును.
పసిబిడ్డకు సైతము పని
వానిలోన ఉండునట్టి
దౌ సమగ్రతుంటున్నది
పసిబిడ్డడు పూర్ణుడైన
మనుజుని వలె కన్పించుట
ఏహ్యామైన దృశ్యమ్మ
జీవితమొక అంతరాయ
రహితమ్మొ సమ్మేళన
ప్రక్రియయే గాని అంతు
లేని కూడికలతో నున్న
సమ్మిశ్రణ కాదెన్నడు.
సంపద ఉత్పన్నమగుట,
భోగమ్ములు, ఒక సృష్ట్యా
త్మక మౌనా దర్శముతో
మేళవింప బడిన యెడల
అవ్వి అట్టి పరిపూర్ణత
నందుకొనును. కాకయున్న
అవి శాశ్వతముగను, అసం
పూర్ణముగను నుండిపోయి
నట్టి రూపములుగ కాను
పించు చుండు. అట్టివి రైలు
పట్టాలే ఉండి స్టేషన్ మా
త్రమ్ములేని రైల్వేయిం
జనును బోలి ఉంటుంది.

అవ్వి నిగ్రహింపబడని
శక్తులవలె చండమైన
సంఘర్షణ వైపుకు పరు
గిడటమ్మొ, విపరీతం
గా కృషి నొనరించి అలసి
పోయిన యంత్రము వోలె హ
ఠాత్తుగాను పడిపోవుటొ
జరుగుతుంది. సృష్టి ద్వార
మానవుండు తన సత్యం
వ్యక్తం చేస్తున్నాడు.
ఈ ప్రక్రియలో ఆతడు
తనదు పూర్వ పరిపూర్ణత
తిరిగి ఎంతో పూర్ణంగా
పొందుతూనె ఉంటాడు
మానవుండు తన్ను తాను
పరిపూర్ణంగా వ్యక్తము
చేసుకొనుటకే సమాజ
మేర్పడింది. ఈ వ్యక్తీ
కరణ తనదు పరిపూర్ణ
స్థాయి ననుసరించి మనుజు
నందలి దివ్యత్వపు పరి
పూర్ణ దర్శనమ్ము వైపు
ఆతని నడిపిస్తుంది
ఈ సత్య వ్యక్తీకర
ణము అస్పష్టముగ నున్న
మానవుడికి తనయందలి
అనంతత్వమ్మున విశ్వా

సమ్ము సన్నగిలి ప్రాపం
చిక ఘనతయె పరమాశయ
మైనట్లుగ మిగులుతుంది.
అనంతత్వ మందున వి
శ్వాసమున్న అర్ధి సృష్టి
శీలమౌను. అర్థ సఫల
తార్థమైన కాంక్షయె ని
ర్మాణశీలమౌను. ఇందు
రెంట నొక్కటతని గృహము
రెండోదాతనిదౌ కా
ర్యాలయమ్ము అన జెల్లును
మనుజు నవసరముల సం
ఖ్యాకముగా వృద్ధి నొందు
టను నాగరకతయును బ్ర
హ్మాండమైన కార్యాలయ
మటులమారి గృహము దాని
క్కొటైన అనుబంధపు
రూపొందుచునుంటున్నది.
భౌతిక ప్రాభవము కొఱకు
ప్రాకులాడుటకు, నత్యధి
క ప్రాముఖ్యమ్మేర్పడుటను
సమాజమ్ము శూద్ర భావ
మును గ్రహించి ఉంటున్నది.
ఒక యుద్ధంలో పాల్గొన
టమ్ముతోటి మహాక్షత్రి
యుడు విజయము కంటె మిన్న
అయిన స్వధర్మాన్ని, ఆత్మ

గౌరవాన్ని ఆదర్శం
గా భావిస్తున్నాడు.
కానీ ధన సంపాదన
పరుడు అయిన శూద్రున కా
యుద్ధంలో పాల్గొనటం
లో విజయమె లక్ష్యమ్ము.
కేవలము ప్రయోజనమే
కాని అన్యమైన వైన
ఏ ఇతరాదర్శాలకు
బద్ధుడుగా నట్టివాని
శూద్రుండని అంటారు
శారీరక క్రియలు గాని,
మానసిక క్రియలు గాని
తమ పరమావధిగ నుండి
మానవతా సమగ్రతయె
లోపించిన నగ్నయాంత్రి
కపు పరికరములను బోలు
నట్టి వారికీ "శూద్రులు"
అను నామం వర్తించును.
నగ్నంగా నడయాడే
కేవలమౌ మేధస్సులు,
జీర్ణకోశములను బోలి
నట్టివారు ఎదురైతే
అప్పుడు "ఓ భగవంతుడ
కరుణ ఉంచి వీరిని కొం
చెము జీవముతో, సౌంద
ర్యమ్ముతోటి ఆచ్ఛాదన

గావింపుము తండ్రి" అంటు
ఆక్రోశింపగవలె అని
అనిపిస్తూ ఉంటుంది.
ప్రపంచాన్ని పరికించే
సందర్భాలల్లో షె
ల్లీ కవీంద్రునకు నా పర
మాత్మ దర్శనాన్కి మారు
పేరు అయిన సౌందర్యపు
దర్శనమ్ము లభించింది
అప్పుడతడు ఆతడి వి
శ్వాసము నిటు తెలియజేసె
"చిరతరమౌ దాస్య శృంఖ
లపు పరిధిని దాటజేసి
ఇత్తువీవు అనే ఆశ
తో మేళవితమ్ము గాని
హాసరేఖ మదీయాధ
రమ్ము పైన నాట్యమాడ
లేదే ఈ నాడుగూడ"
ఇదే షెల్లి కవికి ననం
తుని యందున కల్గినట్టి
విశ్వాసము. ఇది ఆతనిని
వర్తమాన ప్రయోజనము
సాఫల్యము రెంటికి నా
వలన నున్న స్వేచ్ఛాపరి
పూర్ణతలను లోకము వై
పునకే నడిపించింది.
పరమేశ్వరునందలి యా

విశ్వాసము ముక్త్యాద
ర్శపువాస్తవికతలందలి
విశ్వాసమె. ఇది మానవ
లోకంలో ఉత్తమమౌ
సృష్టి సర్వమునకును కా
రణభూతము అయి ఉన్నది.
అంతులేని మార్పులనే
మలుపులున్న వక్రమార్గ
మందు నిరవధికముగాను
పయనించుట వాంఛనీయ
మేగాకను నిష్ఫలమ్ము
సైతమ్మును. కేవల స్వర
ప్రస్తారంలో అంత
ర్గతముగ ఒక సంగీతపు
భావన ఉన్నప్పుడె అది
గానము అవుతుంటుంది.
పరిపూర్ణత దైన పరమ
సత్యమునందలి దౌ మన
విశ్వాసమె ఆ సంగీ
తపు భావన. అదియే నా
గరకతలో ఉన్న గొప్ప
సృజన శక్తి. ఇది జాగృత
మెపుడు కాదౌ అపు దైశ్వ
ర్యాధికారములయందున
విశ్వాసము దాని స్థాన
మాక్రమించు. భౌతిక శ
క్తులయం దీ విశ్వాసము

ఘర్షణలకు దారి తీస్తు
వినాశమ్ము. నా చరిస్తు
నక్షత్రపు కాంతి ననుక
రించు మతాబాలవోలె
ఒక్కమారు ఉజ్వలముగ
వెలిగి హఠాత్తుగను నుడిగి
పోయి నాశనమ్ము నొంది
బూడిద అయిపోతుంది.

**6**

అనాదిగాను ఘనవిశ్వా
సము నిండిన 'మహనీయులు'
సర్వమ్మును నున్నతమౌ
నా దర్శమ్ముల వైపునకు
పయనము గావించుడంచు
మానవులను హెచ్చరిస్తు
వచ్చినారు లౌకిక జను
లవ్వారిని వీక్ష చేసి
'వారు లౌక్యమెరుగని వా'
రంటు అపహసించుచుంట
సైతమనాదిగను జరుగు
తునే ఉంది. కాని మాన
వుని అందలి భావుకుండు
.... .....

**అసంపూర్ణం**

***(రవీంద్ర కవితకు అనువాదం)***

# గేయ కవితలు

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | కోరస్ | 427 |
| 2. | భర్త | 429 |
| 3. | నీబాలలో | 430 |
| 4. | ప్రదీప్ | 431 |
| 5. | ఎట వనితలు గౌరవింప బడియెదరో | 432 |
| 6. | భావములు | 433 |
| 7. | వృత్తి వనిత | 434 |
| 8. | యోజనలు | 436 |
| 9. | త్యాగము | 438 |
| 10. | హిప్పీ | 440 |
| 11. | ఓ దేవదేవ | 441 |
| 12. | తరలి రారండోయీ! | 442 |
| 13. | ఔనె సఖీ, ఔనె సఖీ, | 443 |
| 14. | హే శారద! | 444 |
| 15. | జన్మభూమి – ధన్యభూమి | 445 |
| 16. | స్వాతంత్ర్య దినము | 446 |
| 17. | రావమ్మ జనని | 448 |
| 18. | పౌష్యలక్ష్మి | 449 |
| 19. | ఏకాంత పథికుడు | 450 |
| 20. | తరణోపాయం | 451 |
| 21. | పెళ్లి సవరణ | 453 |
| 22. | మహోయజ్ఞం | 455 |

# కోరస్

(కృష్ణశాస్త్రి గుంటూరులో ఉపన్యశించినప్పుడు పాడినది.)

1. రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనుగు పూలార!!
దివిజలోకమునుండి దిగిరాడె దిగిరాడె
ఏటి కరుదెంచెనో ఈ పురూరవమూర్తి
అతని పాదాలకడ నాత్మార్పణము చేయ
మీ లేత భావాల మీ చిరుత గీతాల
మధుమాస దీధితుల మధుహాస వాసనల
రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనుగు పూలార!!

2. ఊర్వశీప్రియు డీతడున్మత్త పథికుండు
కృష్ణపక్షపు వేళ గ్రీడించు భావుకుడు
మధుర ప్రవాసమున మరగి సోలినవాడు
మహతీ మహాశ్రుతుల మాకరందము గ్రోలి
మనకీయగా నేడు మనవాడకిదె వచ్చె
రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనగు పూలార!!

3. కార్తిక జ్యోత్స్నలో గంధర్వ లోకాన
'మధుర సుషిమాగాన మంజువాటికలోన'
అనిశంబు ప్రేయసీ అంకపాళికలోన
లలిత పర్యంకమున లాలించి లాలించి
విహరించి విహరించి విరహాన బడి వేగి
దివిజ లోకమునుండి తెనుగు సీమకు నేడు

దిగివచ్చినాడు క్రొత్తగ వచ్చినాడమ్మ
రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనుగు పూలార!!

4. అమర లోకమునుండి అరుదెంచు త్రోవలో
ఆకలిని గొన్నాడు ఆసనం బీయండి
కంటక కిరీటంపు కాంతిపుంజము జూచి
కళవళింపకు డోయి కలతపడకం డోయి
'రత్నాక రాముల్య రాగసంపద మెరయు'
నవనీత హృదయుండు నవచూత కోకిలము
రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనుగు పూలార!!

5. ఇతరులతొ సొదలతో ఈ హొస మృదువాస
నలతోడ కొసరు తేనెలతోడ రొదతోడ
ఇతని ప్రణయపు గాథ ఎనలేని పూ బాధ
కన్నీరు కాల్వగా కరగించె నీ జగతి
మన చిన్ని హృదయాల మన కన్నెభావాల
పల్లవింపగ జేయ పలవింపగా జేయ
రారమ్మ రారమ్మ రారమ్మ రారమ్మ
ఓ తెనుగు పూలార! ఓ యనుగు పూలార!!

6. ఆమె యాషాఢ జలధరాయతన సీమ
నొడలు పులకింప నటియించి యొరగి సోలి
మేల్కొనుచు మెరపుటన్నుల మిన్న గాని
దీనుఁ డగు నన్ను నేలెడి తెరవ గాదు

7. స్వాగతోన్ముక్త గీతా స్రవంతి కలుగ
నపుడు ననుఁ బిల్చె నీయలల గములు
ప్రణయరస మధువాహినీ బంధురములు
సైకతముల నేని కనఁగఁ జనఁగ నీవు

*ప్రతిభ 1940*

# భర్త

నేకోరుకొనునతడు భర్త కొనెడి పతి ఎదనిచ్చుకొనునతడు
చిరునవ్వు నవ్వితే కరిగిపోయే అతడు
కన్నెర్రజేసితే కాగిపోయే అతడు
ఆడదెవతైనాను అలాటి పతికొరకె
అతిగాఢవైఖరిని అభిలాష పడుతుంది
ఒంటరిగ గదిలోన ఉంటె నను కలుసుకొని
నిలుచున్న నాగౌనులో తలవంచి దూర్చాడు
మోకాళ్ళపై తొడలమధ్య తలనొత్తుకుని
పతిగగ్రహియింపుమని ప్రార్థించె శోకిస్తు
ఇట్టి అతడిని నేను ఎటుల ప్రేమిస్తాను
జాలిపడుదువరింప జాలుదునె నాథుగా
ఓ పిచ్చిదేవుడా ఒక్కతెను వీరిలో
ప్రేమించి చూడరా బ్రతుకు బయటపడుతుంది
వట్టివే వెర్రికేకలతో భయపెట్టి దే
వుళ్ళ భంగము పరచు పాటకర్థమ్మేమి?
కోటానుకోటి ప్రజ కొలిచేటి దైవాల
చిలిపి కారణములను చెప్పి తిట్టించేటి
ఓ భ్రష్టమానవా! గాయకా! ఓ దుష్ట రచయితా
ఇది ఎంతొ దారుణము! ఇది జాతి మారణము!!

# నీబాలలో

నీబాలలో పరమోత్తమ నిధులు సృజింపుము తల్లీ
సంచలనము, ఉత్తేజము చక్కగ కలిగించు మంచి
వాతావరణము గూర్పుము నీయుము వాంఛితాల నీబాలకు... నీ బాలలో
నీ బాలకు గల సృజనా నిర్మల సామర్థ్యముతో
రంగవల్లులను రసనలలో రమ్యలేఖనల స్వరముల... నీ బాలలో
ఇంటినుంచి దూరముగా ఎక్కడికిని పోనీయకు
ఇంటిలోన కంటిముందు ఏదో పని చేయింపుము... నీ బాలలో

# ప్రదీప్

ఓరీ ప్రదీప్ నీవొక్క వీరుడివేను
నీవు దండెత్తితే నిలువగలమా మేము!
నీ నాన్న కంటేను నీవు బలవంతుడవు,
వృద్ధుడను, తండ్రి నీ వద్ద తట్టుకోలేను!

# ఎట వనితలు గౌరవింప బడియెదరో

ఎట వనితలు గౌరవింప బడియెదరో ఆ తావుల
సకల దేవతాజాతులు తగుతృప్తిని పొందుతారు.
మహిళాజను లెల్లవేళ మన సంస్కృతి రక్షింతురు (రక్షకులు)
పరమ కృతజ్ఞతతో, ఘన భక్తి, మాన్యతా, కారుణ్యముల నొసగి గణియింపుడు.
వనితాతతికెవ్వరైన కష్టములను కల్పించుట
దోషమ్ముల నొనరించుట బహుళపాపకృత్యములగు.
సోదరి పరిణయ వేళను ఆదరానురాగముతో
రథచోదకుడై యుండగ కంసుం డాయమయష్టమ
సుతుచే మృతినొందెదనుచు గగనవాణి తెలియజేయ
కంసుడు విని క్రుద్ధుండై సోదరి దేవకి చంపగ ఖడ్గముతో, పైకి వచ్చె
దేవకి పతి వసుదేవుడు యువరాజు కంసునితో
నారీవధఘోరపాప కరణమ్మని కాననాయె ఖండింపగ
వలదనుచును వాదించె మహామృదువుగ
తప్పని సరియైనను మృతి బహుదారణ భీషణమ్ము
దానిని ఒకడెవ్వడైన తప్పించుకొనంగా లేదు
అతితీక్షణమైన భీతి ఆక్రమితుండైన వ్యక్తి
ఎట్లు పరమపాపముగావింపగ తా బూనుకొనునో ఈ అంశము సూచించును.
అతడు బిడ్డలందరి నట పుట్టిన క్షణమే కంసున
కర్పించు ప్రతిజ్ఞతో వసుదేవుడతని నారీ హత్యాదోషము మాన్పించెను.
హృదయ శూన్యుడే కంసుని చేత ఖండనము నొందుట
కై బిడ్డల నిచ్చుటలో చేసిన ఘనమో ప్రతిజ్ఞ
సర్వము సాగించుటలో పూర్ణముగా సత్యసంధు డై ఒప్పెను వసుదేవుడు.
ఇందులెచట సాటిలేదు స్త్రీ జాతిని పరిగణించు
చేష్టను గన నీ జగమున తుల్యుడు లేడతని కెవడు

# భావములు

నిద్రారహిత నిశీధము శిరమును తినివేసే నా
వెన్నెన్నో విషయమ్ములు
నేత్రమ్ములు అపుడపుడు నిండి పొర్లిపోతుంటవి
అది పొంగిన సమయమ్మున లతలవోలె భావమ్ములు
హృదయమ్మును చుట్టిప్రాకు.
దీపాలను వెల్గింపగ విఫలీకృత చేతనతో (తేజము)
లేఖిని పత్రముల నొంద కలుగు హఠాత్ప్రోత్సాహము
పత్రముపై భావమ్ముల నాటటమ్ము కోసమ్మే
లేఖిని చలియిస్తున్నది తిరిగి శాంతి, ఘననిద్రను
ఎప్పటివలె వచ్చురేపు తెస్తున్నది ఇదే వెనుకను.

***– సునందా కె. మీనన్ కవితకు తెలుగు అనువాదం***

***(సండే క్రానికల్ జూన్ 1, 1986)***

# వృత్తి వనిత

మొన్న ఒకదినాన నేను వీధుల్లో ఒక మిత్రురాలి
కడు ఘనముగ మారిపోయి నట్టిదాని కలుసుకొంటి.
ఆమె వీధిలో క్రిందకు చారుగతిని గడచివచ్చె నడ
స్థూల అయిన ఒక బాలిక ఆమె ప్రేమ చిహ్నములతో నికటమ్మున చేరి ఉంది.
ఎత్తుకున్నదామె ఇంకో బొద్దు, ముద్దు పసిబిడ్డను
ఇద్దరము హఠాత్సంగమమునకెంతో నిర్ఘాంతులమై పోతిమి నిశ్చలముగ.
సత్యమ్ములు రాగోపేతమ్ములు నగు భూషణములు
పరివర్తన పొందిన తరి చిరునవ్వులు, వెనుమళ్ళుట
లంత కాలమానములను వీక్షచేసుకొనుటలయ్యె
వృత్తివనిత నైన నేను
ఆలస్యమ్మయిపోతిని
మనుజపత్ని శాంతముగా శీతలముగ నప్పుడుండ
క్షణము నేను తలపోసితి నిశ్చయముగ నేనదృష్ట
శాలిని నాకున్నవి గద వృత్తి గృహము సమయధనము
తదుపరి భావము నాలో పరివర్తన చూపినది
నాలో ప్రేమాపేక్ష నప్పుడనుభవింప జేసినది.
ఒక స్త్రీ పొందగ దగినది సకలమామె పొందగలదు
అయితే మరినేనా? నే నేదుఃఖింపగ దగదు.
ఎందువల్ల నంటే నే స్త్రీ స్వేచ్ఛా చిహ్నన్ని
అవును నిజమ్మది వనితా స్వీయ సృష్టులందొక్కటి.
అది మూలంగా బాలది అయిననారి ఓహోహో వృత్తిస్త్రీ ఇటనున్నది.

ఇదియే నీ దౌర్బల్యము నేత్రమ్ములు మూసుకొమ్ము నీ హేతువు నొప్పుకొమ్ము
జీవితమ్మున నాడే నీక్రీడయె గాన నీవు శోభాయుత పక్షమ్మునుపార్శ్వమ్మును
వీక్షచేసి అద్దానిని సృష్టింపుము, సుందరముగ.

***అనువాదము సుసన్ అబ్రహం (సండే క్రానికల్ జూన్ 1, 1986)***

# యోజనలు

అంతా అయిపోయినదిట అస్తమించినావిచ్చట.
శూన్యం నా అంతరాన చుట్టూ ఘన సుస్వనము
కాలము నా స్తబ్ధాంగుళి జాలము ద్వారా జారెను
నా శీతల చిబుకమ్ముల చల్లని చుట్టునున్న నిస్తబ్ధత
ప్రణయ కృతజ్ఞతలెన్నో గుసగుసలాడుతు సృజించె
లోకభిన్నాభిన్నత చెవుడు పడెను శ్రవణమ్ములు
నా చుట్టును నున్న కాలశూన్య ధూళి ధ్వంసాలతో
జగమంతా దాని ఐక్య సంపద కోల్పోయినది
ఈ విధ్వంసాలల్లో తారాతేజము వీడిన
వడలిన కన్నులు కలిగిన ముఖములెన్నో చూచాను
చిరునవ్వుల పెదవులు
తము కలుపమనే కాంక్షలతో అర్థించుట చూచినాను
వారందరు నా వలెనే వారి జీవితాలును సం
ఘటనలు నా ప్రస్తుతంతో భయపెట్టగ నా భావిని
వర్తిస్తున్నవి దృఢముగ ప్రతిబింబిస్తున్న నన్ను వానిలోన చూస్తున్నా
వాని పతన సౌమ్యమ్ములు నామశూన్య భీషణతతో
వ్యధవెట్టుచు నింపివేయు
నేను వారి ఉత్విస్తృత కరతలాలనుంచి ఎట్లో
అనుపాతన పొందినాను.
ఎగతాళిని చేస్తువారు – వాడినవీ, దుఃఖోపే
తాలు వాని నిరీక్షణలు నిందిస్తవి ఘనముగ నను

అయితే నాదౌ సౌమ్యము క్షయమున వసియించే వానిలోన లోపింపదు.
ఆ అలసని కన్నులలో ప్రశ్నలకే కనుగొంటూ
నా చుట్టూ కట్టుకొంటి నాణ్యమైన కుడ్యమ్మును. యొకటి
దూరంగా, దూరంగా త్రోసివైచి నా రక్షల
వాత్యావళి చండంగా అతిశక్తితో వచ్చినది. అరుదెంచెను
అయితే నే ప్రస్తుతమ్ము ఆ స్థితి నెటో అధిగమింప
శక్తినొందినాననుచును (నంటూ) స్థిరతరముగ భావింతును
ఛిన్నాభిన్నత నొందక నా మది తగినంత దృఢము
గాగస్థిరత నార్జించెను నా ఇంద్రియములు నీసా
మీప్యపు తావులకిపుడును రంధ్రాలైపోతున్నా
నా జీవితమును నెంతగ (దుష్ట) వికృతమ్మొనరించినావొ
అవగతయ్యెనె నీకు?
నిన్ను మరల కలిసెడి అనుభూతిని నే పొందననుచు
శాంత్యాచ్ఛాదన నాత్మను కప్పుకొన్న దృఢమౌ నా ఏకాంతత వేడుకొనును

అనువాదము: వనితా కిరణ పనాల్కర్

**(సండే క్రానికల్, జూన్ 1, 86)**

# త్యాగము

దైవానురాగ శూన్యాలే సంప్రదాయములు కేవల
భౌతికములు, మానసికములైన అనుష్ఠానములు (క్రియాచరణములే)
శాస్త్రవిధుల వ్రతములలో దైవపూజనములందున
దాంభిక కర్మాచరణము ఎంతగ భారమ్మయినను
అవి ఎపుడు తమంత తాము ఆధ్యాత్మిక నిష్ఠితమ్ములై ఒప్పవు వీక్షింపగ
అతడి భక్తి సూత్రాలలో భక్తిని నారద మహర్షి
పరమ ప్రేమ రూపమ్మని నిర్వచించినాడుమున్నె.
ప్రణయము పరిపూర్ణంగా ప్రభుసంగమ మొందుటతో
పరాకాష్ఠ నొందుతుంది భక్తుని ప్రణయము పెరుగగ పెరిగిన
పరమ ప్రేమాన్వితుడును పరమ రమ్యమూర్తియునే
ప్రభుని పొందుటకు నిరతము నాతని యభిలాష పెరుగు.
అతడు సర్వేశ్వరునకు సన్నిహితుడు సారూప్యుడు
నౌచు ప్రవర్తింపగలడు సకల ప్రాపంచిక బం
ధాలతో, ఆకర్షణలతో జీవన మశ్రద్ధ నొందు
ఈశునితో సంయోగము నొందుటయే అతని ఏ
కైకమ్మగు విషయమౌను
ఏమైనా ఆసక్తుడు, ఎంతటి ఉత్కంఠనున్న
జగమును, కర్తవ్యములను త్రోసిపుచ్చబూనుకొనడు
ప్రాపంచికములును, పుణ్యములునునైన కర్తవ్యము
లన్నిటి నిస్వార్థముతో పరమేశుని పాదద్వయ కర్పించుట కొనరించును
ఈశ్వర సంసిద్ధికి నవకాశయొక్క త్యాగముననె
త్యాగ మన్న సంఘకుటుంబాల విడిచిపెట్టుటన్న

అర్థము కాదది ఈశ్వర సంతృప్తికి స్వార్థరహిత
క్రియాచరణ మటులొనర్చ ప్రతికర్మ పునీతమౌను
అది వ్యక్తిని బంధింపదు సాంఘిక సేవకు బూన్కొను
ముందు నెడద దైవభక్తితో పరిపూరితము సేయు
డని అనుచరులకు చెప్పగ లేదే శ్రీరామకృష్ణ
లేకున్నను మానవుండు స్వార్థపరుండగుటకెంతో అవకాశమ్ముండును గద!
దైవ ప్రణయమ్ము తీక్ష్ణమయ్యెడు కొలదిని భక్తుడు
భగవానునితో పరిపూర్ణముగా సంయోగమందు
ఆ దైవము ప్రతితావున అధివసించుటను కన్గొను
అప్పుడతడు నైజముగా సకల మనుజజాతిపైన యెదను
అనురాగము నొందుటగా కన్యమేదియును నెరుగడు

***మతోపన్యాస గేయము ఈనాడు (జూన్ 13, 86)***

# హిప్పీ

మధుపాత్రలనింపి మనం సుఖయాత్రలు సాగిద్దాం
సమయానికి వీలుపడ్డ నరనారీ సహచరులతో
సాగిద్దాం జీవితాల మన బ్రతుకుల నీతి ఇదే
అని విశృంఖలముగ భావించుట కలవాటు పడ్డ
హిప్పీలచే ఏదో పని చేయిద్దామనుచు బ్రిటన్
పథకాలను వేస్తున్నది, స్వేచ్ఛగ తమనీతులతో
జీవించే హిప్పీలను అటు వీరంగముల నుంచి
అధికారులు తరుముతుంటె న్యాయస్థానాలకేగి హిప్పీ సంస్కారులు
తమ స్వేచ్ఛకు కడుగాఢముగా పోరాడుతున్నారు

# ఓ దేవదేవ

ఓ దేవదేవ నే నుత్సహించెడు రీతి
పుణ్య సేవికనుగా పుట్టింపు మో స్వామి!
వాత్సల్యమున నన్ను వైతాళికను జేయ
ప్రాభాత గీతికల ప్రౌఢి మేల్కొలిపెదను ..... ఓ దేవదేవ
దేవదాసినో నేను దేవాలయమునందు
ఉభయ సంధ్యలనాట్య మొనరించి రంజింతు ..... ఓ దేవదేవ
దేవారులను జేర్చి భావజక్రీడలతో
హర్షింప జేయుతరి అర్చింతు ప్రీతితో ..... ఓ దేవదేవ
పారిపార్శ్వను జేయ భక్తజన సభలనే
అర్చనల భాషణల నతిరమ్య మొనరింతు ..... ఓ దేవదేవ
దీపకన్యను జేయ దేవనీ దర్శనమె
ఫలముగా నిరతమ్ము ప్రార్థింతు మదినితమి ..... ఓ దేవదేవ

# తరలి రారండోయీ!

తరలి రారండోయి! తరలి రారండోయి
ఆలసించెద మేమొ అమ్మసేవకు మనము
తొలి తామరల కనులు
తెరచి చూడక మునుపె,
మల్లికల వాసనలు
మనల ముంపక మునుపె — తరలి రా...

కేళికుళి కెరటాలు
కెరలి యాడకమున్నె
తెమ్మరల గీతాల
మున్మురమునకు మున్నె — తరలి రా..

ఆనందరసఝురుల
నమృత గానము తోడ,
కలసి పోదము రండు,
సొలసి పోదము రండు... — తరలి రా..

తరలి రారండోయి. కెరలిరా రండోయి
ఆలసించెదమేమొ, అమ్మ సేవకు మనము

# జౌనె సఖీ, జౌనె సఖీ,

జౌనె సఖీ, జౌనె సఖీ,
స్వేచ్ఛాభానూదయమే!
జనగణ వన సుమముల కిక
ప్రణయోజ్వల జీవనమే,
అవిగో! అల్లవిగో
రవికిరణము లల్లవిగో
జౌనె సఖీ, జౌనె సఖీ,
స్వేచ్ఛా భానూదయమే!
ఓ హో హో అమృతమయీ!
ఓహో ఆనంద మయీ!!

కీర్తిలతా కుంజములను
మర్చుదమె దశదిశలను,
శాంతి, స్వేచ్ఛ, సౌఖ్యములను
పంచెదమె మనుజాళికి

ఓ హో హో అమృతమయీ!
ఓహో ఆనంద మయీ!!
హిందు ప్రజాహృదయ రాజ్ఞీ
హే జననీ భరతావని!
రత్నాకర సరసీరుహ
సింహళ మృదు పదపీఠా,
శిశిరోజ్వల వుభజ్యోత్స్నా
హిమవన్నగ సితమకుటా!
హిందుప్రజా...
చుంబిత నభ కాళిందీ
కువలయ రుచి కచభారా,
కరమృదంగ కావేరీ
మధు మంజుల మంజీరా!
హిందు ప్రజా హృదయ రాజ్ఞీ
హే జననీ, భరతావని!!
ఓ మహోన్నత హసిత,
ఓ మహోజ్వల చరిత!
ఆభ్రూ విహంగాల,
ఆ కృపా పాంగాల
నమృతమ్ము కురియింపుమా!
ఆనంద మొలికింపుమా!

ఓ మహోన్నత హసిత
ఓ మహోజ్వల చరిత!

పాడరా సోదరా
భారతాంబిక పదము
వీడరా మాంద్యమ్ము
విశ్వమంతా నీది – పాడరా

అర్థతంత్రాలతో
అడుగంటి పోనీకు
రాజ్య తంత్రాలలో
రక్త నదులను నిల్పి పాడరా

మానవులు పశువులై
మసలరో యీ భువిని
ధర్మ దీపచ్ఛాయ
దశ దిశల నలముకొన – పాడరా

**– ముక్తి నుండి**
***గుంటూరు పత్రిక***

# హే శారద!

శరదుజ్వల నవనీరద!
జయ, జననీ, సకల జనీ!!

కలనినాద మృదుచరణా!
కవి మానస మధు విహరణ!!
నిఖిల కళానిధి నిలయా!
రమ్య హృదయా రసికాలయ! – హే శారద

ముజ్జగములు నీ వలననె
మోహరించి నిలిచినవి!
ముగురమ్మలలో పెద్దవు
మూలశక్తి నీవె కదా – హే శారద

మదిలో నిను నిల్పుకొన్న
పదవరోజు షట్పదముల
అసదృశమగు రసపిపాస
మసలెడి మమ్మోము మమ్మ – హే శారద

# జన్మభూమి - ధన్యభూమి

ధన్యభూమి!! జన్మభూమి!!
మంజుల జని! మహితావని!!
నగరాజుల విన్నాణపు
నయగారమ్ముల నెల విది
అమరనదీ హసనములకు
దివ్య కొమరు మిగులు కొలువియ్యది ॥ధన్యభూమి జన్మభూమి॥

ప్రీతి మెరయ వన సుందరి
పెంచుకొన్న ఉపవన మిది
ఖనిజరత్న నిచయమ్ముల
ఘనకాంతుల గని యియ్యది ॥ధన్యభూమి జన్మభూమి॥

సాధుజంతుతతి వలచిన
సస్యహ రిత చేలాంచల
నిఖిల దేవతా మోహన
నిర్మలరుచి నేత్రాంచల ॥ధన్యభూమి జన్మభూమి॥

ధన్యభూమి, జన్మభూమి!!
మంజుల జని! మహితావని!!
ప్రీతి యెసగ వనదేవత
పెంచుకొన్న యుపవన మిది
ఖనిజరత్న నిచయమ్ముల
ఘనకాంతుల గని యియ్యది ॥ధన్యభూమి జన్మభూమి॥

***ఆకాశవాణి, విజయవాడ, 1-2-65***

# స్వాతంత్ర్య దినము

వచ్చె నిదె స్వాతంత్ర్య దినము
మరల నిం కొకమారు
వచ్చె మన స్వాతంత్ర్య దినము!!
పరదాస్యమును బాపి భారతీయుల కేను
పరమ స్వేచ్ఛావృత్త చరమసీమల కేగు
వెలుగు బాటల జూపి, తలపు లిచ్చితి – కాన
నను మరువబోకు డని తిరిగి తెల్విడిసేయ
వచ్చెనిదె స్వాతంత్ర్య దినము...

అచ్చెరువు వడుచు నిదె మెచ్చుకొన మును తాను
జీవనమొందిన రీతి మనసులలో చిత్రించి
హెచ్చరికలను కాన్క లిచ్చి, యెద పుచ్చుకొని
తెరమరుగునకు నేగి మనల నడిపింపగాఁ
వచ్చెనిదె స్వాతంత్ర్య దినము...

తన అహింసాదివ్య దారుణాస్త్రమ్ముతో
కడిది శత్రుల ఆట కట్టించి, రాజ్యమును
పెట్టించె నిజప్రజకు – ప్రీతిమై 'జాతిపిత'
గాంధిదేవుని గొల్చి కైమోడ్పులందింప వచ్చెనిదె స్వాతంత్ర్య రథము...

రాక్షసోజ్వల శక్తి రణచణత్వము పెంచి
దీక్ష నీలోకము తెరలింప గనువేళ
పంచశీల సృజించి ప్రగతి వంకకు మలచి
ఏ జవ్హారిల చెలఁగె ఎన్న నామహనీయు వచ్చెనిదె స్వాతంత్ర్య దినము...

నిన్నుగని కనుకుట్టి యున్నయవి పెనుగొండ
లన్ని దారులలోన అదరకని బెదరకని
మన ప్రజాతంత్ర ఘన మహానౌక కొక
చిన్ని సలహా నొసగి – చేర్పగా తీరమును      వచ్చెనిదె స్వాతంత్ర్య దినము!!

ఆది చరితను మరువ కంధానుకరణమున
నీది యేదొ వెదకి, ఉన్మాదివై వలచి
తూర్పువాకిలి తెరచి, నేర్పుతో పడమటకు
తరలింపుమా నీదు ధర్మ రథమని తెలుప
వచ్చెనిదె స్వాతంత్ర్య రథము!!

ఋషివాటికల తొలుత తుషిత ప్రశాంతి యెది
యింపుగా పెంపొంద నిల స్వర్గమయ్యెనో
అది నేటి మానవున కమరునందాక ఇక
నిదురవోవకు మనుచు నిను ప్రబోధింపగా
వచ్చెనిదె స్వాతంత్ర్య దినము!!

# రావమ్మ జనని

రావమ్మ జనని ఓ రణచండీ!
రావమ్మా శత్రుజన జలరుండీ!!

రణదోహలత మించి
చణభుజా హరి పెంచి,
రాక్షసోజ్వల శక్తి
రగులు కొని వచ్చింది. ॥రావమ్మ॥

నిండు గుండెల విప్పి
నింగిదాకా పొంగు
గంగమ్మ పాటలకె
భంగమ్ము కల్పించి ॥రావమ్మ॥

కడగి పెను గర్జలతో
కైలాసనగము కడ
పరమేశు సాధనకు
చరమగీతము పాడ ॥రావమ్మ॥

మందాకినీ మహిత
మంజువన వాటికల
పుణ్యమౌదుల నిరో
ధించి పోకార్చుచిదె ॥రావమ్మ॥

ఏనాటి హిమవంతు
డింత పాటింపకే
తలమీదనే నడచి
ఇలదోచి, భురిచించి ॥రావమ్మ॥

కేదార నాధునకు
ఏదారియో యింక
మాదారియారు వా
కాదారియే ఇంక ॥రావమ్మ॥

రావమ్మ జనని ఓ రణచండీ!
రావమ్మ శత్రుజన జనరుండీ!

**ఆకాశవాణి**

# పౌష్యలక్ష్మి

వచ్చిందొక వింత వసంతం
కలిపికగణ భాస్వంతం!!
మన కడుపులోన మెసలుతు
ముసలి మొసలి కన్నీళుల
పలుకుగాని పలుకు పలుకు
పరపరభృత గ్రీష్మముగా
వచ్చిందొక

ఈ దేశపు పికములెవో
పరసీమల కోయిలలెవో
తెలిపి నిలిపి వలచి తరిమి
ఇల కొక మే లొనరింపగ
వచ్చిందొక

అగ్నినగ ధ్వానాలతో
అరవనేర్చు పరపికములు
ఈ గతితా నే తెంచిన
ఎటు కదలవో గమనింపగ
వచ్చిందొక

కొత్త తరుతావులతో
ఉత్తమాధి కారముతో
ప్రగతిగీతి పలికింపగ
సుగతి పథము వెదకింపగ
వచ్చిందొక

బలముకాదు బలమిలపై
భావబంధురత పలుకుడు
భావబలమె రణబలమగు
భారతవన పికము లార!!
వచ్చిందొక

ఘన వనచయ ప్రళయములకు
కనమీరే రక్షకులిక!
గళకాహాళ సంధింపుడు
కదనగీతి పలికింపుడు
వచ్చిందొక

ధూర్త వనప్రియ గళములు
శోషిల్లంగ మించి ముంచి
ధర్మఘంటికా కంఠము
దశదిశలకు వినిపింపుడు
వచ్చిందొక

వచ్చిందొక వింత వసంతం
కలిపిక గణ భాస్వంతం
వచ్చిందొక

***ఆకాశవాణి, విజయవాడ 14-1-1982***

# ఏకాంత పథికుడు

శ్రమ వారిబిందువులు కమనీయతల తోడ
ముఖ చంద్రమండలము ముద్దులొలుకగ నడతు ॥శ్రమ॥

దినకరుని కిరణాల తీవ్రతకు తనువెల్ల
నలసి పోవుటజేసి యాయాసముల కోర్చి. ॥శ్రమ॥

పదపద్మముల యందు ప్రాణ నాడులు విరియు,
వ్రేళ్ళ పుటములు జూడ వేడి బొబ్బలు పొక్క. ॥శ్రమ॥

కార్య సాధనదీక్ష కడు బడలిననుగాని
నిలువ నీయక నిన్ను పలుతొందరలపెట్ట. ॥శ్రమ॥

ఎటు చూచినను గాని యేపల్లె పక్కణము
చక్షు గోళమ్మునను వీక్షణమ్మున లేదు. ॥శ్రమ॥

తుది మొదలు గనలేని దొడ్డ బాటను బట్టి
వెనుక చూపే లేక వెర్రినడకల నడతు. ॥శ్రమ॥

తలదాచుకొనుటకై ఫలవృక్షముల నీడ
కరవగును, సుంతయును కలగబోదు సుఖంబు. ॥శ్రమ॥

ఏ చెట్టు నీడనో యింత నిలుచున్నచో
ఆకులన్నియు రాలు నంత పండెండయే. ॥శ్రమ॥

# తరణోపాయం

## సన్యాసి

కష్ట సుఖంబుల
　　కలగా పులగపు
స్వర్ణనరకముల
　　సంకర మౌ భువి
కర్మబంధముల
　　కట్టు బడుట కిట
కారణ మేమియొ
　　కనుగొన వేమిర?

తమమును జూచియె
　　తళతళ లాడెదు
కాంతి పుంజమని
　　కళకళలాడెదు
కలిగిన జన్మకు
　　కారణ మేమో
తలచి తరింపగ
　　తరలిరా, తరలిరా!

పాపంపు వాసనల్
　　పట్టి వేధింపంగ
పుట్టుచున్ చచ్చుచున్
　　భువిలో చరింపకే
తలపోసి నీవిపుడు
　　తరియించు మార్గంబు
కనుగొనను లెమ్మురా!
　　కదలి రా కదలిరా!

భువిలోని సౌఖ్యాలు
　　పూర్వార్జితం బులని
పొంగిపోవుచు నీవు
　　పోయెదవు మురువుతో
భావి జన్మమ్ములకు
　　ప్రబలమౌ కారణము
పోయిన జన్మాల
　　బుద్ధి మాంద్యంబేను.

భార్య బిడ్డ లనేటి
　　పాడు లోకములోని
పంపకం బంతాను
　　పరమ సౌఖ్యంబనే
వెర్రి వేదాంతాల
　　విద్య నీ కేలరా
తరియించు మార్గంబు
　　తక్షణమె వెదుకుకో!సన్యాసి

## కవి

కష్టాలు సుఖములూ
　　కలిగి నందుల కేమి
కారణంబో నేడు
　　కవికి నాకెందులకు?
కష్టముల సుఖములను
　　కౌగిలిం చెదనునే
సమముగా నీ రెండు
　　సౌఖ్యం బొసంగురా!

నూతన సృష్టియె
　　నూతన జన్మకు
కారణభూతము
　　కవి యోచనలో
ముందు జన్మలకు
　　మూలకారణము
పోయిన జన్మల
　　పొంకపు కవితలె!

కనుగొనన్ లేవురా :
　　కవి కేమి లేవనియె
కర్మ బంధంపు సం
　　కర వాసనల పుట్ట
కావ్య ప్రపంచంబు
　　కల్పించు తలపుతో
పుట్టుచుందును చచ్చు
　　భువి లోన కవి యన!

గాఢమౌ తిమిర సం
　　ఘాతంబు లోపలన్
మిణుమిట్లు గొలుపుచున్
　　మెరసి పోయెదను నే
కాంతి పుంజంబనీ
　　కలలలో తేలెదను
కావలసినది కాదె
　　కవికి ఆనందంబు!

పుణ్య భూములలోన
　　పుట్టువారలలెల్ల
స్వర్గ సౌఖ్యంబులన్
　　చల్లి వేయుటకు నై
జన్మ రహితత్వాన
　　చరియింప గాలేక
చచ్చుచును పుట్టుచును
　　సంచరించెదను నే!

ప్రణయ మాధుర్యంబు
　　పంచి యిచ్చెదు నాదు
ప్రాణకాంతకు మించి
　　పరమాత్మ లేదురా
తరియింతు నిదియె నా
　　తరణంపు మార్గంబు
తెలియ జెప్పితి నిదే
　　తేట తెల్లంబుగా!

# పెళ్లి సవరణ

చిన్ని కృష్ణా నీవు
చేసేటిదిదిరా?
నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
కూరపాదుల లోని
గున్న మొక్కల నెల్ల
కుంకుటేళ్ళతో నీవు
కలుకుచున్ పెరికించి
'పాపల్ల' పెళ్ళికిదె
పంది రేశావురా?
చిన్ని కృష్ణా నీవు
చేసేటి దిదిరా?
నీదు
చేయెంత చిలిపిదిర
చిన్నికృష్ణా?
నలుపులో నినుబోలు
నల్ల రేగడి మట్టి
మరగొమ్ము కెళ్ళి నీ
మనసొచ్చి నంతగా
కొని వచ్చి అరుగుల్లు
కొట్టమున వేశావ?

చిన్ని కృష్ణా నీవు
చేసేటి దిదిరా?
నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
పూలతోటకు నరిగి
పూగుత్తు లన్నిటిని
కోసి కొనివచ్చి నీ
కొయ్య బొమ్మల జుట్టి
కోణంగి! ఆటలో
కుదురు కొన్నావా?
చిన్ని కృష్ణా నీవు
చేసేటి దిదిరా?
నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
ఆడు బొమ్మలకు కొ
ప్పందముల దిద్దగన్
చికిలి పిట్టల బట్టి
చెరల బెట్టించుచున్
రంగు రంగుల యీాక
లాగేయు చున్నావ?

చిన్ని కృష్ణా నీవు
చేసేటి దిదిరా?
        నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
        పెళ్ళికిన్ వేంచేయు
        పెద్ద వారల ముందు
        నీ వేణు గానముతో
        నిలువగా లయలనున్
        పికరాజునే బట్టి
        పిలిపించి నావురా?
చిన్ని కృష్ణా నీవు?
చేసేటి దిదిరా?
        నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
        మధుపర్కమున కీవు
        మధుపమును పిలిపించి
        మధుమాసముల నేర్చు
        మధువులన్ – అన్నిటిని
        కప్పములుగా నీవు
కట్టించు చున్నావ?
చిన్ని కృష్ణా నీవు
చేసేటి దిదిరా?
        నీదు
చేయెంత చిలిపిదిర
చిన్ని కృష్ణా?
        కాశియాత్రలో గొడుగు
        కాళియ్య కాబోలు
        నాగవల్లీ రోజు
        నవనళిని నాట్యంబొ!
        పన్నీర్లు అత్తర్లు
        పవనరా జిచ్చునో!
        పండు ముత్తైదువు
        ప్రకృతియే కాబోలు!
        పరమ బ్రాహ్మణుడవు
పరమాత్మ నీవురా!
చిన్నికృష్ణా నీవు
చేసేటి దిదిరా?
        నీదు
చేయెంత చిలిపిదర
చిన్ని కృష్ణా?

# మహాయజ్ఞం

**1**

ప్రపంచ మంతట పరంపరాకం
విపంచి కింతట వసంతరాగం:
ఆహవకర్త – ఆహవభర్త ఎవడో ఎవడో మరి
ఎవడెవడో – ఎవరెవరో
ప్రపంచ మంతట పరంపరాకం
విపంచి కింతట వసంతరాగం

కులగిరులే హోతలుగా నుద్గాతలుగా
విధిదర్శన నేతలుగా,
ఋక్షఋషభకోలాహలమే
ఋత్విక్కుల రోమంధముగా
సముద్రఘోషల సామిధేనితో
హాహాకార స్వాహాస్వనముల,
ఆత్మల హేషల ఆమంత్రణముల –
స్రుక్స్రువమ్ము లీదిక్కులు నాలుగు
హవ్యకవ్యములు, ఆమీక్షమ్ములు,
సాన్నాయ్యమ్ములు, చరుపరమాన్నము
లర్కారాజన ఆత్మ దేహములు
ఉపాకృతమ్ములు, వషట్కృతమ్ములు,
కృపాతిరస్కృత కృశానతేజులు
స్థండిలమండిత చండానలునకు
అపవిత్రాశయ ధవిత్రములతో
స్వేదాంకురముల, చిదిమేసేస్తూ

నిషా కోసమై విషాణపూరిత
సురాదానమున పరాధీనుగా
బంధించేస్తూ, బలిభుక్కునుగా
పాతించేస్తూ, పశుతుల్యముగా
గవేషణమ్మౌ సుభీషణముగా
విషతుల్య మ్మగు విశ్వదాసమును
గగనము నంటే కరాళకాళీ
సుతలము ప్రాకే సుధూమ్ర వర్ణా

**2**

సులోహితార్చిస్ఫులింగినీ గణ
మనోజవమ్ముల – మార్తాండాంశల –
ఆహ్వానిస్తూ అవలోకిస్తూ
అండపిండ బ్రహ్మాండములను
అండపిండ బ్రహ్మాండము నిండిన
ఆహవనీయము కర్పణచేస్తూ
ఆకలి తీరని ఆరాటముతో,
అంతులేని హఠయోగముతో
చేసే ఈ యజ్ఞపు
చిద్విలాస మది యేమో!
చిత్తవీథిలో చిట్టెము కట్టిన
మత్తాశయ మది యేమో!
ఎ న్నైనవో!
ఎ న్నౌతవో!!

ప్రపంచ మంతట పరంపరాకం,
విపంచి కింతట వసంతరాగం.

***ప్రతిభ 1940***

# ఆంధ్ర కామాయని



'ఆంధ్ర కామాయిని' అందుకుంటున్న ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు

# నివేదన

మా తండ్రిగారు శ్రీ వావిలాల సోమయాజులుగారు సాహిత్య రంగంలో ఎంతటి మహోన్నతులో స్వయంగా గ్రహించగలిగేంతటి సంస్కృతాంధ్ర సాహిత్య పరిచయం గానీ ప్రవేశంగానీ మాకు లేదు.

వారు బహుముఖీన ప్రజ్ఞాధురీణులని, ఆంధ్రసాహిత్యాకాశంలో వారొక ధ్రువతార అని నాన్నగారిని చూడటానికి మా యింటికి వస్తూపోతూ ఉండే కవి, పండితులనేకులు అంటూ ఉంటే వింటూండేవారము.

నాన్నగారు ఈ 'ఆంధ్ర కామాయనీ' కావ్యాన్ని తమ సాహిత్య కృషికి తలమానికంగా భావించేవారు. దీనిని యథామాతృకంగానే కాకుండా, మాతృకకు వన్నెపెట్టే విధంగా, హిందీ రాని తెలుగువారికిది స్వతంత్రమైన ప్రౌఢసుందర కావ్యమనిపించే విధంగా రచించారని మా తండ్రిగారు చెబుతుండేవారు.

ఈ ఆంధ్ర కామాయనీ కావ్యాన్ని నాన్నగారు సుమారు పాతిక సంవత్సరాలకు పూర్వమే రచించారు. అప్పట్లో ఇది 'స్రవంతి' అనే మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. ఏ కారణంచేతనో మా తండ్రిగారు దీనిని పుస్తకరూపంలో వెలువరించకుండా చాలా కాలం ఊరుకున్నారు.

1992 జనవరిలో నాన్నగారు దివంగతులైనారు. అంతకు కొంత కాలం పూర్వం నుంచీ వారు అస్వస్థులుగా ఉన్నారు. అప్పుడు ఈ కావ్యాన్ని పుస్తక రూపంలో ప్రచురించాలని వారు వేగిరపడ్డారు. కాని ముద్రణ పూర్తి అయ్యీ కాకుండానే వారు కీర్తిశేషులు కావటం మా దురదృష్టం.

వారు ఈ కావ్యాన్ని విద్వన్మూర్ధన్యులు, బహుభాషా కోవిదులు, మృదుమధురకవితా ప్రియంభావుకులు, రసజ్ఞ శేఖరులు, సహృదయ సమ్రాట్టులు, మన ప్రియతమ భారత ప్రధాని గౌరవనీయులైన శ్రీ పి.వి. నరసింహారావుగారికి అంకితం చెయ్యాలని కాంక్షించేవారు.

వారి అభిమతాన్ని మన్నించి ఈ గ్రంథాన్ని తమకు అంకితం చెయ్యటానికి అనుమతించిన గౌరవనీయులైన శ్రీ పి.వి. నరసింహారావు గారికి శతసహస్ర కృతజ్ఞతాంజలులు.

నాన్నగారికి ఈ గ్రంథ రచనాకాలంలో చేదోడువాదోడుగా ఉన్న సుప్రసిద్ధ హిందీ విద్వాంసులు శ్రీ చావలి కోటీశ్వరరావుగారికి మా కృతజ్ఞతలు. వారి తోడ్పాటును నాన్నగారిలా ప్రశంసించారు.

తొలి నారాయణభట్టు నన్నయకు సద్యుక్తిన్ నిగూఢార్థముల్
చెలిమిన్ దెల్పిన రీతి దెల్పి, యట నాచే నాంధ్ర కామాయనీ
కలహంసన్ సృజియింపఁజేసిన లసద్గణ్యుండు, పుణ్యుండు చా
వలి కోటీశ్వరరాయ విజ్ఞుని మహాప్రౌఢిన్ ప్రశంసించెదన్.

ఈ కావ్యానికి సుప్రసిద్ధ కవివర్యులు డాక్టర్ శ్రీ ఆచార్య తిరుమల గారు 'ఆంతర్యం' అందించారు.

శ్రీ ఆచార్య భీమసేన్ 'నిర్మల్' గారు, (ఎమిరిటస్ ప్రొఫెసర్, హిందీ శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు) 'ప్రశంస' సంతరించారు. ఈ ఇరువురు పెద్దలకు మా నమస్కృతులు.

పాతిక సంవత్సరాల నుండి 'ఆంధ్రకామాయని' వ్రాతప్రతిని నాన్నగారితో పాటు పఠించి, అక్కడక్కడ కొన్ని మార్పులు, చేర్పులు సూచించి అక్షరస్ఖాలిత్యాలను సవరించి నాన్నగారికి మిక్కిలి తోడ్పడిన సుప్రసిద్ధ కవివర్యులు శ్రీ అన్నపర్తి సీతారామాంజనేయులు గారికి మా నమోవాకాలు.

సుప్రసిద్ధ చిత్రకారులు, నాన్నగారికి శిష్యులు శ్రీ మారేమండ శ్రీనివాసరావు గారు అడిగినదే తడవుగా ఈ గ్రంథాన్ని అందమైన ముఖచిత్రంతో అలంకరించారు. వారికి మా అభినందనలు.

ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రించి ఇచ్చిన 'వెల్‌కమ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు' వారికి మా సాధువాదములు.

నాన్నగారి ఈ కృషిలో ఇంకా ఎందరో విద్వద్వరేణ్యులు కవి తల్లజులు సహకరించి ఉండవచ్చును. వారందరినీ గూర్చి తెలియని మా అజ్ఞానాన్ని మన్నించ ప్రార్థన. ఈ కృషిలో నాన్నగారికి సహకరించిన ఎందరో మహానుభావులు – అందరికీ వందనములు.

ఇట్లు

**వావిలాల బృహస్పతి**

**వావిలాల ఉమాపతి**

**వావిలాల గౌరీపతి**

# ఆంతర్యం

మహా విద్వత్కవీంద్రులైన బ్రహ్మశ్రీ వావిలాల సోమయాజులు గారు రచించిన ఈ "కామాయని" ఆంధ్రానువాద కావ్యం – ఒక వైదిక పారిజాతం, ఒక పౌరాణిక గాథారత్నం. ఒక ఐతిహాసిక భ్రమర విన్యాసం, ఒక కాల్పనిక ఊహా సౌందర్య శిల్పం!

మహాకవి జయశంకర్ ప్రసాద్ ప్రణీతమైన హిందీ "కామాయని"–గర్భిత మహాకావ్యం. ధర్మ సమ్మితమైన కామాన్ని రసవంతంగా వర్ణించే కావ్య కళా ఖండిక. అది తుల్య స్త్రీ, పురుషాధికార సంపన్నులైన శ్రద్ధా మనువుల ఇద్ధ చరిత్ర. ఇందులోని దైవీయ, సౌర, భౌమ, శక్తుల అంతర్యామ సంగమం – ఒక మహాశ్చర్యకర విశేషం!

ఇటువంటి మహత్తర కావ్యానువాదానికి కేవలం శబ్దగత పరిజ్ఞానం చాలదు. భాషాగత విశేషపరిచయం చాలదు. అంతర్గత భావనా వైశిష్ట్య మర్మజ్ఞత కావాలి గాఢమైన శ్రద్ధ కావాలి, ప్రజ్ఞాపాటవం కావాలి, నాన్యతో దర్శనీయమైన సామర్థ్యం కావాలి తాత్త్వికమైన రహస్యాన్వేషణ కావాలి. ఇన్ని శక్తుల ఏకీకరణ రూపం శ్రీ సోమయాజులు గారు. సోమయాజులు గారివంటి వారు తప్ప ఇతరులిటువంటి అనువాదాలు చేయలేరు.

ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో భావకవిత్వానికి ఒక ప్రత్యేకత ఉంది. అయితే నవ్యసాహిత్యం నడుస్తున్న రోజుల్లో భావకవిత్వం – విపులంగా గానీ, సుదీర్ఘంగా గానీ, కథా కథనాత్మకంగా గానీ, ప్రాబంధికంగా గానీ లేదు. ముక్తక ప్రాయంగా ఖండ కావ్య సదృశంగా ఉండేది. అది నిజంగా ఒక లోపం. ఆలోపం శ్రీ వావిలాలవారిని చాలా కలవరపెట్టింది, స్పందింపజేసింది. ఆ స్పందన వారి దృష్టిని జయశంకర్ ప్రసాద్ "కామాయని" మీదికి ప్రసరింపజేసింది. భావుకతా బహురస పరిశోభితం, నవ్యాతి నవ్యమైన ఆ కావ్యం వావిలాల వారి హృదయాన్ని ఆకర్షించింది. ఆయన మహా కవిత్వానువాద దీక్షావిధి ఒక తపస్వి అయ్యారు. ఆ తపఃఫలమే ఈ ఆంధ్ర "కామాయని". నవ్యతా ప్రియులైన తెలుగువారి కిదొక అక్షర వరం! ఒక అవ్యయ స్వరం.

ఈ ఆంధ్రకామాయని రచనకు వావిలాల వారికి సుమారు సంవత్సరన్నర పట్టింది. తర్వాత 1964-67 లలో ఇది "స్రవంతి" పత్రికలో ధారావాహికంగా ప్రచురింప బడింది. సుమారు రెండున్నర దశాబ్దాల తర్వాత మళ్లీ యిలా యీ పుస్తక రూపంలో..! ఇది వావిలాల వారి ఆత్మాభిమానానికి, రాజసప్రవృత్తికి తార్కాణం!

ఈ కావ్యంలో చింత, ఆశ, శ్రద్ధ, కామము, వాసన, లజ్జ, కర్మ, ఈర్ష్య, ఇడ, స్వప్నము, సంఘర్షణము, నిర్వేదము, దర్శనము, రహస్యము, ఆనందము, అనే 15 శీర్షికలతో విభాగా లున్నాయి. 'ఇడ' అన్వేషణారూపంలో ఉంది. కాస్తంత లోతుగా ఆలోచిస్తే - ఈ పేర్లన్నీ మానసిక చిత్త వృత్తులకు పెట్టినవే అని తెలియకపోదు. మనసు ఒక అవ్యక్త మధుర జీవన గానం! అందుకే ఈ కావ్యాన్ని వావిలాల వారు "తేటగీతి"లో నడిపారు. మధ్యలో 'శ్రద్ధ' ఆలపించిన "రగడ" కూడా మధుర గేయమే.

భారతీయ వైదిక వాఙ్మయంలో - 1. స్వాయంభువుడు, 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు, 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు 7. వైవస్వతుడు 8. సూర్య సావర్ణి 9. దక్ష సావర్ణి 10. బ్రహ్మ సావర్ణి 11. ధర్మ సావర్ణి 12. రుద్ర సావర్ణి 13. దేవ సావర్ణి 14. ఇంద్ర సావర్ణి అని 14 మంది మనువులున్నారు.

మన స్థానీయమైన ఈ చతుర్దశ మనుచరిత్రల్ని ఆధి భౌతిక, ఆధి దైవిక ఆధ్యాత్మిక సంస్థాగతం గానూ, జీవేశ్వర వ్యూహాత్మకంగానూ తెలుసుకోవలసి ఉంది. ఆ "మను" వంశ "ప్రవర" ఒకానొక తాత్త్విక భావ "వరూధిని"!

అల్లసాని పెద్దన స్వారోచిష మనుసంభవ విశేషాన్ని ప్రబంధీకరించాడు. శ్రీ వావిలాల వారు ఈ కావ్యం ద్వారా "వైవస్వత" మను దర్శనం చేయించారు. ఇప్పుడు నడుస్తున్నది వైవస్వత మన్వంతరం కదా!

గీతాచార్యుడు జ్ఞానయోగంలో -

"ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్" అని ఎవరిని కాలాత్మకంగా గుర్తుచేసుకున్నాడో-ఆ వివస్వతుని కుమారుడే ఈ కావ్య కథానాయకుడు వైవస్వతుడు. ఇతడు "శ్రద్ధా" న్వితుడు. ఇతనిని గూర్చి ప్రత్యేక 'శ్రద్ధ' తో అధ్యయనం చేస్తేనే గానీ తర్వాత వచ్చే సూర్య, దక్ష, బ్రహ్మ, ధర్మ, రుద్ర, దేవ, ఇంద్ర బలాలు అర్థం కావు. అవన్నీ అంతరంగ తరంగాలు! ఈ మనువుల అంతరాలే మన్వంతరాలు! ఈవిషయాల్ని పురాణాలు విభిన్న కోణాల నుండి నిరూపించాయి. ఆ అధ్యయనం ధర్మ కామన! ఇది కామాయనీ మహదక్షర ఖేలన!

దీక్షతో వావిలాల వారు సాధించిన ఈ మహా కావ్యానువాదంతో తెలుగు సాహిత్యానికి కథాకథన విశిష్టతా వైచిత్రాల్లోనూ, భావనా భంగిమలోనూ, శైలీ వాల్లభ్య సంచయనాల్లోనూ, శబ్దఘటనా సామర్థ్యం లోనూ ఎన్నెన్నో నవ్యతలు లభ్యమయ్యాయని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. అంతే కాదు భావకవితా వైశిష్ట్యం, భారతీయ రూపగుణ నిరూపణం– ఇందులో చోటుచేసుకొని వుండటం ముదావహంగా భావిస్తున్నాను.

రమ్యపాపం, అశ్రుమయ హిమానీ హాలహలజలం, కరుణా మనోజ్ఞ మౌనం, చంద్రికా పరీరంభ నీలమేఘం, పుష్పక్రీడ, అంత్యకిరణం, దీపికాజ్వాల యుమిసెడు దీప్తులు, ప్రణయ శిల, విలాసధార, లోకాగ్ని – మొదలైన ప్రయోగాలు గిలిగింతలు పెడుతున్నాయి.

"కామము", "వాసన" ఖండికల్లో భావకవిత్వం పరాకాష్ఠ నందుకొంది. మిగిలిన ఖండికల్లో వెన్నెల్లా పరచుకొని ఉంది. ప్రేమ సంప్రాప్తికి మనోభీష్టానికి ఘర్షణ నిరూపించబడింది.

తే. అచలము న నంత మగు వీచికాళి మీది
నాసనమువేసి కూర్చుంటి వయ్య స్వామి!
శ్రమ కణమ్ముల పోల్కి తారకల నిటుల
నిదె యొడలి నుండి జార్చె దీ వెవర వయ్య!!

మొదలైన పద్యాల్లో ఎంత ఆహ్లాదకరమైన కవిత్వం ఉందో –

తే. లీలఁ బ్రళయమునను మిగిలితిమి మనము
పొందదెఁ బునస్సమాగ మానంద మిపుడు
శూన్య జగతీ ఘనోత్సంగ శుభ్ర తలిని
నొలయు కలయికకు మిగిలియుంటి మిచట !!

మొదలైన పద్యాల్లో అంత అగాధ భావ తీవ్రత ఉంది. ఈ కావ్యంలో లౌకిక పారలౌకిక కామ స్వరూప చిత్రణ, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా జరిగింది. "రహస్య" మనే ఖండికలో మాయను గూర్చి అజ్ఞానాన్ని గూర్చి జ్ఞాన కర్మల్ని గూర్చి బుద్ధియోగాన్ని గూర్చి చేసిన ప్రస్తావన కావ్యాన్ని శిఖర స్థాయిని నిల్పుతున్నాయి. మనసుని గూర్చి ఎన్నెన్నో ధ్వనిగర్భిత మైన శబ్దాలు ఈ పద్యాల్లో ఉన్నాయి.

కామాయని విశ్వమంగళ కామన-విమల మానస తట వీథి జ్యోతిష్మతి గతిగ సంపుల్ల లతిక గతిగ నిలిచిన ఆమె, నిత్యసుందర, సతత సత్య భూరి చైతన్య శుభ మహాపుణ్య వపువు!

తే. భేద భావాళి సర్వమ్ము విస్మరించి
దృశ్యముగఁ జేసి సుఖ దుఃఖ హేల నెల్ల
"నేనె యిది" యను మీ వోయి మానవుండ!
విశ్వమే నీకు నీడ యై వెలయు నయ్య!!

అన్నది కామాయనీ కవితా హృదయ సందేశం! ఈ సందేశం వినినప్పుడు నేత్రాల్లో ప్రేమజ్యోతి ప్రతిఫలించకుండా ఎలా వుంటుంది ?

"దేవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవయే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తితే"

దురత్యయమైన ఈ మాయను తరించి ఆనందాన్ని పొందటానికే మనసుని అధ్యయనం చేయటం, ఎందుకంటే, "మన యేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" కదా!

"చంద్రమా మనసో జాతః" చంద్రుని నుండి మనసు పుడుతూ వుంది. ఎలా? వైజ్ఞానికంగా చంద్రుడు ప్రజ్ఞానాత్మ. రేతః, యశః, శ్రద్ధా - అనే మూడు చంద్రునిలోని మనోజ్ఞతలు. అందుకే మనువు - శ్రద్ధల బంధంలో వైదిక రహస్యం ఉంది.

చాంద్రరసాన్ని 'శ్రద్ధ' అంటారు. ఇది దివ్యమైన ఆదిత్యాగ్నిలో హోమమై 'సోమం' గా మారుతుంది. ఈ సోమం, పర్జన్యాగ్నిలో హోమమై వర్ష రూపంలో పార్థివాగ్నిలో ఆహుతి కాగా ఓషధులు పుడుతున్నాయి. ఇవి ఆధ్యాత్మిక వైశ్వానరాగ్నిలో ఆహుతాలై రసాసృగాదిరూపాలు పొంది చివరికి "శుక్ర" రూపం పొందుతుంది. ఈ అన్న రూప శుక్రంలో చాంద్ర శ్రద్ధామయ సోమం, అంతరిక్ష వాయువు పార్థివ మృద్భాగం ఉంటాయి. విశకలన ప్రక్రియ చేత శుక్రంలో పార్థివ ధాతువు వెళ్లిపోగా, మిగిలిన వాటిని "ఓజస్సు" అంటారు. వాయు తత్త్వం పోగా మిగిలే సుసూక్ష్మ శ్రద్ధామయ సోమరసమే "మనస్సు"! "అన్నమయం హి సౌమ్య మనః" -విశ్లేషిస్తేనే గానీ మను చరిత్రలు గానీ, కామాయనీ కావ్యాలు గానీ అర్థం కావు. తాత్త్వికాభి నివేశం లేని

వారు మన పురాణ వాఙ్మయం మీదికి పోవటం అనవసరం. వేదోపబృంహణాలైన యివన్నీ ఆత్మవిద్యలు. ‘ ఆత్మ’ అన్నదే తెలియక పోతే తదితరా లెలా తెలుస్తాయి?

ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః
మనసశ్చ పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః
మహతః పర మవ్యక్తం అవ్యక్తా త్పురుషః పరః
పురుషాన్నపరం కించిత్ సాకాష్ఠా సా పరాగతిః !!

వంటి కఠోక్తులెలా దృశ్యమాన మవుతాయి?

“అమల చిత్ర జీవిత వికాసాత్త మధుర
వర మహానంద శక్తి ప్రవాహ మిద్ది”

అన్న వావిలాల వారి ఆంతర్యం మాత్రం ఎలా పట్టుబడుతుంది ?

శ్రద్ధా సూత్రం తోనే జ్ఞాన నేత్రం విచ్చుకొనేది. “యదేవ శ్రద్ధయా కరోతి తదేవ వీర్య వత్తరం భవతి” మనోధర్మమే వీర్యం. ఈ మనోధర్మ సాధనే ఈ కామాయనీ కావ్య పరమార్థం!

ఈ కావ్యం – ‘చింత’ తో మొదలై ‘ఆనందం’ తో ముగియటంలోని ఆంతర్యం కూడా మానవతా ధర్మ నిరూపణమే!

అందుకే యిది మహాకావ్య మయ్యింది!

వావిలాల వారు ‘సోమ’ యాజులయ్యారు!

నమస్కారములతో,

హైదరాబాద్ — విద్వజ్జన విధేయుడు,
18–11–91 — **ఆచార్య తిరుమల**

# ప్రశంస

హిందీ సాహిత్యచరిత్రలో భక్తికాలాన్ని (14 నుండి 16 శతాబ్దం) స్వర్ణయుగం అంటారు. అదే విధంగా ఆధునిక హిందీ సాహిత్యంలో ఛాయావాద కావ్యయుగం (1913 నుండి 1936 వరకు) స్వర్ణయుగం. ఛాయావాద మూల స్తంభాలయి, బృహత్త్రయి అని పేరొందిన ప్రసాద్, పంత్, నిరాలాలు, లఘుత్రయి లేక వర్మాత్రయి అని పిలువబడ్డ మహాదేవి వర్మ, రామకుమార్ వర్మ, భగవతీ ప్రసాద్ వర్మలు – ఈ ఆరుగురేగాక ఎంతో మంది ప్రఖ్యాత కవులు, ప్రేమచంద్ లాంటి విశ్వవిఖ్యాత కథా రచయితలు, ఆచార్య రామచంద్ర శుక్ల, శ్యామ సుందర దాసువంటి విమర్శకోత్తములు, తమ రచనా వైశిష్ట్యంతో హిందీ భారతిని సమ్యక్ రీతిలో సమర్పించిన ఛాయావాదయుగాన్ని స్వర్ణయుగం అనడంలో అతిశయోక్తి ఏ మాత్రం కాదు.

ఛాయావాద కావ్యాన్ని మన తెలుగు సాహిత్యంలోని భావ కవిత్వంతో పోల్చవచ్చు. కావ్య లక్షణాలూ, ప్రవృత్తులూ అవే. సౌందర్యోపాసన, ప్రకృతి మానవీకరణం, ప్రకృతి నిత్య సాహచర్యంపట్ల ఆసక్తి, వైయక్తిక ఆత్మాభివ్యక్తి మొదలయినవి ఛాయావాద కావ్యంలోను, భావ కవిత్వంలోను సమతూకంలో కనిపిస్తాయి. అందుచేతనే కొంతమంది పరిశోధకులు ఈ రెండు కవితాధోరణులను సరిపోలుస్తూ, పరిశోధనా వ్యాసాలు వ్రాసారు. ఇటువంటి ఛాయావాద కావ్యయుగంలో 'కామాయనీ' మహాకావ్యం ఉత్తుంగ హిమశృంగం లాంటిది. ఛాయావాద ప్రవృత్తులకు ఆలంబనమయిన మహాకావ్యం 'కామాయనీ' అయితే 'ఆంసూ' ఛాయావాద కవితా ప్రవృత్తులకు అద్దం పట్టే ఖండకావ్యం. 'కామాయనీ' ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఒక విమర్శకుడు సమస్త హిందీ సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయినా, 'కామాయనీ' లోని 'లజ్జా' సర్గంలోని ఒక్కపుట మిగిలి ఉంటే భావితరంవారు హిందీ సాహిత్యం సుసంపన్న మయినదేనని భావిస్తారని అన్నాడు. అట్టి మహత్కావ్యం 'కామాయనీ', ఖండకావ్యం 'ఆంసూ' రెండింటిని తెలుగు కావ్య రసజ్ఞులకు అందించడంలో బ్రహ్మశ్రీ వావిలాల సోమయాజులుగారు కృత కృత్యులయ్యారు. ఇంకో విశేషమేమిటంటే జయశంకర ప్రసాదు రచనల్లో 'ఆంసూ' ప్రారంభ దశకు చెందినది. 'కామాయనీ' ప్రౌఢదశకు చెందినది. సోమయాజులుగారు కూడా తమ చిరుత ప్రాయంలోనే 'ఆంసూ'ను 'కన్నీరు' అనే పేరిట తెలుగులోనికి

అనువదించి, ప్రౌఢవయః పరిపాకదశలో 'కామాయనీ' అనువాదం చేసారు. మూలం లోని కావ్యసౌందర్యాన్ని యథాతథంగా తెలుగు పాఠకులకందించిన శ్రీ సోమయాజులు గారు ధన్యజీవులు.

ఛాయావాద యుగంలో లాక్షణిక పదప్రయోగాలతో కూడి, విశిష్ట ప్రత్యభిజ్ఞానం, సమరసతావాదాన్ని ప్రపంచించే ఈ మహాకావ్యాన్ని అనువదించడానికి చాలా మంది ప్రయత్నాలు చేసారు. దాదాపు 20-25 సంవత్సరాల క్రితమే పూజ్యులు శ్రీ సోమయాజులు గారు ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. కొన్ని పద్యాలను కీ॥శే॥ కవి సామ్రాట్టులయిన నోరి నరసింహశాస్త్రిగారి సన్నిధానంలో నేను వినడం తటస్థించింది. తరువాత ఆ పద్యాలు (మరి కొన్ని కూడా) 'స్రవంతి'లో రెండు మూడు సంచికల్లో ప్రచురితమయ్యాయి. కారణాంతరాలవల్ల ఈ సత్ప్రయత్నానికి విఘ్నాలు ఏర్పడడంతో ప్రచురణ కార్యక్రమం ఆగిపోయింది.

ఆరోజుల్లోనే మాన్యులు శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారు (ఆ రోజుల్లో వారు ఆలీగడ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో హిందీ ఉపన్యాసకులుగా ఉండేవారు) కూడా ఈ ప్రయత్నం చేసారు. వారు వర్ణవృత్తాలలో, ఛందోబద్ధంగా చేసిన అనువాదంలో కొంత భాగం 'స్రవంతి'లో ప్రచురింపబడింది. సమ్మాన్యులు డా॥ ఇలపావులూరి పాండురంగారావుగారు 1973లో ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కీ॥శే॥ శ్రీ యం.ఎన్. రావు గారి ప్రోద్బలంతో ఈ కావ్యాన్ని మాత్రా ఛందస్సులో ఆంధ్రీకరించారు. అది 1974 జులై నెలలో అచ్చయింది.

ఈ నాటికి శ్రీ వావిలాల సోమయాజులుగారి కృషి ఫలించి 'కామాయనీ'కి వారు చేసిన ఛందోబద్ధమయిన అనువాదం పుస్తక రూపంలో అచ్చవడం ఎంతో ముదావహం.

శ్రీ సోమయాజులుగారు తెలుగులో గద్యపద్య రచన చేసి, విశిష్టమయిన గౌరవ ప్రతిపత్తులను సముపార్జించుకున్న వారు. మౌలికమయిన రచనలు వెలయించిన సోమయాజులు గారు అనువాదరంగంలో కూడా తమ రచనా పాటవంతో, ప్రతిభా వైదుష్యాలతో పాఠకుల హృదయాలను ఆకట్టుకున్నారు. సంస్కృత, ఆంగ్ల రచనల అనువాదాలు చేయడమేకాక జాతీయ భాష హిందీలో తలమానికాలవంటి రచనలయిన 'ఆంసూ', 'కామాయనీ' కావ్యాలకు వారు తెలుగు చేసారు. అనితరమయిన దీక్షతో వారు చేసిన ఈ అనువాదం సాహిత్య ప్రియుల మన్ననలందుకుంటుందని నా విశ్వాసం.

అనువాదరంగంలో కావ్యానువాదం క్లిష్టతరమయినది. కావ్యంలో భావ స్ఫూర్తితోపాటు, శబ్దప్రయోగ వైచిత్రికి కూడా ప్రాధాన్యం ఉంటుంది. అనువాదకుడు భావ సౌందర్యంతోపాటు, శబ్ద రమణీయతను కూడా అభివ్యక్తీకరించాలి. జయశంకర ప్రసాదువంటి మహాకవి, లాక్షణిక పద ప్రయోగం పట్ల మక్కువగల వ్యక్తి, తన రచనల్లో శబ్ద ప్రయోగానికి ఎక్కువ ప్రాధాన్యాన్నిచ్చాడు. సోమయాజులుగారు మూలంలోని భావాన్నే గాక శబ్ద సౌందర్యాన్ని కూడా తమ తెలుగు అనువాదంలో తేవడానికి శ్లాఘనీయంగా ప్రయత్నించారు. ఉదాహరణకు 'చింత' సర్గలో మొదటి పద్యం.

'హిమగిరి కే ఉత్తుంగ్ శిఖర్ పర్
బైఠ్ శిలాకీ శీతల్ ఛాంహ్,
ఏక్‌పురుష్, భీగే నయనోం సే
దేఖ్ రహా థా ప్రలయ ప్రవాహ్
నీచే జల్ థా, ఊపర్ హిమ్ థా
ఏక్ తరల్‌థా, ఏక్ సఘన్
ఏక్ తత్త్వకీ హీ ప్రధానతా
కహో ఉసే జడ్ యా చేతన్

దీనికి సోమయాజులుగారి తెలుగు అనువాదాన్ని పరిశీలించండి.

తే. 'తుహిన నగ శీర్షసీమ నుత్తుంగ శిఖరి
నొక శిలా శీతలచ్ఛాయ నొంటి బురుషు
డొక్క డుపవిష్టుడై కనుచున్నవాడు
ఆర్ద్ర నయనాల బ్రళయ జలార్ణవమ్ము

తే. క్రిందనీరము నుపరి బ్రాలేయ, మందు
నొకటి తరల రూపమ్ము, వే ఱొకటి ఘనము
ఏకతత్త్వ ప్రధానతే యిందురెంట
దాని జడమనుండు, మరి చేతన మనుండు'

మరో ఉదాహరణను తిలకించండి. 'లజ్జ' సర్గాంతంలోని పద్యాలు

'దేవోం కీ విజయ్, దానవోం, కీ
హారోం కా హోతాయుద్ధ రహా
సంఘర్ష్ సదా ఉర్ అంతర్ మేం.
జీవిత్ రహా నిత్య విరుద్ధ రహా.

ఆం. సూ సే భీగే ఆం. చల్ పర్
మన్‌కా సబ్ కుఛ్ రఖ్‌నా హోగా
తుమ్ కో అప్నీ, స్మిత్ రేఖాసే
యహ్ సంధిపత్ర లిఖ్‌నా హోగా,

ఈ పంక్తులకు అనువాదాన్ని చూడండి.

తే. 'సమర మత్యంత తీవ్రమై సాగు నమర
జన జయములకు, దను జాపజయములకును
అనయమును బ్రవర్తిల్లు మానసాంతరమున
గాఢ మౌచు వైరుధ్య సంఘర్షణమ్ము.

తే. అశ్రు కణసిక్తమైన వస్త్రాంచలమున
నుంచవలయు నెడందలో నున్నదెల్ల
మధుర దరహాస రేఖతో మగువ ! నీవె
ఈ సుసంధి పత్రమును లిఖింపవలయు

'కామాయనీ' చివరి సర్గ 'ఆనందం' లోని చివరి పంక్తులను పరిశీలించండి–

'సమరస్ థే జడ్ యా చేతన్
సుందర్ సాకార్ బనా థా
చేతనతా ఏక్ విలస్ తీ
ఆనంద్ అఖండ్ బనా థా'

ఈ పంక్తులకు అనువాదాన్ని గమనించండి–

తే. 'జడము చేతన మయ్యెడ సమరసములు
ఉండె సౌందర్య మచట రూపొందినట్లు
ఒక్క చైతన్య మొలసె మహోజ్వలముగ
నటనఖండ మహానంద మమరి యుండె'.

సమరసతావాదాన్ని, సత్ చిత్ ఆనంద స్వరూపంగా పరిలక్షించిన మహాద్రష్ట, మహాస్రష్ట అయిన జయశంకర ప్రసాద్ గుండెలోతు లెరిగి, సోమయాజులు గారు చేసిన ఈ అనువాదం కావ్యానువాద ప్రియులైన పాఠకులకు అమితానందం కలిగిస్తుందనడంలో ఎటువంటి సందేహము లేదు. 'కావ్యానువాదం అసంభవం' అనే

వారికి కనువిప్పు కలిగించే ఈ అనువాద కార్యాన్ని అతి సమర్థంగా నిర్వహించిన శ్రీసోమయాజులు గారు ధన్యులు. వారి కృషికి నా సాధువాదాలు, గౌరవ పురస్సర నమస్కారాలు.

బుధజన విధేయుడు.
**Dr. Bhimsen 'Nirmal'**
Emeritus Professor,
Dept. of Hindi
Osmania University, Hyderabad-7

1-1-405/7/1, Gandhinagar,
Hyderabad-500 380

# ఆముఖం

మానవులకు తొలిపురుషుడైన మనువు చరిత్ర, ఆర్యసాహిత్యంలో వేదములు మొదలు పురాణములు, ఇతిహాసములలో వ్యాపించి ఉన్నది. శ్రద్ధామనువుల సంయోగంతో మానవత్వపు వికాసకథను రూపకావరణంలో భావించే ప్రయత్నము అన్ని వైదిక ఇతిహాసములతో పాటు నిరుక్తముద్వారా కూడ ఏవిధముగా చేయబడినదో, గడచిన కాలంలో ఆవిధంగానే ప్రయత్నము జరిగియుండినప్పటికిని, మన్వంతరము యొక్క మానవత్వపు నవయుగ ప్రవర్తకుని రూపములో మనువుకథ ఆర్యుల అనుశ్రుతిలో దృఢముగా అంగీకరింపబడి యున్నది. అందుచేత 'వైవస్వత మనువు'ను చారిత్రక పురుషునిగానే భావించుట సముచితము. తరచుగ జనులు గాథకు ఇతిహాసమునకు మిథ్యా సత్యముల వ్యవధానమును భావింతురు. కాని సత్యము మిథ్యకంటె ఎక్కువ విచిత్రముగా నుండును. ఆదిమ యుగపు మనుష్యుల ప్రతియొక్క సమూహమును జ్ఞానోన్మేషపు అరుణోదయములో సంగృహీత మొనర్చిన భావపూర్ణ ఇతివృత్తములు నేడు 'గాథలు' లేక 'పౌరాణిక ఉపాఖ్యానములు' అని వేరుచేయబడుచున్నవి. ఏలనన ఆ చరిత్రలతోపాటు మధ్యమధ్యలో భావనల సంబంధము కూడుకొని ఉన్నట్లు కన్పించును. ఘటనలు కొన్ని చోట్ల అతిరంజితముగ గన్పించును. తథ్య సంగ్రహకారిణియైన తర్కబుద్ధికి అట్టి ఘటనలయందు రూపకమును (ఐరిలీరిజిలి) ఆరోపించుటకు సౌకర్యము కలుగుచున్నది. కాని వానిలో కూడ కొంత సత్యాంశము ఘటనతో సంబంధమైయున్నది అని అంగీకరింపవలసి యుండును. నేటి మనుష్యుల వద్ద వాని యొక్క ప్రస్తుత సంస్కృతియొక్క క్రమబద్ధమైన చరిత్రమాత్రమే యుండును. కాని వాని చరిత్రయొక్క హద్దు ఎక్కడ నుండి ప్రారంభమగునో సరిగా దానికి ముందు సామూహిక చైతన్యము యొక్క దృఢమైన, గహనమైన రంగులరేఖలతో గడచిన, ఇంకను పూర్వపు విషయముల ఉల్లేఖనము స్మృతిపటమున అంకితమై యుండును. కాని అది కొంచెము అతిరంజితముగా నుండును. ఆ ఘటనలు నేడు విచిత్రతాపూర్ణములై కాన్పించును. బహుశః ఇందువలననే మనము మన ప్రాచీన శ్రుతులకు నిరుక్తముద్వారా అర్థము చెప్పుకొనవలసి వచ్చెను. దాని వలన ఆ అర్థములు మన ప్రస్తుతాభి రుచితో సామంజస్యము నొందును.

శ్రద్ధా మనువులు – అనగా మననముయొక్క సహకారముతో మానవత్వపు వికాసము రూపకమైనప్పటికిని, అది గొప్ప భావమయము శ్లాఘనీయమునై యున్నది. ఇది మనుష్యత్వము యొక్క మనోవైజ్ఞానిక చరిత్ర అగుటకు శక్తి కలిగియున్నది. నేడు మనము సత్యమునకు అర్థము "ఘటన" అని చెప్పుకొనుచున్నాము. అయినప్పటికి దాని తిథిక్రమముతో మాత్రమే సంతుష్టినొందక మనోవైజ్ఞానిక అన్వేషణ ద్వారా చరిత్రయొక్క ఘటనలోనికి కొంత చూడగోరు చున్నాము. దాని మూలములో ఉన్న రహస్యమేది? ఆత్మానుభూతి, ఔను. ఆ భావము యొక్క రూపగ్రహణచేష్టయే సత్యము లేక ఘటనయై ప్రత్యక్షమగు చున్నది. ఆ సత్యములైన ఘటనలే స్థూల మరియు క్షణికములై మిథ్య మరియు అభావములుగా పరిణతిని పొందుచున్నవి. కాని సూక్ష్మానుభూతి లేక భావము చిరంతన సత్యము యొక్క రూపములో ప్రతిష్ఠితమై యుండును. దాని ద్వారా యుగయుగముల పురుషుల అభివ్యక్తి మరియు పురుషార్థముల అభివ్యక్తి జరుగుచున్నది.

జలప్లావనము భారతీయ ఇతిహాసములో దేవతలకంటె విలక్షణమైన, మానవుల యొక్క ఒక విభిన్న సంస్కృతిని ప్రతిష్ఠించుటకు మనువునకు అవకాశము గల్గించిన ప్రాచీన సంఘటన! ఇది చరిత్రయే. 'మనవే వైప్రాతః' ఇత్యాది వలన ఈ ఘటన యొక్క వర్ణన శతపథ బ్రాహ్మణానికి చెందిన 8వ అధ్యాయములో లభించుచున్నది. దేవగణముయొక్క ఉచ్ఛృంఖల స్వభావము, నిర్బాధాత్మ తుష్టియందు అంతిమ అధ్యాయము పొందెను. మానవభావము అనగా శ్రద్ధామనువుల సమన్వయము జరిగి ప్రాణులకు ఒక నూతన యుగపు సూచన లభించెను. ఈ మన్వంతరమునకు ప్రవర్తకుడు మనువు అయ్యెను. మనువు భారతీయేతిహాసమునకు ఆది పురుషుడు, రాముడు, కృష్ణుడు, మరియు బుద్ధుడు – ఈయన వంశీయులే! శతపథ బ్రాహ్మణములో ఆయన శ్రద్ధాదేవుడని చెప్పబడి యున్నది.

"శ్రద్ధాదేవో వై మనుః" (కాం 1 ప్ర 1)

భాగవతములో ఈ వైవస్వత మనువు శ్రద్ధలతో మానవ సృష్టి యొక్క ఆరంభము భావింపబడినది.

"తతో మనుః శ్రద్ధాదేవః సంజ్ఞాయామాస భారత
శద్ధాయాం జనయామాస దశపుత్రాన్ స ఆత్మవాన్." (9-1-11)

ఛాందోగ్యోపనిషత్తునందు మనువు శ్రద్ధల భావమూలక వ్యాఖ్యానము కూడ లభిం చుచున్నది.

"యథావై శ్రద్ధధాతి అథామనుతే నా- శ్రద్ధధన్ మనుతే" (7-19-1)

ఇది నిరుక్తపు వ్యాఖ్యవలెనున్నది.

ఋగ్వేదమున శ్రద్ధ, మనువు - ఈ ఇరువుర పేర్లు ఋషులవివలె కన్పించును. శ్రద్ధకు సంబంధించిన సూక్తము నందు సాయణుడు శ్రద్ధయొక్క పరిచయము నిచ్చుచు వ్రాసియున్నాడు.

"కామ గోత్రజా శ్రద్ధా నా మర్షికా"

శ్రద్ధ కామగోత్రము యొక్క బాలిక. అందుచేతనే శ్రద్ధ అనే పేరుతోబాటు ఆమె "కామాయని" అని కూడ పిలువబడుచున్నది. మనువు ప్రథమ పథ ప్రదర్శకుడు. మరియు అగ్నిహోత్రమును ప్రజ్వలితము చేయునట్టి మరియు నితరములైన అనేక వైదిక కథలకు నాయకుడు.

"మనుర్వావా అగ్రే యజ్ఞేనేజే యదనుకృతేమాః ప్రజ్ఞాయజన్తే" (5-1 శతపథ)

వీరిని గురించి వైదిక సాహిత్యమునందు చాల సంగతులు వెదజల్లబడి నట్లు లభించు చున్నవి. కాని వాటి క్రమము స్పష్టముగాలేదు. జలప్లావన వర్ణన శతపథ బ్రాహ్మణముయొక్క ప్రథమ ఖండమున (8వ అధ్యాయమున) ప్రారంభమగును. దానిలో వారి నావ ఉత్తరగిరియైన హిమవత్ప్రదేశమునందు చేరిన ప్రసంగము కలదు. అక్కడ ఓఘ జలావతరణము జరిగిన మీదట మనువు ఏ స్థలము నందు దిగెనో దానిని "మనోరవ సర్పణము" అందురు.

"అపీపరం వైత్వా వృక్షేనావం ప్రతి బధ్నీష్వ, తంతు త్వా మా గిరౌ సన్తముదక మన్త శ్ఛైత్సీద్ యావద్ యావదుదకం సమవాయాత్ - తావత్ తావదన్వవసర్పాసి ఇతి సహతావత్ తావదేవా న్వవససర్చ. తదప్యేత దుత్తరస్య గిరే ర్మనోరవ సర్పణమితి. (8-1)

శ్రద్ధతో మనువు కలిసిన మీదట ఆ నిర్జన ప్రదేశమునందే నశించిన సృష్టిని మరల ఆరంభించుటకు ప్రయత్నము జరిగెను. కాని ఆసురపురోహితుడు లభించుటవలన (కలియుట వలన) ఆయన (మనువు) పశుబలిచేసెను.

"కిలాతాకులీ ఇతిహాసుర బ్రహ్మావాసతుః" తౌ హోచతుః – శ్రద్ధా దేవో వైమనుః ఆవం ను వేదావేతి తౌ హాగత్యోచతుః। మనో యాజయాప త్వేతి".

ఈ యజ్ఞము తరువాత మనువునందు జాగృతమైన పురాపరిచిత దేవ ప్రవృత్తి ఆయన ఇడ సంపర్కములోనికి వచ్చిన తరువాత ఆయనను శ్రద్ధయే కాక రెండవవైపునకు ప్రేరేపించెను. 'ఇడ' సంబంధమును గూర్చి శతపథమున ఇట్లున్నది. "ఆమె యొక్క ఉత్పత్తి లేక పుష్టి పాకయజ్ఞము వలన కలిగెను. ఆ పూర్ణయోషితను చూచి మనువు ఇట్లడిగెను, "నీ వెవరవు?" "నీ దుహిత" నని ఇడ ప్రత్యుత్తర మిచ్చెను. "నా దుహిత వెట్లయితివి?" అని మనువడిగెను. "నీ దధి, ఘృతాది హవిస్సులవలన నా పోషణ జరిగినది" అని ఆమె చెప్పెను".

"తాం హ" మనురువాచ "కా ఆసి" ఇతి. "తవ దుహితా" ఇతి. "కథం భగవతి? మమ దుహితా" ఇతి. (శతపథ 6 ప్ర. 3 బ్రా)

మనువునకు ఇడపట్ల అత్యధికమైన ఆకర్షణ కలిగెను. మరియు శ్రద్ధ నుండి కొంచెము దూరమయ్యెను. ఋగ్వేదమున ఇడ ఉల్లేఖనము చాల స్థలము లందు కన్పించును. ఈమె ప్రజాపతి మనువు యొక్క "ప్రథ ప్రదర్శిక" మనుష్యులను శాసించునది. అని చెప్పబడినది.

"ఇడా మకృణ్వన్మనుషస్య శాసనీమ్" (1–31–11 ఋగ్వేదము)

ఇడకు సంబంధించి ఋగ్వేదములో చాల మంత్రములు లభించును.

"సరస్వతీ సాధయన్తీ ధియం న ఇడాదేవీ భారతీ విశ్వతూర్తి, తి స్రో దేవీః స్వధయావర్షి రేదమచ్ఛి ద్రంపాన్తు శరణం నిషద్య"
(ఋగ్వేదము. 2–3–8)

"అనో యజ్ఞం భారతీ తూయ మేత్విడా మనుష్యదిహ చేతయస్తి, తిస్రో దేవీర్వర్షి రేదం స్యోనం సరస్వతీ స్వపనః సదస్తు" (ఋగ్వేదము 10–110–8) ఈ మంత్రముల యందు మధ్యమా, వైఖరీ, పశ్యంతీల ప్రతినిధియైన భారతీ సరస్వతీలతోపాటు ఇడ నామము వచ్చి యున్నది. లౌకిక సంస్కృతమున ఇడ శబ్దము పృథ్వీ అనగా బుద్ధి, వాణి మొదలైన వాటికి పర్యాయవాచకముగా నున్నది.

"గో, భూ, వాచస్త్విడా ఇలా" (అమరము) ఈ ఇడ లేక వాక్కుతో మనువు లేక మనస్సు యొక్క మరియొక వివాదము శతపథమున ఉల్లేఖింపబడి యున్నది. దానిలో ఇద్దరును తమతమ మహత్తు కొరకు పోట్లాడుకొందురు.

"ఆఖాతో మనసశ్చ" ఇత్యాది (1 అధ్యాయము 5 బ్రాహ్మణము) ఋగ్వేదమున ఇడను బుద్ధిని సాధన చేయునట్టియు, మనుష్యునకు చేతనను ప్రదానము చేయునట్టియు 'ధీ' అని చెప్పియున్నది. పూర్వకాలమున బహుశః ఇడకు పృథ్వి మొదలైన వాటితో సంబంధమొనర్చ బడినది. కాని ఋగ్వేదము 5-5-8లో ఇడా సరస్వతులతో బాటు మహి యొక్క ఉల్లేఖనము స్పష్టముగా వేరుగా నున్నది. "ఇడా సరస్వతీ మహితిస్రో దేవీర్మయో భువః" వలన మహి నుండి ఇడ భిన్నమైనదని తెలియుచున్నది ఇడ "మేధస్ వాహినీ' నాడీగా కూడ చెప్పబడినది.

బుద్ధివికాసము, రాజ్యస్థాపనము మొదలైనవి ఇడయొక్క ప్రభావముచేతనే మనువు చేసెనని ఊహింపవచ్చును. తరువాత ఇడమీద కూడ అధికారము చేయవలెనను ప్రయత్నము వలన మనువు దేవగణ కోపభాజనుడు కావలసివచ్చెను.

"తద్వై దేవానాం ఆగ ఆస" (7-4 శతపథము) ఈ అపరాధమునకై ఆయన శిక్ష ననుభవింపవలసి వచ్చెను.

"తం రుద్రో- భ్యావత్య వివ్యాధ" (7-4 శతపథ) 'ఇడ' దేవతలయొక్క "స్వసా" బయుండెను. మనుష్యులకు చేతన ప్రధాన మొనర్చునట్టిది. అందుచేతనే యజ్ఞములలో 'ఇడాకర్మ' జరుగుచున్నది. ఇడయొక్క ఈ బుద్ధివాదము శ్రద్ధామనువుల మధ్య వ్యవధానమును కలిగించుటలో సహాయక మయ్యెను. మరి బుద్ధివాదపు వికాసమున అధిక సుఖాన్వేషణములో దుఃఖము లభించుట సహజము. ఈ ఆఖ్యానము ఇతి హాసములో రూపకపు అద్భుత మిశ్రణము జరుగునంత ప్రాచీనమైనది. అందుచేతనే మనువు, శ్రద్ధ, ఇడ-ఇత్యాదులు తమ ఐతిహాసి కాస్తిత్వమును ఉంచుకొనుచు సాంకేతికార్థమును గూడ అభివ్యక్త మొనర్చినచో నాకే మియు నభ్యంతరములేదు. మనువు అనగా మనస్సు యొక్క రెండు పక్షములు హృదయము, మస్తిష్కము యొక్క సంబంధము క్రమముగ శ్రద్ధా ఇడలతో గూడ తేలికగా కలుగుచున్నది.

"శ్రద్ధాం హృదయ్య యా కూత్యా శ్రద్ధయా విన్దతే వసు" (ఋగ్వేదము 10-5-4)

వీటన్నిటియొక్క ఆధారముననే "కామాయని" యొక్క కథాసృష్టి జరిగినది. ఔను "కామాయని" కథాశృంఖలమును కల్పుటకై అక్కడక్కడ కొంచెము కల్పనను గూడ ఉపయోగించు నధికారమును నేను విడువజాలక పోయితిని.

**- జయశంకర ప్రసాద్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | చింత (ఆవేదన) | 477 |
| 2. | ఆశ (ఆసక్తి) | 489 |
| 3. | శ్రద్ధ (ఆహ్లాదము) | 502 |
| 4. | కామము (అనురాగము) | 512 |
| 5. | వాసన (అనుబంధము) | 522 |
| 6. | లజ్జ (ఆమోదము) | 538 |
| 7. | కర్మ (ఆచరణ) | 545 |
| 8. | ఈర్ష్య (అసంతృప్తి) | 564 |
| 9. | ఇడ (అన్వేషణ) | 575 |
| 10. | స్వప్నము (ఆందోళన) | 594 |
| 11. | సంఘర్షణము (ఆదేశము) | 610 |
| 12. | నిర్వేదము (ఆప్యాయము) | 629 |
| 13. | దర్శనము(ఆలోకము) | 644 |
| 14. | రహస్యము(ఆంతర్యము) | 657 |
| 15. | ఆనందము(ఆనందం) | 669 |

# కామాయని

## చింత (ఆవేదన)

తే. తుహిననగ శీర్షసీమ నుత్తుంగ శిఖరి
నొక శిలా శీతలచ్ఛాయ నొంటిఁ బురుషుఁ
డొక్కఁడుపవిష్టుఁడై కనుచున్నవాఁడు
ఆర్ద్ర నయనాలఁ బ్రళయ జలార్ణవమ్ము.

తే. క్రింద నీరము నుపరిఁ బ్రాలేయ, మందు
నొకటి తరలరూపమ్ము, వేఱొకటి ఘనము
ఏకతత్త్వ ప్రధానతే యిందు రెంట,
దాని జడ మనుండు, మరి చేతన మనుండు.

తే. స్తబ్ధమైన యాతని మానసమ్ము వోలెఁ
జెలఁగి హిమము సుదూరవిస్తృతినిఁ జెందె,
శాంత మటు తోఁచు ఘన శిలాచరణభూమి
ఘట్టన మొనర్చి తిరుగుఁ బ్రకంపనుండు.

తే. ప్రౌఢి గూర్చుండి తరుణతపస్వి రీతి
సాధన మొనర్చు నమరశ్మశాన మందు,
క్రింద విలయసాగర లహరీచయమ్ము
దీనదీనమ్ముగను నవసాన మొందె.

తే. ఆ తపోనిధి వోలె నత్యంత దీర్ఘ
ములును, బ్రాప్త హిమ ధవళములును నగుచు
గండశిల లట్లు సురతరుల్ గడ్డగట్టి
నిలిచె నొక రెండొ మూఁడొ యా నికటభూమి. 5

తే. సర్వ దేహాంగ మాంసపేశలత యొప్పు,
నమిత వీర్య మూర్జస్వితం బగుచునుండె
స్ఫీత ఘననాళములను వసించి శోణి
తమ్ము చరియించుచుండె స్వాస్థ్యమును బడసి.

తే. పౌరుషగుణ ప్రపూర్ణమౌ ప్రౌఢముఖము
చింతచే నైన భీరుతఁ జెదరియుండె
ఎడద యౌవన మధురవాహిని చెలంగి
యిపుడు ప్రవహింప, నతఁ డుపేక్షించుచుండె.

తే. మున్ను ఘన వట బద్ధమై యున్న నౌక
నెలవు గొనియున్నయది పొడినేల మీఁద,
క్రమముగను తగ్గిపో జలప్లావనమ్ము
వెలువడఁగఁ జొచ్చె మున్గిన పృథ్వియపుడు.

తే. గాఢ కరుణా వినిస్సృత గాథ వోలె
వెలికిరా నతని ప్రగాఢవేదనమ్ము
నెఱిఁగియున్నట్టి దగుట హసించి నటుల
నొంటిఁ బ్రకృతిమాత్రమె వినుచుండె దాని

తే. "బహుళ చింతా సముజ్వల ప్రథమరేఖ!
ఓ మహాజగోపవన ఘనోరగమ్మ!!
పావకాద్రీంద్ర విస్ఫోట భయద మహిత
ప్రథమకంపనం బోలు నో ప్రబలమత్త!! 10

తే. "ఓ యభావ చపల మహామాయబాల!
లిఖిత లాలాటికా క్రూర లేఖనమ్మ!!
పచ్చపచ్చని సొగసుల పరుగులాట!
కపట మృగతృష్ణికా తరంగమవు నీవు!!

తే. "ఈవు గ్రహకక్షఁ గల్లోల మెసఁగఁజేతు –
తరళ గరళాన నౌక చిన్ని తరఁగ వీవు
స్వర్గజన జీవితమునకు జరవు చింత!
చెవిటిదానవు విన వేమి చెప్పుకొన్న!

తే. "వ్యాధులకు సూత్రధారిణి వౌదు వోసి
యాధి! మధుమయశాపమ్మ వగుదు వీవు
ఓ హృదయగగన మహా భయోల్క! చింత!!
పరమసృష్టికి రమ్యపాపమ్మ వీవు.

తే. “చింత! న న్నెంత యోజింపఁజేసి తీవు
ఎంత లోఁతుపునాది రచించితేని
యట్టి చింతారహితజాతి నర్థి బ్రతుకు
నమరునకు నెన్నడే మృతియన్న దున్నె!

తే. “చేరి వ్యాపింతు మానస క్షేత్ర మందు
సస్యభూమి వర్షోపలజలద మట్లు
అర్థి నెల్లర హృత్కుహా రాంతరముల
దాఁగియుందువు గుప్తనిధాన మటుల. 15

తే. “మతి మనీ షాశ బుద్ధియు మహిత చింత
యనున వెన్నియొ నామమ్ము లగును నీకు
లేదు స్థానమ్ము పాపినీ! లేదు సుంత
యేని నిలువక వెడలిపొ మ్మెచటికైన.

తే. “విస్మృతీ ! రమ్ము ! శిథిలతా !! విక్రమింపు
మోసి నీరవతా!! మౌన మొసఁగు మీవు
చేతనత్వమ !! వెడలి యే సీమకైన
శుభ్రజడతను నింపుమీ శూన్యహృదిని.

తే. “ఆ యతీతమ్ము, సౌఖ్యమ్ము నాత్మలోన
నెంత ఘనముగ నిపుడు యోజింతు నంత
గాటముగ నొందు దుఃఖరేఖాళి తివురు
నస్మదీయ నిస్సీమా హృదంతరమున.

తే. “అహహా! ఓ మహామహిత సర్గాగ్రదూత!
అసఫలుండ వైతివి, లీనమైతి వీవు
రక్షకుండ వౌదువొ లేక భక్షకుఁడవొ
నీవె నీ యెడ లీనమైనావు సుమ్ము.

తే. “వజ్ర సౌదామనీ వాత్యవర్ష పటలి!
లీల నర్తించినావు రాత్రింబవళ్ళు
అటుల భోగలాలసత మగ్నాత్ము లగుటె
యీవు పలుమారు లేతేర హేతు వయ్యె. 20

తే. “రత్నదీప ఘనాంధకారమ్ముఁ బోలు
నల నిరాశా సహిత భవిష్యమ్మ! ఓసి,
అమరజన ఘనాహంకార యజ్ఞవాటి
రమ్య సర్వస్వమును హవిర్భాగ మయ్యె!

తే. “తరళ మృత్యు రాహిత్య పుత్తలికలార!
ధన్య భవదీయ జయ నినాదములు ప్రబలి
శబలితస్వన దైన్య విషాద మొదవ
నిప్పటికిని బ్రతిధ్వనియించుచుండె.

తే. “అరయఁ బ్రకృతి యున్నది యజేయమ్మె యగుచు
జితుల మైతిమి, యవివేక చిహ్నితులము
మరచి మధుపానమత్తత న్మమ్ము మేమె
యీదుచుంటిమి తౌల్యంపు టేటినీట.

తే. “వారు మునిగిరి, మునిఁగెను వైభవమ్ము
ఆ సమస్తమ్ము రూపొందె నబ్ధి పగిది
దేవతా సుఖవితతిపైఁ దెరలి యంత
దుఃఖజలధి నినాదమ్ము తుఱఁగలించె.

తే. “అట్టి మత్తవిలాస మే మయ్యె? అరయ
స్వప్నమో! కాక మృదులవిభ్రమమొ యద్ది
స్వర్గజనలోక సుఖవిభావరి చెలంగె
తరుణ మహనీయ తారకాతతుల తోడ.

తే. “అమరతరుణీ సుగంధ వస్త్రాంచలముల
సౌఖ్య జీవనపవన నిశ్వాస మొద వె-
వరలు సౌపర్య సౌఖ్యవిశ్వాస మపుడు
ముగ్ధ కోలాహ లోజ్వల ముఖరితమ్ము.

తే. “అది సుఖము! కేవలము సుఖ మహహ! అద్ది
అమల మందాకినీ ప్రవాహమ్మునందు
పృథు తుషారములు ఘనీభవించినట్లు
త్రిదశజన సుఖమయ్యె కేంద్రీకృతమ్ము.

తే. “అమిత విశ్వబల విభవ హర్షములను,
నన్యసర్వస్వ మపుడు స్వాయత్తమయ్యె
ఆ సమృద్ధి సుసంచారవ్యాప్తి తోఁచె
లోల వీచీ మనోజ్ఞ కల్లోలరీతి.

తే. “అరుణకిరణాలు జలధికణాంతరముల
ద్రుమదళంబుల భాసించు నమలఫణితిఁ
గీర్తి దీప్తి శోభ లొనర్చె నర్తనముల
నాల్గు దిక్కుల నానందనవ్యతలను.

తే. “శక్తి యున్న-దౌను ప్రకృతి స్వర్గజనుల
పదతలమ్ముల వినయవిభ్రాంతి నుండె
తత్పదాక్రాంత మౌటచే ధరణితలము
అను దినమ్మును గంపించు నతిశయముగ. 30

తే. “అయిన సురలము స్వయము మే మందరమ్ము
నేల యీ సృష్టికాదు విశృంఖలమ్ము?
కనుకనే మాకు నిట్టు లాకస్మికముగ
వచ్చి వర్షించె భయద విపత్తు లపుడు.

తే. “నాశమయ్యె సర్వమును వినాశమయ్యె
నిర్జరీజన శృంగార నిరతిశయ ము
షస్సు బోలు యౌవనము, జ్యోత్స్నాస్మితమ్ము,
భ్రమర చింతావిహీన విలాసలీల.

తే. “వాసనా పూర్ణవాహినీవర మ దెంత
పరమ మధుఘన మత్త ప్రవాహ మయ్యె!
సంగమింప నది ప్రళయజలధి యందుఁ
బ్రిదిలి, కనువేళ నెడద కంపించి మూల్గె.

తే. “నిత్య యౌవన సుఖభోగ నిరతిశయత
సకలదిశల సుగంధాళిఁ జాదుకొల్పు
ననవరత మధుపూర్ణమౌ నా వసంత
మెచటి కేగెనో యేమొ యదృశ్యమయ్యె.

తే. “కుసుమిత నికుంజకేళుల కొమరు గొన్న
వారి పులకితాలింగనప్రౌఢి సడలె
ముగ్ధ సంగీత తానముల్ మూగవోయె
కెరలి చెవుల సోకదు వల్లకీరుతమ్ము. 35

తే. “వాసనల నిండి నిశ్వాస పవనచయము
నిలువఁగా బోదు చెక్కిళ్ల నీడవోలె
సురత శైథిల్య వసనముల్ చుట్టుకొనవు
శ్రమ మనోజ్ఞము లగు వపుస్స్కంధములను.

తే. “ఓపి క్వణియించుఁ గంకణనూపురములు
చెలఁగి వక్షాన హారముల్ చిందుఁద్రొక్కుఁ
గలరవమ్ములఁ బ్రతిరుతిగతులు తోఁచు
స్వరలయమ్ములు గీతాళి సంగమించు.

తే. “సౌరభస్ఫూర్తి నమరు దిశాంతసమితి
చతుర కాంతిమెయి నభము చంచలమ్ము
అన్నిటను దోఁచుచున్నది యట్టివేళ
మలయపవన ముద్వృత్తి నున్మత్తకేళి.

తే. “ఆ యనంగ వ్యథానుభవాంగ భంగి
మలను నృత్యమ్ము సాగెను జెలఁగి చెలఁగి
షట్పదీ పుష్పరస మహోత్సవము వోలి
వరలె మదిరారసాసక్తి మరల మరల.

తే. “వర సురాగంధములఁ దోగు వదనములను
నరుణనేత్రాళి నలసత, హార్ద రాగ
మమరు సుందరములు కపోలములు వానిఁ
గనినఁ బీత కల్పక పరాగములు బెగడు. 40

తే. “ప్రతినిధులు తృప్తి నెఱుఁగని వ్యసనములకు
వాడి, దగ్ధమై, నిజ సృష్ట వహ్నికీల
భయద వాత్యా రయోద్ధత ప్రళయకాల
జలధి జలమున వారు నాశనముఁ గొనిరి.

తే. “ఓ యుపేక్షా సహిత సుర తోత్కలమ్మ!
ఓ యసంతృప్తి!! నిరవధి కోర్జిత సువి
లాసమా!! అనిమిష భయరహిత నయన
దర్శన క్షుధా ఘటిత విదాహ మహిత!!

తే. “వారి యుపగూహనమ్ములు దూరమయ్యె!
నుడిగిపోయె స్పర్శాపులకోద్గమములు
సురభి శోజ్వల మధుమయ చుంబనచయ
కాతరతల ముఖాబ్జముల్ కష్టపడవు.

తే. “రమ్య మధు మదిరా సమీరములు తిరుగు
ధన్యతమ రత్నసౌధవాతాయనముల
మించి యీనాఁడు జలధి తిమింగలములు
క్రోధరస ముట్టిపడఁగ డీకొనఁగ వచ్చు.

తే. “త్రిదశకామినీ నేత్రముల్ లీలఁ జేయు
లలిత లావణ్య నీలోత్పలముల సృష్టి
అట్టి కన్నులఁ గనుపట్టు నక్కజముగఁ
బ్రళయకారిణి యౌ మహాభయదవృష్టి. 45

తే. “మ్లానరహిత సుగంధసుమాళి మణుల
రచితము లయిన మంజుహారాళి నాఁడు
శృంఖలము లయ్యె-నందు బంధింపఁబడిరి
నిర్జ రాప్సరస విలాసినీ గణమ్ము.

తే. “అమర యజనంపు పశుయజ్ఞ మందు నొదవు
నమిత పూర్ణాహుతిజ్వాల లబ్ధియందు
విలయ కల్లోల మహనీయ వీచికలుగ
నెంత భయదమ్ములై జ్వలియించుచుండె.

తే. “అంతరిక్షానఁ గూర్చుండి యరసి వారి,
ధీరతను వీడి యిటుల రోదింతు రెవరు?
అశ్రుమయ హిమానీ హాలహలజలమ్ము
లెల్ల వేళల నిటుల వర్షింపసాగె.

తే. “కలిగె హాహారవ భయదాక్రందనములు,
సురల వజ్రమ్ము లయ్యె సంచూర్ణితములు
అయ్యె బధిరమ్ము లఖిల దిశాంతములును
క్రూర భీమ శశ్వ న్మహాఘోష లెసగె.

తే. “క్షితిజతటమున జలదముల్ చెలఁగి మొరసె
పొగలు వ్యాపించె దిగ్దాహములను వీడి
ఘన గగనమున భీమ ప్రకంపనంపు
ఝుంఝు యొదవించె గుదుపు లాశ్చర్యమొదవ. 50

తే. “అంధకారాన మలినమ్ములై వసించు
భాను నస్పష్టకాంతులు లీనమయ్యె
అపుడు వరుణుఁడు నిజకర్మ న్యస్తుఁడయ్యెఁ
జేరి పొరగట్టి తిమిరమ్ము చియ్యబట్టె.

తే. “మించెఁ బంచభూత భయద మిశ్రణమ్ము
అమల శంపాశకల నిపాతములు కలిగె
త్రిదశులు మహోల్క లనియెడి దివ్వటీల
వెదకిరి కనని తొలిసంజ–వెలుఁగుజాడ.

తే. “క్రుద్ధ భైరవ దీర్ఘనిర్ఘోషములకు
నవని కలఁగి కంపింపఁగా నాత్మఁ దలఁచి
శాశ్వతాలింగనమునకై శ్యామగగన
మంత దిగివచ్చెనో యననపుడు తోఁచె.

తే. “కుటిలకాలుని క్లిష్టవాగురలఁ బోలు
జలధి కల్లోలమాలికల్ స్వనమొనర్చె
పడగలను విప్పి ఏ తెంచు వ్యాళగతుల
గదలివచ్చెను నురగలు గ్రక్కుకొనుచు.

తే. “క్రమముగాఁ బృథ్వి క్రుంగిపోఁ గడఁగె – నపుడు
పొలిచి యనలాద్రి ని శ్వాసములను బోలి
పావకజ్వాల లెల్లెడఁ బ్రజ్వలించె –
కుంచితాంగియై వసుమతి గోచరించె. 55

తే. “క్రోధరస పూర్ణ జటిల నిర్ఘోష నిచయ
కంబుధి బలవ దూర్మికాఘాతములను
గదలె తిలకింప నౌక మహాకచ్ఛపముగ
క్షోణి–వ్యాకులమ్మొందె, సంక్షోభ మొందె.

తే. “కామకేళీ విలాస వేగమ్ము వోలె
నపుడు భైరవజలరాశి యతిశయించె
అమిత నీల మహాఘనాంధ్యమును జేరి
కడఁగి విలయమహావాత్య కౌఁగలించె.

తే. “జలధి తటము చేరిక కనుక్షణముఁ జేరె
క్షీణమై, లీనమయ్యెను క్షితిజరేఖ,
హేలగాగ మర్యాదావిహీన మగుచు
వార్ధి జృంభించె నిఖిల విశ్వమును ముంచి.

తే. “కరక లతిభీకరధ్వనిఁ గురియఁదొడఁగె
ప్రకృతి సర్వము మర్దింపఁబడుచు నుండె
పంచభూతమ్ము లీలీల భయదరీతి
నెంతకాలము తమిఁ దాండవించినవియొ!

తే. “ఉన్న దయ్యెడ నవ్వేళ నొక్క నౌక
లేదు దానికిఁ జుక్కాని, లేవు తెడ్లు
విపుల తరళోర్మి, కలను నా వెట్టి నౌక
పడుచు లేచుచు నున్నది యడలుఁగొనుచు– 60

తే. “ప్రబల ఘాతలు తగిలె – నస్పష్టమైన
యొడ్డుజాడయొ కానరాకుండె – నంతఁ
బిఱికినైతి, నిరాశానిపీడితుడను
నైతి – విధినియతపథము నరయుచుంటి.

తే. “వీచికల్ రేగె నభము చుంబింప ననఁగ,
నగణిత క్షణప్రభలు నృత్యమ్మొనర్చె
గరళ కాదంబినీ కర్ష గాఢపాత
సలిలబిందువుల్ సేసె స్వజాతిసృష్టి.

తే. “స్వయముగా జంచలల్ వెల్గె జలధిలోన-
అవ్వి కనుపట్టె జలధిగర్భాంతరాళ
గాఢ బాడబజ్వాలలు ఖండ ఖండ
ములుగ నెగసి రోదింపఁగాఁ బోలు ననఁగ.

తే. “సాగరాంతర సంచర జ్జలచరములు
వికలతల లేచి మున్గుచు వెగడుపడియె
రుచిరమగు స్వగృహము విలోడితమ్ముఁ
జెంద నే ప్రాణి యెపు డెటఁ జింతపడదు?

తే. “భూరి పవమాన మట ఘనీభూతమయ్యె
స్తంభితములయ్యె నయ్యెడ శ్వాసగతులు
తప్పి విలపించుచుండె చైతన్యమేని
క్షుభితమగుచుండె దృష్టి విస్ఫురణ దప్పి. 65

తే. “ఆ మహాలోడనమున గ్రహములు ఋక్ష
ములును దోఁచెను జలధిబుద్బదము లట్లు
ప్రళయకాల మహాఘోర వర్షమందు
మిణుగురులఁ బోలి యవి తోఁచె మినికి మినికి.

తే. “ఎన్ని జాములు గడచెనో యిట్టి గతుల
నిట్లు దివసమ్ము లెన్నెన్ని యేగినవియొ
వాని చరితమ్ముఁ జెప్పెడివారు లేరు,
ఎఱుఁగ సాధనచిహ్నములేని లేవు.

తే. “ఎంత కాలము సాగెనో మృత్యులీల
శాసన మ్మది రాదు నా స్మరణ కిపుడు-
ఒక మహామత్స్య దీర్ఘపుచ్ఛోగ్రఘాత
దీననావకు మృత్యువై తేజరిల్లె.

తే. “అమ్మహాఘాత యా నౌక నపుడు విసరి
చేర్చె నిమ్మిహికాగిరి శిఖరమునకు
పరమ సురసర్గ విలయ విధ్వంసనమ్ము
చెలఁగి యొక్కింత మరల శ్వాసింపసాగె.

తే. "అమరతా జర్జరిత దంభమటుల మిగిలి
యొంటినై యిట్లు జీవించియుంటి – నహహ!
ప్రాపితస్థితి నీ సృష్టి రూపకమునఁ
బరుగు చుంటిని విష్కంభపాత్ర వోలె. 70

తే. "ఓరి, జీవన మృగతృష్ణ ఓరి, ఓరి
భీరు తాలస దుఃఖ విహారభూమి!!
ఓ పురాతనామృతమ !! అయో !! అగతిమ
య ఘనమోహ జర్జర సుమహావసాద !!

తే. "మౌన నాశనధ్వంసతమములు, శూన్య
మును నభావమ్ము నీ వేళఁ బొలసియున్న
సత్యములు – నీకు నిలువఁగా స్థాన మెద్ది
యించుకేనియు నమరతా ! యిప్పు డిచట !

తే. "మృత్యువా! ఓసి చిరనిద్ర! మిహికవోలె
నతుల శీతలము భవదీయాంక పాళి
కాలజలధి కల్లోలరింఛోళిఁ బోలు
భంగముల సృజించెదవు విశ్వమ్మునందు.

తే. "కఠిన ఘననృత్య పాదసంఘట్టనమవు,
స్పందనముల కెల్లను గొలబద్ధ వీవు
సృష్టి యభిశప్త మైనప్పు డెల్ల కాల
ములను బొలుపొందును భవద్విభూతి యగుచు.

తే. "అర్థి నుండెదవు ఘనాపహాస మటుల
ఇది పురాసత్యము–ప్రతిధ్వనించు నెపుడు,
సర్గకణకణమున గాది సంచరింతు,
వగు నిదియు రమ్య నిత్య రహస్య మగును. 75

తే. "అగు బ్రతుకె భవదీయ క్షుద్రాంశ–మద్ది
ప్రకటిత మ్మగు నీల జలధరమాల
నమరు సౌదామనీసంధి యటుల నెప్పు
డొప్పు శోభామనోజ్ఞమై యొక్క క్షణము.

***

తే. పానమొనరించు శబ్దాళిc బవన మిపుడు
నిర్జనత్వంపు నిట్టూర్పు నెఱిc జలించె
అద్ది డీకొని హిమవదహార్యపంక్తి
నూను బ్రతిశబ్దరూపాల దీనముగను.

తే. ధిమి ధిమిం ధిమి నిస్వానధీరతలను
దమిని సాగు ననస్తిత్వ తాండవమ్ము
కర్షణ విహీన చంచలా కణగణములు
భార వాహమ్ములై భృత్యభావ మొందె.

తే. దృష్టి శీతల మృత్యు సదృశ నిరాశ
నంగవించి యొనర్చు నాలింగనమ్ము
ధూమ హిమసంహతుల మహావ్యోమవీథి
కడగి వర్షించు భౌతికకణము లట్లు.

తే. కాక నా భయద జలసంఘాత మప్పు
డటుల నావిరైపోవుచున్నదియొ, యేమొ!
పరగె సౌరచక్రమున నావర్తనమ్ము-
గడచెc బ్రళయనిశి - ఉదయకాంతు లొదవె. 80

# ఆశ (ఆసక్తి)

తే. సాగి జయలక్ష్మి పోల్కి నుషస్సు పొలిచి
స్వర్ణతీరాన్ని కాంతివర్షమున ముంచె
గాఢమగు నపజయమునఁ గాళరాత్రి
తతజలాల నంతర్నిహితమ్ము నొందె.

తే. ప్రకృతి భీవివర్ణ వదనపద్మ మంతఁ
దిరిగి హసియింపసాగె సందీప్తరుచుల
వర్షము గతించెను శరత్తు హర్షఫుల్ల-
నవ్యతల సృష్టియందు విన్యసన సేసె.

తే. స్నిగ్ధపింగపరాగ మున్మిషితముగ్ధ
సితసరోజానఁ గ్రీడించు చెలువు మెరసి
రమ్యనవాలోకనము హిమరాసి నపుడు
రాగమున ముంచి వ్యాపించె లలితగతుల.

తే. సకలధరణిపైఁ గల హిమాచ్ఛాదనమ్ము
వీడసాగెను - మేల్కొని వృక్షసమితి
యలసతల శీతజలముల నాచరించెఁ
జతురిమలు దోపఁగా ముఖక్షాళనములు.

తే. నేత్రములఁ జేసె ప్రకృతి యున్మీలనమ్ము
సరవి నది ప్రబుద్ధమును గాసాగె-నంత
వెర్రికడలి యలల యొళ్ళువిరుపు తరుగ
మాటిమాటికి వహియించె మందగతులు. 5

తే. ప్రళయ శార్వరీకల్లోల ప్రస్మృతులకు
నలసినటు, బిర్రుగ బిగిసినటులఁ దోఁచి
యపుడు సర్వంసహావధు నబ్ధి-శయ్య
సంకుచితమూర్తిఁ గూర్చున్న సరణి మెరసె.

తే. బహుళ రంజిత విజన విశ్వమ్మునందు
మనువు చూచె విశ్వైకాంతమహిమ అదియుఁ
దుహిన శీతల జడతగాఁ దోఁచె - నచట
నిఖిలకోలాహల మలసి నిద్రవోయె.

తే. సోమరహి తేంద్రనీల సంశోభి చషక
మపుడు బోరగిలఁబడి వ్రేలాడుచుండె
ఆపద సమస్త మరిగెనో యనగఁ బవన
మర్థి మసృణసునిశ్వాస మాచరించె.

తే. ఆ విరాట్టు క్రొంగొత్తరంగద్దఁ దలఁచి
కలుపుచున్నాఁడు హేమ మకల్పముగను
ఉద్భవించెను మనువున కొక్కపరిగ
నెవ్వఁ డతఁ డను ప్రశ్న-జనించె కోర్కె.

తే. వేనియాజ్ఞకు బద్ధు లీ విశ్వదేవ
వాయు పవమాన పూషాది వరగణమ్ము?
ఎవని శాశ్వత పాలన నిట్లు నడతు
రా మరుత్తు, సోముఁడు వరు ణాదిసురలు? 10

తే. అతని భ్రూభంగ మగుఁ బ్రళయమ్ము తలఁప-
అట్టి ప్రళయాన వికలత నందినారు
ఆ ప్రకృతిశక్తికిఁ బ్రతీకలైన నేమి,
యెంత దుర్బలు లైరి వారిపుడు చూడ!

తే. సర్వభూత చేతన, పృథుశక్తి గణము-
వికలతను జెంది యపుడు కంపించిపోయె
వివశులు నుపాయశూన్యులు వీర- లపుడు
వీరి కెంత దుర్దశ సంభవించె నయొయొ!

తే. కాము దేవతలము మేము- కారు వీరు
భూరి పరివర్తనపు హస్తపుత్తలికల
మగుడు - మరయ నున్నాము మే మందరమును
గట్టఁబడి గర్వరథతురంగమ్ము లట్లు.

తే. కాంతిమయ తటిత్కణ తారకాతతులును
గ్రహసమితి వేడcగా ననురాగభిక్ష
యెవ్వని వెదకుచున్నవి యీ వినీల
గగన మందు, మహాంతరిక్షమ్మునందు?

తే. ఏ మహాశక్తి కర్షింప నివ్వి నింగిc
గానcబడును, అదృశ్యమ్ముc గనును - కడcగి
చేయ నే శక్తి మధురస సేచనమ్ము
నవనవోన్మేష మొందు తృణమ్ము - లతలు.

తే. అర్థి శిరసొగ్గి యెవ్వని యమితశక్తి
నఖిలజీవు లే యెడను సమాదరింత్రొ
మౌనమున నెవని ప్రభుతc బూని స్తుతి
యించెదరొ యట్టి యస్తిత్వ మెచట నుండె?

తే. ఓ అనంతమనోహరా? ఉజ్వలుcడవు!
ఎవ్వరవొ నీవు తెలుప నా కెరుకపడదు
అమలరూప మ దేమి? ఏ మౌదు వీవు?
ఇట్టి భారయోజన యే భరింపcజాల.

తే. "అయ్యెదవు నీవు ఎదియొ నీ వౌదు వయ్య"
అనుచు దోcచెడి నో విరా డఖిల దేవ!!
అబ్ధి భవదీయఘనతనే యాలపించు
రమ్య గంభీర మంద ధీర స్వరాళి.

***

తే. "అధికవిహ్వల సదయ హృదబ్జ మందు
మించు తీయని కలవోలె మినుకు మనుచు
నేమి యిది - ఆశ అనిలమై యిటుల వచ్చి
వ్యాకులతరూపమున నేcడు ప్రకటితమ్ము.

తే. మధుర జాగరణము వోలె మహితకాంతి
నెంత స్పృహణీయమై యిద్ది యెసcగ మెసcగు,

నుబికి జృంభించు నిద్ది స్మితోర్మికలుగ,
నధిక మధుతాన మటుల నృత్యమ్ము సేయు. 20

తే. జీవనము! జీవనపు కేక!! శీతలాగ్ని
సేయు నాట్యమ్ము మన్మనస్సీమ యందు
ఈ శుభప్రభాతోల్లాస మెంత యొప్పు
నెవరి చరణద్వయాన నర్పింతు దీని.

తే. శ్రవణముల భవ్యవరదాన సరణి తోచి
"ఉంటి నే" నను ప్రతిశబ్ద మొప్పి చేరె
"నిత్య సురవర్త్మ సంగీతనిచయ మందు
లీనమౌ నటుం" దనె, "ఉందు" నేను నంటి.

తే. సకలమును మధురవికాస సహిత మైన
యెట్టి శక్తి సంకేతమ్ముని ట్లొనర్చు
నేను జీవనలాలస యెందు కింత
తీక్షణ విలాసమయముగాఁ దేజరిల్లు?

తే. "ప్రభువ! అయిన నే నింకను బ్రతుకవలెనె?
బ్రతికి యే నేమి సేయఁగావలయు నయ్య?
ఈ యమరవేదనము తోడ నెంతకాల
మిట్లు బ్రతికి యెపుడు మరణింపవలయు?

***

తే. పవనచాలిత మగు మాయపటము వోలెఁ
దొలఁగినది యొక్క ప్రతిసీర - ప్రళయకాల
ముద్రిత సుమహావరణవిముక్త యగుచుఁ
బ్రకృతి నవవర్ణశోభలఁ బరిఢవిల్లు. 25

తే. అమల చాంపేయ శాలిధాన్యంపు రాసు
లివె సుదూరమ్ము వరకు వ్యాపించియుండె
అమృతశరదిందిరా మనోజ్ఞాలయమున
కమరఁ గూర్చిన బాటయో యనఁగ నొప్పి.

తే. విశ్వకల్పన పోలిక శశ్వ దున్న
తమ్ముగా నొప్పు శీతభూధరము అద్ది
పృథ్వి కాలంబనము – సుఖప్రీతిదమ్ము,
సకల మణిరత్న సముదయ జన్మభూమి.

తే. అచల హిమవదాహార్య శోభాత్త వల్ల
రీ కలిత శుచిసానుశరీర మొప్పు
నొక సుఖస్వప్నమున నిద్ర నున్నతరిని
నొలసి రోమాంచ కంపన మ్మొందినట్లు.

తే. శస్త హిమనగ పాదదేశమ్ము నందు
నీరవత్వామల విభూతి నిండి పొంగు
అచట నిరఝరిణీ ప్రవాహమ్ము లిప్పు
డర్థి వెదజల్లు నవజీవనానుభూతి.

తే. అమల నిస్సీమ నీలాంబరాంచలమున
నెవరి మృదుహాసమో చూచి హిమనగంపు
మందహాసము కలగాన మహిమ మెరయ
బయలు వెడలెనొ యన నవి వరలఁదొడఁగె. 30

తే. అట శిలాసంధులను మహితానిలమ్ము
తాకి గుంజారవమ్ములఁ దమిని నింపె
పరమదుర్భేద్య మైన యా పర్వతంపు
ద్రఢిమఁ గీర్తించు మాగధప్రవరు నట్లు.

తే. మహిత సంధ్యాసమయ మేఘమాల లనెడి
సుందరానేకవర్ణ సంశోభి వస్త్ర
ములను గప్పి, మంచుమకుటముల ధరించి
గగనచుంబి శైలశ్రేణి గానుపించు.

తే. ఆ విభవ పరిపూర్ణ మహాద్రిపంక్తు
లమర విశ్వమౌనంపు మహత్వగౌర
వములకును బ్రతినిధుల ట్లపార విశ్వ
సవిధమున మూకతను సభసల్పె ననఁగ.

తే. నిలిచి వ్యోమమహానంతనీలిమమ్ము
జడతవలె నుండె నపుడు ప్రశాంతముగను
దూర దూరాన నున్నతిఁ దోఁచి తన య
భావమునకు విభ్రాంతిని బడయు నభము.

తే. రమ్య శీతాద్రి ఘనశిఖరమ్ము లప్పు
డొప్పి విశ్వమనోజ్ఞ మహోర్మికలుగ
వ్యోమమునకు జగత్సుఖోల్లసనమను సు
హాసములఁ జూపుచున్నట్టు లంతఁ దోఁచె. 35

తే. శశ్వదమల మగు గగనోత్సంగ మటుల
నచట నున్నట్టి యొక కందరాంతరమున
సుందరస్వచ్ఛ వరణీయ శుచిమహితము
ను నగు నెలవును గల్పించుకొనియె మనువు.

తే. సవిధమున మిన్కు తొలుతటి సంచితాగ్ని
కలుషిత జ్యోతి యగు రవికరము వోలె
చెలఁగి యది జాగరణశక్తిచిహ్న మటుల
లీల నవ్వేళ మరల జ్వలింపసాగె.

తే. ఆరడమున జ్వలించె నిరంతరమ్ము
నతని నవ్యాగ్ని యుదధితీరాత్త భూమి
చిత్తధీరతను మనువు జీవనమును
సర్వ మర్పించె ఘనతపశ్చర్యయందు.

తే. జాగృతమ్మయ్యె దేవతాసంస్కృతియును
స్వర్గజనయజ్ఞ వరమాయ సంతరించి
కర్మమయ మహాహీన ప్రగాఢతుహిన
శీతలచ్ఛాయ లతనిపైఁ జేర్చె మరల.

***

తే. క్షితిజమధ్యోద యార్కరోచిస్సు వోలె
స్వస్థుఁడైన మనువు లేచి, శాంతమును మ
నోహర మ్మగు ప్రకృతివినూత్న లక్ష్మి
నింపయిన లుబ్ధవీక్ష వీక్షింపసాగె. 40

తే. పాకయజ్ఞ మ్మొనర్చు సద్భావ మొంది
శాలిధాన్యమ్ము సమకూర్పసాగె నతఁడు
పావకజ్వాల నిజధూమపటము నపుడు
నేర్పు మెరయంగఁ బ్రీతిమై నేయసాగె.

తే. శుష్క తరుశాఖలను జేర్పఁ జొక్కి యెగసె
కృష్ణవర్త్ముని యుత్థానకీల లపుడు
కడిఁది యాహుతి నవధూమగంధములకు
మించి నభముఁ గాననము సమృద్ధి నొందె.

తే. “మేము మిగిలిన యట్టులే మిగిలి యెవ్వ
రేని జీవనలీల రచించుచున్న
నిందు నాశ్చర్య మొక్కింతయేని కలదె?
ఇటు మనోవీథి మనువు యోజించి యంత.

తే. అగ్నిహోత్రావశిష్టాన్నమందుఁ గొంత
నిచ్చమెయి దూరమున నుంచి వచ్చుచుండె
అప్పు డపరిచితవ్యక్తి యట్టి క్రియను
దృప్తిఁగను నని తలఁచి సుఖించుచుండె.

తే. అపుఁడు దుఃఖ గభీర పాతాళిఁ జదివి
సానుభూతిని దెలిసికోసాగె నతడు
నీరవత్వంపులోతుల నిలిపి మనసు
నొంటి నాతఁడు మగ్నుఁ డౌ చుండె వలఁచి. 45

తే. అచట నుపవిష్టుఁడై జ్వలితాగ్ని యెదుట
మననమున ముగ్నియున్నాఁడు మనువు – అప్పు
డాకు రాలెడి కాలాన నాతఁ డొప్పె
తపమె యటు సజీవపుమూర్తిఁ దాల్చినటుల.

తే. అయినఁ జెలరేగుచునె యుండె నతని యెదదఁ
బాయకను నవ్యచింతయు స్పందనమ్ము
దీనముగ నస్థిరమ్ముగా దినదినమ్ముఁ
గడిదియై యాతని బ్రతుకు గడవసాగె.

తే. అంధకారంపు మాయ నిత్యమ్ము నతని
కెన్నియో ప్రశ్నలెదనుదయింపఁజేసె
ఆ విరాట్పురుషుని ఛాయయందు మారె
క్షణము క్షణము ప్రశ్నల వర్ణసముదయమ్ము.

తే. తోఁచె సాము తెలిసిన ప్రత్యుత్తరములు–
అఖిలప్రకృతి సకర్మక మ్మయ్యె నపుడు
జీవనము నిల్పుకొన నిజాస్తిత్వ మొగిని
కృషియొనర్చుట మగ్నమై కెరలె నంత.

తే. నిత్యము మనువు తపమున నిరతుఁడయ్యె
సలుప నిజనియమితకర్మ శ్రద్ధతోడఁ
గర్మజాలంపు సూత్రాళి ఘనతరముగ
విశ్వరంగ మెల్లెడల వ్యాపింపసాగె. 50

తే. దీర్ఘ కల్లోల వారాశి వీర భూమిఁ
దరఁగ లతిశాంతముగ వచ్చి తాకినటుల
నట్టి విధిశాసనమ్మునే యను సరించి
యల్లనల్లన వివశుఁడై యతఁడు నడిచె.

***

తే. విజన విష్టప తంద్రీ సువిలసనమున
శూన్యమౌస్వప్న మొందు విస్ఫూర్తిఁ బరగె
గ్రహపథాలోక వృత్తానఁ గాల మపుడు
విపుల మగు తన వాగుర న్విసరుచుండె.

తే. రాగరాహిత్య పూర్ణ తాలాయ సృష్టి
రహిత ఫల నవీన మగు నారంభ మటుల

నెట్టి సందేశమును లేక యేగుచుండె
జాములు, పవళ్ళు, రాత్రులు చక్రగతిని.

తే. స్వచ్ఛ మోహన చంద్రబింబమ్ము తోడ
సోత్సుకతఁ గూడె సుందర శుభ్ర రజని
శీతపవనము పులకిత స్నిగ్ధ మగుచుఁ
గెరలి పాడెను భావనోద్గీథ యపుడు.

తే. ఉర్విఁ గలుషితాధీర మహోర్మికలును
వ్యాప్తినొందె సుదూరమ్ము వరకు జలధి
విస్తరించిన దటులె గభీరముగను
జంద్రికారుచి యంతరిక్షమ్ము నందు. 55

***

తే. అట్టి రమణీయ దృశ్యము నందె యలస
చేతనత్వంపు నేత్రాళి చెందె విప్పు
ప్రౌఢమానస సుమమధు ప్లావితములు.
స్నిగ్ధదళములు తమి వికసించి యొప్పె.

తే. వ్యక్త గగనంపు చంచల భాస్వరతలు
సుఖకరమ్ముగ స్పృశియించు చుండె నపుడు
ఎరుకపడుచుండెఁ బ్రబల మతీంద్రియమ్ము
స్వప్నలోక మధుర రహస్యం బొకండు.

తే. పొలసి స్వాభావిక మధు బుభుక్షవోలె
నాది వ్యసనమ్ము జాగృతంబయ్యె–నపుడు
వలచి కోరె మనువు చిరపరిచితముగ
మధురమౌ ద్వంద్వసుఖ మనుమానముననుు.

తే. దినము రాత్రియు నొప్పె నా రవివరుణుల
పుత్రి కాక్షయ శృంగార పూర్ణతలుగ
జీవిత తరంగి తోదధి జీవనముల
కవలిమేరనునవ్య సమాగమమ్ము.

తే. తృషితమును వ్యాకుల మ్మయ్యె దీర్ఘతపసు
సంయమమున సంచిత మహాశక్తి యిప్పు
డపరిమేయంపు శూన్యరాజ్యానఁ జేసె
నస్థిరమ్మైన తమ మట్టహాస మెనసి. 60

తే. ప్రౌఢపవన సంస్పర్శచే శ్రాంతవపువు
పులకిత మ్మయి వికలతాకలిత మయ్యె
చిక్కువడిన ఆశాసతీ చికురపాళిఁ
జంచల సుగంధవీచి నర్తించసాగె.

తే. దీర్ఘ సంవేద నేచ్ఛతో దెబ్బతిన్న
మను మనోవీథి వికలత మల్లడిల్లె
చటుల సంవేదనము జీవజగము నెల్ల
విపుల బాధారతి నలిపివేయఁగలది.

***

తే. ఎంత మధురమ్ముగా నొహో! యెసఁగ మెసఁగు
నవ్య సుందర మీ కల్పనాజగమ్ము
ఛాయలో సుఖస్వప్న సంచయము పులక
రింత మేల్కొను, నిదురించు - లేక యలపు.

తే. ప్రేమసంప్రాప్తికిని మనోభీష్టమునకు
ఘర్షణమె లేక యున్నచోఁ గడఁగి, యేల
యెవ డభావాసఫలతల హేమగాథ
వ్యర్థగతులఁ బ్రలాపమ్ము లాచరించు.

తే. చెప్పు మొంటిగ నెన్నాళ్ళు జీవితంబ!
యిటుల గడుపంగ వలయునో యేను - తెలుపు
మీ కథ యెవరి కే వినిపింపవలయు?
అనకు మీ విధిఁ దెల్పుట వ్యర్థమనకు. 65

తే. కాంతికిరణ రంజిత తారకామతల్లి!
చారు తిమిరసుందర రహస్యమ్మ! ఓసి!!

విమల శీతలత వ్యధిత విశ్వమునకు
నవ్యగుణబిందు వొచు నున్నావు నీవు.

తే. అమిత సంతప్త జీవన హర్షదాయి
శాంతి సహిత ఛాయాప్రదేశమ్మ! ఇప్పు
డగణిత మనోజ్ఞరూపాళి నమరి యెంత
స్వాదు మంజు సందేశ మొసంగె దీవు.

తే. రమ్యతమ మౌనము వహింప నెచటనీవు
నిట్టి చతురిమ మెలమి నార్జించినావు
ఓసి, యింద్రజాలజనని! ఉజ్వలనిశి
నింత మధురవు నీ వైతి వెందు కిటుల?

***

తే. తారకాదీపముల నబ్ధితటము కడకు
దీప్తి మలిసంజ యేతేర దివ్యరజని!
దాని చాంపేయవర్ణ వస్త్రమ్ము చించి
తివిరి నవ్వెదవేల ప్రతీపముగను?

తే. అంధకారాన నశ్రుకణాళిఁ గలిపి
చతురత ననంతకాల శాసనపు స్వైర
చరితమును వ్రాయువేళను శక్తి మెరయ
నిటుల నాకస్మికముగ హసింతు వేల? 70

తే. విమల రజనీమతల్లికా! విశ్వకమల
మృదుల మధుకరివి సొగయ నెచటనుండి
వచ్చి మంత్రమ్ము పఠియించి ప్రాణికోటిఁ
బ్రీతిఁ జుంబించి పోయెదవే లతాంగి!

తే. ఎక్కిళుల వలె నిట్టూర్పు లే దిగంత
రేఖకడ మెల్లగా సంతరించి యిటుల
గాలిరొద యను మిష సువేగాన రొప్పు
చెవరి జేరంగ నీ విపు డేగె దతివ!

తే. ఇంత తీవ్రమ్ముగా హసియింతు వేల?
బహుళహాసమ్ము వెదజల్లవలదు మరలc
గ్రమ్ము హిమకణ ఫేన తరంగ పాళి
నమల తిమిరము - లక్షణ మట్టి వ్యాప్తి.

తే. ముగుద! ఎవ్వనిc గని మేలిముసుcగు నెత్తి
చిరుతనవ్వుల నాగుచు మరల నడతు
విజనగగనాన మరచిన విధము తోప
స్మృతిపథమ్మున కెవ్వనిc దెచ్చికొందు?

తే. రజతపుష్ప నవీన పరాగమటుల
చంద్రికాధూళికల వెదజల్ల వలదు
ఓసి యున్మాదినీ! యిటు లుజ్వలింప
మధుర కౌముది నిను నీవె మరువcగలవు. 75

తే. జారె నిదె, చూడు నీదు వస్త్రాంచలమ్ము
దాని సవరించుకొనుము-చైతన్యహీన!
రాలె నందుండి ఫణమణిరాజి-దాని
ప్రోవుసేయు మున్మాదినీభావ ముడిగి.

తే. నవ్యయౌవన మధుమదోన్మత్త! రజని!!
చినిగిcపోయెనా యేమి నీ స్నిగ్ధనీల
లులితవసనమో ముగ్ధ! నీ రుచినిc గని య
కించన జగ మ్మిదిగొ, సంతసించుచుండె!!

తే. వరలు నా యతు లానంత వైభవాన-
ప్రౌఢవైరాగ్య మేల యుత్పన్నమయ్యె?
లేక మరచినదాన వై లీల వెదకె
దబల! జీవిత వక్షః కిణాంకములను.

***

తే. ఏను నిపు డెదియొ మరచినాను స్మృతికి
రాదు, ప్రేమయో, వేదనా, భ్రాంతి యౌనె?
ఎద్ది మరి? కాక సుఖముగా నెందు నిదుర
మలఁగి నా మది యద్దాని మరచినదియొ!

తే. ఎచట నేని నీ కదియు యాదృచ్ఛికముగ
గోచరించిన నదియుఁ బోఁగొట్టవలదు
భాగ మద్దాన నీకు నేఁ బంచియిత్తు
మరువకుము దాని నేనియు మగువ! నీవు. 80

# శ్రద్ధ (ఆహ్లాదము)

తే. “ఎవ్వరవు నీవు సంసృత్య హీనజలధి
తీరమున నూర్మి విసరిన దివ్యమణివి?
మౌనఫణితి నీ విజన మనూనరమ్య
క్రాంతి నభిషిక్త మొనరింతు కడcగి నీవు?

తే. మధుర విశ్రాంతి వేకాంతమవును, ఘన బ
హిర్గత జగతీ సురహస్య మీవు నీవు
నవ్య కరుణా మనోజ్ఞ మౌనమవు నీ వ
య్యమల చంచల మధుర మనో లసతవు.

***

తే. సారస మ్మటు, కవితొలి ఛంద మటుల
షట్పదీరుతిc బోలు నా స్వనము నపుడు
పంచుకొనియున్న మోముతో మించి మనువు
మహితగతి విని సంతోష మంజులముగ

తే. అప్పు డొక యూపు కలుగcగా నతcడు చూడ
సాగె నాకర్షితుని వోలె నాగ కటులె
“ఇట్టి రమణీయ సంగీత మెవ రొనర్తు”
రన్న కుతుకము మౌనమ్ము నందcగలదె!

తే. చారుతర మగు నయనేంద్రజాల మటుల
నమరు నా మంజుదృశ్యమ్ము నతcడు చూచె
అద్ది సుమశోభిలతికను నమల చంద్రి
కా పరీరంభ నీల మేఘమ్ము వోలె. 5

తే. నవ్యసౌరభ మధుపవనమ్ము తోడఁ
జెలఁగి క్రీడించు నొక సాలశిశువు వోలె
దీర్ఘ మున్నుక్తమును మహోదీర్ణము నయి
బాహ్యరూపమ్ము హృదయమ్ము వలెనె యుండె.

తే. నీల రోమావళీ రుచి నిస్తులములు
రమ్య గాంధార – మేష చర్మములతో డఁ
గప్పె నా వ్యక్తి కమనీయ కాంత వపువు
అవ్వి దాని కావరణములై చెలంగె.

తే. రమ్య జలదవనాన గులాబిరంగు
గలిగి విరిసిన హ్రాదినీకళిక వోలె
నా వినీలంపుఁ బరిధానమందు లలిత
గతిని సగమది విచ్చి యంగమ్ము తోఁచె.

తే. అహహా! ఆ ముఖసౌందర్య మరయఁ దోఁచుఁ
బశ్చిమ వ్యోమమధ్యాన బరమనీల
మేఘములు గప్ప భేదించి మిత్రమండ
లమ్ము ఛవిధామ మటులఁ జెలంగు ననఁగ.

తే. కాక–లఘ్వగ్నినగ నవగాధనీల
శృంగకము విచ్చి మాధవ స్నిగ్ధరజనిఁ
గదల కెవ్వేళ నిల్చి ప్రకాశయుక్తి
మెరయుచున్నదో యన నది మించి తోఁచు. 10

***

తే. అంసమున నల ల్దిరిగి వ్రేలాడుచున్న
శుభ్రకేశాళి ముఖచంద్రుఁ జుట్టుకొనఁగ
శ్యామ ఘనశాబకమ్ములు శశినిఁ జేరి
యమృతమును గ్రోల వచ్చెనో యనఁగ నొప్పె.

తే. ఆ మొగముననను జిరునగ వద్భుతమ్ము!
మిత్రు నసుకిరణము విశ్రమించి యొక్క

రక్త కిసలయమున నభిరామముగను
నలసతను బొందెనో యన నద్ది యొప్పె.

తే. నిత్య యౌవనచ్ఛవిని నిర్ఛిద్రమగుచు
విశ్వ కరుణా సుకామనా విమలమూర్తి
భూరి సంస్పర్శ కర్షణాపూరితమ్ము
జడమునను స్ఫూర్తిఁ గల్గింపఁ జాలు నద్ది.

తే. ఉదయతారకారుచి యను నొడిని విడిచి
వెల్గి సిగ్గున మత్తిల్లి వెడలినట్టి
యుషసి తొలి సుకాంతకిరణ ముజ్జ్వల మధు
రతను, నార్ద్రమోదానఁ బూర్ణ మగు నద్ది.

తే. అద్ది కుసుమ కావనఖండ మందు మంద
పవన చాలిత సౌరభప్రవర మొలసి
యరుణరాగయుతము మరందార్ద్ర మగుచు
రూపుధరియించెనో యన నోపియుండె. 15

తే. సురభిసమయరాకా నవజోత్స్న పడిన
యట్టు లొప్పె నా మధు మందహాస మపుడు
దాని మదవిహ్వల మ్మైన తరుణకాంతి
పుష్పరస సార్ద్ర గంధోర్మి వోలెఁ దోఁచె.

***

తే. "వసుధగగనాల మధ్య జీవనము కనఁగ
నతిరహస్యము నిరుపాయ మయ్యె-తిరుగు
చుంటి మండెడి యుల్కనై శూన్యమందుఁ
తో డెరుంగక" యని మను వాడినాఁడు.

తే. "ఎటుల దీన నగము ప్రవహింపఁజేయ
లేదొ సెలయేటి, నెటు చేరలేదొ-కరగ
నట్టి హిమము నిరఝురరూప మంది కడలి
యొడిని, అటులె, పాషండుఁడ, నుంటి నేను".

***

తే. ఎసఁగు జిక్కుల బ్రతుకు ప్రహేళికగను–
దాని విడదీయ నెపుడ యత్నమ్ము సలుప
నించుకయు–నర్థ మేమియు నెరుకపడదు
విడిచి యూహలఁ గాలమ్ముఁ గడుపుచుంటి.

***

తే. "తమి నెసంగిన యా యతీతమును రేలుఁ
బవలు మరచిపోవఁగ యత్నపడుచు నుంటి
దీన జీవితసంగీత మైన యద్ది
తిమిరగర్భాన నొదిగి దూరమగుచుండె. 20

తే. ఏమి చెప్పను, నే లక్ష్యహీనుఁడను వి
నీల గగనావకాశాన నేను దారి
చెదరిన పవనోర్మి యటుల శిథిల విధుర
శూన్య రాజ్యమ్ముగ వసించుచుంటి నిపుడు.

తే. ఒక యచేతన స్తూపమ్ము నొక్క స్మృతికి
ఒక్క సుషమకు మాసిన ద్యుతిని నేను
రమ్యజడతకు జీవనరాసి నగుదు
కడు సఫలతకు నే మోసకారి నిపుడు.

తే. ఎవ్వరవు? ఘోరగ్రీష్మాన ని వ్విధాన
తోఁచెదవు మృదువాసంతదూత వోలె,
నంధతమసాన హ్రాదిని యటుల–తపన
యందు శీత సురభిళ మందానిలముగ.

తే. తారకాశాకిరణ తుల్యతను జెలంగి
కవి మృదుల మానసమునకుఁ గాంతకల్ప
నంపు దివ్య లఘు లహరి నాఁగ నాదు
చిత్తవైక్లబ్యము శమింపఁజేతు వీవు."

***

తే. కోకిలా దేవి హర్షానఁ గుసుమమునకు
వచ్చి మధుమయసం దేశ మిచ్చినటులఁ
గడఁగి సవిశేషమగు సముత్కంఠ నుడిపి
పల్కసాగె నాగంతుకవ్యక్తి యంత. 25

***

తే. "తండ్రి కతిప్రియమైన సంతాన మేను
ఇచట, గంధర్వభూమి, వసించి భవ్య
లలితకళ లందు జ్ఞాన మార్జనమొనర్ప
హృది నవోత్సాహ నిబిడమై యెసఁగుచుండె

తే. ముక్త గగనాన జరియించు రక్తి బలిసి
నిత్య మభ్యాస మౌటను నెఱిఁ జెలంగె
వ్యస్తహృదయము బహుకుతూహలము మెరయ
విమలరమ్య సత్సత్యము న్వెదకుచుండె.

తే. అహహా! దృష్టి హిమగిరిపై కరిగినంత
నధిక భీరుతఁ బ్రశ్నించు నాత్మ యిట్లు
"వసుమతీలక్ష్మి కీ భీతివళి ఇ దేమి?
పృథ్వి కిట సంభవించిన పీడ యేమి?"

తే. తనరి మౌనాన నాత్మసౌందర్యమునకు
దివ్యమగు మహాసుప్తసందేశ మొకటి
సజగ మౌచు సంకేతమ్ము సలుపఁ గడఁగె-
తా హతమొనర్చె ముగ్ధచైతన్య మపుడు.

తే. మరులుగొని ముందునకు సాగె మానసమ్ము
పాదములు దాని వెనువెంటఁ బరఁగె-కంటి-
యాకలియె తీరె కామనగాళిఁ గనఁగ
వింత రమణీయసంభార మిద్ది, యహహా! 30

తే. ఒక్క దినమున దరిలేని యుదధి రేగి
క్షుబ్ధమై డీకొనఁగ సాగె క్షోణిధరము

నొంటి నిరుపాయజీవితం బొలయ నిట్లు
నేఁ దిరుగుచుంటి మౌనాన నేటివరకు.

తే. కంటి నొక కొంత బల్యన్న కబళ మిచట-
“ఎవ్వరిది భూతహితరక్తి నిడిరి - ఎవరొ
యుజ్జగిలి తా సజీవుఁడై యుండె నేఁటి
కిచట” ననునూహ జనియించె నెడఁదయందు.

తే. “ఓ తపస్వి! ఇంతగ వాడియుంటి వేల?
ఏమి, యీ వేదనావేగ మేల నీకు?
అయ్యొ! ఎంత హతాశుఁడ వైతివయ్య!
తెలియఁబల్కు మి దెట్టి యుద్వేగమౌనొ!!

తే. అయ్యొ! నిశ్శేషము నధీర మైన మధుర
లాలసయె లేదె హృదయాంతరాన? ఏమి
రమ్యవేషమును గొని వైరాగ్య మిటుల
నిన్ను వంచించు నేర్పుల నెగడు నేమొ!

తే. చటుల దుఃఖభయమ్ము నజ్ఞాత జటిల
తల నెడంద నూహించి సంతతము నిటుల
నపరిచితుఁడ వై నీ భవిష్యమ్ముఁ గూర్చి
కర్మరంగాన విముఖతం గాంచ నేల? 35

తే. జాగృతమ్మయి వ్యక్తమై సంతసించుఁ
దనదు లీలకుఁ బరమచైతన్య మెపుడు
క్రమ విశ్వాభిరామవికాస మద్ది
సర్వు లనురక్తులగుదు రా సర్గ మన్న.

తే. సృష్టి కళ్యాణకర్మచే నెసఁగు- శ్రేయ
మిచ్చు పరిణామ మగు నెపు డిచ్ఛ కద్ది
భ్రమకు లోనయి కాదని వదలి దాని
నిహము నసఫల మొనరింతు వేల, నీవు?”

***

తే. దుఃఖపూరిత గతరాత్రిఁ దోఁచె సౌఖ్య
నూతనోదయము రుచిరానూనముగను
జిలుగు నీలపటమ్ముగాఁ జెలఁగె నద్ది
దాన సుఖశరీర మొగిని దాగియుండె.

తే. ఎద్ది యభిశాప మంచు నూహింతు వీవు
విశ్వ కష్టమూల మని భావింతు దేని
నద్ది యీశు గుప్తవరమె యౌను–దీని
నీవు మరువఁబోకు మెడంద నెన్నఁడేని

తే. వ్యాకులమయి విపత్పీడ వలన నిటుల
స్పందనముఁ జెందు ని మ్మహాజగము – కడఁగు
నిట్టి సుఖదుఃఖమే వికాసంపు సత్య
మగు – మహేశు నమృతదాన మరయ నిద్ది. 40

తే. నిత్యసుఖ మెపుడుఁ బ్రభుత నెరపుచున్నఁ
గళవళము నొందు జలనిధి గతిగ నద్ది
వ్యథవలన నీలవీచి కావళుల నడుమ
కాంతి విరజిమ్ము సుఖమణిగణము చెదరు

***

తే. మనువు సవిషాదుఁడై యిటు లనఁగసాగె
"మానసమున నీ యుచ్ఛ్వాస మంజులతలు
రమ్య సువిలాసతలతో నిరంతరమ్ము
నొదవఁజేయు నుత్సాహ మహోర్మికలను.

తే. కాని నిరుపాయమైన దీ గడ్డు బ్రతుకు,
ఇందు సందేహ మిసుమంత యేని లేదు
పరిణతిగ నా నిరాశను బడయు నద్ది
పరగు సఫలతా కల్పిత వపువు వోలె".

తే. అప్పు డా వ్యక్తి మైత్రితో ననియె "ఎంత
ధీరతను వీడినా వాహో! వీరు లెందుఁ

జచ్చి యేనియుఁ జేకొంద్రొ జయము నట్టి
బ్రతుకు పణమున నోటమి వడసినావు.

తే. తపము కాదు జీవనమె సత్యమ్ము కనఁగ
క్షణిక దీనావసాదమ్ము కరము జాలి
నొదవఁగాఁ జేయు నాశాప్రమదము తరళ
కాంక్షతో నిండియున్నది గాఢనిద్ర. 45

తే. ప్రకృతి వనితకు వాడిన ప్రసవములను
చెలఁగి సింగార మెవ్వరుఁ జేయ రెపుడు
వీడ సౌరభ, మందముల్ వాడిపోవ
త్వరితగతి ధూళిఁ గలసిపోవలయు నవ్వి.

తే. క్షణము సహియింప నోపఁగాఁ గలదె ప్రకృతి
యీ పురాతన నిర్మోకమెన్నఁడేని
వలచి పరివర్తనము, అందు నిలిచియున్న
దనవరత నవతా మహాహ్లాదనమున.

తే. యుగము లనియెడి పృథుల గండోపలముల
నవ్య గంభీరముగ సృష్టి నడచిపోవు
అమర గంధర్వ దై తేయ సముదయములు
వ్యాకులతలతో వెనువెంట నరుగుచుంద్రు.

***

తే. ఒక్కఁడవు నీవు-సువిశాల ముర్వి నైజము
నిఖిల వైభవసంపత్తి నిండియుండె
కర్మభోగము, భోగంపు కర్మ-ఇదియె
యమలిన జడతాచేతనాహ్లాదనమ్ము.

తే. యజన మసహాయతను నొంటి నాచరింపఁ
గలవె? ఆ యూహ నర్థమ్ము గలదె? ఎచట
నాత్మ కర్షణరహితమౌ నచటఁ జేయఁ
జాలుదే యెట్టిక్రియను విస్తారముగను 50

తే. అణఁగిపోయెను నీ భార మందు ఎచట
నూఁత కన్వేషణము సేయ నొప్పిదముగ
ఏను సహచరినై నీకుఁ బూని ఋణ వి
ముక్త నౌదును పూర్ణసముత్సుకతను.

తే. సేవకౌ నా సమర్పణ స్వీకరింపు
మగును జుక్కాని యది నీ భవాబ్ధి యందు
స్వార్థమును వీడి నీ పదసరసిజముల
నేఁటినుండి జీవితము నంకితమొనర్తు.

తే. మాయను, దయను, మమతను, మధురిమమును,
గాఢవిశ్వాసమును నేఁడు గైకొను – మివె
వివృతములు నా మనోరత్న విమల నిధులు
నీ సమీపాన ననుభోగ్య నిచయములుగ.

తే. సృష్టిమూల రహస్యమ్ము వీవు కమ్ము,
వ్యాప్తి నొందు నా వల్లి నీ వలన నింక
కుసుమ సౌరభ మీ విశ్వగోళ మందు
నిండు రమ్య పుష్పక్రీడ నెగడు మయ్య !

***

తే. అబ్జయోని శుభ వరదా నార్ద్ర వచను
శ్రవణముల సోకలేదె – నీరంధ్ర మద్ది
“శక్తియుతుఁడవు కైకొమ్ము జయము నీవు”
ఇట్టి జయగీతి మార్మ్రోగు నీ జగాన. 55

తే. “ఓ అమృతసంతతీ! భయ మొప్పరింపు
మున్నయది వృద్ధి యెదుట శుభోజ్వలముగ
కెరలు కర్షణ జీవనకేంద్ర మెలమి
స్నిగ్ధ సర్వసమృద్ధి కర్షింపబడును.

తే. స్వర్గజనుల యసఫలతా ధ్వంసనమ్ము
కడఁగి ప్రోవిడి ప్రచురోపకరణములను

మానవశ్రీ గతినిఁ బడి మసలు చుండె
మతి సుచైతన్యరాజ్యమ్ము మల్లడిలుత !

తే. అమల చేతనారుచి రేతిహాసరచన
యఖిల మానవ భావసత్యమ్ము -అద్ది
విశ్వ మహనీయ మానసవీథు లందు
నంకిత మ్మగు గాక దివ్యాక్షరముల.

తే. అబ్ధులు జలాలఁ బూర్ణమ్ము లయ్యెనేని,
గ్రహములకు విరుద్ధగతులు గల్గెనేని
యనలనగములు చూర్ణితా లయ్యెనేని
సఫలతను జెందుఁగావుత స్రష్టసృష్టి.

తే. అగ్నికణముల వలె మానవాళియశము
గర్వహర్షాల జ్వలియించు కాల మగుత!
జల మహానిల వసుమతీ సముదయముల
వాని నధిగమించుచు నద్ది వరలుగాత! 60

తే. పొర్లి కడలి పల్మారు లుప్పొంగ నిమ్ము,
ద్వీప కూర్మాల మునుఁగుఁచు దేలనిమ్ము
వెదకుచు నుపాయసంహతి వృద్ధిఁగోరు
మానవుని శక్తి దృఢరీతి మనెడు గాత!

తే. పరిణ మించుత విశ్వదౌర్బల్య మమిత
బలముగా-దాని సవిలాసఫణితి నపజ
యంపు వ్యాపార మిఁక హసియింపఁజేయుఁ
గాత! శక్తికి సుఖగతి కలుగుఁగాత!!

తే. వ్యస్తము, వికలమును, నిరుపాయము నయి,
చెదరినట్టి శక్తి చపలా శీర్ణ వికల
కణములకు సమన్వయ మొగిఁ గలుగుఁగాత!
మానవత నిత్యము విజయమహిత మగుత" !! 63

# కామము (అనురాగము)

తే. “జీవనోద్యాన మధుమయ స్నిగ్ధసురభి !
అంతరిక్షపు టలలఁ బ్రయాణ మొనర
సల్పి శార్వరిలోఁదుదిజాము నందు
వచ్చి తెవ్వేళ నిటకు సవ్వడియె లేక.

తే. ఈవు వచ్చుటఁ జూచెనా యేమి పల్కఁ
గ్రొత్తలుగ నిప్పు డున్మాది కోకిలమ్ము?
నీరవత్వాన నలసతం గూరి ముగ్ధ
ముకుళములు ప్రీతిఁ దమ నేత్రములను దెరిచె.

తే. తమినిఁ గ్రీడగ ముకుళాన దాఁగు టీవు
చేరి నేర్పెడి వేళలో శిథిలసురభి
వలనఁ గల్గదె మసృణంపు బటల మవని?
అగును గాదా? నిజ మ్మెదో యనుము నీవు.

తే. పుష్పవసనాంచలమ్ములఁ బొలుపు మెరయ
నీవు సరసహాసమును లిఖించు వేళఁ
కొండయేరుల జలజల గొంతుకలతొ
నీవు మధురకంఠమ్ము జోడించినపుడు.

తే. ఎంత నిశ్చింత, యుల్లాస మెంత యున్న
వహహా! పిక కాకలీస్వన మందు-బలిసి
జీవన దిగంత గగనానఁజెలఁగి మారు
మ్రోగుచున్నది నవనవామోద మపుడు. 5

తే. చెలఁగి చాంచల్యమున నాఁడు చిత్రకార
శిశువు చిత్రించె నత్యాశ స్నిగ్ధరుచుల
మంజు జీవన నేత్రాళి మసకకాంతి
యుత మగు లిపి మనోజ్ఞమై యొదవఁజేసె

తే. తాల్చి మేలిముసుంగు లతాలతాంగి
దృష్టులను దెలిపాల పూఁదేనెఁ గురియ
మనుసుముంగిలి యా రసమునను నిండు-
దానికడ విశ్వవిభవ మంతయును లొజ్జు.

తే. ఆ సుమమ్ములఁ జిరునవ్వు లమరియుండె
వెడలె నిట్టూర్పులను దాని వెల్లువలుగ
ఆ కలవరము, గానమ్ము నమిత మధుర
క్రమ కోలాహల మపు డేకాంత మయ్యె.

తే. చిత్తమున నున్న మాటలఁ జెప్పు వేళ
నాశ విడినట్టి నిశ్వాస మాచరించి
యెదియొ యోజించెను మనువు - ఏమి యైన
నతని వాంఛాప్రగతి యపు డాగలేదు.

***

తే. "విశ్వనీలావరణమా! ప్రవృత్తిఁ గొన్న
నీవె దుర్బోధమవు గావు కేవలమ్ము
కాంతిఁ బూర్ణమ్ము లగు వస్తుగణము లేని
నయనయుగళికి నవకుంఠనమ్ము లగును.

తే. వరుణ శోభాత్త చలచక్రవర ! శశాంక !
చేతు వేల కలఁతఁ బ్రదక్షిణము నిట్లు?
చల్లఁబడినవి తారాప్రసవము లిచట
నతుల భవదసఫలతలో యన్నయట్లు.

తే. మత్తుఁగొని యూగుచున్నవి మంజునీల
కుంజములు - ఆగిపోలేదు కుసుమచరిత
నభము క్రిక్కిరిసినది గంధమ్ముతోడ
హిమకణాలె మరందమై యొసఁగుచుండె.

తే. రమ్యతగను ఏ యిందీవరమ్ము నుండి
సురభియుత మధుధార వాగురను బన్ను

నద్ది మానసషట్పది కమర నయ్యెఁ
బ్రణయ మోహినీ మధుర కారాగృహమ్ము.

తే. అణువులకు నెట శ్రాంతి లభ్యమగు! నివ్వి
యెంత కర్మవేగాన గమించుచుండె !!
ఉల్లసనము సజీవమై యొప్పు మెరయు !
నృత్యచాలన రుచిరమై నెగడుచుండు!!

తే. నృత్య సంకీర్ణ నిశ్వాస నిచయమాయ
యెంత మోహమయమ్ముగా నెసఁగ మెసఁగు
దాన వెడలి సమీర మనూనమంద
సూక్ష్మతలఁ బ్రాణులకు శాంతిఁ జొప్పరించు. 15

తే. రమ్యకాంతి నాకాశరంధ్రములు నిండె
ఇదియె సృష్టి గభీరమై యెసఁగుచుండె
స్పృహను వీడి కాంతితతి నిద్రించుచుండె
ఈ క్షణమ్మును నలసి రోదించుచుండె.

తే. ఈ మనోహర చంచలకృతులు నాట్య
హసనముల నొప్పు నిండి రహస్యములను
వానిపై వ్రాలు నా నేత్రపాళి, నవ్వి
ముందునకు సాగి, పయనమ్ము నొందనీవు.

తే. ఏను గనుచున్నయది ఛాయయేన? అద్ది
చిక్కుమాత్రమె యౌన? విశేషమైన
యన్యధనమెద్దియేని నీ యందమైన
యవని కాంతర మందున నమరియున్నె?

తే. ఎవర వక్షయనిధి, ఓసి, యెవర వీవు
నేను గుర్తింపఁ జాలనా నిన్నుఁగడఁగి
ప్రాణసూత్రాల చిక్కు విప్పంగ నాకు
సహకరించెడి యొక మహాసాధనముగ.

తే. మధుర మాధవ యామినీ మంజులాల
సాలకల దాగియున్న నక్షత్రమటుల
శూన్య మరుభూమిఁ బ్రవహించుచున్న మధుత
రాంత రోదకస్రోతమ ట్లమరె దీవు. 20

తే. మౌనముగఁ గర్ణపాళి ననూన మంజు
మధురధారను నింపెడి మాడ్కి నుంటి
వీవు–నీరవత్వఁపుఁ దెర కావలననె
మరొక, టెదొతమిఁ బలికెడి పగిది నుండె.

తే. అర్థి స్పృశియించినను మలయానిలమ్ము
నాదు సంజ్ఞనింకను నిద్ర ననుపుచుండెఁ
బులకరింతల నేత్రాళి మూసి–పిల్చు
చున్నయది తంద్ర నిపుడు సముజ్జ్వలింప.

తే. వ్రీడ యెంత చంచల – లీల విభ్రమమునఁ
దాల్చెఁదనదు ప్రావారకతతిని నొలసి
కానఁబడకయె తన మృదు కరజలేజ
ములను నా నేత్రముల నేల మూయు నిటుల?

తే. బుద్ధ మగు క్షితిజమునను బుట్టినట్టి
శుక్రుఛాయను శ్యామసంశోభి జలద
పంక్తి కిరణచయమను దుప్పటిని నుషసి
యటుల నిద్రించు నొక రహస్యమ్ముతోడ.

తే. వ్యాప్తినొందెను కిసలయావరణ మిదియె
కిరణచయమున మధురమౌ స్వరరవమ్ము
మొరయుచున్నట్లుగాఁదోచు ముగ్ధమురళి
రంధ్రముల నుండి కొంత దూరమ్ము నందు. 25

తే. "జీవనపు ధనకాంతి దర్శింతుముతెరు
తెరువు" మనుచు నున్నార లందరును నిచట
దర్శనార్థమ్ముగా వచ్చితం దొకండు
తానె యావరణముపోల్కి దడినిఁ గట్టె.

తే. అమిత కల్లోల భరితమైనట్టి తరఁగ
లందు మత్తిల్లి చరియించు నా సుశక్తి
కొలువగా మాని జ్యోత్స్నావకుంఠనమ్ముఁ
దీసి కన్పట్టనెంత సంతృప్తి యొదవు.

తే. ఫేనయుతమైన, పడగను విసిరికొట్ట
స్నిగ్ధమణిగణమ్ముల రీతిఁ జెదరి తోఁచె
మమతఁ బాడుచున్నట్టు లున్మత్తముగను
నిద్రఁ గూరెడిపగిదిని నెగడి తోఁచె".

***

తే. "రమ్యజీవన మధురభారమ్ము నెప్పు
డెద్దివచ్చినను తిరస్కరింపలేను-
సంయమ క్లేశ దమనసంచయము రూపు
నొంది చనుదెంచెనేని నే నుజ్జగింప.

తే. కనఁగలరె మీరు నక్షత్రగణములార !
యుషసి అరుణిమ మది యెంత యుజ్జ్వలమ్మొ
కడగి నింపుచున్నయది సంకల్ప మద్ది
ఇందు సందేహ మిసుమంత యేని కలదె? 30

తే. ఏమి కౌశలమది యెంత కోమలమ్ము?
అమృతసుషమ దుర్భేద్యమా? అరసినంత
నాదు నింద్రియములు చేతనత్వ మగునె
కడకు నా యోటమికిఁ దొలి కారణమ్ము.

తే. త్రావుచుంటిని, ఔను, నేఁ ద్రావుచుంటి
స్పర్శరసరూప గంధసంభరిత మైన
యట్టి దానిని-మధురోర్మిఘట్టనమున
నిస్వనము ప్రతిధ్వనులతొ నిండినదియె?

తే. పరఁగి యొక్క నక్షత్రరూపమున నాదు
స్వాప్నికోన్మాదము చెదరిపడెన? ఏమి

నిండుగ నవసాదమున నే నింపి మదిని
మలఁగుదున నిదుర నిపుడు మత్తుగొనుచు?"

తే. అంధకారంపు టూర్మికలందుఁ జేత
నత్వ మిదె జారిపోవుచున్నది క్రమాన
మనువు రజనిని చివరి యామమ్మునందు
ఘనమయిన యోజనలలోన మునిఁగినాఁడు.

తే. సృష్టి యా దూరమం దున్న క్షితిజమందు
స్మృతుల సంచితఛాయగా నతులరూప
మొందినది – శ్రాంతి యేకడ నుండు హృదికి
సంచలత నిజమాయ జరించు నిద్ది. 35

తే. ఈ సుజాగృత జగతి విస్మృతినిఁ జెందె
సాగుచుండె స్వప్న సుఖసంచార మిపుడు
ఆ మనువు – నెడఁదను గుతూహలము పుట్టి
యయ్యె నది మంజు లీలా గృహమ్ము పగిది.

తే. అలసతను వ్యక్తి యోచించినపుడు చేత
నత్వ మిబ్బడి మేల్కొన్న నయము నొందు
నెదియొ దహననిస్వనమును నిపుడు మనువు
వీనులను స్వచ్ఛముగ విప్పి వినుచునుండె.

తే. "దప్పిగొనియె యున్నాఁడ నే నిప్పటికిని
తృష్ణ తీరదు – లేదు సంతృప్తి నాకు
వ్యసన బాహుళ్యమున వచ్చె, నద్ది పోయె
తృష్ణ కల్పశాంతియును లభింపలేదు.

తే. అనుదినము సేయు నస్మదీయానుశీల
నమునఁ ద్రిదశులసృష్టి వినాశమొందె "
ఆగ లే దతిచార మావంత యైన
నందరిని మహోన్మత్తత యాక్రమించె.

తే. “నన్నె యెవ్వేళఁ గొలుచుచు నున్నవారు
నే నొనర్చెడి సంజ్ఞయే నియమమయ్యె
అస్మదర్థ మైన ఘనమోహము సృజించె
నమరజన విలాసపు వితానాళివలచి. 40

తే. స్మరుఁడ నేనె వారికి సహచరుఁడనైతి
నెనసి వారి వినోదసాధనము నైతి
నవ్వుచును నుంటి నవ్వించుచుంటి నేను
వారి కృత్రిమజీవమ్ము పగిది నుంటి”.

తే. ఎవతె యాకర్షణమయి హసించు నింతు
లందు నది రతి ఆద్యమౌ వ్యసన మద్ది
ఉన్న దద్దాని యిచ్చ సముజ్జ్వలముగ
యమరు నవ్యక్తముగ ప్రకృత్యంతరమున.

తే. అమ్మహాప్రథ మావర్తనమ్ము నందు
నుండె నస్తిత్వ మొక్క మా యుగళమునకె
ఒదవె నీ సృష్టిరూప మందుండి – అందు
నర్తనము సల్పు మూర్తు లనారతమ్ము.

తే. పుష్పవతి ప్రకృతిలతా ప్రఫుల్ల యౌవ
నమున మాధవు మధుహసనమ్ము విరిసె
నద్ది సృష్టింపఁగా గల్గె నపుడు తొల్త
మధుర రూపద్వయమ్ము సమాహితముగ.

తే. జడతఁ బోఁద్రోలి యా మూలశక్తి యంత
నిలిచినది లేచి – యద్దాని నియతరాగ
వృత్తి గ్రహింయిచుచును బరుగెత్తుకొనుచు
వచ్చి చేరిరి పరమాణుబాల లపుడు. 45

తే. అంతరిక్ష మధూత్సవ మందు మెరసి
యుదిత విద్యుత్కణమ్ము లన్యోన్యముగను
గూర్మిఁ జల్లిన కుంకుమక్షోద మటులఁ
గౌఁగిలింతకుఁ ద్వరపడుకరణిఁ గలిసె.

తే. రమ్య మాధురీచ్ఛాయఁ బ్రారంభమయ్యె
నొప్పు నాకర్షణమును, సంయోగ మపుడు
చెప్పెదరు దాని నందరు సృష్టి యనుచు-
మత్తురా లయ్యె నది నిజమాయ యందు.

తే. నయముననునపుడు ప్రతివినాశ మొదలి
చెలఁగి విశ్లేషణమున సంశ్లిష్ట మొందె
సృష్టి రూపొందె మాదకవృష్టి కురిసె
నొదవి ఋతుపతి-యింట సుమోత్సవముగ

తే. శైల గళముల భుజల తాశ్లేషములను
దమి నొనర్చి నదుల్ సనాథమ్ము లయ్యె
అయ్యె వ్యజనమ్ము పుడమి కబ్ధ్యంచలమ్ము
ద్వయములకు నిట్లు కలయిక వరలె నపుడు.

తే. మే ముభయులము నపుడు జన్మించినాము
మొగ్గగా నంకుర మటు-లానందపరవ
శుల మయితిమి, నూతన సృష్టి సుమవనాన
విరిసితిమి మందపవమాన వీచికలను. 50

తే. ఆఁకలిని దప్పిఁ బోలి మే మపుడు మేలు
కొన్నవార మిచ్ఛాతృప్తిఁ గొన్న యా స
మన్వయమున - నైతిమి రతీమన్మథులము
స్నిగ్ధచిరయౌవ నోజ్జ్వల సృష్టియందు.

తే. రతి సురాకాంతలకు సఖీరత్న మయ్యె
తరుణ లయ యయ్యె వారి హృత్తంత్రులందు
రాగభరితమై మధుమయరతియె వారి
యెదలఁ గల చిక్కులను సవరించుచుండె.

తే. చెలఁగి తృష్ణను విరియఁగా జేయ నేను
వారి కాయమ తృప్తి నొప్పారఁ జూపె
మహిత మయ్యె నానంద సమన్వయమ్ము-
వారి నడిపించితిమి మేము వలసినటుల.

తే. అమరులే లేరు–వారల యా సుభోగ
గుణవిలాసము లే, దనంగుఁడను–చేత
నత్వ మొక్కటే యున్న – దస్తిత్వమునకుఁ
దిరుగుచుంటి – సంచితకథాసరణి యిద్ది.

తే. నిత్యరమణీయ కృతులకు నీడ – మిద్ది
కమ్ర విశ్వము – కర్మరంగస్థలమ్ము
ఎవరి కెంత బలమ్మున్న నిచట నంత
గను వసిం త్రిదియును క్రమ గతిని దోఁచు. 55

తే. సాధనామాత్రులై యున్న జన మనంత
సంఖ్య నున్నవా రవ్వారు చతురిమమున
మొనసి యారంభ పరిణామములకు నేయు
చుంద్రు రమణీయ సంబంధ సూత్రములను.

తే. ఇంద్ర నీలాంబరాన వ్యాపించు నుషసి
రమ్య కాశ్మీర ఘుసృణవర్ణమ్మ దేమి?
ఎన్నడేని దానినిఁ దిలకించినావె
వర్ణములఁ బొల్చు జలదడంబరము నందు?

తే. రేబవళ్ళను విభజించు లీల నిద్ది
ఇద్ది కర్మసాధనను వ్యాపింపఁ జేయు
నమల మాయా వినీలాంచలమున నిద్ది
చెలఁగి యాలోకధార వర్షించు నెపుడు.

తే. మలయు ప్రారంభ వాత్యోద్గమమ్ము వంటి
వాఁడ నా వలననె సృష్టి ప్రగతి జరిగె
మానవుని శీతలచ్ఛాయ మామకీన
కృతిని మోహనముగ సంస్కరించుకొరకు.

తే. వ్యసన సంయమోచిత జంతు వర్తనముల
స్వచ్ఛవికసన యొదవె జీవనమునందు
కామభావనము ప్రళయకాలమందు
నాశమగుటకుఁ బూర్వ మున్నతి వహించె. 60

తే. క్రమ సృష్టి కెద్దాన వికాస మబ్బె
నద్ది ప్రణయము- వినిపింప నర్థి దాని
మధురసం దేశ ముజ్జ్వల మహిత శక్తి
యొకఁడు వచ్చెను బ్రకృతిలో నునికిఁ గొనఁగ.

తే. దంపతుల మైన మాకు సంతాన మదియె
అది మనోజ్ఞము నత్యమాయకము నౌను
రమ్యవర్ణాళి వలచి ఖేలనమొనర్చు
సర్వ మోహన మధుపుష్ప శాఖ యద్ది.

తే. పరగు జడ చేతనములకు బంధ మదియె-
అద్ది భ్రమపరిక్రమపాళి కగును రమ్య
తమ పరిష్కార-మగును శీతలత శాంతి
సహిత జీవితోష్ణ విచారసమితి కద్ది.

తే. "పడయఁగా దాని నాకాంక్ష వరలెనేని
యోగ్యతావాప్తి కింక నీ వుదియఁగొనుము"
అనుచు నాకస్మికమ్ముగా నాస్వనమ్ము
మూకతను జెందె నాయెడ మురళివోలె.

తే. అంత మనువు కన్నుల విప్పి యడిగినాఁడు!
"మమ్ము నచటికిఁ జేర్చెడి మార్గ మెద్ది?
ఎవ్వరేని యా జోతిర్మయిని నెటువలెఁ
జేరఁగాఁ గల్గెదరు దేవ! చెప్పుమయ్య!" 65

తే. ఎవరు లేరు సమాధాన మిచ్చువారు,
భగ్నమయ్యె విలక్షణస్వప్న - మతఁడు
పరపి నేత్రాళి సుందర ప్రాచ్యదిశను
గనియె రసపూరి తారుణ గాఢసుషమ.

తే. జమిలి మెఱయ వల్లీ నికుంజములలోన
రమ్యముగ నాడె హేమాభరశ్మి యపుడు
నిల్చియున్నది మను కరనీరజముల
దేవతా సోమరససుధా దివ్యలతిక. 67

# వాసన (అనుబంధము)

తే. భ్రాంతి వివశత నడచుమార్గమ్ము తప్పి,
యంపు నెఱుఁగని పథికుల యటులఁ దోఁచు
హృదయములు రెండు కలియఁగా నిచట దీర్ఘ
పయన మారంభమొనరించె నియతి నెపుడొ.

తే. ఆ ద్వయమ్మున గృహమేధి యైన నొక్క
రతుల విగతవికారంపు టతిథి యొకరు
ఒకరు ప్రశ్న యైనను మరి యొక్క రౌదు
రుజ్వ లోదార మైన ప్రత్యుత్తరమ్ము.

తే. ఒకరు జీవనసింధు వై యొప్ప నొక్క
రగుదు రమల మోహన విలో లాల్పలహరి
పరగ నొక్కరు నవ్యప్రభాత ఫణితి
నత్యనర్ఘ ఘర్మకిరణ మౌదు రొకరు.

తే. గాఢ వర్షాజలోద్దామ గగన మైన
నొకరు రెండవవా రౌదు రుదిత కిరణ
రాగ రంజిత లక్ష్మీ విలాసగరిమ
మేళనముఁ గొన్న మంజుల మేఘరవము.

తే. ద్వీపవతి కట నవ్వలి తీరమందు
క్షితిజసీమను మలి సంజ చెలఁగు జలద
ముజ్జ్వలోజ్జ్వల మధురిమ యుత్సహించి
యాడుచుండెను చపలాద్వయమ్ము తోడ. 5

తే. చేతనాశక్తియుతము లై చిరము నచట
పాశములు రెండు ఘర్షణపడుచు నుండె
అం దొకటియు రెండవదాని నధిగమించి
పట్టి నిలుపఁజాలదు తన వాగురులను.

తే. గ్రహణసంబంధి సునిహిత లలితభావ
మొండు కలదు సమర్పణ నొత్తగిల్లి
ప్రగతి గన్పట్టుచున్నది బంధురముగ
అయిన నట నెపు డాటంక మడ్డగించు.

తే. మృదుమధుర జీవనక్రీడ మిలమిలలను
బరుగుచున్న దయ్యేకాంత పథము నందు
అపరిచితు లటు పయనించు నా ద్వయమ్ము
కర్థి నియతి సంయోగమ్ము నభిలషించె.

తే. నిత్య పరిచయ మెంత యున్నిద్ర మైన
నిదియు కాన్పించు నవశేష మించుకంత
అతి నిగూఢ విశేష రహస్య మెదియొ
యపుడు దాగియున్నది మానసాంతరమున.

తే. అమిత సంకీర్ణ కానన ధ్వాంత కాంతి
నయనగతి నడ్డుకొనుచు ననారతమ్ము
దూరదూరమ్ము వోవుచుఁ దోఁచురీతి
వార లన్యోన్యమున్నారు దూరముగనె. 10

తే. పాసి సర్వతేజమును విభాకరుండు
తొలఁగుచున్నాఁడు కల్లోలజలధి యందు
జలదపటలాన కిరణసంచయము మెఱసి,
పనిసి, వేవేగఁ గ్రమమున మునుఁగుచుండె.

తే. మోసగింపఁగఁ బగటినిఁ బూనుకొనియె
నలసి నిజకర్మలో సహస్రాంశుఁ డపుడు
ఇంచు గీతమ్ముతో డఁ జాలించె నంత
షట్పదము ప్రసూనరస సంచయనక్రియను.

తే. ధూసరిత మౌట దీనతఁ దోఁచుచున్న
గగనవాటికఁ గ్రమ్మెను కాళిమమ్ము
అంతి మారుణకాంతి యత్యంత విభవ
హీనముగ నా తిమిరమున లీనమయ్యె.

తే. అపుడు కరుణాప్రపూర్ణదృశ్యమ్ము నొక్క
డీ దరిద్రమేళనము సృజించుచుండె
శోకసంభరితార్తితో కోకయుగళి
విడిచి నిజ నీడమును విడివడియె నంత.

తే. మహితగతి నిప్పుడును ధ్యానమగ్నుఁ డగుచు
మనన మొనరించుచున్నాడు మనువు–అతని
శ్రవణములు నిండియున్నవి ప్రసవశరుని
దివ్య మహనీయ మంజు సందేశగరిమ. 15

తే. ఇట గృహమ్మునకు నధికారేద్ధ మైన
యుపకరణ వస్తుసముదయ మొప్పుమీరె
అఖిలసస్యాళి, పశుతతు, లన్యవిభవ
ములను సంపాదనము సేయు పొలుపు మెరసె.

తే. అతిథి హృద్గత మంజులాద్యతనకాంక్ష
మనువు నాకర్షణము సేసె మహితశక్తి
న య్యతిథి సేయు సంకేత మమితరుచిని
సరళ శాసనమై మించి సాగఁదొడఁగె.

తే. మనువు కౌతూహ లాయత్త మతిని నిలచి
యగ్ని శాలాంతరమ్మున నరయసాగె
నచ్చెరువుతో స్వతంత్రమౌ నాత్మవిధి
లీల క్రమమున సాగెడురీతి నెల్ల.

తే. ఉజ్జ్వల మ్మొహోహో! ఇది యొక్కమాయ!
అతిథి వెంబడి యొకపశు వరుగుదెంచె
కరుణతోడ విమోహమ్ము కడగి మెరసి
నది యపుడు సజీవముగ సనాథముగను.

తే. చపల కోమలహస్త మా సత్వవపువు
నిమిరె సర్వాంగకముల – నున్మిషత మైత్రి
నెత్తి నిజ వాల మద్ది యాడించు చప్పు
డామె వెనువెంట నుద్గ్రీవ మగుచు నమరె. 20

తే. లలితముగఁ బులకిత రోమరాజి నొప్పు
జలదరింపు శరీరాన నవదరించి
యంతఁ బశువు ప్రదక్షిణం బాచరించి
యతిథిచుట్టును వలపన్నె నక్కజముగ.

తే. అది యమాయక నేత్రాళి నతిథిమోముఁ
గనుచుఁ గనువాని కనుల కగ్గలిక గలుగ
సకల సంచితస్నేహ ప్రసాద భరము
దృష్టి మూలమ్ముగాఁ గ్రుమ్మరించె నపుడు.

తే. అతిథి యొనరించు లాలనయందుఁ దోఁచు
స్నేహశబలి తోత్సాహ సుస్నిగ్ధ గరిమ
మంజు మమతా ప్రపూరిత మానసాబ్జ
బహుళ సద్భావ చిహ్నమై పఱగుచుండె.

తే. అటుల వీక్షించుచునె యుండ నతిథి, పశువు
సన్నిహితులై సృజించిరి సరళ రుచిర
మధుర ముగ్ధ విలాససంపత్తి పొదలఁ
బ్రణయ మాధుర్య ఘనరసపారణమ్ము

తే. అట్టి రాగవిభూతి యీర్ష్యానిలమున
వ్యస్తమయ్యెను చిందరవంద రయ్యె
మరియు నారిన యీర్ష్యాగ్ని వరకణాళి
జ్వలితమయ్యె స్ఫులింగచయమువోలె. 25

తే. కాని యిది యేమి? ఈ రీతి గళము నొక్క
విషపుగుటక ఈ యెక్కిళ్లు వెడలు టేమి?
ఎవరు కల్గించుచున్నారు హృదయమందు
నిద్ధ వేదనామయ మగు నీర్ష్యనిటుల.

తే. అహహ! ఈ పశు! వింతటి యద్భుతంపుఁ
బరమ రమణీయ మోహన ప్రణయ మిద్ది
ఏ నొసంగు నన్నమునఁ బోషింపఁబడెడు
నీ ద్వయమ్ము నిత్య మిట నీ యింటియందు.

తే. నేనొ, ఎక్కడున్నాడనో నే నెఱుంగ
తృప్తి సర్వులు దమపాలు తీసికొనుచుఁ
బ్రాప్యముగ నాకుఁ దుచ్ఛవిరాగ, మహహ,
విసరివైచుచు నుందు రెవ్వేళఁ గనఁగ.

తే. ఎన్ని హృదయాల నిటుల భంగింపఁ గోరె
దోసి నీచకృతఘ్నుతా! ఉండి యిటుల
పిచ్ఛుల కిలా సుసంలగ్న విపుల జటిల
మలిన శైవాలపటలమ్ము మాడ్కి నీవు.

తే. అపహరించి హృద్రాజస్వ మంత నాచ
రించుచునె నాకు బహుళాపకృతులు వీరు
చోరులై వ్యథ యొదవని సుఖము లెల్లఁ
బడయఁగోరుచున్నారు నా వలన నెపుడు.

తే. విశ్వ మంతట నెలకొన్న విబుధలోక
వరమహైశ్వర్య విభవసర్వస్వ మిపుడు
నాది – ప్రతిదాన మీవలె నాకు నిఖిల
చయము, వాంఛింతు నిదె మనసార యేను.

తే. నిత్యము నశాంతికలిత మై నెగడు నాదు
జ్వలిత బాడబ పావక జ్వాల నెపుడు
శీతలమ్ముగ ననురక్తిఁ జేయవలయు
సర్వమును సింధులహరికాజాల మటుల.

తే. చపల శైశవోపమ సువిస్మరణ భార
వహన యగుచుఁ గ్రీడాశీల వచ్చె నతిథి
యా కడ కుదార మృదుపద న్యాస విభవ
బంధురతతోడ –అంతటఁ బలికె నిటుల

తే. "ఈవు ధ్యానమగ్నుండ వై యేల యిటుల
నిప్పుడును గూరుచున్నాఁడ విచ్చమెయిని,
కన్ను లెద్దాననో నిల్పి కనుచునుండె
శ్రవణములు వినుచున్నవి రక్తి నెదియొ.

తే. చిత్త మే సీమయందొ వసించుచుండె
ఏమి జరిగిన, దీ రీతి యేమి నేఁడు!"
శాంతి నొందెఁ దృప్తమగు నీర్ష్యాఫలమ్ము
అతిశయమ్మగు నావేశ మణఁగిపోయె. 35

తే. అమల కోమల కాంత హస్తాళి నతిథి
శీతలస్పర్శఁ దనువు స్పృశింపసాగె
అట్టి రూపమనోజ్ఞత నర్థిఁ జూచి
యపుడు మనువును నొకకొంత యుపశమిల్లె.

తే. మనువు పలుకంగ సాగె ని మ్మాడ్కి "అతిథి!
ఎచట నజ్ఞాతముగ వసియించుచుంటి
వీవు ఏ సహచరుఁడ నీ కిప్పు డెడఁద
నెదియొ సులభభవిష్య మూహించుచుంటి.

తే. అమృతగంభీరమును మహితార్ద్ర మైన
చిరతర స్నేహసంప్రాప్తిఁ జెందియున్న
నిప్పు డీ స్థితి యేలనో-ఎరుకపడదు!
ఏ నభీరుఁడ నగుచుంటి నేల యిటుల?

తే. ఎవరవో నీవు న న్నిప్పు డిటుల నీదు
వంక కాకర్షణము సేతు వనిత! ఏను
స్వయముగను నిన్ను వాంఛించు సమయమందుఁ
దొలఁగిపోవుచునున్నావు దూరమునకు.

తే. ఓసి జ్యోత్స్నా స్రవంతికా! యుత్సహించి
నేడు నా దృష్టి నీ యెడ నిలుపదేమి?
అర్థి నిను గమనించినా నన్న నమ్మ
కమ్ము నిపుడు కోల్పోయిన కరణి తోఁచు. 40

తే. లతికలును, వీరుధమ్ములు రమ్యఫణితి
దాన మొనరించుఁ గాంతి నెద్దాని కిప్పు
డట్టి శోభాసులలిత రహస్య మెదియొ
తరుణి! నీలోన నిబిడమై దాగియుండె.

తే. సకలమున పశువునను, బాషాణమందు
నృత్య నవమంజు నిస్వన మిమిడియుండె
అందరను దన్వి, ప్రీతి సానందముగను
గడcగి పిలుచుచున్నది యొక కౌcగిలింత!

తే. శాంత సంచితప్రణయ మశ్రాంత మిపుడు
పృథులరాసుల గాగ వ్యాపించియుండె
అట్టి వలపును గైకొని యప్పుగాగ
నిదియె దీనజగము సంతరించుచుండె.

తే. అమృతమోహన! అరుణమేఘాళి సజల
చారుసచ్ఛాయల దినాంతసమయ మందు
లలిత లతికా మనోహర లాస్య లీల
ఏను వీక్షించుచున్నాcడ నిచ్చమెయిని.

తే. సహజ మోహన ఘన విలాసమ్ముతోడ,
సరసధీర పదన్యాస చతురిమలతో,
మంజుగతులను వచ్చె నా సంజయందు
మధుర మాధవయామినీ మానినియును. 45

తే. ఏలనో యెవ్వరు నిపు డియ్యెడను గనcగ
మహిత విధ్వస్త సురుచిర మందిరంపు
దీనమును శూన్యమును నైన కోణమున వ
సించి సమ్మర్ద మొనరించు టెరుకపడదు.

తే. స్థిరనివాసమ్ముగా దానిc జేసికొనియె
మాయ–ఏమి యీ సుఖనిద్ర? మాన్యగతుల
చారు హిమధీర నవ్యహాసమ్ము మించి
మెఱయుచున్నది గుణసమున్మేషమునను.

తే. సరస భోగవిలాస సుచ్ఛాయ! స్వస్థ
మధురశక్తి సువిశ్రామయా! మనోజ్ఞ
మానసనివాస సౌందర్య మంజుప్రతిమ!
ఎవరవు? ఛవిధామనువు, నీ వెరవవోసి!

తే.	కామనా మయూఖంపు టుద్గాఢ సుషమ
యెవరికడ మించి రక్తి దీపించుచుండె,
విభ్రమన్మానసము దేని వెదకుచుండె,
నట్టి నీ వెవ్వరవొ? యోసి అతిథి మిన్న!

తే.	ఫుల్లకుంద సుహాసవిస్ఫూర్తి నీదు
స్మితము లావణ్యమును విరజిమ్ము దెసల
పరఁగి మన్మనో రుద్ధకవాట మటుల
యేల తెఱువంగఁబడి రహియింప దిపుడు" 50

***

తే.	అంత నవ్వుచు నిట్టుల ననియె నతిథి
"అతిథిని – మదీయ మైనట్టి యధికపరిచ
యమ్ము వ్యర్థము దీనికై యార్తితోడ
నింత యుద్విగ్నుఁడవె మును పెన్నడైన.

తే.	జలద లఘుఖండ వాహనాస్థాని యగుచు
సరల హసన మనోజ్ఞుఁడై చంద్రుఁ, డడుగొ,
వచ్చుచున్నాఁడు కను మదె, వలచి మనలఁ
బిలచుటకె యిటు పదవోయి కలఁత వీడి.

తే.	సకల తిమిరము క్షీణింపసాగె నంత
విమలతర రోచు లెల్లెడ విస్తరించె
నిభృతమౌ నీ యనంతాన విలచి లోక
మెల్ల సంతసమ్మున వసియింపసాగె.

తే.	శార్వరీ ముఖ విద్యోత శస్త్రమహితు
శీతకరుని సుధామయ స్మితముఁ జూచి
నిఖిలజనులు కల్పిత దుఃఖనిచయ మెదల
మఱపుఁగొందు రియ్యెడ విసుమానమునను.

తే.	ఉన్నతమ్మైన శిఖరమ్ము వ్యోమరేఖఁ
జుంబనము సేయ యత్నమ్ముఁ జూడుమయ్య!

అంత్యకిరణము వసుమతియందుఁ బొరలి
యస్తమయ మగుచున్న, దయ్యదియె, కనుమ! 55

తే. ప్రకృతి సుస్వాప్నిక ప్రౌఢపాలనమును,
రమ్య సాధనా మోహన రాజ్యరమను,
పద, అమేయ మధుర విభా భరితమైన
కౌముదిని జూచివత్త ముద్గాఢరతిని.

తే. సృష్టి హసియింపఁ గడఁగెఁ బ్రహృష్ట యగుచు
వలపు వికసించె లోచనపాళికలను
ఉదిత రాగరంజిత యౌచు నొప్పె జ్యోత్స్న
ప్రసవములు వెదజల్లెఁ బరాగధూళి".

తే. మనువు–హస్తమ్ముఁ జేపట్టి మమత యొదవ
హసన విస్ఫూర్తిఁ జెలువొందె నతిథి – అంత
నిరువురును స్నేహపాథేయ మిచ్చుఁ గొనుచుఁ
దరలి నడచిరి స్వప్నపథమ్ము వట్టి.

తే. పారిభద్ర నికుంజ గహ్వరము లిప్పు
డన్నియును సుధాస్నాతమ్ము లగుచునుండె
సలుపుకొనుచుండె నవ్వేళ సకల మొలసి
యుజ్జ్వలముగ జాగరణరా త్ర్యుత్సవమ్ము.

తే. పుష్పరస సిక్త మాధవీ పుణ్యగంధ
వీచికావళి దిక్కుల విరియసాగె
మధువు సేవించి మత్తెక్కి మారుతములు
మిట్టిపడుచున్న వొకదాని మీఁద నొకటి. 60

తే. ధీరయామినీ ఛాయాశరీర మిపుడు
శిథిలమై యంత నలసతఁ జెంది, తివిరి
యతుల మంజు తుషార శయ్యాంతరమున
దీర్ఘవిశ్రాంతిఁ గొనుచు నిద్రించుచుండె.

తే. ఛాయచే నెద్ది కల్పించుఁ జారు కుతుక
మట్టి రమణీయ కుంజమ్ము నందుఁ దవిలి
హృదయభావన యిప్పు డహీనగతిని
భ్రాంత మగుచున్నయది యనురక్తిఁగొనుచు.

***

తే. అంతటను మను వీ రీతి ననియె "అతిథి!
ఎన్నిమారులో చూచితి మున్ను నిన్నుఁ
బరగి యపు డింత సౌందర్యబంధురతను
నిండి కన్పట్టగా లేదు నీవు నాకు.

తే. అప్పు డున్మత్త మేఘమాలాళి నాదు
వర విలాస గీతులె ప్రతిస్వన మొనర్చె
దీని స్పృహణీయ సుమధురాతీత మైన
యట్టి నా పురాజన్మమం చనఁగ వలెనె!

తే. ఎట్టి దృశ్యమ్ము మరచి నే నిట్టు లైతి,
చేతనాహీనుఁడ నదియె చెలఁగి మరల
సిగ్గుతో నవ్వు చివ్వేళఁ జేయుచుండెఁ
గ్రీడగా రమణీయ సంకేత మొకటి. 65

తే. "ఏను నీవాఁడ నై నాఁడ నిప్పు" డన్న
దృఢతరం బైన భావమ్ము తీంద్రమగుచు
భవ్య మామక చేతనా పరిధివోలెఁ
జక్రగతిఁ బరిభ్రమియింపసాగె నతిథి!

తే. చలిత సుకుమార చంద్రాంశు సముదయమ్ము
మధువు వర్షించుచుండె నమందముగను
అమరెఁ బవమాన మందరోమాంచితమ్ము
ఇచ్చ మధుభార మెసఁగి చరించుచుండె.

తే. మెలఁగుచున్నావు నీవు సమీపమందుఁ
బ్రాణము లి టేల నే దధీరతను జెందు?

ఎట్టి సౌరభమొంది ఘ్రాణేంద్రియమ్ము
తృప్తినొందుచు నున్న దియ్యెడను మివుల?

తే. అలుకc గొన్నావు నీ వని యాత్మలోన
వ్యర్థసందేహ మేలనో పరcగుచుండె
తీర్పcగా నీదు నలుకను దివురుc గోర్కె
అయిన నే నసమర్థుండ నగుచునుంటి.

తే. నాడులందు బహుళ వేదనమ్ము వోలె
నిండి క్షితిజప్రవాహమ్ము నెఱియc బారు
ఎడcద లఘుహారమును వహియించి కంప
నమ్ము నొందుచుc దోచు స్పందనము కలదు.

తే. చేతనత మోహన మ్మయి చెలcగుచున్న
బహువిలాస కీలాళికా పరిధియందు
పరమసౌఖ్య మనోజ్ఞానుభవము నొంది
హర్షమున మత్తరాగమ్ము నాలపించు.

తే. ఒప్పి యగ్నికీటము వలె నుత్సుకతను
కాలుచునె యది జీవించి కాcనcబడును
ఒడలిపై బొబ్బ కనుపింప దొక్కటేని
దానిలోc దోcచ దియ్యెడ దాహగుణము.

తే. విశ్వ కుహక మాయా ఘనవిభవ మిటుల
మూర్తిcగొన్నట్లు కన్పట్టు ముగుద! అర్థిc
బ్రాణశక్తిరహస్యమ్ము పగిది మెఱసి
యించు సుకుమారతను నొప్పె దెవర వీవు?

తే. బడలికను జెంది యున్నట్టి పాంథు నటుల
హారి భవదీయ సుచ్ఛాయ యందు నిలచి
యలసటను దీర్చుకొనుచున్న దతివ! యెడcద
యెసcగు నిట్టూర్పులను తన్వి! ఎవర వీవు?

తే. శ్యామ నభమున మధుకిరణాళి మాడ్కి
సింధు సుందర ధీర వీచికను బోలి
సరస మలయజ మధువిలాసమ్ము పగిది
మరల మృదుహాస మద్దియే పరిధవిల్లు"!! 75

***

తే. మంజు కుంజాంతరమ్ములఁ గుంజరించు
నట్టి యరవిరి పగిది నయ్యదను నందు
నతిథి పలుకఁగా సాగె అ య్యమృతభాష
మనువు గాఢానురక్తితో వినుచునుండె.

***

తే. "మహిత కల్లోల భరిత మున్మాద యుతము
నగుఁచుఁ గన్పట్టు మానసమం దతృప్తి
భయదభంగాళిఁ బోలు నుచ్ఛ్వాసకలిత
భాషణము! సఖ! ఏమియుఁ బలుకవలదు.

తే. ఎద్దియే నడుగంగ నీ విచ్చగింప
వలదు – కనుమ యా తారకావల్లభుండు
మంజులత, స్తబ్ధముగ, గాఢమౌనమునను
నొప్పి యుపవిష్టుఁడై యెట్టు లున్నవాఁడో!

తే. బహుత రైశ్వర్య, యున్మత్త ప్రకృతి దాని
స్నిగ్ధ నీలావరణ ముండె శిథిలముగను
ప్రచురరీతుల వెదఁజల్లఁబడియె నందు
శుభ్రలాజలు మంగళసూచకముగ.

తే. రాసులెత్తిన చందానఁ బోసి పోసి
శార్వరీ తామ్ర శుభవర్ణ చరణ సవిధ
సీమ నమల తారాళితోఁ జెలఁగుచున్న
యది నిరంతరమును గుసుమార్చనమ్ము." 80

***

తే. క్రమ యామినీరూపము న్గడగి మనువు
కనుచు నున్నకొలంది యగ్గలిక మెఱసి
దాని యతిశయ మోహనోదార సుషమ
విస్తరించుచు నవరూప విసరణమున...

తే. స్వచ్ఛముగ ననంతముగ నత్రశాంతముగను
గురిసె మదిరాకణమ్ములు కొసరి కొసరి
రమ్యముగ, మధురముగఁ దారాడఁ దొడఁగె
గిలుబుకొంచు 'సంయోగసంగీత' మపుడు.

తే. పరఁగి యుత్తేజనములు నుద్భ్రాంతముగను
నైన వహ్నికణమ్ము లత్యంతముగను
వెల్వడఁగఁజొచ్చె మనువు - హృద్వీథి నుండి
లీల మధురమౌ జ్వాల జ్వలించుచుండె.

తే. మనము వికల మశాంత మై మల్లడిల్లె
కలిగె నావేశ మొక సుడిగాలి వోలె
చెదరి వలఁగొను మను-మనస్సీమలోన
లేశమాత్రము ధైర్యమ్ము లేకయుండె.

***

తే. కరము గ్రహియించి యున్మత్తుకరణిఁ బలుకఁ
గడఁగె న య్యెడను మనువు "కనుచునుంటి
నవ్యమధురిమ నెనయు సౌందర్య మిపుడు
అదియెమోహన సౌందర్యమగును, చెలియ! 85

తే. కాని యీ విభ్రమ మ్మేమి? కలఁత వడుచు
నొడ్డెఱుంగ కధీరత నొంది, అయయొ
స్మృతి-మహానౌక వికలమై యిపుడు తిరుగు
చున్నయది విస్మృతి యనెడి యుదధియందు.

తే. క్రమ సుమకోమలాంగి యౌ 'కామబాల'
యొక్కతె 'జనన-సహచరి' యుండె నాకు

ఆమె నామమ్ము మధురమ్ము అద్ది శ్రద్ధ
ప్రాణతతి యామె వలననే పడయు శ్రాంతి.

తే. ముగ్ధ మకరంద సౌందర్యమూలము లగు
ఫుల్ల నవమధు రామోద పుష్పములను
నెల్ల వేళల నామె కేనిచ్చుఁ గలసి
యర్పణము సేయుచుంటి నర్ఘ్యమ్ము గాగ.

తే. లీలఁ బ్రళయమునను మిగిలితిమి మనము
పొందెదఁ బునస్సమాగమానంద మిపుడు
శూన్య జగతీ ఘనోత్సంగ శుభ్రతలిని
నొలయు కలయికకు మిగిలియుంటి మిచట.

తే. నిబిడనీహారమును దాటి నిరతిశయత
విమలకౌముది వలె బయల్వెడలి వచ్చె
రమ్య తారకారత్న హారము గ్రహించి
నింగిఁ బ్రణయ శశాంకుఁడు నిలచియుండె. 90

తే. కుటిల కుంతల విసరానఁ గూర్తు వీవు
భయదకాల మాయాజాల పటల మిటుల
నయన నీలిమ తోడ నానన్య శక్తి
నల్లుచున్నావు తామిస్రహార మిపుడు.

తే. అమిత దుర్భేద్య తిమిరనిద్రాత్తభూతి
నిదియె వెదజల్లుచుండె నీ దృష్టి నేఁడు
వ్యాప్తమగుచున్న దిపుడు స్వప్నమ్ము వోలె
నమల చంచల భవదీయ హాసస్పృష్టి.

తే. సాధనాస్ఫూర్తి నీయందుఁ జతురగతిని
నిలచి కేంద్రీకృతమ్మయి వలపునించు,
సౌకుమార్యమ్ము సర్వమ్ము సంహితించి
మూసవోసిన కామినీమూర్తి వీవు.

తే. ఏను దినమంతయు బరిశ్రమించి యున్న
పూషుఁ బోలుచు వర్తిలు పురుషవరుఁడ!
శిశువు వలె-నేటివఱకును జిక్కకుంటఁ
దెరువు-విభ్రాంతి లోఁగొనఁ దిరుగుచుంటి.

తే. ఈవు విశ్రాంతి నొసఁగు రాకేందుబింబ
కాంత చంద్రికా విసరమ్ము కరణి నొప్పి
విజయినివి వోలె, మాధుర్యవీచి వోలె
సరస వౌచుఁ దోఁచెదవు ప్రశాంతముగను. 95

తే. సస్యసంపత్తి వెల్గొందు శ్యామభూమిఁ
బాదదళితమ్ము నాక్రాంత బంధురతను
నమితమును నయి శాంతితో నంతమొందు
వర మహాయాసమును గొన్న వ్రజ్య యటుల.

తే. అహహ! ఏమియో!! యీ గతి నగుచునుండె
మామకీన మనఃపరిణామ మిపుడు!!
మానసజలేజ మర్పించి మమతఁ దవిలి
యేను నా కామ్యమును గ్రహియించుచుంటి

తే. విశ్వరాజ్ఞిరో సౌందర్యవిభవరాశి!
గురుత రోజ్జ్వలరస జగద్గౌరవమ్ము
చేతనోపేత మైనది, స్నిగ్ధమధుర
మీ సమర్పణమును స్వీకరింపుమమ్మ"

తే. చెలఁగు వలపున శిశిర నిశీథ మందు
తత నవ తుహిన భారానతమ్ము గాన
వ్యోమ తరువును మంజుల ధూమ లతిక
సోలు చధిరోహణము సేయఁజాలకుండె.

తే. పురుష నర్మోపచారముల్ పొంది యంత
సంకుచిత యౌచు నొప్పె నా శ్యామలతిక
రమ్య సౌకుమా ర్యాత్త భారమును గొనఁగ
వంగె నాయమ వ్రీడా శుభాంగి యగుచు. 100

తే. అట్టి స్త్రీత్వ మూల సుమధురానుభవము
హాసనమొనరించు వడువున నంతఁ దోఁచె
ప్రీతి యొదువఁగ నెదలోనఁ బెంచుచుండె
నధికతర మైన యభిలాష నపుడు కడఁగి.

తే. మధుర లజ్జా సుశబలిత మహిత చింత
నొలయు నుల్లసనమ్ముఁదా నొప్పఁ గొనుచు
నర్థిఁ గావింపఁ దొరకొనె హర్షకూజ
నమ్ము రుచిర మహానందనర్తనమును.

తే. నయనపక్షము లపు డవనతము లయ్యె
నాసికాగ్ర మొకింత వినమ్ర మయ్యె
భ్రూలతిక నిరాతంక విస్ఫురణ మొప్పఁ
బొందె వ్యాప్తి యాకర్ణాంతముగను అంత

తే. లలిత లజ్జ శ్రవణకపోలముల నొనర
స్పృశన సేయఁగా సాగె సంప్రీతి తోడ
ఫుల్ల కాదంబ కుసుమాళిఁ బోలి వలపు
పులకరించెను గాద్గద్య మొలసె వాణి.

తే. అయిన - నాయమ మనువుతో ననియె నిట్లు
"మహిత మీ నాఁటి దగు నీ సమర్పణమ్ము
చెలఁగునా స్వామి! ఇఁక స్త్రైణచిత్తమునకుఁ
బరమ శాశ్వత మై నిల్చు బంధనముగ. 105

తే. అహహా! దుర్బలురాల నే నైతి-దేని
ననుభవింపఁగ నాదు ప్రాణాళి, దేవ!
వ్యాకులతఁ జెందుచున్నదో యట్టి నీదు
దానమును స్వీకరింపగాఁ దరమె నాకు!" 106

# లజ్జ (అవరోధము)

తే. “లలిత కోమల కిసలయాంచలము నందు
నొక్క చిఱుమొగ్గ యొగి దాగియున్న యట్లు
ధూమలపటల ముగ్ధ గోధూళివేళ
దీపికాజ్వాల యుమిసెడి దీప్తు లట్లు–

తే. మించు మంజుల స్వప్న విస్మృతిని జెలఁగి
చిత్తవిభ్రమ తీవ్రతఁ జెంది నట్లు–
వాసనా వీచికా చ్ఛాయ పరగి మెఱయు
బుద్బుదఁపు సౌరు కడు వ్యాప్తిఁ బొందినట్లు–

తే. అర్థి మాయావిసర్పణ మమరఁ జేయు
నధరబింబాన నంగుళి యందగిల్ల
నమల వాసంత కౌతూహ లార్ద్రజలము
నేత్రయుగళినిఁ బొలుపార నిలిపి నెలఁత!

తే. ప్రౌఢ పరిరంభ మంత్రమ్ము పలుకు పగిది
చాచి కోమల కరపాళిఁ దోఁచె దీవు
రవ విహీన నిశీథాన లతిక వోలె
నిటుల నరుదెంచు చుంటి వీ వెవర వతివ!

తే. పుష్పధూళీ మరంద విస్ఫూర్తి నెగడు
నింద్రజాలసుమాళి రచించుచుంటి
విటుల తలవంచి మాలిక నిపుడు నీవు
అందు నుండి జాల్వారు మరందధార. 5

తే. పులకిత కదంబమాలిక పొలసి మెఱయ
నిదె మదీయ హృదిపయి ధరింపఁజేతు
వాత్మఫలభార బహుళభయమ్ము వలన
నా మనశ్శాఖి యిటు లవనతినిఁ జెందు.

తే. నీలికిరణాలు పొసఁగించి నేసికొన్న
వసనమును నీవు పరచెదు వరము వోలె
అహహ! అద్ది కనఁగ సౌరభాళి నెనసి
యెట్టి వలిపమ్ముగాఁ గనుపించి యించు.

తే. సిక్థ కముతోడ నంగముల్ సేయఁబడెనె?
కోమలతను శరీరమ్ము గొనఁబుఁ గొనియె
అతిశయముగఁ గుంచితను నా యందె నేను
విమల పరిహాస గీతి నే వినుచునుంటి.

తే. తరళహాసమ్ము స్మితముగాఁ బరిణమించు
నక్షియుగమున నొదవె నపాంగవీక్ష
అన్నిటిని జూచుచుంటిఁ బ్రత్యక్షముగను
కాని స్వప్నమ్మువలె నెల్ల కానుపించు.

తే. నా కలరవజగమ్ము స్వప్నమ్ము నుండి
కనులు తెఱచి సమస్తమ్ముఁగ నెడివేళ
మించి యనురాగ మంజు సమీర నిచయ
దివ్యపంక్తుల గర్వాన తిరుగువేళ–

తే. ఆ సుఖమునకుఁ బలుక సుస్వాగతమ్ము
అమలజీవన పృథు వైభవాళిఁ, బెద్ద
కాలమునకు వచ్చినదాని గౌరవింప
యౌవ నోజ్జ్వల, యభిలాష యరుగుదేర–

తే. దేని నాలంబనమ్ముగా నూని యేను
రసతరంగిణి మున్గి యాహ్లాదశిఖరి
కెక్కుచున్నానొ యద్దాని యా సుకిరణ
రజ్జువును జుట్టఁజుట్టితి వుజ్జగించి.

తే. ఎదియొ సంకోచమగుచు స్పృశింపఁ దలఁప
పక్ష్మముల వీక్షణకు నడ్డుపడుచు నుండు
అమల కలరవయుత పరిహాసవాణి
యధరములఁ జేరి యంతట నాగిపోవు.

తే. ఒనర రోమాళి సంకేతమును నొనర్చు
నన్ను నాటంకపరచు మౌనముగ నిలిచి
భ్రూకుటీ కాళరేఖికా పూర్ణరుచులు
తెలియఁబడియెడి భాషయై యొలసె నపుడు.

తే. ఇటుల స్వాతంత్ర్యమును సంగ్రహింతు వీవు
పడఁతి! ఎవర వస్మ న్మనఃపరవశతవ!
జీవనోద్యానమున వికసించి తావి
దొరయు స్వచ్ఛంద సుమపాళిఁ ద్రుంచె దీవు." 15

తే. నవ్వుచును నవసంధ్యారుణమ్ము మాడ్కి
దానినే దేహముగఁ గొన్న తత్త్వ మొదవ
రమణియపుడు ఛాయామూర్తి లలితగతిని
శ్రద్ధ కీగతి బ్రత్యుత్తరమ్ము నొసఁగె

తే. "ఇంత చకితవు కాఁబోకు మింతి! నీదు
మనసు కుపకార మొనరించుకొనుము సుంత
ఆగు మొక్కింత తలపోయు మనుచుఁ దెలిపి
యాపుదల సేయు నడ్డంకు నౌదు నేను

తే. గగన చుంబి తుహిన శృంగకముల నుండి
కలరవోదిత కల్లోల గతులతోడ
నవనవోల్లాస మంజు లోన్మాదమునను
జంచలా ప్రాణధార నదించుచుండె.

తే. పొలయు నం దుషఃకాంతిని బోలి మెఱయు
స్నిగ్ధ మంగళ కుంకుమ శ్రీరజమ్ము
కులుకు నడలను గనుకట్టి కొమరుమిగిలి
భవ్య హరితము వోలు సౌభాగ్యగరిమ.

తే. ఆ మనోజ్ఞతఁ గనెడి నేత్రాళి కయ్యెఁ
గమ్ర కల్యాణ మహనీయ కారణమ్ము
హ్లాదకుసుమము వికసించె – నద్దిఁ దోచె
గుణిత వాసంత కాకలీ కోకిలముగ. 20

తే. స్నాయువుల మధుస్వన మూర్ఛనమ్ము వోలె
నట్టి మధురిమ ప్రతిరుతు లాచరించు
అద్ది నేత్రమ్ములను మూసలందుఁ జొచ్చి
ముగ్ధ మోహన బహురూపములు ధరించు.

తే. నేత్రనీలిమ యను లోయ నిండి దాని
రసజలడ మచట మనోహరముగ నుండె
అంతరాళ శీతలతకు నద్ది శీత
లత నొసంగెడి చంచలాగతిని తోఁచె.

తే. అమరుఁ డగు ఋతురాజ నాహ్లాదగరిమ,
మధుర గోధూళి వేళా మమత్వ, ముదయ
కాల జాగృతి, మధ్యాహ్న గాఢతలును
నిండియున్న వా యౌవన నిరుపమమున.

తే. చకితయై తన ప్రాచీదిశా గృహమ్ము
విడి హఠాత్తుగ వచ్చిన వెన్నెలటుల
మానసోర్మికలను జేరి పారిపోవు
నమల కౌముది వలెనుండు యౌవనమ్ము.

తే. అట్టి తారుణ్యమున కీయ స్వాగతమ్ము
ననఁగ వికసించె సుమనపత్రాళి యపుడు
స్వాగతార్థపు కుంకుమ చందనములఁ
గడఁగి మకరంద మయ్యది కలుపుచుండె. 25

తే. పల్లవమ్ముల మర్మరధ్వనుల తోడఁ
బెల్లు వినుపించు నద్దాని విజయఘోష
ఆత్మసుఖదుఃఖతతి యపు డందొనర్చె
నమృత గతుల నానందోత్సవములు వలచి.

తే. చేతనోజ్జ్వల వర మది– చెప్పుకొంద్రు
దాని నెల్లవారలును సౌందర్య మనుచు
బహుళకాంక్షలు, సురుచిర స్వప్నములును
నందు మేల్కొను, మించు ననంతములుగ.

తే. అగుదు దాదిని చపల యౌ యౌవనమున
కేను-నేర్పెద గౌర వాహీన గరిమ
తగుల నున్న యెదురు దెబ్బఁ దలఁచి యామె
కేను మెలమెల్లగను నెరగించుచుందు.

తే. ఏను రతిరాజ్ఞి నా దేవసృష్టి యందు
విభుఁడు సుమబాణు వలన వివిక్తనైతి
ఏ నిషేధంపు మూర్తినై యిప్పు డుంటి
దీననై - సంచితాసంతృప్తి యెనయు నను...

తే. అనుభవమ్మునను నతీతమైన దైన
నా సఫలతను బోలి యున్నాను మిగిలి
స్మరవిలాస దుఃఖిత, సలసటను గొన్న
దాని, శ్రమదళితను బోలుదాన నిపుడు. 30

తే. ఏను లజ్జనుఏఁ బ్రతికృతిని రతికి
నేను శాలీనతాలీల నేర్పుచుందు
మదము నొందిన సౌందర్యపదము నందు
నూపురముగ నల్లుకొనుచు నాపుచుందు.

తే. రాగరక్తిమనై కపోలముల యందు
నక్షియుగళికి నయ్యెడ నంజనమ్ము
గాఢ కుంచిత కుటిలాలకములఁ బోలి
మానసమున నేను మెలినై మసలుచుందు.

తే. తమిని జంచల శాబ సౌందర్యమునకు
నాచరించుచుందును రక్ష యనయ మేను
శ్రవణముల కెల్టుఁదనము నొసంగఁజాలు
చిఱుత మెలినినై యపుడు నేఁ జెలఁగుచుందు."

***

తే. "ఔను, సరియె, కానిమ్ము నా యమలజీవ
నంపు పథ మేమొ తెలుపఁగన్నా వె నీవు?

సృష్టి నిబిడ నిశీథాన నెద్ది కాంతి
మయ మనోజ్ఞ మోహన దివ్య మంజురేఖ.

తే. తెలిసికొనఁ గల్గినాను దుర్బలత వలచి
కూడియున్నట్టి స్త్రీ నని నేఁడు నేను
అందరికి నోడినాను నా యంగకముల
నమరు సుందర కోమల తాత్త గరిమ. 35

తే. కాని తనయంతఁ దానె నా మానసమ్ము
చెంది శిథిలత యిట్లున్న దెందువలన?
నీలి మొయిలుల ముక్క లట్లేల నిండి
యున్న దయ్యెడ నీరు నా కన్నులందు.

తే. చారు విశ్వాస ఘన తరుచ్ఛాయ యందు
నఖిల మర్పింపఁగా వలె ననుచు, నచట
మౌనముగ నుండవలె నంచు మనసుపడుచు
మమత జాగృత మగునేల మాయలోన?

తే. క్షీరపథమునఁ దారకా క్షీణ కాంతి
వోలె మిలమిల మను "మధులీల" యనఁగఁ
జిత్తమునఁ గోమలము శ్రమాయత్త మగుచు
నభినయించు టేలనొ యమాయకత యెపుడు!

తే. ఏ నిరాధారముగఁ బర్యటించుచుంటి
నీ మనో– గాథముల యందు నెపుడు నిటులె
జాగరణమును గోర నీ స్వప్న సౌఖ్య
మందు నెన్నఁడేనియును నే నాదరమున.

తే. ఇదియె స్త్రీ–జీవనచరిత్ర? ఇదియె యౌనె?
అస్ఫుట మగు రేఖాసీమ యందు నింతి !
నీవు వికలతావర్ణమ్ము నింపు చిపుడు
కళ కొసంగుచునుంటి వాకారగుణము. 40

తే. నిలువఁబడెదరు, ఆగెద వలచినటుల
కాని యోజనఁ జేయఁగాఁ గడఁగఁజాల

వెట్టిదానివలెను నుపవిష్ట యగుచు
నా యెద నెవతో ప్రలపిం చనారతమ్ము.

తే. ఏఁ దులనమొనరింప యత్నించినప్పు
డెల్లఁ దూచఁగాఁబడుచుంటి నేనె-ఏను
నరతరువునకు భుజలతఁ బిరిగఁ జుట్టి
యాగు- టెండల నెవ్వేళ నూగుచుందు.

తే. ఈ సమర్పణ మందున నేమి కలదు?
ఒక్క త్యాగమ్మె కనఁదోఁచుచుండు నెపుడు
అఖిల మర్పింతు గ్రహియింప నణువునైన
నిదియె సరళముగను దోఁచు మదికి నెపుడు.

తే. "ఉవిద ! ఏ మని పల్కుచునుంటి వీవు !
చాలు - నీ సుసంకల్పాశ్రు బలము తోడ
జీవితంపు స్వర్ణస్వప్న శేవధులను
డొలుతనే దానమిచ్చితి కలికి! నీవు.

తే. రమణిరో! కేవల మ్మీవు శ్రద్ధ- వీవు
కడఁగి విశ్వాస రజతనగ పదజలము
నందు జీవన సమత లాత్యంత భూమి
నెనసి సురశై వలిని వై నదింపు మమ్ము! 45

తే. సమర మత్యంత తీవ్రమై సాగు నమర
జన జయములకు, దను జాపజయములకును
అనయమును బ్రవర్తిల్లు మానసాంతరమున
గాఢ మౌచు వైరుధ్య సంఘర్షణమ్ము.

తే. అశ్రుకణసిక్తమైన వస్త్రాంచలమున
నుంచవలయు నెడందలో నున్న దెల్ల
మధుర దరహాసరేఖతో మగువ! నీవె
ఈ సుసంధిపత్రమును లిఖింపవలయు" 47

# కర్మ (ఆచరణ)

తే. కర్మసూత్ర సంకేతమ్ముకరణి వరలి
మనువునకుఁ దోఁచె మహితసోమలత–అద్ది
సజ్య చాపశింజిని యనఁ జాలియుండె
మనువు కర్షించె జీవనధనువు మరల.

తే. అతఁడు విడిచిన బాణమ్ము గతిగ–నదియె
మార్గమున నగ్రసరుఁడయ్యె–మందరముగ
నంత "యజ్ఞము, యజ్ఞము" అనెడి కటుకు
కేక వినుట స్థిరత నుండలేకపోయె.

తే. శ్రవణయుగళి నిండె బ్రసవశరుని పలుకు
కలిగె నవ్యాభిలాష హృజ్జలజ వీథి
మనువు యోజింప దొడఁగెను– మంజు రంజి
తమగు నాశ పొంగులువారె తరిమి తమిని.

తే. అంత సోమపాన ఘనదాహమ్ముఁ గొనిన
రమ్యలాలస లోభవర్తనము నొందె,
దీన జీవితవైభవోత్సేక మందు
నుండియుండె నౌదాసీన్య మొలసి, బలిసి.

తే. పవన మది ప్రతికూల మై పరగి నపుడు
తరణి లోతులకుఁ దిరిగి యరుగునటుల
జీవితపు టవిరామ సుస్నిగ్ధ సాధ
న మపు డుత్సాహమున నిల్చి కొమరుమిగిలె. 5

తే. శ్రద్ధ పలికిన పోత్సాహరమ్య వచన
ములు గుసుమశరప్రేరణ కలిసి భ్రాంతి
నావగింజ గుమ్మడికాయ యైనయటులఁ
గల్పనముఁ జేసి ముందుకుఁ గదలివచ్చె.

తే. ఒలసి సిద్ధాంత మద్ది రూపొందుఁ దొలుత
నంత దాని కెలమిఁ బుష్టి యగుచునుండు
బుద్ధి యెల్లర కడనుండి పొంది యట్టి
ఋణము నెల్ల వేళలను బూరించుచుండు.

తే. స్వమతముగ మన సెపుడు నిశ్చయముసేయు
నొక్కదాని దానికి బుద్ధి యొలసి దైవ
బలముచే నెపుడు ప్రమాణములను బడయఁ
గడఁగి యెన్నెన్నొ స్వప్నాలఁ గనుచునుండు.

తే. పవన మెప్పు డయ్యలలె కల్పనముసేయు
జలమునం దెద తరలత్వ మొలయు నెపుడు
వ్యాప్తినొందు నభోవీథి నంతరాత్మ
సేయు నదియే ప్రతిధ్వని పాయ కెపుడు.

తే. తర్కశాస్త్ర మెయ్యెడను దాఁ దరతరములు
తివిరి యద్దానినే సమర్థించుచుండు
“ఇదియె క్రమమైన సత్యము ఇదియె సౌఖ్య
మునకు నున్నతికిని నైన మొదటి మెట్టు. 10

తే. ఒక్క శబ్దమ్ము వైన నీ వోసి సత్య
మా! అతిగహనరూపాన నమరినావు
ప్రౌఢ శేముషి నిజ కేళి పంజరమున
రమ్యముగఁ బెంచుకొన్న కీరమవు నీవు!

తే. నిఖిల విషయాల నీదు నన్వేషణమ్మె
యల్పమగు నొక పునరుక్తి యటుల నుండె
కాని తర్కహస్తస్పర్శ కలఁగినంత,
ఔను అగుచునున్నావు నీ “వత్తపత్తి !”

తే. కష్టముల నెన్నొ భరియించి కడగి పూర్వ
మా మహాజలప్లావమ్ము నందుఁ బ్రదికి
రిరువు రసురపురోహితుల్ – తిరుగుచుండి
రాకులియు కిలాతుండును ననెడివారు.

తే. మనువుకడ నున్న పశువును గనుచు నెపుడు
నామిషమునేచ్చ గొన్న యా యసురరసన
వ్యాకులతను జంచలతను బడసి యపుడు
పలుకుచుండె నెదియొ నేత్రపాళి తోడ.

తే. ఏమిరా, కిలాతుఁడ! తిని తృణము లిటుల
నెంతకాలము నేను జీవింతు? నెంత
కాల మీ సజీవ పశువుఁ గనుచు నుందు?
త్రావు టెన్నాళు లిట్టి "రక్తంపు-గ్రుక్క"? 15

తే. భక్షణముసేయు దీని నుపాయ మొక్క
టెదియుఁ గన్పించుటయె లేద ఇంతవఱకు?
బహుదినమ్ముల పిమ్మటఁ బరగ నొక్క
సారియైన నే మొరయింతు సౌఖ్యవీణ.

తే. అప్పు డాకులి యీరీతి వనియె "ఏమి
దాని వెనువెంట నెవ్వేళఁ గానుపించి
సరస మసృణమమత్వంపు ఛాయ యొండు
నవ్వుచుఁ జెలంగు నీకుఁగానంగఁబడదె?

తే. తరిమికొట్టుచు నున్న దాంధ్యమ్ము నెల్ల
నది ఘనాలోకకిరణచయమ్ము పగిది
అర్థి ఛేదించు లఘుమేఘ మటుల మించి
యనయమును నాదు మాయ నయ్యది రహించి".

తే. "ఐన గానిమ్ము పద! ఎదొ యాచరించి
గాని నేఁడు స్వస్థుఁడను గాలేను నేను
ఎన్ని దుఃఖము లట వచ్చె నేని వాని
నన్నిఁటిని సహించెద సునాయాసముగను."

తే. ఇటుల నాలోచనము చేసి యిరువు రపుడు
మనసు లగియించి ధ్యాననిమగ్నుఁ డయిన
మనువు కూర్చుండి యోజించు ఘన నికుంజ
వాటికా ద్వారసీమకు వచ్చి రెలమి. 20

తే. “కర్మయజ్ఞమ్ము సేయఁగాఁ గల్గు రమ్య
జీవితస్వప్న దేవతా స్నిగ్ధభూమి
ఇట్టి విపినమ్మునసె వికసించుచుండు
మానస మనోజ్ఞ కాంక్షాసుమాళి యెపుడు”.

తే. “కాని యెవరు పౌరోహిత్య మూనువారు–
నాకుఁ గల్గిన దిప్పు డీ నవసమస్య
ఏ క్రమమ్మునఁ గ్రతువుఁ గావింపవలయు?
విపుల మీ మార్గ మిపు డెటు వెడలినదియొ”

తే. శ్రద్ధ! ఈమె పుణ్యప్రాప్య!! సర్వ మీమె
నా యనంతాభిలాష! న న్బాయ దెపుడు
మరి, మదీయాశ యెవని నీ మహిత నిర్జ
నమున వెదుకఁ గలదు సవనమ్ముఁ దీర్ప?

తే. ఆననమ్మున గాంభీర్య మతిశయింప
నంత మనువుతోఁ బల్కి రి ట్లసురహితులు
“ఎవరి కొఱకు యజ్ఞము జరిగింప నుంటి
వారె పంపింప నిచటికి వచ్చినాము.”

తే. యజన మొనరింపఁ దలఁచినావా? యెడంద
నిట్టి యన్వేషణము మరి యెవరికొఱకు?
ఏమి? అరెరె, నీ వొక పురోహితునిఁ గోరి
యెన్ని కడగండ్ల నోర్మి సహించినావు! 25

తే. “ఈ జగాన రాత్రింబవ ళ్ళింపుమీర
నెవరి ప్రతినిధులై ప్రకాశించు చుండు
నంధకారము నాలోక మమరి యెవరి
ఛాయ లగు నట్టి వరుణభాస్కరులె నేఁడు...

తే. ఆ ఘనులె, మార్గదర్శకు లగుత నాకు
పొలసి నా క్రతువిధులు సంపూర్తి యగుత !
కదలు ఒక నా యజనవేదికను బిసాళి
తమిఁ జెలంగుత జ్వాలాప్రదక్షిణములు.

తే. అవి పరంపరాగత సుకర్మాళి కైన
యందపు నేమలికొక్కెములై పొసంగు
జీవనపు సాధనకు సుఖ స్నిగ్ధ ఘటిక
లందుఁ గలసియున్నయవి యత్యంతముగను.

తే. పులకపూరితములును సంపూర్ణ సౌఖ్య
దములు నౌ మాదకస్మృతితతులె యగుచు
నందుఁ బ్రేరణామయివోలె ననయ మెన్నొ
కృత్యములు సంచితములైన రీతిఁ దోఁచు.

తే. అధ్వరము సేయఁ బోఁద్రోల నౌను నిర్జ
నత్వ భూరి యౌదాసీన్యతత్త్వమమరు
వర్తనమున మధురతీవ్రత, యొకించు
కగఁ జమత్కృతి, యుత్సవగాఢలీల. 30

తే. శ్రద్ధ కిద్దానివలనఁ బ్రశస్తమైన
యొక విశిష్ట సుకౌతుక మ్మొదవఁగలదు
నవ్యతాప్రలోభి యగు మానసము చేయ
సాగె నపుడు నృత్యమ్ము ప్రసన్నముగను.

***

తే. అధ్వర మది పరిసమాప్త మయ్యె-అయిన
నెగసి పవనాగ్ని కీల జ్వలించుచుండె
దారుణంపు దృశ్య మట నేత్రముల కొదవు
క్షతజ బిందువులును! అస్థిఖండములును!!

తే. వేదికను నిర్మమత్వము వెలయఁ దోఁచె
సుప్రసన్నతయు, పశువు శ్రుతమొనర్చు
కాతరమునైన వాణియుఁ గలసి తోఁచె
నెదియొ కుత్సితప్రాణి వసించు తెఱఁగు.

తే. సోమరసపాత్ర యుండె విస్ఫూర్తి నిండి,
ఉంచఁబడియె పురోడాశ మొప్ప నెదుట

శ్రద్ధ యటలేదు మనుమహాశయుని సుప్త
భావము లవెల్ల మేల్కొన్న పగిదిఁ దోఁచె.

***

తే. దృప్తవాసన బలిసి గర్జింపసాగె
"ఎవరి యుల్లాసము సముజ్జ్వలింపవలెనొ
వేరుగా నామె యట నుపవిష్ట యయ్యె
ఎందులకు నిది యెల్ల? మరెందు కిద్ది.

తే. చెలఁగి మజ్జీవితంపు సంచిత సుఖమ్ము
రమ్యరూపమ్ము నొందె నీ రమణియందు
నట్టి యామెతో నెట్టు లే ననఁగలాఁడ
'నీవు నా దాన' వంచు నా యెదను విప్పి."

తే. సఖియ ఆమె కాలేదు ప్రసన్నురాలు
శుభ్ర మెదొ రహస్య మ్మిట సునిహితమ్ము
ప్రాణములఁ బాసి యాయజ్ఞ పశువు సౌఖ్య
మునకు నాటంకమగుచుఁ దా మనునొ యేమొ!

తే. అలిగినది శ్రద్ధ – ఇప్పు డే నయిన నట్టి
యలుక సవరించి తేర్చఁగా వలసియున్నె?
మానమును వీడి యామెయే మార్గమునకు
వచ్చునా? లేక ఏ నెట్లు మెలఁగవలయు?

తే. అంత మనువు పురోడాశ మారగించి
సొగియఁగా మానసము త్రావె సోమరసము
ప్రాణసంచయ రిక్తాంశపాళి నెల్ల
మాదకత్వమ్ముతోడ నింపఁగను సాగె.

తే. స్నిగ్ధతా ముగ్ధ మౌ గిరి శృంగ వీథి
సంజవేళను ధూసర చ్ఛాయలోన
గగన మలిన శశాంక రేఖను ధరించి
యపుడు చెన్నొందియుండె దిశాంతమందు.

తే. శ్రద్ధ చేరెను శోకభారాన మరల
నపుడు నిజ శయన గుహాగృహమ్ములోన
ఒక విరక్తిభారము మ్రోయుచున్న యట్లు
మించి తనలోనఁ దా విలపించు చుండె.

తే. సన్ననౌ శుష్కకాష్ఠంపు సంధియందు
ననలశిఖ యొండు జ్వలియించు చా గృహానఁ
దనదు విస్పష్టకాంతితోఁ దమము నెల్ల
దూర మొనరించుచుండె సంతుష్టి మెరసి.

తే. కాని శీతల పవనోర్మికలకు నద్ది
యొక్కపరి తగ్గిపోవుచునుండె–నొక్క
పరి జ్వలించుచునుండె నవ్వానివలన–
అయిన నద్దాని నెవ రెటు లాపఁగలరు?

తే. శ్రద్ధ తన మృదువైన చర్మమ్ము నపుడు
పరచుకొని, దానిపైన మైమరచి యుండె
ఆమె యున్నది శ్రమమృదులాలసత్వ
మొంది విశ్రాంతిఁ గైకొనుచున్న యటుల.

తే. మహిత విశ్వమ్ము నిజ ఋజుమార్గ మందు
నడచుచుండెను మెలమెల్లఁ గడగి–తార
కలకుఁ గ్రమమున నొదవె వికాసగరిమ
కట్టఁబడె మృగములు శీతకరురథాన. 45

తే. శార్వరీ సుందరీమణి జారవిడిచెఁ
దనదు జ్యోత్స్నామనోజ్ఞ వస్త్రాంచలమును
పొలసి యద్దాని నీడలోఁ బొందుచుండె
పరమ వేదనామయ సృష్టి బహుళసుఖము.

తే. హిమమహీధరోచ్చయ శృంగకముల యందు
నవ్వుచుండెను బ్రకృతి చంచల లతాంగి
తనదు ధవళహాసమ్మును దనరఁ జిమ్మి
స్నిగ్ధ సుషమల వ్యాపింపఁ జేయుచుండె.

తే. చెలఁగు లజ్జాయుతమ్మైన జీవితంపు
మంజులోద్దామ లాలస, మరియు నొక్క
తీవ్రతరమైన యున్మాద తీక్షణత్వ
మాత్మ నెవ్వేళ మథియించునట్టి యార్తి.

తే. స్వాదువౌ విరక్తి గొలువ వరలు నాకు
లతను నిండెను హృదయతారాపథమ్ము
అయిన నయ్యెడ స్నేహంపు టంతరాగ్ని
యర్థి జనియించుచునె యుండె నాత్మలోన.

తే. తెరచికొనుచు మూసికొనుచు నరయ భీష
ణతనుబొలిచె నా యసహాయ నయనయుగళి
కుటిలకటుత నిల్చినది సంకటము గదుర
సరస సుస్నేహపాత్ర స్పష్టముగ నేఁడు. 50

***

తే. "ఎంత దుఃఖ మెడంద నే నెవరి వలతు
నతఁడు రూపొందినాఁడు నే దన్యరీతి
లీల మన్మనశ్చిత్రిత లేఖనమ్ము
లౌర! సుందరస్వప్నమ్ము లయ్యె నయ్యొ!

తే. మధుర మగు నీ పృథు మనోజ్ఞ మధువనాన
జాగృతమ్మయ్యె దారుణజ్వాల యిపుడు
ఎటుల చల్లారునో యిది యెఱుకపరుప
నేర్తు రెవ్వరీ నీరవ నిర్జనమున.

తే. అపరిమితము ననంత మీ యాకసమ్ము
ఏ ప్రవేదనా నీడమై యెలయు నద్ది
అలసతా రక్తిమలనిండి యస్మదీయ
నేత్రవిశద పక్షముల నున్నిద్రమయ్యె.

తే. వ్యాప్తినొందిన నీరవత్వమ్ము కరణి
ననిలుని పదాలు కంపిల్లు నటుల నుండె

నభమునందున దశదిశాంతరములందు
మలినమగు నుదాసీనత మసలె నిండి.

తే. అతిశయ విదాహ మది వికలతను గలసి
యచటఁ బెంపొందుచుండె హృదంతరమున
యుగయుగాల యసాఫల్య మొలయు నద్ది
వడసి యవలంబనగఁ బైకి ప్రాకుచుండె. 55

తే. నిజ విషమతాపగరిమ నీ నిఖిలవిశ్వ
మర్థి నాతంకత్రస్తత నంత వీడె
బహుళమైన యంతర్దాహభరము వలనఁ
బెల్లుగా నీలిమమ్ము వ్యాపించుచుండె.

తే. ఉజ్జ్వలోద్వేలితమ్మయి యుండె నుదధి
వ్యాకులతను దొరలుచుండె నలలగములు
చక్రవాళంపు సురుచి రాస్పష్టరేఖ
కమలిపోవుచు నున్నట్లు కానుపించు.

తే. క్రమ్ముకొన్న పెన్పొగల కుండమ్ములోన
నెటుల నటియించుచున్న దీ యిధ్మ కీల?
తిమిరమను ఫణి గాఢరక్తిని తదీయ
హారి మణిమాల ధరియించె ననఁగ నుండె.

తే. పరమదుఃఖ దమసమాన భావమునను
నీ జగమ్మెల్ల నేఁడు రోదించుచుండె
దారుణంబగు నిర్మమత్వమ్ము కపట
పెడఁద నిలువు నిలువున భేదించుచుండె.

తే. తమిని జీవిత నిష్ఠుర దంశనముల
వ్యాకులత్వ గుణోపేతమైన పీడ
కన్నుదోయికిఁ గ్రీడయై కడఁగ నేఁడు
నాట్యమొనరించు పాపసంచయము పగిది 60

తే. పిలువఁబడుచుండె భ్రమ యనుపేర చేత
నా సుకౌశల స్ఖలన మనారతంబు
దాని యొకబిందువున విషాద నదచయము
పొంగి ప్రవహించుచుండె విస్ఫూర్తి గదుర.

తే. అదియె యపరాధ! మహహ!! అయ్యదియె విశ్వ
దుర్బలత్వపు మాయ! అతుల వసుంధ
రా వివర్జిత మాంద్యమ్ము రాగసంచి
తోజ్జ్వల ధ్వాంత సుచ్ఛాయ! ఒహొహొ, అదియె!!

తే. నీల హాలాహలమ్ముతో నిండి యున్న
చంద్రుఁ డను కపాలమిదె హస్తమున నుండె!
ఈ నిమీలిత తారలందెంత శాంతిఁ
ద్రావి యీగతి నున్నాఁడ వీవు, దేవ!

తే. పాన మొనరించుచున్నావు బహుళ విశ్వ
గరళమును నీవు - జీవింపఁ గలుగు సృష్టి
మరల- నిత్యశీతలత యీ మాడ్కి నీకు
వచ్చుచున్న దింతగను నే వంక నుండి?

తే. అచలము ననంతమగు వీచికాళి మీద
నాసనమువేసి కూర్చుంటివయ్య స్వామి!
శ్రమకణమ్ముల పోల్కి తారకల నిటుల
నిదె యొడలినుండి జార్చె దీ వెవరవయ్య! 65

తే. అలసి నడకల వచ్చినా రరుగొ, దేవ!
పాలపుంతను నక్షత్ర పాంథవరులు:
రమ్య భవదీయ చరణ నీరజములందుఁ
గర్మకుసుమాంజలుల నుంచఁ గడఁగినారె?

తే. అయిన వారికి దుర్లభం బైన నీదు
స్వీకృతి లభించెనా? లేదు- వెడలుడంచు
నిత్యమును వచ్చు భిక్షుకనిచయ మటుల
ఫలవిహీనతఁ ద్రిప్పి పంపఁబడుచుండ్రి.

తే. ప్రఖర నాశన శీలమౌ వర్తనమున
వరలుచున్నది విపుల విశ్వంపు మాయ
అక్షయము దాని వపువు క్షణక్షణమ్ము
నభినవంబయి ప్రకటిత మగుచునుండు.

తే. అందరును సదా పూర్ణత్వ మందఁగోరి
చెంది భ్రమను దోషములు తాఁ జేయువారె?
జీవితాన యౌవనము నార్జించుకొఱకు
బ్రతికి బ్రతికి చచ్చుచు నున్నవారె వారు?

తే. పరమ గతిశీలమైన వ్యాపార మిద్ది
ఆగదా యేమి యెప్పు డెయ్యదను నందు?
క్షణిక మౌ వినాశాల నిశ్శబ్దముగను
మంజుగతి హసించునె స్నిగ్ధమంగళమ్ము.

తే. మానసిక మీ విరాగసంబంధ మెట్టి
మానవత్వము! ఉన్నదా మానవతయు!!
ప్రాణియెడఁ బ్రాణికిని గేవలముగ నిర్మ
మత్వమె మిగిలి నిలిచెడి మాడ్కిఁ దోఁచు.

తే. ఏల, జీవనసంతోష మిటుల చెలఁగి
యన్యరోదనమై నవ్వులాడ నేల!
ప్రతివిరామమును గటివస్త్రమ్ము రీతి
నొప్పి ప్రగతిని బంధించుచున్న దేల!!

తే. ఒకరి దుర్వర్తనము వ్యథ నొందఁజేయ
నన్యుఁ డెట్టుల మరువఁగా నగును దాని
ఉన్నదే యరయ నుపాయ మొక్క టైన?
గరళ మమృతమ్ముగాఁ జేయఁగలుగు టెట్లు?

తే. తరళ వ్యసనమ్ము మాదకత్వమును గూడి
యపుడు మేల్కొన్న, దయ్యెడ నక్కజముగ
అచ్చటికి వచ్చుచున్నవాఁడయ్యె మనువు
అట్టి యతని నెవ్వం డెటు లాపగలఁడు?

తే. లలిత మసృణ నగ్నభుజమూలముల వలన
నమలి నామంత్రణము ప్రాప్తమగుచు నుండె?
ఉన్నత పయోధరద్వయి నూర్మికలుగఁ
జెలఁగి నర్తించుచుండె నాశ్లేషసుఖము. 75

తే. మంద నిశ్వాస పవనోర్మిమాలిక లట
నిమ్నములు నున్నతము లయి నెగడె అద్ది
శీతకిరణుని హసనాన జీవితమున
నాటుపోటులు వచ్చి. యటుల నుండె.

తే. అందమది మేల్కొనియె యున్న నప్పుడచట
నింతి యా సుకుమారి నిద్రించుచుండె
నేడు నిజరూప చంద్రికానిచయ మందు
నతివ నిశివలె నుజ్జ్వలయై యెసంగె

తే. ఆమనోజ్ఞ మాంసల పరమాణుచయము
స్నిగ్ధ విద్యుత్తులను విరజిమ్ముచుండె
శబలిత మనోజ్ఞ కేశపాశమ్ము నందు
పడుచునుండెను చిక్కు జీవనకణాలు.

తే. గత మనోజ్ఞ చింతాశ్రమ కణము లప్పు
డమల ముక్తాఫలమ్ముల ట్లందగించె
కన దనూన ముఖ కరుణ కల్పనమ్ము
ననుచు నవ్వాని గ్రుచ్చు విన్నాణములను

తే. మనువు స్పృశియింపఁ గడఁగెను మరియు లతిక
కంటకిత యయి రమ్యతా కలితయయ్యె
స్వస్తతను గన్న బాధాసుభంగపాళి
యటుల నా యంగవల్లిక యతిశయిల్లె! 80

తే. మహిత మీ విశ్వమధురి మోన్మత్త సుఖము
లీలగా విరాణ్మూర్తి ధరించె నేఁడు
అంధతా మిశ్ర మిశ్రితమైన కాంతి
ఆ యెడ నొక వితానమ్ము నల్లె వలచి.

తే. తన్వి కామాయని విడ చైతన్యమెల్ల
కొంచెముగ కొంచెముగను మేల్కొనుచునుండె
వచ్చి తనయంత నెదొ మనోభావ మప్పు
డెలమి యేర్పడి యంత నశించుచుండె.

తే. ఎపుడు సన్నిహితం బౌను నెడద యెవని
కడను వాఁడె దూరుఁడగుచుఁ గడఁగుచుండు
ఎవనితోఁ గొంత సంబంధ మెనసి ప్రీతి
యుండునో వానియెడఁ గ్రోధముప్పతిల్లు.

తే. నెట్టివైచియుఁ బ్రియుని బంధించి యుంచు
నెగడుచును మనోమాయ వినీతి మెరసి
తానె దేని ప్రత్యావర్తిత మ్మొనర్చు
"ప్రణయశిల" దాని మరలఁ జేరంగఁ దెచ్చు.

తే. అంత మనువు నెమ్మదిగ నత్యానురక్తి
జలదవేళా సమీరణస్పర్శ వలనఁ
గంపితమ్మగు కిసలయకాంతి నెసఁగు
శ్రద్ధకరమును దనదు హస్తమునఁ జేర్చె. 85

తే. నేత్రముల నుపాలంభము నిండుకొనఁగఁ
బలికె నీ రీతి ననునయ వాక్యములను
మనువు "ఇది యెట్టి మానినీమాయ యౌనొ"?
ఓసి ప్రియతమ! యోజింపు ముల్లముననను.

తే. ఏ శ్రమించి స్వర్గమును నిర్మించినాను,
విఫల మొనరింపకుము దాని వెర్రివగుచు
ప్రేయసీ! అచ్చరా!! వినిపింపు మోసి,
ఆ యతీత నూతనగాన మనయ మీవు.

తే. ఇట్టి నిర్జన భూమి కహీన కౌము
దీ పులకిత జైవాతృ కోద్దీప్త నభము
క్రిందనుంటి మీవును నేను కేవలమ్ము
నేత్రములు మూసికొన నేలనే లతాంగి!

తే. భోగ్యమును ఘనాకర్షణాపూర్ణ మైన
యీ జగమ్మెల్ల మనకె ఓ యింతి! ఇంక
జీవితంపు టుభయ తీరసీమ లొరసి
లలితముగ నిచ్చుగాత విలాసధార.

తే. శ్రమయుతంబు నభావసంశ్రయము నీ జ
గమును, దాని వ్యాకులతను, కలఁచి భీతి
గొలిపెడి మన చేతనతను వలచి యెప్పు
డేక్షణమ్మున మది విస్మరింపఁ గలమొ! 90

తే. అది సురవిపులానంతత్వ మౌచు చిఱుత
నవ్వు లలవోకగా నెటినవ్వుచుండు
ప్రణయినీ! కను మదిగొ, జీవనరసంబు
తొణికిసలను జాల్వారు బిందుద్వయాన.

తే. దేవతల కర్పితమ్మైన దివ్య సోమ
రస మిదిగొ, దీని నీ యధరమునఁ జేర్పు
మింతి! మాదకత్వమను నుయేల యందు
జంటయై యూగుదము చెలి! సాగిరమ్మ."

తే. శ్రద్ధ మేల్కొనుచుండె నా సమయ మందు
నేనియును మాదకతయె వ్యాపించియున్న
దామె మధుభావసముదయ మాస్వదించెఁ
దనువు నందున, మనమునఁ దమ రసమ్మె.

తే. ఒక సహజముద్ర తోడ నా యువిద యనియె
"ఏమి పలుకుచున్నాఁడ విట్లిపుడు నీవు?
తత్పరత నిపు డెదొ భావధారలోనఁ
గొట్టుకొని పోవుచున్నట్లు గోచరింతు.

తే. తిరిగి పరివర్తన మ్మరుదెంచె నేని
యెవరు మిగిలెదరో, ఇది యెవరి కెరుక!
ఎవ్వఁడే సహచరుఁడు ప్రాపించినంత
నాచరింతువు నూతన యజ్ఞమొకడు. 95

తే. ఎదియొ దేవతకొరకు రచింపఁబడును
మరల నెదియొ, దేని బలియొ మాయ మోస
మిది”– “మనము దానిచే నొందునది సకలము
మన సుఖము–కల్గ దెది మించి మన సుఖమ్ము.

తే. అచల మీ జగాన మిగిలి నట్టి ప్రాణు
లవ్వి– అట్టివాని కిచట నరయలేనె
యెట్టి యధికారములు అవి యెల్ల నయయొ,
సత్వహీనమ్ములా యేమి జగము నందు?

తే. భాసు రోదార భవదీయ బహు నవీన
మానవత్వ మ్మిదేన? ఓ మనువరేణ్య!
ఇందు సకలమ్ము కైకొనుటే నటయ్య!
శవత మాత్రమె మిగులునా స్వామి! యిందు?”

***

తే. “ఎన్నఁడును కాదు తుచ్ఛమో ఇంతి శ్రద్ధ!
మన సుఖమ్మేని– అద్దియుఁ గనఁగ నొకటి
ఒకటొ రెండొ దినాలుగా నుండు నిట్టి
బ్రతుకునం దది యంత్య సర్వస్వమగును.

తే. అరయ నే కడ నా యింద్రియాభిలషణ
వడయునో సతతమును నా ఫల్యగరిమ
ఓ విలాసిని! ఏ యెడ నొనర హృదయ
తృప్తి మధురమ్ముగా నాలపించి మించి...

తే. ఎచట మృదుల హాసము వికసించి నంత
నొదవు రోమహర్ష మది యా జ్యోత్స్నయందు–
ఆశలకు నై యెచట నొందు శ్వాసపాళి
చెలఁగి యర్పించుకొనుచు నాశ్లేషతృప్తి–

తే. దేని సముఖాన ననయము తిరివి విశ్వ
మధురిమము, మంజుముకురము మాడ్కి నుండు

నట్టి మనదు సౌఖ్యమును "కా దమరభూమి"
యనుచు నీవేల యీగతి ననియెదబల!

తే. ఈ తుహిననగాంచలమున నేను దేని
వెదకుచున్నానొ తిరుగుచు, నదె యభావ
మిపుడు స్వర్గమై యొప్పి హసించుచుండె
చెలఁగి చంచలమ్మైన యీ జీవనమున.

తే. సతము వర్తమానమ్ము జీవితఁపు సుఖము
నొలసి యెచట రాగమున సంయోగమందు
నెనసి కపటి యైనట్టి యదృష్ట మచటఁ
బ్రకటితం బగునేల? యభావ మగుచు.

తే. మన సమస్త కృతులకును మనమె సీమ
లము– మనదు నభిలాష తీరంగవలయు
కాకయున్నను పడినట్టి కష్టమెల్ల
వ్యర్థమై చనుగద యెట్టి ఫలము లేక? 105

***

తే. శ్రద్ధ విడని మాంద్యముననె సవినయముగ
నిటుల వచియించె నంతట "ఈ వివేక
మొలసి శేషించి యీరీతి నుంట నెఱిఁగి
కన్నుదోయిని దెరువఁగాఁ గడఁగె సృష్టి.

తే. పీన మమతా విచక్షణాజ్ఞాన మిద్ధి
యిటుల మిగులునం చెంచియో యేమొ ప్రళయ
జలధి నిజ దారుణోర్మికా నిచయమునకుఁ
బరగఁ బొందించియుండు నావర్తనమ్ము.

తే. సర్వమునకుఁ దాఁ గేంద్రమై సవదరింప
వ్యక్తి యెటుల వికాసమ్ము వడయఁగలఁడు?
ఇట్టి యేకైక మౌ స్వార్థ మెంత భీష
ణమ్ము– మనలనియ్యది వినాశమ్మొనర్చు.

తే.	ఇతరులు సుఖింపఁ జూచి సుఖింపుమయ్య!
మనుమహాశయ! సుఖముగ మనుము నీవు
విస్తృత మొనర్చి నీ సౌఖ్యవిభవ, మెల్ల
వారిని సుఖులఁ గావింపఁ గోరుమయ్య!

తే.	అగు నిది రచనామూలక మ్మయిన సృష్టి
యజ్ఞ– మా యజ్ఞ పురుషున కర్థి మనము
చేయవలసిన సంస్కృతిసేవ నెల్ల
నెంతయును విస్తృతమ్మును గావింపవలయు. 110

తే.	సీమిత మొనర్చుకొని సౌఖ్యసిద్ధి నెల్ల
నీ వఱకె కేవలము దుఃఖనిచయ మీవు
విడిచెదవు– పరప్రజలదౌ పీడఁ జూచి
పట్టనటు త్రిప్పుకొనెదవు వదనమీవు.

తే.	కూణిత విముగ్ధ మోహన కుట్మలములు
దళములను బందిసేసినఁ దావి నెల్ల
వికసనము నొంది మకరందబిందువులను
మంజు సరసతఁ గనకున్న మరణమొందు.

తే.	వత్తలగు, రాలిపోవును– పాదదళిత
మైన పరిమళమే యపుడబ్బు నీకు!
అయినఁ బొందెద వెటనుండి యపుడు స్నిగ్ధ
మధుమయామోదమును నీవు మనసుపడుచు.

తే.	తోఁచుసుఖ మెల్ల మనదు సంతోషమునకె
సంగ్రహింపఁదగినది కాఁజాలదెపుడు
తమిని నన్యులె దర్శింపఁ దగినయట్టి
యొక్క దర్శనగ్రథితమై యున్నదందు.

తే.	నిర్జనమ్మున నొంటిగ నీవు మనఁగ
నే ప్రమోదము వలచి లభింపఁగలదు
అన్యహృదయసుమ మ్మెదియైన దీని
వలన వికసనావాప్తిని బడయఁబోదు. 115

తే. సుఖ సమీరముననను నీదు సుమ మొకండె
పూర్ణముగఁ బొందవచ్చు ప్రఫుల్లతలను
మానవత్వంపు ధారచే మహితమైన
సృష్టిసీమలవలఁ కదిచేరఁగలదు."

***

తే. మాటలాడెడివేళ నమంద ఫణితి
నంతరంగ ముత్తేజిత మగుచునుండె
ఎడఁదఁ గలయగ్నికీల సహించు కడక
నారిపోవుచునుండె శ్రద్ధాధరములు.

తే. తానె మనువు సోమరసపాత్రము గ్రహించి
యపుడు సమయము కనిపెట్టి యనియె నిటుల
"త్రావుమా దీని! బుద్ధిబంధనము లెల్లఁ
ద్రెంచివైచును శ్రద్ధాసఖీ! చిరంటి !!

తే. చెప్పినది యెల్ల యేను చేసెదను తన్వి!
ఒంటిగానుంట సుఖ మేమియుండు ఇంత
యైనయది నివేదన ఎట్టు లాగఁగలదు
వదన మీ పత్రపాత్రికాస్వాదనమున?"

తే. కనియె నయనాలు ప్రియునేత్ర కంజములను
రసముననను మున్గె నరుణాధరమ్ము- లెడఁద
కాల్పనికవిజయమున సుఖమ్ము నొందె
స్నాయువులఁ దోఁచె చైతన్యనవ్యతలును. 120

తే. పరగి ఘనముగ ఛలవాణివంచనమ్ము
హృదయబాల్యమ్ము నెప్పు డాడించుచుండు
మరగొనఁ జేయు నెపుడు నమలినమైన
దాని నిర్మలోజ్జ్వల విభుతాగుణమ్ము.

తే. జీవితోద్దేశ లక్ష్యమ్ము చెంతనుండి,
ప్రగతి పయనించుచున్న యా పథము నుండి,

యొక్క మధురేంగితమ్ముతో నొలసి యద్ది
క్షణములోఁ ద్రిప్పి వేయఁగాఁ గలదు మనల.

తే. రక్తి నిచ్చె మనోజ్ఞావలంబనమ్ము
నదియె శక్తి మనువునకు–అది తన యభి
నయమువలన లగించి మనస్సు నపుడు
సౌఖ్యమునఁ జిక్కుకొనఁ జేయసాగె కడఁగి.

తే. "ఈ భయదమూర్తియై యున్న సృష్టిరజని
అమృతకర చంద్రశాలిని యగును శ్రద్ధ!
చెలియరో! యింక నీవు నా జీవితమున
పరమసుఖసీమ వగుము పెల్పారుకొఱకు

తే. ప్రాణము నొగి శాలీనతావరణ మెపుడు
కప్పివేయును ఘన తమఃకజ్జలమున
అనయమద్దాని న త్యకించన మొనర్చు
వెఱగుపడ నన్ను నీ నుండి వేరుసేయు. 125

తే. నలిపివేసినది యది యానందసుమము
నిదియె బాధ–దీనిని తొలఁగించు ముదిద!
కలుగ మన కనుకూలసౌఖ్యములు మరల
కడఁగి యత్నింపుమా! నన్ను కలసిపొమ్ము.

తే. క్షితిజ ముడుకెత్తుటకు, తన్వి, యతిశయముగ
వ్యాకు లోదార మధుర చుంబనము నిమ్ము!
తివిరి యీరీతి నిదె తృషాతృప్తి కొఱకు
రగులుచున్నది శీతలప్రాణ మతివ!!

తే. ఆ విశాల గుహా నివేశాంతరమున
కాష్టములు రెండు కలసినకడను, మధ్య,
నర్థి వెలుగుచు నున్న యా యనలకీల
ఆరిపోయె జాగృతిని స్వప్నాళు లటుల.

# ఈర్ష్య (అసంతృప్తి)

తే. క్షణిక మగుచు నెగడిన యా చంచలత్వ
మెడఁద యధికారము సమాహరించె నెపుడొ
మాన్య శ్రద్ధాసతీ మంజు మధురరజని
వ్యాప్తిఁగావించు నిష్ఫలాంధ్యమ్ము నేఁడు.

తే. మృగయ దక్క వ్యాపార మేమియును లేదు
మనువునకు నిప్డు-నోటికిఁ దనియ సోకెఁ
బరమ సమ్మోహ నారుణ వర్ణమునను
శుభ్ర హింసా సుఖాయత్త శోణితమ్ము.

తే. హింసనే కాక మరియొక టెదియొ-చీల్చి
చింత-నాత్మ ప్రభుత్వంపు సీమలెల్ల
విస్తరించెడి శక్తితో వెలయుదాని-
మనువు వెదకుచుండె నధీరమానసమున.

తే. అతని కీనాఁడు లభ్యమైనట్టిదాని
కడను నవ్యత యేమియుఁ గానఁబడదు
స్వాదు శ్రద్ధాసతీ విలాసమ్ము నీర
సముగఁ దోఁచి రుచింపఁగాఁ జాలకుండె

తే. అంతరంగాన నెవ్వేళఁ గాంత మైన
ప్రబల లాలస ఘనమయి ప్రభవమొందు
మెలసి యింద్రచాపము వోలె మరల నద్ది
శాంతగతిఁ దిరోహితము కాసాగెఁ దానె. 5

***

తే. "మూసి నిజవికాసఁపు మార్గముఖము ప్రాణ
మెంతవర కలసతను నిద్రించు నిట్లు?

జీవితంపు చిరచంచల స్నిగ్ధ కేక
యెంతదనుక రోదించు నెయ్యెడను త్రాణ?

తే. ఔను, శ్రద్ధాసతీ ప్రణయమ్ము! అందుఁ
బ్రాథమిక మైన సరళాభివ్యక్తి తోఁచు
నాదు వ్యాకుల భుజబంధనమ్ము లేదు
కెరలి వెలివడు కుశలసూక్తియును లేదు.

తే. ఒలసి చిరునవ్వురేకలో నొదుఁగు నట్టి
శుభ్రభావనా మధురవిస్ఫూర్తి లేదు
నవనివేదన, ఉల్లసనములు లేవు
ప్రసవ వికసన హొయలు నవ్యతలు లేవు.

తే. నవన వోత్సాహ లసిత విన్యాసములను,
నాట్యశీ లానుగుణ నవీనతల, నమిత
గర్వ యౌవత పదకంజ కౌశలాత్త
భవ్య లీలోర్మికల్ లేవు వాణియందు.

తే. అచట నుపవిష్టయై లేక యలపు శాలి
ధాన్య మేరు నాయమ నిత్యతత్పరతను
ఎరుగ కెయ్యెడఁ గ్లాంతి నొక్కింతయైన
పొలసి ధాన్యపుం గింజలు ప్రోవుసేయు. 10

తే. విత్తనమ్ములఁ గూర్చుటో, క్రొత్త కదురు
పట్టి వడకుటో– మరి యిట్టి పనులె వలచి
యెపుడు కూర్చుండి యుండు నా యింతి– అయ్య
తీతవేళ దైనది మదస్తిత్వ మెల్ల.”

***

తే. వెడలి, యలసి, తిరిగివచ్చె వేటనుండి–
కనుల కట గుహాద్వారము కానుపించె
కాని ముందున కడుగిడఁ గలుగలేదు
చిత్తమం దభిలాష– యోజింపసాగె.

తే. మొదట మృగమును, పిదపఁ గార్ముకము నతఁడు
క్రిందఁ బడవైచి శిథిల శరీరమునను
గూరుచుండె–ఆయుధమును, కొమ్ము, నారి,
బాణ ముండెను జిందరవందరగను.

తే. "రాగమయి సంధ్య పొందె నల్లందనమ్ము–
ఇంటి కా వేటకాఁడు రాఁ డిప్పటికిని
చపలజంతువు మోసమ్ముసలిపి యతనిఁ
దీసికొని పోయెనా దూరదేశమునకు?"

తే. ఇటులఁ దనలోనఁ దానె యోజించుచుండె
కదురు పాడుచున్నది హస్తకంజములను–
అయ్యె నన్యమనస్క యా యతివ, శ్రద్ధ
గుల్ఫములఁ గేశములు ముద్దుగొనుచునుండె.

తే. పరగె: నవకేతకీగర్భ పాండుముఖము
నేత్రపాళి నలసమైన స్నేహగుణము,
నవ్య లజ్జాయుత కృశత ననుచు నట్టి
కంపిత లతోపమ మ్మైన క్రమ వపువు.

తే. పరమ మాతృత్వభరమున వంగియున్న–
పీన వక్షోజయుగళి సంప్రీతి దనరఁ
గట్టఁబడె నీలరోమ వల్కలము తోడ–
తరుణి కది యొప్పె నొక యలంకరణ మటుల.

తే. కనక సికతను గాళింది గమనరుచుల
నించు నిట్టూర్పులతొఁ బ్రవహించు పగిది,
అమరవాహిని పైన నీలాబ్జపంక్తి
యమరి హసియించు వడుపున నద్ది తోఁచె–

తే. బరువులేని నల్లని నేతవసన మొకటి
యట్టిదే కటిపయి నామె చుట్టుకొనియె
గర్భ మధురవేదన యుండె దుర్భరమయి
ఉవిద జననీప్రసన్నత నోర్చుచుండె.

తే. భావి జననీ మనోజ్ఞ గర్వమ్ము చెలఁగి
శ్రమపృషత్తతియై వెల్గు సరణి తోఁచె
అవని వనసుమావళి చల్లినటుల నుండె
పరమమౌ మహాపర్వమ్ము వచ్చెదరికి. 20

తే. సహజ శైథిల్యయుత మైన శ్రద్ధరూపు
మనువు తిలకించె-అతఁ డందుఁ గనియెఁ
దనదు కోర్కెకు దృఢవిరోధమ్ము- అంద
రయఁగ నయ్యనుపమ భావచయము లేదు.

తే. ఆతఁ డొక్కింత యైన మాటాడలేదు
మౌనమున సాధికారానఁ దాను చూచు
చుండె- శ్రద్ధ యాతని యెద చొప్పెరింగి
నటుల నించుక చిరునవ్వు నపుడు చిలికె.

తే. పలికె మధుర సుస్నేహసంభరిత శ్రద్ధ!
"దినము దినమెల్ల నెచ్చటఁ దిరుగుచుంటి
వింత ప్రియమైనదా యేమి యిట్టి హింస?
దేహగేహాల మరపుకుఁ దెచ్చె నీకు?

తే. కడగి మృగమును వెన్నాడి కాననమున
శాంతిఁ గోల్పోయి పర్వెత్తు సమయముననె
యిచట వినుచు పదధ్వను లెపుడు నిలిచి
యుంటి- నీ మార్గమే చూచుచుంటి నయ్య!.

తే. మేలి బంగరుపవ లస్తమించె- తిరిగి
తిరిగి రక్తారుణతను జెందితివి నీవు
వలచి గూళ్ళలో విహగదంపతులు కనుమ,
కొసరి తమ శిశువుల ముద్దుగొనుచునుండ్రి. 25

తే. కెరలుఁ గోలాహలము వాని గేహములను,
నా గృహద్వారసీమ శూన్యముగ నుండె,
ఎట్టి దగు లోపమును గని యీవు పరుల
ద్వారముల కేగుచున్నావు, పలుకు మెదియొ?"

తే. “లో టెదియు లేదు శ్రద్ధ, నీలోన– ఇంతి!
ఏ నొక యభావమును సువీక్షించుచుంటి
మరపుఁ గొన్న యెదో యొక్క మధురవస్తు
వున్నయది గాయమును జేయుచున్నయటుల.

తే. భూరి వివశతఁ జిరము క్షత్రపురుషుఁ డేల
యిట్టి యవరుద్ధ మగు శ్వాస నెటుగ్రహించు?
గతివిహీనపంగువు వలె నతిశిథిల చ
యముల రాశియై యేగతి నధివసించు?

తే. ముగ్ధ జడబంధనము వలె మోహ మొకటి
ప్రాణసంచయ మృదుశరీరమ్ము నర్థి
“నెపుడు బంధించు– అతిగ బిగించు నిచ్చ,
పరగఁ ద్రెంచు నట్టి విమోహ బంధనమునె”.

తే. మనువు నవ్వుచుఁ బలికె ఆ మాటలందు
మధుర నిరఝరిణీ రాగమహిమ తొణికె
గానములఁ బ్రాణములు మంజుగతులఁ దూలి
పోవు నుల్లాసములతోడఁ బొలిచి మెరసె. 30

తే. “అఖిలమును మరపించు నా వ్యాకులత్వ
మెచట నున్నది, ఇంతిరో ఇపుడు నీవు
తోఁచి యాశా మనోజ్ఞ తంతు వటు, తన్వి,
కదురు నాడించుపనిని మున్గెదవు వలచి.

తే. సఖియ! ఇది యేల! ఇట మృగశాబకముల
మృదుల చర్మముల్ నీకు లభింపలేదె?
ఏల యిటు బీజముల్ సంగ్రహింతు? నాదు
మృగయ శైథిల్యమును జెందెనే లతాంగి!

తే. తరుణి! ఈ తంతువాయఖేద మ్మ దేల?
మరియు జృంభించె నీ పాండిమ మ్మ దేమి,

ఇంతి? పలుకుమీ యిది యెల్ల నెవరికొఱకు-
ఇందుఁ గలదె రహస్య మ దెద్ది యైన?"

***

తే. "ఆత్మరక్షణఁ గోరి నీ యాయుధమ్ము
నెచటికైన నరుగఁ బ్రయోగింతు వేని
యర్థ మొనరించుకొనఁ గలనయ్య దాని-
శస్త్ర మొనరించు రక్ష హింసకుని వలన.

తే. మనుచుఁ దా మమాయకముగఁ గడుగ నెవ్వి
మనకు మేలొనరించు సామర్థ్యమొదవ
నున్నవో యవి మనరాదె యుపకృతులను-
దీని యర్థమ్మదేమొ నేఁ దెలియఁజాల! 35

తే. వరలు చర్మాలు వాని కావరణములుగ
ఉన్నితో నాకుఁ బని తీరుచున్న- దవ్వి
మాంసలము లయిమనవలె-మనము, క్షీర
గృహములవి, అమృతముల గ్రహింతమయ్య!

తే. హేతువుతొ వాని మనము పోషింతు మాత్మఁ
దలఁప నయ్యవి ద్రోహపాత్రములు గావు
పశువులను మించు నుత్తమత్వమ్మె యున్న
భావజలధిసేతువుల మై పరగఁవలయు".

***

తే. "చేరు సహజ సౌఖ్యచయము దూరమగుట,
వీర జీవనఘర్షణ విఫలమగుట,
పెంపుతరిగి మనము మోసగింపఁబడుట-
ఇంతి! వీని నే నంగీకరించలేను.

తే. తావకీన నీలనయన తారలోన
చెలియ! చూచెద నా ధన్యచిత్ర మేను?

నాదు మానసముకుర మనన్యమైన
నీ వలననే ప్రతిఫలించి నెగడవలయు.

తే. కాదు శ్రద్ధ! నవ్యతర సంకల్పమిద్ది
చెలి అమూల్యమౌ నీ లఘుజీవితమ్ము
రావిచిగురాకు వలెఁ జంచలతయుఁ దోఁచు
నాసుఖ మనుభవింతు ననారతమ్ము. 40

తే. కనవె యెపుడీవు స్వర్గసౌఖ్యముల మీదఁ
బ్రళయము ఘననృత్యమ్మునుఁ బరిఢవింప?
పిదప నాశము, చిరనిద్ర, వెలఁది! ఏల?
ఇంత దృఢతర విశ్వాసమేల నీకు?

తే. ఇంతగా మేలుకొనె నేల యీ చిర ప్ర
శాంత మంగళాభిలషణ? ఏమి? ప్రేమ!
ప్రేమసంచయ మేల కావింతురిట్టు
లువిద! ఎవరిపై ననురాగ మున్నదవని?

తే. ఎట్టి జీవనవరదాన! మెలమి రాజ్ఞి
ఇమ్ము, నీప్రేమనెల్ల నా కిమ్ము నీవు
అర్థిఁ గేవలమును నస్మదర్థ మైన
యూహలే నీ యెడందలో నుండవలయు.

తే. తనరి నాకది విశ్రమస్థాన మగుచు
నించు నొక స్వాదుజగము సృజించుఁగాక!
ఒక్క టొకటిగ నం దల లొలసి యెగయు
దివ్య మధుధార కెరలి నదించుఁగాక!!

తే. "ఒక్కదానిని నిర్మించియుంటి నేను,
రమ్ము, చూడుము, నా కుటీరమును నీవు"–
శ్రద్ధ యిట్లని మనువు హస్తమును బట్టి
యాతురత తోడఁ గొనిపోయె నతని నటకు. 45

తే. ఆ దరీపరిసరముల నమిత శాంతి
పుంజ మగుచునా రెల్లిల్లు పొలుపుమెరయు
లలిత వల్లరీ శాఖికావళులు గలిసి
బంధురమ్ముగ రమ్యతాప్రౌఢి నొసఁగ.

తే. పర్ణములనుఁ బ్రాచీరమ్ము ప్రాప్తమయ్యె
కోయఁబడినవి చిన్ని వాతాయనములు:
వచ్చిపోవును నిముసమ్ము వరలి యవ్వి,
ఆగుటలు మేఘపవనాల కచట లేవు.

తే. పిన్నదగు నాకుటీరానఁ బ్రేపతీవ
యల్లి కల నందగిల్లు నుయ్యాల యొకటి
సుమచయ మసృణ సురభిళ చూర్ణ మవని
రమ్యమోహనముగ వికీర్ణమయి చెలఁగు.

తే. మధుర మధురాభిలాష లమందగతుల
నెన్నియో మౌనముగను జరించు నందు
నవ్య మంగళ మధురగానము లవెన్నొ
మూల మూలలఁ దారాడి పొలుపుమెరయు.

తే. ఇంతి, గృహలక్ష్మి, కట్టిన యింటితీరు
కనుచునుండెను జకితుఁడై మనువు– కాని
అద్ది యతనికి బాగున్న యటుల లేదు–
“ఎందు కిది! గోమున సుఖింతు రెవ్వరిందు?” 50

తే. మనువు వహియించె మౌనమ్ము– అనియె శ్రద్ధ:
“నిర్మితమ్మయ్యెఁ జూడుమా నీడ మిద్ది!
కాని యింకను నీ కుటిఁ గలరవానఁ
జెలఁగి వెలుఁగొంద రాలేదు శిశుగణమ్ము.

తే. నీవు కడుదూరముగ వెళ్ళిపోవు నప్పు
డిచట నుపవిష్టనై యుండి యేను కదురు
చేతఁగొని నిర్జనతఁ ద్రోయఁ జిత్తమొసఁగి
యొడుకుచును దాని నెవ్వేళ నున్నదాన.

తే.	'నెమ్మదిగ నెమ్మది నడుప నీవు కదరు
ప్రియుఁడు వేటాడు తమినిఁ దా వెడలినాఁడు,'
అనుచు ప్రతివర్తనంపు స్వరాళియందు
మునిఁగి కూర్చొని యేఁ బాడుకొనుచునుంటి."

తే.	నీదు సుకుమారతను బోలు స్నిగ్ధజీవి
తంపు కోమలతంతులు తరలుగాత!
వలఁ గొనుత యందుఁ జిరనగ్న ప్రాణ మెపుడు!
అందపుం గౌరవమ్ము వెల్గొందుఁగాత!!

తే.	ఉజ్జ్వ లాంశులఁ బోలుచు నొప్ప నాదు
జీవనప్రభాతము నేయఁ జెలఁగుమీవు
వసనహీన యైన సరళ ప్రకృతి దానఁ
గాంతితో మృదుల వపువుఁ గప్పుకొనుత!! 55

***

తే.	వ్యసన పూరితమైన నేత్రాళి మీఁదఁ
బరగ వేయుము వెల్గుటావరణ మీవు
అందు లతికపై వికసించు నమల సుమము
పగిది సౌందర్య ముజ్జ్వల మగునుగాత!!

తే.	అట్టి యాగంతుకుఁడు గుహాభ్యంతరమునఁ
బశువువలె వస్త్రహీనుఁడై వరలకుండు
గాత!! తన యభావజడతఁ గడఁగి యెపుడు
నొంటిగ నిమగ్నుఁడై యుండకుండుఁ గాత!!

తే.	ఈవు లేనప్పుడిక నెన్నడేని నాదు
లఘుజనము శూన్యమై యురలాడఁబోదు
వానికై పుష్పరస ఫేనపటలి నిచట
మృదుల మోహనముగ పరచెదను నేను.

తే.	ఉంచి డోలిక నవ్వాని నూపుచుందు
ముద్దుఁగొని శరీరమును నే బుజ్జగింతు

కదియఁగా హత్తుకొనుచు వక్షమ్మునందుఁ
ద్రిప్పెద వలపుమెయి నీ దరీజగాన.

తే. చిరుత కురులను విప్పారఁ జేసికొనుచు
నతఁడు వచ్చు కోమల మలయానిలముగ
అతని యధరమ్ములందుండి వ్యాప్తి నొదవు
స్వాదు మృదుహాస లతికా ప్రవాళరేఖ. 60

తే. రమ్య నవమోహ నోజ్జ్వల రసన నతఁడు
పలుకు నెంతయో తీయని పలుకులెలమి
కలిపి చల్లు నా వ్యథపైనఁ బలుకులవ్వి
కుసుమధూళీ మరందాలఁ గొసరి కొసరి.

తే. నిర్వికారమ్ము లౌవాని నేత్రములను
జూచి నా ముగ్ధచిత్ర మేఁ జొక్కునపుడు
స్తబ్ధ మామకీన నయనజల మదెల్ల
నమల సురభిళ పీయూష మై రహించు."

***

తే. "ఒప్పెదవు నీవు సౌఖ్యగంధోర్మికలను
కంపితము సేయు వనలత గతిగ నింక
శుభ్ర ఘనసార మృగము నై సురభికొఱకు
ననయ మేను దిరిగెదను వనవనమ్ము.

తే. ఇట్టి జ్వాలను, దన్వి, సహింపలేను,
నా మమత్వమె కావలె నాకు నెపుడు
ఇట్టి పంచభూతాత్మకసృష్టి యందు
నెలమి నొకతత్వ మగుచు రమింతు నేను.

తే. ద్వైత మియ్యది, ఈ ద్వివిధమె ప్రణయము
పంచుటకు నొక రీతియై పరగుచుండు
ఏను భిక్షుకుఁడనె, కాదు, ఎన్నఁ డైన
నేను నా కోర్కె తిరిగి పొందెదను గడఁగి. 65

తే. వితరణము సేయవలదీవు విమల సజల
వారిదముగ బిందువుల నుదారరీతి
ఏ సకల కళాధర శరదిందువగుచు
నీ సుఖనభముననుసంచరించుచుందు.

తే. ఒకట నాకర్షణాయుక్తి యొదవ నవ్వి
యాత్మ విస్మృతి నొందిన యట్లుచూతు
వోసి మాయావినీ! వర మొసఁగుచుంటి
వని తలంచి మోకరిలి యేఁ గొనను దాని.

తే. అతివ! ఎదఁ దలఁపకుమా దయాభరమ్ము
నిలువ నా మీఁదనే నీవు నేర్తు ననుచు
ఉత్సహించి యొనర్పుకు మోసి శ్రద్ధ!
అఖిల మీ ప్రయాసము సదా వ్యర్థమగును.

తే. నీవు సౌఖ్యాన నుండుమీ నీ సుఖాన
స్వేచ్ఛగా దుఃఖమును బొందనిమ్ము నన్ను
మానసిక పారవశ్యము మహిత ఖేద
మనెడి మంత్రము పఠియింతు నతివ! యేను.

తే. సంచిత మహానుభవ మను సర్వభార
మిచటనే యుంచి వెడలెద నింతి! నేను
ధన్యుఁడను నాకుఁ గంటకతతి లభింపఁ
గుసుమకుంజము నీకుఁ జేకూరుఁగాత!! 70

తే. అరిగె జ్వలనశీల మగు హృదంతరమున
మనువు-ప్రాంతమ్ము శూన్యమ్ము కనఁగ నపుడు
"ఓయి నిర్మోహి! ఆగుము, ఉండు, వినుము"
అనుచు శాంత్యధీరత శ్రద్ధ యనుచునుండె- 71

# ఇడ (అన్వేషణ)

తే. తరలి యెట్టి గహనగుహాంతరము నుండి
బ్రతు కనెడి సంక్షుభిత మహాపవన మిద్ది
యనల జలముల గగన భూ మ్యనిలములను
వికల పరమాణు పుంజమ్ము వెంటఁగొనుచు...

తే. ఝంఝువలె వ్యాకులతతోడి సాగివచ్చె-
బ్రతుకు భీతితో సర్వము న్వ్యాలముగనుఁ
జేసి లీనమై ఘనభయోపాసనమున,
జగము దీన మౌనటు వంచసాగెఁ గటుత.

తే. సర్వ నిర్మాణములలోన, సకల నాశ
నములఁ దనశక్తిఁ జూపుచు నమితగతులఁ
గడఁగె నిది తొలినుండి సంఘర్షణమున-
అన్నిట విరాగము, మమత్వ మమరి తోఁచు.

తే. బ్రతుకనెడి విషమంపు నారాచ మెపుడు
వెడలినది చిరంతన మను విల్లునుండి?
ఎట్టి లక్ష్యము భేదింప నెంచి యిద్ది
చెలఁగి వెడలెను శూన్యమున్ జీల్చికొనుచు?

తే. తత హిమానీ మహిత రంజితమ్ము లగుచు
నొదవి నిర్లక్ష్యభరముతో నున్నవాని
నున్న తోన్నత శైలశృంగోజ్జ్వలముల
నేను తిలకించినాఁడ రహించి, మించి. 5

తే. ఆత్మ జడ గౌరవమున కే యవనియొప్పి
యొక ప్రతీకగ నున్నదో యట్టివసుధ
గర్వగరిమ సర్వమును భంగమ్మొనర్చి
నిజ సమాధిని సుఖముగా నిల్చెనవ్వి.

తే. పరcగుచు నమాయకముగ నా పర్వతంపు
స్వేద జలబిందువులు కొన్ని స్వీకరించి
నదులవిగొ ప్రవహించుచున్నవి - స్థిమిత న
యనము, విగతశోకక్రోధ మరయ నగము.

తే. ఇట్టి ముక్తిని జడత వసించుచుండుc
దమిని నేc గోర నీ జీవితప్రతిష్ఠ
కంపన తరంగము లడుగునడుగునందు
నగజగమ్ములc జుంబించు నట్టి పవన...

తే. మటుల, జ్వలన శీలతనొప్పియు యతి గతిమ
యుం డయిన యాదినకరుని యొప్పుమీరు
మామక మనో నిరాతంక మహితవృత్తి
నెల్ల వేళల నొదవ నే నిచ్ఛగింతు.

తే. స్నిగ్ధ రమణీయ మౌ తొలి జీవితంపు
గృహము నాత్మతేజమున వెల్గించి, విడిచి
తమి గుహా కుంజ వన మరుదంచలముల
వెదకుచుంటి నాదు వికాసపదముకొఱకు.

తే. ఎవరి నైన నేను గనికరించినానె?
వెట్టినై మమత్వమును భంగించినాను-
ఎవరి కుదారుండ నై సంతసించినాను?
ఏ నెవరియెడ స్పర్ధ వహింపలేదు.

తే. నాదుకేక యీ విజనాన రోదనమ్ము
సేయు- ప్రత్యుత్తరము లేదు- చెలcగి వాడి
పోవునటు చేసి వడగాలి పోల్కి పర్వు
లిడెద- నా వల్ల నే సుమ మెపుడు విరిసె.

తే. శిథిల కల్పనా జగతి వసించు చేను
స్వప్న మెయ్యెడ దర్శించువాcడ నైతి
కుసుమ మధుహాస మెన్నcడే కోర్కె మెరయ
సురుచిరత నొప్ప నెయ్యెడc జూచినాcడ!

తే. తత మహా దుఃఖమయ జీవితప్రకాశ
మాత్మ సౌఖ్యాన నిహతాశమై విశాల
గగన నీలలతా శాఖికలను జేరి
చిక్కుకొన్నది కదలికఁ జెందలేక.

తే. వేని నే మొగ్గలనుచు భావించినానొ
వ్యాప్తిఁగనె ముళ్ళుగాఁ జుట్టుప్రక్కల నవి
ఎంత విజనాన నేఁ బయనించినాఁడ!
అలసి పడియుంటిఁ బూర్తిగా నయయొ, యెటనొ! 15

తే. నన్నుఁ గని ముక్తశిఖరాళి నవ్వుచుండె
ఏను నిర్వాసితుఁడను రోదించుచుంటి
శాంతి వీడి ఈ విధి నటీ చటుల నృత్య
భీషణచ్ఛాయ యిదె తాండవించుచుండె.

తే. కోటరము వోలు శూన్యతావాటి నిండి
గంతులిడు నసాఫల్యత ఘనత మెరసి
నాశనము చేసి జ్యోతిఃకణాళి, కడఁగి
వర్షరాత్రుల మిణుగురుల్ పట్టుచుంటి.

తే. జీవిత నిశా తమమ్మ! విచిత్ర నీల
హిమజలధి వియై యెంత విస్తృతిని గొనుచు
వ్యాప్తినొంది– తీ నిర్వికారాత్త చేత
నత్వ కిరణము లెన్ని లీనమగుచుండె.

తే. ఓసి మాదకతమమ! నీ యొడిని నొదిఁగి
యిపుడు నిఖిల భువనము శయించియుండె
మూర్తిఁ దాల్చి ప్రతిక్షణపు పరివర్త
నమున దాగియుందువు రహస్యముగ నీవు.

తే. అమృత సౌభాగ్యవతి తరంగాంకముల
లలిత కాశ్మీర రమ్యచూర్ణమ్ము పగిది
తరుల కాంతి మమత్వంపు టరుణరేఖ
వికసనము నొంది కన్పట్టు విస్ఫుటముగ. 20

తే. ప్రాణ నిచయ నివాస విశ్రమమ! రమ్య
చతుర సమ్మోహ జలధర చ్ఛాయ వీవు
కాంతమాయా కృతాభిషిక్తా మనోజ్ఞ
లలిత మోహన కేశకలాప మీవు.

తే. జీవిత నిశీధినీ ఘన చిత్రతమమ!
అపరిపూర్ణ లాలస, వ్యథ యగ్నికణము
నటుల నెటు కేకవెట్టునో యట్టి కోర్కె
రగులఁ గ్రొత్తగా తోఁచెడి పొగను బోలి.

తే. తిరుగుచున్నావు- యౌవన దివ్య మధు వ
నంపు కాళింది యిటు దిగంతముల ముద్దుఁ
గొనుచుఁ బ్రవహించుచున్నది కొమరు మివుల-
నవె మనశ్శిశువుల చిన్ని యాటపడవ...

తే. లర్థిఁ బర్వెత్తుచున్న వసంతముగను
చటుల మాయావినీ వినిశ్చల విశాల
నయన విరచిత నీలాంజనమ్మ! రమ్య
మైన యాకర్షణమ్ము నీ యందు నవ్వు.

తే. మసకరేఖలఁ జైతన్యమయము చంచ
లమ్ము నైన చిత్ర వినూత్న లలితసృష్టి!
శ్యామల చిరప్రవాస పథాళిఁ బ్రాణ
పికరుతులు నింగిని బ్రతిశబ్దించి విరియు.

తే. దుఃఖసౌఖ్యంపు పరిభాష తోఁచు ధ్వస్త
శిల్పమటుల శూన్య నగరసీమ నిదియె
కడఁగి వికృతంపు వక్రరేఖలునుఁ బరఁగు
ప్రాణుల యశాంత విధిగ నీ ధ్వస్తపురము.

తే. అఖిల సుఖమయ స్మృతు లిట నపరిపూర్ణ
కాంక్ష లై చరియింతు నే కడను గనిన
ఇట్టి రాసుల దుఃఖదురేచ్ఛ లణఁగి
యున్నయవి జీర్ణపత్రాళి యున్నయటుల.

తే. కల్గు సంకోచము ప్రణయగరిమ యందు
విజన దిశలందు వ్యథనిండి వెల్లివిరియు
ఇట్టి జీర్ణపాదపమున నిదె చిగుర్చు
చుండెఁ జిద్వృత్తి 'సురలత' యుదియకొనుచు.

తే. జీవితసమాధి సంబంధి శిథిలములను
నతి నిశాంతముగా వెల్గునట్టి దివ్వె
లివిగొ, వలచి తమకుఁ దామె యిటుల నిపుడు
శమిత మగుచున్నవి అతి ప్రశాంతముగను.

తే. శ్రాంతుఁడై మను వటఁ బథిశ్రమము వలన
నిటుల నేమేమొ మివుల యోజించుచుండె
సకలసుఖ సాధనమ్ము ప్రశాంత యుతము
నైన శ్రద్ధానివాసమ్ము నాతఁ డెపుడు...

తే. విడిచి వచ్చెనో యటనుండి విపుల మార్గ
ములను దిరుగుచు, నాగుచు నలసినంత
వచ్చి, తుద కీ శిథిల పురప్రాంత మునకు–
ఇట సరస్వతి పేర్మి నందించుచుండె.

తే. శ్యామనిశి యపుడుండె నిస్తబ్ధముగను
దళిత వసుమతీ వికల దుర్దశ నవేళ
ధీరగతి వెల్గుచు ననంత తారకాళి
కడఁగి నిర్నిమేషమ్ముగాఁ గనుచునుండె.

తే. వృత్రహుని జనాకీర్ణ పురీలలామ
మిద్ది యెంతయు శూన్యమై యిట్టు లయ్యె
ఇంద్ర జయకథా స్మృతులు కల్పించుచుండె,
నిబిడ దుఃఖములను ద్విగుణీకృతముగ.

తే. దివ్య మిట్టి సారస్వతదేశ మిపుడు
పొందుచు నహీన దుస్వప్నములను క్లాంత
గతి వహించియున్నది– నలుగడల నలమి
వ్యాప్తిఁగొన్నది ఘోరత రాంధ్య మిదియె.

తే. జీవితఁపు నవాలోచన చెలఁగ నొకట
కలిగె సంఘర్షణ- అమరగణము నేని
రాస్థత శరీరసంబంధ మైన పూజ
నమ్ము కొఱకు విపుల ప్రచారమ్ము వలచె. 35

తే. ఆత్మవిశ్వాస నిరతు లైనట్టి త్రిదశ
గణ మిటుల పల్కి రున్ముక్తకంఠముననుః
“సంతతారాధ్యుఁడను నే నిరంతరమ్ము
నాత్మమంగళోపాసన మందు రతుఁడ.

తే. ఉల్లసన శీలమున శక్తి కొదవు కేంద్ర
మును, శరణుకొర కే నెవరిని వెదకుదు?
అమల చిత్రజీవిత వికాసాత్త మధుర
వర మహానంద శక్తి ప్రవాహమిద్ది.

తే. విశ్వ మిది నిత్యహరిత మై వెలయఁ జేయుఁ
గ్రొత్త లెవియొ! అసురు లిటఁ గ్రుంకి ప్రాణ
సౌఖ్యసాధనం జేసి సంస్కారములను
గట్టుబడుదురు నియమ నిగళవ్రజాన.

తే. అర్థిఁ బూజించుఁ దుచ్ఛ దేహము నొకండు
ఒకఁ డపరిపూర్ణమౌహుతి నొంది మదిని
దన నొక ప్రవీణుఁ డంచును దలఁచుచుండుఁ-
బరఁగు నిరువురి హితము తీవ్రముగ నొలసి.

తే. ఇరువురును నిల విశ్వాసహీను లరయ,
శస్త్రములఁ దర్కమును నిల్ప సాగినారు
సమర మేతెంచి యేటికి సాగకుండు?
కలిగి జరిగె నశాంత సంఘర్షణమ్ము. 40

తే. వరలు నీ వ్యతిరేకభావములె నేఁటి
వఱకు కలవు నాయం దొకవంక నిండి
మమతతో నాత్మమోహమ్ము, మంజుల స్వ
తంత్రమైన యుచ్ఛృంఖలతయును నొకట.

తే. ప్రళయ భయభావమున దేహరక్ష కొఱకు
భక్తిఁ బూజింపవలె నన్న వ్యాకులతయుఁ
బరఁగు–దీను గావించు నీ ద్వయము నన్ను
నేను శ్రద్ధావిహీనుఁడ నిజముగానె.”

***

తే. మనువ! శ్రద్ధాసతిని నీవు మరచినావు:
ఆత్మవిశ్వాసపరిపూర్ణ యామె ఎగురఁ
గొట్టితివి దూదిపింజగా నట్టిసతిని
తలఁచితివి విశ్వమది యసత్తనుచు నీవు.

తే. తంతువున నూగు నిట జీవితమ్మటంచు
సౌఖ్యసాధనలోఁ జెల్లు క్షణములవియె
వెలయు సత్యమ్ములనుచు భావించినావు
వ్యసనపరితృప్తియే నీకు స్వర్గమయ్యె.

తే. ఇద్ధి వ్యతిరేక బుద్ధి యార్జించుకొన్న
వ్యర్థ మౌ జ్ఞానము పురుషత్వపు విమోహ
మొదవ, స్త్రీకిఁ గొంతగ సత్త యున్న దనుచు
మరచినావయ్య మదిలోన మనువరేణ్య! 45

తే. ఇలను నీ యధికారాధికృతుల మధ్య
వరులు బంధము సమరసత్వమ్ము గాదె”
అనుచుఁ గంపింపఁగా ననంతాంబరమ్ము
పరమ తీక్షణోజ్జ్వల వాణి పలుకునపుడు

***

తే. మదినొసంగి తాను వినెడి మనువు నెడఁద
యందు శూలము గ్రుచ్చుకొన్నట్టు లయ్యె
“అరె! ఎవరిది? మరల నా యనంగుఁ దేన?
నన్ను భ్రమయందుఁ బడవైచి మున్నితండు...

తే. రమ్యజీవిత విశ్రాంతి లాగికొనియె
కడcగి యిటుల పలుకునc దా కాముcడేన?
ఏ క్షణాల నామమ్ము శేషించియున్న
దా యతీత మియ్యెడను బ్రత్యక్షమయ్యె-

తే. అట్టి గతకాలసుఖము నా యంతరంగ
మెల్ల నివ్వేళ నిట పులకింపcజేయు
స్నిగ్ధ దుఃఖ తాపజ్వాలచే మనమ్ము,
నవయవమ్ములు జ్వలియించు నటులc దోcచు.

తే. మనువు పలికెను: "భ్రాంతసాధనవె నేటి
వఱకు మగ్నుండనా నేను? పలుకలేదె
నీవు శ్రద్ధాసతిని బొందు మీ వటంచు?
పొందినా నన్నయటు స్నేహపూర్వకముగ-

తే. ఆమె నా కిచ్చె నిజ నిర్ఝరాన్నధామ
మై నెగడు హృది నా నాc డనన్యముగను
అయిన మరి పూర్ణకాముcడ నై చెలంగ
కేల యిట్లున్న వాcడనో యెరుకపడదు."

***

తే. "ప్రణయపరిపూర్ణ నిజ సరళాంతరంగ
మొసcగినది యామె- అందున నుండె నిండి
జీవితంపు ప్రమాణము- చేతనతయె
అందు వెల్గొందు శాంతకాం త్యతిశయముల.

తే. అయిన నీవు సదా పొంది తామె యందు
రమ్య జడమైన యా శరీరమ్ము నొకటె
సరస మోహన సౌందర్యజలధి నింపి
తెచ్చినావు నీ గరళపాత్రిక నొకండె.

తే. అర్థ మొనరించుకొనcజాల వైతివయ్య
నీ యపూర్ణత్వమును, నీ వమాయకుcడవు
పరిణయమ్మునc బూర్ణమౌ వలను నుండి
యాగిపోయినా వీవు స్వయమ్ముగానె.

తే. 'ఏదియొ నాయది కావలె- ఇట్టి రాగ
భావ మరయఁగఁ బూర్ణతా భావమునకు
సంకుచితగుణ, మజ్ఞానసరణి మహిత
మానసపయోనిధిని క్షుద్రయాన మౌను. 55

తే. "ఈ విపు డిదె స్వతంత్రత నెనయఁ గోరి
యాత్మ కలుషము లుంచుచు నన్యులపయి,
నౌను ప్రత్యేకతంత్రము న్బూనినావు
ఒదవు నిత్యమై మదిని ద్వంద్వోద్గమమ్ము.

తే. నిశ్చయమ్మయి యియ్యది నెగడునెపుడు
శాఖికలఁ గంటకాళి, పుష్పములు లభ్య
మగును వికసించి- నడచి నీ యభిరుచి కను
వైన యటుల నీ గతి గాయపడితి వయ్య.

తే. దేని కాంక్షించితో నీవు దాని నర్థిఁ
గైకొనుచు నున్నవాఁడవు- కడఁగి వలచి
యీవు మనువ! గ్రహింపలే దెపుడు ప్రాణ
కలిత కీలా ప్రణయ సుప్రకాశనమును.

తే. జ్వలితవాసనకుఁ బ్రథమస్థాన మొసఁగి
నావు చిరజీవితభ్ర మాంధ్యమున నీవు
నీ ప్రజాతంత్ర మే యెడ నియతిచక్ర
యంత్రమున బోలి వికలమౌ నరసిచూడ.

తే. ఎన యెఱుంగక శాపభూయిష్ఠ మగుచు
నీ యభినవ మానవసృష్టి యెల్ల వేళ
ద్వైతమున మగ్నమై పెంచు వర్ణములను
తన వినాశము నొదవించుకొనుచుఁ దానె- 60

తే. సాగి యజ్ఞానమున సమస్యల సృజించు
అమిత కోలాహలము కలహమ్ముఁ గలుగు
కలుగు భేదభావమ్ము లైక్యత నశించి
అభిలషితవస్తు వది దూరమందె నిలుచు.

తే. అమితవేదనా దీర్ఘఖేదము లభించు
వక్షజడతయె యెడఁద కావరణ మగును
ఇల జనులు పరస్పరము గుర్తింపలేరు
విశ్వము పడుచు లేచుచుఁ వెడలుచుండ...

తే. పరగి యెదుట నఖిలము సంపన్నమయ్యు
తొలఁగి సంతుష్టి నిరతము దూరమగును
ఇట్టి లఘుదృష్టి దుఃఖమ్ము నిచ్చుచుండు
ఎన్నియో కోర్కెలెపుడు జనించుచుండు.

తే. కాంక్ష లనియెడి శైలశృంగమ్ము లశ్రు
జలధరమ్ములఁ జుంబింపఁ దలఁచు నిండు
జీవననది హాహారవ జీవనములఁ
గలఁగి పెల్లు పీడాతరంగములు రేగు.

తే. లాలసాయుత యౌవన రమ్య సమయ
మాకురాలెడి కాలమై యరుగుచుండు
బహుళ నవ్యసందేహముల్ ప్రభవమొందు
అందుచే భీతసంతప్త మగుచు నెపుడు... 65

తే. స్వజన వైరము తిమిరమై వరలి నిండి
పృథుల నీల 'కుహు' వలె వ్యాపించుచుండు
బహుళ సస్య సుశ్యామల ప్రకృతి లక్ష్మి
తల్లడిల్లును దారిద్ర్యదళిత యౌచు.

తే. అమిత తృష్ణార్తి కాకృష్టుఁ డగుచు నరుఁడు
పతఁగ మై యంత గాఢ దుఃఖాబ్ధి యందు
శక్రచాప మై మార్చు నజస్ర చతుర
బహుళ నూతన రమణీయ వర్ణములను.

తే. పరఁగదు పరిపూత గతినిఁ బ్రణయమెచట
స్వార్థముల నావృతమ్మయి సంకుచితము
భీతమును నగు- సృష్టి జీవితము విరహ
భరితమైసాగు కరుణ సంస్ఫురిత గీతి.

తే. సీమయౌ నిరాశా శోణ చిత్రవర్ణ
క్షితిజ మతుల కాంక్షా ఘనసింధువునకు
విభజనము సేసికొని నిన్ను వే విధాల
నిచ్చ వలతు వందరను ద్వేషింతు వీవు

తే. ఎనయు వైరము మస్తిష్క హృదయములకు
ఎట్టి సద్భావ ముండఁబో దీద్వయాన
బుద్ధి యెటకైన హృదయము న్బొమ్మటన్న
నరుగు మరి యెటకొ వికలమగుచు నద్ది. 70

తే. వర్తమాన క్షణమ్ములు పరమ దుఃఖ
భారమున సాగు- సుందరస్వప్న మగు
నా యతీతము, నీవు జయాపజయము
లనెడి యుయ్యల లూగెదవయ్య మనువ!

తే. అల నసీమ మమోఘమ్ము నైనశక్తి
సంకుచితమగు బహుభేద సంభరితము
భక్తి జీవితమును గడు భయద గాఢ
కష్టపథమున నడిపించుఁ గడక నపుడు...

తే. లేక యసక లాహంకార లీల నొక్క
కడ మహాసక్త యగును రాగమయి, అపుడు
నియతిచేఁ బ్రేరితమ్మయి నిశ్చయముగ
బంధితమ్మగు నిజసీమ వ్యాపకతయె.

తే. పరమవిద్య యగుచును "సర్వజ్ఞ" మైన
జ్ఞానలఘ్వంశ కొన్ని ఛందములు వలుకు
లలిత సత్కళా కరణ కార్యము ల వెల్ల
ఛాయవలె నౌచు జగతి నశ్వరము లగును.

తే. నిత్యతకు దూరమగుచు నిర్నీతిఁ దరలుఁ
గాల మిలలోన మనువరా! క్షణము క్షణము
తెలియలేవు శుభేచ్ఛకుఁ గలదు చెడుగు
కంటె ఘనశక్తి- తర్కానఁ గర్మచెడును. 75

తే. జీవితమ్మెల్ల సమరమై చెలఁగు-స్వచ్ఛ
భావనిచయ మా రక్తాగ్ని వర్షమందుఁ
బడి నదించునీ శంకల వ్యాకులతను
జెంది నీకు నీవె యరివై చిత్రగతిని...

తే. ఆవృతము వేసికొనుచు ని న్నపుడు నీవె
కృత్రిమంపు నీ రూపుఁ జూపింతువయ్య!
వసుధపై హంకార స్థూపములు పడుచు
నుండును, మహోన్నతుల నొందు నుజ్జ్వలముగ.

తే. సంసృతిరహస్య విలసన చతురయగుచు
స్వచ్ఛవిశ్వాసభరిత యా శ్రద్ధ నీకు
నెల్ల నిజ నవనిధి సమర్పించి తానె
యిటుల నీ చేతనే మోసగింపఁ బడియె.

తే. వర్తమానమ్ముచే నీవు వంచితుండ
వగుచు నాగిపోదువు భవిష్యమ్మునందు
బహుళ విస్తృతి నెసఁగు ప్రపంచమెల్ల
శుద్ధ విరహితమై తోఁచు శోభతరిగి.

తే. ఆ జరామరణము లన్న ననయ మీవు
చిర మశాంతి వహింతువు- జీవితమున
నెద్ది పరివర్తన మ్మని యింతవఱకు
రహి దలంచితో యదె యమరత్వ మయ్య ! 80

తే. భ్రమ వహించి, కైకొని నీవు వ్యాకులతను
దానినే యంతమని పల్కఁ బూనినావు
ఓయి దుఃఖనిబిడ చిరయోజనా ప్ర
తీకమా! నీవు నిరత మస్థిరుఁడవోయి!

తే. ఈవు శ్రద్ధను వంచించినావు మనువ!
విధిని గ్రహరశ్మి గణ తంతు వితతి బిట్టు
కట్టుకొని ప్రాంతపుంతలఁ బట్టి యటులె
నడచెదరు మనుజులిల ననారతమ్ము.

తే. “అఖిల మీ లోక మగును గళ్యాణభూమి”
యనెడి శ్రద్ధారహస్యమ్ము నరయలేరు
ప్రజలు–దీని నత్యాచారి యాత్మలోన
నెంచి మిథ్య యౌ ననుచు వంచింపఁబడును.

తే. ఆశయం దతండు కడు నిరాశఁ జెందు
బహుశ నిజబుద్ధి విభవాన భ్రాంతుఁ డగును
ఎప్పు డాతఁ డలసి పయనించుచుండు
పృథుల జగతీ మహాదీర్ఘ పథములందు.

తే. మింటికడలి నొదిఁగి మహామీన మటుల
లీనమయ్యె శాపఁపు ప్రతిధ్వాన మపుడు
ఫేన సముదీన తారకా విసరమెల్ల
మృదుల పవనతరంగాళి మెఱయసాగె. 85

తే. నిఖిల లోకము స్తబ్ధతా నిలయ మగుచు
మౌనముగ నుండె నుండె తంద్రా నయాల
సతల విజన మౌనా ప్రాంతము తిమిరమ్ము
పేరుకొన్న రజనివలె బిట్టు మనువు...

తే. నిశ్వసించుచుండె నశాంతి నిగుడి మెఱయ
చిత్తమున నాతఁ డపుడు యోజింపసాగె
ఆతఁడే నా యదృష్ట మై యరుగుదెంచి
నాఁడు మరల భవిష్యమ్ము నవ్యఫణితి...

తే. వ్రాయఁగా ఆతఁడే ముసు పరఁగఁ దనదు
స్నిగ్ధనీలిమ నలమె నా జీవితమున
ఎపుడు సాగు యాతన యంత హీనముగను
అరయ నీయెడ లే దుపాయాంతరమ్ము.

తే. శ్యామలమ్మైన లోయలో నమృతనాద
బంధురమ్ముగ నిర్లిప్త భావభరిత
యల సరస్వతి కమనీయచలన యగుచు
నిద్ధ గంభీరముగఁ బ్రవహించుచుండె.

తే. అమరి నిష్ఠుర జడవిషాదములు వోలె
నుండెc బడి యచట నిపేక్షితోపలములు
అద్ది కేవల మధురగానాళి తోడc
దరలు మంజుల ప్రాసన్నతా స్రవంతి... 90

తే. నిరత కర్మప్రతీకమ్ము తరలి యేగు
నద్ది జ్ఞానమెల్ల స్వవశ మైనయట్లు
ఉండి యుండి హిమ సుశీతలోర్మికాళి
తటములను దాకుటలు, వానిc దమిని జ్ఞాన...

తే. వినిమయ వరము లరుణకిరణములు నిజ
కాంతి నలముటలును జిత్రగతులc దోcచె
స్నిగ్ధ సంవాద మెద్దియో చెప్పు చెపుడు
నరుగుచున్న దయ్యాత్మ పథాధ్వనీన.

తే. అమృతమధుకాంతి తూర్పున నలమె- నందు
కమలమొక్కటి విరిసె బంగారుధూళి
కలcగి యద్దాని తావికిc గలరవముల
నీలవర్ణ ఖగాళి యున్నిద్రమయ్యె.

తే. మించి నాలోకరశ్మి నిర్మితిని గన్న
యమలి నోషస్వినీ మృదులాంచలమున
సలుపcగా మధువితరణ సకలదిశల
నుదయపవన మాందోళన మొందుచుండె.

తే. వనితయొక్కతె యా రమ్యఫలకమందు
నవ్యచిత్రమ్ము పోల్కి కానంగcబడియె
కమ్ర నయనోత్సవ ప్రతీకమ్ము-ఆమె
మ్లాన రహిత నవనళినీ మాల నిజము. 95

తే. రమ్య సుషమాసుఘన మండలమ్ము స్మితము
సరణి సృష్టియందున వెదజల్లుచుండె
సుమధుర సురాగ మర్థి- విస్ఫూర్తి నిదుర
జీవన విరాగ తమము తాc జెందుచుండె.

తే. లలిత కేశముల్ తర్కజాలమ్ము వోలెఁ
జిందరగ వందరగఁ గడు చెదరియుండె
విశ్వమకుటమ్ము పోలిక వెలసి మెఱయు
నబ్జఖండమ్ము వలెనొప్పె నామెనొసలు.

తే. పద్మపత్ర చషకములై వరలు కనులు
లలిఁ గురిసె ననురాగ విరాగములను
గుంజరిత మధుపయుత ముకుళము మాడ్కి
నమరె గానభరితమ్మైన యాననమ్ము.

తే. వక్షమునఁ బ్రపంచజ్ఞానభర మహమ్ము
సర్వము సమీకరించి యుంచఁబడి యుండె
తనరు నొక హస్తమున వసుధాతలంపు
కమ్రజీవిత రససార కర్మపాత్ర.

తే. అన్యమిచ్చును మధురాభయావలంబ
నమ్ము యోజనా ఘనత రానంతమునకు
త్రివళి త్రిగుణ తరంగమై తివురు నామె
రమ్యకాంతివసన మరాళముగఁ గట్టె. 100

తే. తాల సంయుత గతి పాదములను దనరి
ప్రాణముల కేక యట నీరవముగఁ దోఁచె
జడముగా నుండె జీవనసరసి భంగ
హీనమై– మహాహిమము వ్యాపించియుండె.

తే. చంచ లానిలమొలసి నిస్తబ్ధముగను
దీర్ఘమౌ నలసతను నిద్రించుచుండె
కడగి త్రావె మానస కంజ కళిక యాత్మ
మధుర మధుబిందువులను దా మౌనముగనె.

తే. అచట రుద్ధములయ్యె దిగంతములను
స్వనము– లాకస్మికమ్ముగా ననియె మనువు
"స్వాదు హసన సుచైతన్యసహిత యగుచు
నరుగు దెంచెను, హేమాభ, యతివ ఎవతె?"

తే. తంద్ర స్వప్నములు తిరోహితమ్ము లయ్యె,
విపుల కాంతివన్మాయ వ్యాపించియుండె
ప్రణయపులకల నెసఁగు నా స్పర్శనమ్ము
గడచిన యుగమ్మును బిలువఁ గడఁగె నపుడు.

తే. అలలు పలుమారు నృత్యమ్ము లాచరించు
నువిద ప్రతిభా ప్రసన్నత లొదవఁ బలికె
"ఇడను నేను, నీ వెవ్వర, విచట నుంటి
వార్య! డోలాయమానుఁడ వగుచు నిటుల?" 105

తే. పలుచని ముకుపుట మదరిపడుచు నుండె
అపుడు నిండితోఁచిన దమూల్య స్మితమ్ము,
"విశ్వపథికుఁడ వినుము నా పేరు మనువు
ఇంతి! నే క్లేశములను భరించుచుంటి".

తే. "స్వాగతము! కను నీ ప్రదేశ మిదియెల్ల
శిథిల సారస్వతావని చెదరిపోయె!
నాదు దేశమిది, ఇటు వినాశమొందె
భౌతికంపు టస్తవ్యస్తఫణితి వలన."

తే. "కనుచు నిద్దాని దీనతాకలిత నగుచు
ననయ మిట్టులె యుండఁబో దనుచు నమ్మి
యాశతో శుభదిన మెదొ యరుగుదెంచు
నంచు నిటఁ బడియుంటి నే నార్యవర్య!"

***

తే. "వచ్చితిని దేవి! తెలియఁగా బలుకు మిపుడె
యమలజీవన నైజ మూల్య మెది యగునొ
దివ్య మహనీయ గుణ! నీవుతెలుపు మింక
భవ భవిష్య ద్వారమును నాపై రహించి.

తే. ఈ జగత్తుహరాన సృజించి యింద్ర
జాలమును, గ్రహతారకా సముదయమును,

విమల విద్యుత్తతులను, వ్యాపింపఁజేసి
నట్టి యా మహాకాళుఁ డత్యంత జలధి... 110

తే. వీచి కాభీల నటన గావించుచుండె
ఈ వసుంధ రాల్పప్రాణు లెల్ల భీతిఁ
బరగఁ గోరెనే యెడద నిష్ఠుర కఠోర
సృష్టి నాశనవిజయ మై యెసఁగు టేన?

తే. నాశయుత మైన దాని నీ నాటివఱకు
నేల తలఁచిరి మూర్ఖులు సృష్టి యనుచు
దాని యధిపతి యెవ్వఁడో తనరుచుండు
నిం కొకండు నెచటనో వసించుచుండు.

తే. అరుగ లేదు దుఃఖఁపు కేక యతనివఱకు
సుఖ మనెడి నీడము మివులఁ జుట్టియున్న
యది విషాదావరణ మిట్లనవరతమ్ము
కోరి యెవరుంచి రీ యవకుంఠనమును.

తే. నెగడుఁ గడుదూరమున శనినీల జగము
దాని చాయవలెను గ్రిందఁ బైన నిటుల
దుఃఖగగనము వ్యాపించి తోచుచుండు-
దాని పరమున నెద్దియో తనరుచుండు-

తే. ఘన మహా కాంతిపుంజ మొకం డటంచు
చెప్పఁబడుచున్నయది- ఇచ్చి స్నిగ్ధకిరణ
మొం డది నియతిజాలమ్ము నుండి ముక్తి
వడసి స్వేచ్ఛనొందుటకుఁ దోడ్పడఁగఁ గలదె?" 115

***

తే. "ఎద్దియైనఁ గాని మ్మది యేల పలుకు?
వెట్టినరుఁ దుండఁగా నమ్మ వీలుపడదు
అతఁ డెఱిఁగి నిజబల దుర్బలతల నుంచ
వలయుఁ జరణము గంతవ్యపథము నందు.

తే. కరములను జూచి యాచింపఁ గడఁగరాదు-
నడుపవలయును నిజపాద నళినయుగళి
ఏ నడువవలె ననుధ్యాస యెవని కున్న
వాని నెవ రెపుడాపఁగాఁ బూనఁ గలరు?

తే. అవును నిజమిది- నీ 'సహాయకుఁడు' నీవె
బుద్ధి యెదిచెప్పు దాని నొప్పుకొన కెద్ది
శరణు- ఎన్ని యూహలును సంస్కారములును
గలవొ వాని కన్యోపాయములును లేవు.

తే. పరమ రమణీయ మైశ్వర్య భరితమైన
ప్రకృతి మర్మజ్ఞరహిత మై పరగుచుండు
అర్థి నద్దాని ప్రతిసీర నవసరింపఁ
గడఁగి నీ వింకఁ గర్మలీనుఁడవు గమ్ము.

తే. నియమనము, పాలనమ్మును నీ వొనర్చి
నీ క్షమత నింక వృద్ధినొందించుకొనుము
ఎపుడు విషమత్వము సమత యెచటనుండ
వలెనొ నిర్ణయమొనరించువాఁడ వీవె. 120

తే. బహుళ విజ్ఞాన సాధనోపాయమునను
జడత నెల్ల చేతనతగ సలుపుమయ్య!
అపుడు వ్యాపించు భవదీయ యశ మనంత
విశ్వ కుహరాంతరాన సంప్రీతిదముగ."

తే. హసన మొనరించినది శూన్యమైన లోక
మా గగనము అద్దాని గర్భాంతరమున
జీవన మరణ శోకముల్ చేరి యెన్ని
యో వసించి నశించెను యుగయుగాల.

తే. మించి హృదయముల మధు సమ్మేళనములు
విరహ శోకములై వలపించె నచట
ఈ విషయ ఘనభారమ్ము నెల్లనేఁడు
తన శిరమ్మునందు మనువు తాల్చినాఁడు.

తే. నరుఁడు వహియింపఁగా పాలనాభరమ్ము
తెలిసె నుషనవ్వినది తూర్పుదిక్కునందు
అట్టి కౌతుకమును గన నరుగు దేరెఁ
బరమ చంచల మలయజ ప్రౌఢవనిత.

తే. ప్రకృతి సుందరీ మృదుకపోలములఁ దోఁచు
లాలిమను గని యనురాగ లాలసతను
మత్తుఁగొన్నట్టి తారకా మహితదళము
క్రిందఁ బడుచుండెఁ జిక్కని యందములను.

తే. ఫుల్ల జలజాత కాననభూము లందు
సాగె నళికుల నర్మభాషణము లపుడు
వసుధ సకలము, సంతోషవర్తనమున
మరచి శోకము, కన్పట్టె మంజులముగ.

తే. “జీవిత నిశీథ తిమిరము చెలియ! అదియె
నిన్నుఁగని పర్వువెట్టుచు నున్న దార్తి
నాననముఁ గప్పికొని క్షితిజాంచలమున
నీవు నిల్చినయెడఁ దాను నిల్వలేక

తే. ఉవిద! ఇడ! ఉదార వయి నీ వుషసివోలె
వచ్చితివి నేఁ డిచటికి నా భాగ్యవశత
సుప్త మన్మనోభావ నిస్తుల ఖగాళి
కలరవమ్ముల తోడ మేల్కొనియె నిపుడు.

తే. కిరణ వీచికానిచయ సంక్రీడఁ దనరి
నవ్వుచుండెఁ బ్రసన్నత నవకములను:
అన్య– యవలంబనల్ విడి యర్థి బుద్ధి
వాదన న్గొన బుద్ధి యేఁ బొందినాఁడ.

తే. అఖిలములు వికల్పము లిఁక యరుగు గాత!
యమల సంకల్పములు అర్థి నగునుగాత!
జీవితము కర్మమయ!! మిలఁ జెలఁగు చెపుడు
విమలసుఖసాధన ద్వారవివృతి యగుత!!”

# స్వప్నము (ఆందోళన)

తే. అరుణ జలజ కేసరతతి, నతివ, సంజ
కొనుచు నెడఁదకుఁ దృష్టిఁ జేకూర్చుకొనియె,
నింతదనుక– నా నీరజ మెపుడు వాడి
వ్రాలెనో, దానినెట నామె వడయఁగలదు.

తే. క్షితిజము ధరించిన నొసటి స్నిగ్ధకుంకు
మము తొలంగె కరాళ కాళిమ కరాన
వృథగ మొగ్గల మీఁదఁ జరించుచుండె
లీలఁ బుంస్కోకిలా కాకలీ స్వనమ్ము.

తే. వసుధపైన కామాయనీకుసుమ మిపుడు
వ్రాలిపడియుండె– లేదా మరంద మధువు
ఆమె యుండె రేఖాచిత్ర మటుల–అందు
తమ్య మోహన మధురవర్ణములు లేవు.

తే. అది ప్రభాతవేళా కళాయత విహీన
చంద్రబింబము– జ్యోత్స్నా ప్రశస్తకిరణ
చయములే దాయమ రవియు, శశియు, తార
కలును లేని సంజగతిని గానుపించు.

తే. సరసిజమ్ములు, నవదాత శతదళములు,
మంజు లేందీవరమ్ములు మలఁగి తూండ్ల
వ్రాలి వాడిన సరసి యా శ్రద్ధ నేఁడు–
రావు మృదురవమ్ముల బంభరమ్ము లటకు. 5

తే. శ్యామలత్వ చంచలతల నామమెచట
మోము చూపదో యట్టి జీమూతమామె
హిమతలమ్మునను ఘనీభవించి నట్టి
శైశిర క్షణ కూలంకషమ్ము ఆమె!

తే. విజన మౌనగభీర సంవేదనమ్ము-
ఝిల్లికా ఝుంకృతు లచట చెలఁగ విపుడు
అఖిల ప్రాపంచ కాస్పృష్ట మౌ నుపేక్ష
ఒక్క వేదనారూపమ్ము నొందియుండె

తే. హరిత కుంజ మంజుచ్ఛాయ యవని నిపుడు
చేసికొనుచున్న దమలి నాశ్లేష మెసఁగి
ఒడ్డు లెఱుఁగక పరువెత్తు నొక్క చిన్ని
విరహ నిమ్నగ రూపాన వెలయు నామె.

తే. లీల నుడ్డీన విహగ బాలికలు వోలె
నీల గగనానఁ గిరణాళి నెఱిఁ జెలంగె
అలసి స్వప్నలోకమునకు నరిగె నవ్వి
యర్థి శయనింప నిద్రాశయమ్ము పైన

తే. కాని, అయ్యెడ బ్రతుకులో గడియయైన
విరహిణికి శ్రాంతి కనఁగ లభింపదయ్యె
స్మృతి మెరసినది క్రొంగ్రొత్త మెఱపుపగిది
క్రమ్మసాగెఁ జీకటుల మేఘమ్ము లపుడు. 10

తే. సంజ యనియెడి నీలకంజమ్ము వీడి
వెల్వడిన శ్యామల పరాగ విసర మపుడు
పర్వత దరీ సవిధ ధరాభాగమెల్ల
నెమ్మదిగ నెమ్మదిగ క్రమ్మి నిండుచుండె.

తే. అంచిత తృణ గుల్మ ఘన రోమాంచితములు,
నగము లా దుఃఖ కథను వినంగ సాగె
స్వరములను శ్రద్ధా శూన్యవిశ్వాసములను
గలపి యెల్లెడ నలమగాఁ గడఁగె నంత.

***

తే. "బ్రతుకునందు మందాకినీ! పలుకు, దయను!
సమధిక మ్మెద్ది సౌఖ్యదుఃఖములలోన?

గగనమందలి తారలు! కడలి బుద్బు
దముల యధికములు?–గణింపఁ దలఁపుమమ్మ!

తే. ఒందఁ బ్రతిబింబములను నీ యందుఁ దార
లుదధిఁ గలియుటకై యేగుచుంటి వీవు?
రెండు నివి ప్రతిమూర్తులై యుండెనేమొ!
ఈ రహస్యమ్ము నీ వెఱింగింపుమమ్మ!!

తే. బహువిధమ్ముల నాకాశపటము మీద
నెన్ని చిత్రాలు పుట్టి నశించుచుండె
పరఁగు నన్నిఁట నింద్రచాపమ్ములోని
రంగులను బోలి మెరయు వర్ణమ్ము లొదిగి. 15

తే. కాని, క్షణమున సకలాణుగణము లెల్లఁ
గరఁగి, నీలశూన్యత వలె, గాఢ వేద
నా భరిత ధూమలపు వసనమ్ము నొందు
వాంఛతో నేయుచుండెఁ బ్రపంచమునకు.

తే. ఉదిత దుఃఖాన నాదు నిట్టూర్పుగాడ్పు
వెడలకుండుత ఈ కుహూవేళ యందు
స్నేహమును ప్రజ్వరిల్లగాఁ జేసి వెల్గు
నిట్టి లఘు దీప మీయెడ నెచట నుండె?

తే. ఆరిపోకుండుఁ గాక సంధ్యాంశు వటులఁ
బరఁగు చీ కుటి నున్న దీపశిఖ యెపుడు
శలభ మెయ్యది లేకున్న సవిధమందు
మంచి దిది యొంటి వెల్గుచు మించుఁ గాక!

తే. ఏమి చెప్పినఁ గోకిల మ్మేను విందు
మౌనముగ–ఐన నియ్యెడఁ గానఁబడదు
మున్ను సమ్మోహనాకృతి నున్నయట్టి
ప్రసవధూళీ మహోత్సవ ప్రాభవమ్ము.

తే. ఆకురాలు కాలంపు శూన్యమగు శాఖ!
తివిరి సంజ కూడినది ప్రతీక్షతోడ!!
మదిని గట్టిచేసికొని నెమ్మదిగ సకల
మీవు, కామాయనీ, సహియింపవలయు! 20

తే. చెదరు శాఖికల నికుంజసీమ లెల్ల-
దుఃఖ నిశ్వాస యుతములై తొలఁకు- అట్టి
స్మృతిసమీరము వీచు నియ్యెడను- అయిన
నెవరు మేళనకథ వినిపింతు రిపుడు.

తే. ఎట్టి యపరాధమును లేక యీ జగ మిపు
డలుగుచున్నది యభిమాన యటుల నేఁడు
ఇటుల విడి రెప్పలను, బ్రవహించుచున్న
బాష్పజలములు కడుగునే పదయుగమ్ము.

తే. విడివడిన కొక్కియముల సంప్రీతిఁ దనర
నెపుడు నిస్సహాయతతో లగింతు రపుడు
కష్టభరితమ్ము లైనను గడచినట్టి
గడియలే తీయనగుచును గానుపించు.

తే. ఆత్మ చిరతర సౌందర్య మందు నెద్ది
సత్యమో య దెటనొ దాగె చాల- చిక్కు
వడిన సుఖదుఃఖ ఘనత రావర్తములను
నెట్లు విడువగాఁ గలవొ యూహింపఁ దరమె!

తే. సారహీనము లైన యా సంగతు లిఁక
విస్మృతము లగుఁగాక యివ్వేళ- అట్టి
యా జ్వలితహృదయము, నిపు డట్టి శీత
లప్రణయమును గానఁగా రావు వెదుక. 25

తే. ఆ యతీతమున విలీనమయ్యె-ఆశ
మధుర వాంఛాప్రతతి నేఁడు- మత్ప్రియునకుఁ
గలిగె దారుణ నిష్ఠుర ఘనజయమ్ము!
కాని ఇది నాకు నోటమి కాదు కాదు.

తే. బంధనంబయ్యెను పరిరంభణ సుఖమ్ము
వరలు నే కడ నట్టి శంపాస్మితమ్ము
మధురవిశ్వాస మేలనో మసలసాగె
ముగ్ధ మానస మహిత విమోహ మిద్ది.

తే. జీవితము సర్వము నిట వంచింపఁబడియె!
అల్పురాలి సమర్పణ మౌ నిదెల్ల!
ఎన్నడో యెయ్యదియొ నేనె యిచ్చివైచి
నట్లుగా నాకు ననుమాన మగుచునుండె.

తే. ఇట్టి ప్రాణాలవినిమయ మెంత భయద
సంకులంబైన వ్యాపారసరణి గలది?
ఇవ్వవలసిన సర్వము నిమ్ము- కాని
గైకొనుట కెన్నఁడును నీవు కాంక్షవడకు.

తే. పడయఁగాఁబోదు తాఁ బరివర్తనమున
కైన తుచ్ఛప్రతీక్ష సమాప్తి నెపుడు
సంధ్య ద్యుమణి నొసఁగి వెదజల్లఁబడిన
యుడుగణమ్ములఁ బొందుచునుండె నిపుడు. 30

తే. బహుళ మాయాబలమ్ముతో, స్వరసుకూజ
నములఁ గుసుమసంవృద్ధి ననంత నవ్య
కిరణ కళికా మనోహర క్రీడ మెరయు
స్మేర మంజుల మాయ విస్మృతిని జెంది-

తే. అంతరిక్షమ్మునం దరుణాద్రి నుండి
హసనముల నేఁగు దెంచిన యా కొలంది
దినము లదె మోసగించి తాఁ దిరిగివత్తు
మని చిరప్రవాసమ్మున కరిగె నిపుడు.

తే. నవ శిరీష మధురసుగంధమ్ము తోడ
భరిత మాన వసంత శార్వరులు దీర్ఘ
జాగరణ నిహతి సహింపఁజాల కలిగి
యరిగె నరుణారుణము లైన యాననముల.

తే. చెప్పునటు తీయ తీయగా స్నిగ్ధకథను
దివస మిదె నింగి తమిని వ్యాప్తిగనుచుండె
నాదు మేల్కొనుచున్న స్వప్నమ్ము లపుడు
తారలై చిరునవ్వు దొంతలర నవ్వు-

తే. స్వాదు వనలతాంగీ నికుంజమ్ము లెల్ల
నమల వాంశిక మధురస్వరాళి నిండె
ప్రీతిఁ దమయింటి పిలుపుల విన్న వెనుక
వలసినట్టివా రెల్లరు వచ్చినారు. 35

తే. కాని ఆ పరదేశి రాఁ గడఁగ లేదు
గడచె యుగము ప్రతీక్షలో- కణకణములు
గను త్రియామార్ద్ర పక్ష్మములందు నుండి
తుహిన బిందువుల్ వర్షింపఁదొడఁగె నపుడు.

తే. మానసస్మృతి యనెడి పద్మమ్ము విరిసె
ప్రౌఢ మకరందబిందువుల్ రాలుచుండె
మసృణములు, పారదర్శిక మౌక్తికమ్ము
లివ్వి- ఎన్ని చిత్రాలు బింబించె నిందు.

తే. కంటిచూపులు లేని చీఁకటిని నశ్రు
కణములు తరల చంచలా కణగణాలు
ప్రాణయాత్రికుఁ డిట్టి సంబళము వడసి
యిచ్చుఁ గల్పనాజగము సృజింపసాగె.

తే. నిండె రక్తాబ్జకోణముల్ నిత్యనవతు
షార బిందుపరంపరా సముదయముల
ఎన్ని వ్యత్యస్త ప్రతిమూర్తు లేర్చి యిప్పు,
డవిగొ, యాదర్శ చూర్ణమ్ము లగుచునుండె-

తే. అట్టి యనురాగ ప్రేమ హాసాదు లెల్ల
నరిగె నిదురింప నిచ్చమై యాంధ్య మందు
స్మృతు లనెడి ఖద్యోతములును, చెలఁగ భీతి,
వెల్గు వర్షా విరహ నిశావేళ యందు. 40

తే. శూన్య గిరిపథమునఁ బ్రతిశ్రుతుల నీను
శృంగనా దార్భటీ ధ్వను లేఁగుదెంచె
కాంక్ష యనెడి లహరిక దుఃఖతటిని పులి
నాంకమం దిపుడు విలీనమగుచు నుండె.

తే. వెలిఁగె నాకాశదీపికా విసర- మెగిరి
యరిగె నభిలాషలను శలభాళి యటకు
నేత్రముల నశ్రుజలములు నిండియుండె
ఆరలేదు జ్వలించు న య్యగ్నికీల.

తే. 'అమ్మ!' అపుడు దూరాగత హర్ష రవళి
మీరి ధ్వనియించె శూన్య కుటీరమందు
తల్లి ద్విగుణీకృతంపు టుత్కంఠ మెరయు
నెడఁద లేచి యటకుఁ బరుగెత్తె, అచట...

తే. పాంసు ధూసరిత మనోజ్ఞబాహువులను
విడివడిన ముంగురుల్ పెనవేసికొనియె
అంత జ్వలియించె నారుచున్నట్టి రజని
యను తపస్వినీ ఘన పవిత్రాగ్నిపాత్ర.

తే. "ఓరి తుంటరి! ఏ కడ నుంటి వీవు?
నాదు విధియటు తిరుగుచున్నాఁడ వింత
వరకు తండ్రి కౌ ప్రతినిధి! పరగ నిచ్చి
నావు నీవును సుఖ దుఃఖ భావయుగళి.

తే. గంతు లెట వనచపలమృగమ్ము రీతి
వేయుచుంటివొ! ఎప్పుడు బెడసి యలుకఁ
గొందువో యని నే భీతినొందుచుంటి
అలుక నీ కైనఁ దీర్పఁగా నగునె నాకు!"

తే. "నే నలుగుటయ నా యల్క నీవు తీర్చు
టయ ఇ దేమి? మంచిగనె మాటాడినావు
ఇదిగొ! నే నిపు డేగి నిద్రింతు- మరల
నంతియే కాదు, నేఁడు మాటాడనమ్మ!

తే. పండినఫలాల నా బొజ్జ నిండియుండె
కలుగదు నిదుర కెట్టి భంగమ్ము నాకు”
శ్రద్ధ ముద్దిడి కొంత ప్రసన్నత మరి
కొంత దుఃఖము తోపఁగా గోచరించె.

తే. అట్టి లఘుజీవనపుఁ టల్పమైన తీయ
నగు క్షణమ్ములు జ్వలియించు చపుడు తోఁచె
అతిశయపు టుదాసీన ముక్త్యంబరంపు
హృదయమున బొబ్బలై ప్రకాశించుచుండె.

తే. పవ లలపుఁగొన్న యాలోక భానుచయము
నీల నిలయాన నెచటనో నిలచి దాఁగె
అదియె కరుణాప్రపూరిత మ్మైన స్వరము
సృష్టిని మరల కరిగి నదింపసాగె.

తే. ప్రణయ కిరణంపు కోమల బంధనమ్ము
ముక్తియై యిదె ప్రాబల్యమును వహించు
కలదు దూరము! అది ప్రతిక్షణము నందు
నాత్మ కెంత సమీపమై యరుగుదెంచు!

తే. మూర్ఛితంబైన మనసున ముగ్ధ మధుర
చంద్రికను బోలు తంద్ర ప్రస్తరణఁ గొన్న
యపు డభిన్నుఁడై చెలఁగు ప్రేమాస్పదుండు
తనదు చిత్రమును లిఖించి తరలిపోవు.

తే. కడక కామాయనీదేవి కనుచు నుండెఁ
దన సకల సౌఖ్యమును స్వప్నదర్శనమున
యుగములుగ శీర్ణ వంచిత యగు నెలంత,
లలిత రూపరి చిహ్నమాత్రముగ నుండె.

తే. అపుడు కోమల ప్రసవపత్రాళి పోల్కి
నమల పవనుపై నంకితమైన యట్టి
దిపుడు నభమున రేఖ లిఖించుచుండె
కొసరి యొక చాతకము సేయు కూఁత యగుచు.

తే. అనలకీల పోలిక, నిడ, యంతికమున
మించి, ఉల్లాసభరిత, జ్వలించుచుండె
మనుమహాశయు మార్గమ్ము మహిత కాంతి
యుతముఁ జేయుచుండె విపదు డుపమయగుచు. 55

తే. నవన వోన్నతి కారోపణముగ నొప్పె
అమర మహిమా కుధరశృంగ మటులఁ జెలఁగె
శ్రమయెరుంగ– దుత్సాహభరమ్ము మెరయఁ
బరమమౌ ప్రేరణాధార వలె నదించె.

తే. కాంత నవ సుషమా మయూఖ మ్మనంగ
హృదయ భేదన దృష్టి వహించె– ఆమె
యెచట చూచునో తమము బంధించి నట్టి
యచటి మార్గాలు వివృతము లగు తమంత.

తే. మనువరు సతత సాఫల్యమహిమ కామె
ఉదయ విజయినీ తారయై యొప్పు మెరసె
ఆశ్రయమ్మును కాంక్షించు నట్టిప్రజలు
అర్పణము సేసిరి శ్రమోపహారములను.

తే. ఇంపుగ మనునగరము నిర్మిం పఁబడియె
లీలగా నెల్లరు సహకరించినారు
స్థిరములుగ దృఢమైన ప్రాచీరములను
వరలె నతిబల– మందిర ద్వారచయము.

తే. ఆతప శిశిర వర్షమ్ము లందు రక్ష
వడయు సాధనసమితి సంపన్నమయ్యె
శ్రమజలమ్ములఁ దడిసి కర్షకులు పొలము
లను హలాల కర్షింత్రు హర్షమున నెపుడు. 60

తే. ఉండెఁ గరుగుచు లోహమ్ము లొక్క యెడను
భూరి భూషణాస్త్రములు రూపొందుచుండె
ఒకట సాహసుల్ నవ మృగయోపహార
ములను గొనివచ్చుచున్నారు మోదమొదవ.

తే. పుష్పలావికల్ వనసుమములను వలచి
సాము విరిసిన మొగ్గల సంతరించ్రు
రుచిర గంధ చూర్ణమగు నా లోధ్రరజము
నవ ప్రసాధన లెల్ల విన్ననువు నొందె.

తే. ఒకట సమ్మెటదెబ్బల కొదవు రోష
భరిత తీవ్రచండధ్వనుల్ ప్రభవమొంద
నొకట రమణీమనోజ్ఞ కంఠోదితములు
హృదయగానము లొలసి స్రవింపసాగె.

తే. ఎల్లరును నిజవర్గము లేర్పరించి
నయముననను శ్రమోపాయ మొనర్చుచుండ్రి
వారి సంయుక్త యత్న ప్రభావకలన
పురముననను వివిధవిధాల భోగ మమరె.

తే. లఘుతఁ గల్పించి దేశకాలముల కచటి
ప్రాణులెల్లరు కర్మనిర్మాయు లైరి
బహువి ధాత్మోపభోగ సంభారములకు
సర్వసుఖ సాధనలఁ గూర్ప సాగినారు. 65

తే. అచట విస్తృత పరమ బలాభిరక్ష
జ్ఞానమును, పరిశ్రమలు వికాసమొందె
వసుధ నిమిడి దాగినది సర్వమ్ము వెలికి
వచ్చుచుండె మనుజయత్న పరిధవమున.

తే. సృష్టి బీజ మంకురితమై చెలఁగి హరిత
వర్ణముల నొందుచుండె సాఫల్యగరిమ
ప్రళయ రక్షితుఁ డా మనుప్రవరు వలన
నద్ది యుల్లాసభరితమై వ్యాప్తినొందె.

తే. ఆత్మచేతను లేప్రాణు లాత్మకుశల
కల్పనల నేఁడు నిలువఁగా గల్గినారు
స్వావలంబన మౌ దృఢవసుధపైన
వార లిపు డెందును పిరికివడుట లేదు.

తే. అట్టి యద్భుత లోకమం దతివ శ్రద్ధ
చేరె మలయపవను ముద్దుచెల్లి వోలె
అరిగినది లోపలికి ప్రతీహారవరుల
మోసగించి సింహద్వారమును గమించి.

తే. అచటఁ జెన్నొందు రాజహర్మ్యమ్ము లతిశ
యోజ్జ్వల స్తంభ వలభీ సమున్నతములు
కాంతిశిఖలతో వెల్గొందు గాఢధూప
ధూమ సురభిళములు గృహసీమలచట 70

తే. స్వర్ణకల శోజ్జ్వల న్మహా భవనచయము
నంటియుండె పుష్పవనులు- అందు నొప్పు
మధ్యమధ్య ఋజు ప్రశస్త మార్గములును
దట్టముగ లతాగృహములు తనరునందు.

తే. అచట దంపతులామోద హాసభరిత
చిత్తులై చరింత్రు ప్రణయాశ్లేషములను,
సుమర జార్ద్రములు మదిరా సురభిళములు
భ్రమర రసికులు గుంజారవములు వినుచు.

తే. దేవదారు తరులకు సుదీర్ఘబాహు
లనఁగ నొప్పె శాఖలు-వానియందుఁ జిక్కు
వడును పవనతరంగాళి, బాలవిహగ
ములు ముఖరిత భూషణములపోల్కి పలుకు.

తే. వనము లందుండి యేతెంచు స్వరలహరుల
కచటి వేణుకానన మిచ్చు నాశ్రయమును
నాగకేసర పుష్పవనాన వెలసె
బహుళవ ర్ణాన్యమంజుల ప్రసవతరులు.

తే. అచట వైశ్వానరజ్వాల యటుల నామె
వేదిపయి నుపవిష్టయై విరియఁ జల్లు
చుండె శీతల సౌమన స్యోన్నయముల
ఎచట జడతాగుణమ్ము కన్పింపదచట. 75

తే. అడిగె మను: "వింక నేమైన నాచరింప
నిచట నున్నదియె మిగిలి" ఇడ పలికెను
"తావకీన విశేష కర్మావధాన
మందుఁ బడసినావె సఫల తాధికతను.

తే. సాధనము లెల్ల నైన వా స్వవశములు?"
"లేదు- నే నుంటి నింకను రిక్తముగనె
దేశనిర్మాణ మొనరించితిని- అయిన సు
దీర్ఘ శూన్యమౌచు హృదయదేశ ముండె.

తే. సుందరము మోము, నయనమ్ము లందు నాశ-
అయిన నివియెల్ల నెవ్వరి వయ్యె? నిండెఁ
బ్రథమ తుహినాంశు మోహన వక్రతయును,
కొలఁది రోషపూరిత భావకలిక లొలసి.

తే. అలుక తీర్చుట కదియె నేత్రాళి యందుఁ
గెరలి యనురోధ మెదియొ సంకేతమొసఁగు
ఎవరిదానవో నీ, వివి యెవరివోను
చెప్పవే, ఇపు డోసి నా చేతనమ్మ!"

తే. "ప్రజలు నీవారు ప్రజలకెల్లరకుఁ బతిగ
నిన్ను మదిలోన భావించుచున్న దాన
ఏల సందేహగర్భిత మిట్టి నూత్న
ప్రశ్నమును నేడు నే వినవలసి వచ్చె." 80

తే. ప్రజవ! కాదు నీ వోసి నా రాజ్ఞి! నన్ను
భ్రమకు లోఁజేయఁ దలపెట్టవలదు నీవు
మధుమరాళివి! నే ప్రేమమౌక్తికముల
నర్థి నేర్చుచున్నాఁడ నంచనుము తన్వి!

తే. కందుఁ గొనియున్న నా భాగ్యగగనసీమ
యందుఁ బ్రాచీపట మ్మటులమరినావు
కలికి! ఆకస్మిక వికాసకలిత వైతి
శస్త్ర సౌందర్య కాంతి సంభరితవైతి.

తే. కోర్కెతీరని కాంతిభిక్షుకుఁడ నేను-
ఓ ప్రకాశతన్వి! చెపుమ, ఒలయు మనదు
దాహ మంతయును మధురాధరరసాన
నెపుడు తీరునో తెల్పుమా, ఇంతి! ఇపుడు.

తే. ఇట్టి సుఖసాధన చయ, మహీన రమ్య
శార్వరీ శీతల చ్ఛాయ, స్వరవితాన
కకుభముల్- ఎద యున్మాదకలితమయ్యె-
కాయమునకు శైథిల్యతా గరిమగలిగె.

తే. వలదు నీవును బ్రజవు కావలదు రాజ్ఞి!
ఇట్టి సమయాన హుంకార మెసఁగఁజేసె
నరపశు- నట వ్యాపించె మందిరమునందు
నాంధ్య ఘనమాయ జీమూతమటుల నపుడు. 85

తే. గాఢ మాలింగనము, భయాక్రందనమ్ము
పిదప- తోఁచెను వసుధ కంపించినటుల,
ఆతఁ డత్యాచరణశీలి- అబల నారి
వెరచి రక్షణమార్గమ్ము వెదకుచుండె.

తే. గగనవీథుల రుద్రహుంకార మొదవె
తోడఁ జెలఁగె భయంక రాందోళనమ్ము
అరరె! 'ఆత్మజు' లగు 'ప్రజ'!! అరరె!! ఇద్ది
పాపపరిభాష యై కల్గె శాప- మంత...

తే. చదల నయ్యెడ క్రోధ సంచలిత దేవ
శక్తితతి యెల్ల క్షుభితప్రశాంతి నొందె
హరునయనము హఠాత్తుగఁ దెరచుకొనియె
వ్యాకులతనొంది కంపించె నపుడు పురము.

తే. పరఁగె నతిచారియై ప్రజాపతియె యిచట-
ఓర్చి దేవతల్ శివులయి యుండఁగలరె?
లే దజగవంపు మౌర్వి కీలింపఁబడియె
నుచిత మౌ ప్రతిచర్య తా నొందఁగోరి.

తే. ప్రకృతి త్రస్తయైనది– భూతపతి తదీయ
నృత్య విచలిత పాదమ్ము నెత్తెనటకు
భూతసృష్టి యెల్లఁగల గాఁబోవనుండె
ఆశ్రయార్థము వ్యాకులమయ్యె నెల్ల. 90

తే. అపుడు కలుషవిషయమున నార్తి మనుపు
స్థిరతచెడి స్వయముగనె సందిగ్ధుఁ డయ్యె
జగము మరల నట నెదియొ జరుగుననుచు
గలఁత గడగడ వణకఁగాఁ గడఁగెనపుడు.

తే. శంకఁ గైకొన్న యా సర్వజంతుతతియు
విలయపుం గ్రీడవలనఁ గంపించుచుండె
ఆత్మరక్షణచింతలో నఖిల ముండె
స్నిగ్ధ సుస్నేహతంతువు ఛిన్నమయ్యె.

తే. మున్ను రక్షణభారమ్ము గొన్నయట్టి
యమల ఘనపాలన మిపు డేమయ్యె– కాని
నడవ బయటి కయ్యిడ నిశాంతమ్ము వెడలెఁ
గ్రోధ లజ్జా ప్రపూర్ణ హృత్కుహర యగుచు.

తే. ఆమెఁ జూచెను ప్రజయెల్ల వ్యాకులతను
అడ్డి నిల్చి రాజద్వారమందుఁ గలరు
ద్వార పాలకుల్ ముందుకు వచ్చినారు
వారిభావాలఁ బరిశుద్ధఫణితి లేదు.

తే. అతికఠిన పాలనకు లొంగి యణఁగి యుండు
నెది యది విరుగు కాదేని యెత్తుశిరము
ప్రజలు నేటిదాక ననుకూలముగ నున్న
వారట నెదొ యోజించుచున్నార లిపుడు. 95

తే. చుట్టుఁ గోలాహలమ్ము కూర్చుండె మనువు
దాగి యాలోచనల నిండి తత్పరతను,
ద్వార మదె మూసియుంటచేఁ బ్రజలు చూచి
త్రస్తులైనారు నిలచునే తాల్మి యెదను.

తే. తొలఁకు శక్తి తరగల యాందోళనమ్ము
ప్రళయరుద్రుని క్రోధమ న్భావమచట
నున్న- దన్నివైపుల నుండి యొలసి క్రమ్మె
నళికనేత్రుని హేతినృత్యమ్మె యటకు.

తే. పక్షములు చాచి యుడ్డినఫణితిఁ బరఁగు
నట్టి విజ్ఞానమయ మైన యమృత కాంక్షి
ఎన్నఁడును గ్రిందికి న్వ్రాల నెడఁదగొనని,
సీమ లెఱుగని యాశలు, చెలఁగి సాగి...

తే. వరలు నధికారముల సృష్టి- వాని మోహ
మయ తిమిర మాయమును, వర్గ మహిత గర్త
మగుచు వ్యాపించె- ఎన్నండు నద్ది కనఁగఁ
బూడుకొనునది కా దెన్ని పుష్కరముల.

తే. కోర్కెతీరని మనువు సంక్షుభితుఁడయ్యె
కొంత- నాకస్మికమ్ముగా నంతరాయ
మేమి కల్గె! ఏ మయ్యె! ఇట్లేల ప్రజలు
గుంపుగాఁ జేరినారో గ్రహింపలేదు. 100

తే. రక్షఁ గోరి సలిపిన ప్రార్థనము త్రిదశ
క్రోధమున నొక్క పరమవిద్రోహ మైన
వికలతను జెందె మను- వట విశద మట్టి
ఘటన కుట్ర ఇడయు నున్న కారణమున.

తే. "ద్వారము నిదె బంధింపుఁడు, వారి నిటకుఁ
జేరనీకుఁ డియ్యెడ నిదె చేయు ప్రకృతి
లీలఁ గల్లోలము- నను నిద్రింప నిందు"-
ప్రకటమౌ క్రోధమున నిట్లు పలికె మనువు.

తే. అయిన మనసున భీతిల్లినట్టు లుండె
దానము, ప్రతిగ్రహము జీవితమున నెటుల
చెలఁగి సాగుచున్నవియొ యోజించుకొనుచు
మానసమున శయనకక్ష్యలోని కరిగె.

తే. వణకసాగె శ్రద్ధాదేవి స్వప్నమందు
కనులు విడివడె నప్పు డాకస్మికముగ
"ఏమి చూచితి నే నిపు డిద్ది యేమి?
ఇంత మోసకారిగ నతం డెట్టులయ్యె!"

తే. స్వజనమైత్రియం దెన్నియో భయముగొల్పు
గట్టి సందేహముల్ మదిఁ బుట్టుచుండు
ఇప్పు డేమగు నన్న యహీనయోజ
నలను రాత్రెల్ల గడిచె వ్యాకులతతోడ. 105

# సంఘర్షణము (ఆదేశము)

తే. స్వప్న మది శ్రద్ధ కొదవిన సత్యమయ్యె
సంకుచితదేహయై ఇడ స్తబ్ధయయ్యె
ద్వారదేశాల నిల్చిన ప్రజలలోన
ఘనతర క్షోభ నర్తింపఁగడఁగె నపుడు.

తే. భౌతికమ్మైన విప్లవప్రౌఢి నరసి
వికలతనుజెంది వా రతి భీతు లయిరి
రాజశరణమ్ము గొని భయత్రాణ వడయ
వార లచటికి పెనునాస వచ్చినారు.

తే. కల్గె వారల కట నవమానగరిమ
వర్తనము దుష్టమగుచుఁ గన్పట్టె నపుడు
నిఖిల జనమానసమ్ముల నిండియుండె
హృదయచింతా జనిత రోష హేతి ప్రబలి.

తే. ప్రజలు క్షుబ్ధులై ఆ ఇడా పాండు వదన
మచట వీక్షించుచుండి రత్యావిలతను
ప్రకృతి చెలఁరేగి సాగించు ప్రబలమైన
యమిత తాండవలీలయు నాగలేదు.

తే. ప్రజలగుంపులు వర్ధిల్లె ప్రాంగణమున
కోర్కె మెయి వచ్చి యట గుమిగూడినారు
ద్వారములు మూసి యల ప్రతీహారవరులు
యోజనా మగ్నులై నిల్చియున్నవారు. 5

తే. కపట మగురాత్రి ఘననీల పటమునందు
నణఁగి లోలోన దాగినయట్టు లుండె
ఉండి యుండి ప్రకటయగుచుండె మిగుల
వంగి మేఘగత యగు శంపాలతాంగి.

తే. చింతితునివలె మనువు సౌధాంతరమున
శయ్యపైఁ బడి యోజన సలుపసాగె
శంక, క్రోధమ్ము లనియెడి శ్వాపదములు
కడఁగి యాతని లోఁగొని కరువఁదొడఁగె.

***

తే. "ఈ ప్రజావళి నెల్లర నేర్పరించి
యమిత సంతుష్టి గలవాఁడ నైతి- కాని
చెలఁగి యే వీరియెడను గోపించి తంచు
నెవ్వ రనఁగలవారు న న్నెన్నఁడేని?

తే. ఎంత జవమున దొరకొని యేను ప్రీతి
వీరి పాలనమ్మును నడిపించినాను!
భిన్నులై వీర లయ్యెడ నున్నవారు
కనఁగ వీరల చాయ యొక్కటిగ నయ్యె.

తే. ఏలుటకు వీరి నేఁ బ్రయత్నించి బుద్ధి
విభవమున నొక్క జనతఁ గావించినాను
నియమముల సృజియించి నిర్నిద్రశక్తి
నడపుచున్నాఁడ పేర్మి ననన్యరీతి. 10

తే. కాని- ఏమి? నే నేని యవ్వాని నెల్లఁ
దొలఁగ కనుసరించి నడువవలెనె? నేను
నడకలో సుంతయును స్వతంత్రుడఁను గానె?
స్వర్ణమటుల నే కఁరగిపోవలెనె యెపుడు?

తే. ఎద్ది నా సృష్టియో దాని కెప్పు డేను
భీతినొందుచు నుందునే? ప్రీతిఁగొన్న
యేనె యవినీతి వర్తింపఁ గాను లేదె
కథిత శాసన భిన్నాధికార మెదియు!

తే. శ్రద్ధ కధికార మగు సమర్పణము- కాని
యద్ది కావింపఁగాఁ జాలనైతి నేను

ఏ ప్రతిక్షణమున ముందు కేఁగుచుంటి
అరయ నే నెప్పు డెయ్యెడ నాగినాను

తే. ఇడ నను నియమపరతంత్రుఁగాఁ గడంగి
చేయ నాశించుచున్నది చిత్తమందు
తన్వి యామెయె నా నిరాతంకమై ప
రంగు నధికారపదవి తిరస్కరించె.

***

తే. వివిధ గతులను తోఁచ నీ విశ్వమొక్క
బంధన విహీన ఘనపరివర్తనమ్మొ
దీని గతియందుఁ గన్పట్టు తిగ్మరశ్మి,
కుముదబాంధవ తారకా సముదయములు.

తే. తనరు చిచట రూపపరివర్తనము జరుగు
జలధి యగుచు నున్నయది రసాతలమ్మొ
అంబునిధి యొక మరుభూమి యగుచునుండె
జ్వాల జనియించి జ్వలియించు సాగరమున.

తే. నిఖిల వస్తు గర్భములందు నిండియున్న
దొక్క తర ళాగ్నివాహిని యుజ్జ్వలముగ
తుహిననగములు నవసరిత్తులను లీల
లను రచించియు ప్రవహించు నెనయఁ దరిగి.

తే. ఈ స్ఫులింగ మహానృత్య మెపుడొ యొక్క
క్షణము విచ్చేసి నిలువక గడచిపోవు
ఎప్పు డెవ్వరి కాగుట కిచటఁ దొరికె
గాఢ సౌఖ్యావహమ్ము సౌకర్య మరయ!

తే. తత మహాంతరిక్ష వివరాంతమ్ము లందు
శతశతమ్ముల తారకా సముదయములు
లాస్య రాస మనోజ్ఞ విలాసములును
నొప్పి యెయ్యెడ తూగాడుచుండెఁ జదల?

తే. తుంగగతుల విజృంభించు తోఁచు చిపుడు
కలఁగి రేగు వాతూలభంగమ్ము లెన్నొ!
అగణితము లివె శీత్కృతుల్! అహరహమ్ము
వరలి చెరలాడు నీ పరవశత యేమొ! 20

తే. మొనయు నీ విశాల జగ దున్ముక్త నర్త
నంపు ధృతతాళ సంస్పందనమ్ము ఘనత
నాత్మలయపయి గతిమయ మగుచునరుగు
మార్గమును విడ కెచట సమాదరమున.

తే. అయ్యదె పునరావర్తనం బరయుచుందు
మపు డపుడు మనము– నదియె యౌను నియమ
మంచు భావించెదము– దాని యనువు వలన
నడచుచున్నది జీవితానమ్ము కడఁగి.

తే. అయినఁ బ్రవహించు మహనీయ హాసరేఖ
రెప్పలపయిని రోదనలీల నిపుడు
వ్యగ్రులగుచు శతాధిక ప్రాణులిచట
పొలసి వెదకుచునున్నారు ముక్తి కొరకు

తే. జీవితమ్మున శాపమ్ము చెలఁగు చుండు
ఉండు శాపాన తాపము నిండి యెపుడు
ఈ వినాశమందునను దా నెసఁగఁగోరి
కొసరి సృష్టినికుంజమ్ము క్రొత్త లెనయు.

తే. "వెలసి కన్పట్టు నీ సర్వవిశ్వ మెపుడు
తిరుగు నొక నియమమున బంధింపఁబడియె"
ఇద్ది యొక కేక– వీరల యెడఁదలందు
బహుళమగు ప్రచారముఁ గొని వ్యాప్తినొందు. 25

తే. మించు నియమములను పరీక్షించి వీరు
పిదప సుఖసాధనము లని మది నెఱింగి
నారు– నే నిష్టపడలేను వీరె నేఁడు
శాస్త్రలయి ప్రవర్తింపఁగా జాలి నిలువ.

తే. ఏను చిరబంధన మ్మెది లేనివాఁడ!
నవత మృత్యుసీ మోల్లంఘన మ్మొనర్చు
చెపుడు చిత్తానుసారినై చెలఁగి నడతు-
ఇదియె యెవ్వేళ నౌను నా దృఢప్రతిజ్ఞ.

తే. నశ్వరం బైన సృష్టిలో నాది యెదియొ,
అదియె, ఆక్షణమె కనఁగనౌను మహిత
పృథుల చైతన్యమునకు సంప్రీతిదముగ-
కాక మిగిలినట్టిది స్వప్నకథయె యౌను.

***

తే. యోజనాశీల మైన నా యుల్లమెల్ల
పొర్లి క్షణకాల మపు డాగిపోయె- మనువు
సర్వమర్పించి యచట నచంచలముగఁ
గడఁగి నిలిచిన ఇడను దాఁ గనులఁగనియె.

తే. చెలియ యేమేమొ యింకను జెప్పుచుండె
"శాస్త్ర నియమమ్ము పాటింపఁ జాలఁడేని
యఖిలమును వినాశమ్మొందినట్లు- కాన
నిదియె నిశ్చయ మనియెద నెఱుఁగు మయ్య!" 30

తే. "అటులనా? నీవు మఱల నెట్లరుగుదెంచి
తివిట కో తన్వి! ఇంకను నేమియైన
నున్నవా యేమి విషయమ్ము లొదిగి యిమిడి
తావక హృదబ్జమున నుపద్రవకరాలు.

తే. ఇద్ది యంతయు నీ దిన మింతజరిగె
అయినఁ గల్గదె తృప్తి హృదంతరమున
ఏమె, ఓ యింతి! అందున నెంతమిగిలె?
ఏ మొనర్పగఁ బూనితివే లతాంగి!"

***

తే. “నీదు శాసన సత్త్వంబు నిఖిల జనులు
నిరతమును బాలనముసేయ నీకుఁ దృప్తి
మనుమహాశయ! కోరఁగా జనదె యితర
జనులు తమ కెట్టి చైతన్య సక్షణములు?

తే. ఓహొహో! ప్రజాపతి! ఇది యొప్ప దెపుడు
జరుగలే దెన్నఁడును– నింక జరుగఁబోదు
ఎవ్వరీ యిల ధిక్కార మెఱుఁగ నట్టి
యాధికృతిని తా మొందినారయ్య! చెపుమ?

తే. మహిత చైతన్య వికసన మాన్యరూపుఁ
డీ మనుజుఁడు విమలమై రహించు దాని
పరమరమణీయ మోహ నావరణ లందు
నిరుపమ మ్మొక విశ్వమ్ము నిర్మితమ్ము. 35

తే. అట్టిచైతన్య కేంద్రాలయందు నెద్ది
గాఢమౌ సుసంఘర్షణ కడఁగి, నడచు
దానివలన మనసున సదా జనించి
ద్వైతభావము నెలకొను పరగి, నిండి.

తే. ఒలసి విస్మృతిఁగొన్న యొక్కొక్క దాని
వారు గుర్తించుచుందు రాప్యాయముగను
వచ్చి చేరువకును పరస్పరము వార
లేక మొనరింతు రెపుడు ననేకజనుల.

తే. ఎవ్వ రుత్తములై నిల్తురట్టి స్పర్థ
నట్టివా రిల నుండెద రనవరతము
సకలసృష్టికి క్షేమమ్ము సలుపుచుంద్రు
ప్రీతి శుభమార్గమును జూపెదరు వారు.

తే. వ్యక్తిచేతన పరతంత్రమై యెసంగు
నిందు మూలమ్మునను– కాని యెప్పుడద్ది
రాగపరిపూర్ణ తలను జెలంగు ద్వేష
పంక మాలిన్యమును బొంది, పరగఁగలదె?

తే. అదినియత మార్గమున నడుగడ్గునందు
నెదురు దెబ్బలఁ దినుచుండు నెల్లవేళ
సాగి పయనించుచుండు ప్రశాంతవృత్తి
మించి యెపుడు శరణ్య సమీపమునకు. 40

తే. ఎందు శ్రేయ మున్నదియొ యదే మనోజ్ఞ
సౌఖ్యసాధన మై ప్రయోజనము నెరపు,
జీవితపు టుపయోగము, స్నిగ్ధబుద్ధి
సాధనము నిదె యగుచుఁ బ్రశస్తిఁగనును.

తే. అట్టి సుచ్ఛాయ సమ్మోహ నాశ్రయమ్ము
వడసి లోకము సుఖ యౌచుఁ బరఁగెనేని
నీవు ప్రాణమ్మువలె రమియింపు మయ్య
లలితగతుల రాష్ట్రపు శరీరమ్ము నొంది.

తే. కాలపరిధియం దెవ్వేళఁ గాంచు లయము
క్రమసుసమ్మోహన స్థానకల్పనమ్ము
కాల మెయ్యెడ నాత్మసంక్షయము నొందుఁ
గడకు నా మహాచైతన్య గహ్వరమున.

తే. ఆ యనంత చైతన్య మత్యంత ముగ్ధ
లీల నున్మత్తగతుల నర్తించుచుండు
పడసి విస్మృతి నీ ద్వైతభావము నెడ
నీవు నొనరింపు మార్య! తన్నృత్యకేళి.

తే. క్షితిజపటమును బైకెత్తి కెరలుఁ బ్రగతి
వెడలుమా నీవు బ్రహ్మాండవివర మందు!
అరయు చిట నీ జగత్కుహరాంతరమున
మారుమ్రోగు ఘనధ్వనిమలపు వినుమ! 45

తే. లయకు భంగమ్ము రానట్టి రమ్యగతులఁ
దాళము ననుసరించుచుఁ దరలిపొమ్ము
జ్ఞానహీనుండవై నీవు లోనఁ బలుకఁ
దనరకుమ యే వివాదాస్పద స్వరమ్ము.”

తే. “శుభము– దీని నీయెడ నిట్లు సుందరాంగి!
చాలఁగాఁ దెల్ప నే యవసరము లేదు”
ఎంత ప్రేరణామయవొ నీ, వింతి!, యెఱిఁగి
తంతయును నేఁడు మ న్మానసాంతరమున.

తే. కాని– నేఁడె యిపుడె, యిటు కడఁగివచ్చి
తివి తిరిగి మనోజ్ఞమగు త్వదీయ హృదయ
కుహరమున నెట్టు లిమిడె నిగూఢరీతి
నధిక గంభీర భయద సాహసము నెలఁత!

తే. అహహ! ఇట ప్రజాపతి యైన ననుభవించు
నట్టి యధికార మిదియేన? అబల! చెపుమ!!
అస్మదీయాభిలాష యిట్లనయ ముందు
నా యపరిపూర్ణముగనె ధన్యత తొలంగి.

తే. ఏను వితరణ మొనరించు చెల్ల వేళ
లందు మెలఁగగవలయునే– అర్థి నెదియొ
పడయవలెనను నీ శ్రమ పాపమగునె?
దీని సహియింపవలయునే తెరవ! యెపుడు? 50

తే. ఈవు నెదియైనఁ బ్రతిదాన మిచ్చినావె?
పడఁతి! యల్పమ్మె యైన జెప్పంగఁగలవె?
నాకు జ్ఞాన మొక్కటె యిచ్చి నాతి! నీవు
బ్రతుకఁగలవె యియ్యిలను విలాసగరిమ.

తే. వలచి దేనిని నే, తన్వి!, వాంఛసేయు
వాఁడనో యదే లభియింప నోడినప్పు
డిపుడె నీ వన్నమాటల నెల్లఁ దిరిగి
గైకొనుము తడయక మంజు కంజనయన!

***

తే. ఏను దేని కాంక్షించుచున్నానొ యద్ది
నాకుఁ గావలె నో యిడ! నాకు నెపుడుఁ

గావలయు నీపయిన నధికారమతివ!
అద్ది లేక ప్రజాపతి యగుట వృథయె.

తే. తరుఁణి! నినుఁ గనినంత బంధనము లెల్ల
నిపుడు తెగిపోవుచున్న వహీనముగను
శాసనమ్ముల నధికార సముదయముల
నేను కాంక్షసేయుట యేల నించుకైన?

తే. పరమ దుర్ధర్షమైన యీ ప్రకృతి కంప
నమును గను మొకమారు నీ నయనములను
నాతిరో! క్షుద్ర మా స్పందనమ్ము నరయ
నతి విపులమైన నా హృదయమ్ము నెదుట. 55

తే. అతికఠోరత నవ్వుచు నాడె నిదియె
ప్రౌఢరీతుల సకల మా ప్రళయఖేల
కాని యిపు డొంటరి యగుచుఁ గడఁగి యీతఁ
డెంత సుకుమారుఁడై నిల్చు నిటుల నిచట!

తే. విశ్వ మొక లయ యని యాత్మ వివర మందు
నమ్మి పల్కుచునున్నావు, నాతి!, నీవు
లీన మౌదునా యే దానిలోన- ఉవిద!
కాని, సుఖ మేమి యున్న దద్దాని యందు

తే. ఏను సృజియించుకొందుఁ బ్రత్యేకఫణితిఁ
గ్రంద నాయత ఘనత రాకాశ మొందు
అందుఁ దోఁచు రోదనలోనఁ బొంది నిన్ను
నట్టహాస మొనర్తు నత్యంతముగను.

తే. అంబునిధి మరల నిజ మర్యాద వీడి
యిచ్చమెయి గంతులిడి నదియించుఁగాక!
వచ్చిపోయెడఁగాక తా వజ్రగతుల
నతులభయ దోరు తీవ్ర ఝంఝూనిలమ్ము.

తే. మఱల నల్లటతల్లట మలఁగుఁగాక!
నౌక– ఊర్మికల్ ప్రవహించుఁగాక పయిన!!
సావధానమ్ముఁ గొనుఁగాక చదల సూర్య
చంద్ర నక్షత్రతతులు సంచకిత గతుల!! 60

తే. కాని– చెలియ! నిలువుము నా కడనె నీవు
నీవు నాదాన వెప్పుడో నెలఁత! నిజము
ఆడుకొనుటకు నీకు నే నబల! యొక్క
క్రీడరీతిగ నుండెడివాఁడఁ గాను.”

***

తే. “నా వచనముల నర్థ మ్మొనర్చుకొనఁగఁ
దలఁపవైనను యత్నమ్ము సలుపవలయు!
ఏల యుత్తేజితుండ వై యిటుల నీదు
ప్రాప్యమును బొందనెంచవు ప్రభువరేణ్య!

తే. ప్రజలు క్షుబ్ధులై శరణమ్ము వడయ నచట
నిల్చియున్నారు– ప్రకృతి యున్నిద్ర నిత్య
ఘనత రాతంక పరిపూర్ణ కంపమాన
యగుచును క్షణక్షణము ప్రత్యక్షమౌను!

తే. ఏ శుభాకాంక్షిణిని నౌట నింక నేమి
చెప్పఁగలదాన– జాగ్రత్త! చెప్పినాను
చెప్పఁదగినదియును నేను జెప్పవలసి
నదియు– ఇఁక నిట నుంట యర్థమ్మె నాకు.”

***

తే. “ఆడి యొక కొన్నిమాటల, నతివ! చిన్ని
బాల లాటల ‘జిల్లాయి’ పలికినటుల
నిదియె, మాయావినీ! యెట కేగుచుంటి
విటుల సెలవు గైకొనుచు నన్నిచట నిలిపి. 65

తే. రూపుఁ గొన్నట్టి యొక మహాశాప మటుల
నాదు నెదుటకు నేతెంచినావు నీవు
ఈవె తొలుతగా నాకుఁ జూపించినావు,
పొలఁతి! సంఘర్ష ణారంభభూమిక నట!

తే. విపుల రుధిరభరిత ఘన వేదికాళి!
అందు జ్వలియించు భీకరమ్మైన జ్వాల!!
నీ వలననే కుశలినయి నేర్చినాను
పడఁతి! ఏను నియంత్రణోపాయ మెల్ల.

తే. వర్ణములు నాల్గు రక్తి నేర్పడిన వపుడు
పరఁగ విభజనఁగొనె నెల్లవారి శ్రమయుఁ
గలలనై నను నెవ్వాని గనఁగ లేదొ
యట్టి శస్త్రాళి, యంత్రమ్ము లందె సృష్టి.

తే. లబ్ధశక్తిని నరుఁడు ఖేలనమొనర్పఁ
దమి వహించుచునుండె నత్యాతురతను
కల్గుచున్నయది ఘన సంఘర్షణమ్ము
ప్రకృతితో నిత్య- మతనికి భయములేదు.

తే. తన్వి! నియమము లనెడి యాతంకములను
నేఁడు నీ విట దరికి రానీయవలదు
తరుణి! యీ హతాశా జీవితమున కీవు
కలుగఁజేయుమ యొక్క సుఖక్షణమ్ము." 70

***

తే. "అయిన నీ వేను చేసిన యట్టిదెల్ల
మరచిపోకుమ యిటు పల్కి మనువరేణ్య!
లభ్యమైనట్టి దానితో రక్తినొంది
గర్వపడకుమ యీ రీతిగను మహీశ!

తే. ప్రకృతితోఁ గల్మష విహీన భావమునను
నీకు సంఘర్షణమ్ము నే నేర్పినాను

నిన్నుఁ గేంద్రముగా నిల్పి యెన్న డేని
నెట్టి యహితము నేను గావింపలేదు.

తే. ఎందు నీ వ్యాప్తి నిండె నహీన గతుల
నట్టి విపుల వైభవమున కాత్మ నెట్టి
సంశయమ్మును జెందక సలిపినాను
నిన్ను యజమానిగా, మనూ! మన్ననలను.

తే. అయిన నేటి నా యపరాధ మన్యమగుచు
నిలిచియున్నది, యో ప్రభూ! నీదుదృష్టి
'ఔను' 'చిత్తము' అనుచు నే ననకయున్న
నదియె యొక దొడ్డ యపరాధ మగుచునుండె.

తే. మనువ! ఈ భ్రాంత శార్వరీ మహిమ యెల్ల
గడచిపోవుచునున్నది కనుమ! ఇదియె
ప్రాగ్దిశను నవోషస్విని క్రమ్మివచ్చి
యిమ్మగ జయించుచుండెఁ దమమ్ము నెల్ల. 75

తే. సమయ మింకను గలదు ప్రజాధినేత!
నా యెడలఁ గొంతగా నిల్పి నమ్మకమును
గొంతగా ధైర్య మిపుడు చేకూర్చుకొన్న
సర్వవిషయముల్ కొలఁదిలోఁ జక్కఁబడును."

***

తే. పరమ దారుణము బ్రమాదభరితము నయి
కడగి వచ్చె "ఆ మరియొక క్షణము" తిరిగి
అప్పు డిట యటఁ దనదు పాదాబ్జములను
ద్రిప్పి నడువసాగెను ద్వారదేశమునకు.

తే. పడఁతి యాపఁబడియె మను పరుషబాహు
దండముల నపు- దసహాయతా మనోజ్ఞ
దీనదృక్కులఁ జూచుచు దెఱవ యామె
యుదిలకొను నెదతో నటనుండి వెడలె.

***

తే. “దేవి! సకల సారస్వతదేశ మిద్ది
నీది, రాజ్ఞివి నీవె యీ నిఖిలమునకు
నీదు నుపకరణమ్ముగా నిలిపి నన్ను
నిచ్చవచ్చినరీతిఁ గావించె దీవు.

తే. ఇట్టి మోసమ్ము నడచుట కిపుడు, రాజ్ఞి!
యింక శక్తివిహీనవం చెఱుఁగు మమ్మ!
కోరి నీ వలనుండి ముక్తుండ నైతి–
ఇద్దియును నీదు మనమున నెఱిఁగికొనుము. 80

తే. సాజముగ నిప్పు డి మ్మహాశాసనంపు
ప్రగతియును నాగిపోవును ప్రభ్వినీ!– ఇ
దేల యనిన నా చేతఁగా దోలి నిట్టి
దాసభావము గ్రహియించి తాల్చుటెపుడు.

తే. సర్వ సమయమ్ములం దేను శాసకుఁడను
జిరతర స్వతంత్రుఁ డను– నిస్సీమ మైన
యాధిపత్యము నీ పయినైన నాకుఁ
గావలె –బ్రతుకు సఫలమై కడఁగవలయు.

తే. కానిచో రాజ్ఞి! మఱియొకక్షణములోన
నీ వ్యవస్థ ఛిన్నాభిన్నమే యగు– నిది
యఖిలమును నిల్వఁజాలక యతలమందుఁ
గనుచు నుండగ వేగాన మునిగిఁపోవు.

తే. గాఢభయమున నీ రత్నగర్భ యెల్ల
నిటులఁ గంపించుటలను వీక్షించుచుంటి:
మఱియు విపుల వియద్వీథి మహిత మమత
వీడి క్రందించుటలను నే వినుచునుంటి.

తే. అయిన నీవు బందీవి నా యప్రతిహత
బాహుబంధాన, ఘన వజ్ర వక్షమందు”
అచటఁ గన్పట్టుచున్న యా యఖిల మపుడు
పిదప మున్గె నిశ్వాసంపు వెల్లువలను. 85

తే. ‘ఫెళఫెళ’ లను సింహద్వారగళము పలికె
ప్రజలు లోని కయ్యెడ సాగివచ్చినారు
లజ్జగొను నిడను గని “మా రాజ్ఞి!” యనుచుఁ
గడఁగి కావించినారు ఛీత్కారములను.

తే. ఆత్మ దౌర్బల్యమున దోఁచి యపుడు మనువు
రొప్పుచున్నట్టివాఁ డయ్యె గొప్పగ నట!
స్ఖలన కంపితములు పదసారసములు
తెప్పరిలక వణకుచుండె నిప్పుడైన.

***

తే. కరమునఁ గొని మనువు వజ్రఖచితమైన
రాజదండము నవధాన రమ్యుఁ డగుచు
బిట్టరచె నిట్లు “ఐనచో వినుఁడు నేను
చెప్పుచున్నది యెల్ల మీ చెవుల జొనిపి...

తే. సకల సుఖసాధనమ్ముల సరగఁ జూపి
తృప్తులను జేసినాఁడ నే తివిరి మిమ్ము
శ్రమవిభజనము సేసితి రమ్యఫణితి
పిదప నే వర్గములను గల్పించినాను.

తే. ఇదె ప్రతీకార మిటులఁ గావించుచుంటి
మనయ మీ యిలలో మన మనుభవించు
ప్రకృతి సేయు నత్యాచారబహుళమునకు–
మౌనము సహించుటయె లేదు మనము నేఁడు. 90

తే. కాము, మన మీ స్థితిని పశుగణము– కాము
మూక కాననచారులము– నయిన నిటు
మీర లెల్లరును మరచినారు కోరి
యే నొనర్చిన యీ యుపకృతిని నిపుడు.”

***

తే. గాఢ మానస గళిత దుఃఖమ్ముతోడ
వారు క్రుద్ధులై యీ రీతి పలికినారు
"కనుమ నీ, వియ్యెడను భవ న్ముఖము నుండి
యే పలికె పాప మిట్లు మహీమహేంద్ర!

తే. తలప మాకు యోగక్షేమములకు మించి
సంచయము ప్రీతిమైఁ బూని సలుపు లోభ
మొనరఁగా నేర్పి పడవైచి, తో యిలేశఁ?
చారు ఘోర దారుణమైన సంకటమున.

తే. అమిత సంవేదనా శీల మబ్బె మాకు
అరయ నిద్దియే దొరికినదైన సుఖము
ఏము కల్పిత దుఃఖాల నేర్పరించి
కష్టముల్ గల్గె ననుకొనఁ గడఁగినాము.

తే. యంత్రముల మూలమున, రాజ!, యఖిలజనుల
ప్రాకృతిక శక్తి కర్షించి భయదరీతి
జీవితము నెల్ల మివుల శుష్కింపఁజేసి
శిథిలమును, నశక్తమ్మును జేసినావు. 95

తే. ఏల యిట్టి యత్యాచార మీ వొనర్చి
నాఁడ విటపయి ఓ జనభాథ!-యిచట
నందఱి బలాభిరక్షతో నిందుకొఱకె
నీవు బ్రతికినాఁడవె మనూ, నిఖిలభర్త!

తే. కడఁగి మా మహారాజ్ఞి యౌ నిడను దలఁప
కిప్పు డిటుల బందీని గావించినావు
ఇంకమఱి నీకు రక్షణ యేది యిచట?
ఓయి యాయావరా! ఎటు లుండుఁ జెపుమ!"

***

తే. "అయిన ప్రకృతి, పుత్తలికల యమిత భయద
సముదయంబుల మధ్య నిశ్చలత జీవి

తాహవమునందు నే నిపు డాత్మశక్తి
నొంటి చరియింపఁ దలచిఁయే యున్నవాఁడ!

తే. ఇదె శరీరముల పయి మీ రిపుడు కనెద
రమిత సాహసికుని పౌరుషాప్తి యెదియొ
కఠిన రాజదండమ్ము నిక్కముగ వజ్ర
ఖచితమైనట్లు గమనింపఁగలరు మీరు.”

***

తే. అని పలుకుచును నిజభయదాస్త్ర మపుడు
మనువు సవరించుకొనియె నమంద ఝుడితి
నంత దేవాగ్ని జనియించి యక్కజముగ
పృథు కరాళ కీలాళుల వ్రెళ్ళఁగ్రక్కె. 100

తే. బయలు వెడలిన దీర్ఘచాపమ్ము నుండి
దారుణాంచల నారాచ తతులు మెఱసి
ఆకసమునుండి పడుచుండె నతివినీల
పీతవర్ణ మహా ధూమకేతు చయము.

తే. సాగుచుండె వాత్యావర్ష శౌర్యమంత
ముందునకుఁ బ్రజాక్రోధమ్ము పోల్కి నొప్పి
కడఁగి మెరయుచునుండె సంగ్రామవృష్టి
యందు జంచలా గణము శాస్త్రాళి యగుచు.

తే. కాని, క్రూరుడు, మనువు మార్గణము లెల్లఁ
దెరలఁజేయుచు, నిశిత నిస్త్రింశ శక్తి
నాహరించుచుఁ బ్రజల ప్రాణాశ లెల్ల
బ్రగతి సాధించుకొనుచుఁ దాఁ బరగుచుండె.

తే. తీవ్రగతిఁ దాల్చెఁ దాండవోద్వేగ మపుడు
రమ్య పరమాణువులు వికలతను జెందె,
తారుమారై నది నియతి దారిఁ దప్పి,
అంద రొందుచుండిరి భయవ్యాకులతల.

తే. అపు డలాతచక్రము రీతి నచట భయద
శుభ్రతిమిరానఁ జరియించుచుండె మనువు
మమత విడిన కరము రక్తిమము వహించి
నాట్య మొనరించుచుండె నున్మత్తగతుల. 105

తే. తుముల రణనినాద గరిమ దుర్భరముగ
స్థితి భయానకతర పరిస్థితిని బొందె
వచ్చె ముందుకు మౌనాన వైరిపృతన
పదదళిత మయ్యె సర్వవ్యవస్థ యపుడు.

తే. గాఢహతి నొంది మనువు వెన్కకుఁ దొలంగె
ఒక్క కంబము నాని నిట్టూర్చినాఁడు
కఠిన లక్ష్య సంభేది యౌ కార్ముకమ్ము
కడఁగి కావించెఁ జటులటంకార- మంత...

తే. వికటములు, నధీరమ్ములు, విషమములును
నైన బహువిధ వాయువు లలమి వీఁచె
పరఁగె నపు డెల్ల మృత్యుపర్వమ్ము పగిది
ఆకులి కిలాతులైరి నాయకులు కనఁగ.

తే. "ఈయనను నెటకును వెళ్ళనీయవలదు "
గట్టిగా హెచ్చరిక కేక పెట్టినారు
అంత సావధానత వచ్చి యనియె మనువు
"పట్టుకొనుడు వీ రిరువురఁ బట్టుకొనుడు.

తే. "మీర లిరువురె" యోరోరి భీరులార!
ఇట్టి యుత్పాత మెల్లఁ గావించినారు
తెలియకను దలఁచి మది నాత్మీయు లనుచు
నిన్ని నాళ్ళుగ మిము స్వీకరించినాను. 110

తే. అయిన మఱి రండు బలి యెట్టులగునొ కనుఁడు
రండు, ఓ కిలాలూకులులార! రండు!!
ఓరి యజ్ఞపురోహితులార! రండు!!
ఏమి యనుకుంటిరో మీర, లిది రణమ్ము"

తే. తక్షణమ్మునఁ బడినారు ధరణిశయ్య
యందు దనుజపురోహితు లార్తిగొనుచు
"చాలు ఆపుడు సమరమ్ము చాలు, చాలు"
ననుచు నయ్యెడ నిడ యిట్టులనియె నిచ్చ.

***

తే. "అతులమై భీషణ జనసంహార మెపుడు
నాగక స్వయముగ సాగు నవనియందు
పరఁగు చీరీతి నో వెఱ్ఱి ప్రాణులార!
బ్రతుకుఁ బోగొట్టుకొన మీకు భావ్యమగునె?

తే. ఓయి గర్విష్ఠి! ఇటు భయమొందఁజేసె
దేల? నీ వాగిపొమ్ము- జీవింపనిమ్ము
రమ్యముగఁ బ్రజ నీ ధరారాజ్యమందు-
పడసి సౌఖ్యాల నీవును బ్రతుకుమయ్య!"

***

తే. కాని- యెవరు దీనిని వినఁగడఁగువారు?
రేగి వేదికాజ్వాల జ్వలించుచుండె
మహితగతిని విలక్షణమార్గమందు
మొదలుపెట్టెను సాగ సామూహికబలి. 115

తే. మను మహోదయుని క్షత జోన్మత్త హస్త
మిప్పటికి నాగిపోవుట కిచ్చగింప
దయిన నా ప్రజాపక్ష వీరాగ్రసరులు
గొన్న సాహస మ్మేని వంగుటయె లేదు.

తే. దీన యగుచు సారస్వత దేశరాజ్ఞి
ఇడయు నిల్చిన దవమానహేతి యొలయ
వారు ప్రతిచర్యయందున వ్యగ్రులైరి
నీటివలె నదించుచునుండె నెత్రుటేళ్ళు.

తే. రజ్యదుగ్ర ప్రతిభయ నారాచ మొండు
పొలిచి ధూమకేతువు వలెఁ బుచ్ఛమందు
నతిశయ లయంకర మ్మైన యగ్నికీలఁ
దాల్చి రణభూమి వంకకుఁ దరలివచ్చె.

తే. ఒక మహాశక్తి జగమెల్ల నుదిలపడఁగ
నుప్పరమ్మున నయ్యెడ హుంకరించె
తత మహోజ్వల ఘన శస్త్రధార లట న
హీన భయద వేగమును వహించి మించె

తే. విరుచుకొనిపడె నవి మనువరుని మీఁద
అచటనె పడి ముమూర్షువై యాతఁ డుండె
ఉండె వ్యాపించి యా ప్రథనోర్వి యందు
నిరత కీలాల కల్లోలినీ జలమ్ము. 120

# నిర్వేదము (ఆప్యాయము)

తే. అట్టి సారస్వతనగర మప్పుడుండె
క్షుభితమై, మలినమునై విశుద్ధ మౌన
గరిమ– దానిపై వ్యాపించె గాఢ కర్మ
రహిత విధుత విషాదావరణ పరిణతి.

తే. ఉడుగణ గ్రహములు నింగి నుల్క లనెడి
హస్తదీపికల్ గల ప్రతీహారు లటులఁ
దిరుగు– ని య్యిల నిట్లేమి జరుగుచుండె–
ప్రత్యణువు చంచలమ్మయి పరుగు లేల?

***

తే. "సత్య మీ జీవితమ్మున జాగరణమ?
కాక యద్దాన నంతమా గాఢనిద్ర?
అతి భయానక రాత్రి యీ యఖిల భవము"–
అనెడి యొక కేక విన్పించునప్పు డపుడు.

తే. తట తటలఁ బక్ష చలన ముద్దండరీతి
సలుపు నాలోచనలు నిశాచరుల పగిది
నిఖిల నిశ్శబ్ద కర్షణ నిరతిశయత
దివ్య యరుగుచుండె సరస్వతీ స్రవంతి.

తే. ఇప్పటికి క్షతగాత్రుల యెక్కికులను
మర్మ దుర్వ్యథ చెలరేగి మలఁగుచుండె
ఖగరవమ్ముల మిషతోడ నగరలక్ష్మి
యెద్దియో కరుణకథ విన్పించుచుండె. 5

తే. మసక నీడల వెడలుచు నెసగుచుండెఁ
గొంత యస్పష్ట పురదీపకాంతి యపుడు

ఆగుచును వీచుచున్నది యనిల మచట!
సకలమును నిండె దుఃఖావసాద గరిమ.

తే. పృథుల భయ మూకతా సునిరీక్షకు వలె
నిత్య మౌనాన నిల్చె నున్నిద్ర యగుచు
తిమిర నీలావరణ మట దృశ్యజగము
కంటె నత్యంత విపులమై కానుపించె.

తే. మంట పాయత్త సోపాన మహితతలము
నచట శూన్యమైయుండె- లే రన్యు లెవరు?
అతివ ఇడ ఉపవిష్టయై యచట నొంటి
నుండె- అనిలశిఖ జ్వలించు చున్నదెదుట.

తే. మనువరేణ్యుని క్షతగాత్ర మచట నెంతొ
కదలఁజాలక పడియున్న కారణమున
రాజచిహ్న శూన్యము మందిరమ్ము కనఁగ
నొక సమాధి పోలిక పడియుండె నపుడు.

తే. కాంత ఇడ కేవల గ్లాన కలిత కెరల
గతవిషయముల యోజింపఁగడఁగె నపుడు
విమల మమతా మహాఘృణ విసరములను
బరఁగఁ గడచిన విట్టి శార్వరు ల వెన్నొ.

తే. అట్టి యంగనా హృదయము! అందు చెలఁగ
సృష్టి గావించినది సుధాసింధు వలల
బాడబజ్వాల జనియించి ప్రౌఢి మెరసి
జలములను జేసె సౌవర్ణ శబలితముగ.

తే. అట్టి మధుర పింగళ తరళాగ్ని యందు
శీతలతయె సృష్టిని విరచించుచుండె
అహహా! ఆ క్షమా ప్రతిచర్య యగు ద్వయంపు
మాయ స్థిరతర నృత్యము సేయుచుండె.

తే. “నాతొ నాతఁడు స్నేహ మొనర్చినాఁడు
అయిన లే దది కనఁగ ననన్యముగను
అయ్యనన్యత సహజ సంప్రాప్త యగును
ఇద్ది యుండు నే కడ నేని, ఎన్నఁ డేని.

తే. ఎద్ది యవరోధ సముదయ మెల్ల దాటి
పరుగువెట్టెనొ యా స్నేహభావమె యిపు
డర్థి భేదించి సీమల, నఖిల మిటుల
మారినది యొక యపరాధ ఘోరముగను.

తే. ఔను, అపరాధ! మది, కాని అద్ది యొకటె
యెంత భీప్రద మైన రూ పెనయఁ గొనియె
జీవితఁపు టొక కోణంపు సీమనుండి
చెలఁగి జృంభించి నే డె ట్లసీమ మయ్యె! 15

తే. కనఁగ సర్వ మా ప్రచురోపకార చయము,
నఖిల సహృదయతము మాయయా?, అహీన
శూన్యమా? దానియందు నస్తోక మగుచుఁ
గ్రీడసేయునే కపటమ్ము కేవలముగ.

తే. ఆ దినమ్మున బరదేశి యగుచు వచ్చి
నప్పు డెంతటి దుఃఖార్తి నతఁడు తోఁచె
అతని పదముల క్రింద లే దవని– ఉన్న
సకలమును నాల్గు దిక్కుల చాయ యొకటె.

తే. శుభ్ర పాలన కతఁ డయ్యె సూత్రధారి
తత నియమ చయమునకు నాధారుఁ డయ్యె
తాను నిర్మించిన నవ విధానముననె
అతఁడె సాకార దండన యయ్యె నిపుడు.

తే. జలధిఁ దరగల వలె లేచి శైల శృంగ
పాళికల కెక్కినాఁ డవలీల మెరసి
ముందునకు విశ్రమస్థానములను గడచి
య డ్డెరుఁగని నడల సాగి యరిగినాఁడు.

తే. ఉర్విని ముమూర్షువై పడియుండె నేఁడు
గతము సర్వము నొక స్వప్నగాథ యయ్యె
అతని నాత్మీయుగా హృదయాంతరములఁ
గొన్న స్వజనులే యన్యులై యున్నవారు. 20

తే. ఆతఁ డెవ్వతె కుపకార మర్థి జేసె
నట్టి నా కిపు డపకార మాచరించె
ఎల్లరకు గుణి యౌచుఁ జరించె నెవ్వఁ
డతని నుండి కలిగె దోష మతిశయముగ.

తే. అరెరె! కందళిత నవ సర్గాంకురమునఁ
బరగె నీ మంచిచెడులను పల్లవములు
చెలఁగు నియ్యవి యన్యోన్యసీమ లగుచు
ఏల యీరెంటి నిచ్చఁ బ్రేమింపరాదు.

తే. తనదు సుఖమైన నది యన్యజనుల దైన
నదియె కడు వృద్ధిఁగొని దుఃఖమౌను తుదకు
ఆగిపోవుట కెచట సీమాంత మెదియొ
యించుకేనియు బుద్ధికి నెరుకపడదు.

తే. తవ భవిష్యముఁ గూర్చి చింతన యొనర్చు
ప్రాణి వర్తమానసుఖము వదలుకొనును
పరుగువెట్టుచు నుండు నేర్పరుచుకొనుచుఁ
దానె తన మార్గమునకు నాతంకములను.

***

తే. "ఇటచఁ గూర్చుఁట శిక్ష విధించుకొరక–
కాక యితనికిఁ గావలిఁగాయుకొరక!
ఎట్టి విషమ సమస్య యౌ నిద్ది! ఎట్టి
నవసమస్యా ప్రపూర్ణ వైనాను నేను. 25

తే. ఎద్దియో శుభము జరుగు నిందువలన
ఒక్క మధురకల్పన మిది– ఉండు నిద్ది

వాస్తవము కంటె కమనీయ వైఖరులను
దీనినే సత్యము వరించుఁ దీపి నెరిఁగి."

తే. అపుడు విని యెదొ దూరాగ తారవమ్ము
నువిద ఇడ యోజనలలోన నులికిపడియె
రమణి యెవతెయో, యా స్తబ్ధ రాత్రివేళ
నిటకు వచ్చుచుండె నడచి, యిట్టు లనుచు

తే. "తెలియఁజేయుఁ డోహో దయోదీర్ణులార!
నా ప్రవాసి యే కడన నున్నాఁడొ యేమొ!
అట్టి యున్మత్తుని యనుషంగార్థమె యిటు
నేను జగము నెల్లఁ బ్రదక్షిణించు చుంటి.

తే. ఆతఁ డాత్మీయత యెడనె యలిగినాఁడు
తెలియనైతిఁ జేయఁగను నాత్మీయు నతని
నతఁడు నావాఁడె యై యున్న కతన నపుడు
తెలిసి యే నెవ్వని యలుకఁ దీర్పవలయు?

తే. అదియె పొరపాటు– ఇప్పుడ య్యదియె యొక్క
కంటకము నా మనమ్మును గలఁతవెట్టు
పురుషు నాతని నేనెట్లు పొందగలను?
వచ్చి యెవరైన యీ యెడఁ బలుకుఁడయ్య." 30

***

తే. లేచె ఇడ చూచె అస్పష్టరీతి నొక్క
ఛాయ రాజవీథి నడచుచాయఁగనియె
వాక్కునం దున్నది కరుణావ్యథయె నిండి
ఆ పిలుపు జ్వలియించు చున్నట్లు తోఁచె.

తే. శిథిల వపువు వసనము విశృంఖలమ్ము
చెదరి విడివడ్డ చంచల చికులపాళి
ఛిన్నపత్రమ్ము, విశ్లథ స్నిగ్ధ మధువు
మ్లానరుచి యైన ప్రసవమ్ముమాడ్కి నుండె

తే. పట్టుకొని కరాంగుళి నొక బాలుఁ డుండె,
రమ్య నవకోమలంపు టాలంబనముగ
గట్టిగాఁ బట్టి తల్లి నా పట్టి యప్పు
డటు నడచుచుండె మూకధైర్యమ్ము పగిది.

తే. పరమ దుఃఖాకులత బాధపడుట వలన
నధ్వగు లగు మాతాపుత్రు లలసినారు
క్షతములను శయనించి, మార్గమ్ము తప్పి
వెడలి చరియించు మనువును వెదకుచుండ్రి.

తే. అప్పు డిడయు ద్రవీభూత యగుచు నుండె
విశద దుఃఖార్తులగు వారి వీక్షసేసె
చేరి వారిదగ్గరకుఁ బ్రశ్నించి రిటుల
"మరచి మిమ్ముల విడినవా రెవరుతల్లి!" 35

తే. తిరుగు చీ గతి నీ తీవ్ర తిమిరరాత్రి
నెచటి కేగెదవమ్మ, ఓ యింతి! చెపుమ!!
సాధ్వి! మిముఁ గని విచలిత స్వాంత నైతి
కడఁగి విప్పుమ నీ వ్యథాగ్రంథి యెదియొ!

తే. అమిత దీర్ఘ మీ జీవితయాత్రలోన
నెంత దూరగులైన లభింత్రు, దేవి!
ఒక్కయెడ నెప్డొ బ్రతుకు సంయోగమొందు
కడకు దుఃఖనిశీథముల్ గడచిపోవు."

***

తే. 'బిడ్డ యలిసెను శ్రాంతి లభించు నిచట'
ననుచుఁ దలపోసి యటశ్రద్ధ యాగిపోయె
వహ్నిశిఖయు నయ్యెడ నటఁ బ్రజ్వలించు
నవని నిలిచిన ఇడ కడ కరిగె నామె.

తే. ఎదుటి మంటపమెల్ల వెల్గించుచును గృ
హీటయోని కుండజ్వాల పెల్లు రేగి

నది యదాటుగ- శ్రద్ధ యెయ్యదియొ చూచె:
అడుగులను వేయుచును దాని కడకుఁ జేరె.

***

ఆ మనువె నిక్కముగను గాయపడినాఁడు!
అయిన స్వప్న మిటుల సత్యమైన యదియె?
"అయ్యయో! ఓయి ప్రాణప్రియా! ఇదేమి?
ఈవె- ఇటులనా..." ప్రవహించె నెద ద్రవించి,

తే. చకితురా లయ్యె నిడ, వచ్చి శ్రద్ధ, చేరి
నిజకరమ్మున మనువును నిమిరె నపుడు
ప్రాపిత స్పర్శ మధులేప నోపమమ్ము!
ఏల నిలచును వ్యథ యది యెట్టి దైన?

తే. బహుళ మూర్ఛిత మా నీరవత్వ మందు
వరలి మెలఁగెఁ గొలఁది లఘు స్పందనములు
మించె కందోయి పొంది యున్మీలనమ్ము
తోఁచి కోణాల నిండె బిందువులు నాల్గు.

తే. మందిరమ్మును, మంటప మహిత వేది
కలను పుత్రుఁ డయ్యెడ నటఁ గనుచునుండె
"ఏమి యిదియెల్ల నా మది కిడుచుఁ బ్రీతి
నిటుల మోహనాకృతిఁ గనుపించుచుండె!"

తే. తల్లి అనియె "అరే! రమ్ము తడయ కీవు
నాన్న! ఈ యెడనె పడియున్నాఁడు!!, చూఁడు!!"
"నాన్నయా? ఇదె వచ్చుచున్నాను నేను"
అటుల ననువేళ నొదవె రోమాంచితమ్ము.

తే. "ఇమ్ము జలములఁ, కొనియుందురమ్మ దప్పి
ఏ మొనర్తువె కూర్చుండి యిచట నీవు?"
మొనసి శూన్యమంటప మయ్యె ముఖరితమ్ము
ఈ సజీవత్వ మది కన నెచట నుండె?

తే. ఆ గృహమ్మున నాత్మీయ తపుదు తోఁచె
చిన్ని పరివార మేర్పడి చెలఁగుచుండె
ఆ మహిత మందిరమ్మెల్ల నలముకొనియెఁ
జేరి శ్రద్ధా మధురగీతికా రవమ్ము

తే. "మనసా! ఓహో! ఓ మనసా!!
అతిశయ తుముల రణోజ్జ్వల ఘనకో
లాహల కలహ మ్మందున నే నౌ
దును హృదిలోఁ గల వలపుల పలుకును ఓహో, ఓ మనసా!

తే. వికలమ్మై చిరచంచల మై నిద్రాక్షణ
ముల నన్వేషణ చేసెడి చైతన్య మ్ముల
పొందిన రీతిగ దోచును- ఓ మన
సా? నే మంజుల మలయానిలము నొహో! ఓహో ఓ మనసా!

తే. చిరదుః ఖావిల మానసబాధా తిమిర న
వోషస్విని బోలెదు నొక జ్యోతిర్లేఖను
నే నై యుందు నె వేళను గనఁగా-ఓ మన
సా! సుమవికసిత ప్రాతఃకాలము నోహో! ఓహో ఓ మనసా!

తే. మరుభూముల నగ్నిజ్వాలను గనలెడి
చాతకి జలబిందువులకు వ్యాకులపడియెడి,
జీవితత్రుటులను నే నౌ దోహో, ఓ మన
సా! సుమనోహరఘన వర్షర్తువు నియ్యిల! ఓహో, ఓ మనసా!

తే. పవన ప్రాచీరమ్మున నిలిచి జ్వలించెడి
జీవన మిదె నమితమ్మై బ్రతుకుచు నున్నది
కుమిలిన యీ విశ్వమ్మను పగటికి ఓ మన
సా? నే నామని సొగసుల శార్వరి నోహో! ఓహో ఓ మనసా!

తే. నిత్యనిరాశా నీరద గుచ్ఛాచ్ఛాదిత లోచన
బిందు సరోవర మందున షట్పద ముఖరిత
మంజుల మాధ్వీ ముకుళిత మోహన హిమకరణ
జలజాతమ్మును నే నోహో ఓ మనసా! ఓహో ఓ మనసా!"

తే. ఆ స్వరలహరికా మంజు లాక్షరాళి
మధుర సంజీవనంపు రస మై నదించె.
ఐనయది ప్రభాతము ప్రాగ్ది శాంగణమున
ముకుళిత మనులోచనములు వికసితములు.

తే. లభ్యమయ్యె శ్రద్ధ యను నాలంబనమ్ము
మరల– నిండెఁ గృతజ్ఞ తా గరిమ నెడఁద
మనువు కూర్చుండె గాద్గద్యముననులేచి
పలికెనొక్కింత యనురాగభరితుఁ డగుచు.

***

తే. "మంచి దో శ్రద్ధ! ఈవె యే తెంచినావు
కాని–పడియున్న వాఁడను నేను, తన్వి?"–
అదియె భవనము, స్తంభమ్ము లవియె! అచట
ఘృణయె నాల్గుదెసలను వ్యాపించియుండె. 55

తే. "క్షోభచే నయ్యెడను మూసికొనియె కనులు
తీసికొనిపొ మ్మెదో దూరదేశమునకు
ఈ భయంక రాంధ్యమ్మున నేను మరచి
మరల పోఁగొట్టుకొనవచ్చు మగువ! నిన్ను.

తే. పట్టుకొని చేయి నీ వెంట వత్తు నేను
ఇంతి? ఆలంబన మ్మొ, లభించె, నిదియు
తోచునా నీ వెవర వోసి! తొలఁగిపొమ్ము!
రమ్ము! వికసించును మనస్సుమమ్ము, శ్రద్ధ!"

***

తే. శ్రద్ధ నిశ్శబ్దముగ విలోచనములందు
నింపి విశ్వాసము శిరము నిమురుచుండె
"ఈవు నావాఁడ విపు డెవ్వరేని యేల
యడలుగొనవలె"నని చెప్పునటులఁ దోఁచె.

***

తే. జలము గ్రోలి పిదపఁ గొంత స్వస్థుఁ డైన
మనువు కడు నెమ్మదిగ నిట్టు లనఁగసాగె
"చెలియ! ఈ నీడ నిలువని సీమకిపుడె
నీవు కొనిపొమ్మనను- ఉండనీయ కిటను.

తే. నాతి! మన మింక నిర్మేఘ నభము క్రింద
నో మరెచటనో నొక గుహనో చరింత
మనుభవించుచునే యుంటి మనుభవింత
మెద్ది యేతెంచినను దాని నెల్ల వలచి". 60

తే. "కొంత యోపిక పట్టుము కొంచె మైన
బలము రానిమ్ము అయ్యది వచ్చినంత
నిన్నుఁ గొనిపోదు మరి మన నిన్ని క్షణము
లైన నుండనీయదె యిట"- అనియె శ్రద్ధ.

***

తే. కుంచితాంగియై ఇడ నిల్చె- కోరి యిట్టి
అధికృతిని లాగికొనఁ జాలదయ్యె నపుడు
స్థిరత దోప శ్రద్ధ మనువు చెంత నుండె-
'అపుడు పల్కె నాతని వాణి యాగ కిటుల.

తే. "నిండి జీవిత మందున నుండె నిచ్ఛ
కొసరి స్వేచ్ఛానురోధమ్ము కూడియుండె
అంతరంగాన నభిలాష లతిశయించె
అమల మాత్మీయతాజ్ఞాన మర్థి నిండె

తే. ఉంటి నేను- సుందర కుసుమోజ్జ్వలముల
దట్టమగు సువర్ణచ్ఛాయ తనరియుండె
మలయ పవన తరంగాళు లొలయుచుండె
ఉల్లసనముల ఘనమాయ యొప్పుమెరసె.

తే. అరుణ సురభిళ చ్ఛాయోజ్జ్వ లాంతరమున
కపు దుషాదేవి పాత్రిక నర్థి నింపి

తెచ్చె– నా యౌవనము సుఖోదీర్ణమగుచుఁ
ద్రావుచుండెను ముదిత నేత్రములు మూసి. 65

తే. ఒంది నవ మరందము శరదు దయవేళ
బహుళ బిందువుల్ రాల్చు శేఫాలికాళి
అంత సంధ్యా రుచిర వలి తాలకములు
సౌఖ్యముల నిలపయి వెదజల్లుచుండె.

తే. కదఁగి క్షితిజమునుండి యాకస్మికముగఁ
దెరలి జృంభించె వేగానఁ దిమిరవాత్య
కలఁగె విశ్వము కల్లోలగరిమ వలన
విమల మానసలహరి యుద్వేగమొందె.

తే. వ్యథిత మానస మనెడి నీలాంబరమున
కాంతిపథ మెపుడు జనించి కడు హసించె
నప్పు డో దేవి! మంగళాయతన మైన
నవ మధురహాసమును నీ వొనర్చినావు.

తే. నీదు నమలిన నిర్ఝరీ నిత్య శోభ
యింపుగా విలాసములఁ గ్రీడింపసాగె
ఉజ్ఝిత మదీయ హృన్నిక షోపలమున
లిఖితవైతివి నవహేమరేఖ వోలె.

తే. అపుడు నేర్పసాగిన దరుణాద్రిఁ బోలు
నా మనోగృహాన నిలచి మహిత ముగ్ధ
మా మధుర నవప్రతిమ సమాదరమున
ప్రణయమయి వోలె సౌందర్యభావ మహిమ. 70

తే. దేని సౌందర మనుచు నుతింతు మెపుడు,
దేనికయి సుఖదుఃఖ సంతానమెల్ల
ననుభవింతురో ప్రాణులు, కనుచు నేను
దాని గుర్తింపఁగలిగితిఁ దన్వి! యపుడు.”

తే. యౌవనము జీవితమ్ముతో ననియె నిటుల:
"ఓ మదించినదాన! నీ వోసి మత్తు
రాల! చూచితే యేమైన"– యౌవనమ్ము
పలికె నిట్టూర్చి: "నడువు సంబలము గొనుము."

తే. రక్తిమై చిత్త మైనది శుక్తి పగిది
స్వాతిబిందువు వైతివి చాన! నీవు
నాదు నెదతమ్మి తూగె నానందముననే
తెరవ! తమి నైతి వీవు పూఁదేనె వందు.

తే. ఆకు రాలినకాలాన నతివ! యెంత
చతురతను నింపితీవు పచ్చంద నమ్ము
మాదకత్వ మటంచు నే మదిఁ దలంచి
తిని– అదియె రూపుఁగొనె నింత తృప్తియగుచు.

తే. ఎందు శోక వాత్యావర్ష మెసఁగు నెందుఁ
బరమ పీడాతరంగముల్ ప్రభవమొందు,
జీవిత మ్మెందు మృత్యువై చెలఁగు, నెందు
బుద్బుదఁపు మాయ నాట్యముల్ పొనరఁజేయు–

తే. అట్టి విశ్వము నిశ్వాస హసనములను
లలిత శాంత్యుజ్జ్వలతలఁ గళ్యాణగరిమ
కానుపించె– వర్షా నీప కానన మయి
సృష్టి విభవము సెలఁగె నుజ్జీవనమున.

తే. అట్టి పావన మధుధార నర్థిఁ జూచి
భగవతీ! యమృతమె లోభపడును గాదె!
పుణ్య సౌందర్య శైలమ్ముఁ బోలె నద్ది
దానియందు జీవితము స్నాత మగుచుండె.

తే. సంధ్య నాకడఁ దారకా సముదయముల
యకథిత కథ గ్రహించి తా నరుగుచుండె
అపుడు సకల శ్రమావిల వ్యథను నిద్ర
సహజముగనె గ్రహింపఁగాఁ జాలి యుండె.

తే. క్రమ కౌతూహలమ్మును గల్పనమ్ము
సుందరము లాచరణములఁ జుట్టికొనియె
స్నిగ్ధసుమములు తోఁచె హసించినటుల–
అద్ధి జీవితమునకు ధన్యక్షణమ్ము.

తే. స్మితము మధుర రాకా జ్యోత్స్నగతిఁ జెలంగె
సరస నిశ్వాసములు పారిజాత వనమె!
పుష్పరస మంథరమ్మయి పొలిచె నడక 80
వంశి స్వరమును జేరినపగిది నెగడె

తే. నాదు నిశ్వాస మను పవనమ్ము నెక్కి
బహుళ దూరాగత మురళీ స్వనము వోలె
మొరసితిని– విశ్వ కుహరాన ముగ్ధ నవ్య
దివ్యరాగిణి వలె నీవు తేజరిలితి.

తే. జీవితపయోధి కడుగునఁ బ్రోవుఁ గొన్న
మౌక్తికములు వెల్వడెను సమస్తమపుడు
ఆలపింప నీ వట మంగళార్ద్ర గీతి
మంజులమ్మయి యొదవె రోమాంచితమ్ము.

తే. నాదు మోహన మధుర మానసము నుండి
యమలి నాశా మయూఖాళి నర్థిఁ గొనియె
శశికళా మంజుల పరివేషమును గొన్న
స్నిగ్ధ లఘుతర జలధర సృష్టి జరిగె.

తే. దానిపయి కాంతి సంభరిత వయి నీవు
తూలిపడితివి హ్రాదినీమాల పగిది
జలజలలఁ గురిసె నపు డా జలధరమ్ము
పరగ మానస వనభూమి పచ్చవడియె.

తే. "అఖిల మీ విశ్వ మొకయాట యాడుచుండు"
మనుచు నవ్వుచు బోధించి తతివ! నాకు
"అందరితో నీవు నేస్తమ్ము నాచరింపు"
మనుచును దెలియఁగాఁ జెప్పి తపుడు చేరి. 85

తే. చంచలలఁ బోలు తను విలాసములతోడ
నిటుల సంకేత మొనరించి తీవు దేవి!
"మన మనసు సర్వమును నౌను మనదె- దాని
నిచ్చుకొంటిని ప్రీతితో నిష్టులకును.

తే. నిత్య సౌభాగ్య వర్షాగణేయ వీవు
మరియు- చిరతర ప్రణయార్ద్ర మధుర జనివి
జీవితము చిరాతృప్తియై చెలఁగెనేని
యందుఁ దృప్తి వయ్యెదవు నీ వహరహమ్ము.

తే. ఈ వొనర్చిన యుపకార మెంతఘనము!
నా ప్రణయ మెల్ల పొందిన దాశ్రయమ్ము!
అమృత! ఎంత కృతజ్ఞుఁడ నైతి నిపుడు
నా యెడఁద యింత సంవదేనమ్ము నొందె.

తే. ఆ మనోజ్ఞ మంగళకర మైన మాయ
నయిన నథముఁడఁ దెలియఁగా నైతి నేను
పట్టుకొనఁగ నే యత్నించువాఁడ నిపుడుఁ
గడఁగి ఘనతర హర్ష దుఃఖముల నీడ.

తే. నిర్మితము మత్సకలమును నేఁటివరకుఁ
గ్రోధ మోహోపదే శావగుణము వలన
ఇట్టి యనుభూతికలిగిన దిపుడు నాకు
జ్ఞాన కిరణాళి ముట్టదు నన్ను మున్ను. 90

తే. సూనుఁ డీతఁడు పడయుత శుభములెల్ల
ఎల్లరును సుఖులౌచు జీవింత్రుగాక!
అర్థి విడువుఁ డీ యపరాధినైన నన్నె!"-
మను- హృదయఝుంఝు మౌనానఁ గనియె శ్రద్ధ.

తే. పవలు చనె- తంద్ర నిద్రలఁ బరగ వెంటఁ
గొనుచు వచ్చె రజని- అట కొడుకు కడనె
సకల హృదయాంతర స్థితో త్సాహ మణఁగి
యుండ నొక్కటఁ దాఁ బడియుండె ఇడయు.

తే. శ్రద్ధయును ఖిన్నయై యలసటను జెంది
తనదు కరములఁ గొని యుపధానముగను
చిత్తమున నపు డెదియొ యోజించుచుండె
దుఃఖములఁ గ్రోలి మౌనానఁ దోఁచె మనువు

తే. అతఁడు యోజించె "జీవిత మరయ సుఖమ?
అది కన నొకానొక వికట మౌ సమస్య
ఓయి మను! పారిపో! మోహమాయ వలన
నెంతొ వ్యథ నిచట ననుభవింప లేదె?

తే. ఆమె ప్రాభాత జాంబూ నదాంశు వటుల
మెరసిపోవు క్రొంజిగిని, ఏ మెయిని నేను
నాది వీగిన మోమున, నాదు కలుషి
తాననమ్మున శ్రద్ధకుఁ గానుపింతు. 95

తే. అన్యు లెల్లవారు నమిత్రు లరయ నాకుఁ
గాఁ గృతఘ్నులు- మరి వీరిఁ గడఁగి యెట్లు
నమ్మెద- ప్రతిచర్యేచ్ఛల నా యెడంద
నణచి మరణింతునా, యే ప్రయాస లేక!

తే. శ్రద్ధ యున్నపు డెదియైన సంభవమ్ము
కాదు సేయఁగ- కాన నేకడను నాకుఁ
బ్రీతి నొదవించు శాంతి లభించునట్టి
తావు దొరకునో వెదుకఁగాఁ బోవువాఁడ".

తే. అందరును మేల్కొనిరి ప్రభాతావసరము
నందు- చూడఁగా మనువు లేఁ డచట- "నాన్న
యెక్క డనుచును బిడ్డ ఘోషించుచుండె-
లేఁడు బిడ్డఁడును ప్రశాంతరీతి నిపుడు.

తే. మెలఁత, ఇడయు, త న్నందర మించి నట్టి
యొక్క యపరాధినిగ నెద నూహసేయు
చుండె- కామాయనీదేవి యోజనా ని
మగ్నయై యటఁ గూర్చుండె మౌనముగను. 99

# దర్శనము (ఆలోకము)

తే.గీ. ఎందు శుభ్రోదయమ్ము నిద్రించు నట్టి
శీతకర రహిత మగు నిశీథ మిద్ది
ఇంపుల తెలితారకలు భాసించుచుండె
వరలి ప్రతిఫలించెడి సరిద్వక్షమందు.

తే. జాలు సాగి యరుగుచుండె- చంద్రబింబ
మచలము విరియుచున్నది యవని యపుడు
వినుచుఁ దనమాటయే- అట వృక్షపంక్తి
మొనసి నిలచియున్నయది తా మౌనముగను.

తే. మసక నీడల శాంతి మై మసలుచుండె
పాదముల ముద్దుఁగొను నదీభంగచయము
"అమ్మ! ఇటకు వచ్చితివి దూరమ్ము నడచి,
సంజ యా దెస కెప్పుడో చనియెనమ్మ!

తే. ఇట్టి నిర్జన దేశాన నేమి నీవు
సొగయు రమణీయమును చూచుచుంటి వమ్మ!
గంధధూపమ్ము క్రమ్మెడిఁ, గదలు మింటి"
కనెడు చిరుమోము చుంబించె నపుడు శ్రద్ధ!

తే. "ఏల చింతింతువమ్మ! నీ విటుల? లేనె
యేను నీకడ! ఎందు కీ విట్టు లుంట!
బహుదినమ్ముల నుండియుఁ బరమమౌన
మునను యోజింతు వేదియో! అనుముకొంత. 5

తే. ఇటుల బహిరంతరముల దహింపఁజేయు
నట్టి దుర్భర దుఃఖ మ దెట్టిదమ్మ!
అమ్మ! ఏలనె నిహతాశ వైనయట్లు
విపుల నిశ్వాస మీరీతి విడుతు వీవు?"

తే. పలికె నాయమ: "బహు నీర భార ఘనన
తమ్మగును వినీల గగనతలము సౌఖ్య
దుఃఖముల్ దేశకాలముల్ తొలఁగు వచ్చి
పవనుఁ డాడుచు నేతెంచు బాలుపగిది.

తే. మరల మెరయును సుందర తరుణ తార-
లుదిత గగన శార్వరుల ఖద్యోతచయము
వివృత మిదె ద్వార మో తండ్రి! విశ్వమెల్ల
నెంత సుందర- మ్మోను నా కిదియె గృహము.

తే. నయన గోచరమగు నీ యనంతజగతి
సర్గకల్పిత సుఖదుఃఖ చయము లెపుడు
భావజలధి నుండి కిరణపథము వట్టి
స్వాతిబిందువులై వ్రాలు జగమునందు.

తే. ప్రేమతో నగములఁ గౌగలించుకొనుచుఁ
బడుచు లేచుచు సెలయేళ్లు పరువువెట్టు
దారు ణాకర్షణలును నాతంకములును!
అఖిల మియ్యది యౌ నమ్మహాత్ము మాయ.

తే. జగము మేల్కొను రక్తాబ్జచక్షువులను
నిదుర చీఁకటి ముసుఁగులో నిద్రవోవు
ఇంద్ర ధనువటు మార్చుచు సృష్టిలయము
లాత్మవర్ణాల రూపొందు ననవరతము.

తే. ఇద్ది తన యందమునఁ బ్రకాశించు నెపుడు
ఇం దుడుగణము కడు వికసించి వ్రాలు
గగన కాసార మధ్యస్థ కనక హంస
యతి మనోజ్ఞ మతి విపులమై రహించు.

తే. దీని పొరపొర యందున మౌన శాంతి
ఘనత రాగాధ శీతలత, నవతాప
భ్రాంతి! పరివర్తన మయ మపార శుభద
మించు సర్వభావములు హసించుచుండు.

తే. ఇందుఁ గల్లోల మెపుడు నర్తించుచుండు
ఉల్లసన మంతరమ్మున నుండు నిండి
మ న్నివాస దేశంబును మధురకాంతి!
నిత్య సుఖద శాంతియుతము నీడ మద్ది".

తే. "ఎందులకె యీ విరాగ మిట్లింత ఇంతి!,
ఏల యనురక్తి నాపై వహింప వీవు?"
వెనుదిరిగి చూచినది శ్రద్ధ- విమలనయన!
కనులఁబడె నిడ మాలిన్యకాంతిరేఖ! 15

తే. అమృతకరుఁడు రాహుగ్రస్తుఁ డైనయటుల
దుఃఖ విషరేఖ యలమెను- తోఁచె, నెవతె
భాగ్యము మును మేల్కొని నిద్రవడసె నట్టి
యిడ ఇతరు లిచ్చుదాని గ్రహించు పగిది.

తే. శ్రద్ధ! యనె: "నీయెడనె నా విరక్తి! నాతి!!
కెరలు జీవి తాంధ్యానురక్తివి- తొరంగి
నన్నరుగుదెంచె- ఆలంబనమ్ము నొసఁగి
యతని- బ్రతుకును నిలువఁబెట్టితివి నీవు!

తే. కాంత! ఆశామయివి, చిరాకర్షణవును
మాదక త్వావనత మేఘమాల వీవు
చిరత రాతృప్తివి మనుమస్తిష్క మందు
చారణోత్తేజిత చలనశక్తి వీవు!

తే. ఎట్టి ప్రతిఫల మేను నీ కీయఁగలను?
ఇదె యెడంద తీయనిపల్కు లివియె రెండు
కలను నవ్వంగ నేడ్వఁగా గలను నేను
కలను బొందఁగఁ- గోల్పోవఁ గలను నేను.

తే. ఒకరికడ స్వీకరించి యిం కొకరి కిత్తు
స్నిగ్ధమూర్తిని, దుఃఖము న్జేతు సుఖము
చారు మాధురీ ప్రణయ రసాయనమును
ఏను తిరుగుచుంటిఁ జిరవిస్మృతిని బోలి. 20

తే. అతివ! నీ ప్రభాపూర్ణమౌ నాననమును
జూచి మను వొక్కయెడ నెంతొ చొక్కినాఁడు
మాయ మమతలకు వనిత మహిత బలము!
శక్తిమయ మైన శీతలచ్ఛాయ యామె.

తే. ఎవరిచే భూమి ధన్యమై యెసఁగు నట్టి
ఛలరహితను క్షమింపఁగా శక్తు లెవరు?
నీవె క్షమియింప వలె– ఎట్టు లేను విడుతు
క్షమను బొందెడు నా యధికార మిపుడు".

తే. "నేను వహియింపఁగాజాల మౌన మిపుడు
కాని యిట నెవ రపరాధి కానివారు
అనుభవింతురు దుఃఖసౌఖ్యముల నెల్ల
రైన సౌఖ్యమ్మె తమదని యందు రెపుడు.

తే. మేరలకు లొంగ వెపు డధికారములు–న
దించు నవ్వి వర్షాఝరీ తీవ్రతలను –
వారి నెవ రాపఁగాఁ గల్గువారు అనెద
రందరిని వారు మీరు మా కరు లటంచు.

తే. వైర మతివేగముగ సాగె ప్రబల మగుచు
కృత్రిమపు సీమ లెల్ల నశించిపోయె
శ్రమ విభాగమ్ము చేత వర్గములు గలిగె
బలముచేఁ గల్గెను బొగరు వర్గములకు. 25

తే. ఎవరు నియమాళి రక్తి సృజింత్రు వారె
కోరి విప్లవవర్షమ్ము కురియుచుంద్రు
లాలసతఁ గ్రోలి ప్రజ మత్తులైరి–అంత
నాదు సాహస మెల్ల విన్నదన మొందె.

తే. ఖ్యాతికల్గె జనపద– కల్యాణి యనుచు,
చెంది యవనతి నేను– నిషిద్ధనైతి
నా విభజనము దోషభంగమ్ము లొందె
ప్రబలి నిత్యనియమము లేర్పడుచునుండె.

తే. బహుళ కేంద్రాల జలధరపాళి వోలెఁ
గ్రమ్మి, చెదరి కురిసె కరకాగణమ్ము-
ఈ మహోజ్వాల యింత సమిద్ధమయ్యె
ఇచ్చ సేయు నాహుతుల సమృద్ధముగను.

తే. అయిన నుంటినె నే భ్రమయందు మునిఁగి
ప్రాణు లసహాయులై సంహరణమునకు- ని
రంతరము, మౌనముగను, నిర్బలత, నణఁగి
వెడలవలెనె నాశన ముఖ వివరమునకు?

తే. గాఢ సంఘర్షణమ్ము, నా కర్మశక్తి
మిథ్యలా? ఈ మహా బలమిత సుచిహ్న
యజ్ఞముల్ రెండు వృథయె! భయార్ణవమ్ము!
భ్రాంతి యుత వతి!! శాసనాశాంతిలీల!! 30

తే. ఇంతియే కాదు. దేవి, కర్షించుకొంటి
నీదు సౌభాగ్య సుస్నేహ నిధుల నేను
సాధ్విరో! ఐన నే నకించనను నేఁడు
లేను, దేవి! నా కింపుగా నేనె యిపుడు.

తే. నాదు గీతాస్వనమె నే వినంగ లేను
ఇమ్ము క్షమను విరాగమ్ము నీయవలదు
తడవు నిద్రించు నాదు చేతనత యెల్ల
నిర్మలోజ్జ్వలశక్తి నున్నిద్రమగుత!"

తే. శ్రద్ధ పలికెను "రుద్రరోషము, నెలంత!
ధ్వాంత భయద మైయున్న దశాంతిఁ గ్రమ్మి
ఎక్కితి శిరము, పొందలే దీ వెడంద
ఉవిద! వికలత నటియించుచుంటి వీవు!

తే. తన్వి! సుఖద చైత న్యాప్తత కడుఁ దొలఁగె
ఇంచెడి ప్రకాశ మది యుదయింపలేదు
నడచిరి తమ మార్గముల నందరును శ్రాంతి,
ప్రతివిభజనము మౌఢఁగా భ్రాంతియయ్యె.

తే. శుభ్రరమ్యము, జీవితస్రోత– మద్ది
సత్తు, నిత్యము చిరకాంతి సౌఖ్యదమ్ము
తర్కమయి! ఊర్మిల గణించి తరగలందుఁ
బ్రతిఫలించెడి తారలఁ బట్టి నిలతు. 35

తే. అష్ట యామములను జూచి తాగి యాగి,
అది జడత్వపు స్థితి– భ్రమ నందవలదు
కాంత! స్వాదువుల్ సౌఖ్యదుఃఖములు– వెల్గు
నీడ– లా సరళపథము వీడినావు.

తే. భౌతికము చేతనము! అట్టి భావమెల్ల
నీ విదె విరాగమున విభజించినావు
చిరము, నిత్యమైన జగము చేతనతయె
శతశతములుగ రూపాల నవతరించు.

తే. విరహ మేలన నటనార్తి నిరత మణు– వ
మంద పరిపూర్ణ మంజు లానంద జగము!
రాగ మొక దందు లీనపూర్ణతను మొరయు
"ఇంక మేల్కొను" మనెడి ఝుంకృతులతోడ.

తే. ఆహుతియగుచు నుంటి లోకాగ్ని లోనఁ
దప్తనై ప్రసన్న ప్రశాంతతను నేను
ఒలసి క్షమియింప కెదొ కోరుచుంటి వీవు
హృదయ కుహరాన నగ్ని జ్వలించునేని–

తే. పడఁతి! నాకడఁ గల నిధి బడయు మీవు
నాదు మార్గమ్మె యున్నది నాకు– సౌమ్య!
ఉండు మిట! శ్రీద మగుత యీ యుర్వి! నీవు
శక్తి, కర్మ వినిమయము సలుపుమయ్య! 40

తే. రక్తి సాగింపు డిరువురు రాష్ట్ర నీతి
ఏలుబడిలోన ధీతిఁ గల్పింప వలదు
వెదుకఁగా నాదు మనువును వెడలుచుంటి
వాహినీ నగ మరు కుంజ వాటికలకు.

తే. కాఁ డతఁడు మోసకారి నిష్కపటి- దొరుకు
పెరిగితిని నేను మంజుల ప్రేమలోన-
కనెద నవ్వేళ లీల నీ క్రమమునెల్ల
మానవా! నీ యశోగతి మలయుఁగాత!"

తే. బాలుఁ డనియెను! "త్రెంచఁగావలదు మమత
అమ్మ! నా యెడ విముఖత నందవలదు
పాలనము సేసి నీ యాజ్ఞ' వడసి నీదు
ప్రణయలాలన నెవ్వేళ బహుళ కాంక్ష...

తే. విడువ కుందును గాక జీవించియైన,
మరణమొందినను ప్రతిజ్ఞ- మంగళకర
మౌనుగాక నా బ్రతుకు! లభ్యమగుగాక,
మాత! నీ యొడి, విడిచిన, మరలనాకు".

తే. "స్వచ్ఛ మీ యిడ- ప్రేమ సౌమ్య! నీదు
వ్యథ హరించు తర్కమయి యీ యతివ నీవు
శ్రద్ధగలవాఁడవు మననలక్షణుఁడవు
ఆచరింపుము కర్మ భయార్తి విడచి. 45

తే. ఈమె- తాపసంహతి తొలగింపు మయ్య!
ఎలమి మానవశ్రీ యుదయించుఁగాక!
సామరస్యమ్మున కిలఁ బ్రచార మిమ్ము
పుత్ర! నీమాత చేసెడి బోధ వినుము!"

తే. "మధుర వాక్కులు విశ్వాస మంజులమ్ము
లివ్వి- మరపు రాకుండుగా కెన్నఁడైన
దేవి! చెలఁగుచు భవదీయ దివ్యగాథ
మైత్రి యవిరళ శ్రేయోద్గమముగ మెలఁగి...

తే. లీల జలదమ్ము లటుల వర్షించుఁగాక!
తలఁగుగావుత సర్వసంతాపములును"-
అనుచు నిడ ప్రణమిల్లి, పాదాబ్జధూళిఁ
గైఁకొని, కుమారు సుమమ్మృదు కరమువట్టె.

తే. క్షణము మూకగా మువురకు గడచె నపుడు
మన మెవరము, మరెట నుంటి మనున దెల్ల
మరచి రయ్యెడ–అట బాహ్యమౌ వియోగ
మును నెదలకు సంయోగమ్ము మొనసి మెరసె.

తే. కంకణము లాహతమ్ములై కలియు– మనుజ
జీవితము కన వీచికా జీవితమ్ము!
తిరిగి యిరువురు వెడలిరి పురముదెసకు–
దూరమేగ నిరువురుగ లేరు వారు. 50

తే. స్తబ్ధ మయ్యెడ నింగి శాంతములు దెసలు:
స్నిగ్ధ నిస్సీమ ఘన కాంతచక్ర మద్ది
తోఁచు వక్షాన శూన్యబిందువులు కొన్ని
వ్యథిత శార్వరీ శ్రమకణ వారము లవి...

తే. మించి బహుకాలముగ నిట్లు మెరయు– పడవు
ఉర్విపై గభీర మిలిన మొక్క నీడ!
చెలఁగు నట నదీతట తరు క్షితిజసీమ–
తివిరి విరియుచున్నది దీన తిమిరచయము.

తే. వ్యోమ మయ్యెడ శతసహ స్రోడు యుతము
ఫుల్ల సుమగుచ్ఛ విలసిత పుష్పసమయ
మూర్ధ్వ విశ్వమ్ము హసియించుచుండె–అపుడు
మానసము మందసంకాశ మూనినిలిచె.

తే. పైన మాయాసరిత్తు పెంపారఁ దరలు
కిరణ లోల త్తరంగాళి కెరలి లేచు
వచ్చుచును బోవు నట నధోభాగమందు
సద్దు సేయకయె యమితచ్ఛాయ యపుడు.

తే. ఆపగా రమ్యమైన యేకాంత తటము
ఒలసి పవన ముయ్యేలల నూగుచుండె
నెమ్మదిగ నట నూర్మికా నిచయము దరి
కరిగి తాకి వెన్క నదృశ్య మగుచునుండె. 55

తే. అపు డపుడు తోఁచు ఛపఛప యనెడి ధ్వనులు
వలను గల దీప్తి గడగడ వడఁకుచుండె
సృష్టి తను తానె మరచి వసించు నచట
సురభి విరహి తామ్లాన మౌ సుమముపగిది.

తే. ఆ సరస్వతీ నదివలె నమల విశ్వ
సనమునను జూచె నటు నిటు శ్రద్ధ– ఆశ్మ
లగ్నముల విద్ధములయిన రత్నములుగఁ
దెరచినట్టి కనుల్ రెండు మెరయుచుండె.

తే. చీఁకటిని జిలిబిలిసద్దు సేయు నెదియొ!
ఇది తరంగిణీమణి శబ్ద మేన? కాదు
అంతికమున నొక గుహ, లతావృతమ్ము
అం దొకఁడు జీవి నిశ్వాస మాచరించు.

తే. రమ్యమును, చిత్రితమ్ము నిర్జనతటమ్ము
ఎంతయో పునీత మది– వర్తించు శైల
శిఖరము, లొకింత యున్న తస్థితి– మించి
యెప్పె శ్రద్ధాశిరము వాని యున్నతులను.

తే. ఆమె లోకాగ్నిఁ దప్తయై యంతఁ గరఁగి
స్వర్ణమూర్తిగ రూపొందె– స్థగిత దృష్టి
మనువు వీక్షించె చిత్ర మా మాతృమూర్తి
విశ్వమిత్రగఁ గనుపట్టె విమలరుచుల. 60

***

తే. ఇటుల పలికెన "అయ్యయో! ఎడఁదలోనఁ
గాంక్ష నిండినదానవు గావు నీవు
ఈవు కోల్పోయి సర్వస్వ, మింతి! అయితి
వంచితవు– కోరి యెవ్వనిఁ బడసినావొ...

తే. వాని నిచ్చితి, దాక్షిణ్య హీన వగుచు
పారి, యేమును విడచినవారి కీవు

బాధనొందఁగ లేదె నీ భావమపుడు
ఎంత చిత్రమో ఓసి నీ యెడఁద -నడఁక!

తే. వారు నిర్ద యోగ్రులు శ్వాపదముల పగిది
మంజు శాబక మా వీర మాణవకుఁడు
వలచి వింటి వాని చలువపలుకు- ఎంత
యమలిన ప్రియము, గభీరమై రహించె.

తే. ధీర! నీయెద యెంత కఠోర మరయ!
ఇడ తెలివిని మోసమ్ము గావించె మరల
ఉంటి విపుడును శాంత వై యువత! అయ్యొ!
దాటివెడలెను శరము హస్తమ్ము నుండి".

తే. "ఇంత శంకించుచున్నాఁడ విప్పటికిని
ఎవ్వరును గా రిలనుఁ పేద -లచ్చియుంట
ప్రియుఁడ! ఇది పరివర్తన, వినిమయమ్ము
ఇచ్చిన ఋణమగునుగదా, హెచ్చు ధనము? 65

తే. బంధనమె నీదు దోషము- వరలె ముక్తి,
వదలినావు స్వజనుల, నిర్వాసితుఁడవు
పీడ యేటికిఁ గలుగ? సంప్రీతి నిమ్ము
గైకొనుమ తృప్తి- విస్పష్ట కార్యమిద్ది".

తే. "ఎంతటి మనోహరోదార వీవు దేవి!
మహిత! నిర్వికారము నీదు మాతృమూర్తి
సర్వమంగళ! సహియింతు స్వయము సకల
జనులఁ బరిపూర్ణమౌ దుఃఖ సముదయముల.

తే. పలికెదవు నీవు కళ్యాణవాణి నెపుడు
నీవు వసియించెదవు క్షమానిలయ మందు
నిన్నుఁ గని భ్రమియించితి నేను దేవి!
అల్పమగు నూహయనితోఁచె నద్ది కనఁగ

తే. ఇట్టి యేకాంత తటమున యే నధీర
వృత్తి నాకలిని వ్యథ నహీన వాయు
గతి సహించుచు భావ చక్రముననలిగి
వనిత! ముందుకు నడచుచు వచ్చినాను.

తే. మానస వికారముల వలె నేను శక్తి
విడిన శూన్యుఁడ చూడఁగాఁ గాదు లఘుత!
మొనసి బహుళ పశ్చాత్తాపము శర మటులఁ
జొరఁబడిన నాదు వక్షమ్ము చూడు చీల్చి". 70

తే. "స్నిగ్ధకోమల మైన నీ నిధి, ప్రియుఁడ!
గత విషయమును నా కిదెజ్ఞప్తిసేయు
తీక్ష్ణ మా లయ లీల శాంతించి నపుడు
ప్రీతి నా బ్రతుకెల్ల నర్పించి నీకు...

తే. ఏను నిశ్చయమ్ముగను నీదాన నైతి
బ్రతుకునం దాఁక మరువ- దుర్బలనె నేను?
శాంతి యుదయించు, స్థలి కింక సాగుమయ్య
ఏను నీదాననే సదా- ఇది నిజమ్ము."

తే. అగుఁ బ్రతీక యీ త్రిదశద్వయాని కతఁడు-
మానవుఁడు! పొరబాట్లను దానె దిద్దఁ
గలఁడు-విషయమై మరి వ్యాప్తిఁగనిన యీ వి
షమును కర్మోన్నతిని జనుల్ సర్దఁగలరు.

తే. పరఁగుచు స్వతంత్రులై తమ భ్రమను వీడి,
స్వాదు శుభద సంయమరహస్యమ్ము నెరిఁగి
కొనెద రెల్లఁ రళీకముల్ కూలిపోవు
కడఁగి నడచిన నశియించుఁ బడిన లేడి.

తే. అట్టి శూన్య మసత్తొ, యాంధ్యమ్మొ- గగన
పటలమునకు శూన్యము రెండు తటము- లద్ది
బాహ్యమున నంతరమ్మున వరలి ముక్త
మగుచు ఘనమౌచు నీలాంజనాద్రి యగును. 75

తే. పొసఁగె నది గాఢ మాలిన్య భూమికగను,
నెగడె నిర్నిమేషత మను నేత్రయుగళి
ఆ తిమిర మున్న దెంతో యనంతముగను,
దాని సీమ కన్నుల కెటఁ గానఁబడదు.

తే. ఆవరణ పటల గ్రంథి నర్థి విప్పి
కలిగెశక్తిసంస్పంద మొకానొకండు
ధ్వాంత జలధికి మధుర మంథనము గల్గె
స్ఫీత చంద్రికా నిమ్న గాశ్లేష మొదవె.

తే. అమల రజత గౌరోజ్జ్వల మ్మైన జీవి
తమ్ము! ఆలోకపురుషుఁ! డత్యంత శుభద
చేతన! ప్రకాశఖేలన! స్నిగ్ధ మధుర
కౌముదీ చలత్కిరణ భంగాళి!–అపుడు–

తే. కూడినది గాఢతమము ముంగురులు గాగ,
అయ్యె జ్యోతిర్మయములు సర్వాంగకములు
నవ్య నిర్హ్లాద మంత ర్నినాద మెసఁగె
మహిత శూన్య భేదనము చిన్మయము తోచె.

తే. నిరతుఁ డయ్యెను నటరాజు నృత్యకేళి
ఆకసము హాస ముఖరిత మగుచునుండె
స్వరము లయయయి తాళ ప్రస్తవము సలిపె
కలఁగి లోపించె దెసలును కాలమపుడు. 80

తే. అబ్బె భంగి మాస్పంద నాహ్లాదగరిమ,
ఆ ప్రభాపుంజ చిన్మయ హారి చణత!
తత ఘనానంద సుందర తాండవమ్ము!
చెదరిపడె నుజ్జ్వల శ్రమ శీకరములు.

తే. భూరి తారలు, రవి, శశి పుట్టినారు
నగము లట ధూళికణములై యెగురుచుండె
సృజన సంహారముల గతిశీల మొదవె
చరణ యుగళి, కనాహత స్వనము తోఁచె.

తే. అగణిత బ్రహ్మగోళముల్ పగిలి చెదరె
అవధి గన్నట్టి యుగము సమాప్తమయ్యె
విద్యు దుపమిత నేత్రాంతవీక్ష వడిన
తావులం దెల్ల సృష్టి వ్యత్యస్త మయ్యె.

తే. చేతన పరమాణువులు విశ్లేషమొంది
క్షణములో రూపుఁగొని లీనగతులఁ దారె
ఒక మహాడోలవలె విశ్వ మూగుచుండెఁ
దనరి– విప్పుకొనెఁ బరివర్తన పటమ్ము.

తే. శాప పాపముల వినాశన మ్మొనర్చి
యట్టి శక్తిశరీరు ననంతకాంతి
నాట్యరత మయ్యె– ప్రకృతి విన్నాణములను
గరఁగి యా ప్రభాజలనిధిఁ గలసి యంత... 85

తే. దిద్దుకొనె నిజ మోహన దివ్యమూర్తి
భీషణమ్ములు రమ్యతా పేటికలుగఁ
బరఁగె– విద్యుద్విలాసమై వజ్రగిరిని
నమలి నోల్లాస నీహార హాస మొదవె!

తే. ఎలమిని మనువు నటన్నటేశుఁ జూచి
చేతనా హీనత నొకట నాతి కనియె :
"శ్రద్ధ! ఇది యేమి? ఘన సమరస మఖండ
మమల మానంద రూపమై యమరుచుండె?

తే. ఎందుఁ బుణ్యపాపములు తపించి నిర్మ
లమ్ము పావన మౌను క్షర మటు, జ్ఞాన
లేశమును మాయు నా పాదదేశమునకుఁ
జేర్పు మందించి కర సరసీరుహమ్ము" 88

# రహస్యము (అంతర్యము)

తే. ఆ వినీలాంధ్యమున నూర్ధ్వ మందుఁ గలదు
చలన రహితమగు హిమము కడు స్తబ్ధగతిని
అలసి యధ్వ మటు విలీనమయ్యె- అచటి
నగము మానియై కనుచుండె నాల్గు దెసలు

తే. పాంథు లిర్వురు ఎప్పుడో బయలుదేరి
నారు- పైపైకి నెక్కుచున్నారు వారు
శ్రద్ధ ముందు మనువు వెన్క సాగుచుండి-
రమిత సాహ సోత్సాహమ్ము లటుల నపుడు.

తే. పవన వేగము ప్రతికూల ఫణితిఁ దాల్చి
యనియె "యాత్రికా! వెనుకకు నరుగుమోయి!
ఇటుల ఛేదింతు నను నెట కేగుకొఱకు?
ఎల్ల ప్రాణాలపై మోహమేల విడువ?

తే. ఆ నగశిరము తాకఁగా నంబరమును
బ్రీతి యత్నించుచున్నట్లు పెరిగిపోవు
క్షతము లద్దాని సర్వాంగకములఁ గలిగె
భయద సానువుల్ దరులు కన్పట్టుచుండె

తే. సోకి హిమఖండములపయి సూర్యకరము
లెందరో చంద్రముల సృజియించుచుండె
వలయగతులఁ జరించుచుఁ బవనమపుడు
మరల నచటికి వేగానఁ దిరిగివచ్చు. 5

తే. జలధరము లటఁ గ్రిందను శక్రచాప
విసర హారాళి యలను బర్వెత్తుచుండె
కలభముల రీతి గర్వానఁ గడఁగెఁ దిరుగ
శంప లనెడి భూషల మెరయింప సాగె.

తే. శ్వేత గజరాజ ఘన గండసీమ చెలఁగి
స్నిగ్ధ మధుధారలను విరజిమ్మినటుల
నిమ్న దేశాన శతశత నిరఝిరమ్ము
లింపు లెనయించుకొని ప్రవహించుచుండె.

తే. శాద్వలత యుబ్బి కన్పట్టు సమతలములు
పటము లటుతోప నొప్పుగా వానియందుఁ
జిత్రచిత్ర రేఖావళీ స్ఫీతరుచుల
నెనసి తోఁచి సతము ప్రవహించు నదులు.

తే. రత్నగర్భ పైఁ గల వెల్ల లఘు తమములు
ఒలసె శూన్యావరణ మట నూర్ధ్వమందు
అమరి కలదున్న తారోహణ మను నిశికి
నంత మనెడి ప్రాతఃకాల మయ్యెనపుడు.

తే. "పొలఁతి! ఎచటి కీ ననుఁ గొనిపోవుచుంటి
వే నధికముగ నలసితినే నెలంత!
సాహసము నశించినది, నిస్సంబలుండ!
బహుళ భగ్నాశగల పాంథ జనుఁడ, శ్రద్ధ! 10

తే. పద, వెనుదిరిగి– ఏను దుర్బలుఁడ ఇట్టి
వాతచక్రమ్ముతోఁ బోరఁ జేతఁగాదు
శ్వాస నరికట్టు నీ శీతపవనమునకు
నిలువఁబడఁజాల నియ్యది నిశ్చయమ్ము.

తే. ఔను నా వారు– ఎవరిపై నలిగి వచ్చి
నానొ వా రెల్ల నావారు నాతి! వారు
దూరమునఁ గ్రింద విడిపోయినారు– కాని
యేనె వారిని మరువఁగా లేను, పడఁతి!"

తే. అపుడు మెరసె శ్రద్ధా! మనో జ్ఞాననమున
లలిత విశ్వాసయుత నిశ్చల స్మితమ్ము
ఆమె కోమలహస్తాన నతని కెదియొ
సేవయొనరింప వ్యగ్రత జెందెనపుడు.

తే. వెలఁది యవలంబన మ్మిచ్చి, వికలుఁడైన
సహచరున కనె మోహన స్వనము లొలయ
"చెలుఁడ! కడుదూర మిపుడు వచ్చితిమి మనము
స్వాదు పరిహాసమున కిది సమయ మగునె?

తే. కంపిత దిశ– అసీమము క్షణము– పైన
నెద్దియొ యనంతమువలె వసించి తోఁచు
పదతలమున భూధరమున్న పగిదినీకు,
ఏమి, తోఁచుచు నున్నదా? ఇప్పు డార్య! 15

తే. ఎట్టి యాధారమును లేక యిచట నుంటి
మిరువురము– కాని యియ్యెడ నిలువంగ
వలయు నేఁడు– నియతిఖేలనల గనంగ
నితరమగు నుపాయ మ్మిపు డెదియు లేదు.

తే. అంధకారము వలెఁ దోఁచు నట్టి యెదియుఁ
బైకిఁ బొమ్మని నీతోడఁ బలుకుచుండె
ఇట్టి ప్రతికూల పవనంపు గట్టిదాడి
నెదియొ యల వచ్చి తా నెదురించు నార్య!

తే. అలపుఁ గొన పక్షములు నేత్రములను మూసి
కొన్న ఖగయుగ మటు లుంద మనిభృతముగ
పవనమే పక్షయుగళమై పరఁగ మనకు
నిచ్చు శూన్యాన నాధార మెదియొ యింక.

తే. కలఁత పడఁబోకు– మిది సమతలము, కనుమ,
ఎచ్చటకు వచ్చితిమొ మన మిపుడు– కనుమ!"
అప్పు డొక్కింతగాఁ బ్రాణ నందినటుల
చెలఁగి కన్నులు తెరచి వీక్షించె మనువు.

తే. అబ్బె నూష్మాభినవ మహితానుభవము
అస్తమించె నక్షత్రగ్రహములు, తార
కలు– దివారాత్రముల సంధికాల మందు
చలనరహితమ్ముగా నుండె సర్వ మచట. 20

తే. ఋతు చతుర చక్రగతి తిరోహితమునొందె
అవని రేఖ విలీనమైనట్లు తోcచె
ఆ నిరాధార పృథుదేశమందు నుదిత
మయ్యె నొక నవ్య చైతన్య మహితశక్తి.

తే. దిక్త్రయాన విశ్వత్రయి- తెలియcబడియె
విడివిడిగ నవి యాలోక బిందువులుగ
పోలెc బ్రతినిధు లటులc త్రిభువనములకు-
చెలcగె విడివిడిగ క్రియాచేతనతల.

తే. అడిగె మనువు "ఈ నవ్య గ్రహమ్ము లేమి?
తెలియc జెప్పుము శ్రద్ధ! యీ తెరcగునెల్ల
చెలియ! ఏ లోక మధ్యమ్ము చేరినానె?
రక్షసేయు మీ యింద్రజాలమ్ము నుండి"

***

తే. "ఈ త్రికోణస్థబిందువు వీవు- ఇవ్వి
బహుళ శక్తిక్షమాగుణవంతము, లొక
టొకటిగా స్థిరుcడ వయి నీ వోపి కనుమ-
ఇచ్ఛతో, జ్ఞానమునc, గ్రియ నెసcగు నివ్వి.

తే. తోcచుచున్నది యుషసి కందుకము పగిది
రమ్యరా గారుణ మది నేత్రములc గనుమ
మంజు కాంతిమయ మనోజ్ఞ మహిత దేహ
మయిన భావమూర్తి కది యౌ నాలయమ్ము. 25

తే. శబ్ద సంస్పర్శ రూప రస ఘనగంధ
భవములగు స్వచ్ఛ సుందర ప్రతిమ లవియె!
చెలcగి వన్నె సీతాకోక చిలుకలటుల
నలు దెసల చేయుచున్నవి నర్తనమ్ము.

తే. ఈ సుమసమయ కాన నాహీన రక్త
పుష్పధూళికా చ్ఛాయ, విస్ఫూర్తి నాత్మ

భావ పూరిత మాయలోఁ బరిఢవిల్లి
యెలమి నిద్రించు, మేల్కొను నెల్లవేళ

తే. వీని సంగీత నినదమ్ము విమల కోమ
లమ్ముగ నొడల్ విరుచుకొను సమ్మదముగ
మాదకత్వ తరంగాళి మలయఁజేసి
మించి గగనపథ మధిగమించుచుండె.

తే. లీల నాలింగనము వోలెఁ బ్రేరణమ్ము
స్పర్శఁగావించు– కల్గుఁ గంపనము మరల
లలిత నూత నాలంబుషా లజ్జవోలె
వికచ సంకోచముల నొందుఁ బ్రకటఫణితి.

తే. మహిమ, మియ్యది, జీవిత మధ్య జగము,
స్నిగ్ధ రసధారలను నభిషిక్త మిద్ది
మధుర లాలసా లహరుల మాన్య మిట్టి
వాహినీవర మెపుడు సంస్పందితమ్ము. 30

తే. దాని దరిని విద్యుత్కణ తతులఁబోలు
నమలమూర్తులు, ఛాయామయమ్ము లవిగొ!
లలిత లావణ్యమున విహ్వలతను మెరసి
యిద్ధ మత్తత నట విహరించుచుండె.

తే. లలిత సుమ సంకు లావనీ రంధ్రములను
భరితరస మగు ఘ్రాణ తత్పరము వచ్చు
ఇందుఁ బొలుచు చుండు సరస బిందువుల న
దృశ్య పృష దుల్బణములు క్రీడించుచుండు.

తే. తిరుగు నియ్యెడఁ దమి నాల్గుదెసల చలన
చిత్రమువలె సృష్టిచ్ఛాయ చిత్రగతుల
సొగయ నీ కాంతిబిందువు చుట్టుఁ జేరి
యా మహామాయ యున్నది హసనరుచుల.

తే. భావచక్రము నడిపించు భామ యామె!
అమరి తిరిగెడి నిచ్ఛా శతాంగ నాభి
నవరస భరి తారమ్ము లనంతముగను
జక్రగోళమ్ముఁ జుంబించుఁ జకితగతుల.

తే. భూరితర మనోమయ భూమి పూజసేయుఁ
దమిని రాగారుణంపు చేతనము నిచట
ఇద్ది మాయకు రాజ్యమ్ము- ఇచటి క్రమము
పాశముల వైచి జీవాలఁ బట్టుచుండె. 35

తే. పరఁగు నీ యశరీర రూపములు వర్ణ
వాసనల యందు విరియు పుష్పములపోల్కి
అప్సరో రాగ లహరి కాత్యంత రమ్య
డోలికలలోన నూగాడుఁ దేలి యవ్వి.

తే. ఈ జగద్భావభూమిక యెల్ల పుణ్య
పాపములకు జనని- మధు తాపకీలిఁ
గరఁగి రూపొందుచున్నారు కనఁగ దాస్య
భావ ప్రతికృతులై యిటఁ బ్రాణు లెల్ల.

తే. నియమయుతమయి చిక్కు లనియెడి లతిక
వడయు భావవిటపి తోడ బంధనమును
ప్రబలమై యున్న జీవితవన సమస్య
వెలయు నాశా గగన సుమ వికసనమ్ము.

తే. నూన సమయంపు టుద్గమస్థానమిద్ది
కలదొకట నాకు రాలెడి కాల మిచట
అమృత హాలాహలము లిట నమరఁ గలిసె
సౌఖ్య దుఃఖమ్ము లొక సూత్ర సంధి నొందె”

***

తే. “ఈవు రమ్య మీ జగముఁ జూపించినావు
కాని యా శ్యామ దేశంపు కథ యదేమొ?

ఒదిగి యెట్టి రహస్య మం దున్న యదియొ,
కాంత, కామాయనీ! తెల్పఁగదఁగు మోసి!" 40

***

తే. "బహుళ తిమిరమ్ము పోల్కి నస్పష్ట మట్టి
శ్యామలావని, కర్మవిశ్వమ్ము, మనువ!
అగు ఘనీభూత మజ్ఞాత మైన యిద్ది
మలినమౌ ధూమవాహినిమాడ్కి నిద్ది.

తే. నియతిచేఁ బ్రేరితమ్మయి నిత్య మిద్ది
కర్మ చక్రోపమమ్మయి కడ భ్రమించు
తగులుకొన్నది యిచట నందరికి వెంట
నెదియొ యొక వ్యాకుల వినూత నేషణమ్ము.

తే. శ్రమమయ మ్మైన కోలాహలమ్ము– మహిత
యంత్రపీడాయుత వికలమౌ ప్రవర్త
నమ్ము– లేదు విశ్రాంతి క్షణమ్ము నచట–
దాసు లెల్ల జీవులు క్రియాతంత్రమునకు.

తే. భావరాజ్య మానసిక శుభ సుఖ వితతి
దుఃఖ నిచయమ్ముగా మారి తోఁచునిచట
అమిత హింసోన్నతము లైన హారములను
నణువు లియ్యవి తిరుగు గర్వాత్తరేఖ.

తే. భౌతికశరీరు లిట యొక పని యొనర్చి
యిచట బ్రతుకఁగ నెదలలో నిచ్ఛయింత్రు
భావరాష్ట్రంపు నియమముల్ పరఁగు దండ
నలుగ– వ్యథల మూలిగెద రందరును నిచట. 45

తే. పని యొనర్తురు సంతోషఫలము లేదు
అల కశాహత ప్రేరితు లైన యటులఁ
గర్మపరు లౌదు రిటఁ బ్రతిక్షణము– భీతి
వివశు లైనట్లు వీరు కంపింతు రెపుడు.

తే. విధియె కర్మచక్రము నడిపించుచుండు
సంభవించు మమత్వ వాసనలు తృష్ణఁ
బాణి పాద మయమ్మైన పంచభూత
పూజనము సాగు నిచట విస్ఫూర్తి నెపుడు.

తే. కల్గు సతత మియ్యెడను సంఘర్షణమ్ము
రమ్య వైఫల్య కల్లోల రాజ్యమిద్ది
మత్తతను గైకొనిన యీ సమాజమెల్లఁ
బరుగులిడుచున్న దొౌక ఘనధ్వాంత మందు.

తే. స్థూలు లౌదురు రూపాల సొగయఁ జేసి
భయద పరిణతి కర్మనిర్వహణ వలన!
బహుళ కాంక్షలఁ దీవ్ర పిపాస కలిగె
గాఢ మమతచేఁ గాఠిన్య గరిమ యొదవె!

తే. శాస నాదేశ ఘోషణ చటుల విజయ
భయద హుంకార మెయ్యెడ వరలఁజేయు
ఆఁకలిని వికలతఁ జెందినట్టి దళితుఁ
బదతలమ్మునఁ బలుమారు పడగవైచు. 50

తే. 'ఉన్నతినిగూర్తు' మని మత్తు గొన్నవార
లిచటఁ గర్మబాధ్యతను వహించుచుంద్రు
తప్పులగుట బొబ్బలు కల్గి, దేహమందుఁ
నెపుడు పగులుచు రసిగారు నెక్కువగను.

తే. ఇచట రాశీకృత మ్మైన యెల్ల విభవ
మమరుచు మరీచికా జాల మటులఁ దోఁచు
క్షణిక భాగ్యధను లయి నాశనము గొనిరి
అయిన యత్నము చేసెద రందె వీరు.

తే. చేయ నపరాధముల నెల్ల సిద్ధపడుట
యశమునకు లాలసత యిటు నబ్బుచుండు
అంధమగు ప్రేరణముచేత నరగుచుంద్రు
గణనగావించెదరు తమ్మె కర్తలనుచు.

తే. జలము తుహినోపలమ్ముగఁ జెలఁగుచుండు,
నెగడుఁ బ్రాణతత్వ మిట ఘనీభవింప
దప్పిగొన్నవా రెల్లరు దగ్ధమగుదు
రిటు క్షతముల- చచ్చుచునె జీవించుచుంద్రు.

తే. నీల లోహితానల కీల నిత్య మిచటఁ
గాల్చి, కరగించి మూర్తుల గండరించు
ఓర్చి దెబ్బల నిలువఁగా నోపినట్టి
ధాతువును మృత్యువైనఁ గదల్పలేదు. 55

తే. ప్రావృ డంబోధరము ఘనస్వనముఁజేయు-
కూలముల నైజముగ నెరిఁ గూలఁద్రోసి,
విపినకుంజములఁ గడు ప్లావిత మొనర్చి,
లక్ష్యసంశుద్ధి యనునది రహి నదించు"

***

తే. "ఇంకఁ జాలును- దీనిఁ జూపింపవలదు
గాఢ భీషణమౌ నిట్టి కర్మజగము
శ్రద్ధ! కలదు పుంజీభవ ద్రజత మటుల
నద్ది! ఆ యుజ్వలత యేమి? అతివ! చెపుమ"

తే. "ప్రియతమా! ఇది జ్ఞానవిశ్వమ్ము ఇచటఁ
గల దుదాసీనత సుఖ దుఃఖముల యెడల
నిర్మమన్యాయ మిట! దైన్య నివృతి లేని
బుద్ధి చక్రము నడచు పొల్పొంది! విరిసి.

తే. ఇచటఁ బ్రాణులు స్వేచ్ఛ నహీన తర్క
యుక్తి "అస్తి నాస్త్యను వాక్య" నొనర సలుపు
ఇవ్వి నిస్సంగములు- ముక్తి నెనయఁ గలియఁ
గొంత సంబంధమును బెట్టుకొనునుగాని.

తే. ప్రాప్యమే లభించు నిచట- పడయఁ దృప్తి
లేదు- బుద్ధి విభజనను రేణుగణము

వంటి ఐశ్వర్యమును బంచుఁ- బ్రాణులిచట
దప్పితీర లిహింత్రు శీతల హిమాని. 60

తే. ఈ నిదాఘ మరుస్థలి నెండియున్న
యేటి తటములు మివుల భాసించినటులఁ
దర్కమున, తపమున, సంపదలను మగ్ను
లయిన ప్రాణులు మెరయుచున్నటులఁ గలరు.

తే. కడఁగు తమ మనోభావాలఁ గాయకర్మ
లెల్ల సమతులనము సేయ నిచ్ఛగలుగు
వీరు విత్తమ్ముకొరకునై దారివిడని
న్యాయపతులను బోలుచున్నారు మనువ!

తే. తమదు పరిమిత పాత్రలఁ దాల్చి మనువ!
స్వాదు బిందువుల్ గల్గు నిర్ఘరము నుండి
పడయగోరుచున్నారు జీవనరసమ్ము
జరయు, మృత్యువు లేనట్లు వరలి వీరు

తే. ధర్మతుల సేయు విభజన తమిని జేరు
స్వత్వముల కిట వ్యాఖ్యయు సరసగతుల
ఈ మహాలోక మరయ నిరీహ- మయ్యు
నెదియొ పొందియే తాను సంతృప్తి నొందు.

తే. పద్మసంపద గల సరోవరము వోలె
నుత్తమత నిజస్వంబుగా నుంద్రు వీరు
మధుకరము లటు జీవనమధువునెల్ల
సంచిత మొనర్చుచుంద్రు వీ రంచితముగ. 65

తే. ఇచట శారదాజ్యోత్స్న భేదించి తిమిర
పటలిఁ దోఁచుచున్నది తాను బ్రస్ఫుటముగ-
ఇట్టి యనవస్థ! రెండు సంహితను గొనఁగఁ
జెదరును వ్యవస్థ వికలతఁ జెంది యెపుడు.

తే. అరయుమా, సౌమ్యులై యుందు రంద రిచట
అయిన శంకితుల్ వీరు దోషాళిఁ గూర్చి
భ్రూచలన మిష సంతుష్టిఁ బొందినట్లు
దంభ చిహ్నమ్ము లిట సతతమ్ము సాగు.

తే. ఇచట జీవితంపు రస మస్పృశ్య మౌను
ముట్టవలదు కూడుకొనుచుఁ బొలయనిమ్ము
ఇంతమాత్రమె నీ యంశ మిందు– నిలుపు
మా తృషామృషలను దూఁరమందు నీవు.

తే. బహుళ సామరస్యముఁ గూర్ప బయలు వెడలి
వీరు వైషమ్యమును బెంచినారు– కడఁగి
పలికెద రెవియొ మూలతత్త్వమ్ము లనుచు
అందు రిచ్ఛ లన్నియు నసత్యమ్ము లనుచు.

తే. శాంతు లటు తోఁచెదరు వీ రశాంతు లయ్యు
బ్రీతి శాస్త్రరక్షణఁ గని పెరుగుచుంద్రు
వీరి జ్ఞానశాసనముల తీరు లెల్లఁ
బడయును క్షణక్షణముఁ బరివర్తనమ్ము. 70

తే. ఈవు చూచితివి– "త్రిపుర" యిదియె– ఇటులఁ
దోఁచు జ్యోతిర్మయమ్ము బిందుత్రయమ్ము
సౌఖ్య దుఃఖాల కేంద్రముల్ స్వయముగానె
ఎంత భిన్నమ్ములై యివి యెల్ల నెనయు.

తే. కలదు జ్ఞానము దూరాన చెలఁగును క్రియ
భిన్నముగ–హృదయేచ్ఛ సంపన్నమగుట
యెట్లు? కలిసికో లేకపోయినవి– ఇదియె
యరయ జీవితఁపు విడంబమై చరించు".

తే. లీలగా నొక ఘన కాంతిరేఖ వోలె
వ్యాప్తిఁగొనియె శ్రద్ధాస్మితి వాని యందు
మరల సంబద్ధతను జెంది వరలె నవ్వి
కడిమి వానిలో జ్వాల జాగరితమయ్యె

తే. వక్రరేఖాకృతి నది జాజ్జ్వల్య మగుచు
నుండె విషయ వాయు హతిచే నొలసి యపుడు
వరలి శూన్యాన చాంపేయ వర్ణకీల
"లేదు లే" దని చెప్పెడి లీలఁ దోఁచె.

తే. ప్రళయ పావనశక్తి తరంగపాళి
యా త్రికోణాన జ్వలియించు చపుడు మెరసె
శృంగ డమరుక నాదమే చెలఁగు చపుడు
నిఖిల జగములఁ దానయై నిండియుండె. 75

తే. చేతనమయాగ్ని వెల్గుచుఁ జెలఁగు సతము
అట మహాకాళ విషమ నృత్యమ్ము! విశ్వ
రంధ్ర మట జ్వాలతో నిండి రక్తి నాత్మ
విషమనాట్యమ్ము తమిని గావించుచుండె.

తే. స్వప్నమును స్వాపమును మరి జాగరణము
పొలిసి యిచ్ఛా క్రియా జ్ఞానముల్ లయించె
అమృతమగు ననాహత శబ్దమందు మనువు
తన్మయత నిల్చె శ్రద్ధాద్వితయత నొప్పి. 77

# ఆనందము (ఆనందం)

తే. తీసికొని కావలసిన పాథేయ మప్పు
డొక్క యాత్రికదళము సముత్సుకతను
నాపగా రమ్యతీరమం దమల మృదుల
పృథుశి లోచ్చయ మార్గాన వెడలుచుండ్రి.

తే. ధర్మమునకుఁ బ్రతినిధి యౌ ధవళ వృషభ
మావృతమ్మయ్యె సోమలతాళి, నద్ది
గళ ఘటిత ఘంటికా తాళగతులు మొరయ
ధీర మంథర గమనానఁ దేజరిల్లు.

తే. వామకరమున వృషభఁపు దామెనయును,
నితర హస్తమున త్రిశూల మెలమిఁ దోప
నమిత తేజో విరాజమా నాననుండు
మానవుఁడు దాని వెనువెంట మసలుచుండె.

తే. అభినవములైన యాతని యంగకములు
సింగపుం బిల్లకును బోలెఁ జెలఁగుచుండె
అమిత గాంభీర్యమున నొప్పు యౌవనమ్ము!
నిండి కల వందు నవభావనిధులు కొన్ని.

తే. ఉక్షమునకు రెండవ ప్రక్క నుండి, వనిత
ఇడ యపుడు సద్దుసేయక నేగుచుండె
సంజవలెఁ గావిఁ గట్టె నా సాధ్వి, వినఁగఁ
గలరవము లేదు, మౌనమ్ము చెలువుమెరసె. 5

తే. లలితమోహన యువజ నోల్లాసములును,
శిశుగణ మృదు కలరవ విశేషములును,
కామినీజన మంగళ గానములును
దివిరి ధ్వనియించుచుండె యాత్రికదళమ్ము.

తే. చమరముల మీఁద వేసిరి బరువు వారు
అవ్వి కలసి, యాగక యపు డరుగుచుండె
వానిపై నెక్కి కొందరు బాలు రంతఁ
బ్రమద మొందుచునున్నారు పయనవేళ.

తే. ప్రక్కగా నేగుచును వారిఁ బట్టుకొనుచు
నెద్దియో చెప్పుచును దల్లు లేగుచుండ్రి
పోవుచున్నది యెచటికో పుత్రు లెరుఁగ
వారు తెలియంగఁ జెప్పుచున్నారు తమిని.

తే. బాలుఁ డొక్కఁ డీరీతిగాఁ బలుకుచుండె
"వచ్చితిమి- అదె చూడుఁ మీ వచ్చినదియె
యా వసుంధర యౌ నని యందు వీవు
నెంతకాలమ్ము నుండియో యిటులనమ్మ!

తే. అయిన నడచుచునుంటి వో యమ్మ! నీవు
ఆగు టనుమాట తలఁచుట యైన లేదు
అమ్మ! దేని జేరఁగ నిటు లరుగుచుంటి
మట్టి తీర్థభూమి యెచట నమరె చెపుమ!" 10

తే. "తండ్రి! అయ్యదె! ఆ దేవదారు వనికి
నా యెదుటి సమతలమదె యట్టి నెలవు
దాని దళములనుండి హిమానిఁ గొనుచు
నింపుకొనుచుండెఁ బాత్రల నీరదములు.

తే. ఈ గిరితటము దిగినంత నెలమి మెరసి
మనకుఁ గనుపట్టు నెదుట నా మహిత మంజు
భూమి యత్యుజ్జ్వలం బౌచుఁ బొలుపులొలయు
తీర్థ రాజమ్ముగా భువిఁ దేజరిలుచు".

తే. అంత నా బాలుఁ డిడ కడ కరిగి యనియె
"ఆగవే అమ్మ! ఇంచుక యాగు" మనియె
"ఇంక మరికొంత కథ వినిపింపు" మనుచు
హఠమొనర్చెను ముద్దుగా నాతఁ డపుడు.

తే. నెలంత, ఇడ, రెప్ప వాల్పక నేత్రదృష్టి
నిజపదాగ్రమ్ములను నిల్పి నిలచి చేర
మార్గదర్శిని పగిదిఁ దా మంద మంద
ముగను నడచుచు నుండె నింపులు దలిర్ప.

తే. ఇటుల ననె నామె "ఎచటికి నేగుచుంటి
మద్ది పావన క్షేత్ర మీ యఖిల జగతి
అద్ది యొకరి సాధన కైన యమరభూమి!
భూరి శీతల శాంత తపోవనమ్ము!! 15

తే. బాలకుం డపు డిడతోడఁ బలికె నిట్లు:
"పొలసి తోఁచు నా శాంత తపోవనమ్ము
ఎప్పు డెందు కయ్యెనొ యెఱిగింపు మమ్మ"
ఆమె సంకోచ మొందుచు నపుడు పలికె:

తే. "ఒక మనస్వి యొక దినాన నొంటివచ్చె
నచటి కని వింటి- అవ్వేళ నతి వికలతఁ
జెంది సర్వావయవములు శీర్ణములుగఁ,
వాడియుండె జగజ్జ్వాల వలన నతఁడు.

తే. అతని భీప్రద కీల గిర్యంచలముల
యందుఁ జెలఁగుచుఁ జొరఁబడి వ్యాప్తినొందె
అట్టి దావానలజ్వాల లతిశయించి
యస్థిరత నిచ్చె ఘన కాననాళులకును.

తే. అతని యర్ధాంగి యైయున్న యతివ యతని
వెదకికొంచును వచ్చి యవ్వేళ పరమ
దీన కరుణాత్మక మగు నా స్థితినిఁ జూచి
నేత్రపాళిని వర్షమ్ము నింపుకొనియె.

తే. ఆమె కన్నీరు వరదాన మయ్యె- అంత
నది జగన్మంగళము సేసె నక్కజముగ
తాపమెల్ల శమించె నంతట వనమ్ము
హరిత శీతమై సౌఖ్యదమ్మయ్యె నెంతొ. 20

తే. గిరుల నిరఝరుణుల పరువెత్తసాగె
హరిత వర్ణమ్ము సకలమ్ము నలమికొనియె
జీర్ణతరువులు మృదువుగా స్మిత మొనర్చె,
పల్లవాళి నెఱ్ఱదనము ప్రభవమొందె.

తే. అచట నుపవిష్టమై యిప్పుడా ద్వయమ్ము
చేయుచున్నది సంప్రీతి సృష్టిసేవ
అఖిలజన దుఃఖకీలల నణఁచి యిచ్చు
చున్న దనుపమ సంతోషసుఖము లిచ్చ.

తే. అచటఁ గలదు మనోదాహ మార్పఁ గలుగు
నమల జలపూర్ణ రమ్య నీరాకరమ్ము
అందు రద్దాని మానసం బటకుఁ జేరు
వారి కెల్లను సౌఖ్యసంపదలు గలుగు".

తే. "ఇట్టు లూరక నడిపింతు వేల దీని?
ఎక్కి కూర్చుండ వేమి యీ వృషభముపయి?
ఎరుకపడ దించుకేనియు నేమొ కాని
యిటుల నలయించుకొనుచుంటి వీవె నిన్ను".

తే. "శుభ్ర సారస్వతపుర వాసులము మనము-
వ్యర్థమైన యీరిక్త జీవనఘటమ్ము
నమృత సలిలమ్ముతో, నింప నభిలషించి
వచ్చితిమి యాత్ర కిట కపారరక్తి. 25

తే. ధర్మమునకుఁ బ్రతినిధి యై తనరు నిద్ది-
ఈ వృషభ మటఁ జేరి తృజింత- మచట
నిద్ది భయము విడి సుఖ మెయ్యెడను నొదవ
స్వేచ్ఛతోఁ జిరముక్తమై చెలఁగుఁగాత!"

తే. అందరును ముందునకు సాగుచరిగినారు
అంతఁ దోఁచె నించుక పల్లమైన భూమి-
పరుపు గట్టిన పచ్చికబయలు వోలె
దాని సమతలమ్ముగు లోయ తనరియుండె.

తే. శ్రమయు, దాపము, మార్గవిషాద మెల్ల
నపుడు క్షణమున మటుమాయ మయ్యె- ఎదుటఁ
జెలఁగి యాత్మమహిమ విలసిల్లుచుండెఁ
దత మహోన్నత ధవళభూధర మొకండు.

తే. శ్యామల తృణ వీరుధముల నతి మనోజ్ఞ
మగుచు నెలకొన్న దాని ప్రత్యంతమందు
నవ్య కుంజగుహాగృహభవ్యహ్రదము
రమ్యమై, శిష్టమై యుజ్జ్వలముగ నుండె.

తే. అరుణ పీత హరిత కణిశాళి తోడఁ
బరగు నా కాననము ప్రతి పర్వవేళఁ
గుసుమ సంకులమౌచును గొమరు మిగిలి-
శాఖికలు దాగె నట సుమజాతులందు. 30

తే. మహిత యాత్రికదళ మాగి మానసఁపు వి
శిష్ట దృశ్యమ్ము తమిని దర్శించినారు
అద్ది ఖగ మృగములకు నత్యంత సుఖద
మై సముజ్జ్వ లాల్ప జగతి యట్టులుండె.

తే. అద్ది రమణీయమై యొప్పె- అమల వజ్ర
నీరమును మరకత వేది నింపి నటుల,
రమ్యమైన ప్రకృతిముకురమ్మొ యనఁగ,
నిదురవోవు రాకారాజ్ఞి యొదిగి యనఁగ.

తే. దినకరుఁడు గిరివెన్కకు దిగియె నపుడు
హిమకరుం డాకసమ్ముపై కెక్కివచ్చె
కడఁగి కైలాసము ప్రదోషకాంతి యందు
విమలమై ధ్యానమగ్నోప విష్టమయ్యె.

తే. అమల వల్కల వసనయై యరుగుదెంచె
మించి సంధ్య కాసార సమీపమునకు
తురుముకొనె నామె రిక్కల కురులలోన
ధారణము సేసె శుభ్ర కదంబ రశన.

తే. కొసరి కిలకిలల్ వోయె శకుంతలమ్ము,
కలరవము సేసె రాయంచగణము వలచి,
ప్రతిరుతులతోడ నభినవ రాగసమితి
నాలపించెద రట కిన్న రాబ్జముఖులు. 35

తే. మానస స్వచ్ఛతటమున మనువు ధ్యాన
నిరతుఁడై యుపవిష్టుఁడై నెగడుచుండె
అంజలి నిలిపి సుమముల నపుడు శ్రద్ధ
నిలువఁబడియుండె నాతని నికటభూమి.

తే. శ్రద్ధ పుష్పాళి వెదజల్లె - శతశతములు
షట్పదములు మనోజ్ఞ గుంజారవముల
నింపివైచె నెల్లెడల వినీలనభము-
కడఁగి కూర్చుండె మనువును కనుల మోడ్చి.

తే. అపుడు గుర్తించినా రెల్ల యాత్రికులును
అయిన వారింక నే రీతి నాగఁగలరు?
ద్యుతిమయమ్మయి యా దేవయుగళి తోఁచె
ఏల తలవంప రటఁ బ్రణమిల్లు కోర్కె?

తే. నిజ గళాయత్త ఘంటికా నిక్వణముల
సోమ వల్లరీ వాహి యస్తోక వృషభ
రాజ మిడవెన్క నడచెను లలితగతుల
నడచుచుండె నా వెన్క మానవుఁడు గూడ.

తే. మరచి తనుఁ దానె ఇడ నేఁడు మసలు, అహహ!
కాని- కాంక్షింప లే దామె క్షమను తలఁచి
అట్టి దృశ్యమ్ము కనఁగల్గినందు కామె
కన్నుఁగవను బ్రశంసించుకొన్న దపుడు. 40

తే. ఆ పురా చేతన పురుషుఁ డపుడు ప్రకృతి
తోడఁ జిరయోగ మొంది సంతుష్టి నొందు
చుండ మంగ ళానంద మహోదధియును
నయ్యె నిజశక్తితోఁ, దరంగాయితమ్ము.

తే. ఒనరc గావించుకొని శ్రద్ధయొడినిc దనరి
మానవుcడు చేరె- అపు డిడమంజు శిరము
చేర్చి శ్రద్ధాసతీ పాదసీమc బలికెc
బులకితాంగియై గాద్గద్య లలితగతుల:

తే. "మరచి వచ్చి తే నిటకు నమర్త్యమూర్తి!
ధన్యనైతిని నీదు సందర్శనమున:
నన్ను నిచటి కీనాcడు సంపన్నశక్తి
లాగికొనివచ్చె నీగతి లలితమమత!

తే. నేను నిజమున కేమియు నెరుcగననుచు
దివ్య! భగవతి! యీనాcడు తెలిసికొంటి!
అందరను ఏను మహితాత్మ! అతిశయముగ
భ్రమకు లోcజేయుచుంటి నభ్యాసవశత.

తే. దివ్యమౌ నీ తపోవన తేజ మహిమ
నఖిల కలుషమ్ము లెడబాయు ననుచుc దెలిసి
యొక కుటుంబమ్ముగాc గూడి యుత్సహించి
యందరము వచ్చినాము యాత్రార్థమిటకు" 45

తే. ఇంచు కించుక తోవ హసించి మనువు
చూపెc గైలాస మహనీయ శుభ్రనగము
పలికె "తిలకింపు మిట లేరు పరు లెవరును
కా, రిచటివారలు పరాయివారు కారు.

తే. తలcప కా మన్యమౌ కుటుంబులము మనము
కనcగ నయ్యెదము మనము మనమె! మనమె!-
అగుదు రీ యెల్లవారు నా యవయవములు
ఏను బరిపూర్ణుcడను లోప మెదియు లేదు.

తే. ఇందు శప్తులు కాcజాcల రెవ్వరైన,
ఎవcడు తప్తుc డయినపాపి యిచట లేcడు
సమతలమ్ముగc మరియును సమరసముగ
జీవితావని యెటనైన చెలcగుచుండు.

తే. చేతనత యను నుదధిలో జీవితమ్ము
వ్యాప్తిఁజెందిన దూర్మికా వ్రాత మటుల
వ్యక్తిగత ముద్రలొక కొన్ని యున్న వయ్యు
నున్న దొక యున్న తాకృతి యుజ్జ్వలముగ.

తే. ఇట్టి జ్యోత్స్నా పయోనిధి నెలమి నున్న
బుద్బుదమ్ముల పోలికఁ బొలిచి తార
కాళి కన్పట్టుచున్నది కాంతివిసర
మంజులమ్ముగ, ముగ్ధ సమ్మోహనముగ. 50

తే. ఎల్ల ప్రాణులు రమణీయ సృష్టిరీతి
నిట్టి దగు నభేదజలధి నెలసియుండె
చరమభావము వరలు చన్నింటియందుఁ
గలసి మెలసి రసముగా రహించు చుండు.

తే. విపుల మీ చరాచర మూర్త విశ్వమెల్ల
నాత్మ సుఖదుఃఖముల తోడ నమరియుండు
భూరి చైతన్య శుభ మహా పుణ్య వపువు
నిత్య సుందరము సతత సత్యమరయ.

తే. అందరకుఁ జేయు సేవ కా దన్య మరయ
నద్ది తన సుఖసృష్టి యై యమరు- అగును
దాని ప్రత్యణువు, కణము దాని దందు
ద్వైతభావంపుటూహ విభ్రమమె యగును.

తే. ఎన్న నందరఁ దా నంటుకొన్న పగిది
నెగడు నే నను చైతన్య నిత్యశక్తి
భిన్నతా మద్యమును ద్రావి యున్నరీతి
నొలసి యందరుఁ దలపోయుచున్నవారు.

తే. అగుత మేల్కొంట యుషసి నేత్రాబ్జములను!
రేలతాంగి రెప్పలను నిద్రించుఁగాత!
చిక్కువడిన నిశాసతీ చికురపాళి
స్నిగ్ధమౌ స్వప్నములను దర్శించుఁగాక!! 55

తే. మహిత చైతన్య సాక్షియౌ మానవుండు
హసనముల నిర్వికారుఁడై యలరుఁగాత!
నొప్పు మానస మధుర సంయోగ మందు
లోలుఁ డౌఁగాక యతఁడు లోలోతు లెదిఁగి.

తే. భేద భావాళి సర్వమ్ము విస్మరించి
దృశ్యముగఁ జేసి సుఖదుఃఖ హేలనెల్ల
"నేనె యిది" యను మీ వోయి మానవుండ!
విశ్వమే నీకు నీడయై వెలయు నయ్య!"

తే. అపుడు శ్రద్ధాసతీ మధురాధరముల
యందు లఘురేఖ లొదవి రాగారుణంపు
కిరణకళ లట్లు తోఁచి, చిగిర్చినట్టి
స్మితిసురేఖ లై కడు వికసించి మించె.

తే. ఆమె యౌను కామాయని– ఆమె యౌను
విశ్వ మంగళ కామన– విమల మాన
సతట వీధి జ్యోతిష్మతి గతిగ నామె
లలితముగ నిల్చె సంపుల్ల లతిక గతిగ. 59

విశ్వచేతనచే హర్షవివశ యగుచు
పూర్ణ కామంపుఁ బ్రతిమయై పొలిచె నామె;
ఒక గభీర మహాహ్రద మొగిని విమల
పుణ్య జలముల నిండినపోల్కి నుండె;

ఎట్టి వంశీరవమ్ముచే నీ జగమ్ము
రాగమయ మగు ననురాగ లాలనముల
నట్టి కామాయనీదేవి హర్షములకు
నర్థి ముఖరిత మగుచుండె నగజగములు.

క్షణములో విశ్వకమనీయ కమల మందుఁ
బ్రత్యణువు చెందినది పరివర్తనమ్ము;
నిండినది పిశంగ పరాగ నియతి నద్ది;
అర్థి నానంద పీయూష మపుడు కురిసె.

చేసి స్నానమ్ము నవగంధ శీకరములఁ
బ్రౌఢ పవమానుఁ డయ్యెడఁ ఎబరువువెట్టె;
అతఁడు సుమరజ రంజి తాయామ నళిన
కేసరాళీ సుఖస్పర్శ చేసి వచ్చె.

ముగ్ధము లగణితము లైన ముకుళములకు
నిచ్చి యున్మత్త వికసన వచ్చె నతఁడు;
అతఁడు స్పర్శ నెఱుఁగని వాని యధరములకుఁ
జిరుత ముద్దు లెన్నిచ్చి విచ్చేసినాఁడొ!

ఆగి యాగి యెదొ మరచినట్టు లాతఁ
డపుడు సాగించుచుండె వయారి నడక;
స్వర్ణ సుమరజ రమ్య ధూసరము నిండి
స్నిగ్ధ జలదమ్ము పగిది విస్తృతిని జెందె. 65

తుషిత వనలక్ష్మి కేసర ధూళిపాళిఁ
దానె వెదజల్లె నను నట్లు కానఁబడియె;
హేమకూటము తనరూపు హిమజలములఁ
బ్రతిఫలింపఁగఁ జేసెడి పగిది నుండె.

సర్గ సుమధుర మేల నోచ్ఛ్వాసు లపుడు
బృందములు గట్టి యెడఁద నమందరక్తి
నవ్య మంగళ ముగ్ధ గానములతోడ
వెడలి యే తెంచినవి నభోవీథి యందు.

వల్లరులు మున్గె నృత్యప్రవర్తనములఁ,
బ్రీతి సౌగంధ్య వీచికల్ విస్తరించె
వేణురంధ్రమ్ములను వీడి వెడలి వచ్చు
నిట్టి సంగీత మొకయెడ నెటుల నిలచు.

మధుకరమ్ములు మత్తిల్లి మంజు నూపు
రముల పోలిక శింజినీరవ మొనర్చె
శారదా హస్త వల్లకీ స్వనము వోలె
నమరి వ్యాపించె గగన దిశాంగణముల.

క్రైపున వసంతుఁడు మలయగంధవహుఁడు
పడుచు లేచుచుఁ బరువెత్తి వచ్చిరపుడు
వచ్చెఁ బసుపాడి కాకలి పరమళముల
సొగయ వర్షించె నంత ప్రసూనచయము. 70

విశ్వసుందరి దేహాన వెలసి మెరయు
పట్టుచీరె నొక ముడుత పడియె నేమొ
కాదు– సంపూర్ణ సృష్టిలోఁ గల్గి మత్త
మృదుల కంపన మొందు వ్యాపించె నపుడు.

తోడు సుఖమున కార్తి విదూషకుండు
నవ్య పరిహాసపూర్ణాభినయ మొనర్చి,
యెల్లర స్మృతిపటము నందు నిపుడు దాగి
భయము విడిచి తాఁ గూర్చున్నవాఁడు నేఁడు.

కొమ్మకొమ్మన మధుమయ కుట్మలములు
జాలికల రీతి రూపొందె– సవతు లేదు
మంజు రసభార ఫుల్ల సుమాళి యెల్ల
నొదిగి యెదిగి నెమ్మదిగ నెమ్మదిగఁ గురిసె.

మహిత హిమఖండములు, రశ్మి మండితములు,
కాంతి విరజిమ్మె మణిదీప గతుల నొప్పి,
వాని డీకొని పవనుండు పరమ మృదుల
మర్ద ళాధ్వని గావించు మాడ్కిఁ దోఁచె.

మంజు గీతారవము వినిచె మహితరీతి
మొరయుచున్నది జీవన ముగ్ధమురళి
రమ్యకామన మధుర మేళనము వంకఁ
గెరలి చేయుచునుండె సంకేత మపుడు. 75

అప్సరసలై సుధాంశుని యమృత రశ్మ
ులంతరిక్షాన నటనమ్ము లాడుచుండె
పరిమళఁపుఁ గణకణమును బట్టికొనుచు
రక్తిఁ గావించుకొనుచుండె రంగబూమి.

అపుడు హిమవతి పాషాణియైన ప్రకృతి
తోఁచె మాంసల వోలె నత్యూర్జితయయి
అట్టి లాస్య రాసముల విహ్వలతఁ జెంది
లలితగతి నవ్వఁ గడఁగెఁ గళ్యాణి యామె!

శశిమకుటధారియై యా రజత మహీధ్ర
మను మహేశుఁడు మానస హ్రద మనోజ్ఞ
వీచికా గౌరి లాస్యమ్ముఁ జూఁచి యెడఁద
స్పందన మ్మొందినట్లుగా బరగుచుండె.

విమలమై యందమొలయు నా ప్రేమజ్యోతి
ప్రతిఫలించెను సర్వ నేత్రములలోన
పరిచితము లట్లు తమవె యై పరఁగినట్లుఁ
గానఁబడియె నెల్లెడ వస్తుగణము లపుడు.

జడము చేతన మయ్యెడ సమరసములు
ఉండె సౌందర్య మచట రూ పొందినట్లు
ఒక్క చైతన్య మొలసెఁ మహోజ్వలముగ
నట నఖండ మహానంద మమరి యుండె! 80

# కన్నీరు

# కన్నీరు

## అంకితం

హిందీ సాహిత్య రంగంలో యుగకర్తవంటి మహాకవి శ్రీ జయశంకర ప్రసాద్ కావ్యాలు రెండు. 'ఆంసూ', 'కామాయని' మా నాన్నగారు శ్రీ వావిలాల సోమయాజులు గారు తెలుగులోనికి అనువదించారు. హిందీ సాహిత్యచరిత్రలో మన భావకవిత్వ రీతివంటిది అయిన 'ఛాయావాద' రీతిలో ప్రముఖుడైన శ్రీ జయంశంకర్ ప్రసాద్ 'ఆంసూ' కావ్యం ఆరోజుల్లో ఎందరినో ఆకర్షించి ప్రభావితులను చేసింది. చిరవిరహం, ప్రణయభంగం వాటినుండి జనించిన నిర్వేదం, ఆ నిర్వేదం అంచున నల్లమబ్బుకు వెండి అంచులాటి ఆశాద్యుతి వీటన్నిటి సమ్మేళనంలోనించి ఉద్బుద్ధమైన ప్రణయమాధుర్యం ఇవన్నీ మానాన్నగారిని ఆకర్షించి వుండాలి. ఆ కావ్యాన్ని తెలుగువారికి పరిచయం చేయటం ఒక్కటే ఆయన లక్ష్యం అనుకోవ డానికి వీలులేదు. ఆయన జీవన సంస్కారంలోని ప్రణయరేఖామార్దవం వల్లనే అనువాదం ప్రారంభమైందనటం సత్యం.

ఆ ప్రణయరేఖాచాలనం వల్లనే ఆయన ఈ కావ్యాన్ని తన జీవన సహచరి ధర్మపత్ని అయిన మా అమ్మగారికే అంకితం చేయాలని భావించారు. జీవితంలోని ఆటుపోట్లు అన్నిటిలోనూ, అద్వైతం సుఖదుఃఖయోః అన్నట్లు నిలిచిన ఆమెకు కవిగా తన ప్రేమపూర్ణ కృతజ్ఞతను ఈ విధంగా చెల్లించాలని మా నాన్నగారు భావించారు. అది ఆయన జీవించి వుండగా సఫలం కాకపోవటం ఒక దురదృష్టం కాగా ఆయన భావనను సఫలీకృతం చేసి పితృఋణం చెల్లించుకొనే అవకాశం ఆయన సంతానమైన మాకు కలగటం మా అదృష్ట విశేషంగా భావిస్తున్నాము.

మా నాన్నగారు శ్రీవావిలాల సోమయాజులుగారి హృదయ సంవాదంగా ఈ కావ్యాన్ని మా అమ్మగారు శ్రీమతి కైకమ్మగారికి సమర్పిస్తున్నాము.

10-1-2001 **వావిలాల బృహస్పతి**

కొలంబియా

# కన్నీటి కైవల్యం

"కవి కౌస్తుభ"
**డా॥ ఆచార్య తిరుమల**
301, నందిని కాంప్లెక్స్
మోజంజాహి మార్కెట్, హైదరాబాదు-95

అనువాద ప్రక్రియ ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, పరిధిని విస్తృతం చేసిన మహనీయుల్లో ప్రాతఃస్మరణీయులు బ్రహ్మశ్రీ వావిలాల సోమయాజులు. గారు. సంస్కృతాంగ్ల హిందీ భాషల్లోని ఉత్తమోత్తమ రచనల్ని తెలుగువారి కందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. సంస్కృతం నుండి నీలకంఠ దీక్షితులవారి కలి విడంబన శతకం, భరత రస ప్రకరణం, సర్వేపల్లి వారి గీత, ఆంగ్లం నుండి షేక్స్పియర్ మేక్బత్, ఆంటోని అండ్ క్లియోపాత్ర, జూలియస్ సీజర్ – నాటకాలు, రాబర్ట్ స్టీవెన్సన్ నవల డాక్టర్ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్, ట్రయల్ బై జ్యూరీ – న్యాయనిర్ణేత, ఠాగూర్ మహాకవుల మతం–హిందీ నుండి జయ శంకర ప్రసాద్ 'కామాయని', 'ఆంసూ' – వంటివి వావిలాల వారి అనువాద రచనల్లో రత్న సదృశాలు. అంతే కాకుండా కేథలిక్ క్రైస్తవ మతసాహిత్యాన్ని కూడా ఆంగ్లం నుండి తెనిగించి విద్వత్కవికి కావల్సిన మతాతీత మానవతా ధర్మాన్ని కూడా ఆయన ప్రదర్శించారు. ఈ విషయంలో విశ్వనాథ, దేవులపల్లి వంటి వారిలో లేని ఒకానొక విశిష్టగుణం వావిలాల వారిలో మనకు కనిపిస్తుంది. కాగా–

అనువాదం – 'యథామాతృకం'. 'యథేచ్ఛ' అని రెండు విధాలు. వావిలాల వారు రెండిటా సిద్ధహస్తులు. వీరి షేక్స్పియర్ నాటకాలు యథామాతృకాలు కాగా మిగిలిన అనువాదాలు యథేచ్ఛగానే కనిస్తాయి. అసలు, ఏ అనువాదం చదివితే మూలం చదవాలని బుద్ధిపుట్టదో ఆ అనువాదం ఉత్తమం. అటువంటి ఉత్తమోత్తమ అనువాదాలు వావిలాల వారివి. వాటిలో ఈ 'కన్నీరు' – (ఆంసూ) ప్రస్తుత పరిశీలనా పరిధి!

హిందీలోని విశిష్ట ఖండకావ్యాల్లో ఆంసూ (అంసూ) ఒకటి. 'ఆంసూ' అంటే కన్నీరు. తెలుగులో కవిత్రయంలా ఆధునిక హిందీ సాహిత్యంలో ప్రసాద్–పంత్–నిరాలా–లు భావకవిత్రయంగా, 'ఛాయావాద కవిత్రయం'గా పేరుపొందారు. వీరిలో ప్రసాద్ అంటే జయశంకరప్రసాద్. ఈయన 1925లో రాసిన కావ్యమే ఆంసూ. ఇది బహుధాప్రశంస లందుకోవటానికి కారణం దీనిలోని వస్తువు, భాష. అంతే కాదు, వేదనకి అక్షరరూపమిస్తే అది ఆదికావ్యంలా అజరామరమే కదా! 'కన్నీరు' ఒక మహోత్కృష్ట సృష్టి!

మహాకవి జయశంకర ప్రసాద్ 19వ శతాబ్ది తొలి దశకంలో బెనారస్ (వారణాసి) లో కాన్యకుబ్జ వంశీయులైన ఒక వైశ్యకుటుంబంలో జన్మించాడు. బాల్యమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో గడిచింది. 12 ఏళ్లకే తండ్రిపోవటం, ఇంటి దగ్గరే చదువుల వల్ల ఆయనలో కొన్ని ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. కాలక్రమంగా ప్రసాద్ ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, ఫార సీ, సంస్కృతం, వ్రజ భాషలు క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. పురాతత్త్వ (పరిశోధనా) విషయాలు, వేదోపనిషత్పురాణేతిహాసాలు, బౌద్ధాది మత సాహిత్యాలన్నీ ఆసాంతం ఆకళింపు చేసుకున్నాడు.

బాల్యం నుండి ఎదురైన కష్టాలు ప్రసాద్‌ని భావుకుణ్ని, కవిని చేశాయి. 1911లో తొలిగా ఆయన 'కానన్–కుసుమ్' కవితాసంపుటి వెలువడింది. 'ప్రేమ పథిక్' రెండో రచన. 1925లో 'అంసూ' వెలుగు చూసింది. అయితే 'కామాయని' ఆయనికి కీర్తి కిరీటమయ్యింది. దాని ఆవిష్కరణతో ప్రసాద్ మహాకవిగా స్థిరపడిపోయాడు.

కవితలే కాకుండా, నాటకాలు, చారిత్రక నాటకాలు, కథలు, నవలలు, వ్యాసాలు, ఎన్నెన్నో రాశాడాయన. హిందీలో ఆయన పేరు మీద ఒక 'యుగ'మే ఆరంభమయ్యింది. ఆ మహా ప్రతిభావంతుడు 1936లో కన్నుమూశాడు. లోకానికి 'ఆంసూ' మిగిలింది. జీవన సమరాన్ని ప్రేమశక్తి జయిస్తుందని 'ఆంసూ' ఆంతర్యం ఆయన నమ్మకం. దాన్నెవరు కాదనగలరు?

'ఆంసూ' కంటె ముందు ప్రసాద్ లౌకిక ప్రేమ, యౌవన విలాసాలు, విశృంఖల స్వప్నాలు, స్వేచ్ఛాభావాలు ప్రతిపాదించాడు కానీ 'ఆంసూ' వచ్చేసరికి ఆయనలో జీవిత యథార్థ సంఘటనలు, వాస్తవిక అనుభవాలు చోటుచేసుకున్నాయి. ఈ'కన్నీరు' కళ్లనే కాదు హృదయాన్ని కూడా ప్రక్షాళనం చేసి పవిత్రీకరిస్తుంది. మానసిక ఉద్వేగం అణగారిపోయిన తర్వాత చిందిన కన్నీరిది. ఈ కావ్యంలో బాధల మధ్య నిలద్రొక్కుకోవటంలోనే జీవితానికి అర్థం, పరమార్థము వుంటుందని, అప్పుడే

సత్యదర్శనం సులభమవుతుందని కవి ధ్వనిగర్భితంగా బోధిస్తాడు. ఈ కావ్యం చదివిన పాఠకుడికి విరహం, భయం, నిరాశా దైన్యాల మధ్య సామంజస్యం ఏర్పరుచుకుని ధైర్యంతో 'ఆశ' తోడుగా ముందుకు నడవాలనే సందేశం లభిస్తుంది.

దేవులపల్లి శ్రీశ్రీ ల్లా కాకుండా ఈ కవి తన కన్నీటిని, బాధకి చైతన్య స్ఫూర్తిని కలిగించి ముందుకు నడిపిస్తాడు. చూడండి.

సబ్‌కా నిచోడ్ లేకర్ తుం
సుఖ్‌సే సూఖే జీవన్ మేఁ
బర్సో ప్రభాత్ హిమకణ్ సా
ఆంసూ ఇస్ విశ్వ సదన్ మే॥

దీనికి వావిలాలవారి అనువాద పద్యం చూడండి :-

తే.    ఈ సకలముల రసము గ్రహించినీవు
స్నిగ్ధ సుఖముచే మిగుల శుష్కించి యున్న
జీవితమున విశ్వసదన సీమ నుషసి
హిమ కణమటు నశ్రువుల వర్షింపు మువిద !!

ఏ అశ్లీలత లేని యీ వియోగ విరహగీతి కావ్యంలో గడిచిన ప్రేమ సంఘటనల్ని నెమరు వేయటం. ప్రేయసి వర్ణన, వియోగ బాధలున్నా జీవితాన్ని అర్థాంతరంగా ముగించని ఆత్మస్థైర్యంతో బాటు ఆధ్యాత్మిక రహస్యవాదం కూడా కనిపిస్తుంది.

మాదక్ థీమోహమయీ థీఁ
మన్ బహలానే కీ క్రీడా
అబ్ హృదయ్ హి లాదేతీ హై
వహ మధుర్ ప్రేమ్ కీ పీడా॥

అంటూ గుండెను చీల్చుకు వచ్చే ఆవేదనను శబ్ద మాధుర్యంతో వ్యక్తం చేస్తాడు. దీనికి వావిలాల వారి అనువాదం చూడండి:-

తే.    మనసు నెదొ సంతస పరచుకొనెడు క్రీడ
మాదకమ్మయ్యెను - విమోహమయము నయ్యె
అట్టి మధుర ప్రణయ వేదనానిలమ్మె
యెదద నిప్పుడీ గతిఁ గదిలించివేయు !!

ఇతి వృత్తం చిన్నదే అయినా యిందులో గీతి కావ్యలక్షణాలన్నీ వున్నాయి. తన ప్రేమ ఫలించనందుకు వేదన, ఆశ్చర్యం, వర్తమానంతో గతాన్ని పోల్చుకోవటం ప్రియురాలి సౌందర్య వర్ణన ఆమె నిర్లక్ష్యాన్ని నిందిస్తూ జీవితంతో రాజీపడటం - అంతా వ్యథాగత తాత్త్విక దృక్పథ సందేశం - సారాంశం.

ఆంసూ వర్షాసే సించ్ కర్
దోనోం హీ కూల్ హరాహో
జస్ శరద్ ప్రసన్న్ నదీమే
జీవన్ ద్రవ్ అమల్ భరాహో !!

ఈ అద్భుత భావ చిత్రణకి వావిలాల వారి అనువాదం చూడండి

తే. తడిసి కన్నీటి జడివాన తటములప్పు
దుభయములు, హరితమ్ములై యలరుగాక !
ఆశరత్ప్రసన్న తటిని అమల జీవ
న ద్రవము నిండి యుండుత నవనవముగ !!

అలాగే ఆంసూలోని

హైం పడీ యీ ముంహ్ ఢక్కర్
మన్కీ జిత్నీ పీడాయేం
వే హంస్నే లగీ, సుమన్ సీ
కర్తీ కోమల్ క్రీడాయే !!

అనే పద్యాంశానికి

మానసవ్యథలెన్ని యీ మహిని గలవొ
అన్నియును గప్పికొని మోము నున్నవి పడి,
ప్రసవములు పోల్కి నయ్యవి లలిత ఖేల
నము లొనర్చుచు చిలిపిగ నవ్వుగాక !!

అనే వావిలాలవారి అనువాద పద్యమెంత మెరుగులు దిద్దిందో 'లలిత ఖేలనం' చూస్తే తెలుస్తుంది. 'కామం' ప్రేమగా, 'నిరాశ' ఆశగా మారటంలోనే పరమార్థముందనే సత్యాన్నే సందేశంగా ఈ కావ్యంలో కవి అందించాడు.

‘కన్నీరు’లో వ్యథ ప్రధానమైనా అంతం విషాదం కాదు, శాంతి నైరాశ్య విజయమే ఈ కృతి విశేషం. వియోగంలో కుమిలే ప్రేమికుని కన్నీటి సంకలనం ఈ కావ్యం. ఒక రకంగా ఇదొక స్మృతి కావ్యం. సుఖదుఃఖాల్ని సమానంగా భావించి, నిస్సంగత్వంతో, నిర్మోహత్వంతో ఉండాలని, ఇలా ‘ఆంసూ’ లో ఉంటాడు కవి:-

లిపట్ సోతే థే మన్‌మే
సుఖ్ దుఃఖ్ దోనోం హీ ఐసే
చంద్రికా అంధేరీ మిల్ తీ
మాలతీ కుంజ్ మేఁ జైసే!!

దీనికి వావిలాలవారి అనువాదం చూడండి:-

తే. మంజులోజ్జ్వల మాలతీ కుంజమందు
కౌముదియు నంధకారమ్ముఁ గలసినటుల!
గడగి మనసున సౌఖ్య దుఃఖద్వయమ్ము
లీలగాఁ జుట్టుకొని వినిద్రించుచుండె!!

తన జీవితంలో వ్యాపించిన వేదన నుండి లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ, ప్రపంచ బాధల్ని గమనిస్తూ, వాటికి స్పందిస్తూ కన్నీరు కార్చాలనీ, ఆ కన్నీరు లోకంలో ఆశని, ఉల్లాసాన్ని నింపాలని కవి వాంఛిస్తున్నాడీ కావ్యంలో. విషాన్ని గ్రోలి లోక కళ్యాణాన్ని సాధించిన శివునిలా కన్నీటితో వేదనలు దిగమ్రింగి నిర్మలమైన జీవితామృతాన్ని సాధించాలని కావ్య తాత్పర్యం.

హిందీ నుండి వావిలాల సోమయాజులుగారు తెనిగించిన ‘కామాయని’ ‘కన్నీరు’ రెండు కావ్యాలకూ తొలి పలుకులు నావే కావటం కేవలం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారికి కన్నీటితో కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

విద్వజ్జన విధేయుడు
**ఆచార్య తిరుమల.**

# ఆంధ్ర 'అంసూ' కావ్య భూమిక

**డాక్టర్ మల్లాది గోపాలకృష్ణ శర్మ,**
ఎమ్.ఏ(త్రయ), పిహెచ్.డి.(హిందీ), డి.లిట్ (సంస్కృత) విమర్శకాగ్రేసర,
వైదిక, లౌకిక ఉభయసాహిత్యాలంకార, సాహిత్యరత్న, సాహిత్య సుధాకర,
రాష్ట్ర భాషా ప్రవీణ, కృష్ణనగర్ కాలనీ, మౌలాలి, హైదరాబాద్-40.

స్వ.శ్రీ జయశంకర్‌ప్రసాద్ రససిద్ధుడైన మహాకవి. కావ్యప్రపఞ్చమున, మహాకవిగ పదికాలములబాటు నిలబడుటకు అపేక్షితములగు ప్రతిభా వైదుష్యములు, ఆయనలో పుష్కలముగ ప్రాక్తన జన్మ సంస్కార ఫలముగ చిన్నతనముననే నెలకొనియున్నవి. అందువలన తన పదునాల్గవ యేటనే, కవితలు వ్రాయుటకారంభించి, క్రమముగ మహాకవిగ రూపొంది, హిందీ కవితా సామ్రాజ్యముపై తన ఏకచ్ఛత్రాధిపత్యమును ప్రతిష్ఠించినాడు. ఆయన ముక్త కగీతాలు వ్రాసినా, నాటకములు వ్రాసినా, మహాకావ్యములు వ్రాసినా, నవలలు వ్రాసినా, సాహిత్యసమాలోచనలు చేసినా, అవి ఆయన కల్పనా చాతురిని, సృజన ప్రతిభను, ఆయన సౌందర్యానుశీలన సౌక్ష్మ్యమును, ఆయన భావనాపటిమ, ఉదాత్తములగు ఆయన భావములను, అన్నిటిని మించి ఆయన ప్రగాఢ ప్రేమను ప్రకటించుచు, తమ వైశిష్ట్యమును చాటుచునే యుండెను. ఆయన తనకు పూర్వమందున్న కవితల్లజులవలె స్థూల సౌందర్యోపాసకుడుగాక, సూక్ష్మసౌందర్యోపాసకుడు. ఆయనగూడ మొట్టమొదట ఇతి వృత్తాత్మక శైలిలో కవితలనల్లినను, సంస్కృత మహాకవులనుసరించిన ధ్వన్యాత్మక కావ్యశైలి ఆయన భావుక హృదయము నాకట్టుకొనగ, హిందీభాషలోగూడ, నూతనమును, విశిష్టమునునగు ధ్వన్యాత్మకశైలిని ప్రవర్తిల్లచేయుటకై చాలా కృషిచేయ మొదలిడెను.

మొట్టమొదటగా తొమ్మిదియేండ్ల చిరుతప్రాయముననే వ్రజభాషలో ఒక 'సవైయా' (ఛందస్సులో) పద్యమును వ్రాసి తన గురువగు 'రసమయ సిద్ధు' నకు చూపి ఆయన మెప్పు నొందెను. 'చిత్రధార్' అను కవితా సంగ్రహములో ఆయన మటికొన్ని ఆరంభిక కవితలు సంగ్రహించబడినవి. శైశవ దశనుండియే ఆయనను మిక్కిలి ప్రభావిత మొనర్చిన శైవమత ప్రభావాన్ని ఆయన ఆరంభ కవితలలోనే ('చిత్రధార్'లో

సంగృహీతమైన) చూడవచ్చును. పై కవితా సంగ్రహముతో బాటు ఆయన మఱి ఎనిమిది, అనగా మొత్తము తొమ్మిది కావ్య రత్నములమాలతో హిందీ భాషామతల్లి కంఠసీమనలంకరించి, హిందీ కావ్యక్షేత్రమును నవదీధితులతో నింపెను. ఆయన కవితాకృతులు, చిత్రధార్, కాననకుసుమ, మహారాణా కామహత్త్వ, ప్రేమపథిక, కరుణాలయ, ఝర్నా, ఆంసూ, లహర్, మఱియు కామాయని. ఆయన కవిమాత్రమే గాక, కథానికా రచయిత, నాటకకర్త, నవలానిర్మాత, సాహిత్య సమాలోచకుడుగూడ. ఆయన వివిధ సాహిత్య ప్రక్రియలలో ఆయనలోని కవి, మఱియు దార్శనికుడే కొట్టవచ్చినట్లు కన్పించును.

స్వ. ప్రసాద్‌ను హిందీ కావ్యక్షేత్రమున ధ్వని ప్రధానమైన ఛాయావాదశైలి ప్రవర్తకుడని చెప్పవచ్చును.

ఆయన కవిత్వంలోని ముఖ్యవిషయము ప్రేమ, మఱియు వియోగ వేదన, ఆయన దృష్టిలో మానవ జీవితము, అనగా సుఖ-దుఃఖములచే ఓత ప్రోతము. సంయోగ వియోగములకు 'మిలనభూమి'యని ఆయన ఆ విషయమును స్పష్టంగా వివరిస్తూ ఇలా అంటాడు:-

**మానవజీవన్‌కీ వేదీపర్ పరిణయ హై విరహ-మిలన్‌కా।**
**సుఖ-దుఃఖ, దోనోం నాచేంగే హైఖేల్ ఆంఖ్‌కా మన్‌కా॥**

ఐతే ఆయన కవితకు ముఖ్యవిషయమైన ప్రేమ, పూర్తిగ భౌతికంకాదు, అట్లాగని పూర్తిగ ఆధ్యాత్మికం కూడకాదు. ఆయన స్వచ్ఛమైన భౌతిక ప్రేమ జీవితంలో అవసరమని భావించే వ్యక్తి. ఆయన ప్రేమ కేవలము 'మన్‌కాఖేల్' అనగా మానసిక - భావుకత మాత్రమే గాక 'ఆంఖ్‌కాఖేల్' గూడ అనగా నేత్ర పర్వమును కల్గించు భౌతిక సౌందర్యరూపముగూడ, మానసిక ప్రగాఢ భావుకతతోబాటు, కన్నుల యాకర్షణము గూడ అవసరమని (ప్రేమలో) ఆయన భావించటమే గాదు సర్వత్ర తన కవితలలో వర్ణిస్తాడుగూడ.

**'ఖిచల్‌రహీహై చాందనీ, ఛవిమతవాలీరాత్,**
**కహతీ కంపిత అధరసే, బహకానే కీబాత్,**
**కౌన్ మధుమదిరా ఘోల్‌రహా!**

ఆయన కవితాసంగ్రహములలో 'ఝర్నా' ఒకటి. అందులో 1913 నుండి 1927 వఱకు ఆయన వ్రాసిన కవితలు సంగ్రహించబడినాయి. ఈ కవితలలో

ప్రసాద్ యొక్క నిశ్చల ప్రేమాభి వ్యక్తి, దృగ్గోచరముగాని, అజ్ఞాతసత్తనూ గూర్చిన ప్రేమలాలస మఱియు ఆత్మ సమర్పణ రూపమైన ముఖ్యమైన ఛాయా వాదలక్షణాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

'లహర్' అనే తరువాతి సంగ్రహములోని కొన్ని కవితలు కవియొక్క కైశోర హృదయంలో ఉదితమైన తీవ్రభావనోద్వేలనము శాంతపడిన పిదప కవిలో కల్గిన ప్రగాఢచింతనను, ప్రతి ఫలిస్తాయి. 'ఆంసూ' మఱియు, 'ఝర్‌నా' లోని కవితలో కవి యొక్క ప్రేమభావన, తన ఉచ్ఛృంఖలతను త్యజించి, సాత్త్వికము, నిర్మలము, మఱియు శుద్ధమగు ప్రేమగ రూపొందడం మనకు స్పష్టంగా కన్పిస్తుంది.

కవి 'ఈ కవితలలో 'ప్రేమ'కు సంబంధించిన తాత్త్విక రహస్యాన్ని ఈ విధంగా ప్రకటిస్తాడు.

**"ముఝ్‌కో న మిలారే కభీప్యారా"**

అని తన ప్రేమవ్యథను వెళ్లపోసికొని, తిరిగి ఇట్లా అంటాడు. ప్రేమలో ప్రదానమేగాని, ప్రతిగ్రహముండదని:

**పాగల్‌రే, వహ్ మిలతాహైకబ్।**
**ఉస్‌కోతో దేతేహీ హైఁసబ్॥**

'ఝర్‌నా'' తరువాత ప్రసాద్‌యొక్క ముక్తగీతికలు 'లహర్' అనే కవితా సంగ్రహంలో సంగ్ర హించబడ్డాయి. ఈ కవితా సంగ్రహంలోని కొన్ని కవితలలో కవి యొక్క కొన్ని అతీతస్మృతులు దర్శనమిస్తాయి. దీనిలో కవి, తన 'వ్యష్టి' పరిధిలోనుండి 'సమష్టి'లో ప్రవేశిస్తూ కనిపిస్తాడు.

'ఆంసూ' అనే కావ్యాన్ని నిర్మించే కాలానికి, ఆయనలోని ధ్వన్యాత్మక కావ్యశైలిని హిందీ కవితాక్షేత్రంలోగూడ ప్రవర్తిల్లచేయాలనే తీవ్ర ఆకాంక్ష పూర్ణముగ పరిణతనొంది ఛాయావాదశైలిలో 'ఆంసూ' 'కామాయని' వంటి మహాకావ్యములను నిర్మించడానికి పూర్తిగ దోహదం చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే 'ఆంసూ' అనే విరహకావ్యమే ఆయనను ఛాయా వాదకవితకు అగ్రదూతగ నిలబెట్టింది. కవితాక్షేత్రంలో 'ఆంసూ', 'కామాయని' అనే రెండూ కావ్యాలే హిందీ సాహిత్య ప్రపంచంలో, ఛాయావాదశైలిలోని గరిమను, మహిమను చాటడంతో బాటుగ, ఆ శైలిలో నవీనకవితలను సృజించడానికి ఒక నూతనోత్సాహాన్ని, ప్రేరణను, కవిలోకానికి, ఇచ్చి నవ్యకావ్యరచనకు ప్రేరేపించినాయి, అని, నిస్సంశయంగా చెప్పవచ్చు.

**'ఆంసూ' అనే వియోగ కావ్యంలోని అసాధారణములగు కొన్ని విశేషములు:-**

1. ఈ కావ్యశైలి ఇతివృత్తశైలి గాక సూక్ష్మసౌందర్య, భావాభి వ్యంజనైక ప్రధానమైన ఛాయావాద శైలి.

2. ఈ కావ్యము నాయికా - నాయకులు శారీరేంద్రియ మనోవాసనా పరితోషప్రధానమైన నాయికా – నాయకుల విరహోద్గారాభివ్యంజన ప్రధానము గాక, సూక్ష్మాతి 1 సూక్ష్మము, మనో వాగింద్రియా గోచరము. కేవలము, బుద్ధిమాత్రగమ్యమైన అదృశ్య సత్తాప్రాప్తినభిలషించు, అవ్యక్త ప్రేమికుని వియోగవ్యథావర్ణన పరమైనది.

3. ఇందలి సౌందర్యముగూడ భౌతికోపాదానాశ్రితముగాక, భౌతికో పాదానముల ద్వారా సర్వత్రావ్యాప్తమైన ఒక విశేషమైన సూక్ష్మ సౌందర్య రూపము.

4. ఈ కావ్యమందు వర్ణింపబడిన ప్రేమ, కామవాసనా పరితోష ప్రధానము గాక, ఆత్మ పరితోషప్రధానము.

5. ఇందలి విరహవ్యథితుడగు ప్రేమికుని వియోగవ్యథ, కించిత్కాల వ్యాప్తము గాక, ఆజీవన పరివ్యాప్తము, అనంతము. ఈయవ్యక్తప్రేమ వియోగవేదన, మేఘసందేశములోని నాయకుని విరహవ్యథవలె వ్యక్తి నిష్ఠముగాక, సకలలోక వ్యాప్తము. కనుకనే, ఛాయావాద కావ్యములలోని అవ్యక్తమును గూర్చిన వియోగవ్యథ సార్వభౌమమౌనదియు అనంతమునునగు వియోగవ్యథ, సర్వలోక ప్రసృతమై, సహృదయులగు సకల భావుకుల కాహార్యమై, నిరంతర మనన పాత్రమై, సర్వుల కాదరణీయమై, సర్వోపాస్యమై, సకల వియోగిజనుల అవ్యక్త ప్రేమమయ జీవితముల కాలంబమై తనరారుచున్నది.

అందువలన ఏతత్కావ్యగత విశేషముల నరయవలెననిన 'ఆంసూ' అను మహావియోగ కావ్యమును సృజించిన, శ్రీ జయశంకరప్రసాద్, నియతి మూలమున జీవితములో నెదుర్కొనిన కొన్ని విషమస్థితులను గూడ తెలిసికొనవలసిన అవసరమున్నది.

శ్రీ జయశంకరప్రసాద్ తన పదియవయేటనే తన తండ్రిని కోల్పోయెను. కానీ నియతియంతటితో తృప్తిపడక పితృతుల్యుడు, కుటుంబ నిర్వాహకుడును నగు 'శంభురత్నజీ'ని గూడ శాశ్వతముగ శ్రీ జయంశంకర ప్రసాద్ నుండి కనుమఱుగు

చేసెను. అన్నగారి మృత్యువునకు రెండు సంవత్సరముల పూర్వమే మమతామూర్తియగు మాతృమూర్తి గతించెను. దీనివలన కైశోరావస్థను దాటీ – దాటకుండగనే, అతనిపై బృహత్తరమగు సంసారభారము పడెను. ఈ విషమస్థితిలో ఆయన దార్శనిక చింతనము ఆయనను పూర్తిగ క్రుంగిపోకుండగ కాపాడెను. ఇట్లుండగ ఆయన తన వదినెగారి ప్రేరణతో ఇష్టము లేకున్నా వివాహము చేసికొనెను. ఆమె అకాల మృత్యువువాత పడగ, తిరిగి ద్వితీయ వివాహము చేసికొనెను. ఆమెగూడ కాలగతి చెందగా, తృతీయ వివాహమునుగూడ చేసికొనవలసి వచ్చెను. ఈ విధముగ ఆయనకు జీవిత ప్రథమదశలోనే సంభవించిన ఆకస్మిక బంధుమరణములు ఆయనను 'నియతివాది' లేక 'భాగ్యవాది'గా మార్చివేసెను.

ఇక కుటుంబముపైబడిన ఋణభారమును (పైతృకఋణమును) తొలగించు కొనుటకై శ్రీ ప్రసాద్ రెండు – మూడు దశకముల పాటు తమవ్యాపారమును చాల దీక్షతో కొనసాగించవలసి వచ్చెను. ఐనను ధృతిని వీడక తమ వ్యాపారమును పట్టుదలతో కొనసాగించుటతోబాటుగ, తన కవితా వ్యవసాయమును గూడ అకుంఠితదీక్షతో సాగించి కృతకృత్యుడాయెను.

ఇక మఱియొక, నిగూఢమైన జీవితరహస్యము. ఆయన తన యౌవనారంభ దశలో ఒక యువతిని ప్రేమించెను. ఆ యువతిని గూర్చిన ఆ నిగూఢ ప్రేమగూడ నియతి ప్రాతికూల్యమున భగ్నమాయెను. ఈ 'భగ్నప్రేమ' ఆయనను అనంత విరహవేదనకు గుఱిచేసెను. ఆ విరహవేదన, ఆంసూలోని ప్రతిఛందస్సులోను కొట్టవచ్చినట్లు గాన వచ్చును. కాని ఆయనలోని దార్శనికుడు, ఆయనలోని భావుకుడు, ఆ భగ్నప్రేమను వైయక్తికమగు సంకీర్ణ పరిధినుండి ఈవలకు లాగి, సార్వభౌమముగను, భౌతిక వియోగవ్యథను ఆధ్యాత్మికముగను రూపొందించుటచే, అది అనంత వియోగవ్యథితులగు ఆధ్యాత్మిక వియోగులగు జనులకు నిరంతరసేవ్యమై, వియోగపీడితులకు జీవితసంబలమై తనరారునట్లొనరించినాడు.

ఈ కావ్యములోని విశేషమేమియన, అనంత వియోగ వ్యథితుడగు కవి, తన ప్రేమకు పాత్రము ఐన వ్యక్తి, ఒక 'ప్రేయసి' యనుభావమును మఱుగు పఱచి సర్వత్రా పుంలిఙ్గమునే ఆ ప్రేయసిని గూర్చి ప్రయోగించినాడు. అనగా 'ప్రియా' అని స్త్రీలింగముగ తన విరహాలంబన మును ప్రకటించక 'ప్రియ' అని పుంలిఙ్గములో నుపయోగించినాడు. ఈ క్రింద ఇచ్చిన పంక్తులను చూడుడు:–

(క) ‘ఛిల్ ఛిల్ కర్ ఛాలే ఫోడే,
మల్ మల్‌కర్ మృదుల చరణసే।
ధుల్‌ధుల్ కర్ వహారహ్‌జాతే,
ఆంసూ కరుణాకే కణ సే॥

(ఖ) ‘బిజలీ మాలా పహనే ఫిర్,
ముసక్యాతా–సా ఆంగన్ మేం
హాం, కౌన్ బరస్ జాతాథా,
రసబూందేం హమారే మన్‌మేం॥

(గ) మానాకి రూప – సీమాహై
సుందర! తవ చిరయౌవనమేం,
పర్ సమాగమేథే, మేరే
మనకే నిస్సీమ గగనమేం॥ మొదలైనవి.

నేను మచ్చునకిచ్చిన ఈమూడు పద్యములయందేగాక, మొత్తము కావ్యములో సర్వత్ర, ఈ కావ్యమును, ఆధ్యాత్మిక వియోగపీడా – ఉద్గార రూపమగు వియోగ కావ్యముగ నిరూపించుటకై ప్రసాద్ తన వియోగ శృఙ్గారాలంబనమును పుంలిఙ్గములోనే యభివర్ణించినాడు. తాను ఏ ప్రేయసి యొక్క వియోగ వ్యథతో చిరకాలము అమిత వేదనకు లోనయ్యెనో, ఆ ప్రేయసిని నిగూఢముగనే ఉంచుటకు ప్రయత్నించినాడు. కాని ఆమెను పూర్తిగ నిగూఢముగనే నుంచలేకపోయినాడు.

ఈ క్రింది పద్యములను మనము సూక్ష్మముగ నవలోకించిన ఆరహస్య మవగతము కాగలదు:–

“శశిముఖ పర్ ఘూంఘట్ డాలే,
ఆంచల్ మేం దీప ఛిపాయే,
జీవన కీ గోధూలీమేం
కౌతూహల సే తుమ్ ఆయే” (ఆంసూ–34)

శ్రీ సోమయాజులుగారి ఆంధ్రానువాదము:–

అబ్జముఖమున సమ్మోహనావకుంఠ
నము దర్శించి, కొంగునను దీపమునుదాచి

**విమల జీవిత, గోధూళివేళవచ్చి**
**తపుడు పూర్ణ, కుతూహలమ్మనగ నీవు॥**

మూలమెంత మధురశైలిలో సాగినదో, అనువాదము గూడ అంతటి మధుర శైలిలో, ఎక్కడను కుంటువడక ధారాళముగ సాగినది. బాగుగనే యున్నది. మూలకవి తన మృదు, మధుర, కోమల భావములను, తదనుగుణమగు మృదు, మధుర, లలిత పద గుంఫితమైన శైలిలో చిత్రించగల సామర్థ్యము గలవాడో, అనువాదకులుగూడ, తేట తెలుగులో నట్టి తేనె లొలుకు మృదు, మధుర, లలిత పద సంఘటనశైలిలో ననువదించగల సామర్థ్యసంపన్నులు. కాని యనువాదమెంత సమర్థులు చేసినను, మూలమును యథాతథముగ భాషాంతరములోనికి తెచ్చుట కొన్ని చోటుల సాధ్యపడదు. ఉదాహరణమునకు ఈయుదహరించిన పద్యములనే తీసికొనుడు:-

మూలములో, ప్రేమికుడు, తన జీవితములో గోధూళివేళ (అనగా పూర్ణముగ వికసించని యౌవనదశలో) తన హృదయములో ప్రవేశించిన తాను ప్రేమించిన వ్యక్తిని 'తుమ్ ఆయే' అని పుంలిఙ్గములో వర్ణించినాడు. కాని ఆంధ్రభాషలో అట్లు సాధ్యపడదు. ఏలయన భూతకాల మ ధ్యమ పురుషలోని కర్త స్త్రీయైనను, పురుషుడైనను, తెలుగులో ఒకే విధముగ నుండును, ఉదా:-

తూ ఆయా, తుమ్ ఆయే, ఆప్ ఆయే = ఈ వాక్యములోని కర్తలగు తూ, తుమ్, ఆప్ అను సర్వనామములు, మూడు తెలుగులోని మధ్యమ పురుష కర్తృవాచకములగు, నీవు, మీరు, అను సర్వనామములకువలె లింగ భేదరహితములు. అనగా స్త్రీ-పురుషులిర్వురుని గూర్చి సమముగ చెప్పునవి. కాని హిందీలోని సామాన్య భూతకాలములోని అకర్మకక్రియ, మధ్యమ పురుషలో కర్తలుగ, ప్రయోగించబడిన సర్వనామముల లింగ-వచనములను తెల్పును, కనుక మధ్యమపురుషకు కర్తలగు, తూ, తుమ్, ఆప్, అను సర్వనామములు, స్త్రీ లింగబోధకములుగ అభిమతములైనచో సామాన్య భూతకాల క్రియలు స్త్రీలింగములలోనే ప్రయోగించబడును.

ఉదా : (స్త్రీ.లిం) తూ ఆయీ, తుమ్ ఆయీం, ఆప్ ఆయీం అని పుంలిఙ్గములైనచో: తూ ఆయా, తుమ్ ఆయే, ఆప్ ఆయే యని ప్రయోగించబడును.

కాని తెలుగులో నీవు, మీరు అను మధ్యమపురుష సర్వనామకర్తృకములగు క్రియలు, స్త్రీ - పుం లింగములు రెంటిలోను సమముగనే ప్రయోగించబడును. ఉదా: నీవు (స్త్రీ లేక పురుషుడు) వచ్చితివి (మ.పు. ఏక, వచ)

మీరు (స్త్రీ లేక పురుషుడు) వచ్చితిరి (మ.పు. బహువచనము).

తేలిన సారాంశమేమియన మూలములో విరహవ్యథకు ఆశ్రయభూతమైన వ్యక్తికి ఆలంబనము పురుషుడు, ఎందువలన? క్రియ 'ఆయే' అనునది పుంలింగము (బ.వ) కనుక. కాని తెలుగు అనువాదములో అట్టి యవకాశము లేదు. అందువలన 'వచ్చితపుడు' అని అనువాదము చేయబడినది. ఇందులో క్రియాపదముగ 'వచ్చితి' (వచ్చితివి) అనునది కర్త పుంలింగమైనను, స్త్రీ లింగమైనా, కర్తను బట్టి మార్పు చెందదు గద.

ఇదంతా ఎందుకు వ్రాయవలసివచ్చినదంటే ఒక భాష నుండి మఱియొక భాషకు అనువాదము చేయుటలో అనువాదకు డెదుర్కొను క్లేశములను తెలియజేయటానికి.

ఇక మూలములో 'శశిముఖ పర్ ఘూంఘట్‌డాలే' అని ప్రేమాస్పద వ్యక్తి యొక్క సౌందర్యము వర్ణించబడినది. ఆ ప్రేమాస్పద వ్యక్తియొక్క ముఖము, చంద్రబింబము వలె దర్శకునకు ఆహ్లాదజనకము, అని భావము.

అనువాదకులు 'శశి' అను పదమునకు (అబ్జ) యను పదమును ప్రయోగించినారు. ఇందులో ఇబ్బందియేమన 'అబ్జ' శబ్దము, చంద్రవాచకముగ నిఘంటువులో[1] ప్రసిద్ధము.

కాని లోకములో 'అబ్జ' శబ్దము 'పద్మ' వాచకముగ ప్రసిద్ధము. అట్టి ప్రసిద్ధార్థమైన 'పద్మము'ను తీసికొనినను, 'ముఖము–పద్మమువలెనున్నది' అని సరిపెట్టుకొనవచ్చును. కాని ఇక్కడ 'పద్మము' అను అర్థము ప్రకృత సందర్భములో సంగతము కాదు. ఏలయన పద్మమున కవగుంఠన (ముసుగు) కల్పన, చంద్రునియందు సంగతమైనంతగ సంగతము కాదు.

అస్తు, ఈ పద్యమును (మూలములోని) నేనుదహరించిన సందర్భము, మూల–అను వాదముల తారతమ్య పరిశీలనము కొఱకుగాదు. మఱియేమన, కవికి తన ప్రేయసిని తాను మొదటిసారిగ తన ముగ్ధయౌవనమున చూచినపుడు అతని మనస్సులో రేకెత్తిన యుత్కంఠను తెలియజేయుటకు. అది వయోధర్మము. కాని పరాయి యువతిని యుత్కంఠతతో దర్శించుట శిష్టాచార విరుద్ధమగుటవలన, ఆప్రేమ పాత్రమగు వ్యక్తి 'యువతి' గాక 'యువకుడు' లేక పురుషుడు అను భ్రమను కల్గించుటకై యిట కవి,

---

1. "అబ్జో జైవాతృక స్సోమో గ్లౌ ర్మృగాఙ్కః కలానిధిః ॥ అమరకోశము దిగ్వర్గము

పుంలింగమును ప్రయోగించినాడు. కాని అంత మాత్రముచే అదియలౌకిక ప్రేమస్థాయికి చేరలేదు, కాగా అతినిగూఢ ప్రేమయొక్క 'నిగరణము' లేక 'అవగుంఠనము' మాత్రము పూర్తిగ జరుగలేదు.

ఏలయన, అతనిలో తొలిసారిగ ప్రేమాసక్తిని రగుల్కొల్పిన ఆ వ్యక్తి 'పురుషుడే' యైన నెత్తిమీద బురఖా (మేలిముసుగు) ఎందుకు వేసికొనును? తన చీరకొంగుతో, చేతనున్న, వెల్గించిన దీపము ఆరిపోకుండగ, కప్పుకొని నడచుచు ఎందుకు దర్శనమిచ్చును? ఇక్కడ మేధావులెంతటి రహస్యమైన ఆధ్యాత్మికార్థమును కల్పించినను నాయకునికి యువతీ దర్శనము వలన కల్గిన మనోవికారము దాచశక్యముకాని జీవితసత్యము. ఒక శశిముఖిని, శిరస్సుపై మేలిముసుగు ధరించి ప్రక్కయింటికి సంజవేళ దీపము వెల్గించుటకైపోయి, తన యింటికి మఱలివచ్చుచు, ఆదీపము నారిపోకుండగ తన చీర చెఱగుతో కప్పుకొని పోవుచుండగ కవిచూచినాడు –

ఆమెను మొదటగ చూచినపుడు తనకు గల్గిన ఆనందమును, మధురమగు అనుభూతిని తరువాతి పద్యములలో వర్ణించినాడు.

**మధురా కా ముసక్యాత్ థీ,**
**పహలే దేఖా జబ్‌తుమ్‌కో**
**పరిచిత – సే జానే కబ్‌కే,**
**తుమ్‌కో ఉసీ క్షణ, హమ్‌కో**

ఆమెను చూచినపుడు కవియొక్క నీరసము, నిరుత్సాహముతో నిండిన హృదయములో నొక్కసారిగ వసంతపూర్ణిమ తన శీతలములు, అమృతమయములునైన చంద్రికలను బరపినట్లన్పించెను. అది మొదటి దర్శనము. తన ప్రేయసి యొక్క ప్రథమదర్శనములోనే, ఆమెతో తనకుగల ప్రేమ సంబంధ మిప్పటిదిగాక, దీర్ఘమైన అజ్ఞాతకాలము (జన్మ–జన్మాంతరముల) నకు సంబంధించినదిగా అన్పించెను ('భావస్థిరాణి జననాంతరసౌహృదాని')

ఆమెను చూడకపూర్వము అతని హృదయమున శిశిరఋతువు (ఆకురాలు కాలము) వ్యాప్తమై యుండెను. అతని మనమునగల పూదోట, ఫల–పత్ర–పుష్పవిహీనమై మోడువారి ఎండిపోయియుండెను. అందుగల లతలు, గుబురగు పొదలు, అన్నియు మోడువారి జాలిగొల్పుచుండెను. కాని తన ప్రేయసి హఠాత్తుగ తనకు దర్శనమీయగనే తన జీవితములో నవ వసంతము ప్రవేశించినట్లు అన్పించెను. మోడువారిన తన

జీవితో ద్యానములోని, లతా– గుల్మవృక్షాదులు పునఃపల్లవితములై, పుష్పితములై నయనానందమును గూర్చుచున్నట్లు నిపించెను.

ఇంకను తన ప్రేయసి యొక్క సౌందర్య సంబంధమైన ప్రగాఢ ప్రభావమును వర్ణించుచు కవి ఈ ఛందములను వ్రాసినాడు :–

**"ప్రతిమామేఁసజీవతా – సీ,**
**బస్ గ ఈ సుభవి ఆంఖోంమేఁ",**
**థీ ఏక్ లకీద్ హృదయమేఁ**
**జో అలగ్ ంహీ లాఖోం మేఁ ॥**

**"మానా, కి, రూపసీమాహై,**
**సుందర! తవ, చిర యౌవనమేఁ,**
**పర్ సమాగేథే, మేరే**
**మనకే నిస్సీమగగనమేఁ ॥**

**భావార్థము:** ఒక బంగరు ప్రతిమలో ప్రాణములను పోసినయపుడు, అది ఎంత రూపవంతముగ వెల్గొందునో, యట్లే తన ప్రేయసి యొక్క ఉద్దీప్తమైన తనుకాంతి తన కన్నులలో వ్యాపించెను. ఆమె తన కనుమొఱగినను, ఆమె సౌందర్యరేఖ తన హృదయపటలమున చాల ప్రగాఢ పటముగ చిత్రించబడెను. తన హృదయములో అనంతవస్తు సముదాయపు అస్పష్టరేఖలు నెలకొనియున్నను. ఆ లక్షలాది అస్పష్టరేఖాచిత్రములలో, తన ప్రేయసి చిత్రము తన విలక్షణమగు దీప్తితో వానికంటె వేఱుగ భాసించుచునే యున్నది.

తన ప్రేయసి సౌందర్యమునకు సీమ, తన యౌవన వసంతములో ఆమె కడు రమ్యముగ భాసించుచున్నది. కాని ఆ ప్రియురాలి సౌందర్యము ఆయన యనంతహృదయ గగనములో నిండియే యున్నది.

కనుక, నా తాత్పర్యమేమియన, శ్రీజయశంకరప్రసాద్ తన హృదయములో శల్యమై బాధించు తీవ్ర విరహ వేదనోద్గారములను, తన భావుకతా బలముతో నభివ్యంజించు నుద్దేశ్యముతో 'ఆంసూ' అను ఈ విరహ కావ్యమును నిర్మించదొరకొనినను, అతనిలోని దార్శనికుడు, అతని వైయక్తిక విరహవేదనను, అజ్ఞేయము, శాశ్వతము, సర్వాంతర్యామియునగు ఆత్మ విషయమైనదిగ రూపొందించి, విశ్వజనీన మొనరించినాడు. ఇదియే యీ కావ్యములోని ప్రముఖవిశేషము.

మహాకవి సుమిత్రానందన్ పంత్‌జీ విరహవిధురుల మూకవేదనను గూర్చి పల్కిన యీ పల్కులు శ్రీ జయశంకర్‌ప్రసాద్ కవితా విషయములో నూటికి నూరుపాళ్లు అన్వయించును:-

**"వియోగీ హెూగా పహలాకవి, ఆహ్‌సే ఉపజాహోగా, గాన్ ।**
**ఉమడ్ కర్ ఆంఖోంమేఁ చుప్‌చాప్, బహీహోగీ కవితా అనజాన్ ॥**

'ఆంసూ' అను విరహకావ్యము మహాకవి జయశంకర ప్రసాద్ ఛాయావాదశైలిలో రచించినట్టిది ఇది రాశిలో అల్పమైనను, అనగా సుమారు నూటతొంబది గీతములు కలదియేయైనను, అమూర్తమైన విరహవ్యథాభి వ్యంజక కావ్యములలో అసాధారణమైన గీతకావ్యము. ఇందలి విశేషమేమియన యౌవనోదయ కాలములో మనస్సులో రూపదర్శన 'జనితయైన ఆహ్లాదజనకమైన ప్రేమ కాలగతి వలన (దుర్దినములు వచ్చినపుడు) తీవ్ర వియోగవ్యథగ మాఱి, తన మూర్త స్థితి నుండి అమూర్త స్థితిని పొందుటతో బాటుగ, సంకీర్ణమైన వ్యక్తిపరిధి నతిక్రమించి భూ-నభోంతరాళములందు వ్యాపించి విశ్వజనీనయై, చిరవిరహవిధురమగు యావజ్జీవ చేతనను, తన పావన వియోగప్రేమ గంగలో తానమాడించి, పునీతమొనర్చుట. కనుకనే 'ఆంసూ'లోని అమూర్త వియోగ గీతికలు, యువహృదయ లోకమునకు, నిరంతర మననయోగ్యములై సమాదృతములౌచున్నవి. ఇందలి ప్రేమలోని విశేషమేమియన, ఈ ప్రేమ కాలంబన భూతములుగ, స్థూల (భౌతిక) సూక్ష్మ (అమూర్త) పక్షములు రెండూ గ్రహించబడినవి.

ఈగీతి కావ్యము విరహవ్యథయొక్క సూక్ష్మత్వమును, తీవ్రతను మాత్రమే అభివ్యంజించక, జీవన మీమాంసదెసకు భావుక హృదయమునాకర్షించు చున్నవి. కేవలము స్థూల ప్రేమ - విరహములు మాత్రమే గ్రహించగల్గిన భావుకుల హృదయములను, సూక్ష్మము, సర్వవ్యాప్తమునైన మహాచేతన దెసకాకర్షించి, స్థూలప్రవణమైన బుద్ధిని, సూక్ష్మానుభూతి యోగ్యమొనరించి, స్థూలాసక్తిని తగ్గించుటకు ఇందలి కావ్యవస్తువగు అమూర్తప్రేమ తోడ్పడుచున్నవి. ఈ వియోగ గీతికావ్యము ఈ క్రింది ఛందస్సుతో నారంభమగు చున్నది:-

**"ఇస్ కరుణా కలిత హృదయమేఁ**
**అబ్ వికల రాగినీ బజతీ ।**
**క్యోం హాహాకార స్వరోంమేఁ**
**వేదనా అసీమ గరజతీఁ ॥**

శ్రీ వావిలాల వారి ఆంధ్రానువాదము :

**తే. “ఏల కరుణరస కలిత హృదయవీథి,**
**నిటుల వికలరాగిణి ధ్వనియించునేడు,**
**ఏల హాహారవాల గర్జించునిటుల,**
**స్నిగ్ధ వేదన చెలగి నిస్సీమ మగును?**

ఈ పంక్తులలో కవి తన హృదయమును వికల మొనర్చుచు తన యంత రాళము నుండి వెడలుచుండుటను గమనించినాడు. ఈ రాగిణులు తమంతట తాము మ్రోగవుగద! ఇంత వఱకు నీరవముగ నున్న తన హృదయవీణను బహుశః ఏదియోయొక అసీమ వ్యథామూల మగు హాహాకారములు మీటినవేమో!

**సారాంశము:** వికలరాగములను ధ్వనించు తన హృదయవీణ, తన హృదయములో అంతులేకుండ పేరుకొని పోయిన తీవ్ర వేదనను ‘హాహాకార’ రూపమున ప్రసరింపచేయు చున్నది.

మూలమెంత కోమలపదమనోజ్ఞమో, అనువాదము గూడ తేటతెనుగులో నంతమధుర పదయుక్తముగనున్నది. ఈ పద్యములో ‘విశేషణ వ్యత్యయ’ రూపమగు ఛాయవాద ప్రచలితమగు లాక్షణిక ప్రయోగము చేయబడినది. ఎట్లన ‘రాగిణి’, యను పదము ‘వికల’ అను విశేషణముతో విశేషించబడినది. న్యాయముగ, రాగిణి (రాగభేదము) వికలముగా నెట్లుండును. ఆరాగిణిని వినుట వలన, శ్రోతల మనస్సు వికలమగును. కనుక ఈ ‘వికల’ అను విశేషణము ‘హృదయము’ అను విశేష్యమును విశేషించుటకై ప్రయోగించ వలసియుండగ, అట్టి వ్యాకుల హృదయమును మీటుటవలన వెల్వడు ‘రాగిణి’ లను విశేషించుటకై ప్రయోగించుట. ఇది యొక నవ్యమైన లాక్షణిక ప్రయోగము. దీనిని ‘విశేషణ వ్యత్యయ’మని యందురు.

మూలములో ‘వేదన’ మాత్రమే గర్జించుచున్నదని యుండగ, అనువాదకులు, ఆవేదనకు ‘స్నిగ్ధ’ యను మూలమునందు ప్రయోగించబడని విశేషణమును ప్రయోగించినారు. ఎందుకన, వేదనకు హేతువులు పలు విధములుగ నుండవచ్చును. కాని ఈ కావ్యములోని వర్ణ్య వస్తువగు వేదన, స్నేహ (ప్రేమ) మూలకమైనది అని పాఠకులను ఎచ్చరించుటకై ప్రయోగించినారు.

అస్తు. ఈ మొదటి పద్యములో తన నీరద హృదయవీణను అసీమ వేదనా జన్యమై హాహాకారము మ్రోగించగ ఏల, పీడావ్యంజకలములగు స్వరములలో నీవీణ

గర్జించుచున్నదను ప్రశ్నద్వారా కావ్యము నారంభించు, ఆయసీమ వేదన యొక్క ఉత్తరోత్తర తీవ్రతను నిరూపించుటకు దొరకొనినట్లు కన్పించును.

ఇక్కడ మనము గమనించవలసిన ముఖ్యవిషయ మేమియన, శ్రీప్రసాద్ ప్రేమ యొక్క యాధ్యాత్మిక పక్షమునకు మూలముగ ఐహిక పక్షమును మున్ముందు ముప్పదినాల్గవ పద్యములో వర్ణించినాడు, కనుక న్యాయముగ ఆ పద్యముతోనే ఈ విరహకావ్యము నారంభించవలసి యుండగ, “ఇస్ కరుణాకలిత హృదయమేఁ' అను పద్యముతో నారంభించుటకు కారణము ఆయన వ్యక్తిగత జీవితరహస్యమేయని మేము ముందుగనే నివేదించియుంటిమి.

కనుక తన జీవితగోధూళి వేళలో తానుగాంచిన నిండు యౌవనమున పొంగారు నొక శశిముఖియగు యువతిని చూచిన పిదప తన మనస్సులో కల్గిన రూపాసక్తిని, ఆనందమును కవి వర్ణించకుండనుండ లేకపోయినాడు. ఈ క్రింది పద్యములను చూదుడు:-

మూలములోని 1) 'మధురాకాముసక్యాతీథీ, (29 పద్యము)2) 'ప్రతిమామే (సజీవతాసీ)' (ప-36), మానాకి రూపసీమా-హై (ప.37) పద్యములను ముందే నాయకునిపై ప్రియారూప దర్శన జనితమైన ప్రగాఢ ప్రభావమును నిరూపించుటకై యుదహరించియుంటిమి. ఆ పద్యములకు శ్రీసోమయాజులు గారి ఆంధ్రానువాదమును గూడ తిలకింపుదు.

**తే.** **'తొలుత నినుగని నతు డైనడె సంతుషిత్త,**
**నవ్యరాకానిశి స్మితమొనర్పసాగె,**
**పరగినట్లు దీర్ఘకాలపరిచయమ్ము**
**నాకుపొడగట్టితివి యాక్షణాన నీవు.** (ప-29)

**'ప్రతిమామేఁ సజీవతాఁ సీ** (ప-36)

(అను) **తే.** **ప్రతిమయందున ఘన సజీవతనుబోలి,**
**నేత్రపాళిని శుభకాంతి నెలవుకొనియె,**
**కాని మన్మనోనిస్సీమ గగనమందు,**
**బొలుపుమెరయ, గడునిమిడిపోయినావు.**

ఇక మూడవ పద్యము : **'మానాకి రూపసీ మాహై'** అను

తే. ‘అప్పుడొప్పితి నో సుందరాంగ, నీదు
చిరతరుణిమను, సౌందర్యసీమ కలదు,
కాని మన్మనో నిస్సీమ గగనమందు,
బొలుపు మెరయ గడు నిమిడి పోయినావు

ఇంకను తమ తమ ప్రేమాస్పదమైన వ్యక్తులయొక్క తత్తద్భౌతికములగు కర–చరణ–ముఖా ద్యవయముల సౌందర్యమును పునః పునఃస్మరించుటయే నిజమైన ప్రేమయని భావించి, వర్ణించిన, ప్రాచీనకవుల స్థూల ప్రేమ మార్గమున నడువక ప్రసాద్, ఛాయావాదమునకు ప్రధానలక్షణమైన సూక్ష్మ సౌందర్యమును, అంకనముచేయు, ప్రేమపద్ధతి ననుసరించి చేసిన ఈ రూప వర్ణనమును తిలకింపుడు:–

మూలము : **“చఞ్చలా స్నాన కర్ ఆవే,**
**చన్ద్రికా పర్వమేఁ జైసీ**
**ఉస్ పావనతన్‌కీ శోభా,**
**ఆలోక మధుర థీ ఐసీ”.**

అనువాదము : **తే. “చంద్రికా పర్వసుషమల జలకమాడి,**
**చఞ్చలా తన్వి వచ్చిన సరళినుండె,**
**రమ్యమాపావన వపుర్విలాసశోభ,**
**అమరెనాలోక మధురయై అక్కజముగ॥** (పద్య. సం. 48)

ఈ పై పద్యములో కవి తన ప్రేమపాత్ర యొక్క సంపూర్ణ శారీర సౌందర్యములోని కన్నులను మిఱుమిట్లుగొల్పుకాంతిని వర్ణించుటతో బాటు దాని దర్శనీయత్వమును గూడ అభివర్ణించినాడు:–

**భావార్థము :** తన ప్రేయసి యొక్క తనుయష్టి విద్యుల్లత వలె మెఱసి పోవుచున్నది. కాని విద్యుల్లతలో క్షణికత్వము (అనగా చంచలత్వము)తో బాటుగ కన్నులకు బాధ కల్గించుట ద్వారా ఖేదమును కల్గించు లక్షణమున్నది. కనుక ఆదోషపరిహారమునకై ఆ చంచలను పూర్ణిమయొక్క అమృతమయమైన నిండారభూమియందంతటను పండువెన్నెలలో తానమాడించుట ద్వారా, దాని చంచలతయను దోష పరిహారము చేసి, చంద్రికలలోని శీతలత్వమును, దర్శనీయత్వమును, పావనత్వమును, ఆహ్లాదజనకత్వమును. విద్యుత్ప్రకాశమునకు కల్గించి, తన ప్రేయసియొక్క కన్నులను జిగేలు మన్పించు తనుకాంతిని సంవేదన శీలమొనరించుటతో బాటుగ దానిలోని పవిత్రతను వెల్లడించుట ద్వారా తన నిర్దోషత్వమును చాలనిపుణముగ నిరూపించినాడు.

కనుక దీనిని బట్టి మనకు ఛాయావాదము యొక్క స్థూల సౌందర్య వర్ణన వైముఖ్యముతో బాటుగ, సూక్ష్మ సౌందర్యాజ్కనపటీయస్త్వము స్పష్టముగ నవగతమగుచున్నది.

అట్లే తన ప్రేమకు ఆలంబనమైన ప్రేయసి యొక్క శరీరచ్ఛవిని మాత్రమే గాక, ఆమె యొక్క చంద్రబింబము వంటి ముఖమును, నల్లగనున్న దీర్ఘములను, దట్టములుగ నున్నవియునగు కేశములను, ఆమె పాపటలో అలదుకొనిన సిందూరమును ఈ క్రింది పద్యములో స్పష్టముగ వర్ణించినాడు.

**"బాంధా థా విధుకో కిస్‌నే**
**ఇన్ కాలీ జంజీరోంనే,**
**మణి వాలే ఫణియోంకాముఖ**
**క్యోం భరాహుఆహీరోంనే ॥**

(తెలుగు) : **తే. 'ఎవ్వరీ విధు నీ రీతియీ వినీల,**
**బంధనమ్ముల నిటుకట్టుబడగఁజేసి**
**రేల నిండియున్నయది వజ్రాల నిటుల**
**మణుల వెల్గుల వెలిజిమ్ము ఫణులమోము.** (ప.సం. 39)

**అభివ్యంజనాశైలిలోని విశేషములు :**

ఈ పై పద్యములో వర్ణ్యమగు ముఖమును చెప్పకుండగ, 'విధు' (చంద్రుడు) శబ్ద ప్రయోగము ద్వారా తన ప్రేయసి ముఖము చంద్రబింబమును బోలియుండునని, అవగతమొనర్చినాడు. 'కాలీ జంజీరేఁ అను పదప్రయోగము ద్వారా నల్లని, సుదీర్ఘములైన దట్టముగనున్న కేశములను అవబోధమొనర్చినాడు. 'మణివాలే ఫణియోంకా' అను మూడవ పాదము, మఱియు క్యోంభరాహుఆ! అను నాల్గవ పాదముల ద్వారా నల్ల సర్పములను బోలిన కేశపాశము ముఖభాగమున అనగా పాపటమొదట్లో తన ప్రేయసి వజ్రపుటాభరణమును పెట్టుకొని యున్నదని అవగతమొనరించినాడు. ఇందలి వర్ణనములో క్రొత్తదనమంతగలేకున్న, శైలిలోని నవ్యత్వము పాఠకుల నలరించుచున్నది.

అట్లే ఆమె దట్టమైన కనుబొమ్మలను (ప.సం.42) మందస్మిత సుందర కపోలపాళిని (ప.సం.43) వర్ణించినపిదప ఆమె ఎఱ్ఱని ఓష్ఠ సంపుటములో

ముత్తెములవలె స్వచ్ఛముగ ప్రకాశించు దంత పంక్తిని, శుకమును బోలిన సుందరమైన నాసికను వర్ణించి భావుకుల నలరించు ఒక చమత్కారమును నిక్షేపించినాడు:-

ఈ క్రింది పద్యమును చూడుడు:-

మూలము : "విద్రుమ సీ పీ సంపుట మేఁ
మోతీకే దానేకై సే?
హై హంస నశుకయహ్ ఫిర్ క్యోం
చుగనేకో ముక్తా కైసే?

(తెలుగు) : **తే. "ఇంపు బొలయ విద్రుమశుక్తి సంపుటమున
నిటుల ముత్తియ పుంగింజ లేల తోఁచు?
హఘ మిది కాదు శుకమె యౌ, అరుగుదెంచె
నేలనో యీ ముత్యముల భక్షించుకొఱకు.** (ప.సం.44)

**అభివ్యంజన విశేషముల వివరణము :**

విద్రుమసంపుట' పదముచే పగడమువలె ఎఱ్ఱగానున్న పెదవులు, ఆ సంపుటములోని ముత్తియపుగింజలు అను వాక్యముద్వారా ముత్తియముల వలె స్వచ్ఛంగా ప్రకాశించు ప్రియురాలి యొక్క దంత పంక్తియులక్షితములగుచున్నవి. ముత్యములను హంసలు భక్షించునని కవి సమయము కనుక, తన ప్రేయసి యొక్క నాసిక, ఆ ముత్యములను భక్షించుటకు వచ్చిన హంస యనుటకు వీలులేదు. ఏలయన 'నాసిక'ను హంసతో బోల్చుట కవిసమయ విరుద్ధము. అందుకని, నాసికను, 'శు క'ముతో పోల్చవలెను. కాని ముత్యములను భక్షించు అలవాటు లేని శుకము (నాసిక) ఈ విద్రుమసంపుటములోని ముత్తియపు గింజల నేల భక్షించుట కిటకు వచ్చినదో అనూహ్యమని పల్కి కవి చమత్కరించినాడు.

కనుక పైన యిచ్చిన ప్రేయసి యొక్క తనులతతో బాటుగ, సుందరములును, కోమలములునైన, అంగకముల సౌందర్యవర్ణనమును దర్శించిన పిదప, ఇది యలౌకిక ప్రేమ వర్ణనము అని ఎవ్వరును అనజాలరు. శ్రీజయశంకర్ ప్రసాద్ తన ప్రేయసి యొక్క నిరుపమ లావణ్యమునే స్పష్టముగ నిట వర్ణించినాడు. అంతేగాదు. అట్టి సౌందర్యదర్శన జనితమైన ప్రగాఢ ప్రభావమును గూడ ఇక్కడ ఉదహరించబడబోవు పద్యములో స్పష్టముగ వర్ణించినాడు.

**"కాలీ ఆంఖోంమే కిత నే,**
**యౌవనకే మదకీలాలీ,**
**మానిక - మదిరాసే భర్‌దీ,**
**కిస్‌నే నీలమ్ కీ ప్యాలే ॥**

(తెలుగు) : **తే. 'ఆవినీలా వదాత నేత్రాళి నెంత**
**యౌవన ఘన ఘూర్ణ మధుమదారుణిమము!**
**పరమ మాఘవాసిత వజ్రపాత్ర నెవ్వ**
**రొదవ నింపిరి మాణిక్యమదిరతోడ !** (ప.సం. 40)

కవి, కజ్జల వినీలములగు తన ప్రేయసి నేత్రములలో తనకు అనురాగపు లాలిమను, ఎఱ్ఱని మధువు నింపిన నీలమణి చషకములతో బోల్చినాడు.

ఈ వర్ణనముద్వారా తన ప్రియురాలి అనురాగమును వెదజల్లు దృష్టి పాతముల వలన, తనలో మధుపానము చేసినపుడు కల్గు మాదకత యలము కొనెనని ధ్వనింప చేసినాడు.

కవి వెనుక ఉదహరించిన పద్యములన్నిటిలోనను తన ప్రేయసియొక్క భౌతికమైన శారీర సౌందర్యమును వర్ణించినాడు. కాని దానిపై పూర్తిగ నిలబడక, తిరిగి తన ప్రేమలో ఆధ్యాత్మికతను గూడ రంగరించి కొన్ని ఛందస్సులు వ్రాసినాడు. ఈ క్రింది పద్యములను చూడుడు:-

మూలము : **"బిజలీ మాలా పహనే ఫిర్,**
**ముసక్యాతా - సా ఆంగన్ మేఁ, ముస్కురాతా -**
**హాఁ కౌన్ బరస్ జాతాథా,**
**రస-బూంద్ హమారే మన మేఁ"**

**"తుమ్ సత్యరహే చిరసున్దర్,**
**మేరే ఇస్ మిథ్యాజగమే,**
**థే కేవల జీవన సజ్గీ**
**కల్యాణ - కలిత ఇస్ మగకే"**

**"గౌరవథా, నీచే ఆయే**
**ప్రియతమ మిలనేకో మేరే,**

మైం ఇతలా ఉతా అకించన
దేఖేజ్యోం స్వప్న సబేరే"

"పరిచయ రాకాజలనిధికా
జైసే హెూతా హిమకరసే
ఊపర్‌సే కిరణేం ఆతీం
మిలతీహైం గలేలహర్‌సే"

ఈ పద్యములలో ఆయన ప్రేమకాలంబనము, భౌతికవ్యక్తిగాక, ఒక సర్వ వ్యాప్తము, చిరసుందరము ఐన, ఆత్మయను అర్థము, ధ్వనించుచున్నది.

**భావార్థము :** తాను తన ప్రియదర్శనోత్కంఠతో కలగుడు పడువేళ తన ప్రియుడు, విద్యున్మాలను ధరించి చిఱునవ్వుతో నాపంచలో (హృదయంలో) నే నాకు దర్శనమిచ్చినాడు. అతడు మామీద దివ్యప్రేమ రస బిందువులను కురిపించినాడు.

ఆయానందములో కవి మనస్సులో ఇట్లు తలపోస్తాడు. ఈ జగత్తంతా మిథ్యయే. కాని ఈ మిథ్యా జగత్తులో తన ప్రియతముడొక్కడే సత్యము. జాగతిక సౌందర్యము అశాశ్వతము. కాని తన ప్రియుడు చిరసుందరుడు, కళ్యాణ కలితమైన ఈ ప్రేమ మార్గంలో అతని జీవిత సహచరుడు తన ప్రియతముడు మాత్రమే.

తన ప్రియతముడు ఈ లోకమున కావల చాల ఉన్నత లోకములో నున్నను తనను గూర్చి క్రిందకు దిగివచ్చుట తనకెంత గౌరవము! అతని రాకకు, అకించనుడనైన నేను గర్వంతో పొంగిపోయాను. నిజంగా నా ప్రియతమునితో నా యొక్క మిలనము ప్రాతఃకాల స్వప్నం (సత్యము).

తన ప్రియమిలనప్రసఙ్గమును కవి యిట్లు వర్ణించినాడు. నిండు పున్నమి నాడు చంద్రుడు ఉదయించి, తన స్వచ్ఛములైన సుధామయ కిరణములతో తన రాకచేనుప్పొంగు సముద్ర తరంగములను ఆలింగనము చేసికొనునట్లు

(తెలుగు) : **తే. "మహిత విద్యుల్లతా మంజుమాలికల ధ**
**రించి, స్మిత మొనర్చెడిరీతి, నాదు**
**స్వాంతమున ఘనరసబిందు సముదయమ్ము**
**నెవ్వరాగక మరల వర్షించినారు.**

తే. “అస్మదీయ మిథ్యా జగమందునున్న
నిత్య సుందర మోహన సత్యమీవు,
మధుర కళ్యాణకవిత మీమార్గమందు
నాకు జీవనసంగియై యొప్పినావు

తే. “గౌరవము కల్గినది ననుఁగలియు కొఱకు
వచ్చితివి ‘మత్ప్రియా’ దిగివచ్చినావు,
కదునకించనతగల యేగర్వపడితి
అల్గి, ఉదయవేళ కలల నరసినాద !

తే. ‘శీతకరునకు బూర్ణిమా సింధువునకు
బరిచయ విభవ మబ్బిన పగిదితోచి,
పచ్చిపైబడియుత్తుంగ భంగములను
స్నిగ్ధ కిరణాళి సేయు నాశ్లేషణముల ॥

ఈ యనువాదము చాల రసవత్తరముగ సాగినది.

మొదటి పద్యములో మూలములో కవియొక్క ప్రియతముడు కేవలము ‘బిజలీ మాలా పహనే’ యని యుండగ, శ్రీ సోమయాజులుగారు, ఆ విద్యున్మాలను, ‘మంజు’, మహితములగు విశేషణముల ద్వారా విశేషించి మంజులతను, మహితత్వమును గూర్చినారు. అట్లే మూడవ పాదమునఁ రసబూంద్ బరస్ జాతాథా, అని యుండగ, ఆరసబిందువులకు శ్రీవావిలాల వారు బహుఘనతను గూడ కూర్చినారు.

ఈ విధంగా వ్యాఖ్యానం చేసికొంటూపోతే ఇదియే ఒక పెద్ద గ్రంథం ఔతుంది. కాన సహృదయులగు పాఠకులే స్వయముగ ఆయా విశేషము లనరయ వేడికోలు.

నిజంగా కవిది ఆధ్యాత్మిక ప్రేమయే యైన, తన ప్రియతమునితో అతనికి సంభవించిన ఈయాధ్యాత్మికలనము గర్వపడతగినదే, మిడిసి పడవలసినదే. కాని అది నిలబడినట్లు కవి వర్ణించలేదు.

అతడు తన ప్రియతముని ప్రేమ సత్యముగాక ఛలము అనగా వట్టి దగా అంటాడు. కాని ఛలమైన తనకు మాత్రం తన ప్రియతముని యందు గట్టి విశ్వాసం ఉందంటాడు. తన ప్రేమలో మాత్రం ఎట్టి ఛలమూలేదు. అది సత్యమే అంటూ, అతని ప్రియతముడు రూపముచే సుందరుడే గాని, అతనికి హృదయం లేదంటూ ఈ క్రింది పద్యాలూ చెప్తాడు.

మూలము : “చలనాథీ, తబ్ భీ మేరా,
ఉస్‌మేఁ విశ్వాసఘనాథా।
ఉస్ మాయాకీ ఛాయమేఁ
కుఛ్ సచ్చు స్వయంబనాథా॥

“వహ్ రూప రూప థా కేవల్,
యాహృదయరహాబీ ఉస్‌మేఁ,
జడతాకీ సత్ మాయాథీ,
చైతన్య సమఝ్‌కర్ ముఝ్‌మేఁ॥

(తెలుగు) : తే. ‘అయిన మోసకత్తియ దానియందెనాకు,
గాఢ–విశ్వాసమెదలోనగలదు, అట్టి
చారుమహిత మాయాఘనచ్ఛాయయందు,
స్వయము గ నేదొ యున్నది సత్యమగుచు

తే. ‘మంజు సౌందర్యమది రూపమాత్రమగునె?
కాక అందు హృదయమును గలదె, నిండి,
తానె చైతన్యమను భ్రాంతిమాని నాలొ,
పరగుచున్నది యొక జడత్వంపుమాయ.

ఈ విధంగా తన ప్రేయసి వట్టి జడమనియు, ప్రతిస్పందములేని సుందర ప్రతిమయనియు, తాను ఆమె చేతనపుత్తళిక యని భ్రమపడినానని కవి వాపోయినాడు.

తాను తన ప్రియతముని యందలి ప్రేమవలన, మోసపోయినను, ఆమె యందలి తనకు గల మోహము మూలముగ కల్గిన వియోగవ్యథను వర్ణించుచు కవి యీ విధంగా తన వియోగవ్యథను ఇలా వెళ్లపోసికొంటాడు:

మూలము : “హీరే సా హృదయ హమారా,
కుచలా శిరీష కోమలనే,
హిమశీతల ప్రలయ అనలబన్
అబ్ లగా విరహ్ సే జలనే

“జల్ ఉఠా స్నేహదీపక సా
నవనీత హృదయథా మేరా,

అబ్ శేష ధూమమరేఖాసే,
చిత్రిత కర్ కహా అంధేరా॥

"నీరవ మురలే, కలరవచుప్,
అలికులథే బంద్ నలినమే
కాలిన్దే బహీ ప్రణయకీ,
ఇస్ తమమయ హృదయపులినమే॥

ఈ మొదటిపద్యములో తన ప్రియతముడు శిరీషపేశల హృదయుడేయైనా, ఎట్టి కష్టములకు సాధారణముగా తలవంచని తన యొక్క వజ్ర సమమైన హృదయాన్ని సైతం నులిమివేసి తన హిమశీతల హృదయంలో ప్రళయానలమువలె భీకరమైన విరహాగ్నిని రగుల్కొల్పినాడు. అతడు పెట్టిన ఈ ఘోరమైన చిచ్చుతో తానే నిత్యము దహించబడుచున్నానని తన విరహ వ్యథాజనితమైన తీవ్ర సంతాపమును వెళ్లబోసి కొనినాడు.

ఇక రెండవ పద్యములో తనలోని ప్రియవిషయకమైన స్నేహము (ప్రేమ, తైలము, శ్లిష్టపదము) వియోగాగ్నిని ప్రజ్వలింపచేయుచున్నదనియు, తన నవనీతహృదయ మందులో కాలి కాలి చివఱకు ఒక ధూమారేఖా మాత్రముగ మిగిలిపోయి అంధకారమును సృజించుచున్నదని వాపోయినాడు.

ఇక ఇపుడు తన జీవితములో నలముకొనిన ఘనవిషాదచ్ఛాయల నభివర్ణించుచు కవియిట్లు పల్కినాడు.

భావార్థము : తన జీవితములోని పూర్వపు కలరవమంతయు ఇపుడు మాయమై పోయినది. తన హృదయవీణ ఇపుడు మూగపోయినది. తమ మధురఝుంకారములతో లోకమును మురిపించు అలికులము. పద్యములో మణగియుండుటచే (రాత్రి సమయమగుటచే) ఎట్టి ఝుంకారములను చేయక సద్దుమణగియున్నది. తన హృదయసీమలో, ఇపుడు ప్రేమోల్లాసములు మటుమాయమైనవి. ఇపుడాహృదయము యొక్క శుష్కపులినములలో నిరాశా, నిర్వేదముల దట్టమైన చీకటియే అలముకొని యున్నది. ఇపుడు నా హృదయపులినములలో ప్రేమయొక్క యమున (నల్లని రంగు గలది యగుటచే, దుఃఖము, నిరాశ వానికి ప్రతీకము) అప్రతిహత గతితో ప్రవహించుచున్నది.

నిజముగ తన దుఃఖములోని తీవ్రతను, తన హృదయములో అలముకొనిన నిరాశను, తనకు విరహవ్యథ వలనకల్గిన అసహ్యావేదనను ప్రకటించుటకై ప్రయోగించిన లాక్షణిక ప్రయోగము, అద్భుతము.

(తెలుగు) : **తే. "మృదుశిరీషము, వజ్రమై మెలగు నాదు**
**నెదను నలిపివేసిన యదియుదయవృత్తి**
**హిమసుశీతలప్రేమ జ్వలించుచున్న**
**దనలమై యిపుడనయ మాయుల్లసమున**

**తే. "ప్రణయ ముజ్జ్వల దీపమ్ముపగిది వెలిగె**
**నెగడె మన్మానసము నవనీతమగుచు,**
**లీలగా మిగిలిన ధూమరేఖతోడ**
**నిపుడు చీకటినెపుడు చిత్రించుచుండె**

**తే. "నీరవము వంశి కలరుతి నిశ్చలమ్ము,**
**నళినమున నళికులము బంధనమునొందె**
**ఈ ప్రగాఢతమోమయ హృదయసైక**
**తమున ప్రణయ కాళింది కదలినదించె ॥**

**తెలుగు ఛాయలోని విశేషములు :**

మొదటి పద్యములోని శైలి శిరీషపేశలము. పేశలమగు శిరీషమువంటి తన ప్రియతముడీ వియోగపుదుష్కాలములో వజ్రమై మెలగు కవి యొక్క హృదయమును జాలిమాలి (అదయవృత్తి) మూలములోలేని) నలిపివేయు చున్నాడని పూరించి మూలమునకు శోభనుగూర్చబడినది.

రెండవ పద్యము మూలాను సారమగు రమ్యమగు అనువాదము. ఇక మూడవ పద్యము శైలిచాల మనోజ్ఞము. మొదటి రెండు పాదములలో సమాన విధురమైన, మధురశబ్ద ప్రయోగము నిజముగ ముచ్చట నొప్పుచున్నది. నీరవము, వంశి, కలరుతి (రవము)- నిశ్చలము నళినమున-నళికులము ఇత్యాది పదములు, ధ్వని సౌందర్యమునకు నిదర్శనములు.

కవియొక్క యీ తీవ్ర విరహవేదనకు మఱియొక కారణము, ఆమె తన ప్రగాఢ ప్రేమను గూర్చి తెలిసినా, ఏమియు ఎఱుగని దానివలె తనయుల్లసములో తాను

మున్గియుండుటే. ఈ ప్రియతమోపేక్షా జనితమైన వ్యథను కవికావ్యారంభంలోనే ఇట్లా వెళ్లపోసికొంటాడు.

మూలము : **“రో–రోకర్, సిసక్ – సిసక్ కర్**
**కహతామైఁ కరుణకహానీ,**
**తుమ్ సుమన నోచతే సునతే**
**కర్‌తీ జానే అనజానీ ॥**

**తే. “ఏడ్చి యేడ్చి నేనంతతట నెకువెట్టి**
**కరుణ కథ నీకు విన్పింపగడగినాను**
**సుమనములు గిల్లుచును వినుచుంటి వీవు**
**ఎఱిగియును ఎఱుగనియట్లు వర్తింతు వేల**

(తన ప్రియురాలు పూలుకోసికొనుటకు వచ్చినపుడు తన కరుణకథను విన్పించినను, ఆమె ఏమియును పట్టించుకొనక, తన పూలు తాను కోసికొని వెళ్లిపోయెడిది.

ఇఁక తన జీవితములో తన ప్రియతముని ప్రవేశనిర్గమనముల వలన తనలో కల్గిన ప్రతిక్రియను వర్ణించుచు కవి యీ క్రింది ఛందస్సును కూర్చినాడు.

మూలము : **“మాదకతాసే ఆయే తుమ్,**
**సంజ్ఞా – సే చలేగయే తుమ్,**
**హమ్ వ్యాకులపడే బిలఖతే**
**థే, ఉతరే హు ఏ నశేసే ॥**

(కవి హృదయంలో అతని ప్రియతముడు ప్రవేశించినపుడు అతనిలో నొక విధమైన మాదకత (నిషా) వ్యాపించింది. కాని ఆనిషా తగ్గేలోపల ఆమె నిష్క్రమించింది. దాని వలన నతడు చాల వ్యాకులతతో బిట్టు విలపించినాడు. కాని ప్రయోజనం? (అను)

తే. **“వచ్చితివి మాదకత్వము పగిదినీవు,**
**చనెడివేళ వెడలితివి సంజ్ఞవోలె!**
**వదలిపోయిన మత్తులో వ్యాకులతను**
**విలపనము సేసినాడ నవ్వేళనేను**

ఇcక ప్రియతమ నిష్క్రమణముతో అతని ముందు నిరాశతో నిండిన ఆకాశములే వ్యాపించినట్లన్పించెను. కాని అకించనుడగు తాను ఒడ్డులులేని ఈయపారవియోగ దుఃఖపారా వారమునెట్లు ఈది దాటగలదు?

ఇcక గతిలేక శూన్యత వ్యాపించిన ఈ జలములన్నియు, ఇంకి పులినమయమై నిల్చిన ఇసుక సాగరంలో, తన ప్రేమనౌకను త్రోసికొని వెళ్ళుటకై తన అశ్రుధారలను వర్షించి, ఆ జలములతో గుణరహితమైన (బేగున్ – శ్లిష్టపదము, గుణము మఱియు రజ్జువు) తన ప్రేమ నౌకను, త్రోసికొనుపోవు చున్నాడు! ఈ క్రింది పద్యమును చూడుడు:–

**'సూనే సికతా సాగరమేc**
**యహ్ నైయా మేరే మనకీ,**
**ఆంసూ కీ ధార్ బహాకర్,**
**ఖేచలా ప్రేమ బేగునకా"**

(అను) తే. **'శుద్ధ ఘన సికతామయాసోక్తజలధి,**
**నాదు మానస మనెడి యీ నావనిప్పు**
**డశ్రుధారల నదియించు నట్లొనర్చి**
**ప్రేమగుణహీనముగ నడిపించుచుండె.**

భావము స్పష్టము.

ఇcక తనకు తన ప్రియతమునికి గల మధుర సంబంధమిపుడు శలభ అగ్నులకు గల ప్రేమ సంబంధంగా తయారైనది.

మూలము: **"బలనేకా సంబల లేకర్**
**దేపక్ పతంగసే మిలేతా,**
**జలనే కీ దేన దశామేc**
**వహ్ ఫూల్‌సదృశ హెూఖిల్‌తు ॥**

తెలుగు : తే. **"పొంది జ్వలనమె పాథేయముగను జ్యోతి**
**శలభమును జేరుటకు తాను జనుచునువుండె,**
**తివిరి జ్వలియించు నట్టి దీనదశను,**
**పుష్పసదృశముగ నది సంపుల్లమౌను.**

ఈ పై పద్యములతో, కవి తనను, మిడుతగను, తన ప్రియతముని అగ్నిగను వర్ణించినాడు. కాని చిత్రమేమిటంటే అగ్ని, శలభాన్ని ప్రేమిస్తే ఏమౌతుంది? ఆయగ్ని జ్వాలలో పడి తానే భస్మమై పోతుంది. అట్లే తన ప్రియతమ గూడ తనలో ప్రవేశించింది. కాని అబోధమగు శలభము (మిడత) అగ్నియొక్క రూపమును చూచి భ్రమపడి, దానిలో దూకింది. కాని మిడుతలోని ప్రేమ ఎంత బలవత్తరమంటే తాను ఆయగ్నిలో పడి భస్మమై పోతున్నా తన ప్రియునితో కలసిపోతున్నాననే ఆనందంతో అది, సంతోషంతో ఆత్మార్పణము ప్రియునకు చేస్తూ, ప్రియునితో తాదాత్మ్యము పొందుతుంది.

ఈ పద్యములలో కవి ప్రేమ యొక్క యథార్థ స్వరూపమును వెల్లడించినాడు. ప్రేమయన ఆత్మ సమర్పణమే కాని, సుఖభోగము కాదు.

లోకంలో సాధారణంగా ఒక ప్రథ ఉన్నది. అది ఏమంటే మనకేదైనా బాధకల్గితే అణచడాన్కి ప్రయత్నం చేయడం కంటె, ఒక్కసారి మనం గట్టిగా విలపిస్తే ఆ బాధ తగ్గుతుందని. దీనికి ఉదాహరణంగా తన తండ్రిమరణ వార్త తెలిసిన పిదప రాముడు విలపించిన, శ్రీమద్రామాయణం లోని ఘటనను తీసికొనవచ్చును.

మఱియొక విషయమేమిటంటే మన ఒంటికి గాని, వస్త్రమునకు గాని ఏవైనా రంగు అంటుకొంటే అది కడిగితే పోతుంది అని.

కాని ఈయనురాగము రంగు మనస్సుకు అంటుకొంటే అది ఎంత దుఃఖించినా తగ్గదు. ఎంతటి అశ్రుప్రవాహములు ఐనా దానిని కడిగివేయలేవు. అది తగ్గకపోగా అశ్రుబిందువులు రాల్చినకొలదీ అనగా దుఃఖించిన కొలదీ ఆ రంగు ఇంకా పక్కాగా తయారౌతుంది. నిజముగ ఇది అనురాగపు రంగు యొక్క వైలక్షణ్యం ఈ విషయాన్ని స్మరిస్తూ శ్రీ ప్రసాద్ ఇట్లా అంటాడు.

**“ఆజ్ ఘుటతానహీఁ ఛుడాయే**
**రంగగయా హృదయమేఁ ఐసా ।**
**ఆంసూసే ధులా నిఖరతా,**
**యహ్ రంగ్ అనోఖాకైసే?**

(తెలుగు) తే. **“ఎడదపై వేయగా బడెనిట్టి వర్ణ**
**మింత వదలదెంతగ వదలించుకొన్న**
**కెరలి మెరయునశ్రుల గడగిన కొలంది**
**బహువిలక్షణమై యేలపరగునిద్ది?**

ఇక కవి ఈలోకంలో అన్నీ కష్టాలే అని చెప్తూ ఇలా అంటాడు :

పైన శూన్యమైన ఆకాశంలో నియతిసర్వసుఖాల్ని నింపింది. అందుకు చిహ్నంగా నింగిలో నక్షత్రములు, మిలమిలలాడుతు అనంతముగ వ్యాపించి ఉన్నాయి. ఇక క్రింద భూమి ఉన్నది. ఆ భూదేవి అన్ని కష్టాలను భరిస్తూ తన క్షారములగు అశ్రు వులతో సముద్రాన్ని నింపుతున్నది.

ఇక్కడకవి తాత్పర్యము : తన ప్రియురాలు చీకుచింతలేని హృదయ సీమలో సుఖంగా ఉంది. కాని తానుమాత్రం ఈ భౌతిక జగముననే రమిస్తూ అష్టకష్టాలూ పడ్తూ ఉన్నాడు (ఆంసూ, ప. 108, 109)

ఇంక ప్రసాద్, తన వేదన, మేఘమాలయై అనంతగగనంలో, సుఖ-దుఃఖాల స్పర్శ గూడ తగలకుండగ హాయిగ స్వచ్ఛందంగా చరించాలని ఆకాంక్షిస్తాడు. ఇది నిరంతర సాహచర్యము వల్ల దానితో అతనికి విడదీయరాని మమత ఏర్పడింది. అతని జీవితము వేదనామయమే ఐపోయింది.

ఈ క్రింది పంక్తులను చూడుడు :

మూలము : **"ఛడ్ జాయ్ అనంత గగనపర్,**
**వేదనా జలద కీ మూలా ।**
**రవితీవ్ర తాప, న జలాయే,**
**హిమకర కాహెూ, న ఉజాలా॥**

తెలుగు : **తే. "అపరిమేయ నభముపై వ్యథాభ్రమాల,**
**యధి వసించుత - తాపాగ్ని నర్యముందు**
**కోరి జ్వలియింప కుందుతఁగుముద బంధు**
**వుజ్జ్వల ద్యుతి విన్నవోకుందుగాత॥**

(ఇక్కడ రవి - హిమకరులు, సంతాపమునకు - శీతలతకును అనగా దుఃఖ - సుఖములకు ప్రతీకములు.

కవి తన జీవిత వేదనను పదునాల్గు భువనాలలోనికి పంపినా, ఎక్కడా శాంతంగా నిల్చిపోవడానికి తావులభించక తిరిగి కవి జీవిత ప్రాంగణానికే వచ్చి స్థిరమైన ఆవాసం ఏర్పాటు చేసికొని స్థిరపడ్తుంది. తన జీవితం వేదనామయం అని తెల్పటానికి కవి చమత్కృతి జనకమగు ఈ వ్యంగ్యశైలినిట ప్రయోగించినాడు :-

మూలము : **“వేదనా వికల ఫిర్ ఆయీ,**
**మేరీ, చౌదాహోం భువనమేం,**
**సుఖ కహీంన దియా దిఖాఈ**
**విశ్రామ, కహాఁజీవనమేం?**

తెలుగు : **తే. “నాదు వికలవేదన పదునాల్గు భువన**
**ములలొ తిరిగితావచ్చె – ఆ ఇలలొ నెచట**
**వెదకినను సుఖమది కనిపించలేదు**
**చెలగునిచ్చట విశ్రాంతి జీవితమున ॥**

(భావానుగణమైన సుందర అనువాదము)

ఈ వర్ణనములో సూరదాసు వర్ణన ప్రభావమించుక గోచరించుచున్నది :-

**“మేరో మన అనత కహాఁసుఖపావై ।**
**జైసే ఉడి జహాజ్‌కో పంఛీ ఫిర్ జహాజీ పై ఆవై॥** (సూరసాగరం)

(నా మనస్సు కమలనయనుడగు, శ్రీకృష్ణుని పాదారవిందములందు దక్క, అన్యత్ర ఆశ్రయం కోసం పోతే దానికక్కడ శాంతి యెట్లులభిస్తుంది? ఎట్లు సముద్రములో పయనించు ఓడమీదనున్న పక్షి, దానిని విడచి ఎంతదూరము ఎగిరినను, నిల్చుటకు, తగిన స్థానము లభించక తిరిగి ఆ ఓడ మీదనే వచ్చి వ్రాలినట్లు, నా మనస్సు ఆ శ్రీకృష్ణపదారవిందముల సన్నిధానమునకు తిరిగివచ్చి, అక్కడనే స్థిరనివాసం ఏర్పాటు చేసికొని విశ్రాంతినొందగలదు అని.

కవి తన వేదనను సంబోధించి యిట్లా అంటాడు. ఓ నా వేదన జ్వాలా, నీవు నిత్య సౌభాగ్యవతివి. నీవు ఈ సంఘర్షపీడితమైన జగత్తులో దాపరించిన ఆకురాలు కాలమునకు హోలీపండుగవు, అనగా దానిని దహించి వేయుదువు. అంతటితో ఊరుకొనక మానవ లోకంలో తిర్గి వసంతమును ప్రవర్తిల్లచేయుదువుగాన నీవు మానవత తలపాటలోనున్న సింధూర రేఖవు (శుభసూచకము). కవి యీ ఛందస్సులో తన వేదనా జ్వాల, తనకు సంతాప దాయకమయ్యును లోకమునకు శుభదాయకమని తెల్పుటకు లోక ప్రసిద్ధమైన అరుణ రోలీ పదములను ఈ పద్యములో ప్రయోగించినాడు.

మూలము : **“ఇస్ వ్యథిత విశ్వ పతఝడ్ కీ,**
**తుమ్ ఖలతీ హో మృదుహోలీ!**

**హే అరుణే! సదా సుహాగిని,**
**మానవతా సిర్ కీ రోలీ॥**

మఱియును

**"జీవన సాగరమేఁ పావన**
**బడబానలకే జ్వాలాసీ**
**యహ్ సారా కలుషజలాకర్,**
**తుమ్ జలో అనల బాలాసీ॥**

తెలుగు : **తే. "ఉంటివి వ్యథితవిశ్వమహోజ్జ్వల మృదు,**
**హోళికోత్సవ మట్లుగా నొప్పి నీవు,**
**అరుణరో! సదాయైదువయైన మాన**
**వత్వ సీమంత సిందూర భాగ్యమీవు.**

ఈ విధంగా తనలోని వేదన (వియోగ) తనను నిరంతరము జ్వలింప జేయుచున్నను మానవ జీవితంలో నవవసంతములు నింపుగాక యని యాశాసించి, ఇక వియోగ దుఃఖమూలములకు తన విరహాశ్రువుల స్రవంతి సుఖ–దుఃఖములను రెండు ఒడ్డులను ఒరసి కొనుచు, సంతప్తులును, దుఃఖవ్యథితులును నగు జనుల జీవితములలో కరుణ నింపుగావుతమని ఆశ్వాసిస్తాడు. ఈ క్రింది పంక్తులను చూడుదు:–

మూలము : **"ఆంసూ వర్షాసేం నించ్‌కర్,**
**దోనోం హీ కూల్ హరాహెూ ।**
**ఉస్ శరద్ ప్రసన్ననదీమేఁ**
**జీవన–ద్రవఅమలభరాహెూ ॥**

ఇక్కడకవి తాత్పర్యము : మానవుని మలినమైన జీవితధార సుఖ–దుఃఖములను ఒడ్డుల మధ్యమున ప్రవహించుటవలననే నిర్మలమౌతుంది. అపుడే నిర్మల జీవన – ద్రవముతో (కరుణారూపమైన) నిర్మలరసముతో అది ముందుకు ప్రవహించి ధన్యమౌతుంది.

తెలుగు : **తే. "తడిసి కన్నీటి జడివానఁ దటములప్పు**
**డుభయములు హరితమ్ములైయలరుగాక**
**ఈశరత్ప్రసన్న తటిని, నమల జీవ**
**న ద్రవమునిండియుండుత నవనవముగ.**

ఇక తనలోని శుభ్రవేదనను (నిశ్చల ప్రేమ – జనితమగు) తన జీవిత చిరసహచారిణిగ నంగీకరించి అట్టి చిరసహచరి సహవాసము వలన ఆమెయశ్రు వులతో బాటుగ ఆమె ప్రేమను గూడ తనకు ప్రాప్తించినదని పల్కుచు, తనలోని వేదనను మఱియు అశ్రువులకునుగల విడదీయరాని సంబంధమును వెల్లడించుచు బాబూజయశంకరప్రసాద్ ఇట్లు వ్రాసినాడు.

మూలము : **"తుమ్! ఆ రే వహీహాఁ తుమ్ హెూ**
**మేరీ చిరజీవనసంగిని**
**దుఃఖవాలేదగ్ధ హృదయకీ**
**వేదనే ! అశ్రుమయిరంగిని**

అను : **తే. "ఔను నీవు దానివె – మామకాత్త దుఃఖ**
**పూరిత విదగ్ధ హృదయాన పుట్టియెపుడు**
**నెగడు చిరజీవిత సుసంగినివె యగుదువు**
**శుభ్రవేదనా ! ఓసి అశ్రుమయవర్ణ ॥**

ఇక చివఱగ, తన కన్నులను నిచ్చలుక్రమ్మియుండు అశ్రువుల, తన వలె దుఃఖసంతప్తమైన జనుల హృదయములను, ప్రాతఃకాలీన తుషార బిందువులు, శుష్కమైన ధరతిపై వర్షించి, ఆర్ద్రమొనరించిన చందమున స్నేహార్ద్రములను కరుణ సంభృతములను గావించుచు, మానవత, మోముపై ఆనందముచే తరళమైన మందస్మితము గోచరించుదనుక, కన్నులనుండి సతతము వర్షించుచునే యుండుగాక, యని కవి యాశ్వాసించుచు ఈ కావ్యమును ముగించినాడు. కవితాత్పర్యమేమియన లోకమునందు సుఖ–దుఃఖముల సామరస్యమును నెలకొల్పుటకై కరుణ వేదనలు, రెండూ అనివార్యములు. ఇదియే స్వ. జయశంకరప్రసాదు జీవిత దర్శనము. 'ఆంసూ' అనే కావ్యంలోనే గాక 'కామాయని'లో గూడ, తన యీ మతమునే నిర్ద్వంద్వముగ ప్రకటించియున్నాడు. ఈ విషయమునే వర్ణించుచు బాబూ జయశంకర ప్రసాద్, తన సందేశాన్ని ఇలా ఇస్తాడు :–

మూలం : **'సబ్‌కా, నిచోడ్, లేకర్**
**సుఖసే సూఖే జీవనమేఁ**
**బరసో ప్రభాతహిమ – కనసా**
**ఆంసూ ఇస్ విశ్వ సదనమేఁ ॥**

శ్రీ వావిలాల వారి యాంధ్రానువాదము :

**తే. "ఈ సకలముల రసము గ్రహించి నీవు,**
**స్నిగ్ధసుఖముచే, మివుల శుష్కించియున్న**
**జీవితమున విశ్వసదన సీమ నుషల**
**హిమకణమటు నశ్రువుల వర్షింపు, ముదిద!**

ఈ సందేశంతో ప్రసాద్ తన కావ్యాన్ని ముగిస్తాడు.

**సందేశ సారాంశము :** తనలోని తీవ్రమగు విరహ వేదన (ఇదియే శ్రీ సోమయాజులు గారు సంబోధించిన, యువిద) లోకములోనున్న కరుణారసము నంతను గ్రహించి స్నేహమునకు నోచుకొనని, జనముల జీవిత క్షేత్రములను, ఉషస్సు, తన ప్రాభాతిక హిమ కణ వర్షము ద్వారా ఈ గ్రీష్మ సంతప్తమైన మేదినిని చల్లబరచినయట్లు, తన యశ్రుధారలతో కరుణార్ద్రముల గావించుగావుతమని, శ్రీ జయశంకర్‌ప్రసాద్ ఆశాసిస్తాడు. కవి 'ఆంసూ' అను తన కావ్యానికి విషయంగా గ్రహించిన 'అశ్రు–వేదనల' పర్యవసాన మీ సుఖ–దుఃఖముల సామరస్యమే యని కవి ధ్వనింపచేసినాడు.

'ఆంసూ అనే ఛాయావాద కావ్యాన్ని, 'కన్నీరు' అనేపేరుతో తెలుగు ఛందస్సులోని కనువ దించిన శ్రీ స్వ. వావిలాల సోమయాజులు గారు, తెలుగు మాగాణమును సుమారు మూడు దశకములు, తన మంజుల, మధుమయ కవితల ద్వారా రస స్రవంతిలో ముంచియెత్తిన కవిశేఖరులు. ఆయన స్నేహశీలి. కరుణార్ద్రహృదయుడు. సంస్కృతాంధ్రాంగ్లములను పుడిసిలించిన అగస్త్యుడు. సహృదయుడు, భావుకుడు, సంఘసేవకుడు. రససిద్ధిని సాధించిన కవీశ్వరుడు. ఆంధ్రసాహిత్య ప్రక్రియలలో ఆ మహాకవి స్పృశించని ప్రక్రియ లేదు. తనది యగు ముద్రవేయని ప్రక్రియగూడలేదు. 'కుమారధూర్జటి' యను బిరుదముతో సత్కరించబడిన సరసకవితా నిర్మాణ ధురీణుడు. అట్టి కవి తల్లజుడు 'ఆంసూ' అనే ప్రసాదు కావ్యమును తెనిగించు అవసరమేల కల్గెను. అను ప్రశ్న తప్పక పాఠకలోకమునుదయించును. వారు అనువదించిన ఈ 'ఆంసూ' అనే హిందీ కావ్యము, కేవలము స్థూల లేక మూర్త పదార్థ వర్ణనా పరమైన ప్రాచీన కావ్యశైలిలోగాక, సూక్ష్మము లేక అమూర్తముఐన భావ ప్రపంచము దెసకు భావుకలోక దృష్టిని మఱల్చుటకై స్వర్గీయ శ్రీ జయ శంకర ప్రసాద్, తన భావతీవ్రత కనుగుణముగ రూపొందించిన, లాక్షణిక పద సంగఠనా రూపమైన 'ఛాయావాద' శైలిలో రచించబడిన మధుర, మంజులకృతి. ఇట్టి నవ్య శైలిని తెలుగు

సాహిత్యలోకమునకు పరిచిత మొనర్చుటకై శ్రీ వావిలాల సోమయాజులుగారు 'కన్నీరు' అనేపేరుతో ఈ కావ్యమును తెలుగులోకనమునకందించినారు. అట్లే ప్రసాద్ నిర్మించిన 'కామాయని' యను పేరుతో సరస మంజులమైన ఆంధ్రభాషలోని కనువదించి ఆంధ్రభాషా ప్రపంచమునకు చాలయుపకారమొన రించినారు. శ్రీ స్వ. ప్రసాద్ రచించిన ప్రత్యేకముగ ఛాయావాదశైలిలో రచించిన కవితలు, హిందీ సాహిత్యమును తఱచి – తఱచి చూచిన విద్వత్తల్లజులకే, 'విద్యావతాం భాగవతే పరీక్షా' అనినట్లు పరీక్షా స్థానము. అట్టి కవితలను ఆకళింపు చేసికొనుటయే కష్టము. కాని వానిని ఆకళింపు చేసికొనినను, వానిని భాషాంతరము లోని కనువదించు యత్నము చాల సాహసమే యని చెప్పవచ్చును. కాని శేముషీధురీణులును, మధుమయకవితా నిర్మాణ దక్షులును నగు శ్రీ వావిలాల సోమయాజులగారు, తన లక్షణ లేక ధ్వని ప్రధానమైన తెలుఁగు శైలిలో తన యనువాదములను గూడ సమర్థముగ నిర్వహించి, తాము చేపట్టిన కార్యములో సంపూర్ణ సాఫల్యమును, తమ ప్రతిభా – వ్యుత్పత్తుల బలముతో సాధించుటతోబాటుగ ఆంధ్ర కవితా క్షేత్రములో గూడ నవీన కావ్య నిర్మాణమునకొక అభినవ మార్గమున, సుగమ మొనరించినారు. ఇట్టి యద్భుత కవితా రీతిని ఆంధ్రలోకమున కందించిన స్వ. శ్రీ వావిలాల సోమయాజులు గారికి, వారి కవితలకు జయకారములను (జేజేలను) పల్కుచూ –

భవదీయుడు

భూమికా రచయిత

# కన్నీరు (ఆంసూ)

తే. ఏల కరుణరసకలిత హృదయ వీథి
నిటుల వికల రాగిణి ధ్వనియించు నేఁడు
ఏల హాహారవాల గర్జించు నిటుల
స్నిగ్ధవేదన చెలఁగి నిస్సీమ మగును? 1

తే. తత మదీయ మానస రహస్తటము నందుఁ
గలిత లోలలహరి కాఘాత పంక్తి?
ఏల కలరవమ్ముల వినిపించుఁ గొలఁది
బహుళ విస్మృత గత పూర్వ వచనములను? 2

తే. నా ప్రతిరుతి ప్రత్యావర్త నమ్ము నేల
సలుపు నిటు శూన్యమౌ క్షితిజమ్ము నుండి?
ఎదురు దెబ్బ తిన్నటు, విలపించు దాని
వోలె నున్మత్తయటు రాకపోక లేల? 3

తే. అర్థిఁ జింతించుచును నుభయాంచలముల
వ్యథిత గగన కూలంకష పగిది నేఁడు
మామకీన సుచేతనా మహిత తటి ని
మృదుతరంగ పాళికల సృజించు నేల? 4

తే. నీల నభమున తారకానిచయ మెనసి
వ్యాప్తిఁ గైకొని వర్తిలు పగిది మదిని
వెలయ నిర్మింపఁబడియె సువిస్తృతముగ
బహుళ సంకీర్ణమౌ జనపద మొకండు. 5

తే. ఇట్టి జ్వాలామయాగ్నియం దెగసి పడెడి
యఖిల మిది నాదు విస్ఫులింగాళి, అరయ
నిద్దిశీర్ణమై కనఁ గేల శేషమగుచు
చెలఁగు నా మహామేలన చిహ్న వితతి. 6

తే. ఇదియె శీతలజ్వాల జ్వలించు, నేత్ర
జలమె యింధన మయ్యెను సాగు వ్యర్థ
మైన నిట్టూర్పు రేగి యత్యంతముగను
ననిలుఁ డొనరించు కృత్యమ్ము నాచరించు. 7

తే. ప్రణయ జలధి తలాన నిద్రించుచుండె
బాడబజ్వాల, దప్పిక వడసి నట్టి
మత్స్య నేత్ర యుగళి సదమదము నొందె
వికలమైనట్టి జలముల వెతలగూరి. 8

తే. సింధు జలబుద్బుదములు విశీర్ణమయ్యె,
స్నిగ్ధ నక్షత్రమాల సంభిన్నమయ్యె.
అసితనభముక్త కుంతల యైన ధరణి
దోచుకొనఁబడినట్లుగాఁ దోచుచుండె. 9

తే. కమల మృదుపద నిత్య సంకషణములను
జెలఁగి బొబ్బలు చిటిలి విశ్లేషమొందె
అవ్వి యీయెడఁ దిలకింప నశ్రులనెడి
కరుణ కణములచేఁ గడుగఁబడియుండె. 10

తే. ఈ వికల వేదనను నొంది యెది సుఖమ్ము
తోడఁ బందెము వేయఁగా దొరయు నద్ది
నాదు ముగ్ధమును నకించనమ్ము నయిన
స్మృతి విహీన చైతన్యమై మెలఁగుచుండె. 11

తే. ప్రబల కాంక్షానిచయ పరివర్తనమును
నిత్యసుప్త వ్యథాఘనోన్నిద్రతయును!!
స్వాదు సుఖము సమస్తమ్ము స్వప్నమగుట!
సార్ద్రనయన పక్ష్మమ్ములు సంవృతములు. 12

తే. ఆత్మ వారిజ మలకమ్ము లనెడి యళుల
చిన్ని యురులలోఁ దవిలి తాఁజిక్కువడియె,
నశ్రు సుమరసము నదించి యనయ మిటులఁ
గడఁగి నిశ్వాసపవనాలఁ గలియుచుండె. 13

తే. మనసు నెదొ సంతసపరచుకొనెడి క్రీడ
మాదకమ్మయ్యెను–విమోహమయము నయ్యె,
అట్టి మధుర ప్రణయ వేదనా విలమ్మె
యెడఁద నిప్పు డీగతిఁగదలించి వేయు. 14

తే. సుఖముచే నాహతమ్మయి సుప్తమైన
యాశ! ఉచ్ఛ్వాసమౌ వృథాయాస హృదయ
మైన యది సమాధి, కరుణ యవలఁజేరి
యొక్క మూలన రోదించుచున్న దిటుల. 15

తే. చకితగతి నిస్వనము సేయు చాతకమ్ము
రమ్యరసమయ కలకోకిలారవమ్ము
ఆర్ద్రమగును నా కరుణ కథాంశ మిపుడు
తడిసి యున్నది కన్నీటిధార లందు. 16

తే. రమ్య నిజసౌఖ్యముల స్పృహారహితులుర్వి
నెవరొ, సుప్తముగ నువుండు నెవరి వ్యథలు
వార లవకాశ మేకడఁ బడయఁగలరు?
కడఁగి వినుటకు కమనీయ కరుణకథలు. 17

తే. ఇటుల జటవలెఁ దోచుచు నెట్టు లెంత
పెరిగియున్నది జటిలజీవిత సమస్య
హృదయ వీథుల భూరజ మెగురుచుండె
నరయ నిట్టి విభూతి యెవ్వరికిఁ గలదు? 18

తే. మసలి స్మృతివోలె మామక
వ్యాప్తినొంది ఘనీభూతమైన పీడ
తోచి, కలఁగి, కార్కొన్న యీ దుర్దినమున
నశ్రువులు వోలె వర్షింప నరుగుదెంచె. 19

తే. కడఁగి వినుట కీవిటుల నాక్రందమున
నేమి మొరయుచు నున్నది యెదొ విపంచి
ధారలై వచ్చు కన్నీటి దారములతొ
కోరి కరుణపటము నేసికొనెద వీవు. 20

తే. ఏడ్చి యేడ్చి నే నంతట నేకువెట్టి
కరుణకథ నీకు విన్పింపఁ గడఁగినాను
సుమనముల గిల్లుచును వినుచుంటి వీవు
ఎఱిగి యెఱుఁగని యట్లు వర్తింతువేల? 21

తే. మించెడి విమోహమునను విస్మృతిని జెంది
పడుచు లేచుచు సాగుచు వెడలుచుంటి
చి త్తవీథి వీణాశ్రుతుల్ సేయఁబడియె
తివిరె నా యనురక్తి సుతీక్షణముగ. 22

తే. పొలసె జంఝానిలోద్ధతా స్ఫోటనమ్ము
మహితగర్జ శంపామేఘ మాలికాళి
చూచి, పొంది సమస్త మీశూన్య హృదయ
మునను వాసమ్ము కల్పించుకొనియె నపుడు. 23

తే. ప్రళయ జలదాళి నా కుటీరమును దరిసి
పూర్ణగర్జలఁ బైఁబడి ముట్టడించె
శుభ్ర గతి కురిసెను తమశ్చూర్ణ-మంత
నంధ తమసమ్ము క్రమ్మె నత్యధిక మగుచు. 24

తే. మహిత విద్యుల్లతా మంజు మాలికల ధ
రించి, సుస్మిత మొనర్చెడి రీతి, నాదు
స్వాంతమున ఘనరసబిందు సముదయమ్ము
నెవ్వ రాగక మరల వర్షించినారు? 25

తే. అస్మదీయ మిథ్యాజగమందు నున్న
నిత్యసుందర మోహన సత్య మీవు
మధుర కళ్యాణకలిత మీ మార్గమందు
నాకు జీవన-సంగవై యొప్పినావు. 26

తే. రజ్య దుజ్వల చిరరహోరాత్రు లెన్నొ
నమల మందాకినీ ప్రవాహమ్ము లోన
దివ్యతారామనోహర దీపికాళి
నిచ్చి యుపహారములుగ నర్చించినాను. 27

తే. గౌరవము కల్గినది ననుఁగలియు కొరకు
వచ్చితివి మత్ప్రియా! దిగివచ్చినావు
కడు నకించనత గల యే గర్వపడితి
అల్గి ఉదయ వేళ కలల నరసినాఁడ ! 28

తే. తొలుత నినుఁగని నప్పుడె సంతుషిత్త
నవ్యరాకానిశి స్మితమొనర్పసాగె,
పరఁగి నటు దీర్ఘకాల పరిచయమట్లు
నాకుఁ బొడకట్టితివి యాక్షణాన నీవు. 29

తే. శీతకరునకుఁ బూర్ణిమా సింధువునకుఁ
బరిచయవిభవ మబ్బిన పగిది తోఁచి
వచ్చి పైఁబడి యుత్తుంగ భంగములను
స్నిగ్ధ కిరణాళి సేయు నాశ్లేషణముల 30

తే. రెప్పవాల్పకా సౌందర్యలీల నెల్ల
నేను నివియె నేత్రముల దర్శించుచుంటి
నింపుగఁ బ్రతిభ యనుపాత్ర నింపితెచ్చి
సుకవి కది దానమొనరించుచుండె నపుడు. 31

తే. మాధవీ మంజు లచ్ఛాయ మసలువేళ
ఝురఝురలను నదించె నిరయఖరమువోలె
మాయలో చేతనత్వము మంత్రముగ్ధ
మైనరీతిగ ప్రవహించి యరుగు చుండె. 32

తే. ఆకురాలెడి కాల మట్లరుగుదెంచె
పుష్పవని నిల్చె శుష్కించి భూరుహములు
చివురుటాకుల క్రొంబూల సెజ్జ పరచి
వచ్చితివి పొదరింటికి న్వలచి నీవు. 33

తే. అబ్జముఖమున సమ్మోహనావకుంఠ
నము ధరించి, కొంగునను దీపమును దాచి
విమల జీవిత గోధూళివేళ వచ్చి
తపుడు పూర్ణకౌతూహలమ్మనగ నీవు. 34

తే. జలధరమ్మున సుందరశంపవోలె
శుభ్ర హ్రాదినిని చపలశోభ పగిది
అక్షియుగళిఁ గనీనిక యనఁగఁదోచి
చక్షుతారల శ్యామల ఛ్ఛవినిబోలి. 35

తే. ప్రతిమయందున ఘన సజీవతనుబోలి
నేత్రపాళిని శుభకాంతి నెలవుకొనియె
శతశతాగణితము మహాసంఖ్యయందు
భిన్నమైన రేఖగతి హృద్వీధినుండె. 36

తే. అప్పుడొప్పితి నో సుందరాంగ! నీదు
చిర తరుణిమను సౌందర్యసీమ కలదు
కాని మన్మనో నిస్సీమ గగన మందు
బొలుపు మెరయఁ గడు నిమిడిపోయినావు. 37

తే. సరగునను దేనికై యొక సర్షపముగ
యేను లావణ్యశైల మర్పించినానొ
అట్టి లావణ్య సత్కళాయతఁమనోజ్ఞ
దివ్య ముగ్ధసౌందర్య మతి ప్రియమ్ము. 38

తే. ఎవ్వ రీ విధు నీరీతి యీ వినీల
బంధ నమ్ముల నిటు కట్టుబడఁగ జేసి
రేల నిండియున్న యది వజ్రాల నిటుల
మణుల వెల్గుల వెలిజిమ్ము ఫణులమోము. 39

తే. ఆ వినీలావదాత నేత్రాళి నెంత
యౌవన ఘన ఘూర్ణ మధు మదారుణిమము !
పరమ మాఘువాసిత వజ్రపాత్ర నెవ్వ
రొదవ నింపిరి మాణిక్యమదిరతోడ ! 40

తే. అమలిన విలక్షణమగు నీలమణి నావ
తిరుగుచున్నది నేఁడీ యతృప్త జలధి
లీల లొలయ కాలాంజనరేఖ యొందు
వెలయుచున్నయది వినీల వేలవోలె. 41

తే. నీదు పక్ష్మతూలిక మహోన్మేషముననుక్షి
క్షితిజపటము నిటుల నంకితమ్మొనర్చి
యెన్ని క్షతహృదయముల కహీనచతుర
చిత్రకారిణి యౌచుఁదాఁ జెలఁగుచుండె. 42

తే. కోమల కపోలములను నిగూఢ మంజు
స్మితి సురేఖను, భ్రుకుటి వక్రతను నెవఁడు
దర్శనము సేయునో గాఢ తత్పరతను
నిలపయిని వాఁడె కౌటిల్య మెఱుఁగగలఁడు. 43

తే. ఇంపు లొలయు విద్రుమ శుక్తి సంపుటమున
నిటుల ముత్తియపుం గింజ లేల తోఁచు?
హోఘు మిది కాదు శుకమె యౌ, అరుగుదెంచె
నేల యీ ముత్యములను భక్షించుకొఱకు. 44

తే. బహు వికసిత జలజ వన వైభవమ్ము
మించెడి మధురోషస్సు నిజాంచలమునఁ
గెరలు నాహాసమును దిలకించి క్షణము
తనను నపహాస మొనరించుకొనును దానె. 45

తే. ఆననాబ్జ సమీపమ్మునందు భవ్య
పంకరుహ ముగ్ధ కిసలయ ద్వయము గలదు
శ్రవణముల యందు జలబిందు సదృశముగను
నెవరి దుఃఖము నిలచి తా నిటుల నుండె. 46

తే. ఏ యనంగుని సమ్మోహ నేద్ధ చాప
శిథిలతా ద్విగుణీకృత శింజిని యది!
అది యనంతతన్వీ సుభుజాబ్జ లతయె!
రమ్య నవ తనుచ్ఛవి సరోలహరి యౌనె? 47

తే. చంద్రికాపర్వ సుషమల జలకమాడి
చంచలాతన్వివచ్చిన సరణి నుండె
రమ్య మా పావనవపు ర్విలాసశోభ
అమరె నాలోక మధురయై అక్కజముగ. 48

తే. అయిన మోసకత్తియ దానియందె నాకు
గాఢవిశ్వాస మెదలోనఁ గలదు, అట్టి
చారు మహిత మాయా ఘనచ్ఛాయయందు
స్వయముగా నెదొ యున్నది సత్యమగుచు. 49

తే. మంజు సౌందర్య మది రూపమాత్రమగునె?
కాక అందు హృదయమును గలదె, నిండి
తానె చైతన్యమను భ్రాంతి నూని నాలొ
పరగుచున్నది యొక జడత్వంపుమాయ. 50

తే. కమ్ర యాయమ మృదులాల కములు వోలెఁ
జెదరినయవి నాదు బ్రతుకు - చిక్కులెల్ల
ఎవ్వరు మధుమదిర నాస్వదించినారు?
అస్మదీయపక్ష్మములు మూయంగఁ బడియె. 51

తే. చిక్కు పెరిగిన కొలఁది హసించు చపుడు
శాంతి యుపవిష్ట యైయుండె-స్వాదుసుఖము
పరగ బంధింపఁబడియె నా బంధనమున
విమల కరుణ మెలిగొని యవ్వేళనుండె. 52

తే. చలిత తరుదళ కిసలయశాఖ వలచి
చేయుచున్నది మంజులాశ్లేషణమ్ము
పుష్ప చుంబనము! మధుపముల విలక్ష
ణంపు తాన మారంభమైనది యెసంగి. 53

తే. స్నిగ్ధ మకరంద భారముచే నణంగి
యమలిన మురళి ముఖరిత మగుచునుండె
క్రమముగ నవ్వనధరముల్ కళికలందు
సర్వము విచ్చేసి నెలకొనె శ్రవణములను. 54

తే. శుంభ దున్మద పరిరంభ కుంభ మదిర!
బహుళ నిశ్వాస మలయజ భంగ పాళి!!
స్వాదు ముఖచంద్ర చంద్రికా జలముతోడఁ
గడిగికొని మోము లేవఁగా గడఁగుచుంటి. 55

తే. సుఖ సురజని యలసిపోవుచుండె–హృదయ
మందు ముఖకైరవాధిపు డధివసించె,
శ్రమ పృషత్కణ సదృశ నక్షత్రములతొ
నార్ద్రమైయుండె నప్పు డంబరపటమ్ము. 56

తే. అస్మదీయ మేలన నికుం జావసథము
నందు శిథిలత అలసిన యవనితలము
నా మనోహర మసృణ స్వప్నములు వోలె
నా తెరంగున నిద్దుర నంద దెపుడు? 57

తే. అలలయందున దప్పిక కలదు నిండి
అయినయది శూన్య మావర్త మనెడి పాత్ర
మానసరసమంతయుఁ గ్రోలి మమత మెరయ
నీవు పాత్రను దొర్లించినావు పిదప. 58

తే. చాలగాఁ జెదరినవి కింజల్కతతులు
అగుచునుండె నుద్ధూత మనార్ద్ర పుష్ప
ధూళి, మనసున శుష్కించి తోఁచెనపుడు
స్నిగ్ధ వికసిత స్నేహకుశే శయమ్ము. 59

తే. అమల మలయజ మృదుతరంగములు సోకి
యే కడను దాగియున్న వియ్యెడను గనఁగ
ఇటకు విచ్చేసి తిరిగి తా మేల వెడలె
నమృత మృదుకరుణా కటాక్షాంచలములు. 60

తే. కలదు విస్మృతియను, మాద కతయుఁ గలదు
మహితగతి మూర్ఛనము నిండి మానసమున
కలదు కల్పన, స్వప్నమ్ముకలదు – కలదు
నిర్జనమ్మున మురళి ధ్వనించు టచట. 61

తే. మృదుశిరీషము వజ్రమై మెలఁగు నాదు
నెదను నలిపివేసిన యది యదయవృత్తి
హిమ సుశీతలప్రేమ జ్వలించుచున్న
దనలమై యిపుడనయ మా యుల్లకమున. 62

తే. అళికులమ్ముల కనుచాటు నంది కంజ
ములు ముకుళితము లైనచో మొనయు మసక
కాంతి సంధ్యయు ప్రత్యాశ - కాన నిప్పు
డేను నొకదాని గుర్చి రోదించుచుంటి. 63

తే. ప్రణయ ముజ్వల దీపమ్ముపగిది వెలిఁగె
నెగడె మన్మానసము నవనీత మగుచు
లీలగా మిగిలిన ధూమరేఖతోడ
నిపుడు చీఁకటి నెపుడు చిత్రించుచుండె. 64

తే. నీరవము వంశి కలరుతి నిశ్చలమ్ము
నళినమున నళికులము బంధనము నొందె
ఈ ప్రగాఢ తమోమయ హృదయ సైక
తమున ప్రణయ కాళింది కదలి నదించె. 65

తే. అమితముగఁ ద్రియామాంతిమ యామవేళ
నర్థి వికసించినది కుసుమాకరమ్ము
ఆ మృదుల శిరీషకుసుమ మటుల నుదయ
కాలమున నేను ధూళిలోఁ గలసిపోతి. 66

తే. ఆ మధుర గంధమున నొంది వ్యాకులతను
దీర్ఘ విరహ తరంగిణీ తీరమందు
మందమందమ్ముగా నదె మలయజమ్ము
వెడలుచున్నది నిశ్వాస విసరములను 67

తే. చెలువు మెయిఁదోచె చుంబున చిహ్నితమ్ము
కాంత ప్రాచీసతీ హేమగండ యుగళి
చూచుచుంటి మార్గమును నే శూన్యనేత్ర
ముల నుదయకాలమున నిద్ర పోవుచుంటి. 68

తే. అర్థిమెయి నవనీ శ్యామలాంచలముల
మంజులాశ్రు పుష్కరబిందు మౌక్తికముల
నినిచి ప్రేమప్రభాతాన నేను నింగి
పయిన లఘు మేఘములవలె వచ్చినాను. 69

తే. హరిత విషపాత్ర నయనములందుఁ జేర
మదిరయై మనోజ్ఞారుణిమముల వెలిఁగె
చక్షు సుందర ముగ్ధ పక్ష్మములు నేఁడు
జీవితమ్మున ప్రణయమై చెలఁగుచుండె. 70

తే. కామనాసింధు వీచికాగతుల నొప్పి
నిత్యసౌందర్య పూర్ణిమ నిండియుండె
అస్మదీయ విధుచ్ఛాయ యమల ఫణితి
మించి రత్నాకరమ్మయి మెరయుచుండె. 71

తే. పరగి సౌందర్య యవనికా భ్యంతరమున
నిచ్చ మోహన మురళి మ్రోయించుచుండె
అపుడు ఛాయానటుండు వస్త్రాంచలమున
సంధ్య, కుహన, కౌతుకమొంది సాగిపోయె. 72

తే. వచ్చితివి మాదకత్వమ్ము పగిది నీవు
చనెడివేళ వెడలితివి సంజ్ఞవోలె
వదలి పోయిన మత్తులో వ్యాకులతను
విలపనము సేసినాడ నవ్వేళ నేను. 73

తే. అవధి నెఱుఁగనిదగు నంబరాంతరమున
బహుళ చంచల చపలవైవచ్చి వెడలి
మఘువ చాపోప మమ్మైన మహితకాంతి
వదలితివి తన్వి! బహుళముగను. 74

తే. ఆస్మృతి కుసుమ రస జలదాళి మాల
పగిది కైపున వేవేగ వచ్చెనపుడు
ఈ హృదయ విపిన కళిక యిటుల దాని
రసముచే స్మిత మొగి నొనర్పంగ సాగె. 75

తే. శిశిరకణపూరిత మ్మయి చెలఁగె నెడఁద
నీదు సమ్మోహన కుముదినీ ప్రియుండు
కడఁగి మధువర్షమటు మౌక్తికముల రాశి
నిదె మనోమందిరముపై వర్షించుచుండె. 76

తే. పావనమ్మైన నీ స్పర్శ వడసి నంత
మించి శీతసమీర మే తెంచుచుండె
అశ్రుధారల వర్షించి యంతఁబులకి
తాంతరంగోజ్జ్వలుండ నే నగుచు నుంటి. 77

తే. అమలినోపధాన నుసహాయమ్ము నొంది
యింపుగ మధుమాలతులు నిద్రించుచుండె
ఏను వ్యర్థమ్ముగాఁ బ్రతీక్షించుచపుడు
మించు గగనతారకల లెక్కించుచుంటి. 78

తే. ఏటి దాగుట నిష్ఠుర! యిది యెఱుంగ
ఎవఁడొ యుండును నావాఁడు - ఎనసె బహుళ
విరహ నిశిని బ్రత్యాశ సువిస్తృతముగ
ఉండెదము మేము - దుఃఖము నుండె నిలచి. 79

తే. శాంత మేలన సంధ్యచేఁ జారుహేమ
వాగురను మనము ధరియింపంగఁజేయు
నపుడు నీలావకుంఠన యవనిక విప్ప
తాత్త మగుట యేఁ గనఁ జాలనైతి నెఱిఁగి. 80

తే. ఎడదపై నేయగాఁ బడె నిట్టివర్ణ
మింత వదలదెంతగ వదలించుకొన్న
కెరలి మెరయు నశ్రులఁ గడిగిన కొలంది
బహు విలక్షణమై యేల పరగు నిద్ది? 81

తే. వికసిత కళామనోహర విమలమూర్తి
యగుచు నీదు కామన హృదయపటమందు
నస్మదీయాభిలాషగ నక్కజంపు
బహుళరీతులఁ జిత్రింపఁ బడుచునుండె. 82

తే. పొలుపుగఁ గరాన మణిదీపమును గ్రహించి
పథము చూపింపఁగా నీవు వచ్చినావు
కిరణ కేశపాశ ఘన వికీర్ణత నది
పావకోజ్జ్వలపుంజమై పరగుచుండె. 83

తే. అలిగిన కరుణ వీణ యత్యతిశయముగఁ
గడిఁగి మరియు నెంతయు నూర్ధ్వగామి యయ్యె
దర్పమై యుపవిష్ట యై దైన్యమపుడు
సాహసమునఁ గీడు పలుకసాగెనంత. 84

తే. క్రోలి నా తీక్షణ హృదయకుహర మదిరఁ
దృప్తి తీరఁగ – చూపుచు నిపుడు ప్రౌఢ
కింశుకారుణ నేత్రరక్తిమము వలచి
యెదియొ ప్రక్కకు మోము త్రిప్పెదవు నీవు. 85

తే. నౌక నే యలల పయిన నడిపి కర్ణ
ధారి! చేర్చితి వీశూన్యతటము కీవు
ఇట్టి నీరవవేళయం దిప్పటివర
కెవ్వ రేనియు వచ్చిరే యిటకుఁ గనఁగ. 86

తే. ఆ ఘనాంధ్యపు మలినాంచలాంతరమున
ఆదరి మరల నెటకు నే నరుగఁ గలను?
అట్టి వేదనాఛద్మమయఛల నాన
జీవిత ప్రలోభ మేదియుఁ జెలగఁబోదు. 87

తే. తిరిగివచ్చెడి మార్గాన నరయఁ బాద
చిహ్న మెయ్యది చూడ శేషింపలేదు
చాలగ మునింగె నెద మరుస్థలము నందు
పొరలి కన్నీటివాక యుప్పొంగుచుండె. 88

తే. మించి గగనశూన్యమ్ము వ్యాపించియుండె
లేదు శక్తి ఆధారమ్ము లేదు ఎటుల
యే నకించనుఁడను దీని నీద గలను?
ఒక్కకూల మెయ్యదియేని యున్నయదియొ? 89

తే. ఇదియె నా తరణి యెపు డహీనముగను
దిరుగుచున్నది ఘనతర తిమిరజలధి
ఆన నాబ్జ కరాకృష్యమాణ యగుచు
వచ్చుచున్న దుర్వీ సమీపమున కిపుడు. 90

తే. శుద్ధ ఘన సికతామయాస్తోక జలధి
నాదు మానస మనెడి యీ నావ నిప్పు
డశ్రుధారల నదియించు న ట్లొనర్చి
ప్రేమగుణహీనముగ నడిపించుచుండె. 91

తే. తరల మై ఫేని లమ్మయి తనరు నిట్టి
కడలి గరళ తతుల వెలిగ్రక్కుచుండె
తలమున జ్వలించు బాడబానలము మించి
ఎట్టి తృష్ణచే దీని మథించినావు. 92

తే. కలసి నిశ్వాసపవనము మలయజమును
సోకి ఛాయాపథమ్మును దాకి వచ్చు
అంత్యకిరణాళి వెదజల్లి యమృతకరుఁడు
తాను నియ్యెడ నయ్యెదే దాగుకొనియె. 93

తే. ఎక్కడేనియు నినుఁబొందు నెడల నేను
మెరసెదను ధూళికణమునై మించి మంజు
సౌరభముగ నెగిరిపోదు - శక్తి మెరసి
గ్రహపథమ్మును డీకొనఁ గడఁగు దేను. 94

తే. చెలఁగు నీ యాంత్రి కోన్నత జీవితమున
నట్టి ఘనశక్తి యెయ్యదియైనఁ గలదె?
నీ సజీవ మమత్వమ్ము నిత్య తేజ
మునను నిండిన యటుల మేల్కొనుచు నుండె. 95

తే. విధువు హృదయాన నిపుడుపవిష్టుఁడయ్యె
తరుణ సౌందర్యసుధ కడుధన్యమయ్యె
ఆ సుశీతల కిరణ సహాయమునను
నిప్పురవ్వలు మేయు వెన్నెల పులుంగు. 96

తే. పొంది జ్వలనమె పాథేయముగను జ్యోతి
శలభమును జేరుటకును తాఁ జనుచునుండె
తివిరి జ్వలియించునట్టి యా దీనదశను
పుష్ప సదృశముగ నది సంపుల్లమౌను. 97

తే. గగనయూధికావని తారకాళి మెరసి
విరిసె నొక జాతిగల కుంద విసర మటుల
స్వచ్ఛ శతదళమును బోలు శశివి నీవు
చేరి వాని నేలొకొ కలిసెదవు తమిని. 98

తే. కళికల లఘు జీవితపు సాకల్య ఫల మ
దెల్ల నిదియె యనుచును వచింపఁదగదు
ఇటుల మకరంద భరితమై యెసఁగుచుంట!
అన్యగత మానసులు త్రుంప నవనిఁబడుట!! 99

తే. రెండు గడియలె జీవిత ముండు – మృదుల
వృంతములలోనఁ గడచిన నేమి హాని
కలదు నీ – కిటు జీవిత కాలముననె
జారిపోవుట యౌనె నిశ్శబ్దముగను ! 100

తే. ఏను వెదజల్లితిని కోరి హృదయ కాంక్ష
లనెడి సుమనాంజలిని నీ పదాబ్జములను
పురుగువలె దీనిని తొలచిపోయవలదు
కలదు కొంత తేనియ వీని కణములందు. 101

తే. నిండిన విమోహవేళా వినీలపటము
పైనఁ గల దెదో వ్రాత యస్పష్టముగను
దాన సుఖదుఃఖమయ జీవితంపు రేఖ
యెంతగనొ వ్రాయబడియుండు వింతగతుల. 102

తే. పడుచు లేచుచు సుఖదుఃఖభరము వలన
నఖిల జగము తిరోహితమగుచునుండు
హితము నహిత మెవ్వరికిఁ బ్రాపించెననుచు
నెన్నఁ డేనియుఁ దిరిగి వీక్షింపఁబోదు. 103

తే. వెలయు మానవజీవిత వేదిపైన
జరుగు విరహమేళనముల పరిణయమ్ము
కడఁగి నటియించును సుఖదుఃఖద్వయమ్ము
కెరలు నేత్రమానసముల ఖేలనమ్ము. 104

తే. క్షణములోన నింతయు సుఖమును గ్రహించి
జీవితాంతస్థలము నుండి నీవు జారు
కొంటి వెటకొ నెమ్మదిగ – నీ కొఱకు ప్రాణు
లిపుడు వికలమ్ము లగుచు రోదించుచుండె. 105

తే. ప్రవిమలోషస్వినీ మృదు పక్ష్మములను
జెలcగి నా దుఃఖ మిటు లేల చిందుచుండు
జౌను సంధ్యామనోజ్ఞాలకాళి యందుc
జిక్కు కొన్నది నా సౌఖ్య మెక్కటిగను. 106

తే. మంజులోజ్వల మాలతీ కుంజ మందు
కౌముదియు నంధకారమ్ముc గలసి నటులc
గడcగి మనసున సౌఖ్యదుఃఖద్వయమ్ము
లీలగాc జుట్టుకొని వినిద్రించుచుండె. 107

తే. సీమ లెఱుcగని సౌఖ్యానc జెలcగి గగన
మంతయును దరంగా యిత మగుచునుండె
హసన మొనరించు పగిది ఛాయాపథాన
స్నిగ్ధతారకాతతి ప్రదర్శించుచుండె. 108

తే. ఎసcగుచుండె దుఃఖభరమునెల్ల మోయు
చున్న యట్టుల గను విశాలోర్వి, క్రింద
నవ్వసుధ నిజలవణ నేత్రాశ్రువులతొ
సరవి నింపుచుండె కరుణ సాగరమును. 109

తే. శోకభర మెద వాంఛించుచుండె ధరణి
కెరలి నింగి సుఖమును లాగికొనుచుండె
నన్నె యర్పించుకొని వాని యన్నిటికిని
నరయుచున్నాడ నిప్పుడయ్యాననమును. 110

తే. అంతరిక్షాన జలతల మందు నైన
నిముడగాలేనిదైనట్టి యింత సుఖము
వాని పిడికిళ్ల నున్నది బంది యగుచుc
బెంపుగc బడితి నాశ్వాస నంపుభ్రమను. 111

తే. చేసి చుంబన నిద్రలో – నా సుఖమ్ముఁ
గొల్లగొని పారిపోయెడు నల్లవారి
కేమి దుఃఖమున్నది? పులకించెఁదనువు
కొంచెముగ నపు డొదవె రోమాంచితమ్ము. 112

తే. బ్రతుకునందున దుఃఖమై పరగుదాని
సుఖమనుచు నుప్డు భావించుచుంటి నేను
వారిదమ్మున ప్రోదిని పగిది నుండు
జీవితమున మృత్యు వది వసించి యెపుడు. 113

తే. ఇటుల దుఃఖ తరుపలాశ మింత చలన
మొందుటనె వారి సౌఖ్య మట్లొనర నాడెఁ
వారి శృంగార మిప్పు డవ్వారిగాగ
మెరయుచుండె నా కరుణ సమ్మేళనమున. 114

తే. రెంటియెడ నుదాసీనత నుంట యెఱిఁగి
సౌఖ్యదుఃఖ మేళనమును సలుపవలయు
హాని నొందియును మమత యలిగినట్టి
వానియెడ సేయవలయు సాంత్వనమునోర్చి. 115

తే. అపరిమేయ నభముపై వ్యథాబ్దమాల
యధివసించుత–తాపాగ్ని నర్యముండు
కోరి జ్వలియింప కుండుతఁ గుముద బంధు
వుజ్జ్వలద్యుతి విన్నవో కుండు గాత !! 116

తే. ఆడు నటివలె నియతి నృత్యమ్ము–సలుపు
కందుక క్రీడ–కడఁగె నానందమునను
నినిచికొన నిజాసంతృప్త మనము నిట్టి
వ్యథిత విపుల విశ్వంభరా ప్రాంగణమున. 117

తే. జాగృతిని గని విభ్రమ చతుర మదిర
నుండి తిమిరాంతరమ్మున నుండ రమ్ము
శూన్యగేహాన వెదకినఁ జూడఁజాల
వితరమెదియు – నేఁ గాక లభింప దెదియు. 118

తే. ఇట్టి శిథిలోచ్ఛ్వసనము కర్షింప నిన్ను
వచ్చెదవు నీవు - తప్పదు - వత్తువీవు
ఏడ్చి యేడ్చి తుదకు స్వీకరింతు విప్పు
డిటుల సంవృద్ధిఁ గొన్న నా యెల్లవ్యథను. 119

తే. ఇదియె సాంధ్య సంయోగ ప్రతీక్ష యెదియొ
చెప్పిపోవుచున్నయది తోచినది - అంత
యుషసి రక్తవర్ణ నిరాశ యొప్పిదముగ
నంత మొనరించు చున్నది యఖిలకథను. 120

తే. నాదు వికల వేదన పదునాల్గు భువన
ములలో తిరిగి తా వచ్చె - ఆ ఇలలో నెచట
వెదకినను సుఖమది కనుపించలేదు
చెలఁగు నెచ్చట విశ్రాంతి జీవితమున? 121

తే. బహుళ నిశ్వాస నేత్రాశ్రు పాళిలోన
నిదియె యలసి విశ్రాంతి నిద్రించుచుండె
కోరి రోదించి నట్టి చక్షువులలోన
నిద్రయై స్వప్న మియ్యెడ నెలవుకొనియె. 122

తే. ఓ నిశీథిని! యెడలోన నున్న యిట్టి
వ్యథలగు కృతఙ్ఞములు నిద్ర నందనపుడు
వీని యతిశయోన్మాదము న్బాని బుజ్జ
గించు టౌను సుఖ కరమటంచుఁ దలఁతు. 123

తే. తరుణిరో! నందన తమాల తలమునుండి
స్పర్శరహితానుభూతివై సాగి నీవు
పరమ తంద్రా సు విహ్వల పల్లవముల
శ్యామలత గతి వ్యాపింపుమా జగాన. 124

తే. స్వప్నములలోని మల్లికా ప్రసవ సమితి
తారకాళి యై వ్యాప్తిని దనరుగాత
నిండి స్నిగ్ధమసృణ సిత నీరజముల
నీ త్రిదశలోక వాహిని నెగడుగాత! 125

తే. నీ నభోంగణ మందు వినీల శయ్య
యందు నుపవిష్టయై కరుణాబ్దమటుల
విస్తృతిని వినీల నళిన విమల రసము
కురియుమా తన్వి యెయ్యెడ కొసరి కొసరి. 126

తే. చిర విదగ్ధ దుఃఖితమైన స్థిరయిపుడును
గోరుచున్నది యాలోకసార, మిప్పు
డైన నున్మత్త యిది నిద్రనంద కణము
కణముగఁ గురియు మదియె చీఁకటిహిమమ్ము. 127

తే. ఎనసి సంప్రీతిఁ గురియు విస్తృతి సమాధి
పయినఁ గళ్యాణ మోహన వారిదమ్ము
నెగడు నాసుఖ మలసి తా నిద్రవోవు
అంత వదలిపోవును విపచ్చింత తివిరి. 128

తే. చేతనాలహరి కనదు జృంభణమును
జీవిత జలధి నిలచును స్థిరతవడసి
పరగ సర్గప్రళయ సంధ్య ప్రభవమొందు
నొదవు మరల వియోగ సంయోగములును. 129

తే. రమ్య రజనీమతల్లి నేత్రములు జార్చుఁ
బృథులముగ నిత్య మాలోక బిందువులను
అంధతామిస్ర కుహనాంగ నాళి వానిఁ
ద్రావుచుండు నిశ్శబ్దతా తంద్రతలను. 130

తే. నిన్ను సుఖ మవమానించుచున్న యట్లు
వ్యంగ్యపూరిత హాసమ్ము నాచరింప
నీవు మౌనముగ నెద రోదింప వలదు
ఇదియు పృథుపరవశతయై యెసక మెసఁగు. 131

తే. ఏల నీదు కన్నీటి దోయిలిని నేత్ర
యుగళినె నినిచి యిటు త్రావుచుంటి వీవు?
గగనతారకలు పతన కాలమందు
వెలసి యుజ్జ్వల ఫణితి జీవించుచుండు. 132

తే. ఆ విమలహాసమును నిట్టి యశ్రువులను
గనక సురుచిర గతులతోఁ గలియనిమ్ము
అర్థి రానిమ్ము నవ్య వర్షాగమమును
చెలఁగఁ గళికలన్నియు వికసింపనిమ్ము. 133

తే. అఖిల జగతీఘనోన్నిద్ర వ్యథలయందుఁ
గణకణమునుండి యేరుకోఁ గడఁగుమీవు
చారు సమ్మోహన జనరంజక కథాళిఁ
జెప్పికొనుటకు మిగులుచుఁ జెలఁగనిమ్ము. 134

తే. అతి వినీల మంజుల త్రియామాంచలమున
నలసి శీతకరుఁడు నిద్రనందు వేళఁ
జరమగిరి లోయవంకకు నరిగి యంత
దినకరుండును గనఁగ సద్దృశ్యుఁడయ్యె. 135

తే. రమ్య జలద మనోజ్ఞ కారాగృహాన
హ్రాదినీ లత తా బందియైన యపుడు
స్వర్గ గంగాస్రవంతి నక్షత్రపాళి
మునిఁగిపోవుచునుండె నపూర్వముగను. 136

తే. అయ్యెడను దాల్చి మణిదీప మనెడి విశ్వ
మందిరపు కిరణ మసృణమాల నాదు
జ్వాల లౌ నీవు తన్విరో! పరగి యొంట
రిగ జ్వలించుచు నున్నావు క్రీడ మెరసి. 137

తే. లీల నుత్తాల జలనిధి వేల లందు
నెత్తికొని శిరశ్శైల మునెసఁగి, అర్థి
మెయిని నిస్తబ్ధ గగన భూమీతలాన
బహుళ హృదయాగ్ని నొగిగ గుప్తమ్మొనర్చి. 138

తే. నియతి సంకేతమును బొంది నిండుతమము
లోన బ్రతుకును జిక్కుల నూనఁ జేసి
చంచలోజ్జ్వల చికుర పాశమును విప్పి
గహనగుహయందు నిద్రలో గడపువేళ. 139

తే. రజ్య దుదయ మౌనట్టి జ్వాలాముఖమ్ము
అట్టి జగతీవ్యథా మంజులాంగి – నాదు
జ్వాల వగు నీవు – మరువక సతత మప్పు
డొప్పి యొంటివై జ్వలియించుచుంటి వోసి! 140

తే. ఉంటివి వ్యథిత విశ్వమహోజ్వల మృదు
హోళికోత్సవ మట్లుగా నొప్పి నీవు
అరుణరో! సదా య్యెదువయైన మాన
వత్వ సీమంత సిందూర భాగ్య మీవు. 141

తే. కలుష మీ సకలమును దగ్ధమ్మొనర్చి
స్వాదు జీవిత మంజుల జలధియందు
పావనోజ్జ్వల బాడబజ్వాల వోలె
ననల తన్విగ జ్వలియింపు మవని నీవు. 142

తే. విశద సౌరభమయి! ఓసి విజయమాల!
అస్మదీయ మంజుజ్వాల!! ఆర్ద్ర కిరణ
కేసరరజాన నింపుమా, కెరలి భవము
బహుళ జగతీ ద్వయమహిత పరిణయమ్ము. 143

తే. చెలియ! నీ వెల్గులోఁ దోచు చేతనత – అ
మేయ వేదనామయి యౌ సమిద్ధ జగము
పొంది కరుణప్రకాశము పొల్పుమెరయ
ననయమును నా సమీపము కరుగుదెంచు. 144

తే. అందు నస్పష్టమైన ఛాయలు తమ పరి
చయము నిచ్చుచునున్నవి స్వాదువులయి
మొనసి చెల్లించి రోదన మూల్య మర్థి
నిపుడు సర్వస్వమును గ్రహియించు చుండె !! 145

తే. ఇటుల జ్వలియించు మామక హృదయ శీత
లోజ్జ్వల జ్వాల! ఈగతి నొలసి నిర్మ
మత్వమున నున్న జగతికి మహిత! ఇంక
వెలయు నీ శుభకాంతి లభించుగాక !! 146

తే. జీవితము దేని ముందట శింజనీ యు
తమ్మొనర్చుచును పులకి తమ్మునొందు
మృత్యు వు నటన మొగి నాచరించుచుండు
నిర్జరత్వము నవ్వుచు నిలచియుండు. 147

తే. అట్టి నా ప్రణయమ! మదీయ మధువనము
నందు మేల్కొనుము విమల హాసనములను
చెలఁగి మరల ఈ నా శుష్క జీవితమునఁ
గలుగుఁగాక మధురభావ కలవరమ్ము. 148

తే. ఇంపుగఁ జిరు నవ్వులను నిద్రించుదాన!
అధరముల నవ్వుచును నవ్వ చక్షియుగళి
మించి యెవ్వేళఁగనఁగ దుఃఖించుదాన!
కోరి నాదునూర్పులను మేల్కొనుము నీవు. 149

తే. స్వప్నమయమైన యీ సృష్టి సత్య జీవి
తమగు, నీవు మేల్కొన గదె సుమమనోజ్ఞ
మంగళ కిరణ రంజిత! మామక మధు
రోజ్జ్వల తమమ! జాగృతి నొందు మీవు! 150

తే. అభిలషణ మానసమ్మున నబ్జనేత్ర
ములను తెరువుమ! మధుపకులమ్ముల రుతి
వలను దోఁచు మధురవమ! కలరవాల
మరల నొక కొంత పలుకఁగా మనుసుపడుము. 151

తే. ఆ యభిలషణ శూన్య నేత్రాంచలమ్ము
వ్యాప్తినొందుచునున్న దత్యంతముగను
ఇట, మరల, క్రింద చాంపేయ సృష్టివోలె
చంచల కరుణలోన వసించుగాక ! 152

తే. ఓ మధుర సంస్మృతీపుల కోద్గమమ్మ!
మేల్కొనుము, నీదు యౌవనామృత మృదుసుమ
కాననాంతర వీథులలోన మరల
నమలిన మకరం దోద్గమ మగునుగాక !! 153

తే. లలి జగము నభరిక్త పాత్రను గ్రహించి
మరల నరుణిమ నొందcగా మనసువడుచు
నర్థినీకడ కేతెంచి అమృత! నిన్ను
కొన్ని మధుబిందువుల్ తమిcగోరుగాక ! 154

తే. గాఢతమ తమఃకాంతి సంఘర్షణముల
నా నవజ్యోతి విజయిని యగును–ఎలమి
నీ మనజగ మెల్లయెడ హసించు–చెలిమి
స్నిగ్ధ మౌక్తిక వితతి వర్షించునంత. 155

తే. అమలి నోషస్వినిని రమ్య ప్రాక్సతీ శు
భారుణ ముకురాంతరమున నర్థి నాదు
నయన తారకలైన నీ నవ్యముగ్ధ
సుందర ప్రతిబింబమ్ముc జూచుకొందు. 156

తే. ఆకృతిని లీనమై కొన్ని యమలరేఖ
లొదవుc గావుత! అయ్యెడ నొక్క దర్శ
నమ్ము కలుగు! అద్ది విశద నవ్యతలతొ
నెంత మధుమయ రచనయై యింపు లొలయు? 157

తే. తమిని తన్వీ నిసర్గ సౌందర్య మెందు
గర్వరేఖ లొలయc దిరుగాడుచుండు
ఎందు శిశుహృదయ మనోజ్ఞ మందిరమున
చెలcగు నిర్మలతయె తోచి చిందులాడు. 158

తే. అట్టి ముఖము నయననిధి యగునుగాక!
అగునుగా కవకుంఠన మసిత నభము
నా శిథిల హృదయము గగనముగcదానె
విస్తరించు గావుత ఘన విభవమునను. 159

తే. నాదు మానసార్చన భావనా ప్రతీక
యరయ నెవ్వేళ సవిచల మగును గాక!
అతులి తామ్లాన తపనీయ శతదళమున
నెలమి యౌవన మధువు నందించుగాక !! 160

తే. జీవితసకల కల్పనా స్నిగ్ధతలను
నేత్రతారా కిరణ రుచి నిచయములను,
బహుతరాలోక మంజు ప్రవాహమునకు
నెలమి ప్రతినిధిగ నభిషేకించుగాక! 161

తే. అఖిల మీ వేదన మధుర మౌను గాక!
నా దయారహితమగు తన్మయత నేఁడు
గాటముగ నెదతోడఁ దాఁ గలయుగాక!
నేనును సహృదయతను పొందెదను గాక!! 162

తే. నా అనామసంగిని! ..కలకఠోర
కోమలత! ఇరువుర మెదఁగోరి జీవి
తాధ్వమున పయనించు చనంతకాల
హృదయ సఖులమై యుండిపోవుదము చెలియ! 163

తే. ఎన్ని యా తారకలరాత్రు – లెన్నిదివము
లెన్ని గడియలు – మదినెపుడెన్నరాని
యట్టి మోహరహిత సమయ వలయమ్ము
లెన్ని విస్మృతిని గడచి యేగినవియొ! 164

తే. మానసోద్వేల్లిత తరల మహిత వీచి
కాళి తాను తిరిగిరాదు – జౌను ఆయ
నంతకోణమును దరిసి స్నానమొనర
నది నిజమ్ముగఁ జేయించి యరుగుదెంచు. 165

తే. నేత్రముల కోణముల దేనిని దమిఁదాకి
నింపుకొని తెచ్చు నిర్మల నీర చయము
నట్టి చలువకై దప్పి గొన్నట్టి దీన
భావ కరుణార్ద్ర రసపత్ర పాత్రలగును. 166

తే. పొలసి యెయ్యవి నిద్రించుఁ బులకి తమ్ము
లైన యట్టి సుఖచ్ఛాయలందు మసృణ
ములయి ఆ హృదయోచ్ఛ్వాసములు కడంగి
మరల మేల్కొను నామధు మాయ యందు. 167

తే. తడిసి కన్నీటిజడి వానఁదటము లప్పు
డభయములు, హరితమ్ములై యలరుగాక!
ఆ శరత్ప్రసన్న తటిని నమల జీవ
నద్రవము నిండియుండుత నవనవముగ. 168

తే. ఆ సరిత్కూలతటమున నర్థి నెవ్వ
రెచట నిల్చిన సముఖాన నిద్ధ చంద్ర
తరళ కాంతిచ్ఛటా మహిత పథమె కనఁ
గలరు–అన్య మెయ్యదియును గానఁబడదు. 169

తే. అటులనే యిట్టి జాగృతి యమరి తనదు
నుజ్జ్వలతలఁ బ్రసాదించి యుచితరీతి
నిట్టి లఘు బిందువులతోడ నెల్ల పంకి
లమును హరియించి తానె నిర్మలత నొసఁగు. 170

తే. శుభ్ర మీ లఘు మౌక్తిక శుక్తియందు
కదలి క్రీడించు తెఱఁగునఁ గానఁబడును
తోచు నీ కరుణార్ద్ర బిందువులలోన
నమలినానంద మదె చిందులాడు నటుల. 171

తే. వెలయుచెపుడు మదీయ జీవితపయోధి
ఆంధ్యమునను తరంగిత మగునుగాక!
అఖిలమున త్వదీయమెయైన యమృతకాంతి
పరగి మెరయుత నింగి దీపమ్ము పగిది. 172

తే. మానస వ్యథలెన్ని యీ మహిని గలవొ
అన్నియును గప్పికొని మోము నున్నవి పడి
ప్రసవముల పోల్కి నయ్యవి లలిత ఖేల
నములొనర్చుచు చిలిపిగ నవ్వుగాక ! 173

తే. లీలలొలయు నీ కోమలాలింగనమ్ము
అమరవల్లరి – అది వ్యాప్తినందుగాక!
ప్రౌఢ మై వెలయు ధమని బంధనమున
నుండ కుండుత జీవిత మొంటి యగుచు. 174

తే. అఖిల సంసృతి దుఃఖమ్ములందు జన్మ
జన్మలను జీవితము నాకు సహచరియగు
అర్థి పావనప్రత్యూష మగునుగాక !
అలస సుఖమున మేల్కొల్పు లగుత నీకు !! 175

తే. జగదపావన కలుషము సర్వ మింక
నీదు వైదగ్ధ్యమును బొంది నెగడుగాత !
ఇలను మరల నిర్మలత శోభిల్లుగాత !!
ఇట్టి పాపము పుణ్యమై యెసఁగుఁగాత !! 176

తే. స్వప్నముల సుఖచ్ఛాయలో సంసృతి కడు
గాఢ తంద్రాలసమ్మయి కడఁగు వేళ
నిటుల జాగృతవై వచ్చి తెవర వీవు?
మించి నామది నున్న విస్మృతివె నీవు? 177

తే. ఔను నీవు దానివె-మామ కాత్త దుఃఖ
పూరిత విదగ్ధ హృదయాన పుట్టి యెపుడు
నెగడు చిరజీవిత సుసంగినివె యగుదువు
శుభ్రవేదనా! ఓసి అశ్రుమయ వర్ణ !! 178

తే. స్వైర కుట్మల కిసలయచ్ఛలములోన
నేను మరచిపోయినపుడు నిన్ను, నీవు
విమల కుహుకుహూ నిస్వన వేదనముగ
వచ్చితివి రంగభూమికి వనిత ! నీవు. 179

తే. తెలియఁగాఁ జెప్పు మెదను సందేహపడకు
శూన్య గగనాన నీవేమి చూచినావు ?
నెలఁత! రజనీ మనోహర నిర్జనమున
పథము నెంత నీవు నడచివచ్చినావు. 180

తే. స్వప్నకల్పన చణబుక్ష సముదయముల
అభినయపు మాయ సాగెడు నపుడు సౌఖ్య
హృదయకోణమందున తిమిరేద్ధ నీల
కాంతి పర్వి యంతటట దానిఁ గప్పుచుండె. 181

తే. తన్వి! మానసకుముద రోదనమును గని
యపుడు శశికరమ్ములు నవ్వు చతిశయమున
మంజు మోహన మకరంద మౌక్తికముల
సొగసులను గ్రుచ్చు టీ వాగి చూచినావు. 182

తే. వామ నమ్మైన జలనిధి వలచి శశిని
తాకవలె నను నాశతోఁ దనరుచుంట
నంత హాహారవమ్ముల నాచరించు
చెగిరి యెగిరిపడుటను దర్శించినావు. 183

తే. అటుల నోటిని కుట్టేసి యాత్మశావ
తావ కీలల బహుయుగతతుల నుండి
యెరిగి చిరమౌనమున సహియించుచున్న
శుభ్రశైలమాలల నీవు చూచినావు. 184

తే. శ్యామలమ్మైన యొక వనస్పతి యెదైన
వేని పయి మొల్వ జాలదో, వేని కెప్పు
డబ్బక జనపద స్పర్శ యమిత శప్త
ములనుచు జనులు చెప్పగ మెలగుఁచుండు. 185

తే. ఆ కపటకథను వినుచు నతిశయముగ
నున్ముఖములైన కళికల నోపి చూచి
నావు, ఇచ్చవచ్చినటు సంచరణసేసి
యెగిరిపోవు తుమ్మెదల నీక్షించినావు. 186

తే. మరల నేత్రజలము లెండి చిరము వంచి
తమ్ములై, ఆకలిని గొని దారుణమగు
నా నిరాశాభరిత నయనాళి గొన్న
ఘనతర ప్రళయదశను గాంచినావు. 187

తే. ఈవు చూచితివి కడు శుష్కించి యున్న
యా నదీశయ్యను, వసుంధరార్ద్ర కరుణ
కథను, కూలములను తాను ఘనతరముగ
లీనమౌటను రాజ్ఞి! దర్శించినావు. 188

తే. శూన్యమైన కుటీరంపు శుభ్రకోణ
మందు నిశియెల్ల వలచి స్నేహాభరితముగ
ను లఘుదీపిక జ్వలియించు టలఘుగతిని
నెగసి మరల యారుటను వీక్షించినావు. 189

తే. ఈ సకలముల రసము గ్రహించి నీవు
స్నిగ్ధ సుఖముచే మివుల శుష్కించి యున్న
జీవితమున విశ్వసదన సీమ నుషసి
హిమకణమటు నశ్రువుల వర్షింపు మువిద. 190

శ్రీ శారదామూర్తి

"హరికథా పితామహు"లకు

సమర్పితాలైన

# ఉపాయనలు

**అంకితము**

మహావిద్వాంసులు, పుణ్యమూర్తులు, గురుతుల్యులు

ఆప్తమిత్రులు, స్వర్గీయులు

**శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రి మహాశయులకు**

"యాదేవీ సర్వభూతేషు స్వరరూపేణ సంస్థితా

నమస్తస్యై సరస్వత్యై నమస్తస్యై నమోనమః!

# శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస ప్రశంస

సీ॥ అభ్రగంగాపగాశుభ్ర శీతలధార కుపమ నీకవితయొక్కొక్క చోట
ప్రావృట్పయోధర ప్రబలగర్జనభాతి గంభీరమౌచునే కవితవెల్గు
మందారమకరంద మత్తషట్పదగీతి సదృశ మెవ్వని పదజాలమొప్పు
వాణీసతీమంజు వీణాస్వనద్గీతి వలెనే మహామహు వాణివెలయు

తే॥గీ॥ అష్టభాషావిశారదుడయ్యె నెవడు?
"హరికథా పితామహుడంచు" బరగె నెవడు
అట్టి శ్రీ ఆదిభట్ల వంశాబ్ధి చంద్రు
మాన్య, నారాయణాఖ్యు, నమస్కరింతు.

ఉ॥ కాలికి గండపెండెరము, కంఠమునందు సువర్ణహారమున్
వ్రేళ్లకునుంగరంబులును, వీరరసంబునుజూపు మీసముల్
ఫాలమునందుబొట్టు, తలపాగయునొప్పగ, కంకణంబులం
దాలిచియున్న పూజ్యు హరిదాస శిఖామణి సన్నుతించెదన్.

తే॥గీ॥ సకలశాస్త్రంబులనియెడి సాగరాన
గలజలముద్రాగినట్టి యగస్త్యుడితడు
సకల హరిదాస జీవనాధార మితడు
ధాత్రి "పుంభావవాణి" యీ దాసుగారు.

మ॥ ధరనారాయణ పాదపద్మ మకరందాస్వాదనానంద సం
భరితాంతః కరణుండు, భవ్యకవితాపారీణుడున్, విప్రశే
ఖరుడున్, యోద్ధ, మహర్షి, సర్వలోకస్తుత్య సామ్రాట్టు శ్రీ
వరనారాయణదాసవర్యుగొలుతున్, వాణీస్వరూపున్, మదిన్.

తే॥గీ॥ పండితులందు నుద్దండపండితుండు
విశ్వవిఖ్యాతచరితుడై, విజయనగర
వాసియై, వైణికుండునై వాసిగాంచు
హరికథాతాపితామహుడగు గురుని దలతు ॥

రచయిత, కవిశేఖర, భాషాప్రవీణ
**పంతుల సూర్యప్రకాశరావు,**
రిటైర్డు–తెలుగు పండితుడు
చాపర–శ్రీకాకుళం జిల్లా–23-3-91

# "ఉపాయనలు" కావ్య ముద్రణద్రవ్య ప్రదాత

**-శ్రీ కూనిశెట్టి ఆత్మానందం**

## ప్రశంసా దశకం

"మద్దివా" రల్లుడవు  అత్యమంద బుద్ధి
విద్య లార్జించి "ఆనంద"! విమల చరిత !!
పేరు ప్రఖ్యాతులను పొంది పిన్ననాడె
ఆర్యవైశ్య శిఖామణి వైతి వీవు.

నీవు "భారత వాణిజ్య నిలయ" మునకు +
రెండు మారులు పెద్దవై యుండునపుడు
పాలనా దక్షతన దాని బాగుపరచి
నడుపుటే సాక్షి విన్నాణ విజయములకు.

సరస మోహన రమణీయ సరణి నడుప
నీ కలంజ + వాణిజ్యమ్ము నిస్తులముగ
పెరిగి యొనరించె చిన్ని కుబేరు నిన్ను
గుప్తదాతవు ఎందరి కోరికలకొ !

సజ్జనుండవు "ఆనంద", సదయహృదయ !!
వ్యసన రహితత, పరమ దుర్వారశక్తి,
స్వేచ్ఛ, ప్రజల క్షేమమ్ము వాంఛింతు వీవు
ప్రౌఢ సాహిత్యవరు లన్న భక్తి నీకు.

ఆ రసాయనశాస్త్ర విద్యాధికుడవు[1]
అయ్యు వ్యాపారరంగ మధ్యమ్ము నుందు

---

"ఇండియా కామర్సు ఇన్సిస్టూట్" + పొగాకు వ్యాపారము  కలంజము= (ధూమపత్రానికి) పొగాకుకు పురాతనకాలంలో ఉపయోగించిన సంస్కృత పదము - చూ. భార.

1. ఆంధ్రవిశ్వవిద్యాలయ కెమిస్ట్రీ, ఎం.యస్.సి. పరమ పట్టభద్రుడు.

ధ్రువుని[2] పోలిక వెల్గొందు తొలిదినాల
యందె మిత్రుల మైతి మత్యంత రక్తి.

గొప్పకవి "వావిలాల"ను "కూనిశెట్టి"
గౌరవించెడు శిష్యత, గాఢ శ్రద్ధ
నీ "ఉపాయన" ముద్రణ కీ వొసంగు
నీ సహాయము నాకు సంతృప్తి నొసగె

నీవు పట్టాభిపురమున నెగడి యున్న[3]
సత్యనారాయణ స్వామి సదనమందు
వరలు నగరాజ పుత్రి పార్వతిని ప్రీతి
దత్తు గొంటివి దేవతా ధర్మకార్య.

కీర్తి నిష్కాముడవు నీవు కెరలు కాంక్ష
భాజనల, పాత్రలను సమర్పణము చేసి,
నగల, వసనాల సమ్మోహనగ నొనర్చి,
అర్చ నాదుల జరిపింతు వమ్మ కీవు.

మాఘ పూర్ణిమ న్నీవు సుమాన్య గతుల
భావ వైభవ సంపత్తి, ప్రగతి భక్తి
అంబ పార్వతీ దేవి కళ్యాణ కృతిని
సలుపు టీక్షింత్రు శంకర స్వామి సతులు -

కనకదుర్గాంబ, భ్రమరాంబ, కాశిలోన
'వజ్రభైసిక' హస్తాన వరలు తల్లి,
అందరకు భుక్తి నిచ్చు నా అన్నపూర్ణ
పరమ శుభములు నీకు సంప్రాప్తమౌను.

2-14-130/2,
శ్యామలానగరం
గుంటూరు-522006 (ఏ.పి.)

**కర్రా ఈశ్వరరావు,**
శ్రీ "హరికథా పితామహ"
సామాన్య ప్రచారక మాననీయుడు

---

2. ఉత్తర దిశన ఉండే సుస్థిర నక్షత్రము (పోల్‌స్టార్) పౌరాణికము
3. అబ రవీంద్ర నగరమున నధివసించు - పాఠాంతరము.

---

వజ్ర భైసిక - కాశీ అన్నపూర్ణాదేవి హస్తాన ఉన్న గరిటె (దర్వి, చమవం)ను మనపూర్వులు 'వజ్రభైసిక' అని నామకరణచేసి వ్యవహరించారు. -చూ. మల్లంపల్లి వ్యాసాలు.

# ప్రస్తావన

ఇయ్యది "మధురకవి", "కుమార ధూర్జటి", శ్రీ వావిలాల సోమయాజులుగారు, శ్రీ "శారదావతారమూర్తులు", "హరికథా పితామహులు", శ్రీమ దజ్జాడాదిభట్ట నారాయణదాస మహోదయులకు సమర్పించిన "ఉపాయనాలు" అను నృత్య, గేయ ప్రబంధము.

శ్రీ వావిలాలవారు విమర్శకాగ్రేసరులు, గురుతుల్యులు, ఆప్తమిత్రులు, నేను 1967లో గుంటూరు వచ్చినప్పటినుండి, ఆచార్య ఎస్.వి. జోగారావుగారు, మహావిద్వాంసులు, గురువులు, స్వర్గీయులు అయిన శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగార్ల ద్వారా, సోమయాజులుగారు నాకు చాలసన్నిహితులైనారు. నేను దాసభారతీ ప్రచురణల మహాయజ్ఞములో, శ్రీ జోగారాయ మహాకవి, పర్యవేక్షణలో, వెలువరించిన 25 పుస్తకప్రచురణలలో, వావిలాలవారి చేయి కూడ వుంది. ముఖ్యంగా, శ్రీ నారాయణదాసు గారి "నా యెఱుక" అను గ్రంథమునకు సోమయాజులుగారు చక్కని పీఠిక, సోదాహరణముగా, చక్కని ఉపపత్తులతో వ్రాయగా, అది శ్రీ జోగారావుగారి "ఆదిభట్ట నారాయణదాస సారస్వత నీరాజము" అను బృహద్గ్రంథములో వ్యాసముగా ప్రచురింపబడినది. నేను, అప్పుడప్పుడు, వావిలాలవారు అస్వస్థులుగా నున్నపుడు, నీలకంఠ శాస్త్రి గారితో వారింటికి వెళ్ళడము, వారి సాహిత్య సమాలోకనము వినడము తటస్థ పడేది. శ్రీశాస్త్రిగారు కూడ దాస భారతీ గ్రంథములకు, అనేక పర్యాయములు పీఠికలు, వ్యాసములు (సంస్కృతములో, తెలుగులో) వ్రాసి ఆ గ్రంథములు పటుత్వమునకు దోహదము చేసిరి. శాస్త్రిగారి నిర్యాణము తరువాత గూడ వావిలాలవారి యోగక్షేమములు తెలుసుకొనుటకై వారింటికి వెళ్ళడము జరిగేది. అప్పుడు వారంతట వారు "మీరు ప్రచురించే గ్రంథములకు నా సహాయము కావలె నన్న నేను తప్పక సహకరించెదను" అని చెప్పేవారు.

అలాగే, వారి ప్రోద్బలము, ప్రోత్సాహమే హేతువులుగా ఇటీవల శ్రీ నారాయణదాసు గారి "స్వయంలేఖనము" అనేక ప్రముఖుల అభిప్రాయములతో ప్రచురించడం జరిగింది. 17 సంవత్సరములు వెలుగుచూడని "ఈ గ్రంథము, వీరు

చూసి అచ్చు వేయవచ్చును" అని అభిప్రాయము వెల్లడిచేసినదే తడవుగా దాని ముద్రణము ప్రారంభించి క్రిందటి సంవత్సరమే పూర్తి చేయబడినది. ఆ సందర్భములో వావిలాలవారు గూడ వ్యాసము వ్రాయ సంకల్పించి, చివరకు 'గేయ' రూపకంగా వ్రాయుటకు నిశ్చయించిరి. నేను అచ్చువేస్తున్న ప్రతి ఫారము వారికి ఇవ్వడము, వారు వాటిలోని విషయములు సేకరించి గేయంలో నిబద్ధం చేయడం జరుగుతుండేది. అలాగ వ్రాస్తూ, వ్రాస్తూ ఈ "ఉపాయనాలు" చాలా పెద్ద గ్రంథమై అచ్చులో 70 పేజీలు ఆక్రమించినది. అందువలన, వారి అనుమతితో "స్వయంలేఖన" గ్రంథములో 8 పేజీలు మాత్రమే వేయుదును – తరువాత సావకాశముగా దీనిని వేరే పుస్తకముగా ప్రచురించెదను" అని చెప్పగా వారు సరేననిరి. ఇది, ఈ గేయప్రబంధము యొక్క ఆవిర్భావ స్వరూపము. వారు దానికి సంబంధించిన మాత్రా ఛందస్సులో, నృత్యాభినయముకు అనుకూలముగా ఈ గేయము సాగినది. ఈ వినూత్నమైన ప్రక్రియ ద్వారా ''దాసభారతి''కి వన్నె తెచ్చినందుకు వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పించుకుంటున్నాను.

అనుకోకుండా, వెల్‌కమ్ ప్రెస్‌లో తరచు శ్రీ వట్టిపల్లి మల్లినాథ శర్మగారిని కలుసుకోవడం తటస్థపడేది. నేనూ, వారు ఇంచుమించు ప్రతిరోజు, ప్రెస్‌లో ప్రూఫులు దిద్దుకొనుటకు కలుస్తూ ఉండేవారము. "స్వయంలేఖనం" అచ్చు అవుతున్నపుడు వారిని కూడ, అది చదివి అభిప్రాయమును వ్రాయవలసినదిగా కోరగా, వారు చదివి చక్కని వ్యాసము వ్రాసిఇచ్చిరి. తదుపరి వారికి గూడ ఆటోరైటింగ్‌లో ప్రవేశమున్నదని తెలుసుకొని ఆ సాహిత్య ప్రక్రియ మీద కూడ వ్యాసము వ్రాయమనగా రెండవ వ్యాసము వ్రాసిరి. ఇవి రెండు "స్వయంలేఖనం"లో ప్రచురిత మయేయి. ఆ సమయములో వావిలాల వారి "ఉపాయన"లు ఫెయిర్‌చేసి నాకు అందించగా అది వట్టిపల్లి వారికి చూపి దాని మీద వారి అభిప్రాయము కోరగా "దిక్సూచి" అని పేరుపెట్టి ఒక విపులమైన వ్యాసమును వావిలాలవారి గ్రంథమునకు అనుబంధుగా ఉండేటట్టు అనేక విషయములు ప్రస్తావిస్తూ వ్రాసిరి. అది అసలు గ్రంథమును విశదీకరించేదిగా వ్యాఖ్యానముగా ఉన్నందువల్ల పాఠకుల ఉపయోగార్థం గ్రంథములో పాటు వెనుకను అచ్చు వేయడం జరిగినది. ఈ వ్యాసము అసలు గ్రంథమునకు వన్నె తెచ్చినది. శ్రీ వావిలాలవారు అది చదివి బ్రహ్మానందభరితులైనారు. శ్రీ వట్టిపల్లి వారు, పాఠకులకు ఉపయోగపడేటట్టు చక్కని, చిక్కని వ్యాసము అనేక ప్రమాణములతో వ్రాసి మాకు ఇవ్వడం ఈ గ్రంథమునకు భూషణమువలె ప్రకాశించినది. వారికి నా నమస్సుమనస్సులు.

ఇంకొక విశేషం – శ్రీ వావిలాలవారికి, వట్టిపల్లి వారికీ, నాకునూ అత్యంత సన్నిహితులు, ఆప్తమిత్రులు, హితులు, పరమపూజ్యులు, సత్యధర్మ రతులు, ఉపనిషద్మార్గ ప్రవర్తకులు అయిన బ్రహ్మశ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రి గారికి ఈ కృతిని అంకితము చేయటం చాలా సముచితంగా ఉంది. శ్రీ నారాయణదాస అభిమానులు, దాసభారతీ సేవలో అనేక సూచనలిచ్చి, వ్యాసములు వ్రాసి మమ్ముల నందరను ముందుకు నడిపించి ప్రోత్సహించిన మహనీయులు శ్రీ శాస్త్రి గారు. అట్టివారికి ఈ కృతిని అంకితము చేయవలెనన్న కోరిక శ్రీ వావిలాల వారికి కలగడం చాల ముదావహమైన విషయము.

ఇక, శ్రీ నారాయణదాస సాహిత్యమును ఆపోశనపట్టి, ఆచార్య జోగారావుగారి వద్ద శుశ్రూష చేసి వారి పిహెచ్.డి. కొరకై శ్రీ నారాయణదాస వైభవమును అనేక కోణములనుండి దర్శించి "శ్రీనారాయణదాస దర్శనము" అని ఒక పరిశోధన గ్రంథమును, ఏ విషయము వదలక ప్రచురించిన, సాహితీ పోషకులు శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణగారు శ్రీ వావిలాల వారి "ఉపాయనలు" మీద అభిప్రాయము వ్రాయవలెనని పట్టుబట్టగా, వారు అనేక కార్యభార వ్యగ్రులై ఉన్నప్పటికిని వారి వ్యాసమును మాకు అందజేసి నందుకు వారికి కూడ సాంజలి బద్ధుడనై నా ధన్యవాదములు సమర్పించుకొనుచున్నాను.

అలాగే, శ్రీ నారాయణదాస స్వరూపమును, ఆకలింపు చేసుకొని, వారికి ఒక విధముగా భక్తులు అనిచెప్పుకోదగిన వ్యక్తి "సాహిత్య సార్వభౌములు", "వ్యాకరణ ప్రవీణులు", "విమర్శకాగ్రేశ్వరులు" నాకు ఆప్తమిత్రులు, అయిన శ్రీ కోగంటి వారిని, వారి అభిప్రాయ మిమ్మని కోరగా వెంటనే మాకు వారి వ్యాసము వ్రాసి ఇచ్చి నందుకు నా సంతోషమును వ్యక్తముచేస్తూ వారికి నా ప్రణామములు అర్పిస్తున్నాను.

చివరకు, "మహానటులు," పద్యములు చక్కని రాగములతో పాడగల సమర్థులు "సాహితీ ప్రియంభావుకులు", ఉపాధ్యాయవృత్తి నుండి ఇటీవలనే విరమించి విముక్తుడై విశ్రాంతి తీసుకొనుచున్న శ్రీ అన్నపర్తి సీతారామాంజనేయులుగారు కూడ వారి అభిప్రాయమును ఇచ్చి, ఈ గేయ ప్రబంధమునకు వన్నె తెచ్చిరి, వారికి నా నమస్కారములు.

ఇక చివరి మాట – నేను దాసభారతీ ప్రచురణలకు నా ధనమును వ్యయపరచి అనేక పుస్తకములు శ్రీ జోగారాయ మహాకవి సహకారంతో వెలుగులోకి తేగలిగితిని. ఈ "ఉపాయనల" ముద్రణ భారము వహించడం ఎలాగ అని ఆలోచిస్తూ వుంటే, నా

స్మృతిపథంలో ఒక వెలుగు వెలిగినట్టుగా, నాకు అత్యంత సన్నిహితుడు, ప్రియమిత్రుడు, అయిన ఒక వణిక్ప్రముఖుడు మెరిసినాడు. ఆయన హిందూకళాశాలలో శ్రీ వావిలాలవారి శిష్యులు, భక్తులు, వారి ఉపన్యాసధోరణికి ముగ్ధులై, నాతో పదేపదే చెప్పుతుండేవారు. వారిని కోరగా అలాగే అని దీని ముద్రణభారము వహించి నా పనిని తేలిక చేసినందుకు వారికి నా కృతజ్ఞత తెలియచేయు చున్నాను.

ఈవిధంగా ఇంతమంది సహకారంతో ఈ గేయ ప్రబంధం వెలువడి, దాసభారతికి, సాహిత్య సరస్వతికి తలలో ఒక పుష్పముగా వెలుగొంది, పాఠకులు దీనిని ఆదరించి స్వీకరిస్తా రని నమ్ముతూ ఈ ప్రస్తావన ఇంతటితో ముగిస్తున్నాను.

బుధజన విధేయుడు

**కజ్జా ఈశ్వరరావు**

(దాసభారతీ ప్రచురణ కర్త)

# గీతాంజలి

'మహావిద్వాంసులు', 'సంస్కృతాంధ్రకవీంద్రులు
'పరమపౌరాణికులు'
**శ్రీ కోగంటి సీతారామాచార్యులు**

"కుమార ధూర్జటి" శ్రీ వావిలాల సోమయాజులుగారు "ఉపాయనలు" అనే ఒక గీతమాలికా రూపంలో నారాయణదాస స్వరూపాన్ని మొత్తాన్ని సంగ్రహంగా దర్శింపచేసే గ్రంథాన్ని వ్రాశారు. సాధారణంగా నారాయణదాస సంబంధి గ్రంథాన్ని శ్రీ కళ్లా ఈశ్వరరావుగారు అచ్చు వేయిస్తారు గావున ఈశ్వర, సోమయాజుల హృదయ ధర్మాలు రెండూ కూడా పాఠకలోకానికి విదితచరములే!

ఈ సోమయాజులుగారిని నేను "అన్నగారూ" అని పిలుస్తాను. వారు నన్ను సోదర వాత్సల్యంతోనే చూస్తారు. ఈశ్వరరావుగారు, సోమయాజులుగారు కూర్చుని మాటాడుతుంటే రెండు కైలాసపర్వతాలు సూక్ష్మాకారంతో మాటాడు తున్నట్లే అనిపిస్తుంది నాకు మాత్రం, వీరి హృదయాలకు రెంటికీ ఆత్మసంబంధమైన శ్రీమన్నారాయణదాసు మాత్రం మధ్యలో మహామేరువువలెనే భాసిస్తాడు. ఆకారంలో వర్ణంలో ధైర్యంతో మాత్రం పోలికగాని, విద్యావిశేషాల్లో ఏమీ పోలికలేనే లేదు. ఆ మేరువు చరంగాదు. ఈ నారాయణదాస మేరువు జంగమం. ఆ మేరువు నాశ్రయించినట్లే సమస్త దేవతా సమూహం ఈ మేరువును కూడా ఆశ్రయించుతారు. ఆ పర్వతం మీద దేవతలు విహారం చేస్తారు. ఈ పర్వతం యథేచ్ఛాసంచారం చేస్తూ నానావిధ నృత్యభంగిమలను ఒలకపోస్తుంటే దేవతలు విధేయులై ఒదిగి ఉంటారు. అంతే తేడా.

ఆ మేరు పర్వతం ప్రక్కన ఉన్న ఈ చిన్న కైలాసాలు మనస్సులోకి వస్తే ఎంతో మైమరపించే ఆనందం పొంగి పొరలి తరంగాలుగా తూగి వస్తుంటుంది. మనస్సుతో చూచే అలవాటు ఉంటే ఆ దృశ్యాన్ని దర్శించాలిగాని వర్ణించలేము. మన మేమన్నా కాళిదాసులమా!

ఈ ముప్పురితో బాటుగా మరొక రున్నారు. ఆ మహానుభావుడు అందరికీ కూడా గురుస్థానం. అజాతశత్రువు. తనను తిట్టినా కోపం తెచ్చుకోని శాంతమూర్తి.

వారు బ్రహ్మశ్రీ కీ.శే. ఓరుగంటి నీలకంఠ శాస్త్రిగారు. ఈ గ్రంథానికి కృతిపతి వారే! ఈ నలువురూ కూడా నాకు ఆప్తులే వీరిలో ఈశ్వర సంబంధం నాకు మెండు. శ్రీ మన్నారాయణదాస సంబంధం నాకు ఆత్మ సంబంధం. కాబట్టి నా అంజలి ముఖ్యమే!

దాససాహిత్యాన్ని మొత్తాన్ని సమీక్ష చేయించి హేమా హేమీలచేత పెద్ద పెద్ద వ్యాసాలు వ్రాయించి అన్నింటినీ ప్రచురించి శ్రీ ఈశ్వరరావుగారు తెలుగు భాషకు, తెలుగు వారికే కూడా మహోపకారం చేసాడు. ఈ మొత్తానికి "మహాచార్య" శ్రీ జోగారావుగారు సారథ్యం వహించారు. కాబట్టే వైవిధ్యంతో పాఠక మనస్సులకు మహానందాన్ని కలిగిస్తూ ఆ సారస్వత ప్రపంచం అవతరించింది.

ఈ మధ్యకాలంలో "స్వయంలేఖనం" అనే ఒక అంశం మనదేశంలో అక్కడక్కడా వెలిసింది. "స్వయంలేఖనం" అంటే తమ చరిత్ర రహస్యాలను తామే వ్రాసుకోవటం, మరణించిన తర్వాత తామే వ్రాసుకోవడం ఎక్కడ జరుగుతుంది? అంటే ఆత్మశక్తి తమకు అనుగ్రహం కలిగిన వారి యందావహించి వారి కథనే వారే చెప్పుకోవటం లేదా వ్రాసికోవడం జరుగుతుంది. దాన్నే స్వయం లేఖనం అంటారు. ఈ మాట అనువాద రూపంలో వచ్చిందికాని స్వతస్సంభవం కాదు. "ఆటో రైటింగు" దీనికి మూలం.

కొందరు ఇది మాత్రం కుదురుతుందా? అనవచ్చు. కుదురుతుంది. మహాభారతంలో గాంధారీ, ధృతరాష్ట్రుడు మొదలైనవారు వ్యాసభగవానుణ్ణి దుర్యోధనాది బంధువర్గాన్ని చూపుండని కోరితే వ్యాసులవారు వారికి బంధువర్గాన్ని మొత్తాన్ని చూపించారు. అంతేకాదు. శ్రీ రామాయణంలో కూడా దశరథుడు పరమేశ్వర విమానంలో వచ్చి దర్శనమిచ్చి రామునితో, మాటాడటం మనకు తెలుసు. అదెలా కుదురుతుందో ఇదీ కూడా అంతే!

అందరికీ ఇలా రావటంలేదే అనవచ్చు. అందరికీరాదు. ఆ అపూర్వయోగశక్తి ఉండాలి. అప్పుడు రావాలి. యోగం అంటే తెలియనివారు స్వయం లేఖనం చేయలేరు. మన కందరికీ పూర్వజన్మస్మృతి ఉందా? మన కున్నది చేతనైనంత పాపం చేసి ఆ ఫలాన్ని గట్టిగా పట్టుకొని పుట్టి నానాబాధలు పడటం తప్ప ఇంకేమున్నది. ఉత్తమశక్తి ఒక్కటికూడా లేదు. ఉత్తమ విద్య లేదు. అందువల్ల మనకు అంతా చిత్రంగా విచిత్రంగా ఉంటుంది.

పూర్వకాలంలో దూరదర్శన దూరశ్రవణాదులుండేవి. ఇప్పుడు లేవు అంత మాత్రంలో ఆ విద్యలు లేనేలే వంటామా? అంటే లోకం ఒప్పుతుందా? విద్యారూపం ఎప్పుడైనా ఎక్కడైనా మారితే మారుతుందేమో కాని నశించడం మాత్రం ఉండదు. అలాగే ఈ స్వయంలేఖనవిద్య కూడాను.

ఆ దాసస్వయంలేఖనాన్ని ముద్రించే విషయంలో ఎంతో ప్రోత్సాహం చేసినవారు శ్రీ సోమయాజులుగారు. వారు బహుభాషావేత్తలు కావటంలో వారి మాట రూపం ధరించి. కొందరు పండితులు, కవులు ఆస్మాదృశులు చెప్పినా దాన్ని అంత పాటికివట్టకపోవటం లోకంలో ఉన్నమాట! కాబట్టి శ్రీ సోమయాజులుగారి ఒక మాట ఒక విలక్షణమైన గ్రంథాన్ని వెలువరిస్తుందన్న మాట!

నారాయణదాసు శారద అని అందరిమాట. అసలు దాసుమాట కూడను కాని మా జోగారావు పద్యం ఈ మాటను కాదంటుంది. వారి పద్యం మాత్రమే కాదు. నా మనస్సు కూడాను. ఈ పద్యాన్ని చిత్తగించి నట్లయితే తమకే తెలుస్తుంది.

ఉ. “నాయవి నాల్గు మోము లవునా? యెటు ముద్దిడె దంచు నల్వ యా
ష్యాయముగా హసింపగ ననంతముఖన్ నను నెట్లు ముద్దిడం
బోయెదొ యంచుఁ జెల్వ నగ ముద్దిడెదన్ గనుమంచు నల్వ నా
రాయణదాసుగాగఁ ద్రపనందు సరస్వతికిన్ నమస్కృతుల్”

సెబాసు జోగారాయా! దాసుకంటె ఘనత దక్కించుకున్నావుగదయ్యా! నలువ నారాయణదా సైతే దాసు కేమీ లేదు. తన అసామర్థ్యానికి సిగ్గుపడుతూ నుంచున్నది సరస్వతి. అననుభూత పూర్వశృంగార విలాస వైభవం సరస్వతీ స్వరూపంలోనుండి మందాక్ష మందాక్ష మధురంగా తన అపజయాన్ని అంగీకరించక తప్పని యిరకాటంలో త్రపనందుతూన్న సరస్వతి సాక్షాత్కారం మా జోగారావుది. స్వాపజయసూచక శృంగార మందహాస సంవలిత త్రపొద్భు తమధుర వీక్షణముల తిర్యగ్వలనములు అంతంతమాత్రమువాళ్ళకు అందవు. ఇప్పుడు మీరు దాసదర్శనం చేయండి. మా ఈశ్వరరావుగారికి ఈ పద్యంలో అందచందాలు చాలా సార్లు వినిపించాను అంతా విని నాకేమీ తెలియదు అంటారు. అలాగే అన్నారు. “పుంభావ సరస్వతి” అంటే చాల గొప్ప అని అందరి అభిప్రాయం. ఈ పద్యం వచ్చిం తర్వాత నా అభిప్రాయం మారింది. ఒక పద్యం చెప్పితే పుంభావ సరస్వతి. ఈ విధంగా సరస్వతీ శబ్ద సంఘటనంతో ఎవరి ముచ్చటను వారు తీర్చుకుంటున్నారు. సంతోషం.

అలాంటి మహామహులైన సోమయాజులుగారు దాసుచరిత్రను గేయధర్మిగా వ్రాసారు. శ్రీ సోమయాజులుగారు ఎన్నిపోకడలైనా పోగలవారు. ఎన్ని నడకలైనా నడవగలవారు. ఇది పద్యంగాక, ద్విపదగాక, ద్విపదధర్మగా వ్రాసారు తాళానికి సర్దుకొని, శ్రుతి పెట్టుకొని, తగినవాడు గానంచేస్తే సభ సభంతా తన్మయత్వం చెందుతుంది. ఈ విషయంలో ఏమీ సందేహం లేదు. సోమయాజులు గారి ప్రసంగం గాని, కవితాగోష్ఠిగాని ఎంతో ఉజ్జ్వలంగా ఉంటుంది. మా "సాహితీ సమితి" ఉత్సాహశక్తి సోమయాజులుగారే! విద్యార్థులకు నోట్సులు వ్రాసే అభ్యాసం బాగా ఉన్నందువల్ల శ్రీ సోమయాజులుగారు ఎంత క్లిష్టవిషయాన్ని అయినా సరే! చాలా సుఖబోధం చేస్తారు. మళ్ళీ యిదేమి అనే ప్రశ్న రాకుండా వివరించడం వారి అపూర్వశక్తి.

ఆకార సదృశమైన ప్రజ్ఞ. ప్రజ్ఞా సదృశమైన ఆగమం. ఆగమ సదృశమైన కార్యారంభం. ఆరంభ సదృశమైన ఉదయం కలవారు మా అన్నగారు. వారు చాలా విధాల సాహితీరంగాల్లో వినూతన ప్రక్రియల్ని సూచించి ప్రయోగంలో సహృదయా నందాన్ని వెల్లివిరియించినారు. ఎందరెందరో దాసచరిత్ర విశేషాల్ని చెప్పితే వాని నన్నింటినీ ఒక సూత్రంలో తార హారంగా కూర్చిన మహాశిల్పి.

దాసుగారిని గూర్చి, శ్రీ ఈశ్వరరావుగారిని గూర్చి, నీలకంఠశాస్త్రుల వారిని గూర్చి, శ్రీ సోమయాజులుగారిని గూర్చి తెలియని వార్వెరూ లేరు. ఇంకా మద్విశిష్టులు చాల మంది అభిప్రాయాల్ని శాస్త్రపద్ధతిలో, లోకపద్ధతిలో, కావ్యపద్ధతిలో అందించారు. కాని నాకు కూడా ఆ పెద్దలతో పాటుగా ఒక పీటవేసి గౌరవాన్ని అనుభవింపచేస్తున్నారు శ్రీ ఈశ్వరరాయ సోమయాజులుగారలు.

శ్రీ సోమయాజులుగారు నిరంతర సారస్వత - వ్రతి.ఎప్పుడూ గ్రంథపఠనం. ఎప్పుడూ లేఖనం. ఎందరెందరికో 'కవిసామ్రాట్' శ్రీ పైడిపాటి సుబ్బరాయశాస్త్రి వంటివారలకు ఎన్నో ఎన్నో విషయాల్ని అందించడం నేనెరుగుదును. వారిని ఒక విధంగా పీఠాధిపతి అనవచ్చును. ఆ వారికి నా పాదాభివందనాలు. ఆ వారి యీ దీర్ఘగీతమునకు నా ప్రణామాంజలి. దానిని గురించిన అంజలి గాబట్టి ఇది "గీతాంజలి" అయింది. ఈ గీతంలో పాటు నా యీ అంజలి కూడా ఉంటుంది. అదంతా ఈశ్వరేచ్ఛ.

'జయన్తి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః'

ఆనందతీర్థాగ్రహారము **కోగంటి సీతారామాచార్యులు**
గుంటూరు-522004

# త్రికళోపహారము

"కవితా కళానిధి", "నటశేఖర", "కావ్యమర్మజ్ఞ"

**శ్రీ అన్నపర్తి సీతారామాంజనేయులు**

'బ్రహ్మ విష్ణు మహేశ్వరులు
ఒకరి నొకరు ఏకీ భావ
వమ్ము తోడ వీక్షిస్తూ
ఉండగా వారి చూపు
లకు పుట్టెను ఒక కన్నియ
అందగత్తె, మహామాయ
పేరు త్రికళ............ (ఉపాయనాలు పుట.)

విధాతృ స్థానీయులు బ్రహ్మశ్రీ వావిలాల సోమయాజులుగారు, నామరూపాభ్యాం నారాయణు లైన హరికథా పితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు. శ్రీ నారాయణ దాస అవతార వైభవ ప్రకాశన మహాయోగ నివిష్టులు శ్రీ కణ్టా ఈశ్వరరావుగారు 'ఒకరి నొకరు ఏకీభావంతో వీక్షిస్తూ ఉండంగా వారి చూపులకు' పుట్టిన 'త్రికళ' యీ ఉపాయనాలు అనే కృతి.

సంగీత, సాహిత్య, నృత్యములనే మూడు కళలూ ముప్పిరి గొన్న హరికథా వైభవ ప్రతిపాదకము గనుక ఇది 'త్రికళ'.

ఈ త్రివేణీసంగమంలో అంత స్రోతస్విని యైన 'సరస్వతి' సరస్వత్యవతారమే! ఆ అవతరించటంలో శారదామాత తాను భూలోకానికి అనుగ్రహింపదలచిన ఒక విశిష్ట కళా స్వరూపానికి ప్రాచుర్యం కలిగించటానికి అనువుగా పురుషాకృతి వహించింది.

స్వీకరించింది పురుషాకృతి అయినా, స్త్రీపాత్రారోపణంతో అభినయించే వేళ ఆ నడబెడంగులు, ముంగురుల మురువులు, విలోచన విలాసాలు అతివలకు సైతం అందరానివి.

అవతరించిందేమో వాగ్దేవి ధరించిందేమో 'నారాయణ' నామం! ఇందేమి ఔచిత్యం ఉన్నది?

ఉన్నదని విద్యావారథులైన శ్రీ వావిలాలవారు వెల్లడిస్తున్నారు.

'.................. శబ్దమ్ములు  
ఎవని వలన బయలుదేరు  
అతడు 'రాయణుండు' అతడు  
గానివాడు 'అరాయణుండు'  
అరాయణుండు గానివాడు  
'నారాయణు' డందుచేత  
తనవలననె శబ్దమ్ములు  
బయలు వెడలు చుంట వలన  
'నారాయణు' డయ్యె (ఉపాయనాలు పుటలు)

నారాయణ శబ్దం వాగ్దేవికి కూడా అన్వయిస్తుందన్న మాటే కదా!

ఇలా పొడిమాటలతో వాచ్యం చెయ్యటం వావిలాలవారి పద్ధతి కాదు. వారీ విషయాన్ని వివరించిన తీరుసౌరు గమనించండి.

'దేవదాసి ఒకతెకు ఆ  
దీక్షాగుణ లక్షణాన్ని  
అవసరమౌ జ్ఞానమ్మును  
అభినయ సంక్లిష్టతలను  
నాట్య గాన క్లేశాలను  
అవగతమ్ము గావింపగ  
అభ్యర్థన చేసినపుడు  
దృఢతర సద్భావనతో  
శిష్యురాలిపై ప్రేమతో  
దేవదాసి రూపంతో  
స్వయంగాను అభినయిస్తు  
చూపి నేర్పగా-వలె నని  
.............................

............................
'నన్ను కనుము, నన్ను వినుము'
ఆదేశము జ్ఞప్తిచేసి
............................
............................
నవ విధ శృంగారమ్ముల
నభినయింప నేర్చు వరకు
శిష్యురాలి విద్య పరా
కాష్ఠ నందుకొనెడి వరకు (ఉపాయనాలు పుటలు)

శ్రీ కృష్ణ ఆలయంలో నిత్యమూ తాను అభినయిస్తూ, ఆమె చేత అభినయింప జేస్తూ ఉంటే, స్త్రీ పురుషులనేకులు అది చూడటానికి వచ్చేవారు.

దాసుగారు తా నభినయించే టప్పుడు –

'........ సభను ఉన్న
సర్వజనుల – స్త్రీ పురుషుల
నందరినీ కొంతవరకు
తనవలెనే స్త్రీల జేస్తు' (ఉపాయనాలు పుట)

తాను స్త్రీగా నటిస్తూ ప్రేక్షకులందరూ స్త్రీవద్భావాన్ని భజించేటట్లు చేయడం కంటె అభినయానికి పరాకాష్ఠ వేరే ముంటుంది.

మరొక విశేషం :

"దేవదాసి కాదలచిన
ఆ గణికా కన్యను తమ
ప్రియురాలిని చేసుకొనగ
మనసుపడుతు ఉన్నవారు
ఆమె నేర్చు విద్య చూడ
ప్రీతితోడ ఆలయాన్కి
అప్పుడపుడు వచ్చి వచ్చి
ఆమె పరాకాష్ఠ నొంది
అభినయించు వేళ చూచి

ప్రేమభక్తిగా మారగ
అపుడు నిల్వలేక ఇర్వు
రీమె మహాదేవు పత్ని
పరమ పుణ్యవతి యయ్యె
............................
............................
అని అందరు చూచుచుండ
ఆమెకు నతు లర్పించిరి

ఇది దాసుగారి అధ్యాపన అభినివేశానికి, భక్తి ప్రచారార్థంగా తాల్చిన ఆయన అవతారవైభవానికి అర్పించిన ఒక మహాద్భుతోపాయనం.

శ్రీ దాసుగారి మూర్తికి 'కుమార ధూర్జటి' శ్రీ వావిలాలవారెలా అద్దం పట్టారో చూడండి.

పెద్ద దయిన తలకొప్పును
దానిపైన రమ్య పుష్ప
గుచ్ఛమ్ములు, ఫాలభాగ
మున కుంకుమ బొట్టు, కనుల
దిద్దుకొన్న కడు నల్లని
కాటుకయును, దేహముపై
లేపనాలు, చందనాది
గంధమ్ములు, అన్యమైన
అంగరాగ భోగమ్ములు
ఆభరణాలును ధరింప
కడు నపేక్ష పురుషుల, సై
తమ్ము మోహపరచు నట్టి
నైజ రమ్య లక్షణాల
............................
వ్యాప్తినొందు సురభిళాల
తో నొప్పెడు వేషము"

ఇది ఇలా ఉంచండి. మొదట్లో – త్రికళావిర్భావాన్ని గురించి ముచ్చటించు కున్నాం. అక్కడ శ్రీ వావిలాలవారు, శ్రీ ఆదిభట్టు వారు శ్రీ కళ్లూవారు – ఈ ముగ్వురి చూపులకలయిక వల్ల ఈ కావ్యం ఆవిర్భవించింది అనుకున్నాం. శ్రీ వావిలాలవారు శ్రీ కళ్లూవారు–వారిరువురి చూపులు కలసినవనటంలో సామంజస్యం ఉన్నది గాని 'హరికథాపితామహుల' చూపు కలిసిందనటంలో సామంజస్య మేమిటి? ఇది ఎలా సంగత మౌతుంది అనే శంక కలుగవచ్చును.

"ఈ సర్వమూ శ్రీ దాసుగారిని గురించే కదా!" అని నే ననబోవటం లేదు.

"స్వయంలేఖనము" అనే ప్రక్రియ ఒకటి ఉన్నది. దానిని ఇంగ్లీషులో 'ఆటో–రైటింగ్' అంటారు.

స్థూల శరీరాన్ని విడిచి గతించిపోయిన జీవాత్మ ఒక మానవుని మీదికి ఆవాహన చేసినప్పుడు, ఆ మానవుణ్ణి ఆవహించి అతనిచేత తాను చెప్పదలచుకొన్నది వ్రాయింప జేస్తుంది. వ్రాసేవాడు ఒట్టి సాధనం మాత్రమే! అతని చేయి, ఆ చేతిలోని కలం కదులుతుందే తప్ప, ఆ వ్రాసే వ్రాతతో అతని కెట్టి సంబంధమూ ఉండదు. వ్రాసేదంతా అతణ్ణి ఆవహించిన జీవాత్మయే. ఇలా గతించిన జీవాత్మకు సాధనంగా ఉపయోగపడేవారు పురుషులూ కావచ్చు స్త్రీలూ కావచ్చు. అయితే అందరూ ఇందుకు పనికిరారు. ఇందుకు సాధనంగా పనికివచ్చే వారు కొందరే ఉంటారు. శ్రీ దాసుగారి స్వయంలేఖనానికి శ్రీ కళ్లూ ఈశ్వరరావుగారి ప్రథమ పుత్రిక చి॥ల॥॥సౌ॥ రాజేశ్వరి సాధనమయింది.

"………. ఎపుడో శరీరాన్ని
విడిచి నట్టి దాసుగారు
తనదు జన్మరహస్యాన్ని
ప్రపంచాన్కి బహిర్గతము
చేయటాన్కి శ్రీ ఈశ్వర
రావుగారి ప్రథమపుత్రి
ని చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతిని రాజేశ్వరి
దేవి నొక్క ఉపకరణము
గా గ్రహించి తన అదృశ్య
వాణి నామె కందజేసి

ఆమె మూలముగను తనదు
జన్మరహస్యాన్ని తెలియ
జేసెడు నా స్వయంలేఖ
నాన్ని లిఖింపగజేసిరి.” (ఉపాయనాలు:పుటలు)

ఆ స్వయంలేఖానాన్ని ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు శ్రీ కణ్వా ఈశ్వరరావుగారు ‘భట్టు - విద్యలకే భట్టు ఆది భట్టు- నారాయణదాసు’ అన్న పేరుతో ఒక గ్రంథంగా అచ్చు వేయించారు.

ఈస్వయంలేఖన ప్రక్రియను గూర్చి ప్రముఖులనేకులు చర్చించారు. కొందరు దీన్ని విశ్వసించారు. కొందరు విశ్వసించలేదు. కొందరు అవైదికమన్నారు.

ఈ స్వయంలేఖనంలో శ్రీ దాసుగారు తమను శారదావతారంగా ప్రకటించుకొన్నారు. పెద్దలనేకులు ఈ అంశాన్ని విశ్వసించి ధృవీకరించారు. ఆయా రంగాల్లోనిష్ణాతులైన ప్రసిద్ధ పండితులనేకులు, శ్రీ దాసుగారి సాహిత్యపాండిత్యాన్ని, కవనవైశిష్ట్యాన్ని, గానవైదుష్యాన్ని, నృత్యనిష్ణాతృత్వాన్ని, ఆయన అవతారవైభవాన్ని పలురీతుల ప్రశంసించి, నివాళులర్పించారు. ఇవన్నీ ‘భట్టు -విద్యలకే భట్టు ఆదిభట్టు - నారాయణదాసు’ అనే ఈ స్వయంలేఖన గ్రంథంలో చోటు చేసికొన్నాయి.

ఆ సందర్భంలో చేయబడ్డ రచన ఈ ‘ఉపాయనాలు’. ఇది సుదీర్ఘంగా ఉండటంచేత ఇందులో ఎనిమిది పేజీలు మాత్రం పైన పేర్కొన్న గ్రంథంలో అచ్చువేసి, ఈ ‘ఉపాయనా’లను ప్రత్యేక గ్రంథంగా ప్రకటించే సంకల్పాన్ని అందులో వెల్లడించారు. శ్రీ ఈశ్వరరావుగారు. ఆ సంకల్పం ఇప్పటి కిలా కార్యరూపం ధరించింది.

ఆ స్వయంలేఖనంలో సాక్షాత్కరించిన పుంభావసరస్వతి వీక్షాప్రసారం గూడా ఈ కృత్యావిర్భావానికి లభించినట్లే గదా!

శ్రీ వావిలాల సోమయాజులుగారు బహు సహస్ర సంఖ్యాకంగా ఏకలవ్య శిష్యసంతతిని సమకూర్చుకొన్న గురుపీఠ సమధిష్ఠితులు. మూడు దశాబ్దుల క్రిందటివరకు ఇంటర్మీడియెట్, డిగ్రీతరగతుల్లో చదువుకొనే విద్యార్థులలో తెలుగు భాషాపరీక్షకు వారు వ్రాసిన నోట్సులు చదువనివారు లేరంటే అతిశయోక్తికాదు. ఆ నోట్సులో ఆయా ప్రశ్నలకు వారు వ్రాసిన సమాధానాలు పరీక్షదృష్ట్యా తేలికగా ముక్కునపెట్టుకోటానికే ఉద్దేశించిన చౌకబారు సమాధానాలు కావు. అవి సాహిత్యదృష్ట్యా

విలువైన వ్యాసాలు. ఆయా పద్యాలకు వారు వ్యాఖ్యలు గభీర సాహిత్య విశేష సమన్వితాలు అవన్నీ ఇప్పుడెవరైనా క్రోడీకరించుకొంటే పిహెచ్.డి. పట్టం పొందవచ్చు.

వావిలాలవారి లేఖిని నుండి జాలువారిన రచన ఏదైనా కానివ్వండి ఒక వైలక్షణ్యం ఉంటుంది.

నాలుగు దశాబ్దుల క్రితం వారు వెలువరించిన 'మణిప్రవాళము' అనే వ్యాససంపుటి తెలుగులో వ్యాసరచనకు మార్గదర్శకంగా ఉన్నదనటం పెద్ద లంగీకరించిన విషయం. ఒక్కొక్క వ్యాసంలో ఎన్నెన్ని విషయాలు చెప్పబడ్డాయి! అన్ని విషయాలు సేకరించటానికి ఎంత చదివి ఉండాలి! ఆ సేకరించిన విషయాలను పొందుపరచటంలో ఎంత అందం! ఆ శైలిలో ఎంత హొయలు!

వారి 'నాయకురాలు' నాటకం పలుమార్లు, ఆంధ్రదేశంలోను, ఆంధ్రేతర ప్రాంతాల్లోను ప్రదర్శింపబడి బహుజనరంజకమయినది. వారు రచించిన 'కజ్జల' 'వసంతసేన' నాటకాలు వైలక్షణ్య రమణీయాలు. అయితే 'నాయకురాలు'వలె ఇవి పలుప్రాంతాల్లో ప్రదర్శితాలు కాలేదు.

1950 ప్రాంతంలో వాత్స్యాయన కామసూత్రాలను మథించి, శాతవాహన సంచికలో వారు ప్రకటించిన వ్యాసం పరిమాణంలోనే కాక, విషయ విన్యాసంలో కూడా గొప్పది. ఎన్నో అపూర్వములూ, ఆసక్తికరములూ అయిన విషయాలు అందులో ఉన్నాయి.

వారి పద్యశిల్పానికి ముగ్ధులై డా॥ శ్రీ సి.నారాయణరెడ్డి గారు వారిని 'పద్యవిద్యాధరు' లని సంభావించారు. ఇంక వారి పద్యశిల్ప రామణీయకాన్ని గూర్చి వేరే చెప్పవలసిన దేమున్నది.

బహుభాషావేత్తలైన శ్రీ వావిలాలవారి అనువాద సాహిత్యం కూడా అనల్పమే!

మహాకవి శ్రీ జయశంకర్ ప్రసాద్ గారి 'కామాయని' హిందీ కావ్యానికి శ్రీ వావిలాల సోమయాజులు గారు తేటగీతి ఛందస్సులో తెలుగు అనువాదం సంతరించారు. ఇదొక విశిష్ట రచన. వేమన్న రసనపై ఆటవెలది నృత్యం చేసినట్లు సోమయాజులుగారి లేఖినిలో తేటగీతి కదను త్రొక్కింది. సుదీర్ఘ సంస్కృత సమాసగ్రథనానికి కూడా ఒదుగుబాటు చూపించి హొయలు గుల్కింది. ఈ కావ్యం తెలుగు భాషాయోష కొక వినూత్న భూష.

జయదేవుని 'పీయూషలహరి' గోష్ఠీరూపకానికి వావిలాలవారి ఆంధ్రానువాదం అంత మృదువుగానూ, అంత మధురంగాను, అంత మనోహరంగాను ఉన్నది.

'ఆంటోనీ క్లియోపాత్రా', 'జూలియస్ సీజర్', 'మేక్‌బెత్' మున్నగు షేక్స్పియర్ ఆంగ్లనాటకాలకు వావిలాలవారి అనువాదాలు ఆంధ్రాంగ్ల సాహిత్యవేత్తల మెప్పుదలకు పాత్రమైనాయి.

ఈ 'ఉపాయనాలు' కూడా ఒక ప్రత్యేకతతో కూడిన కృతియే!

ఇది శారదావతారులైన నారాయణదాసుగారి కథాకథన వైభవ ప్రశస్తికేర్పడిన రచన. సాధారణంగా ఇలాంటి రచనలు వచన రూపంలో ఉంటాయి. పద్యరూపంలో కూడా ఉండవచ్చు గాని నాతి దీర్ఘంగా ఉంటాయి. ఇది విజయమంగళరగడ మాత్రాఛందస్సులో సాగిన సుదీర్ఘరచన. శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారి ప్రతిభావైదుష్యాలను 'కొండ అద్దమందు'.. అన్నట్లు ప్రతిఫలించే రచన.

అసలు 'ఉపాయనాలు' అన్న పేరే చమత్కారంగా ఉన్నది. ఇది 'ఉపాయనము' కాదు. బహువచన యుక్తము, 'ఉపాయనాలు'.

ఇది శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు శారదావతారమే అన్న విశ్వాసానికి సంస్ఫోరకము.

ఎంత మహామహిముడైనా మానవమాత్రు డైతే అభినందిస్తాము. ప్రశంసిస్తాము, తత్ప్రజ్ఞాపాటవాలను, వైదుష్యాన్ని విమర్శిస్తాము, వ్యాఖ్యానిస్తాము. ఇది దేవతావిషయం కాబట్టి 'ఉపాయనము' సమర్పిస్తున్నారు శ్రీ వావిలాలవారు. అయితే 'ఉపాయనము' కాక, 'ఉపాయనాలు' ఎందుకైనది?

"విపులమైన లోకంలో
మిమ్ము ప్రశంసించు రీతి
మీ విజ్ఞా నాధిక్యత
మీదు కళాపాండిత్యము
ఇత్యాదుల గూర్చి ఏమి
చెప్పుకుంటు ఉన్నారో
వానిలోని కొన్ని భావ
ములను సేకరించి, వాని

లోన కొన్ని సంగ్రహించి
భక్తజనావళి కొరకును
మా కొఱకూ, మీ కొఱకూ
గాన యోగ్య ఛందస్సులో
నేను తెలుప బూనుకొంటి" (ఉపాయనాలు: పుట)

అంటున్నారు శ్రీ వావిలాల.

ఈ విధంగా సుప్రసిద్ధులైన మరెందరో పెద్ద లర్పించిన కానుకలు కూడా ఈ కృతిలో చోటు చేసుకొన్నవి. ఇందుచేతనే ఇది 'ఉపాయనాలు' అయినది.

శ్రీ దాసుగారికి శ్రీ వావిలాలవారర్పించిన ఉపాయనాలలోని వైవిధ్యం చూడండి:

వావిలాలవారు నారాయణ దాసుగారిని వ్యాసభగవానునిగా సంభావించారు.

"జన సంక్షేమం కోసం
వ్యాసుడు బోధించినట్టి
వైదిక పౌరాణిక వి
జ్ఞానపు రుచి చూపినారు" (ఉపాయనాలు : పుటలు )

"మీరు వ్యాసభగవానులు
........................
........................
వ్యాసుడు ఏ కారణాన
లిఖియించెనా భారతాదు
లా కారణముననె మీరు
హరికథల లఖించినారు". (ఉపాయనలు : పుట )

శ్రీ దాసుగారి శీలసంపదకు వావిలాల వారి నివాళు లివి:

'జగము నందు పుట్టినట్టి
జను లంతా మీ బిడ్డలె,
కుల మత భేదాలు లేవు,
కోర్కెల దోషాలు లేవు,

నిత్యములౌ మీ చేష్టల
నిర్లక్ష్యం కనుపించదు.'

'క్రీడగ నైనాను మీరు
కించపరచ రెవ్వరినీ' (ఉపాయనాలు : పుట )

శ్రీ ఆదిభట్ల లోకహిత వర్తనను వావిలాలవారిలా ఉగ్గడిస్తున్నారు:

"భయరహితత, ఓ భట్ట!
కీలకరంగాల కేగి
దుష్టులలో పరివర్తన
కల్గింపను, దళితులకును
బాధితులకు ఉపశమనం
చేకూర్పను కృషిచేతురు." (ఉపాయనాలు : పుట )

స్త్రీ విద్యపట్ల, స్త్రీ జనోద్ధరణ పట్ల శ్రీ దాసుగారికి గల ఆసక్తిని, ఆ రంగంలో వారి కృషిని వావిలాలవారిలా వెల్లడిస్తున్నారు.

"కాంతలలో నొక కొందరు
మీ ప్రోత్సాహం వల్లను
మేటి కథాకథన లైరి" (ఉపాయనాలు : పుట )

"అందం కోసమ్ము స్త్రీని
ఆరాధించారు గాని
భోగము కోసమ్ము కాదు" (ఉపాయనాలు : పుట)

'హరిదాస జగద్గురువులైన శ్రీ నారాయణదాసుగారు, 'హరికథలను నేర్పు నట్టి హరిదాసులె కారు. జీవితాన్కి, శీలానికి శ్రేయానికి చెందినట్టి ఎన్నో నేర్పిన గురువులు.

శ్రీ దాసుగారు ప్రగతి శీలురు

"ఎట వసించుచున్న నేమి?
ఏ మొనర్చుచున్న నేమి?
ఉత్సాహము కల్గించుట
ఉత్తేజితులను జేయుట

మీకు జన్మలక్షణమ్ము!
నే నన్నది సత్యమ్ము" (ఉపాయనాలు : పుట )

అంటారు వా.సో.

ఈ గ్రంథంలో సోమయాజులు గారు, 'మధురభక్తి, నవవిధ శృంగారాభినయాలు, తమ బాల్యంలో గుంటూరులో జరిగిన శ్రీ దాసుగారి హరికథా గానసభను పూర్వోత్తరరంగాలతో విపులంగా రసవత్తరంగా వర్ణించడమే కాక, ఆనాడు హరికథాపితామహులు గానంచేసిన పార్వతీకల్యాణగాథను కూడా వివరించారు. సామాన్యంగా వాడుకలో లేని కొన్ని పదాలను ప్రయోగించి, వాటి అర్థాలను తెలియజెప్పారు. అనేక పౌరాణిక గాథలను వివరించారు. యక్ష రాత్రిని గూర్చిన విపుల వర్ణన, 'అవిజేత' అనే బిరుదు నందుకున్న 'మెస్సాలిని' అనే రోమక వనిత వృత్తాంతం, సురసా కశ్యపుల కూతురైన 'అజముఖి' వృత్తాంతం మొదలైన ఎన్నో ఈ గ్రంథంలో చెప్పబడ్డాయి. శ్రీదాసుగారి ప్రజ్ఞాపాటవాలను ప్రశంసించే కృతిలో ఇవన్నీ చెప్పవలసిన అవసరమేమిటి? అనే శంక కలుగుతుంది.

శ్రీ దాసుగారు 'జ్ఞానభూమి గోలోమి', 'అజ్ఞులయెడ దాక్షిణ్యత విజ్ఞుల జేసెద' రట వారిని.

అందువల్ల సామాన్యపుచదువు చదువుకొన్నవారికి తెలియని అనేక విషయాలను ఈ గ్రంథంలో తెలియజెప్పడం కూడా శ్రీ దాసుగారికి సమర్పించే ఒక గొప్ప ఉపాయన మౌతుందని వావిలాలవారు భావించారనుకుంటాను.

హరికథాపితామహులు పలికిన సుభాషితములను పెక్కింటిని సోమయాజులు గారు ఈ కావ్యంలో పొందుపరచారు.

'అల్పముగా మాటాడుము
అధికముగా కృషిచేయుము' (పుట)

'క్రమము తప్ప కెపుడు గడి
యారమువలె ఉండవలయు' (పుట)

'జ్ఞానము ప్రేమల కలయిక
యే పూర్ణత ఆనందం' (పుట)

‘ఆధ్యాత్మిక తనియెడు నది
కారణాన్ని తిరస్కరణ
చేయునట్టి దెపుడు కాదు,
దాని నధిగమించునది’ (పుట)

‘నారి లేని ఇల్లు వృథా
నారి లేని విల్లు వృథా’ (పుట)

ఇవి మచ్చుకు కొన్ని. వారు ఇలాంటి సూక్తులను పొందుపరచడం కూడా పాఠకుల విజ్ఞానాన్ని పెంచడానికే! ఇదిన్నీ శ్రీ దాసుగారికి ఒక గొప్ప ఉపాయనమే!

శ్రీ దాసుగారిని

‘ఆంధ్రావని అవతరించి
నట్టి ఒక్క గంధర్వుడు’ అని –
‘పుష్టిమంత మై కదలిన
ఒక్క కళాపర్వతమ్ము’ అని –
‘సంవిత్తుకు, సంస్కృతికిని
సంగమ సుస్థానము’ అని –

పలువురు పలు విధాల ప్రశంసించారు.

ప్రథమాస్థాన కవీంద్రులు శ్రీచెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారు

‘నారాయణదాసు ప్రజ్ఞ
ఆ అనన్వయాలంకా
రానికి తొలి లక్ష్యమ్ము’

అని, దాసుగారికి సాటి దాసుగారే అని ప్రశంసించారు.

ఇలా ఎంద రెన్ని విధాల భావించినా, శ్రీ వావిలాలవారికి మాత్రం శ్రీ నారాయణదాసు గారు శారదామాతయే!

“విచ్చలవిడి తిరుగునట్టి
పుంగవ మన్నట్లు పోవు
దాసుగారి మూర్తి ఎంత

పౌరుషవంత మ్మయినను
ఆలోచింపంగ "అమ్మ"
మూర్తిగానె గోచరించు
టద్భుతమ్ము మీసాలీ
భావన కేమాత్రమ్మును
అడ్డురావు...........' (పుట 34)

అట్టి శారదామూర్తికీ,

తద్వైభవాన్ని మన కట్టెదుట నిల్పిన శ్రీ వావిలాల సోమయాజులుగారికీ –

త దవతార వైభవ ప్రకాశయిత శ్రీ కఙ్ఞా ఈశ్వరరాయ మహోదయులకు –

ఇది 'త్రికళాత్మకోపహారము"

# దిక్సూచి

వట్టివల్లి మల్లినాథ శర్మ-

శ్రీ శివాయ గురవే నమః

"ధారుణి నారాయణుఁడై
శారదనారాయణకథ శం,భో యనఁగా
నా రవము వినిన నలువ ప్ర
సారించిన నభయకర మొసంగుత సుఖముల్"

"శ్రీమ దజ్జాడ ఆదిభట్ట నారాయణదాసుగారు – శ్రీ శారదావతార మూర్తులు – హరికథా పితామహులు" అను పలుకును విన్నను, ఎచటనైనను చదివినను, ఛాయా చిత్రములలో వారి మూర్తిని ఒక్కసారి చూచినను వీరికి, పై రెండు విశేషణములేనా, ఇంకను ఉన్నవా! అను విషయములను దెలిసికొన వలయు నను జిజ్ఞాస సహృదయుల హృదయములలో వెంటనే కలుగును. ఆ మూర్తిస్ఫూర్తి అట్టిది.

శ్రీ దాసుగారినిఁ గూర్చిన చిత్రలు, విశేషములు పలు విధములు. అవి యన్నియు జిజ్ఞాసువులకు ఒక పుస్తకమునందే దొరకవు. ఎందఱు ఎన్ని విధాలుగా ఎన్ని అంశములు వారినిఁగూర్చి వ్రాసినను లేక ఉపన్యసించినను పుస్తక రూపమున ముద్రించుచున్నను అవి అన్నియు అసమగ్రములే అనిపించుట జగమెఱిఁగిన సత్యము.

అయినను 'సంస్కృతి సమితి – చీరాల' 1967 ఏప్రియలులో ప్రకటించిన "హరికథాపితా మహ. శ్రీమదజ్జాడ ఆదిభట్ట నారాయణదాస జయంత్యుత్సవ సంచిక"లో దాదాపు 70 మంది సకలకలానిష్ణాతులైన పండితులు శ్రీ దాసుగారి జీవితచరిత్ర సంగ్రహము, వారి సర్వంకషా పాండితినిఁ గూర్చిన విశేషములు వ్యాసరూపములలో, బ్రకటించియున్నారు. ఈ సంచిక శ్రీ దాసుగారి చరిత్ర సర్వస్వముగా నున్నది. ఒక్క హరికథకులు, గాయకులే కాదు. వివిధ శాస్త్ర పండితులును దానిని జదుపవలసినదే.

మఱియు, నెల్లూరు వాస్తవ్యులు, శ్రీ వాడరేవు సీతారామాంజనేయ భాగవతులు రచించిన "హరికథావాఙ్మయము"లోను పండితులు. విద్వాన్ శ్రీ వేదము చంద్రశేఖరయ్య

– (ఎగ్మూరు, మద్రాసు గారు) వ్రాసిన "భారతభారతి" అను గ్రంథమున 'మహాపురుషులు" అనుశీర్షిక క్రింద: శ్రీ నారాయణ దాసుగారిని

"ఆదిభట్ల నారాయణాఖ్య కవివరుడు
హరికథా పితామహ బిరుదాంచితుండు
అతఁడు చెప్పెడు కథ లాలకింత్రు
ప్రజలు తిండి, నిద్రమాని పరవశులయి" (252)

అనియు కీర్తించియున్నారు. ఇది గాక, శ్రీమదజ్జాడ, ఆదిభట్ట శ్రీనారాయణ దాస జీవిత చరిత్రను, 'యక్షగానరూపమున' కవి "కథకరత్న" శ్రీ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసుగారును (1967) ముద్రించియున్నారు.

"ఉపాయన"లు అను శీర్షికగల యీ గ్రంథమును శ్రీ వావిలాల సోమయాజులుగారు వ్రాసిరి. విషయము, విషయవైవిధ్యము పైసంచికలోనిదేగాక, మఱికొన్ని గ్రంథములనుండియు గ్రహించిరి. అయినను "గానయోగ్య ఛ్ఛందస్సు"లో వ్రాయుటయే శ్రీ సోమయాజులుగారి ప్రశంసనీయ కృషి.

సహృదయపండిత మిత్రులు శ్రీ కర్రా ఈశ్వరరావుగారు ఈ "ఉపాయన"లను ముద్రింపఁదలపెట్టి, దీనిపై "ఒక పీఠిక వ్రాయుడు" అని నన్నుఁ గోరిరి. విషయము సర్వజ్ఞులైన హరికథా పితామహులను గూర్చినది. రచయితలు పండిత ప్రకాండులు శ్రీ సోమయాజులుగారు. దేనియందును సామర్థ్యము లేని నేను దీనికి పీఠిక వ్రాయుటకు సాహసింపలేక, శ్రీ ఈశ్వరరావుగారి మాటను త్రోసి వేయను జాలక వ్రాసియిత్తు నని మాట యీక, వారిచ్చిన వ్రాఁత ప్రతిని ఇంటికిఁ దెచ్చి చదువ మొదలుపెట్టఁగాఁ దొలుతనే ఈ "ఉపాయనలు" శ్రీ నీలకంఠశాస్త్రిగారికి అంకితము అనుపంక్తినిఁ చూచి, ఆ త్రిమూర్తులపై భారముంచి చదువ మొదలు పెట్టితిని.

శ్రీ సోమయాజులుగారు "ఉపాయన"లను గొన్ని భాగములుగా విభజించినట్లు ఊహించుకొని, ఆ భాగములకు నా సౌలభ్యము కొఱకు క్రమసంఖ్యను గూర్చితిని. ఈ నా చొఱవను శ్రీ సోమయాజులుగారు మన్నింతురని వారి సహృదయతపై నా విశ్వాసము.

"శ్రీనారాయణదాస.... నారాయణదాససుకవి.

సంచిత బహుశాస్త్రభట్ట" – అను రీతిలో విశేషణములు సంబోధనములు ఉండుట, వానిలో పూర్వాపరవైవిధ్యము కనఁబడుటచే పైరీతిగా ఊహించితిని.

శ్రీ నారాయణదాసుగారి చరిత్రను చాలమంది వ్యాసరూపములలో వ్రాసి యుండఁగా, వానిలోని యంశములచే ముక్తాహారముగా వీరు గేయరూపమున రచించుట యిందలి విశేషము. గేయములలోని భాషయు చాల సులువుగా నున్నది. నా గ్రుడ్డిలెక్క ప్రకారము ఈ గేయపంక్తుల సంఖ్య దాదాపు మూఁడువేలకు మించి రెండువందలున్నవి.

విషయము స్వకపోలకల్పితమైనచో ఇట్లు గేయఛందస్సులో వ్రాయుట ఒకశ్రమ. ఇందలి విషయము - శాస్త్రములు, అందలి పంక్తులు కొన్ని యధా తథముగా చొప్పించుట, సంచికలోని వ్యాసకర్తల వాక్యములను కొన్నిటిని అట్లే యిముడ్చుట అనునది కష్టతమము. వీరి రచనను చదివినవారి కెవరి కైనను రచనలో, అందులో గేయఛందస్సులో వారికిఁ గల నైపుణ్యము పాండితి రచనాసారళ్యము మనసునకు రాఁగలవు. ఇట్టు శ్రీ దాసుగారి చరిత్రాంశములను గేయ రూపమున రచించి జిజ్ఞాసు సమాజమున కందించుటయేగాక యీ కృతిని శ్రీ నీలకంఠ శాస్త్రిగారికి అంకితమిచ్చుట అను రెండు కార్యములను ప్రశంసార్హములే కాదు నమస్కారార్హములును, వీరికి నా కృతజ్ఞతాంజలులు.

ఈ గ్రంథమును గూర్చిన నా వ్రాఁతకు 'పీఠిక' అనుట నా చేతగాని చేఁత మఱియు ఈ "ఉపాయనలు" నా దృష్టిలో ఒక రత్నాకరము. ఇందు పిపఠిషా (చదువఁగోరిక) నౌకలో పయనించువారికి ఇందు ఏ భాగమున ఏ విషయమున్నదో తెలుపు విషయసూచిక వంటి ప్రక్రియ "దిక్సూచి" అనుటయే తగినదని ఆపేరే ఉంచినాను.

శ్రీ సోమయాజులుగారు దీనిలో దాదాపు 12 మంది ప్రముఖుల యభిప్రాయాలను సంగ్రహించి, శ్రీ చెళ్లపిళ్ల వారితో ఆరంభించి శ్రీ విశ్వం గారి ఆశీస్సులతోఁ బూర్తిచేసిరి. స్వాభిప్రాయములను సైతము ఇందుఁ జేర్చి యున్నారు.

ఈ గేయపద్ధతిలోని సౌలభ్యము పాటగా పాడుకొనుటకు వీలగుట సంగీతమును పద్యములకును జోడింపవచ్చును. కాని 'లయ' అవసరములేదు. గేయములు అట్లుకాదు.

''హృద్యాహీ వాద్యకలయా కలితేవ గీతిః'' (భోజచంపువు) అన్నట్లు వాద్యసహకారముతో లయబద్ధమైన సంగీతముతో గేయమును గానముచేసినపుడు 'హృద్యము', వినువారికి ఆనందము. ఈ గేయములు అన్ని భాషలందును గలవు.

గేయముగాఁ బాడఁదగినవానిలో పద్యభేదములైన ద్విపద, మంజరి, సీసము, పంచచామరాదులు కొన్ని గలవు. సంస్కృతశ్లోకములును కొన్ని వాల్మీకి రామాయణము, శ్రీశంకరాచార్య షట్పది, భజగోవింద శ్లోకములు, కొన్ని ఆర్యావృత్తములు మున్నగునవి కలవు. ఇవిగాక అప్పకవి తన గ్రంథము అశ్వాసము (4)లో 'శ్రీవృత్తము' (178) అనిప్రారంభించి యిచ్చిన ఛందోభేదములలో (ఉదాహృతికై) మదరేఖ ఆదితాళము, విద్యున్మాలా, తోటకములు, ఆది, లేక ఏకతాళములలో లయతోపాటు గానముచేయ వీలగున్నట్లున్నది. మఱియు అచ్చటనే

1) 'బింబము' అను వృత్తలక్షణమును-

"ఇమ్మహిలోఁ గ్రమ్మిభగల్ - బింబమునం గంబుధరా (భ+గ) 4పా 'చిత్రపదము' అను వృత్తలక్షణమును -

2) చిత్రపదం బనువృత్తం-బత్రిముని స్తుతశౌరిన్

స్తోత్రము సేయఁగనొప్పున్-ధాత్రిని భాగగ యుక్తిన్ (భ+భ+గగ) (4పా) అని క్రమముగా "భ,భ,గ, బింబములోని గణక్రమమును, భ,భ,గగ. అను గణక్రమమును దెలిపి ప్రాసయతినిఁ గూర్చి రచించినట్లు వ్రాసిరి.

ఇందలి (ఉపాయనలు) ఛందస్సు పోలికను నడకను బట్టి పైరెంటివలెఁ గన్పట్టినను యతి ప్రాసలు పాటింపఁబడక రచింపఁబడుటచే కేవలము మాత్రాచ్ఛందస్సుకే ప్రాధాన్యమిచ్చినట్లు తోఁచుచున్నది. అయినను శ్రీ సోమయాజిగారి కలము పరిపాటిచేఁ గొన్నిచోట్ల యతులను అంత్యానుప్రాసములను గూడ పాటించినది. ఈ నా యూహలో నా యజ్ఞతయు నుండవచ్చును.

శ్రీ దాసుగారి సర్వతోముఖపాండితిని, గానకళను హరికథాకథనదక్షతను, కవితా నైపుణ్యమును బట్టి శ్రీదాసుగారు "శారదావతారము" అనుట ఆయా పండితుల యూహలు కల్పనలుకావు. వారు యథార్థముగా శ్రీశారదావతారమే అనుటకు ఆధారము ప్రత్యక్షసాక్ష్యము, శ్రీ నారాయణదాసుగారి స్వయం లేఖనము. ఈ స్వయం లేఖనము ప్రమాణము అనుట యెట్లు అను సందేహము కొందఱకుఁ గలుగవచ్చును. ఇందులకు ఈ అంశముపై చక్కని వ్యాసము వ్రాసిన శ్రీవేమూరి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సమాధానమును ఇందే చూడఁగలరు.

ఈ విషయమును మొట్టమొదటఁబ్రస్తావించి, మరల

"విద్యావతి మీరు గాఢముగను ప్రేమతోడ పిలిచి
వారసురాలవుటచేత. "స్వయంలేఖ" నాన్ని లిఖిం
పగఁజేసిన లేఖకురా లౌ శ్రీమతి రాజేశ్వరి
ఒక సందర్భమునందు మిమ్ముగూర్చి తెలిపిన వివి" అని వ్రాసిరి

ఈమెచేత శ్రీదాసుగారు స్వయముగా వ్రాయించి "స్వయంలేఖనము"నే తొలుతగా-

"శ్రీనారాయణదాస -స్వయంలేఖనమ్ము ఇద్ది
ఈ నూతన సాధనమ్ము-నవ్యమార్గగామి అయిన
ఆమహనీయునిజీవిత -పూర్వరంగమును దెలిపెడి
సమ్మోహన పరికరమ్ము" అని ప్రారంభించిరి.

అనఁగా శ్రీదాసుగారినిఁగూర్చి ఏయే అభిజ్ఞులు ఎట్లు ఉగ్గడించివ్రాసినను, అవి యన్నియు ప్రత్యక్షరసత్యములే అనుటకై గ్రంథకర్తగారు ఇట్లు ప్రారంభించుట సముచితము, సత్యమును.

రెండవ భాగములో "నారాయణదాసద్రష్ట" అనిరి. అట్లు ఏల అనిరో దానిని:

"గానకళా ప్రావీణ్యము-ముగ్ధ నృత్య రమణీయత
కథాకధన కమనీయత - కవన మహావైదుష్యము
సురగురు విజ్ఞానగరిమ-వికసిల్లగ విలసిల్లగ
చేరినట్టి సర్వజ్ఞుడు - నారాయణదాస - ద్రష్ట"

అని యిట్లు 5 ఉపపత్తులచే దెలిపిరి. అనఁగా పై అయిదు విధములయిన అంశములకు శ్రీ నారాయణ దాసుగారు 'ద్రష్ట' అనుట. 'ద్రష్ట' అనునది చాల ఉదాత్తమైన పదము. ఏదో ఒక కళలోనే నేర్పుగలవారిని ద్రష్ట అనుటకు వీలులేదు. వేదములలోఁ గొన్ని సూక్తములకు ముందు ఒక ఋషిపేరు వినిపించును. ఆ సూక్తమునకు ఆ ఋషి ద్రష్ట అని అర్థమును పెద్దలు చెప్పుదురు. ద్రష్ట అనఁగనే 'చూచువాఁడు' అను నర్థమే సామాన్యముగా స్ఫురించును. ఇచట వినినవారు, లేక తెలిసికొనినవారు అని వారి యభిప్రాయము.

"అన్యత్ర ధర్మా దన్య త్రాధర్మాత్ అన్యత్రాస్మాత్రృతాకృతాత్
అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్త తృశ్యసి తద్వద" కఠ 2/14

ఇచ్చట 'పశ్యసి' అనగా :-

(యది ఈదృశ్యం వస్తు సర్వవ్యవహారగోచరాతీతం పశ్యసి=జానాసి తెలిసికొను చున్నావో తద్వదీ=దానినిఁ జెప్పుము) అని. శాంకర భాష్యము. యజుశ్శాఖీయుల స్మార్తకర్మలలో "జాతకర్మ" అను ప్రకరణమునందు 'జాతం వాత్సప్రేణాభిమృశ్య' (పురిటి బిడ్డను 'వాత్సప్ర' అను సూక్తముతో తాకి) అనుసూత్రముతోఁ జెప్పఁబడిన సూక్తము 'వాత్సప్రసూక్తము. "దివస్పరి ప్రథమం జజ్ఞే" అను ఋక్కుతో ప్రారంభింపఁబడునది. ఇట -వాత్సప్రేణ=వత్సప్రఋషిణా దృష్టేన = (వత్సప్ర అను పేరుగల ఋషిచేతఁ దెలిసికొనఁబడిన, వినఁబడిన) అని హరదత్తభాష్యము. ఈ ఋషులను శ్రుతి గోచరమైన దానినే) 'ద్రష్ట' అను శబ్దముతో సూత్రకారులు వెల్లడించిరి.

"ప్రలయే-ంతర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః"
తపసా లేబిరే పూర్వమనుజ్ఞాతాః స్వయంభువా"

అనుస్మృతి ననుసరించి 'ఋషులు' అనఁగా – మహాప్రళయమునకు ముందు, ఏయే వేదములు, ఏ యే ఇతిహాసములు ఉండి, ప్రళయ సమయమునందు ఆ వేదపురుషుని యందే లీనములై యుండినవో మరల సృష్టి ప్రారంభమైనపుడు, ఆయా వేదాదులు బ్రహ్మయొక్క ఆజ్ఞచేత ఏ యే మహాత్ముల చెంతకుఁ దమంతకుఁ దామే వచ్చి శ్రవణరూపమున వారినిఁ జేరినవో (వారికి వినఁబడినవో) ఆయా భాగములు ఆయా ఋషుల పేళ్లతో ప్రసిద్ధములైనవి. ఈ భావమునే దెలుపు నట్టిది "-ప్రళయే అంతర్హితావేదాః యాన్ 'ఆర్షంతి' తే ఋషయః" యీ వాక్యము.

కాఁబట్టి, శ్రీదాసుగారు 'ద్రష్ట'. అనఁగా (గానకళా ప్రావీణ్యాదులు) నవ్యమార్గగామి= ఆయా గాన నృత్య తాళ అభినయ రచనలలోఁబయనించి భావితరములవారికి మార్గదర్శకులు అయిరి. అనఁగా, "దాసుగారికి ముందు ఆయా మార్గములు లేవని, వానిని దాసుగారు స్వోపజ్ఞతో రూపొందించిరి ఆయా కళాసమూహములు తమంతకు తామే దాసుగారి యొద్దకు అహమహమిక (నేను ముందు నేను ముందు) తో వచ్చి వారి ద్వారా లోకమునఁ బ్రసిద్ధిఁజెందినవి' అనుటచే 'ద్రష్ట' అనిరి.

20–లో నారాయణశబ్ద నిర్వచనము చేసిరి.

–నారాయణులైనారు "–శబ్దమ్ములు
ఎవనివలన బయలుదేఱు – అతఁడు రాయణుండు, అతఁడు
గానివాడు ఆరాయణుఁడు – ఆరాయణుడు గానివాడు
నారాయణుడు అందుచేత – తనవలననె శబ్దమ్ములు
బయలువెడలుచుండుటవలన – నారాయణుఁడయ్యె"

అని యింకన పలువ్యుత్పత్తులు చెప్పియున్నారు.

21–లో–నారాయణదాసుగారు –బ్రహ్మశక్తి, త్రికళ – వృత్తాంతమును వర్ణించిరి.

22.) "నాలుగేండ్ల యీడుననే చదువు లన్ని వాటి అంత
టనే మీకు అబ్బినాయి – లయకారుడు, మాటకాడు".

మున్నగు విశేషములు చెప్పిరి. ఇచట లయకారుడు=తాళభేదములను సృష్టించినవాడు – "లయబ్రహ్మ" బిరుదు – నవరసతరంగిణి అను వీరి నూతన సృష్టి–

దీని వలన "లయకారుడు" అనుట సార్థకము

25) "ఆదిభట్ట" శబ్దనిర్వచనము

"నారాయణదాసుగారి – గృహనామము ఆదిభట్ట
భట్టశబ్ద మా పండిత – వాచకమ్ము ఆదిభట్ట
వారిలోన అజ్జాడవారు – ఎంతో విశిష్టులు అంటూ

తెలియనౌట "ఆదిశ్చాసౌ భట్టశ్చ ఆదిభట్ట"

ఆదిభట్టవంశము నా–రాయణవంశమ్ము గాను

కీర్తికెక్కుటకు నారా–యణదాసులె కారణమ్ము"

ఇచటనే వీరి విద్యాప్రాప్తి – హరికథాకథనము, గానము మొదలగు విశేషములు పేర్కొనఁబడినవి. మఱియు భావికాలమున భక్తులలో ప్రహ్లాదాదులవలె నారాయణునకు దాసుడు అయి తీఱును. ఇతని జన్మవంశమునకు జెందినట్టి జ్ఞాతుల కంటె, విద్యావంశానికి జెందినట్టి జ్ఞాతులె విస్తారంగా ఉంటారు. ప్రస్తుతాంధ్రలోకంలో హరికథచెప్పే ప్రతివ్యక్తియు – ప్రత్యక్షముగానో పరంపరగానో ఈయన శిష్యులు అయితీరవలెను.

పై వాక్యములు "చెళ్లపిళ్ల"వారిని –

'అందగాంగ్ర తలకట్టు':–

మైసూరు దొరేను తోడాలను తొడుగుట, అంకినీడు కాలికి గండపెండేరము తొడుగుట, 18వ ఏటనే అరవము, మలయాళము, కన్నడం, బంగాలీ, తెలుగు సీమలందు మెప్పుపొందుట, 80వ యేట గూడ గజ్జెగట్టి కథచెప్పుట. వీరు రచించిన గ్రంథములు.. వివరించిరి.

15) శ్రీ దాసుగారి –మూర్తి విశేషము వారి అలంకారమును గూర్చి, తెలుపుచు :

> "శారదావతార మీరు–పెద్దదయిన తలకొప్పును
> దానిపైన రమ్యపుష్పగుచ్ఛమ్ములు, ఫాలభాగ
> మున కుంకుమబొట్టు కనుల – దిద్దుకొన్న కడు నల్లని
> కాటుకయును దేహముపై – లేపనాదులు..."

ఇచట, దాసుగారు కన్నులలో కాటుక పెట్టుకొనినారు, అనుటను గూర్చి కనుల–కాటుక స్త్రీలకే అనిపించును, అట్లుకాదు, స్మార్తకర్మలలో "స్నాతక వ్రతము" అను ఒక సంస్కారమున్నది. ఇది నేఁడు 30వయేట పురుషులు యాజ్ఞికులకొఱకు కన్యాదాతలనుండి పాదరక్షలు, గొడుగు – కఱ్ఱ –అద్దము, మొదలగు వస్తువులను సంపాదించుటకు, "కాశియాత్ర" అను నొక అభినయము జరుపుకొనుచున్నారు. ఈసంస్కారము ఎప్పుడు బ్రహ్మచారి చేసికొనవలెనో దానినిఁ గూర్చి ఆపస్తంబమహర్షి:

> "వేద మధీష్యస్నాస్యన్... (5 12 1 ఆపస్తంబసూత్రము)" అని
> ప్రారంభించి "ఏవం ఉపనీత చరితబ్రహ్మచర్యః అధీత వేగ
> షడంగః యది ఆచార్యకులాత్ అన్య మాశ్రమం ప్రేప్సుః
> భవతి. తస్య స్నానం నామ కర్మ ఉపదిశ్యతే..."

ఉపనయనము నాఁటినుండి గురుకులముననే ఉండి బ్రహ్మచర్యవ్రతముతో షడంగములతో పాటు, మొదట స్వశాఖాధ్యయనమును చేసి, వీలున్నచో మఱొక వేదమును అధ్యయనము చేసిన తరువాత, బ్రహ్మచర్యాశ్రమధర్మములను వదలి, మఱొక ఆశ్రమము ప్రవేశింపఁదలఁచినచో (గృహస్థాశ్రమమును స్వీకరింపఁ దలఁచినచో) అట్టి వానికి "స్నానం" అను సంస్కారము ఉపదేశింపఁబడుచున్నది. ఇట్టి సంస్కారమును పొందినవాఁడు "స్నాతకుఁడు" అనఁబడును. వీఁడు చేయునదే స్నాతకవ్రతము. దీని తరువాత ఒకవేళ వెంటనే గృహస్థు కాలేక పోయినచో బ్రహ్మచర్యాశ్రమ ధర్మములను

వదలుకొనవచ్చును. అప్పుడు బ్రహ్మచర్యవ్రతములోపముఁ దద్వారా ప్రాయశ్చిత్తము అవసరము ఉండదు అని అభిప్రాయము. ఈ సందర్భముననే బ్రహ్మచారికి తగని విలాసాదులు ఇచట సంస్కారపూర్వకముగా స్వీకరింపజేయుదురు. వానిలో –

"ఏవ ముత్తరైః యధాలింగఁ స్రజః (పూలమాల) శిరసి, అంజనం (కాటుక) ఆదర్శావేక్షణం (అద్దములో తన బింబమును చూచుకొనుట) ఉపానహే (చెప్పులు) ఛత్రం = (గొడుగు) దండః (కఱ్ఱ ధరించుట) అనునవి స్నాతకమునుండియే ప్రారంభము. బ్రహ్మచారిగా ఉన్నప్పుడు పై వస్తువులను ధరింపరాదు, అనుట.

కాటుకను గూర్చి :

"యదాంజనం త్రైకకుదం జాతగ్ం హిమవత ఉపరి, తేన
వామాంజే తేజసేవర్చసే భగాయ (బలాయ) చ"

(ఏకాగ్నికాండ=2-9-11)

త్రికకుత్, లేక, హిమవత్పర్వతములందు దొఱకునట్టి ఓషధులచేఁ గల్పించిన కాటుకను స్నాతకుఁడు కన్నులలో పెట్టుకొనవలెను. దానివలన కంటికి దృష్టి శక్తియే గాక ముఖమునకు తేజస్సు గలుగునఁట!

ఈ రహస్యము నెఱిఁగినవారు కావుననే శ్రీదాసుగారు కంటికి కాటుక ధరించెడివా రేమో!

15) శ్రీ సోమయాజులవారి 11వ ఏట, శ్రీ దాసుగారు గుంటూరులో హరికథ చెప్పుటకై వచ్చి కథారంభమున దైవప్రార్థనాదులు పూర్తిచేసి :

"చిత్రంగా హరికథవిం–టారా హరకథవిం
టారా! అని సభవారిని–ప్రశ్నిస్తే అప్పుడచట
చమత్కారశీలి అయిన – ధనికు డొకడు దర్పంతో
హరకథనే చెప్పండి –నేటిదాన్ని బట్టి రేపు
హరికథ వింటామొ లేదొ తేలుస్తా మన్నాఁడు"

"మీరు కోరినట్లు హరకథనే చెప్పుతాను" అని పార్వతీపరిణయమును చెప్పినారఁట!

16) వారు నాడు చెప్పిన కథాసారాంశ విశేషములు.

"దక్షయజ్ఞవేళ విష్ణువునకు శివునకు యుద్ధము సంప్రాప్తించుటచే భద్రతకై సతీదేవిని బ్రహ్మ తనలో నిలిపెను. కాఁబట్టి తన శీలముపై అనుమానముతో తన భర్త తననుఁ (మన్మథుడు పుష్పాస్త్రము వేసినప్పుడు చూచియు) చేరదీయ మానెనేమొ అన్న ఊహ కలిగి పరమేశ్వరి తీవ్రతపము చేసినదఁట! తపఃఫలమును ఆమెకుఁ బ్రసాదించుటకై శివుఁడు బ్రాహ్మణవేషములో వచ్చి ఆహారము పెట్టమంచు అర్థించెను.

నగపుత్త్రిక "నదిని స్నామాడిరండు" అని అడిగెను
బ్రాహ్మణుండు నదిలో దిగి, "మొసలి ఒకటి నన్ను
అంచు అరిచి" లేవదీయు మంచు నామె వేడినాడు
లేచి ఆమె నదియొద్దకు – వెళ్లె. కాని పరపురుషుని
ముట్టు టెట్లు? అని సంకోచించుచుండె.
అపుడు శివుడు నిజరూపము చూపినాడు" –

(ఇది వరాహపురాణాంతర్గతము)

ఈ కథలో శ్రీదాసుగారు, వ్యాసుడు బోధించినట్టి వైదిక పౌరాణిక విజ్ఞానపు రుచిని చూపినారు. గాంధర్వకళానుభూతి, నారద తుంబురు జ్ఞానప్రావీణ్యము తండు మహానృత్యకేళి, నందీశ్వర నాట్యకళావైశిష్ట్యము మంజుల మహతీకచ్ఛపి తంత్రుల మహాత్మ్యములను దర్శింపజేసినారు.

గాంధర్వకళ = అనఁగా : – కాళిదాస మహాకవి రఘువంశమున వ్రాసిన, "మనో–భిరామాః శృణ్వం తా రథనేమిస్వనోన్ముఖైః –

షడ్జ సంవాదినీః కేకాః ద్విధా భిన్నాః శిఖండిభిః (1–39)

అను శ్లోకవ్యాఖ్యలో శ్రీమల్లినాథసూరిగారు 'షడ్జస్వరము' సరిగమపదని అను వానిలో 'స' అనునది "శుద్ధీ వికృత భేదన ఆవిష్కృతావస్థాయాం చ్యుతాచ్యుతభేదేనవా షడ్జో ద్వివిధః" అని వ్రాసిరి. పైఏడు అక్షరముల స్వరములలో షడ్జ పంచమ (ప)ములు సర్వభేదము కలవికావు. పంచమముతో సంబంధములేని రాగములు ఉన్నవికాని షడ్జముతో సంబంధము లేని రాగము లేనేలేదు. రాగ మేదియైనను షడ్జస్వరములో లీనము కావలసినదే ఈ స్థితిలో షడ్జముగూడ రెండు విధములు అనఁగా దానిని రెండు విధములుగా పలుకుట సాధ్యమే కాదనిపించుచుండఁగా, కాళిదాస మహాకవి

"ద్విరాభిన్నాః" అనుదానికి వ్యాఖ్యతలు వ్రాసిన వివరమునుబట్టి 'ఆ' స్వరభేదమును గంధర్వులకే పలుక సాధ్యమని మానవులకు సాధ్యముకా దని తెలుఁగు లిపి వ్యాఖ్యలో నున్నది. శ్రీదాసుగారు పలికి చూపించినను ఎవరో ఒకరిద్దఱు వారిశిష్యులు తప్ప తక్కిన వారికి కర్ణగోచరమే అయియుండదేమో!

17) కాళిదాస వాల్మీకుల కవితామహనీయతలతో, మనోభావమధురిమలతో కథను నడిపినారు. ఆనాఁటి శ్రోతలతో వేద శాస్త్ర పురాణేతిహాస విజ్ఞులు "కథాగానవాచస్పతి" అనిరఁట!

23) వ్యాసుఁడు వేదార్థప్రతిపాదకములైన భారతాదులు లిఖియింపఁగా వారిని "కారణజన్ములు" అనిరి. అట్లే శ్రీదాసుగారును అందలి కథలను హరికథలుగా రూపొందించి గానముచేసినారు. వారి శిష్యులును అట్లే చేయుచున్నారు.

24) ప్రాచేతసుడు తపసువల్ల వాల్మీకను బిరుదు పొందినాఁడు. శతకోటి ప్రవిస్తరమౌ మహాకావ్యమును రచించి కావ్యగుణములైన సౌందర్యాదులను వర్ణించి రససిద్ధిని పొంది, పఠితలను సైతము ఆచంద్రార్కము రససిద్ధులను గావించిన కావ్యశిల్పము అజరామరము. అట్లే శ్రీదాసుగారు ఆ ఋషి చంద్రుని యోగశక్తిచే కొల్చి అఘమర్షణ మంత్రస్నానము (పురుషులు, తమ తమ అన్ని విధుములైన పాపములను, తాము స్నానము చేయు నీటిలో ఉన్నా 'క్రూర - అమేధ్య- అశాంత' అను మూడు చెడ్డగుణములను పోగొట్టి శారీరకముగా మానసికముగా తమ్ము పవిత్రులను చేయుమని వరుణుని ప్రార్థించు మంత్రభాగము - దీనినే 'అఘమర్షణసూక్తము' అందురు, 'సుడులలో త్రిప్పి చంపుట' అనునది వీటియందలి క్రూరగుణము. పాచినురుగు మొదలగు అపవిత్ర వస్తువులతో గల సంబంధమే అమేధ్యము- "వేడి, పైత్యమ్ము వాతము, శ్లేష్మము" అను గుణములు నీటిలో గల 'అశాంతము' అనునది) చే నిత్యపునీతులై వాచికము, ఉపాంశువు మానసికము అను మూడు విధములైన జపము. "స్వాధ్యాయము" అను వీని ఫలితమే శ్రీదాసుగారికి కవితాశక్తి గలిగించినది.

25) శ్రీదాసుగారి రచనలు సర్వప్రజాసంక్షేమమును. భక్తజనులకు మాంగల్యము (మేలును) గలిగించునవి.

27) సదా సంతోఽభిగంతవ్యాః యద్యప్యుపదిశంతి నో
యాహిస్వైరకథాస్తేషాం ఉపదేశా భవంతి హి"

అను పెద్దలసూక్తికి "శ్రీదాసుగారు ఉదాహరణభూతులు" అను విషయమునే (ఎప్పుడును) సహృదయయులైన పండితులకును, పెద్దలకును సేవచేయుము. వారు నీకు ఏదేని మంత్రోపదేశము చేయుటలేదు అని అనుకోవద్దు. వారు మాటలాడు మాటలనే నీవు వినుచున్నచో ఆ మాటలలోనే నీకు కొన్ని ఉపదేశమువలె మేలు కలిగించును. 26 అంశము నందలి, "ఓ బాబూ! కథచెప్పే నైపుణ్యం నేర్పు"దని ఒకశిష్యుడు చనువుతో అడిగెను. "ఒరే శిష్యా! నన్ను ఎపుడు చూస్తుండుము. నా మాటను నా తీర్పును చూస్తుండుము" అను మాటలే వానికి ఉపదేశముకాగా భ్రమరకీటకన్యాయమున 10 సంవత్సరాలు అట్లేచేసి ఆ శిష్యుడు శ్రీదాసుగారి అనుగ్రహ పాత్రు డైనాడు – ఇట్టివా రెందరో, అను విషయము.

మఱియు

"–అభినయోచితముగ – లాస్య తాండవ ప్రజ్ఞల
తెలిపినారు చూపినారు"–

స్త్రీ చేయు నాట్యమును 'లాస్యము' అని, పురుషుడు చేయు నాట్యమును 'తాండవము' అని పెద్దలు అందురు. శ్రీదాసుగారు స్త్రీపాత్ర చేయు లాస్యమును, పురుషపాత్రము చేయు తాండవమును, కథాభాగము ననుసరించి వారు అభినయించుటయేగాక, వాని వాని భేదములను, ఆ ప్రక్రియల భంగిమలను లాస్య తాండవ భేదములను బట్టి శిష్యులకు నేర్పుట మరియొక ప్రతిభ. ఇది అనన్యసాధ్యము.

27) 'శంభో' అను ఆలాపన – 'గోవిందా' అను స్మరణం".............

'శంభో' అనువాఁడు 'శైవుడు' 'గోవిందా' అనువాడు 'వైష్ణవుడు' అని సామాన్యాభిప్రాయము. హరిహరులందు భేదములేని భక్తులు 'హరిహరాద్వైతులు'. ఇది ఉన్నతస్థాయికి పోయినప్పుడు ఎట్లుందురు? ఆ భక్తియందలిఅద్వైతము ఎట్టిది? అని ఆలోచించినచో, తిక్కయజ్వ మున్నగువారు కొందఱు చరిత్రలో నున్నారు. తిక్కయజ్వ "కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం తవ స్వాదు వద ప్రభో మే" అని స్తుతించెను. హరిహరనాథునకు అంకిత మిచ్చినందున ఈ స్తోత్రములోని విశేషణములు క్రమముగా హరిపరముగా హరపరముగానే అన్వయమునకు రావలసియున్నవి. కాని శ్లోకమునందు –

"ఓ ప్రభూ! నీకు అస్థిమాల (పుసుకలమాల) ఇష్టమా? లేక కౌస్తుభ
మణి యిష్టమా? అట్లే "నీకు కాలకూటవిషము రుచిగా నుండునా?
లేక యశోద యిచ్చిన చనుబాలు రుచిగానుండెనా? తెలుపుము"

అనుటలో మొదట హరికే విశేషణములు ఉండవలెను.

కాని ఆస్థిమాల, కాలకూట పదములు మొదట నున్నవి. ఇవి శివునికి విశేషణములు, అట్లె "కౌస్తుభము, యశోదాస్తన్యము" అనునవి హరిపరమైనవి. అవి తరువాత నున్నందున శ్లోకమున హరిహరుల వరుస తప్పినట్లు అనిపించును: కాని హరియందు, ఆస్థిమాలను, కాలకూటపానమును, హరుని యందు కౌస్తుభమణిని, యశోదాస్తన్యపానమును దర్శించిన తిక్కయజ్వ హరిహరాద్వైతి కావుననే ఇట్టివారిస్థితినిఁ గూర్చి:-

"హరేహరేతి నామ్నా వైశంభో చక్రధరస్య చ
రక్షితా బహవో మర్త్యాః శివేన పరమాత్మనా"

అని పెద్దలసూక్తిని, ఇచట సమన్వయించు కొనవలెను.

హరే=ఓ విష్ణూ!, హర=ఓ శివా!, ఇతి, అని శంభోః=శివుని యొక్కయు చక్రధరస్యచ = విష్ణువు యొక్కయు, నామ్నా= పేరు (స్మరించుట) చేత శివేన = మంగలకరుఁడైన (తన నామస్మరణము చేయు వారికి మేలు గలిగించునట్టి) పరమాత్మనా: సర్వాంతర్యామి, సర్వాత్ముఁడును అయిన దైవము (హరిహరాభేదమూర్తి) చేత, బహవో మర్త్యాః=పెక్కుమంది మనుష్యులు (భక్తులు) రక్షితాః=కాపాడబడిరి. అనఁగా ఒక భక్తుఁడు శివుని ఓ విష్ణువూ, అనియు విష్ణువును, "ఓశివా" అనియుఁ బిలిచినను వారు భక్తులను కాపాడుదురు అని తాత్పర్యము. శ్రీదాసు గారి భక్తియు ఇట్టిదే.

28) శిష్యులను హరికథకులుగా తీర్చిదిద్ది వారిని తన దగ్గఱనుండి సాగనంపునపుడ "పుణ్యకార్యవిజయోపేతులు గండు" అని దీవించుట వారి పరిపాటి.

29) కులమత భేదాలను స్త్రీ పురుష భేదాలను పాటింపక వారిని దగ్గఱదీసి ఎవ్వరిని కించపరచక, సమయానుకూలముగ వారిని హెచ్చరించి, పీడితాళిబాధల దీర్చు ప్రగతిశీలురు. ఇట్లే స్త్రీలను పెక్కుమందిని హరికథా కథనదక్షలనుగా చేసిరి. ఈ వివరమును పాఠకులు 34వ భాగములోను చదువుకొనవచ్చును. ఒకదాసిని

దేవదాసినిఁగా చేసిన కథ – ఈ కథలోనే

"దేవదాసిరూపంతో –స్వయంగాను అభినయిస్తు"
... "స్తనవల్కల వసనమ్ములు – కడు రమణీయముగ దాల్చి॥
... సర్వజనుల స్త్రీ పురుషుల – నందరినీ కొంతవఱకు
తన వలెనే స్త్రీలజేస్తు – రజోభావ రాధికలుగ
కృష్ణ భుజింగికల వోలె – భిన్నభిన్న గోపికలుగ
పరివర్తనచేయటమ్ము..."

అను వర్ణనములో శ్రీ సోమయాజులుగారు "రజోభావరాధికలు" అనుటలోని సారస్యమును సహృదయరసికులు గమనింపఁగలరు. మఱియు గోపికలు "కృష్ణభుజింగికలవోలె" అనుటయు, ఆ గానమునకు గోపికలు పెంటి నాగుబాములవలె ఆనందమున మునింగిరి అనుట సామాన్యము. కాని 'విటుఁడు, నాయకుఁడు' అను అర్థము నిచ్చు భుజంగ శబ్దమును గ్రహించి "కృష్ణుఁడుభుజంగుఁడుగాఁగలవారు" అను బహువ్రీహిని ఆశ్రయించినచో పఠితలు ఆ గోపికాకృష్ణుల చిత్రములను తమ మనఃపటములపై దర్శింతురు. ఇట్టి దాసుగారు "స్త్రీపురుషుల నందరినీ... తనవలెనే స్త్రీలజేస్తు" అను వాక్యమును చదువగానే శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు ఆముక్తమాల్యద పీఠికలో వ్రాసిన:

"గోవిందనందతనయా చ వపుఃశ్రియా చ
మాస్మిన్ నృపే కురుత కామాధియం తరుణ్యాః
అస్త్రీకరోతి జగతాం విజయే స్మరః స్త్రీః
అస్త్రీ ఇనః పునరనేన విధీయతే స్త్రీ"

(ఈ శ్లోకముగుర్తుకు వచ్చుచున్నది అనఁగా పురుష మూర్తి అయిన దాసుగారు స్త్రీ వేషమును ధరించినపుడు పురుషులను మోహింపఁజేయగలట్లు తోఁచుట వారి వేషరచనలోని నైపుణ్యము అనవచ్చును. కాని స్త్రీలను సైతము మోహింపజేయుట యెట్లనిపించును. స్త్రీలకు ఆమూర్తి స్త్రీవేషధారిణి అని కనఁబడుచున్నను "దాసుగారు పురుషుండే" అను భావము వారి మనస్సులకు బాగుగాఁ దెలియు చున్నది కాఁబట్టి వారికి స్త్రీ వేషములో పురుష మూర్తియే మోహజనకముగా గనఁబడినట్లు మన మూహింపవలసియున్నది.

27) శ్రీ దాసుగారు రచించిన "దశవిధరాగనపతికుసుమాంజలి" అను వీరి గ్రంథమునకు పీఠిక వ్రాసిన శ్రీ నూకల సత్యనారాయణగారు "విద్యార్థులకీ మాలిక బోధిస్తే మొదటి రాగమును నేర్చుకొనేటప్పుడు విద్యార్థిగ నున్నవాడు ఆ నూటెవనభయ్యో రాగమ్ము చేర్చి పాడగలిగి నట్టివాడు విద్వాంసుడుగా రూపొందును అన్నది నిర్వివాదమౌ నంశము" అనిరి.

ఈ భాగమునందే దాసుగారి "పంచముఖీషణ్ముఖి" అను అపూర్వరాగ తాళపంచముఖి విషయముగూడ కలదు.

29) దాసుగారు వ్రాసిన 'జానకీశపథః' హరికథ, ఇందలిపాటలకు దాసుగారి స్వరకల్పన అపూర్వము.

46) శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారు దాసుగారినిఁ గూర్చి వ్రాసిన విషయమును శ్రీ సోమయాజులు చిత్రించిరి.

ఇట్లు వ్రాయుచుఁబోయినచో ఈ వ్రాఁతయే పెద్దదగుననియు, శ్రీ దాసుగారి సూక్తులు ఎల్లరకు పాటింపఁదగినవిగాఁ దోచినందున వానిని సంగ్రహముగా వ్రాయుచున్నాను.

47)

1. ఎవ డధికముగా నెరుంగునో అతఁ డల్పముగా చెప్పును.
2. వినతివల్ల ఎన్నండును ఏలోపము ప్రాప్తింపదు.
3. అల్పముగా మాటాడుము  అధికముగా గృషి చేయుము.
4. ఉత్తమమౌ ధ్యానమ్మును నీవు విడిచిపెట్టకుము.
5. ఆరోగ్యము ఘనభాగ్యము. క్రమము తప్ప కెపుడును గడియారము వలె ఉండవలయు.
6. సంభాషణ సామర్థ్యానికి మౌన మలంకారమ్ము.
7. జ్ఞానము ప్రేమల కలయికయే పూర్ణత, ఆనందము.
8. సజ్జనులతో స్నేహము–పురాణశ్రవణము – దైవచింతనము మొదలైనవి జ్ఞానప్రస్థానంలో ప్రథమమైన మజిలీలు.

9. నిద్రను స్వప్నాలచేత, స్త్రీలను ఆసక్తులతో, అగ్నిని చిదుగులచేతను దాహమ్మును మద్యంతో ఓడింపంగాలేము.

10. కలియుగమ్ములోని దోషములలో శ్రీకృష్ణుని సంకీర్తన మొకటియె సుగుణము.

11. వైరాగ్యము ప్రమిద, భక్తి తైలము, ఏకాగ్రతవత్తి, తత్త్వవిచారణ అనే అగ్నిగా జ్ఞానజ్యోతి చక్కగా వెలుగును.

"సంసార విషవృక్షస్య ద్వే ఫలే అమృతోపమే
కావ్యామృతరసాస్వాదః సల్లాపః సజ్జనై స్సహ" అను సూక్తికీ

12. తెలుఁగుగా "సంసార మనే విషవృక్షమ్మునుండి సత్సాంగత్యమ్ము, సాహితి ఆరాధన అనియెడి రెండు సత్ఫలాలు లభ్యమౌతాయి" అనిరి.

48) "జ్ఞానరహిత మైన కర్మ నిష్ప్రయోజనమ్మైనది." ఈ సూక్తితాత్పర్యముగా క్రింది శ్లోకము చూడదగును.

"హతం జానం క్రియాహీనం హతాస్త్వజ్ఞానతః క్రియాః
అపశ్యన్నంధకో దగ్ధః పశ్యన్నపి చ పంగుకః" (మునిభావబోధిని)

ఒక యింటిలో ఒక కుంటివాఁడు, ఒక గ్రుడ్డివాఁడును ఉన్నారు. ఒకనాడు హటాత్తుగా ఆయింటికి నిప్పు అంటుకొన్నది. కుంటివాఁడు (కర్మచేయుటకు తెలియనివాడు. జ్ఞానముగల వాఁడైనను) నడిచిపోలేకయు, గ్రుడ్డివాడు (కర్మలు చేయువాఁడైనను జ్ఞానము లేనివాఁడు) ఎటుపోవుటకుఁ దెలియనందున వీడును మంటకు ఆహుతి అయిరి. కాన కర్మజ్ఞానములు రెండును ముఖ్యములే కర్మములను నిర్వహించుచు చిత్తశుద్ధి ద్వారా జ్ఞానమును సంపాదించినను లోక సంగ్రహమునకైనను ఆ జ్ఞానికి కర్మాచరణము తప్పదు, అను విషయమునే దాసుగారు సూక్తిగా వ్రాసిరి.

"దీక్షతోడ సాగరమ్ము - లోన నెంత లోతు దిగిన
అన్ని రత్నములు లభించు - అట్లె పురాణాలలోన
విల్వగల్గు విషయమ్ములు - మనకు లభ్యమౌతాయి"

పై దాసుగారి వాక్యాలకు : Errors like straw upon the surface of the flow. He would search for pearls he must dive below అను సూక్తికిఁ దెలుఁగుగానున్నది. ఈ వీరి సూక్తులకు ఏ యే భాషలలో మూలములున్నవో శ్రీదాసుగారికే యెఱుక

శ్రీ సోమయాజులుగారు మొదటి అంశములో "స్వయంలేఖనమ్ము" అని ప్రారంభించిరి. ఈ స్వయంలేఖనమును గూర్చి శ్రీ వేమూరి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తమ వ్యాసములో పూర్వ పక్షసిద్ధాంతములను చక్కగా నిరూపించిరి. ".... ఈ పైవివరణమును దృష్టిలో ఉంచుకొన్నట్లయితే దాసుగారి వంటి మహాజ్ఞానికి తన నరజన్మ తీరినతరువాత కైవల్యము పొందినపుడు" "న సత్యప్రాణాః ఉత్క్రామంతి... అత్రైప సమవలీయంతే న స పునరావర్తతే" అను సూక్తులను బట్టి ఆలోచించితే వారికి సూక్ష్మశరీరమే మిగిలియుండదు. అమనస్కస్థితిలో ఉండే యోగికి లేఖనక్రియను నిర్వహించే అవకాశ మెక్కడిది? – మఱొక అంశము. దాసుగారికి మానవదేహము లయించిన తరువాత వారి ఆత్మ సరస్వతియే యైనపుడు ఆ సరస్వతి గాని, లేక ఆమెయందు లీనమయిన నారాయణదాసు జీవాత్మ గాని మరల. "నేను నారాయణ దాసును, వచ్చి యీ నా అవతార వివరము వ్రాయుచున్నాను" అని చెప్పకొనుట యెట్లు పొసగును? అని ఒక పూర్వపక్షమును కల్పించి –

...'సరస్వతీ సాయుజ్య మందిన – లేదా సరస్వత్యైక మందిన దాసుగారి యాత్మ 'కామరూపత' అనే యిచ్ఛానుసార శరీరధారణ సామర్థ్యముతో దాసుగారి సూక్ష్మశరీరము నాపాదించుకొని సాధకుల హస్తము ద్వారా తన ఆశయాన్ని లిఖించడము అసాధ్యము కానేరదు" అని సిద్ధాంతమునుగా సముచితమైన సమాధానమును వ్రాసిరి. వీరి – వ్యాసము చాల పెద్దది. తప్పక చదువ దగియున్నది.

శ్రీ నారాయణదాసుగారి చరిత్రను దెలుపు "ఉపాయన"లు "ఒక రత్నాకరము" అని మొదటనే మనవిచేసియున్నాను. దానికి ఈ"దిక్సూచి" లవమాత్ర ముపయోగ పడినను అది శ్రీనారాయణార్చకులలో నొకడనై నే నర్పించిన ఒక చిన్నపూవు అని సహృదయులకు మనవి.

అజ్జాడ గ్రామమున రక్తాక్షి శ్రావణ బహుళ చతుర్దశి బుధవారము 31-8-1864 నాఁటి శుభదినమున శ్రీ లక్ష్మీనరసాంబా వేంకటచయనులకుఁ బుత్రరూపమున అవతరించిన శారదామూర్తి. తారణ పుష్యబహుళ పంచమి 2-1-1945 నాఁడు అవతారము చాలించినను ఆ స్ఫూర్తి ఆచంద్రార్కము భూలోకమున నిలిచియే యుండుననుట సత్యము.

1967 జయంత్యుత్సవసంచిక (123) లోని శ్రీ ఓ.నీలకంఠశాస్త్రిగారి:

"బాధాకరమగు విషయము భూతభవిష్యత్తులను గూడ వర్తమానస్థితికి గొనివచ్చి సకల జన ప్రత్యక్షముచేయగల శాస్త్రసంపద ఆనాడే మనకున్నను "ఈ రేడియోలు" – గ్రామఫోనులు "ఫోటోగ్రఫీ"లు అన్ని మహాత్ముల గానామృతమును నృత్యదృశ్యములను శాశ్వతీకరింప లేకపోవుట భారత దేశమున కెంతయో తలవంపు అనుటకెట్టి సందేహము లేదు. ఆనాటి యధికారి బృంద మట్టిది. వారలు విశ్వమునకు తత్రాపి భారతీయులకు మహాద్రోహము చేసినట్లు తలంపవలసియున్నది. ప్రకృత మేమనుకొనిన నేమి లాభము?

"ముకుటే రోపితః కాచః చరణాభరణే మణిః
న హి దోషో మణేరస్తి కింతు సాధో రవిజ్ఞతా"

"కిరీటమున గాజుముక్కను, అందెకు మణిఖండమును, పొదిగినచో అది వాని అజ్ఞతయే గాని మణిదోషము గాదు" అను నీవాక్యములును సత్యములే.

ఈ "ఉపాయన"లను కీ.శే.సహృదయ నిరాడంబర విద్వద్రత్నము శ్రీ నీలకంఠ శాస్త్రిగారికి అంకితము గావించిన కవివతంసులు, పండితశౌండులు శ్రీ వావిలాల సోమయాజులుగారు. వీరిని గుఱించి నేను ప్రత్యేకముగా వ్రాయుట కంటె ఈ "ఉపాయన"లలోని 10వ భాగమున చూడఁదగును.

ఈ "ఉపాయన"లను "గానయోగ్యఛందస్సు"లో వ్రాసినట్లు గ్రంథకర్తగారే చెప్పియున్నారు. ఇట్టి గేయాలలోని భేదములలో,తోహరాలు, మంజరులు, నర్తకి, మున్నగువానిని శ్రీదాసుగారే వారి మార్కండేయచరిత్ర, సావిత్రీ చరిత్రము అను స్వీయరచనలైన హరికథలలో ప్రవేశపెట్టి నట్లు జయంత్యుత్సవ సంచికలో శ్రీపంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారు వ్రాసియున్నారు. శ్రీ సోమయాజులుగారు ఇందు 48వ భాగములో మన్వాది స్మృతులలోని ధర్మములను భంగ్యంతరముగా తేలికయగు మాటలలో వ్రాసిరి.

"మానవుండు తన్ను తానె–రక్షించు కొనంగా వలె"

(ఆత్మానం సతతం రక్షత్) అని మొదలు పెట్టబోవుచు "సహనావవతు సహనౌ భునక్తు.. తేజస్వి – నావధీతమస్తు – మా విద్విషావహై" అను శాంతిమంత్రమును గూడ సులభశైలిలో:

"భగవంతుడు మన నిర్వుర – రక్షించుత, పోషించుత
మన నిరువుర, ఇరువురమును – శక్తివంతులముగ నై

శ్రమియింతముగాత మనము - మన అధ్యయనము తేజో
వంతమ్మగుగాక - ఎపుడు - ద్వేషము లేకుండా ఇరు
వురమును మనియెదముగాక" అని వ్రాసియున్నారు.
"కృతతీర్థ పయసామి వాశయః - సతు తత్ర విశేష దుర్లభః"

"కాలువ, చెఱువు, లేక నీటిమడుగు మున్నగు వానిలో రాఁబోవువారికి స్నానము చేయుటకె దిగుటకు వీలుగా రేవును ఏర్పాటుచేయువాఁడు అరుదు. అతఁడే పొగడదగినవాఁడు" అనిన బాలకవిసూక్తి ననుసరించి యిట్టి గేయ భేదమును మొట్టమొదటగా శ్రీదాసుగారి చరిత్రలోఁ బ్రవేశపెట్టిన కీర్తి శ్రీ సోమయాజులవారిదే.

శ్రీ నారాయణదాసార్చకులు శ్రీ కర్రా ఈశ్వరరావుగారు. వారి యర్చనలో 'ఉపాయన'ల నీరాజనమిచ్చినవారు శ్రీ సోమయాజులుగారు. దానినిఁ గన్నుల నద్దికొనుటయే నా యీ కృత్యము. ఇందెంతమాత్రము కృతకృత్యుఁడనో భావికాలమున సహృదయులైన చదువరులే ప్రమాణము. నా కీ యవకాశమిచ్చిన మిత్రులు శ్రీ ఈశ్వరరావుగారికిఁ గృతజ్ఞత.

ప్లాట్‌నెం. 21 అన్నపూర్ణనగర్
అమరావతిరోడ్ గుంటూరు-34
శుక్ల-పుష్యశుద్ధోపైకాదశి.

**వట్టిపల్లి మల్లినాథశర్మ**
8-1-1990

# ఉపాయనలు

1 శ్రీ నారాయణదాస
'స్వయంలేఖనమ్ము' ఇద్ది[1]
ఈ నూతన సాధనమ్ము
నవ్య మార్గ గామి అయిన
ఆమహనీయుని జీవిత-
పూర్వరంగమును దెలిపెడి
నమ్మోహన పరికరమ్ము
గాన కళా ప్రావీణ్యము,
ముగ్ధ నృత్య రమణీయత,
కథాకథన సౌభాగ్యము
కవన మహావైదుష్యము,
సురగురు విజ్ఞానగరిమ
విలసిల్లగ, వికసిల్లగ
చేరినట్టి సర్వజ్ఞుడు
నారాయణదాస ద్రష్ట

☆

2 నారాయణదాస సుకవి
భీరహితుడు, ధీచతురుడు,
బహుముఖీన ప్రజ్ఞానిధి,
నవ్య దివ్య పుంస్కోకిల,
బ్రాహ్మీమయ భవ్యమూర్తి,
వివిధకళా కోవిదుండు
విద్య త్సంస్తవనీయుడు

☆

సంచితబహు శాస్త్ర భట్టు
శ్రద్ధాయుత ఛాత్రగోష్టు
కళలెన్నింటికొ భట్టు
ఆది భట్టు, పుంభావ స
రస్వతి అని బహురీతుల
అనురక్తితొ, పూజ్యతతో
కీర్తింపగబడుచు గ్రంథ
రచన చేసి లోకానికి
జ్ఞానమ్మును పంచియిచ్చి
ధార్మిక జీవితము గడిపి
అమరలోక మరిగినారు
హరికథాపితామహుండు!

☆

3 పిదప కొంతకాలానికి
బంధు శిష్య భక్తాళికి
సర్వ రసిక లోకానికి
తా నెవరో తెలుపుకొనం
గావలె అను ఆసక్తితొ
'స్వయంలేఖనమ్ము' అనే
ఈ సాధన స్వీకరించి
దీనిద్వార ఆదిభట్టు
తన జీవిత పూర్వరంగ
గాథను విన్పించినారు

☆

4 శ్రీనారాయణదాసుని
'స్వయంలేఖన' ప్రక్రియ
మంజులమ్ము, మోహనమ్ము,
చేతనత్వ సముపేతము,

ధార్మికశృంగారయుతం,
మహాభక్తి సంభరితం
భాస్వన్నవ విభవములకు
బంధుర సంశోధనలకు,
రమ్యరమ్య భావనలకు,
రజ్యు[1] న్మధు భాషణలకు
చేతోభవ భావములకు
చిత్రచిత్ర వర్తనలకు
ప్రవిమల విశ్లేషణలకు
విదిత జనాకర్షణలకు
విలస న్నవ నిలయమ్ము
ఒక్క మహత్కార్యార్థం
ఒక్క నవ్య సృష్ట్యర్థం
మనసు నిశ్చయమ్ముచేసి
భారతి పుంరూపంతో
పుడిమిపైన ప్రవర్తింప
ఆదిభట్ట నారాయణ
మూర్తితోటి అవతరించి
అక్కార్యము నాచరించి
అద్భుతవిఖ్యాతి తోడ
తిరోగమన మొనరించిన
సత్య కథా కథనమ్ము!

☆

5 జన రంజన కర్మవీర
సర్వ దేశ పరీవార!![2]
సద్గుణగణ బహుభూషణ
ధర్మకర్మ రణభీషణ!!
ప్రౌఢ భక్తజన నేతా,
సజ్జనగణ సంత్రాతా!!
పరమభక్తి అగ్రగామి
జ్ఞానభూమి గోలోమీ[3]
అజ్ఞులయెడు దాక్షిణ్యత
విజ్ఞుల జేసెదవు వారి
క్షేత్రజ్ఞుడవైన నీకు
చిరు భక్తులపైన ప్రేమ
చేర్తు వారి వైకుంఠము
ఆదిభట్టు, వాగధిపతి,
అల్పజ్ఞుడ నైన నన్ను
విజ్ఞుని గావించెదవో!
మధురభక్తి సంభరితను
మానిని 'రాధను' జేతువో
నారాయణభట్ట! దిట్ట!!
నా నమస్సు లందుకొనుము
ఓహో, విజ్ఞానఖనీ!
ఆహహా! ఆనందవనీ
అమ్మా, ఓ వాగీశ్వరి!
అందుకొమ్ము వందనముల!
అందుకొమ్ము ఈ కాన్కల!

6 ఓ నారాయణ దాసా
ఓ దాసా! దాసదాస
నీవె స్వయంగాను వచ్చి
'స్వయంలేఖ' నాన్ని మాకు
వ్రాసి యిచ్చుకొన్నావు
శ్రద్ధతోటి, భక్తితోటి
నిష్ఠతో పఠియించినాను
అందు నీవు నిన్ను గూర్చి
శారదావతారుడ నని
తెలియ జెప్పుకున్నావు

నీదు స్వయంలేఖనాన్ని
నేను నమ్ముతున్నాను.
శారదగానే భావన
చేసి మ్రొక్కుతున్నాను.
నీవు 'స్వయంలేఖ' నాన
[4]అబ్జయోని జాయ ననీ,
[5]నాభీకమలుని సతినని
స్వయంజ్యోతి పత్ని ననీ,
శ్రీ జ్ఞాన సరస్వతి నని
శారద నని, భారతి నని
మృదులోక్తుల, మధుశక్తుల
చిత్ర చిత్ర విలసనలతొ
తెలియ జెప్పుకున్నావు
'స్వయంలేఖ' నమ్మ్మ నందు
స్ఫురియింపగ జేసి నట్టి
అంశమ్మును విశ్వసించి
శారదవను నమ్మికతో
అర్పించితినయ్య నీకు
సాష్టాంగ నమస్కారము.

నమ్మజాల యట్టివారు.
ఉంటూనే ఉంటారు.
శ్రీ హరి అవతారాల్లో
పరిపూర్ణమ్ములు రెండు –
శ్రీరాముని అవతారం,
శ్రీ కృష్ణుని అవతారం!
ఈ రెంటినె నమ్మినట్టి
వారు జగతి నెంతొమంది,
నమ్మనివా రెంతొమంది
తొలుత నమ్మనట్టివారు
పిదప నమ్మువా రెందరొ
వాగీశ్వరివే నీ వని
నారాయణదాసు శార
దావతార మనీ జగము
నమ్మటములో నైనా
ఇట్టి అంతరాలుంటవి
అయితె, మీరు "శారదావ
తారు" లనెడివారి దేను
లోకంలో మేలు చేయి,

⋆

7 నారాయణదాస! నీవు
శారదావతారమ వని
నమ్మువారు నమ్ముతారు!
నమ్మువారు వేనవేలు!
నమ్మనివారా నమ్మరు
వారు ఎందరో ఉందురు!
ప్రతియుగాన లోకంలో
పరమేశ్వరు నవతారా
లను నమ్మిన యట్టివారు

8 సిరుల కాటపట్టు విద్య
లెల్ల పట్టినట్టి యిల్లు
[6]కర్మఠుల నివాసభూమి
జ్ఞాను లయినవారి కాల
వాలమ్మును, భక్తజనుల
కునికిపట్టు ముసీ క్షీర
నదీ గుండ్లకమ్మలు ప్రవ
హింపంగా, తృణజలకా
ష్ఠాది సమృద్ధిని వహించి

నట్టి వంగవోలు సీమ
అందు కందుకూరు సమీ
పాన ఉన్న "సర్వదేవ -
అగ్రహార" మందు నిరం
తరమును శ్రీ భగవత్సే
వా తత్పరు లయిన వావి
లాలవారు, తెలుగునాటి
వైదికాగ్రగణ్యులయిన
వారు వసిస్తుండెవారు.
ఆ వంశములోని 'సదా
శివశర్మ'ను వేదశాస్త్ర
కోవిదుండు, అగ్నిష్టో
మమ్ము చేసి సోమయాజి
అయినాడు. ఆయన తన
పత్ని వలన నొక తొమ్మిది
మంది పుత్రులను పొందుట
వలనను "నవపుత్ర సోమ
యాజి" యయ్యె. విఖ్యాతితో
ఆయన - వంశమ్ము నందు
యజ్ఞమ్ముల నాచరించి
సోమయాజులైనవారు
ఎంతమందొ ఉన్నారు.
అట్టి వారిలొ ప్రసిద్ధు
డయిన కృష్ణసోమయాజి
మనుమడిగా పుట్టినాడ
బహు విద్యా దానయాజి!
సోమయాజి యైన నేను
పెట్టు సోమయాజి నేను.

☆

9

నవ్య మార్గ సంవాసా
ఓ నారాయణదాసా!!
సంస్కారము నొందిఉన్న
సజ్జనవంశమ్ము నందు
పుట్టినానె గాని నేను
రెండేండ్లకె నా తండ్రిని
ప్రజ్ఞాన్వితు కోలుపోతి.
తల్లి ఎపుడు వ్యధనొందుచు
అస్వస్థత నుంటచేత
ఆప్తబంధువుల ఇండ్లకు
అప్పుడప్పుడేగి అచట
శ్రద్ధాభక్తులు వహించి
జ్ఞానార్జన చేయుచుంటి
అట్టి నాదు బాల్యదశను
నాకు వయసు పన్నెండేండ్లు.
అభ్యర్థన స్వీకరించి
రాయల ప్రాంతాని కేగి
పరమేశ్వర విద్యా వై
దుష్యమ్మును మేళవించి
కథాకథన మొనరించుచు
ప్రజ్ఞాప్రౌఢిశుల దివ్య
గాంధర్వకళా వైభవ
సంపత్తిని పంచి ఇచ్చి
ఆనందామృతము త్రావ
నబ్బజేసి సంతృప్తితొ
విజయనగర మరుగుచున్న
వేళను మా గర్తపురీ
భక్తజనుల అభ్యర్థన
నాదరించి మా నగరికి

కథజెప్పగ వచ్చినారు
నవ్యమార్గ సంవాసా!
ఓ నారాయణదాసా!!

⋆

10 "కథాగానపుంస్కోకిల",
నిత్య నవ్య మయూరమ్ము
పుంభారతి వచ్చినారు,
కథను జెప్ప నున్నా రను
[7]క్రమవిషయ మెరిగి నేను
ఆటభూమి నుంచి ఇంటి
కతివేగముగాను చేరి
దాసుగారి కథను నేను
వారి పాదములకడ నుప
విష్టుడనై శ్రద్ధతోడ
వినగావలె సాయపడుడు
అని ప్రార్థన చేసినాను.
పురములోని విజ్ఞులలో
ప్రముఖులైన మేనయత్త
భర్తలైన మామగారు
నా ఆందోళనను చూచి
చేరబిల్చి చతురతతో
బుజ్జగించి "ఒరే యాజి!
సుప్రసిద్ధ నామధేయు
లైన వారి కథను వినగ
నేనూ ఒక శ్రోతనురా!
నీ కోరిక తీరుస్తా!!"
అంటు మాట యిచ్చినారు.

⋆

11 తమ హరికథ కేర్పాటులు
చౌతరాలో జరిగాయి.
వేలవేలమంది జనం,
పురములోనివారు, ప్రక్క
ఉన్న ఊళ్లలోని వారు
శ్రోతలుగా వచ్చి సభను
నింపినారు పరమభట్ట!
మిమ్ముగూర్చి పలువిధముల
విన్నయట్టి విజ్ఞానులు
సైతము మిము వీక్షింపగ
స్వాభిమాన దర్పంబుల
ఎట్లొ విడిచి, విడువకుండ
వచ్చి సభను చేరినారు,
స్థానమ్ముల పొందినారు.
శారదావతార! మీరు
పెద్దదయిన తలకొప్పును
దానిపైన రమ్య పుష్ప
గుచ్ఛమ్ములు, ఫాలభాగ
మున కుంకుమబొట్టు, కనుల
దిద్దుకొన్న కడు నల్లని
కాటుకయును, దేహముపై
లేపనాలు, చందనాది
గంధమ్ములు, అన్యమైన
అంగరాగ భోగమ్ములు
ఆభరణాలను ధరింప
కడు నపేక్ష, పురుషులపై
తమ్ము మోహపరచునట్టి
నైజ రమ్య లక్షణాల
వ్యాప్తినొందు సురభిళాల

తో నొప్పెడు వేషముతో
నాట్య ముగ్ధ గమనమ్ముల
ఉజ్జ్వలాభినయ వీక్షల
అరుగుదెంచినారు భట్ట!
సభ సర్వం అద్భుత క
ళ్యాణ మందిర మ్మయినది.
సభకు దివ్యవాతావర
ణాన్ని కల్పనమ్ము చేయ,
సహకరించు వాద్యగాంధ్ర
నలువిధమ్ము లయిన యట్టి
అభినయాల హెచ్చరించి
స్థానోచిత స్తోత్రాలతో
వాగ్దేవిని, శివరివస్యను
అన్య దేవతామూర్తుల
సంప్రార్థన చేసినారు
అనుభూతికి ఏమి తోచె
నో ఏమో అపుడు మీరు
చిత్రంగా "హరికథ విం
టార మీరు హరకథ విం
టారా" అని సభవారిని
ప్రశ్నిస్తే అప్పు డచటి
చమత్కారశీలి అయిన
ధనికు డొకడు దర్పంతో
"హరకథనే చెప్పండి.
నేటిదాన్ని బట్టి రేపు
హరికథ వింటామొ లేదొ
తేలుస్తా" మన్నాడు.
"చేతో ముద మొదవె నాకు
మీరు కోరినట్లు నేడు
హరకథనే చెప్పుతాను.
పరమశివుడు పార్వతినెటు
పరిణయమాడెనొ తెలిపే
హరకథనే చెపుతా" నని
నిర్ణయించినారు మీరు
హర్షధ్వను లొనరించిరి.

☆

12 శ్రీ నారాయణదాసా
కథాకథన మహాదక్ష!!
గౌరీకల్యాణకథను
తాము ఇట్లు నడిపినారు
సతీదేవి శివునిపత్ని,
పతినిగాని, తననుగాని
తండ్రి అతడి యజ్ఞానికి
పిలువకపోయినను సోద
రీమణులను చూచుకోర్కె
తోడవచ్చె. దక్షు డపుడు
"జ్యేష్ఠపుత్రి నీవు నాకు
ఎపుడు నిన్ను పిలువనుగద
ఏల నీవు వచ్చినావు?
నా ఇంటికి? నీ పతిశివు
డన్యాయము చేస్తు నన్ను
నిరతమ్మును ద్వేషించును
కాన అతని పిలువలేదు,
సర్వదేవతల పిల్చితి.
యజ్ఞేశ్వరుడైన విష్ణు
వే ఈ కడ కరుగుదెంచు
వెళ్లిపొమ్ము. నీ విటను
న్నావొ శివుడె ఇటకు వచ్చు.

యజ్ఞభూమి యౌ నియ్యది
అపవిత్ర మ్మయిపోవును
నా కుల గౌరవము చెరుప
గా శివు వరియించినావు"
అని పుత్రిని కోపించెను
పరమశివుని దూషించెను.
అపు డసిక్కి, తల్లి ఏమి
పలుకలేక శోకించెను.
తనను కోపగించుట అను
విషయము పట్టించుకొనక
పతి దూషణ వినజాలక
పతినే మది స్మరియిస్తూ
మరల జన్మ కలిగినపుడు
శివుడె భర్త ఔగా కని
మ్రొక్కి, మహాయోగాగ్నిని
సృష్టిజేసి సతీదేవి
దేహమ్ము దహించుకొనియె.
తన–సతి సతి దేహ
త్యాగమ్మును ఎరిగి శివుడు
దక్షుడి యజ్ఞాన్ని ఘోర
ముగ ధ్వంసము గావింపను
వీరభద్రు పుట్టించెను,
జట నుండియె అతడు శివగ
ణాలతోటి దక్షయజ్ఞ
వాటికకడ కేగి త్రొక్కి
యజ్ఞమును, యజ్ఞశాల
నాశనమ్ము గావించెను.
కొంతకాల మైనపిదప
శివుని పత్ని సతీదేవి
తదుపరిజన్మమ్ము నందు
మేనక గర్భాన పుట్టు
నగరాజగు హిమవంతున
కని విష్ణ్వాదులు ఆతని
గేహమునకు విచ్చేసిరి.
నారదుండు విచ్చేసెను
దైవజ్ఞుండగునాతడు
పుట్టనున్న సతీదేవి
అందచందములను దెలిపి
"నీ కుమార్తె పరమశివుని
పత్ని ఎంత అదృష్టమ్ము
నీ యది హిమవంతా!" అని
సంతోషము నొంద జెప్పి
నతుల నంది అరిగినాడు.
హిమవంతుడు, పర్వతరా
జధికదీక్ష తపమొనర్చి
తన వంశము విస్తరింప
జేసుకొనంగా దలచెను.
దేవతలందరు పితరుల
కడకు వెళ్లి "హిమవంతుడు
పెండ్లాడగ దలచినాడు.
ఇది అందరకును శ్రేయో
దాయకమ్ము అతడు మేన
కను పెండ్లాడుటకు మీరు
ఆజ్ఞ ఇందు" అని కోరిరి.
పితరుల అనుమతి మీదను
హిమవంతుడు పెండ్లి ఆడె
మేనకను. విష్ణ్వాదులు
దేవత లేతెంచినారు

"మేనకగర్భాన శివుని
పత్నియైన సతీదేవి
నగరాజుకు జన్మించును".
అని తెలిపిరి మహాదేవు
పరమేశ్వరు, శివు నందరు
శ్రద్ధతోడ స్తుతియించిరి.
మేనకకును నగరాజుకు
మైనాకాదులు పుత్రులు
జన్మించిన పిదప పుట్టి
నది పార్వతి  జాతకమ్ము
చూపింపగ బిడ్డ అంద
చందాలను తెలియజెప్పి
తేరిచూచి వందనమిడి
"ఈమె పతి దిగంబరుండు
శ్మశానాన వసియించును.
అయిన నేమి? పరమశివుడు!
అమ్మా! ఓ మేనకాంబ!
చింతింపక – మీ పుత్రిని
పరమశివునకే యిండు"
అంటు చెప్పి నారదుండు
అధికముగా [9]నతుల నంది
అమరలోక మరిగినాడు.

☆

13 సృష్టిని గావింపు మంచు
బ్రహ్మ శివున కాజ్ఞ ఇచ్చె
నిర్వహింప నీ కార్యము
తగిన శక్తి నొందుటకై
హిమనగాన శివుడు మహా
తపము చేయుచున్నాడు.
దేవతలకు తారకాసు
రుని వలన నుపద్రవమ్ము
అధికమయ్యె ఆ రాక్షసు
సంహరింప శివుని సుతుడు
తప్ప అన్యు లెవరు చాల
రన్న విషయ మింద్రాదుల
కందరికీ తెలిసినదే!
తపము నాపి, శివుడు కుమా
రుని పొందెడు విధమును క
ల్పింప నొక్క ఆలోచన
చేసి [10]దివిజులంద రొక్క
నిర్ణయమ్మునకు వచ్చిరి.
14 ప్రతినిత్యము పుష్పాదుల
సంతరించి సమ్మోహన
వేషంతో శ్రద్ధతోటి,
భక్తితోటి కాబోయే
పతికి సేవ గావింపగ
హిమవంతుడు తనపుత్రిని
శివుని తపోభూమి కంపు
టెరిగినారు ఇంద్రాదులు,
అమరాధిపు డా మదనుని
గౌరవముతో పిలువనంపి
పీఠమిచ్చి, అంద రెరుగు
నటులుగా అర్ధాసన
గౌరవమ్ము నబ్బచేసి
"పుష్పబాణ! పరమవీర!
నీ అనన్యశక్తితోడ,
        నీ అనుపమరక్తితోడ
పనివడినది పంచాస్త్రా[11]
తారకాసురుడు మనలను

బాధించుట పెచ్చు పెరిగె
వాని సంహరించుటకై
పడతి పార్వతికి, శివునకు
పుత్రు డొకడు పుట్టగవలె
ఘోరతపము నందు నున్న
పరమశివుని తీక్ష్ణబుద్ధి
ఆయనకడ సేవజేయు
పార్వతిపై ప్రసరింపగ
జేయవలయు, చిలకతేరు
నెక్కి నీవు ఓ మన్మథ!
ఓ రతిపతి! రతికేళీ
సార్వభౌమ!! రతీదేవి
ఆవసంత, మలయానిల
గంధవాహ శుక పిక సం
దోహముతో చేరు మటకు
ముల్లోక క్షేమార్థము
వీరుడవై వర్తింపుము
విజయమ్మును సాధింపుము
లెమ్ము, పొమ్ము," అని ప్రోత్సా
హించి పంప, "కార్యమ్మును
సాధించెద, విజయమ్మును
గైకొనియెద" అంటునమ్మ,
ప్రోత్సాహక వస్తువులతో
అచటి కేగి సమయానికి
తగినట్లుగ సిద్ధపడెను.
శృంగారరసాధి నేత
శృంగారరసోద్దీపన
శక్తిమంతు డౌ మదనుడు
సమ్మోహన రూపంతో
సహజ భక్తిభావంతో
విచ్చేసెను నగనందిని!
విశ్వసృష్టి కానందిని
ప్రతిమరూపమున తోచే
పరమశివుని చేరి ఆమె
స్నిగ్ధ సౌకుమార్యంతో
అంజలించి, పరిక్రమించి
ఎదుట నిల్చి ఎదనొసంగి
పుష్పాంజలి నర్పించే
సమయంలో పుష్పధన్వి[12]
నిజదళాన్ని హెచ్చరించి
అరవిందాస్త్రమ్ము ప్రయో
గించినాడు, తపశ్శీలి
శివుని శరీరమ్ము కొంత
సంచలించె పార్వతి గనె
మదనునిగనె తక్షణమే
నొసటి కంటిమంటతొ
రతిపతి దహియించె శివుడు
పార్వతి అదృశ్య అయ్యె
ఆత్మజుగా పతిని రతికి
నొసగి శివుడు మరల తపము
నారంభము గావించెను

⋆

తండ్రి దక్షుయజ్ఞవేళ
విష్ణువునకు తన భర్తకు
యుద్ధము సంప్రాప్తించుట
భద్రతకై బ్రహ్మ తన్ను
అతనిలోన నిలిపెగాన
తన శీలముపై అనుమా
నమ్ము కల్గి యుంటచేత

తనదు భర్త తన్ను చేర
దీయ మానెనేమొ అన్న
ఊహకలిగి పరమేశ్వరి
తీవ్రతపము గావించుట
జ్ఞాపకమ్మునకు వచ్చెను.

15 భర్త శివుని, మనసు మార్ప
శక్తియుక్తి జోడొనర్చి
పరమతపము చేయబూనె
పార్వతి శివుకోసంగా
తీవ్రతపము చేస్తుంటే
ఆ తపోగ్ని భరియింపగ
రానిదయ్యె అవ్వేళను
బ్రహ్మాదులు శివుని తపో
భూమికడకు అరుగుదెంచి
పరమేశ్వరి స్వీకరింపు
మని కోరిరి. బ్రాహ్మణవే
షమ్ముతోడ శివుడు ఆమె
తపముచేయు స్థానమ్మున
కేగుదెంచి ఆహారము
పెట్టుమంచు అర్థించెను.

16 నగపుత్రిక "నదిని స్నాన
మాడి రండు" అని అడిగెను.
బ్రాహ్మణుండు నదిలో దిగి
"మొసలి ఒకటి నన్ను బట్టె"
అంచు అరిచి లేవదీయు
మంచు నామె వేడినాడు.
లేచి ఆమె నదియొద్దకు
వెళ్ళె కాని పరపురుషుని
ముట్టు టెట్లు అని సంకో
చించుచుండె. అపుడు శివుడు
నిజరూపము చూపినాడు.
పూర్వజన్మమున అతడు
తనకు భర్తయౌట గౌరి
గుర్తించెను. పరమేశ్వరు
గూర్చి ఆమె తండ్రి అయిన
హిమవంతున కెరిగించెను
ఇంద్రాదుల తోడ్పాటుతో
సప్తర్షుల సాయంతో
హిమవంతుడు గౌరీక
ళ్యాణమ్మును సిద్ధపరచి
అందరి ఆనందంతో
ఉత్సవమ్ముగా జరిపెను.

⋆

17 కథాకథన చక్రవర్తి!
శారదావతారమూర్తి!!
గౌరీ కళ్యాణకథన
మైన వెనుక విషయమ్ములు
ఈ రీతిగ సాగినవి
గిరిజాకళ్యాణవేళ
గీర్వాణోచితములైన
ఆచారము లన్నింటిని
అబ్బబ్బా! అద్భుతముగ
గొప్పగాను తాము ఎంతొ
ఒప్పిదముగ జరిపించిరి.
శ్రోత లెంతొ సంతృప్తితొ
శుద్ధ బుద్ధి శోభిస్తూ
దూరమ్మున నుండి తమకు
వందనమ్ము లర్పించిరి.

హారతులుగ వెలిగించిన
దీపకాంతులను కనులకు
అద్దుకొనిరి హర్షముతో.
ఉన్నవారు పెద్దగాను
సామాన్యులు కొద్దిగాను
కాన్కల నర్పించినారు
మీ ఆపేక్ష ననుసరించి
నగరిలోని శైవాలయ
స్థితిగతులను పెంచుటకై
వాని ఖర్చు చేస్తారట!.
కథలో పాత్రలను గూర్చి
తమ ప్రావీణ్యాన్ని గూర్చి
రకరకాల చర్చిస్తూ.
సాగి ఇండ్లు చేరినారు
పలురకాల భావాలతో
నలుదిక్కుల నుంచి వచ్చి
సభను చేరినట్టి విజ్ఞు
లెల్లవారు తమ్ము గూర్చి
"హరికథాపితామహులే"
"పుంభావ సరస్వతియే"
అన్య మేమియును గాదు
యుగయుగాలు తరతరాలు
జగమునందు వసియించే
జనసంక్షేమం కోసం
వ్యాసుడు బోధించినట్టి
వైదిక పౌరాణిక వి
జ్ఞానపు రుచి చూపినారు
గాంధర్వ కళానుభూతి
శారద తుంబురు జ్ఞాన

ప్రావీణ్యము ఎరుకపరచి
తండు మహానృత్యకేళి
లక్షణాల, నందీశ్వర
నాట్యకళా వైశిష్ట్యము
మంజుల మహతీ కచ్ఛప
తంత్రుల మహాత్మ్యములను
దర్శింపగ జేసినారు.
కథాపాత్ర దృష్టులలో,
గమనాలతొ, పీఠాదుల
విన్యసనల, భంగిమాదు
లందు అభినయించి శిల్ప
కళాపుష్టి నెరిగించిరి.
కాళిదాస, వాల్మీకుల
కవితా మహనీయతతో
మనోభావ మధురిమతో
కథను నడిపినారు దాసు.
వేద శాస్త్ర పురాణేతి
హాసాదులలోని సర్వ
సారజ్ఞులు కడు విజ్ఞులు.
ఇంతటి విజ్ఞానకళా
మేళనాలు అన్యులలో
లభ్యమౌ టసంభవమ్ము
కథాగాన వాచస్పతి
అంటు గౌరవమ్ము నిచ్చి
చెప్పుకొంటు నానారీ
తుల వందన లాచరించి
విఖ్యాతి వహించినట్టి
విబుధుల మా మామగారు
తృప్తుడ నౌ నాచేతను

సాష్టాంగ ప్రణామమ్ము
లర్పింపగ జేసినారు
మీ గొప్పను నాకు చెపుతు
ఇంటికి గొనివచ్చినారు
మీరు చేయు 'శంభో!' అను
ఆలాపన 'గోవిందా!'
అను స్మరణము అనుకరిస్తు
బహుకాలము గడిపినాను.

18 ధ్యానము గావించి మిమ్ము
ఆవాహన చేసినంత
ఆదరణతో ఈనాడును
అరుదెంతువు ఆదిభట్ట!
అభినుతించి అంజలించి
ఏ నివాళు లర్పించిన
ఏది అడిగిన నది చెప్పెదు.
ఎవ్వరి కడ నేమియు పఠి
యింపకున్న నేమి భట్ట
అఖిలవిద్యలును నీవై
అలరింపగ జేసెగదా!
నృత్య సరస్వతివి నీవు,
గాన సరస్వతివి నీవు,
సాహిత్య సరస్వతివి,
సర్వకళా శారదవు
సత్యభావ నీరదవు!![13]
నీవు నిల్చు నిలయమ్ములు!!
నిస్తుల దేవాలయాలు
వేదమంత్ర మూలాలౌ
దేవతలను పిలిచి నీవు
వీక్షింపగ జేసెదవు.

19 ఓ నారాయణదాసా!
ఓహో ఓ మహాదాస!!
నీవు తెలుపు భావమ్ములు
నిత్యమ్ములు, సత్యమ్ములు
నిర్మలములు, నిస్తులములు[14]
ఆముష్మిక బోధనములు!
అఖిల [15]పాపభంజకములు!!
భక్త్యౌషధ గేహమ్ములు
వలచి వచ్చి చేరును నిను
ప్రీతితోడ, ప్రేమతోడ
మంగళ సద్ద్రవ్యమ్ముల
రమ్య పరమభాజనాల[16]
పంచియిచ్చి సమ్మోహన
[17]రసచషకము నందింతువు
కథాకథన జలధియాన!
భక్తరక్షణాభిమాన!!
కడునేర్పరి! [18]కర్ణధారి!!

20 నారాయణభట్ట! మీరు
నారాయణులే తలంప
అవతరించు వేళను నా
రాయణుండు నరసంబం
ధము గల్గిన దేహమ్మును
దాల్చుగదా! అట్లె సర
స్వతులు మీరు ఆదిభట్ట
నారాయణగాను అవత
రించినపుడు నరశరీర
మును ధరించినారుగదా!

☆

'నార'మ్మనగా జలము.
దాన్ని స్థానముగ నొందుట
నారాయణులైరి మీరు
ఓ నారాయణభట్టా!
శ్రీ నారాయణభట్టా!!
రసజలమ్ము సర్వమ్మును
రమ్యమైన స్థానంగా
గల్గి ఉంట 'నారాయణు'
లైనారు.

☆

శబ్దములు

ఎవని వలన బయలదేరు
అతడు 'రాయణుండు' అతడు
గానివాడు 'అరాయణుండు'
అరాయణుండు గానివాడు
'నారాయణు', డందుచేత
తన వలననె శబ్దమ్ములు
బయలువెడలుచుంట వలన
'నారాయణు' డయ్యె. అట్లె
సర్వమైన శబ్దమ్ములు
మీ ముఖమ్ము నుంచి ఉద్భ
వించుటచే మీరును 'నా
రాయణులే!'
సరసి యందు దక్షపుత్రు
లైనయట్టి పూతాత్ములు
హర్యశ్వులు[19, 20]శబలాశ్వులు
అమితతపము గావించిరి
అమలతపము గావించిరి.
'నారాయణ సరసి' మీది
మీకడనే 'గానకళా
హర్యశ్వులు' 'నృత్యకళా
శబలాశ్వులు' తపమొనర్చి
శామ్యవిద్య నేర్చినారు.
'నారాయణి' శత మూలిక
ఇందీవరి, నారాయణు
వలన బుట్టినట్టి గడ్డ
వేళ్ళచేత ఆవరించి
నది భూమిని, నల్ల కల్వ
పూలుబుట్టు. మీ వలనను
విద్యా శతమూలికలును
ఇందీవరు లెన్నెన్నో
పుట్టి భువిని ఆవరించె
గుణములతో విస్తరించె
మీ సేవాసంస్మరణల
మీరును నారాయణులని
నారాయణదాస భట్ట
నవ్యగతుల మాకు తోచు.

☆

21 శ్రీ శారద – అవతారా!
నారాయణదాస భట్ట!!
ఒక దినాన నేను మిమ్ము
బ్రహ్మశక్తి అని స్మరించి
ప్రార్థిస్తూ ఉండగ విని
అల్పుడొకడు నా శిష్యుడు
"అది ఏ మని అడిగినాడు.
అపుడు నేను ఇటు తెల్పితి
బ్రహ్మ విష్ణు మహేశ్వరులు
ఒకరి నొకరు ఏకీభా

వమ్ముతోడ వీక్షిస్తూ
ఉండంగా వారి చూపు
లకు పుట్టెను ఒక కన్నియ
అందగత్తె మహామాయ,
పేరు 'త్రికళ' ఆమెదేహ
మందలి వర్ణత్రయాన్ని
విభజించి ఇమ్మటంచు
కోరినారు. త్రికళదేహ
మందు నున్న బ్రహ్మశక్తి
శ్వేత పర్వతమ్ము జేరి
తపము జేసుకొనుచుండెను.
బ్రహ్మ అచటి కేగుదెంచి
కానుపించి తపము మెచ్చి
వరము కోరుకొను మనియెను.
"సర్వపదార్థముల యందు
నేను ఉండితీరునట్లు
వర మొసంగు డని అడిగెను
"బ్రహ్మశక్తి" ప్రేమతోడ
ఆమెను తన శరీరమ్ము
లోనికి గ్రహియించె బ్రహ్మ
ఆక్షణమ్ము నుండి సృష్టి
వర్ధిల్లెను.

విష్ణునికళ

నారాయణి మహావైభ
వమ్ముతోటి "మందర" నగ
మందు నుండె. నారదుండు
అచటి కేగి ప్రణామమ్ము
లాచరించి ఆమె అంద
చందమ్ముల అమితముగా
ప్రశంసించె. "విష్ణుమూర్తి
మమ్ము స్వీకరింపకుంట
చిత్రమ్మే" అంటు వెళ్ళి
పోయినాడు.

అచటినుండి

నారదుండు మహిషాసురు
కడకు నేగి "మందర నగ
మందు మహాసుందర రూ
పమ్ముతోడ ఉంటున్నది
ఒక కామిని ఆమె వంటి
భామిని ఈ విశ్వంలో
ఏ తావున కనిపించదు.
ఆమె నీకు తగిన కాంత"
అంటు తెలియజెప్పినాడు.
మహిషాసురు డామెను కొని
రండని తన సేన లంపె
నారదుండు నారాయణి
కడకు మరల తిరిగి వచ్చి
"చూచావా మహిషాసురు
కావరమ్ము నిన్ను గోరి
సైన్యాలను పంపినాడు
నీవు తప్ప నితరు లెవ్వ
రా రక్కసు గెల్వలేరు"
అని చెప్పెను. మహిషాసురు
భటులు వచ్చినంత వారి
నారాయణి ధిక్కరించె.
స్వయముగానె మహిషాసురు
డపుడు వచ్చి యుద్ధము గా
వించి సంహరింపబడియె.
నారాయణి 'మహిషాసుర

మర్దని' అని ఖ్యాతి నొందె.
'త్రికళ' లోని మాహేశ్వర
శక్తియు నొక ఏకవీర.
'రురుడు' అనే అసురు జంపి
చర్మ రక్తముల రెంటిని
వేరు చేయటమ్ము వల్ల
'చాముండీ' అను ప్రసిద్ధ
నామమ్మును పొందెనీమె.
అప్పుడప్పు డవసరమ్ము
అయినప్పుడు బ్రహ్మశక్తి
యే కాదు, విష్ణుశక్తి
శివశక్తియు అద్భుతముగ
కానుపించు గాన నేను
భావికాల లాభార్థము
నా శిష్యున కా కళలను
కూడ తెలియజెప్పినాను.

☆

22 హరికథా పితామహా!
ఆదిభట్ట! మహాభట్ట!!
నాలుగేండ్ల ఈడుననే
చదువులన్ని వాటి అంత
టవే మీకు అబ్బినాయి!!
[21]'లయకారుడు', 'మాటకాడు'
'ఆట పాట లందు మేటి'
అంటు మీరు పేర్వడసిరి.
ఏనా డైనాను ఎదురు
లేకుండా వేల వేల
మంది ప్రజకు గొంతును విని
పించినారు గజ్జె విప్ప
లేదు రేయి తుదివరకును
పాటపాడు "అందగాంధ్ర
తలకట్టని" పేరుపొంది
నారు మీరు ఎకిమీడుల[22]
కాన్క లెన్నో అందుకొనిరి.
మైసూరుదొరేను మీకు
తోడాలను తొడిగినారు.
అంకినీడె మీ కాలికి
పెండేరం[23] వేసినాడు.
పదునెనిమిది యేండ్ల మొదలు
ఆట, పాట మాటలతో
బ్రతికినారు, భట్ట, మీరు
కన్యకుమారిక మొదలుగ
కలకత్తా వరకు మీరు
అరవము, మలయాళ, కన్న
డాలు, పైన బంగాలీ
తెలుగు సీమలందు మెప్పు
తెచ్చుకొన్నవారు మీరు
మంచి గూర్చి చెప్పేవేళ
[24]ఈవికాంధ్ర తప్ప ఇతరు
లెవ్వరినీ ఎచట నైన
గౌరవింప, కీర్తింపగ
[25]చీరికిగొనువారు కారు.
చదువులెల్ల మీ అంతటె
నేర్చినారు మీ అడుగుల
నొత్తి విద్య నేర్చుకొంచు
వందలు మని నారిలలో
ఎనుబదేండ్ల వయసు వచ్చి
నపుడైనను మాటలాడు
వాంధ్ర సాటిమీర మీరు

గజ్జెకట్టినారు దాస!
హరికథామృతము కోసు[26]
మీరు తారకమ్మును కల[27]
గల్పు తెలుగుగాను కాళి
దాస షేక్స్పియరుల అంద
ముల ప్రహ్లాదాదులయిన
హరికథలను ఒక పదకొం
డిటిని, మరి, బాటసారి
సూర్య, సత్యవ్రత, ముకుంద
శతకమ్ముల మూడింటిని
సారం గను నాటకమ్ము
తెలుగులో పెరుమాళ్ల వేయి
పేర్ల వినుకలియును[28], పెద్ద
మొక్కుబడియు, [29]విడిసీమలో
తెలుగు నందు వేల్పు వంద
గౌరు పెండ్లి, మర్కటయ్య[30]
చౌకట్లును మీరు లిఖిం
చారు ఇవ్వి మీకు డబ్బు
ఎన్నెన్నో పలు డబ్బులు!
ఆర్య! చదువులకుగ నైన
యట్టి తెన్నువారికంటె[31]
మీకు నిజపు కన్నాకులు[32]
ఎటు చూచిన లేరుగదా!

23 శ్రీనారాయణభట్టా!!
ఆదిభట్ట! మహాభట్ట!!
మీరు వ్యాసభగవానులు
మీ శిష్యులు ఆత్రేయుడు
కాశ్యపుండు, భారద్వా
జుండును, వాశిష్ఠుండును
శ్రీశర్ముడు[33] వంటివారు
పురాణాలు ఉదాహరణ
లకు చెందిన గ్రంథమ్ములు
వేదార్థ ప్రతిపాదక
గ్రంథమ్ములు మహాభట్ట!
వ్యాసుడు ఏ కారణాన
లిఖియించెనొ భారతాదు
లా కారణముననె మీరు
హరికథల లిఖించినారు.
మీ హరికథలును అట్లే
కాలానికి తగినయట్టి
పరమోదాహరణమ్ములు
వేదార్థ ప్రతిపాదక
నవ్య భవ్య గ్రంథమ్ములు
ప్రతి ఒక్కటి ఒక [34]క్షేత్రం!
ప్రతి ఒక్కటి ఒక [35]తీర్థం!!
వ్యాసశిష్యులైనయట్టి
ఆత్రేయాదులు ఏగతి
పౌరాణిక విజ్ఞానము
వ్యాప్తినొందజేసినారొ
అదేగతిగ మీ శిష్యులు
హరికథాళి నిమిడి ఉన్న
భగవద్విజ్ఞానమ్మును
ఓ నారాయణదాసా!!
వ్యాప్తిజేయు చున్నారు.

24 ఓ నారాయణభట్టా
ఒక్కడు ప్రాచేతసుడు[36]
తపసువల్ల 'వాల్మీక'ను
బిరుదమ్మును పొందినాడు

"ఆ రావణలంకానగ
రీలలామ రత్నకాంతి
దేహాచ్ఛాదన వసనం
గా అచ్చటిగోశాలలు
భూషణకాంతులుగను యం
త్రాగారమ్ములు ఉన్నత
వక్షోజాలుగ[37] నలంక
రించుకొన్న యట్లున్నది"
'శతకోటి ప్రవిస్తరమౌ'
నీ ఋషీంద్రు మహాకావ్య
మం దెచ్చట తిలకించిన
సౌందర్యము, రససిద్ధియు,
శబ్దసౌకుమార్యాదుల
తో గూడిన కావ్యశిల్ప
మహనీయత గోచరించు
ఓ నారాయణసుకవీ!
ఆకవీంద్రు, ఋషిచంద్రుని
యోగశక్తి గొల్చి మీరు
అఘమర్షణ[38] మంత్రమ్ముల
వాచికమ్ము, పాంశువు[39] మా
నసికమ్మగు ముత్తెరగుల
స్వాధ్యాయము[40] అధ్యయనము
చేసి అమరులైనారు
కాకపోతె మీ కవితా
నైపుణ్యము, గానకళా
పాండిత్యము లభ్యమౌనె!

☆

25 నారాయణదాస! నీవు
సౌందర్య మహాప్రతిమవు
శ్రీశారదకాకిలమవు!![41]
నీ'కథ'లలో ప్రతిఒక్కటి
నిస్తులమౌసత్ప్రతీక[42]
నీరచనా వ్యాసంగము
నిరుపమమ్ము నిస్సీమము[43]
సకలదోష సంహననము![44]
సర్వప్రజా సంక్షేమము!!
భక్తజనుల మాంగల్యము!
దేవరాజ్య[45] దర్పణమ్ము.

☆

26 ఓ నారాయణ దాసా!
దివోదాస![46] దేవదాస!!
ఆకర్షితులై మీకడ
కరుగుదెంచినట్టి వారి
కులమత భేదాలుచూడ,
కంతేవాసులను జేసి,
ఆధ్యాత్మిక దృక్పథాన్ని
తృప్తితొ దర్శింపజేసి
మోక్షకాములను నొనర్చి,
అదృష్టితొ హరికథలను
చెప్పనేర్పి లోకసేవ
నాచరించు బుద్ధి నొసగి
దేవభూమి పర్యటనల
దేవపూజనా రీతుల,
దేవతార్చనా విధముల
శ్రద్ధాభక్తులను నేర్పి,
పరీక్షలలొ నెగ్గజేసి
సర్వమ్మును ఎరుకపరచి
మోక్షగాములను జేతువు!

ఇష్టదైవమునకు తావు
వైకుంఠమొ, కైలాసమొ
అన్యమ్మొ తెలిపి, ఆటకు
పంపుతారు, లేకపోతె
జ్ఞానులుగా తీర్చిదిద్ది
బ్రహ్మీభూతుల జేతురు.

☆

27 పరమభక్త! మహాజ్ఞాని!!
ఓ నారాయణభట్టా!
'శంభో' అను ఆలాపన
'గోవిందా' అను స్మరణం.
చేసుకొంటు బహుభాషా
నేతృత్వము వహియించిన
అట్టి మీరు వృద్ధాప్యము
వృద్ధి అయిన గ్రంథరచన
అధికమ్మై నట్టివేళ
ఒక శిష్యుడు చనువుతోటి
"ఓ బాబూ! కథచెప్పే
నైపుణ్యం నేర్పు" దన్న
వెనువెంటనే నేర్పబూని
"ఒరే శిష్య! నన్ను ఎపుడు
చూస్తుండుము నా మాటను
నా తీర్పును చూస్తుండుము"
అని అంటే దాన్ని గొప్ప
ఉపదేశంగా గ్రహించి
ఆ శిష్యుడు శ్రద్ధతోటి
పది ఏడులు ఏకగ్రీ
వముగ మిమ్ము చూచినారు.
మీ పదసేవన యొనర్చి
తరియించిన దాసశిష్య
నకు మీరలు వ్రాసుకొంటు
మధ్య మధ్య స్ఫురణకు వ
చ్చిన అద్భుతవిషయాలను
వచియిస్తూ, గానము గా
విస్తు అభినయోచితముగ
లాస్య తాండవ ప్రజ్ఞల
తెలిపినారు చూపినారు
ఇన్ని శక్తు లేకత్రా
ఎవరి అందు ఉంటాయి.
ఈ శిష్యాగ్రేసరునకు
ఈ భక్తాగ్రేసరునకు,
సహకరించి కథాకథన
నైపుణ్యం నేర్పునపుడు
పూజ్యమూర్తు లయిన మీరు
శారద వలె, గణపతి వలె
విష్ణువు వలె పలుమారులు
దర్శన మిచ్చారు భట్ట!
ఆదిభట్ట! మహాభట్ట!
భద్రభట్ట!! ఈ శిష్యులు
"శ్రీ సద్గురు సన్నిధాన"
కర్తలైన శ్రీ వేదన
భట్లవారు' భట్టభట్ట!!

☆

28 ఇట్టిశిష్యులను మీరలు,
'నారాయణదాస భట్ట!!
పరమేశ్వర రమ్య రమ్య
విపణులందు భక్తి విషయ
వస్తువులకు లోకానికి

లాభసాటి విక్రేతల
భక్తజన ప్రాయోజిక
కార్యక్రమ శక్తియుతుల
గానొనర్చి, సర్వమైన
సన్నాహములకు సంప
న్నులను, పరిష్కారములకు
సర్వకాల సంసిద్ధుల
గా నొనర్చె పంపునపుడు
పుణ్యకార్య విజయోపే
తులు కండని దీవిస్తూ
శ్రేష్ఠ నతుల స్వీకరించి
వీడ్కోలును చెప్పినారు.
వారికి మీరిచ్చినారు
పరమ దివ్య విక్రాంతుల[47]
అద్భుతాస్త్రజాలమ్ముల,[48]
'పాశుపత' మహాస్త్రమ్ము
అందువల్ల వారు వారి
కథనాలలొ మీవలెనే,
లోకంలో పుంజుకొన్న
నరక దుర్గద్వారాలను
భిన్న భిన్న మొనరిస్తూ
నాశనమ్ము చేయగల్గు
దేవలోక దిగ్గజాలు!
ఆకతాయి[49] లెచట వారి
ఇంద్రియ విజృంభణలతొ,
కామోద్దీపక వృత్తితొ,
దహనాలతొ, హత్యలతొ,
దోపిళ్లతొ, దుశ్చేష్టల
గర్వోక్తుల భీప్రదులై[50]
వర్తిల్లగ పుట్టినట్టి
ఆకసాన్ని అంటుకొన్న
ఆక్రందన లుద్భవిల్లి
వ్యాప్తినొంద మీ శిష్యులు
భయరహితత ఓ భట్ట!
కీలకరంగాల కేగి
దుష్టులలో పరివర్తన
కల్గింపను, దళితులకును
బాధితులకు ఉపశమనం
చేకూర్పను కృషిచేతురు
ఉపశాంతుల కల్పింపగ
సమయోచిత 'గాథ' ను కథ
నమ్మొనర్చి, మానసిక
స్వస్థత చేకూర్చి, తృప్తి
నిచ్చి, ప్రజల మెప్పునొంది
సన్మానం స్వీకరించి
విజయంతొ తిరోగమింత్రు.

⋆

29 ఏకాంతంగా శ్రద్ధతో
అత్యంతమ్మగు భక్తిని
ధ్యానముగావించి మిమ్ము
ఆవాహనచేయ మీరు
ఆదరముతొ విచ్చేసిరి!
అపు డిచ్చిన అర్పణ ఇది!
ఓ భట్టా! ఆదిభట్ట!!
జగమునందు పుట్టి నట్టి
జను లంతా మీ బిడ్డలే!
కుల మత భేదాలు లేవు!!
కోర్కెల దోషాలు లేవు!!

నిత్యము లేమీ చేష్టల
నిర్లక్ష్యం కనుపించదు
సర్వ విషయముల యందున
సత్యసమ్మతము భావన!
పక్షపాతవైఖరి ఎట
పరికించిన కానరాదు
క్రీడగనైనాను మీరు
కించపరచ రెవ్వరినీ
దళితుల ఆక్రందన విని
దారుణ విస్పందితులై[51]
తప్పించుకొ తిరుగువారి
తట్టి, ఎంతొ హెచ్చరించి
ప్రక్కచేర్చి "పీడితాళి
బాధలన్ని తీర్చునట్టి
ప్రగతిశీలు రయ్యమీరు!
ఎట వసించుచున్న నేమి?
ఏమొనర్చు చున్న నేమి?
ఉత్సాహము కల్గించుట
ఉత్తేజితులను జేయుట
మీకు జన్మలక్ష్మణమ్మ!
నే నన్నది సత్యమ్మ!!
ఇంతు లొక్క కొంతమంది
ఎంతొ భక్తి భావంతో
ఎంతొ మహాశ్రద్ధతోడ
ఏ వత్తిళ్లకు లొంగక
ప్రముఖమార్గముల విద్యల
పరమకరుణ బోధచేయ
ప్రౌఢవిజ్ఞు లైనారు
కాంతలలో నొక కొందరు
మీ ప్రోత్సాహంవల్లను
మేటి కథాకథన లైరి
భక్తితోడ హరికథలను
జనము మెచ్చ చెప్పినారు
సన్మానము లందినారు

☆

30 శ్రీశారద అవతార!
ఓ నారాయణ దాసా!!
బాల్యక్రీడాసక్తత
చిన్నలలో చిన్నలుగా,
కూలంకష ప్రతిభా పాం
డిత్యాలతొ పెద్దలలో
పెద్దలుగా తగినట్లుగ
లీనమౌతు దేశమంత
పర్యటించి భారతీయ
ధర్మమ్మును, సంస్కృతులను
సర్వ వర్ణములవారికి,
సర్వ వర్గములవారికి
కథాకథన పద్ధతితో
రమ్యంగా బోధించిరి.
పరప్రాంతాలకు చెందిన
నూతన గాన–ఔత్సాహికు
లైనవారి కెన్నెన్నో
రహస్యాలు దెల్పి వారి
జిజ్ఞాసుల జేసెదరు!
హరికథలను జెప్పునట్టి,
హరికథలను నేర్పునట్టి,
హరిదాసులె కారు మీరు

జీవితాన్కి, శీలానికి,
శ్రేయానికి చెందినట్టి
ఎన్నో నేర్పిన గురువులు!
మీకడ కడు భక్తితోడ,
శ్రద్ధతోడ విద్యనేర్చి
మేధ్యామేధ్యమ్ము[52] లెరిగి
ధనసంపద, దారిద్ర్యా
లకు గల్గిన మంచి చెడుల
తరిచి తెలుసుకొన్న వారు
మంచివైన అలవాటుల
నేర్చియు తమ బిడ్డల కం
దీయనట్టివారి మంద
లించి తెలియజేస్తారట!
దైహికముగ మానసికం
గాను మీరు పలురీతుల
ఆర్జించిన పరిశుద్ధులు.
సంస్కారానికి చెందిన
స్వల్పమైన ఏ అంశం
మీ దృష్టిలొ పడకుండా
తప్పించుకొ పోయినట్లు
చెప్పటమ్ము కనుపింపదు.

31 శ్రీనారాయణదాసా!
వేశ్యలలో కుంభదాసి,[53]
రూపాజీవయు [54] గణికయు[55]
–మూడు భేదముల వారితొ
మీకు పరిచయమ్మున్నది
ముప్వురకును తగినవిద్య
చెప్పి వారి స్థానమ్ముల
ఉన్నతములు గావించిరి.
నీరు పల్లమెరిగి నట్లు
వారు మిమ్ము ఎరిగినారు
"ఉన్నదేమొ ఇచ్చుకొందు
మయ్య స్వామి! విద్య నేర్పి
బాగ బ్రతుగకల్గునట్టి
అవకాశము దయతో క
ల్పింపుడయ్య, అంటు వేడ
అద్ది మీకు ధర్మమ్మను
భావముతో ఒప్పుకొని
వారిలోన శారీరక
సౌందర్యం పురుషజాతి
కమ్ముకొనే అంగనలకు
నగ్న రూప దర్శనాల
రతి విభేద లక్షణాల
వారిలోన తగినవారి
కించించుక నృత్యగాన
కళలు నేర్ప నేర్చి వారు
నైపుణ్యంతో రసికుల
రంజింపంగా గలిగిరి.
జీవితాన ఉత్తమమౌ
స్థాయి చేర గలిగినారు.
కొద్దికాలమందె వారు
సంస్థానాధీశుల సభ
లందుజేరి పెద్దవారు
వీక్షింపగ నాట్యగాన
కళ లందున ప్రావీణ్యం
చూపుకొంచు మెప్పువడసి
సన్మానము నొందినారు.

⋆

32 శ్రీశారద–అవతారా!
ఓ నారాయణదాసా
సకల కళాకోవిద లౌ
నాగరకులు గాన మీరు
పక్షమ్మున కొక్కమారు
పరమశ్రద్ధతో నడిపెడు
నవగోష్ఠుల వేశ్యలతో
విజ్ఞురాంఢ్రు, విద్యావతు
లైన మీదు శిష్యురాంఢ్ర
తోటి కలసి నడిపినారు
శుక్లపక్షమందున జా
గరణమునొనరిస్తూ ఆట
పాటలతో "యక్షరాత్రి"[56]–
నేటి మనదు దీపావళి –
అశ్వయుజమ్మునకు శుద్ధ
పూర్ణిమనాడున "కౌముది"[57]
జాగరణను రేయియెల్ల
వెన్నెలలో వివిధ కళా
క్రీడలతో గడపినారు
"సువసంతం" అను గోష్ఠిలొ
నాట్యాదుల మూడునాళ్లు
రమ్యంగా నడపినారు
"సహకారపు భంజిక"లో[58]
సమయమెల్ల సహకార[59]
ద్రుమయుత సత్క్రీడలతో
నాట్యగానములతొ సాగు
అభ్యూషాఖాదికలో[60]
చెట్లమీద, శాఖలపై
వ్రాలి, ఒకరిచేతి నొకరు
తాకి, తగిన ముగ్ధ మధుర
భాషణలతో గడుపుతారు
"బిసఖాదిక"[61] లో తూడుల
తోటి ఆడు, వాని తినుట
"నవ పత్రిక"లో క్రొత్తగ
పుట్టిన ఆకులను ఆట
పాటలతో సేకరించి
మందగతుల క్రీడింతురు
"ఉదకక్ష్వేదిక"[62] అందున
వంశనాడులతో – అంటే
వెదురుబొంగు గొట్టాలతో
వసంతాలు చల్లుకొనుట
స్త్రీ పురుషులు రసికతతొ
ఆటవోలె ఆచరింత్రు.
"పల్యంకికయానము"తొ
మ్మిదవ గోష్ఠి! ఇందు స్త్రీలు
పురుషవరుల, పురుషులు రమ
ణీమణులను పల్యంకిక[63]
లందున నుపవిష్టుల గా
వించి వారి పల్యంకిక
లను మోస్తూ క్రీడింతురు
దమనభంజికాదు[64] లిందు
ఒక జాతికి చెందినవి.

33. శ్రీ శారద–అవతారా!
ఓ నారాయణభట్టా
గానభట్ట! నాట్యభట్ట!!
యౌవనమ్ము నందు మీరు
ఈ గోష్ఠీ క్రీడల కడు
విజ్ఞతతో ఆడినారు!

ఆడు టెట్లో నేర్పినారు!!
అనంగనృత్యముల[65] యందున
అనుపమ ప్రజ్ఞాన్వితలౌ
"నంగనాచు"[66] లెందరొ మీ
పాద సేవికలు  శిష్యులు!!
పూర్వరాగ, విప్రలంభ
సంభోగము లను విభేద
ముల దక్షిణ నాయకత్వ
రీతు లెరిగినట్టివారు.
గణికలలొ అగ్రగణ్య
లైనవారు భక్తురాండ్రు!
"దేవదాసి" అన్న పేరు
నార్జించిన అట్టివారు
తిరు కళ్యాణోత్సవాల
ఆర్జించిన సేవలలో
శ్రద్ధాసక్తుల పాల్గొన
శ్రవణము, కీర్తనము, కేళి
ప్రేక్షణమ్ము,[67] గుహ్యభాష[68]
ణమ్ము, సంకల్పోద్భవమ్ము
క్రియా నిష్పతన[69] మగ్నత[70]
లను నెనిమిది మైధునాంగ
ములను పిదప మీరు తెల్ప
నవవిధ శృంగారములను
మధురభక్తితోడ నేర్చి
భర్తనుగా జేర్చుకొన్న
భగవంతుని మరులకొల్ప
నగరిలోని ఆలయాల
శృంగారము లభినయించి
వీరాంగనలు గా వర్తిలి
రతిపరవశు గావింతురు.
అనతికాలమందే వారు
స్వామివారి సన్నిధాన
సేవ నొందగా గలరు?
దేవదాసి భక్తురాండ్ర
అందును మీ శిష్యురాండ్రు
ఉన్నారో శుద్ధభట్ట.

⋆

34 ఓహో ఓ మహాభట్ట!!
ఆహాహా శుద్ధభట్ట!!
దేవదాసి ఒకతెకు ఆ
దీక్షాగుణ లక్షణాన్ని
అవసరమౌ జ్ఞానమ్మును
అభినయ సంక్లిష్టతలను
నాట్య గాన క్లేశాలను
అవగతమ్ము గావింపగ
అభ్యర్థన జేసినపుడు
దృఢతర సద్భావనతో
శిష్యురాలిపై ప్రేమతొ
దేవదాసి రూపంతో
స్వయంగాను అభినయిస్తు
చూపి నేర్పగావలె నని
దేవదాసి వేషానికి
తగినట్లుగ మిమ్ము మీరు
అందంగా దిద్దుకొనిరి
కబరీ వైచిత్ర్యాలతో[71]
శ్రవణ కంఠ నాసికాదు
లకు యోగ్యములౌ నగళుల[72]

కరకంకణముల మెరుస్తు
హస్తానికి నాగవత్తి
రమ్యమైన మణిమేఖల[73]
అందెలు, కడియాలు, జిలుగు
గజ్జలతో దిద్దుకొనిరి
యవ్వనాని కుచితమైన
వర్ణాలతొ నొప్పునట్టి
స్తనవల్కల వసనమ్ముల[74]
కడురమణీయముగ దాల్చి
హారిద్రాకుంకుమలను
గంధపుష్పమాల్యమ్ముల
చెలిమి మెరయ స్వీకరించి
శరద్రాత్రి, పౌర్ణమినా
డందరకును పరమేశ్వర
పత్ని నన్న భావమ్మును
తెలియజేస్తు, నన్ను కనుడు
నన్ను వినుడు, అనుపాద
మ్మును చెప్పుచు అందరకును
మేళతాళగమనముతో
జ్యోతుల విక్రాంతితోడి
శిష్యురాలు పూజావ
స్తువులతోటి వెంటరాగ
నగరీజను లెల్ల జేరు
శ్రీ కృష్ణుని ఆలయాని
కరిగి మీరు ఆరంభము
నకు యోగ్యమ్మైన మరో
భావ మ్మేర్పడియుంటను
మీ శిష్యకు దేవదాసి
దీక్షా క్రమబోధనమ్ము
'నన్ను కనుము, నన్ను వినుము'
ఆదేశము జ్ఞప్తిచేసి
ప్రారంభము చేసినారు.
కొంతకాల మిలా వస్తు-
శిష్యురాలివిద్య పరా
కాష్ఠ నందుకొనెడి వరకు-
నవవిధ శృంగారమ్ముల
నభినయింప నేర్చువరకు
ఉదయసమయ ధర్మములకు
సౌందర్యసమయ ధర్మములకు
వసంతాదులౌ ఋతువుల
ధర్మములకు వెన్నెలపూ
తల జల్లుల ధర్మమ్ముల
కనుగుణమౌ నర్తనముల
నభినయింప నేర్చువరకు
కౌతూహల హేలాలీ[75,76]
లా విలాస విభ్రమ బి
బ్బోకాదుల[77] రోమాంచిత[78]
విన్యసనల[79] జనియింపగ
జేసి, చూప నేర్చువరకు
నాట్య గాన విశేషాల
ప్రణయభావ నుద్దేష్టాల[80]
పంచియిచ్చి సభను ఉన్న
సర్వజనుల - స్త్రీ పురుషుల
నందరినీ కొంత వరకు
తనవలెనే స్త్రీలజేస్తు
రజోభావ రాధికలుగ
కృష్ణ భుజంగికల[81] వోలె
భిన్న భిన్న గోపికలుగ

పరివర్తన చేయుటమ్ము
తాను సాహచర్యమునకు
తన స్వామిని, ఆ బృందా
వనస్వామిని, చేరటమ్ము,
వ్యష్టిగా సమష్టిగాను
రాసక్రీడలను నేర్చి
పరమ భక్తిభావంతో
మంద్ర మధ్య మోద్వేగా
లతో సంగమ మొందటాన్ని
అభినయింప నేర్చువరకు
లలితగతుల నేర్పినారు.
ఆ నగరంలో ధనికులు
అత్యాచారాలల్లో
ఆసక్తులు, కడు రసికులు
దేవదాసి కాదలచిన
ఆ గణికాకన్యను తమ
ప్రియురాలిని చేసుకొనగ
మనసుపడుతు ఉన్నవారు
ఆమె నేర్చు విద్య చూడ
ప్రీతితోడ ఆలయాన్కి
అప్పు డపుడు వచ్చి వచ్చి
ఆమె పరాకాష్ఠ నొంది
అభినయించు వేళ చూచి
ప్రేమ భక్తిగా మారగ
అపుడు నిల్వలేక ఇర్వు
రీమహాదేవుపత్ని యయ్యె
పరమ పుణ్యవనిత యయె
ఎంత అందగత్తె ఈమె!
ఎంత దివ్యురాలు ఈమె!!
అని అందరు చూచుచుండ
ఆమెకు నతు లర్పించిరి.
ఈ ఘట్టము చూచి మీరు
"శుభము, శుభము, సిద్ధిగడిం
చినది కన్నె పరమేశ్వరు
పత్ని అయ్యె శుభము" అంటు
ఆనందం పొందినట్లు
లోకంలో ఒక వినికిడి
సృష్టి అంతటికి స్త్రీయే
కారణమ్ము ఆమె తల్లి,
అక్క, చెల్లి, పత్నియు, నుప
పత్ని అన్న విషయము ప్రజ
మరచిపోతు ఉన్నారు.
నేడు పురుషుతో బాటుగ
నారీమణి అన్ని ఉన్న
తమ్ము లైన శిఖరాలను
చేరినది. కాని ఆమె
తాను ఒక్క "వ్యాపారపు
వస్తు" వన్న ముద్ర చెరుపు
కొనలేకుండా ఉన్నది.

☆

35 శ్రీశారద–అవతారా!
బహువిద్యాఘనధీరా!!
వివిధరంగముల లోపల
మీకు ఉన్న అనితర సా
ధ్యమ్మౌ ప్రతిభను గురించి
ఆయా రంగాలల్లో
ఉద్దండులు ఔ వ్యక్తులు
ప్రచురించిన "ఆదిభట్ట

నారాయణదాసు గారి
సారస్వత నీరాజన”[82]
గ్రంథమునందున వారల
నీరాజన లర్పించిరి
అందులోన “చెల్లపిల్ల”
మానాప్రగ డింటిపేరి
శేషశాయి యామిజాల
పద్మనాభ శాస్త్రియు, ఆ
శ్రీనివాస శిరోమణియు
మూలా పేరన్న శాస్త్రి
దివాకర్ల రామమూర్తి
దివాకర్ల వేంకటావ
ధాని, ఓరుగంటి నీల
కంఠశాస్త్రి, శ్రీస్థానం,
శ్రీమామిడిపూడి వారు,
గంటిజోగి సోమయాజి,
శ్రీ వేదనభట్లవారు,
శ్రీమాన్ పెద్దింటి సూర్య
నారాయణ దాసవర్య
లమ్ముల భాగవతారు
కరుణశ్రీ పాపయార్య
వావిలాల సోమయాజి,
శ్రీ శంభర  బొడ్డుపల్లి
శ్రీ యమ్ ఆర్ అప్పారావు
శ్రీ యస్ వీ జోగారావు
కట్టా ఈశ్వరరావు
ఇత్యాదులు విజ్ఞానులు
ఎందరోను ఉన్నారు.

☆

36

హరికథలకు ఆదిభట్ట!
గేయఫణితి కాదిభట్ట!!
నాట్యకళకు ఆదిభట్ట!!
లోకగతుల కాదిభట్ట!!
విజ్ఞులేమి, అజ్ఞులేమి
విపులమైన లోకంలో
మిమ్ము ప్రశంసించు రీతి
మీ విజ్ఞానాధిక్యత
మీదు కళాపాండిత్యము
ఇత్యాదుల గూర్చి ఏమి
చెప్పుకుంటు ఉన్నారో
వానిలోని కొన్ని భావ
ములను సేకరించి, వాని
లోనకొన్ని సంగ్రహించి
భక్తజనావళి కొరకు
మా కొరకు, మీకొరకు
గానయోగ్య ఛందస్సులో
నేను తెలుపబూనుకొంటి
శిష్టువైన ఓ భట్టూ!
శ్రీనారాయణ భట్టూ!
స్వీకరింప వేడుచుంటి
కళాతపస్వులలో, విద్యా
మహిమాఢ్యులలో, ఉపాస
కులలోనను నాదబ్ర
హ్మానుస్సంధానపరుల
లోన నవనవోన్మేషము
నొందు కళా సృష్టికారు
లందున, బ్రహ్మర్షులలో
తొలిపీఠ మొసంగదగిన

వా దపూర్వవ్యక్తి శ్రీమ
దాదిభట్ట నారాయణ
దాసుగారు. ఈయన కే
వలము ఒక్క హరిదాసెకాదు
కాదు– అంటే జీవికకై
ఈషణ్మాత్రముగను నా
దోపాసన, సాహిత్యో
పాసనమ్ము చేసి వాని
నవలంబించినవాడా!
కాడటంచు నా భావన!!
ఆయన అవతారమూర్తి
విద్యావైదుష్యమ్మును
గాంధర్వ కళాశక్తియు,
కవితామృదుమధుర చమ
త్కారోక్తియు ఇత్యాదులు
శ్రీ మాతృక దయాభిషం
గము లేకుండాను లభిం
చునవి కావు లభియించిన
శోభించెడి వెపుడు కావు.
దాసుగారి కివి అన్నీ
వెన్నతోడి బెట్టినట్టి
విద్య లౌటయే కాదు
అమ్మవారి వెంట అంటి
ఉండి ఎపుడు ఉండగవలె
లేకపోతె అంతటి గం
డరగండడై కళామూర్తి
ఔట అసంభవము గదా!
వారి మూర్తి విశేషమ్ము
ఈభావన శతధా బల

పరుస్తోంది వారి మూర్తి
సౌందర్యం వారిదేను.
అట్లనటం కంటె అద్ది
దాని దనుట సముచితమ్ము!!
ఎందుకంటె ఆకారం
పుష్టిమంత మై కదలిన
ఒక్క 'కళాపర్వతమ్ము'
కదలినట్లుగా ఉండును.
ముఖము బ్రహ్మవర్చసుతో
భాసిస్తూ ఉంటుంది.
శిరోజాలు మధ్య ఉన్న
పాపిటతో ద్విధా విభజి
తమ్ము లౌచు వంపులు తిరి
గిన అలకలతో విశాల
ఫాలభాగసౌందర్యము
వీక్షచేయు మధుపపుంజ[83]
మును బోలుచు ఇరుప్రక్కల
తైల నైగనిగ్యమ్మున
అలరారును, వారి విపుల
నేత్రమ్ములు భావగభీ
రము లగుటయె కాక ప్రపం
చాన్ని తృణ ప్రాయంగా
నెంచగల్గు పరిభావన
చేత నెంతొ గభీరాలు.
శ్రవణమ్ములు కుండలాల
చే నలంకృతాలు, సుదీ
ర్ఘమ్ము అయిన ఘననాసిక
నిండా వెంద్రుకల నొప్పు
కన్నుబొమలు ఒక దానిని

ఒకటి మించి సొగసును రె
ట్టించుచుండు. రాజఠీవి,
కవిరాజుల ఠీవి, కథక
చక్రవర్తిఠీవి వెడల
గ్రక్కునట్టి మీసమ్ములు
ముఖమున కుంకుమబిందువు
ముమ్మూర్తుల లలితా తాం
డవ మెనర్చు చేతికగ్ర
మహాస్వర్ణ ఘంటాలం
కృత్యములైన సింహతలా
టాలు, బుజముపైన సొగసు
కొంగు రానిచ్చిన రెండి
ప్రక్కనుండి పోవనిచ్చి
ఎడమచంక నదిమిపట్టు
ఉత్తరీయమును జలతా
రంచుదాన్ని, బెత్తెడు జల
తారంచుల సేలం దో
వతికుచ్చెళ్లను జీరా
డగను కట్టి పాంకోళ్లతో
ముందుదెసకు వీథిలోన
వెనుక శిష్యతండము వె
న్నంటిరాగ మెడ అందలి
జపమాలయు, బంగారపు
పతకమ్ములు అల్లాడగ
విచ్చలవిడి తిరుగునట్టి
పుంగవ[84] మన్నట్లు పోవు
దాసుగారిమూర్తి ఎంత
పౌరుషవంత మ్మయినను
ఆలోచింపంగ "అమ్మ"
మూర్తి గానె గోచరించు
టద్భుతమ్ము! మీసా లీ
భావన కేమాత్రమ్మును
అడ్డురావు అలంకార
ముల పొందుతు ముస్తాబవ
టమ్ములోన ఎచట లేని
శ్రద్ధనొందు దాసుగారి
వైఖరి తిలకింతు మేని
సత్యముగా ఈయన ఆ
శారదయే అనిపింతురు
అనిపించుట తోటి ఏల?
సత్యముగా పుంభావ స
రస్వతియే లేకపోతె
సారస్వత గాంధర్వ క
ళాప్రావీణ్యాలు ఎలా
వారికి లభియించేవి?
ఓ నారాయణదాసా!
మిమ్ము గూర్చి కవిచంద్రుడు
దివాకర్ల రామమూర్తి
వక్కణ ఇల్లా నడిచెను.

37. ఓ నారాయణభట్ట!
ఆదిభట్ట! మహాభట్ట
భగవంతుని సర్వజనుల
హృదయాలలో ప్రతిష్ఠింప
జేసినట్టి యత్నమె మీ
మనుగడగా సాగినట్టి
మహాభాగులయ్యా మీరు
ఆంధ్రజాతి అంతె కాదు
భరతజాతి, కలకాలం

గర్వింపగ దగినయట్టి
మహావ్యక్తులయిన మీరు
భట్ట సర్వభారతియ
సంవిత్తుకు,[85] సంస్కృతికిని
సంగమసుస్థానముగద!
ఇట్టి మీదు నానావిధ
శ్రమఫలితంగాను బాహి
రిల్లినట్టి కడ కృతులలో
ముఖ్యంగా హరికథలే
సకలజనుల ఆకర్షణ
గావిస్తూ, సత్కీర్తితో
యుగయుగాలు బ్రతికి ఉండె
"సంస్కృతి–భాండాగారం"
ఆంధ్ర విశ్వవిద్యాలయ
ఉపాధ్యక్షులయిన అప్ప
రాయ మహాశయుల అభి
ప్రాయ మిద్ది మిమ్ము గూర్చి

☆

38 శ్రీనారాయణదాసా!
శ్రీసుందరరామశాస్త్రి
మీ రెరిగిన విద్వాంసుడు,
మిమ్ము గూర్చి తెలిపె నిట్లు
"దాసుగారు వేద శాస్త్ర
పురాణేతిహాసాదుల
లోని సర్వసారజ్ఞులు
సంగీతము నందును, సా
హిత్య మందు, కవితలోన,
నృత్య వాద్యములలో అస
మాన ప్రజ్ఞాధురీణు
డును కళాప్రపూర్ణుండును.
ఇది అది అన నేల స
ర్వజ్ఞుండును, పరిపూర్ణుడు,
సర్వమందు స్వతంత్రుండు.
రూపరేఖ లందు సుంద
రుడు, శ్యామలగాత్రుండు
శారదాంశసంభవుండు
ఆంధ్రావని అవతరించి
నట్టి ఒక్క గంధర్వుడు".

39. శ్రీనారాయణవర్య!
సకలకళాగుణధుర్య!!
వస్తున్నవి కథకచక్ర
వర్తుల్లో ఒక్కరుండు,
రామాయణమును తొలుతగ
ప్రజ కిచ్చిన మహనీయుడు
ప్రముఖ పత్రికారచయిత
శ్రీనివాస శిరోమణులు
మిమ్ము గూర్చి తెలిపినది
"దక్షిణాపథానను సం
గీతంలో అంతవాడు
ఇంతవరకు పుట్టలేదు.
త్యాగరాజు సంగీతం
లోన ప్రాథమికం గాను
సుగమముగను ఒనరించిన
కార్యమ్ముల నారాయణ
దాసుగారు అతిసమగ్ర
ముగను, సప్రమాణముగా
ప్రౌఢంగా ప్రదర్శించి
లోకానికి చూపినారు"

40. శ్రీనారాయణభట్టా!
మహాభట్ట! ఆదిభట్ట!!
రానున్నది ఆంధ్రజాతి
వైతాళికులలొ ప్రముఖులు
పుణ్యాత్ములు కడుపూజ్యులు
శ్రీమామిడిపూడివారు
మిమ్ముగూర్చి తెలిపినవి
"ఆంధ్రుల సంగీతకళా,
సాహిత్య వియన్మండలా[86]న్ని
ధగద్ధగిత మొనరించిన
ధ్రువతార[87]లు దాసుగారు
వారితోటి కొంచెముగనొ
గొప్పగనో పరిచయమ్ము
కలిగినట్టి నన్ను వంటి
వార్కి వారి అందున 'కను
పించినట్టి ముఖ్యలక్ష
ణమ్ము వారి కున్న ఆత్మ
విశ్వాసము. ప్రపంచంలో
స్వయంకృషితొ సాధింపం
గాజాలని విద్య ఎట్టి
దీ లేదను ధీమాతో
జీవన యాత్రను నడిపిరి.
ఈవిశ్వాసమువారికి
కుదరటాన్కి పోతన్న మ
హాకవీశునకు పాండి
త్యమ్ము వోలెవారిది సై
తమ్ము సహజ పాండిత్య
మ్మగుటయేను కారణమ్ము.
జన్మతః శక్తియు, సా
మర్థ్యమ్మను కలవారే
ప్రతిభావంతులు కాగల
రనుట వారి నమ్మకమ్ము.
దీని గూర్చి పదేపదిగ
వారు స్నేహితులతో ప్ర
స్తావిస్తూ ఉండేవారు.
గురుముఖాన ఏ విద్యయు
నేర్వలేదు వారు. అట్లు
నేర్చుకొనుట స్వీయప్రతి
భకు ఆటంకమును కలుగ
జేయు ననియు, అట్లు నేర్చు
కొన్నవారు ప్రాచదువుల[88]
బిక్కబట్టి గుడ్డియెద్దు
చేలలొబడు నట్లు ప్రవ
ర్తించువారు అనియు వారు
భావించిరి. మహీశూర
సంస్థానమునందు వారు
కర్ణాటక హిందుస్థాని
బాణీలను రెండింటి స
మన్వయించి నూత్న ఫక్కి
లోన శ్రోతలబ్బురపడ
సంగీతప్రదర్శనమ్ము
గావించిన సమయమ్మున
మహారాజువారు. మహా
రాజ్ఞితోడ వారిగాన
మును పరమమ్మౌ శ్రద్ధతో
ఆలకించి "సంగీతము
మీ రెక్కడ నేర్చుకొంటి
రని అడిగితె" నా సంగీత

తమ్మును, సాహిత్యమ్మును
నైజమ్మో పాండిత్యమె
కాని ఒకరివద్ద నేర్చు
కొన్నది గాదని చెప్పిరి”

⋆

41 నారాయణదాస సుకవి!
సంగీత కళాకోకిల!!
“నిన్న మొన్న కీర్తిశేషు
లైన జగద్విశ్రాంతసు
కీర్తిమూర్తు లైన హరిక
థాప్రథమావతారు లౌ
నారాయణ దాసుగారి
గృహనామము “ఆదిభట్ట”.
భట్టశబ్దమా పండిత
వాచకమ్ము. ‘ఆదిభట్ట’
వారిలో ‘అజ్జాడవారు’
ఎంతో విశిష్టులు అంటూ
తెలియనౌట “ఆదిశ్చా
సౌ భట్టశ్చ ఆదిభట్ట”
ఆదిభట్ట వంశము నా
రాయణవంశమ్ము గాను
కీర్తికెక్కుటకు నారా
యణదాసులె కారణమ్ము.
భావికాలమున ఈయన
నారాయణునకు దాసుడు
అయితీరును. శ్రీ ప్రహ్లా
దాది పరమ భక్తులలో
ఒక్కడుగా పరిగణింప
దగ్గవాడు కాగలడని
తెలియుటచే నారాయణ
నామధేయ మీయన కా
తలిదండ్రులు పెట్టియుండ్రు.
బాహ్యావర్తనమ్ము ఎదో
రీతిగాను కనబడినను
అంతరంగ మతినిర్మల
మైనట్టిది. భక్తుడంటె
నారాయణ దాసుగారు
అంటు నేను బాహులెత్తి
అతిదృఢముగ చెప్పగలను.
చదవకుండగనె సమస్త
విద్యల సాధించినాడు
మాతృగర్భమందె మధుర
సంగీత కవిత్వమ్ముల
సాధన గావించినాడు.
“ప్రపేదిరే” తో మొదలౌ
కాళిదాస కవీశోక్తి
ఈయన ఎడ అన్వయించి
నట్లుగ ఏ మరిఒక్కరి
అందు అన్వయింపబోదు!
ఇతని జన్మవంశమునకు
చెందినట్టి జ్ఞాతుల కం
టే విద్యావంశానికి
చెందినట్టి జ్ఞాతులె వి
స్తారంగా ఉంటారు
ప్రస్తుతాంధ్రలోకంలో
హరికథ చెప్పే ప్రతివ్య
క్తియు ప్రత్యక్షముగానొ ప
రంపరగానో ఈయన
శిష్యులు అయి తీరవలెను.

ఈయన గానమ్ము దాక్షి
ణ్యాత్యగానమును పోలదు
ఉత్తరదేశపుగాన
మ్మును బోలదు  ఈ గానము
అన్నింటిని కలియద్రొక్కి
పెట్టినట్టి కాషాయము
గాయ మందు నేను. ఈ
యనకు కవితయందొక్క వి
శిష్టస్థానమ్ము నీయ
కను తప్పదు. ఈయన కీ
ర్తనల గానమొనరించెడు
సమయమ్మున విన్న నాకు
ఆ కవిత్వమందును, ఆ
గానమ్మం దున్నయట్టి
మాధుర్యముచే కంఠో
పాఠము చేయాలనియెడు
బుద్ధి పుట్టుతుంది
హరికథకులలోన ఇట్టి
సన్మానము పొందినట్టి
వారుగాని ఇంత నిరా
ఘాటంగా వర్తించిన
వారు గాని, ఇట్టి శిష్యు
లను తయారుచేసినట్టి
వారు గాని ఆంధ్రదేశ
మందె కాదు ఇతర దేశ
ముల అందున లేరని యే
స్పష్టంగా చెప్పవచ్చు
ఈయన సంస్కృతము లోన
రచియించిన గ్రంథము పం
డితులెల్లరు శిరసావహి
యించినదిగ ఉండుటచే
నిరాఘాట ప్రజ్ఞ గల్గి
నట్టివాడు అయినప్పుడు
మాతృభాష అయిన తెలుగు
లో నీయన కొక్క గురువు
ఉండవలసి ఉంటుందా?
ఈయనతో పోల్చటాన్కి
నాకు తెలిసినంతమటుకు
ఏ ఒక్కరు, ఏమాత్రం
గోచరించటమ్ము లేదు.
బ్రతుక దగిన కాలమంత
బ్రతికి, కులము వన్నె కెక్క
జేసి తన్ను తెలిపి మిన్ను
కరిగినాడు సోదరుండు
పేరిదేవు చూడ గోరి.
నారాయణదాసు ప్రజ్ఞ
ఆ అనన్వయాలంకా
రానికి తొలి లక్ష్యమ్ము"
తిరుపతి వేంకటకవీంద్రు
లిరువురిలో పెద్దవారు,
కవిచంద్రుల కెందరికో
గురువర్యులు, అవధానశి
రోమణులకు రారాజులు,
పాండవనాటకకర్తలు
సుప్రసిద్ధ విద్వాంసులు
"చెళ్లపిళ్ల" మిమ్ము గూర్చి
నిష్క్రమణ చేసినపుడు
తెలిపినట్టి విషయము లివి.

42 సంగీతకళాశారద!
నవ్యరాగఘననీరద!!
ఓనారాయణభట్ట!
నూత్నరాగములను దిట్ట!
'దశవిధరాగనవతికుసు
మాంజలి' పీఠిక వ్రాస్తూ
గానకళా మహనీయులు
మీ రనగా కడుభక్తులు
నూకల సత్యన్నారా
యణ తెలిపిన విషయాలివి
"దాసుగారి రాగమాలి
కాప్రబంధమును వల్లెన
వేసి నిత్యమును సాధన
చేసినట్టివారి కసా
ధ్యమ్ము అయిన విషయ మేది
సంగీతమ్మున గానీ,
తాళ విభగాన గాని
ఉండదనుట అతిశయోక్తి
కాజాలదు. విద్యార్థుల
కీమాలిక బోధిస్తే
మొదటి రాగమును నేర్చుకొ
నేటప్పుడు విద్యార్థిగ
నున్నవాడు నూటెన
భయ్యో రాగమ్ము చేర్చి
పాడగలిగినట్టివాడు
విద్వాంసుడు రూపొం
దును అన్నది నిర్వివాద
మౌ నంశము. దాసుగారి
'పంచముఖీ షణ్ముఖి' అను
ఆ అపూర్వ రాగతాళ
ప్రబంధాన్ని ప్రశంసిస్తు
పంచముఖిని ప్రదర్శించు
విద్వాంసులు నేడు ఒక్క
రో ఇద్దరొ మాత్రమ్మే
ఉన్నారు... అట్టివారి
ప్రోత్సహించి, వారిచే ప్ర
దర్శనాని కేర్పాటును
చేయించుట మన బాధ్యత
దాసుగారు సంగీతా
నికి, సంగీతాత్మకమౌ
లయశాస్త్రానికి అనేక
పరిశోధన లాచరించి
గానకళకు సం సేవన
సలుపుటందు మన కాద
ర్శప్రాయులుగా ఉండిరి.
కొందరైన పంచముఖిని
సాధనగావించి ప్రద
ర్శించినచో దాసుగారి
రచన సార్థకమ్మౌను".

43 ఓ నారాయణభట్టా!
ఆదిభట్ట! భట్టభట్ట!!
విద్యావతి మీరు గాఢ
ముగను ప్రేమతోడపిలిచి
వారసురా లవుటచేత
"స్వయంలేఖ" నాన్ని లిఖిం
పగజేసిన లేఖకురా
లౌ శ్రీమతి రాజేశ్వరి
ఒక సందర్భమ్మునందు

మిమ్ము గూర్చి తెలిపిన వివి
బంధువులందరి భావన.
"కర్మను ఉపదేశింపగ
జైమిని ఋషి, ఉపదేశిం
పగ జ్ఞానము వ్యాసర్షియు
అవతరించి నట్లుగ భ
క్త్యుపదేశం - కోసము శ్రీ
నారాయణదాసు లవత
రించినారు జనుల మనస్
క్షేత్రాలలో "కథాకథన"
రూపమ్మున భక్తిబీజ
ములనాటిరి. వివిధ విద్య
లందు విశారదుడు, సకల
కళాపేశలుడు, బహుభా
షాచతురాననుడు నైన
నారాయణదాసు జనుల
చిత్తవృత్తి ననుసరించి
హరికథాపితామహులును,
సర్వకళాపరిపూర్ణులు,
మహాకవులు, గాంధర్వ
సార్వభౌమ మహానీయులు,
ఘన భాగవతోత్తములును
పరమమహావేదాంతులు
భగవత్పద భక్త్యమృత
పానరతిని త్రిదివమ్ముల
మీద నాధిపత్యమ్మును
అష్టవిభూతిని పొందుట
కంటె, మోక్షపదముకంటె
అత్యధికమ్మయినట్టిది
అంటు వారు వాక్రుచ్చిరి
దాసుగారి ప్రతిభ ప్రధా
నముగ వ్యక్తినిష్ఠమ్ము
వస్తునిష్ఠమెపుడు కాదు
సమకాలిక మహాపండి
తాళి వాక్కు ననుసరించి
ఆయన సాహిత్యమందు
ఎంతటి ప్రతిభాధురీణు
లో సంగీతమ్ము నందు
అంత మహానిష్ణాతులు
వారి కృతుల పరిశీలి
స్తే ఆయన సర్వవిద్య
లందు ప్రవీణులు అన్నది
విదితమౌను విశదంగా".

44. ఓ నారాయణదాసా!
దాసా! ఓ దాసదాస!
కొందరు విద్యావంతులు
సామాన్యజనానీకం
తోటి కూడిఉన్నప్పుడు
మిమ్ము గూర్చి సంభాషణ
ఈవిధంగ సాగింది.
"అర్థ మెవరి బుద్ధిచెరచు
కామ మెవరి కండ్లు తోడు,
నూదకాలు ఎవరి నిండు
మతులు చెరచి బుద్ధివిరుచ
అట్టి వారు అంటె మీకు
అధికమైన అట్టి జాలి.
గుణదోషమ్ముల చూడరు
బొంకుటాండ్రు రంకుటాండ్రు

కులపతితలు, పుంశ్చలులును[89]
రూపాజీవలును నైన
వారిమీద మీ కెంతో
అధికమైన దాక్షిణ్యం
ఇట్టివారిలోన మీకు
ఎవరిమీద కక్షలేదు.
భక్తిని అందించి వారి
పుణ్యజనుల జేస్తారు.
మనసులోని మాలిన్యం
ప్రక్షాళనచేసి వారి
గోపికలను గాగ మార్చి
బృందావనపుణ్యలోకు,
పురుషోత్తము జూపింతురు
సేవా పద్ధతులేవో
చిత్తానికి అనుగుణముగ
చెప్పి చేయనేర్పుతారు.
భక్తి ముదిరినట్టి కొంత
కాలానికి అట్టివారి
వైతరణిని దాటజేసి
వైకుంఠం చేర్చుతారు.
పతితులైన వారి నుద్ధ
రించటమ్మె లక్ష్యమౌట
ధర్మకార్యములలో మీ
దర్శకత్వ మత్యధికము
కావ్యశిల్ప సమ్రాట్టులు
మీరే లిఖియించు కొన్న
కథను జెప్పు సమయాలలో
ప్రతిఘట్టం నైజంగా
ముగ్ధంగా, మోహనంగ

కథవిషయంలో నడుపుతు
వర్ణనలతొ, విషయాలతొ
మధ్య మధ్య ప్రత్యేకత
ఉన్న అట్టి కన్యాదే
వాలయాన్ని లక్ష్మణదే
వాలయాన్ని, పరశురామ
ఆలయాన్ని, ఆంజనేయ
ఆలయాన్ని, మూషికదే
వాలయాన్ని, అత్తాకో
దళ్లఆలయాల, తుదకు
అయహోలీ ఆలయాల
కోణార్కపు ఆలయాల
మానసికంగా చూపుతు
సామాన్యజనం చేతను
కాశీరామేశ్వర యా
త్రలు చేయిస్తారు మీరు
మధ్యస్థుల బుద్ధికి తగి
నట్టులుగా మేధావులు
శ్రీహరి, శంభో మొదలౌ
శబ్దార్థమ్ములు వివరిం
చేటప్పుడు సక్రమంగ
ద్వైతాద్వైతముల, విశి
ష్టా ద్వైతము లెరుకపరచి
ఆధ్యాత్మిక జ్ఞానమును
ఆ విదేహముక్తి విశే
షాల నర్థవంతంగా
జిజ్ఞాసతో బోధింతురు
భక్తిభావ సంభరితులు
అయిన శ్రోతలనే కాక

సభలొ చేరి మంద్ర నీచ
కృత్యమ్ముల దుశ్చర్యల
నాచరించు నట్టివారి
ఆకతాయిలును,[90] వరాకు[91]
లైన పాపవర్తనులు
దుష్టకార్యలక్షణులను
పాశవత్వ ప్రతీకాల,
పరమ గుహ్య భుజంగాల
సంచిత సమ్మోదముతో
అంతేవాసులుగ[92] తలచి
అతిపవిత్రులను చేయగ
కన్యావిస్రంభణమున[93]
కడు సమర్థులయిన మీదు
ముగ్ధ మధుర మంజులమ్ము
నయిన యట్టి పుణ్యలోక
పథికుల గావింపంగా
ప్రదర్శించి నందుకు యే
మును కీర్తిని పొందెదము.
దాసుగారి సంగీతపు
విశ్వ-అంతరాళంలో
తారాకోటిని లెక్కిం
చటము ఎంత అసాధ్యమ్మొ
వైదుష్యము నభినందిం
చుట సైతము అంత బెడద
వారు జానకీశపథం
లోని స్వరమ్ముల చేతను
అందులోని అపురూపా
లైన రాగములలోపలి
వరుసల ద్వారా ముందు
తరములవారికి తమసం
గీతపు పాండిత్యమ్మును
కల్పనలలొ చాతుర్యము
అక్షరబద్ధ మ్మొనర్చి
అద్భుతముగ అందించిరి.
అనన్వయం అనెడు అలం
కారానికి వారె ఉదా
హరణమ్ము వారి జగ
జ్యోతిలోని ప్రతివాక్యం
ఒక సిద్ధాంతము నుద్ఘా
టించు వచనమై ఉన్నది.
షట్దర్శనములు, అష్టా
దశ విద్యలు, చతుష్షష్టి
కళలు అధిగమించినట్టి
వారికి అద్దానిలోని
సిద్ధాంతాలలో కొన్నిం
టికి మూలా లెరుకపడవు.

☆

45 నారాయణదాస సుకవి!
ఆకర్షిత సకల భువీ!
ఓ నారాయణభట్టా!!
భట్టా! భట్టా!! ఆదిభట్టా!!
రానున్నవి దాసభార
తీ ఆవిష్కరణ ప్రచు
రణల ధూర్వహులును మహా
'సుకవీంద్రులు' 'మధురసర
స్వతులు', 'తెలుగు-తానీషా'
ఆంధ్ర విశ్వవిద్యాలయ
ప్రాచార్యులు[94] మిమ్ము గూర్చి

పూర్ణంగా ఎరిగినట్టి
మహావ్యక్తి మీ రంటే
భక్తిపరులు శ్రీ యస్వీ
జోగరాయ మహనీయుల
లోమెదలిన సద్భావన
భావగభీరపు రేఖలు
శ్రీ జోగరాయ సుకవి
'నాయెఱు' కను మీదు ఆత్మ
కథను గూర్చి వ్రాసినట్టి
సంపాదక భూమికలో
తెల్పినట్టి విషయా లివి
"ఇద్ది లోక మ్మెరిగి నట్టి
ఒక అలోకసామాన్యుని
ఆత్మోదంతమ్ము, అంత
రంగ ముగ్ధ సంగీతము.
సంగీతము, సాహిత్యము
నృత్యమ్మను త్రికళా కుశ
లియు నాత్రిదశేంద్రులైన[95]
వారి పూర్ణ పురుషాయుష
జీవితాన చిత్రంగా
ఇద్ది మొదటి ముప్పదేండ్లు
పరిమితమై ఉన్నట్టిది.
ఆదేశ ద్రిమ్మరియు, సర
స్వతీప్రతినిధి అయిన ప్రచా
రకుని శేష జీవితమ్ము
నిత్య మనస్సన్యాసిని
నిరంతరము స్వస్వరూప
అనుసంధాన ప్రవీణు
డును విశ్రేయసోదర్క

సాధనా సుమార్గపుపా
ధేయమాత్ర సుగాంధర్వ
ధూర్వహుండు నిషధయోగ్య
డైన దాసు నరుడై దిగి
వచ్చినాడు. శ్రీ నారా
యణుడై దివి కేగినాడు.
'దాస' సంజ్ఞ ఆయనచే
తన పేరుకు చివర కోరు
కొని చేర్చుకొనబడినది.
హరికి దాసుగానివారు
హరిదాసుల స్వామివారు
కారణజన్ములు వారలు
ఆదిభట్టవారు బ్రతుకు
గహనమ్మున వేసుకొన్న
బాటవేరు  వారు నడచి
నట్టి నడకయే వేరు
ఆపాటీ ఈపాటీ
అయిన వారి కది ఎంతో
దురవగాహ మైనతీరు
వారి వ్యసనలోపమ్మా![96]
ఆకసాన మసనము[97] లే
కుంటయేను. నీటికి ని
ప్పంటుతుంద! నిప్పును చెద
లంటుతుంద! కారణజ
న్ముల స్వభావమునకు జెంది
నట్టివియో సరిహద్దులు
అవగాహన కొలబద్దల
కందునట్టివే కావు
శూరవరుల జన్మంబును

సురలోకుల జన్మంబును
ఆ ఏఱుల జన్మంబును
ఎవరి కెరుక అనుచు నొక్క
నమస్కార మెసగనిచ్చి
ఊరకుంట ఎంతో లెస్స!
నారాయణ దాసుగారు
భక్తికొరకు బ్రతికినారు
తిండికోసం కాదు
రుచికోసం తిన్నారు.
అందం కోసమ్ము స్త్రీని
ఆరాధించారు గాని
భోగముకోసమ్ము కాదు.
కళావతుల నాదరించి
నారు కాని కామము కో
సమ్ముకాదు  ఆస్తిక్య ప్ర
చారార్థము, ధర్మము బో
ధింపంగా హరికథ చే
పట్టినారు  అది హరికో
సమ్ము కాదు  సిరికోస
మ్మును కాదు కథారక్తి
కొరకాయన కలమును చే
పట్టినారు  గాత్ర మెత్తి
నారు, గజ్జ కట్టినారు
ఆదిభట్ట కివి ఎవ్వీ
ఆ యశస్సుకొరకు కాదు.
ఆ మహామహుండు బ్రతుకు
గహనమ్మున[98] వేసుకొన్న
బాటవేరు  వారు నడుచు
నట్టి నడక ఎంతో నేరు

ఆపాటీ ఈపాటీ
అయినవారి కది ఎంతో
దురవగాహ మైనతీరు!
"నావి నాల్గు మోము లవున!
ఎటు ముద్దిడగాగల" వని
అంటు నల్వ ఆప్యాయన
గా హసింప "నే ననంత
ముఖిని నన్ను ఎట్లు ముద్ది
డగా గల" వటంచు చెల్వ
నవ్వ "ముద్దిడెదను చూడు"
మన్న నల్వ నారాయణ
దాసుగాగ సిగ్గువడెడు
శ్రీ సరస్వతీదేవికి
"చెప్పుకొందు నానమస్సు"
భిన్న భిన్న సమయమ్ముల
శ్రీ జోగారాయ సుకవి
మిమ్ము గూర్చి వెల్లడించి
నట్టి భావనారీతులు
"బహిరంతరముల విశిష్ట
లక్షణత, విలక్షణతల
నొప్పెడు గుణబంధురుండు,
వివిధ విద్యలను విశార
దుండు, సకలకళాకౌశ
లాల మహాపేశలుండు
బహు భాషాచతురాస్యుడు"
అయిన అట్టి దాసుగారి
వ్యక్తిత్వము నాకళించు
కొనుట కొక్క రేవెక్కడ
కనుపించదు. ఆయన సా

మాన్యులైన మానవులకు
"మహామహుడు, ధీమాన్యుల
కత్యద్భుత ధిషణాధూ
ర్వహుండు, హరిదాసాళికి
హరికథాపితామహుండు
కవిజనులకు మహాసుకవి,
గాయకులకు గాంధర్వసు
చక్రవర్తి, నర్తకులకు
నందీశుడు, నటులకు నొక
మహానటుడు, భక్తాళికి
పరమ మహాభాగవతుడు
భాషావేత్తలకు బ్రహ్మి
ష్ఠో బ్రహ్మ, సర్వశాస్త్ర
విద్వాంసుల కక్షపాదు
డా పౌరాణికుల బాద
రాయణుండు, వేదాంతుల
కా అనాది శంకరుండు
ధార్మికులకు ధర్మజుండు
వనితల కంటికి వంచిత
పంచాస్త్రుడు, కామధేను
వా కళావతులకు వదరు
బోతులకును వావదూక[99]
వల్లభుండు, మితభాషుల
వాచంయమి,[100] నిక్కుబోతు
లౌవారికి అంకుశమ్ము
లేని గంధ సింధురమ్ము,
నాగరికుల నవఖండ మ
హీమండల ఆఖండుల
చక్రవర్తి, జానపదుల
సత్తెకాల సత్తెయ్యయు
మహాభాగు డౌ నాయన
జీవితాన్కి, వ్యక్తిత్వాన్కి
వైదుష్యాన్కి ఏతా మె
త్తెటందుకు సాధ్యపడదు.
నీరాజన మెత్తటాన్కి
సంకల్పము చేశాము.
సరస్వతీప్రసాదు లైన
దాసుగార్కి జగద్గురువె
అయినయట్టి పరమేశుడె
జగద్గురువు. ఆయన వి
ద్యలు సర్వం స్వయంకృషిని
లబ్ధమ్ములు హరి కరుణా
కటాక్ష సంప్రాప్తమ్ములు.
అందువల్లనే ఆయన
తన నేర్పుల నన్నింటిని
జగజ్జన తారకమౌ
హరికీర్తన కోసమ్మే
వినియోగమొనర్చినారు.
తనదు సకల కళాకౌశ
లముల కెల్లగాను సాంద్ర
విద్యాకేంద్రమ్ము గాను
తీర్చిదిద్దుకొన్నాడు.
ఆంధ్రదేశ మందలి ప్ర
ప్రథమమైన సంగీతక
ళాశాలకు ప్రప్రథమ ప్ర
ధానాచార్యుండు అయ్యు
హరికథకు పితామహుండు
గా జగమ్మునను సరస్వ

తీనామమునిల్పినాడు.
ఎందరనో శిష్యవరుల
తనయశఃపతాకలుగా
దేశమందు నిల్పినాడు.
ఆయన తనకొక్క గురువు
లేకున్నను ఆహరిదా
స జగద్గురువైనారు.
హరికథకోసమె ఆయన
అవతరించినాడొ లేక
ఆయనకోసమె హరికథ
అవతరించెనో చెప్పుట
కడు కష్టము. వాదమేల?
ఉభయపక్షములును సత్య
సమ్మతమ్ములంచు ఒప్పు
కొనుట ప్రాజ్ఞలక్షణమ్ము!
బహిరంతర బంధురస
ద్భక్తిభావనా శేవధి[101]
యో ఆరూపమ్ము భార
తీయ సంవిత్ సార సర్వ
ధూర్వహా,[102] మా మహావ్యక్తి
గాన నృత్య సాహిత్య
మ్ములు మొదలౌ కళల, కౌశ
లమ్ము పేశలమ్ము గాన
ఆ మూర్తియు స్వయంగాను
హరికథోపన్యాసమ్మును
చెప్పువేళ సన్నివేశ
మున సనకసనందులు, శా
రదచతురాస్యులు, నారద
తుంబురులును పార్వతిపర
మేశ్వరులును కాళిదాస
షేక్స్పియరులు కలసినట్లు
గా సాక్షాత్కారము నొన
రించినట్లు కనుపించును.
ఆ మహాత్ముహరికథనము
మూలంగా భక్తిభావ
మా సామాన్యుల యందున
జీవమ్మును పోసుకొనెను.
సద్భావము పెంపొందెను.
వివిధకళా రసికతలును
వికసించెను. అత్యపూర్వ
మౌ ఆయన కథాకథన
బంధుర వైదగ్ధ్యానికి
స్పందించని డెందమంటు
లేనేలేదు. లోకంలో
హరికథాపితామహుండు
హరిదాసజగద్గురుండు
అవు నాయన గాన రూప
కథాఖ్యానమును, కైటభు[103]
అరిసంకీర్తనము అయిన
యక్షగాన పూర్వరూప
మునకు పునర్భవము ప్రసా
దించి దాని కపూర్వమ్ము
చిరస్థాయికమ్ము నయిన
ప్రతిష్ఠను పటిష్ఠము గా
వించినట్టి వాగ్దేవీ
ప్రియవయస్యు డైన భట్టు
నటరాజుకు గగనతలము
ఎట్లు రంగస్థల మయ్యెనొ

46

అట్లె నట్ట నడువీధియె
ఆదిభట్టు హరికథలకు
ఆటపట్టు అయిపోయెను
విద్యార్థులుగా తనకడ
కరుదెంచిన వారిని వి
ద్వాంసులుగా జేసి పంపు
టే గాదు  తన లోగిట
తన వాకిట హరిదాసుల
కరచేతను వైకుంఠము
చూపినారు ఆదిభట్టు
శ్రుతి లయ లీరెం డాయన
ఉచ్ఛ్వాసము, నిశ్వాసము
ఆయన దౌ నెట్టి కూన
రాగమైన సామగాన
మౌతుంది. ఆడినతై
తక్క శివుని అద్భుతమౌ
తాండవమ్ము  జగము సర్వ
మాయన సంగీతశాల
కారణజన్ములు నారా
యణదాస మహోదయులు.
త్యాగరాజు, నారాయణ
దాసు, మహాత్మాగాంధీ
ఈముువ్వురు యుగపురుషులు.
ఈ ముువ్వురు పరమపదిం
చిన దినమ్ము పుష్య బహుళ
పంచమియౌటొక అపూర్వ
మౌ జ్యోతిషవిశేషమ్ము.

☆

శ్రీనారాయణభట్టా!
ఆదిభట్ట! మహాభట్ట!!
వేదాంత వ్యాకరణ మహా
విద్వాంసులు, పుణ్యమూర్తులౌ
పూజ్యులు ఓరుగంటి
నీలకంఠ శాస్త్రి వరులు
మిమ్ము గూర్చి తెలిపినవి
"దాసుగారి కుటుంబమ్ము
వేదవిజ్ఞ కుటుంబమ్ము
తండ్రి ఖ్యాతినొందినట్టి
సరస సుసాహిత్యమ్మున
పారంగతు డయినవ్యక్తి!
తల్లి వివేక మహా సం
పన్న అయిన విదుషీమణి!!
సహోదరులు వైదికలౌ
కిక విద్యా పరులు. వీరి
తలిదండ్రుల సత్ప్రవృత్తి
మహాభాగ్య విశేషమ్ము
చేతనె ఈ మహాభాగు
డవతరించి కారణజ
న్ముండుగాను జనకుని కడ
నే తన విద్యోపదేశ
మయ్యె. అద్ది కావ్యపఠన
శ్రవణ మాత్రమేను. తల్లి
వద్దనె పౌరాణికాది
గాథాశ్రుతి 'ఉపదేశ మ
పేక్షంతే విద్యా స
త్పాత్రసంగతాః' అను న్యా
యమ్ము చేత నామమాత్ర

మౌ జనకుని ఉపదేశమె
దాసుగారి సకల విద్య
లకు నిధానమై ఉన్నది.
దాసుగారి స్వరూపమ్ము
స్వభావమ్ము నెరిగినట్టి
వా రెవరైన నీ మహాను
భావు డెట్లు గురువుల కడ
శుశ్రూష నొనర్పంగా
గలడని అద్భుతపడెదరు.
తార్కికులలొ తార్కికుడుగ
వైయాకరణుల అందున
వైయాకరణుండుగాను,
మీమాంసకు లందున మీ
మాంసకుడుగ కవుల యందు
మహాకవిగ, గాయకులలొ
గాయకుడుగ వైణికులలో
వైణికుడుగ, నటకులలో
నటకుడుగా, హరిభక్తుల
అందున హరిభక్తుడుగా
తనదు విశ్వరూపత్వము
ప్రకటనగావించుకొనును
కావునన దాసుగారు
ఎవ్వని ప్రభు వనదగునొ
ఎవని ఇచ్ఛ కడ్డులేదొ
ఎవడు సత్య స్వరూపుండొ
ఆ ఎవ్వడు అధికార
ణమ్మొ అఖిలమునకు నట్టి
"సర్వేశుని నాగురునిగ
నాశ్రయింతు" నన్నారు

సకలశాస్త్ర పాండిత్యము,
సకలకళా కౌశలమ్ము
బహుభాషా వేతృత్వము
ప్రతిభాతిశయమ్ముచేత
స్వయముగ సంపాదన నొన
రించుకొన్న అప్పటికిని
దాసుగారు తనను ఒక్క
భక్తుడిగా, ఒక భక్తిప్ర
బోధకుడిగ ప్రకటనగా
వించుకొనెను, "మేధాశ
క్తికిని, ధారణాశక్తికి
సహకరింప గురుముఖాన
కొన్ని యేండ్లు మహాశ్రమతో
తిరిగి తిరిగి చింతనమ్ము
చేస్తే గాని అవబోధము
గాని యట్టి కౌముది శ
బ్దేందు శేఖరాల వంటి
గ్రంథమ్ముల దాసుగారు
స్వశేముషీ విశేషాన
అవగతమ్ము చేసుకొనిరి
జీర్ణముగావించుకొనిరి"
అని మా గురుపాదులు శ్రీ
మహామహోపాధ్యాయులు
శ్రీ తాతా సుబ్బరాయ
శాస్త్రివారు చెబుతుండగ
మే మెంతో అత్యంతా
శ్చర్యమ్మును పొందినాము.
ఇద్ది ఎలా సాధ్యమ్మని
ఇట్టి మహామేధావియె

తన్ను సర్వస్వతంత్రుండు
ఐన మహాపండితుండ
అని ప్రకటించక భక్తిప్ర
బోధకుగా మాత్రమ్మే
ప్రకటించుట కేమి హేతు
వని ఎందరకో సంశయ
మబ్బవచ్చు. ఆయనగ్రం
థాలవల్ల ఒక్క మహా
భక్తరూపమున నుండుట
యే ఆయన హృదయానికి
సర్వాభీష్టమ్మని గా
ఢముగ వెల్లడౌతున్నది.
ఏ విద్యావైభవమ్ము
భగవాను డనుగ్రహించె
దాని తాను జీర్ణముగా
వించుకొని లోకంలో
భక్తి ప్రబోధము చేయుట
చేతను తా పరమేశ్వర
ఆరాధన, ధర్మప్రబో
ధము తద్వారాను భార
తోద్ధరణము చేసియె కృత
కృత్యుడ గాగలనని సం
పూర్ణముగా నమ్మినారు
దాసుగారు. తమదు హరిక
థోపదేశ మూలంగా
సకల హృదయ క్షేత్రాలలో
భక్తిబీజముల నాటిరి.
అవి క్రమంగ లతాప్రతా
నమ్ము లౌచును కుసుమించి
ఫలించి తమ సువాసనల
నలుదిక్కుల వ్యాపింపగ
జేసినవి. ఆయన గురు
మూర్తులైరి తాము తరిం
చిరి. ఇతరుల తరింపగా
జేసిరి. పితృమూర్తులైరి.
నైజమ్మౌ కరుణాత
రంగితాంతరంగముతొ
అంతేవాసులవి కష్ట
సుఖముల గనిపెట్టినారు.
వారి నుద్ధరించినారు.
దివ్యమూర్తులై వారల
హృదయాంతరముల ప్రవేశ
మొనరించిరి సన్మార్గుల
గావించిరి. ఇలా వారు
వారి శిష్యసందోహా
నికి ఋషిపితృదేవతా
మూర్తులుగా నొప్పినారు.

☆

47 నారాయణదాస గురూ!
గురువుల కొ పెద్దగురూ!!
ఎక్కడున్న మీరు భట్ట!!
పిల్లల మైనట్టి మమ్ము
బ్రహ్మీసమయాన లేపి
వామనస్తుతిని పఠింప
జేసి పిదప ఈ పాఠము
కంఠస్థము చేయింతురు.
మన అందలి ప్రతిఒక్కరి

భగవంతుడు అనుగ్రహించు
నే దేవుని తెలుసుకొందు
గాఢముగా ప్రేమింతును
కీర్తింపగవలె దేవుని
వందనమ్ము లీయగవలె
ఎచట శాంతి ఉంటుందో
అచట దేవు డుంటాడు
భగవంతుడు సృష్టించును
మనుజుడు రూపమ్ము నిచ్చు
దైవసూత్రములను నేను
అనుసరించి తీరవలెను.
ఎవడధికముగా నెరుంగు
అత డల్పముగా చెప్పును.
వినతి వల్ల ఎన్నండును
ఏ లోపము ప్రాప్తించదు.
పతనానికి పూర్వము కడు
దొడ్డగ పెరుగును గర్వము
మహనీయులు అంద రొకే
పద్ధతిగా యోచింతురు
అరయంగా సారళ్యము
అత్యుత్తమమౌ పద్ధతి
శ్రద్ధారాహిత్య మొక్క
దుష్టమైన ఆచారము
స్వగృహాన్ని పోలినట్టి
స్థాన మెద్ది కనుపింపదు
అల్పముగా మాటాడుము,
అధికముగా కృషిచేయుము
ఆకాశపు వర్ణ మ్మది
అందమ్ముల నీలిమమ్ము

తీయని తావిని వహించి
ఉండు గులాబీతరువు
ఉత్తమమౌ ధ్యానమ్మును
విడిచిపెట్టబోకు మెపుడు
ముఖ్యమ్మగు అవకాశము
కోసమ్మే వీక్షింపుము
సద్గుణాని కయ్యదియే
సాటియైన బహుమానము
ఋణము తీసుకొనుటకంటె
క్రయము చేసుకొనుట మేలు
వీరులైన యట్టివారి
విధి అనుగ్రహించుచుండు
ఎల్లవారి తృప్తిపరుచు
టెంతో ఘనమౌ కష్టము
పనిచేయుము సర్వత్రా
అదిపగలై ఉన్నపుడె
మన అందు వసించు ఆత్మ
ఎన్నండును మృతినొందదు.
ఎన్నో వాలుకలు[104] కలిసి
మహానౌకనే ముంచును
ఆరోగ్యము ఘనభాగ్యము
క్రమము తప్ప కెపుడు గడి
యారమువలె ఉండవలయు
మధ్యాహ్నమ్మున భుజించి
కొద్దిసేపు కూర్చుండుము
రాత్రి భోజనమ్ము పిదప
నడువుము నీ వొక్క మైలు
సిద్ధాంతా లాచరణలు
యోగ్యాలై ఉండవలెను

సంభాషణ సామర్థ్యా
నికి మౌన మలంకారము
అంగబలం లేనివారి
అర్థబలం వ్యర్థముగద!
ఆలస్యం అయితే అమృ
తము సైతము విషమౌను
ఆత్మస్తుతి, పరనిందల
అవసరాల విడువరాదు
విత్త మనర్థపు హేతువు
అద్ది సుఖప్రదము కాదు
దిగ్విజయమ్మునకు నాత్మ
విశ్వాసమ్మే మూలము
జ్ఞానము, ప్రేమల కలయిక
యే పూర్ణత, ఆనందం
మన మనస్సె చిందరవం
దరగఉంటె మనము ఎలా
బైట శాంతి కాపాడగ
గల మన్నది పెనుసమస్య
ఏ సమస్యలను యుద్ధం
పరిష్కరింపగా జాలదు
ఆవేశం జలధివోలె
అతి చెవిటిది? అగ్నిలాగు
చురుకుగ వ్యాపించేది
గురువు–అనుగ్రహము వల్ల
శిష్యులోని అజ్ఞాన
మ్మను చీకటి వేగంగా
పటాపంచ లవుతుంది
ఆశయమ్ము మంచిది అయి
నప్పుడే అది ఆచరణము
లోనికి విచ్చేయటాన్ని
ఎవ్వరునూ ఆపలేరు.
తప్పు రెండు వైపులందు
ఉన్నపుడు ఘర్షణమ్ము
కడు ఘనముగ సాగుతుంది.
క్షమాగుణము అనునది బల
హీనుల కౌనట్టి బలము
బలవంతుల కాభరణం.
ఆవేశంతోడి కాక
ఆలోచనలతోటి వ్యవహ
రించువాడు దేవుడితో
తుల్యుండని పేరు పొందు.
అవివేకుల మతులలోని
అధికారం, కామోద్రే
కులచేతుల లోని ప్రేమ,
పిచ్చివాడి చేతిరాయి.

⋆

48 ఓనారాయణదాస!
జ్ఞానదాన! మహాగాన!!
భగవంతుడు మన నిర్ద్వుర
రక్షించుత! పోషించుత!
మన నిరువుర! ఇరువురమును
శక్తివంతులముగా నై
శ్రమియింతము గాత మనము
మన అధ్యయనము తేజో
వంత మ్మగుగాక! ఎపుడు
ద్వేషము లేకుండా ఇరు
వురమును మనియెదముగాక!
పాఠప్రవచనము చేసి

శిష్యకోటి కెన్నో ఇట్టి
సూక్తులు వినిపిస్తారు.
మానవుండు తన్నుతానె
రక్షించుకొనంగా వలె
భేదింపగ రానియట్టి
దుర్గంగా వర్తిలవలె
సజ్జనులతొ స్నేహమ్ము, పు
రాణశ్రవణమ్ము దైవ
చింతనమ్ము మొదలైనవి
జ్ఞాన ప్రస్థానంలో
ప్రథమమైన మజిలీలు!
ఉపకారం చెయ్యడమే
ఉత్తమమౌ ధర్మమ్ము
నేర్పుతో కర్మలు చేయుట
ఉత్తమమౌ నర్థమ్ము
పాత్రోచితమౌ దానమె
పరమోచితదానమ్ము
జగము సర్వమును మనసే,
ముల్లోకములును మనసే,
ఆ మనసే, సంసారము,
అది స్వాధీనమ్మయితే
సర్వము స్వాధీనమ్మౌ!
నిద్రను స్వప్నాల చేత,
స్త్రీలను ఆసక్తులతో,
అగ్నిని చిదుగులచేత,
దాహమ్మును మద్యంతో,
ఓడింపగా లేము
కలియుగమ్ములో ఇప్పుడు
దోషాలెన్నున్ననేమి!
సుగుణ మ్మొకటున్న దద్ది
శ్రీకృష్ణుని సంకీర్తన
రామనామమునకు సాటి
లే దెయ్యది? సంసారపు
దుఃఖమ్మును మొలకలోనె
నాశనమ్ము గావించును
ఏకైక మ్మగు భక్తితొ
శివుని, రాము, మహావిష్ణు
ఎవ్వరి నే రూపంలో
ఆరాధించినను నీవు
మోక్షాన్నే పొందుతావు.
మరణించిన తరువాతను
వెంటవచ్చునది ధర్మము
అదియే నిజమైనయట్టి
నేస్తమ్ము మిగలినవ
న్నియు దేహము తోబాటే
అంతరించి పోతుంటవి
వైరాగ్య మ్మనెడి ప్రమిద
భక్తి అనే తైలమ్మును
ఏకాగ్రత అనెడి వత్తి
తత్త్వవిచారణ అనియే
అగ్నిఉంటె జ్ఞానజ్యోతి
బహు చక్కగ వెలుగుతుంది
అంతరంగమందున శ్రీ
నారాయణుడుండు వారి
ఆనందానికి నేవిధ
మైనలోప ముండబోదు
సాగరంలొ సంగమించి
నది సాగర మైనట్లుగ

ఏ జీవుడు ఆత్మ నెరుగు
ఆ జీవుడు ఆత్మయౌను
సంసార మనే విషవృ
క్షమ్మునుండి సత్సాంగ
త్యమ్ము సాహితీ ఆరా
ధన అనియే రెండు సత్ఫ
లాలు లభ్యమౌతాయి
శ్రద్ధలేనివారికి హిత
బోధచేయు టతివ్యర్థము
ఇంద్రియనిగ్రహము లేని
వారికి బోధించు విద్య
నిష్ప్రయోజన మ్మౌను
మోక్ష మంటె వ్యక్తిత్వం
కోలుపోవటమ్ము కాదు
పరమాత్మను తానుగాను
స్వస్వరూపముగను నెరిగి
అనుభూతిని పొందటమే
ప్రతి ఒక్కని జీవితమ్ము.
భగవాను ప్రణాళికలో
నియమించిన ఒక భాగం.
ఆధ్యాత్మికత నియెడునది
కారణాన్ని తిరస్కరణ
చేయునట్టి దెపుడు కాదు,
దాని నధిగమించునది
ధ్యానం ద్వారాను శ్వాస
స్వాధీనంలోకి చేరు
కుంటుంది, మనసులోన
ప్రాణము లయ నొందుతుంది.
సంకల్ప వికల్పాలు
నాశనమ్ము నొందుతాయి.
శాంతి లభ్యమౌతుంది.
భోగవాంఛ బంధమౌను.
వాంఛాశూన్యత మోక్షము.
నీవు నీదు గౌరవాన్ని
ఏ దినాన కోల్పోతా
వో ఆదినమందు నీవు
ఈ లోకంలోన లేని
వాడవె అయిపోతావు
ఎవ్వడు తన ఇంద్రియాల
నిగ్రహించుకోగలడో
అతడు స్థితప్రజ్ఞానిధి
సత్యమ్మును మించిన ధ
ర్మమ్ము లేదు  సత్యసంధు
లయివర్తించే వారికి
పరమేశ్వర సాక్షాత్కా
రమ్ము లభ్యమౌతుంది!
జపతపాలు గావించెడి
వారికంటె ఎల్లప్పుడు
సంతోషముతో ఉల్లా
సమ్ముతోటి చిరునవ్వుల
తో జీవించేటివారె
పరమేశ్వర సన్నిహితులు
ఓర్పుతోటి సాటి అయిన
అట్టి తపము కానబడదు,
సంతుష్టిని మించినట్టి
సౌఖ్య మెదీ కానబడదు,
దయను మించు నట్టిదైన
ధర్మమెదీ కానబడదు

మనకు మిత్రులను గానీ
మనకు శత్రులను గానీ
మన ప్రవర్తనే కూర్చును
ప్రేమ బాధలను సహించు,
ఎట్టి ప్రతీకారమ్మును
గావింపదు, తలపోయదు.
హింసతోటి సాధింపగ
గలిగినట్టి హిత మెయ్యది
లోకంలో కనుపించదు.
నిందగాని, స్తుతిగానీ
వాయుతరంగాల బోలి
ఉంటాయి ఆ నిందా
స్తుతుల ప్రభావాని కెపుడు
లొంగిపోవగా చెల్లదు
నీలో కోరికలు పెరిగి
పోతు ఉన్నకొద్ది నీలో
శోకము సైతమ్ము ఎంతొ
పెరిగిపెరిగి పోతుంది
యత్నమొనర్చుట వరకే
మన బాధ్యత ఫలితమ్మును
భగవానుడె చూచుకొనును
దేహానికి ఆహారం
ఎటువంటిదొ ఆత్మకు ధ్యా
నమ్ము సైత మటువంటిది.
ముందు సేవకుడివి గాను
ఉండటమ్ము నేర్చుకొమ్ము,
అంతట అధికారివిగా
ఉండేటందుకు అర్హత
లభ్య మ్మై తీరుతుంది.

పరులను దూషించువాడు,
కడుసోమరి, పిసినిగొట్టు,
దీర్ఘకోపి ఈ నల్వురె
లోకమందు అస్పృశ్యులు
నీ బాధకు కారణ మెవ
రైన నేమి? నీవు మాత్ర
మితరుల కే బాధను కలి
గింపవద్దు-ఎన్నండును
జ్ఞానరహిత మైన కర్మ
నిష్ప్రయోజన మ్మయినది
కర్మరహితమౌ జ్ఞానము
ఉపయోగము లేనట్టిది.
సరస్వతీ యమునా గం
గలు అకార ఉకారమ
కారాలని జాగ్రత్స్వ
ప్నమ్ము నిద్రల కార ఉకా
రమ కారాలని తెలియుము.
మూలమందు బ్రహ్మ మధ్య
మందు విష్ణు వగ్ర మందు
శివుడ వైన వృక్షరాజ!
అశ్వత్థా! నీకు నతులు
దీక్షతోడ సాగరమ్ము
లోన నింత లోతు దిగిన
అన్ని రత్నములు లభించు.
అట్లె పురాణాల లోన
విల్వ గల్గు విషయమ్ములు
మనకు లభ్యమౌతాయి.
కామ, క్రోధ, లోభాలను
చోరవరులు చేరినారు

దేహంలో జ్ఞానరత్న
మును హరింప నున్నారు
అందువల్ల జాగరూక
తను వహింపవలెను నీవు
విస్తృతమౌ ప్రాపంచిక
కదనక్షేత్రమ్ము నందు
జీవితాన శాత్రవభయ
హేతువుచే రాత్రులందు
జాగృతి వహియించువేళ
మూక చలిత జంతువు లటు
ఉండవద్దు. ధైర్యముతో
వీరునివలె వర్తింపుము.
సౌఖ్యంలో ఆపదలో
ఏకరూపమున నుంటా
రు మహాపురుష శ్రేష్టులు
సూర్యుడు ఉదయించు వేళ
అస్తమించు వేళ రక్త
వర్ణంతో ఉండునుగద!
రవి పగటిని, శశిరాత్రిని
భాసింపగ జేస్తారు.
బుద్ధిమంతు డయినకొడుకు
కుటుంబాన్కి పూర్తిగాను
వన్నె తెచ్చిపెడతాడు.

☆

49 నారాయణదాస! భట్ట!!
మహాభక్త! ఆదిభట్ట!!
"శక్తివైన ఓ నీవా!
శక్తివంతు గావింపుము
వీర వైన ఓవీరా! నను
వీరుని గావింపు తల్లి!!"
ఈ ప్రార్థన పఠియించిన
వెనుక మిమ్ము మీ శిష్యులు
"రసికులు తమ శక్తికొలది
పసనెరుగంగా గలరు
మీ వచనం ప్రతి ఒక్కటి
ఒక కురంటి,[105] ఒక చిరంటి![106]
ఒక సాకే తెచ్చి యిచ్చు
ఉజ్వలరస భృంగారము.[107]
ఏమైనా చెప్పు దనిన
ఈ రీతిగ నుడివినారు!
భక్ష్య[108] భోజ్య[109] చోష్య లేహ్య[110]
ముల నాల్గిటిలోన ఉన్న
షడ్రుచులను "షాడబరుచి"[111]
ఎరిగిన భోజనప్రియుడ!
కామినీ జనమ్ము కామ
సౌఖ్యాలను కోరి ఇంద్రు
వలన పుచ్చుకొన్నారు
ఈ నారులు లోకంలో
ప్రేమయాత్ర లెన్నింటిని
ప్రీతితోడ నడిపినట్టి
పర్యాటక సారథులు.
నారి లేని ఇల్లు వృథా!
నారిలేని విల్లు వృథా!!
నగ్న అయిన స్త్రీని చూచి
ఎవని మనసు చలియింపదొ
అతడు యోగి, సత్యమ్ముగ
"ఉన్న దొక్క కూతు రయిన
ఊరంతా అల్లుళ్లే"
అన్న కీర్తి ఆర్జించిన

వీరమాతలకు హేతువు
చర్చనీయమౌ అంశము.
ప్రేమికులను వలుసంఖ్యగ
పొందునట్టి సమ్మోహన,
సుప్రసిద్ధ 'మెస్సాలిని'
కెవ్వ రెపుడు పూర్ణముగా
సంగమసుఖ మివ్వ లేక
పోవటాన్ని తెలుపుకొన్న
రోమక విట విఖ్యాతులు
మెచ్చి ఆమె కీర్తింపగ
"అవిజే" తను ఘనబిరుదము
సంప్రీతితొ ఇచ్చినారు.
అవిజేతతొ పోల్చంగా
దగినట్టిది, అంతకంటె
వీరవనిత "అజముఖి" అను
నామంతో పురాణాన
గొప్పగ కనిపిస్తున్నది.
"అజముఖి" ఎవ రంటారా?
సురస కశ్యపుల కూతురు,
శూరసురల, పద్మాదుల
ప్రియిసోదరి. లావణ్యల
లాంపట్యము సర్వమ్మును
త్రోసిపుచ్చి, ఈమె తనకు
అందగాడుగా తోచెడు
వీరవరుని ప్రతిఒక్కని
పట్టి తెచ్చి శయ్యజేర్చి,
సంగమించు టందు శక్తి
సర్వమ్ము ప్రదర్శించు
అవిజేతవు నీవు తన్వి"
అని అందరి చేతను ఒ
ప్పించి తృప్తి నొందెడిది.
పలువీరులతో నీ గతి
గడిపి నట్టి మహోభయద
రతికేళీ వీరనారి
అజముఖి ఆ దుర్వాస మ
హర్షి చూచి ఆయన శ
క్తిని పరీక్షచేయ దలచి
సంయోగము గావింపగ,
తనను అట్లు అవమానిం
చుట నోర్వక శాపమొసగి
గర్భధారణము నొందగ
జేసినాడు, వాతాపీ
ఇల్వలు లను జనహంతకు
లయినవారి కనియె నామె
పరుగులెత్తు మెరపు తీవ
చాంచల్యము, క్షురాఖడ్గ[112]
గతతీక్ష్ణత, వాయువర్ణ
నాతీతమ్మగు వేగము
నెలతల ఎదలందు నిత్య
మును నుండుట మీకు ఎరుక
మీ రెన్నడు చక్రాటుల
వర్ణాటుల, భావాటుల,[113]
అన్యమైన దోషాటుల[114]
వశ మెన్నడు కారాదు
ఎచట స్త్రీలు పూజింపం
గాబడుదురొ అచట దేవ
తాజాలము పూజింపం
గా బడుదురు. ఎద్ది కంటి
కింపో అది కడుపు కింపు
గణికామణులును, శిల్పులు

వృద్ధవయసు వచ్చు వరకు
పొంద రెపుడు ప్రావీణ్యం.
లావణ్యల మార్దవాన్ని
లఘువొనర్చు ప్రేమ ఎంతొ
స్త్రీల ప్రేమ బాణమ్ము
అద్ది బీజ మెపుడు కాదు.
మనుజ శరీరమ్ము రథము
రథికుడాత్మ సారథియౌ
బుద్ధి ఇంద్రియాలు ఆశ
గణము, మనసు కళ్లియమ్ము
నదులు ఏవిధాన నామ
రూపాదుల వదలి జలధి
లోన లీనమౌతాయో
అట్లె జ్ఞాని విశ్వేశ్వరు
లోన లీన మౌతాడు.
కామము నుద్దీపించెడు
నేత్రదృష్టి భేదమ్ములు.
వక్షోజపు[115] కాఠిన్యము
సూక్ష్మమైన మధ్యమ్ములు[116]
స్త్రీ జాతికి ముఖ్యంగా
నట్టువలకు[117] ఎంతగానో
అందానికి పోషకాలు.

☆

నాభిలోతు[118] అయిన స్త్రీకి
మదనరసము అధికమంటు
కాళిదాసుకవి మేఘ
సందేశంలో తెలిపెను.

☆

నారదుండు పంచచూడ
అనెడి దేవతావనితను
స్త్రీ స్వభావ మెట్టిది అని
ప్రశ్నిస్తే పరపురుషుల
గవయగోరుటయు మొదలౌ
లక్షణాల తెలిపె నామె

☆

నర్తకీ కుచద్వయమ్ము[119]
ఆమె కంఠహారమ్మును
మించిన మూల్యమ్ము కలది...

☆

దూర్వాస మునివరుడు
ఒక మౌనిపుత్రికను
కందళిని[120] మోహించి
భార్యగా నర్థించె
ముని ఒసంగిన పిదప
దూర్వాసఋషి పుచ్చు
కొనియె నా సుందరిని
ఆ రూపవతి మహా
వాగ్దుష్ట కాన నా
యమ తిట్టుటకు కడగ
దూర్వాసఋషి వరుడు
కుపితుడై "భస్మమై
పొ" మ్మనుచు శపియించె
అప్పుడాయమ తండ్రి
దూర్వాసు వేడుకొనె
ఆ మహాముని ఆమె

నపుడు "కందళి" వోలె
నుద్భవింపగజేసె

☆

50 ఓ నారాయణభట్టా!
భట్టభట్ట! ఆదిభట్ట!
లోకంలో ప్రజలకున్న
అర్హతలకు అనుగుణంగ
ప్రవృత్తి నివృత్తుల రెంటిని
శ్రద్ధతోడ తెలిపినారు
నీవీ[121]మోక్షణవేళను
వస్త్రమూల్యములను విచా
రించువారి శ్రద్ధతోడ
క్రమబద్ధుల జేసినారు
'శృంగారమ్మే మధురము,
అన్యరసము లెల్లను ప్ర
హ్లాదనములు' అని చెప్పిరి.
రక్తిని కట్టించుకొరకు
మర్యాదల తెలుపుకొరకు
కథాకథన శిష్యుల కిటు
పౌరాణిక వైశిష్ట్య వి
శేషాలను తెల్పినారు.
"తార, సీత, మండోదరి
ద్రౌపదియు అహల్య" ఇందు
వల్ల పంచకన్య లైరి.
గౌరీ ఈశ్వరుల ఆజ్ఞ
పుడమిపైన అవతరించి
నట్టి లక్ష్మియే ద్రౌపది
వేశ్యాపుత్రుడు వసిష్ఠు,
వ్యాసుడు జాలరికి పుట్టె.
మాలెతకు పరాశరుండు
జననమందె తపము చేత
సంస్కారము నొందినారు.
వాలిని నిష్కారణముగ
చంపినట్టి కారణాన
రామచంద్రునకు అబ్బెను
శాపం అది శ్రీకృష్ణుని
అవతారము నందు వాలి
పుత్రు డైన అంగదుండు
బోయవాడు గాను పుట్టి
మృగమనియెడు భ్రాంతితోడ
వేసిన బాణము కృష్ణు
పాదాలకు తగిలి అంత
మరణమ్మును కల్పించుట
వలన జగన్నాథున కా!
తారశాప మంతరించె
వాలి భార్య తార భర్తృ
మృతి నొందుట శోకిస్తూ
రామునితో "సీత తిరిగి
వచ్చినప్పటికిని ఆమె
చిరకాలమ్మును మీతో
కలసి కాపురమ్ము చేయ
కుండుగాక!" అని శపించె.
కృష్ణుని ప్రేమకు లక్ష్యం
కంసుదాసియౌ త్రివక్ర
కుబ్జ కంసునకై గంధ
లేపనాల గొనిపోవుచు
నున్నవేళ భ్రష్టరూప

సుందరి యౌ నామె జూచి
ఆక్రమించి, లేపనాల,
స్వీకరించి ఆమె పాద
ములపై తన పాదమ్ముల
మోపి లేవనెత్తి కృష్ణు
డామె వంకరలను దిద్ది,
ప్రేమను జనియింపజేసి
సంయోగము నొంది ఉప
శ్లోకు డనెడి బిడ్డ నిచ్చి
సంతృప్తిని కలుగజేసె.
తపముచేసి బ్రహ్మలోక
మును పొందిన ఒకబ్రాహ్మణి,
బాలవితంతువును, రుచీ
కను సుందుని, ఉపసుందుని
సంహరింపవలసినపుడు
బ్రహ్మ తిలోత్తమగ సృష్టి
గావించెను. వారిరువురు
తమలొ తాము కలహముగా
వించుకొంటు మృతినొందే
టట్లు చేయమంచు వారి
కడకు నామె నంపినాడు.
తన విలాసవిభ్రమాల
కార్యసాధన మ్మొనర్చి
తిరిగి వచ్చినది ఆయమ.
సంతసించి పితామహుండు
ఆతిలోత్తమకు సూర్యుని
రథముపైన స్థాన మిచ్చె
రవిరథశిల్పాల యందు
కనుపించే రమ్యమూర్తి

ఈ తిలోత్తమేను, కనుడు.
నవవిధభక్తులు ఇయ్యవి
పరీక్షిత్తు శ్రవణమ్మును
వైయాసిక[122] కీర్తించుట,
ప్రహ్లాదుడు స్మరియించుట,
లక్ష్మిదేవి సంవాహన,[123]
పృథువు మహాపూజనమ్ము,
అక్రూరుడు అభినందన,
హనుమంతుడు దాస్యమ్మును
అర్జునుండు సఖ్యమ్మును
ఆత్మనివేదన మా బలి.
ఘంటాకర్ణుండు ధూప
మర్పిస్తే హరిహరరూ
పాన శివుడు ప్రత్యక్ష
మ్మైన, అతడు కేవలశివ
భక్తుడౌట హర్యర్ధ
మ్మయిన నాసికను మూయుట
లో రహస్య మెరుగదగును.
విద్యా సౌభాగ్య ధాన్య
ధన విరాళ కరుణా సం
తాన మహాలక్ష్ము లనెడి
వా రష్ట మహాలక్ష్ములు[124]
ఒక్కసారిసూర్యసుతుడు
రేవంతుడు ఉచ్చైశ్రవ
మెక్కిచేరె వైకుంఠము,
లక్ష్మికి సహజన్మ డౌట
ఆమె తదేకంగా ఉ
చ్చైశ్రవము చూస్తు ఉండి
పోయింది  విష్ణువు ఆ

వచ్చిం దెవరని అడిగితె
లక్ష్మి పరాకుగ ఉండుట
ఎట్టి సమాధానమ్మును
చెప్పలేదు. విష్ణువు కో
పించి నీవు యమునా తమ
సా సంగమ క్షేత్రమైన
'సువర్ణాక్ష' క్షేత్రంలో
బడబవుగా పుట్టుమంటు
శాపమిచ్చినాడు. బడబ[125]
వోలె పుట్టి లక్ష్మి అచట
'పతిని తిరిగి ఎలా చేరు
కొనగలనా?' అని శివుణ్ణి
గూర్చి తపము చేసింది.
బడబకు[125] ప్రత్యక్షమయ్యె
పరమేశుడు "నీభర్తను
నీతో చేరుస్తా" నని
గట్టిమాట ఇచ్చినాడు.
చిత్రరూపు డను దూతను
శివుడు విష్ణుకడకు పంపె.
ఈ హేతువుచే విష్ణువు
అశ్వరూపమును ధరించి
లక్ష్మి బడబను కలిసెను
ఇద్ది దేవకార్యార్థం
సంభవించె నని తెలిపిరి.
ఇంద్రుపత్ని శచీదేవి
విష్ణులోకమునకు నేగి
విష్ణుని సందర్శించెను
"ఇంద్రాణిని ఓదేవా!
మీ ఊరువు నందున నే
ఉపవిష్టను కావలెనను
ఉల్లాసం అధికమయ్యె,
ఇచ్చగింపు" దని వేడెను
విష్ణువు భూలోకానికి
వెళ్లు మీవు, శ్రీకృష్ణుడ
నై జనింతు అచ్చటనే
నీ కోర్కెను తీర్చగలను.
అని ప్రీతితొ తెలిపినాడు
భూమికి దిగి శచీదేవి
వృషభానుని కూతురుగ క
ళావతియందున పుట్టెను.
కృష్ణుడు గోలోకమ్మున
ఉన్నవేళ రాసమందు
జన్మమంది హరిప్రక్కన
పరుగెత్తెను. రాసమ్మున
నుండి పుట్టి హరి ఎదుటను
ధావన[126] యొనరించుటచే
రాధఅయ్యె నా సుందరి,
శచీదేవి యే రాధగ
వ్యవహరించె నొకజన్మను.

☆

51 నారాయణదాస! భట్ట!!
భట్టభట్ట!! ఆదిభట్ట!!
గర్తపురీ విశ్వమంది
రమ్ము నుంచి విశ్వయోగి
విశ్వంజీ మిమ్ము సర
స్వతి–అవతార మ్మటంచు
విశ్వసించి ఆశీస్సుల
నిట్లు ప్రసాదించినారు

“విశ్వ మెల్ల శక్తిస్వరూ
పము, ఇచ్ఛాశక్తి, జ్ఞాన
శక్తి, క్రియాశక్తిగాను
శోభిస్తూ, ఇద్ది సర్వ
లోకానికి శక్తినిచ్చు
విశ్వవ్యాపకము అయిన
జ్ఞానశక్తి సమాజాన్కి
నూత్నశుభ మొనర్చు దివ్య
సంకలనముతో ఈ భువి
నేదో ఒక ఆకారా
న్నాధారము చేసుకోని
ఆవిర్భావమ్ము నొంది
తద్వారా సమాజాన్కి
జ్ఞానభిక్ష ప్రసాదించ
ట మ్మనునది అప్పుడప్పు
డరుదుగాను జరుగుతున్న
విషయమ్ము. ఆవిధంగ
ఆవిర్భవ మొందినట్టి
దివ్యవ్యక్తులు దివ్య మ
హాపథముల ప్రవర్తించి
ఈ సమాజమునకు ఒక్క
నూతనమ్ము, విశిష్టమ్ము
అయిన సాధనామార్గము
నందజేస్తు ఉంటారు.
నారాయణదాసు గారు
అట్టి మహాపుణ్యమూర్తి!
కేవలము సరస్వతీ
అవతార మ్మయినవారు,
ఆదిభట్ట నారాయణ
దాసుగారు! వీరు “హరిక
థాపితామహులుగ” జగ
ద్విఖ్యాతిని పొందినారు.
సాహిత్యము, సంగీతము,
నృత్యమును హావభావ
ములు గూడిన నటనమ్మును,
నవరసములు, వేదశాస్త్ర
పాండిత్యము సమ్మిశ్రిత
మును నొనర్చి, ప్రేక్షకులను
ఆనందపు తన్మయత్వ
మున నూయల నూపునట్లు
‘హరికథావిధాన’ మనే
నూతనప్రక్రియను సృష్టి
జేసి తాను తన అంతట
తాను గాను దాని అను
ష్ఠించి ఆచరణలొ పెట్టి
అది ఎంతొ విజయవంత
మును శుభప్రదమ్ము అయిన
ప్రక్రియగా, విజ్ఞు లంద
రామోదము నొంది అనుస
రించు రీతి హరికథలను
లోకంలో విఖ్యాతము
చేసిన సాక్షాత్సరస్వ
తీమూర్తియే ఆదిభట్ట
నారాయణ దాసుగారు.
దాసుగారి వంశంలో
జననమంది, వారికి మ
న్మడుగ మంచి పేరును ప్ర
ఖ్యాతి గడించిరి శ్రీ క

ఝా ఈశ్వరరావుగారు.
సహృదయుడు, మహా భక్తి
తత్పరుండు, దాసుగారి
యందు గాఢ భక్తి శ్ర
ద్ధలు గలిగిన యట్టివారు
దాసుగారి ఆరాధన –
ఉత్సవాల, జన్మదినో
త్సవముల జరిపిస్తారు.
కఝా ఈశ్వరరావులు
దాసుగారి సుచరిత్రను,
రచనల లోకాని కంద
జేయాలను ఉల్లాసం
కలిగి ఉన్న యట్టివారు
అందుజేతనే కాబో
లును ఎపుడో శరీరాన్ని
విడిచినట్టి దాసుగారు
తనదు జన్మరహస్యాన్ని
ప్రపంచాన్కి బహిర్గతము
చేయటాన్కి శ్రీ ఈశ్వర
రావుగారి ప్రథమ పుత్రి
కైన చిరంజీవిని లక్ష్మీ సౌ
భాగ్యవతిని రాజేశ్వరి
దేవి నొక్క ఉపకరణము
గా గ్రహించి తన అదృశ్య
వాణి నామె కందజేసి
ఆమె మూలముగను తనదు
జన్మరహస్యాన్ని తెలియ
జేసెడు నా స్వయంలేఖ
నాన్ని లిఖింపగ జేసిరి.

ఏ విధమౌ కవితా నై
పుణ్యము, భాషాచాతు
ర్యమ్ము లేని ఆ అమ్మా
యికి పలువిధ వర్ణనలును,
సత్యలోక, వైకుంఠము
లకు, కైలాసేంద్రలోక
ములకు చెందు వర్ణనలను
అలంకార సహితముగా
సమాస భూయిష్టముగా
చేసిన రీతిని చూడగ
ఈ సాహిత్యంపు సృష్టి
ఆ అమ్మాయిది కాదని
దాసుగారి అమరవాణి
దే అంటూ తేటతెల్ల
మౌతున్నది. ఏది ఏమి
అయినా ఈ గ్రంథము శ్రీ
దాసుగారి జన్మరహ
స్యాన్ని, దేహమును ధరింప
కారణాన్ని తెలియజేస్తు
దాసుగారు సాక్షాత్తుగ
శ్రీ సరస్వతీ – అపరపు
రూపమ్మని, హరికథాప్ర
క్రియను సమాజానికి అం
దించుటకే దాసుగారు
ఉద్భవించినా రంటూ
వక్కణిస్తునే ఉన్నది.
ఈ విషయంలో ఏ మా
త్రమ్ము సంశయమ్ము లేదు.
ఇది ప్రతి – ఒక్కరు తప్పక

ఆమోదింపగ వలసిన
సత్యమైన విషయమ్ము,
కొన్ని వత్సరాల నుంచి
ముద్రణమ్ము లేని దీన్ని
"భట్టు–విద్యలకే భట్టు–
ఆదిభట్టు–నారాయణ
దాసు" అన్న శీర్షికతో
ముద్రణ గావింపజేసి
సమాజాన్కి అందించం
గావలె నని శ్రీ ఈశ్వర
రావు మనసునందున తల
పెట్టినాడు. ఎంతోమంది
గ్రంథాలను ముద్రణగా
వింపజేసి లోకానికి
అందించిన ఈశ్వరరా
వున కారాధ్యుండు అయిన
నారాయణ దాసుగారి
జన్మరహస్యాన్ని తెలుపు
దీనిని ముద్రింపబూను
కొనుట ఎంతొ సమంజసము.
అయిన కార్య యైయున్నది.
ఈ రీతిగ నిది ముద్రణ
పొంది స్వచ్ఛరీతిని ఈ
శ్వరరాయల మూలంగా
లోకానికి అందింపం
గాబడవలె అనెడి నమ్మ
కముతోనే కాబోలు అ
శరీరవాణి వీరి పుత్రి
క ద్వారా సృజియించుట.
దీని రహస్యాన్ని, భట్ట,
ఆవిర్భవ రహస్యాన్ని
తెలుసు కొని ప్రతివ్యక్తీ
ఆనందం పొందుతాడు
అంటు నేను ఆశిస్తా!
చిరంజీవ రాజేశ్వరి
దేవికి, ఈశ్వరరావుకు,
వారి కుటుంబాలకు నా
దివ్యమైన ఆశీస్సులు!!
ఈ గ్రంథం ఆంధ్రదేశ
పాఠకలోకాన్ని చేర
టాన్ని చూచి దాసుగారి
ఆత్మ అయిన జగన్మాత,
వాగ్దేవత సంతసించి
ఆశీస్సుల నందింపం
గాగల దని దృఢముగ నే
ఆశిస్తూ ఉన్నాను.
జ్ఞప్తిచేస్తు ఉన్నా నివి
విశ్వయోగి విశ్వంజీ
విశ్వమందిరమ్ము నుంచి
అందించిన ఆశీస్సులు.

**కఠిన పదములకు అర్థములు -ఉపాయనలు - కానుకలు**

1. రజ్యత్ - శోభించుచున్న
2. పరీవారుడు - సముదాయము గలవాడు
3. గోలోమీ - గోవుల (పవిత్రమైన) తనూరుహములు (వెంద్రుకలు) గలవాడా
4. అబ్జయోని - పద్మమునుండి పుట్టినవాడు (బ్రహ్మ)
5. నాభీ కమలుడు - శ్రీమహావిష్ణుని నాభీపద్మమైనవాడు (బ్రహ్మ) సురభిళములు - మంచివాసనలు గలవి
6. కర్మకులు - కర్మల నాచరించువారు
7. క్రమ- రమణీయమైన
8. వరివస్య - పూజ
9. నతుల - మ్రొక్కుదలలు
10. దివిజులు - దేవతలు
11. పంచాస్త్రొ - అయిదు పుష్పములు (చూతము మొదలైనవి) అస్త్రముగా గలవాడు (మన్మథుడు) చిలుకతేరు - శుకరథము (మన్మథుని వాహనము) గంధవాహ - వాయువు.
12. పుష్పధన్వి - పూ విల్లుకలవాడు (మన్మథుడు)
13. నీరదవు - మేఘమువు
14. నిస్తులము - పరుషమైనది
15. భంజకములు-విరుచునది
16. భాజనాల-భోజనా పాత్రలు
17. చషకము - మద్యపానమొనరించుపాత్ర
18. కర్ణధారి - ఓడను సరియైన మార్గాన నడుపువాడు
19. హర్యశ్వములు - ఆకుపచ్చని గుఱ్ఱములు
20. శబలాశ్వములు - చిత్రవర్ణపు గుఱ్ఱములు
21. లయకారుడు - నృత్యగీత వాద్యముల సమముగా నుండువాడు
22. ఎకిమీడుల - ప్రభువుల, రాజన్యుల

    సురభిళము - మంచివాసన గలది
23. పెండరము - గౌరవ సూచకమైన కడియము

    సింహతలాటము - గౌరవ సూచకమైన సింహముఖముగల కంకణము

24. ఈవికాంద్ర - దానపరులను, దాతలను

25. చీరికిగొనుట - పాయ నొందించుట, చీలికను పొందించుట

26. కోసుమీరు - దైర్ఘ్యము వహించు, పొడుగునతిశయించు

27. కలగల్పు - కలియునట్టు కలిపిన

28. వినుకలియును - ఆకర్ణించి (శ్రవణమొనర్చి) వానిని పొందుట (కనుకలి - వీక్షించి పొందుట)

29. విడిసీమలో -ఒంటరి లేదా ప్రతాపముగల ప్రదేశము లేక దేశమునందు

30. మర్కటయ్య చౌకట్లు - మొగకోతికి నాలుగు ముత్తెముల చేర్చి కుట్టిన (కట్టిన) పోగులు

31. తెన్నువారికంటె-మార్గమువలె ప్రసరించు వారికంటె

32. కన్నాకులు - కన్ను+ఆకులు కన్ను-నేత్రము జూడ కనుపు వంతెనద్వారము తమలపాకు కట్టనో మొదట ఉంచిన పెద్ద ఆకు

33. శ్రీశర్ముడు - సంపదతో కూడిన సంతోషము కలవాడు

34. క్షేత్రం-పుణ్య ప్రదేశము (భూమి)

35. తీర్థము - పుణ్యనది, పుణ్యనదీ ప్రదేశము

36. ప్రాచేతసుడు-వాల్మీకి ప్రచేతసుడు మహర్షి

37. వక్షోజములు - కుచములు, స్తనములు

38. అఘమర్షణము - సమస్త పాపాలను పోగొట్టటానికి పఠించే (జపించే) మంత్రము (ఋగ్వేదము 10-190)

39. పాంశువు-దుమ్ము

40. స్వాధ్యాయము - తన శాఖకు చెందిన వేదాధ్యయము లేదా జపము

41. కాకిలము - కంఠహారము

42. నిస్తులము - సాటిలేని

43. నిస్సీమము - హద్దులేని

44. సంహననము -నశింపజేసేది

45. దేవరాజ్య - స్వర్గ

46. దివోదాస - స్వర్గదాసుడు

47. విక్రాంతుల - ప్రకాశములను

48. జాలమ్ముల-సమూహముల వల

49. ఆకతాయలు–దుష్టులు
50. భీప్రదుల–భయమును కల్గించువారు
51. విస్పదింతులు– విశేషముగ చలించువారు
52. మేధ్యామేధ్యమ్ములు – శుద్ధములు, అశుద్ధములు
53. కుంభదాసి – వేశ్యయింట జలకుంభాన్ని, పానకుంభాన్ని ప్రియుల కడకు చేర్చే కన్య.
54. రూపాజీవ – అందముతో జీవించు వేశ్య
55. గణిక– వేశ్యాగృహ యజమానురాలు
56. యక్షరాత్రి–వసంతమున యక్షులవలె శృంగారక్రీడనము జరుపునట్టి రాత్రి
57. కౌముది–వెన్నెల
58. భంజిక – నరుకుట  తుంచుట
59. సహకార ద్రుమయుత – లేత మామిడి చెట్లతో గూడిన
60. అభ్యూషాఖాదిక – మంచి చవిటిరుచిగల దానిని తినుట
61. బిసఖాదిక – తామరతూడులను తినుట అనుక్రీడ
62. ఉదక క్ష్వేదిక – 'పిచకార'తొ వలె వెదురు గొొట్టముతో నీటిని చల్లుకొనుట
63. పల్యంకిక–పల్లకి, పాలకి
64. దమన భంజికాదులు – అణచుట, విరుచుట మొదలైనట్టివి
65. అనంగనృత్యము – అంగము లేనివానికి (మన్మథునకు) చెందిన నృత్యము
66. నంగనాచి–ఏమియు తెలియనటుండి ఘనముగ కామ (మదన) నృత్య మొనర్పగల దిట్ట.
67. ప్రేక్షణమ్ము – వీక్షణమ్ము, చూచుట
68 గుహ్య భాషణము – రహస్య సంభాణము
69. నిష్పతనము – పనులలో నిమగ్నమగుట
70. మగ్నత – లీనమగుట
71. కబరీ వైచిత్ర్యములు – చెదరిన జుట్లముడుల వింతలు
72. నగళుల – అంత:పురముల
73. మణిమేఖల – మణులతో గూడిన వడ్డాణము
74. వసనము–వస్త్రము

75. హేల-భూనేత్ర వికారాదులచేత, చక్కగా తెలియదగిన మనోవికారము

76. లీల-క్రీడ, శృంగారచేష్ట

77. బిబ్బోకాదులు - గర్వాతిశయముచే నాయికకు ఇష్ట వస్తువునందైనను కలుగునట్టి అనాదరము.

78. రోమాంచిత - పులకలు పొందినది రోమముల గగుర్పాటు గలది

79. విన్యసనలు - అవయవములు మొదలయినవానిని నాట్యశాస్త్ర క్రమమున ఉంచుటలు

80. సుద్దేష్టాల- బాగుగా కోరబడెడు ప్రియ

81. కృష్ణ భుజంగికలు - నల్లవాగులు, పాములు వస్తువులు

82. నీరాజన - హారతి

83 మధువపుంజము- ముంగురుల రాశి (ప్రోగు)

84. పుంగవము - ఎద్దు (ఓషధి విశేషము)

85. సంవిత్తు - జ్ఞానము, సంకేతము, ఆచారము.

86. వియన్మండలము - ఆకాశము

87. ధృవతార - ఉత్తరదిక్కున ఉండు నక్షత్రము

88. ప్రాచదువులు - (ప్రాత+చదువులు) వేదము

89. పుంశ్చలి - రంకులాడి

90. ఆకతాయిలు - పూర్వాపర సందర్భము లేకుండగ హేళనగ మాట్లాడే వారు, ఆకతాయి అని రూపాంతరము.

91. వరాకులు - దయనీయులైన అల్పులు.

92. అంతేవాసులు - దగ్గర ఉండువారు (శిష్యులు)

93. విస్రంభణము - స్వేచ్ఛ

94. ప్రాచార్యులు - విద్యాలయాధిపతి

95. త్రిదశేంద్రులు - దేవతల ప్రభువు దేవేంద్రుడు

96. వ్యసన- సప్తవ్యసనములు

97. మసనము - శ్మశానము త్రోవ

98. గహనమ్ము - అరణ్యము, తెలియనిది, దారి తెన్నులేని

99. వావదూకులు - వాగుడుగాండ్రు

100. వాచంయమి-మునులలో శ్రేష్ఠుడు

101. శేవధి – నిధి

102. ధూర్వహుడు – బరువు మోయువాడు

103. కైటభారి – కైటభశత్రువు విష్ణువు

104. వాలుకలు – ఇసుకలు

105 కురంటి–తుమ్మి పచ్చగోరంట పచ్చచేమంతి

106. చిరంటి – జవరాలు ఐదువరాలు

107. భృంగారము – బంగారుగిండి

108. భక్ష్యము – కొరికి తినునది (భోజన పదార్థము)

109. భోజ్యము – నోటితో మ్రింగి తినునది (భోజన పదార్థము)

110. లేహ్యము – నాలుకకు వ్రాసుకొని రుచి ననుభవిస్తూ తినునది (భోజన పదార్థము)

చోషణము – నీటితో పీల్చి తినునది (భోజన పదార్దము)

111. షాడబము – తీపి మొదలయిన రుచుల కలయిక, మధురాది రసము

112. క్షరాఖడ్గము – వాడి అయిన అంచుగల కత్తి

113. చక్రాటులు–దేవాలయస్థల పుజా మందిరంలో తిరుగువారు

వర్ణాటులు – గాయకులు చిత్రలేఖకులు, ఆడదానివల్ల బ్రతికేవారు

భావాటులు – మనో వికారభావాలతో స్థిమితత లేక తిరుగుచుండువారు

114. దోషాటులు – చౌర్య వ్యభిచార హింసాది దుశ్చేష్టల్లో తిరుగువారు

115. వక్షోజపు – చన్నులకు చెందిన, స్తనములకు చెందిన

116. మధ్యమ్ములు – నడుములు

117. నట్టువ – నాట్యకత్తె

118. నాభిలోతు – ఈ విషయాన్ని కాళిదాస మహాకవి మేఘ సందేశం ఉత్తర కాండ 22లో తెలిపినారు.

119. కుచద్వయమ్ము – చూచుక ద్వంద్వము, చన్నులజంట

120. కందళి – ఒక వింత అయిన పొద, అరటి పొద లేదా చెట్టు

కందళి–స్త్రీ, టెక్కము ఒకవిధమైన పొద

121. నీవి – కోకముడి

122. వైయాసిక– వ్యాసుని పుత్రుడైన శుక మహర్షి

123. సంవాహన–ఒడలు (శరీరము) పిసుకుట, బాగా మోయుట

124. అష్ట మహాలక్ష్ములు : ధాన్య విద్యా సౌభాగ్య సంతాన ధన విరాళ కారుణ్య మహాలక్ష్ములు. 18,19 శతాబ్దాలలో తంజాపుర ప్రభువులు ఈ లక్ష్ములకు మూర్తులను చిత్రింపజేసి శ్రవణం, కీర్తనం, స్మరణం, పద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం ఆత్మనివేదనం అన్న నవవిధ భక్తిభావాలతో పూజ చేశారు ప్రజలచేత చేయించారు.

125. బడబవు – ఆడుగుఱ్ఱము

126. ధావనము – పరుగెత్తుట

# హరికథా పితామహ

పూర్వం ఒక కాలంలో
మహాపురుషు డొక్కడుండె
వాడు  ఆయన కంఠాన
శ్రోతల హృదయాలన్నిటి
సంతోషంతో నింపగ
జాలునట్టి సంగీతం
నిండిఉంది  ఆయన హ
స్తాంగుళాలు తంత్రులపై
పర్యటనం చేసినాయి
ఓహో! అది ఎంతో మహో
ల్లాసమ్మును తేగలదు!
ఆయన – సంగీతానికి
సమ్మోహితులౌ జనాన్కి
శాంతి, దాన్ని తెచ్చి యిస్తు
శిలకు మార్దవాన్ని ఇచ్చు
రామణీయకత ఉన్నది
ఆయన మృదుగీతికాళి,
ఆయన మధు సుస్వరములు
ఆయన కథలను తెల్పెను
ఆయన ఖ్యాతుల స్తుతించె!
మహనీయుండౌ నాయన
యమకాలతొ, లయలతోటి
ప్లుతగమ్యం చేసినాడు,
నాట్యమ్మును ఆడినాడు
సర్వకాలముల అందును
ఈశ్వరుకై పయనించెను
ప్రవచనం గావించెను
భాషలన్ని సుగమముగా
ఆయనవే అయిపోయెను,
ఆయన విస్మృతికిని సైతం
కడు – ఎరుంగబడినవాడు
పత్రములెటు వృక్షానికి
నైజములో అటులె కవిత
ఉల్బణముగ నాయన – ఎద
నుబికి వచ్చె  ఆయనలో
సకలకళలు ఉత్సాహము
తోటి కలుసుకొన్నాయి.
ఆధిక్యత నంతటినీ
రాశీభూతము గావిం
చా డాయన. దర్శనమున
కాయన ఘనమౌ దీపం,
హృదయాలకు ఆహ్లాదం
పరమేశుని వీక్షించిన
అట్టివారె భీతితోడ
ప్రణామమ్ము, లాచరించి
నారు  ఆయనెవ్వరికిని –
పరమశక్తిమంతుడైన
పరమాత్మకు తప్పవంద
నమ్మునాచరింపలేదు
కంఠమ్ములు ఏకతాన

తను పరమోల్లసముతో
'విద్యాదైవతము, బ్రాహ్మి'
భూమికవత రించినది,
సమ్మోహనమౌ నాయన
రూపము గ్రహియించిన' దని
ప్రకటన గావించినది !
ఆదిభట్ట నారాయణ
దా సాయన నామమ్ము
ఖ్యాతికి చెందినది అయిన
పరమోన్నతి చేరినది
ఆయన, ఆయనకి, ఆయ
నవియును నౌకథలాకా
లపు ప్రఖ్యాతుల శోభి
స్తూ ఉన్నవి.

– వావిలాల సోమయాజులు

(ఇది శ్రీమతి నిరుపమ నరసింహంగారి ఆంగ్లభాషా కృతికి గేయకర్త గావించిన ఛందోబద్ధాంధ్రాను వాదము)

# శ్రీ వావిలాల సోమయాజులు
# జీవనరేఖలు, సాహిత్యవీచికలు

| | | |
|---|---|---|
| జననం | : | 19.1.1918 |
| జన్మస్థలం | : | విప్రుల పల్లె అగ్రహారం, గుంటూరు జిల్లా |
| తల్లిదండ్రులు | : | మాణిక్యాంబ, సింగరావధాని |
| విద్యాభ్యాసం | : | నరసరావుపేట, గుంటూరు |
| వివాహం | : | 13.2.1932 |
| ధర్మపత్ని | : | శ్రీమతి కైకమ్మ |
| **ఉద్యోగం** | | |
| ప్రధానాచార్యులు | : | శ్రీ శారదానికేతన్ భాషా ప్రవీణ కళాశాల, గుంటూరు 1940–1946 |
| ఆంధ్రోపన్యాసకులు | : | హిందూ కళాశాల, గుంటూరు 1946–1976 |
| సాహితీసమితి | : | సభ్యుడు, సహాయకార్యదర్శి, కార్యదర్శి 1939 నుండి |
| నవ్యసాహిత్య పరిషత్తు | : | సహాయ కార్యదర్శి |
| 'ప్రతిభ' | : | రచనా నిర్ణాయక సంసత్సభ్యుడు |
| ఆం.ప్ర. సాహిత్య అకాడమీ | : | సభ్యుడు 1963 – 1973 |
| బిరుదులు | : | సాహిత్యాచార్య, సాహిత్య రత్న, సాహిత్య బంధు, మధురకవి, కవిభూషణ, కుమారధూర్జటి, పద్యవిద్యాధర |
| స్వర్గవాసం | : | 9.1.1992 |

# సాహిత్య వీచికలు

1. నాయకురాలు, నాటకం, 1944 సాహితీ సమితి.
2. వసంతసేన, నాటకం, 1953 సాహిత్యలతా గ్రంథమాల
3. డా. చైతన్యం, నాటకం, 1953 సాహిత్యలతా గ్రంథమాల
4. కజ్జల, నాటకం, 1963 ప్రజావాణి 2.12.63 నుండి 23.12.63
5. సాక్షాత్కారము, నాటకం, 1962 ప్రజావాణి 7.10.62 నుండి 28.10.62 16.4.52 హైదరాబాదు రేడియో
6. నిర్ణేత, ఆంగ్లనాటకానువాదం, 1967
7. సుమప్రియ, గేయనాటిక, 8.12.46 ఆకాశవాణి, మద్రాసు
8. వధూసర, పద్యనాటిక, ప్రమాదీచ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక
9. శివోహం, సాంఘిక నాటకం
10. బ్రహ్మరథము, పౌరాణిక రూపం
11. ముక్తి, గేయరూపకం
12. సౌగంధిక, సంగీత రూపకం, 26.4.49 ఆకాశవాణి, విజయవాడ
13. యమయమి, సంగీతరూపకం
14. పీయూషలహరి, సంస్కృత గోష్ఠీ రూపకానువాదం, తెలుగు విశ్వవిద్యాలయం
15. ఆశాజ్యోతి, సంగీతరూపకం, 27.6.76 ఆకాశవాణి, విజయవాడ
16. ప్రాచీన హైందవవిజ్ఞానం, వ్యాసం, గుంటూరు ఎ.సి. కళాశాల మేగజైన్
17. శ్రీనాథుని జన్మస్థలం, వ్యాసం, శ్రీముఖ ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచిక
18. భారతరచనోద్దేశం, వ్యాసం 1939 వీణ
19. మైసూరు సంస్థానాధీశ్వరులు – ఆంధ్రసాహిత్యము, వ్యాసం, 3.9.1938 ప్రజామిత్ర
20. మధురనాయకులు – ఆంధ్రసాహిత్యము, వ్యాసం, 20.8.1939 ప్రజామిత్ర
21. తంజావూరు ఆంధ్రనాయకులు – ఆంధ్రసాహిత్యం, వ్యాసం, 29.10.1939 ప్రజామిత్ర

22. పుదుక్కోట తొండమానులు – ఆంధ్రసాహిత్యం, వ్యాసం, 16.8.1939 ప్రజామిత్ర

23. తంజావూరు మహారాష్ట్ర నాయకులు – ఆంధ్రసాహిత్యం, వ్యాసం, 17.5.1942 దేశాభిమాని

24. తంజావూరు మహారాష్ట్రుల ఆంధ్రసాహిత్యం, వ్యాసం, బహుధాన్య ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక

25. వాత్స్యాయనుడు –కామసూత్రములు, వ్యాసం, సాతవాహన సంచిక, 1950

26. వివాహము – స్త్రీ పురుషులు, వ్యాసం, 28.11.48 ఆంధ్ర వారపత్రిక

27. వివాహము – సంతానము, వ్యాసం, 24.3.48 ఆంధ్ర వారపత్రిక

28. బహుభార్యాత్వము –బహుభర్తృత్వము, వ్యాసం, 29.4.48 ఆంధ్ర వారపత్రిక

29. ఏకపత్నీవ్రతం, వ్యాసం, 21.7.48 ఆంధ్రవారపత్రిక

30. కూటాంతరత (ఎండోగమీ), వ్యాసం, 8.9.48 ఆంధ్రవారపత్రిక

31. బృందవివాహము, వ్యాసం, 22.9.48 ఆంధ్రవారపత్రిక

32. వివాహము – జయాపజయాలు, వ్యాసం, 10.11.48 ఆంధ్రవారపత్రిక

33. వివాహము – వయస్సు, వ్యాసం, 17.11.48 ఆంధ్రవారపత్రిక

34. రాక్షసవివాహము, వ్యాసం, 1.12.48 ఆంధ్రవారపత్రిక

35. ఆసురవివాహము, వ్యాసం, 15.12.48 ఆంధ్రవారపత్రిక

36. సంక్రాంతి – సూర్యోపాసన, వ్యాసం, 12.1.48 ఆంధ్రవారపత్రిక

37. దేవీనవరాత్రులు, వ్యాసం, 8.10.48 ఆంధ్రవారపత్రిక

38. దీపావళి, వ్యాసం, 3.11.48 ఆంధ్రవారపత్రిక

39. శ్రీకృష్ణభగవాన్, వ్యాసం, 1978 విశ్వహిందూపరిషత్, పెదవడ్లపూడి ప్రచురణ

40. గణపతి, వ్యాసం, భారతి

41. వ్యాసభగవానుడు, వ్యాసం, జాగృతి

42. ఆంధ్రులు – సంగీతనాట్యాలు, వ్యాసం, భారతి, సర్వధారి, కార్తిక – మార్గశిర

43. పుష్పలోకం, వ్యాసం, 1948 జనవరి, ఆనందవాణి

44. సాహిత్యంలో చంద్రుడు, వ్యాసం, భారతి, సర్వజిత్, భాద్రపద

45. మలయానిలుడు, వ్యాసం, భారతి, సర్వధారి, భాద్రపద
46. భ్రమరాన్వేషణము, వ్యాసం, భారతి, సర్వజిత్, మాఘ
47. శబ్దము – శబ్ద సంపద, వ్యాసం, భారతి, సర్వజిత్, మార్గశిర
48. గేయరచనలు – ప్రాచీనులు, వ్యాసం, ప్రతిభ, సంపుటి 5, సంచిక 1
49. గేయరచనలు – ఆధునికులు, వ్యాసం, ప్రతిభ సంపుటి 5, సంచిక 2,3
50. వచనకావ్యాలు – రచనా విధానాలు, వ్యాసం, ప్రతిభ సంపుటి 4, సంచిక 1
51. నోరి ఖండకావ్యాలు, వ్యాసం, ప్రతిభ సంపుటి 4, సంచిక 2,3
52. దీక్షితదుహిత, వ్యాసం భారతి, విక్రమ, ఆషాఢ
53. తెలుగునాగు, ఖండకావ్యం, భారతి, 1940, నవంబరు
54. మాచాలదేవి, ఖండకావ్యం, సాహితీసమితి రజతోత్సవ సంచిక 1940
55. ప్రియోత్కంఠ, ఖండకావ్యం, సాహితీసమితి రజతోత్సవ సంచిక 1940
56. ఆత్మార్పణము, ఖండకావ్యం, ప్రతిభ
57. ఉజ్జీవనము, ఖండకావ్యం, ప్రతిభ, 1945 అక్టోబరు
58. వాత్సల్యప్రియ, ఖండకావ్యం, ఆనందవాణి, 1946 దీపావళి సంచిక
59. భ్రష్టయోగి, ఖండకావ్యం, ప్రతిభ, 1945 ఏప్రిల్, మే
60. నిరాశ, ఖండకావ్యం, ప్రతిభ, 1940
61. మహాయజ్ఞం, ఖండకావ్యం, ప్రతిభ 1940
62. కోరస్, గేయం, ప్రతిభ 1940
63. స్వాతంత్ర్యగీతాలు, గీతాలు, గుంటూరుపత్రిక
64. అవతరణ, ఖండకావ్యం, ఆశాజ్యోతి
65. విన్నపాలు, ఖండకావ్యం, ఆశాజ్యోతి
66. కోకిల, ఖండకావ్యం, గుంటూరు హిందూకళాశాల పత్రిక
67. జీవయాత్ర, ఖండకావ్యం, భారతి 1941 మార్చి
68. స్వామి, ఖండకావ్యం, అముద్రితం
69. తల్లి, ఖండకావ్యం, అముద్రితం
70. ఉపహారము, ఖండకావ్యం, అముద్రితం

71. కర్తవ్యత, ఖండకావ్యం, అముద్రితం

72. నివేదన, ఖండకావ్యం, భారతి 1952 నవంబరు

73. వాలిహృదయం, ఖండకావ్యం, ఆంధ్రపత్రిక ఉగాది

74. బృహన్నలాశ్వసనము, ఖండకావ్యం, అముద్రితం

75. భారతా, ఖండకావ్యం, అముద్రితం

76. కావ్యమాల, ఖండకావ్య సంపుటి

77. రసప్రస, ఖండకావ్య సంపుటి

78. శివాలోకనము, ఖండకావ్య సంపుటి

79. సత్యసత్కవీ!, పద్యాలు, అముద్రితం

80. సంతాపము, పద్యాలు, హిందూకళాశాల మేగజైన్

81. ద్వాదశలింగస్తోత్రానువాదం, పద్యాలు, రామా అండ్ కో.

82. ఆశీస్సు, పద్యాలు, అముద్రితం

83. పితామహా, పద్యాలు, అముద్రితం

84. గురుదేవుడు, పద్యాలు, అముద్రితం

85. హే శారదా!, గేయం

86. నాచి, ఏకాంక శ్రవ్యనాటిక, ఎ.సి. కళాశాల మేగజైన్ 1939

87. గోల్కొండ ముట్టడి, ఏకాంక శ్రవ్యనాటిక, VOL XII No: 1,2,3

88. మధుప్రియ, ఏకాంక శ్రవ్యనాటిక, ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల, రాజమహేంద్రవరము వారి ఏకాంకిక నాటికలలో ముద్రితము

89. సుకన్య, ఏకాంక శ్రవ్యనాటిక, 24.4.52 ఆకాశవాణి హైదరాబాదు

90. నగరనర్తకి, ఏకాంక శ్రవ్యనాటిక, 7.6.49 హైదరాబాదు రేడియో

91. చివరిమాట, ఏకాంక శ్రవ్యనాటిక, 15.7.52 విజయవాడ ఆకాశవాణి

92. తానాజీమాల్పురే, ఏకాంక శ్రవ్యనాటిక, 15.7.52 విజయవాడ ఆకాశవాణి

93. నానాఫడ్నవీస్, ఏకాంక శ్రవ్యనాటిక, 17.12.52 విజయవాడ ఆకాశవాణి

94. రాజ్యరక్ష, ఏకాంక శ్రవ్యనాటిక, 3.6.52 విజయవాడ ఆకాశవాణి

95. చంద్రవదన, ఏకాంక శ్రవ్యనాటిక, 15.7.53 విజయవాడ ఆకాశవాణి

96. ఉడతాభక్తి, ఏకాంక శ్రవ్యనాటిక, 15.8.53 విజయవాడ ఆకాశవాణి

97. ఉత్పల, ఏకాంక శ్రవ్యనాటిక, 9.10.54 విజయవాడ ఆకాశవాణి

98. సుజలం, ఏకాంక శ్రవ్యనాటిక, 9.10.54 విజయవాడ ఆకాశవాణి

99. పన్న, ఏకాంక శ్రవ్యనాటిక, .. . 7.55 విజయవాడ ఆకాశవాణి

100. శివాజీ - అఫ్జల్ ఖాన్, ఏకాంక శ్రవ్యనాటిక, 28.11.58 విజయవాడ ఆకాశవాణి

101. ఉదయనుని కథ, బాల-యువసాహిత్యం, 27.8. 52 విజయవాడ ఆకాశవాణి

102. నరవాహనదత్తు, బాల-యువసాహిత్యం, 2.1.53 విజయవాడ ఆకాశవాణి

103. గుంటూరుసీమ, బాల-యువసాహిత్యం, ...1.53 విజయవాడ ఆకాశవాణి

104. ఖ్యాతిగన్న రాణులు - రుద్రాంబ, బాల -యువసాహిత్యం, 11.2.54 విజయవాడ ఆకాశవాణి

105. పెంపుడుకోడి, బాల-యువసాహిత్యం, 27.2.53 విజయవాడ ఆకాశవాణి

106. రెడ్ ఇండియన్ల వేట, బాల-యువసాహిత్యం, 19.9.55 విజయవాడ ఆకాశవాణి

107. ఉద్గ్రంథగాథలు - దిలీపుడు, బాల-యువసాహిత్యం, 22.11.55 విజయవాడ ఆకాశవాణి

108. జంతు స్నేహితులు, బాల-యువసాహిత్యం, 27.2.56 విజయవాడ ఆకాశవాణి

109. మహిమాన్వితులు - తుకారాం, బాల-యువసాహిత్యం, 24.11.56 విజయవాడ ఆకాశవాణి

110. భారత స్వాతంత్ర్య ప్రథమసమరం - ఉద్యమవ్యాప్తి, బాల-యువసాహిత్యం, 4.6.57 విజయవాడ ఆకాశవాణి

111. తెలియనిత్యాగం, బాల-యువసాహిత్యం, ... 7.57 విజయవాడ ఆకాశవాణి

112. తెలుగుభాషాభివృద్ధి-అక్షరములు, పదములు, బాల-యువసాహిత్యం, 4.11.57 విజయవాడ ఆకాశవాణి

113. మన చరిత్ర – అశోకుని కళింగయుద్ధం, బాల–యువసాహిత్యం, 18.3.58 విజయవాడ ఆకాశవాణి

114. మన పండుగలు, బాల – యువసాహిత్యం, 21.5.65 ఆకాశవాణి విజయవాడ

115. నిద్ర – దాని చిత్రవైచిత్ర్యాలు, వ్యాసం, భారతి 1950 మే

116. జయదేవుడు – పీయూషలహరి, వ్యాసం, భారతి 1951 ఫిబ్రవరి

117. ధర్మఘంటిక, చరిత్రాత్మక పద్యనాటిక, ఆర్యవాచకము, 1941 సుందరరామా అండ్ కో తెనాలి

118. నాలంద, చారిత్రాత్మక నవల, 1950 ది ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీ మద్రాసు, తెనాలి, హైదరాబాదు

119. లక్కనభిక్కు, బౌద్ధయుగ సాంఘిక నవల,

120. వీరకూర్చ, పల్లవులనాటి సాంఘిక నవల

121. ఊరి పెద్దలు, సాంఘిక నవల

122. సప్తర్షులు, కథానికాసంపుటి

123. శంభుదాసు, ఎర్రన జీవితకథ

124. అగ్రగాములు, ఆధునిక చరిత్రాత్మక మహాపురుష జీవితాలు, 1950, ది ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీ, మద్రాసు, తెనాలి, హైదరాబాదు

125. కదంబం, పౌరాణిక – చారిత్రక కథా సంకలనం, 1952, అజంతా బుక్ హౌస్

126. మణిప్రవాళం, సృజనాత్మక సాహిత్య వ్యాస సంకలనం, 1952, ఉమాసదనం, 5.32.4, బ్రాడీ పేట, గుంటూరు

127. ఆంధ్రకామాయని, జయశంకరప్రసాద్ హిందీ కావ్యానికి అనువాదం, వావిలాల సాహితీలత, గుంటూరు 1992

128. కన్నీరు, జయశంకరప్రసాద్ "ఆఁసూ' కావ్యానువాదం, వావిలాల సాహితీలత, హైదరాబాదు 2002

129. కలివిడంబనం, నీలకంఠదీక్షితుల సంస్కృత శతకానువాదం, పింగళి – కాటూరి సాహిత్యపీఠం, హైదరాబాదు

130. గాథాసప్తశతి (కొన్నిగాథలు), అనువాదం, అముద్రితం
131. వాల్మీకి రామాయణ సూక్తులు, అనువాదం, అముద్రితం
132. మహాజనసూక్తులు, అనువాదం, అముద్రితం
133. జూలియస్ సీజర్, ఆంగ్లనాటకానువాదం, 1957
134. ఆంటోనీ – క్లియోపాత్ర, ఆంగ్లనాటకానువాదం, 1958
135. మేక్బెత్, ఆంగ్లనాటకానువాదం, 1959
136. ప్రాణదానం (గిఫ్ట్ ఆఫ్ లైఫ్), ఆంగ్లనాటకానువాదం, అముద్రితం
137. డాక్టర్ జైకిల్ మిస్టర్ హైడ్, ఆంగ్ల నవలికానువాదం
138. ఆండ్రూ కార్నెగీ జీవితచరిత్ర, యు.ఎస్.ఐ.ఎస్., మద్రాసు
139. సర్.ఎస్. రాధాకృష్ణన్ భగవద్గీత ఆంగ్ల వ్యాఖ్యానువాదం, అముద్రితం
140. జన్మభూమి – ధన్యభూమి, సంగీత రూపకము, 1.2.65 ఆకాశవాణి విజయవాడ
141. పౌష్యలక్ష్మి, సంగీత రూపకము, 14.1.82 ఆకాశవాణి విజయవాడ
142. స్తోత్రపాఠము, వ్యాసం, ఆంధ్ర వారపత్రిక 24.11.48
143. శత్రువులు – శత్రుత్వము, వ్యాసం, ఆంధ్ర వారపత్రిక 8.12.48
144. కులాసాకబుర్లు, వ్యాసం, ఆంధ్ర వారపత్రిక 5.1.48
145. ఆంధ్రవాఙ్మయ చరిత్ర, సాహిత్య చరిత్ర, అముద్రితం
146. అనామిక, ఖండికలు, అముద్రితం
147. వార్తాపద్యాలు, పద్యాలు / గేయాలు, అముద్రితం
148. భరతరసప్రకరణము, అనువాదం, అముద్రితం
149. శివశంకరస్వామి, వ్యాసం, వైతాళికులు, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ
150. చింతా దీక్షితులు, వ్యాసం, వైతాళికులు, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ
151. ఆచార్య రాయప్రోలు, వ్యాసం, వైతాళికులు, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ
152. సాహిత్య రసన, సాహితీ విమర్శ

## బహాయీ సాహిత్య అనువాదాలు

153. Living the Life
154. Words of God.
155. Writings of Bab
156. Writings of Bahaullah
157. Writings of Abdul Baha
158. Gleanings from the writings of Bahaullah
159. Symbols of the Greatest Name
160. Excellence in all things
161. Dawn Breakers
162. Promised day has come
163. Importance of Prayers and Meditation
164. Power of Divine assistence
165. Family life
166. Messages of the Universal House of justice
167. Bahai Prayers

## క్రైస్తవ సాహిత్యానువాదాలు

168. మోజెస్
169. హిబ్రూస్

## ఆంగ్లవ్యాసాలు

170. On Democracy, A.C. College Magazine, Guntur 1934 June
171. Prolaya Vema Reddy, A.C. College Magazine, Guntur, 1936
172. Enemies and Enimities, Hindu College Magazine, Gutur, 1953
173. Music and Dance in Andhra Desa, Journal of Andhra History and Culture
174. Santoshi Maata